కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

(సరళ వ్యాఖ్యాన సహితం)

సంపుటము - 3

సభాపర్వము

కృతికర్త

నన్నయభట్టారకుడు

వ్యాఖ్యాత

డాక్టర్ అప్పజోడు వేంకటసుబ్బయ్య

ప్రధాన సంపాదకుడు

డాక్టర్ జి.వి.సుబ్రహ్మణ్యం

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

2013

KAVITRAYA VIRACHITA
SRIMADANDHRA MAHABHARATAM

With Commentary
Sabhaparvamu of Nannaya Bhattarakudu
Vol. III.

Commentary by
Dr. Appajodu venkatasubbaiah

Edited by
Dr.G.V.Subrahmanyam

T.T.D.Religious Series No.602
First Edition : August 2000
First Re-print : 2006

Second Edition: 2013
Copies : 5,000

Published by
Sri. M.G. Gopal, I.A.S.
Executive Officer,
T.T.Devasthanams,
Tirupati - 517 507

D.T.P. Type Setting
Editor-In-Chief Office
T.T.D., Tirupati.

Cover Design:

Printed at:

ఒక మాట

తిరుమల తిరుపతి దేవస్థానం సనాతనధర్మప్రచారరంగంలో పూర్వంనుంచి ప్రముఖమైన సేవ లందిస్తున్నది. అందుకు అధికంగా దోహదపడే వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత, పురాణాలు, రామాయణ భారత భాగవతాది ధార్మిక గ్రంథాలు విరివిగా ప్రచురిస్తూ ప్రజాబాహుళ్యానికి అందజేస్తూనే ఉంది.

ఈ ధార్మిక ప్రచార మహోద్యమంలో భాగంగా తి.తి.దేవస్థానం కవిత్రయ విరచితమైన ఆంధ్ర మహాభారతాన్ని విస్తృత వ్యాఖ్యాన సహితంగా తెలుగు ప్రజల కందజేయాలనే ఉద్దేశంతో ఒక బృహత్ సాహిత్య యజ్ఞాన్ని చేపట్టింది. ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యంగారి ప్రధాన సంపాదకత్వపర్యవేక్షణలో దేశంలో సుప్రసిద్ధులైన ముప్ఫైమంది పండితులచేత 18 పర్వాలను వ్యాఖ్యానింపజేసి 15 సంపుటాలుగా వెలువరించింది. ఆంధ్రమహాభారతానికి సమగ్రంగా వెలువడిన ఏకైక వ్యాఖ్యానం ఇది. ఈ మహాభారత మహేతిహాస సంపుటాలు పదిహేనింటినీ 2005 సంవత్సరపు శ్రీవారి బ్రహ్మోత్సవాలలో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గౌ॥శ్రీ వైయస్.రాజశేఖరరెడ్డి గారు ఆవిష్కరించి తెలుగు జాతికి కానుకగా సమర్పించారు.

పాఠకులందరికీ అందుబాటులో ఉండేటట్లు చాల తగ్గింపు ధరకే, కేవలం వెయ్యి రూపాయలకే తి.తి.దేవస్థానం అందించింది. పాఠకుల విశేషాదరణకు పాత్రమైన ఆంధ్రమహాభారత ప్రతులన్నీ అనతికాలంలోనే పూర్తిగా చెల్లిపోయాయి.

పాఠకుల అక్కర తీర్చేందుకు మళ్ళీ భారతసంపుటాల పునర్ముద్రణ ఆవశ్యకతను దేవస్థానం గుర్తించింది. తొలిముద్రణలో దొరలిన లోటుపాట్లను పరిశీలించి సవరించుటకుగాను ఈ సందర్భంగా దేవస్థానం, ఈ దిగువ పేర్కొన్న ప్రముఖ సాహితీవేత్తలతో కూడిన ఒక పండితపరిషత్తును ఏర్పాటుచేసింది.

1) శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు

2) ఆచార్య రవ్వా శ్రీహరి

3) శ్రీ జొన్నలగడ్డ మృత్యుంజయరావు

4) డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

5) డా॥ సముద్రాల లక్ష్మణయ్య

6) ఆచార్య కె. సర్వోత్తమరావు

7) విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు

ఈ పండితపరిషత్తు సభ్యులందరు ఆమూలాగ్రంగా పరిశీలించినతర్వాత పునర్ముద్రించబడిన మహాభారతం 18 పర్వాలను 15 సంపుటాలుగా రసజ్ఞులైన చదువరులకు అందజేస్తున్నాం.

పాఠకమహాశయులు యథాపూర్వం మా యీ ప్రయత్నాన్ని ఆదరించగలరని, చదువరు లందరికి ఆ దేవదేవుని ఆశీస్సులు అందగలవని ఆశిస్తున్నాం.

సదా శ్రీవారిసేవలో...

(లంక వేంకట సుబ్రహ్మణ్యం)

కార్యనిర్వహణాధికారి,

తి.తి.దేవస్థానములు, తిరుపతి.

సరళవ్యాఖ్యాన సహిత
కవిత్రయ భారతం ద్వితీయ ముద్రణ
పూర్వాపరాలు

భారతీయ సనాతన సంస్కృతి మణి కిరీటంలో జాజ్వల్యమానంగా మెరుస్తున్న ముచ్చటైన మూడు అమూల్యరత్నాలు రామాయణ, భారత, భాగవత గ్రంథాలు. అనాదిగా ఆసేతుహిమాచలం ధర్మప్రచారంలోను, ధర్మపరిరక్షణలోను ఈ అమూల్యగ్రంథాలు అద్భుతమైన ఎనలేని పాత్రను పోషిస్తున్నాయి. అందులోను త్రిలింగాలమధ్య నెలకొన్న ఆంధ్రులకు అత్యంత ఆదరణీయమైనవి, ప్రీతిపాత్రమైనవి ఈ మూడు గ్రంథాలు. అందువల్లే తిరుమల తిరుపతి దేవస్థానం 'ధర్మో రక్షతి రక్షితః' అన్న నినాదంతో ధర్మపరిరక్షణకోసం ఈ మహాగ్రంథాల ప్రచురణ పెద్దఎత్తున చేపట్టింది.

మహోన్నతమైన ఈ బృహత్సాహితీయజ్ఞంలో తొట్టతొలిగా సవ్యాఖ్యానంగా కవిత్రయ భారత గ్రంథ ప్రచురణను చేపట్టింది తిరుమల తిరుపతి దేవస్థానం. ఈ మహా ఆధ్వర్యవానికి అధిదైవతం శ్రీ వేంకటేశ్వరుడు కాగా, ఎందరో పండితవరేణ్యులైన వ్యాఖ్యాతలు ఋత్విక్కుల పాత్రను పోషించారు. సుమారు 30 ఏండ్లపాటు సాగిన ఈ సాహితీక్రతు నిర్వహణకుగాను నాటి శ్రీకార్యనిర్వహణాధికారి శ్రీ కుమారస్వామి రెడ్డిగారి కార్యనిర్వహణలో ప్రజాసంబంధాల అధికారిగా కొనసాగిన శ్రీ రావుల సూర్యనారాయణమూర్తిగారు విశేషకృషి చేసినారు. అలాగే ఆనాడు ప్రధాన సంపాదకులుగా వ్యవహరించిన ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు, సంపాదకులుగా వ్యవహరించిన డా॥ నండూరి రామకృష్ణమాచార్యులుగారు, డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్యగారు భారత ముద్రణలో ప్రత్యేకమైన పాత్రను పోషించారు. తరువాత కవిత్రయ మహాభారత వ్యాఖ్యాన రచనాకార్యక్రమానికి పూర్తిగా ప్రధాన సంపాదకత్వ బాధ్యత వహించిన ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం గారు ఈ కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించి పద్దెనిమిది పర్వాల భారతాన్ని పదిహేను సంపుటాలుగా వెలుగులోనికి తీసుకురావటంలో కీలకపాత్రను వహించారు. ఇదే పరంపరలో 'సప్తగిరి' సంపాదకులు శ్రీ కాట్రపాటి సుబ్బారావు గారు, ఆ తర్వాత 'సప్తగిరి' సంపాదకులు డా॥ ఎన్.ఎస్.రామమూర్తి గారు సమన్వయకర్తలుగా వ్యవహరించారు. పిదప 'సప్తగిరి' ప్రధాన సంపాదకులు, డా॥ సి.శైలకుమార్ గారు మరియు సంపాదకులు డా॥ కోటపాటి రాధారమణ గారల పర్యవేక్షణ కాలంలో 'కవిత్రయ భారతం' ప్రచురణ పూర్తి అయింది. ఆ తరువాత అనతికాలంలోనే ఆ గ్రంథ ప్రతులు అన్నీ పూర్తిగా చెల్లిపోయి ద్వితీయముద్రణకు అవశ్యకత ఏర్పడింది.

డా॥ పొత్తూరి వేంకటేశ్వరరావు గారి సలహా మేరకు నాటి శ్రీకార్యనిర్వహణాధికారి డా॥ కె.వి.రమణాచార్యులుగారు భారత తొలిముద్రణలో దొరలిన లోటుపాట్లను పరిశీలించి సరిచేయుటకుగాను **1) డా॥ పొత్తూరి వేంకటేశ్వరరావు 2) ఆచార్య రవ్వా శ్రీహరి 3) శ్రీ జొన్నలగడ్డ మృత్యుంజయరావు 4) డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య 5) డా॥ సముద్రాల లక్ష్మణయ్య 6) ఆచార్య కె. సర్వోత్తమరావు 7) విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు** – ఈ ఏడుగురు పండితులతోకూడిన ఒక పండిత పరిషత్తును ఏర్పాటు చేయడం జరిగింది. తదుపరి శ్రీకార్యనిర్వహణాధికారిగా బాధ్యతలను స్వీకరించిన శ్రీ ఐ.వై.ఆర్.కృష్ణారావుగారు ప్రత్యేక శ్రద్ధతో ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేసారు. పండిత పరిషత్తు వివిధ పండితులు వ్రాసిన వ్యాఖ్యాన భాగాలను పరిశీలించి అన్వయ దోషాలను, ముద్రారాక్షసాలను, శైలీ భేదాలను వీలైనంతవరకు గుర్తించి సవరించి శైలిలో ఏకరూపత సాధించేందుకు తగిన కృషి చేసింది. ఆ పండిత పరిషత్తులో నన్ను కూడా ఒక సభ్యుడిగా దేవస్థానం స్వీకరించడం శ్రీనివాసుని నిర్హేతుకమైన అనుగ్రహానికి తార్కాణం! అంతేగాక 2011 ఫిబ్రవరిలో దేవస్థానం గ్రంథ ప్రచురణ విభాగానికి ఎడిటర్–ఇన్–చీఫ్‌గా నన్ను నియమించడమే గాక, 'కవిత్రయ భారత పునర్ముద్రణ'ను పర్యవేక్షించే బాధ్యతను కూడా దేవస్థానం నాకు అప్పగించింది. ఆనందనిలయుని అపారకృపవల్ల 'కవిత్రయ భారతం' పునర్ముద్రణకార్యంకూడ పూర్తి అయింది.

మలిముద్రణ ఈ రూపంలో రావడానికి అన్నివిధాలా సహాయసహకారాలందించిన తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ కనుమూరి బాపిరాజుగారికి మరియు పాలకమండలి సభ్యులకు నా కృతజ్ఞతలు.

సవ్యాఖ్యాన మహాభారత ద్వితీయ ముద్రణను వేగవంతం చేసి ప్రజాబాహుళ్యానికి అందించడంలో విశేషకృషి చేసిన శ్రీకార్యనిర్వహణాధికారులు శ్రీ ఎల్.వి.సుబ్రహ్మణ్యం, ఐ.ఏ.ఎస్. గారికి, సంయుక్త కార్యనిర్వహణాధికారులు శ్రీ పి.వెంకటరామిరెడ్డి, ఐ.ఏ.ఎస్; శ్రీ కె.యస్.శ్రీనివాసరాజు, ఐ.ఏ.ఎస్. గారలకు నా కృతజ్ఞతలు.

సరళ వ్యాఖ్యాన సహిత కవిత్రయ మహాభారత ముద్రణల్లో నాటి నుండి నేటివరకు తమ అమూల్య సహాయ సహకారాలు అందించిన తి.తి.దే. శ్రీకార్యనిర్వహణాధికారులకు, సంయుక్త కార్యనిర్వహణాధికారులకు, ప్రజాసంబంధాల అధికారులకు, ముద్రణాలయ అధికారులకు అందరికీ నా కృతజ్ఞతలు.

వృత్తిరీత్యా ఇంజనీర్ అయినప్పటికి సాహిత్యాభిలాషతో తి.తి.దే. మహాభారతంలోని కొన్ని సవరణలను గుర్తించి తెలియజేసిన శ్రీ పుత్తా పుల్లారెడ్డి గారికి ధన్యవాదాలు.

కవిత్రయభారత పునర్ముద్రణకార్యక్రమంలో అవసరమైన సహకారమందించిన సహృదయులు 'సప్తగిరి' ప్రధాన సంపాదకులు డా॥ సి.శైలకుమార్ మరియు సంపాదకులు డా॥ కోటపాటి రాధారమణ గారలకు కృతజ్ఞతలు. అలాగే పునర్ముద్రణ విషయంలో అడుగడుగునా, చేదోడు వాదోడుగా వుంటూ పూర్తి సహాయ సహకారాలందించిన పండితులు మహాకవి విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు, ఉపసంపాదకులు డా॥ కంపల్లె రవిచంద్రన్, డా॥ నొస్సం నరసింహాచార్య, శ్రీమతి మొలకా ఉత్తర ఫల్గుణి, పరిశోధక సహాయకులు, డా॥ డి.భారతి, డా॥ టి.సావిత్రి, డా॥ వి.గోపాలకృష్ణమూర్తి, ప్రచురణ సలహాదారులు శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, శ్రీ జల్లి శ్రీరఘుపతిరావుగార్లకు మరియు కార్యాలయ సిబ్బందికి, డి.టి.పి. ఆపరేటర్లకు కృతజ్ఞతలు.

ఈ బృహద్గ్రంథముద్రణలో ఎంతగానో సహకరించిన దేవస్థానం ప్రజాసంబంధాల అధికారి శ్రీ టి.రవిగారికి, ముద్రణాలయాధికారి శ్రీ సాంబశివరావుగారికి, మరియ వారి సిబ్బందికి నా కృతజ్ఞతలు.

మరోమాట!

'ఆంధ్రత్వమాంధ్రభాషా చ నాల్పస్య తపసః ఫలమ్' అని అప్పయదీక్షితులు చెప్పినట్లుగా ఆంధ్రుడుగా పుట్టడం, ఆంధ్రభాష మాట్లాడటం ఎంతో గొప్ప తపస్సు చేస్తేకానీ లభించని అదృష్టాలు. అలాంటి భాషలో కవిత్రయంవారు పంచమవేదమైన వ్యాసభారతాన్ని ఆంధ్రులకు అందించటం ఆంధ్రుల పుణ్యవిశేషం ! ఆంధ్రమహాభారతం తెలుగువారికి లభించిన అమృతఫలం ! ఆ అమృతఫలరసాన్ని పాఠకులు ఈ వ్యాఖ్యానం ద్వారా ఆస్వాదిస్తారనీ, మహాభారత సందేశాన్ని సుగమం చేసుకొంటారనీ ఆశిస్తున్నాము.

కవిత్రయ మహాభారత ద్వితీయముద్రణకార్యం నాచేతుల మీదుగా జరిపించిన దేవదేవుడైన ఆ శ్రీనివాసుని ప్రార్థిస్తూ....

సదా శ్రీవారి సేవలో

ఆచార్య రవ్వా శ్రీహరి

ఎడిటర్–ఇన్–చీఫ్

తిరుమల తిరుపతి దేవస్థానములు

ముందుమాట

నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమమ్,
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయ ముదీరయేత్.

మహాభారతం మన జాతీయ కావ్యం (National Epic). ఈ ఇతిహాసంలో వ్యాసమహర్షి ధర్మం, అర్థం, కామం, మోక్షం - అనే నాలుగు పురుషార్థాలను సాధించటానికి అవసరమయ్యే విజ్ఞానం అంతా చక్కగా ఇమిడ్చాడు. వేదాలు, శాస్త్రాలు, పురాణాలు, ఉపనిషత్తుల సారం ఇందులో సముచితంగా చోటుచేసికొన్నందువల్ల, ఈ గ్రంథం 'పంచమవేదం'గా, 'భారతీయ విజ్ఞాన సర్వస్వం'గా ప్రశస్తి పొందింది.

వ్యాసభగవానుడు లోకశ్రేయస్సును కోరి మూడు సంవత్సరాలు నిష్ఠతో భారతకథను 'జయ' కావ్యంగా రచించాడు. దానిని తన శిష్యులద్వారా వివిధ లోకాలలో వ్యాపింపజేశాడు. వైశంపాయనుడు జనమేజయ మహారాజుకు ఈ కథను వినిపించాడు. అట్లా వినిపింపగా పెంపొందిన కావ్యాన్ని 'భారత' మని పిలిచారు. తరువాత ఆ కథను రోమహర్షణుని కుమారుడైన ఉగ్రశ్రవసుడు నైమిశారణ్యంలో సత్రయాగం చేస్తున్న శౌనకాది మహామునులకు వివరించాడు. అక్కడి మునులడిగిన ప్రశ్నలకు ఉగ్రశ్రవసుడు చెప్పిన కథార్థాలతో కలిసి భారతం 'మహాభారతం'గా వాసి గాంచింది.

ఉగ్రశ్రవసుడు (సూతుడు) శౌనకాది మునులకు భారత కథనంతా చెప్పి, చివర ఇలా అంటాడు-

"యదిహాస్తి తదన్యత్ర, యన్నేహాస్తి న తత్ క్వచిత్"

'ఇందులో ఉండేదే ఎక్కడైనా ఉంటుంది, ఇందులో లేనిది ఎక్కడా లేదు' (What is in Mahabharata is every where; what is not in Mahabharata is nowhere) - అని.

ఆసక్తికరమైన విషయం, ఏమంటే మహాభారతం ప్రపంచంలోని గ్రంథాలన్నింటిలోకి గొప్పది. ఉదాహరణకు "ఇలియడ్", "ఒడెస్సీ"- అనేవి గ్రీకుల ప్రాచీన ప్రసిద్ధ వీరకావ్యాలు. మహాభారతం ఆ రెంటికన్నా అనేకరెట్లు పెద్దది. ఈ పెద్దతనం ఒక పరిమాణంలోనేగాక, పాత్ర చిత్రణ (Character delineation), భావాల వైవిధ్యం (Range of emotion) వంటి అంశాల్లో స్పష్టంగా తెలుస్తుంది.

మహాభారతంలో పాండవుల ఉత్తమ చరిత్ర, కౌరవుల దుర్వృత్తం చక్కగా ఆవిష్కరింపబడ్డాయి. పాండవులు ధార్మిక, సాత్త్విక, దైవీశక్తులు; కౌరవులు అధార్మిక, రాజస, తామసిక, ఆసురీశక్తులు. ఈ రెండురకాల శక్తుల నడుమ జరిగిన సంఘర్షణయే కురుక్షేత్ర సంగ్రామం. అందులో ధార్మికశక్తులకు జయాన్ని కలిగించి, అధర్మశక్తులను అంతమొందించి, అవతార పురుషుడుగా, జగద్గురువుగా నిలిచి ఉపదేశించిన దివ్యశక్తి శ్రీకృష్ణుడు.

భగవద్గీత భారతానికి ఆత్మ; పాండవుల చరిత్ర శరీరం; చతుర్విధ పురుషార్థ విజ్ఞానం జీవితం; ఇతిహాసాలు, ఉపాఖ్యానాలు జవసత్త్వాలు. మానవ జీవితమనే మహాసముద్రాన్ని మథించి బాదరాయణుడు మానవాళికి అందించిన

అమృతకలశం మహాభారతం. మానవజీవిత క్రమానికి మహాభారత ఇతివృత్తగమనానికి ఎంతో సాదృశ్యం గోచరిస్తుంది. ఒక్కమాటలో మానవ ధార్మిక జీవన ప్రవృత్తికి మహాభారతం ప్రాణాధారం.

మహాభారతం వేదాలు మొదలుకొని పురాణాలవరకు గల భారతీయ వాఙ్మయంయొక్క సారాంశాన్ని అందించటమేగాక, ఆ యా అంశాలకు వైరుధ్యం ఏర్పడినప్పుడు, వాటికి సామరస్యపూర్వక మార్గాన్ని నిర్దేశించే సమన్వయ సంహితగా పేరు గాంచింది:

"వేదములకు, అఖిలస్మృతి
వాదములకు, బహుపురాణ వర్గంబులకున్
వాదైన చోటులను తా
మూదల ధర్మార్థకామమోక్షస్థితికిన్"

ఈ విధంగా ఆర్షవాఙ్మయానికి అంతటికీ మూదల (ప్రమాణం) అయి ఉండటం మహాభారతం యొక్క ప్రత్యేకత!

దేవభాషలో అవతరించిన భారతం కాలక్రమేణ తమిళ, కర్ణాటాది దేశభాషలలోనికి అనువదింపబడుతూ వచ్చింది. ప్రాంతీయ భాషలలో వెలువడిన ఆ యా భారత అనువాదాలన్నిట్లోనూ తెలుగులో 'కవిత్రయం' వారు రచించిన ఆంధ్రమహాభారతానికి ఒక ప్రత్యేకత నెలకొనిఉంది. తెనుగుభారతం కేవల అనువాదం కాదు; కృష్ణద్వైపాయనుడు వైదికమైన ఏ పరమార్థాన్ని మూలంలో నిరూపించాడో, ఆ నిరూపితార్థం చెక్కుచెదరకుండా పుణికిపుచ్చుకొని అవతరించిన స్వతంత్ర రచన ఆంధ్రమహాభారతం. కవిత్రయం కావించిన పునఃసృష్టి!

'తింటే గారెలు తినాలి, వింటే భారతం వినాలి,' 'భారతం చదివినవాడు పండితుడు'- ఇత్యాది లోకోక్తులు తెలుగులో వెలిశాయంటే ఆంధ్రులకు మహాభారతమంటే ఎంతటి ఆదరమో తేటపడుతోంది. ఆంధ్రావళికి అలాంటి ఆదికావ్యాన్ని ప్రసాదించిన మహాకవులు మువ్వురూ త్రిమూర్తుల లాంటివారు. వారిలో ఆదికవియే విష్ణువు, కవిబ్రహ్మయే బ్రహ్మదేవుడు, ప్రబంధ పరమేశ్వరుడే పరమేశ్వరుడు. ఈ ముగ్గురు సారస్వత మూర్తులు వేరువేరు కాలాల్లో, తెలుగుదేశంలోనూ వేరువేరు ప్రాంతాల్లో తమతమ రచనల్ని కొనసాగించినప్పటికీ, కవిత్రయ భారతం స్వరూపంలోనూ, సందేశంలోనూ ఏకవాక్యతతో విలసిల్లుతూవుంది. ఇది ఆంధ్రావనికి దైవికంగా సిద్ధించిన అదృష్ట విశేషం. తరతరాల తెలుగుజాతికి ఆదర్శంగా తెనుగు సంస్కృతి మందిరంపై నిర్మించిన సమున్నత స్వర్ణగోపురం ఆంధ్రమహాభారతం. ఆ సుందర గోపురాన్ని నెలకొల్పిన అక్షర శిల్పులు "కవిత్రయం" అందరకూ ఆరాధ్యులు.

పై త్రిమూర్తుల్లో ఆద్యుడు, ఆంధ్రసారస్వతానికి 'అపర వాల్మీకి' నన్నయభట్టారకుడు. ఆ మహాకవి వేంగీదేశపు రాజధాని అయిన రాజమహేంద్రవరంలో చాళుక్యవంశ ప్రభువగు రాజరాజుయొక్క ప్రోత్సాహంతో క్రీ.శ. 1053 ప్రాంతంలో వ్యాసభారత ఆంధ్రీకరణకు శ్రీకారం చుట్టాడు. ఆంధ్రవాఙ్మయ చరిత్రలో అపూర్వమైన ఆ మహనీయ సన్నివేశాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1982-83 విద్యావత్సరాన్ని "నన్నయ సంవత్సరం"గా ప్రకటించింది. అప్పట్లో నన్నయ సహస్రాబ్ది జయంతి- ఉత్సవాలు తెలుగుదేశంలో వాడవాడలా వైభవోపేతంగా నిర్వహింపబడినాయి.

ఆ సందర్భంలో తిరుమల తిరుపతి దేవస్థానంవారు ఆర్షధర్మానికి, ఆంధ్రభాషా సాహిత్యాలకు, సంస్కృతీ సభ్యతలకు మార్గదర్శకమైన ఆది కావ్యానికి - ముఖ్యంగా తొలి మూడు పర్వాలకు ప్రసిద్ధ విద్వాంసులచే ప్రతిపదార్థ, తాత్పర్య, విశేషాలను వ్రాయించి ప్రచురించే ధార్మిక కార్యక్రమాన్ని ఆసక్తితో చేపట్టారు. తొలుదొలుత నన్నయ భారతభాగంతో ఆరంభమైన ఈ కార్యక్రమం క్రమేణ తరువాతి పదిహేను పర్వాలకు కూడా వ్యాఖ్య వ్రాయించాలనే ఉదాత్త సంకల్పానికి దారితీసింది.

ఈనాటి విద్యార్థుల పాఠ్యప్రణాళికల్లో భారతీయ సంస్కృతి వైశిష్ట్యాన్ని బోధించే అంశాలకు తగినంత ప్రాధాన్యం లేక, అరుదైపోతూ ఉన్నందున, కవిత్రయమహాభారతం అందించే సందేశం సామాన్య జనులకూ, అలాగే నేటి యువతరానికీ అందేటట్లు చేయవలసిన ఆవశ్యకతను గుర్తించి, తిరుమల తిరుపతి దేవస్థానం వ్యాఖ్యానసహిత కవిత్రయ భారత ప్రచురణను అందుకు అనువైన మహోద్యమంగా చేపట్టి పురోగమిస్తున్నది.

మొదట నన్నయ భారతభాగానికి సరళగ్రాంథికంలోనూ, తరువాత తిక్కన భారత భాగానికి శిష్టవ్యావహారిక భాషలోనూ- అందులోనూ భిన్న భిన్నశైలులలో - వ్యాఖ్య రచింపబడి ఉన్నందున, ఈ మొత్తం సంపుటాల వ్యాఖ్యాన స్వరూపానికి ఏకవాక్యతనూ, సామాన్యపాఠకులకు సైతం సుబోధంగా ఉండే విశిష్ట వ్యావహారికరీతినీ సంతరించటానికి ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారిని సంపాదకులుగా నియమించటమైనది.

వెయ్యేళ్ల తెలుగు సాహిత్యానికే కీర్తికిరీటమైన ఆంధ్రమహాభారతాన్ని సరళవ్యాఖ్యతో అచిరకాలంలో సమగ్రంగా ముద్రించి, ఈ రీతిగా ఆంధ్రావళికి సమర్పింపగలుగుతున్నందుకు తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం ఎంతో సంతోషిస్తూన్నది.

ఆదికవి నన్నయభట్టారకుణ్ణి ఆంధ్రమహాభారత రచనకు ప్రోత్సహించిన రాజరాజు క్రీ.శ. 1022 ఆగస్టు 22వ తేదిన పట్టాభిషిక్తుడయ్యాడు. ఈ అద్వితీయ చారిత్రక సన్నివేశాన్ని పురస్కరించుకొని తిరుమల తిరుపతి దేవస్థానం ఈ సంవత్సరం ఆగస్టు 22న శ్రీ పద్మావతీ శ్రీనివాసుల మంగళాశాసనములతో ఆది, సభా పర్వాలను తిరుపతిలో ఆవిష్కరించడం జరిగింది. ఆదినుండి ఈ వాఙ్మయయజ్ఞంలో పాలుపంచుకొన్న సుగృహీతనామధేయులయిన విద్యావేత్త లందరికి పేరు పేరున కృతజ్ఞతలు తెలుపుతూ వున్నాము.

వేదత్రయమూర్తి అయిన వేంకటేశ్వరుని అనుగ్రహంవల్ల, వ్యాఖ్యానసహితమైన ఈ 'జయేతిహాసం' సర్వులకు జయప్రదము, ఆనంద సంధాయకము కాగలదని మా ఆశయము, ఆకాంక్ష.

అనతి కాలంలోనే ప్రతులన్నీ చెల్లిపోయిన కారణంగా పునర్ముద్రిస్తున్నాము (2006). ఎప్పటిలాగే పాఠకులు సమాదరిస్తారని ఆశిస్తున్నాను.

వ్యాసరచిత భారతామ్నాయ మాంధ్రభా
షగనొనర్చి జగతిఁ బొగడు గనిన
నన్నపార్యుఁ, దిక్కనను గృతక్రతు, శంభు
దాసు నెఱ్ఱసుకవిఁ దలఁతు భక్తి.

కార్యనిర్వహణాధికారి
తి.తి. దేవస్థానములు, తిరుపతి.

కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు : పుట్టు పూర్వోత్తరాలు

శ్రీ వేంకటేశ్వరస్వామివారి దివ్యానుగ్రహంతో తిరుమల తిరుపతి దేవస్థానం ఆదినుండీ ఆర్షధర్మప్రబోధం నిమిత్తం అనేక కార్యక్రమాలను చేపట్టి నిర్వహిస్తూవుంది. అలాంటి కార్యక్రమాల్లో ధార్మిక సాంస్కృతిక గ్రంథాల ప్రచురణ అత్యంత ప్రధానమైంది. ఆర్షధర్మానికి, భారతీయసంస్కృతికి, మూలాధారాలైన వేదాలు, శాస్త్రాలు, పురాణాలు, ఇతిహాసాలు, కావ్యాలు మొదలైనవాటిని, తత్సంబంధి రచనలను పలుభాషల్లో, పలురీతుల్లో అసంఖ్యాకంగా ప్రచురిస్తూ, తిరుమల తిరుపతి దేవస్థానంవారు ఆర్షసంస్కృతి సముద్ధరణలో తమవంతు కృషిని విజయవంతంగా కొనసాగించటం జరుగుతూ వుంది.

పూర్వరంగం:

ఇటీవల 1982 మార్చినెలలో మహాకవి పోతనపంచశతాబ్ది జయంతి ఉత్సవాలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధిపత్యంలో ఏకశిలా (వరంగల్లు) నగరంలో వైభవోపేతంగా జరుపబడినాయి. ప్రభుత్వసూచన ననుసరించి తిరుమల తిరుపతి దేవస్థానం ఆ ఉత్సవాల్లో సముత్సాహంతో పాల్గొన్నది. వరంగల్లు పట్టణంలో ప్రతిష్ఠించే నిమిత్తంగా పోతన విగ్రహాన్ని నిర్మించడం, పోతన భాగవతం ప్రథమస్కంధాన్ని తాత్పర్యసహితంగా ప్రచురించటం, 'శ్రీనివాస బాలభారతి' పక్షాన "పోతన" పుస్తకాన్ని ప్రకటించడం, పోతన కవితామహత్త్వాన్ని చాటే స్మారక సంచికను ముద్రించటం - ఇత్యాదికార్యక్రమాలను నిర్వహించడంద్వారా దేవస్థానం ఆ ఉత్సవాల వైభవానికి ఎంతగానో తోడ్పడింది! పోతనపంచశతాబ్ది జయంత్యుత్సవాలు ఆంధ్రభాగవత ప్రచురణకు దోహదకారులైనట్లే, అటు తర్వాత 1983లో జరిగిన నన్నయ సహస్రాబ్ది జయంత్యుత్సవాలు "వ్యాఖ్యానసహిత ఆంధ్రమహాభారత" గ్రంథప్రచురణకు అంకురార్పణ గావించాయి.

నన్నయ భారత ప్రాజెక్టు :

ఆంధ్రమహాభారతం ఆంధ్రజాతి వెయ్యేండ్ల తపఃఫలం! ఇది తెలుగులో ఆదికావ్యం. ఈ కావ్యరచయిత నన్నయభట్టారకుడు. క్రీ.శ.1053 ప్రాంతంలో - అనగా దాదాపు వెయ్యివత్సరాల క్రిందట, గోదావరీ తీరమందలి రాజమహేంద్రవరంలో, చాళుక్యరాజగు - రాజరాజనరేంద్రుని కోరికననుసరించి, ఆ మహాకవి ఈ ఉత్తమ కావ్యరచనకు శ్రీకారం చుట్టినాడు. ఆంధ్రసాహిత్య చరిత్రలో అపూర్వమైన ఆ మహనీయసన్నివేశాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1982 - 83 విద్యావత్సరాన్ని "నన్నయ సంవత్సరం" గా ప్రకటించింది. అప్పట్లో నన్నయ సహస్ర వార్షిక జయంతి - ఉత్సవాలు ఆంధ్రావనిలో వాడవాడలా వైభవోపేతంగా నిర్వహింపబడ్డాయి.

ఆ సందర్భంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల శాఖ, అంతకు మునుపటి పోతన జయంత్యుత్సవాల్లో తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించిన విశిష్టపాత్రను ప్రశంసాత్మకంగా ప్రస్తావిస్తూ, అదే విధంగా నన్నయ జయంత్యుత్సవాల్లో పాల్గొని చరితార్థం చేయవలసిందిగా కోరుతూ, దేవస్థానంవారికి కొన్ని ముఖ్య సూచనలు చేసింది. ఆ సూచనల ననుసరించి తిరుమల తిరుపతి దేవస్థానం రాజమహేంద్రవరంలో ప్రతిష్ఠించే నిమిత్తం నన్నయ విగ్రహాన్ని నిర్మించింది; 'భారతావతరణము' (రూపకం) 'నన్నయ భట్టారకుడు' (వచనం) - అనే పుస్తకాలను, 'నన్నయ వ్యాస పీఠము' - అనే ప్రశస్త సంచికను ప్రచురించింది.

తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సూచించిన సూచనలలో అత్యంత ప్రధానమైనది నన్నయభారతానికి (తొలి మూడు పర్వాలకు) వ్యాఖ్య వ్రాయించి ప్రకటించటం. ఈ బృహత్తరవ్యాఖ్యా గ్రంథప్రచురణ బాధ్యతను దేవస్థానంవారు ఇటీవల పదవీవిరమణ చేసిన అప్పటి పౌరసంబంధాధికారి డా॥ రావుల సూర్యనారాయణమూర్తికి అప్పగించారు. అనంతరం నన్నయ భారత వ్యాఖ్యా రచనా ప్రణాళికను రూపొందించటానికి ప్రసిద్ధ విద్వన్మణులతో ఈ క్రింది సంపాదకమండలి ఏర్పాటయింది.

కళాప్రపూర్ణ డా॥ దివాకర్ల వేంకటావధాని

డా॥ నండూరి రామకృష్ణమాచార్య

డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

డా॥ రావుల సూర్యనారాయణమూర్తి (సమావేశకర్త)

ఈ సంపాదకమండలి 1983 జూలై 11వ తేదీన హైదరాబాదు బాలాజీభవనంలో తొలిసారిగా సమావేశమై, నన్నయభారత వ్యాఖ్యారచనకు ఆవశ్యకమైన మార్గదర్శక సూత్రాలను రూపొందించింది.

ఆ సూత్రాల సారాంశం :

"ఇది మహాభారతము. ఆంధ్రవాఙ్మయములో పరమప్రామాణికమైన ఆది గ్రంథము. ఆరణ్య పర్వములో శేషభాగము ఎఱ్ఱన వ్రాసినను, నన్నయ పేరుమీదనే వ్రాసియున్నాడు గనుక, ఆ పర్వము పూర్తిగ ప్రచురించవలెనని నిర్ణయముగైకొనబడినది. టీకా తాత్పర్యసహితముగా ప్రచురించుటలో గల ఉద్దేశము సామాన్యులకు గూడ అర్థమగుట. కనుక, వ్యావహారికభాషకు సన్నిహితమైన సరళగ్రాంథికములో వ్రాయవలెనని నిర్ణయము జరిగినది. పదాలు ప్రయోగించుటలో సామాన్యులకు అర్థమగునట్లు, భారతముయొక్క ప్రామాణికత చెడకుండ - భాషను సాధ్యమైనంతమేరకు సులభముగా నుండునట్లు వ్రాయవలెను. అరసున్నలు, శకటరేఫములు పాటింప నక్కరలేదు. విసంధులు అంగీకరింపబడినవి. సరళాదేశము అనవసరము. మూలములో ఉన్న కఠినపదములు పరిహరించి, సుబోధములైన పదాలు వాడవలెను.

మూలపదాలు యథాతథముగ వ్రాయవలెను. అరసున్నతోగాని, సున్నతోగాని పదము ముగియునపుడు దానిని ద్రుతాంతముగా వ్రాయవలెను. సరళాదేశము వచ్చినపుడు పరుషములే గ్రహించవలెను. మొదట మూలపద్యము, దానిక్రింద ప్రతిపదార్థము, తరువాత తాత్పర్యము, పిమ్మట- ఉన్నచో విశేషాలు, అతిముఖ్యములైన వ్యాకరణవిశేషాలు, అలంకార విశేషాలు పొందుపరచవలెను. వచనమునకుగూడ పద్యాలకు వ్రాసినట్లే అర్థతాత్పర్యాలు వ్రాయదగును.

ఉస్మానియా విశ్వవిద్యాలయమువారు ప్రచురించిన సంశోధితప్రతిని ఆధారముగా స్వీకరింపవలెను. అందలి శీర్షికలను యథాతథముగా ఉంచవలెను. సంస్కృతమూలములోని అధ్యాయ సంఖ్యగూడ వేయవలెను. మూలవిభిన్నత పీఠికలో సూచించవచ్చు; లేదా విశేషాంశములలో చేర్చవచ్చు. పాఠాంతరాలలో - సంశోధితప్రతిలో ఉన్నదానికంటె ఇతర పాఠము మేల్తరముగా తోచినచో రచయిత దానినికూడ స్వీకరించి అర్థము వ్రాయవలెను. దానిని విశేషములలో చేర్చునది.

రచన కొనసాగిన పిమ్మట రెండుమూడు నెలలకు ఒకసారి రచయితల సమావేశాలు ఏర్పాటుచేసి అన్యోన్య సమీక్షలు జరుపవలెను. ఇది రచనలో సామరస్యము ఏర్పడుటకు సదవకాశము కలిగించును. (మూడుపర్వముల) రచనలో ఏకరూపత

కలుగునట్లు చూచుటకు ఒక ప్రధాన సంపాదకుడు కావలసి యున్నది. ఈ బాధ్యత ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారికి అప్పగించుటకు ఏకగ్రీవముగా తీర్మానింపబడినది. ప్రధాన సంపాదకుడు వ్రాతప్రతిని సాధ్యమగునంత త్వరలో అచ్చుకు (Finalise) సంసిద్ధముచేయగానే, ఒక సమష్టి సమీక్షా సమావేశము ఏర్పాటుచేసి, అనంతరము వ్రాతప్రతిని ముద్రణకు ఇయ్యవలెను. ప్రతి సంపుటికి పీఠిక, విషయసూచిక, చివర పద్యానుక్రమణిక ఉండవలెను.''

పై ఆదేశిక సూత్రాల ననుసరించి ఆచార్య దివాకర్ల వేంకటావధాని ఆదిపర్వానికి, డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య సభాపర్వానికి, డా॥ నండూరి రామకృష్ణమాచార్య ఆరణ్యపర్వానికి- వ్యాఖ్యలను రచించే కార్యక్రమం చేపట్టారు. ఇలా వ్యాఖ్యను సమకూర్చే పని ఒకవైపు కొనసాగుతూ ఉండగా, దేవస్థానం ఇంచుమించు ఆరేసి మాసాల కొక పర్యాయం, అంతదనుక జరిగిన కృషినిగూర్చి సమీక్షించేందుకు, పై ముప్పురు రచయితలతో కూడిన సంపాదకవర్గ సమావేశాలను నిర్వహిస్తూ వచ్చింది.

ప్రధాన సంపాదకుడు ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు తక్కిన ఇరువురి రచనలను పునఃపరిశీలన చేస్తూ, తుదిమెఱుగులు దిద్ది వ్రాతప్రతులను అచ్చుకు సిద్ధంచేస్తున్న దశలో - 1986 అక్టోబరులో పరమపదించారు. ఈ ఆకస్మికసంఘటనవల్ల "వ్యాఖ్యాసహిత నన్నయభారత ప్రచురణ'' కార్యక్రమ పురోగతికి విఘాతం ఏర్పడింది.! ప్రణాళిక ఈ ఆటంకాన్ని అధిక్రమించటానికి, తిరుమల తిరుపతి దేవస్థానంవారు తగినపెద్దలతో విస్తృతంగా సమాలోచించారు. తదుపరి, కళాప్రపూర్ణ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు కీ.శే. దివాకర్లవారి స్థానంలో ముఖ్య సంపాదకులుగా 1987 మే నెలలో నియుక్తులయ్యారు.

అప్పటినుండి, మళ్ళీ వ్యాఖ్యారచయితల పరస్పరసమీక్షా సమావేశాలు యథారీతిగా నిర్వహింపబడుతూ వచ్చాయి. వీటితోపాటు, ప్రధాన సంపాదకుడు మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు మూడుపర్వాల వ్రాతప్రతులను క్రమంగా పర్యవేక్షిస్తూ, వాటిని ముద్రించవలసినదిగా తీర్మానించారు.

ఆ యా పర్వాల ముద్రణకార్యం ఒకప్రక్క జరుగుతూవుంటే, మరోవైపున ఆ యా సంపుటాల సంపాదకులు పీఠిక, ఉపోద్ఘాతము - మున్నగు అంశాలను సమకూర్చాలని ఒకానొకసమావేశంలో నిర్ణయింపబడింది. అవసరాన్నిబట్టి పీఠికలకు తుదిరూపం ఇవ్వటానికి సంపాదకవర్గం మరొకసారి సమావేశం కావడానికి కూడ అందులోనే నిశ్చయింపబడింది. అయితే, ఈ నిర్ణయాలు చోటుచేసికొన్న సమావేశమే నన్నయ భారత ప్రణాళికకు సంబంధించిన సమావేశాల్లో చిట్టచివరిదయింది! ఈ సమావేశం రాజమహేంద్రవరంలో శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారి గృహంలో 1991 జూలై 3వ తేదిన జరిగింది. అనంతరం ఈ గ్రంథాన్ని ముద్రించే ప్రయత్నాలు కొనసాగాయి.

తిక్కన భారత సంయోజన :

ఇటువంటి పరిస్థితుల్లో, తిరుమల తిరుపతి దేవస్థాన సప్తగిరి సంపాదకుల కార్యాలయమందలి ప్రచురణల విభాగంలో 'పబ్లికేషన్సు ఎడిటర్'గా పనిచేస్తూ వుండిన విద్వాన్ డి. నాగసిద్ధారెడ్డిగారు (రిటైర్డు ప్రిన్సిపాల్, యస్.వి.ఓరియంటల్ కళాశాల, తిరుపతి) తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారిగారికి "తిక్కన భారత వ్యాఖ్యారచనాప్రణాళిక''ను గూర్చి 1992 ఆగష్టు ఆరంభంలో ఒక నివేదికను సమర్పించారు.

ఆ నివేదిక సారాంశం :

"తిరుమల తిరుపతి దేవస్థానంవారు నన్నయ భారతం మూడు పర్వాలకు ప్రసిద్ధ విద్వాంసులచేత వ్యాఖ్య వ్రాయించిన విధంగానే, తిక్కన భారతం పదునైదు పర్వాలకు రాష్ట్రంలోని ప్రముఖపండితులచేత వ్యాఖ్య వ్రాయించి ప్రచురించటం సముచితంగానూ, సమగ్రంగానూ ఉంటుంది. తాము అనుమతిస్తే ఈ ప్రణాళికకు నేను సమన్వయ సంపాదకుడనుగా, సమావేశకర్తగా (కో ఆర్డినేటింగ్ ఎడిటర్ అండ్ కన్వీనర్) బాధ్యతవహించి నిర్వర్తించగలను".

తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారి అధ్యక్షతన సమావేశమైన గ్రంథనిపుణుల సంఘం (Experts Committee) పై ప్రతిపాదనను ఆమోదించింది. తదనుసారంగా తిక్కన భారతవ్యాఖ్యా రచనా ప్రణాళికకు సంబంధించిన తొలిసమావేశం తిరుమల తిరుపతి దేవస్థాన పరిపాలనా భవనం (తిరుపతి)లో కార్యనిర్వహణాధికారిగారి ఆధ్వర్యంలో 1992 నవంబరు 5వ తేదిన జరిగింది. ఈ ప్రణాళికా నిర్వహణకు తొలుత ఒక సలహాసంఘం ఏర్పాటయింది. అనంతరం ఈ సలహాసంఘం 1) సంపాదకవర్గం 2) సలహాసంఘం- అని ఈ క్రింది రెండు సంఘాలుగా విభజింపబడింది.

సంపాదక వర్గం

శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు	**ప్రొ॥ ఎస్.బి. రఘునాథాచార్య**
ప్రొ॥ కే. సర్వోత్తమరావు	**శ్రీ డి. నాగసిద్ధారెడ్డి (కన్వీనర్)**

సలహాసంఘం

ఆచార్య తూమాటి దొణప్ప	**ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం**
ఆచార్య బిరుదురాజు రామరాజు	**ఆచార్య మడుపు కులశేఖరరావు**
ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావు	**డా॥ రావుల సూర్యనారాయణమూర్తి**
ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి	**శ్రీ కాట్రపాటి సుబ్బారావు**
ఆచార్య నండూరి రామకృష్ణమాచార్య	**శ్రీ ములుకుట్ల రామకృష్ణశాస్త్రి**

పై సమావేశంలో చర్చింపబడిన అంశాల్లో అత్యంతప్రధానమైనది వ్యాఖ్యాన విధానానికి సంబంధించినది. సభ్యులందరి సలహాలు, సూచనలమేరకు - వ్యాఖ్యానరచనకు మార్గదర్శకాలైన - కొన్ని ముఖ్య నియమాలు క్రోడీకరింపబడ్డాయి.

ఆ నియమాల సారాంశం :

"రచనావిషయంలో ప్రధానంగా సామాన్య ప్రజానీకాన్ని దృష్టియందుంచుకొనవలెను. భాష వ్యావహారికంగానే ఉండాలి. మాండలికాలు ఉండరాదు. సాధ్యమైనంతవరకు విసంధుల్ని పాటించాలి. సంధి విడదీసిన తర్వాత పదస్వరూపం తెలిసేటట్లుగా పదాదిన అచ్చుల్ని వాడాలి. దుస్సంధులు తగదు. శకటరేఫలు, అరసున్నలు ఉండరాదు. కథాభాగాన్ని అతికేసమయంలో పూర్వాపర సందర్భాలను అనుసంధానంచేస్తూ అవసరమైనచోట స్థూలంగా ఐదారు పంక్తులు అవతారిక (పరిచయం) వ్రాయాలి. ప్రతిపద్యానికి అక్కరలేదు.

విశేషాంశాల్లో అలంకారాలు, వర్ణనలు కథా సందర్భానికి ఏవిధంగా అతికాయో చెప్తూ, పద్యంలో గుర్తించిన ముఖ్యమైన విశేషాంశాలు విస్తారంగా కాకుండా, సంగ్రహంగా చెప్పాలి. (రచయితలు వ్రాయని విశేషాంశాదులను 'సంపాదకులు' 'ఎడిటోరియల్ నోటు' వ్రాసి నమోదుచేయవలసినది.) అవసరమైన చోట్ల రచనలో మార్పులు, చేర్పులు చేయడానికీ, సంతృప్తికరం కాకపోతే తిరస్కరించి మరొకర్ని ఎంపిక చేసుకొనడానికీ సంపాదకవర్గానికి అధికారం ఉంది. (రచయితలు) ఉస్మానియా యూనివర్సిటీవారి భారతప్రతిని రచనకు ప్రమాణంగా స్వీకరించాలి. ఇతర ప్రతులలో సొబగైన పాఠములున్నచో వాటిని రచనలో ఉటంకించవచ్చు."

పై సూచనల ప్రకారం, తిక్కన భారతం పదునైదు పర్వాల్లోని 46 ఆశ్వాసాలకు సరళవ్యాఖ్య సమకూర్చటానికి మొత్తం ముప్పదిముగ్గురు పండితులు ఎంపిక చేయబడ్డారు. వీరిలో చాలమంది తమవంతు వ్యాఖ్యారచనను సకాలంలో పూర్తిచేసి దేవస్థానానికి సమర్పించారు. 'తిక్కనభారత ప్రణాళిక' యొక్క చివరి సమావేశం 1994 జూలై 15వ తేదిన కార్యనిర్వహణాధికారిగారి అధ్యక్షతన తిరుమల తిరుపతి దేవస్థానపరిపాలనాభవనం (తిరుపతి)లో జరిగింది.

1995 జూన్‌లో శ్రీ డి. నాగసిద్ధారెడ్డి పదవినుండి విరమించేనాటికి, తిక్కన భారతంలోని కొన్ని ఆశ్వాసాలకు వ్యాఖ్య - ఆ యా రచయితలు వ్రాసి పంపనందున - దేవస్థానానికి అందలేదు. అలా, వ్యాఖ్యానింపబడక శేషించి ఉన్న తిక్కన భారతంలోని కొన్ని ఆశ్వాసాలను స్థానికులగు మరికొందరు విద్వాంసులచేత వ్రాయించి, ఈ వ్యాఖ్యాన క్రతువును సమాప్తి నొందించడం జరిగింది. ఈ విధంగా తొలుత 'నన్నయభారత ప్రణాళిక'గా ఆరంభమైన ఈ వ్యాఖ్యారచన, తరువాత తిక్కన భారతంలోకి విస్తరించి, సమగ్రతను సంతరించుకొని, చివరకు "కవిత్రయ మహాభారత ప్రణాళికగా" సార్థకమయింది.

కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు :

మొదటి మూడు పర్వాలు సరళగ్రాంథికంలోను, తక్కిన భాగమంతా భిన్నభిన్నశైలుల వ్యావహారికంలోనూ రచింపబడిన ఈ మొత్తం పదునెనిమిది పర్వాల వ్యాఖ్యాన స్వరూపానికి ప్రామాణికమైన ఏకరూపతను, నవ్యతను సముచితంగా సంతరింపజేయగల సంపాదకుణ్ణి సూచించవలసిందని తిరుమల తిరుపతి దేవస్థానం, స్థానికులైన నిపుణులను కోరింది.

అనుభవజ్ఞులగు నిపుణుల అభిప్రాయానుసారం దేవస్థానం - సుగృహీతనామధేయులైన సాహితీవేత్తలు ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారిని "కవిత్రయ మహాభారతం ప్రాజెక్టు"కు సంపాదకత్వం నిర్వహింపవలసిందిగా 1996 అక్టోబరులో ఆహ్వానించింది. తిరుమల తిరుపతి దేవస్థానంవారి ఆహ్వానాన్ని శ్రీ స్వామివారి ఆదేశంగా స్వీకరించి ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు తిరుపతికి వచ్చి 'ఎడిటరు' కార్యాలయంలోని ప్రచురణల విభాగం (Publications Wing)లో భద్రపరుపబడియున్న భారతం వ్రాతప్రతిని విశదంగా పరిశీలించి, ఇచ్చటి ఉద్యోగుల సహకారంతో వారు ఈ బృహద్ గ్రంథ పరిష్కరణకు అవలంబించవలసిన కొన్ని ముఖ్యపద్ధతులను, విధానాలను ప్రతిపాదించారు.

ఆ ప్రతిపాదనల సారాంశం :

"మహాభారత కథార్థాలు సామాన్యజనానికి అందుబాటులో ఉండేటట్లు చేయటానికీ, మహాభారతంలోని ధర్మసందేశం

అందరికీ అవగాహనకావడానికీ ఈ వ్యాఖ్యానం లక్షింపబడింది కాబట్టి, వ్యాఖ్యానమంతా ప్రామాణిక వ్యావహారిక భాషలో ఒకేరీతిగా ఉండేటట్లు చూడాలి. అవసరమైన చోట్ల వ్యాఖ్యాతలు వ్రాసిన వివిధశైలులను ప్రామాణిక వ్యావహారిక శైలిలోనికి మార్చి, ఒకే గ్రంథకర్త రచించిన రచనను చదువుతున్న స్ఫూర్తిని పఠితలకు కల్పింపచేయాలని నిర్ణయించడమైనది. భాషాశైలులు మార్చవలసి వచ్చినపుడు ఇపుడున్న 'ఒరిజినల్' వ్రాతప్రతిని చెడగొట్టకుండా 'ప్రెస్‌కాపీ'ని లేఖకులచే వ్యావహారిక భాషలో మరల వ్రాయించవలసివుంటుంది.

వ్యాఖ్యానరచనకు ఒకస్థూలమైన ప్రణాళికను ఇదివరలో రూపొందించి వ్యాఖ్యాతలకు తెలియపరచటమయింది. కాని, అందరూ ఆ అంశాలను తు.చ. తప్పకుండా పాటించినట్లు కనబడదు. అందువలన వ్యాఖ్యానరచనలో ఏకరూపత (Uniformity) ఒక్కొక్కచోట లోపించినట్లు కనబడుతోంది. కాబట్టి, వ్యాఖ్యానం అవసరానికి మించి ఉన్నచోట్ల తగ్గించటానికీ, అవసరం ఉన్నచోట్ల కొన్ని అంశాలను చేర్చటానికీ సంపాదకునికి స్వేచ్ఛ ఇవ్వాలని నిర్ణయించడమైనది.

వ్యాఖ్యానం వ్రాయడానికి ఉస్మానియా విశ్వవిద్యాలయంవారి ఆంధ్రమహాభారత సంశోధితప్రతిని ఆధారం చేసికోవాలని ఇదివరలోనే నిర్ణయించడమైనది. ఆ నిర్ణయాన్ని వ్యాఖ్యానరచయితలకు తెలుపడం కూడా జరిగింది. కాని, కొందరు రచయితలు నిర్దేశించిన ప్రతిని కాకుండా, వేరే ప్రతులను ప్రామాణికంగా తీసికొని వ్యాఖ్యానం వ్రాశారు. అటువంటి ఘట్టాలలో దేవస్థానంవారు ఎన్నుకొన్న ప్రతిని దృష్టిలో ఉంచుకొని వ్రాతప్రతులను తగినవిధంగా మార్చవలెనని నిర్ణయించటం జరిగింది.

మహాభారత వ్యాఖ్యానాన్ని 1/4 'డెమ్మీసైజు'లో పండ్రెండు సంపుటాల్లో ప్రచురించాలని నిర్ణయించడమైనది. పుస్తకం 'సైజు'ను నిర్ణయించడంలో పాఠకుణ్ణి, విషయాన్ని, ప్రచురణకర్త సౌకర్యాన్ని సాధారణంగా దృష్టిలో ఉంచుకొంటారు. పాఠకుణ్ణి దృష్టిలో పెట్టుకొంటే, అతడు భారతంలో ఒక్కొక్క పర్వాన్ని ఒక్కొక్క సంపుటంగా భద్రపరచుకోవాలని భావిస్తుంటాడు. అందువల్ల, 'వాల్యూమ్'కు పర్వాన్ని ప్రమాణంగా తీసికోవటం సౌకర్యంగా ఉంటుంది. విషయాన్ని బట్టిచూచినా పర్వవిభాగమే అందరికీ సౌకర్యం. ప్రచురించేసంపుటికి 'క్లాసిక్' (Classic) గౌరవం ఆకృతిలో కల్పించాలన్నా 1/4 'డెమ్మీసైజు' బాగుంటుందని తీర్మానించటమైనది. అయితే ఆదిపర్వం, ఆరణ్యపర్వం, శాంతిపర్వంలాంటి పెద్దపర్వాలు, మహాప్రస్థానిక పర్వంలాంటి చిన్నపర్వాలు ప్రచురిస్తున్నపుడు 'వాల్యూమ్' విభాగంలో కొంత వెసులుబాటు కల్పించుకోవచ్చు.

ఒక్కొక్క సంపుటానికి మొదట తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగారి ముందుమాట, 'ఎడిటరు' గారి ఉపోద్ఘాతం తప్పకుండా ఉండాలి. విషయసూచిక తయారుచేయాలి. ప్రతి పర్వం చివర అకారాది పద్యానుక్రమణిక తప్పనిసరిగా ఉండాలి".

పై పద్ధతుల ననుసరించి ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు పరిష్కరించి ఇస్తున్న భారత సంపుటాలను తిరుమల తిరుపతి దేవస్థానం వరుసగా ప్రచురింప బూనుకొన్నది. ఈ సంపుటుల ప్రచురణకార్యం త్వరితగతిన పూర్తి చేయించాలనే సంకల్పంతో తిరుమల తిరుపతి దేవస్థానం 1999 నవంబరు 3,4 తేదీల్లో శ్రీ పద్మావతి అతిథి గృహంలో తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ ఐ.వి. సుబ్బారావు, ఐ.ఏ.ఎస్., గారి అధ్యక్షతన కీలకమైన సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశంలో ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు తయారు చేయించిన ఆదిపర్వ, సభాపర్వాల డి.టి.పి. 'మాస్టరు కాపీ'లను సభ్యులు సమీక్షించారు. తదనంతర పర్వాల ప్రకటన ఇతోధికమగు వేగం అందుకోవటానికి వీలుగా ఈ సమావేశంలో కవిత్రయ భారతానికి సంబంధించిన సంపాదకమండలి (Editorial Board), సలహామండలి (Advisory Board) - అనే రెండు సంఘాలను ఈ దిగువ పేర్కొన్న విధంగా పునర్వ్యవస్థీకరించటం జరిగింది.

సంపాదక మండలి సభ్యులు

ఆచార్య నండూరి రామకృష్ణమాచార్యులు	శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు
ప్రొ॥ ఎస్.బి.రఘునాథాచార్య	డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య
ఆచార్య కె.జె.కృష్ణమూర్తి	ఆచార్య కె. సర్వోత్తమరావు

సలహా మండలి సభ్యులు

ప్రొ॥ బిరుదురాజు రామరాజు	ప్రొ॥ ఎస్.బి.రఘునాథాచార్య
ఆచార్య నండూరి రామకృష్ణమాచార్యులు	శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు
డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య	ఆచార్య ఎం. కులశేఖరరావు
ఆచార్య కె.జె.కృష్ణమూర్తి	ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావు
డా॥ మేడసాని మోహన్	ఆచార్య ఎం. బుద్ధన్న
ఆచార్య హెచ్.ఎస్. బ్రహ్మానంద	

తరువాత 2000 సంవత్సరం ఫిబ్రవరి 25వ తేదీన తిరుమలలో కార్యనిర్వహణాధికారి డా॥ ఐ.వి.సుబ్బారావు, ఐ.ఏ.ఎస్., గారి అధ్యక్షతన 'క్యాంప్ ఆఫీస్'లో పై రెండు మండలుల లోని సభ్యుల సంయుక్త సమావేశం నిర్వహింపబడింది. ఈ సమావేశంలో 2000 సంవత్సరాంతానికి కవిత్రయ భారతసంపుటా లన్నింటినీ వెలువరించాలనే ముఖ్యతీర్మానం కావింపబడింది. ఇందులకు అనువుగా ఆ యా పర్వాల వ్యాఖ్యాతలతో కూడిన ఒకటి, రెండు 'వర్క్‌షాప్'లను కూడ నిర్వహించడానికి నిర్ణయం గైకొనబడింది.

కవిత్రయ భారతాన్ని వ్యాఖ్యతో ముద్రించటంద్వారా తిరుమల తిరుపతి దేవస్థానంవారు 'పంచమవేద' మందలి ధర్మప్రబోధాన్ని యావదాంధ్రులకు అందించే ఉదాత్తపాత్రను నిర్వహిస్తున్నారు. ఆ క్రమంలో ఇప్పుడు ప్రథమ సంపుటం- ఆదిపర్వం (రెండు భాగాలు), ద్వితీయ సంపుటం – సభాపర్వం వెలువడినాయి. తరువాతి సంపుటాలు సైతం త్వరలోనే వెలుగుచూడనున్నాయి. అక్షరాస్యులైన ఆంధ్రులు భారతాన్ని స్వయంగా చదివి అర్థం చేసికోవటానికి ఈ సరళవ్యాఖ్య 'కరదీపిక' కావాలని తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆశయం. తిరుమల తిరుపతి దేవస్థానం తొలుదొలుత ప్రచురిస్తూవున్న ఈ 'వ్యాఖ్యానసహిత కవిత్రయ భారతం' ముద్రణలో ఏవైనా నూత్నాంశాలు చేర్చవలసివున్నట్లు అభిప్రాయపడితే సహృదయసాహితీవేత్తలు వాటిని మాకు తెలియజేయగలరని మనవి.

కృతజ్ఞతలు:

ఈ ప్రణాళిక ఫలప్రదం కావటానికి ఆధికారికమైన తమ ఆమోదాన్ని అందజేసిన తిరుమల తిరుపతి దేవస్థాన ధర్మకర్తలమండలి అధ్యక్షులకు, పాలకమండలి సభ్యులెల్లరకు కృతజ్ఞతాభివాదములు. ఈ మహాగ్రంథం వెలుగు చూడటంలో

ముఖ్యకారకులైన సహృదయులు తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారులు డా॥ ఐ.వి.సుబ్బారావు, ఐ.ఏ.ఎస్., గారికి అనేక ధన్యవాదాలు.

ఈ ప్రణాళిక ద్వారా "వ్యాఖ్యాన సహిత కవిత్రయ భారతము"ను ఆంధ్రావళికి అందజేయటంలో ప్రధానపాత్ర వహించిన – వ్యాఖ్యాతలు, పై ఉభయ మండలుల (సంపాదకమండలి, సలహామండలి) యందలి విద్యావేత్తలు ప్రధాన సంపాదకుడు ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యంగారు – ఈ విద్వాంసులందరికి నా కృతజ్ఞతాపూర్వక నమోవాకములు.

"సప్తగిరి" సంపాదకులుగా ఉండి, ఈ ప్రణాళిక కొనసాగటంలో ఆదినుండి ప్రముఖ పాత్ర వహించిన కీ.శే. కాట్రపాటి సుబ్బారావుగారికి హార్దిక కృతజ్ఞతలు. "సప్తగిరి" సంపాదక కార్యాలయ ప్రచురణల విభాగంలో 'సబ్ ఎడిటరు'గా ఉద్యోగిస్తూ 1995లో పదవినుండి విరమించేదాకా ఈ ప్రణాళిక విషయమై మిగుల సహకరించిన విద్వత్కవివర్యులు శ్రీమాన్ ముదివర్తి కొండమాచార్యులుగారికి, ఆచార్య కె.జె.కృష్ణమూర్తి (కంట్రోలర్ ఆఫ్ పబ్లికేషన్స్) గారికి అనేక కృతజ్ఞతలు. ఈ కార్యక్రమంలో చేదోడువాదోడుగా ఉంటూ, అన్ని విధాలా సహాయ సహకారాలందించిన ప్రచురణల విభాగమందలి సహోద్యోగులు రీసెర్చ్ అసిస్టెంట్ శ్రీ కోరాడ రామకృష్ణ, తెలుగు సబ్–ఎడిటర్లు డాక్టర్ కె. రాధారమణ, డాక్టర్ ఎ. సంధ్య, సప్తగిరి పత్రిక కన్నడ సబ్–ఎడిటర్ శ్రీ బి.ఎన్.శ్రీనివాసన్ గారలకు, తదితర సిబ్బందికి, టి.టి.డి. ముద్రణాలయ అధికారి శ్రీ ఎం. లక్ష్మణరావు గారికి, వారి సిబ్బందికి కృతజ్ఞతలు.

శ్రీ వేంకటేశ్వరస్వామివారి అనుగ్రహ విశేషం వల్ల ఈ మహోత్తమగ్రంథం వెలుగు చూస్తున్నందుకు, ఆ వేదత్రయ స్వరూపునకు కృతజ్ఞతాంజలి ఘటిస్తున్నాము.

డా॥ ఎన్.ఎస్.రామమూర్తి
కన్వీనర్
సంపాదకుడు – సప్తగిరి
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

సంపాదక మండలి సభ్యులు

డా॥ ఐ.వి. సుబ్బారావు, ఐ.ఏ.ఎస్., అధ్యక్షులు

కార్యనిర్వహణాధికారి, తి.తి.దే., తిరుపతి.

ప్రధాన సంపాదకుడు: ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం

ఆచార్య నండూరి రామకృష్ణమాచార్యులు

శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు

ప్రొ॥ఎస్.బి. రఘునాథాచార్య

డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

ఆచార్య కె.జె. కృష్ణమూర్తి

ఆచార్య కె. సర్వోత్తమరావు

సలహా మండలి సభ్యులు

డా॥ బిరుదురాజు రామరాజు

ప్రొ॥ ఎస్.బి. రఘునాథాచార్య

ఆచార్య నండూరి రామకృష్ణమాచార్యులు

శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు

డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

ఆచార్య ఎం. కులశేఖరరావు

ఆచార్య కె.జె. కృష్ణమూర్తి

ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావు

డా॥ మేడసాని మోహన్

ఆచార్య ఎం. బుద్ధన్న

ఆచార్య హెచ్.ఎస్.బ్రహ్మానంద

డా॥ ఎన్.ఎస్.రామమూర్తి, కన్వీనర్

"సప్తగిరి" సంపాదకులు, తి.తి.దేవస్థానములు, తిరుపతి.

కవిత్రయ విరచిత

శ్రీమదాంధ్ర మహాభారతము

	వ్యాఖ్యాతలు	పర్వాలు, ఆశ్వాసాలు
1.	డాక్టర్ దివాకర్ల వేంకటావధాని	ఆది. ఆశ్వా. 1,2,3
2.	డాక్టర్ జి.వి. సుబ్రహ్మణ్యం	ఆది. ఆశ్వా. 4; శాంతి. ఆశ్వా.1
3.	డాక్టర్ అప్పజోడు వేంకటసుబ్బయ్య	ఆది. ఆశ్వా. 5,6,7,8; సభా. ఆశ్వా. 1,2
4.	డాక్టర్ నండూరి రామకృష్ణమాచార్యులు	ఆరణ్య. ఆశ్వా. 1 నుండి 7 వరకు; భీష్మ. ఆశ్వా. 1,2
5.	డాక్టర్ కె. సర్వోత్తమరావు	విరాట. ఆశ్వా. 1
6.	డాక్టర్ ఆర్. అనంతపద్మనాభరావు	విరాట. ఆశ్వా. 2
7.	శ్రీ సింగరాజు సచ్చిదానందం	విరాట. ఆశ్వా. 3; ద్రోణ. ఆశ్వా. 3,4; శల్య. ఆశ్వా.2
8.	డాక్టర్ మేడవరం వేంకటనారాయణశర్మ	విరాట. ఆశ్వా.4
9.	డాక్టర్ కె. రామగోపాలకృష్ణమూర్తి	విరాట. ఆశ్వా.5
10.	డాక్టర్ జొన్నలగడ్డ మృత్యుంజయరావు	ఉద్యోగ. ఆశ్వా. 1,2; సౌప్తిక. ఆశ్వా. 1,2
11.	శ్రీ ముదివర్తి కొండమాచార్యులు	ఉద్యోగ. ఆశ్వా. 3,4
12.	శ్రీ కవి చెరుకూరి జయచంద్రశాస్త్రి	భీష్మ. ఆశ్వా. 3
13.	డాక్టర్ జి. హరిహరనాథ్	ద్రోణ. ఆశ్వా. 1
14.	డాక్టర్ మల్లెల గురవయ్య	ద్రోణ. ఆశ్వా. 2
15.	డాక్టర్ కె. రాజన్నశాస్త్రి	ద్రోణ. ఆశ్వా. 5
16.	శ్రీ ఏలూరిపాటి అనంతరామయ్య	కర్ణ. ఆశ్వా. 1
17.	డాక్టర్ యస్వీ. రామారావు	కర్ణ. ఆశ్వా. 2
18.	డాక్టర్ మరుపూరి కోదండరామరెడ్డి	కర్ణ. ఆశ్వా. 3
19.	డాక్టర్ పి. వెంకటరాజు	శల్య. ఆశ్వా. 1
20.	డాక్టర్ హెచ్. ఎస్. బ్రహ్మానంద	స్త్రీ. ఆశ్వా. 1,2; అశ్వ. ఆశ్వా 1,2; మౌసల-1; మహా.1; స్వర్గా-1
21.	డాక్టర్ ఎస్. గంగప్ప	శాంతి. ఆశ్వా. 2
22.	డాక్టర్ దావులూరి కృష్ణకుమారి	శాంతి. ఆశ్వా. 3
23.	డాక్టర్ ఆకురాతి పున్నారావు	శాంతి. ఆశ్వా. 4
24.	శ్రీ సముద్రాల లక్ష్మణయ్య	శాంతి. ఆశ్వా. 5
25.	డాక్టర్ బేతవోలు రామబ్రహ్మం	శాంతి. ఆశ్వా. 6
26.	డాక్టర్ తుమ్మపూడి కోటీశ్వరరావు	అను. ఆశ్వా. 1,2
27.	డాక్టర్ శలాక రఘునాథశర్మ	అను. ఆశ్వా. 3,4
28.	డాక్టర్ ఎమ్. కులశేఖరరావు శ్రీ ముదివర్తి కొండమాచార్యులు	అను. ఆశ్వా. 5
29.	శ్రీ నాగళ్ల గురుప్రసాదరావు	అశ్వ. ఆశ్వా. 3,4
30.	డాక్టర్ ఎ. నాగభూషణం	ఆశ్ర. ఆశ్వా. 1,2

సంకేతాక్షర సూచి

ఆది.	–	ఆదిపర్వం
సభా.	–	సభాపర్వం
ఆర.	–	ఆరణ్యపర్వం
విరా.	–	విరాటపర్వం
ఉద్యో.	–	ఉద్యోగపర్వం
భీష్మ.	–	భీష్మపర్వం
ద్రోణ.	–	ద్రోణపర్వం
కర్ణ.	–	కర్ణపర్వం
శల్య.	–	శల్యపర్వం
సౌప్తి.	–	సౌప్తికపర్వం
స్త్రీ.	–	స్త్రీ పర్వం
శాంతి.	–	శాంతిపర్వం
ఆను.	–	ఆనుశాసనికపర్వం
అశ్వ.	–	అశ్వమేధపర్వం
ఆశ్ర.	–	ఆశ్రమవాసపర్వం
మౌస.	–	మౌసలపర్వం
మహా.	–	మహాప్రస్థానికపర్వం
స్వర్గా.	–	స్వర్గారోహణపర్వం
సం.	–	భండార్కరు సంస్థవారి సంస్కృతభారతప్రతి
సం.మ.భా.	–	సంస్కృత మహాభారతము
అను.	–	పై ప్రతిలోని అనుబంధాలు
సంపా.	–	ప్రధాన సంపాదకుడు

క.	–	కందపద్యం
వ.	–	వచనం
ఆ.	–	ఆటవెలది
తే.	–	తేటగీతి
సీ.	–	సీసం
ఉ.	–	ఉత్పలమాల
చ.	–	చంపకమాల
మ.	–	మత్తేభవిక్రీడితం
శా.	–	శార్దూలవిక్రీడితం
ఆశ్వా.	–	ఆశ్వాసం
క్రీ.శ.	–	క్రీస్తుశకం
య.	–	యగణం
మ.	–	మగణం
త.	–	తగణం
ర.	–	రగణం
జ.	–	జగణం
భ.	–	భగణం
న.	–	నగణం
స.	–	సగణం
ల.	–	లఘువు
గ.	–	గురువు
అలం.	–	అలంకారం
సం.	–	సంవత్సరం
మొ.	–	మొదలైన

పీఠిక

ఆ. "ధర్మజుండు ధర్మతరు, వర్జునుఁడు ఘన
స్కంధ, మనిలసుతుఁడు శాఖ, కవలు
పుష్పఫలము, లేను భూసురులును వేద
ములుఁ దదీయ మైన మూలచయము."

ఆ. "రోషమయ మహాతరువు సుయోధనుఁ, డురు
స్కంధ మందులోనఁ గర్ణుఁ, డలరుఁ,
గొమ్మ సౌబలుండు, గుసుమఫలములు దు
శ్శాసనుండు, మూలశక్తి తండ్రి." **(ఉద్యో. 1. 356, 355)**

సభాపర్వంలో రెండు మహావృక్షాలు

ధర్మరాజు ధర్మవృక్షం. దుర్యోధనుడు రోషవృక్షం. వీరిద్దరూ మహావృక్షాలుగా సభాపర్వంలో దర్శన మిస్తారు. ఉద్యోగపర్వంలో ఘర్షణపడతారు. చెట్టు మహావృక్షం కావాలంటే కొమ్మలతో విస్తరిల్లాలి. మూలబలంతో స్కంధం చేవతేలాలి. పూలుపండ్లు దాని వైభవంగా నిలవాలి. అది ధర్మవృక్ష మైతే లోకహితంకొరకు సువాసనలు విరజిమ్ముతుంది. అధర్మవృక్ష మైతే స్వార్థంతో లోకప్రళయానికి దోహదం చేస్తుంది. ఇటువంటి రెండు విరుద్ధవృక్షాల ప్రకృతిని, విస్తృతిని దర్శింపచేసే పర్వం సభాపర్వం.

ఆంధ్రమహాభారతంలోని పదునెనిమిది పర్వాలను నాలుగుభాగాలుగా విభజించుకొని చదివే పరిపాటి ఆంధ్రులలో కనపడుతుంది. మొదటిభాగం - ఆదిపంచకం (ఆది, సభా, అరణ్య, విరాట, ఉద్యోగపర్వాలు); రెండవభాగం- యుద్ధషట్కం (భీష్మ, ద్రోణ, కర్ణ, శల్య, సౌప్తిక, స్త్రీ పర్వాలు); మూడవభాగం- శాంతిత్రయం (శాంతి, ఆనుశాసనిక, అశ్వమేధపర్వాలు); నాల్గవభాగం- ఆశ్రమవాస చతుష్టయం (ఆశ్రమవాస, మౌసల, మహాప్రస్థానిక, స్వర్గారోహణపర్వాలు).

పదునెనిమిది పర్వాలలో సభాపర్వం కీలక మైనది. ఇది లేకపోతే తరువాతి కథ లేదు. మహాభారతాన్ని ఒక మహానాటకంగా భావిస్తే, అందులో సభాపర్వం ప్రతిముఖసంధిస్థానంలో ఉంటుంది. ఆదిపర్వం ముఖసంధిస్థానీయం. బీజ, బిందు, పతాక, ప్రకరీ, కార్యాలు అర్థప్రకృతులు. ఆరంభ, యత్న, ప్రాప్త్యాశా, నియతాప్తి, ఫలాగమాలు అవస్థలు. అర్థప్రకృతులు అవస్థ లైదింటితో వరుసగా కలిసి ప్రవర్తిల్లటంవలన పంచసంధులు ఏర్పడతాయి. ముఖ, ప్రతిముఖ, గర్భ, అవమర్శ(విమర్శ), నిర్వహణ సంధులు అయిదు.

చతుర్విధపురుషార్థ సాధనాత్మకమైన జీవితాన్ని నడుపుతూ, అధర్మవర్తనులను శిక్షించి, ధర్మాన్ని ఉద్ధరించి చంద్రవంశచరిత్రలో సమగ్రగుణోపేతులు కావాలని పాండవుల ధర్మవీరవ్రతం. పాండవులు పుట్టినప్పటినుండి దివ్యశక్తియుతులు కావటంచేత దుర్యోధనాదులచేత ద్వేషించబడుతూనే ఉన్నారు. ఉపాంశువధనుండి భీముడు ఎన్నోసార్లు బయటపడ్డాడు. కుమారాస్త్రవిద్యాసందర్శన ఘట్టంలో పాండవకౌరవులు వైరివర్గాలుగా చీలిపోయారు. పాండవుల నందరినీ సామూహికంగా చంపాలనే పన్నాగంలో భాగంగా దుర్యోధనుడు పన్నిన లాక్షాగృహదహన వ్యూహంవలన పాండవులకు కౌరవులు దాయాదులైనా ప్రబలశత్రువులుగా పరిణమించారు. ద్రౌపదీవివాహానంతరం పాండవులకు క్రొత్తగా ఏర్పడిన బంధుమిత్రుల బలాన్నీ, బలగాన్నీ గమనించి కౌరవులు పాండవులకు రాజ్యంలో భాగ మివ్వటంతో పైకి సయోధ్యతలు కుదిరినా అంతశ్శైత్యాలు అట్లాగే ఉండిపోయాయి. ఆదిపర్వం ముగిసేనాటికి శ్రీకృష్ణుడి ప్రేరణచేత విశ్వకర్మ నిర్మించియిచ్చిన ఇంద్రప్రస్థంలో పాండవులు ప్రజారంజకులుగా ప్రకాశిస్తూ ఉన్నారు. కథలో బీజారంభాల ప్రకాశనం ప్రకృష్టంగా జరిగింది. ముఖసంధి ముచ్చటగా రూపుకట్టింది.

సభాపర్వంలో ధర్మరాజు పాండురాజాదులకు ఉత్తమగతులు కలగటానికి రాజసూయం తలపెట్టాడు. శ్రీకృష్ణుడి సహాయంతో మయసభను పొందాడు; జరాసంధుడిని వధించి వివిధదేశాధిపతులకు విముక్తిని ప్రసాదించి వారిని మిత్రులుగా చేసికొన్నాడు. నలుగురు తమ్ములతో నాలుగుదిక్కులను జయించి అపారసంపదను గడించాడు. రాజసూయాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించి, శ్రీకృష్ణుడిని పూజించి, శిశుపాలుడి అడ్డు తొలగించి, సమ్రాట్టుగా సత్కీర్తిని సంపాదించాడు. ధర్మరాజుజీవితంలో రాజసూయం ఒక మహాయోగం!

ధర్మరాజుచరిత్ర రెండుయజ్ఞాలతో ప్రకాశించిన ప్రఖ్యాతేతివృత్తం; ఒకటి రాజసూయం, మరొకటి అశ్వమేధం. ధృతరాష్ట్రుడు, భీష్ముడు, ద్రోణుడు, కృపాశ్వత్థామలు, దుర్యోధనాదులు ఉండగా ధర్మజుడు స్వతంత్రించి సమ్రాట్టుగా ప్రకాశింపచేసిన యజ్ఞం రాజసూయం. దానివలన ఇహంలో ప్రజలు, పరంలో పాండురాజు లాభించారు. కాని, భవిష్యత్తులో విస్తారంగా ప్రజాక్షయ మయ్యే మహాయుద్ధం జరిగే ప్రమాదం ఏర్పడింది. దానికి చూళికవలె జ్వలించి, పాండవవైభవాన్ని చూచి దుర్యోధనుడి గుండెలో రగిలిన ఈర్ష్యాగ్ని పాండవులకు అష్టకష్టాలు కలిగించింది. మయసభలో ఎంత ఐశ్వర్యాన్ని పొందాడో ధర్మరాజు మాయాద్యూతసభలో అంత కోల్పోయాడు. తననూ తన తమ్ములనూ భార్యనూ జూదంలో ఓడిపోయాడు. పాంచాలి నిండుసభలో అవమానించబడింది. వస్త్రాపహరణ సమయంలో ఆమెను శ్రీకృష్ణుడు రక్షించాడు. దుశ్శకునాలు వెలువడ్డాయి. ధృతరాష్ట్రుడు గాంధారీవిదుర ప్రేరితుడై ద్రౌపదికి వరాలరూపంగా రాజ్యాన్నంతా ఇచ్చి దాసదాసీత్వాలను తొలగించాడు. పునర్ద్యూతంలో కూడా ధర్మజుడు ఓడిపోయి తమ్ములతో భార్యతో కూడి అరణ్య అజ్ఞాతవాసాలు చేయటానికి పూనుకొన్నాడు. శకునిమాయవలన దుర్యోధనుడు అతిసులభంగా అనంతసంపదను సంపాదించి అడ్డులేని అహంకారంతో వ్యవహరించాడు. అతడి దుష్ప్రవర్తనాన్ని ఎవ్వరూ ఆపలేకపోయారు. వికర్ణవిదురాదులు ధర్మంచెప్పబోయి మాటపడ్డారు. పాండవులు వెంటనే ప్రతీకారం తీర్చికొనే అవకాశం లేకపోయినా, భవిష్యత్కాలంలో జరిగే భయంకరమైన యుద్ధంలో ధార్తరాష్ట్రులనందరినీ, కర్ణశకునులను చంపుతామని భీమాదులు భీకర ప్రతిజ్ఞలు చేశారు. సభాపర్వంలోని ప్రథమాశ్వాసంలో ధర్మతేజం సముజ్జ్వలంగా ప్రకాశించింది. ద్వితీయాశ్వాసంలో కుత్సిత స్వార్థ దురహంకారం అసూయాగ్నితో విజృంభించి

ధర్మతేజాన్ని చుట్టుముట్టింది. రెండురకాల విరుద్ధ విచిత్ర శక్తుల మహాప్రతాపం ప్రజ్వరిల్లింది. ఆదిపర్వంలో ఆరిపోయినట్లు కనిపించిన పాండవ కౌరవద్వేషం సభాపర్వంలో కార్చిచ్చువలె రగులుకొని వ్యాపించి ధార్తరాష్ట్రవనాన్ని కాల్చటానికి పూనుకొన్నది. అరణ్యవాసమంతా పాండవులు కౌరవులపై పగసాధించి విజయం పొందటానికి కావలసిన తపస్సంపదను, శస్త్రాస్త్ర సంపదను పొందటానికే వినియోగించుకొన్నారు. ఆపైన కురుక్షేత్రయుద్ధంలో ధార్తరాష్ట్రులను చంపి, ప్రతిజ్ఞ లన్నీ నెరవేర్చి విజయాన్ని పొందారు. అంటే- రాజసూయంలో ధర్మరాజు సంపాదించిన వైభవాన్ని, తీవ్రయత్నంతో యుద్ధానంతరం తిరిగిపొందా డన్నమాట!

యుద్ధానికి పూర్వం రాజసూయంలో ధర్మరాజు సమ్రాట్టు. యుద్ధానంతరం అశ్వమేధంలో మరల సమ్రాట్టు. ఈ రెండు యాగాలూ అతడి చరిత్రలో రెండు మహర్దశలు. ఈ రెండింటి నడుమ సాగిన సంఘర్షణ భారతంలోని ప్రధానకథ. అందులో 'బిందువు' మాయాద్యూతం. 'యత్నం' పాండవ శపథాలు. అందువలననే ఆదిపర్వం ముఖసంధి కాగా, సభాపర్వం ప్రతిముఖసంధి అవుతుంది.

ధర్మరాజు ధర్మతరువుగా యౌవరాజ్య పట్టాభిషేకంతో నిలిచాడు. కాని, రాజసూయంలోమాత్రమే కొమ్మలు సాచి విస్తృతినీ, వైభవాన్నీ ప్రదర్శించకలిగాడు. ఆదిపర్వంలో భీమార్జునుల బలపరాక్రమాలు ప్రకటితా లైనాయి. సభాపర్వప్రథమాశ్వాసంలో దిగ్విజయసాధనలో తమ్ములప్రతాపం ప్రకాశితమైనది. ధర్మం, శ్రీకృష్ణుడు, ధౌమ్యుడు, ధర్మజుడి ఔన్నత్యానికి మూలబలంగా నిలిచారు. భూతలంమీద నున్న రాజులందరి మ్రొక్కు లందుకొన్న ధర్మరాజు మూర్తికట్టిన ధర్మంగా కీర్తించబడ్డాడు. "రామో విగ్రహవాన్ ధర్మః" అని శ్రీరామచంద్రుడు ప్రశంసితు డైనట్లే 'ధర్మజో విగ్రహవాన్ ధర్మః' అని యుధిష్ఠిరుడు ప్రఖ్యాతి నొందాడు. పుష్పఫలాలతో చేవతో పెరిగిన ధర్మ మహాకల్పవృక్షం ధర్మరాజు. యజ్ఞదీక్షితు డైన ధర్మజుడు మూర్త మైన ధర్మ మని కీర్తించాడు నన్నయ.

ఉ. "సమ్మదమంది చూచిరి భృశంబుగ భూజను లెల్ల బ్రహ్మతే
జమ్మును రాజతేజమును సద్బహుభూషణరత్నరాజితే
జమ్మును విస్తరించుచు నిజద్యుతి యొప్పఁగ మూర్త మైన ధ
ర్మమ్మునుబోలె నున్న గుణమండితు దీక్షితు ధర్మనందనున్." **(సభా. 1.290)**

మహాభారతంలో ప్రతినాయకు డైన దుర్యోధనుడు మూర్తీభవించిన క్రోధం. రోషమయమహాతరువు. క్రోధప్రధానుడు- ఉద్ధతుడు, అర్థ పురుషార్థ సాధకుడు, అధర్మరతుడు, ఆత్మశ్లాఘానిరతుడు, కపటి, నయవంచకుడు కావటం సహజం. కణికనీతి బోధతో దుర్యోధనుడు రోషవృక్షంగా అవతరించాడు. అతడికి కర్ణుడు చేవగల స్కంధం అయ్యాడు. కుమారాస్త్రవిద్యా ప్రదర్శనంలో ఆ చెట్టుకు ఆ బోదె సిద్ధించింది. శకుని మాయోపాయాలు ఆ చెట్టుకు కొమ్మలు. లాక్షాగృహదహనం, మాయాద్యూతం, అనుద్యూతం ఆ కొమ్మల విలాసాలు. శకుని దుర్మంత్రానికీ, దుర్యోధనుడి అసూయాగ్రహాలకూ అనుస్పందించి, అనుమతించి, కపటనాటకం ఆడగలిగిన రెండునాల్కల ధృతరాష్ట్రుడు ఆ చెట్టుకు మూలబలం. అది శ్రీకృష్ణుడంతటి దృఢమైనది కాదు. భయ మోహాలచేత కంపించిపోయేది. అందువలన రోషతరువు ఎప్పటికైనా కూలేదే. ధృతరాష్ట్రుడివలన దుర్యోధను డనే చెట్టు నిలిచింది. కర్ణుడివలన చేవ తేలింది. శకునివలన విస్తరించింది. దుశ్శాసనుడివలన దుర్వాసనలను వెదజల్లింది. ధృతరాష్ట్రాదులు దుర్యోధనుడి ఈర్ష్యాగ్నిని చూచి భయపడ్డారు. శకుని ఆజ్యం పోశాడు. కర్ణుడు గాలిగా వీచి రెచ్చగొట్టాడు. దుశ్శాసనుడు జ్వాలాజిహ్వలవలె పెచ్చుపెరిగి శత్రువులను అవమానాలతో దహించాడు. భీముడు చేసిన ప్రతిజ్ఞలు దుర్యోధన దుశ్శాసనులను సంహరించటానికి ఉద్దేశించబడినవి. వాటికి బలమైన హేతువు కర్ణుడు. ద్రౌపదికి జరిగిన ఘోరమైన పరాభవానికి కారణం కర్ణుడి మాటలూ, సూచనలే. నిండుసభలో బంధకిని వివస్త్రను చేసినా తప్పులేదన్నదీ, జూదంలో ఓడని ఆరవ భర్తను ఎన్నుకొనుమని అవహేళనం చేసిందీ కర్ణుడే. అతడి మాటలు, దుర్యోధనుడు పాండవ ధర్మపత్నిని తన తొడపై కూర్చొను మని చేసిన సైగలు, దుశ్శాసనుడు లజ్జలేక ఆమె శిరోజాలు పట్టి లాగి వస్త్రాపహరణం చేసిన దుశ్చర్యలు భావికాలంలో పాండవుల మనస్సులలో ములుకులై బాధించి ప్రతీకారజ్వాలలను ప్రజ్వలింపచేశాయి.

దుర్యోధనుడి దౌష్ట్యవిశ్వరూపం చూడగలిగిన పర్వం సభాపర్వమే! అర్థలోభంవలన కల్పవృక్షాలనుసైతం బొగ్గులకొరకు కాల్చే అంగారకారుడివంటి కరుణారహితుడు దుర్యోధనుడు. విదురుడు ధృతరాష్ట్రుడితో అన్నమాటలలో-

మధ్యాక్కర.

"అంగారములు గొనువేడ్కఁ బుష్పఫలావళీలలిత
తుంగద్రుమప్రకరంబుఁ గరుణావిదూరుఁడై కాల్చు
నంగారకారుఁ బోలంగ సమకట్టె నర్థలోభంబు
నం గురుకులహానికరుఁడు ధారుణీనాథ! నీసుతుఁడు." **(సభా. 2.182)**

ఈవిధంగా ధర్మవృక్ష రోషవృక్ష సమగ్ర విస్ఫూర్తులు సభాపర్వంలో రూపుకట్టాయి.

సభాపర్వం: నామసార్థక్యం

ఆంధ్రమహాభారతంలోని అష్టాదశపర్వాలలో రంగస్థలసూచకా లైనవి సభాపర్వం, అరణ్యపర్వం, విరాటపర్వం, ఉద్యోగపర్వం. సభలను ఆలంబనంగా చేసికొని ప్రవర్తిల్లిన పాండవ జీవితవృత్తాన్ని అధికరించి చెప్పేది సభాపర్వం. వనవాసవ్రతాన్ని నిర్వహిస్తూ అరణ్యాలలో గడపిన పాండవ జీవిత విశేషాలను ఆయా ఘట్టాలలో వివరించేది అరణ్యపర్వం. విరాటనగరంలో మారువేషాలతో ఎవ్వరికీ తెలియరాకుండ అజ్ఞాతవాసాన్ని పాండవులు నిర్వహించిన ఆసక్తికరమైన కథను వివరించేది విరాటపర్వం. ఉపప్లావ్యంలోని ధర్మరాజు సభలోనూ, హస్తినాపురంలోని ధృతరాష్ట్రుడి సభలోనూ దూతకార్యాలు నాటకీయంగా నిర్వహించే వస్తువు కలది ఉద్యోగపర్వం. ఇవి వేర్వేరు పర్వాలుగా కనపడుతున్నా తత్త్వతః ఒక్కటే మహాపర్వం అనవచ్చును. సభాపర్వంలో జరిగిన కథకు అనుబంధాలే అరణ్య విరాట ఉద్యోగాలు. ఉద్యోగపర్వం ఆది సభాపర్వ కథార్థాల పునర్విచారణమే. అందులోనూ పాండవ కౌరవ సభలలో దౌత్యాలు నడుస్తాయి. కురుక్షేత్రయుద్ధానికి శంఖాలు పూరించబడతాయి. ఈవిధంగా భారతంలోని ఆది పంచకంలో సభలు కీలకపాత్రలు నిర్వహిస్తున్నాయి. ఆ యా సభలలో సాగిన కథార్థాలకు మూల మైనది మయసభ. అది దివ్యసభ. దానికి ప్రతిగా ధృతరాష్ట్రుడు నిర్మించింది మణిమయ (ద్యూత)సభ- ఫలితాలనుబట్టి చూస్తే అతడి సంతానానికి యమసభ. పుణ్యం ప్రోగుచేసింది మయసభ. పాపం మూటకట్టింది ధృతరాష్ట్రసభ. 'అత్యుత్కటైః పుణ్యపాపైః ఇహైవ ఫల మశ్నుతే' అన్న న్యాయానికి ఆ సభలు బొమ్మాబొరుసులు!

సభాపర్వంలోని రెండుసభలూ, ఉద్యోగపర్వంలోని రెండుసభలూ శ్రీకృష్ణ మహిమలకు వ్యంజకాలుగా నిలవటం పాండవుల దైవీసంపదకు నిదర్శనం. 'ధర్మో రక్షతి రక్షితః' అనే న్యాయాన్ని అనుసరించి శ్రీకృష్ణుడు ధర్మరక్షకుడుగా పాండవులను నాలుగురకాలుగా ఆదుకొన్నాడు నాలుగుసభలలో. రాజసూయయాగంలో మయసభలో ధర్మజుడిని సమ్రాట్టుగా నిలిపింది శ్రీకృష్ణుడే. అతడి వ్యూహబలమే ధర్మజుడి మూలబలం. ధృతరాష్ట్రనిర్మిత మైన సభలో అంతసంపదను ఆ విధంగా మాయాద్యూతంలో కోల్పోతున్న సందర్భంలోకూడా ధర్మజుడుకాని, అతడి తమ్ములుకాని శ్రీకృష్ణుని స్మరించలేదు. బలవంతంగానైనా పిలువబడినప్పుడు క్షత్రియుడు జూదమాడక తప్పదనే ధర్మపన్నం చదివాడేకాని ధర్మరాజు తనకు హృదయస్థానీయు డైన శ్రీకృష్ణపరమాత్మను తలంచనేలేదు. కాని, విపత్తులో మునిగిన ద్రౌపది శ్రీకృష్ణుడిని స్మరించి తనను తాను ఉద్ధరించుకొనటమే కాక పాండవులను కూడ ఉద్ధరించగలిగింది. అనుద్యూతంలోకూడా ధర్మజుడికి శ్రీకృష్ణుడు తలపులో నిలువలేదు. వ్యసనమున్నచోట వాసుదేవు డుండడు కాబోలు! అయినా ధర్మాన్ని రక్షించే పాండవులను మయసభలో ప్రత్యక్షంగానూ, ధృతరాష్ట్రసభలో పరోక్షంగానూ రక్షించి శ్రీకృష్ణుడు దివ్యశక్తిని ప్రదర్శించాడు.

ఉద్యోగపర్వంలో ఉపప్లావ్యంలోని ధర్మజుడిసభలో తీర్పరిగా నిలిచి సంజయురాయబారంలోని బండారాన్ని బయటపెట్టాడు. హస్తినాపురసభలో మధ్యవర్తిగా నిలిచి ధార్తరాష్ట్రుల అధర్మప్రవృత్తినీ, పాండవుల నీతివర్తనాన్నీ లోకంలో ప్రకటమయ్యేటట్లు వర్తించి నైతికమైన విజయాన్ని పాండవులకు సాధించిపెట్టాడు.

సభాపర్వంలో శ్రీకృష్ణుడు పాండవులకు యోగదాయకుడు. ఉద్యోగపర్వంలో క్షేమకారకుడు. ఇది సభల కథలవలన ప్రతీయమానమయ్యే ప్రబంధధ్వని.

మయసభ ఇంద్ర, యమ, వరుణ, కుబేర, బ్రహ్మసభలకంటె మనోహరంగా ఉన్నదని నారదుడు చెప్పటం యథార్థంగా కథార్థంగా నిలిచినా, పాండురాజు యమసభలో, హరిశ్చంద్రుడు ఇంద్రసభలో ఉండట మెందు కనే ప్రశ్న ధర్మజుడికి పుట్టటం, పరమార్థంగా పాండురాజు ధర్మరాజును రాజసూయం చేయుమని ఆదేశించిన వార్తచెప్పటానికి పోషకంగా, హరిశ్చంద్ర మాహాత్మ్యాన్ని చెప్పటానికి ఉపాయంగా సాగింది సభాప్రశంస. మయసభ రాజసూయసంకల్పానికి రంగమై నిలిచింది. రాజసూయసంకల్పం ప్రజాక్షయాన్ని కలిగించే మహాయుద్ధానికి పూర్వరంగమై తారసిల్లింది. ఎంతోసేపు ఆలోచించి మయసభా నిర్మాణాన్ని సూచించిన శ్రీకృష్ణుడిసంకల్పంలోనే మహాభారతయుద్ధప్రయోగానికి ప్రరోచనం జరిగింది.

సభాపర్వాని కున్న ఇన్నిరకాల ప్రాముఖ్యాన్ని నన్నయ సారమతిగా భావించి, రంగస్థలప్రాధాన్య మున్న కథలోని సన్నివేశ చారుత్వాన్ని వివేచించి, నాటకీయతను ప్రసన్నకథాకలితార్థయుక్తితో మేళవించి, అపూర్వఫణితిలో రచించాడు. అంటే- శ్రవ్యకావ్య మర్యాదలలో దృశ్యకావ్యమర్యాదలను ప్రవేశపెట్టి రూపకమర్యాదావిశిష్టమైన కావ్యకళను ఇతిహాసేతివృత్తంలో నిబంధించా డన్నమాట. ఆంధ్రమహాభారతాన్ని కావ్యేతిహాస మనే మిశ్రప్రక్రియలో రచించటమే కాకుండ శ్రవ్య దృశ్య కావ్య మిశ్రప్రయోగాన్ని సాధించి నన్నయ తన ప్రత్యేకతను ప్రదర్శించాడు. అందుచేతనే సభాపర్వం- 'పండిత చేతో నిర్వృతి' చేస్తూ 'రమ్యం'గా ఉంటుందన్నాడు నన్నయ పర్వసంగ్రహంలో. (ఆది. 1.38) 'కావ్యేషు నాటకం రమ్యం' అనికదా ఆర్యోక్తి!

నన్నయరచనలో నాటకీయత

'నాటకీయత' అనంగానే తెలుగులో తిక్కనసోమయాజి జ్ఞాపకం వస్తాడు. కాని, తిక్కనకుకూడ మార్గదర్శి నన్నయభట్టారకుడే. నన్నయ నాటకీయతకు మార్గంవేసి మనోజ్ఞంగా చూపించాడు. తిక్కన దానిని ఘంటాపథంగా మార్చి రసవంతంగా అలంకరించాడు.

శ్రవ్యకావ్యంలో నాటకీయతను వివేచించటానికి నన్నయరచనాశిల్పం బాగా తోడ్పడుతుంది. ఈ క్రింది అంశాలు అందులో ముఖ్యంగా పరిగణించదగినవి.

1. **రంగపరికల్పన:** కథలో ప్రదర్శన కనుకూలంగా ఉండే ఘట్టాలను గుర్తించి, వాటిని నిర్వహించేటప్పుడు కథాకథనంకంటె పాత్రల చేష్టలకు సంభాషణలకు ప్రాధాన్యం కలిగించి, ఒక నాటకరంగాన్ని చూస్తున్న అనుభూతిని పఠితలకు కలిగించటం.

2. **దశరూపకవివేకం:** కథలో వచ్చే ఉపాఖ్యానాలనుకాని, రసవత్తరఘట్టాలనుకాని లోతుగా పరిశీలించి, వాటి నిర్మాణ స్వభావాలనుబట్టి దశవిధరూపకాలలో వేటికైనా దగ్గరగా ఉన్నాయేమో వివేచించి, ఆ యా రూపకలక్షణాలు అచ్చుపడేటట్లు వాటిని రూపొందించటం.

3. **చతుర్విధాభినయవిన్యాసం:** దృశ్యకావ్యం అభినయప్రధాన మైనది. అభినయం నాలుగువిధాలు. ఆంగికం, ఆహార్యం, వాచికం, సాత్త్వికం. శరీరావయవాలవలన ప్రకటితమయ్యే హావభావముద్రల విన్యాసం ఆంగికం. వేషభూషాదులవలన వ్యక్తమయ్యే భావవిన్యాసం ఆహార్యం. వాక్యవిన్యాసంతో పాత్రోచితంగా, సందర్భోచితంగా, రసోచితంగా సాగే సంభాషణశిల్పంవలన వ్యక్తమయ్యే భావవిన్యాసం వాచికం. సమాహితచిత్తం సత్త్వం. దానినుండి పుట్టిన అభినయం సాత్త్వికం. కంప స్వేదరోమాంచ వైవర్ణ్యస్తంభాదులవలన వ్యక్తమయ్యే భావవిన్యాసం సాత్త్వికాభినయం. ఈ నాలుగురకాల అభినయాలకు ప్రాధాన్యం కలిగించే వర్ణనలను కావ్యంలో ప్రవేశపెట్టటంవలన నాటకీయత రక్తికట్టుతుంది.

4. **రసపోషణ:** శ్రవ్యకావ్యంలో శబ్దార్థ, అలంకార, గుణ, రీతి, వృత్తులను రసాభివ్యక్తికి అనుకూలంగా, పోషకంగా నిర్వహించటంవలన రసదీప్తి కలుగుతుంది. నాటకంలో రచనకంటె కథ కెక్కువ ప్రాముఖ్యం ఉంటుంది. కథలో నాయకుడు కాని, ప్రధానపాత్రకాని, లేదా వ్యక్తివంటి శక్తికాని ఒక ప్రధానకార్యాన్ని ఆరంభించి నిర్వహించటంలో స్థాయి భావోత్కటస్థితిని నిర్వహించటంద్వారా రసపోషణం చేయటం దృశ్యకావ్య మర్యాద. కథా కార్యపరంగానూ,

కవితాపరంగానూ నాయకాశ్రిత మైన స్థాయిభావాన్ని పోషించి రసాభివ్యక్తిని కలిగించటం నాటకీయతలో గోచరించే శిల్పం. అంటే అది శ్రవ్య దృశ్య రసపోషణ విధానాల సమష్టిశిల్ప మన్నమాట!

5. **నాటకరచనాంగాల ప్రకాశనం:** సంధి, సంధ్యంగాలు, వృత్తులు, పతాక, గండం, పూర్వాపరకథార్థసూచన, మొదలైన నాటకరచనాంగాలను యథావకాశంగా ఆ యా సందర్భాలకు సముచితంగా సమకూర్చటం.

సభాపర్వంలో సహజంగా నాలుగుఘట్టాలు నాటకీయతకు అనుగుణంగా అమరి ఉన్నాయి. అవి- జరాసంధవధ, శిశుపాలవధ, మాయాద్యూతం (ద్రౌపదీవస్త్రాపహరణం), దుర్యోధనుడి భంగపాటు. మొదటి మూడూ స్వయంసమగ్రమైన కథలుగా, నాటకాలుగా, హరికథలుగా, జానపదకళారూపాలుగా లోకంలో ప్రచారం పొందిఉన్నాయి. తెలుగువారిరంగప్రక్రియలలో ఏకపాత్రాభినయం ఇప్పుడు ఎనలేని ప్రచారం పొందిఉన్నది. ఆ ప్రక్రియలో ప్రథమతాంబూలం అందుకొనేది మయసభలో దుర్యోధనుడి భంగపాటు. పాండవులు మయసభలో జీవించిన వృత్తాంతాలు విశేషాలు తెలుగువారి కంతగా తెలియవు కాని, దుర్యోధనుడు మయసభలో ఉన్న ఆ మధుర(విషమ)క్షణాలు చరిత్రలో కలకాలం కళాత్మకంగా నిలిచిపోయాయి. ఈ ఘట్టాలన్నీ ఇంత రక్తికట్టటానికి కారణం ఏమిటి? అని ప్రశ్నించుకొంటే- నన్నయ ఆ సన్నివేశాలను నాటకీయంగా దిద్ది తీర్చిన శిల్పమే- అని సమాధానం వస్తుంది. నేటికీ పద్యనాటకాలలో సైతం ఆ యా ఘట్టాలలో నన్నయ వ్రాసిన పద్యాలే ఒరవళ్ళుగా, ఒజ్జబంతులుగా నిలుస్తున్నాయి- అంటే నన్నయరచనలో నాటకీయత ఎంత గొప్పదో స్పష్టమౌతుంది.

సభాపర్వంలో పురుషులే పాల్గొన్న యుద్ధప్రాయా లైన సన్నివేశాలు ఎక్కువగా ఉండటంచేత నన్నయ వ్యాయోగ, సమవకార, డిమాలనే రూపకాలలక్షణాలు అచ్చుపడిన శ్రవ్యకావ్య ఘట్టాలుగా వాటిని గుర్తించి, ఆ రూపకచ్ఛాయలు ముద్రిత మయ్యేటట్లు దిద్దితీర్చి నాటకీయతను పోషించాడు. ఆది సభారణ్యపర్వ కథాఘట్టాలలో శ్రీకృష్ణుడు, భీముడు, అర్జునుడు శత్రువులతో తలపడి వారిని వధించిన ఆయా సన్నివేశాలు రూపక ప్రయోగప్రాయాలే. శ్రీకృష్ణుడు శిశుపాలుడిని వధించాడు; భీముడు జరాసంధుడిని ఈ పర్వంలోనే చంపాడు; ఆదిపర్వంలో హిడింబుడిని, బకుడిని, అరణ్యపర్వంలో కిమ్మీరుడిని వధించాడు; కృష్ణార్జునులు ఖాండవదహనాన్ని చేశారు; ఆదిపర్వంలోని కుమారాస్త్రవిద్యాప్రదర్శన సందర్భంలో భీమార్జునులు దుర్యోధనకర్ణులతో తలపడ్డారు.

వాటిలో శ్రీకృష్ణుడు చేసిన శిశుపాలవధను నాట్యశాలలో ప్రదర్శించిన సమగ్రసుందర మైన వ్యాయోగంగానూ, కుమారాస్త్ర విద్యాప్రదర్శనను బహిరంగ ప్రదేశంలో ప్రదర్శించిన వ్యాయోగంగానూ నన్నయ తీర్చిదిద్ది ప్రకరణ గౌరవాన్ని సమున్నతంగా నిలిపాడు. ఆ తరువాత భీమనాయకమైన రాక్షసవధ ఘట్టాలను వీరరౌద్రరసరమ్యంగా సమవకారాలుగా చిత్రించాడు. మాయాద్యూత ఘట్టంలో డిమ లక్షణాలను సమగ్రంగా నిలిపి రసవత్తరంగా నాటకీయతను పోషించాడు. అంతేకాదు, స్వతంత్రోపాఖ్యానాలుగా లెక్కించదగిన యయాతి, దుష్యంత, నలమహారాజులచరిత్రలలో నాటకలక్షణాలను అచ్చుపడేటట్లు రూపొందించాడుకూడ నన్నయ. ఈవిధంగా నన్నయ రచనలో తొమ్మిదిఘట్టాలలో దశరూపకప్రయోగనాటకశిల్పాన్ని దర్శనీయమయేటట్లు స్పష్టంగా చిత్రించి తెలుగుకావ్యరచనలో నాటకీయతను పోషించటం ఒక అనివార్యలక్షణంగా భావితరాలకు సూచించాడు; తిక్కనాదులకు త్రోవచూపించాడు. ఇంతేకాక దుర్యోధనుడు మయసభను దర్శించి భంగపడిన ఘట్టం తెలుగువారికి 'ఏకపాత్రాభినయ'మనే ప్రక్రియకు పురుడుపోసింది. అందులో వర్ణ్యవస్తువు, రచనాశైలి నన్నయ చూపించిన బాటలోనే నడవటం ఒక సంప్రదాయమైపోయింది. ఈ విధంగా రెండున్నర పర్వాలలో పదిదృశ్యకావ్యశిల్పాలను ప్రదర్శించటం సామాన్యమైన విషయం కాదు.

కథాస్వభావాన్నిబట్టి రూపకచట్రాన్ని అమర్చి శ్రవ్యకావ్యంలో దృశ్యకావ్యదర్శనం చేయించటం నన్నయనాటకీయత. మూలంలోని వస్తువును రూపకమర్యాదలకు అనువుగా మలచుకొని పునర్నిర్మించటంలోనూ, కథాకథనసంభాషణాదుల నిష్పత్తిని సవరించుకొని సంవిధానంచేయటంలోనూ, నన్నయ నాటకీయతనుకూడా దృష్టిలో ఉంచుకొనటంవలన ఆంధ్రమహాభారతం పునస్సృష్టిగా గోచరించింది. నన్నయరచనలోని నాటకీయత వ్యాసుడిలో లేదా? అని కొందరు ప్రశ్నిస్తారు. అందుకు శ్రీ ఎస్వీ.భుజంగరాయశర్మగారి సమాధానం గమనించతగింది- ''ఈ నాటకీయత సంస్కృతభారతంలో లేదా అని

ప్రశ్న. సంస్కృతభారతంలోనూ- ఉంది. ఫోకస్ తప్పిన ఫోటోగ్రాఫ్‌లా, బూజర బూజరగా! నన్నయగారి కున్నంతటి స్పష్టమైన నాటకీయదర్శనం వ్యాసునిలో కనపడదు. ఎన్ని శిల్పాలకో ఒరవడిపెట్టినట్లు నాటకీయశిల్పానికికూడా తెలుగులో ఒరవడిపెట్టింది నన్నయగారే అనుకొంటాను.'' (నన్నయభారతి- వ్యాససంకలనం- ప్రథమసంపుటి. నన్నయనాటకీయత (వ్యా.) పు.561)

నన్నయనాటకీయతలో ఆకృతిశిల్పం అగ్రతాంబూలం అందుకొంటుంది; తిక్కననాటకీయతలో అభినయశిల్పం అగ్రస్థానంలో నిలుస్తుంది. నన్నయనాటకీయత ప్రయోగసంబంధి; తిక్కననాటకీయత ప్రదర్శనసంబంధి.

శిశుపాలవధ - సమగ్రవ్యాయోగప్రయోగం

ఆంధ్రమహాభారత సభాపర్వ ద్వితీయాశ్వాసారంభంలో శిశుపాలవధఘట్టాన్ని నన్నయ 72 పద్యగద్యాలలో రచించాడు. ధర్మజ రాజసూయాధ్వరంలో శ్రీకృష్ణుడిని పూజించే ప్రతిపాదనంతో ప్రారంభమైన ఈ ఘట్టం శిశుపాలవధానంతరం యజ్ఞసమాప్తితో ముగుస్తున్నది. (సభా. 2.1-72)

శిశుపాలవధ కథాఘట్టంలో దశరూపకాలలో ఒకటైన 'వ్యాయోగం' అనే రూపకలక్షణాలు * అధికంగా అమరి ఉన్నాయి. యుద్ధప్రాయమైన వ్యాయోగంలో పురుషులే వర్తిస్తారు కాబట్టి దాని కా పేరు వచ్చింది. దానిలక్షణాలు ఈ కథాఘట్టానికి సమన్వయిస్తున్నాయి. ఇందులోని వస్తువు ప్రఖ్యాతమే. నాయకుడు ప్రసిద్ధుడే. స్త్రీ పాత్ర లేనే లేదు. ఇందులో వీరరసం అంగి, రౌద్రరసం అంగం. శిశుపాలాదుల పరుషవాక్యాలతో నిండిన రణవిజృంభణం, భీష్మకృతధిక్కారవచనాలు, భీమసహదేవుల రౌద్రోద్రేకం, శ్రీకృష్ణుడి పౌరుషపరాక్రమ ప్రదర్శనం, ధర్మజుడి నయనీతివర్తనం- ఈ ఘట్టంలో బహుపురుషుల యుద్ధాభిముఖ్యాన్ని గోచరింపజేస్తున్నవి. కాబట్టి శ్రవ్యకావ్యమర్యాదలలో ఒదిగియున్న వ్యాయోగంగా ఈ ఘట్టం సహజస్వభావాన్ని సంతరించుకొని ఉన్నది. నన్నయ ఈ రహస్యాన్ని గుర్తించి ఆ యా రూపకలక్షణాలు ప్రస్ఫుట మయ్యేటట్లు రచించి, తన కథాకథనకౌశలానికి ఒక వైశిష్ట్యాన్ని సంతరించుకొన్నాడు.

నాందీప్రయోగం సర్వరూపకసామాన్యలక్షణం. 'ఆశీ ర్నమస్క్రియా వస్తునిర్దేశోవాఽపి తన్ముఖమ్' అని దానినియమం. ఆశీర్నమస్క్రియలలో ఏదో ఒకదానిని ఎన్నుకొని వస్తునిర్దేశాన్నిమాత్రం తప్పక పాటించటం రూపకరచయితల పరిపాటి. అది శబ్దంచేత కాని, అర్థంచేత కాని సూచించబడవచ్చును. నన్నయ ఈ అదను కనిపెట్టి సభాపర్వ ద్వితీయాశ్వాసారంభంలో కృతిపతిని సంబోధించే పద్యాన్నే నాందిగా తీర్చిదిద్దాడు. ఇది ఒక అపూర్వమైన నాటకీయరచనాప్రయోగం.

క. ''శ్రీరమణీప్రియ! ధర్మవి
శారద! వీరావతార! సౌజన్యగుణా
ధార! భువనైకసుందర!
వీరశ్రీరమ్య! బుధవివేకనిధానా'' **(సభా. 2.1)**

ఇందులోని సంబోధన లన్నీ బహువ్రీహులై అన్యపదార్థ మైన రాజరాజనరేంద్రు డనే అర్థాన్ని కలిగిస్తున్నాయి. ఈ పద్యం నన్నయ రాజరాజును సంబోధిస్తూ చెప్పిందని తెలియపరచకుండా ఏ పఠితకైనా వినిపిస్తే ఇది రాజరాజు నుద్దేశించిన దని తెలియటం కష్టం! ఈ పద్యంలో సంబోధనం కాదు కావ్యార్థసూచనం ముఖ్యం.

కావ్యార్థసూచనంలో కథార్థాలను సూచించటం ఒక పద్ధతి. కావ్య పాత్రలపేర్లను నిర్దేశించి ముద్రాలంకారంగా నాందీపద్యాన్ని రచించటం మరొకపద్ధతి. నన్నయ రెండవదానిని పాటించాడు. ఈ కథాఘట్టంలో నాయకపక్షంలో కానవచ్చే

---

* ''వ్యాయోగస్తు విధిజ్ఞైః కార్యః ప్రఖ్యాత నాయక శరీరః । అల్పస్త్రీ జనయుక్త స్త్వేకాహకృత స్తథా చైవ ॥
బహవ స్తత్ర చ పురుషాః కవిభిః కార్యా యథా సమవకారే । న చ తత్ప్రమాణయుక్తాః కార్యా ఏకాంక ఏవాయమ్ ॥
న చ దివ్యనాయక కృతః కార్యో రాజర్షి నాయక నిబద్ధః । యుద్ధ నియుద్ధాక(ధ)రణ సంహ(ఘ)ర్ష కృతశ్చ కర్తవ్యః ॥
ఏవం విధాస్తు కార్యో వ్యాయోగో దీప్త కావ్య రసయోనిః''
- భరతనాట్యశాస్త్రమ్. 16 అధ్యా. శ్లో. 142-145

పాత్రలు ప్రధానంగా ఏడుగురు. వారిలో శ్రీకృష్ణుడు పూజనీయుడు. కాబట్టి అతడు ప్రథమగణ్యుడు. తరువాత నాయకులైన పాండవులు. ఆ తరువాత- వారికి ధర్మనిర్దేశం చేసిన కురుపితామహుడు భీష్ముడు. వీరిని చెపితే కథార్థాలను సూచించినట్లే అవుతుంది. నన్నయ నాందీపద్యరచనా సంప్రదాయంలోని ఈ విధానాన్ని ఇందులో అనుసరించాడు.

శ్రీరమణీప్రియు డంటే రమావల్లభు డైన శ్రీమహావిష్ణువు. ఇక్కడ తదవతారమూర్తి అయిన శ్రీకృష్ణుడు. ధర్మవిశారదు డంటే ధర్మాచరణకోవిదు డైన ధర్మరాజు. వీరావతారు డంటే భీముడు. ధర్మతేజమైన ధర్మరాజుకు ఆతడు కార్యసాధనంలో పురుషకారసాధకుడు, ఉత్సాహమూర్తి. సౌజన్యగుణాధారు డనే సమాసంలోని 'గుణాధార' శబ్దార్థశక్తిచేత ప్రతీయమాన మయ్యే గాండీవం, దాన్ని ధరించే పార్థుడు సూచించబడుతున్నారు. సౌజన్య(స్నేహ) గుణానికి ఆధారుడనే అర్థం స్వీకరించినా నరనారాయణ స్నేహాన్ని పురస్కరించుకొని అర్జునుడు స్ఫురిస్తాడు. సౌజన్యగుణమంటే దేవతాగుణమనీ, అందులోనూ ఇంద్రుడి గుణమనీ దానికి ఆధారమైనవాడు అర్జునుడనీ ఊహకు అందుతాడు. భువనైకసుందరు డనే విశేషణంవలన నకులుడు స్ఫురణకు తగులుతున్నాడు. స్వర్గారోహణపర్వంలో అతడి పతనానికి కారణంగా అతడి సౌందర్యగర్వాతిశయం చెప్పబడి ఉండటం గమనించదగిన అంశం. 'వీరశ్రీరమ్య' అనే విశేషణం ఈ కథాఘట్టంలోని సహదేవుడికి అన్వర్థమౌతుంది. శిశుపాలవిజృంభణంతో సంకులమైన సభను తన వీరోక్తులతో అనుశాసించి దేవతల మెప్పులను పొందిన ఆ వీరుడు పరాక్రమసంపదచేత అందమైనవా డనటం సార్థకం. అశ్వినీదేవతల వరంవలన పుట్టిన నకులసహదేవు లిద్దరూ అందమైనవారే. అయితే వారిలో అన్నకంటె తమ్ముడు రణపాండిత్యంలో రెండాకులు ఎక్కువ చదివాడు. అందువలన వీరశ్రీరమ్యుడు. ఇక- 'బుధవివేకనిధానా!' అనే సంబుద్ధి భీష్ముడిని స్మరింపజేస్తున్నది. బుధు డనగా పండితుడు. "పండానామ ఆత్మవిషయక జ్ఞానః." ఆత్మజ్ఞానవేత్త బుధుడు. అతడి వివేకం సదసద్వివేకం. సత్తు పరమాత్మ. తద్వివేకానికి నిధానమైనవాడు జ్ఞాని. భీష్ముడు అట్టి జ్ఞాని. కాబట్టే భావికథలో శ్రీకృష్ణుడి పరమాత్మతత్త్వాన్ని ఆతడు ధర్మరాజుకు నిరూపించిచెప్పాడు. ఆశ్వాసాదిపద్యాన్ని పఠితలు అంతగా పట్టించుకోరు- అందులో రసభావాలు ఉండవు కనుక. కాని, నన్నయ రచనలో అట్టి నీరసపద్యంకూడ నాటకీయ రచనాశిల్పానికి ఒక అనర్ఘపద్యరత్నమై నాందీశ్లోకగౌరవాన్ని పొందగలుగుతున్నది. మహాకవి సృష్టి అటువంటిది!

నాంది ముగిసిన తరువాత స్థాపకు డనే రెండవసూత్రధారుడు రంగంలో ప్రవేశించి ప్రస్తావన అనే పూర్వరంగప్రయోగాన్ని నిర్వహించటం రూపకసంప్రదాయం. ప్రస్తావనలోని చివరి అంశం పాత్రప్రవేశసూచనం. నన్నయ ఈ అంశాన్ని నారదపాత్రను ప్రవేశపెట్టి నిర్వహించాడు. సభాపర్వద్వితీయాశ్వాసం ఈ క్రింది వచనంతో ఆరంభమౌతున్నది:

"అక్కథకుండు శౌనకాదిమహామునులకుం జెప్పె: నట్లు రాజసూయ మహోత్సవంబు నొప్పను ధర్మరాజు ధర్మనిత్యతయును స్తుతియించి నారదుం డాసదంబున సకలరాజసమూహంబును రాజలోకంబులో మనుష్యసామాన్యుం డయియున్న జగన్మాన్యు జనార్దనుం జూచి, తొల్లి బ్రహ్మాది సురగణ ప్రార్థితుం డయి యఖిల మహీభారావతరణార్థంబు నారాయణుండు యదువంశంబున నుదయించుటయు, నయ్యయిక్షత్త్రియ కులంబుల సురదైత్యదానవ యక్ష రాక్షస గంధర్వాదుల యంశావతారంబులుం దలంచి భవిష్యద్భారతరణంబునకు సంహృష్టహృదయుం డయి యుండునంత"
(సభా. 2.2)

మహాభారతంలో నాయకుడు ధర్మరాజు. అతడు ధర్మనిరతుడు. అతడి ధర్మనిత్యతను నారదుడు మొదట స్తుతించాడని చెప్పటంచేత కథానాయకప్రశస్తిని. అంగిరస సూచనను నన్నయ చేశాడు. ఆ తరువాత అవతారపురుషు డైన శ్రీకృష్ణుడి మహత్త్వాన్ని కీర్తించాడు. అతడికి ప్రత్యర్థు లై ఉన్న రాజలోకాన్నీ, భక్తు లై ఉన్న పార్థివసమూహాన్నీ పేర్కొన్నాడు. కలహభోజనుడైన నారదుడి దృష్టి సహజవిరోధవర్గాలు బలసి ఉన్న సభపై పడిందంటే అక్కడ చిచ్చు పుట్టినట్లే. ఈ కథాఘట్టానికి సంబంధించినంతవరకు శిశుపాలుడితో జరిగే సంఘర్షణం ముఖ్యం. కాని, మహాభారతకథాదృష్టికి కురుక్షేత్రసంగ్రామం ముఖ్యం. ఆ మహాఫలాన్ని అందుకొనటానికి ఏర్పడిన కథాసోపానాలలో ఈ ఘట్టం బలమైనది. అట్లవటంచేత ప్రస్తుతసంఘర్షణను వ్యంగ్యంగానూ, భారతరణాన్ని వాచ్యంగానూ నన్నయ నారదుడితలపులో సూచ్యమయ్యేటట్లు నిబంధించాడు. పూర్వరంగప్రక్రియకును, రూపకప్రయోగప్రక్రియకును భేదం సూచించేందుకు నన్నయ ఇట్లా రచించాడు.

నన్నయ ఈ ఘట్టంలో కథాకథనాన్ని సంగ్రహంగానూ, సంభాషణలను అధికంగానూ రచించి నాటకీయతను అచ్చుపడేటట్లు చేశాడు; వాక్క్రియారూప సంఘర్షణలలో వాగ్రూప మైనదానిని అధికంగా చిత్రించాడు. శ్రీకృష్ణుడు శిశుపాలుడిని వధించిన క్రియను నన్నయ ఒకపద్యంలో చెప్పాడు. మిగిలినదంతా ధర్మజ భీష్మ శ్రీకృష్ణాదులకున్నూ, శిశుపాలునకున్నూ నడుమ జరిగిన వాగ్వివాదమే. కాబట్టి ఈ ఘట్టంలో సంభాషణలు ఉద్దీప్తాలై, శక్తిమంతాలై, పూర్వాపరసమన్వయ సంబద్ధాలై సంఘర్షణను సృష్టింపజేయగలిగినట్టివిగా రూపొందించటంలోనే నాటకీయరచనాశిల్పం రాణించ వీలౌతున్నది. నన్నయ దానిని నిపుణంగా నిర్వహించాడు.

నిజానికి ఈ ఘట్టంలో చెప్పుకొనదగిన కథే లేదు. రాజసూయం ఉత్తమపూజతో ముగియాలి. అట్టి ఉత్తముడు శ్రీకృష్ణ డని భీష్ముడు ప్రతిపాదించాడు. ధర్మజుడు అతడిని పూజించాడు. కార్యం అంతటితో ముగియనుండగా శిశుపాలుడు 'శ్రీకృష్ణుడు పూజార్హుడు కా'డని అధిక్షేపించాడు. అతడు ధర్మజుడితో, భీష్ముడితో వితండవాదం చేశాడు. వారు యథాశక్తి నయానా భయానా అతడిని ఒడబడేటట్లు చేయటానికి యత్నించారు. అతడు సభను వెలువడి యుద్ధసన్నద్ధు డైనాడు. యజ్ఞదీక్షితు డైన ధర్మజుడు యుద్ధంచేయటానికి వీలు లేదు. పైపెచ్చు అతడు రాజలోకాన్ని ఆహ్వానించిన యజమాని. భీష్ముడు సమర్థుడే. అతడినికూడా శిశుపాలుడు పడతిట్టాడు. కాని, శిశుపాలుడిమరణం శ్రీకృష్ణుడిచేత వ్రాయబడిఉన్నదని తెలిసిన విజ్ఞు డాతడు. అందువలన భీష్ముడు శ్రీకృష్ణుడి మాహాత్మ్యాన్ని కీర్తించటమే కాకుండా, అతడిని శిశుపాలవధోన్ముఖుడిగా పురికొల్పాడు. పూజ గైకొన్న పురుషోత్తముడే తన ఉత్తమత్వాన్ని స్థాపించుకొనవలసివచ్చింది. చేసిన వాగ్దానాన్ని అనుసరించి శ్రీకృష్ణుడు శిశుపాలుడిని చంపవలసివచ్చింది. దానితో యజ్ఞం సమాప్త మైనది. పాండవులకార్యం సఫల మైనది. ఈ ఘట్టంలో 'శ్రీకృష్ణుడు పూజార్హుడా?' అనే అంశంపై జరిగిన వాదోపవాదాలు ఏవిధంగా ఒకదానిపై ఒకటి కార్యకారణసంబద్ధా లై శిశుపాలవధ కార్యానికి దోహదాలైనవో గమనించటమే సంభాషణశిల్పాన్ని సమీక్షించటం.

కథారంభంలో నన్నయ- భీష్ముడు ప్రశాంతు డనీ, ధర్మజుడు ధృతిమంతు డనీ, సత్యధర్మమతి అనీ పరిచయం చేశాడు. ధర్మమతికి ప్రశాంతుడి హితబోధ కలిగింది. అది ధృతిమంత మైన ఉత్సాహంతో ఆచరించబడింది. అత్యంత క్లిష్టపరిస్థితులలోకూడ చలించని ధీశక్తి ధృతి. అది దీప్తిమంతం కావాలంటే బంగారం పుటంపెట్టబడినట్లు కథలో అత్యంత సంఘర్షణానికి గురి అయి సమర్థవంతంగా విజయం సాధించాలి. అంటే- శిశుపాలుడి దుర్వ్యవసాయం ధర్మజుడిధృతిని, ధర్మనియతిని ప్రకాశింపజేసేటట్లు కథలో నిబంధించబడిం దని నన్నయసూచన. పరమశాంతు డైన భీష్ముడు పరతత్త్వప్రతిపాదనసమర్థు డని తాత్పర్యం.

మత్తకోకిల.

''స్నాతకుండును ఋత్విజుండును సద్గురుండును నిష్టుఁడున్
భూతలేశుఁడు సంయుజుండును బూజనీయులు వీరిలోఁ
బ్రీతి నెవ్వఁడు సద్గుణంబులఁ బెద్ద యట్టి మహాత్ము వి
ఖ్యాతుఁ బూజితుఁ జేయు మొక్కనిఁ గౌరవాన్వయవర్ధనా!'' **(సభా. 2.4)**

అని భీష్ముడు ధర్మరాజును ప్రబోధించాడు. ధర్మజుడు యజ్ఞంలో భీష్మద్రోణులను 'కృతాకృత పరిజ్ఞానంబునందు' నియోగించాడు. అందువలన భీష్ముడు కర్తవ్యాన్ని తెలియపరచాడు. ఆ చెప్పటంలో పూజార్హు డైన మహాత్ముడి లక్షణాలు పేర్కొని భీష్ముడు ఆతడి నామనిర్దేశం చేయకుండా ధర్మజుడినిర్ణయానికి వదలివేశాడు. ధర్మజుడు తాతకు దగ్గులు నేర్పగల చతురుడు. నిర్ణయం తానే తీసికొంటే దానికి బాధ్యుడు తానే ఔతాడు. కాబట్టి ఆ పాపపుణ్యాలనుకూడ ఆ తాతపైనే త్రోయనెంచి 'అట్టివా డెవ్వండు? నా కెఱింగింపు' మని భీష్ముడినే అడిగాడు. మనుమ డిచ్చే పెద్దరికానికి అన్నింటా తగిన పితామహు డాతడు. అందువలన నిశ్శంకగా అఖిలలోకపూజ్యు డైన శ్రీకృష్ణుడినే (అచ్యుతుడినే) పూజార్హుడుగా నిర్దేశించాడు. తాను తలచిందే తాత చెప్పాడు. సహదేవుడు అర్ఘ్యపాద్యాది పూజాద్రవ్యాలు తెచ్చాడు. ధర్మరాజు వాసుదేవుడికి పూజ చేశాడు. శ్రీకృష్ణుడు కిమ్మనకుండ పూజలు స్వీకరించాడు.

శిశుపాలుడు గోపాలుడికి బద్ధవిరోధి. భీష్ముడిహితబోధ, ధర్మజుడివర్తనం, శ్రీకృష్ణుడిఅంగీకారం ఒక్కొక్కటే అతడి చిత్తాన్ని ఉడు కెక్కించాయి. ఆ పూజకు కర్త ధర్మరాజు. ప్రేరకుడు తాత. ఫలభాక్కు గోవిందుడు. అందువలన శిశుపాలుడు ధర్మరాజును కేంద్రంగా చేసి ఆ ముగ్గురిని అధిక్షేపించాడు. గాంగేయుడి దుర్వ్యవసాయానికి లొంగి కష్టచరితు డైన కృష్ణుడిని పూజించి ధర్మజుడు తన అవివేకాన్ని ప్రకటించా డనీ, 'దాశార్హుడు పూజార్హుడు' కాడనీ అతడిఅభ్యంతరం. వాది యెదుటివారి వాదాన్ని మొదట ఖండిస్తాడు. ఆపైన దానిలోని అసంబద్ధాలైన అంశాలను ఉటంకించి వరుసగా అధిక్షేపిస్తాడు. శిశుపాలుడు అటువంటి వాదకౌశలాన్ని ప్రకటించాడు.

శిశుపాలుడు ధర్మతాత్పర్యాన్ని ప్రతిపాదించే తలంపుతో వాదాన్ని ఆరంభించినప్పటికీ అందులో వ్యక్తిదూషణానికి తావు కల్పించాడు. అది వాదకుశలుడు చేసేపని కాదు. దానికితోడు శిశుపాలుడు తనకు తలకుమించిన ధర్మపన్నాలు చదివి, తన వివేకాన్ని ప్రదర్శించబోయి కొన్నియెడల ఆ వాక్యాలు తనకే తగిలివచ్చేటట్లు మాట్లాడి ఎదుటివారి వాదానికి బలంచేకూర్చే బలహీనతకు గురిఅయ్యాడు.

చ. "కడుకొని ధర్మతత్త్వ మెఱుఁగంగ నశక్యము; ధర్మబాహ్యు ని
న్నొడఁబడ నిష్టుఁడై కఱపి యుత్తము లుండఁగ వాసుదేవుఁ డ
న్జడునకుఁ బూజ యిమ్మని విచారవిదూరుఁడు భీష్ముఁ డెంతయున్
వెడఁగుఁదనంబునం బనిచె; వృద్ధులబుద్ధులు సంచలింపవే?". **(సభా. 2.9)**

భీష్ముడు వృద్ధుడే కావచ్చును. అతడిబుద్ధి వార్ధక్యంవలన చలించియే ఉండవచ్చును. కాని, అతడు విచారవిదూరు డని అనటం, అతనిది 'వెడఁగుదన'మని వెక్కిరించటం, అతడు ధర్మబాహ్యు డని నిందించటం, వాసుదేవుడు జడు డని నోటికసి తీర్చికొనటం- శిశుపాలుడివాదబలంకంటె, ఎదుటివాడిని అధిక్షేపించే చిత్తవృత్తిని, వాక్పారుష్యాన్నీ పట్టియిస్తున్నాయి. 'కడుకొని ధర్మతత్త్వ మెఱుఁగంగ నశక్య' మనే సత్యాన్ని చెప్పిన శిశుపాలుడు మత్సరగ్రస్తుడు కావటం విచారం. తా నన్నమాట తగిలివస్తున్న దన్న వివేకం లే దతనికి. సద్ధర్మాన్ని చూచి అధర్మ మని శంకించే అజ్ఞానినోట సాభిప్రాయంగా ఆ మాటను అనిపించటం నన్నయ చేసిన చమత్కారం. ధర్మరా జున్న సభలో ధర్మస్థాపనం చేయాలని అతడి ప్రయత్నం! అది అనధికారిచేత పడి హాస్యాస్పద మౌతున్నదని కవి సాధించిన వ్యంగ్యం!

ఈవిధంగా నోటికసి తీర్చికొని, శిశుపాలుడు పూజార్హు డైనవాడి కుండదగిన వని భీష్ముడు నిర్దేశించిన గుణగణాలు శ్రీకృష్ణుడియందు లేవని వరుసగా ఖండించటం ప్రారంభించాడు. పై మత్తకోకిలలోని గుణాలన్నింటిలో పాండవులు సమర్థించుకొనటానికి బాగా సులభమైనది- శ్రీకృష్ణుడు వారికి ఇష్టుడై ఉండటం. ఇష్టుడైనంతమాత్రాన సభలో అర్హులైనవా రుండగా అతడికి పూజచేయటం పాడి కాదని శిశుపాలుడు మొదట వాదించాడు.

చ. "ఇతనికిఁ గూర్తు రేని ధన మిత్తు రభీష్టము లైన కార్యముల్
మతి నొనరింతు రిష్టుఁ డని మంతురుగాక మహాత్ము లైన భూ
పతులయు విప్రముఖ్యులసభన్ విధిదృష్టవిశిష్టపూజనా
యతికి ననర్హు నర్హుఁ డని యచ్యుతు నర్చితుఁ జేయఁ బాడియే?" **(సభా. 2.10)**

పూజార్హు డైనవాడు ఇష్టుడై ఉన్నా, తగిన అర్హతలుకూడా కలవాడై ఉండాలని ఈ పద్యంలో శిశుపాలుడు నిష్కర్షించాడు. ఆపైన తరువాతి అర్హతలుకూడ ఆ అచ్యుతుడియందు లేవని వరుసగా ఖండించాడు. వసుదేవాదు లుండగా కృష్ణుడు వృద్ధు డెట్లా ఔతాడు? వ్యాసు డుండగా అతడు ఋత్విజు డనీ, ద్రోణకృపాదు లుండగా ఆతడు ఆచార్యుడనీ, భూనాథు లనేకులు ఉండగా యాదవు డైన ఆతడు రాజనీ ఎట్లా పూజించటానికి అర్హుడైనా డని ప్రశ్నించాడు. ఆవిధంగా నిండుసభలో అనర్హుడిని పూజించటం ధర్మజుడి గౌరవానికీ, భూమీశుల విశ్వాసానికీ గొడ్డలిపెట్టని వర్ణించాడు. ధర్మజుడు శ్రీకృష్ణుడిని పూజించి సభికు లైన ధారుణీశ్వరులను అవజ్ఞ చేశాడనీ, అది ధర్మవిరుద్ధ మనీ అధిక్షేపించాడు.

అంతటితో ఆగక ధర్మనందనుడితో-

క. "నీ వెఱుఁగక యిచ్చిన నిది
నా విషయమె యని మనంబునం దలఁపక ల
జ్జావిరహితుఁ డయి యర్ఘ్యము
గోవిందుఁడు గొనియెఁ దనకుఁ గొను టుచితంబే?" **(సభా. 2.13)**

అని ముకుందుడిని మొగం మొత్తేటట్లు ఎత్తిపొడిచాడు. అంతటితో తనివితీరక-

క. "చనఁ బేడికి దారక్రియ
యును జెవిటికి మధురగీతియును జీకున క
త్యనుపమసురూపదర్శన
మును జేయుటఁ బోలుఁ గృష్ణుఁ బూజించు టిలన్." **(సభా. 2.14)**

అని వాక్కండూతిని తీర్చుకొన్నాడు. ధర్మరాజుపేరు నిరర్థకమై నవ్వులపాలైపోయిందని నోటితో నొవ్వబలుకుతూ శిశుపాలుడు సపుత్రబలుడై సభను వీడి బయటికి వెళ్లిపోయాడు.

శిశుపాలుడి అధిక్షేపంవలన కథలో రెండంశాలు ప్రశ్నించబడుతున్నాయి. ఒకటి: శ్రీకృష్ణుడి పరమేశ్వరత్వం. రెండు: పాండవుల ధర్మపరత్వం. మహాభారతంలో ఈ రెండూ పరస్పరపోషకాలు. వీటిలో మొదట నిరూపించబడవలసింది శ్రీకృష్ణుడి పరమేశ్వరత్వం. అప్పుడు రెండోది తనంతట తానే నిరూపిత మౌతుంది. ధర్మరాజు ఈ అంశాన్ని గుర్తించాడు. సదస్యులను ఆహ్వానించిన యజమానిగా తన సభ్యతను ప్రకటిస్తూ శిశుపాలుడివెంట పోయి ధర్మనందనుడు ప్రియవచనాలతో అతడిని అనునయించాడు. సమయోచిత ప్రజ్ఞాప్రదర్శనంలో ధర్మజుడు అందెవేసిన చేయి!

ధర్మజుడు మాట్లాడిన అనునయవాక్యాలు ఎంత మెత్తగా ఉంటాయో అంత వాడిగాకూడా ఉంటాయి. 'మెత్తనిపులి' అయిన ధర్మజుడి లక్షణం అది. అన్నిమాటలన్న శిశుపాలుడిమీద మరొకడైతే అగ్గిమీద గుగ్గిలంవలె భగ్గుమనేవాడు. ప్రశాంతు డైన భీష్ముడే ఈ ఘట్టంలో భీషణహుతాశనకీలవలె మండిపడ్డాడు. తాతకన్న మనుమడు ధృతిమంతు డని నన్నయ అందుకే నిర్దేశించాడు. ధర్మరాజుమాటలు సంగ్రహాలు, సారవంతాలు, సార్థకాలు. నారసతుల్యాలు.

క. "భూరిగుణోన్నతు లనఁ దగు
వారికి ధీరులకు ధరణివల్లభులకు వా
క్పారుష్యము చన్నె? మహా
దారుణ మది విషముకంటె దహనముకంటెన్". **(సభా. 2.17)**

శిశుపాలుడివాదనలో వాక్పారుష్యాన్ని తొలగిస్తే వాక్యతాత్పర్యం మిగులుతుంది. పారుష్యం భావప్రకటనంలో వ్యక్తిసంస్కారాన్ని తెలుపుతుంది. వాక్యతాత్పర్యం వ్యక్తివివేకాన్ని తెలుపుతుంది. ధర్మజుడు మొదట అతడి సంస్కారాన్ని ఎత్తిచూపించాడు. వాక్పారుష్యం ఉండకూడనివాడికి ఉంటే ఆతడి భూరిగుణౌన్నత్యం, ధీరత్వం, ప్రభుత్వం రాణించవని ధర్మజుడి తాత్పర్యం. అంటే- శిశుపాలుడియందు ఆ మూడు లక్షణాలు వాక్పారుష్యంవలన దూషితా లైనవని వ్యంగ్యమైన ధర్మజుడి అధిక్షేపం. వాక్పారుష్యం విషంకంటెను, దహనంకంటెను మహాదారుణ మైనదని ధర్మజుడి బెదిరింపు. విషంవలన మూర్ఛ కలుగుతుంది. అది మంత్రతంత్రాలవలన నివారించదగింది. దహనం అట్టిది కాదు. మనిషిని బూడిద చేస్తుంది. వాక్పారుష్యం ఈ రెండింటికంటె మహాభయంకర మైనదట! వాక్శక్తి ఎఱిగినవాడు ధర్మజుడు. అందువలననే ఇంత తీవ్రమైన విషయాన్ని, ప్రతిపాదిస్తున్నా పారుష్యం కానుపించ దాతడిపలుకులలో. ఎత్తుకొనటంలోనే ప్రతివాదిదోషాన్ని నిరూపించి, అతడిని అప్రతిభుడిని చేసే వాదకౌశలం ధర్మజుడు ప్రదర్శించాడు. ఆపైన తనయందు దోషం లే దని వాదించాడు.

క. "ఆదిజుఁ డైన బ్రహ్మయుదయంబున కాస్పద మైనవాఁడు వే
దాది సమస్తవాఙ్మయములందుఁ బ్రశంసితుఁ డైనవాఁడు లో
కాది త్రిలోకపూజ్యుఁ డని యాత్మ నెఱింగి పితామహుండు దా
మోదరుఁ జెప్పెఁ బూజ్యుఁ డని; యుక్తమ కా కిది యేమి దోసమే!" **(సభా. 2.18)**

ఆదిదేవు డైన బ్రహ్మకు ఆదియై, ఆదివాఙ్మయ మైన వేదానికి ఆదియై, లోకత్రయసృష్టికి మూలమైనవాడు దామోదరు డని పితామహుడు చెప్పాడట! 'పితామహ' శబ్దప్రయోగంలో ఈ పద్యప్రాణం ఉన్నది. దానికి బ్రహ్మ అనీ, భీష్మ డనీ అర్థాలు చెప్పవచ్చును. భీష్మార్థం ప్రకృతం. బ్రహ్మ అనే అర్థం అప్రకృతం, వ్యంగ్యం. బ్రహ్మ చెప్పినదే తాత చెప్పాడని చమత్కారం. పూర్వప్రసిద్ధ సిద్ధాంతాలను ప్రమాణంగా చూపించి వాదానికి బలం కల్పించుకొనే నేర్పు ఈ ధర్మరాజువాక్కులలో ధ్వనించబడుతున్నది.

క. "పరమార్థప్రతిభఁ దమో
హరు నచ్యుతు భీష్ముఁ డెఱిఁగిన ట్లెఱుఁగఁగ నీ
కరిది శిశుపాల! పెద్దల
చరితం బల్పులకు నెఱుఁగ శక్యమె యెందున్?" **(సభా. 2.19)**

అచ్యుతుడి తత్త్వాన్ని నిరూపించటానికి పరమార్థప్రతిభ కావాలనీ, అది భీష్ముడి కున్నట్లుగా శిశుపాలుడికి లేదనీ చెప్పి ప్రతివాది అజ్ఞానాన్ని ధర్మజుడు బయటపెట్టటమే కాక- "పెద్దలచరితం బల్పులకు నెఱుఁగ శక్యమె యెందున్!' అనే అర్థాంతరన్యాసంచేత తన వాక్యార్థాలను సమర్థించుకొన్నాడు. 'పిన్నలకు' అని వాడినా సరిపోయేచోట 'అల్పుల' కని వాడటం ధర్మరాజువాక్కులోని గూఢ మైన తీక్ష్ణత.

ఇప్పటికి ధర్మజుడు శిశుపాలుడిదోషాన్నీ, శ్రీకృష్ణుడిపూజార్హతనూ, భీష్ముడిపరమార్థప్రతిభనూ వరుసగా నిరూపించాడు. పూజనీయు లైన పురుషులు సభలో ఉండగా శ్రీకృష్ణు డేవిధంగా పూజ్యుడైనా? డని శిశుపాలుడు చేసిన వితండవాదానికి కీలెరిగి వాతపెట్టినట్లు సమాధానం చెప్పాడు.

క. "గురుఁ డని సమస్తలోకో
త్తరుఁ డని నీకంటె వృద్ధతము లైన నరే
శ్వరు లచ్యుతు నర్చననెడఁ
గర మభినందింప నీకుఁ గాదనఁ దగునే?" **(సభా. 2.20)**

పూజార్హు లని శిశుపాలుడు చెప్పినవారే అచ్యుతుడిని పూజార్హు డని అభినందించగా, కా దనిన శిశుపాలుడివాదంలోకంటె వ్యక్తిస్వభావంలోనే దోషం ఉన్నదని ధర్మజుడు ఈ వాక్యంవలన నిరూపించాడు. అది తరువాతి భీష్ముడివాక్యాలకున్నూ, శిశుపాలుడి వధకున్నూ పోషకమై ఉండటం సంభాషణక్రమవిన్యాసశిల్పానికి చక్కని ఉదాహరణం.

ధర్మజుడు ఈ పద్యచతుష్టయంలో ప్రతిపాదించిన అంశాలు శిశుపాలుడివాదాన్ని నిర్వీర్యంచేశాయి; శిశుపాలుడిని ఒక అవివేకిగా నిరూపించాయి. ధర్మజుడిపాత్ర ఈ ఘట్టంలో నిర్వహించవలసిన పని అయిపోయింది. ఇక ఆ పాత్ర ఈ విషయమై మాటలాడితే చర్వితచర్వణ మౌతుంది. ధర్మజుడివాక్కులలో గూఢమైన వాడిమి ఉన్నది. అది ప్రజ్వలనప్రక్రియకు తోడుపడదు. సన్నివేశంలో సంఘర్షణ సృష్టించబడాలి. యజమానివాక్కులు అనునయాత్మకాలు కావటంచేత ప్రతినాయకుడిలో కోపాగ్నిని ప్రజ్వలింపజేయవు. అందువలన కథలో భీష్ముడు ఉద్రేకంతో శిశుపాలుడికి ఉడు కెక్కించేమాట లన్నట్లు చిత్రించబడినాయి.

భీష్ముడు ధర్మరాజుతో అనిన మాట లివి-

ఉ. "పాలితదుర్ణయుండు శిశుపాలుఁడు బాలుఁడు; వీని నేల భూ
పాలక! నీకుఁ బట్టువఱుపన్? మఱి ధర్మ్ము వెఱుంగ వీనికిం
బోలునె రాగకోపపరిభూతమనస్కున కల్పరాజ్యల
క్ష్మీలలనాంధబుద్ధి కనిమిత్తమహత్పరివాదశీలికిన్." **(సభా. 2.22)**

ఎదుటివాడు తూలనాడినప్పుడు ఓరిమితో పరువం చెడకుండ ప్రవర్తించే నిగ్రహం ధర్మజుడి కున్నంతగా భీష్ముడికి లేదు. అందువలననే భారతంలో తాతకన్న మనుమనికి గౌరవం. భీష్ముడు ఉపాలంభనంతో మొదలు పెట్టాడు సంభాషణను. శిశుపాలుడు తననుగురించి అన్నమాటలకు ఆ వృద్ధసింహం క్రుద్ధమై నెమరువేసికొంటూ ఎదురుదెబ్బ తీయటానికి యత్నించింది. శిశుపాలుడిలో మొదట విమర్శించతగింది అవినయం. దానివలన పెద్దలను దూషించే వాక్పారుష్య మేర్పడింది. తరువాతివి అజ్ఞానం, అప్రౌఢత్వం. వాటివలన అతడు ధర్మాధర్మవివేచనం లేని మాటలు వ్యక్తిదూషణ ప్రధానంగా మాటలాడాడు. ధర్మరాజు అతడిని బ్రతిమిలాడవలసిన అవసరం లేదనటంలో శిశుపాలుడి అయోగ్యత నిరూపించబడింది. ఈ మాటలన్నీ ఒక యెత్తు! 'కడుకొని ధర్మతత్త్వ మెఱుఁగంగ నశక్యము' అనే అధిక్షేపానికి ఈ వాక్యం ప్రత్యాఖ్యానం. అతడి గూఢామర్షకు తార్కాణం. ధర్మనిర్ణయవేత్త అయినవాడి కుండకూడని మూడుగుణాలు శిశుపాలుడిలో ఉన్నాయని భీష్ముడు అధిక్షేపించాడు. అవి:- 1. రాగకోపదూషిత మైన మనస్సు కలిగిఉండటం. 2. రాజ్యసంపదవలని మదంచేత వివేకాన్ని కోల్పోవటం. 3. నిష్కారణవాదబుద్ధి. తుల్యపరిశీలనంవలన పఠితకు ఈ అవలక్షణాలు ధర్మజుడిలో లేకపోవటంచేత అతడిఉత్తమత్వం ద్యోతమానం అవుతున్నది.

భీష్ముడు ధర్మరాజును వారించి శిశుపాలుడితో ముఖాముఖి వాదానికి దిగాడు. అతడివాద మంతా శ్రీకృష్ణుడి పూజార్హతను నిరూపించటానికి వెచ్చించబడింది. వాదాంశ విశ్లేషణంలోనూ, విశ్లిష్టాంశవివరణంలోనూ, తాత్పర్యాంశ ప్రతిష్ఠాపనంలోనూ భీష్ముడు కడు శ్రద్ధవహించాడు. 'వృద్ధుల బుద్ధులు సంచలింపవే' అనిన శిశుపాలుడితో సుసంగత మైన తాత్పర్యాలు గల వాక్యాలను మాట్లాడి తన సుస్థిరవివేకచిత్తాన్ని సభకు వ్యక్తం చేసికొన్నాడు.

సభలో శ్రీకృష్ణుడి పూజార్హతను ప్రతిపాదించినవాడు భీష్ముడు కావటంచేత అతడే దానిని సమర్థిస్తూ మాటలాడటం సమంజసంగా ఉన్నది. దానికి శిశుపాలుడు ఒడబడేటట్లు లేడు. ధర్మజుడి నయవాక్యాలవెంట వెలువడిన భీష్ముడి వివేకవాక్యాలుకూడా విఫలాలైతే ఇక కార్యం ఎట్లా సఫలమయ్యేటట్లు? కోపం వచ్చి కొలువు వీడిపోయే కొరకరానికొయ్యపై కఱకుమాటలూ, చేష్టలూ పనిచేస్తాయని భావించి సహదేవుడు సంక్షుభితసభ స్తంభించేటట్లు భీషణప్రతిజ్ఞ చేశాడు.

చ. "ఎడపక యర్ఘ్య మచ్యుతున కిచ్చితి; మిచ్చిన దీనికిం దొడం
బడమని దుర్జనత్వమునఁ బల్కెడు వీరుల మస్తకంబుపై
నిడియెద నంచు దాఁ జరణ మెత్తె సభన్ సహదేవుఁ డట్టిచో
నుడిగి సభాసదుల్ వలుకకుండిరి తద్దయు భీతచిత్తులై" **(సభా. 2.30)**

ఇది సహదేవుడి సమయోచిత ప్రజ్ఞాప్రదర్శనం. దీనికి దేవతలు పూలవాన కురిపించారు. సభికులు విస్మయభావావిష్టు లైనారు. నారదు డానందంతో చిందులు త్రొక్కాడు.

కథ కిది ఒక విశ్రాంతిస్థానం. నాయకపక్షాన ఆరంభ, ప్రయత్నావస్థలు స్ఫురించాయి. బీజబిందువు లనే అర్థప్రకృతులు సార్థకంగా ప్రయుక్తా లైనవి. ప్రతిముఖసంధి ప్రత్యక్షమై ఉన్న ఈ కథాఘట్టంలో ముఖసంధిలోని బీజార్థాలు విచ్ఛిన్నమయ్యేటంతటి సంఘర్షణ సృష్టించబడాలి. గర్భ అవమర్శసంధులు వ్యాయోగంలో ప్రత్యక్షం కాకపోయినా వాటి ప్రభావం ప్రదర్శితం కావచ్చున్నారు. అందువలననే అంతటి సహదేవప్రతిజ్ఞను ధిక్కరించి శిశుపాలుడి సేనాపతి అయిన సునీథుడు విజృంభించాడు.

ప్రళయజలధివలె పరవాహిను లుప్పొంగివచ్చాయి. క్రియాబహుళమైన ఈ సన్నివేశాన్ని నన్నయ రసోదంచితమైనఛందోవిన్యాసంచేత వ్యంగ్యరమణీయం చేశాడు.

చ. "రయవిచలత్తురంగమతరంగములన్ మదనాగనక్రసం
చయముల సంచలచ్చటులసైనికమత్స్యములన్ భయంకరం
బయి యదు వృష్ణి భోజ కుకురాంధక వాహినియుం గలంగె ని
ర్దయతరరోషమారుతనితాంతసమీరిత మై క్షణంబునన్". **(సభా. 2.33)**

ఇందులోని శ్లేష సన్నివేశంలోని సంశ్లిష్టతను, రూపకాలంకారం రూపకరసప్రక్రియను వ్యంజింపజేస్తున్నాయి.

ఆ సైన్య సంక్షోభాన్ని చూచి ధర్మజుడు భయసంభ్రమాక్రాంత మనస్కుడై తాతతో ఇట్లని విన్నవించుకొన్నాడు.

తరలము.

"ధరణిలోఁ గల రాజు లెల్లను దారుణక్షయకాలసా
గరము లట్లు గలంగి రిప్డు; మఖప్రయోగము విఘ్నముం
బొరయకుండఁ బ్రజాపకారము పుట్టకుండఁగ నీవు చె
చ్చెరఁ బితామహ! వీరి కిచ్చటఁ జిత్తశాంతి యొనర్పవే!" **(సభా. 2.35)**

నన్నయ కథాకథనంలో ప్రయోగించిన రూపకాలంకారాన్నీ, ధర్మరాజపాత్రముఖాన ఉపమాలంకారాన్నీ నిబంధించి నాటకీయసంభాషణశిల్పాన్ని పోషించాడు. పై వర్ణనాత్మక పద్యాన్ని వీడి ధర్మజుడి పద్య మొక్కటి చదువుకొన్నా కథాప్రభావం చెడకుండ రక్షించటం ఈ రచనలోని శిల్పం! తాత చెప్పిన సలహాను పాటించటంవలన ధర్మరాజుకు శత్రువ్రాతాన్ని ఎదుర్కొనవలసి వచ్చింది. వారిని ఉపశాంతింపజేసే బాధ్యత మరల ఆ తాతపై ఉంచటం ఆ మనుమని లౌకికప్రజ్ఞావిశేషం. కథ భీష్ముడిసంభాషణలతో ముందుకు సాగుతుం దని సూచన. రంగంమీద ప్రదర్శనకు అసాధ్య మైన యుద్ధక్రీడకు బదులు వాగ్వివాదం ప్రవేశపెట్టే అవకాశం ఆ ధర్మరాజువాక్యంవలన కథలో సిద్ధిస్తున్నది.

భీష్ముడు తనబాధ్యత నిపుణంగా శ్రీకృష్ణుడిమీద ఉంచాడు-

క. "నీ యజ్ఞమునకు విఘ్నము
సేయఁగ నోపుదురె యొరులు జితదైత్యుఁడు నా
రాయణుఁడు యజ్ఞపురుషుఁ డ
జేయపరాక్రముఁడు దీనిఁ జేకొని కావన్" **(సభా. 2.37)**

అనటంలో కథ ఒక క్రొత్తమలుపు తిరిగింది. సవనప్రయోగ భంగభీతి కలిగిన నాయకుడికి శ్రీకృష్ణుడి అండ చూపి భీష్ముడు ప్రాప్త్యాశ అనే అవస్థను కల్పించాడు. శ్రీకృష్ణుడే యజ్ఞరక్షకు డనేసరికి శిశుపాలుడికి మహామర్షం పొడుచుకొని వచ్చింది. శ్రీకృష్ణుడి పరాక్రమాలన్నిటినీ విపరీతార్థాలతో అధిక్షేపిస్తూ నిష్ఠురాలకు దిగాడు శిశుపాలుడు. స్త్రీగోవధపాపాలను ఆ గోవిందుడికి అంటగట్టి నిండుసభలో అతడిని గర్హించాడు. ఆపైన భీష్ముడి దుర్వ్యవసాయాన్ని దృష్టాంతరూపంగా చెప్పి దుయ్యబట్టటానికి వృద్ధహంసోపాఖ్యానం చెప్పాడు. నన్నయ శిశుపాలుడు 'రూక్షాక్షరవచనంబుల' నాక్షేపించాడని వర్ణించి సంభాషణస్వభావాన్ని ధ్వనింపచేశాడు.

గురునింద చేస్తున్న శిశుపాలుడివాక్కులు భీముడికి భీషణరౌద్రోద్రేకాన్ని కలిగించాయి.

చ. "ప్రకటితకోపవేగమునఁ బద్మదళాయతనేత్రముల్ భయా
నకతరలీలఁ దాల్చె నరుణద్యుతి నుద్యతమై త్రిశాఖ మై
భ్రుకుటి లలాటదేశమునఁ బొల్చెఁ ద్రికూటతటిత్రిమార్గగా
నుకృతిఁ బ్రభంజనప్రియతనూజున కంతకమూర్తి కచ్చటన్". **(సభా. 2.51)**

భీముడు శిశుపాల నిర్మూలనాభీలసంరంభంతో ముందుకు ఉరికాడు. భీష్ముడు అతడిని వారించి, శిశుపాలుడివృత్తాంత మంతా చెప్పి, అతడు శ్రీకృష్ణుడివలనతప్ప, ఇతరులచేత అసాధ్యు డనే సత్యం తేటపడేటట్లు చేశాడు. అట్లా కాకపోతే-

చ. "ఇతనికి నిట్లు న న్నుఱక యెగ్గులు పల్కఁగఁ బోలెఁగాక! యు
ద్ధతిమతి నన్యు లీతనివిధంబునఁ బల్కి మదీయచాపని
ర్గతచటులోగ్రమార్గణనికాయపయోధి మునుంగ కిట్లు ద
ర్పితు లయి పోవనేర్తురె? గభీరపరాక్రమ! మారుతాత్మజా!" **(సభా. 2.61)**

అని అనునయించి మనుమడిక్రోధోద్రేకాన్ని మాన్పాడు.

కథలో శ్రీకృష్ణుడే శిశుపాలుడిని వధించగలిగినవాడనే తాత్పర్యం ఈ సంభాషణలచేత స్థిరీకరించి నాటకీయతను పోషించటంతోపాటు కథలో నిర్వహణ సంధిని సూచించాడు నన్నయ. వృద్ధహంసోపాఖ్యానాన్ని, శిశుపాలవృత్తాంతాన్ని పాత్రసంభాషణలలో నిబంధించటం రూపకమర్యాద!

శిశుపాలుడు శ్రీకృష్ణుడిని యుద్ధానికి ఆహ్వానించటంకంటె మరొక గత్యంతరం లేనిస్థితిలో పడ్డాడు. అతడి యుద్ధాహ్వానాన్ని మన్నించిన శ్రీకృష్ణుడు అతడి వధార్హతను నిరూపించే దుశ్చేష్టితాలను ఏకరువు పెట్టాడు. సహనానికీ, సమయపాలనానికీ సమయం తీరిందని సూచించాడు. శిశుపాలుడు శ్రీకృష్ణుడి మనసును మండించేమాట లన్నాడు-

"నీ కూర్మియు నీ యలుకయు
నా కవి యేమిటికి దుర్గుణప్రియ! మొదలన్
నా కిచ్చిన యక్కన్యకఁ
జేకొని నీ కిట్లు పలుక సిగ్గును లేదే?" **(సభా. 2.67)**

అర్హతానర్హతల చర్చతో ఆరంభమైన వాదులాట అంతఃపురచరిత్రలను తడవుకొనేంతవరకు ముదరజొచ్చింది. చక్రధారి ఇక శిశుపాలుడికథకు చక్రం అడ్డంవేశాడు. శిశుపాలుడిమొండెం నేల కొరిగింది. తేజం విశ్వాత్ము డైన శ్రీకృష్ణుడిలో లీనమైపోయింది. రూపకతుల్య మైన ఈ సన్నివేశం నిర్వహణంలో అద్భుతంగా ముగిసింది.

నన్నయ ఈ ఘట్టంలో యజ్ఞవిధానాన్ని పేర్కొంటూ ప్రయోగశబ్దాన్ని వాడటం గమనించ తగింది.

"మఖప్రయోగము విఘ్నముం బొరయకుండన్" **(సభా. 2-35)**

"జగన్నాథరక్షితంబయి రాజసూయమహాధ్వరంబు సమాప్తప్రయోగం బయిన" **(సభా. 2-72)**

ఈ ప్రయోగంవెనుక నాందినుండి నిర్వహణంవరకు సాంగంగా నిర్వహించిన తన రూపకప్రయోగ సంవిధానాన్ని నన్నయ వ్యంగ్యంగా సూచించా డనటం కావ్యశిల్పాంశం! నన్నయనాటకీయశిల్పప్రపంచంలో ఇది ఒక కళారేఖ!

కుమారాస్త్రవిద్యాప్రదర్శనం: బహిరంగవ్యాయోగప్రదర్శనం

రూపకప్రయోగం నాట్యమంటపంలోనూ, బహిరంగ మంటపంలోనూ ప్రదర్శించబడటం ప్రాచీనకాలంలో పరిపాటిగా ఉండేది. ఆ సంప్రదాయాన్ని అనుసరించి నన్నయ శిశుపాలవధ సభామంటపంలో జరిగిన వ్యాయోగంగానూ, కుమారాస్త్ర విద్యాసందర్శనం బహిరంగప్రదేశంలో ప్రయోగించబడిన వ్యాయోగంగానూ రూపొందించి తన రచనలోని నాటకీయతలో వైవిధ్యం ప్రదర్శించాడు. ఈ ఘట్టం ఆదిపర్వ షష్ఠాశ్వాసంలో 60 పద్యగద్యాలలో వ్యాపించిఉన్నది. (ఆది.6. 2-61)

పాండవధార్తరాష్ట్రకుమారులు శస్త్రాస్త్రవిద్యలలో ఆరితేరారు. వారి విద్యానైపుణ్యాన్ని ధృతరాష్ట్రాదులముందు ప్రదర్శించి చూపించటానికి ఒకసభను ఏర్పాటుచేయుమని ద్రోణుడు రాజును కోరాడు. ధృతరాష్ట్రుడు విదురుడిని కుమారాస్త్రవిద్యా ప్రదర్శన సందర్శనలకు అనుకూలమైన ఒక రంగాన్ని సిద్ధం చేయించుమన్నాడు. వెంటనే శాస్త్రోక్తంగా ఒక అపూర్వమైన రంగం సిద్ధమైనది. నన్నయ ఆ రంగాన్ని నాటకీయంగా బహిరంగప్రదర్శనంగా రచనలో వాడుకొని నాటకీయతనుకూడా కలిపి సంయుక్తంగా సాగించాడు. కన్నులపండువుగా ప్రదర్శనసందర్శనరంగాలు అలంకరించబడ్డాయి. ప్రదర్శకులు ప్రదర్శనరంగంమీద కనపడతారు. ప్రేక్షకులు సందర్శనరంగంలో ఉపవిష్టులై ఉంటారు. ప్రదర్శనను చూచిన ప్రేక్షకుల స్పందనలుకూడ నాటకీయంగా వర్ణించబడుతుంటాయి. అది యొక మిశ్రమప్రయోగం.

ప్రదర్శనరంగమధ్యంలో తెల్లనివస్త్రాలతో, ఆభరణాలతో అలంకరించుకొన్నవాడు, తెల్లనిగడ్డాలు మీసాలతో ఒప్పారేవాడు అయిన ద్రోణుడు శిష్యగణంతో వచ్చి నిలిచాడు. రణరంగోచిత వేషాలతో ఆహార్యాభినయం అచ్చుపడేటట్లు ధర్మజాదులు వీరవేషాలలో ఉన్నారు. రంగం నిండుగా రంగురంగుల శృంగారాలంకారాలతో రంజిల్లిపోయింది. ప్రదర్శన ప్రారంభమైనది. కత్తులు, బాణాలు, గుర్రాలు, ఏనుగులు, కుంతకాలు, గదలు మొదలైన వాహన, ఆయుధాలలో తమతమ ప్రజ్ఞలను రాజకుమారులు సామూహికంగా ప్రదర్శించారు. ద్రోణుడు అందరి ప్రదర్శన లైపోయిన తరువాత భీమదుర్యోధనుల గదాయుద్ధాన్ని ప్రదర్శింపజేయించాడు. వా రిద్దరూ మదగజాలవలె గదాయుద్ధం సాగించారు. చూచేవారిలో భీమదుర్యోధనుల అభిమాను లేర్పడ్డారు. వారుకూడా తమ తమ అభిమానవీరులు గెలవాలని కేకలు వేయటం పరుషంగా పరస్పరం మాట్లాడుకొనటం మొదలుపెట్టారు. రంగభంగ మయ్యే పరిస్థితి ఏర్పడింది. ద్రోణుడు అశ్వత్థామను పంపి భీమదుర్యోధనుల బలప్రదర్శనను ఆపించాడు. దానిని నన్నయ ఇట్లా వర్ణించాడు.

మ. ''అవనీచక్రము పాదఘాతహతి నల్లాడంగ నత్యుగ్ర భై
రవహుంకారరవంబునన్ వియదగారం బెల్ల భేదిల్లఁ బాం
డవకౌరవ్యగదావిఘట్టన మకాండప్రోత్థమై భావిపాం
డవకౌరవ్యరణాభిసూచనపటిష్ఠంబయ్యె ఘోరాకృతిన్''. **(ఆది. 6.14)**

ఇది నన్నయ తీర్చిదిద్ద దలచుకొన్న వ్యాయోగానికి చూళిక.

అసలురంగం మొదలుకావటానికి ముందు ఇంతవరకు పూర్వరంగం ప్రవర్తిల్లింది. ఆచార్యుడు సూత్రధారుడు. మిగిలిన రాజకుమారులందరి ప్రదర్శన ప్రస్తావన. భీమ దుర్యోధనుల గదాయుద్ధం విష్కంభం. అందులో వారి పోరు కురుక్షేత్రయుద్ధాన్ని సూచించింది. ప్రజలుకూడా పాండవ కౌరవపక్షవర్తులై పరస్పరక్రోధవచనాలకు దిగారు. అటువంటి సంకుల సంక్షుభితవాతావరణం ఈ బహిరంగ ప్రయోగంగా సాగబోయే అర్జునుడి శస్త్రాస్త్రప్రయోగరంగ మనే వ్యాయోగానికి భిత్తికవలె చిత్రించి నన్నయ ఒక మహానాటకకర్తలక్షణాన్ని వెలార్చాడు.

ద్రోణుడు 'నా ప్రియశిష్యుడైన అర్జునుడి ధనుఃకౌశలాన్ని చూడండి' అని ప్రకటించాడు. రంగంమీద ఏకైకవీరుడు అర్జునుడు నిలబడ్డాడు. అప్పటికి భీముడికి దుర్యోధనుడు ఎదురున్నాడు. కాని, అర్జునుడికి సాటివీరుడు లేడని గురువు సూచించాడు. అతడి శస్త్రాస్త్ర ప్రదర్శన గురువుగారి గొప్పతనానికి కీర్తికిరీటంవలె నిలుస్తుంది. అదే కథావస్తువైతే అందులో

నాటకీయత లేదు. ప్రతివీరుడు లేడని ప్రకటించిన పార్థుడికి ప్రతివీరుడు రంగంమీదకు రావటం, అతడిని పాండవవర్గంవారు ప్రతివీరుడు కా డని అధిక్షేపించటం, దుర్యోధనవర్గంవారు అతడిని ప్రతివీరుడిగా రంగంమీద ప్రతిష్ఠాపించటం ఈ రంగంలోని ఉద్వేగకరమైన వస్తువు. ఒక అంకంవలె సాగే ఈ ఘట్టంలో పాత్రలు పరుషవాక్యాలతో పరాక్రమప్రదర్శనకు పూనుకొని వాక్క్రియారూపసంఘర్షణను సృష్టించారు కాబట్టి దీనిని వ్యాయోగంగా పరిగణించ వీలున్నది. నన్నయ దీని కా రూపకశిల్ప వైభవాన్ని సంతరించి కృతకృత్యు డైనాడు.

ఉదాహరణకు కొన్ని నాటకీయాంశాలు గమనించదగినవి.

1. నాయకప్రతినాయకస్థానీయులుగా ఆ రంగంలో నిలిచినవారు అర్జునకర్ణులు. వారి వీరాకృతులను వర్ణించి వీరవిభావ విస్ఫూర్తిని రంగసుందరంగా వెలార్చాడు నన్నయ. అర్జునుడు రంగంమీదకు రాగానే ఇట్లా కనపడ్డాడు-

ఉ. “హారివిచిత్రహేమకవచావృతుఁ, డున్నతచాపచారుదీ
ర్ఘోరుభుజుండు, భాస్వదసితోత్పలవర్ణుఁడు, సేంద్రచాపశం
పారుచిమేఘమో యనఁగఁ బాండవమధ్యముఁ డొప్పి బద్ధతూ
ణీరుఁడు రంగమధ్యమున నిల్చె జనంబులు దన్నుఁ జూడఁగన్”. **(ఆది. 6.17)**

ఇంద్రధనుస్సుతో ఇంపుగా సొంపారే నల్లనిమేఘమో అన్నట్లు అందరిచూపులను ఆకట్టుకొన్న అందమైన వీరరసమూర్తి అర్జునుడు. అడ్డులేని చాపవీరుడుగా వెలిగిపోతున్న అర్జునుడిపై సవాలు విసురుతూ పిడుగువంటి శబ్దం పుట్టేటట్లు భుజాస్ఫాలనంచేసి రంగద్వారం వద్ద- అందరూ తనవైపు ఆశ్చర్యంతో చూచేటట్లు- నిలిచాడు కర్ణుడు.

శా. “సాలప్రాంశు నిజోజ్జ్వలత్కవచు శశ్వత్కుండలోద్భాసితున్
బాలార్కప్రతిమున్ శరాసనధరున్ బద్ధోగ్రనిస్త్రింశు శౌ
ర్యాలంకారు సువర్ణవర్ణు ఘనుఁ గర్ణాఖ్యున్ జగత్కర్ణపూ
ర్ణాలోలద్గుణుఁ జూచి చూపఱు ప్రభూతాశ్చర్యులై రచ్చటన్.”. **(ఆది. 6.31)**

నల్లకలువ వన్నెవాడు అర్జునుడు. అందువలననే మేఘంవలె మనోహరంగా ఉన్నాడు. అతనికి కోదండం అద్భుత విశేషం. కవచం ఒక వైచిత్రి. భుజబలం ఒక అలంకారం. బంగారు మేనిచాయవాడు కర్ణుడు. అందువలననే సూర్యబింబంవలె ప్రకాశమానంగా ఉన్నాడు. అతడి కవచకుండలాలే అద్భుతవిశేషాలు. నిస్త్రింశం ఒక వైచిత్రి. శౌర్యం ఒక అలంకారం. అర్జునుడు ఆహ్లాదాన్ని కలిగించాడు; కర్ణుడు ఆశ్చర్యం కలిగించాడు. అర్జునుడిఆకృతిలో అగ్రగణ్యం కోదండం. కర్ణుడిఆకృతిలో కవచకుండలాలు. ఒకడు పరాక్రమానికీ మరొకడు శౌర్యానికీ ప్రతీకలు. ఈ తారతమ్యాన్ని సూక్ష్మంగా పరిశీలిస్తే కర్ణుడికంటె అర్జును డధికుడని వస్తుధ్వని. శ్రవ్యకావ్యమర్యాద రంగమధ్యంలో దృశ్యకావ్యమర్యాదగా ఆకృతులు పొంది నిలిచినట్లు సాగింది.

2. కర్ణుడు రంగప్రవేశం చేసి అర్జునుడు ప్రదర్శించిన విద్యలన్నీ ప్రదర్శించి చూపటంతో కౌరవపక్షానికి ఒక ఆశాకిరణం ఆవిర్భవించింది. దుర్యోధనుడు కర్ణుడిని చేరదీసి, స్నేహం కలిపి, తనచేత కురురాజ్యం ఏలించు మని రంగమధ్యంలోనే కోరాడు; అర్జునుడితో పోటీపెట్టి ద్వంద్వయుద్ధం చేయించాడు. కృపాచార్యుడు కర్ణుడిని కులగోత్రాలను చెప్పమని అధిక్షేపించగా కర్ణుడు తలవంచి నిలబడినప్పుడు దుర్యోధను డతనికి రంగమధ్యంలోనే అంగరాజ్య పట్టాభిషేకం చేశాడు. దానికి ప్రత్యుపకారంగా కర్ణుడి స్నేహాన్ని వాగ్దత్తంగా తీసికొన్నాడు. కర్ణుడు సూతపుత్రు డని తెలియగానే భీముడు అధిక్షేపించాడు. కర్ణుడు మహాపురుష డై ఉంటా డని వాదించి దుర్యోధనుడు కర్ణసహాయుడై ఇంటికిపోయాడు. ఈ అంకంలో చర్య లెన్ని ఉన్నాయో సంభాషణ లన్ని ఉన్నాయి. అందువలన కథనంతోపాటు నాటకీయతకూడా సమంగా రాణించింది.

3. ''నీవ కడు నేర్పుకాడవు గావలవదు''- (ఆది. 6.33) అనే పద్యం కర్ణుడి పౌరుషోక్తికి, ''పిలువంగఁబడక సభలకు బలిమిం జని పలుకు పాపభాగుల లోకంబులకు'' (ఆది. 6.36) అనే పద్యం అర్జునుడి పరుషోక్తికి. 'ఘననిశితాస్త్రములఁ బలుకఁ గడఁగుము నాతోన్' ''ఈ రంగభూమి'' (6.37,38) మొదలైన పద్యాలు కర్ణుడివీరోక్తులకు ప్రసిద్ధోదాహరణాలు. ''కురుకులజుండు పాండునకుఁ గుంతికిఁ బుత్త్రుఁడు''........ ''దొరయగుదేని నీకెదిరి దోర్బలశక్తి నితండు నూపెడిన్'' (6.45) అనే పద్యంలో కృపాచార్యుడి అధిక్షేపోక్తులు, ''కులము గలవాఁడు....'' ''రాజవరుఁడైన పార్థుతో.....'' (6.47,48) మొదలైన పద్యాలలో దుర్యోధనుడి అభిమానోక్తులు, ''నీదు కులమునకుఁ దగఁగఁ.....'' ''ఉత్తమక్షత్రియప్రవరోపయోగ్యమైన....'' (6.55.57) అనే పద్యాలలో భీముడి నిందోక్తులు, ''అనిలజ! నీ కిట్లని పల్కను దలఁపను....'' ''శూరులజన్మంబు.....'' (6.59,60) అనే పద్యాలలో దుర్యోధనుని అధిక్షేపోక్తులు ఈ ఘట్టంలో వాగ్యుద్ధవాతావరణాన్ని కలిగించి వ్యాయోగస్వభావాన్ని పోషించాయి. వీరరౌద్రరసముద్రితమైన ఈ రంగం దీప్తసత్వానికి ఆలవాలమై సహృదయరంజకంగా సాగింది.

4. ఈ రంగాన్ని ప్రదర్శనసందర్శనరంగంగా నన్నయ తీర్చిదిద్దటంతో- రంగంమీద నిలిచి మాటలతో చేతలతో అభినయించేవారిని ఎంత శ్రద్ధగా చిత్రించాడో, వారిని చూచి స్పందించిన ప్రేక్షకలోకాన్నికూడా అంత శ్రద్ధగా చూపించాడు.

ఉదాహరణకు-

(1) ''నరు, నింద్రాత్మజు నింద్రావరజసఖున్ వీరుఁ బాండవప్రవరు, ధనుర్ధరుఁ జూచి చూపఱెల్లన్ - పరమాద్భుత చిత్తులగుచు'' అర్జునుడిని ప్రశంసించారట (ఆది. 6. 18).

(2) ప్రజల ప్రశంసలు విని కుంతి ఉప్పొంగిపోయి 'అనంతహర్షవిస్తారితలోచన' అయిందట! (6.20)

క. ''చారుమనస్సమ్మదరస
పూరము వెలివేర్చునట్లు పాలఁతికి విగళ
ద్భూరిస్తనజనితపయో
ధారలు నానందబాష్పధారలు నొప్పెన్!'' **(ఆది. 6.21)**

(3) రంగద్వారం వద్ద కర్ణుడు భుజాస్ఫాలనం చేయగానే పాండవ కౌరవులలో కలిగిన ప్రతిస్పందన రమణీయంగా వర్ణించాడు నన్నయ.

మ. ''జను లెల్లం గడు సంభ్రమింపఁగ నజస్రంబై భుజాస్ఫాలన
ధ్వని శైలప్రకరంబుపైఁ బడు మహాదంభోళిశబ్దంబొకో
యన వీతెంచినఁ బాండవుల్ సనిరి ద్రోణాచార్యు డాయన్, సుయో
ధను వేష్టించిరి తమ్ము లందఱును దద్ద్వారంబు వీక్షించుచున్.'' **(ఆది. 6.29)**

భయసంభ్రమాలు కలిగినప్పుడు తమకు రక్షకు డనీ ఆత్మీయుడనీ ఎవరిని భావిస్తుంటారో వారివద్దకు అప్రయత్నంగా పరుగెత్తటం మానవసహజం. పాండవులు ద్రోణుడిని సమీపించారు. ధార్తరాష్ట్రులు దుర్యోధనుడిచుట్టూ చేరారు. ఈ సన్నివేశంలో బెదరక కుదురుగా నిలిచింది ద్రోణుడు, దుర్యోధనుడు. మిగిలినవారు రెండు పక్షాలుగా చీలి వా రిద్దరినీ ఆశ్రయించారు. పాండవ కౌరవులు ఆవిధంగా చీలిపోవటానికీ, పాండవుల గురుభక్తి, కౌరవుల భ్రాతృభక్తి ప్రకాశంకావటానికీ కర్ణుడు భవిష్యత్కథలో కారకుడు కాగలడనీ ఈ వర్ణనద్వారా వస్తుధ్వనిని సాధించాడు నన్నయ.

(4) కర్ణుడి అధిక్షేపోక్తులు వినగానే జనులకు ఆశ్చర్యం కలిగిందట. అర్జునుడికి కోపం, సిగ్గూ రెండూ మొలుచుకొని వచ్చాయట. దుర్యోధనుడికి ప్రీతి కలిగిందట. ఈవిధంగా సహృదయస్పందనను ప్రదర్శనకళగా నాటకీయతతో చేర్చటం నన్నయ తిక్కనకు చూపించిన వెలుగుబాట.

(5) కర్ణుడు వేసిన పర్జన్యాస్త్రంవలన మేఘాలు క్రమ్మి అర్జును డందులో మరుగుపడి కనపడకపోయినప్పుడు కన్నతల్లి కుంతి మోహమూర్ఛాన్విత అయినదట. ఆమెను చల్లనీళ్ళతో సేదదీర్చవలసివచ్చిందట! (ఆది. 6. 42,43).

(6) కర్ణుడు తన తల్లిదండ్రులపేర్లను చెప్పటానికి సిగ్గుపడి తలవంచాడట(ఆది. 6. 46); దుర్యోధనుడు అతడికి అంగరాజ్యాభిషేకం చేయగా 'పరమహర్షం' ప్రకటించాడట (ఆది. 6. 49); సూతుడు కర్ణుడిని కౌగిలించుకొని మూర్ధాన్ని ఆఘ్రాణించాడట, అభిషేకంతో అసలే తడిసి ఉన్న కొడుకుతలను హర్షాశ్రువులతో మరొకసారి తడిపివేశాడట! (ఆది. 6. 53).

(7) భీముడు కర్ణుడిని అధిక్షేపించినప్పుడు కర్ణుడు "వెల్లనయి యెద్దియుం జేయునది నేరక దీర్ఘోష్ణ నిశ్వాసవ్యాకులితవదనుం డయి యాకాశంబువలన నున్న యాదిత్యుం జూచుచు మిన్నకుండె"నట. (ఆది. 6.63)

(8) ధనుర్విద్యాపారగుడైన కర్ణుడు మిత్రుడు కావటంచేత అర్జునుడివలని భయంపోయి ఆనాటిరాత్రి దుర్యోధనుడు 'ముదితాత్ముడై' నిశ్చింతగా గుండెమీద చేతులుపెట్టుకొని నిద్రించాడట. (ఆది. 6. 63)

విభావానుభావ సాత్త్వికభావవర్ణనంలో నన్నయ తిక్కనకు గురుపీఠమని ఈ ఘట్టంలో నిరూపించుకొన్నాడు. శిశుపాలవధ ఘట్టంవలెనే, కుమారాస్త్రవిద్యాప్రదర్శనంకూడా ఆశ్వాసాదిలో ఉన్నది. అయినా ఆశ్వాసాదిపద్యాన్ని శిశుపాలవధలో నాందిగా నిలిపినట్లు కుమారాస్త్రవిద్యాప్రదర్శనంలో కూర్చలేదు. ఇది ఆదిపర్వంకంటె సభాపర్వంలో నన్నయ సాధించిన నాటకీయశిల్పపరిణతి అనవచ్చును. లేదా బయలురంగంలో ప్రదర్శించే రూపకంకంటె నాటకశాలలో ప్రదర్శించే రూపకప్రయోగంలో నాంది ఉండటం ఔచిత్యమని భావించియుండవచ్చును. ఏమైనా రంగ-బహిరంగ ప్రయోగంగా వ్యాయోగాన్ని శ్రవ్యకావ్యరంగంమీద ప్రదర్శించిచూపిన ఆదికవి నన్నయ అభినందనీయుడు!

వ్యాయోగం: సమవకారం

వాగ్రూపయుద్ధం విస్తారంగా ప్రవర్తిల్లి, తదనుబంధంగా క్రియారూపయుద్ధం సాగినట్లు సూచించే ఘట్టాలలో వ్యాయోగలక్షణాలను ఉపలక్షించవచ్చును. దీనికి విపరీతంగా ఉంటే- అంటే క్రియారూపయుద్ధానికి ఉపస్కారకంగా, ఉపబలకంగా వాగ్రూపయుద్ధంగాని, వాగ్వివాదంగాని ప్రవర్తిల్లినట్లు వర్ణించి యుద్ధాన్ని ఫలంగా నిర్వహించే ఘట్టాలలో 'సమవకార' స్వభావాన్ని ఎక్కువగా సంలక్షించవచ్చును. ఆదిసభారణ్యపర్వాలలో భీముడు రాక్షసులను సంహరించిన ఘట్టాలు ప్రసిద్ధాలు. అతడు హిడింబ, బకాసుర, కిమ్మీర, జటాసురులను ఏకవీరుడై సంహరించాడు. అరిభయంకరుడైన జరాసంధుడిని శ్రీకృష్ణార్జున సహాయంతో స్వయంగా మల్లయుద్ధంలో సంహరించాడు. భీముడు రాక్షసులను చంపిన ఘట్టాలన్నీ ఒకయెత్తు, రాక్షసుడు కాని జరాసంధుడిని చంపిన ఘట్టం ఒక్కటీ మరొక యెత్తు. స్వీయరక్షణార్థం గానీ, జనరక్షణార్థం గానీ భీముడు రాక్షససంహారం చేశాడు. రాజసూయయాగం నిరంతరాయంగా సాగటానికీ, అతడిచేత బంధితు లైన సమస్త భూపతులను చెర విడిపించి ధర్మాన్ని రక్షించటానికీ, భీముడు జరాసంధుడిని వ్యూహంతో చంపాడు.

సమవకారంలో దేవతలకు, అసురులకు సంబంధించిన ఫలాన్ని సాధించే ఉపాయం బీజంగా ఉంటుంది. అందులో 12మంది నాయకు లుండవచ్చును. వారు ప్రఖ్యాతులూ, ఉదాత్తులూ అయి ఉండాలి. సమవకారంలో మూడు అంకా లుంటాయి. అందులో సందర్భానుకూలంగా మూడురకాల కపటచర్యలూ, మూడురకాల విద్రవాలూ (ఉపద్రవాలూ), మూడురకాల శృంగారాలూ నిబంధించబడవచ్చును. సుఖాన్నీ కానీ దుఃఖాన్ని కానీ కలిగించటానికి చేసే వంచనలు కపటచర్యలు. అవి మూడురకాలుగా ఉంటాయి. 1. వస్తుక్రమ విహితాలైనవి- అంటే కార్యసాధకుడిదోషం లేకపోయినా వంచకులచేత కలిగే మోసం. 2. పరప్రయుక్తం- అంటే కార్యసాధకుడు చేసే అపరాధాన్ని ఆసరాగా చేసికొని వంచకులు చేసే మోసం. 3. దైవవశాగతం- అంటే దైవవశాన కాకతాళీయంగా సంభవించే మోసం. విద్రవం అంటే చెదరిపోవటం. ప్రజలను చెదరిపోయేటట్లు చేసేవి విద్రవాలు. దాన్నే మనం ఇప్పుడు ఉపద్రవాలు అని అంటున్నాం. ఇవి మూడురకాలు.

1. అచేతనకృతాలు- నీటివలన కలిగే వానలు, తుఫానులు, వరదలు, ఉప్పెనలు మొ॥నవి. వాయువువలన అగ్నివలన కలిగే అపాయాలు. 2. చేతనకృతాలు- క్రూరవన్యమృగాలవలన కలిగే సంక్షోభాలవంటివి. 3. ఉభయకృతాలు- యుద్ధాలు, నగరాలముట్టడులు, రాక్షసబాధలు మొ॥నవి. శృంగారాలుకూడా ధర్మ, అర్థ, కామసంబంధాలని మూడువిధాలు. వీటిలో వేటినైనా యథావకాశంగా మూడు అంకాలలోనూ ప్రయోగించాలి. రచనలో విశేషవృత్తాలు వాడాలి. మొత్తంమీద సమవకారం నానారసాశ్రయంగా రాణించాలి. నన్నయ భీమనాయక మైన ఘట్టాలలో సమవకారస్వభావాలను సమయోచితంగా రంగరించి తనరచనలో నాటకీయతను పోషించాడు.

జరాసంధవధ: సమగ్రసమవకారం

సమవకారస్వభావాన్ని ఎక్కువగా సంతరించుకొన్న సన్నివేశం సభాపర్వంలోని జరాసంధవధఘట్టం. ధర్మరాజుకోర్కెపై శ్రీకృష్ణుడు ఇంద్రప్రస్థానికి వచ్చి రాజసూయయాగం చేయా లని ప్రోత్సహించి, దానికి ముందుగా జరాసంధుడిని వధించా లని సూచించి, వ్యూహం నిర్ణయించి, దానిప్రకారం కార్యం నిర్వహించి, విడుదలైన రాజుల నందరిని ధర్మజుడికి ఒప్పగించి, తిరిగి ద్వారకకు వెళ్ళిపోయేవరకు గల 124 పద్యగద్యాల భాగం (సభా. 1.101-224) జరాసంధవధఘట్టం. ఇందులో ప్రధాననాయకుడు ధర్మరాజు, అతడిపక్షాన జ్ఞానేచ్ఛాక్రియాశక్తులకు ప్రతినిధులవలె శ్రీకృష్ణార్జునభీములు జరాసంధవధను నిర్వహించారు. అంటే నలుగురు ధీరోదాత్తులు నాయకులుగా ఉండి కార్యాన్ని ముందుకు తీసికొనిపోయి నిర్వహించి ఫలాన్ని అనుభవించేవారుగా గోచరిస్తున్నారు. ఈ కార్యమంతా రాజసూయం చేయటానికి, తద్వారా పాండురాజాదులకు ఉత్తమగతులు కలిగించటానికి, శ్రీకృష్ణాదులకు ఇబ్బందులు కలిగించేవారిని తొలగించటానికి ఉద్దేశించబడింది కాబట్టి పితృదేవతల, అవతారపురుషుడైన శ్రీకృష్ణుడికార్యాలను సాధించటానికి ఉపాయాన్ని వెదకటం బీజంగా సాగింది కాబట్టి సమవకార వస్తుస్వభావం సహజంగా అమరింది. కార్యం సార్థకంగా సాగింది.

జరాసంధవధ ఘట్టాన్ని మూడుభాగాలుగా విభజించవచ్చును. అవి సమవకారంలోని మూడంకాలుగా రాణిస్తున్నాయి. మొదటి అంకంవంటి కథాభాగం- ప. 101-171 వరకున్నది. ఇందులో జరాసంధుడి బలపరాక్రమాలూ, అతడి పుట్టుపూర్వోత్తరాలూ, మిత్రులబలాబలాలూ చెప్పి, అతడిని వధించటంలో కల ఆవశ్యకతను పేర్కొని, అతడిని మల్లయుద్ధంలోమాత్రమే చంపే అవకాశం ఉండటాన్నీ, భీముడిని అతనిపై ప్రయోగించి ఉపాయంతో చంపటాన్నీ నిశ్చయించే కథ యీ భాగంలో చెప్పబడింది. ఇక రెండవ అంకంవంటి కథాభాగం - ప. 172-200 వరకున్నది. ఇందులో శ్రీకృష్ణార్జునభీములు కపటస్నాతకవేషాలతో గిరివ్రజపురం చేరి అపసవ్యంగా వెనుకద్వారంనుండి నగరంలో ప్రవేశించి, బలవంతాన రాజమందిరంలోకి చేరి, జరాసంధుడితో వాదించి, తమ ప్రవర్తనను సమర్థించుకొని, తమ లక్ష్యాలను వివరించి, భీముడితో ద్వంద్వ(మల్ల) యుద్ధానికి జరాసంధుడిని ఆహ్వానించిన ఘట్టం వివరించబడింది. ఆ తరువాత మూడోఅంకంవంటి కథాభాగం- భీమజరాసంధుల మల్లయుద్ధాన్ని వర్ణించే ఘట్టం- ప. 201-224. జరాసంధవధ జరిపించి, చెరలో ఉన్న రాజులను విడిపించి, సహదేవుడికి రాజ్య మిచ్చి, జరాసంధుడి దివ్యరథమెక్కి శ్రీకృష్ణుడు అందరితో కలిసి ఇంద్రప్రస్థానికి వచ్చి, విజయఫలాన్ని ధర్మరాజుకు సమర్పించటం ఇందులో ప్రధాన కథాంశాలు. ఈ మూడు ఘట్టాలలోని మొదటి రెండింటిలో కథాకథనంకంటె సంభాషణశిల్పాన్ని నన్నయ ఎక్కువగా పాటించి నాటకీయతను రక్తికట్టించాడు. మూడవది మల్లయుద్ధవర్ణనం కావటంచేత కథాకథనపద్ధతిలో సాగింది. నాటకంలో వేదికమీద మల్లయుద్ధం ప్రదర్శనయోగ్యమైనది కాదు. కాని, శ్రవ్యకావ్యప్రక్రియలో సాక్షాత్తు వేదికమీద జరుగుతుండగా మనోనేత్రంతో చూచి హర్షించేటట్లు నన్నయ దిద్దితీర్చాడు. రెండురంగాల దృశ్యకావ్య రచనాప్రభావం మూడోరంగాన్ని ముంచెత్తుతూ సమవకార స్వభావాన్ని సుసంపన్నం చేస్తున్నది.

జరాసంధవధ ఘట్టంలో మూడువిధాలైన కపటచర్యలూ, ఉపద్రవాలూ, యథావకాశంగా వర్ణించబడ్డాయి. జరాసంధుడు పధ్నాలుగు రాజవంశాలలో పుట్టిన క్షత్రియుల నందరినీ జయించాడు. అతడికి మహాబలుడైన శిశుపాలుడు సేనానిగా, హంసడిభకులు సహాయకులుగా ఉండి దండయాత్రలలో సహాయం చేశారు. శ్రీకృష్ణుడు కంసుడిని వధించటంవలన ఆ కంసుడిభార్య జరాసంధుడి కూతురు కావటంచేత, జరాసంధుడు శ్రీకృష్ణుడిపై పగసాధించేయత్నంతో అనేకఉపద్రవాలు కలిగించాడు. జరాసంధుడు, హంసడిభకులు కలిసి రణరంగంలో నిలిస్తే లోకంలో వారికి ఎదురులేదు. వారు ముగ్గురూ

ఆయుధాలతో చావని వరాలు పొందినవారు కావటంచేత వారు మధురపై దండెత్తి వృష్ణిభోజాంధకవీరులను యుద్ధాలతో పీడిస్తుండేవారు. ఈ ఉపద్రవంనుండి తప్పించుకొనటానికి శ్రీకృష్ణాదులు ఒక చిన్న మోసం చేశారు. హంసడిభకు లిద్దరూ ఒకరిని వదలి మరొకరు బ్రతకలేనివారు. అందువలన హంసుడు యుద్ధంలో చనిపోయా డని డిభకుడికి చెప్పించాడు కృష్ణుడు. ఆ మాటను నమ్మి హంసుడు లేనిలోకంలో తాను జీవించలేనని శోకించి డిభకుడు నీటిలో మునిగి ప్రాణాలు వదిలాడు. డిభకుడు చనిపోయాడని తెలిసిన హంసుడుకూడ తమ్ముడిమీది ప్రేమతో నీటమునిగి అసువులు పోగొట్టుకొన్నాడు. మిత్రుల మరణానంతరం జరాసంధుడు మగధకు తిరిగివెళ్ళిపోయాడు. శ్రీకృష్ణాదులు జరాసంధుడికి భయపడి మధుర సురక్షితప్రాంతం కాదని రైవతకపర్వతంమీద దుర్గాన్ని నిర్మించుకొని అక్కడ ఉండసాగారు. పాండవులు వారికి అండగా నిలిచారు.

జరాసంధుడు ఆవిధంగా విజృంభించి భూతలంమీద ఉన్న రాజుల నందరినీ యుద్ధాలలో ఓడించి, బంధించి తెచ్చి గిరివ్రజపురంలో బందీలుగా ఉంచి ప్రతిరోజూ ఒక్కొక్కరిని భైరవపూజలో బలియిస్తూ ఉగ్రవర్తనుడై వ్యవహరించాడు. కాబట్టి అతడిని చంపితేనే సామ్రాజ్యవైభవం సుస్థిర మౌతుందనీ, రాజసూయం చేయటం సుగమమౌతుందనీ శ్రీకృష్ణుడు ధర్మరాజుకు సలహా చెప్పాడు.

నన్నయ ఈ కథాభాగాన్ని కథాకథనంగా కాకుండా శ్రీకృష్ణుడు చేసిన దీర్ఘసంభాషణగా తీర్చిదిద్దటం నాటకీయత. జరాసంధుడివలన కలిగిన యుద్ధోపద్రవం, హంసడిభకులను చంపటంలో శ్రీకృష్ణుడు చేసిన వంచనశిల్పం ఈ కథాభాగంలో ముఖ్యమైనవి. వంచనను వంచనతోనే వంచాలని శ్రీకృష్ణుడి వ్యూహం. ఆయుధాలచేత చావని శత్రువీరులను ఉపాయంచేతనే వధించాలని అతడి రాజనీతి. జరాసంధుడి వృత్తాంతాన్ని శ్రీకృష్ణుడు సంగ్రహంగా వినిపించి, అతడి వధోపాయాన్ని నిశ్చయించటంతో మొదటిభాగం ముగుస్తుంది ప్రథమాంకంవలె.

ఈ కథలో కాగల కార్య మిది-

ఉ. ''అమ్మగధేశు నుగ్రబలు నాయుధయుద్ధమునన్ జయింపఁగా
నిమ్మహి నోప రెవ్వరు; నుమేశ్వరుఁ డట్టివరమ్ము వానికిన్
నెమ్మిన యిచ్చెఁ; గావున వినీతుఁడు వాయుసుతుండు మల్లయు
ద్ధమ్మున నోర్చు నాతని నుదగ్రమహాభుజశక్తి యేర్పడన్''. **(సభా. 1.162)**

రెండవ అంకంగా భాసించే భాగంలో శ్రీకృష్ణార్జునభీములు గిరివ్రజపురంలో అమార్గాన ప్రవేశించటం, శత్రువులవలె వ్యవహరించటం, గమనిస్తే జరాసంధుడిపట్ల వా రనుసరించిన పద్ధతి గత్యంతరంలేని వంచనగా స్ఫురించటం స్పష్టం. ఆ భాగంలో శ్రీకృష్ణుడు వారివర్తనాన్ని సహేతుకంగా సమర్థించుకొన్నట్లు సంభాషణను చిత్రించటం నన్నయ రూపకరచనాశిల్పం!

అభ్యాగతులవలె శ్రీకృష్ణభీమార్జునులు జరాసంధుడిగృహంలో ప్రవేశించారు. జరాసంధుడు వారికి ఎదురువచ్చి ఆహ్వానించాడు. ఆ తరువాత వారినడుమ జరిగే సంభాషణ ఒక రమణీయ మైన రంగంవలె రాణిస్తుంది. దానిని ఇలా అన్వయించుకొనవచ్చును.

జరా: మీరు నిజంగా స్నాతకులే అయితే, పూలనూ చందనాన్నీ బలవంతాన గ్రహించటం న్యాయమా? చైత్యకాద్రితటాన్ని పగులగొట్టి మీరు చులుకదనంతో అద్వారాన నగరంలో ప్రవేశించటం తగునా? నే నిచ్చిన మధుపర్కాలను గ్రహించకుండట మెందువలన? మీ వేషాలు బ్రాహ్మణులవి, రూపాలు క్షత్రియులవి. మీరు వేషధారులవలె ఉన్నారు. ఎవరు మీరు?

కృష్ణుడు: స్నాతకులు బ్రాహ్మణ క్షత్రియ వైశ్యజాతులలో ఉండటం సనాతనంగా వస్తున్న ఆచారం. మేము క్షత్రియజాతిస్నాతకులం. మిత్రులగృహాన్ని ముఖద్వారంనుండి, శత్రువులగృహాన్ని మారుమార్గంనుండి ప్రవేశించటం క్షత్రియులకు ఉచితం.

గంధపుష్పాలలో లక్ష్మి ఉంటుంది కాబట్టి వాటిని మేము బలాత్కారంగా గ్రహించాం. ఇది క్షత్రియాచారం. నీతో మాకు వేరేపని ఉండటంచేత నీ విచ్చిన అర్ఘ్యాన్నీ మధుపర్కాలనూ గ్రహించలేదు.

జరా: మీరు నాకూ, నేను మీకూ ఎన్నడూ కీడు చేసినదిలేదు. నే నెట్లా మీకు శత్రువు నయ్యాను? నేను పాపరహితుడిని, గుణవంతుడిని. సురమునిబ్రాహ్మణభక్తుడిని, ఉత్తమక్షత్రియకులాచారపరుడిని.

కృష్ణుడు: సమస్తక్షత్రియవంశాలనూ ఉద్ధరించే సమర్థుడైన ధర్మరాజుఆనతిమేరకు క్షత్రియకులాన్ని రక్షించటానికీ, అపజయమెరుగని శత్రువుల అకుంఠితపరాక్రమాన్నిసైతం వమ్ముచేయటానికీ, దుర్మార్గులను దూషించటానికీ మేము ఇక్కడికి వచ్చాం. జరాసంధా! నీ వేమో 'ఉత్తమక్షత్రియుడ' నన్నావు; ఎవ్వరికీ కీడు చేయలే దన్నావు. మరి నీవలె మూర్ధాభిషిక్తులైన రాజులను చెరబట్టి తెచ్చి, క్రూరంగా పశుపతికి బలియిచ్చినవా రెవరైనా ఉన్నారా? ఇంతకు మించిన కీడు మరేదైనా ఉన్నదా? కారణం లేకుండా సాధుజనులను హింసించే దుర్మార్గుడు అందరికీ శత్రువేకదా! ఉత్తములకు ఇంతకంటె కారణం మరొకటి కావాలా? ఏ తప్పూ చేయని తనకులంవారిని చంపటంకంటె మహాపాపం మరేమైనా ఉన్నదా? నీవంటి పాపకర్ముడిని ఉపేక్షిస్తే ధర్మరక్షకులమైన మాకుకూడా ఆ పాపం అంటుతుంది. కాబట్టి అటువంటి పాపభయంతో నిన్ను దండించటానికి వచ్చాం. నన్ను మించినవాడు లే డని విర్రవీగి ఇతరులను అవమానించవద్దు. పూర్వం జయద్రథ, దంభోద్భవ, కార్తవీర్యులు మహాబలవంతు లైనప్పటికీ అవినీతులై, మహాత్ములకు అవమానంచేసినవారై ఇతరులచేత పరాజితులైనారు. అపారపరాక్రమంతో రణయజ్ఞాలు చేసి, శత్రువులను సంహరించిన వీరులు మహాతపస్వులు పోయే సద్గతి పొందుతారు. కాని, నీవలె అపకారదారుణకార్య మైన భైరవపూజ చేసేవాడికి ఉత్తమగతు లుంటాయా? కాబట్టి, నీవు చెడకుండా ఉండాలంటే నేను చెప్పేమాట చేయుము. నీవు బంధించిన రాజుల నందరినీ విడిపించుము; నేను కృష్ణుడను, ఇతడు భీముడు, అతడు అర్జునుడు, నీవలన పుట్టిన ఈ పాపమనే మహాగ్నిని చల్లార్చటానికి వచ్చిన పరాక్రమవంతులు. కురువంశశ్రేష్ఠులు వీరు. నీవు క్రూరుడవై ఇప్పటికీ ఆ రాజులను విడువకపోతే, ఈ పాండవేయులు నిన్ను యుద్ధంలో ఓడించి వారిని విడిపిస్తారు.

జరా: (కోపంతో కనుబొమలు ముడిచి) అపారపరాక్రమంతో రాజుల నోడించి గర్వించటం క్షత్రియులకు ధర్మమే అవుతుంది. కానీ, దోష మెట్లా అవుతుంది? నే నెప్పుడూ పరాక్రమమే జీవితవ్రతంగా కలవాడిని. భైరవపూజకొరకే తెచ్చిన ఈ రాజులను నే నెందుకు వదలుతాను? నేను పరాక్రమంచేత శత్రువులను జయించినవాడిని. కృష్ణా! నా సంగతి నీ కిదివరకే తెలుసు. నేను వేరే చెప్పనవసరం లేదు. మీతో యుద్ధమే చేయవలసివస్తే- మీ కిష్టమైన పద్ధతిలోనే చేస్తాను. సైన్యంతో నైనా సరే, మీ ముగ్గురితో కానీ, ఇద్దరితో కానీ, ఒక్కరితో కానీ నే నొక్కడినే అసహాయశూరుడనై పోరాడుతాను. మీరూ ప్రయత్నించండి. మీ యిష్టం చెప్పండి.

జరా: ఒక్కరితో పలువురు యుద్ధం చేయటం న్యాయం కాదు. మేము ముగ్గురమూ బలవంతులమే. మాలో ఒక మహాబలుడిని ఎన్నుకొమ్ము. అతడితో మల్లయుద్ధంలో తలపడుము.

జరా: భీముడే యుద్ధంలో నాకు దీటైనవాడు.

ఈ ఘట్టం రంగంమీద ప్రయోగింపబడుతున్న అంకంవలె ఉన్నది. స్నాతకులుగా, మార్గంగాని మార్గంలో ఉద్ధతు లై ప్రవేశించి, మాల్యసుగంధాలను హరించి, అర్ఘ్యాన్ని తిరస్కరించిన శ్రీకృష్ణభీమార్జునులవృత్తం ఉపాయంతో (కపటంతో) చంపటానికి చేసిన ప్రయత్నాల ప్రదర్శనమే. దానిని క్షత్రియోచితవర్తనంగా సమర్థించుకొనటం శ్రీకృష్ణుడిచాతుర్యం. మూర్ధాభిషిక్తులను చెరపట్టటం దోషంకాదు కానీ, వారిని భైరవుడికి బలియివ్వటం అన్యాయ మన్నాడు కృష్ణుడు. వారిని విడిపించటమే ధర్మరాజు కర్తవ్యమనీ, అది ధర్మవ్రతమనీ చెప్పాడు. క్రూరుడిని చంపటానికి ధర్మచ్ఛన్నమైన కాపట్యం న్యాయమని శ్రీకృష్ణుడి మతం. అది నిఖిలరాజబలివధ అనే ఉపద్రవాన్ని తొలగించటానికి ఏర్పరచుకొన్న ఉపాయమని శ్రీకృష్ణుని వ్యాఖ్య. ఇటువంటి వస్తువు కపటచర్యలనూ, ఉపద్రవాలనూ చిత్రించే స్వభావంగల సమవకారానికి సరైన దని

నన్నయ భావించి, ఈ ఘట్టాన్ని రెండవఅంకంవలె సంభాషణచతురంగా. వాదోపవాదతుల్యంగా చిత్రించి నాటకీయతను రక్తికట్టించాడు.

సమవకారంలో విశేషవృత్తాలు వాడాలనే నియమం ఉన్నది. నన్నయ ఈ అంశంలోకూడా శ్రద్ధతీసికొన్నాడు. శ్రీకృష్ణుడు జరాసంధుడిని ధిక్కరిస్తూ భైరవపూజలో రాజులను బలిచేయటం దారుణ మని నిందించటం, ఆ రాజులను వదలిపెట్టు మని ధట్టించటం, వదలిపెట్టకపోతే అతడి పరాక్రమాగ్నిని ఆర్పటం తథ్యమని హెచ్చరించటం, భీమార్జునులనూ తననూ బహిర్గతం చేసికొనటం అనే అంశాలను తెలిపే సంభాషణలు ఈ ఘట్టంలో కీలకా లైనవి. కథావృత్తంలో కేంద్రబిందువులవంటివి. జరాసంధవధను సమర్థించుకొనే సారధర్మసూక్తులవంటివి. ఇంతటి ప్రాధాన్యం కలిగిన శ్రీకృష్ణుడివాక్యాలను రెండు తరలవృత్తాలలో రచించటం నన్నయవిశేషచ్ఛందశ్శిల్పం. పఠితలమనస్సులు ఈ వృత్తాలవైపు ఆకర్షితాలై కథాప్రాణాన్ని గుర్తించేటట్లు చేశాడు నన్నయ.

విశేషవృత్తాలను సందర్భోచితంగా వాడటం, నాటకీయశిల్పానికి అనుగుణంగా అమర్చటం ఛందశ్శిల్పంలో ఒక నేర్పు. సామాన్యవృత్తాలనుకూడా విశేషంగా వాడటం మరొకనేర్పు. జరాసంధవధఘట్టంలో మత్తేభవృత్తాన్ని రెండుచోట్లమాత్రమే వాడాడు నన్నయ. ఒకటి భీమజరాసంధులు మల్లయుద్ధంలో పెనగిన సన్నివేశం చెప్పేది. (సభా. 1.203). మదించిన ఏనుగులు కుమ్ములాడినట్లుంటుంది ఆ మత్తేభం. అందుకే అది సార్థకం. జరాసంధవధానంతరం భీముడు ఇంద్రప్రస్థపురంలో ప్రవేశించినప్పుడు ప్రజ లాతనిని ప్రశంసిస్తూ, ధర్మజరాజ్య ప్రతిష్ఠాపనాచార్యుడివలె భావించిన పద్యంకూడా మత్తేభమే. (సభా. 1.219). మొదటిపద్యంలో భీమజరాసంధులు రెండు మత్తేభాలవలె పోరాడారనీ, చివరకు వీరమత్తేభంవంటి భీముడే విజయాన్ని సాధించి సాటిలేనిమత్తేభంగా మిగిలాడనీ వృత్తధ్వని సాధించాడు నన్నయ. ఇది భారతరచనాశిల్పంలో భాగమే కాకుండా సమవకారరచనాశిల్పమర్మంకూడా కావటం నన్నయనాటకీయతకు నిదర్శనం!

మూడవరంగం యుద్ధకార్యప్రదర్శన ప్రధానమైనది. ఆ ఘట్టంలోని నడిమిభాగంలో శ్రీకృష్ణుడిప్రబోధాన్ని సంభాషణగా ఒకపద్యంలో నిలపటం నన్నయ రచనాశిల్పం. ఈ యుద్ధచక్రానికి ఆ సంభాషణ ఇరుసు. దాని తాత్పర్యమంతా ఆ పిలుపులో ధ్వనిస్తుంది.

చ. ''విరహితసత్త్వుఁ డయ్యెఁ బ్రతివీరుఁడు వీని నశేషధారుణీ
శ్వరనికరాపరాధు నతిసాహసికున్ వధియించి నీభుజ
స్థిరత యెలర్ప నయ్యనిలదేవుబలంబును నీబలంబు భా
సురముగ మాకుఁ జూపుము విశుద్ధయశోనిధి! మారుతాత్మజా!''. **(సభా. 1.208)**

ఈ పద్యం రూపకప్రక్రియలో చూళిక వంటిది. తెరలోపలి పాత్రతో యుద్ధాదుల సూచనలు చేయటం దీనిస్వభావం. దీని విస్తరణమే మిగిలిన రంగవస్తువర్ణనం. జరాసంధవధ లోకధర్మన్యాయంగానే కాక, నాటకీయధర్మన్యాయంగాకూడా నిరూపించటం ఈ పద్యతాత్పర్యం. అంతేకాదు. శ్రవ్య దృశ్య కావ్య ప్రక్రియల విశిష్టయోజనం- ప్రసన్నకథాకలితార్థయుక్తిలో భాగంగా నన్నయ దీనిని ప్రదర్శించాడు.

ప్రజలు చేసే భీమప్రశంస భరతవాక్యంవలె ప్రకాశింపచేయటం మరొక రూపకశిల్పం!

మ. ''జనసంత్రాసకరున్ మహోద్ధతు జరాసంధున్ హరిప్రేరణం
బున భంజించెఁ బ్రభంజనాత్మజుఁడు భూభుగ్వీరులం దన్నిరో
ధననిర్ముక్తులఁ జేసె నింకఁ జతురంతక్షోణికిన్ ధర్మనం
దనుసామ్రాజ్యము పూజ్యమయ్యె నని మోదం బంది రుర్వీజనుల్''. **(సభా. 1. 219)**

'సర్వేజనా స్సుఖినో భవంతు' అనే అర్థాన్ని ధ్వనింపచేశాడు 'మోదంబంది రుర్వీజనుల్' అనే చివరివాక్యంలో పరోక్షంగా నన్నయ.

కథారచనలో నాటకీయతను సూచించే కొన్ని పారిభాషికపదాలను తగిన సందర్భాలలో వాడటం నన్నయ పాటించే ఒక మర్యాద. కథారంభంలో 'ఆరంభము' (సభా.1.123) 'కార్యంబు నిర్వహింతుము' (1-126) అనే పదాలూ, అద్భుతంగా ముగిసే నిర్వహణంలో ప్రజల 'ఆశ్చర్యము' (1.221)ను సూచించటం ఇందుకు నిదర్శం. ఆ యా సందర్భాలలో భావానుభావవ్యంజక శబ్దాలను వాడటంకూడ గమనించవచ్చును. ఉదాహరణకు- 'నిర్వేదించి' (1.137), భక్తి-(1.139), భయానకము (1.205) ఆహవహర్షము (1.204) మొదలైనవి. నన్నయ చతుర్విధాభినయాలలో ఆంగికానికీ, వాచికానికీ మాత్రమే ఎక్కువ ప్రాధాన్య మిస్తాడు. ఆహార్యసాత్త్వికాభినయాలను క్వాచిత్కంగా వర్ణిస్తాడు. నన్నయగారు వదలిన ఆ రెండు అభినయాలను గూడా తిక్కన కళాపూర్ణంగా కవితలో పోషించాడు.

నన్నయఆంగికాభినయవర్ణనానికి ఒక మచ్చుతునక:

ఆ. ''బలియుఁ డపుడు వెండ్రుకలు పాచి ముడిచి గం
టెసఁగఁ దాల్చి వీరరసికవృత్తి
నుద్ధతుండు మల్లయుద్ధప్రసాధనం
బమర నిలిచె వేడ్క నమితబలుఁడు''. **(సభా. 1.201)**

వాచికాభినయప్రదర్శనకు-

క. ''అమితపరాక్రమమున నా
క్రమించి పరనృపుల నోర్చి గర్వించుట దో
సమె యిది సత్క్షత్త్రియధ
ర్మమ; యే నెప్పుడుఁ బరాక్రమవ్రతుఁడ నిలన్!''. **(సభా. 1.196)**

అలంకారంచేత యుద్ధాదులలో వీరప్రతివీరుల తారతమ్యాన్ని ధ్వనింపచేయటానికి ఉదాహరణం:

చ. ''అతులబలుల్ పరస్పరజయార్థులు పార్థివపుంగవుల్ మరు
త్సుతమగధేశ్వరుల్ సమరశూరులు దారుణలీలఁ బోరి రూ
ర్జితభుజదర్ప మేర్పడఁగ సింహగజేంద్రములట్లు వజ్రప
ర్వతములయట్లు ఘోరతరవాసవవృత్రులయట్లు నిద్ధఱున్.'' **(సభా. 1.206)**

ఈ వర్ణనంలో మూడు ఉపమానా లున్నాయి. అతులబలుల్- అనే విశేషణానికి సాటిలేని బలం కలవారనీ, సమానం కాని బలం కలవారనీ రెండర్థాలు స్ఫురిస్తాయి. వారు పరస్పరజయార్థులై ఒకరిపై ఒకరు మించాలని వ్యూహాలు వేసికొంటూ మల్లయుద్ధం సాగించారు. కొంతసేపు మొదట్లో సింహగజేంద్రాలుగా అనిపించారు. ఇందులో క్రమాలంకారాన్ని అన్వయించుకోవాలి. భీముడు సింహంవలె, జరాసంధుడు గజేంద్రుడివలె కనిపించారు. అంటే మొదట భీముడిదే పైచేయి. ఆ తరువాత ఇద్దరూ వజ్రపర్వతాలవలె పోరారు కొంతకాలం. అందులో ఇరువురూ తుల్యబలాలను ప్రదర్శించారు. ఇక చివరకు- వా రిద్దరూ వాసవవృత్రాసురులవలె పోరారు. ఈ ఉపమానంవలన భీమవిజయం, జరాసంధమృతి ధ్వనించబడుతున్నది. యుద్ధవీరం పోషించబడే వస్తువును అలంకారంచేత ధ్వనింపజేయటం నన్నయ శిల్పం. ఈ అవస్థల వర్ణనం ఎంత శ్రవ్యకావ్యసుందరమో అంతటి దృశ్యకావ్యరమ్యం!

నానారసా(భావా)శ్రయంగా ఉండటం సమవకారంలో కానవచ్చే మరొక సార్థకలక్షణం. నన్నయ ఈ ఘట్టాన్ని నానారసభావబంధురంగా మలచాడు. ధర్మజ భీమార్జునులలో శ్రీకృష్ణుడిలో ఉత్సాహం, క్రోధం, బృహద్రథుడిలో నిర్వేదం,

హర్షం, భక్తి, పుత్రోత్సాహం, బృహద్రథుడి భార్యలలో భయం, లజ్జ, ఆశ్చర్యం, హర్షం, జరాసంధుడిలో ఉత్సాహ, క్రోధ, భక్తిభావాలు, భీమజరాసంధులలో రౌద్రోద్రేకం, ఉత్సాహశీలం, ప్రజలలో ఆశ్చర్యం- ఇవన్నీ స్పష్టంగా ప్రకటితమయ్యేటట్లు నన్నయ రచించాడు.

ఆదిసభారణ్యపర్వాలలో భీముడు చంపిన వీరులలో సర్వోత్తముడైన ధీరోద్ధతుడు జరాసంధుడు. భీమపరాక్రమ ప్రదర్శకాలైన వీరఘట్టాలు సమవకారాలుగా గోచరిస్తాయి. కాని, వాటన్నిటిలో జరాసంధవధ సమగ్రసుందరంగా సాక్షాత్కరించింది. దానికి కారణం నన్నయనాటకీయరచనారామణీయకత్వప్రసన్నతయే!

భీముడు రాక్షసులను వధించిన ఘట్టాలు ఆదిపర్వంలో రెండు, అరణ్యపర్వంలో రెండు ఉన్నాయి. అవి హిడింబాసురవధ (ఆది. 6.185-227), బకాసురవధ (ఆది. 6.237-309), కిమ్మీరవధ (అర.1.107-121), జటాసురవధ. (అర. 3.380-397) వీటిని నన్నయ తీర్చిదిద్దినపద్ధతి గమనిస్తే ఈ అంశాలు వ్యక్త మౌతున్నాయి.

1. ఆదిపర్వంలోని ఘట్టాలలో నాటకీయతను పాటించిన నన్నయ అరణ్యపర్వంలోని ఘట్టాలను కథాఘట్టాలుగానే చిత్రించాడు. అవి ఆఖ్యానంలోని భాగాలే కాబట్టి ఉపాఖ్యానా లనటానికి వీలులేదు.
2. హిడింబాసురవధఘట్టంలో భీమాశ్రిత మైన యుద్ధవీరానికి శృంగారం అంగంగా నిలిచింది.
3. బకాసురవధఘట్టంలో భీమాశ్రితయుద్ధవీరానికి, దయాధర్మవీరాలూ, కరుణరసం రౌద్రరసం పోషకాలుగా నిలిచాయి.
4. వస్తుస్వభావాలనుబట్టి హిడింబాసురవధఘట్టం లలితం ఉజ్జ్వలం. బకాసురుడిని లోకహితార్థం చంపాడు. ఆ ఘట్టాలను నాటకీయతతో చిత్రించటంలోకూడ మొదటిదానికంటె రెండవది ఉత్తమం.
5. హిడింబాసురుడిని స్వీయరక్షణంకొరకు చంపాడు భీముడు; బకాసురుడిని లోకహితార్థం చంపాడు. ఆ ఘట్టాలను నాటకీయతతో చిత్రించటంలోకూడ మొదటిదానికంటె రెండవది ఉత్తమం.
6. హిడింబ, బకాసురవధలు మూడురంగాలుగా విభజించబడటానికి అనువైన కథలు. అందుకే సమవకారస్వభావం వాటిలో కుదిరింది.

హిడింబాసురవధ - పాక్షికసమవకారం

లాక్షాగృహదహనానంతరం పాండవులు దుర్గమారణ్యంలో తలదాచుకొంటూ ఒక మర్రిచెట్టుక్రింద విశ్రాంతితీసికొంటున్న దృశ్యంతో ఈ కథ మొదలౌతుంది. ధర్మార్జున నకులసహదేవులు, కుంతీదేవి శ్రమవలన ఒడలుతెలియకుండా చెట్టుక్రింద నిద్రపోతుంటారు. రాత్రివేళ రాక్షసాదుల బాధ కలుగకుండ భీముడు జాగరణచేస్తూ వారిని రక్షిస్తూ ఉంటాడు. వారి దైన్యాన్ని చూచి ఖిన్ను డౌతాడు, దుర్యోధనధృతరాష్ట్రులు చేసిన కాపట్యానికి చింతిస్తూ ఉంటాడు. ఆ సన్నివేశం ఒక రూపకంలోని రంగంలాగా శోభించింది.

ఆ ప్రక్కనే ఉన్నది లేతమద్దిచెట్లతోపు. అందులో ఉంటాడు హిడింబు డనే భయంకర రాక్షసుడు. మానవమాంసభక్షకుడు. అతడితో కలసి ఉంటున్నదిఅతడి చెల్లెలు హిడింబ. ఆమెకు వయసు వచ్చింది. మనసు పండింది. అన్న గడిపే భయంకరజీవయాత్ర ఆమెకు గిట్టదు. అయినా అగ్రజుడి ఆనతిని పాటించక తప్పదని కాలంగడుపుతున్నది. ఆమె సంస్కారవతి. ఆమెకు వివాహంచేసి ఒక ఇంటిదాన్ని చేయాలన్న స్పృహ హిడింబుడికి లేదు. తినటం, చెల్లెలిని వేధించుకొని తినటం తప్ప అతడికి మరొక ధ్యాస లేదు. అంతరాంతరాలలో ఆమె తన జీవితమాధుర్యాన్నిగురించి ఎన్నో ఆశలు పెట్టుకొని కలలు కంటున్నది. పాండవులు ఆ అడవిలో ప్రవేశించి వంటింట్లోకి చొరబడిన కుందేళ్ళవలె హిడింబుడికంటపడ్డారు. ఆ రాక్షసుడు హిడింబను పిలిచి 'వారిని తెచ్చి వారి మాంసాలు వండి వడ్డించు' మని ఆజ్ఞాపించాడు. అన్నఆజ్ఞ హిడింబకు యముడిఆజ్ఞయే. ఆమె భీము డున్నచోటకి వచ్చింది - అంటే భీముడున్న రంగంలోకి హిడింబ ప్రవేశించింది.

దూరంగా ఉండి భీముడిని చూచింది. అపూర్వం అతని ఆకారం. అతడి కన్నులు జాగృతాలై విప్పారి ఉన్నాయి వికసించిన పద్మాలవలె. విశాలమైన వక్షఃస్థలం, సింహంనడుమువంటి నడుము, వజ్రాయుధాలవలె ఉన్న స్థిరమైన బాహువులు, మహావీరుడు, అన్నింటికంటె మించి మన్మథాకారుడు. అతడిని చూడగానే మనస్సు చలించింది. ఒకవృక్షం చాటున అట్లాగే నిలువబడి కొంతసేపు కన్నార్పకుండా చూచింది. ఆమెకు తెలియకుండానే హృదయంలో మదనాగ్నివేదన మొదలైనది. ఆమెమనసులో తనను తాను భీముడికి సమర్పించుకొన్నది. ఆమె కామరూపధర కాబట్టి మనోజ్ఞమైన మానవస్త్రీరూపం తాల్చింది. పూచినతీగ నడచివచ్చినట్లు ఉన్నతమైనవక్షోజాలు ఉప్పొంగగా బహురత్నశోభితాలంకారాలతో భీముడిని సమీపించింది. అన్నగారిస్పృహయే లేదు. పవనతనయుడే తన సర్వస్వ మనుకొని మైమరచి నిలిచింది. ఆమెకు రాగోదయ మయింది.

ఆ రాత్రిసమయంలో ఒంటరిగా వచ్చిన ఆ వనితను అనుమానంతో గ్రుచ్చిగ్రుచ్చి అడిగాడు అనిలతనయుడు. ఆమె ఉన్నమాట, అన్నమాట అన్నీ చెప్పింది. మనసులో ఉన్నమాటకూడా మనవిచేసికొన్నది.

క. ''నాకుఁ బతివయిన, నిన్నుం
జేకొని మా యన్న యెగ్గుసేయక కాచున్;
నాకు మఱి నీవ పతివి గు
ణాకర! యిజ్జన్మమున మహాస్నేహమునన్''. **(సభా. 6.194)**

అని జన్మజన్మల అనుబంధంగా తనలో కలిగిన అనురాగభావోదయాన్ని గుర్తించి వ్యాఖ్యానించి చెప్పింది. హిడింబు డున్న వనంలో ప్రవేశించటం యముడిగొంతులో దూరటంవంటిదని హెచ్చరించింది. తనను ప్రేమిస్తే భీముడిని హిడింబుడు చంపకుండ ఉంటాడని ఉపాయం సూచించింది. నిద్రపోతున్న ధర్మజాదులను రక్షించవలెనని భీముడి కోరికైతే తాను వారిని కాపాడుతానని మాటయిచ్చింది. అన్నబారిన పడకుండా భీముడిని దక్కించుకొందామని తాపత్రయపడుతూ భీముడికి రక్షణోపాయాలు చెప్పి తన అనురాగాన్ని వ్యక్తంచేసింది.

భీముడు మహాబలశాలి, మహాభిమాని. ఒక రాక్షసుడికి భయపడి తాను, తనవారిని నిద్రలేపి వారిని 'మీకు మీరే రక్షించుకొనం' డని ప్రబోధించాలనే సూచన భీముడికి కోపం తెప్పించింది. హుంకరించి ఇట్లా అన్నాడు హిడింబతో.

ఉ. ''క్రచ్చఱ నొక్క రక్కసుఁడ కాఁడు సురాసురు లెల్ల నొక్కటై
వచ్చిన నీవ చూడఁగ నవార్యబలోన్నతిఁ జేసి వారలన్
వ్రచ్చి వధింతుఁగాక! యిటు వచ్చి శ్రమంపడి యున్న నిచ్చట
న్మెచ్చగు వీరి దైన సుఖనిద్రకు భంగము సేయ నేర్తునే?'' **(సభా. 6.200)**

హిడింబాసురుడిని రమ్మని చెప్పుమని విజృంభించాడు.

భీముడి భీషణసుందరమైన వీరమూర్తిని చూచింది హిడింబ. హిడింబుడికి ఎదురుగా నిలబడి గర్జించగల సింహం ఆమె కంతవరకు కనపడలేదు. అటువంటి మహావీరు డుంటా డని ఆమె కలకూడా కనలేదు. అటువంటి అనంతశక్తియుతుడు మన్మథాకారుడై తనమనసు దోచుకొని ముందు నిలువబడ్డాడు. ఆమె నిలువెల్లా పులకించింది.

ఇక ఆమె జీవితానికి కావలసింది హిడింబుడా? భీమసేనుడా?- సోదరుడా? మనోహరుడా? ఆమె అంతరంగం అరక్షణం సంక్షోభం చెందింది. వాయుతనయుడే తన ప్రాణనాథు డనుకొన్నది. చచ్చినా బ్రతికినా ఆతడే శరణ్యమని నిశ్చయించుకొన్నది.

ప్రళయకాలమేఘంవలె గర్జిస్తూ, మెరుపులవంటి కోరలు మెరుస్తూ ఉండగా అగ్నికుండాలవలె కన్నులు మండుతూ ఉండగా యముడివలె హిడింబుడు రంగంలో ప్రవేశించాడు. తనమాట కాదని మనుషులతో కూడి మసలుతున్నందుకు

చెల్లెలిని గద్దించాడు. ఆగ్రహించిన అన్న ప్రాణం తీస్తాడన్న భయంతో హిడింబ భీముడిచాటుకు పోయి నిలబడింది. భీముడు ఆమెను ప్రసన్నంగా చూచాడు. అన్నబలాన్ని అంతగా పొగడిన అబల తనఅండ చేరటం భీముడికి ఆత్మాభిమానం పెంచింది. "నన్నూ మీఅన్ననూ చూస్తూ ఇక్కడే ఉండుము" అని ధీమాగా పలికి ముందుకు సాగాడు భీముడు.

హిడింబాసురుడు భీముడిని సమీపించాడు. ఒకవైపు అన్నదమ్ములూ తల్లీ నిద్రపోతున్నారు. వారికి నిద్రాభంగం కలుగకూడదు. మరొకవైపు మహారాక్షసుడు యుద్ధానికి వస్తున్నాడు. భీముడు మేనుపెంచి హిడింబుడిభుజం పట్టుకొని సింహం నోటకరచుకొన్న మృగాన్ని లాగి తీసికొనిపోయినట్లు ఎనిమిదిధనువులదూరం లాగికొని పోయాడు.

రంగంప్రక్కనే మరోరంగం మొదలైనది. ఇప్పు డసలురంగ మిది. భీమహిడింబాసురులు ముష్టియుద్ధం ఘోరంగా చేస్తున్నారు. చప్పుడు లౌతున్నా ధర్మరాజాదుల నిద్ర భగ్నం కాలేదు. ఒకసారి హిడింబుడు భీముడిని బాహువులతో బిగియబట్టి పెద్దగా అరిచాడు విజయగర్వంతో. ఆ చప్పుడుకు ధర్మరాజాదులు నిద్రలేచారు. ఎదుట మానవాకారంలో ఉన్న హిడింబను చూచారు. అబ్బురపాటుతో ఆమెను 'నీ వెవ' రని అడిగారు. ఆమె తనసంగతంగా పూసగ్రుచ్చినట్లు చెప్పింది. కుంతిచెంత చేరి ఆత్మీయతను కలుపుకొన్నది. 'మీ కొడుకు ఆ రాక్షసుడిని అవలీలగా చంపి, నన్నూ మిమ్మల్నీ రక్షిస్తాడు చూడండి' అని భీముడు యుద్ధంచేస్తున్న స్థలాన్ని చూపించింది. అక్కడికి అర్జునుడు హుటాహుటిగా వెళ్ళాడు. తెల్లవారకపూర్వమే రాక్షసుడిని చంపు మని భీముడిని హెచ్చరించాడు. భీముడు హిడింబుడి కడకాలు పట్టుకొని గాలిలో నూరుసార్లు త్రిప్పాడు. అతడి ముక్కునా నోటా రక్తం కాలువలు కట్టింది. హిడింబుడిని నేలమీద వేసి కొట్టి వెన్నుముక విరిచి విసిరివేశాడు. ఆ చిత్రవధతో హిడింబుడు చచ్చాడు.

హిడింబ కుంతికి ధర్మరాజుకు నమస్కరించింది. తననుగురించి దాపరికం లేకుండా చెప్పింది. భీముడిమీది వలపు ప్రాణంకంటె లోతైన దని తెలిపింది. తన కున్న శక్తులనుగురించి ఎరిగించింది. భవిష్యత్తులో జరుగబోయే సంగతులను ముందే తెలియచెప్పింది. ఆమె రాక్షసిగా పుట్టినా సాత్త్వికచైతన్యం గల సాధ్వి అని కుంతి గుర్తించింది. ధర్మరాజు ఆమె దివ్యవనిత అని పసికట్టాడు. (ఆ తరువాత వ్యాసుడు ఆమెను కమలపాలికగా గుర్తిస్తాడు). ఆమెను కపటిగా భావించి తిరస్కరించిన భీముడికి నచ్చచెప్పి హిడింబను వివాహమాడటానికి అంగీకరింపజేశారు కుంతీధర్మజులు. హిడింబకు బుద్ధులు చెప్పి భీముడిమనసుకు నచ్చేటట్లు మసలుకొమ్మని కోరింది కుంతీదేవి. పుత్రుడు పుట్టేంతవరకు హిడింబతో ఉండటానికి భీము డంగీకరించాడు. హిడింబాసురవధ హిడింబ వివాహంతో సుఖాంత మయింది.

కథలో సహజంగా మూడురంగా లున్నాయి. మానవమాంసం తినే రాక్షసులను హతమార్చాలన్నది పాండవవ్రతం. వారివలన కలిగే అవరోధాలనుండి ఋషులను, సాధుజనులను రక్షించాలని వారి దీక్ష. అందులో భాగంగా సాగింది హిడింబాసురవధ. ఆత్మరక్షణ సన్నిహితలక్ష్యమైనా, సాధురక్షణ పాండవుల జీవితలక్ష్యం. అందువలన సమవకారబీజం కొంతవరకు సార్థకమౌతున్నది.

హిడింబాసురవధ యుద్ధప్రధానం కావటంచేత క్రియాప్రధానమైనది. రంగంమీద యుద్ధం ప్రదర్శనయోగ్యం కాదు కాబట్టి ఆ సందర్భాలలో నాటకీయత తక్కువ. ఇకపోగా, మిగిలిన ఘట్టాలలో పాత్రల సంభాషణలు, చర్యలు రంగపరికల్పన సామగ్రులై సొంపు నింపుతాయి. ఇందులో హిడింబ కేంద్రబిందువు, హిడింబుడి వైపునుండి చూస్తే హిడింబ ఆడింది కపటనాటకం. అన్నయందున్న దోషాన్ని ఎంచి అన్నను మోసంచేసింది. కాని, ఆమె ఆత్మవంచన చేసుకొనలేదు, ప్రేమవంచన చేయలేదు. ధర్మశృంగారం ప్రధానమైన ఈ ఘట్టంలో హిడింబుడివలన కలిగే ఉపద్రవం చర్చించబడుతుంది. దానిని నివారించగలిగిన ధీరుడు వీరుడు భీముడై నిలవటంతో - కార్యదక్షుడైన నాయకుడు భీముడైనాడు. అతనివెంట నిలిచినవారు ధర్మజాదులు మరి నల్గురైనారు నాయకులు.

సమవకారస్వభావం కల ఈ ఘట్టంలో ఆ రూపకనిర్మాణస్వరూపస్వభావాలను పఠితలకు ప్రసన్నంచేస్తూనే కథాకథనానికి నాటకీయతను పోషకంగా నిలిపిన రచనాశిల్పం కనపడుతుంది. వాగ్యుద్ధం సగానికి పైగా సాగిన జరాసంధవధ సమగ్ర సమవకారంగా భాసిస్తే, హిడింబాసురవధ పాక్షికసమవకారంగా పరిఢవిల్లింది.

బకాసురవధ - సలక్షణసమవకారం

హిడింబాసురవధలోకంటె బకాసురవధఘట్టంలో నాటకీయత ఎక్కువగా కనపడుతుంది. లక్షణాన్ని ముందుపెట్టుకొని వ్రాసినట్లుకూడా అనిపిస్తుంది. బ్రాహ్మణుడిఇంటిలో సాగిన సన్నివేశం మొదటిరంగం. అది కరుణరసనిర్భరం. కుంతియింట జరిగిన సన్నివేశం దయాధర్మవీరపోషకం. భీముడు బకాసురుడిని చంపినరంగం యుద్ధవీరాద్భుతం. భీముడిది వంచనగా అనిపించటం సమవకారస్వభావం. అది ఆభాస నిజానికి. ఇది సంభాషణ బహుళం కావటంచేత నాటకీయతతో రక్తికట్టింది. ఇందులో రాక్షసకృత ఉపద్రవం చర్చనీయాంశం. భూదేవహితార్థం రాక్షససంహారం కార్యం. రచనలో తరువోజ, మధ్యాక్కర, తరలం అనే విశేషవృత్తాలు వాడబడిఉన్నాయి. కరుణ, వీర, రౌద్రాద్భుతహాస్యాదిరసబాహుళ్యం ఇందులో తరళసుందరంగా పోషించబడింది. ఈ ఘట్టంలోని నాటకీయతను, సమవకారస్వభావాన్నీ సహృదయులు సులభంగా గ్రహించగలిగేటట్లుగా నన్నయ రచించటంవలన బకాసురవధ సలక్షణసమవకారం అనవచ్చును.

నన్నయగారిరచనలో నాటకీయతను సూక్ష్మంగా పరిశీలిస్తే సమవకారరూపకాన్ని కథలో ఇమడ్చటంలో ఉత్తమప్రయోగం జరాసంధవధ, మధ్యమస్థానీయం బకాసురవధ. చివరకు పేర్కొనతగింది హిడింబాసురవధ. ఈ వరుసను నిజానికి తిరుగబెట్టి గమనించాలి. అప్పుడు నన్నయ నాటకీయతలో కలిగిన పరిణామక్రమంకూడ స్పష్టమౌతుంది. హిడింబాసురవధ పాక్షిక సమవకారం, బకాసురవధ సలక్షణ సమవకారం, జరాసంధవధ సమగ్రసమవకారం.

ద్యూతసభ - డిమప్రయోగం

సభాపర్వంలో అత్యంతసంఘర్షణాత్మక మైన సన్నివేశం మాయాద్యూతం. అది మహాభారత కథాచక్రానికే ఇరుసు. దానిలో సహజంగా డిమమనే రూపకంలో కానవచ్చే లక్షణాలు ప్రతిఫలిస్తున్నాయి. వాటిని నన్నయ గమనించి పోషించి నాటకీయతలో మరొక నాణ్యమైన శిల్పమర్యాదను ప్రపంచించాడు.

''డిమతే ఇతి డిమః''- అంటే ఉద్ధతనాయకులు, వారి ఆత్మవ్యాపారం ఎక్కడ ఉంటుందో దానిని డిమ మంటారు. 'డిమ్' అనే ధాతువుకు గాయపరచటం అనే అర్థాన్ని ధనికుడు చెప్పాడు. ఇతరులను బాధపెట్టటం, గాయపరచటం ఉద్ధతుల సహజస్వభావం. అది తేట తెల్లమయ్యేటట్లు ప్రయోగించబడేది డిమమని భావం. డిమానికి విద్రవ మనే పేరుకూడా ఉన్నది. విద్రవం (ఉపద్రవం)తో కూడుకొన్నదని దాని అర్థం. (నాట్యశాస్త్రము.పు. 525). భరతనాట్యశాస్త్రంలో డిమం లక్షణాలు స్థూలంగా ఇట్లా ఉన్నాయి- డిమంలో నాయకుడు ప్రఖ్యాతుడు, ఉదాత్తుడూ అయి ఉండాలి. నాలుగు అంకా లుండాలి. శృంగారహాస్యాలు తప్ప మిగిలిన ఆరురసాలూ పోషించబడాలి. కావ్యవస్తువు దీప్తరసమై, నానాభావోపసంపన్నమై ఉండాలి. నిర్ఘాత-ఉల్కాపాత- సూర్యేందు గ్రహణాలు, యుద్ధ-నియుద్ధ-ఆధర్షణ, సంఫేటాలు ఇందులో ప్రయుక్తం కావాలి. అంతేకాక, మాయ, ఇంద్రజాలం, నానావిధాలైన పుస్తాలు ఉండాలి. దేవ, భుజగేంద్ర, రాక్షస, యక్ష, పిశాచుల చరిత్రలుకూడా ఉండవచ్చును. సాత్త్వతి, ఆరభటి వృత్తులతో రచన సంపన్నంకావాలి. నాయకులు 16 మందివరకు ఉండవచ్చును. ఇవన్నీ దాదాపుగా సభాపర్వంలోని ద్యూతసభాఘట్టాలలో ద్యోతకమౌతూ ఉన్నాయి.

ఈ లక్షణాలను స్థూలంగా ఈ క్రిందివిధంగా కథకు అన్వయించుకొనవచ్చును.

1. ఉద్ధతు లైన దుర్యోధన ధృతరాష్ట్రాదుల కుటిలక్రూరస్వభావాలు, అధర్మశీలాలు ఈ సన్నివేశంలో సమగ్రంగా చిత్రించబడ్డాయి కాబట్టి ద్యూతసభ ముమ్మాటికీ డిమమే.

2. ద్యూతంవలన కలిగే ఉపద్రవాలను గురించి విదురాదులు వివరించి చెప్పటం, ద్రౌపదీవస్త్రాపహరణంవంటి ఉపద్రవకారకాలైన సన్నివేశాలు జరగటం గమనిస్తే డిమానికి ఉన్న విద్రవ మనే పేరుకూడా ఈ సభకు సార్థకంగా అన్వయిస్తుంది.

3. నాయకుడు ధర్మజుడు ధీరోదాత్తుడు, బలవంతానవైనా పిలువబడిన జూదానికి క్షత్రియుడు కాదనరాదన్న ధర్మానికి కట్టుబడినవాడు, అరణ్యాజ్ఞాతవాసాలను నిర్వహించటానికి సత్యసంధుడై అంగీకరించినవాడు.

4. ఇందులోని నాలుగంకాలకు సరియైన కథాఘట్టాలను ఈ క్రిందివిధంగా గుర్తించవచ్చును.

    (1) దుర్యోధనుడితోనూ, విదురుడితోనూ ధృతరాష్ట్రుడు మంతనాలాడిన రంగం.

    (2) ధర్మరాజు శకునితో జూదమాడిన రంగం.

    (3) ధృతరాష్ట్రుడు ద్రౌపదికి వరాలిచ్చిన రంగం.

    (4) ధర్మరాజు శకునితో అనుద్యూత మాడిన రంగం.

5. శృంగారహాస్యాలు తప్ప అన్ని రసాలూ పోషించబడినాయి.

6. కావ్యవస్తువు దీప్తరసత్వం కలిగి, నానాభావోపసంపన్నం అయిఉన్నది.

7. ఉల్కాపాతాది అరిష్టాలు, అపశకునాలు ఎన్నో పొడసూపాయి.

8. శకునిమాయ ఇంద్రజాలంవంటిదే. శ్రీకృష్ణుడి మాహాత్మ్యం దివ్యమాయ. ఆ రెండూ ప్రదర్శితమయ్యాయి.

9. సాత్త్వతీ ఆరభటీవృత్తులు ప్రదర్శితమయ్యాయి. ఈ వృత్తుల సమగ్రచిత్రణం ఈ ఘట్టంలోని నాటకీయశిల్పం.

10. ఇది బహునాయక మైన రంగం. నాయకులంటే ప్రధానపాత్రలు నిర్వహించేవా రని గ్రహించాలి. పాండవులలో ధర్మజ భీమార్జునులు, కౌరవులలో దుర్యోధన కర్ణ శకుని దుశ్శాసనులు, వికర్ణవిదురులు, ధృతరాష్ట్రభీష్మాదులు ఇట్లా ఎందరో పాల్గొని వాగ్వివాదాలు చేసికొనిన ఘట్టాలు ఇందులో ఉన్నాయి.

ఈ లక్షణాలన్నీ మాయాద్యూతఘట్టం డిమప్రాయమై ప్రకాశిస్తుందని స్పష్టంచేస్తున్నాయి.

డిమరూపక నిర్వహణంలో రసపోషకాలై నిలిచే అభినయాంగాలు వృత్తులు. అవి నాలుగు- భారతి, సాత్త్వతి, ఆరభటి, కైశికి, బీభత్స కరుణరసాలలో భారతి, వీరాద్భుతశమాలలో సాత్త్వతి, రౌద్రభయానకాలలో ఆరభటి, శృంగారహాస్యాలలో కైశికి రాణిస్తాయని భరతుడి మతం. డిమం వీర రౌద్ర భయానకాద్భుతరసాలు ప్రధానంగా ఉండే రూపకం కాబట్టి దీప్తరసప్రయోగంగా ప్రకాశిస్తుంది. నన్నయ డిమాని కుండే ఈ స్వభావాన్ని లోనారసి దాన్ని నాటకీయమైన వృత్తులతో రమణీయంగా దిద్దితీర్చాడు.

సాత్త్వతీ, ఆరభటీవృత్తుల సమగ్ర నిర్వహణ

నన్నయ ఈ ఘట్టంలో సాత్త్వతీ ఆరభటీవృత్తులను సర్వాంగసమగ్రంగా నిర్వహించటం గమనిస్తే నన్నయ రూపకకళాశిల్పనైపుణ్యం ప్రకటిత మౌతుంది.

సాత్త్వతీవృత్తిలో పాత్రల మనఃప్రవృత్తులు ప్రకాశమానా లయ్యేటట్లు చిత్రించబడతాయి. మాయాద్యూతసభలో గోచరించే పాత్రల మనఃప్రవృత్తులను చిత్రిస్తూ నన్నయ నాటకీయతను పోషించటం గమనించదగిన ముఖ్యాంశం. సాత్త్వతీవృత్తిలో నాలుగురకా లుంటాయని భరతుడు పేర్కొన్నాడు. అవి:- ఉత్థాపకం, పరివర్తకం, సల్లాపకం, సంఘాత్యం. ఉత్థాపక మంటే- మానసికసంఘర్షణ సూచించే వ్యాపారం. పరివర్తక మంటే- మానసిక సంఘర్షణవలన చేయదలచిన కార్యాన్ని వదలి కారణాంతరంచేత మరొకకార్యాన్ని చేయటం. ఆధర్షణసహితంగా కానీ, రహితంగా కానీ ఇతరులను అధిక్షేపించటం సల్లాపకం. ఆధర్షణ మంటే నేరం మోపటం, తిరస్కరించటం, వాదాన్ని ఖండించటం, అన్యాయంగా పీడించటం. ధర్మార్థాంశాల చర్చలో రాగదోషసహితంగా సాధిక్షేపవచనాలు పలకటంకూడా సల్లాపక మని కొందరంటారు. ఇక సంఘాత్య మంటే- సామాద్యుపాయశక్తిచేతగాని, అర్థశక్తిచేత గాని, దైవవశంగా గాని, ఆత్మదోషంవలన గాని సంఘాతం (గట్టిదెబ్బ) భేదించబడటం. ఇది వ్యష్టిగా సమష్టిగా ప్రయోగించబడవచ్చును. కొందరు కూటమిగా చేరి అనేక కపటాలతో, ఇతరులను చంపవలెననీ వంచించాలనీ ఆశించి చేసే ప్రయోగం కూటసంఘాతం అంటారు. దానిని భేదించటం సంఘాత్యం. సాత్త్వతీవృత్తిలో కానవచ్చే భేదాలన్నీ సభాపర్వంలోని ఈ ఘట్టంలో సాంగంగా సాక్షాత్కరిస్తాయి.

ఆరభటు డంటే శూరుడు. అతడి చిత్తవృత్తినుండి జనించే క్రోధ ఆవేగాదులు, అనేకరకాల కపటచర్యలు, వంచనలు, దంభాలు, అనృతవాక్యాలూ కలిగి దీప్తరసాలైన రౌద్రాదులందు ప్రవర్తిల్లేది ఆరభటీవృత్తి. షాడ్గుణ్యంతో, వంచనా విద్రవాలతో, లాభా లాభాలతో కూడి ఉండేది ఆరభటీవృత్తి అని కొందరంటారు. ఇది నాలుగువిధాలు. 1.సంక్షిప్తకం. 2.అవపాతం. 3.వస్తూత్థాపనం. 4.సంఫేటం. అన్వర్థా లైన శిల్పాలు విపులమైన పుస్తములు (రంగదృశ్యాలు) విచిత్రమైన నేపథ్యం మొదలైనవాటిచేత సంజ్ఞామాత్రంగా వస్తువులను సూచించటం సంక్షిప్తకం. అధికమైన హర్షభయాదులతో పాత్రల ప్రవేశ నిర్గమాదులు జరగటం, విద్రవం (ఉపద్రవం)చేతకాని, వినిపాతం (పాటు, భంగపాటు, బాధ, దుఃఖం, అమర్యాద, అగౌరవం) వలనగాని ఆవేగప్రధానమైన చేష్టలను ప్రదర్శించటం అవపాతం. భావివస్తువును అనేకవిధాలుగా హృదయగోచర మయ్యేటట్లు (ధ్వనింప) చేయటం వస్తూత్థాపనం, సంరంభంచేత ప్రయుక్త మయ్యేదీ, యుద్ధ, నియుద్ధ, కపటాదులతో కూడుకొన్నదీ, శస్త్రప్రహారాలతో నిండిందీ సంఫేటం. ఆరభటీవృత్తిని సాంగంగా కపటద్యూతఘట్టంలో నన్నయ ఆవిష్కరించిన వైనం గమనిస్తే అతడి నాటకీయరచనాప్రతిభ మనలను ఆశ్చర్యపరుస్తుంది.

పరాక్రమార్జితమైన పాండవుల ఐశ్వర్యాన్ని మోసంతో అపహరించి, వారిని అపహసించి అవమానించే ప్రయత్నం కపటద్యూత ఘట్టంలోని కార్యం. ఇందులో ప్రతినాయకవిజృంభణం, నాయకపరాజయం వస్తువు. ప్రతినాయక కుటిలప్రయత్నమే మహాభారత రణానికి హేతువౌతున్నది. కర్మఫలభోగరూపమైన వస్తువు ఇతిహాసంలో ఉండటం సహజం కాబట్టి దుర్యోధన ధృతరాష్ట్ర స్వయంకృతా పరాధమే వారి స్వీయనాశానికి దారితీస్తుందనటం ప్రయోజనం. దానికి తగినట్లుగా ఈ కథ డిమప్రాయమై ఉండటం ఉచితం.

మహాభారతయుద్ధంలో (కురుక్షేత్రయుద్ధంలో) పాల్గొనే పాండవ కౌరవుల మనఃప్రవృత్తులను క్రమంగా ఆవిష్కరించే ఒక వికాసపద్ధతికి డిమరూపక నిర్మాణపద్ధతిని నన్నయ శక్తిమంత మైన వాహికగా వాడుకొన్నాడు. అందులో సాత్త్వతీ, ఆరభటీ వృత్తులు రెండు రెక్కలవలె పనికివచ్చాయి.

పాండవ రాజసూయవైభవాన్ని చూచి అందరూ ఆనందించారు. దుర్యోధను డొక్కడే అసూయతో అంతర్వేదనకు గురి అయ్యాడు. చిక్కి శల్యమైపోయాడు. తన దీనావస్థకు హేతువును తండ్రితో ఈవిధంగా మొరపెట్టుకొన్నాడు.

ఉ. ''భావిపురాతనాద్యతన పార్థివలక్ష్ములు పాండవేయుల
క్ష్మీవిభవంబుతోడ నుపమింప సమంబులు గా; వశేష రా
జావళిలోన నత్యధికు లైన సపత్నులపేర్మిఁ జూచి యేఁ
జూవె సహింప నోపక కృశుండ వివర్ణుఁడ నైతి నెంతయున్''. **(సభా. 2.114)**

శత్రువుచేతకూడ ప్రశంసించబడి, అసూయపొందేటట్లు అతిశయించిన పాండవవైభవం ఇందులో ధ్వనించబడి ప్రశంసనీయ మైనది. కాని, దానిని అవలీలగా అపహరించాలన్న దుర్యోధనుడి సంకల్పం ధూర్తలక్షణం. ఉద్ధతస్వభావం. ఈ రూపంలో కార్యం ప్రారంభిస్తున్నది ప్రతినాయకుడు. తీవ్రమనోవేదనానంతరం ప్రతినాయకుడు బీజాన్ని తండ్రియెదుట నాటాడు. దానికి శకుని నీరుపోసి ప్రోత్సహించాడు.

క. ''భానుప్రభు లగు పాండుమ
హీనాథాత్మజులలక్ష్మియెల్లను నీకున్
నే నపహరించి యిత్తు ధ
రానుత! మాయాదురోదరవ్యాజమునన్.'' **(సభా. 2.122)**

అని ఉపాయాన్ని చూపాడు. శకుని పన్నాగాన్ని ధృతరాష్ట్రుడిచేత అంగీకరింపజేయాలని దుర్యోధనుడు ప్రయత్నించాడు. కాని, ధృతరాష్ట్రుడు విదురుడి నడిగి చేయటం ఉచిత మని భావించాడు. విదురుడిని పాండవపక్షపాతిగా పేర్కొని దుర్యోధనుడు

నిందించాడు. దుర్యోధనుడు తలపెట్టిన మహావంచనకు ధృతరాష్ట్రుడు వెంటనే అనుకూలంగా స్పందించలేదు. విదురభీష్మద్రోణాదు లీ యత్నాన్ని గర్హిస్తారని భయపడ్డాడు. డోలాయమానస్థితిలో ఉన్న తండ్రిమనస్సును గమనించి దుర్యోధనుడు తనమాట మన్నించకపోతే అగ్నిలో దూకి ఆహుతి అయిపోతానని బెదిరించాడు. పుత్రవ్యామోహం అధర్మభీతిని మ్రింగివేసింది. ఉచితం కాదని అంతరాత్మ చెపుతున్నా కొడుకును కాదనలేక ఆ పాపకార్యానికి అంకురారోపణం చేశాడు ధృతరాష్ట్రుడు. సుయోధనుడి మనశ్శాంతికై మణిమయమహాసభను నిర్మింపచేశాడు.

దుర్యోధనుడు ధృతరాష్ట్రుడిని ఏవిధంగా మెడలు వంచి ఒప్పించాడో, అట్లాగే ధృతరాష్ట్రుడుకూడా విదురుడిచేత ఒప్పింపజేయటానికి ప్రయత్నించాడు. విదురుడితో ఏకాంతంగా ఒకనాడు దుర్యోధనశకునుల పన్నాగాన్ని గురించి ప్రస్తావించాడు. విదురుడు విరుచుకొని పడ్డాడు. పుత్రులనడుమ భేదబుద్ధి కలిగించటం అన్యాయమనీ, జూదంవలన కలహం తప్పదనీ హెచ్చరించి, శకుని దుర్యోధనుల ప్రయత్నాన్ని మాన్పు మని ప్రబోధించాడు. ధృతరాష్ట్రుడు దానికి మెత్తపడలేదు సరికదా మెత్తబడని విదురుడినే మెత్తపరచటానికి పూనుకొన్నాడు. తన మనసులోని మర్మం బైటపడకుండా ధర్మపన్నం చదివాడు.

ఉ. “పుత్త్రుల కేల భేదమగు? భూనుత! యేనును నీవు జాహ్నవీ
పుత్త్రుఁడు నుండఁగా నహితమున్ భయమున్ దొరకొన్నె? నాకు నా
పుత్త్రులకుం బ్రసాదకృతబుద్ధులు వేల్పులు గాన దీనికిన్
మిత్త్రనిధీ! యొడంబడుము మిన్నక సంశయమంద నేటికిన్?” **(సభా. 2.133)**

మనస్సులో పుత్రుడివైపు. మాటలలో విదురుడివైపు పలికిన ధృతరాష్ట్రుడు మేకతోలు కప్పుకొన్నపులివలె మాట్లాడాడు. జూదమాడటంవలన కలహంవస్తే మాన్పే శక్తులుగా ముగ్గురిని చూపించాడు- తాను, విదురుడు, భీష్ముడు. తనమీద విదురుడికి నమ్మకం లేకపోయినా విదురుడిమీద, భీష్ముడిమీద తనకు నమ్మక మున్నట్లు పలికాడు. విదురుడి విద్వత్తును బంగారుగొలుసుతో కట్టి కదలకుండ చేశాడు. ఇంద్రప్రస్థపురానికి పోయి ధర్మజుడిని పిలిచికొని రమ్మన్నాడు. విదురుడు భీష్ముడి కీ సంగతి చెప్పాడు. ఇద్దరూ మ్రింగలేక క్రక్కలేక ఉక్కిరిబిక్కి రయ్యారు.

విదురుడు చెప్పింది నిప్పువంటి నిజం. జూదంవలన తగాదా వస్తుంది. దానివలన యుద్ధ మౌతుంది. ప్రజానష్టం జరుగుతుంది. ఆ యుద్ధంలో వీరులే గెలుస్తారేమో! కపటులైన తన పుత్రులకు అపాయం వాటిల్లుతుందేమో! గ్రుడ్డిరాజుగుండెలో గుబులు మొదలైనది. విదురుడు చెప్పిన హితబోధలో దుర్యోధనుడి మనస్సును మార్చే ప్రయత్నంచేయాలన్న సూచన ఉన్నది. అది అతడికి సాధ్యం కాదేమో! అయినా ప్రయత్నంచేయటంలో తప్పులేదని ఒకనాడు తన కొడుకును పిలిచి, జూదం వలన కలిగే అహితాలన్నీ చెప్పి,

ఉ. “ఇమ్మహి నీవుఁ బాండవులు నెప్పటియట్ల పరస్పరానురా
గమ్మున నేలుచున్కి యిది కార్యము; పాండవలక్ష్మి నీ కస
హ్యమ్మన నేల? వంచనఁ బరార్థపరిగ్రహబుద్ధిఁ జేసి పా
పమ్మగుఁ; బాపకారులకుఁ బాయు నవశ్యము నర్థధర్మముల్.” **(సభా. 2.136)**

అని హితవు చెప్పాడు. జూదం విదురసమ్మతం కాదనీ, పాండవసంపదకంటె కౌరవులకు అయిదురెట్లు ధనమున్నదనీ, ధర్మజుడు చేసినన్ని యజ్ఞాలు దుర్యోధనుడుకూడా చేసి భూలోకంలోని రాజులందరి సంపదలను ఉపాయనాలుగా పొందవచ్చుననీ, బుజ్జగించి చెప్పాడు. దానికి దుర్యోధనుడు సుముఖుడు కాకపోగా, పైపెచ్చు తనకు జూదమే యజ్ఞమని ఘోషించాడు.

క. “ఇమ్ముల ధర్మజుతో జూ
దమ్మాడఁగఁ గాన్ప నాకు ధరణీశ్వర! య
జ్ఞ మ్మదియ సమస్తైశ్వ
ర్యమ్ములు వడయఁగ నుపాయ మభిమతసిద్ధిన్” **(సభా. 2.138)**

అని తన మనోభీష్టాన్ని స్పష్టంచేసి, తాను స్వయంగా చూచిన పాండవసంపదను, దర్శించిన మయసభా వైభవాన్నీ, పొందిన భంగపాటును, అవి తనను హృదయశల్యాల వలె బాధిస్తున్న వైఖరినీ వివరించి, సుఖోపాయంతో పరసంపదను గ్రహించటం ఉత్తమ పురుషార్థ మనీ, సుహృద్ద్యూతం ఉత్తమపుణ్యప్రద మనీ వాదించి, ఇంద్రుడు నముచిని చంపి అతడి సంపదను హరించిన ఐతిహ్యాన్ని దృష్టాంతంగా చెప్పి, తన వంచనయత్నం అధర్మం కాదని తేల్చి చెప్పి, తన ప్రయత్నాన్ని ధ్రువపరిచాడు.

తే. “అహితవృద్ధి యుపేక్షితం బగుడు నల్ప
మగు మహావ్యాధియును బోలె నది యసాధ్య
మయి యుపేక్షకు నిర్మూలితాత్ముఁ జేయుఁ
గానఁ బాండవశ్రీ యుపేక్ష్యంబు గాదు.” **(సభా. 2.145)**

అని నీతిశాస్త్రాన్ని తనకు ఉపబలకంగా చూపించుకొన్నాడు. పాండవసంపదను ఏవిధంగానైనా సాధిస్తాననీ, లేకపోతే తన మనస్తాపం తీరదనీ గంద్రగొండిగా చెప్పాడు. శకుని దానికి వంతపాట పాడాడు. కాని, వారివ్యూహానికి ధృతరాష్ట్రుడు అంగీకరించలేదు. విదురుడి ధర్మబుద్ధిని సమర్థించి, జూదయత్నాన్ని మానుమని కొడుకుకు హితవు చెప్పాడు. ఇక్కడ ప్రతిముఖసంధి ప్రవర్తిల్లింది.

తన ప్రయత్నానికి పెద్ద అడ్డు తగలటంతో దుర్యోధనుడు తీవ్రయత్నం మొదలుపెట్టాడు. తండ్రికి వ్యక్తిత్వం లేదని, తనవా రెవరో పరాయి వారెవరో తెలియదనీ, తనపని ఇతరుల అభిప్రాయాల కనుగుణంగా చేయకూడదనీ, విదురుడు పాండవహితం కోరేవాడనీ, ఆ పక్షపాతబుద్ధి కలవాడిని ఆప్తుడిగా పరిగణించరాదనీ, జూదం పురాణాలలోకూడా పుణ్యకార్యంగా చెప్పబడిందనీ నీతిసమ్మతంగా తన వాదాన్ని వినిపించాడు. ధృతరాష్ట్రుడు చాలసేపు ఆలోచించాడు. తనకు కావలసింది పుత్రసంతోషమా? ధర్మప్రవర్తనమా? అన్న ప్రశ్న అతడి మనసులో సంఘర్షణగా నిలిచింది. మథనపడ్డాడు. చివరకు పుత్రవ్యామోహమే గెలిచింది. ‘బుద్ధిః కర్మానుసారిణీ’. విదురుడిని పిలిచి ధృతరాష్ట్రుడు విస్పష్టంగా ఆదేశించాడు- ధర్మరాజును కొనితెమ్మని, దుర్యోధన ధర్మజులనడుమ సుహృద్ద్యూతం ప్రవర్తిల్లుతుందని. విదురుడు తలవంచాడు- జరుగబోయేది సుహృద్ద్యూతం కాదని మాయాదురోదరమనీ దానివలన దురర్థం పుడుతుందనీ భావిస్తూ విషణ్ణుడై కర్తవ్యోన్ముఖు డైనాడు.

విదురుడిని పంపటంవలన ధృతరాష్ట్రుడు భావికార్యం తప్పక జరిగే వ్యూహం సాధించగలిగాడు. దుర్యోధనుడి యత్నానికి విదురుడి సౌముఖ్యం బిందువు వంటిది. ముఖ ప్రతిముఖసంధులు ప్రవర్తిల్లిన ఈ సన్నివేశం ఒక అంకం వంటిది. ఇందులో కథాకథనంకంటె సంభాషణలు విస్తృతంగా సాగాయి. ఆణిముత్యాలవంటి పద్యాలు సార్థక సంభాషణలవలె ఆ యా పాత్రల మానసిక ప్రవృత్తులను, మనస్సంఘర్షణలను వ్యక్తంచేస్తూ సాత్త్వతీ వృత్తిలోని ఉత్థాపక మనే శాఖను సుసంపన్నం చేశాయి. దుర్యోధన, ధృతరాష్ట్ర, విదుర పాత్రల మనస్సంఘర్షణలతో ఈ అంకం రక్తికట్టింది. దానికి పోషకంగా సంక్షిప్తకం అనే ఆరభటీ వృత్తిభేదం - దుర్యోధనుడు పాండవవైభవాన్నీ, మయసభ విలాసాన్నీ, తన భంగపాటు పరితాపాన్నీ చెప్పేటప్పుడు రాణించింది. మయసభా శిల్పాలను గురించి, అందులోని దృశ్యాలను గురించి ప్రశంసించటం అందులో పొందిన అవమానమే మాయాద్యూత వ్యూహానికి నేపథ్యమనే సత్యాన్ని వెల్లడించటం సంక్షిప్తక మనే ఆరభటీవృత్తిని పోషించాయి. సుయోధనుడి ప్రయత్నం అర్థమూలం కాబట్టి అతడి క్రోధంవలన రౌద్రం పోషించబడుతున్నది. అది అధర్మమూలం కావటంచేత విదురాదులకు విషాదం కలిగించింది. కొడుకును సమర్థించిన ధృతరాష్ట్రుడు సైతం నిప్పు రగులుకొన్న కట్టెవలె లోలోన దహించుకొనిపోయాడు. రసోద్దీప్తి రంగాన్ని రక్తికట్టించింది.

ధర్మరాజు శకునితో బలవద్ద్యూతం ఆడిన ఘట్టం డిమంవంటి రూపకంలోని శక్తిమంత మైన రెండవ అంకంవంటిది. అందులో గర్భసంధి భాసించింది. అంతేకాక పరివర్తనం, సల్లాపకం అనే సాత్త్వతీవృత్తులూ, అవపాతం, వస్తూత్థాపనం అనే ఆరభటీవృత్తులూ విస్తారంగా ప్రయోగించబడ్డాయి. నన్నయ ఉభయకావ్యకళాశిల్పానికి ఈ ఘట్టం (రంగం) ఉన్నతపతాకగా నిలిచింది.

హృదయసంఘర్షణవలన చేయదలచిన కార్యాన్ని విడిచి, కారణాంతరంచేత వేరొకకార్యాన్ని ఆచరించే పరివర్తక సాత్త్వతీవృత్తి ధర్మజుడిలో మొదట దర్శన మిస్తుంది. సుయోధనుడు చూపించగా ధృతరాష్ట్రనిర్మిత మణిమయసభను చూచి ధర్మజుడు మెచ్చుకొన్నాడు. దుర్యోధనుడు కపటమైన తన పావును కదిలించాడు.

క. ‘‘అనఘ! సుహృద్ద్యూతం బిం
దొనరింతము; ప్రొద్దువోకయును నగు; జూదం
బునకుం బ్రియుఁడవు దక్షుఁడ
వన విందుము నిన్నుఁ బ్రీతి నక్షజ్ఞులచేన్’’ **(సభా. 2.164)**

అని ద్యూతానికి ఆహ్వానించాడు. ధర్మరాజు ఆవులించిన ప్రేవులు లెక్కపెట్టగలడు. దుర్యోధనుడు ద్యూత మాడలేడు. శకుని అతడి భుజంవంటివాడు. అతడు మాయాదురోదరంలో మహానిపుణుడు. మోసగాడు. దుర్యోధనుడికి బదులు అతడు రంగంలోకి దిగవచ్చును. అసలు ఆ ఊహకు అతడే కారకుడు. ఇవన్నీ కడుపులో పెట్టుకొని ధర్మజుడు కపటద్యూతాన్ని అధిక్షేపిస్తూ మాట్లాడాడు. సాత్త్వికంగా అధిక్షేపించాడు. తనను బలవంత పెట్టకుండా ముందుకాళ్ళకు బందాలు వేశాడు. ఆమాట లివి-

తే. ‘‘క్షత్త్రనీతిక్రమంబులు గావు సూవె
నికృతియును జూదమును ధర్మనిత్యు లైన
వారి కీ రెండు వర్జింపవలయు నెందుఁ;
బాపవృత్తంబు జూదంబు పార్థివులకు.

ఆ. ‘‘కుటిలమార్గు లయిన కుత్సితకితవుల
తోడఁ గడఁగి జూదమాడఁ జనదు;
దానఁజేసి యర్థధర్మవివర్జితు
లగుదు రెట్టివారు జగములోన.’’ **(సభా. 2.166,167)**

కుటిలమార్గులు, కుత్సితులు అయిన కితవుల ప్రసక్తి పైకి సాధారణంగా వినపడినా ప్రక్కనున్న శకునికి అధిక్షేపమై తగిలి వచ్చింది. పిలిచిన దుర్యోధనుడు నిరుత్తరుడైనాడు కాని, మోసగాడైన శకునిమాత్రం మాటందుకొన్నాడు. ‘ధర్మజా! నీవంటి కళాకుశలుడే ఆ కళను దూషించటం నీతి కా’దన్నాడు. బలహీనులు బలవంతులను జయించేటప్పుడు మోసం తప్పదనే లోకనీతిని పేర్కొన్నాడు. జూదానికి నీవు భయపడితే, మానుకొనవచ్చు’ నన్నాడు.

ధర్మజుడు మొదట జూదంనుండి తప్పుకొందా మనుకొన్నాడు. కపటద్యూతాన్ని తిట్టి, తనకు పనికివచ్చే ధర్మసూత్రాన్ని ప్రతిపాదించాడు. శకుని నిపుణంగా పథకం మార్చాడు ‘ఆటకు భయపడితే మానుకోవచ్చు’ అన్నాడు. అభిమానధనుడైన యుధిష్ఠిరుడికి అది సవాలుగా తగిలింది. ‘బలవద్ద్యూతానికి పిలువబడి ఆడకుండా తిరిగిపోవటం న్యాయం కాదుకదా! ఇక పెక్కుమాట లెందుకు?’ అని అనుకొంటూ ముగ్గులోకి దిగాడు. ఊహించినట్లే దుర్యోధనుడు తనకు బదులు శకునితో పందెం వేయిస్తా నన్నాడు. అతడు కాచిన పందాలకు తాను పూచీపడతానన్నాడు. ధర్మజుడు కటకటపడ్డాడు. ‘ఒకరికొరకు మరొకరు జూదం ఆడటం అన్యాయం’ అని విసుక్కొన్నాడు. కాని, తెగించి జూదాన్ని మానలేకపోయాడు. పోగా, తెగించి

జూదానికి దిగాడు. దానితో- రెండవ అంకం రసకందాయంలో పడింది. ధర్మజుడు మొదట తలచిం దొక్కటి, శకుని తెచ్చిన ధర్మసంఘర్షణ వలన చివరకు చేసింది మరొక్కటి, ఇది కథాగతికి బలమైన హేతువు. ఇక్కడ పరివర్తన మనే సాత్త్వికవృత్తి పరిపూర్ణంగా ప్రకాశించింది.

ధర్మజుడు జూదంలో ఓడుతూ ఒక్కొక్క పందానికి కోల్పోయిన విలువైన కథనం సంక్షిప్తకం అనే ఆరభటీవృత్తికి నిదర్శనం. ధర్మరాజు సంపదనంతా కోల్పోయి ఓటుపడ్డాడు. పుత్రులమధ్య తగవు రాకుండా చూచే బాధ్యత తనమీదా ధృతరాష్ట్రుడిమీదా ఉన్నదనిచెప్పిన ధృతరాష్ట్రుడి మాటలను మనసులో తలంచి విదురుడు ధృతరాష్ట్రుడితో రహస్యంగా హితవు చెప్పాడు. ఇక ఇక్కడినుండి సల్లాపక మనే సాత్త్వతీవృత్తీ, అవపాతం అనే ఆరభటీవృత్తీ సర్వాంగసమగ్రంగా రంగప్రయోగంలో ప్రవర్తిల్లాయి. సల్లాపకంలో ఇతరులను అధిక్షేపించే సంభాషణలు విశేషంగా ఉంటాయి. అవి- ఒకరిమీద ఒకరు నేరం మోపుకొనే తీరులో కాని, పరస్పరం తిరస్కరించుకొన్నట్లుగా గాని, ఒకరి వాదాన్ని మరొకరు ఖండించుకొన్నట్లుగాగాని, అన్యాయంగా పరులను పీడించినట్లుగాగానీ, ధర్మాంశాలను చర్చించేటప్పుడు రాగదోషసహితంగా సాధిక్షేపంగా పలికినట్లుగా గాని సల్లాపకంలో అధిక్షేపాలు సాగుతాయి. సల్లాప సాత్త్వతీవృత్తితోపాటు అవపాతమనే ఆరభటీవృత్తి ప్రవర్తిల్లటంచేత- రంగంమీద భయహర్షాతిశయంతో పాత్రలు ప్రవేశనిర్గమాలు చేయటం, ఉపద్రవాలు కాని, భంగపాట్లు గాని జరిగినట్లు ప్రదర్శించటం జరుగుతుంది. ఈ దృష్టితో ఈ క్రింది అంశాలలో నాటకీయతను అన్వయించుకొనవచ్చును.

1. విదురుడు ధృతరాష్ట్రుడితో - దుర్యోధనుడు పుట్టినప్పుడు కలిగిన దుర్నిమిత్తాలను పేర్కొని, అతడివలన కులానికి కలుగుతున్న ఎగ్గును సూచించి, కులరక్షణార్థం అతడిని వధించటమో దేశబహిష్కృతుడిని చేయటమో తగునని ప్రతిపాదించాడు. పాండవులను దరికితీసి మన్నించు మని ప్రబోధించాడు. ఫలవృక్షాలను కట్టెలకొరకు తగులబెట్టే బొగ్గులవాడివలె, బలిసిన యెద్దు దర్పంతో కొండచరియను చీల్చటానికి పూనుకొన్నట్లు దుర్యోధనుడు పాండవులతో తగవుపెట్టుకొంటున్నాడనీ, ఆ దుష్టద్యూతాన్ని ఇకనైనా ఆపుమనీ చెప్పిన హితోక్తులలో దుర్యోధనుడి దుర్మార్గంవలన కలిగే ఉపద్రవాల ప్రసక్తి ఏర్పడి ఆరభటీవృత్తి పోషించబడింది.

2. ధృతరాష్ట్రుడు తన హితవు వినకపోవటంతో విదురుడు స్వయంగా దుర్యోధనుడిని అధిక్షేపిస్తూ మాట్లాడాడు. దానికి ప్రత్యాఖ్యానంగా దుర్యోధనుడు విదురుడిని అహితుడిగా నిందించి తమకు తొడమీద ఉంచుకున్న పామువంటివాడని నేరంమోపాడు. దానికి విదురుడు కోపించి అధిక్షేపోక్తులతో మందలించి ధర్మంచెప్పి ఊరుకొన్నాడు. ఆ ఇరువురి మధ్య ఒకరిమీద ఒకరు దోషం మోపుకొనే తీరులో అధిక్షేపసంభాషణలు సాగి సాత్త్వతీవృత్తి భాసించింది.

3. ధర్మరాజు తమ్ములను, తనను, ద్రౌపదిని క్రమంగా జూదంలో ఓడిపోయి, తలవంచుకొని మిన్నకుండగా, దుర్యోధనాదులు హర్షాతిశయంతో సభలో అనౌచిత్యంగా వ్యవహరించారు. దుర్యోధనుడు విదురుడిని పోయి ద్రౌపదిని తీసికొనిరమ్మన్నాడు. ఆ అనుచితపు పనికి, మాటలకు విదురుడు కోపించాడు.

క. ''మదమలినమనస్కుఁ డరుం
తుదుఁడు నృశంసుఁ డనఁ బరఁగు దుర్జనునకు సం
పద లెడ లయ్యును నాతని
మొదలిటి సంపదలతో సమూలంబు సెడున్'' **(సభా. 2.202)**

అని భావికథార్థసూచకంగా దుర్యోధనుడిని శపించినట్లు తిరస్కరించాడు.

దుర్యోధనుడు ప్రాతికామిని పంపాడు. అతడు పాంచాలివద్దకు పోయి సంగతులన్నీ చెప్పి దుర్యోధను డున్న సభకు రమ్మని పిలిచాడు. భార్యను జూదంలో ఓడినవారు రాజలోకంలో ఎవ్వరూ లేరని ఆశ్చర్యపోయింది ద్రౌపది. ఒక ధర్మసందేహాన్ని రేపి, దానిని ధర్మరాజు నడిగి సమాధానం తెమ్మన్నది. అతడు రమ్మంటే వస్తానని ప్రాతికామిని తిరిగిపంపింది. ఆమె ప్రశ్న ఇది:

తె. "మున్ను దన్నోటువడి మఱి నన్ను నోటు
వడియెనో? నన్ను మున్నోటువడి విభుండు
గ్రన్నఁ దన్నోటువడియెనో యన్న! నాకు
నెఱుఁగఁ జెప్పుము దీని నీ వెఱుఁగుదేని." **(సభా. 2.209)**

ప్రాతికామి తిరిగి సభకు వచ్చాడు. పైప్రశ్నను ధర్మజుడికి నివేదించాడు. అత డేమి పలుకక దుఃఖాతిశయంతో మిన్నకున్నాడు. దుర్యోధనుడు కల్పించుకొని, అధిక్షేపకాత్మకంగా 'ద్రౌపదిని తానే వచ్చి నిండుకొలువులో తెలిసికొ'మ్మని వెటకారంచేస్తూ మరల ప్రాతికామిని ద్రౌపదిదగ్గరకు పంపాడు. పరిస్థితుల వైపరీత్యాన్ని ద్రౌపది గుర్తించి ఏకవస్త్ర అయిఉన్నా, కన్నీటిధారలతో కదలి ప్రాతికామివెంట కౌరవసభకు వచ్చింది. భీతయై ధృతరాష్ట్రుడి చెంత నిలిచింది. దుర్యోధనుడు మదోద్ధతుడై దుశ్శాసనుడిని ఆజ్ఞాపించాడు- ఆమెను సభామధ్యప్రాంతానికి తీసికొనిరమ్మని, ఆమె భయకంపితురాలై గాంధారియొద్దకు పరుగెత్తిపోయి నిలిచింది. దుశ్శాసనుడు ఆమెను సమీపించాడు. ద్రౌపది తాను రజస్వల ననీ, ముట్టవద్దనీ, ఏకవస్త్రనై పెద్దలున్న సభకు రాజాల ననీ మొరపెట్టింది. ఆమెమాటలు తిరస్కరించి 'నీవు ఏకవస్త్రవైతే నేమి? విగతవస్త్రవైతే నేమి?' అని ధిక్కరించి, దుశ్శాసనుడు నిర్దయుడై రాజసూయావభృథ స్నానంతో పవిత్రమైన ఆమె దీర్ఘశిరోజాలను పట్టి నిండుసభకు లాగికొనివచ్చాడు. ఈవిధంగా హర్షంతో దుర్యోధనవర్గంవారూ, భయంతో ద్రౌపదీ, సభలో ప్రవేశనిర్గమాలు చేయటంవలనా, ఆ తరువాత ద్రౌపదీవస్త్రాపహరణ ఘట్టంలో ఆవేగప్రధానమైన చేష్టలు ప్రదర్శితం కావటంవలనా అవపాత మనే ఆరభటీవృత్తి రచనలో ఉద్దీప్తంగా పోషించబడింది.

నిండుసభలో పాంచాలి దుఃఖితఅయి నిలచిఉండగా భీముడు సహించలేక కోపోద్రిక్తుడై, భార్య నూరడించాలని భావించి, ధర్మరాజును తూలనాడి, శకునిమోసం తెలిసికూడ జూదమాడిన అతని చేతులు కాల్చాలని విజృంభించాడు. దుఃఖాతిశయంతో మనసు కలతచెంది ఒకటి చేయబోయి మరొకటి చేసిన ఉదంతం భీముడిది. అర్జునుడు అతడిని సమాధానపరచాడు. ఇందులో పరివర్తకమనే సాత్త్వతీవృత్తి ఉన్నది.

వికర్ణుడు సభలో నిలువబడి ఇట్లా హెచ్చరించాడు-

క. "సమచిత్తవృత్తు లగు బు
ద్ధిమంతులకు నిపుడు ద్రౌపదీప్రశ్న విచా
రము సేయవలయు నవిచా
రమునఁ బ్రవర్తిల్లు టది నరకహేతు వగున్". **(సభా. 2.226)**

ద్రౌపది అధర్మవిజిత అనీ, ఏకవస్త్రను సభకు తేవటం అధర్మమనీ ఎలుగెత్తి చాటాడు. అతడిని కర్ణుడు తిరస్కరించి మాట్లాడి, అతడి వాదాన్ని ఖండించి, ఆమె ధర్మవిజితయే అనీ, ఆమె బహుభర్తృక కాబట్టి వివస్త్రను చేసితెచ్చినా తప్పు లేదనీ వాదించాడు. ఆ సూచనకు రెచ్చిపోయి దుర్యోధనుడు ద్రౌపదివలువలు పాండవుల వలువలు వలువవలసిందని దుశ్శాసనుడిని ఆజ్ఞాపించాడు. ఇది పరులను అన్యాయంగా పీడించే ఆధర్షణం. ఇది సల్లాపక మనే సాత్త్వతీవృత్తి స్వభావం. ఇది దుర్యోధనుడిలో పరాకాష్ఠ నందుకొన్నది. దుశ్శాసనుడు ద్రౌపదీవస్త్రాపహరణం చేయ ప్రయత్నించాడు. శ్రీకృష్ణుడు ద్రౌపది మేనిమీది వస్త్రం తొలగకుండ తన మహిమతో ఆమె మానాన్ని, ధర్మాన్ని కాపాడాడు. దుశ్శాసనుడు ఎన్ని చీరలు లాగినా ఆమె మేనిమీది చీర తొలగక నిలిచిఉండేది. పర్వతమంత కుప్ప పడేంతవరకు చీరలు ఒలిచి ఒలిచి, అలసి సొలసి ఊరకుండిపోయాడు. భీము డప్పుడు భీషణప్రతిజ్ఞ చేశాడు.

మ. "కురువృద్ధుల్ గురువృద్ధబాంధవు లనేకుల్ సూచుచుండన్ మదో
ద్ధురుఁడై ద్రౌపది నిట్లు సేసిన ఖలున్ దుశ్శాసనున్ లోకభీ
కరలీలన్ వధియించి తద్విపులవక్షశ్శైలరక్తౌఘని
ర్ఝర ముర్వీపతి సూచుచుండ నని నాస్వాదింతు నుగ్రాకృతిన్". **(సభా. 2.233)**

ఇందులో సల్లాపం, అవపాతం, వస్త్రూత్థాపనం ముప్పేటగా మోహరించాయి. భీముడి ప్రతిజ్ఞలు దుర్యోధన కర్మఫలసూచికలు, భావికథార్థ పతాకలు, వీరరౌద్రరస పోషకాలుగా వర్తించే సాత్త్వతీ ఆరభటీవృత్తుల సమగ్ర విస్ఫూర్తులు! అభినయాకృతులు!

భీముడి అతిమానుష మైన ప్రతిజ్ఞకు సభ దద్దరిల్లింది. సభికులు ధృతరాష్ట్రుడినీ, అతడికొడుకులనూ మనసులో నిందించారు. సభ క్షోభించింది. విదురుడు సభాసదులను సద్దుమణగింపచేసి, ద్రౌపది అడిగిన ప్రశ్నకు సభలోని పెద్దలు సమాధానం చెప్పాలని కోరాడు. వికర్ణుడి తెగువను ప్రశంసించాడు. సభలో ధర్మం చెప్పకుండా మిన్నకుండేవారు ఆ పాపంలో పాలుపంచుకొంటారనీ, అసత్యదోషం అనుభవిస్తా రనీ హెచ్చరించాడు. విరోచనుడి కథను ఇతిహాసదృష్టాంతంగా చూపించాడు. అతడి దీర్ఘోపన్యాసం బూడిదలో పోసిన పన్నీరైపోయింది. దుర్యోధనుడికి భయపడి సభికు లెవ్వరూ నోరెత్తలేదు.

నన్నయ రచనలోని నాటకీయశిల్పంలో ఇక్కడ ఒక రంగనిర్వహణ నైపుణ్యాన్ని గమనించాలి. మాయాదురోదరంవలన పుడుతున్న ఉపద్రవాన్ని అడ్డుకొనటానికి యత్నించే ధార్మికశక్తి విదురుడు. అతడు నిండుసభలో ధర్మప్రసక్తి తెచ్చినప్పు డల్లా దుర్యోధనుడు తిరస్కారభావంతో రెచ్చిపోయేవాడు. హర్షగర్వాతిశయంతో అనౌచిత్యపు ఆఘాయిత్యాలు చేసేవాడు. అవి పాండవులకు, ప్రత్యేకంగా భీముడికి, అపారకోపాన్నీ, ద్రౌపదికి అపారదుఃఖాన్నీ కలిగించేవి. భీము డొక భీషణప్రతిజ్ఞ చేసేవాడు. దానితో ఒక రకమైన కార్యవర్తులం పూర్తి అయినట్లయ్యేది. విదురుడి బోధ- దుర్యోధనుడి దుశ్చర్య- భీముడి ప్రతిజ్ఞ- ఇట్లా రెండు ఆవృత్తులు తిరిగాయి ఈ రంగంలో. దానివలన కౌరవుల హర్షాతిరేకం, కర్ణాదుల దుష్టాలాపం, విదురాదుల ఆగ్రహాతిరేకం, ద్రౌపది దుఃఖావేశం, భీమాదుల రౌద్రోద్రేకం ప్రవర్తిల్లి సాత్త్వతీ ఆరభటీవృత్తులు రసోపస్కారకాలుగా వర్తిల్లటానికి తోడ్పడ్డాయి. ఈ రెండు రంగప్రయోగవర్తులాలలో ఒకదాని కంటె మరొకటి రసవత్తరమై రాణించటం విశేషం. ఈ చివరి వర్తులం శిల్పసుందరం.

విదురుడి దీర్ఘోపన్యాసంతరువాత సభలో దీర్ఘనిశ్శబ్దం. ద్రౌపదిని సమర్థించే సత్పురుషుడు ఒక్కడుకూడా ఆ సభలో లేడని తేలిపోయింది. అదీ ఆ సభలోని దారుణవాతావరణం. అప్పుడు ద్రౌపది ఎలుగెత్తి మరొక ప్రశ్న వేసింది.

సీ. ''అవ్విధంబున నొప్పి యాస్వయంవరమునా౯ । డఖిలభూపతులచే నట్లు సూడ౯
బడి పాండవులధర్మపత్నినై, గోవిందు । చెలియలినై, వీనిచేత నిట్లు
పరిభూత నగుచు సభామధ్యమున మహీ । పతులచే౯ జూడంగ౯ బడితి; నింత
వడుదునె? యిపుడు నా పలుకుల కెవ్వరు౯ । బ్రతివచనం బేల పలుకరైరి?
ఆ. ధన్యులార! యే నదాసినే? దాసినే? । యెఱుఁగ౯ జెప్పి పనుపు౯ డెల్లదాని.....'' **(సభా. 2.244)**

నని అడిగింది. అలనాడు స్వయంవరసభలో అందరిచేత ఆమె ఒక్కతె అంత గౌరవంగా చూడబడింది; ఈనాడు కురుసభలో ఇందరిచేత ఈవిధంగా అగౌరవంగా చూడబడింది. ఆమె జీవితంలో ఆ రెండు సభలు నిర్వహించిన పాత్రలను తులనాత్మకంగా సభికులముందు చలనచిత్రంవలె ప్రదర్శించింది. ఇది కౌరవులపట్ల వ్యంగ్యమైన అధిక్షేపం. ఆ ద్రుపదుడిసభలో ఆమె పాండవపత్ని అయింది. ఈ సభలో గోవిందుడి చెల్లెలుగా నిరూపించుకొన్నది. అవమానంనుండి తనను తాను రక్షించుకొనగలిగింది. దుశ్శాసనుడు చేసిన దుశ్చర్యను తన సచ్ఛీలంతో త్రిప్పికొట్టగలిగింది. ఆమె తన పతివ్రతాశక్తిని, శ్రీకృష్ణశక్తిని, ధర్మానురక్తిని ప్రదర్శించి కర్ణుడు చేసిన (బంధకివంటి) అధిక్షేపాలకు వ్యంగ్యంగా సమాధానం చెప్పింది. ఆమె మొదట అడిగిన ప్రశ్నకు సమాధానం వివరించి చెప్పే నాథుడు లేని ఆ సభలో, ఆ ప్రశ్నయొక్క ఫలితాంశాలను రెండు ముక్కలలో అడిగింది- 'నేను అదాసినా? దాసినా?' అని. అందులో ఏ ఒక్కమాట చెప్పినా చాలు అని సభికులముందు ఆక్రోశించింది. ద్రౌపది మానసికసంఘర్షణ మంటలాగా రేగి సభను చురుక్కు మనిపించిన ప్రశ్న అది.

దానికీ ఎవ్వరూ మాట్లాడ లేదు. ఎంతో నిగ్రహంతో నిశ్శబ్దంగా ఉన్న భీష్ముడు ఎట్టకేలకు నిగ్రహించుకోలేక ఒక్కమాట అన్నాడు. ''అమ్మా! నీ వడిగిన ప్రశ్నకు యుధిష్ఠిరుడు మాత్రమే బదులుచెప్పగలడు. దీనిలోని ధర్మసూక్ష్మం తెలియటం మరెవ్వరికీ సాధ్యంకాదు. దీనికి ఫలం ఈ కురుకుల కంటకులు త్వరలోనే అనుభవిస్తారులే' అని పలికి

ఊరుకొన్నాడు. భీష్ముడి సమాధానం సమస్యను తీర్చేది కాదు. పైపెచ్చు- ద్రౌపది ఆ ప్రశ్నను మొదట ధర్మరాజుకే వేసింది కదా! అత డేమీ మాట్లాడకపోయె; మరిం కెవ్వరు మాట్లాడగలరు? ఆమె మమ్ములను ముందు అడుగలేదు....అన్నట్లు మెత్తగా మందలించినట్లయింది. అంతటితో ఆగకుండ ధార్తరాష్ట్రులను నిందించాడు. భీష్ముడి మాటలు విదురుడి వాక్యాలవలెనే ఆధర్వణ రహితమైన అధిక్షేపాలకు ప్రతినిధులుగా నిలిచాయి.

భీష్ముడు దుర్యోధనుడి దుష్టవర్తనాన్ని దూషించినట్లు వ్యంగ్యంగా మాట్లాడేసరికి, మిత్రుడిమీద ఈగవాలనివ్వని ప్రాణమిత్రుడు కర్ణుడు, నిస్సహాయురాలుగా నిలువబడిన ద్రౌపదిని చూచి, అధిక్షేపాత్మక మైన అవహేళనం చేశాడు. దానివెనుక భీష్మవచన ప్రభావంకూడా లేకపోలేదు. ధర్మసందేహం తీర్చగల భర్త ధర్మరాజు, అతడే ఊరుకున్నాడు. దానికి కారణం జూదంలో ఓడిపోవటం. దాసుడు మాట్లాడకూడదు కాబట్టి, మౌన మర్ధాంగీకార మన్నట్లు ధర్మజుడు దాసుడని మౌనంతోనే ఒప్పుకొన్నాడు. అతడితోపాటు అతడి తమ్ములు, వారందరితోపాటు వారి భార్య పాంచాలి. ఇది చెప్పకుండానే స్పష్టమౌతున్న కథార్థం. ఈ దైన్యస్థితిని గమనించి కర్ణుడు ద్రౌపదిని నిష్కారణంగా పీడించాలని పూనుకొన్నాడు. 'ఓ తరుణీ! నీకు ఐదుగురికంటె ఒకే భర్త ఉండటం మంచిది. జూదంలో ఓడిపోనివాడిని ఒకడిని భర్తగా ఎన్నుకోవటం సబబు' అని వికటంగా నవ్వాడు. స్వయంవరసభతో కౌరవసభను పోల్చి తమను అధిక్షేపించిన ద్రౌపదికి తగిన జవాబిచ్చినట్లు మాట్లాడాడు. 'ఇప్పుడు ఈ సభనే మరొక స్వయంవరసభగా మార్చుకొ' మ్మన్నట్లు 'దాసీత్వాన్ని తొలగించుకొమ్ము' అన్నట్లు ఎగతాళిచేశాడు. మాటకు మాట ఘాటుగా వడ్డించాడు. నిజానికి ద్రౌపదీస్వయంవరసభలో పెద్దదెబ్బ తిన్నది కర్ణుడే కదా!

కర్ణుడి మాటలలోని వెటకారం పాండవులనూ, ద్రౌపదినీ బాధించింది. దుర్యోధనుడికి మరొక దురాలోచన చేయటానికి దోహదం చేసింది. సుయోధనుడు ద్రౌపదిని తన తొడమీద కూర్చుండు మని సైగచేశాడు. ఆ సైగను చూచి భీముడు భగ్గున మండిపడ్డాడు. ఉగ్రరణాంతరంలో భీమగదాఘాతంతో దుర్యోధనుడి తొడలు విరుగగొట్టుతానని భీషణప్రతిజ్ఞ చేసి, ఆయుధాలవైపు చూచాడు. ధర్మజుడి ఆజ్ఞకొరకు తేపతేపకు అతడివైపు చూచాడు. భీముడు కార్యవీరుడైతే కథలో కార్యం దెబ్బతింటుందని భీష్మద్రోణాదులు భీముడిని అనునయించి కూర్చోబెట్టారు. ఈ ఘట్టంలో ప్రవర్తిల్లిన వీరరౌద్ర రసాలకు పోషకంగా సల్లాపక, అవపాతాలనే సాత్త్విక ఆరభటీవృత్తులు నిలిచాయి. ఇంతటితో రెండవరంగం పూర్తయింది. ఈ డిమప్రాయమైన కథాఘట్టంలో.

మూడవరంగం ముచ్చటైన చిన్నఅంకం. ద్రౌపదీవస్త్రాపహరణసభానంతరం ధృతరాష్ట్రుడి మందిరంలో మహోత్పాతాలు పుట్టాయి. అగ్నిహోత్రగృహాలలో నక్కలు అరిచాయి. అగ్నులు ఆరిపోయాయి. కౌరవుల భార్యల హృదయాలు అధికశోకంతో ఉడికిపోయాయి. ధార్తరాష్ట్రుల శయ్యాగృహాలలో కాకులూ గ్రద్దలూ అరిచాయి. ఆ దుశ్శకునాలను గురించి విని విదురభీష్మద్రోణులు కౌరవులకు అరిష్టం దాపురించిం దని భావించి మనస్సులలో సంతోషించారు.

రాజమందిరంలో గుప్పున పొడచూపిన ఆ దుశ్శకునాలకు గాంధారిగుండె చెదిరిపోయింది. విదురుడిని పిలిపించుకొని అతడితోపాటు తాను ధృతరాష్ట్రుడివద్దకు గబగబా పోయింది. ఆవేగంతో కురుసభలో జరిగిన వృత్తాంతాన్నీ, దుర్నిమిత్తాలనూ చెప్పింది. ధృతరాష్ట్రుడు వెంటనే కొడుకును పిలిపించాడు.

చ. ''పరమపతివ్రతన్ సభఁ దపస్వినిఁ బాండవధర్మపత్ని ధ
ర్మరత నయోనిజం బ్రకృతిమానవభామినిఁగాఁ దలంచి దె
ప్పరములు వల్కఁగాఁ దగునె? బాల్యము నాదిగ దుష్టభావనం
బెరిఁగితి; నీ నిమిత్తమునఁ బెద్దయు దుఃఖితు లైరి పాండవుల్''. **(సభా. 2.255)**

అని మందలించి పాండవులపట్ల గల ఆగ్రహాన్ని మానుకొమ్మని హితవుచెప్పి పంపాడు. ఆ తరువాత దుర్యోధనుడికి తెలియకుండా ద్రౌపదిని పిలిపించి, ఆమెను నయవాక్యాలతో బుజ్జగించి, 'నా కోడండ్రలో నీవే పూజనీయ'వని ప్రశంసించి, వరాలిస్తాను కోరుకొమ్మన్నాడు. ఆమె క్షత్రియవనితకు తగినట్లుగా రెండువరాలు కోరుకొన్నది. ఒకటి- ధర్మరాజును దాస్యంనుండి విముక్తి చేయుమని కోరింది. దానివలన ద్రౌపదికి అతడివలన కలిగిన ప్రతివింధ్యుడు దాసపుత్త్రు డనే అపప్రథకు

దూరమౌతాడని భావించింది. ధర్మరాజు తరువాత తన పుత్త్రుడు మూర్ధాభిషిక్తు డైతే మిగిలిన ఉపపాండవులకు, సుభద్రాతనయుడికి ఉండే దాస్యులనే మచ్చ తన కొడుకుకు లేకుండా ఉండాలని ఆమె మనసులోని మాట. ఆ తరువాత భీమార్జున నకులసహదేవులు ఆయుధాలతోసహా దాస్యవిముక్తులు కావాలని కోరింది. ధృతరాష్ట్రు డావరా లిచ్చాడు. కోడలి గుణాలకు ధర్మతత్పరతకు మెచ్చుకొన్నాడు. ధర్మజుడిని పిలిపించి అతని రాజ్యం అతని కిచ్చి వైభవోపేతంగా ఇంద్రప్రస్థానికి తిరిగిపంపాడు. పంపుతూ-

తే. "నీవు నిత్యంబు వృద్ధోపసేవఁ జేసి
యెఱుఁగు దెల్లధర్మంబుల; నెఱుక లేక
కడఁగి నీ కెగ్గు సేసె నా కొడుకు; దీని
మఱచునది; నీకు నే నొండ్లు గఱపనేల?" **(సభా. 2.265)**

అని ధర్మరాజును ప్రశంసించి పలకటమే కాకుండా తననూ తన కొడుకునూ కించపరచుకొని దయాభిక్ష కోరినట్లు మాట్లాడాడు. ఉత్తములైనవారు ఇతరుల అపరాధాలను మనసులో పెట్టుకోరనీ, ఓర్పును ప్రకటిస్తారనీ, గుణాలను గ్రహించి దోషాలను విడిచిపెడతారనీ పేర్కొన్నాడు. తాను బుద్ధిలేక జూదాన్ని ఉపేక్షించాననీ, ముసలితనంచేత తెలివిమాలినవాడైన తనను, తల్లి అయిన గాంధారిని చూచిఅయినా దుర్యోధనాదుల దుర్నయాలను సహించు మనీ ధర్మరాజును వేడుకొన్నాడు. ధర్మరాజుకు పాండురాజు రాజ్యాన్ని సమర్పించాడు. రంగం ముగియవచ్చింది. ఆ రంగంలో ద్రౌపది నిర్వహించిన పాత్రను పఠితహృదయంలో ప్రతిష్ఠిత మయ్యేటట్లు తరల మనే విశేషవృత్తాన్ని వాడి నన్నయ సూత్రధారుడిగా గానంచేశాడు. నాటకప్రయోగంలో ఇది ఒక చూళికవంటిది.

తరలము.

"తరుణి ద్రౌపది యిట్లు పాండవధార్తరాష్ట్రుల దైన భీ
కరపరస్పరకోపవేగము గ్రన్నఁ బాచి విపత్తిసా
గరనిమగ్నుల నుద్ధరించెఁ బ్రకాశకీర్తుల ధీరులం
బురుషసింహములన్ నిజేశులఁ బూని తద్దయుఁ బ్రీతితోన్." **(సభా. 2.268)**

ఈ సన్నివేశాన్ని నాటకీయశిల్పదృష్టితో, డిమలక్షణయుక్తితో గమనిస్తే కొన్ని విశేషాలు గోచరిస్తాయి.

1. గాంధారి విదురుడితో కలసివచ్చి ధృతరాష్ట్రుడిముందు నివేదించిన విశేషాలూ, ధృతరాష్ట్రుడు వెంటవెంటనే దుర్యోధనుడినీ ద్రౌపదినీ, ధర్మరాజునూ పిలిపించి, వారితో మాట్లాడి తీసికొన్న నిర్ణయాలూ కలిసి అవపాతమనే ఆరభటీ వృత్తిభేదాన్ని సమగ్రంగా చిత్రించాయి.

2. ధృతరాష్ట్రుడు ప్రదర్శించిన రాజనీతి సంఘాత్యం అనే సాత్త్వతీవృత్తికి సమగ్రోదాహరణం. దుర్యోధన కర్ణ శకుని దుశ్శాసనాదులు ఒక కూటమిగా కూడి కపటద్యూతాన్ని నడిపి, పాండవసంపదను హరించి, వారిని వారిభార్యను అవమానించారు. వారి దుష్టవ్యాపారంవలన కలిగే విపత్తునుండి తప్పించుకొనటానికి ధృతరాష్ట్రుడు సామదానోపాయాలను ప్రయోగించాడు, రాజ్యదానం చేసి అర్థశక్తిని ప్రదర్శించాడు. ఆత్మదోషాన్ని చెప్పుకొని క్రుద్ధులను అనునయించాడు. అనేక కపటాలతో ఇతరులను చంపటానికి గానీ, కీడు కలిగించటానికి గానీ ఒక కూటమి ప్రయత్నిస్తే, దానిని భేదించటానికి చేసే బలమైన యత్నంలోనే సంఘాత్యమనే సాత్త్వతీవృత్తి రూపుకట్టుతుంది. అది ఈ అంకంలో ప్రదర్శితమైనది.

నిజానికి ఇంతటితో ఈ రూపకం ముగిసే అవకాశం ఉన్నది. కౌరవులచేత ఆరంభించబడిన కార్యం ఫలించినట్లు ఫలించి విఫలమైపోయింది. బీజప్రగతి దృశ్యాదృశ్యమైపోయింది. ఈ సన్నివేశం గర్భసంధివంటిది. ఇందులో ప్రాప్త్యాశగా ప్రవర్తిల్లినవి రెండంశాలు.

1. సతికారణంగా వచ్చిన సామ్రాజ్యం పురుషులకు పౌరుషచిహ్నం కాదని శత్రువులమీద విరుచుకొనిపడటానికి పూనుకొన్నాడు భీముడు. ధర్మజుడు చేయెత్తి అతడిని వారించాడు. దీనివలన ధృతరాష్ట్రు డిచ్చిన రాజ్యం పాండవుల పరిపూర్ణమైన అంగీకారాన్ని పొందలేకపోయింది. దానితో యుద్ధం అనివార్యమైనది.

2. దుర్యోధనుడు తండ్రిని కలిసి పాండవులతో ఇకపై స్నేహం కుదరదనీ, వారిని అవమానించి అనునయించటం పాములను రెచ్చగొట్టి గొంతులదగ్గర ఉంచుకొన్నట్లే అని వివరించి అనుద్యూతంలో వారి నోడించి పన్నెండేళ్ల అరణ్యవాసం, ఒకయేడు అజ్ఞాతవాసం చేయటానికి పంప నిశ్చయించటం.

3. దుర్యోధనుడి చర్యలలో మరొక సంఘాత్యస్ఫూర్తి భాసించి కథను ముందుకు నడిపించింది. దీనితో బీజఫలాని కనువైన ప్రాప్త్యాశ సిద్ధించింది. అవమర్శసంధి ఆకృతి తాల్చింది.

అనుద్యూతం చివరిదైన నాల్గవ అంకంవంటిది. అందులో ధర్మజుడు మరల ఓడి అరణ్యఅజ్ఞాతవాస వ్రతాన్ని నిర్వహించ పూనుకొంటాడు. అది ఆకృతిలో చిన్నదైనా అందులోని శకునిమాటలు నాటకీయతను పోషించాయి. అందులో కపటంతోకూడిన సంఫేట మనే ఆరభటీవృత్తి ద్యూతయుద్ధపరంగా ప్రయోగించబడింది.

ఈ డిమప్రాయమైన కథాఘట్టంలో జూదానికి కూర్చున్నది మొదలు ధర్మరాజు పాత్రనోట ఒకమాటకూడా పలికించకుండ కార్యాన్ని నడిపించిన ప్రజ్ఞ నన్నయది. లోనారసి చూస్తే- ఒక విశేషం భావించవచ్చును. భరతుడు నాట్యశాస్త్రంలో ఏ యే వృత్తులు ఏ యే రసాలలో ప్రయోగించబడతాయో వివరిస్తూ "సాత్త్వతీ చాపి విజ్ఞేయా వీరాద్భుత శమాశ్రయా" (భరతనాట్యశాస్త్రమ్. 18.73 శ్లో) అని అన్నాడు. దీనికి "వీరాద్భుతసమాశ్రయా" అని పాఠాంతరం ఉన్నదన్నారు కొందరు. శాంతరసవాదులు 'శమ' శబ్దాన్ని గ్రహిస్తారు. ఇతరులు 'సమ' శబ్దాన్ని సమర్థిస్తారు. శమ శబ్దమే సార్థకమని ధర్మజుడి పాత్రవైఖరి స్పష్టంచేస్తున్నది. కురుసభలో అంతటి సంక్షోభం తనవలన రేగినా, చుట్టూ ఉన్న పాత్రలన్నీ వీర రౌద్ర కరుణోద్వేగాలతో ఆవేశాన్ని ప్రదర్శిస్తూ ఉన్నా, ధర్మజుడు మాత్రం మూర్తికట్టిన శమం లాగా స్థిరుడై నిలిచాడు. సుడిగాలివలె యుద్ధానికి సిద్ధమైన భీమసేనుడిని చేయెత్తి సైగచేసి ఆపగలిగాడు. భీష్మాదులచేత, అర్జునుడిచేత సమున్నతుడుగా కీర్తించబడ్డాడు. శమంకూడా సాత్వతీవృత్తిచేత పోషించబడుతుందని నాటకీయంగా నిరూపించాడు. డిమంలో భాసించే మానసికసంక్షోభ వాతావరణంలోకూడా శాంతపర్వతంవలె నిలిచిన ధర్మజుడినిగురించి అర్జునుడు చాటిన ధర్మవీరగీతం మహాభారతనాయకుడైన ధీరోదాత్తుడి కీర్తి కెత్తిన విజయపతాకం.

సీ. "ధర్మతనూజుండు ధర్మువు తప్పిన । ధరణీతలంబెల్లఁ దల్లడిల్లుఁ
దగిలి సుహృద్ద్యూతధర్మయుద్ధములకుఁ । బరులచేఁ బిలువంగఁబడి విభుండు
గడఁగక విముఖుండు గాఁ జన దని శుభ । క్షాత్త్రధర్మంబు లోకంబునందు
నిలిపెఁ దా నిది పతినేరమియే? దైవ । వైపరీత్యంబైన వనరఁ దగునె?". **(సభా. 2.224)**

అన్నది సభాపర్వనాయకధర్మశీలసంకీర్తనం! నన్నయ నాటకీయరచనాశిల్పసుకేతనం!

ఈవిధంగా పరిశీలిస్తే నన్నయరచనలో నాటకీయత సంతరించుకొన్న సన్నివేశాలు మరికొన్ని గమనించవచ్చును. స్థాలీపులాక న్యాయాన్ని అనుసరించి యీ వివేచన చేయడ మైనది. నాటకలక్షణాలతో తీర్చిదిద్దిన కథలు యయాతి, దుష్యంత, నలమహారాజు చరిత్రలు. వాటినిగురించి ఆరణ్యపర్వపీఠికలో పరిశీలించటం సందర్భోచిత్యం.

నన్నయనాటకీయత ఆయన చెప్పుకొన్న 'ప్రసన్నకథాకలితార్థయుక్తి'లో భాగమే. నన్నయకథాకథనశిల్పం తల్లివంటిదైతే నాటకీయత ఎత్తుడుబిడ్డవంటిది. చంకబిడ్డ తల్లిని కేంద్రంగా చేసికొని చుట్టూ పారాడుతుంది, తిరుగుతుంది. ఒడిలోనుండి

లేచి ఆటలాడి మరల ఒడిలో చేరటమే ఎత్తుడుబిడ్డ లక్షణం. నన్నయ నాటకీయతకూడా అటువంటిదే. నాటకీయతకూ కథాకవితకూ పోష్యపోషకసంబంధం నన్నయ కల్పించిన అనుబంధం.

ప్రసన్నకథాకలితార్థయుక్తి

సంస్కృతమహాభారతంలోని సభాపర్వంతో పోల్చిచూస్తే నన్నయ సభాపర్వం సగానికి సగం తగ్గినట్లు కనపడుతుంది. కథలో వాపు తగ్గి బలుపు పెరిగింది. అంటే వ్యాసభారతాన్ని సర్వార్థప్రధానంగా కాక పరమార్థప్రధానంగా నన్నయ తెలుగులో పునర్నిర్మించాడన్నమాట! వ్యాసుడిది శాస్త్రేతిహాసం; నన్నయది కావ్యేతిహాసం! శాస్త్రం వాచ్యప్రతిపత్తిమీద నిలుస్తుంది; కావ్యం వ్యంగ్యగౌరవంతో జీవిస్తుంది. ఇతిహాసం చతుర్విధపురుషార్థప్రధానమైన జీవితాన్ని సత్యదృష్టితో ఆవిష్కరిస్తుంది. అందువలన వ్యాసభారతాన్ని చూచే చూపుకంటె భిన్నమైన దృక్పథం ఆంధ్రమహాభారతానుశీలనంలో అనుసరించాలి. వ్యాసరచన శాస్త్రేతిహాసప్రక్రియలో మేరునగశిఖరం. నన్నయరచన కావ్యేతిహాసప్రక్రియలో ఎవరెస్టుశిఖరం!

వ్యాసనన్నయల రచనాదృక్పథాలలోని భేదం తెలియటానికి ఒకఅంశాన్ని గమనిద్దాం. మహాభారతంలో శ్రీకృష్ణమహత్త్వాన్ని విస్తృతంగా వర్ణించి దానిని కార్ష్ణవేదంగా రూపొందించటం వ్యాసహృదయం. ఆ అర్థాన్ని వీలైనప్పుడెల్లా వివరించి, వర్ణించి, వ్యాఖ్యానించి విస్తృతంగా చెప్పటం వ్యాసరచనాశిల్పం. నన్నయ ఆ అంశాలను సంగ్రహం చేస్తాడు. కాని, శ్రీకృష్ణమహత్త్వాన్ని తగ్గించడు. వ్యాసుడు వాచ్యం చేసినచోట వ్యంగ్యమర్యాదను పాటించి దానిని భావనామయం చేస్తాడు. అంటే- అల్పాక్షరాలలో అనల్పార్థరచన చేస్తాడన్నమాట. అది ఇతిహాసానికి కావ్యస్వభావాన్ని సంయోజనం చేయటం.

సభాపర్వంలో రెండుచోట్ల ప్రధానంగా శ్రీకృష్ణమహత్త్వం ప్రకటితమౌతుంది. మొదటిచోటు- రాజసూయంలో శ్రీకృష్ణుడిని గురించి భీష్ముడు చేసిన ప్రశంసలు. శిశుపాలుడు చేసిన దూషణలు. రెండవచోటు- కౌరవసభలో ద్రౌపది శ్రీకృష్ణుడిని ఆర్తితో ఎలుగెత్తి పిలవటం- విస్తృతంగా ఉన్నాయి. వాటిని తగ్గించి నన్నయ సంగ్రహమైన సారవద్రచన చేశాడు. కాని, దానివలన 'కృష్ణద్వైపాయన మునివృషభాభిహిత మహాభారతబద్ధనిరూపితార్థము' చెడలేదు. పైపెచ్చు ధ్వనిమయమై రమణీయమై నిలిచింది. మచ్చుకు ద్రౌపదీవస్త్రాపహరణ ఘట్టంలోని నన్నయరచనను గమనిస్తే ఈ సత్యం బైటపడుతుంది.

శ్లో. ''ఆకృష్యమాణే వసనే ద్రౌపద్యా చింతితో హరిః
గోవింద ద్వారకావాసిన్ కృష్ణ గోపీజనప్రియ
కౌరవైః పరిభూతాం మాం కిం నజానాసి కేశవ! ॥
హేనాథ హే రమానాథ ప్రజానాథార్తినాశన
కౌరవార్ణవమగ్నాం మా ముద్ధరస్వ జనార్దన ॥
కృష్ణ కృష్ణ మహాయోగిన్ విశ్వాత్మన్ విశ్వభావన
ప్రపన్నాం పాహి గోవింద కురుమధ్యేఽవసీదతీం ॥
ఇత్యనుస్మృత్య కృష్ణం సా హరిం త్రిభువనేశ్వరం
ప్రారుద ద్దుఃఖితా రాజ న్ముఖ మాచ్ఛాద్య భామినీ ॥
యాజ్ఞసేన్యా వచ శ్రుత్వా కృష్ణో గహ్వరితోఽభవత్
త్యక్త్వా శయ్యాసనం పద్మాం కృపాళుః కృపయాఽభ్యగాత్ ॥
కృష్ణంచ విష్ణుంచ హరిం నరంచ త్రాణాయ విక్రోశతి యాజ్ఞసేనీ
తతస్తు ధర్మోఽంతరితో మహాత్మా సమావృణో ద్వై వివిధై స్సువస్త్రైః ॥''

(సం. సభా. 61. 40; 542 అథస్సూచి)

ఈ వర్ణనం గమనిస్తే భాగవతంలోని గజేంద్రమోక్షణఘట్టంలో గజేంద్రుడిఆర్తి గుర్తుకు వస్తుంది. గజేంద్రుడిని కాపాడటానికి శ్రీవిష్ణువు వలెనే ద్రౌపదిని రక్షించటానికి శ్రీకృష్ణుడు సిద్ధమయ్యాడు. 'ద్రౌపద్యా చింతితో హరిః' అనే వాక్యంతో మొదలై 'విక్రోశతి యాజ్ఞసేనీ' అనే వాక్యంతో ముగిసే పై ఘట్టంలో శ్రీకృష్ణుడిని ఆమె ఆర్తితో పిలిచినట్లూ, ఆత డామెను రక్షించినట్లూ స్పష్టమౌతున్నది. అప్పుడు ఆ సంగతి సభలో అందరికీ తెలిసిఉంటుంది. తెలిస్తే దానిప్రసక్తి కథలో వచ్చిఉండేది. నన్నయ దీనిని లోనారసి భావించి పునర్నిర్మించాడు. అసలీ కృష్ణస్తుతినంతా ఎత్తివేశాడు. ''భామిని కృష్ణుఁ దలంచె భీతయై'' అని మాత్రం చెప్పి ఊరుకొన్నాడు.

దీనివలన నన్నయ అనేకార్థాలను సాధించాడు. నన్నయరచనలో ద్రౌపది మూలంలోవలె ఆక్రోశించదు. ధీరోదాత్తురాలువలె దుఃఖిస్తుంది. బేలవలె శ్రీకృష్ణుడి నామావళి చదువదు. 'కృష్ణ' అనే నామాన్ని ఒక్కదానినే స్మరిస్తుంది. అది ఆమెకూ ఆ గోపాలుడికీ అద్వైతంగా కుదిరిన పేరు. దాన్ని స్మరిస్తే శ్రీకృష్ణుడు ఆ వస్త్రాపహరణం తనకే జరుగుతున్నట్లు భావించాలి. ద్రౌపదికీ శ్రీకృష్ణుడికీ అభేదభావం నన్నయ వ్యంగ్యంగా సాధించటంవలన శ్రీకృష్ణుడు శయ్యాసనం వదలి కదలిరావలసిన అవసరం తప్పింది. ద్రౌపది మనసులో స్మరించిన కృష్ణనామం సభలోనివారికి వినపడే అవకాశం లేదు. అందువలన ఆమె జఘనప్రదేశంపై వస్త్రం తొలగకుండా, ఆమెకు నగ్నత్వం ఏర్పడకుండా రక్షించినశక్తి ఎవరైఉంటారనే యోచన సభికులకు ఏర్పడుతుంది. కృష్ణుడు రక్షించా డని కృష్ణకు తెలుసు. సభికులుమాత్రం ఆమెపాతివ్రత్యమే ఆమెను రక్షించిందని భావించినట్లు ధ్వనిమయంగా తెలుస్తుంది. బంధకిని వివస్త్రను చేసినా తప్పులే దనీ, పలువురు భర్తలకు భార్యఅయిన ద్రౌపదిని ఎవరు ఉపభోగించినా దోషం లేదనీ, అటువంటి సామాన్యవనిత పట్టమహిషిగాకంటె దాసిగా ఉండటం సమంజసమనీ దుర్యోధనకర్ణాదుల తలంపులు. అందుకే వా రామెను సభలో వివస్త్రను చేయాలని తలపెట్టారు. వారి మొగాలు బొప్పులు కట్టేటట్లు ద్రౌపది తన శీలమాహాత్మ్యంతో సభలోనే సమాధానం చెప్పినట్లు రచించటం నన్నయ తాత్పర్యం. అది సన్నివేశౌచిత్యంకూడ. కావ్యదృష్టితో చూస్తే నన్నయరచన మిన్న. పురాణదృష్టితో పరిశీలిస్తే వ్యాసుడిరచన పైచేయి.

నన్నయగారి ప్రసన్నకథాకలితార్థయుక్తినిగురించి మౌలికంగా ఎన్నో అంశాలను వివరించినవారు కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు. వాటిలోనూ సభాపర్వంలోని నన్నయ కథాకథనశిల్ప విశేషాలనుగురించి వారు చేసిన వ్యాఖ్యలు అపూర్వంగా ఉన్నాయి. కాళిదాసుకు మల్లినాథుడివలె నన్నయకు విశ్వనాథ తెలుగులో పేరుతెచ్చారు. వారు చెప్పిన కొన్ని విలువైన అంశాలను స్మరించటం అవసరం.

1. సభాపర్వంలో ద్రౌపదికి గల ప్రాధాన్యం

''పాండవ కౌరవ ద్యూత కథాసౌధ మూలస్తంభము ద్రౌపది. ఇది నన్నయగారు చేసిన నిర్ణయము. అందుచేత నీ కథయొక్క యాద్యంతములందు నన్నయగారు ద్రౌపదిని నిక్షేపించిరి. గాంధారి కోడండ్రు

తే. అఖిలలావణ్యపుంజంబు నబ్జభవుఁడు
మెలఁతగా దీనియందు నిర్మించె నొక్కొ
కానినాఁ డిట్టి కాంతి యేకాంతలందు
నేల లే దని సామర్షహృదయ లైరి. ॥ **(సభా. 2.160)**

ఆమెయొక్క లావణ్యమును జూచి కౌరవుల భార్యలు చుప్పనాతితనమునుఁ బొందిరి. నన్నయ్యగారు వాడిన శబ్దము లావణ్యము. సౌందర్యము కాదు. లావణ్య శబ్దమునకు సౌందర్యమని సామాన్యముగా నర్థము చెప్పినను నిజమైన యర్థ మదికాదు. లవణము యొక్క భావము లావణ్యము. రాతిఉప్పు పగులగొట్టినచోఁ బలకలు పలకలుగా నుండును. ఒక ద్రవ్యము పలకలు పలకలుగా నున్నపుడు, నది స్నిగ్ధమైన వస్తువైనపుడు దానిమీఁద సూర్యకిరణ ప్రసారము జరిగి యది తళతళలాడును. ఆ మెఱుపు లావణ్యము. స్త్రీయొక్క శరీరచ్ఛాయయు, స్నిగ్ధత్వమును, బోషణచేత వచ్చిన సౌకుమార్యమును, నైగనిగ్యమును- నివి యన్నియు లావణ్య మనిపించుకొనును. అట్టి లావణ్యము ద్రౌపదీశరీరమందుఁ

గౌరవుల భార్యలు మాత్సర్యము వహించఁ దగినంతగా నుండెను. దీనిచేత ద్రౌపదీదేవియొక్క భోగలక్షణాధిక్యము వ్యజ్యమాన మగుచున్నది. అందుచేత వారు మత్సరము పడిరి. వా రంద ఱా రాత్రి తమభర్త లందఱితో నామెయొక్క యీ భోగవైశిష్ట్యమునుఁగూర్చి చెప్పియుందురు. వా రందఱకు ద్రౌపది యన్నచోఁ జుప్పనాతితనము బలిసినది. మఱునాఁడు జరుగఁబోవు నధర్మమునకు నందఱును హర్షించిరి. ఇంత ప్రయోజనకారిగా నన్నయ్యగా రీ పద్యము నిచ్చట నిక్షేపించిరి. ఒక్క ద్యూత కథా మూలస్తంభ మగుటయే కాదు. అట్టి మూలస్తంభ మగుటకుఁ బ్రధానకారణమయిన ద్రౌపదియందలి లక్షణములు, నా లక్షణములు వారిమాత్సర్యమునకు హేతువులు, నా మాత్సర్యము ద్రౌపదిపరాభవము హర్షించుటకు హేతువులు. ఈ రీతిగా నన్నయ్యగారు ద్యూతకథా మహాభవన మూలస్తంభ మయిన ద్రౌపదినిఁ దొట్టదొలుత స్థాపించి తరువాత ద్యూతకథలోనికి వెళ్ళిరి.

మఱియు నీ ద్యూతకథావసానము ద్రౌపది. ఆమెకు ధృతరాష్ట్రుఁ డిచ్చిన వరములచేతనే యా విచిత్ర ద్యూతఫల మహావైపరీత్యము మఱియొక త్రోవ పట్టినది. ఆ వరము లీయకున్నచో భారతకథ యేమి యయ్యెడిది? పాండవులు బ్రదికినన్నాళ్లు కౌరవదాసులుగా నుండిపోదురా? ఉండిపోయెడినాడు భారతకథయే లేదు. పాండవులు దాసులై యుండి కౌరవులతో యుద్ధము చేయుదురా? ఇది యొక చిత్రమైన సమస్య. ఆ సమస్య సమాధానములేని సమస్య. ద్రౌపదిచేతఁ బరిష్కరించఁబడినది. ఈ రీతిగా ద్రౌపది భారతకథలో నున్న యనేకములయిన కథాప్రవాహ భంజకము లయిన ఘట్టములలోఁ గథ సాగించిన యొక సహకారిణి. ఈ ఘట్టమునందు ద్రౌపదియొక్క ప్రాధాన్య మిట్టిది. దానినిఁ దెలిసికొని నన్నయగారు రచనచేసిరి. మహాకవి తాను వ్రాసెడి కథయొక్క స్వరూపము తెలిసికొని వ్రాయును. ఆ కథాగత సమస్యలనుఁ బరిష్కరించును. ఆ పరిష్కరించిన వైఖరి ఘట్టములుగాఁ గనిపించును. ఆ ఘట్టములు మనకు సువ్యక్తములుగా నుండును. వానియొక్క సువ్యక్తతచేతనే పాఠకులకు మహాకవి చేసిన కథానిర్ణయము తెలియును. అవి సువ్యక్తమగుటకుఁ గవి నిరూపించిన విషయములు శిల్పతీర్థములు.

ఈ కథావసానమునందు మఱల నన్నయగా రిట్లు వ్రాసెను.

తరలము.

తరుణి ద్రౌపది యిట్లు పాండవధార్తరాష్ట్రులదైన భీ
కరపరస్పరకోపవేగము గ్రన్నఁ బాచి విపత్తిసా
గర నిమగ్నుల నుద్ధరించెఁ బ్రకాశకీర్తుల ధీరులం
బురుషసింహములన్ నిజేశులఁ బూని దద్దయుఁ బ్రీతితోన్. ॥ **(సభా. 2.268)**

ఈ రెండు పద్యములచేత ద్యూతకథయంతయు నెట్లు ద్రౌపదిమీఁద నాధారపడియున్నదో, భారతకథా ప్రవాహములో నిది యెటువంటి ఘట్టమో నన్నయ్యగారు నిరూపించిరి. ఈ రెండును నన్నయ్యగారి మహాశిల్పమున కుదాహరణములు.'' (ఆంధ్రమహాభారతోపన్యాసములు: నన్నయగారి భారతాంధ్రీకరణము (వ్యా). పు. 12-14).

2. ద్రౌపదీవస్త్రాపహరణం - వివస్త్రత

''నన్నయగారు తా నొక విషయమును గాఢముగా నాలోచించికాని వ్రాయరు. ద్రౌపదీవస్త్రాపహరణవిషయమున భారతమునం దిట్లున్నది.

శ్లో. ఆకృష్యమాణే వసనే ద్రౌపద్యాస్తు విశాంపతే
తద్రూప మపరం వస్త్రం ప్రాదురాసీ దనేకశః ॥
నానారాగవిరాగాణి వసనాన్యథ వై ప్రభో
ప్రాదుర్భవంతి శతశః ధర్మస్య పరిపాలనాత్ ॥

తతో హలహలా శబ్ద స్తత్రాసీద్ ఘోరనిస్స్వనః
త దద్భుతతమం లోకే వీక్ష్య సర్వే మహీభృతః ॥
శశంసు ర్ద్రౌపదీం తత్ర కుత్సంతో ధృతరాష్ట్రజం
శశాప తత్ర భీమస్తు రాజమధ్యే బృహత్స్వనః ॥ **(సం. సభా. 61. 41-43; అథస్సూచికలు 553,554)**

దీనిని నన్నయగా రిట్లు తెనుఁగు చేసిరి.

సీ. ఇది సేయఁగాదని మది విచారింపక సద్గర్వితుండు దుశ్శాసనుండు
నెట్టన ద్రౌపది గట్టిన పుట్టంబు సభలోన విడ్చె నాశంక లేక
యుడుగక యొలువవంగఁబడియు ము న్నపనీత మైన తద్వస్త్రంబునట్టి వలువ
లలితాంగి జఘనమండలమునఁ బాయక యొప్పచునున్న న య్యువిదఁ జూచి

ఆ. సభ్యులెల్ల నుదితసమ్మదు లయిరి దుశ్శాసనుండు వస్త్రచయము పర్వ
తోపమాన మైన నొలువంగనోపక యుడిగె లజ్జఁ బొంది యుక్కుదక్కి. ॥

వ. ఇట్లు భీమసేనుఁడు ద్రుపదరాజనందనకు దుశ్శాసనుండు సేసినయవమానంబు సూచి, కోపరక్తాంత నయనుం డగుచు నంతకాకారంబున దంతసందష్ట దారుణముఖుం డయి యెల్లవారును విన నిట్లనియె.
(సభా. 2.231, 232)

వివిధములైన యనేక వర్ణములు కలిగిన వసనములు పుట్టుచున్నవి. దీనికి హేతువు ధర్మము పరిపాలింపఁబడుట, సభలోఁ బెద్ద ధ్వని కలిగెను. ఈ యద్భుతమునుఁ జూచి రాజు లందఱు ద్రౌపదినిఁ బొగడిరి. దుర్యోధనునియందుఁ గుత్స వహించిరి. భీముఁడు శపథముఁ జేసెను. నన్నయగారు వస్త్రములయొక్క నానారాగవిరాగత్వము వర్ణించలేదు. అది యనవసరము, జనులలో హలాహలశబ్ద ముదయించినది. దానిని నన్నయగారు వదలిపెట్టిరి. ఇది యొక మహాఘోరము జరుగుచున్నపుడు జనులు నిస్తబ్ధులై నీరవులై యుండిపోదురు. అందుచేత నన్నయగారు దానిని వదలిపెట్టెను. ఆమెను జూచి సభ్యు లుదితసమ్మదు లయిరి. ప్రశంసించలేదు.

'తద్రూప మపరం వస్త్రం ప్రాదుర్భవతి' యన్న మాటను 'ఉడుగక యొలువవంగఁ బడియు ము న్నపనీతమైన త ద్వస్త్రమ్మునట్టి వలువ లలితాంగి జఘనమండలమునఁ బాయక యొప్పచునున్న'దని నన్నయగారు తెలుఁగుచేసిరి. ఈ తెలుఁగు సేతలోనున్న సొగసేమి? ద్రౌపదికి మానభంగము చేయవలయు నని దుర్యోధనాదుల యూహ, మానభంగ మనఁగా నేమి? ఆమె వివస్త్రయగుట. వివస్త్రత యనఁగా నగ్నత, నగ్నత యనఁగా నేమి? ఇచట విచారణ చేయవలెను. వస్త్రము ధరించినందువలన శరీరావయవములు కప్పఁబడు నని యనుకొందుము. కప్పఁబడుట యనఁగా నొక వస్తువుయొక్క స్వరూపజ్ఞాన మేర్పడకుండ నుండుట, శరీరముయొక్క నగ్నత్వ మనఁగా శరీరాంచలములు భాసించుట, మన కొక వస్తువు కనిపించుచున్న దనఁగా నా వస్తువుయొక్క యవధిభూతములయిన రేఖలు సువిస్పష్టముగాఁ గనిపించుటయే, ఒక పేటికను జూచితిమి. ఒక ఘటమును జూచితిమి. మఱి యింకొక వస్తువును జూచితిమి. త ద్వస్తువుయొక్క లోపలిభాగమును జూడలేదు. దాని పై యంచులనుఁ జూచితిమి. ఈ యంచులు రేఖలు. దృష్టికిఁ గనిపించునది రేఖ. అందుచేతనే చిత్రకారుఁడు రేఖలతో మనకు వస్తుదర్శన మీయగలఁడు. వస్త్రముచేత శరీరాంచలరేఖలు కప్పఁబడును. అపుడు శరీరము వస్త్రాచ్ఛాదిత మైనదని చెప్పదుము. అంచల రేఖలు విస్పష్టముగా భాసించుచు దానిపయిన వస్త్రమున్నను వస్తువు వస్తువుగా భాసించును. కొందఱు పెట్టెలకు మాసిపోకుండఁ బైన గుడ్డలువేసి కుట్టింతురు. పెట్టె కనిపించుచునే యుండును. ఆ పెట్టె కనిపించుట లేదు. పెట్టె యని గుర్తుపట్టుటకు వీలులేదని చెప్పుటకు వీలులేదు. పురుషులు వస్త్రములు ధరించుట యీ ప్రయోజనముకొఱకు. శరీరాంచలరేఖలు భాసించకుండ ముడుతలతోఁ, గుచ్చెళ్ళతో, మడతలతో వస్త్రములను

ధరించుట పేరు వస్త్రము ధరించుట. నగ్నత లేకుండఁ జేయుట. శరీరము నంటుకొనియున్న వస్త్రము నగ్నతను రక్షించదు. అందుచేతఁ బాశ్చాత్యులు వేయు దుస్తులు నగ్నతను సరిగా రక్షించవు. అది యనాగరకమైన వేషము. భారతీయులు కుచ్చెళ్లు పెట్టుకొని కట్టెడు ధోవతి పరమనాగరకమైన వేషము.

అట్టి కుచ్చెళ్లు, నట్టి మడతలు- నేది తొలఁగినను నగ్నత భాసించును. ద్రౌపది ధరించిన చీర యామెయొక్క నగ్నతను రక్షించునదిగా నున్నది. దుశ్శాసనుఁ డొక చీర తీసిన తరువాత మఱియొక చీర యచట భాసించినచో నది తొలఁగి యిది వచ్చులోన నగ్నత భాసించును. గాలిచేతఁ జీర తొలఁగినప్పుడే వేణీసంహారమున దుర్యోధనుఁడు భానుమతీవిషయమున నాటకరంగమైన గండము నిక్షేపించు స్థలములో నూరుప్రస్తావన చేసెను. అది నగ్నత. నగ్నత రేఖామాత్రమున భాసించినను ద్రౌపదికిఁ బరాభవము జరిగినట్లే. అందుకనియే 'మున్నపనీతమైన తద్వస్త్రమ్ము నట్టి వలువ'యని చెప్పుట. నానారాగవిరాగములైన వసనము లైనచో నొలిచిన వలువకు మఱల మొలిచిన వలువకు భేద మేర్పడి నగ్నతాభ్రాంతి కలుగవచ్చును. తద్వస్త్రము నట్టివలువ యనుటచేత నొకవలువ యొలువఁబడినది లేదు. మఱియొక వలువ, తత్స్థానీయమైనది, మొలిచినట్లు లేదు. నగ్నత లేదు సరికదా నగ్నతాభ్రాంతికూడ లేదు. ఇది యాశ్చర్యకరమైన రచన. నన్నయగా రీ విషయము నంత పరమసూక్ష్మముగా విచారించి, యా మాటల నచ్చటఁ బొదివెను. పరమేశ్వరానుగ్రహ మున్నచో నింత పరాభద్రమైన స్థితి యేర్పడుటయే. నగ్నత యనఁగా నేమి? యన్న విషయమును బహుముఖములుగా విచారించిన మహామేధాశాలి కాని యిట్లు వ్రాయలేఁడు." (ఆంధ్రమహాభారతోపన్యాసములు - నన్నయగారి భారతాంధ్రీకరణము (వ్యా)- పు. 6-9)

3. సంబుద్ధి - సంస్కృతి

"దుర్యోధనుడు ధర్మరాజుతో నెప్పుడు మాట్లాడడు. నన్నయ్యగారు వ్రాసిన భాగములో దుర్యోధనుడు ధర్మరాజుతో ద్యూతసమయమునందుతప్ప మరి యెప్పుడును మాటాడలేదు. ఈ ద్యూతసమయమున రెండుసారులే మాటాడెను. మొదటిసారి జూదమాడు మని, రెండవసారి తనబదులు తన మామయైన శకుని యాడు నని. ఈ రెండు పద్యములు చూడుడు.

"అనఘ! సుహృద్ద్యూతం బిం । దొనరింతము ప్రొద్దువోకయును నగు"

"అనఘ! మా మామ శకుని నాకై కడంగి । జూద మాడెడి నీతోడ"

మరియెచ్చటను దుర్యోధనుడు ధర్మరాజుతో మాటాడలేదు. ఈ మాటాడిన రెండుసార్లు ధర్మజుని 'అనఘా' అని సంబోధించెను. మొదటి పద్యములో సంబోధన మేదో పద్యరచన యట్లే యుండునని యనుకొన్నను రెండవపద్యములోని మొదటిసంబోధనము నన్నయ్యగారు బుద్ధిపూర్వకముగా నొక ప్రయోజన మర్థించియే యట్లు వ్రాసెనని తెలియగలదు. ఇది దుర్యోధనుడు ధర్మరాజుకు చేయుగౌరవము. వారికుటుంబములోని మర్యాద. దుర్యోధనునకు పాండవులయం దెంత మాత్సర్యమున్నను సముదాచారము నుల్లంఘించడు. పైన నతనికి ధర్మరాజునందు మిక్కిలి గౌరవము.

ఇట్లు రెండు సంబోధనలచేత నొక విచిత్రమైన నాగరకతయు, సముదాచారమును, కుటుంబమర్యాదయు, దుర్యోధనుని శీలములోని యొకయంశమును రహస్యముగా గుప్తపరచి లోనారసి తెలియఁదగిన శిల్పమును నన్నయ్యగారు ప్రదర్శించిరి." (నన్నయగారి ప్రసన్నకథాకలితార్థయుక్తి - పు. 135-136).

4. అన్నగారి అదుపు - అంతరార్థం

భీముడు దుశ్శాసనుడినీ, దుర్యోధనుడినీ భయంకరమైన యుద్ధంలో చంపుతానని రెండుప్రతిజ్ఞలు చేశాడు. 1."కురువృద్ధుల్ గురువృద్ధబాంధవు లనేకుల్ సూచుచుండన్...... ఉర్వీపతి చూచుచుండ నని నాస్వాదింతు నుగ్రాకృతిన్" (సభా.2.233); "ధారుణిరాజ్యసంపదమదంబున.... మదీయ బాహుపరివర్తిత చండగదాభిఘాత భగ్నోరుతరోరుఁ జేయుదు సుయోధను నుగ్రరణాంతరంబునన్." (సభా. 2. 249). ఈ రెండు ప్రతిజ్ఞలు చేసినప్పుడు ధర్మజుడు కిమ్మనలేదు. ద్రౌపది వరాలరూపంగా రాజ్యాన్ని ధృతరాష్ట్రుడినుండి తిరిగి పొందినప్పుడు భీముడు సతి కారణంగా వచ్చిన రాజ్యాన్ని అంగీకరించటానికి

అసమ్మతిని తెలిపి, శత్రువులను ఉగ్రరణంలో జయించి రాజ్యాన్ని పొందుతా నని ఆగ్రహించాడు. అప్పుడు ధర్మజుడు చేయెత్తి సైగజేసి భీముడిని అదుపులో పెట్టాడు. పైరెండు ప్రతిజ్ఞలకు స్పందించని ధర్మజుడు మూడవసారి ఎందుకు వారించాడు? అన్నప్రశ్నకు విలువైన వ్యాఖ్యానం చేశారు విశ్వనాథవారు-

1. ''మొదటిసారి ప్రతిజ్ఞలు చేసినపుడు భీముడు యుద్ధమున కింత సిద్ధపడలేదు. దుర్యోధనుని తొడలు విరుగఁ గొట్టెదనని యాయుధమ్ము లున్న వలనికి దృష్టులు సలుపుచు నగ్రజుమొగంబు చూచెను. అప్పుడు భీష్మ విదుర ద్రోణాదు లాపిరి. మొదటిసారి ప్రతిజ్ఞచేసి యూరకుండెను. ధృతరాష్ట్రుడు రాజ్యమిచ్చినతర్వాత, కౌరవులను చంపుదు నని వాచ్యముగా చెప్పెను. ఈ మూఁడు భేదములు చమత్కారముగా నున్నవి. మనకు చూచినచో ద్రౌపది వస్త్రము లొలుచుట మిక్కిలి దుర్భరము. తన తొడమీఁదఁ గూర్చుండ రమ్మనుట దానికంటె తక్కువది. ద్రౌపదివలన రాజ్యము మరల వచ్చుట తత్పూర్వము గల రెంటికంటె తక్కువది. కాని భీము డొకదానికంటె నొకదానికి నుత్తరోత్తర మధికాధిక కోపము పొందుచున్నట్లు కాన్పించుచున్నాడు. అతని కోప ముత్తరోత్తర బలీయ మని చెప్పుటకు గారణము? మొదటిసారి ప్రతిజ్ఞచేసి యూరకుండెను. రెండవ ప్రతిజ్ఞచేసి యాయుధాగారమువంకఁ జూచెను. మూఁడవసారి వాచ్యముగా చెప్పి వెంటనే యుద్ధము చేయుటకు బయలుదేరఁ బోవుచుండెను. ఇవి కారణములు. మొదటిసారి తాను ప్రతిజ్ఞ చేసెనుగాని వెంటనే కౌరవులను చంపు నూహ వెలిపరుచనే లేదు. అప్పు డతని కా యూహ లేదు. ఆ యూహ రెండవసారి కలిగెను. దానిని భీష్మ ద్రోణ విదురులు వారించినమాత్రతో సరిపోయినది. మూడవది అన్నగారే వారించెను. చేయి వలదన్నట్లు పై కెత్తెను. ధర్మరాజు చేసిన దింతమాత్రమే. తొడలు విరుగ గొట్టెద నన్నప్పు డన్నగారి యంగీకార మున్నదో లేదో యని తెలిసికొనుట కతనివంక చూచుచుండెను. శత్రువు లంతటి యపకృతి చేసినప్పుడు, తన కంతటి కోపము వచ్చినపు డన్నగా రంగీకరించునా లేదా యన్న విచారణ విచిత్రముగా నున్నది. ఆ యన్న యదుపెట్టిదో? అతని నాయకత్వ మెట్టిదో? ఈ తమ్ముల యనుయాయిత్వ మెట్టిదో? మనసు పట్టని యొక శైష్యోపాధ్యాయిక వ్యంగ్యమగుచున్నది.''

2. ''ఇప్పు డీ మూఁడు పరిస్థితులలో నుత్తరోత్తర మధికాధిక మగుటకు కారణ మేమి?

మొదటిది జంతుత్వమాత్రసంబంధ మయినది; రెండవది నరత్వ సంబంధ మయినది. మూఁడవది స్త్రీసంబంధమయిన మరల రాజ్యము సమకూరుట వట్టి ధర్మవిషయము. పాండవులు ధర్మనిష్ఠులు. ధర్మముమీఁద నాధారపడి మోక్షమున్నది. తా నార్జించిన విత్త ముత్తమము, పిత్రార్జితము మధ్యమము, భ్రాతృవిత్త మధమము, స్త్రీవిత్త మధమాధమము. అందుచేత భీముడు మిక్కిలియు కోపించెను. ధర్మరాజు వారించెను.

ద్రౌపదీసంపాదిత మయిన రాజ్యానుభూతియందు ధర్మరాజునకుమాత్ర మీ యధమాధమబుద్ధి లేదా? ఎందుకు వారించెను? ధర్మజునియొక్క ధర్మస్వరూపము చాల నిగూఢ మయినది. ధృతరాష్ట్రుఁ డిచ్చుటచేత రాజ్య మిప్పుడు వచ్చినది. పాండవులకు మరల స్వాతంత్ర్యము వచ్చినది. తత్పూర్వమునందు తమమీఁద తమకు, తమ యాయుధములమీఁద తమకు తమ వర్మవరూథమ్ములమీఁద తమకు నధికారము లేదు. అందుకనియే ద్రౌపది యడిగిన రెండవవరము.

క. ''నెమ్మిని ధర్మజు నలువురు
తమ్ములుఁ దమయాయుధములఁ దమవర్మవరూ
థమ్ములయుఁదోడ సకలహి
తమ్ముగఁ బాయంగవలయు దాస్యమువలనన్.'' **(సభా. 2.261)**

అని యున్నది. అందుచేత నిప్పటి భీముని పౌరుషము, ఆయుధప్రయోగము చేయగల సామర్థ్యముకూడ స్త్రీవిత్తముక్రింద లెక్కగట్టబడవలయును. రాజ్యసంపద ననుభవించుటకు స్త్రీవిత్తదోష మెంత యున్నదో తమ పరాక్రమము ప్రకటించుటకు స్త్రీ ప్రసాదకృతసామర్థ్య మను దోస మంతియే యున్నది. ఇందుచేత ధర్మజుడు కరతలమ్మున వారించెను. తొడలు విరుగ గొట్టెద నన్నప్పుడు పరాక్రమము ప్రదర్శించుటకు వీలే లేదు. అందుచేత ధర్మరా జతనివంకనే చూడలేదు. ఇవి నన్నయ్యగారి రచనాంతర్నిగూఢమహార్థములు.'' (నన్నయగారి ప్రసన్నకథాకలితార్థయుక్తి- పుట. 155-159).

నన్నయకథాకథనశిల్పం

1. కార్యకారణపద్ధతి

కథ చెప్పటంలో రెండు పద్ధతులు ప్రసిద్ధం. 1. కాలక్రమపద్ధతి నాశ్రయించి చెప్పటం. 2. కార్యకారణపద్ధతి నాశ్రయించి చెప్పటం. ఈరెండు పద్ధతులు సందర్భాన్నిబట్టి శిల్పసుందరంగా శోభిల్లుతుంటాయి. అయితే మొదటిపద్ధతిలోకంటె రెండవ దానిలో ఉత్కంఠ, భావనం, పూర్వాపరసమన్వయం అనే గుణాలు ఆసక్తిదాయకంగా రాణిస్తాయి. సభాపర్వంలో సహజంగా కొంతకథ కార్యకారణసంబద్ధంగా చెప్పబడింది. ముఖ్యంగా- ధర్మజరాజసూయఘట్టం.

ఇందులో విశేషమేమంటే - ప్రథమాశ్వాసమంతా రాజసూయయాగం చేయటం ఫలంగా సాగే కార్యచైతన్యాన్ని ఉజ్జ్వలంగా వివరంగా వర్ణిస్తుంది. కాని, చివరకు రాజసూయయాగవర్ణనం అయిదారు పద్యాలలో ముగించివేస్తుంది. పఠిత ఈ సంగ్రహ రచనకు అసంతృప్తి చెందుతాడు. వివరాలు చెపితే బాగుండేది అనుకుంటాడు. ముందు వివరాలు తెలుస్తాయేమో అని ఒక ఆసక్తి కలిగిస్తూ ఆశ్వాసాన్ని ఆపటం నన్నయకథాకథనంలో ఒక శిల్పం. రెండోఆశ్వాసంలో పఠిత (శ్రోత) కోరే వివరాలన్నీ దుర్యోధనుడిచేత చెప్పించడం గమనిస్తే ఆశ్చర్యం వేస్తుంది. శత్రువులకు అసూయ పుట్టేటంత వైభవంగా రాజసూయం జరిగిందనే వస్తుధ్వని అందులో ఉన్నది. ధర్మరాజు రాజసూయ వైభవాన్ని కన్నులతో చూడలేని ధృతరాష్ట్రుడికి మనసుకు రూపుకట్టేటట్లు వర్ణించిచెప్పటం విశేషం. దానివలన కథలో పునరుక్తి తొలగి ఆసక్తి పెరిగింది.

ఇటువంటివే మరికొన్ని అంశాలు సభాపర్వకథాకథనశిల్పానికి వన్నె తెచ్చిపెట్టాయి. మచ్చుకు జరాసంధ శిశుపాలుర జన్మవృత్తాంతాలను వారివారి వధలకు ఉపబలకంగా చెప్పటం, వాటివలన శ్రీకృష్ణభీష్మల వర్తనాలలోని లోతులను శ్రోతలు లోనారసి గ్రహించే గాఢత సాధించబడింది.

2. సమన్వయసూత్రం

ప్రతిపర్వంలోనూ ఆ యా కథార్థాలను సమన్వయించుకొనటానికి కొన్ని కీలకమైన సమన్వయ సూత్రాలను అందించటం కథాకథనంలో కనపడే ఒక ప్రౌఢశిల్పం.

క. "నయనములు నాకుఁ, బవనత
నయవిజయులు, మనము కమలనాభుఁడు, వీరిం
బ్రియహితులఁ బాసి నిమిషం
బయినను నెట్లుండ నేర్తు నవిచేష్టుఁడనై". **(సభా. 1.169)**

అని ధర్మరాజు అనుకొంటాడు. ధర్మరాజు మూర్తికట్టిన ధర్మం. ఆ ధర్మానికి రెండు కళ్ళు భీమార్జునులు, అంటే ప్రవృత్తి నివృత్తులు, పురుషార్థపరార్థాలు. మానుష దైవీశక్తులు. మనసు శ్రీకృష్ణుడు. అతడు ధర్మతత్త్వస్వరూపుడు. కన్నులు చూస్తాయి. మనసు భావిస్తుంది. అనుభవిస్తుంది. మనస్సునుకూడా నేత్రంగా చెప్పటం ప్రసిద్ధి. మనోనేత్రం భౌతికనేత్రాలకంటె బలమైనది. అది తత్త్వాన్ని దర్శించగలుగుతుంది. కన్నులది వాస్తవజ్ఞానం, మనస్సుది తత్త్వదర్శనం. సభాపర్వకథార్థాలను ఈ దృష్టితో అర్థం చేసికొంటే ధర్మానికి మూడోకన్ను దైవం. ఇహపరాలు ఉభయనేత్రాలు. రాజసూయం చేసే ధర్మమూర్తిని విజయమూర్తిగా చేసినవి భీమార్జునుల భుజశౌర్యబలం, శ్రీకృష్ణుడి బుద్ధిబలం. అయినా వీరు ధర్మజుడికి సహాయకులే. నాయకుడికి అనునాయక, ఉపనాయకప్రాయులే అనే తాత్పర్యం గ్రాహ్యం. ఈ తాత్పర్యాన్ని శ్రీకృష్ణుడే వ్యాఖ్యానించి చెప్పాడు.

క. "బలిమిమెయిఁ బార్థురక్షా
బలమును బవనసుతుబాహుబలమును నా ని
ర్మలనీతిబలము నీకుం
గలుగ నసాధ్యంబు గలదె కౌరవనాథా!" **(సభా. 1. 163)**

రక్షాకవచమైన అర్జునుడు దైవీశక్తిని ధర్మరాజుకు కవచంగా అమర్చే బలం. నర డెక్కడుంటే అక్కడ నారాయణుడు. వారిద్దరు కలిసి ఎక్కడుంటే అక్కడ శ్రీవిజయం. అర్జునుడు అస్త్రశస్త్రాలను, దేవతలవరాలను పొందుతూ దివ్యశక్తులను తనలో సమీకరించుకొంటూ సాగే నిరంతరసాధకుడు. భీముడు జన్మసిద్ధంగా వచ్చిన వజ్రకాయంతో స్థిరమైన దేహబలంతో సిద్ధుడు. కృష్ణుడు బుద్ధిబలానికి ప్రతినిధి. పై రెండింటికి పరిమితు లున్నాయి. నిర్మలనీతికి నియతి లేదు, హద్దులు లేవు. ఈ మూడింటిని సంగమించుకొనిన త్రేతాగ్ని ధర్మజుడు. శ్రీకృష్ణ డనే మూడోకన్ను తెరిస్తే, నీతిబలాన్ని సారిస్తే ధర్మమూర్తి అయిన ధర్మరాజు త్రినేత్రుడు కాగల డని ధ్వని. భీమార్జునకృష్ణులు ధర్మజుడి భౌతికసంపద కాదు. సహజమైన అక్షయసంపద. దిగ్విజయంవలన పొందిన సిరి అనిత్యం, కాని, ఆ సహజసంపదమాత్రం ఎవరూ అపహరించలేనిది.

3. ప్రశంసలు : ప్రయోజనాలు

సభాపర్వంలో నాయకుడైన ధర్మజుడు ప్రతినాయకుడైన దుర్యోధనుడి కపటోపాయంచేత వంచితుడై రాజ్యసంపదలను కోల్పోయి అవమానాలకు లోనై అడవుల పాలవుతాడు. అయినా ప్రతినాయక ప్రశంసలు మాత్రం అతడి నాయకత్వానికి గౌరవచిహ్నాలై రాజిల్లుతూ ఉంటాయి. దుర్యోధనుడు రాజసూయయాగ మహత్త్వాన్ని విస్తృతంగా - అసహనంతో నైనా - కీర్తించి ధర్మజుడి ఉత్తమ నాయకత్వాన్ని ఉన్మీలింపచేశాడు. ఆ వర్ణనమంతా ఒకయెత్తు; ధర్మజుడు రాజసూయాంతంలో అవభృథస్నాతుడై సమ్రాట్టుగా శోభిల్లిన సన్నివేశవర్ణనం మరొక యెత్తు.

సీ. అభిషిక్తుఁడయిన యయ్యమరాజసుతునకు । సాత్యకి మౌక్తికచ్ఛత్ర మొప్పఁ
బట్టె; భీముండును బార్థుండు మణిహేమ । దండచామరయుగధారు లయిరి;
కమలనాభుండును గవలును ద్రుపదేశ । పుత్త్రుండు వేర్వేఱ భూమిపతుల
మూర్ధాభిషిక్తుల మ్రొక్కించుచుండిరి । దర్పంబు వెలయంగ; దానిఁ జూచి

ఆ. యేను మొదలుగా మహీపతు లెల్లను । దీప్తి దఱిఁగి యుండఁ దివిరి మమ్ము
నగిరి కృష్ణపాండునందన ద్రౌపదీ । సాత్యకులుఁ గరంబు సంతసమున.'' **(సభా. 2. 119)**

భారతంలో కురుసామ్రాజ్యపట్టాభిషేకగౌరవం ధర్మజుడికి తప్ప దుర్యోధనుడి కుండ దని ఈపద్యంలోని వస్తుధ్వని.

ఉ. ''భూవిదితప్రతాపపరిభూతవిపక్షుఁడు సవ్యసాచి గాం
డీవము గొన్న, భీముఁడు వడిన్ గద గొన్నఁ, గవల్ కృపాణచ
ర్మావరణాదిభాసితమహాభుజవిక్రములైన వారలన్
లావె రణంబులో మన కలంఘ్యబలాఢ్యుల నింక నోర్వఁగన్.'' **(సభా. 2. 273)**

ఈ పద్యం అనుద్యూతానికి అనువుగా దుర్యోధనుడు ధృతరాష్ట్రుడితో చెప్పిన ముందుమాట! ఏమైనా - ప్రతినాయకుడి అంతరంగంలోని అసలైన మాట! అంతేకాదు కురుక్షేత్రయుద్ధంలో కాబోయే నిజమైన మాట!

కథలో ప్రతినాయకుడిచేత నాయకవర్గాన్ని ప్రశంసింపచేసే వాక్యాలు స్థాయిభావపోషకాలై రాణించటం కథాశిల్పరహస్యం. ఇటువంటివి మరెన్నో!

సహానుభూతి : సానుభూతి

కావ్యంలోని పాత్రలు వారి వారి స్వభావాలనుబట్టి సహృదయులలో మూడు రకాలైన అనుభవాలను కలిగిస్తూ ఉంటారు. వాటిని ఈ విధంగా వివేచించవచ్చును. 1.ఆదర్శపాత్రలలో కాని, ధర్మబద్ధమైన ప్రవర్తన కలిగిన పాత్రలలో కాని, ధర్మబద్ధమైన ఏ కావ్యంలోనైనా ఉత్కటభావస్థితి ప్రదర్శించే పాత్రలలో కాని సహృదయులు తాదాత్మ్యాన్ని పొంది,

సాధారణీకరణంవలన వారి భావాలే తమ భావాలుగా చర్వణంచేసి రసానందాన్ని అనుభవిస్తారు. దీనిని సహానుభూతి అంటారు. 2.ఉదాత్తగుణసమన్వితులై కూడా ఏదో ఒక లోపంవలన కాని, బలమైన విధివలనగాని, అపజయానికి- ఒక్కొకసారి మరణానికి - గురిఅయ్యే పాత్రలు పఠితలనుండి తమపట్ల సానుభూతిని సాధించుకొంటారు. పాశ్చాత్య రూపకాలలో విషాదాంత పాత్రల స్వరూపం కూడా ఇటువంటిదే. 3.అధర్మబద్ధమైన ప్రవృత్తి కలిగిన దుష్టపాత్రల ప్రవృత్తులు పఠితలలో సహానుభూతిని గాని, సానుభూతిని గాని కలిగించకపోగా ప్రతికూలస్పందనను కలిగిస్తాయి. ఆ ప్రతికూలస్పందనలు ఉదాత్తపాత్రలపట్ల కలిగే సహానుభూతి, సానుభూతులకు బలాన్ని చేకూరుస్తాయి. ఈ రసానుభవసూత్రాన్ని దృష్టిలో ఉంచుకొని సభాపర్వ కథార్థాలు కలిగించే అనుభవాలను విశ్లేషించుకొంటే అవి అంత ఆసక్తిదాయకంగా ఎందుకు ఉన్నాయో తేటపడుతుంది.

ప్రథమాశ్వాసంలో సహానుభూతి : ద్వితీయాశ్వాసంలో సానుభూతి

ధర్మజుడు పాండురాజుహితం కోరి, రాజుల ప్రజల బాగునుకోరి రాజసూయం నిర్వహించటంలో ధర్మబద్ధమైన యుద్ధవీరాన్ని సహానుభూతిగా సహృదయుడు సభాపర్వ ప్రథమాశ్వాసంలో పొందుతాడు. జరాసంధవధలో జరాసంధుడు ప్రతినాయకప్రాయుడు. మూర్ధాభిషిక్తులను భైరవపూజలో బలిచేసే క్రూరకర్మ అతడిలో గల దోషం. దానివలన అతడు అపారబలపరాక్రమాలు కలిగి ఉన్నా పఠితకు సహానుభూతిని గాని, సానుభూతిని గాని కలిగించలేకపోయాడు. పైపెచ్చు పఠితల ప్రతికూలస్పందనకు గురిఅయ్యాడు. అట్లా కావటానికి శ్రీకృష్ణుడి అధిక్షేపణలు ఎంతగానో తోడ్పడతాయి. జరాసంధవధ చేసిన భీమాదుల కృత్యాలు ధర్మసమ్మతాలు కావటంచేత పఠితలు వారితో సహానుభూతి పొందుతారు.

వీరరసం ధర్మమూలం. ధర్మార్థకామాలను ధర్మబద్ధంగా సాధించే ఉత్కటోత్సాహమే వీరం. ''తతోఽర్థకామయో ర్ధర్మ మూలకత్వాత్ ధర్మప్రధానో వీరః'' అని అభినవగుప్తపాదులు. కాబట్టి ధర్మవిరుద్ధమైన ఉత్సాహం వీరానికి స్థాయి కాలేదు. అది వీరరసంగా సహృదయులచేత సహానుభూతితో అనుభవించబడలేదు.

సభాపర్వ ప్రథమాశ్వాసంలో ధర్మజుడి రాజసూయ ప్రయత్నమంతా ధర్మప్రధానం కావటంచేత వీరరసానుభవాన్ని సాంద్రంగా సహృదయుల కందిస్తుంది. ఇక ద్వితీయాశ్వాసంలో ధర్మజునిప్రవర్తనం మాయాద్యూతఘట్టంలో సహృదయుల సహానుభూతిని కోల్పోయి సానుభూతినిమాత్రం పొందే స్థితికి రావటం అనుభవసత్యం.

ధర్మరాజు తెలిసి తెలిసి కపటద్యూతంలో పాల్గొని వంచనకు గురిఅయి తన సంపదనంతా ఓడిపోవటం చదువుతూ ఉంటే ఆ పాత్రలో మనకు తాదాత్మ్యం కలుగదు. అట్లని ప్రతికూలస్పందనకూడా కలుగదు. అంతటి నిర్మలచరిత్రుడు ద్యూతవ్యసనం అనే బలహీనతకు లొంగి, 'బలవద్ద్యూతార్థముగాఁ బిలువంబడి మగుడ నగునె?' అనే ధర్మాన్ని చూపిస్తూ తనచర్యను బలపరచుకొంటూ అనుద్యూతంలోకూడా ఓడిపోవటాన్ని పఠిత ఆదర్శవర్తనగా గ్రహించడు. భీము డన్నట్లుగా అతడి చేతులు కాల్చదగిన వని ప్రతికూలస్పందన పొందడు. అర్జును డన్నట్లుగా ఉత్తమక్షత్రియ సంప్రదాయాన్ని నిలుపుతున్నాడని ధర్మరాజును మెచ్చుకొనలేడు. కాని, ''విధినియుక్తుఁడయి'' (2.157) ''విధినియోగంబు నతిక్రమించలేక'' ధర్మరాజు జూదానికి దిగవలసి వచ్చిందనీ, తత్ఫలాన్ని అనుభవించవలసి వచ్చిందనీ జాలి పొంది అతని పట్ల సానుభూతిని ప్రకటిస్తాడు. కాబట్టి అడవులకు పోతున్నా పాండవులు పాఠకుల సహానుభూతిని పొందరు. సానుభూతిని పొందుతారు. పాఠకులు విషాదపాత్రల స్వభావాన్ని వారిలో దర్శించగలుగుతారు. ఈ విధంగా- సహృదయులు కథార్థాలలో సహానుభూతిని, సానుభూతిని పొందే రెండుమార్గాలకు సభాపర్వపూర్వోత్తరార్ధాలు రంగస్థలాలైన వన్నమాట!

సభాపర్వంలో ధీరోద్ధతులైన జరాసంధ, శిశుపాల, దుర్యోధనుల అధర్మబద్ధమైన అర్థప్రవృత్తులు ధర్మజాదుల ధర్మవీరప్రవృత్తులకు వ్యతిరేకవైఖరితో పోషకంగా నిలవటం గమనార్హం. జరాసంధ శిశుపాల దుర్యోధనులు అర్థపురుషార్థసాధకులు, అందువలన ఉద్ధతులు. వారి నాశ్రయించుకొని ఉన్న రసం రౌద్రం. క్రోధం దానికి స్థాయిభావం. 'శత్రుకృతాపచారేణ మనః ప్రజ్వలనం క్రోధః' అని ప్రతాపరుద్రయశోభూషణం. ఇది జరాసంధుడియందుకంటె శిశుపాలుడిలో, అంతకంటె దుర్యోధనుడిలో పరిపూర్ణతను సాధించింది. కారణం- మొదటిరెండూ ఉపకథలు, మూడవది ప్రధానకథ కావటమే.

అర్థ కామాలను ధర్మంతో ముడిపెట్టినవాడు ధర్మజుడు. అర్థకామాలనుండి ధర్మాన్ని దూరం చేసినవాడు దుర్యోధనుడు. త్రివర్గాలను సేవించేవిధం భారతంలోనే ఇట్లా చెప్పబడి ఉన్నది.

సీ. "ధర్మకామంబులు దఱుగంగ నర్థార్థి । యగువాఁడు పతితుఁడౌ, నర్థసేవ
నర్థార్థముగఁ జేయునతఁ డుగ్రవనములో । గోరక్ష సేయు నక్కుమతిఁబోలు,
నర్థధర్మములకు హానిగాఁ గామార్థి । యగు నాతఁ డల్పజలాశయమున
జలచరం బెట్టు లజ్జలములతోఁ జెడు । నట్లు కామంబుతో హానిఁ బొందు

ఆ. నర్థధర్మములు మహాబ్ధిమేఘము లట్టు । లుభయమును పరస్పరోదయమ్ము
లిట్లుగాఁ ద్రివర్గ మెఱిఁగి సామ్యమున సే । వించువాఁడు సర్వవిత్తముండు". **(అరణ్య. 1. 245)**

దీనినిబట్టి గమనిస్తే దుర్యోధనుడు - ధర్మకామాలను కాదని అర్థాన్ని కోరేవాడు కాబట్టి-పతితుడు. అసూయాగ్రస్తుడై పాండవధనాన్ని మాయోపాయంతో అపహరించబూనిన అతడిపట్ల, అతడికి సహకారులుగా వర్తించినవారిపట్ల పఠితల సానుభూతి ఉండకపోగా ప్రతికూలస్పందన బలంగా ఉంటుంది. వారిని దుష్టపాత్రలుగా భావించి గర్హిస్తారు. సభాసదులు ధృతరాష్ట్రుడినీ, అతని పుత్రులనూ గర్హించినట్లు నన్నయ అనేకసార్లు వర్ణించడం కథార్థాలలో సహృదయ ప్రతికూలస్పందనలకు అనుస్పందనలను అనుసంధించటానికే. అందువలన కపటద్యూతంలో ఓడినా, ధర్మజుడు సానుభూతితో తన ఔదాత్త్యాన్నీ, ఔన్నత్యాన్నీ నిలువబెట్టుకొని, భావికథలో పఠితల సహానుభూతిని పొందటానికి వీలుకలిగించుకొన్నాడు.

అధర్మమూలమైన రౌద్రం దుర్యోధనాదులదైతే, ధర్మబద్ధమైన రౌద్రం భీముడిది, అతడి భీషణప్రతిజ్ఞలన్నీ సహృదయుల సహానుభూతిని పొందగలగటం విశేషం. పఠితలకు ధర్మజుడిపై సానుభూతి, భీముడిపట్ల సహానుభూతి. విదురవికర్ణుల ధర్మసంభాషణలవలె ఆదర్శాలుగా ఉండక పోవచ్చును. కాని, భీముడి ప్రతిజ్ఞలు అధర్మానికి ప్రతిగా తీవ్రంగా స్పందిస్తున్న ధర్మచైతన్యంగా పఠితలు భావిస్తారు. అక్కడక్కడ శ్రుతిమించి ధర్మజుడిని నిందించినా సహిస్తారు. అర్జునుడి హితబోధతో అతడు తన స్వల్పదోషాలను సరిదిద్దుకొనే సత్పురుష ప్రవృత్తిని ప్రకటించటంచేత భీముడు పాండవపాత్రలందరిలో ప్రశంసాపాత్రుడౌతాడు. అతడి ప్రతిజ్ఞలకు మారుగా దుర్యోధనాదులలో, చివరకు దుర్యోధనుడిని అంతగా బుజాన వేసికొని మోసే కర్ణుడుకూడ, మారుపల్కలేకపోవటం, ధర్మబద్ధమైన రౌద్రరసస్థితిని తెలుపుతున్నది. ధర్మజుడు భీముడిని ప్రతిజ్ఞలు చేయకుండా వారించకపోవటం గమనార్హం. ధర్మజుడి మనసే భీముడుగా పలుకుతున్నట్లు పఠితలు భావిస్తారు. అందువలననే ధర్మజధర్మ ప్రవృత్తికి పోషకంగా నిలిచింది భీముడి రౌద్రోద్రేకం!

మొత్తంమీద ధర్మజుడిది స్థిరమైన ధర్మవీరం. ప్రథమాశ్వాసంలో భీమాదుల దిగ్విజయ యుద్ధవీరంతో పరిపుష్టమై రాజసూయ నిర్వహణంలో అది ద్విగుణీకృతమైనది. రెండవ ఆశ్వాసంలో ప్రతినాయక రౌద్రంచేత ధిక్కరించబడి మందీకరించబడినదైనా ధర్మజు ధర్మవీరం భీముడి రౌద్రంచేత, అర్జునుడి వీరంచేత, ద్రౌపది ధర్మవీర ప్రవర్తనచేత, శ్రీకృష్ణుడి మహత్త్వంచేత మాన్యతను పొంది సహృదయుల రసానుభూతిని చూరగొన్నది. ధర్మబద్ధమైన రౌద్రం ప్రక్కనే ధర్మవిరహితమైన రౌద్రం ఆభాసగా అనుభూతి కందుతుంది. అట్టి విశిష్టరసచిత్రం కపటద్యూతసభలో ప్రత్యక్షమౌతుంది. అందుకే సభాపర్వం అంటే వీరకావ్యరసవైవిధ్య వర్ణచిత్రంగా పండితుల నాకర్షించేది.

క. "పర్వి సభాప్రభృతిగ నవ
పర్వములను విస్తరిల్లి పండితచేతో
నిర్వృతిఁ జేయుచు రెండవ
పర్వమునా రమ్య మగు సభాపర్వ మిలన్". **(ఆది. 1.38)**

'ఎఱుఁగఁ జెప్పుము దీని నీ వెఱుఁగుదేని'

తెలుగువారి నోట ఈ తేటగీతి పాదం ఒక పొడుపు కథ తోక ప్రశ్నగా ఎప్పటికీ తురంగలిస్తూ ఉంటుంది. ఇది ద్రౌపది ప్రాతికామికి వేసిన ప్రశ్న. తిరిగి ప్రాతికామి ధర్మరాజుకు వేసిన ప్రశ్న. మరల కురుసభలో ఆసాధ్వి అందరినీ అడిగిన ప్రశ్న. ఆ ప్రశ్నకు సరైన సమాధానం ఇచ్చినవారు లేరు. ఒకరిద్దరు ఇచ్చినా వాటిని పట్టించుకొన్న నాథుడు లేడు. ధర్మజుడు కిమ్మన లేదు. ధర్మమర్మం జనంమధ్యలోనే నిద్రపోయింది. ద్రౌపదికి జరుగవలసిన అవమానం జరిగిపోయింది. అసలుసంగతి వ్యాసుడైనా చెప్పినట్లు స్పష్టంగా తెలియదు. నన్నయ వ్యాసుడివలె వాచ్యం చేసేవాడు కాడు. మూలాన్ని ఒరపిడి పెట్టి తన కథామూల్యాన్ని మెరుగుపెట్టుతాడు. ఒక్కమాటలో మూటెడు కథార్థాలను గుబాళింప చేస్తాడు. అందువలన అసలువిషయం అంత తేలికగా బైటపడదు.

ఈ కథాఘట్టాన్ని చదువుతుంటే పఠితల ముందు ఎన్నో ప్రశ్నలు తలలెత్తుతాయి. వాటికి నన్నయ వాచ్యంగా సమాధానం చెప్పడు. సారమతులై లోనారసి చూడండి అంటాడు. అటువంటివాటిని కొన్నింటిని గమనిద్దాం.

1. కపటద్యూతవ్యూహాన్ని భీష్ముడు ఎందుకు వారించలేదు?

సమాధానం : భీష్ముడు దాశరాజుఎదుట సత్యవతికి పుట్టిన సంతానమే తనకు రాజుగా ఉంటాడనీ, తాను అతడి నియుక్తుడుగా ఉంటాననీ శపథం చేశాడు. అందువలన ధృతరాష్ట్రుడికి అతడు యావజ్జీవ నియోజ్యుడు. అది కారణంగా ధృతరాష్ట్రుడు రాజుగా తీసికొన్న నిర్ణయాన్ని కాదని తిరస్కరించలేడు. సలహా అడిగితే చెప్పగలడు అంతే. భీష్ముడి శపథమే అతడి మాటను చేతను కదలకుండా బంధించింది. అందువలన రాజాజ్ఞకు విరుద్ధంగా ఒక్కమాట కూడా ఈ ఘట్టంలో భీష్ముడు పలుకడు.

2. విదురుడు పాండవులను హస్తినాపురానికి తెచ్చాడు. అడుగడుగునా ధర్మాన్ని ప్రబోధిస్తూ, అధర్మాన్ని వారిస్తూ ఉండి కూడా ఏమీ చేయలేని స్థితిలో ఎందుకు ఉండిపోయాడు?

సమాధానం : విదురుడు మహామంత్రి స్థానీయుడు. రాజుకు హితవు చెప్పగలడు కాని, అతడిని బలవంతం చేయలేడు. అతడు తనమాట విననప్పటికీ చెవులలో జోరీగవలె హోరుపెట్టి చెప్పగలడు. కాని, అతడి పక్షాన తాను మాట్లాడ లేడు. రాజు నిర్లిప్తుడై తన మాటను పట్టించుకొనకపోయినా రాజహితాన్ని కోరి రాజకుటుంబ సభ్యులకు, సభికులకు, ప్రజలకు తన మాటగా చెప్పగలడే కాని రాజుగా పలకలేడు. తనమాట కాదని రాజు తనను ఆజ్ఞాపిస్తే అతడు ఆ పని తప్పక చేయకతప్పదు. అట్లని దుర్యోధనుడు ఆజ్ఞాపిస్తే ఆచరించ నవసరం లేదు. దుర్యోధనుడు ఎన్ని నిందించినా తాను కటకట పడగలడు. తిరిగి నాలుగుమాట లనగలడు కాని, రాజు తనను నిందిస్తే, పాండవపక్షపాతి వని తూలనాడితే హస్తినాపురిని వదలిపోవలసిందే. ఇతిహాసమైన మహాభారతంలో కురుసభలో మిత్రుడివలె (మిత్రసమ్మితంగా) హితం బోధించే ధార్మికమూర్తి విదురుడు. అతడి మాటను పాటించనివారు వారి పాపాన వారే పోతారు.

3. పాచికలాడి పాండవ సంపదలను అవలీలగా హరిస్తానని అంత ధీమాగా శకుని ప్రకటించటంలో గల రహస్య మేమై ఉంటుంది?

సమాధానం : పాండవులను పరాక్రమంతో దుర్యోధనుడు జయించలేడు కాబట్టి కపటోపాయంతో రాజ్యసంపదను అపహరించటం తప్ప మరొక మార్గం లేదు. ధర్మరాజులో జూదమాడే వ్యసనం చంద్రుడిలోని మచ్చ వలె నిలిచి ఉన్నది. అయితే అది అధర్మం కాదు. క్షత్రియులు వ్యసనపరులై వేటనూ, జూదాన్నీ అప్పుడప్పుడూ ఆడుతూ ఉంటారు. సుహృద్ద్యూతం దేవతలాడే ఆట అని ఒక ప్రతీతి ఉన్నది. ధర్మంగా జూదమాడితే యజ్ఞంచేసిన పుణ్య మనే భావం కూడా ప్రచారంలో ఉన్నది. పైపెచ్చు ఎవరైనా సుహృద్ద్యూతానికి పిలిస్తే జూదరి రాననటం ఆ ఆటగాళ్ళు పాటించే మర్యాద కాదు. ధర్మజుడు మర్యాదను పాటించే ధార్మికుడు. హాస్యానికికూడా అబద్ధమాడడు. అధిక్షేపంలోకూడా అన్యాయం చేయడు. అందువలన దుర్యోధనుడు

ధర్మరాజును సుహృద్ద్యూతానికి పిలిచి కపటద్యూతం మొదలుపెట్టినా - ముగ్గులోకి దిగిన తర్వాత మొగం తప్పుకోలేడు. లోకంలో జూదగాళ్ళ స్వభావం విచిత్రమైనది. పందెం ఓడిన కొద్దీ వారికి పంతం పెరుగుతూ ఉంటుంది. ఒడలు తెలియకుండా పందెములు కాస్తారు. చివరకు ఉన్నదంతా పణంగా పెట్టుతారు. చివరకు భార్యలనుకూడా ఒడ్డి ఓడిపోతారు. తనను తాను పణంగా పెట్టి ఓడిపోవటంతో ఆట ముగుస్తుంది. సాటి జూదగాళ్ళు ఓడిపోయినవాడినీ వాడి భార్యనూ వస్త్రహీనులను చేయటం, నిష్ఠురాలాడటం, పీడించటం, బాధించడం, దాసీ పనులు చేయించుకోవటం మొదలైన దుశ్చేష్టలతో అవమానాల పాలుచేస్తారు. అయినా ఓడినవారు కిమ్మనక చూస్తూ కూర్చుండవలసిందే. ఇవన్నీ ద్యూతలోకంలో సర్వసామాన్యాలే. ఇటువంటి వివరాలు ఋగ్వేదంలోని అక్షసూక్తంలో వివరించబడి ఉన్నాయి. (ఋగ్వేదం. మం10, అ 3, సూ. 32-33). శకుని కపటద్యూతపరుడు. అతని ద్యూతలోకంలో ఇదంతా ఆక్రీడకు సంబంధించిన సంస్కృతి. కపటం తెలియని ధర్మరాజుయొక్క జూదవ్యసనాన్ని, అతని ధార్మికవర్తనాన్నీ గుర్తించి కొల్లగొట్టాలని వ్యూహం పన్నాడు. ధర్మరాజును పిలిస్తే అతడు రాక తప్పదు. వస్తే ఆడక తప్పదు. ఆడితే ఓడక తప్పదు. ఓడితే పైనచెప్పిన జూదరుల మర్యాదలతో అతడిని అతని భార్యను తమ్ములను అవమానించటానికి అవకాశం దొరుకుతుంది. వస్త్రాపహరణం ఓడినవారికి గెలిచినవారు చేసే ద్యూతావమానక్రీడ. అందువలననే పాండవుల వస్త్రాలను, ద్రౌపది వస్త్రాలను అపహరించుమని దుర్యోధనుడు దుశ్శాసనుడిని ఆజ్ఞాపించాడు. ఆ ద్యూతావమాన క్రీడలలో వస్త్రాపహరణం ఉత్కృష్టదశగా నిలిచింది. దీన్ని గమనిస్తే శకునివ్యూహం సందు లేనిది. తిరుగు లేనిది.

4. 'మున్ను తన్నోడి ఆపై న న్నోడెనా? నన్ను మున్నోడి విభుడు ఆ మీద త న్నోడెనా? - ఈ ప్రశ్నలో ఉన్న కిటుకు ఏమిటి? మెలిక ఏమిటి?

సమాధానం : శకునితో జూదమాడుతూ ధర్మరాజు క్రమంగా తన తమ్ములనూ చివరకు తననూ పణాలుగా పెట్టి ఓడిపోయాడు. నన్నయరచనలో ధర్మరాజు తమ్ముల నోడినట్లే తానూ ఓడినట్లు చెప్పబడి ఉన్నది. వ్యాసు డీ ఘట్టంలో - జూదమాడుతున్నప్పుడు జూదరులు ఆటలో ఒక్కొక్క పందెం వేసేటప్పుడు ఏయే మాటలంటూ ఆడారో వాటిని ఆయా సందర్భాలలో వివరంగా చెప్పాడు. అందులో ధర్మజుడు తమ్ములలో ఒక్కొకడిని పణంగా పెట్టి ఓడినప్పుడు - 'ఇతడిని పణంగా పెట్టి ఆడుతున్నాను' అని అనేవాడు శకుని పందెం వేసి 'నీవు దీనిని ఓడావు' అని పలికేవాడు. అయితే ధర్మజుడు తనను తాను పణంగా పెట్టుకొన్నప్పుడు మాత్రం మాట మార్చి ఇట్లా అన్నాడు.

శ్లో. ''అహం విశిష్టః సర్వేషాం భ్రాతౄణాం దయిత స్తథా
కుర్యామస్తే జితాః కర్మ స్వయ మాత్మన్యుపప్లవే.'' **(సం. సభా. 58. 27)**

నా సోదరులలో నేను విశిష్టుడను, సోదరులకు ప్రీతిపాత్రుడను. జయించబడితే జితదాసుడి వలె స్వయంగా పనిచేస్తా నన్నాడు. కాని, నన్ను నేను పణంగా ఒడ్డి ఆడుతున్నానని మామూలుగా చెప్పలేదు. శకుని మాత్రం ధర్మజుడు తనను తాను పణంగా పెట్టి ఓడినట్లే ప్రకటించాడు. కాని, ధర్మజుడు తాను పణంగా ఓడలేదని, ఓడితే దాసుడిగా ఉండటానికి అంగీకరించాడనీ తలంచి ఉండవచ్చును. శకుని ఈ భేదాన్ని గుర్తించకుండా వ్యవహరించాడు. ఏమైనా ధర్మజుడియందు దాసత్వం మాత్రం ఏర్పడింది. దానిచేత యజమాని ఏమి చెపితే అది చేయటం అతడి ధర్మమైపోయింది. శకుని మాట దుర్యోధనుడి మాటే కాబట్టి వారిద్దరిమాట కాదన లేని స్థితి ఏర్పడింది. భీమాదుల కట్టి స్థితి లేదు. అందువలన వారు శపథాలు చేశారు.

శకుని ధర్మరాజును ఆ సమయంలో ''ఇ ట్లేల ని న్నొడ్డి తధిప! నీకు నొండుధనము గలదు, మఱచి తెట్లు? కమలాక్షి పాంచాలకన్య నీకు ధనము కాదె?' అని అన్నాడు. ఆమాట విని ఆటమీది ఆసక్తితో తన భార్యను పణంగా పెట్టి ఒడ్డి ఓటుపడ్డాడు. అంతటితో పణం పెట్టే ధనం ధర్మరాజుదగ్గర లేకపోవటంచేత ఆట ఆగవలసి వచ్చింది. తల వంచుకొని ఖిన్నుడై ధర్మరాజు కూర్చున్నాడు. ఇది నన్నయ చెప్పిన తీరు.

వ్యాసు డిచ్చిన వైనం ఇంతకంటె వివరంగా ఉన్నది.

శకుని రువాచ - ఏత త్పాపిష్ఠ మకరోత్ యదాత్మానం పరాజితః
శిష్టే సతి ధనే రాజన్ పాప ఆత్మపరాజయః ॥
వైశంపాయన ఉవాచ - ఏవ ముక్త్వా మతాక్షస్తాన్ గ్లహే సర్వానవస్థితాన్
పరాజయ ల్లోకవీరా నాక్షేపేణ పృథక్ పృథక్ ॥
శకుని రువాచ - అస్తి వై తే ప్రియా దేవీ గ్లహ ఏకోఽపరాజితః
పణస్వ కృష్ణాం పాంచాలీం తయాత్మానం పునర్జయ ॥ (సం. సభా. 58. 29-31)

శకుని ధర్మరాజుతో 'నీ సొమ్ము మిగిలి ఉండగా నిన్ను నీ వోడటం పాపిష్ఠి కర్మ. అట్లా చేయటం పాపహేతువు, అని పలుకుతూ పాండవులందరూ పరాజితు లైనా రని సభలో ప్రకటించాడు. ఆ తరువాత ధర్మరాజు ఓడని ధనం మరొకటి ఉన్నదనీ, అది పాంచాలి అనీ పేర్కొన్నాడు. ప్రియురాలైన కృష్ణను పణంగా పెట్టుమని ధర్మరాజును ప్రేరేపించాడు. ద్రౌపదీ పణానికి ధర్మజుడి దాస్యవిముక్తి ప్రతిపణంగా ప్రతిపాదించాడు. ఆమాటలు కొసమెరుపు ఆశలు కలిగించగా ధర్మజుడు శకుని సూచన నంగీకరించి ద్రౌపదిని పణంగా పెట్టి జూదంలో ఓడిపోయాడు.

వ్యాసుడు చెప్పిన సంభాషణ వివరాలు కొన్ని విశేషాలను బయట పెట్టుతున్నాయి. (1) ధర్మజుడు తన్ను తా నోడి దాసుడైనాడు. (2) దాసుడి సొమ్ము రెండు రకాలు. దాసుడు కాకపూర్వం సంపాదించుకొన్న ధనం. దాసుడైన తరువాత సంపాదించే ధనం. ధర్మరాజుకు ద్రౌపది ఇందులో మొదటిరకం ధనమే అవుతుంది. దానిని తానోడకపూర్వం పణంగా పెట్టినట్లైతే ఆమె యజమాని సొత్తు అయి ఉండేది. అట్లా చేయటం ధర్మరాజు అభిమతం కాదని అతడి చర్య స్పష్టం చేస్తున్నది. తమ్ములను ఓడి భార్యను ఓడక తనను తానే ఓడిన ధర్మరాజు ఉచితజ్ఞుడు. ధర్మపత్ని గౌరవప్రతిష్ఠలను కాపాడటానికి యత్నించిన ధర్మజ్ఞుడు. అందుకే ద్రౌపది నిండుసభలో తన భర్త ధర్మస్వరూపుడని కీర్తిస్తుంది. (3) ధర్మరాజుచర్యలోని ఈ మెళకువను శకుని పసికట్టాడు. ధర్మజుడితో పాటు ద్రౌపదిని కూడా దాసిని చేయాలని అతడి పన్నాగం. అందువలన ద్రౌపదిని పణంగా పెట్టుమని ధర్మజుడిని ప్రేరేపించాడు. అయితే ఇక్కడ ఒక చిక్కు ఏర్పడింది. ధర్మజుడు సహదేవనకులార్జునభీములను ఒడ్డి ఓడిపోవటంతో వారికి ద్రౌపదిమీది అధికారం పోయింది. పెద్దవాడైన ధర్మజుడియందు అది నిలిచి ఉన్నది. అతడు ఆమెను ఓడకుండా తనను ఒడ్డి ఓడిపోవటంతో ద్రౌపది స్వతంత్రురాలుగా మిగిలిపోయింది. ఆమె ధర్మరాజు దాసుడు కాకపూర్వం సంపాదించుకొన్న ధనం వంటిది కాబట్టి దాసుడైన ధర్మరాజుయొక్క యజమానికి- అంటే- దుర్యోధనుడికి ఆమె అధీనురాలు, లేదా, దాసి కాజాలదు. ఈ ధర్మసూక్ష్మాన్ని కపటోపాయంతో భేదించాలని శకుని పూనుకొన్నాడు. (4) శకునిమాట దాసుడైన ధర్మజుడికి దాటరాని గీత. అందువలన అతడి ఆజ్ఞ ప్రకారం ద్రౌపదిని పణంగా పెట్టి ఓడిపోయాడు. అందులోనూ భీమాదులను ఓడినట్లు ఓడాడు. తాను ఓడినట్లు ఓడ లేదు. ఆమె దాసి కాదు. వాక్స్వాతంత్ర్యం ఉన్నది. సభలో ప్రశ్నించవచ్చును. పరుషంగా మాట్లాడవచ్చును. ఆమె నెవ్వరు కాదనటానికి వీలు లేదు. కాని ధర్మజుడికి ఆ వెసులుబాటు లేదు. (5) శకుని ఆడిన జూదమంతా ఒకయెత్తు; ధర్మరాజుకు చివరియెత్తును (పందెం వేసే అవకాశాన్ని) కలిగింపచేయటానికి వేసిన మలియెత్తు ఒక్కటీ ఒక్కయెత్తు, అందులో ఒక మడతపేచీ ఉన్నది. భార్యను పణంగా పెట్టుమని సూచిస్తే నలమహారాజువలె ధర్మజుడు కూడ తిరస్కరించవచ్చును. అప్పుడు శకుని చేయగలిగిం దేమి లేదు. అందుకే భార్యను పణంగా పెట్టి ధర్మజుడుఓడాడని విన్నప్పుడు ద్రౌపది ఆశ్చర్యపోయింది. ''ఏ యుగంబునందు నెట్టి దుష్కితవుండు, భార్య నొడ్డి యోటువడిన భర్త గలడె? ఇది వినంగఁ గడు నపూర్వం బయ్యో! ఇట్లు చేయునొక్కొ ఇందుకులుడు?' అని తల్లడిల్లిపోయింది. ధర్మజు డంతపని అంత తేలికగా చేయ డని శకునికి తెలుసు. అందుకే - ద్రౌపదిపణానికి ధర్మజుని దాస్యవిముక్తి ప్రతిపణంగా పలికాడు. ఈ యెత్తులో ఉభయపక్షాలవారికీ ద్విగుణీకృత లాభం ఉన్నది. ఎట్లాగంటే - ధర్మజుడు గెలిస్తే ద్రౌపది అతడికి దక్కుతుంది, దాసత్వం పోతుంది. శకుని గెలిస్తే ధర్మజుడు మరల దాసుడుగా మిగులుతాడు. ద్రౌపది దాసురా లౌతుంది. ద్రౌపది పణంగా పెట్టబడాలంటే ధర్మజుడు దాసుడుగా మొదట విముక్తుడు కావాలి. ఆ వెసలుబాటుకోసం శకుని ఆ ప్రతిపణం పెట్టాడు. ఆ పందెం కాయటానికి అనువుగా అతడిని దాసత్వంనుండి విముక్తుడయ్యే అవకాశాన్ని ధర్మపరంగా కలిగించాడు. ఆ దాస్యవిముక్తి ద్రౌపదిని పణంపెట్టినప్పుడే

వర్తిస్తుంది. అందులో గెలిస్తేనే సిద్ధిస్తుంది. అది అసాధారణమైన అవకాశం. దానిని ధర్మజుడు వినియోగించుకొనటానికి ముందుకు వచ్చి ఉచ్చులో పడతా డని శకుని వ్యూహం. అనుకొన్నట్లే జరిగింది. (6) ధర్మజుడు ఒకసారి ఓడి దాసుడైన తరువాత, యజమాని ఆజ్ఞకు కట్టుబడి ఉండవలసిందే. శకుని సూచనను కాదనే హక్కు ఆయనకు లేదు. అందువలన భార్యను పణంగా పెట్టాడు. అదృష్టం కలిసి వస్తే తానూ తన భార్యా ఇద్దరూ బయటపడవచ్చు ననుకొన్నాడు. ఉన్నంతలో అంతకంటె గత్యంతరం లేదు. (7) ఇక్కడ మరొక ప్రశ్న ఉదయిస్తుంది. ధర్మజుడు ద్రౌపదిని పరిపూర్ణమైన అంగీకారంతోనే పణంగా పెట్టాడా? యజమాని బలవంతాన పెట్టాడా? మరేదైనా వ్యూహంలో భాగంగా పెట్టాడా? అన్నది. ఆయనకు ఇష్టం లేదని ముందే స్పష్టం. శకుని సూచనపై చేసినదనీ, బలవంతుడైన యజమాని ఆజ్ఞను పాటిస్తున్న ధర్మంగా చేసినదని సుస్పష్టం. దానివలన ధర్మరాజు నిర్ణయం ప్రకారం కూడా ద్రౌపది ధర్మవిజిత కాదు; బలవద్ధర్మ విజిత. (8) బలవద్ధర్మవిజిత భర్త సంకల్పపూర్వకంగా ఒడ్డినప్పుడు విజితురాలైన వనితతో తుల్యురాలౌతుందా? అన్నది ధర్మ మీమాంస. ఆప్రశ్న ఎవరు అడగాలి? ఆపద్ధర్మాన్ని అంగీకరించి పణంగా పెట్టి ఓడిపోయిన ధర్మరాజు అడగలేడు. అసలు ప్రశ్నించటమే దాసధర్మం కాకపోవచ్చును. భీమాదులకు అడిగే అవకాశం లేకుండా ధర్మరాజే చేశాడు. అందుకే అతడి చేతులు కాలుస్తానని భీము డొకసారి మండిపడ్డాడు. ఇక అడుగ గలిగింది - అడుగవచ్చునా అని అనుమతిని ముందుగా ధర్మజుడిని వ్యంగ్యంగా అడగగలిగింది ద్రౌపది మాత్రమే. బలవంతంమీద పణం పెట్టుతున్నానని ధర్మజుడు చెప్పకచేసిన దోషమని వాదించే అవకాశం ఉన్నది. అంతకంటె గత్యంతరం లేక అట్లా వర్తించాడు కాని, తత్త్వతః అది మనిషిని ఇరకాటంలో పెట్టి ఇబ్బందిగా పెట్టించిన పణమని సభికులు గ్రహించారు. దానిని సభలో చెప్పి, వాదించినా బలంగా నిలబడుతుందని నమ్మకం లేదు. శకుని అందుకే పొల్లు మాట మాట్లాడలేదు. ధర్మరాజు అందుకే కాబోలు, లేదా మరెందుకో, అసలు మాట్లాడలేదు.

5. ద్రౌపది నిండుకొలువులో అడిగిన ప్రశ్నకు సభాసదు లెవ్వరూ ఎందుకు మారుపలుక లేదు? భీష్ము డా ధర్మసూక్ష్మం ధర్మజుడికే తెలుసు నని ఎందుకు అన్నాడు?

సమాధానం : ప్రాతికామి నిండుకొలువులో ధర్మరాజును ద్రౌపది వేసిన ప్రశ్ననే అడిగినప్పుడు అతడు మాట్లాడలేదు. దానికి కారణం ధర్మరాజు 'దురోదర పరాజయ దుఃఖిత చేతస్కుఁడు' కావటంగా నన్నయ పేర్కొన్నాడు. అప్పుడు దుర్యోధనుడు ప్రాతికామితో ఇట్లా అన్నాడు.

క. 'సందిగ్ధ మయినయర్థము । నిందఱసన్నిధిన యడిగి; తింద ఱెఱుంగన్
సుందరిఁ బాంచాలేంద్రసు । తం దోడ్కొని రమ్ము పొమ్ము తడయక' ..... అని, **(సభా. 2.211)**

ఇందులో దుర్యోధనుడు ఆప్రశ్నకు సమాధానం ఇతమిత్థంగా చెప్పకుండా, సందిగ్ధమని చెప్పటం విశేషం. ప్రాతికామి ద్రౌపదివద్దకు వెళ్ళి 'దేవీ! నీ యడిగిన యర్థంబు నిర్ణయించువారయి సభ్యులు నిన్ను రాఁబనిచిరి' అని ఆమెను సభకు రమ్మని నిర్దేశించాడు. ఆమె దుర్యోధనుడి దుశ్చేష్టితానికీ, ధర్మరాజు సమ్మతానికీ భయపడి ప్రాతికామి వెంట వచ్చింది. సభలో పాండవులు ఆమె దీనస్థితిని చూడలేక తలలు వంచి కూర్చొని ఉన్నారు. ఆ సన్నివేశాన్ని చూచి అసూయాపరుడైన దుర్యోధనుడు సంతోషించాడు. కురువృద్ధుడి సమీపంలో ఉన్న ద్రౌపదిని సభామధ్యానికి తోడ్కొని రమ్మని దుశ్శాసనుణ్ణి పంపాడు. ద్రౌపది భయపడి గాంధారి చెంతకు పరుగెత్తింది. అప్పుడు దుశ్శాసనుడు ద్రౌపదితో ఇట్లా అన్నాడు- ''సౌబలుండు నిన్నొడిచె దురోదరంబునఁ, గురూత్తము నర్థమ వైతి; నిన్నునుం బుడమిని దమ్ముఁ గోల్పడిరి పొల్తి! భవత్పతులైన పాండవుల్.'' ఆ తరువాత ఆమె శిరోజాలను పట్టి బలవంతాన సభామధ్యానికి లాగికొని వచ్చాడు. అందరూ సంభ్రమంతో ఆ దృశ్యాన్ని చూచారు. ఆమె కురువృద్ధులను సంబోధిస్తూ ఇట్లా అన్నది -

చ. ''అనుపమదైవయోగహతుఁడయ్యు నవశ్యము ధర్మసంపదం
దనరున కాక ధర్మజుఁడు ధన్యుఁడు, ధర్మపథంబు తప్పఁ ద్రొ
క్కునె కురువృద్ధులార! భృశకోపనుఁ డీతఁడు నన్ను నేల దు
ర్జనుఁ డిట యీడ్చి తెచ్చె? నవిచారపరుం డయి దుర్మదంబునన్''. **(సభా. 2.218)**

ఇది ద్రౌపది అడిగిన మొదటి ప్రశ్న. దానికి పెద్ద లెవ్వరూ మాట్లాడ లేదు. వికర్ణుడు లేచి 'కితవాహూతుండై వ్యసనవర్తి యయి పరాజితుం డయిన పాండవాగ్రజుండు పాండవుల కందఱకు సాధారణ ధనంబయిన పాంచాలిఁ బణంబుఁ జేసెం గావున ద్రౌపది యధర్మవిజిత; యక్కోమలి నేకవస్త్ర నిట దోడ్కొనితెచ్చుట యన్యాయంబు' అని వాదించాడు. అతని వాదనను కర్ణుడు ఖండించాడు. ధర్మరాజు సర్వస్వం ఒడ్డి ఓడినప్పుడు ద్రౌపది అతడికి వెలి కాదు కాబట్టి 'ధర్మవిజిత' అని పేర్కొన్నాడు. కాకపోతే పాండవులు మారుపలుకకుండా ఎందుకు ఉంటారు? అని దట్టించాడు. ఆమె బంధకి కాబట్టి వివస్త్రను చేసి తెచ్చినా ధర్మవిరోధం కాదన్నాడు. వికర్ణుడివాదంలో వివేకం ఉన్నది కాని ధర్మతత్త్వవిజ్ఞానం లేదు. కర్ణుడి వాదనలో దబాయింపు ఉన్నది కాని ధర్మం లేదు.

ద్రౌపదీ వస్త్రాపహరణ ప్రయత్నం సాగింది. భీముడి భీషణ ప్రతిజ్ఞ వెలువడింది. 'ద్రుపదరాజపుత్రి వాక్యంబులు విచారింపక వృద్ధరాజు లుపేక్షించి'రని సభాసదులు గగ్గోలు పెట్టారు. విదురుడు కల్పించుకొని సభలో అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పకుండటం మహాపాప మని దృష్టాంతసహితంగా వివరించి "ద్రౌపదీ ప్రశ్నంబునందు ధర్మబుద్ధి సేయుం" డని సభాసదులను కోరాడు. దుర్యోధనుడివలని భయంతో సభలో ఎవ్వరూ నోరు పెకలించలేదు.

అప్పుడు ద్రౌపది ఎలుగెత్తి 'ఇపుడు నాపలుకుల కెవ్వరుఁ బ్రతివచనం బేల పలుకరైరి? ధన్యులార! యే నదాసినే, దాసినే యెఱుఁగఁజెప్పి పనుపుఁ డెల్లదాని' అని సభలోనివారి నడిగింది. అప్పుడు భీష్ముడు 'అవ్వా నీ ప్రశ్నంబునకు నుత్తరం బయ్యుధిష్ఠిరుఁడు సెప్పవలయుఁ; గానినాఁడు ధర్మసూక్ష్మత యెవ్వరికి నెఱుంగ గహనంబు; దీనిఫలంబు వేగంబ యిక్కురుకులపాంసను లనుభవింతురు' అని పలికి ఊరుకొన్నాడు. ధర్మజుడు ఆ ధర్మసూక్ష్మాన్ని చెప్పలేదు. అంతటితో ఆమె ప్రశ్న సమాధానం లేనిదిగా మిగిలిపోయింది. (ఆ ప్రశ్నార్థాలకూ ఆ యా సన్నివేశాలలో ఆ యా వ్యక్తుల అభిప్రాయాలకూ సంబంధం ఉన్నది కాబట్టి కొంత పునరుక్తిగా తోచినా సౌలభ్యంకొరకు ఇక్కడ వివరించటం జరిగింది.)

పై కథాంశాలలో స్పష్టమౌతున్న అంశాలు:

1. ప్రాతికామిద్వారా ద్రౌపది అడిగిన ప్రశ్నకు ధర్మరాజు మౌనంగా ఉండిపోగా దుర్యోధనుడు 'అది సందిగ్ధమైన అర్థం' అని ప్రకటించటం గమనార్హం. అంటే అది ఎటూ చెప్పలేని సందిగ్ధమైన ధర్మ మన్నమాట. అందుకే ఎటూ వాదించటానికి భయపడ్డారు సభాసదులు. రాజసభల చరిత్రలో తన్నోడి సతినోడిన సన్నివేశం అపూర్వంగా అప్పుడు ఆసన్న మైనది. దాని ధర్మస్థితి నిరూపించటం కష్టమని దుర్యోధనుడి భావం. దానిని భీష్ముడుకూడా అంగీకరిస్తూనే ధర్మజుడు ఒక్కడుమాత్రమే దానికి తీర్పుచెప్పగల డన్నాడు. అయితే దానికి ధర్మసూక్ష్మాన్ని ఆశ్రయించాలని భీష్ముడు భావించాడు.

మూలభారతంలో భీష్ముడు ద్రౌపది ప్రశ్నించిన రెండు సందర్భాలలోనూ సమాధానం చెప్పినట్లున్నది. నన్నయ రెండవప్రశ్నకు మాత్రమే ఆతడి అభిప్రాయానికి అనుగుణమైన సమాధానం చెప్పించి ఊరుకొన్నాడు. భీష్మడి అభిప్రాయం తెలుగులో తేటపడుతున్నా అతడు ఆలోచించిన విధానం మనకు తెలియకుండా పోయింది. మూలంలో భీష్ముడు పలికిన మాటలనుగురించి పండితులు చేసిన వ్యాఖ్యలు గమనిస్తే ఆ సమస్య ఎంత జటిలమైనదోకూడా స్పష్టమౌతుంది. మచ్చుకు డాక్టర్ మూలంపల్లి చంద్రశేఖరశర్మగారి విలువైన సమీక్ష గమనించదగింది.

"భీష్ముడు సభలోని వా రందరికిని పెద్దవాడు గావున ద్రౌపది ప్రశ్నమున కిట్లు సమాధానము జెప్పెను. అందుగూడ ధర్మతత్త్వ మిమిడియున్నది. నన్నయ యీ భాగమును వదలివేసెను. వస్త్రాపహరణానన్తరమునగూడ భీష్ముడు ద్రౌపదీ ప్రశ్నమును విచారించుట సంస్కృత భారతమున గలదు. గావున నన్నయ యా రెండవ సమాధానమునే తెనిగించి యుండును. కాని సంస్కృత భారతమున వస్త్రాపహరణమునకు ముందు భీష్ముడు చేసిన ధర్మవిచారమున కొంత వైశిష్ట్యమున్నది. ద్రౌపదికూడ "ద్రోణస్య భీష్మస్య చ నాస్తి సత్త్వం క్షత్తు స్త థైవాస్య మహాత్మనోఽపి రాజ్ఞ స్తథా హీమమధర్మ ముగ్రం నలక్షయన్తే కురువృద్ధముఖ్యాః" అని కురువృద్ధులను పేరెత్తి సత్త్వహీనులైనా రని యున్నది. కావున కురువృద్ధుడైన భీష్ముడు మొదట సమాధానము జెప్పుట యుచితము. అతడు చెప్పిన సమాధాన మిది-

శ్లో. "న ధర్మసౌక్ష్మ్యా త్సుభగే వివక్తుం శక్నోమి తే ప్రశ్న మిమం యథావత్ ।
అస్వో హ్యశక్తః పణితుం పరస్వం స్త్రియశ్చ భర్తు ర్వశతాం సమీక్ష్య ॥
త్యజేత సర్వాం పృథివీం సమృద్ధాం యుధిష్ఠిరో ధర్మ మథో న జహ్యాత్ ।
ఉక్తం జితోఽస్మీతి చ పాండవేన తస్మా న్న శక్నోమి వివేక్తు మేతత్. ॥
. ద్యూతేఽద్వితీయః శకుని ర్నరేషు కున్తీసుత స్తేన నిసృష్టకామః ॥
న మన్యతే తాం నికృతిం యుధిష్ఠిరః తస్మా న్న తే ప్రశ్న మిమం బ్రవీమి".

(సం. సభా.60. 40-42)

ధర్మసూక్ష్మతవలన నీ ప్రశ్నకు వివేచన మున్నది యున్నట్లుగా జేయలేకున్నాను- అని భీష్ము డనెను. ద్రౌపదికూడ "ధర్మశ్చ సూక్ష్మో నిపుణోపలక్ష్యః" అని తన నోడుటలో ధర్మసూక్ష్మ ముండు నని యొప్పుకున్నది. ద్రౌపదీ ప్రశ్న వివేచనము జేయమికి భీష్ముడు చూపిన కారణములు-

1. ధర్మజుడు తన్నోడుటచే, నస్వామియై దాసుడై, తన సోదరులకును సొమ్మై పరస్వమైన ద్రౌపది నోడుటకు స్వామ్యము లేకుండుటచే ద్రౌపది యధర్మజిత యనవలసి యుండుట.

2. స్త్రీ భర్త్రధీన యగుటచేతను భర్త లోడిపోవుటవలన వారితోడి భార్యయు నోటుపడిన దగుటచే ద్రౌపది ధర్మజితయే యనవలసి యుండుట.

3. సమస్తమును వదలియు ధర్మమును వదలనట్టి ధర్మజుడే "జితోఽస్మి" యని పుంలింగైక వచన శబ్దముచే తా నొక్కడే యోడినట్లు జెప్పి ద్రౌపదియు సోదరులు ఓడబడలే దని సూచించుటచే ద్రౌపది జితయే కాదనవలసి యుండుట.

4. ద్యూతమున నద్వితీయ పరమ ప్రామాణిక విద్వాంసు డగు శకుని ద్రౌపదీ విషయ సంబంధము వదలునట్లు ధర్మజుని ప్రేరేపించి, ద్రౌపదిని ప్రత్యేక పణముగా బెట్టించుటవలనను ద్యూత మాత్మపరాజయావసానమే యగుటచే ధర్మజుని మరల ద్యూత మాడింప జేసి, ద్రౌపదిని జయించుటవలన, ద్రౌపది శకునికాపత్యధర్మజితయే యైనను శకుని యొప్పుకొనక ధర్మజితయే యని యనుచుండుటచేత ద్రౌపది ధర్మజిత యనవలసి యుండుట.

ఈ సందర్భమున భీష్మవచనములకు నీలకంఠ వ్యాఖ్య యిట్లున్నది. "భర్తు రీశ్వరతాం దాసభార్యాపి దాస్యే వేతి భావః జితోఽస్మీతి వదతా ఆత్మైవ పరాజితో న తు స్త్రీ, నచ రాజజయేనైవ త్వజ్జయః సిద్ధ్యతి ద్యూతమర్యాదావిదా శకుని నైవ తవ పృథక్ పణీకరణా దిత్యాహ ద్యూతే ఇతి. రాజాతు పరాజ్ఞయా త్వాం పణీకృతవాన్ న స్వేచ్ఛయాఽతోఽస్వామీ కథం పణితవా నితి రాజ్ఞోఽపి దోషో నాస్తి. తథాచ శకుని బుద్ధ్యైవ త్వమజితా తచ్చ శకుని ర్న మన్యతే ఇత్యాహ నేతి. యతః పణీకృతా అతః ప్రాగజితా. యతశ్చా పరదాసేన పణీకృతా తతోఽప్యజితై వేతి భావః" (సం.భా. నీలకంఠ వ్యాఖ్య, సభా. 67, 47-49. పుటలు 108-109)

భర్తలు దాసులైనపుడు భార్యయు దాసి యగును. కాని ధర్మజుడు "జితోఽస్మి" యని మాత్ర మనుటచే తాను మాత్రమే జితుడయ్యెను గాని ద్రౌపది కాదనియు, ద్యూతమర్యాదను దెలిసిన శకుని ద్రౌపదిని వేరుగా పణముగా బెట్టించుటచే ధర్మజుని యోటమితో ద్రౌపది యోటుపడినట్లు కాదనియు, ధర్మజుడు తన స్వేచ్ఛతోగాక శకునియాజ్ఞచేతనే ద్రౌపదిని పణముగా బెట్టుటచే "దాసుడై ద్రౌపది నెట్లు పణముగా బెట్టె"నను దోషము ధర్మజునియందుగూడ లేదనియు కావున శకుని మతమునగూడ ద్రౌపది జయింపబడలేదు. కాని దానిని యొప్పకున్నా డనియు, ద్రౌపదిని పణముగా బెట్టించుటచే నంతకుపూర్వ మామె జిత కాదనియు ఇతరదాసుడైన ధర్మజునిచే పణముగా బెట్టబడినందున ఆమె జయింపబడనే లేదనియు భీష్ముడు చెప్పినట్లు నీలకంఠ వ్యాఖ్య వివరించినది.

ఇట్లు భీష్ముడు ద్రౌపదీ ప్రశ్నకు ధర్మనిశ్చయమును కొంతవరకు జెప్పినను "తస్మాన్న తే ప్రశ్న మిమం బ్రవీమి" యని దానిని సందిగ్ధముగనే యుంచెను. భీష్ముడు ద్రౌపదీ మాహాత్మ్యమును బ్రకటింపజేయు తలంపుతోడనే ద్రౌపదీ ప్రశ్నమునకు సందిగ్ధముగనే సమాధానము జెప్పెనని నీలకంఠుడు తన వ్యాఖ్యలో జెప్పెను. ("తథేతి.... భీష్మేణ ద్రౌపదీ మాహాత్మ్యఖ్యాపనాయ ప్రశ్న స్యోత్తరం నోక్తం దుశ్శాసనస్తు పాండవ పక్షపాతినాపి భీష్మేణ సంశయోపన్యాసా దస్మాక మేవ జయ ఇతి మన్వానో యత్కించి త్ప్రలలాపే త్యర్థః". ఈ సందర్భమున క్షేమేంద్రుని భారతమంజరి:

శ్లో. "సూక్ష్మా ధర్మగతిః పుత్రి వాచా తాం వివృణోతి కః?
హారితాత్మా నృపో నేశః పతిః స్త్రీణాం చ దైవతః"

అని యనుచున్నది. ద్రౌపదియు భీష్ముని సందిగ్ధ సమాధానమునకు ప్రతిప్రశ్నముగా "కర్ణదుర్యోధన శకుని సైంధవాది దుష్టభూయిష్ఠంబైన సభకు న న్నేల పిలిపించి నన్నవమానించు నవకాశమును గల్పింపవలసి వచ్చెను? పై దుష్టు లందరిచే గలిసి మోసమున జయింపబడియు దెలిసికొనక (ద్యూత మాత్మపరాజయావసాన మనియు గూడ దెలిసికొనక) ధర్మజుడు మరల నెట్లు జూదమాడెను? శకునియు నాతని జూదమాడునట్లు ఏల చేసెను" అని యడిగి కురువృద్ధు డైన భీష్ముడు ధర్మమును జెప్ప వెనుకాడుచున్నా డని సర్వాధికారిగా నున్న ధృతరాష్ట్రుని లక్ష్యముగా జేసికొని సభలోని కౌరవుల నందరిని-

శ్లో. "తిష్ఠన్తి చేమే కురవ స్సభాయాం । ఈశా స్సుతానాం చ తథా స్నుషాణామ్,
సమీక్ష్య సర్వే మమ చాపి వాక్యం । విబ్రూత మే ప్రశ్న మిమం యథావత్" అని యడిగినది.

ఈ ప్రశ్నలో "తాను జితయా? అజితయా? ధర్మజునకు దనపై యధికార మున్నదా? లేదా? ఎవరి కధికార మున్నది?" అను విషయములను సుసూక్ష్మవిచారము చేసి సూచించి ఏ యొక్కరు ధర్మనిర్ణయము చేయలేనపుడు సభలోని వారినందరిని గలిసి ధర్మనిర్ణయము చేయుడని యడిగినది.

ఈ సభలో కొడుకులకు కోడండ్రకును సర్వాధికారు లైన ప్రభువు లున్నారు. దుర్యోధనాది కుమారులకు వారి భార్యలకును ధృతరాష్ట్రుడు, అతని తరువాత భీష్మాదులు అధికారులు. అటులనే పాండురాజు లేనికారణమున పాండవులకును వారిభార్యయగు ద్రౌపదికిని అధికారి ధృతరాష్ట్రుడు. కావున సుహృద్ద్యూత మాడరమ్మని యాత డాజ్ఞాపింపగనే పాండవులు వచ్చి యాడిరి. ఆజ్ఞానువర్తు లైన పాండవులను పాండవపత్నిని అవమానింపజేయుట న్యాయము గాదు. ఆ యవమానము దుర్యోధనాదులయు వారిభార్యలయు అవమానమువంటిది. ఇది కురురాజుగా రాజుగా సర్వాధికారియైన ధృతరాష్ట్ర డుపేక్షింపదగినది గాదు.

ఒక అధికారి పోయిన నాయధికారము పైయధికారికి సంక్రమించుట, పై యధికారి పోయిన వానియుత్తరాధికారి కాయధికారము సంక్రమించుట ధర్మరహస్యము. భీష్ముడు ప్రతిజ్ఞచే నధికారము వీడుటచే విచిత్రవీర్యు డధికారి యయ్యెను. తదనంతరము అతని సంతానములలో నంధత్వమున నధికారయోగ్యత లేమి పాండురా జధికారి యయ్యెను. పాండురాజు కిందమశాపవిరక్తుడై శతశృంగమునకు బోవుటచే ధృతరాష్ట్ర డధికారి యయ్యెను. శతశృంగమున పాండువు మరణించుటచే ధర్మజునకు పితృవ్యునితో సమభాగమైన రాజ్యము నీయవలసివచ్చినది. మనుస్మృతివ్యాఖ్యాకారుడగు కుల్లూకభట్టు వ్రాసిన "అస్మాదేవలింగాత్ పౌత్రస్యాపి మృతపితృకస్య పైతామహే ధనే పితృవ్య విభాగోస్తీతి గమ్యతే" (మనుస్మృతి. 9అ. 120 శ్లోకవ్యాఖ్య) అను వాక్యమునుబట్టి విచిత్రవీర్యుని రాజ్యమునందు అతని పౌత్రుడైన ధర్మజునకు తండ్రియైన పాండువు మరణించుటచే పితృవ్యుడైన ధృతరాష్ట్రునితో సమవిభక్తమగు రాజ్యము రావలసియున్నది. అది ఖాండవప్రస్థము రాజధానిగా ధృతరాష్ట్రునిచే నీయబడినది. దానికి దోడు స్వసద్గుణపరాక్రమమున రాజసూయము నెరవేర్చి ధర్మజుడు సార్వభౌము డైనాడు.

కావుననే ధృతరాష్ట్రుడు దుర్యోధనుని జననమందు గలిగిన యపశకునములకు పెద్దలందరిని సభచేయించి-

శ్లో. "యుధిష్ఠిరో రాజపుత్రో జ్యేష్ఠో నః కులవర్ధనః ।
ప్రాప్తః స్వగుణతో రాజ్యం న తస్మి న్వాచ్య మస్తి నః ॥
అయ న్త్వనంతర స్తస్మా దపి రాజా భవిష్యతి ।
ఏత ద్విబ్రూత మే తథ్యం యదత్ర భవితా ధ్రువమ్" ॥ **(సం.మ.భా. ఆది. అ.115. శ్లో. 31,32)**

'జన్మజ్యేష్ఠుడైన ధర్మజుడు మనకు రాజు. అదియునుగాక నాతడు స్వగుణములతోడనే రాజయ్యెను. అం దేమాత్రము దోషము లేదు. కాని వాని యనంతరమైనను దుర్యోధనుడు రాజు గాగలడా? ఈ విషయమున నేమి జరుగనున్నదో నిశ్చితముగా వివరించి చెప్పుడు'- అని యడుగును.

ఇట 'అయన్త్వనంతరః' అను పదముచేత దుర్యోధనుడు, విచిత్రవీర్యునకు మొదటి భార్యయైన యంబిక యందు బుట్టిన ధృతరాష్ట్రుని కొడుకుగావున ధర్మజుని కన్నను దుర్యోధనుడే రాజు గావలయు నను నభిప్రాయము ధృతరాష్ట్రుడు వ్యక్తము చేయకపోలేదు. అందుకే ధర్మజుని రాజసూయప్రాప్త వైభవమునకు తండ్రికొడుకులలో నసూయాద్వేషములు గలిగినవి. కపటద్యూతమున ధర్మజుని సర్వస్వము నపహరించి (ద్రౌపదిని విడిచి) చివరి కాతనినిగూడ జయించిరి.

ఇట్లు ద్రౌపదిపై నధికారము 'సోదరులలో నొక్కొక్క రోడుటచే పైపైవారికి సంక్రమించి చివరికి సర్వాధికారము ధర్మజునిపై బడినది. అతడుగూడ తన్నోడుటచే నామెపై నాతనికున్న సర్వాధికారము ధర్మజుని పైయధికారియైన ధృతరాష్ట్రునకు సంక్రమించినది. కావుననే "తిష్ఠన్తి చేమే కురవ స్సభాయా మీశా స్సుతానాం చ తథా స్నుషాణాం" ఇపుడు నాకు (మాకు) సర్వాధికారులైన పెద్దలు(ధృతరాష్ట్రాదులు) సభలో నందరియెదుట నిదిగో బ్రతికియే స్థాణువులవలె కూర్చొని యున్నారు. వా రుండగా వారి యుత్తరాధికారికి దుర్యోధనునకు నాపై నధికారము ఎట్లు వచ్చును? కావున నా వాదము సమీక్షజేసి యథార్థమైన ధర్మస్వరూపమును సభలోని వారందరు నిర్ణయింపు డని ధర్మతత్త్వమును స్పష్టముగా ప్రకాశింప జేసి యంగీకరింపు డనును.

ఇట ద్రౌపది జిత యైనచో దుర్యోధనుడు సాక్షాదధికారి యగును. అజితయైనచో ధృతరాష్ట్రుని యనంతరము అధికారి అగును. కావుననే చివరకు ధృతరాష్ట్రుడు వరముల వేడుకొమ్మనగా ద్రౌపది, ధర్మజునకు స్వాతంత్ర్యమును, భీమాదులకు స్వాతంత్ర్యమును వరములుగా గోరునే కాని అంతటి యవమానమును బొందినను తన దాస్య విముక్తిని వరముగా గోరలేదు. మూడవ వరమును (పరీక్షగాను) తన దాస్యవిముక్తి కవకాశముగా నిచ్చినను క్షత్రియస్త్రీ మూడవవరము గోరరా దనునే కాని స్వదాస్య విముక్తిని గోరదు. ఇట్లు తాను దాసిని గానను సుదృఢ ధర్మతత్త్వమును దెలిసి త్రికరణములతో వెలిబుచ్చినది. నన్నయగూడ "నే నదాసినే. దాసినే"! యని సంగ్రహముగా నీ తత్త్వమును ద్రౌపదితోనే యనిపించును. దీనివలన తాను దాసిని గానని నిరూపించు నవకాశ మున్నను కౌరవు లధర్మ మాచరించుట యందరు తెలిసికొనియున్నను, తన భర్తలతో బాటు ప్రశాన్తసహనము వహించి పాండవులకు దగిన భార్యయని నిరూపించుకొన్నది. లేనిచో ద్రౌపది యప్పటికప్పుడు శపింపగల పతివ్రతా తపోనిధి. ఆమె కోపించిన కౌరవులు నిలుతురా? తమలో ఒక్కొక్కరే కౌరవులనందరిని పరిమార్చగల పాండవులు తమ ప్రశాన్త సహనము వీడినచో కౌరవులు బ్రతికియుందురా? వికారహేతు వున్నపుడే వికారము జెందనివారు ధీరులు. ద్రౌపదియును పాండవులును కోప విజృంభణమునకు దగిన కారణము లున్నను ఏ వికారమునకు గురికాక ప్రశాన్తసహనముల నుండుటచే నిజమైన ధీరులు.

ఇంతటి సహన మున్నందుననే నిండుసభలో రజస్వలయై ఏకవస్త్రయైన ద్రౌపదిని వివస్త్రను జేయబూనిన దుశ్శాసనునకు ద్రౌపదికి మించిన యవమానమే జరిగినది. ద్రౌపదిని వివస్త్రను జేయునపుడు ఆమె కృష్ణుని రక్షింపు మని మొరలిడెను. వెంటనే యా మహాత్ముడగు కృష్ణుడు ధర్మస్వరూపమై యామెమానమును రక్షించు వస్త్రరూపమై అనేక వస్త్రములతో నామెను గప్పెను. ఆమె ధర్మపాలనము జేయుటచే దుశ్శాసనుడు లాగినకొలది, యెడతెగని వస్త్రము లామె యొడలిపైననే పుట్టుచుండెను. వస్త్రములు గుట్టలై పడుచుండెను. నిత్యధర్మవస్త్రబద్ధయైన యామెవస్త్రము హీనమగుట లేదు. దుశ్శాసను డలసి సిగ్గిలి కూర్చుండెను. ద్రౌపది యవమానమునకు ధర్మమడ్డుపడినది కాని దుశ్శాసనుని యవమానమునకు

వానిద్వారా దుర్యోధనాదులకు గలిగిన యవమానమునకును ఎవ్వ రడ్డు పడరైరి. ఈ యకృత్య ఫలితమును భావిభారతరణమున ననుభవించినపుడు గూడ నెవ్వరడ్డురాకుండిరి.'' (మహాభారతము - విశ్వవిజ్ఞాన కోశము. (సిద్ధాంత వ్యాసము) (1989) -పు. 118-124)

2. మూలంలో వివరించబడిన అంశాలను మరికొన్నింటిని నన్నయ సూచ్యప్రాయంగా తెలుగులో చెప్పటంవలన కథార్థసమన్వయంలో ఆయనదైన ఒకవైఖరి స్పష్టమౌతున్నది. ఉదాహరణ (1) దుర్యోధనుడి దుశ్చేష్టితానికీ, ధర్మజుడి సమ్మతానికీ భయపడి ప్రాతికామివెంటపోవటం-(2.212) అనే వాక్యం అల్పాక్షరాలలో అనల్పార్థరచన. దుర్యోధనుడు పాండవసంపదను వంచనతో అపహరించి వారికి అవమానం చేయటమే కాకుండా తనను అపహసించిన ద్రౌపదిని అవమానించి వారి అభిమానధనాన్నికూడ వమ్ముచేయాలని పన్నిన కుట్రలో భాగమే- బలవంతంగా ధర్మజుడిచేత ద్రౌపదిని పణంగా పెట్టించటం. అది అతడి దుశ్చేష్టితం. పోగా, దానికి అవకాశ మివ్వటమే కాకుండా ధర్మరాజు తాను దాస్యంనుండి విముక్తుడు కాకుండానే ద్రౌపదినికూడ దాసిని చేసే దుష్టవ్యూహానికి తలఒగ్గటం ఆమెకు ఆశ్చర్యం వేసింది. ధర్మజుడి నిశ్శబ్దం 'ద్రౌపదికూడ దాసియే' అనే అంశాన్ని పరోక్షంగా అంగీకరించిన ట్లౌతుందని ఆమె భయం. దాన్ని సభలోనే తేల్చుకొనటం మంచిదని ఆమె కదలివచ్చింది. ఇక్కడ ఒక విషయం మాత్రం స్పష్టం. ద్రౌపది తాను దాసిని కాను- అనే నిశ్చితాభిప్రాయంతోనే ఆలోచించింది; దాని కనుగుణంగా మొదటినుండి తుదిదాకా వ్యవహరించింది. ఈ అంశాల నన్నింటినీ దుశ్చేష్టితం-సమ్మతం అనే రెండు పదాలలో ఊహించుకొమ్మంటాడు సారమతి నన్నయ.

3. మూలంలోని కొన్ని అంశాలను పూర్తిగా వదలిపెట్టటంలో కూడ నన్నయతీరు గోచరమౌతుంది. ప్రాతికామిని ద్రౌపది అడిగిన ప్రశ్నను, తానే వచ్చి ధర్మరాజునే నిండుసభలో అడిగి, సమాధానం తెలిసికొమ్మని ఆదేశించాడు దుర్యోధనుడు. ప్రాతికామిని తిరిగి ఆమెవద్దకు పంపాడు. ద్రౌపది సభలోని వారి నిశ్చయమేమిటో తెలిసికొనివస్తేదానిప్రకారం నడచుకొంటానని మరల ప్రాతికామిని త్రిప్పిపంపింది. ప్రాతికామి సభికుల నందరినీ ఉద్దేశించి ద్రౌపది అడిగినట్లుగా ఆమె ప్రశ్నను అడిగాడు. సభికులందరు తలలువంచి నిశ్శబ్దంగా ఉండిపోయారు. అప్పుడు మూలంలోని ధర్మరాజు ఆ పరిస్థితిని గమనించాడు. దుర్యోధనుడు ఏ విధంగానైనా ద్రౌపదిని సభకు రప్పించాలనే పట్టుదలతో ఉన్నాడని గ్రహించి, తానే ద్రౌపదివద్దకు విశ్వాసపాత్రుడైన ఒక దూతను పంపుతూ రహస్యంగా ఇట్లా నిర్దేశించాడు-

శ్లో. ''ఏకవస్త్రా త్వధో నీవీ రోదమానా రజస్వలా ।
సభా మాగమ్య పాంచాలి శ్వశురస్యాగ్రతో భవ ॥
అథ త్వా మాగతాం దృష్ట్వా రాజపుత్రీం సభాం తదా ।
సభ్యా స్సర్వే వినిందేరన్ మనోభి ర్ధృతరాష్ట్రజమ్'' ॥ **(సం. సభా. 60. 15)**

ఏకవస్త్రవూ, అధోనీవివీ, రజస్వలవూ అయిన ఓ పాంచాలీ! నీవు రోదిస్తూ సభకు వచ్చి మామగారైన ధృతరాష్ట్రుడి ఎదుట నిలువబడు. రాజపుత్రి వైకూడా అట్లా వచ్చిన నిన్ను చూచి సభ్యులందరూ దుర్యోధనుడిని మనస్సులలో నిందిస్తారు అని ధర్మరాజు నిర్దేశం. ధర్మజుడి సందేశాన్ని అనుసరించి ద్రౌపది సభకు వచ్చింది.

ఆమె సభకు వచ్చి ధృతరాష్ట్రుడి ఎదుట నిలువబడిందంటే సభకు చెప్పకుండానే తెలిసే విషయం ఒకటి ఉన్నది. తనను ముందుగా ఓడిన ధర్మజుడు ఆమెను పణంపెట్టి ఓడటం ధర్మం కాదు. అందువలన ఆమె ద్యూతంలో విజిత కాదు. ఆమె స్వతంత్ర, అయితే భర్తల బాధ్యత అధికారం ఆమెపట్ల లేనప్పుడు వారి తరువాత మామగారైన ధృతరాష్ట్రుడియందు ఆమెరక్షణ బాధ్యత లుంటాయి. ఆ అంశాన్ని స్థిరీకరించటానికే ధర్మజు డామె నట్లా నిర్దేశించాడు. నన్నయ ఈఅంశాన్ని తెలుగులో చెప్పలేదు. దానివలన ద్రౌపది స్వయంగా ఈఅంశాన్ని ఊహించి వర్తించిన వివేకవతిగా నన్నయ రచనలో రూపొందింది. 'తాను మున్నోడి ఆపైన నన్నోడెనా?' అని ధర్మజుడి సలహా లేకుండానే ప్రశ్నించిన ప్రజ్ఞావతికి సభలో వచ్చి ఏమి చేయాలో ధర్మజుడు చెప్పాలా? కాబట్టి నన్నయ ద్రౌపదివ్యక్తిత్వానికి విలువ పెంచటానికే మూలంలోని ఆ భాగాన్ని గ్రహించలే దని స్పష్టం!

4. ఈ అంశాల పరిశీలనంవలన తేలిందేమంటే- జూదంలో శకుని అక్షవిద్యాకుటిల విశారదుడు. అతడు ధర్మరాజును ఏనుగును ఆకులుకప్పిన గుంటలో త్రోసినట్లు ద్యూత ధర్మకూపంలో దింపాడు. ధర్మరాజుపడుతూ కూడా తనధర్మాన్ని రక్షించుకొని శత్రువుల కాపట్యాన్ని సూక్ష్మబుద్ధులకు తెలిసేటట్లు వ్యవహరించాడు. ద్యూతంవలన ఎట్లాగూ యుద్ధం తప్పదు. ద్యూతంలో ఓడిన ధర్మరాజుకు ప్రజలసానుభూతి లభించటం కష్టం. ద్రౌపదిని అవమానించటంవలన ప్రజలు కౌరవులను నిందించి పాండవులపట్ల సానుభూతిని ప్రదర్శిస్తారు. ద్రౌపదిని ఓడకపోతే పాండవులకు సానుభూతికూడా మిగలదు. కౌరవులు పాండవసంపదలను ప్రారంభించడానికి ద్రౌపదిని పణంగా పెట్టుమన్న శకునిసలహాను దోహదంగా తీసికొన్నాడు ధర్మజుడు. పాండవసంపదను సమూలంగా నాశనం చేశా ననుకొన్నాడు - శకుని ద్రౌపదీపణానికి అవకాశాన్ని కల్పిస్తూ. కాని ధర్మజుడి లోతైన ఎత్తుగడను గమనించలేకపోయాడు. సభలో ధర్మరాజు నిశ్శబ్దం భవిష్యత్తులో కౌరవుల జీవితాలలో వ్యాపించే మృత్యునిశ్శబ్దానికి బీజరూపం.

ధర్మజుడి నిశ్శబ్దంలోని అంతరార్థాన్ని తెలిసినవారు ఆ సభలో ఇద్దరే. ఒకడు భీష్ముడు, మరొకడు విదురుడు. విదురుడు ద్రౌపది అధర్మవిజిత అన్నాడు. జూదాన్ని బలవంతులతో ఆడటం విరోధమని వ్యాఖ్యానించాడు వాచ్యంగా. భీష్ముడు ధర్మజునికి ధర్మతత్త్వం తెలుసునని పరమవ్యంగ్యంగా చెప్పాడు తనమాటలలో. 'ధర్మసూక్ష్మం ధర్మజుడికే తెలుసు. దాని ఫలితం కౌరవులు త్వరలోనే అనుభవిస్తా' రని. ఆ ఫలిత మేమిటో ధర్మజుడికి తెలుసు. భీష్మ విదురులకు తెలుసు. ద్రౌపదికీ తెలుసు. వ్యాసుడి రెండు ఉపన్యాసాల సారాంశాన్ని నన్నయ రెండువాక్యాలలో భీష్మునినోట నిబంధించి చెప్పాడు. నానారుచిరార్థ సూక్తులంటే ఇవే. ప్రసన్నకథాకలి(వి) తార్థ యోజనమంటే ఇదే!

పైకిచూస్తే మాయాద్యూత పర్వాన్ని నన్నయ సంగ్రహంగా వ్రాసినట్లు కనపడుతుంది. కాని సారమతితో ఆలోచిస్తే సారమతి చేసిన సారవద్రచనగా ప్రసన్నమౌతుంది.

అనుద్యూతంలో ధర్మరాజు పణాన్ని తప్పదు కాబట్టి ఒప్పుకొన్నట్లు ఉంటుంది కథలో. కాని దాని లోతులుకూడా తక్కువకావు. కపటద్యూతం తరువాత హస్తినాపుర సార్వభౌములుగా ఎవరో ఒకరే ఉండాలని తేలిపోయింది. ధర్మరాజు పాండురాజు భాగం పొంది రాజ్యం చేస్తూ ఉండగా ధృతరాష్ట్రుడి భాగాన్ని ఆక్రమించడానికి ధర్మబద్ధమైన ఉపాయం లేదు. అంతేకాక స్త్రీ సంపాదించి యిచ్చిన రాజ్యాన్ని అనుభవించటం అనుజులకు ఇష్టం లేదు. ఒకసారి కురురాజ్యం వదలిపోతే కాని మరలరాజ్యం మొత్తం వీరభోజ్యంగా హరించే అవకాశం దొరకదు. ఆ అవకాశం ఎప్పుడు కలగాలి? అనుద్యూతాహ్వానం దానికి సూచికగా తోచింది. వెంటనే అనుద్యూతానికి ధర్మజుడు అంగీకరించాడు. మూలంలో భీష్మాదులు, కుంతి మొదలైన ఆప్తులు, హితులు, మంత్రులు ధర్మరాజును అనుద్యూతాహ్వానాన్ని తిరస్కరించు మని ఎన్నోవిధాల చెప్పినట్లు ఉన్నది. నన్నయ దానిని వదలి ధర్మజుడి మౌనానికే, స్వయం నిర్ణయానికే కథనంలో ప్రాధాన్యమిచ్చి నడిపించాడు. అనుద్యూతంలోనిమౌనం హస్తినాపుర సామ్రాజ్య సార్వభౌమార్హతకైన మార్గాన్వేషణం. శకుని వాక్కులలో సర్వేశ్వరుడు ప్రవేశించి తమకు సర్వరాజ్య సర్వంసహాధికార యోగ్యతాసిద్ధికొరకు పుణ్యాహవచనం చేస్తున్నట్లు ధర్మజుడు భావించిఉండాలి. అడవికి పోయే పాండవుల వైఖరి ఆ సామ్రాజ్యసిద్ధికొరకైన మహారణయజ్ఞానికి చేస్తున్న విఘ్నేశ్వరపూజ. భస్మంలోనుండి కూడ బంగారాన్ని సృష్టించగల ధర్మజనీతిశక్తికి సభాపర్వం సంజీవనిమంత్రం!

పాండవదిగ్విజయం: ప్రాచీనభారతం

మహాభారతంలోని సభాపర్వంలో పాండవులు చేసిన దిగ్విజయ వివరాలూ, భీష్మపర్వంలో కౌరవ పాండవులకు సహాయకులుగా నిలిచిన రాజుల వివరాలూ గమనిస్తే ఆకాలంనాటి భారతదేశం (భరతఖండం) రూపురేకలు మనకు కొంతవరకు గోచరిస్తాయి. అప్పటి భౌగోళికాంశాలనుగురించి, రాజ్యాలస్థితి గతులను గురించి పండితు లెందరో చర్చించి ఉన్నారు. శ్రీచర్ల నారాయణ శాస్త్రిగారు మహాభారత మీమాంస (మూడవభాగంలో) (1984 ప్రథమ ముద్రణ) లోని పన్నెండవ ప్రకరణంలో ఈ విషయాలు విపులంగా వివరించి చెప్పారు. అంతకు 50 ఏళ్ళముందు 1933లోనే శ్రీపెండ్యాల వేంకటసుబ్రహ్మణ్య శాస్త్రిగారు రచించి ప్రచురించిన గ్రంథం 'మహాభారత చరిత్రము' లో 'మహాభారతకాలపు రాజ్యములు' అని ఒక అధ్యాయాన్ని ప్రత్యేకంగా రచించారు. వారు పాఠకుల సౌకర్యార్థం 'భారతకాల భరతఖండము' అనే దేశపటాన్ని,

రాజ్యాల రాజుల పట్టీని అనుబంధంగా ఇచ్చారు. వారికి కృతజ్ఞతలతో ఈనాటి పఠితలకొరకు ఆ పటాన్ని ఇక్కడ పొందుపరచటమైనది. (మిగిలిన వివరాలకు ఆ గ్రంథాన్ని చూడవచ్చును.) భీమాదులు నాలుగు దిక్కులలో దండయాత్ర చేసి జయించిన దేశాలపేర్లు, స్నేహంతో వర్తించిన దేశాలపేర్లు, కొంతమంది రాజులపేర్లూ నన్నయ మూలాన్ని అనుసరించి తెలుగులో చెప్పాడు. ఆ దేశాలపట్టీని ఇక్కడ ఇవ్వటం జరుగుతున్నది. వాటిలో కొన్నింటిని పఠితలు ఆ పటంలో గుర్తించి తెలిసికొనగలరని భావిస్తున్నాము. కురుక్షేత్ర యుద్ధంలో పాల్గొనే రాజ్యాల రాజుల వివరాలు భీష్మపర్వపీఠికలో ఇవ్వటం జరుగుతుంది.

అర్జునుడి ఉత్తరదిగ్విజయయాత్రలో పేర్కొనబడిన దేశాలు, రాజులు : (సభా.1.229-241)

1. పుళిందదేశ ప్రభువు. 2. ప్రతివింధ్యుడు. 3. ద్వీప మండలేశ్వరులు. 4. ప్రాగ్జ్యోతిషం-భగదత్తుడు. 5. శబరులు, 6. సాగరతీర వాసులు. 7. అంతర్గిరి, బహిర్గిరి, ఉపగిరి భూపతులు. 8. ఉలూక దేశాధిపతి బృహంతుడు. 9. ఉత్తర ఉలూక, కామదేవ, మోదాపుర, సుదామ, సుసంకులము అనేదేశాలు, రాజులు. 10. దేవప్రస్థప్రభువు సేనాబిందుడు. 11. విష్వగశ్వుడు అనేరాజు. 12. పార్వతేయులు. 13. బర్బర, శబర, తురుష్క పతులు. 14. మాళవ, పౌండ్ర, కాశ్మీర, త్రిగర్త, లోహిత, సుధన్వ, గాంధార, కాంభోజ, కోసలపతులు. 15. సింహపురాధీశుడు చిత్రాయుధుడు. 16. వనచర దస్యుల రాజులు. 17. శ్వేతపర్వతం దాటిన తరువాత ఉన్న కాంభోజకటకుడు అనేరాజు, 17. హాటకదేశం, మానససరోవరం ఋషికుల్య ప్రాంతరాజులు, 18. హేమకూట నిషధాచలాలను దాటిన తరువాత గంధర్వనగరం. 19. జంబూవృక్షాన్ని జంబూనదిని చూచి మేరువును, గంధమాదనాన్ని దాటి సిద్ధ, విద్యాధర, చారణ, గంధర్వులచేత పూజితుడైనాడు. 20. మాల్యవంతం నీలపర్వతం దాటిన తర్వాత నున్న ఉత్తర కురుదేశాలు - హరివాసర నగరం.

భీముడి పూర్వ దిగ్విజయయాత్రలో పేర్కొనబడినదేశాలు, రాజులు: - (సభా.1.242-245)

1. పాంచాల దేశం. 2. విదేహరాజు జనకుడు. 3. దశార్ణపతి సుధన్వుడు. 4. అశ్వమేధేశ్వరుడైన రోచమానుడు. 5. చేది భూపాలుడు శిశుపాలుడు. 6. పుళిందవిషయంలో సుకుమార సుమిత్రులు. 7. కుమారవిషయంలో శ్రేణిమంతుడు. 8. కోసలదేశంలో బృహద్బలుడు. 9. అయోధ్యాపురంలోని దీర్ఘప్రజ్ఞుడు. 10. కాశీరాజు సుపార్శ్వుడు. 11. రాజపతిఅయిన సుధన్వుడు. 12. మత్స్య మలదపతులు. 13. కర్ణాట దక్షిణమల్లులు. 14. మగధపతి సహదేవుడు. 15. హిమవత్పర్వతపార్శ్వంలో ఉన్న జలోద్భవ మనేదేశం. 16. భల్లాటదేశం. 17. ఇంద్రపర్వత సమీపంలోని ఏడుగురు కిరాత పతులు, 18. శర్మక వర్మకులు. 19. ఇంద్రసేన సముద్రసేనులు. 20. కర్ణవత్సపతులు. 21. పుండ్రపతి. 22. పౌండ్రక వాసుదేవుడు.


సహదేవుడి దక్షిణదిగ్విజయయాత్రలో పేర్కొనబడిన దేశాలు, రాజులు: (సభా.1.246-264)

1. సుమిత్ర, శూరసేన, దంతవక్త్ర, యవనులు, 2. గోశృంగగిరి నివాసులు. 3. కుంతిభోజుడు. 4. భూరిబలుడి పుత్రుడైన జంభకుడు. 5. నర్మదానదీ సమీపంలో అవంతి దేశాధిపతులు విందానువిందులు. 6. మాహిష్మతీ పురాధీశుడు నీలుడు. 7. సౌరాష్ట్ర దేశంలో ఉండి దూతలద్వారా రుక్మి, భీష్మక, శూర్పారక, దండకపతులనుండి కప్పాలు కొన్నాడు. 8. సాగరద్వీపవాసులైన నిషాదులు, పురుషాదులు, ఏకపాదులు, కాలముఖులు, కర్ణప్రావరణులు, నరరాక్షస జాతులవారు. 9. రామశైల, కోల్లశైల, తామ్రద్వీప, సంజయంతీపుర నివాసులు. 10. తాళవన, పాండ్య, కేరళ, కాళింగ, ద్రవిడ, యవన, కరహాటక రాజులు. 11. లంకాధిపతి విభీషణుడు (దూతలద్వారా)

నకులుడి పశ్చిమదిగ్విజయయాత్రలో పేర్కొనబడిన దేశాలు, రాజులు: (సభా.1.265-270)

1. మహితక విషయం. దత్తక మయూరకాదులు. 2. మరు, మాళవ, బర్బర, కర్బర, శైరీషక, దశార్ణదేశాలు. 3. పుష్కరారణ్య నివాసులైన ఆభీరగణాలు. 4. సరస్వతీ, సింధు నదుల నాశ్రయించి ఉన్న స్రువణీయులు. 5. పంచనద-

భారతకాల భరతఖండం - (దేశపటం)



(కీ.శే. పెండ్యాల వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి గారి 'మహాభారతచరిత్రము' (1933) నుండి కృతజ్ఞతలతో)

అమర పర్వతనివాసులు. 6. ద్వారవతిలో వాసుదేవుడు. 7. మద్రపతి శల్యుడు (శాకలపురం). 8. పశ్చిమ సముద్ర గర్భనివాసులు బర్బర కిరాతవీరులు.

ఈ వివరాలు మహాభారతేతివృత్తంలోని చారిత్రక వాస్తవికతకు అద్దంపట్టుతాయి. ప్రాచీన భారతవర్ష పరిజ్ఞానానికి చుక్కానిపట్టుతాయి.

సభాపర్వం: సూక్తిసుధాకరం

ధర్మాధర్మ ప్రవృత్తుల సంఘర్షణలతో కూడుకొన్న సభాపర్వంలో నన్నయ కూర్చిన రుచిరార్థసూక్తులు కొన్ని తెలుగువారి నిత్యవ్యవహారంలో బాగా ప్రచారం పొంది ఉన్నాయి. సభాపర్వం అనగానే తెలుగువారినోట వినిపించే సుభాషితం వార్తను గురించినది.

ఆ. ''వార్తయంద జగము వర్తిల్లుచున్నది, యదియు లేనినాఁడ యఖిలజనులు
నంధకారమగ్ను లగుదురు గావున, వార్త నిర్వహింపవలయుఁ బతికి''- **(సభా.1.51)**

వార్తనుగురించి ఇంత చక్కని సూక్తి వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యంలో ఇంతవరకు వెలువడలేదు.

ఆదిపర్వంలోని 'నిండుమనంబు నవ్యనవనీత సమానము.....' అనే పద్యం తరువాత ప్రజాదరం బాగాపొందిన రుచిరార్థసూక్తి నన్నయ వాక్పారుష్యాన్ని గురించి సభాపర్వంలో చెప్పినది.

క. 'భూరిగుణోన్నతు లనఁదగు, వారికి ధీరులకు ధరణివల్లభులకు వా
క్పారుష్యము చన్నె మహా, దారుణ మది విషముకంటె దహనముకంటెన్''. **(సభా.2.17)**

కథార్థ సందర్భాలలో పొదగబడి ఉన్నప్పటికీ సూక్తులు స్వతంత్రప్రతిపత్తిగల పద్యాలుగా రాణించటం గమనార్హం. ఇటువంటి సూక్తులు జీవితంలోని అనేకరంగాలకు సంబంధించినవై ఉండటంచేత సమాజంలోని అన్నివర్గాలవారూ నన్నయసూక్తులను నోరారా పలుకుతూ ఉంటారు. వీటిని గురించి వ్యాఖ్యానంలో యథావకాశంగా వివరించటం జరిగింది కాబట్టి ఈ పీఠికలో వాటి ప్రస్తావన మాత్రం చేయబడుతున్నది. సూక్తులుగా సుప్రసిద్ధాలైన కొన్ని పద్యాలు-సభాపర్వం-1వ అశ్వా. పద్యాలు- **122, 123, 131, 2వ అశ్వా- పద్యాలు: 25, 49, 144, 149, 166, 167, 169, 170, 191, 192, 202, 237, 242, 263, 271.** సభాపర్వంలోని సూక్తులు ఎక్కువగా మానవుడి ఆర్థిక ధార్మిక జీవితానికి సంబంధించినవై ఉండటంచేత త్రివర్గసాధనలో అవి వెలుగు కిరణాలను ప్రసరిస్తూ ఉంటాయి.

సూక్తులు పూర్తి పద్యాలే కానక్కరలేదు. వాటిలోని వాక్యాలుకూడా కావచ్చు. లోకోక్తులుగా, ఛలోక్తులుగా, హాస్యోక్తులుగా, అధిక్షేపోక్తులుగా, వ్యంగ్యోక్తులుగా నన్నయ ఆయా సందర్భాలలో వాడినవాక్యాలు తెలుగువారి సంభాషణలలో వెలుగులు నింపుతూ ఉంటాయి- మచ్చుకు కొన్ని.

1. వృద్ధుల బుద్ధులు సంచలింపవే. సభా.2.9.
2. దాశార్హుండు పూజార్హుఁడే. సభా.2.8.
3. యుక్తమ కా కిది యేమి దోసమే? సభా.2.18.
4. పెద్దలచరితం బల్పులకు నెఱుఁగ శక్యమె యెందున్. సభా.2.19
5. పాలితదుర్ణయుండు శిశుపాలుఁడు బాలుఁడు. సభా.2.22.
6. బాలుఁ డయ్యును బూజ్యుండు బ్రాహ్మణుండు. సభా.2.25.

7. బూతు వొగడినట్లు వొగడెదు. సభా.2.48.

8. నీ కిట్లు పలుక సిగ్గును లేదే? సభా.2.67.

9. భూపతి సహియింపనోపునె సపత్నులవృద్ధియు నాత్మహానియున్. సభా.2.98.

10. మిత్రనిధీ! యొడంబడుము మిన్నక సంశయమంద నేటికిన్? సభా.2.133.

11. పాపకారులకుఁ బాయు నవశ్యము నర్థధర్మముల్. సభా.2.136.

12. ఒక నక్క నిచ్చి సింహమ్ముల విల్చికో లుఱదె? సభా.2.181.

13. చిఱుతవాని కింత తఱుసంటి పలుకులు సన్నె వృద్ధజనము లున్నచోట. సభా.2.228.

14. ఇట్లు చేయనైతినేని పితృపితామహులగతికిం దప్పినవాఁడ నగుదు. సభా.2.234.

15. దీని మఱచునది. నే నొండ్లు గఱపనేల? సభా.2.265.

ఇంకెన్నో అలంకృతోక్తులనుకూడ వ్యాఖ్యలో గమనించవచ్చును. మొత్తానికి సభాపర్వం ఒక సూక్తిసుధాకరం!

సభాపర్వం: ఉద్యోగపర్వం

మహాభారతంలో సభాపర్వం, ఉద్యోగపర్వం చెల్లెలు, అక్కవలె ఉంటాయి. నిడివిలో సభాపర్వం రెండాశ్వాసాలు. ఉద్యోగపర్వం నాలుగాశ్వాసాలు. ఈ భౌతికమైన భేదం ఉన్నా అంతర్గత లక్షణాలలో పోలిక చాలవరకు భాసిస్తుంది.

ఈ రెండిట్లో ఉండే కొన్ని సాధారణలక్షణా లివి: 1. శృంగారాది లలితరసాలు లేవు. 2. వీరరౌద్రరసాభ్యుదయోల్లాసాలు ఉద్దీప్తంగా పోషించబడతాయి. 3. శోకభయాది భావాల తీవ్రత కనిపిస్తుంది. 4. పాండవ ధార్తరాష్ట్రుల చిత్తవృత్తులూ, స్వభావాలూ సంఘర్షణాత్మకమైన సన్నివేశాలలో వారివారి దీర్ఘసంభాషణలద్వారా వ్యక్త మౌతాయి. 5. అర్థసాధనలో సార్థకాలైన వ్యూహాలను ప్రదర్శించే క్రియాచైతన్యం కథలో వెల్లివిరుస్తుంది. 6. ధర్మనీతివర్తనానికీ, కపటనీతివర్తనానికీ గల తారతమ్యం కొట్టవచ్చేటట్లుగా సన్నివేశాలు తీర్చిదిద్దపడతాయి. 7. భారతంలోని ప్రసిద్ధపాత్రల వాగ్వృత్తులకు అనుగుణంగా పాత్రోచితసంభాషణశిల్పం అభినయదర్పణంగా ఆవిష్కృత మౌతుంది. 8. రసపోషకాలైన శబ్దార్థగుణప్రధాన రచనాప్రయోగాలు కవుల స్వీయ శైలీవిన్యాస వైభవాన్ని ప్రదర్శించుకొనటానికి రంగస్థలాలై రాణిస్తాయి. 9. దశరూపకప్రయోగవైచిత్రి యథావకాశంగా ప్రకాశిస్తుంది. 10. తెలుగువారి నాల్కలమీద నిలువగలిగిన ప్రసిద్ధమైన తెలుగుపద్యాలకు హృద్యమైన రంగాలుగా వెలుగొందాయి.

ఈ రెండుపర్వాలకూ వస్తుకవితాస్వభావాలనుబట్టి భేదంకూడా లేకపోలేదు. 1. సభాపర్వంలో ద్యూతం ప్రధానం. ఉద్యోగపర్వంలో దౌత్యం ప్రధానం. 2. సభాపర్వంలో పాండవుల ఆర్థికమైన ఉత్థాన పతనావస్థలు వర్ణించటం ప్రధానం. ఉద్యోగపర్వంలో కౌరవుల ధార్మికమైన ఉత్థానపతనాలు వర్ణించబడతాయి. 3. సభాపర్వంలో పాండవుల రాజసూయవైభవం విస్తృతంగా వర్ణించబడి, తత్ఫలమంతా కపటవ్యాపారపూరితమైన మాయాదురోదరంతో వైపరీత్యాన్ని పొందటం చిత్రింపబడింది. ఉద్యోగపర్వంలో ధృతరాష్ట్రకృత కపటరాజనీతికి కవాటాలు తెరిచిన దౌత్యకార్యం విస్తృతంగా వర్ణింపబడి చివర కది శ్రీకృష్ణుడిరాయబారంతో శిథిలం కావించబడుతుంది. 4. సభాపర్వంలో పాండవులు ప్రతిజ్ఞలు చేస్తూ అరణ్యవాసానికి వెళ్ళుతారు. వారు అడవులకు పోతున్నా యుద్ధానికి పోతున్నట్లుంటుంది. ఉద్యోగపర్వంలో కౌరవులు పదకొండు అక్షౌహిణీల సైన్యంతో యుద్ధానికి పోతున్నా పాండవులవలె భయంకర ప్రతిజ్ఞలు చేయటం లేకపోగా ధార్తరాష్ట్రులు ధూర్తులవలె మృత్యుముఖంలోకి ప్రవేశిస్తున్న ట్లుంటుంది. 5. సభాపర్వం ధర్మయుద్ధానికి నాందిగా ముగుస్తుంది. ఉద్యోగపర్వం అధర్మపరిపాలనకు భరతవాక్యంవలె ధ్వనిస్తుంది. 6. సభాపర్వంలో నన్నయగారి శబ్దగుణప్రధానరచన లాస్యంచేస్తుంది. ఉద్యోగపర్వంలో తిక్కనగారి అర్థగుణప్రధాన రచన అభినయిస్తుంది.

ఈవిధంగా సామ్యభేదాలున్నా అంతర్గతస్వభావంలో ఆనురూప్యం గల ఈ రెండుపర్వాలనూ ఇటు నన్నయా, అటు తిక్కనా రచించటం ఆంధ్రసరస్వతి చేసికొన్న అదృష్టం. అందువలన ఈ ఉభయపర్వాలలో కథార్థవిశేషాల తులనాత్మకానుశీలనం ఎంతటి ప్రాధాన్యాన్ని వహిస్తుందో కవితార్థవిశేషాల పరిశీలనంకూడా అంతటి ప్రాముఖ్యాన్ని సంతరించుకొంటుంది.

శబ్దగుణశాలి నన్నయచతురశైలి - అర్థగుణశాలి తిక్కనయజ్వశైలి

రచనకు రూపాన్నిచ్చేది శబ్దం. ప్రాణచైతన్యాన్ని ప్రసాదించేది అర్థం. ప్రాణచైతన్యంతో కూడుకొన్న రూపమే శరీరం. అందువలననే భామహాదులు కవితకు శబ్దార్థాలు రెండూ కలిసి శరీర మన్నారు. కావ్యశరీరమైన శబ్దార్థాలలో శబ్దానికి ప్రాముఖ్యముండే రచనను చేసేవారు కొందరూ, అర్థానికి ప్రాధాన్యం ఉండే రచన చేసేవారు కొందరూ, ఉభయప్రాధాన్యం ఉండేరచన చేసేవారు కొందరూ కనపడతారు. కవిత్రయంలో శబ్దార్థోభయ ప్రాధాన్యమున్న రచనచేసేవాడు నన్నయ. అర్థప్రాధాన్యాన్ని మన్నించినవాడు తిక్కన. శబ్దవైచిత్రిచేత అర్థాన్ని దీపింపచేసేవాడు ఎఱ్ఱన. అందువలన ముగ్గురిశైలులూ మూడువిధాలుగా ఉంటాయి. ప్రాణచైతన్యంతోపాటు రూపవిలాసంకూడా ఉన్న ఆకృతిమాధుర్యాన్ని నన్నయ తెలుగుకవితకు ప్రసాదించాడు. ఆ మార్గాన్ని తరతరాల కవులు తన్మయత్వంతో అనుసరించారు. ఆకృతి వైభవంకంటె ఆత్మచైతన్యం అనంతంగా ప్రకాశించే తేజశ్శరీరాన్ని కవితకు తిక్కన ప్రసాదించాడు. నన్నయకవిత వివేకానందుడివలె రూపకాంతిమనోజ్ఞంగా ఉంటుంది. తిక్కనకవిత రామకృష్ణపరమహంసవలె భావతేజస్సుందరంగా ఉంటుంది. ఎఱ్ఱన ఆకృతిని అలంకరిస్తాడు; భావంచేత రూపారాధనం చేయిస్తాడు. ఆహార్యంచేత అలంకృతుడైన రాజకుమారుడివలె ఎఱ్ఱయకవిత రాణిస్తుంది.

కావ్యశరీరం శబ్దార్థోభయరూప మైతే- ఆ శరీరానికి శోభను కలిగించే గుణాలుకూడా శబ్దార్థగుణాలుగా ఉండాలని వామనుడు వింగడించాడు. ఉదాహరణకు- ఒక యువతి ఉన్నది. ఆ యువతి శరీరానికి శోభను కలిగించేది యౌవనం. ఇది కావ్యంలోని శబ్దగుణంవంటిది. శరీరశోభను కలిగించే యౌవనం యువతికి ఉన్నా, ఆమె ముగ్ధ కాకుండా గయ్యాళిగా ఉన్నదనుకోండి. ఆమె ఆస్వాదయోగ్యతను కోల్పోతుంది. లజ్జ మొదలైన ముగ్ధాలక్షణాలు ఆమె శరీరగుణాలు కావు. ఆమె సంస్కారంనుండి పుట్టిన ఆత్మగుణాలు. కావ్యానికి అర్థగుణాలవంటివి. యువతి సిగ్గులమొలక అయినప్పుడే ఉపభోగంలో శోభిస్తుంది. లేకపోతే రసభంగ మయ్యే అవకాశం ఉన్నది. ఈ తార్కాణంవలన కావ్యరచనలో శబ్దార్థగుణాల కున్న సార్థకమైన స్థానం స్పష్టమౌతుంది.

కావ్యానికి ఆత్మ రసం. అది ధ్వనిమయంగా శబ్దార్థాల నాశ్రయించి ఉంటుంది. ఆత్మలక్షణాలను గుణాలు వ్యంజింపచేస్తాయి. రసాన్ని ఆస్వాదించటానికి అనుగుణమైన సౌందర్యాభివ్యక్తిని గుణాలు కల్పిస్తాయి. నన్నయ కవితలోని ఆస్వాదనీయ మైన సౌందర్యం శబ్దగుణసంయోజనంవలన ప్రధానంగా ఏర్పడుతుంది. గుణవర్ధకమైన శబ్దం అతడి రచనకు ప్రాణం. దానివలన రచనకు నాదమాధుర్యం ఏర్పడుతుంది. సహజశోభాహేతువు లైన గుణాలను నన్నయ రచనలో పోషించినా వాటివలన రీతులు రూపుకట్టినట్లు సాధారణంగా కనపడవు. కాని, అక్కడక్కడ అటువంటి రచనను ఆవిష్కరించి రీతివైభవాన్ని ప్రదర్శించటం నన్నయకవితలో కనపడుతుంది. మచ్చునకు కుబేరసభలో పరమేశ్వరుడు సదా నివసించి ఉంటాడనే అంశాన్ని వర్ణించినపద్యం-

ఉ. వానికి నెయ్యుఁడై యమరవంద్యపదాంబుజుఁ డంబికా బృహ
త్పీనపయోధరాగ్రపరిపీడితవక్షుఁడు, భూషణీకృతా
హీనుఁ, డశేషలోకగురుఁ డీశ్వరుఁ డెప్పుడు నంద యుండు నా
నానిశితాయుధాయుతసనాథమహాద్భుతభూతకోటితోన్. **(సభా. 1.78)**

ఈ పద్యంలో ఓజఃప్రసాదగుణమిశ్రమం వైదర్భీరీతిని రూపుకట్టించింది. ఇందులో శివుడికి వేసిన విశేషణాలు నన్నయలో అపూర్వంగా కనపడతాయి. శ్రీనాథుడిరచనలో విశేషించి భీమఖండ, కాశీఖండాలలో శివుడి శృంగార రసికత్వం, శివగణ వీరవ్రతత్వం- సాధారణంగా గోచరిస్తాయి. 'అంబికా బృహత్పీనపయోధరాగ్ర పరిపీడితు' డనటంలోని శృంగారం.

'భూషణీకృతాహీనుడు' అన్న సమాస సంఘటనలో ఉన్న సంస్కృత వ్యాకరణ ప్రయోగప్రౌఢి, 'నానా నిశితాయుధాయుత సనాథ మహాద్భుత భూతకోటి'ని వర్ణించే విశిష్టపదరచనా రీతి నన్నయ అప్పుడప్పుడు ప్రదర్శించే రీతి విన్యాసం. శ్రీనాథుడు తరువాత దీనిని సొమ్ముచేసికొన్నాడు. 'కుంభినీధర సుతాకుచకుంభ పరిరంభ మహాలోలుపాయోం నమశ్శివాయ' అని శ్రీనాథుడు ఈ రీతిమార్గాన్ని తన నీతిగా మార్చుకొన్నాడు. ఆ శిల్పంలో శ్రీనాథుడు ఆ తరువాత నన్నయకు వారసుడై రసానుగుణమైన రీతులను పోషించే రచనకు ఒక కళాపూర్ణత్వాన్ని కల్పించాడు. నన్నయ ఆ మార్గంలో శ్రీనాథుడికి గురువైనాడు.

క. "నెట్టుకొని కొలుతు నన్నయ
భట్టోపాధ్యాయసార్వభౌముని఼ గవితా
పట్టాభిషిక్తు భారత
ఘట్టోల్లంఘనపటిష్ఠగాథప్రతిభున్" అని శ్రీనాథుడిచేత కీర్తించబడ్డాడు.

ఓజఃప్రసాదగుణమిశ్రమంవలన వైదర్భీరీతి, ఓజఃకాంతిగుణాలవలన గౌడీయరీతి, మాధుర్యసౌకుమార్యాలవలన పాంచాలిరీతి ఏర్పడతాయని లాక్షణికు లంటారు. ఈ రీతుల రీతులను శ్రీనాథుడి కవితలో గుర్తించినంత సులభంగా నన్నయలో కనుగొనలేము. అయినా గుణవద్రచనాసౌందర్యాన్ని మాత్రం గుర్తించి ఆస్వాదించగలం. నన్నయకవితలో ప్రసాదగుణం ప్రధానపాత్ర నిర్వహిస్తుంది. ఓజోమాధుర్యాది గుణాలలో ప్రసాదాన్ని ఆస్వాదయోగ్యంగా కలిపి ప్రయోగిస్తాడు నన్నయ. దానితో పద్యరచనకు హృద్యమైన సౌందర్యం ఏర్పడుతుంది. రసగుణాలైన దశవిధగుణాలను రసోదంచితంగా మేళవించి రచనలో రామణీయకత్వాన్ని సృష్టిస్తాడు నన్నయ. "నన్నయగారి రచన ప్రవాహము వంటిది. పద్యము విరుగదు. అమృతాధారగా఼ బోవుచుండును. అట్లుపోవుచున్న పద్యము తా నొక్కొక్కచోట విరుగును. ఎందుకు విరుగు ననగా, నచ్చటి భావము రచనచేత ధ్వనింప఼జేయుటకు-" అని కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారి వ్యాఖ్య (నన్నయగారి ప్రసన్నకథాకలితార్థయుక్తి- పు. 172) నన్నయరచనలో గుణప్రధానస్వభావాన్ని తెలుపుతున్నది. నన్నయ రచనలో అలంకారరీతివృత్తులు గుణపోషకాలుగా నిలవటం విశేషం. అది నన్నయకవితా శీలం.

తిక్కన అర్థగుణప్రధానవాది. అర్థగుణాలసంయోజనంవలన ప్రధానంగా రసాన్ని పోషిస్తా డాయన. అందువలననే పాత్రల ఆకృతులకంటె అభినయాన్ని విశేషంగా చిత్రిస్తాడు. శబ్దగుణం ఆకృతి వైభవాన్నీ, అర్థగుణం అవస్థావిలాసాన్నీ ధ్వనింపచేస్తాయి. అవస్థలను దీపింపచేసేవి అనుభావసాత్త్వికభావాలు. అనుభావాదులు రసభావవ్యంజకాలు. వాటి వ్యక్తీకరణంవలన శ్రవ్యకావ్యంలో దృశ్యకావ్యచిత్రణ వెల్లివిరుస్తుంది. దానికి సంభాషణాదులు రసవద్వృత్తులను అనుసంధింపజేస్తాయి. దానివలన కావ్యానికి రూపరామణీయకత్వంతోపాటు రసాభ్యుదయోల్లాసంకూడా ఏర్పడుతుంది. నన్నయ శబ్దగుణాలవలన కలిగించే రామణీయకత్వం వలన రసాభ్యుదయం కవితకు సిద్ధిస్తుంది. తిక్కన అర్థగుణపోషణంవలన రసాభ్యుదయంతోపాటు ఉత్+లాస్యస్థితి (నృత్యాయమానస్థితి)కూడా ఏర్పడుతుంది. నన్నయ శబ్దగుణప్రధానరచనకు మార్గదర్శకుడు. తిక్కన అర్థగుణప్రధానరచనకు ప్రస్థానాచార్యుడు.

శబ్దార్థగుణ స్వభావాలు ఈవిధంగా ఉంటాయి.

	గుణం	**శబ్దగుణం**	**అర్థగుణం**
1.	ఓజస్సు	గాఢబంధత్వం	అర్థప్రౌఢి
2.	ప్రసాదం	బంధశైథిల్యం	అర్థవైమల్యం
3.	శ్లేషము	మసృణత్వం	ఘటన
4.	సమత	మార్గాభేదం	అవైషమ్యం, ప్రక్రమాభేదం
5.	సమాధి	ఆరోహావరోహక్రమం	అర్థదర్శనం

6.	మాధుర్యం	పృథక్పదత్వం	ఉక్తివైచిత్ర్యం
7.	సౌకుమార్యం	అజరఠత్వం	అపారుష్యం
8.	ఉదారత	బంధవికటత్వం	సభ్యప్రసంగంలో అగ్రామ్యత్వం
9.	అర్థవ్యక్తి	అర్థవ్యక్తిహేతుత్వం	వస్తుస్వభావస్ఫుటత్వం
10.	కాంతి	బంధౌజ్జ్వల్యం	దీప్తరసత్వం

మరే వివరాలకు పోకుండానే పై శబ్దార్థ గుణ వివేచనను ముందుంచుకొని సమీక్షించినా సహృదయలోకానికి నన్నయ తిక్కనల రచనలలోని తారతమ్యం గోచరమౌతుంది. శబ్దబంధానికి సంబంధించినవి శబ్దగుణాలు, అర్థప్రకటనకు సంబంధించినవి అర్థగుణాలు. నన్నయ కవితలో అర్థప్రకటన చేస్తున్న శబ్దసౌందర్యం అనుభవానికి అందుతుంది. చక్కగా చిక్కగా అల్లిన పూలదండ పరిమళం వెదజల్లు తున్నట్లుంటుంది. తిక్కన రచనలో శబ్దం అర్థసమర్పణం చేసి అంతర్హిత మౌతుంది. అందువలన తిక్కన రచనలో శబ్దం పానకంలో చక్కెరవంటిది. మరొకవిధంగా చెప్పాలంటే- నన్నయశబ్దగుణరచన పండు తింటూ రసాన్ని ఆస్వాదించినట్లుంటుంది. తిక్కనరచన పండ్లరసాన్నే త్రాగుతున్నట్లుంటుంది. ఒక్కమాటలో చెప్పాలంటే- శబ్దగుణశాలి నన్నయ చతురశైలి; అర్థగుణశాలి తిక్కనయజ్వశైలి.

వామనాదులు శబ్దార్థగుణ వివేచనం చేసి విశ్లేషించి చూపించినా ఆ తరువాతి లాక్షణికులు ఆ విభాగాన్ని అంతగా పాటించలేదు. దానికి కారణం కవిత్వంలో శబ్దగుణాలను గుర్తించినంత సులభంగా అర్థగుణాలను గుర్తించలేము. అసలు కవులుకూడా అర్థగుణప్రధానమైన రచనం చేయటం చాలకష్టం. తెలుగులో తిక్కన అటువంటి కవిత వ్రాసి 'తన కావించిన సృష్టి తక్కొరులచేతం గాదునాన్'' అని ఎఱ్ఱయగారిచేత ప్రశంస లందుకొన్నాడు. ఆ భేదం నన్నయ తిక్కన కవితలలో కనపడుతుంది. నన్నయ శబ్దగుణవాది కాబట్టే అనుయాయులు అసంఖ్యాకంగా ఏర్పడ్డారు. తిక్కనరచన క్లిష్టం కాబట్టి ఆయన ఒక్కడే మిగిలిపోయాడు. అందువలన లక్షణగ్రంథకర్తలుకూడా అర్థగుణాలను ప్రత్యేకంగా పరిగణించటం మాని శబ్దగుణాలకు అనుబంధాలుగానే భావించారు. అంటే నన్నయశబ్దగుణాలను అనుశీలించేటప్పుడు శబ్దగుణలక్షణాలను ముఖ్యంగానూ, అర్థగుణలక్షణాలను గౌణంగానూ పరిగణించాలన్నమాట. తిక్కనకవితలో ఇది వ్యత్యస్తంగా మారుతుంది.

శబ్దార్థగుణవిభాగం ధ్వనిసిద్ధాంతం వచ్చినతరువాత వెనుకపడింది. ధ్వనివాదులు గుణాలు రసధర్మాలే కాని శబ్దార్థధర్మాలు కావని స్పష్టంగా చెప్పారు. అవి పది కాని, ఇరవై కాని కావని, రసానుభవదృష్టితో వాటిని మూడుగానే గుర్తించవచ్చుననీ పేర్కొన్నారు మమ్మటాదులు. రసానుభవంలో చిత్తద్రుతివలన కలిగే ఆహ్లాదకత్వం శృంగారాదులలో ఉంటుంది కాబట్టి ఆ రసగుణం మాధుర్య మని గుర్తించారు. మాధుర్యం కరుణ, విప్రలంభ, శాంతరసధర్మా లనికూడా పేర్కొన్నారు. రసానుభూతిలో చిత్తవిస్తారరూపమైన దీప్తత్వం వీరరసంలో కలుగుతుంది కాబట్టి ఓజస్సు ఆ రసగుణమని నిర్దేశించారు. వీరంకంటె రౌద్రబీభత్సాలలో ఓజస్సు రాణిస్తుందని కొందరు భావించారు. సర్వరసానుభవాలలో చిత్తవికాసం సర్వసామాన్యధర్మ మనీ అది సర్వరసాభ్యుదయ హేతు వనీ భావించి లాక్షణికులు ప్రసాదగుణం అటువంటి సర్వరస సామాన్యధర్మ మనీ గుర్తించారు. నన్నయరచనలో ప్రసాదగుణం ప్రధానమని గమనిస్తే అది సర్వరసరమ్యంగా ఉంటుందనీ, నానారుచిరార్థసూక్తికి నాణ్యంగా పనికివస్తుందనీ, అర్థయోజనాన్ని రసార్థయోజనంగా గ్రహిస్తే సర్వరసగుణాలను ప్రసాదంలో మిశ్రితంచేసి నన్నయ వాడతాడనీ స్పష్ట మౌతుంది.

పదిగుణాలూ వస్తుతః మూడుగుణాలలోనే అంతర్భవిస్తాయని మమ్మటాదుల అభిప్రాయం. కవిత్రయమార్గంలో ధ్వన్యనంతరయుగంలో రసధ్వనిమార్గదర్శకత్వాన్ని నిర్వహించిన లాక్షణికులలో మమ్మటుడు ముఖ్యుడుకూడ. అతనికాలం క్రీ.శ. 1020-1100. నన్నయసమకాలీనుడు. అంటే- నన్నయదృక్పథం ఆనాటికి ఆధునిక మన్నమాట!

ఆనాటి లాక్షణికులు ఓజస్సు, ప్రసాదం, మాధుర్యం అనేవి మూడే ప్రధానగుణాలనీ, పదిగుణాలలో శ్లేష, సమాధి, ఉదారగుణాలు ఓజస్సులోనూ, అర్థవ్యక్తి ప్రసాదంలోనూ, సుకుమారకాంతి సమతలు మాధుర్యప్రసాదాలలోనూ అంతర్భవిస్తాయనీ

భావిస్తున్నట్లు తెలుస్తున్నది. రసధ్వనిమార్గంలో పయనించే నన్నయ దీనికి అనుకూలుడే. అందువలన నన్నయ తిక్కనాదులలో గుణవిచారం చేసేటప్పుడు రసధర్మాలుగా, తదనుకూల రచనాధర్మాలుగా పరిశీలించటం సమంజస మౌతుంది.

సభాపర్వంలో వివిధరసగుణాలను పోషించే ప్రసిద్ధపద్యాలు నూటికిపైగా ఉన్నాయి. అందులో సగానికి పైగా ప్రసాదం, అర్థవ్యక్తిగుణాలకు, మిగిలినవాటిలో చెరిసగం ఓజస్సుకు, మాధుర్యానికి చెందుతాయి. వాటిలో అంతర్భవించే గుణాలన్నీ ఆ యా సందర్భాలలో పోషించబడినాయి.

నన్నయకవితలో ఓజస్సు

సభాపర్వంలో వస్తువు వీర రౌద్రరస ప్రధానమైనది. పాండవ రాజసూయం ధర్మయుద్ధ దాన వీరాలతోనూ, వాటికి పోషకంగా నిలిచే రౌద్రవిస్ఫూర్తితోనూ, మాయాద్యూత ఘట్టం రౌద్ర కరుణరసాలతోనూ ఉద్దీప్తంగా సాగాయి. అందువలన ఇందులో లలితరసాల ప్రసక్తి తక్కువ. అందువలన ఓజస్సు అనేగుణం విస్తృతంగా ప్రయోగించే అవకాశం ఉన్నది.

ధర్మజుడు ధర్మవీరుడు కావటంచేతను, ఉదాత్తుడు, శమప్రవృత్తి కలవాడు కావటంచేతను అర్థపురుషార్థసాధకులలో వెలుగొందే రౌద్రం పరుషంగా వ్యక్తం కాదు. ఆయనకు సహాయకులైన శ్రీకృష్ణ భీష్మాదులయందుకూడ శిశుపాలాదులవలె శుద్ధరౌద్రం భాసించే అవకాశం లేదు. ఇక శత్రువులలో దుర్యోధన, శకుని, కర్ణాదులు కపటవర్తనులై వ్యవహరించటంచేత వారియందు శుద్ధరౌద్రం రాణించదు. ఇకపోగా సభాపర్వంలో భీమసేను డొక్కడే భీషణయుద్ధాలూ, ప్రతిజ్ఞలూ చేసేవాడు. అయినా అతడు ధర్మజుడికి అనునాయకుడు. అనివార్యమైన అతని ఆగ్రహాన్ని అందరూ అదుపుచేయటానికి ప్రయత్నించారు. అందువలన శుద్ధమైన ఓజస్సు ఆతనియందూ ఆవిష్కరించబడటానికి వీలులేదు. ఈ పరిస్థితులలో నన్నయకవితలో వీరరౌద్రరసానుగుణమైన ఓజస్సు ప్రసాదమిశ్రితమై ఉండటమే సహజం. అటువంటిరచన ఉండటమే గమనార్హం.

నన్నయకవితలో రౌద్రరసగుణమైన ఓజస్సును ప్రదర్శించిన ప్రసిద్ధమైన పద్యపంచరత్నాలు సభాపర్వంలోనే కొలువుతీర్చి ఉండటం, అవి రౌద్రరసవిస్తారమైన రెండో ఆశ్వాసంలోనే ఉండటం విశేషం.

1. 'రయవిచలత్తురంగమతరంగములన్....... క్షణంబునన్.' (2.33)
2. 'ప్రకటితకోపవేగమున.......... అంతకమూర్తి కచ్చటన్.' (2.51)
3. 'కురువృద్ధుల్........... ఉగ్రాకృతిన్' (2.233)
4. 'ధారుణిరాజ్యసంపదమదంబున..... ఉగ్రరణాంతరంబునన్' (2.249)
5. 'కనకోర్వీధరసానుసారరుచి..... సంగ్రామరంగంబునన్.' (2.297)

అంగ, నేపథ్య, వాక్యభేదాలచేత రౌద్రరసం మూడువిధా లని భరతుడు నిర్దేశించాడు. పై పద్యాలైదింటిలో మొదటిది నేపథ్యానికీ, రెండవది అంగానికీ, మిగిలినమూడూ వాక్యరౌద్రానికీ ఉదాహరణలు. వాక్యరౌద్రాన్ని స్వభావరౌద్ర మనికూడా అంటారు కాబట్టి భీమార్జున రౌద్రప్రతిజ్ఞలను వర్ణించే పద్యాలు వారి రౌద్రస్వభావాన్నికూడా వ్యక్తంచేస్తున్నాయి. మొదటిరెండురకాలూ కథాకథనంలోని వర్ణనలు, మిగిలినమూడూ వీరప్రతిజ్ఞలు, పాత్రోచితవాచ్యాభినయపతాకలు!

'రయవిచలత్తురంగమతరంగములన్'- అనే పద్యంలోనిది శిశుపాలవధ అనే రౌద్రకర్మకు నేపథ్యాన్ని కల్పించే యదు వృష్ణి భోజ కుకురాంధకవాహినుల సంకుల విజృంభణవర్ణనం. ఇది నిర్దయతర రోషమారుతనితాంత సమీరితమైన వాహినిని దర్శింపజేసే సావయవరూపకం. రోషశబ్దంచేత అది రౌద్రరసానికి సంబంధించిన క్రోధభావోద్వేగస్థితిని నన్నయ ధ్వనింపజేస్తూ ఓజస్సును నిబంధించాడు. అలంకారాన్ని అక్షరరమ్యతతో సంవదించి క్రోధభావదీప్తిని భావనామయం చేశాడు. సైనికసమూహం ప్రదర్శించే కోపం రసస్ఫూర్తిని పొందదు. కాని, ఉద్దీపనవిభావంగా రాణిస్తుంది. ఇది క్రోధభావదీప్తిని మాత్రం తెలిపే అలంకారధ్వనిమయమైన పద్యం. ఇది రౌద్రరసభావం ప్రకటిస్తున్న విభావవర్ణనం. ఇందులో అనుభావవర్ణనం అస్పష్టం.

'ప్రకటితకోపవేగమున'-అనే పద్యం-భీష్ముడిని రూక్షాక్షరవచనాలతో ఆక్షేపిస్తూఉన్న శిశుపాలుడిని చూచి సహించలేక కోపించి భీమసేనుడు రౌద్రాకారంతో నిలిచిన అతడి అనుభావాలను వర్ణించేది. శత్రుకృతమైన నిందావమానాలవలన అభిమానధనుడైన ధీరుడికి కలిగే క్రోధోద్రేకం ఇందులో వర్ణ్యవస్తువు. క్రోధాన్ని ఎఱ్రబడిన కన్నులు, ముడివడిన కనుబొమ్మలు, నిప్పులు రాలే చూపులు, ఎఱ్రబారిన ముఖం, స్వేదం, పళ్ళు పటపటకొరకటం, పరుషవాక్యాలు పలకటం మొదలైన అనుభావాలతో వ్యక్తంచేస్తారు. భీముడియందు ఆ అనుభావాలను అలంకృతంచేసి నన్నయ రౌద్రవిభావాన్ని భావనామయం చేశాడు.

ఇందులో గమనించవలసిన అంశాలు ముఖ్యంగా మూ డున్నాయి.

1. శ్రవ్యకావ్యమర్యాద నాశ్రయించి అలంకారం విభావాన్ని ఆస్వాదమధురంగా మారుస్తుంది.

2. ఓజోగుణంవలన పఠితలకు చిత్తవిస్తారరూపమైన రౌద్రరసానుభవం కలుగుతుంది.

3. 'అతిరౌద్రాకారమున నలిగిన' 'భయానకతరలీల(దాల్చె' 'అంతకమూర్తి' 'నిఖిలక్షత్రియత్రాసజనకంబుగా నలిగి' అనేమాటలు రౌద్రరస అభినయానికి సంబంధించిన సాంకేతికపదాలవంటివి. రౌద్రాకారంతో కోపించటం అనేది భరతనాట్యశాస్త్రంలోని అష్టమాధ్యాయంలో చెప్పిన ఉత్తమాంగాభినయంలో భాగమైన రౌద్రదృష్టికి సంబంధించింది. చలనంలేని కనురెప్పలతో, తారకలతో, బొమముడితో కూడిన క్రూరమూ, పరుషమూ, అరుణమూ, ఉద్ధృతమూ అయిన చూపు గల ముద్ర-రౌద్రాకారం- రౌద్రరసంలో ప్రయోగించేది. ఆ ముద్రలో సాక్షాత్ నాట్యరసమైన రౌద్రరసం ఆకృతిగొన్నట్లుగా భీముడు ఉన్నా డని నన్నయవర్ణన. 'భయానకతరలీల' అన్నదికూడా రసదృష్టికి సంబంధించిందే. చూచేవారికి భయం కలిగించేదిగా ఉండేది భయానకం. అంటే చూచేవారుకూడా భీముడి ఆకారాన్ని చూచి రెండురెప్పలూ బాగా విప్పారి నిశ్చలంగా ఉండగా, తారకలు మెరుస్తూ తిరుగుతూఉండగా, అత్యధికమైన భయాన్ని చూపించే దృష్టిగల భంగిమ భయానకదృష్టి, అటువంటి భంగిమలో చూపరులు భయంతో నిలబడేటట్లు భీముని రౌద్రాకారం ఉన్న దని భావం. ఇవి నాట్యపరిభాషకు సంబంధించినవి కాగా, 'అంతకమూర్తికి' అనేది కావ్యాలంకారానికి సంబంధించింది. ఈవిధంగా రౌద్రరసవర్ణనం చేసేటప్పుడు నాట్యపరిభాషను కావ్యపరిభాషతో కలిపి వాడే రచనాశిల్పంలో నన్నయగారే తిక్కనకు మార్గదర్శకు లయ్యారు. "కనుగొనికోపవేగమున....." (విరా.2.133) అనే తిక్కనపద్యం ఈపాదులో మొలిచిందే.

'కురువృద్ధుల్ గురువృద్ధబాంధవులు'- అనే పద్యంలో రౌద్రరసపోషక మైన వాచికాభినయానికీ, పాత్రోచితసందర్భోచిత సంభాషణానికీ ఓజస్సు సమర్థమైన సాధకంగా నిలిచింది. గాఢబంధత్వంతోపాటు అర్థప్రౌఢికూడా ఈ శపథంలో రాణించింది. ఇంతమంది పెద్దలు చూస్తూఉండగా ఖలుడైన దుశ్శాసనుడు ద్రౌపదిని "ఇట్లు" చేశాడు అన్నాడు భీముడు. "ఇట్లు" అనే పదం వాచికాభినయంలో అనంతమైన భావాభివ్యక్తికి పనికివచ్చే వాఙ్మయసాధనం. ఇట్లు-అన్నప్పుడు దుశ్శాసనుడు ద్రౌపదికి చేసిన అవమానం అవాచ్యం(నోటపలుకరానిది) అనీ, అంతటి అవమానంచేశాడనీ సందర్భోచితంగా గమ్యమానమైన అర్థం. దానితోపాటు మరొక అర్థంకూడా ప్రతీయమానం అవుతుంది. భీముడికి అంతటి కోపం వచ్చేటట్లు అవమానంచేయటానికి ఎంత వీలుందో ఆవిధంగా అని అర్థం. ఆ కోపం ఎంతటిది? ఇంతమంది చూచేటట్లు అవమానంచేయటానికి కారకుడైన దుర్యోధనుడిముందు దుశ్శాసనుడి రొమ్ముచీల్చి అందులోనుండి పారే నెత్తురుటేరులను త్రాగితేకాని తీరనంతటిది. రౌద్రం రాక్షసప్రవృత్తికి సంబంధించిందని భరతనాట్యశాస్త్రం. పచ్చినెత్తురు త్రాగటం ఎంత రాక్షసమో అంత రౌద్రం, అంత ఉగ్రత్వం. దుశ్శాసనుడు చేసింది అంతటి రాక్షసకృత్య మని భీముడి భావం. ఇంతటి అర్థప్రౌఢి భీముడి వాక్కులలో ఉన్నప్పుడు ఈ పద్యంలోది అర్థగుణమైన ఓజస్సు అనవచ్చును కదా? కాదు. ఆ అర్థప్రౌఢిని గాఢబంధానికి గౌణం చేశాడు నన్నయ. అందువలన ఇది శబ్దగుణమైన ఓజస్సు సార్థకంగా సాగిన సమర్థవంతమైన పద్యం. భావిరణరంగంలో దుర్యోధనుడికంటె దుశ్శాసనుడిచావు ముందుగా జరుగుతుందనీ, అతడి కర్మానుభవానికి ప్రేరకుడైన దుర్యోధనుడు అప్పుడు పరితపించక తప్ప దనీ వ్యంగ్యార్థం. రౌద్రరసంనుండి కరుణరసం పుడుతుంది. దుర్యోధనుని రౌద్రంనుండి ద్రౌపదియందు కరుణం జనించింది. శత్రుకృత అవమానంనుండి భీముడిలో రౌద్రం జనించింది. దానివలన దుర్యోధనాదులకు శోకం కలిగిస్తా నని

అతడు శపథం చేశాడు. రౌద్రానుప్రాణిత యుద్ధవీరం ఇందులో రసం. అందువలననే అతడిశపథం విని సభ్యులు అద్భుతరసావిష్టు లైనారు. వీరం జనకరసం. అద్భుతం జన్యరసం.

దుశ్శాసనుడిని చంపుతా నని భీముడు శపథం చేసినప్పుడు ఆలోచిస్తూ ఆగ్రహాన్ని అభివ్యక్తీకరించాడు. మరి-దుర్యోధనుడి తొడలు విరుగగొడతా నన్నప్పుడు భీముడు 'సర్వజనభయానకక్రోధావేశవివశు'డైనాడు. 'రౌద్రాకారం' తాల్చాడు. అప్పుడు పలికినపద్యం "ధారుణిరాజ్యసంపద మదంబున......". చెయ్యకూడని పనిని వివేకం లేకుండ చేశాడు కాబట్టి దుశ్శాసనుడు ఖలుడు, పశుతుల్యుడు. అతడి నెత్తురు త్రాగటం అతడి పశుత్వానికి అనువైనపని. కాని, దుర్యోధనుడు తెలిసి మదంచేత ఇల్లాలిని అవమానించ దలచిన "దురాత్ముడు" (చెడుబుద్ధి కలవాడు, దుష్టమైన స్వభావం కలవాడు) వీడు చావకూడదు, చచ్చినట్లు పడి తన కర్మఫలాన్ని భీము డనే రౌద్రాకారుడివలన ఇహంలోనే అనుభవించి అవమానం పొందాలి అన్నది అతడి భావం. అర్థప్రౌఢికంటె గాఢబంధత్వమే ఈ రచనలో శబ్దగుణమైన ఓజస్సుకు ప్రాణంపోస్తున్నది. ఈ నాలుగుపద్యాలు ఒకటికంటె మరొకటి విలక్షణమైనవి, విశిష్టమైనవి.

భీముడిశపథాలు ద్వంద్వయుద్ధాలకే పరిమితమైనవి. అయితే, అరణ్యానికి పోతూ 'దుర్యోధనాదులగు రిపుల'ను చంపుతా నని శపథం చేసినట్లు భీముడిచేత నన్నయగారు అనిపించారు (సభా.2.295) కాని అందులో ఓజస్సు లేదు. పైపద్యాలలోని తేజస్సుకూడా లేదు. కాగా, అరణ్యానికి పోతూ పాండవులు చేసిన ప్రతిజ్ఞలలో కవ్వడి చేసిన ప్రతిజ్ఞ కవోష్ణంగా ఉన్నది. "కనకోర్వీధర....." అన్న మత్తేభం ఓజోగుణభూయిష్ఠం. అర్జునుడి ప్రతిజ్ఞలో అంతర్నిగూఢ క్రోధం గర్జించినట్లయింది. వికటత్వ మనే ఉదారతతో కూడుకొన్న ఔజ్జ్వల్యంకూడా ఆ మాటలలో ఉన్నది. పక్షులముందు పిండాలు వేసినట్లుగా, రక్తతర్పణాలతో పక్షులు (ప్రేతాలకు ప్రతినిధులు) సంతోషపడేటట్లు కర్ణాదులను చంపుతా నన్నాడు పార్థుడు. అగ్రామ్యత్వంతోడి వికటత్వం. అర్థప్రౌఢితోకూడిన గాఢబంధత్వం అర్జునుడి ధీరోదాత్తప్రవృత్తిని వీరరసమూర్తిని ధ్వనింపజేస్తున్నాయి. (మరిన్ని వివరాలకు వ్యాఖ్యానంలోని విశేషాంశాలు చూడండి).

నన్నయగారి సభాపర్వంలో ఈ అయిదుపద్యాలూ ఓజో(శబ్ద)గుణప్రధానకవితకు పద్యపతాకలు!

రౌద్రరసపోషణంలో తిక్కన శబ్దగుణంకంటె అర్థగుణానికి ఏవిధంగా ప్రాధాన్యా న్నిస్తాడో గమనిస్తే నన్నయతిక్కనల గుణవద్రచనలలోని భేదాన్ని తెలిసికొనటం తేలికౌతుంది. ముందుగా తిక్కన నన్నయవలె ఓజోగుణాన్ని శబ్దగుణంగా వెలార్చే విధానానికి ప్రసిద్ధమైన పద్యం ఒకటి-

శా. "దుర్వారోద్యమబాహువిక్రమరసాస్తోకప్రతాపస్ఫుర
ద్గర్వాంధప్రతివీరనిర్మథనవిద్యాపారగుల్ మత్పతుల్
గీర్వాణాకృతు లేవు రిప్లు నిను దోర్లీలన్ వెస న్గిట్టి గం
ధర్వుల్ మానముఁ బ్రాణముం గొనుట తథ్యం బెమ్మెయిం గీచకా!". **(సభా. 2-55)**

పాండవుల రౌద్రవిభావవిస్ఫూర్తిని ప్రకటింపజేసే ద్రౌపదివాక్యాలలో ఆకృతినిరూపణసామర్థ్యం గల శబ్దగుణమైన ఓజస్సును కూర్చటం ఔచిత్యం. అయితే, తిక్కన రచనలో విభావాలను భావమూర్తులుగా చిత్రించే శిల్పమే అధికం; భౌతికరూపచిత్రణంకంటె భావక్రియారూపచిత్రణమే విస్తారం. పైపద్యంలో రౌద్రవిభావ ప్రదర్శనం చేసిన పద్ధతి శబ్దగుణాశ్రయంగా తిక్కన రచించి చూపించినా ఆయన ప్రధానంగా భావోచితవాక్యవిన్యాసంద్వారా పాత్రలప్రవృత్తులను వ్యంజింపజేసే అర్థగుణాశ్రితమైన రచనాశక్తిని ప్రకటించడంలో తన ప్రజ్ఞాప్రాభవాన్ని ప్రసిద్ధంగా ప్రదర్శించాడు. అందుచేత తిక్కన రచనలో అర్థగుణదీప్తి భాసిస్తుంది. ఉదాహరణకు భీముడి రౌద్రప్రవృత్తిని ప్రకటించే ఈ పద్యం చూడండి:

మ. "అవనీచక్రము సంచలింపఁగ దివం బల్లాడ నాశాచయం
బవధూతంబుగ గోత్రశైలనికరం బాకంపముం బొంద న

ర్ణవముల్ ఘూర్ణన మొందఁ గ్రోధము గృతార్థత్వంబు నొందించి చి
త్రవధప్రౌఢి వహించి సూతునకు రౌద్రం బేర్పడం జూపెదన్''. **(సభా. 2.284)**

రౌద్రరసోన్నిద్ర మైన ఈ పద్యంలో నిజానికి తిక్కన శబ్దగుణప్రధాన మైన సమాససంఘటనను ప్రవేశపెట్టియుండవలసింది. కాని, గాఢబంధత్వంతో కాక అర్థప్రౌఢితో భీమరౌద్రాన్ని తిక్కన వ్యక్తీకరించాడు. తిక్కన కిట్టిరచన అత్యంతప్రీతిపాత్రం. ఓజస్సును రౌద్రంలో నిబంధించటం రసవద్రచనాధర్మం. అయితే, దానిని శబ్దగుణంగా వెలార్చాలా, అర్థగుణంగా వెలార్చాలా అన్నది కవి ఇచ్ఛాధీనం. తిక్కన పైపద్యంలో అర్థగుణ మైన ఓజస్సును ప్రదర్శించిన తీరు అపూర్వం. క్రోధం స్థాయిభావం. అది కృతార్థత్వం పొందటం అంటే రౌద్రంగా మారటమే. దానిని భావరూపంగా, క్రియారూపంగా కీచకుడి పట్ల ప్రదర్శించి చూపుతా నని భీమప్రతిజ్ఞ. రౌద్రరసమూర్తి అంటే ప్రళయకాలరుద్రునిమూర్తి అనే అర్థవిశేషం ధ్వని. ఆ రుద్రమూర్తిని చూచి ప్రకృతి సంక్షోభిస్తుంది. అటువంటి రౌద్రమూర్తిని ప్రదర్శిస్తానని భీముడి భావం. అప్పుడు కీచకుడుకూడ సంక్షోభాన్ని పొంది చిత్రవధకు గురికొతాడట. భీముడిని ప్రళయరుద్రుడిగా భావింపజేసే అర్థప్రౌఢి ఇందులో ప్రధానం. రౌద్రరసంనుండి జనించే కరుణరసం భావనారమ్యం. ఇక్కడ శబ్దం అర్థంలో మునిగింది. శబ్దగుణంకంటె అర్థగుణం సాత్త్వికమైనదీ, సూక్ష్మమైనదీ, సుందరమైనదీ అయి, ఆస్వాదమాధుర్యాన్ని పఠితకు భావనామయంగా అందిస్తుంది. ఈ పద్యాలు రెండింటినీ గమనిస్తే నన్నయమార్గాన్ని అనుసరిస్తూనే తనప్రత్యేకతను తిక్కన ఎట్లా ప్రపంచించాడో స్పష్టమౌతుంది. ఉభయులమార్గాలలో ఉన్న సామ్యభేదాలు తేటపడతాయి.

శ్లేష, సమాధి, ఉదారత అనే గుణాలు ఓజస్సులో అంతర్భవిస్తాయి. వాటిని నన్నయ సభాపర్వంలో నిర్వహించినతీరు గమనించదగింది. బహుపదముల ఏకవద్భావం శబ్దాశ్రితమైన శ్లేషం. సన్నివేశఘటన అర్థాశ్రితమైన శ్లేషం. ఈ రెండింటియొక్క చక్కని సంయోజనంతో శ్లేషను శబ్దగుణప్రధానంగా ఆవిష్కరించిన నన్నయపద్యం-

ఉ. ''ఆ వనజాననం గురుకులాపశదుండు గడంగి రాజసూ
యావభృథంబునందు వసుధామరమంత్రపవిత్రవారిధా
రావళిఁ జేసి పావనములైన శిరోజములం దెమల్చి పా
పావహుఁ డీడ్చి తెచ్చె సభ కందఱు సంభ్రమమంది చూడఁగన్''. **(సభా. 2.216)**

సన్నివేశం రౌద్రరసగంభీర మైనది. నిర్దయుడైన దుశ్శాసనుడు ద్రౌపదిపవిత్రదీర్ఘకేశాలను పట్టి నిండుసభకు లాగుకొనివచ్చే క్రియాబహుళమైన సన్నివేశాన్ని నన్నయ శ్లేషలో నిబంధించాడు. అక్షరాలు వేరైనప్పటికీ ఒకేపదంవలె తోపింపజేసే సంహిత(సమీపోచ్చారణం)కు అనుకూలమైన వర్గాక్షరాల విన్యాసవిశేషంచేత గాఢంగా భాసించేది శబ్దగుణం. పవర్గ, కవర్గాక్షరాలతో మిళిత మైన అంతస్థశ్వాసాక్షరాల వర్ణవిన్యాసం రౌద్రభావోచిత మైన అక్షరరమ్యతను సాధించి శ్లేషను రూపుకట్టించింది. ద్రౌపది దీర్ఘశిరోజవర్ణనంలో గల దీర్ఘసమాసబంధం శ్లేషలోని ఓజస్సును పోషిస్తూ ఉండగా, దానిని పట్టి లాగుతున్న దుశ్శాసనుడిచర్యను వర్ణించే పదాలలోని శైథిల్యం పఠితకు స్ఫురించకుండా రచించటంలో శ్లేష భాసించింది. ఓజస్సుకు అంగంగా నిలిచి తన అస్తిత్వాన్ని ఆకృతికట్టించుకొన్నది. సన్నివేశం నిర్విరామంగా, ఏకధాటిగా ఒక్కుమ్మడిగా దానినిగురించి విశ్లేషించి తెలుసుకొనటానికి వీలులేకుండా సాగినట్లు చిత్రించిన ఈ శ్లేషగుణం సార్థకం. శబ్దప్రధానమైన మసృణత్వం ఘటనను తనలో ముంచివేసినట్లు రచించిన నన్నయరచన రౌద్రరసోన్నిద్ర మైన శబ్దశ్లేషగుణానికి ఉదాహరణం. అది ఓజస్సును తనలో నిలుపుకొన్నది కాబట్టి ఓజోగుణసుందరం.

నన్నయ తిక్కన రచనలలో శ్లేష శబ్దార్థఘటనల వ్యక్తిత్వాలను అపూర్వంగా ఆవిష్కరించే శిల్పాన్ని వెలార్చగలిగింది. అందువలన నన్నయశ్లేష అక్షరరమ్యతను సంతరించుకొన్నది తిక్కనశ్లేష అర్థసంఘటనకు ఆయువుపోసింది.

శ్లేష తిక్కన అర్థగుణ ప్రయోగ పాండిత్యాన్ని పట్టియిచ్చే గుణం. పదబంధంలోని మసృణత్వమే శబ్దగుణమైన శ్లేషలక్షణం. బహుపదా లున్నప్పటికీ ఏకపదంవలెనే భాసించటం దానిస్వభావం. అర్థగుణమైన శ్లేష అర్థఘటనకు

సంబంధించింది. అనేక భావా లున్నప్పటికీ అవన్నీ నీరక్షీరన్యాయంగా కలిసి వేరుపరచటానికి వీలుకాకుండా మెలగుతూ ఉండే ఐక్యఘటనాన్ని సంవదింపజేసేదిగా అది కనపడుతుంది. మచ్చుకు - తిక్కనప్రసిద్ధపద్యం:

చ. ''పగ యడఁగించు టెంతయు శుభం; బది లెస్స; యడంగునే పగం
బగ; వగ గొన్న మార్కొనక పల్కక యుండఁగ వచ్చునే; కడుం
దెగ మొద లెత్తిపోవఁ బగఁ దీర్పఁగ వచ్చినఁ గ్రౌర్య మొందు; నే
మిగతిఁ దలంచినం బగకు మేలిమి లేమి ధ్రువంబు గేశవా!''. **(ఉద్యో. 3-21)**

శ్లేషలో క్రమమూ, కౌటిల్యమూ, అనుల్బణత్వమూ ఉపపన్నమై ఉండా లని వామనుడు పేర్కొన్నాడు. ఈ మూడు లక్షణాలూ ధర్మజుడి వాక్యఘటనలో అర్థగుణసిద్ధిని పొందాయి. తిక్కనపాత్రలు ఆలోచిస్తూ మాట్లాడుతున్నట్లుండటం ప్రసిద్ధి. వారి మాటల పొందికలో ఎంత మన్నిక ఉంటుందో వాక్యాల కూర్పులో అంత అర్థసంఘటన ఉంటుంది. మాటలను అతకటం శబ్దగుణం; ఊటగా ఊరే భావాలను బహు వాక్యాలలో ప్రవహింపజేసినా ఏకధారను అర్థస్ఫూర్తియందు సంఘటింపజేయడం అర్థగుణం. తిక్కన రచనలో శబ్దగుణమైన శ్లేష అర్థగుణమైన శ్లేషకు ఊడిగం చేస్తుంది. వాక్యవిన్యాసంలో ఏకసూత్రంగా ఉండే ఆలోచనాక్రమం ఒక్కొక్కప్పుడు వక్రతతో కూడివున్నా అనుల్బణత్వాన్ని ఆద్యంతమూ సమాదరిస్తుంది. ఇది తిక్కన సంభాషణశిల్పంలోని ఆయుస్సూత్రం. పైపద్యంలోని ధర్మజుడి వాక్యరచన అర్థగుణమైన శ్లేషకు శీర్షప్రాయమైన ఉదాహరణం.

ఆరోహావరోహక్రమం శబ్దగుణమైన సమాధిలక్షణం. పద్యంలోని రచనాబంధం క్రమంగా హెచ్చుతూ తగ్గుతూ, దిగుతూ ఎక్కుతూ శ్రోతలకు రచనమీదా, తద్వారా రసభావప్రకటనం మీదా రక్తి కలిగించటమే శబ్దగుణప్రయోజనం. అర్థగుణమైన సమాధి పద్యంలోని తాత్పర్యంమీద పఠితబుద్ధిని సమాహితంచేసి అర్థదర్శనం చేయిస్తుంది. నన్నయరచనలో శబ్దసమాధికి అర్థసమాధి అంగం. ఉదాహరణకు-

మ. ''అవనీనాథు లనేకు లుండఁగ విశిష్టారాధ్యు లార్యుల్ మహీ
దివిజుల్ పూజ్యులు పల్వు రుండఁగ ధరిత్రీనాథ! గాంగేయు దు
ర్వ్యవసాయంబునఁ గృష్ణుఁ గష్టచరితున్ వార్ష్ణేయుఁ బూజించి నీ
యవివేకం బెఱిఁగించి తిందఱకు; దాశార్హుండు పూజార్హుఁడే!''. **(సభా. 2.8)**

శిశుపాలుడి ఈ అధిక్షేపవాక్యాలలో మూడురకాల వాక్యవిన్యాసా లున్నాయి. సభలో నిండియున్న అవనీనాథులనూ, విశిష్టారాధ్యులనూ, ఆర్యులనూ, మహీదివిజులనూ, పూజ్యులైన అనేకులనూ చేయెత్తి నిర్దేశించిచూపిస్తూ, వా రందరి మహత్త్వాన్నీ ఎలుగెత్తి చెప్తూ ఉదాత్తఫణితిలో ఆరోహక్రమంలో మొదటివాక్యం అన్నాడు. ధరణీనాథ! అనే సంబుద్ధి అధిక్షేపాత్మకం; అవివేకిని పట్టుకొని మహారాజా! అని పిలిచినట్లు పిలిచే వైఖరితో పిలిచిన పిలుపది. అక్కడినుండి 'నీ అవివేకం బెఱిఁగించి తిందఱకు'- అనేంతవరకూ అభిశంసనాత్మకంగా మాట్లాడుతూ వాక్యవిన్యాసంలో అవరోహక్రమం భాసించేటట్లు పలికాడు - శిశుపాలుడు. 'దాశార్హుండు పూజార్హుఁడే?' అనే వాక్యం అమర్షాధిక్షేపాత్మక మైన ఆవేశంతో వేసిన ప్రశ్న. శిశుపాలుడి కోపం తీవ్రస్థాయిని అందుకొన్న దీర్ఘాక్షర రూక్షవచనం, ఆరోహక్రమానికి అచ్చమైన అభివ్యక్తి.

శిశుపాలుడి రౌద్రప్రవృత్తికి ఈ పద్యం అద్దంపట్టుతుంది. ఆరోహావరోహక్రమంలో ఒక వర్తులం ప్రదర్శిత మైన అక్షరవిన్యాసం ఈ పద్యంలోని శబ్దసమాధి శిల్పం. పద్యంలోని 'కృష్ణుఁ గష్టచరితున్ వార్ష్ణేయుఁ బూజించి' అన్నప్పుడూ, 'దాశార్హుండు పూజార్హుఁడే' అని అధిక్షేపించినప్పుడూ అర్థం గూఢంగా ద్యోతక మౌతున్నది కాబట్టి అర్థదర్శనప్రధానమైన అర్థగుణసమాధికంటె ఆరోహావరోహక్రమ విన్యాసప్రధానమైన వాక్యవిన్యాసమే ప్రస్ఫుటంగా ఉండటంచేత ఇది శబ్దగుణప్రధానమైన సమాధిగా నిశ్చయించవచ్చును.

సమాధిలో లఘ్వక్షరవిన్యాసమున్న రచనలో అవరోహం, గుర్వక్షర విన్యాసమున్న రచనలో ఆరోహం అధికంగా భాసిస్తాయి. అందులో- అవరోహంనుండి ఆరోహాన్ని అందుకొనే శబ్దగుణసమాధిని నిబంధించే పద్ధతి ఒకరకం. వక్తవ్యాంశాన్ని క్రమపరిణామపద్ధతిలోగాని, ఆరంభవివరణపద్ధతిలోగాని చెప్పే ప్రతిపాదనవిధానంలో శబ్దగుణం రాణిస్తుంది. అటువంటి పద్యంలోని రచన రక్తిని కలిగించినా అది అంతటితో ఆగకుండా ప్రతిపాద్యాంశంలో పఠితమనస్సును అవహితం చేసే గుణాన్ని ప్రకటిస్తుంది. అర్థప్రతిపాదనకంటె అక్షరవిన్యాసం ఆకర్షణీయంగా ఉండేది శబ్దగుణం. అక్షరవిన్యాసంకంటె అర్థప్రతిపాదన ఆకట్టుకొనేది అర్థగుణం. ఒకటి నన్నయసొత్తు. మరొకటి తిక్కనసొత్తు.

ఆరోహక్రమాన్ని అందంగా ప్రదర్శించే శబ్దసమాధిగుణానికి ఉదాహరణం-

ఉ. "పాలితదుర్ణయుండు శిశుపాలుఁడు బాలుఁడు, వీని నేల భూ
పాలక నీకుఁ బట్టువఱుపన్, మఱి ధర్మ్మ వెఱుంగ వీనికిం
బోలునె రాగకోపపరిభూతమనస్కున కల్పరాజ్య ల
క్ష్మీలలనాంధబుద్ధి కనిమిత్తమహత్పరివాదశీలికిన్". **(సభా. 2.22)**

శిశుపాలుడిని బాలుడిగా చెప్పి అధిక్షేపించే మాటలనుండి, తనకు ధర్మం తెలియ దని నిందించిన శిశుపాలుడిలో ధర్మం తెలియలేని అవగుణాలను ఏకరువుపెట్టే ఆవేశాత్మకమైన వాక్యవిన్యాసంవరకు సాగే ఈ పద్యంలోని అక్షరవిన్యాసంతోపాటు వాక్యవిన్యాసంకూడా అవరోహంనుండి ఆరోహంవరకు సాగే సమాధిని సాక్షాత్కరింపజేస్తూ క్రోధభావద్యోతకంగా నిలిచింది.

పద్యంలో అవరోహక్రమం భాసించే పద్ధతికి ఉదాహరణం-

చ. "అతులపరాక్రమార్జితములైన ధనంబుల పేర్మిఁ జేసి యు
న్నతమగుచున్నపాండునరనాథతనూజులలక్ష్మి నా కస
మ్మత మయి సూ వెలింగె విను మాతుల! మానధనాఢ్యుఁ డైన భూ
పతి సహియింపనోపునె సపత్నులవృద్ధియు నాత్మహానియున్." **(సభా. 2.98)**

దుర్యోధనుడి అర్థప్రధానమైన రౌద్రరసానికి పాండవసంపదను చూచి సహించలేకపోవడమే మూలం. పాండవసంపద ప్రసక్తివచ్చినప్పుడు ఆరోహక్రమం, దానిని చూచి సహించలేక విచారిస్తున్నప్పుడు అవరోహక్రమం రచనలో ఉండటం సహజంకూడా. ఆ క్రమమే ఈ పద్యశిల్పంలో పాటించిన శబ్దసమాధిగుణం. రచనలో అర్థదర్శనంకంటె అక్షరప్రదర్శనకే ఆధిక్యం ఉండటం శబ్దగుణస్వభావం. దీనిలో నన్నయ అందెవేసిన చేయి.

తిక్కనరచనలో ఆరోహావరోహాలక్రమం అందంగా అమరి ఉన్నా దానికంటె అర్థదర్శనం అగ్రతాంబూలం అందుకొంటూ ఉంటుంది. పై రెండురకాలకూ తిక్కనగారి పద్యాలు-

చ. "అనయము పుట్టె జూదమున; యప్పుడ యెంతయుఁ జిచ్చువెట్టి కా
ల్చినయది నీ యుపేక్షయ; వశీకృతచిత్తుఁడు ధర్మసూతి మె
త్తనిపులి; యెల్లవారలు నధర్మము నీపయిఁ బెట్టునంతకు
న్వినఁడును గానఁడుం; బిదప నీకును నాకు మరల్పవచ్చునే?". **(ఉద్యో. 2.14)**

ఇది తిక్కనగారిప్రసిద్ధపద్యం. ధర్మరాజును 'మెత్తనిపులి'గా తెలుగువారికి పరిచయం చేసిన పద్యం. ఇందులోని వాక్యవిన్యాసం గూఢమైన ధర్మజుడి క్రోధాన్ని సమాధిగుణమయంగా ఆవిష్కరించటానికి వినియోగించిన సంభాషణశిల్పం. ధృతరాష్ట్రుడికి ఆమోదం కాని తాత్పర్యాన్ని సత్యకథనదృక్పథంతో చెప్పిన సంజయుడివాక్యాలలో రచన అవరోహంనుండి ఆరోహానికి

ఎక్కటం రచనలోని శబ్దగుణసార్థక్యం. అయితే ఆ గుణంకంటె అర్థదర్శనమే ఈ పద్యంలో అధికంగా ప్రకాశిస్తున్నది. అది తిక్కనకవితాకళ!

శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రుడితో చెప్పిన మాటలలో దీర్ఘాక్షరబహుళమైన రచనతో ఎత్తుకొని లఘ్వక్షరబహుళమైన రచనతో పద్యాన్ని ముగించి, ఆరోహణనుండి అవరోహణంగా దిగివచ్చే పద్ధతిని తిక్కన ప్రదర్శించాడు.

ఉ. "కౌరవపాండవుల్ తెఱఁగు గైకొని శాంతతఁ బొందియున్కి మే
లారయ నాకు నీకుఁ గులమంతకు నీనృపకోటి కుర్వికిం;
బోరితమైన నింతకును బుట్టు మహాపద; గావునన్ ధరి
త్రీరమణాగ్రగణ్య! గణుతించి యవశ్యముఁ బొం దొనర్పవే!" **(సభా. 3.262)**

సచివుడైన సంజయుడు అవరోహంతో ఆరంభించి అర్థసమాధిని మాటలలో రంగరించటం, స్వతంత్రుడైన శ్రీకృష్ణుడు ఆరోహణంలో ఆరంభించటం అర్థవంతంగా బోధించటం గమనిస్తే తిక్కనకూడా సందర్భశుద్ధి నెరిగి శబ్దార్థగుణాలను సార్థకంగా ప్రయోగించటం నన్నయనుండి గ్రహించా డని తెలుస్తుంది.

వికటత్వం ఉదారత. ఏ రచనలో శబ్దాలు నృత్యంచేస్తున్నట్లు వికటత్వాన్ని ప్రదర్శిస్తాయో అది శబ్దగుణమైన ఉదారతాగుణంతో కూడిఉన్న దని చెప్పాలి. కాని, ఉదారతాగుణం అర్థగుణంలో అగ్రామ్యత్వంగా శోభిస్తుంది. ఉపాలంభనాదులలో ఔచిత్యపోషణకు ఉదారతాగుణం ఉదాత్తపాత్రలకు ఉపాలంబనంగా ఉంటుంది. జరాసంధుడు శ్రీకృష్ణభీమార్జునులతో అన్నమాటలు-

ఆ. "మీరు నాకు నేను మీకు నెన్నండు ము
న్నహిత మాచరించినదియు లేదు
మీకు నేల నే నమిత్రుండ నైతి? ని
రాగసుండ సద్గుణాన్వితుండ." **(సభా. 1.186)**

శ్రీకృష్ణుడి మాటలకు జరాసంధుడు మనసులో ఉడికిపోయి, ఉవ్వెత్తుగా రేగుతున్న రోషకోపాలను అదుముకుంటూ కసిగా అంటున్న మాట లివి. గలగలగలగల- నడకతో నడిచిన మాటలు నృత్యాయమానంగా ఉన్నాయి. నన్నయరచనకు తోడుగా ఆటవెలదిని ఛందంగా వాడటం విశేషం. క్రోధఘూర్ణితవచనంలోని వికటత్వం ఆత్మసమర్థనంలో, ఆత్మస్తుతిలో అర్థవంతంగా రాణిస్తున్నాయి. అగ్రామ్యత్వంకంటె పైపద్యంలో వికటత్వమే ప్రచురంగా వెలువడింది.

పాండవులు అడవులకు ఎట్లా పోయారో వివరంగా విని, వారివలన కౌరవులకు కీడు తప్పదని శంకించి దుఃఖిస్తూ ఉన్న ధృతరాష్ట్రుడిని చూచి, కుపితుడైన విదురుడు పలికిన మాటలు నిప్పులవలె చిటపటలాడిన వాక్యవిన్యాసాలు; వికటత్వానికి అక్షరరూపాలు. అవి తరలవృత్తంలో తురంగలించాయి.

తరలము.
"వగవ నేటికి నింక నైనను వారలం బిలిపించి యీ
జగతి నెప్పటియట్ల యేలుచు సంతసంబున నుండఁగా
జగదధీశ్వర! పంపు, వంచన చన్నె! యన్యులసంపదల్
మిగిలి చేకొన నిట్లు సేసిన మెత్తురే మది నుత్తముల్?" **(సభా. 2.315)**

తిట్టవలసినచోట గౌరవంగా మొట్టినట్లు మాట్లాడిన ఈ మాటలు అగ్రామ్యత్వాన్ని ప్రదర్శిస్తున్నా, ఆ మాట లనే తీరులో గోచరించే వికటత్వం పఠితలహృదయాలను ప్రధానంగా ఆకర్షిస్తుంది. ఇది నన్నయ శబ్దగుణమైన ఉదారతాగుణం.

తిక్కనకూడా రసౌచిత్యపాలనంలో ఈ గుణాన్ని నిపుణంగా వాడతాడు. అర్జునుడు దుర్యోధనుడిని ఉపాలంభిస్తూ అన్నమాటలు ఇందుకు ఉదాహరణాలు.

ఉ. "క్షత్రియుఁ డోడునే తగదు కౌరవరాజ! యొకండ నేఁ బృథా
పుత్రులలోనఁ బిన్న, నినుఁ బోరికిఁ బిల్వఁగ మాని నాఁగ ని
ద్ధాత్రిఁ బ్రసిద్ధి కెక్కి బలదర్పసమగ్రుఁడ వైన నీవు నీ
మిత్రులుఁగూడ నిట్లయిన మెత్తురె వత్తురె కొల్వ భూపతుల్?" **(విరా. 5.203)**

అర్జునుడిఅధిక్షేపం సభాపర్వంలోని కథార్థాలమీద ఆధారపడి ఉన్నది. సుహృద్ద్యూతానికి పిలిచినా, యుద్ధానికి పిలిచినా క్షత్రియుడు ఎదురొడ్డి యశస్సో మృత్యువో తేల్చుకోవాలికాని రణభూమి వదలిపారిపోకూడదు. ఈ ధర్మాన్ని ఆధారంగా చేసికొని ధర్మజుడిని జూదంలో ఓడించాడు శకుని సాయంతో దుర్యోధనుడు. ఇక్కడ అర్జునుడు యుద్ధానికి పిలిచాడు. కాని దుర్యోధనుడు నిలువలేక పారిపోతున్నాడు. నేతిబీరకాయ తీరుగా వీరుడైన దుర్యోధనుడిని నోరారా ఎగతాళిగా ఎత్తిపొడుపుగా వాక్యాలను ఉదాత్తానుదాత్తాలుగా పలుకుతూ అర్జును డంటున్న మాటలు ఉదారతకు ఊపిరిపోస్తున్నాయి. అవి అధిక్షేపాలే కాని గ్రామ్యాలు కావు. శబ్దగుణాలకు నన్నయ రమణీయతను నేర్పితే, తిక్కన రంజకత్వం అలవరచాడు.

ఈ విధంగా శ్లేష, సమాధి, ఉదారతలు వీర రౌద్ర రసపోషకాలై ఓజస్సుకు అంగాలుగా రాణిస్తాయి. అందులో లీనమౌతాయి.

నన్నయకవితలో ప్రసాదం

ఓజోగుణంతో కూడుకొన్న శిథిలబంధం ప్రసాదం. ప్రసాదం శబ్దగుణమైతే బంధశైథిల్యంవలె కనపడుతుంది. శిథిలబంధంలో కూడా అర్థవైమల్యం అర్థగుణప్రసాదం. ప్రసన్నంగా చెప్పే పద్ధతికి సంబంధించింది శబ్దగుణప్రసాదం. పద్ధతి నాశ్రయించి ప్రతిపాద్యాంశాన్ని ప్రసన్నంచేసేది అర్థగుణప్రసాదం. నన్నయలో శబ్దప్రసాదం ఎక్కువ; తిక్కన్నలో అర్థప్రసాదం అధికం.

చ. "ప్రియహితసత్యవాక్య! యరిభీషణ! కృష్ణ! భవన్నిదేశసం
శ్రయమున నున్న మా కధికశత్రుజయం బగు టేమి పెద్ద? ని
శ్చయముగ నింక మోక్షితుల సర్వమహీశులు; నిమ్మహాధ్వర
క్రమమును సిద్ధిఁ బొందె నయకిల్బిషకీర్తి వెలుంగుచుండఁగన్". **(సభా. 1. 166)**

ఈ పద్యంలో గాఢమైన రచనాబంధం శిథిలమైనట్లు కనపడుతున్నది. ఎందుకొరకు? అది వీరరౌద్రరసభావచర్వణంవలన కలిగే చిత్తవిస్తారంకంటె ఆహ్లాదంవలన కలిగే చిత్తవికాసం వంటి అనుభవాన్ని అందించాలి కాబట్టి. రాజసూయ యజ్ఞ నిర్వహణ ప్రయోగాని కంతా సూత్రధారుడుగా నిలిచిన శ్రీకృష్ణుడినిగురించి కృతజ్ఞతాబద్ధంగా ధర్మజుడు ప్రదర్శిస్తున్న ఆహ్లాదమానసికస్థితికి అభివ్యక్తి ఈ పద్యం. ఇటువంటి రచన నన్నయకు ప్రీతిపాత్రం. ఇది సర్వరససామాన్యమైన రచన.

భారతంలో నాయకుడైన ధర్మజుడి ప్రశంసలుగాని, ప్రసంగాలుగాని సాధారణంగా ప్రసాదగుణభూయిష్ఠాలుగా ఉండేటట్లు నన్నయ రచించాడు. ఆవిధంగా నాయకుడిని ఆశ్రయించుకొని సాగే స్థాయిభావంగాని, తత్పోషకాలైన భావాలుకాని ప్రసాదగుణప్రధానంగా ఉండటం ఔచిత్యమని నన్నయ భావించినట్లున్నాడు. ఉదాహరణకు- ఈ పర్వంలో కొన్నిపద్యాలు.

1. పాండవులలో అగ్రజుడైన ధర్మజుడిని రాజసూయయాగం చేయగలిగిన సమర్థుడిగా పాండురాజు పలికినమాటలలో అతని యుధిష్ఠిరత్వం వ్యంగ్యం. ఆ వీరరసమూర్తిని వర్ణించినపద్యం. "అనుపమశక్తిమంతులు......" (సభా.1.90)

2. అర్జునుడు ధర్మరాజును రాజసూయం చేయుమని ప్రశంసిస్తూ చెప్పిన పద్యం వీరరసానుగుణం. "భూభుజులం జయింపుము....." (సభా.1.128)

3. దిగ్విజయానంతరం ధర్మజుడు శ్రీకృష్ణుడిని ప్రశంసించటం "ధారుణీధర! ధర్మతత్త్వనిధాన!......" (సభా. 1.270) భక్తిభావపోషకం.

4. శ్రీకృష్ణుడు ధర్మజుడిని భారతాన్వయభూషణుడిగా ప్రశంసించటం. "పూజ్యుఁడ వెల్లవంశముల భూపతులందును...... (సభా. 1.279)

5. ప్రజలు దర్శించిన రాజసూయయాగదీక్షితుడైన ధర్మజుడిస్వరూపవర్ణన. "సమ్మదమంది చూచిరి...... ధర్మనందనున్" (సభా. 1.290)

6. ధర్మరాజు భీష్ముడిని సభలో పుట్టిన కలకలాన్ని మాన్పు మని ప్రార్థించటం, భయభావం- "ధరణిలోఁ గల రాజు లెల్లను......... (సభా. 2.35)

7. రాజసూయయాగం ముగించిన ధీరుడు ధర్మజుడివర్ణన. (సభా. 2.73) రాజుల ప్రశంస. (సభా. 2.75)

8. ధర్మజుడినిగురించిన శ్రీకృష్ణప్రశంస. (సభా. 2.81)

9. ధర్మజవైభవాన్ని దుర్యోధనుడు ప్రశంసించిన పద్యాలు- (సభా. 2.110, 111)

10. ధర్మరాజువ్యక్తిత్వాన్ని అర్జునుడు ప్రశంసించినపద్యం (సభా. 2.224)

11. ఉదాత్తులవర్ణనలలోనూ, దిక్పాలకాదుల సభలను వర్ణించటంలోనూ నన్నయప్రసాదగుణాన్నే రచనలో పోషించి ఔదాత్యాన్నీ, ఓచిత్యాన్నీ పాటించాడు.

తిక్కనఅర్థగుణమైన ప్రసాదాన్నే ఎక్కువ రమిస్తాడు.

ఉ. "దక్కెను రాజ్యమంచు నకటా! యిటు దమ్మునిభాగ మీక నీ
వెక్కటి మ్రింగఁ జూచె దది యె ట్లఱుగున్? విను- మీను లోలతన్
గ్రక్కున నామిషంబుచవి గాలము మ్రింగినచాడ్పునూవె యి
ట్లుక్కివుఁడైన నీకొడుకు నుల్లము నున్నటు లాడఁగూడునే?" **(ఉద్యో. 2.52)**

ఈ పద్యంలో బంధశైథిల్యం ఉన్నా దాన్ని మించిన భావనైర్మల్యం ఉన్నది. ప్రతిపాద్యాంశంకంటె పదరచనాన్ని చూపించి పరవశింపచేసేది శబ్దగుణమైన ప్రసాదం. రచనాన్ని ఆలంబనంగా చేసికొని రమణీయభావాభివ్యక్తిని రమింపచేసేది అర్థగుణమైన ప్రసాదం. తిక్కన ఉభయగుణ నిర్వహణ ప్రౌఢిని ప్రకటించగల ప్రజ్ఞావంతుడైనా ఉత్తరోత్తరాలు బలీయాలని భావించే అర్థగుణవాది.

ప్రసాదగుణంలో పర్యవసించే గుణం అర్థవ్యక్తి. ఝటిత్యర్థప్రతిపత్తిహేతుత్వం శబ్దగుణమైన అర్థవ్యక్తిలక్షణం. వస్తుస్వభావ తత్త్వం అర్థగుణమైన అర్థవ్యక్తి. నన్నయ తిక్కనలకు అర్థవ్యక్తి అంటే అలవిమాలిన అభిమానం. ఇరువురికవిత్వాలలోనూ ఈ వ్యక్తిగుణబలంతో ఎన్నో అనర్ఘరత్నాలవంటి పద్యాలు వెలువడ్డాయి. మచ్చు కొక్కొక్కటి- శిశుపాలవధ ఘట్టంలో ధర్మజుడినోట కృష్ణుడి మహత్వాన్నిగురించి నన్నయ పలికించిన పద్యరత్నం.

ఉ. ''ఆదిజుఁడైన బ్రహ్మయుదయంబున కాస్పద మైనవాఁడు, వే
దాది సమస్తవాఙ్మయములందుఁ బ్రశంసితుఁ డైనవాఁడు, లో
కాది త్రిలోకపూజ్యుఁ డని యాత్మ నెఱింగి పితామహుండు దా
మోదరుఁ జెప్పెఁ బూజ్యుఁ డని; యుక్తమ కాకిది యేమి దోసమే?'' **(సభా. 2.18)**

కౌరవసభలో శ్రీకృష్ణుడు చేసిన ఉపన్యాసంలో ధర్మరక్షకుడైన భగవంతుడితత్త్వాన్ని గురించి చెప్పిన పద్యరత్నం.

ఉ. ''సారపుధర్మమున్ విమలసత్యముఁ బాపముచేతఁ బొంకుచేఁ
బారముఁ బొందలేక చెడఁబాఱినదైన యవస్థ దక్షు లె
వ్వార లుపేక్ష సేసి రది వారలచేటగుఁగాని ధర్మని
స్తారకమయ్యు సత్యశుభదాయక మయ్యును దైవ ముండెడున్.'' **(ఉద్యో. 3.273)**

నన్నయపద్యంలో శ్రీకృష్ణుడే పరమాత్ము డని చెప్పే తాత్పర్యం పండుఒలిచి చేతిలో పెట్టినట్లు చెప్పబడింది. తత్సమపదబహుళంగా, నాతిదీర్ఘసమాససుందరంగా, అర్థగంభీరంగా చెప్పిన ధర్మజుడిమాటలలో ఓజస్సుయొక్క శిథిలబంధం అర్థవ్యక్తిహేతువుగా రాణిస్తున్నది. పితామహుడు, లోకాది, త్రిలోకపూజ్యుడు, ఆత్మ నెఱింగి- అనేమాటలలోని గాఢమైన అర్థాన్ని భావన చేస్తే పురుషోత్తమతత్త్వం తేటపడుతుంది. తిక్కనపద్యంతో పోలిస్తే నన్నయపద్యం శబ్దసుందర మనటంలో అనుమానం లేదు. నన్నయది సార్థకశబ్దప్రయోగం. తిక్కనది సాభిప్రాయశబ్దప్రయోగం. తిక్కనరచనలో శబ్దాలు నన్నయరచనలోకంటె దేశీయముద్రను కలిగిఉన్నాయి. నన్నయకంటె తిక్కన తేటతెలుగుమాటలలో చెప్పటానికి ప్రయత్నించాడు. అందువలన శబ్దంకంటె అర్థం ప్రధానమైన రచనగా అనిపిస్తుంది. ధర్మాన్ని తెలిసిన దక్షులు సారపుధర్మాన్నీ, సత్యాన్నీ రక్షించక ఉపేక్ష చేస్తే వారికి చేటు కలుగుతుందనీ, ధర్మాన్నీ సత్యాన్నీ దైవం తానై పూనుకొని రక్షిస్తుందనీ భారతకథాతత్త్వవ్యంజకంగా పలికాడు శ్రీకృష్ణుడు. ధర్మరక్షాదక్షు డైన దైవంయొక్క స్వభావాన్ని వ్యాఖ్యానించే వాక్యసముదాయం ఇందులో ప్రసన్నంగా ప్రకాశిస్తుంది కాబట్టి అర్థవ్యక్తి అర్థవంతంగా అవతరించింది. నన్నయ తిక్కనల పద్యాలు కలిపి చదువుకొనే తెలుగువారికి అర్థవ్యక్తియొక్క ఉభయశక్తులూ అనుభవంలోకి వస్తాయి. అర్థవ్యక్తి ప్రసాదగుణంలోనే అంతర్భవించగలదు. ఎందువల్లనంటే ప్రసాదానికి అర్థదీప్తిని కలిగించే శక్తి అర్థవ్యక్తి కాబట్టి.

నన్నయకవితలో మాధుర్యం

పరుషగుణాల పోషకశక్తి ఓజస్సయితే, లలితగుణాల రంజకశక్తి మాధుర్యం. సర్వగుణాల దీపకశక్తి ప్రసాదం. ప్రసాదమాధుర్యాలు కవలపిల్లలవంటివి. ఓజఃప్రసాదాలు ప్రాణస్నేహితులవంటివి. మాధుర్యంలో అంతర్భవించే గుణాలు- సౌకుమార్యం, కాంతి, సమత. ఇవి ప్రసాదానికికూడా పోషకంగా నిలుస్తాయి. మమ్మటుడు ప్రధానత్రిగుణాలనుగురించి చెప్తూ ఇట్లా అన్నాడు-

శ్లో. ''మాధు ర్యౌజః ప్రసాదాఖ్యా స్త్రయ స్తే న పునర్దశ''
''కేచి దంతర్భవం త్యేషు దోషత్యాగా త్పరేశ్రితాః
అన్యే భజంతి దోషత్వం కుత్రచి న్న తతో దశ'' **(కావ్యప్రకాశమ్. 8 ఉల్లాసం. కా. 68, 72)**

మాధుర్యం, ఓజస్సు, ప్రసాదం అనేవి మూడేగుణాలనీ, అందులోనే మిగిలిన కొన్నిగుణాలు అంతర్భవిస్తాయనీ చెప్తూనే, కొన్ని గుణాలు దోషాలను తొలగించటంవలన స్ఫురించేగుణాలేననీ, మరికొన్ని గుణాలుగా చెప్పబడినా వాటిని అట్లాగే గ్రుడ్డిగా వాడితే దోషాలుగాగూడా మారవచ్చు ననీ పేర్కొన్నాడు. దోషనివారణంవలన స్ఫురించేది సౌకుమార్యం. కష్టత్వ, గ్రామ్యత్వాదులు దోషాలు. వాటిని నివారించి నిరూపిస్తే సౌకుమార్యం అవుతుంది. మార్గాభేదత్వం సమత. అయితే

కొన్నిచోట్ల సమత పాటించబడకపోవటంకూడా గుణంగా పరిగణించబడుతుంది. కాబట్టి సౌకుమార్యం, సమత ప్రత్యేకగుణాలుగా కాకుండా ప్రసాదమాధుర్యాలలోని అంతర్భాగాలుగా మాత్రమే గ్రహించా లని మమ్మటాదుల మతం. ఔజ్జ్వల్యం లక్షణంగా కలిగిన కాంతికూడా ప్రసాదమాధుర్యాదులకంటె భిన్నంగా పరిగణించవలసిన అవసరం లేదని మరికొందరు భావిస్తారు. ఏమైనా రసానుభవానుకూల చిత్తవృత్తులను దృష్టిలో ఉంచుకొని గుణత్రయవిభాగం చేసే సంప్రదాయంలో చిత్తద్రుతిని కలిగించేది మాధుర్యం. ''గుణానాం చైషాం ద్రుతిదీప్తి వికాసాఖ్యా స్త్రిస్ర శ్చిత్తవృత్తయః క్రమేణ ప్రయోజ్యాః । తత్తద్గుణవిశిష్టరసచర్వణా జన్యా ఇతి యావత్'' అని జగన్నాథపండితరాయలు. చిత్తాన్ని కరగింపజేసే గుణం లలితం. అందుకే అది మధురం.

పృథక్పదత్వం శబ్దగుణమాధుర్యం. ఉక్తివైచిత్ర్యం అర్థగుణమాధుర్యం, ఉక్తివైచిత్ర్యం లేకుండా వట్టి పృథక్పదత్వం రసపోషకం కాదు. అందువలన నన్నయ ఈ రెండు లక్షణాలనూ కలిపి మాధుర్యాన్ని కలిగించి మనసును కరిగిస్తాడు. మచ్చుకు ఒక్కపద్యం.

ఉ. ''ఇచ్చకు వచ్చుపూజనల నెంతయు సంతసమంది తొల్లి నా
కిచ్చె మునీశ్వరుండు దయ నిత్తనయున్; మఱి యిప్డు నెమ్మితో
నిచ్చితి; వీవు రాక్షసివె? యిక్కుల మెల్లను నుద్ధరింపఁగా
వచ్చిన పుణ్యదేవతవు వారిరుహాయతచారులోచనా!'' **(సభా. 1.153)**

రెండుముక్కలుగా పుట్టిన పుత్రుడికి ఒక్కరూపు నిచ్చి వంశాన్ని నిలువబెట్టిన జరను 'నీవు రాక్షసివి కావు మా కులదేవతవు' అని కీర్తించే ఈ పద్యంలో బృహద్రథుడి మాటనేర్పరితనం మనసును కరిగించేదిగా ఉన్నది. ఉక్తివైచిత్రి అపహ్నవాలంకారంవలన కలుగుతున్నది. దానివలన కలిగే అర్థచమత్కారంకంటె పద్యంలోని నడకలో ఒడుపుగా సాగే పృథక్పదాల వినియోగసౌందర్యం పఠితలమనస్సులను ఆకర్షిస్తుంది. ''వచ్చిన పుణ్యదేవతవు'' అనే అభివ్యక్తి మనసును కరగించే బిందువు. ఆ అనుభూతిని అందుకొనటానికి అనువుగా ద్విత్వచకారప్రాస మూడుమెట్లుగా పనికివచ్చింది. 'వారిరుహాయతచారులోచనా' అనే సంబుద్ధిలో బృహద్రథుడితోపాటు పఠితకూడా ఆర్ద్రుడై రసానుభూతి పొందుతాడు.

ఇటువంటి మధురమైన పద్యాలు నన్నయ్యలో కొల్లలు. లలితరసాలలో నన్నయకవిత మధురమూర్తి.

పృథక్పదత్వంకంటె ఉక్తివైచిత్ర్యం శక్తిమంతంగా ఉంటే- అది అర్థగుణమైన మాధుర్యం అవుతుంది. తిక్కనకవితలో ఈ గుణం అధికం. మచ్చు కొకపద్యం.

క. ''ఆ రాజు మాదెసం గల
కారుణ్యము కతమునను సుఖంబున ని ట్లు
న్నారము నినుఁ బుత్తెంచిన
గారవమున నాదుమది వికాసముఁ బొందెన్.'' **(ఉద్యో. 1.276)**

ఇందులో కాకువువలన ఏర్పడే అర్థవైచిత్రియే అర్థగుణం. శబ్దగుణం అర్థగుణంలో మునిగిపోయినట్లుంది ఈ పద్యంలో. ధర్మరాజు మాటల్లో అతడు చెప్పదలచుకొన్న భావం అంబరంవంటిది. దానికి సూచికలుగా నిలిచే నక్షత్రాలవలె పదాలు వెలుగుతూ ఉంటాయి. శబ్దం వాచ్యార్థా న్నిచ్చి, ప్రతీయమానమైన వ్యంగ్యాన్ని స్ఫురింపచేసి, తనను అప్రధానం చేసికొని ఒదిగిపోతుంది తిక్కనకవితలో. అందువలన పానకంత్రాగిన తరువాత గొంతులో నిలిచిపోయిన మాధుర్యంవలె అర్థగుణమే అనుభవంలో నిలుస్తుంది. ఈ అనుభూతి నందించే తిక్కనరచనకు వివరణ అనవసరం.

పదబంధం చెవికి కటువుగా తోపకుండటం శబ్దగుణమైన సౌకుమార్యం. దాన్నే అజరఠత్వం అంటారు. కఠినమైన విషయాన్నిగాని, కరకుగా చెప్పదలచుకొన్న అంశాన్నిగాని చెప్పవలసివచ్చినప్పుడు ఆ కాఠిన్యం, ఆ కరకుదనం స్ఫురించకుండా చెప్పటమే అర్థగుణమైన సౌకుమార్యం. నన్నయతిక్కనలు పాత్రచిత్రణంలో సంభాషణలలో ఈ గుణాన్ని సంజీవనిగా వాడుకొంటారు. మచ్చుకు- దుర్యోధనుడు సభలో చేసిన దుష్కృత్యాలకు అంతఃపురాలలో అపశకునాలు పుట్టాయి. వాటిని చూచి భయపడి గాంధారి విదురుడితో కలసివచ్చి ధృతరాష్ట్రుడితో మొరపెట్టుకొన్నది. అప్పుడు ధృతరాష్ట్రుడు తెలివితో కొడుకును మందలించాడు. ద్రౌపదిని పిలిపించి ప్రశంసించాడు. ఈ ఘట్టంలో నన్నయ సౌకుమార్యాన్ని సలక్షణంగా పోషించాడు. ధృతరాష్ట్రుడు ద్రౌపదితో ఇట్లా అన్నాడు.

క. "సుందరి! నా కోడండ్రుర
యం దభ్యర్హితవు నీవ; యతిముదమున నీ
కొందఁగఁ బ్రియంబు సేసెద
నిందుముఖీ! వేఁడు మెద్ది యిష్టము నీకున్" **(సభా. 2.257)**

అని అన్నాడు. నిండుసభలో అంత జరుగుతున్నా కళ్ళుమూసికొని కూర్చున్న ధృతరాష్ట్రుడూ, దుశ్శాసనుడు లాగుకొనిపోవటానికి వచ్చినప్పుడు ద్రౌపది తనప్రక్కనే నిలిచిఉన్నా పట్టించుకొనక కళ్ళకు పట్టీకట్టుకొని కూర్చున్న గాంధారీ, తమకు కీడు వస్తుందేమో నన్న భయంతో నిష్ఠురా లాడకుండా నెమ్మదిగా నెమ్మిమీర మాట్లాడుతున్నారు. విదురుడు నిష్ఠురంగా చెప్పినా పట్టించుకోని ధృతరాష్ట్రుడు ఇప్పుడు నీతివాక్యాలు పలుకుతున్నాడు. ప్రాణభీతితో పలుకుతున్న మెత్తని మాటలేకాని ప్రేమమీర పలుకుతున్నవి కావు ధృతరాష్ట్రుడివి. ద్రౌపదికూడా ఆ మాటలతీరును గమనించి ఎత్తిపొడిచి పలుకలేదు. మెత్తగానే, చిత్తంలోని నిప్పును కొంగున దాచిపెట్టుకొనే మాట్లాడింది.

ఆ. "కరుణతోడ నాకు వరము ప్రసాదింప
బుద్ధియేని లోకపూజితుండు
మనునిభుండు ధర్మతనయుండు దాస్యంబు
వలనఁ బాయవలయు వసుమతీశ!" **(సభా. 2.259)**

'దయతో నాకు వర మిచ్చే సంకల్పం నీకు నిజంగా ఉంటే'- అని మొదలుపెట్టిన వాక్యంలో ఎంతటి పారుష్యం ఎంత సుకుమారంగా మారింది! 'వసుమతీశ!' అని ధృతరాష్ట్రుడిని సంబోధించి, ఇప్పుడు రాజ్యానికంతా నీవే రాజువు అని అధిక్షేపంగా కాకుండా గౌరవప్రదంగా పలికింది. మాయాద్యూతంవలన లోకపూజితుడు, మనువువంటివాడు, యమధర్మరాజుకొడుకు అయిన ధర్మరాజు దాసుడైనాడు. అది అధర్మం. అతడిని దాస్యంనుండి విడిపించటం న్యాయం. నేను న్యాయబద్ధమైన కోరికను కోరుతున్నాను అని పారుష్యంలేకుండా పలకటమే కాకుండా ప్రతిపదసార్థక్యం గల వాక్యాలతో ఉక్తులను పరమసుకుమారంగా ప్రదర్శించింది. ఇటువంటివి సుకుమారగుణరచనలు.

తిక్కనకూడా నన్నయకు సరితూగేరచనలు చేశాడు సుకుమారగుణంతో. మచ్చు కొకటి. సంజయుడి వాక్యాలలో తిక్కన ఈ గుణం రెక్కలు విచ్చుకొన్నది.

క. "పాలీక కౌరవులు దు
శ్శీలతఁ జెడఁ దలఁచిరేనిఁ జెప్పెద రుధిరా
భీలాన్నంబునకంటెను
మేలగు భిక్షాన్న మైన మీ నడవడికిన్". **(ఉద్యో. 1.329)**

సంజయుడి పలుకులకు ధర్మజు డిచ్చిన ధ్రువపత్రమే ఇందుకు సాక్ష్యం.

క. "ఎదు రున్నరూపు పలుకఁగఁ
దుదిఁ గటకటఁ బడవు నీవు; దుర్ణయమును బె
ట్టిదమును రెండును నగు పలు
కొదువదు నీ నాలుకకు నయోన్నత! యెపుడున్". **(ఉద్యో. 1.363)**

కొరవులవంటి అర్థాలను కుసుమపేశలంగా నయనీతితో ఆవిష్కరించే నేర్పు నన్నయవలెనే తిక్కన సంజయుడికీ, ధర్మజుడికీ నేర్పాడు. దూషణలుకూడా సౌకుమార్య మనే అర్థగుణంవలన వాగ్భూషలుగా మారటం ఆ గుణంలో ఉన్న విశేషం. మహామంత్రి తిక్కన వాక్పాకానికి వాడితోపాటు వాల్లభ్యంకూడా నేర్పిన అర్థగుణం సౌకుమార్యం.

శబ్దబంధానికి ఔజ్జ్వల్యాన్ని కూర్చి రసాన్ని పోషించటమే శబ్దగుణమైన కాంతిలక్షణం. దీప్తరసత్వం అర్థగుణమైన కాంతిలక్షణం. నన్నయ ఈ రెండులక్షణాలనూ కాంతిలో కలిపి పోషించినా శబ్దగుణానికే తూకం ఎక్కువగా కల్పిస్తాడు. మచ్చుకొకటి- పాండవు లడవులకు పోయే సమయంలో కుంతీదేవిమాతృహృదయం దుఃఖావేశంతో తురంగలించింది.

మత్తకోకిల.

"వీర లిట్టు లనాథులై మునివృత్తి నుండెడివారె? హా
ద్వారకాపురనాథ! కేశవ! దైత్యభేది! భవత్పదాం
భోరుహాశ్రితు లైన వీరలఁ బూని కావకయుండఁగా
ధారుణీధర! నీకు ధర్మువె ధర్మనిర్మలమానసా!". **(సభా. 2.286)**

ఇందులో శ్రీకృష్ణుడికి వాడిన సంబుద్ధులన్నీ సార్థకాలై సందర్భోచితంగా ఆమె దుఃఖతీవ్రతకు తోడ్పడ్డాయి. వరుసగా బంధుత్వాన్నీ, పరమాత్మతత్వాన్నీ, దుష్టశిక్షణస్వభావాన్నీ స్మరించి 'ఆశ్రితుల యోగక్షేమాలు చూడకుండా ఉండటం న్యాయమా?' అని ఆక్రందించింది. భూతలాన్ని ధరించేవాడా! విష్ణురూపుడా! ధర్మాన్ని నిర్మలంగా భావించే మనసుకలవాడా! ధార్మికులను ధరణీపతులను ఈవిధంగా అనాథులనుగా చేయటం ధర్మమా? అని ఆక్రోశించింది. 'ధర్మో రక్షతి రక్షితః' అంటారే! ధర్మనిర్మలవర్తనులైన పాండవులను రక్షించకుండా ఎందుకు ఊరుకొన్నా? వని అడిగింది. ఈ పద్యంలోని శబ్దా లెంత ముఖ్యమో అర్థం అంత ముఖ్యం. ఔజ్జ్వల్యం రెండింటినీ ఆశ్రయించుకొని ఉన్నది. అయినా సార్థకశబ్దంవలన రచన రూపుకట్టుతున్నది. దీప్తకరుణరసత్వం ప్రసన్నమౌతున్నది. నన్నయ కవితాకాంతివైఖరి ఇది.

తిక్కనలో శబ్దాలు దీప్తరసత్వంలో జలకా లాడతాయి. రససిద్ధితో తిక్కనశబ్దం కరిగిపోతుంది. అందుకే తిక్కనది అర్థగుణప్రధానరచన. కాంతి కొక ఉదాహరణం.

చ. "అరయమిఁ జేసి కోడలన కప్పుడు దాసిగఁ జేసె నమ్మహా
పురుషునిపాలికిం బతులు వోవఁగ వీరలతోన యేను జె
చ్చెరఁ జని కోటరంబు దగఁ జేయుదునో, యటుగాక పాడి మై
వరవుడ మోపి చేయుదునొ వారికి మాధవ! నిశ్చయింపుమా!" **(ఉద్యో. 3.112)**

సంధికై హస్తినాపురి పోబోతున్న శ్రీకృష్ణుడితో ద్రౌపది అన్నమాట లివి. నిప్పులు మూటకట్టినట్లు వేడిగా ఉన్నమాటలు. ఆత్మాభిమానాన్ని ఉజ్జ్వలంగా వెలిగించే భావప్రకటనం ఈ పద్యప్రాణం. 'ఆ మహాపురుషునిపాలికిన్', 'కోటరంబు' 'పాడిమై' 'వరవుడము' అనే మాటలవేడిదనం ఆమెగూఢామర్షంలో మునిగిపోయింది ఈ రచనలో. తిక్కనతీరు ఇది.

ఒకపద్యంగాని, ఒకఘట్టంగాని ఏమార్గాన ఆరంభించబడుతుందో, ఆ మార్గాన్ని విడువకుండా చివరిదాకా నిర్వహించబడటం శబ్దగుణమైన సమతాగుణలక్షణం, ప్రారంభించిన అర్థంయొక్క పద్ధతి ప్రక్రమంలో భేదంలేకుండా ఉండే అవైషమ్యమే అర్థగుణమైన సమతాగుణం. శబ్దగుణంలో భాగంగా పద్యనిర్మాణశిల్పంలోకూడ సమతను పాటించిన పద్యం-

చ. "అనిలజవాశ్వయుక్త మయి హాటకరత్నవిచిత్రతార్క్ష్యకే
తన మయి మేఘనాద మయి దారుకసారథి యైన దివ్యకాం
చనరథ మెక్కి యాక్షణమ సాత్వతకుంజరుఁ డేఁగె, భక్తి నా
తని ననిచెన్ యుధిష్ఠిరుఁడు దమ్ములు దానును బాదచారి యై." **(సభా. 2.84)**

రథ మెక్కిన శ్రీకృష్ణుడు, అతడిరథంతో కొంతదూరం సమంగా నడిచిన భాతృయుతుడైన ధర్మరాజు ఈ పద్యంలో వర్ణించబడుతున్నారు. నన్నయ వస్తువులోని ఆ సమతను శబ్దగుణంలోకూడ పాటించాడు. యతిస్థానంవద్ద పాదం విరగటం, పాదాల కొసళ్ళు పైపాదాల మొదళ్ళలోకి చొప్పించుకొనిపోవటం, పద్యపూర్వార్ధం రథవర్ణనం, ఉత్తరార్ధంలో చెరిసగం శ్రీకృష్ణధర్మజుల ప్రశంసచేయటంవంటి వృత్తనిర్మాణసామ్యాలు సమతను సమర్థిస్తున్నాయి.

నన్నయ కథాకథనంలోనే కాక సంభాషణలలోకూడ ఎడనెడ సందర్భోచితంగా సమతను పాటించి రసభావాలను పోషించాడు. ఉదాహరణకు విదురుడిని కోపంతో మందలిస్తూ దుర్యోధనుడు అతనిస్వభావంలో పాండవులపట్ల గల అభిమానాన్నీ, తమపట్ల ఉన్న కాపట్యాన్నీ సమతాగుణస్ఫూర్తి గలిగిన సీసపద్యంలో ప్రవచించాడు.

సీ. "పరులగుణంబులు పలుమాఱుఁ గీర్తింతు । పక్షంబ పలుకుదు పాండవులకు
ధార్తరాష్ట్రుల సతతంబు నిందింతువు । కుడిచినచోటికిఁ గూర్ప వెపుడు
నుత్సంగతలమున నుగ్రవిషోరగం । బున్నట్లు నీవు మాయొద్ద నునికి
పరులసంపద సుఖోపాయబలంబునఁ । గొనుట భూపతులకు గుణమ కాదె?

ఆ. యడుగకయును గర్జ మది యిష్టుఁడై చెప్పు । నతని కాడఁ దగినయదియ నన్ను
నిట్టు నట్టు ననఁగ నేల? నీయిమ్ముల । నుండు బుద్ధి సెప్పకుండు మాకు" **(సభా. 2.188)**

దుర్యోధనుడికోపం క్రమక్రమాభివృద్ధి చెందినట్లు సీసపద్యగతిలోని సమతద్వారా తెలుపదలచుకొన్నాడు నన్నయ. పద్యాన్ని మూడుభాగాలు చేశాడు. మొదటి రెండుచరణాలలో సగానికే ఒక్కొక్కవాక్యం- ఆతరువాతిరెండుచరణాలలో చరణాని కొక్కొక్కవాక్యం. ఆ తరువాతి ఆటవెలదిలో నాలుగుపాదాలలో మూడువాక్యాలు అనే రచనాశిల్పాన్ని ప్రవేశపెట్టాడు. చిన్నవాక్యాలతో మొదలైన కోపం పెద్దవాక్యాలతో పెంపొందింది. విదురుడిని మందలించటంలో ఆ సమత మార్గం మారింది. ఈ విధంగా ఒక పాత్రలోని రెండు భావావస్థలకు రెండురకాల వాక్యప్రయోగంలో కానవచ్చే సమతలతో రచించటం శబ్దగుణమైన సమత స్వభావం. అయితే, ఒకే పద్యంలో మూడురకాలైన వాక్యవిన్యాసవైఖరులు ప్రదర్శిస్తున్నప్పుడు అది మార్గభేదం కా దని కొందరి మతం. కాని, అది అవైషమ్యం ప్రక్రమాభేదం కావచ్చును. దీనిని గమనిస్తే ఈ పద్యం శబ్దగుణసమత కాక అర్థగుణసమతకు ఉదాహరణ మని చెప్పబడుతుంది. ఇటువంటి చిక్కు లున్నాయి కాబట్టి సమతను ప్రత్యేకగుణంగా పరిగణించక ప్రసాదమాధుర్యాలలో అంతర్భవింపజేస్తారు కొందరు.

తిక్కన రచనలో అర్థగుణ మైన సమత కీ శబ్దగుణ మైన సమత ఎప్పుడూ అంగంగానో, పోషకంగానో ఉండటం గమనిస్తాం. ఉదా॥

సీ. ''లీల నా ముందట నా లేమ వొలసినఁ । జూడ్కికిఁ జుబ్బనచూఱ గాదె;
కను విచ్చి నన్ను నా తనుమధ్య సూచినఁ । దనువున కమృతసేచనము గాదె;
చిఱునవ్వు బెరయ నచ్చెలువ నాతోడఁ బ । ల్కినఁ జెవులకు రసాయనము గాదె;
యెలమి నమ్మెలఁత న న్నెలయింపఁ దివిరిన । నెడఁద కానందంబు నిక్కగాదె;

తే. ''యా నితంబిని మక్కువ ననఁగి పెనఁగి । యింపుపొంపిరివోవ న న్నేలికొనఁగఁ
దలఁచి పొందిన నది జన్మఫలము గాదె । యనుచు వలరాజుబారికి నగ్గమయ్యె.'' **(విరా. 2.86)**

ఈ పద్యనిర్మాణంలో శబ్దగుణ మైన సమత పాటించబడినా మూడవచరణంలో స్వల్పవిపర్యయం సూక్ష్మదృష్టికి గోచరిస్తుంది. అయినా, అది అంత పట్టింపుకు రాదు. కాని, ఇందులో అర్థగుణలక్షణా లైన అవైషమ్యమూ ప్రక్రమాభేదమూ సలక్షణంగా, నిర్వహించబడటం విశేషం. సైరంధ్రి క్రమంగా పొలయుట, చూచుట, పల్కుట, ఎలయింప దివురుట, ఏలికొనుట అనే అనుభవాలవలన కీచకుడు పొందే అనుభవవిశేషాన్ని ప్రక్రమభంగం లేకుండా సుగమం చేసే సమతను తిక్కన శిల్పసుందరంగా, అన్వయబంధురంగా ఇందులో సాధించాడు. తిక్కనదృష్టి అర్థగుణపుష్టిని కల్గించటంలో వ్యగ్రత వహించినంతగా శబ్దగుణసృష్టియందు వ్యామోహాన్ని ప్రకటించ దని దీనివలన స్పష్టమౌతుంది.

కవిత్రయంవారు తెలుగుకవితను గుణవతిగా తీర్చిదిద్దారు. శ్రీనాథుడు ఆమెకు రీతిమాధుర్యాన్ని నేర్పాడు. పోతన భక్తిపారవశ్యాన్ని అలవరచాడు. ప్రబంధకవులు అలంకారవైభవాన్ని అందించారు. నిజానికి మొదట గుణ మున్నప్పుడే మిగిలినవి జీవితంలో పూజాస్థానా లయ్యేవి. 'గుణాః పూజాస్థానం గుణిషు నచలింగం న చ వయః' అనికదా లోకోక్తి.

నన్నయ సభాపర్వంలో ప్రదర్శించిన ప్రసన్నకథాకలితార్థయుక్తిని, శబ్దగుణప్రయోగాన్నిగురించీ, అక్షరరమ్యత, నానారుచిరార్థసూక్తులనుగురించీ వ్యాఖ్యానంలో యథావకాశంగా వివరించటం జరిగింది. పాఠకులు వాటినికూడ పరిశీలించ ప్రార్థన.

సభాపర్వం - సందేశం

సభాపర్వంలో ప్రత్యక్షమయ్యే రెండుసభలలోనూ జరిగిన సంఘర్షణాత్మకమైన కథార్థాలను ఉపదేశదృష్టితో సమీక్షించుకొంటే దైవాసురసంపద్విభాగయోగాన్ని దర్శించినట్లు అనిపిస్తుంది. పాండవపక్షం దైవసంపదకూ, కౌరవపక్షం ఆసుర సంపదకూ ప్రాతినిధ్యాన్ని వహిస్తాయి. మానవహృదయమే సభ అయితే, అందులో దైవాసురస్వభావాల సంఘర్షణం సహజస్వభావమైతే, ఆరెండింటిలో దైవీశక్తుల విజయాన్ని సూచించేది మయసభ, ఆసురీశక్తుల విజృంభణాన్ని ప్రదర్శించేది కురుసభ.

భగవద్గీతలో శ్రీకృష్ణభగవానుడు ''మహాత్మానస్తు మాం పార్థ!, దైవీం ప్రకృతి మాశ్రితాః! భజం త్యనన్యమనసో, జ్ఞాత్వా భూతాది మవ్యయమ్'' (9.13) (అర్జునా! మహాత్ములైనవారు దైవీప్రవృత్తి నాశ్రయించి, అన్నిటికీ ఆదినీ, అవ్యయుడనూ అయిన నన్ను తెలిసికొని అనన్య చిత్తంతో సేవిస్తున్నారు) అని దైవీప్రవృత్తుల స్వభావాన్ని పేర్కొన్నాడు. రాజసూయంలో శ్రీకృష్ణుడిని పూజిస్తూ, 'ఆదిజుడైన బ్రహ్మ యుదయంబున కాస్పదమైనవాడు, లోకాది, త్రిలోకపూజ్యుడని - ఆత్మ నెఱింగి' పితామహుడు చెప్పగా, దాని నెఱింగి పాండవులు పరమాత్మను సేవించారు. పరమేశ్వరానుగ్రహాన్ని పొందారు. ఆ సభలోనే శిశుపాలాదులు ఆసురీప్రవృత్తిని ప్రదర్శించి చెడిపోయారు.- 'అవజానంతి మాం మూఢా, మానుషీం తను మాశ్రితం। పరం భావ మజానంతో, మమ భూతమహేశ్వరమ్' (9.11) (సర్వభూత నియామకుడనై మానవశరీరధారినైన నన్ను మూఢులు తిరస్కరిస్తున్నారు. వారికి నా శ్రేష్ఠత్వం తెలియదు) అనే తాత్పర్యం శిశుపాలుడి ప్రవర్తనలో స్పష్టమైనది. దాని ఫలాన్నికూడా అత డనుభవించాడు. శిశుపాలుడి తరువాత రాజసూయంలో రాక్షసీప్రవృత్తిని ప్రదర్శించినవాడు దుర్యోధనుడు. దైవీవైభవాన్ని

చూచి దుఃఖితుడైన దుర్యోధనుడు "మోఘాశా, మోఘకర్మాణో, మోఘజ్ఞానా విచేతసః । రాక్షసీ మాసురీం చైన ప్రకృతిం మోహినీం శ్రితాః" (9.12) (వారి ఆశలు అడుగంటాయి. వారికోర్కెలు గొడ్డుపోయాయి. వారి తెలివి తెల్లవారింది. అట్టివారు మోహకరమైన రాక్షసీప్రవృత్తికిన్నీ, ఆసురీప్రవృత్తికిన్నీ వశులై చెడిపోతారు) అనే తాత్పర్యానికి అచ్చమైన ఉదాహరణంగా నిలిచాడు. శిశుపాలుడు అజ్ఞాని. దుర్యోధనుడు అహంకారి. మోహానికి వీరిద్దరూ బొమ్మా బొరుసులు. వారివిషాదాంతవృత్తాలు లోకానికి వివేకకరదీపికలు!.

భగవద్గీతపదారవఅధ్యాయంలో చెప్పబడిన దైవాసురసంపద్విభాగంలో ఆసురీగుణాలు కలిగినవారి లక్షణాలన్నీ దుర్యోధనుడిలో మూర్తీభవించి ఉండటం గమనిస్తే అతడు కలిఅంశతో జన్మించిన సార్థక్యం స్పష్టమౌతుంది. "ఆత్మ సంభావితాః స్తబ్ధా, ధనమానమదాన్వితాః, యజంతే నామ యజ్ఞై స్తే, దంభే నావిధిపూర్వకమ్." (16.17) "అహంకారం బలం దర్పం, కామం క్రోధంచ సంశ్రితాః । మామాత్మ పరదేహేషు, ప్రద్విషంతోఽభ్యసూయకాః" (16.18) (ఆసురీ ప్రవృత్తి కలవారు అహంకారంతో విర్రవీగుతూ, ధనాభిమానమదాంధులై విధివిధానాలను లెక్కచేయకుండా, డంబంకొరకు పేరుకొరకు యత్నాలు చేస్తారు. అహంకారాన్నీ, పశుబలాన్నీ, దర్పాన్నీ, కామాన్నీ, క్రోధాన్నీ కలిగి, అసూయాపరులై తమయందూ, ఇతరులందరియందూ ఉండే నన్ను తిరస్కరిస్తూ ఉంటారు). అతడి అసూయ వెనుక ఆసురీప్రవృత్తు లుంటాయని శ్రీకృష్ణభవానుడు చెప్పిన లక్షణాలన్నీ మోహరించి ఉన్నట్లు పాండవసంపదను హరించే అతడి దుష్టస్వభావంలో ధ్వనించబడుతూ ఉన్నది.

దైవీప్రవృత్తులు ఆసురీప్రవృత్తులచేత ధిక్కరించ బడినప్పుడు దైవం దైవీప్రవృత్తులను ప్రత్యక్షంగా రక్షించిన దివ్యవృత్తం శిశుపాలవధ ఘట్టం. వెంటనుండి విజయపథంలో నడిపించే ఆచార్యతత్త్వం ప్రకటించిన వృత్తం జరాసంధవధఘట్టం. ఆశ్రితులను పరోక్షంగాకూడా ఆదుకొనే ఆర్తత్రాణపరాయణరూపమైన పరమాత్మమాహాత్మ్యం ప్రదర్శించినవృత్తం ద్రౌపదీమానసంరక్షణ ఘట్టం. పరమాత్మవిభూతిని తెలిసికొనగోరే జిజ్ఞాసువులకు సభాపర్వం వివేకచూడామణి.

సభాపర్వంలోని ధార్తరాష్ట్రుల ప్రవర్తనాన్ని శ్రీకృష్ణభగవానుడి మాటలలో ఈవిధంగా అన్వయించుకొనవచ్చును. ఆ మాట లివి-

శ్లో. "త్రివిధం నరక స్యేదం । ద్వారం నాశన మాత్మనః,
కామః క్రోధ స్తథా లోభః । తస్మా దేతత్రయం త్యజేత్." **(భ.గీ.16.21)**

కామ, క్రోధ, లోభా లనేవి నరకానికి మూడుద్వారాలు. వాటివలన మనుష్యుడు సర్వనాశనం చెందుతాడు. కాబట్టి వాటిని పరిత్యజించటం కర్తవ్యం- అని ఆ మాటల తాత్పర్యం. పాండవసంపదను చూచి దాని నేవిధంగానైనా అపహరించాలని పూనుకొన్న దుర్యోధనుడిలో కామం పడగవిప్పింది. పాండవులూ, ద్రౌపదీ తనను జూచి నవ్వా రని అహంకరించి వారిపై ప్రతీకారం తీర్చుకొని అవమానాలపాలు చేయాలనే క్రోధం దుర్యోధనుడిలో విశ్వరూపం తాల్చింది. శత్రుసంపదను హరించటమే కాకుండా వారికి జీవితంలో ఎన్నడూ రాజ్యానుభవసౌఖ్యం లేకుండా చేయాలనే లోభం అతడిలో వికృతనాట్యం చేసింది. ఈమూడుగుణాల సంపుటి దుర్యోధనుడు. అందువలన నరకద్వారాలన్నీ తెరుచుకొన్న జీవనమార్గం దుర్యోధనుడిది.

కామంతో మొదలైన అతడి ప్రస్థానం ఏవిధంగా సాగుతుందో తెలిపేసూత్రం భగవద్గీత ద్వితీయాధ్యాయంలోని సాంఖ్యయోగ కథనంలో శ్రీకృష్ణుడు స్పష్టంచేశాడు.

శ్లో. "ధ్యాయతో విషయాన్ పుంసః । సంగ స్తే షూపజాయతే,
సంగా త్సంజాయతే కామః । కామా త్క్రోధోఽభిజాయతే.
క్రోధా ద్భవతి సమ్మోహః । సమ్మోహా త్స్మృతివిభ్రమః,
స్మృతిభ్రంశాత్ బుద్ధినాశః । బుద్ధినాశాత్ ప్రణశ్యతి". **(భ.గీ. 2.62-63)**

విషయవాంఛలవలన కామం పుట్టుతుంది. దానివలన కోపం సంభవిస్తుంది. కోపంవలన అవివేకం ఆవేశిస్తుంది. దానివలన మతిభ్రమ కలుగుతుంది. దానివలన బుద్ధి నశిస్తుంది. బుద్ధినాశంవలన సర్వస్వం నశిస్తుంది. ఇది దుర్యోధనుడి ప్రస్థానం.

దీనిని పరిత్యజించటమే ఉత్తముల కర్తవ్యం. దుష్టద్యూతంతో మతిభ్రంశం పొంది వ్యవహరించిన దుర్యోధనుడు కురుకులనాశన కారకుడౌతా డని విజ్ఞుడైన విదురుడు ధృతరాష్ట్రుడితో చెప్పటం గమనించదగిన అంశం. కౌరవులు తమ పాపకర్మకు తగినఫలం త్వరలో అనుభవిస్తా రని భీష్ము డనటం మరొక తార్కాణం. సపుత్రకుడైన ధృతరాష్ట్రుడిని ప్రజలు నిందించటం మరొక దృష్టాంతం. దుర్యోధనుడిని త్యజించటానికి ధృతరాష్ట్రుడు ఇష్టపడడు. అతడు మోహావిష్టుడైన జీవివంటివాడు. సత్యధర్మాలను చూడలేని గ్రుడ్డివాడు.

మనలోకూడా ధర్మరా జున్నాడు. దుర్యోధను డున్నాడు. అంతేకాదు విదురుడుకూడా ఉన్నాడు. ఆ సత్యాన్ని మనం గుర్తించాలి. ధర్మాధర్మాలకు సంఘర్షణ జరిగినప్పుడు మనలో వివేకమనే విదురుడు ధర్మబోధ చేస్తూనే ఉంటాడు. దానిని పెడచెవినిపెట్టి మనం ధృతరాష్ట్రులం కారాదు. కామం ఒక్కటే మనలను సర్వనాశనం చేయగలదు. దానికి తోడూ దుశ్శాసనుడనే మదం చేరకూడదు. మదం దుష్టచర్యలను చేయిస్తుంది. ఇక దానికితోడూ కాపట్యంకూడా కలిసి కార్యోన్ముఖమైతే ధర్మం నిలువునా దగ్ధమౌతుంది. లోకహాని ఏర్పడుతుంది. ఆరెండింటికీ కృపణత్వం తోడ్పడితే గాలితోకూడిన అగ్నికి ఆజ్యంతోడైనట్లవుతుంది. సభాపర్వంలో కామం దుర్యోధనుడు, కాపట్యం శకుని, కృపణత్వం (కుత్సితం) కర్ణుడు, మదం దుశ్శాసనుడు. ఈ దుష్టచతుష్టయం కలసినచోట ప్రళయం తథ్యం. అదే సభాపర్వసందేశం.

అయితే, ఈ ఆసురీప్రవృత్తి సమాజంలో విజృంభించినప్పుడు మానవుడి కర్తవ్య మేమిటి? సమర్థులైనవారు, దైవీప్రవృత్తి కలవారు కలిసి ఆసురీప్రవృత్తులను ఎదుర్కొని ధర్మాన్ని రక్షించాలి. విశ్వశ్రేయస్సును సాధించాలి. కురుసభలోవలె ఒక్కొక్కసారి సమర్థులు అసమర్థులై ఉపేక్షిస్తే దైవంమాత్రం చూస్తూ ఊరుకోదు. వారికి తగిన గుణపాఠాన్ని తానే పూనుకొని చెప్పుతుంది. ధర్మాన్ని విజయపథంలో నడిపిస్తుంది - ఉద్యోగపర్వంలో అదే కురుసభలో శ్రీకృష్ణుడు ఈ సత్యాన్ని ప్రకటించాడు.

ఉ. ''సారపుధర్మమున్ విమలసత్యముఁ బాపముచేత బొంకుచేఁ
బారముఁ బొందలేక చెడఁబాఱిన దైన యవస్థ దక్షు లె
వ్వార లుపేక్ష సేసి రది వారల చే టగుఁ గాని ధర్మని
స్తారక మయ్యు సత్యశుభదాయక మయ్యును దైవ ముండెడున్''. **(ఉద్యో. 3.273)**

ఈ సందేశం సభాపర్వంలో ప్రదర్శితమైన సత్యం. కురుక్షేత్రయుద్ధంలో ప్రవర్తిల్లబోయే సత్యం. ధర్మసాధకుడైన మానవుడు ఎప్పుడూ జ్ఞాపకముంచుకోదగిన నిత్యసత్యం!

కవిత్రయమహాభారతం - వ్యాఖ్యానం

తెలుగులో ఆదికావ్యమైన మహాభారతానికి వ్యాఖ్యానం సమగ్రంగా రావటం ఆంధ్రావళికి ఆనందం కలిగించే అంశం. ఆంధ్రుల అభిమాన దైవమైన శ్రీవేంకటేశ్వరస్వామివారి అనుగ్రహంతో అవతరించటంవలన ఇది సారస్వత యజ్ఞగౌరవం పొందింది. శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానంవారు దీనిని ఒక బృహత్తరధార్మికకార్యంగా భావించి, సర్వాంగసుందరంగా ప్రచురించి, సామాన్యులకుకూడ అందుబాటులో ఉండేటట్లు చేయటం తెలుగువారి వెలుగులపుణ్యం. ఈ పవిత్రమహత్తరప్రయత్నానికి ఏడుకొండలస్వామిపక్షాన బాధ్యత వహించి విజయవంతంగా ముందుకు సాగిస్తున్న మాన్యులు, పుణ్యులు టి.టి.డి. బోర్డు ఛైర్మన్, కార్యనిర్వహణాధికారి మొదలైన అధికారులూ, సంపాదక సలహామండలి సభ్యులూ, సంపాదక మండలి సభ్యులూ, శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానం సంపాదకులూ, వారిసహాయకులూ, వ్యాఖ్యాతలుగా పాల్గొన్న విద్వన్మణులూ, వివిధరకాలుగా దీనికి తోడ్పడుతున్న అధికార అనధికారులూ ధన్యులు. వారికి నా కృతజ్ఞతా పూర్వక నమస్సులు. ఈ గ్రంథాన్ని ఆమూలాగ్రం చదివి ఆమోదించిన శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానం కంట్రోలర్ ఆఫ్ పబ్లికేషన్స్‌కు ప్రత్యేకకృతజ్ఞతలు.

పదునెనిమిది పర్వాలలో ఆదిపర్వం మొదటి సంపుటిగా వెలువడింది. సభాపర్వం రెండవ సంపుటంగా రూపుదిద్దుకొన్నది. సభాపర్వం విద్వత్సభలలో విశేషంగా చర్చించుకొనే భారతభాగం. ఆకృతికి రెండాశ్వాసాలతో చిన్నదిగా పైకి కనపడుతున్నా లోనారసి చూస్తే జీవితంలోని మూడుపురుషార్థాలకు సంబంధించిన ఎన్నో విషయాలను మథించిన విలువైన పర్వం. నన్నయ తన కవితాకళాశక్తిని రూపకరమణీయంగా, గుణసుందరంగా, తత్త్వగంభీరంగా ప్రదర్శించిన మహత్తరపర్వం. మానవుడిలోని దైవాసురప్రవృత్తులు ఒకదానితో ఒకటి పోటీపడి సంఘర్షించిన సారవంతమైన పర్వం. అంతేకాక ఈ పర్వం భారతకథలో కీలకస్థానం నిర్వహించేది. అందువలన ఇది పరిమాణంలో చిన్నదైనా ప్రభావంలో పెద్దది. అందుకే కొంత విస్తృతమైన పీఠికకూడ అవసరమైనది. అది సరిక్రొత్త సమన్వయాలతో సమకూర్చబడినది. సహృదయులు సాదరంగా సమీక్షించ ప్రార్థన.

తిరుమల తిరుపతి దేవస్థాన ధర్మప్రచారపరిషత్తు పూర్వాధ్యక్షులు, సద్విమర్శకులు, పండితులు అయిన డాక్టర్ అప్పజోడు వేంకట సుబ్బయ్యగారు సభాపర్వంలోని అనేకాంశాలను పండు ఒలిచి చేతిలో పెట్టినట్లు వ్యాఖ్యానంలో చెప్పారు. వారు ఆదిపర్వంలోని పంచమాశ్వాసం నుండి నాలుగాశ్వాసాలకూ, సభాపర్వంలోని రెండాశ్వాసాలకూ మొదట సరళ గ్రాంథికభాషలో వ్యాఖ్యానం వ్రాశారు. తిరుమల తిరుపతి దేవస్థానంవారి నిర్ణయానుసారం భారత వ్యాఖ్యానం ప్రజల కందుబాటులో ఉండటానికై శిష్టవ్యావహారికంలోకి వారే మార్చి వ్రాశారు. ఈ పర్వాల శుద్ధప్రతిని తయారుచేయటంలో సహకరించిన సంస్కృతాంధ్ర భాషాసాహిత్యకోవిదులు డాక్టర్ అట్లా వెంకటరామిరెడ్డి, డాక్టర్ శ్రీమతి కె. జయశ్రీ, శ్రీ ఎ.వి.బి.కె. శాస్త్రి, శ్రీమతి ఎస్.వి. విజయలక్ష్మి, డాక్టర్ వి. విశ్వనాథయ్య, డాక్టర్ బి. జయరాములుగారలకు నేను కృతజ్ఞుడను. ప్రూపులు సరిచూడటంలో సహాయపడిన శ్రీమతి జి.లక్ష్మీ విద్యానాథ్, శ్రీమతి జి. సుశీల గార్లకు, డాక్టర్ వెలుదండ నిత్యానందరావు గారికి, భారతంమీద వచ్చిన లఘువ్యాఖ్యలను సేకరించటంలో సహకరించిన డాక్టర్ దంటు హేమలతగారికి, ముద్రణకు అనువైన అక్షరాకృతి నిచ్చిన శ్రీ దత్తసాయి గ్రాఫిక్స్ అధినేత్రి డాక్టర్ జి.యస్.లక్ష్మి గారికి ఆశీస్సులు.

వ్యాఖ్యాతలు చెప్పిన అంశాలకు మరికొన్ని విశేషాంశాలు చేర్చి ప్రతి సంపుటికీ ఒక పీఠికను కూర్చి, వీలైనంత సమగ్రతను, ఏకవాక్యతను, కథార్థ ప్రసన్నతను, కావ్య శిల్పతత్త్వ సమన్వయాన్నీ సంతరించి, ఎక్కువమంది సహృదయులకు సమ్మోదాన్ని కలిగించే దిశగా సంపాదకుడి కృషి సాగింది. ప్రతిపదార్థ తాత్పర్యాలు సరళసుందరంగా సాగాలనీ, విశేషాంశాలు వివేకచూడామణులుగా ప్రకాశించాలనీ భావించి రూపొందించటం జరిగింది. ఇది ప్రబంధవ్యాఖ్యలవంటిది కాదు; ప్రసన్నవ్యాఖ్యమాత్రమే!

భక్తజనకల్పద్రుమమైన భద్రమూర్తి పద్మావతీసహిత శ్రీ వేంకటేశ్వరస్వామివారు ధర్మద్రుమమైన ఈ భారతవ్యాఖ్యకు ప్రభువు. ఆస్వామి సత్య శివ సుందరమైన దివ్యసన్నిధిలో ఈ వ్యాఖ్యా సంపుటిని వాఙ్మయారాధనలో పుణ్యపూజాకుసుమమంజరిగా సమర్పించుకొంటున్నాను!

హైదరాబాదు
బహుధాన్య సంక్రాంతి
15-1-1999

జి.వి.సుబ్రహ్మణ్యం
ప్రధాన సంపాదకుడు
కవిత్రయమహాభారతంప్రాజెక్టు
తిరుమల తిరుపతి దేవస్థానం

సభాపర్వకథాసారం

శ్రీకృష్ణుడి కోరికపై మయుడు ఒక అపూర్వమైన సభను నిర్మించి పాండవులకు సమర్పించాడు. ఒక శుభముహూర్తాన పాండవు లందులో ప్రవేశించారు. దిక్పాలకుల సభలకంటె, బ్రహ్మసభకంటె, మయనిర్మితమైన సభ మహిమాన్వితమైన దని నారద మహర్షి ప్రశంసించాడు. ఆ సందర్భంలో పాండురాజాదులు యమసభలో ఉన్నా రనీ, హరిశ్చంద్రుడు ఇంద్రసభలో ఉన్నా డనీ నారదుడు ప్రస్తావించాడు. పరమధర్మాత్ముడైన పాండురాజు యమసభలో ఉండటానికీ హరిశ్చంద్రుడు ఇంద్రసభలో ఉండటానికీ కారణమేమిటని ధర్మరాజు నారదుడి నడిగాడు. హరిశ్చంద్రుడు రాజసూయయాగం చేయటంవలన ఆ యోగాన్ని పొందాడనీ, పాండురాజు ధర్మరాజును రాజసూయంచేసి తనకూ పితృగణానికీ ఇంద్రసభా నివాససౌఖ్యాన్ని కల్పించుమని కోరుతున్నాడనీ తెల్పాడు. అంతటితో ఆగక ఆ మహర్షి ధర్మజుడిని రాజసూయయాగం చేయుమని ప్రోత్సహించాడు. రాజసూయంవలన ప్రజలు పుణ్యాత్ము లౌతారనీ, దానివిఘ్నంకొరకు బ్రహ్మరాక్షసులు ప్రయత్నిస్తారనీ, అది నిర్విఘ్నంగా పూర్తిఅయితే ప్రజాప్రళయం జరిగే మహాయుద్ధం జరుగుతుం దనికూడా పేర్కొన్నాడు. ధర్మరాజు తమ్ములతో మంత్రులతో యోచించి రాజసూయం చేయా లని సంకల్పించాడు. ధర్మరాజు శ్రీకృష్ణుడిని ఇంద్రప్రస్థానికి పిలిపించుకొని, రాజసూయం చేయటానికి ఆశీస్సుల నర్థించాడు. శ్రీకృష్ణుడు రాజసూయం నిర్వహించే యోగ్యత ధర్మరాజుకు అన్ని విధాలా ఉన్న దని నిర్దేశించి, జరాసంధుడినీ, అతడికి ఆసట బాసటగా నిలచి ఉన్న శిశుపాలుడినీ, హంసడిభకులనూ సంహరించనిదే రాజసూయయాగం నిరాటంకంగా సాగ దని సూచించాడు.

ధర్మజరాజసూయం

గిరివ్రజపురాన్ని రాజధానిగా చేసికొని, చండశాసనుడుగా పాలిస్తూ, భరతవర్షంలో మూర్ధాభిషిక్తులైన రాజులనందరినీ బంధించి, రోజు కొక్కడిని భైరవుడికి బలియిస్తూ సమకాలీన రాజలోకంలో సింహస్వప్నంగా దాపురించాడు జరాసంధుడు. అతడికి ఆయుధాల వలన చావు లేదు. అట్లాగే హంసడిభకులకుకూడా. శిశుపాలుడు నూరు తప్పులు చేసేంతవరకు ఎవరూ ఏమీ చేయలేరు. అపార సేనతో జరాసంధుడు శ్రీకృష్ణుడినికూడా బాధించాడు. అతడు మధురను వీడి మరోచోటికి ఎన్నోసార్లు పోవలసి వచ్చింది. అటువంటి జరాసంధుడిని భీము డొక్కడే చంపగలడు. అందువలన శ్రీకృష్ణుడు భీమార్జునులతో కలిసి బ్రాహ్మణవేషాలతో గిరివ్రజానికి వెళ్లి ద్వంద్వయుద్ధంలో జరాసంధుడిని భీముడిచేత చంపించే పథకాన్ని వేశాడు. శ్రీకృష్ణుడిమాట పాండవులకు శిరోధార్యం. శ్రీకృష్ణ దర్శకత్వంలో భీముడు జరాసంధుడిని ద్వంద్వయుద్ధంలో చంపాడు. బందీలుగా ఉన్న వేలాది భూపతులను విడుదల చేయించాడు. శ్రీకృష్ణుడు గిరివ్రజానికి జరాసంధుడి కుమారుడైన సహదేవుడిని రాజును చేశాడు. విముక్తులైన రాజులనందరినీ వెంటపెట్టుకొని భీమార్జునశ్రీకృష్ణులు ఇంద్రప్రస్థపురం చేరారు. ధర్మరాజు ఆ రాజులకు వారి వారి రాజ్యాలిచ్చి సగౌరవంగా పంపాడు. శ్రీకృష్ణుడికి కృతజ్ఞతాంజలి సమర్పించాడు.

రాజసూయానికి ముందు జరాసంధసంహారం ఒక విజయారంభం అయింది. ధర్మరాజు నలుగురుతమ్ములనూ నాలుగు దిక్కులూ జయించటానికి పంపాడు. భీమసేనుడు తూర్పుదిక్కున నున్న రాజులను నిరాఘాటంగా సాధించాడు. అర్జునుడు ఉత్తరదిశపై దండెత్తి విజయాన్ని కరతలామలకం చేసికొన్నాడు. నకులుడు పశ్చిమ దేశ ప్రభువులను పాదాక్రాంతులను చేసికొన్నాడు. సహదేవుడు దక్షిణదిగ్విజయాన్ని దక్షతతో నిర్వహించాడు. నాలుగు దిక్కులనుండీ అపారధనరాసులు తెచ్చి ధర్మరాజుకు సమర్పించారు భీమాదులు. రాజసూయానికి కావలసిన సంపద చేకూరింది. శ్రీకృష్ణుడిఅనుమతి తీసికొని ధర్మరాజు యాగానికి సన్నాహాలు ప్రారంభించాడు. సహదేవుడిని సకలసన్నాహాలకూ సారథిగా నియమించాడు. నకులుడిని హస్తినాపురానికి స్వయంగా పంపి భీష్మాదులనందరినీ సగౌరవంగా ఇంద్రప్రస్థానికి రప్పించాడు. ధృతరాష్ట్ర దుర్యోధనాదులను కలుపికోలుతనంతో గౌరవించాడు. దక్షిణలిచ్చే నిర్ణయం కృపాచార్యుడి కిచ్చాడు; కృతాకృతనిర్ణయాధికారాన్ని భీష్మద్రోణులకు వప్పచెప్పాడు. వస్తువ్యయభారాన్ని విదురుడి చేతుల్లో ఉంచాడు. నానా దేశాల నుండి వచ్చే రాజులు తెచ్చే విలువైన కానుకలను గ్రహించే పరువైన బాధ్యతను దుర్యోధనుడి కిచ్చాడు. భక్ష్యభోజ్యాదివినియోగపర్యాలోకనాన్ని దుశ్శాసనుడి

కందించాడు. ఇట్లా అందరికీ అన్నిబాధ్యతలు ఇచ్చి, ధర్మరాజు తాను యజ్ఞదీక్షితుడై యజమాని చేయవలసిన కార్యక్రమాలను ఆరంభించాడు. యజ్ఞం మహేంద్రవైభవంగా సాగింది; అఖిల జనాలకు ఆనందాన్ని కలిగించింది.

శిశుపాలవధ

రాజసూయయాగం జరిగిన విధానాన్ని చూచి కురువృద్ధుడు భీష్ముడు ఉప్పొంగిపోయాడు. ధర్మరాజును ఆప్యాయంగా దగ్గరికి పిలిచి ఇట్లా బోధించాడు: 'మహాయజ్ఞం మహాత్ముని పూజతోకాని పరిపూర్ణం కాదు. స్నాతకుడైనా, ఋత్విజుడైనా, సద్గురుడైనా, సన్మిత్రుడైనా, భూతలేశుడైనా, సంయమీంద్రుడైనా - వీరిలో ఎవరినైనా ఒక్కరిని ఉత్తముడిని ఎన్నికచేసి పూజించుము; యజ్ఞఫలాన్ని పొందుము' - అని నిర్దేశించాడు. 'తాతా! అట్టివా డెవ్వడో నీవే నిర్ణయించి చెప్పాలి' అని ధర్మరాజు అర్థించాడు. పితామహుడు చిరునవ్వు నవ్వి. ఒకతన్మయభావంతో ఇట్లా అన్నాడు 'యుధిష్ఠిరా! సూర్యచంద్రులు ఎట్లా తమకాంతి కిరణాలతో లోకాలను వెలిగిస్తూ ఉన్నారో, అట్లాగే తనదివ్యతేజంతో మనలనందరినీ ఆనందపరవశుల్ని చేస్తున్న ఆ పుండరీకాక్షుడు, ఆ అనాది నిధనుడు, ఆ అబ్జనాభుడు ఈ కృష్ణుడు మన మధ్య ఉన్నాడు. ఆ అచ్యుతుడిని పూజించి, యజ్ఞపురుషుడిని పూజించిన అమృతఫలాన్ని పొందుము'.

భీష్ముడిమాటలు ధర్మరాజు శిరసావహించాడు. సహదేవుడు పూజాపాత్రలను తేగా ధర్మతనయుడు విధివిధానంగా వాసుదేవుడిని అగ్రాసనంమీద కూర్చుండపెట్టి అర్ఘ్యాన్ని ఇచ్చాడు. దానికి శిశుపాలుడు ఆగ్రహించాడు. నిండుసభలో పెద్దగా అధిక్షేపించటం ఆరంభించాడు.

'ధర్మరాజా! పూజించదగిన రాజులు, ద్విజులు, పూజ్యులు ఇంతమంది ఈ సభలో కొలువుదీరి ఉంటే ఈ గాంగేయుడు ఏదో నెపంతో ఈ కృష్ణుడిని పూజించమంటే, వెంటనే పూజించి నీ అవివేకాన్ని ప్రకటించుకొన్నావు. నిజంగా దాశార్హుడు పూజార్హుడా? సభలలో ధర్మతత్త్వాన్ని నిరూపించి చెప్పటం సాధ్యంకాని పని. భీష్ముడు వెర్రితనంతో ధర్మబాహ్యుడైన కృష్ణుడిని పూజించుమని చెప్పాడు. వృద్ధుల బుద్ధులు సంచలించటంలో ఆశ్చర్యం లేదు. ఇష్టముంటే కానుక లిచ్చుకొనవచ్చును కాని, పలువురు పెద్దలున్న సభలో అయోగ్యుడిని యోగ్యుడిగా ప్రకటించి పూజించటం న్యాయం కాదు. కృష్ణుడు ఏ విధంగా అర్హుడైనాడు? వృద్ధు డందామా సభలో అతని తండ్రి వసుదేవు డున్నాడే? ఋత్విజు డని గౌరవిద్దామా ఎదురుగా వేదవ్యాసు డున్నాడే? ఆచార్యు డందామా అరుగో కృపాచార్యులూ, ద్రోణాచార్యులూ, భూనాథు డందామా ఈసభలో ఎందరో ప్రభువులూ ఉన్నారు. యుధిష్ఠిరుడు యోగ్యు డని భావించి మే మందరమూ ఈ యజ్ఞానికి వచ్చాం. ఇట్లా భీష్ముడు చెప్పిన మాటలు విని మమ్మల్ని అవమానిస్తా వని ఊహించలేకపోయాం. ఒకవేళ నీవు తెలియక అర్ఘ్య మిచ్చినా, తగుదునమ్మా అని ఈ గోవిందు డెట్లా గ్రహించాడు?' - అంటూ ధర్మజ భీష్మ శ్రీకృష్ణులను నిందిస్తూ పుత్రమిత్రులతో కలిసి సభను వీడి బయటకు నడిచాడు శిశుపాలుడు.

యజమానియైన ధర్మజుడు నయవినయవాక్యాలతో శిశుపాలుడిని సమాధాన పెట్టటానికి ప్రయత్నం చేశాడు. 'ఉత్తములకు వాక్పారుష్యం చెల్లుతుందా? విషంకంటె, దహనంకంటె అది ఎంతో దారుణం. పితామహుడు దామోదరుడు పూజ్యు డని చెప్పాడు. బ్రహ్మోత్పత్తికి మూలమైనవాడు, వేదాది సమస్త వాఙ్మయాలలో ప్రశంసితుడైనవాడూ, లోకాలకు ఆదియైనవాడూ త్రిలోక పూజ్యుడు అయిన అచ్యుతుడే ఈ కృష్ణు డని తాతగారు ఆత్మలో దర్శించి చెప్పారు. ఇది ఒప్పుగాక తప్పెలా అవుతుంది? అదీకాక మహాత్ముల చరిత్రలు అల్పులకు అర్థం కావటం కష్టంకూడా. నీకంటె పెద్దలందరు తమందరికంటె పెద్దగా శ్రీకృష్ణుడిని గౌరవిస్తుంటే, నీ వభ్యంతరం చెప్పటం ఉచితమా?' అని శిశుపాలుడిని ధర్మజుడు మందలించాడు.

శిశుపాలుడి మాటలకు భీష్ముడు మండిపడ్డాడు. 'అవినయపరుడైన శిశుపాలుడు బాలుడు. అజ్ఞాని, ధర్మరాజా! వాడి నెందుకు నీవు అనునయించటానికి యత్నిస్తావు? రాగకోపాలతో పరిభవించబడిన మనస్సుకలవాడూ, స్వల్పరాజ్యలక్ష్మివలననే కన్నులు తలకెక్కినవాడు, నిష్కారణంగా ఇతరులతో తగాదాలకు దిగేవాడైన శిశుపాలుడికి ధర్మ మిది అని తెలిసికొనే వివేకం ఉండటానికి వీలుందా?'-అని ధర్మరాజును వారించి శిశుపాలుడితో ఇట్లా నిష్ఠురంగా పలికాడు. 'శిశుపాలా! నీవు మూర్ఖుడవురా.

అవినయబుద్ధితో హరికి అర్పిస్తున్న అర్ఘ్యాన్ని అయోగ్య మని నిందించావు. నేను వేరే చెప్పవలెనా? ఈ సభలో ఉన్నవారందరూ ఆతడి దయచేత పరిముక్తులైనవారే. అతడి శరణార్థులే, బాలుడైనా, జ్ఞాని అయితే బ్రాహ్మణులలో పూజ్యుడు; విక్రమంలో అధికుడైతే క్షత్రియులలో పూజ్యుడు. గోవిందుడియందు ఈ రెండుగుణాలూ ఉన్నాయి. అతడు వయోవృద్ధు డని కాదు గుణవృద్ధు డని పూజించాలి' అని మందలించాడు.

సహదేవుడు శిశుపాలుడిఅవినయవర్తనానికి ఆగ్రహించాడు. 'మేము అచ్యుతునికి అర్ఘ్యమిచ్చాం. దీనికి అంగీకరించని దుర్మార్గుల శిరస్సులమీద ఇదుగో నా పాదాన్ని ఉంచి తగినశాస్తి చేస్తాను' అని సహదేవుడు పాదాన్ని ఎత్తి ఝళిపించాడు. సభాసదులు కిమ్మనకుండా సద్దుమణిగి కూర్చున్నారు. దేవతలు పూలవాన కురిపించారు.

ఆ తరువాత శిశుపాలుడు కొందరురాజులను కూడగట్టుకొని ససైన్యంగా ధర్మరాజుయజ్ఞంపై దాడిచేయ యత్నించాడు. యజ్ఞదీక్షితుడైన ధర్మజుడు భయసంభ్రమాలతో భీష్ముడివైపు చూచాడు. శ్రీకృష్ణు డున్నంతవరకు భయ మేమీ లే దని పితామహుడు ధైర్యం చెప్పాడు. ఆ మాటలు విని శిశుపాలుడు భీష్ముడిని పరుషవచనాలతో నిందించాడు; 'శ్రీకృష్ణుడు పరమేశ్వరుడా?' అని అవహేళనం చేశాడు. అతనివీరగాథలను పేర్కొని అధిక్షేపం చేశాడు. ఆ విధంగా ఇచ్చవచ్చినట్లు ప్రేలుతున్న శిశుపాలుడిని చూచి భీముడు రౌద్రోద్రేకుడైనాడు. పండ్లు పటపటా కొరుకుతూ అతడిని చంపటానికి ఉద్యుక్తుడైనాడు. అప్పుడు భీష్ముడు భీముడిని వారించి శిశుపాలుడిని చంపవలసినవాడు శ్రీకృష్ణుడే నని వానిజన్మగాథ చెప్పి, నూరునేరాలవరకు హరి అతడిని సహించి ఊరుకుంటా డనీ, ఆ తరువాత అతని చావు ఆయన చేతులలో తప్ప దనీ వివరించాడు. ఆ మాటలు విని శిశుపాలుడు శ్రీకృష్ణుడితో ముఖాముఖిగా నిలిచి ద్వంద్వయుద్ధానికి ఆహ్వానించాడు. శ్రీకృష్ణుడు - శిశుపాలుడు చేసిన నూరుతప్పులను ఏకరువు పెట్టి అందరికీ తెలియచెప్పి, ఇక శిశుపాలుడు క్షమార్హుడు కా డని నిరూపించి, సుదర్శనచక్రంతో అతడి శిరస్సును ఖండించాడు. శిశుపాలుడి శరీరంలో నుండి ఒక వెలుగు లేచి వెలుగుల కన్నింటికి వెలుగైన శ్రీకృష్ణుడిలో లీనమయిపోయింది. సభాసదు లందరు ఆశ్చర్యమగ్ను లయ్యారు; జయజయనినాదాలు చేశారు.

మయసభ: సుయోధనుడిఅసూయ

రాజసూయయాగం నిర్విఘ్నంగా నారాయణుడిదయవలన పరిసమాప్తమయింది. బంధుమిత్రులు ఒక్కరొక్కరే తరలి వెళ్లటం మొదలయింది. శ్రీకృష్ణుడు ద్వారకకు పయనమైపోయాడు. ధృతరాష్ట్రాదులు హస్తినకు తిరిగి వెళ్లారు. దుర్యోధనుడు, శకుని మాత్రం మయసభావైభవాన్ని చూడటానికై కొన్నాళ్ళు ఇంద్రప్రస్థంలో ఆగారు. సుయోధనుడు మయసభాశిల్పరమణీయ కల్పన లన్నింటిని చూస్తూ విహరిస్తున్న తరుణంలో మిట్టలు జలాశయాలుగా, జలాశయాలు మిట్టలుగా, ద్వారాలు కుడ్యాలుగా, కుడ్యాలు ద్వారాలుగా గోచరించే విచిత్రశాలలో తిరుగుతూ ద్వార మని భావించి కుడ్యాన్ని ఢీకొనటం, మిట్టలని భావించి నీటిలో పడటం జరిగింది. అప్పుడు పాంచాలి, పాండుకుమారులు నవ్వారు. ధర్మరాజు దివ్యాంబరాలను, భూషణాలను దుర్యోధనుడు ధరించటానికి భీముడి ద్వారా పంపాడు. నకులసహదేవులను త్రోవచూపటానికి పంపాడు. ఆ విధంగా జరిగిన సభాప్రలంభనం దుర్యోధనుడికి సహించరాని అవమానంగా హృదయాన్ని బాధించింది. అతడు లజ్జతో పాండవులను వీడ్కొని హస్తినాపురం చేరాడు.

ధర్మరాజు చేసిన రాజసూయం అందరికీ సంతోషాన్ని కలిగించింది. కాని, దుర్యోధనుడిలో అసూయ రగిలించింది. సకలజన నయనానందాన్ని కలిగించిన పాండవ సభాలక్ష్మి ఆ సుయోధనుడికి మాత్రం గుండెలలో మంటలు పెట్టినట్లు బాధించింది. రాజధానికి తిరిగి వచ్చాడే కాని రారాజు కంటినిండా నిద్రపోలేదు. పాండవులపై పాపచింతతో, అన్నిభోగాలూ వదలి, దిగులుతో రోజులు గడుపసాగాడు. శకుని దానిని గమనించి దుర్యోధనుడిని ఏకాంతంగా ఊరడించటానికి వచ్చాడు. దుర్యోధనుడు తనబాధ బయటపెట్టుకొన్నాడు.

'మామా! మయుడు నిర్మించి పాండవుల కిచ్చిన సభను నీవుకూడా చూచావు కదా! ఏ యుగంలోనూ, ఏ లోకంలోనూ దానివంటి వైభవం వినపడదు, కనపడదు. దానితో ధర్మరాజు సూర్యతేజంతో వెలిగిపోతున్నాడు. అదేమి ఆశ్చర్యమో భూతలంమీది ప్రభువులందరూ ధనరాసులను కానుకలుగా తెచ్చి ధర్మరాజుకు భృత్యుల్లా చెల్లించారు. పాండవుల పరాక్రమం, ధర్మరాజు ప్రభుత్వం భూమిమీద స్థిరపడ్డాయి. అపార పరాక్రమార్జితమైన పాండవమహాలక్ష్మిని చూచి నేను

సహించలేకపోతున్నాను. అభిమానధనులైనవారు జ్ఞాతుల అభివృద్ధిని చూచి సహించగలరా! కాబట్టి ఏ విధంగా ఆ పాండవలక్ష్మిని అపహరించటానికి వీలౌతుందో యోచించాలి' - అని ఆవేదన వ్యక్తంచేశాడు.

దుర్యోధనుడి దురాలోచనకు ధృతరాష్ట్రుడి అనుమతి సాధించా లని శకుని అతడిని ధృతరాష్ట్రుడివద్దకు తీసికొని పోయాడు. దుర్యోధనుడు తనమనోవేదనను తండ్రిముందు చెప్పుకొన్నాడు. రాజు లిచ్చిన కానుకల నన్నిటినీ తానే స్వయంగా లెక్కించాడు. ధర్మరాజు సంపదల నంచనా కట్టాడు. కాబట్టి వాటన్నింటి విలువలనూ చెప్పి వాపోయాడు. గతంలోనూ, భవిష్యత్తులోనూ, వర్తమానంలోనూ పాండవలక్ష్మీవైభవంతో సరితూగే సంపదను ఎన్నడూ చూడలే దనీ, దాని నిప్పుడు చూస్తూ తాను సహించి ఉండటంకూడా కష్ట మనీ, అందువలననే క్రుంగి కృశించిపోయినా ననీ తండ్రిముందు చెప్పుకొన్నాడు.

'అవభృథస్నానానంతరం ధర్మరాజు ఉన్నతసింహాసనంమీద కూర్చున్నాడు. సాత్యకి ముత్యాలగొడుగు పట్టాడు. భీమార్జునులు చామరాలు వీవసాగారు. నకులసహదేవులు ధృష్టద్యుమ్నుడు శ్రీకృష్ణుడు మూర్ధాభిషిక్తులైన రాజు లందరిచేత అతడి పాదాలకు మ్రొక్కించారు. ఆ మహారాజు వైభవం చూచి మే మందరం చిన్నబోయాం. మమ్మల్ని చూచి శ్రీకృష్ణ పాండునందన ద్రౌపదీ సాత్యకులు నవ్వారు. ధర్మజు డారాజ్య వైభవాన్ని అనుభవించడం నేను సహించలేను'- అని దుర్యోధనుడు పలికాడు. 'అనుమతిస్తే ఆ సంపదనంతా మాయాద్యూతనెపంతో అపహరించి దుర్యోధనుడికి ఇస్తా'నని శకుని సూచించాడు. శకుని ఉపాయానికి అంగీకరించు మని తండ్రిని బలవంతపెట్టాడు దుర్యోధనుడు. అంగీకరించకపోతే అగ్నిలో పడి ఆత్మాహుతి చేసికొంటా నని బెదిరించాడు. పుత్రవ్యామోహంతో ధృతరాష్ట్రుడు శకుని వ్యూహానికి తలఊపాడు.

మాయాద్యూతం

హస్తినాపురంలో ధృతరాష్ట్రుడు వేయిమంది శిల్పులను పిలిపించి ఒక విచిత్ర మణిమయమహాసభను నిర్మించాడు. దానిలో మాయాద్యూతం జరిపించా లని నిర్ణయించి విదురుడికి చెప్పాడు. విదురుడు జూదంవలన కలిగే ఆపదలను పేర్కొని, దుర్యోధనాదులను ఆ ప్రయత్నంనుండి విముఖులయ్యేటట్లు ప్రయత్నించు మని ధృతరాష్ట్రుడిని హెచ్చరించాడు. గ్రుడ్డిరాజు ఏ విధంగానైనా జూదం జరగా లనీ, ఎటువంటి కీడులూ జరగకుండా పెద్దలు చూడా లనీ చెప్పి, పాండవులను తీసికొని రావటానికి విదురుడిని ఇంద్రప్రస్థపురానికి రథాలతో పంపాడు. విదురు డీసంగతి భీష్ముడికి నివేదించి బయలుదేరాడు.

మహేంద్ర వైభవంతో ఉన్న ధర్మరాజును విదురుడు దర్శించాడు. ధృతరాష్ట్ర సందేశాన్ని వినిపించాడు. నూత్న సభాసందర్శన సందర్భంలో సుహృద్ద్యూతం సమంజసం కా దనీ, అది కలతలకు దారి తీస్తుం దనీ ధర్మజుడు భావించాడు. కాని, పెదతండ్రి ఆనతిని శిరసావహించి భీమాదులను ద్రౌపదిని, ధౌమ్యాదులను వెంటబెట్టుకొని బయలుదేరి హస్తినాపురికి చేరాడు.

మణిమయమహాసభను దుర్యోధనుడు చూపగా ధర్మజుడు దర్శించి హర్షించాడు. ఆ తరువాత రారాజు ద్యూతానికి ఆహ్వానించాడు ధర్మరాజును. ద్యూతంవలన కలిగే కీడును పేర్కొని ధర్మరాజు ఆ ఆహ్వానాన్ని వారించాడు. శకుని కల్పించుకొని ఆట నేర్చినవారే దానిని నిందిస్తే ఆ కళ ఏమైపోతుం దని చమత్కరించి, ధర్మజుడు జూదమాడటానికి భయపడితే ఆడవలసిన అవసరం లే దని అధిక్షేపించాడు. ధర్మజుడు ఆ మాటకు నొచ్చుకొన్నాడు. 'బలవంతంగా జూద మాడించటానికి పిలిచిన తరువాత వెనుకాడటానికి వీలౌతుందా?' అని అంటూ విధిప్రేరితుడై మాయాద్యూతానికి ఉన్ముఖుడైనాడు.

జూదంలో తన పక్షాన శకుని ఆడతా డనీ, అత డొడ్డిన ధనరాసులు తాను చెల్లిస్తా ననీ రత్నరాసులు కుప్పలు పోసి దుర్యోధనుడు ముందుకు వచ్చాడు. 'ఇతరులకొరకు జూదం ఆడటం అసమంజసం' - అని అంటూనే ధర్మరాజు సాగరావర్త సంభవాలైన మణిరాసులను ఒడ్డాడు. సుహృద్ద్యూతం ఆరంభమయింది. భీష్మ ధృతరాష్ట్ర విదుర కృప ద్రోణాశ్వత్థామాదులు సముచితాసనాలలో కూర్చొని జూదాన్ని పరికిస్తున్నారు.

శకుని మాయావిదుడు. అందువలన పాచికలతో కావలసిన పందాన్ని జయప్రదంగా వేయగలడు. దానితో వరుసగా పందాలు శకుని గెలుచుకొంటున్నాడు. ధర్మరాజు ఓడిపోతున్నాడు. అట సాగే కొద్దీ ధర్మరాజుకు పంతంకూడా పెరిగింది. ఒక ఒడ్డుకు సువర్ణ భాండాగారాలు పెట్టి ఓడిపోయాడు. మరొక పందానికి రత్న భాండాగారాలను కోల్పోయాడు. ఇంకొకసారి చతుశ్శతనిధులను, మరొకసారి గుర్రాలను, ఏనుగులను, పరిచారికలను, పరిచారకులను ఇలా క్రమంగా ఉన్న సంపదనంతా, చివరకు రాజ్యాన్నికూడా మాయాద్యూతంలో చేజార్చుకొన్నాడు. విదురు 'డా కపటద్యూతాన్ని అంతటితో ఆపించు' మని ధృతరాష్ట్రుడిని కోరుకొన్నాడు. కాని, అతడు పుత్రవ్యామోహంతో కిమ్మనకుండా మిన్నకున్నాడు.

అప్పుడు విదురుడు దుర్యోధనుడిని ఇలా మందలించాడు: 'అన్యాయంగా, శకునిమాయతో, పాపమతివై జూదంలో పాండవుల సంపదలను ఇట్లా మోసంతో సంగ్రహించటం న్యాయమా? పాండవులు పరాక్రమాన్ని ప్రకటించి సంపాదించుకొన్నారు సంపదను; మీరు మోసంచేసి దోచుకొంటున్నారు'అన్నాడు. విదురుడి మాటలు దుర్యోధనునికి కోపం తెప్పించాయి. 'మావద్ద తిని పరాయివారిని పొగిడే కుత్సితబుద్ధి నీది! ఓ విదురా! నీవు మాయింట్లో విషసర్ప మున్న ట్లున్నావు. ఇతరులసంపద సులభోపాయంతో గ్రహించటం రాజనీతికాదా! అడగకుండానే నీవు మాకు నీతులు చెప్పవచ్చావు. ఇక చాలు. మాటలు కట్టిపెట్టటం మంచిది' - అని దుర్యోధనుడు విదురుడిని గద్దించాడు.

'దుర్యోధనా! నిన్ను పాడుచేసేవారిమాటలు విని సంబరపడుతున్నావు. నీకు హితుడైనవాడు - ముందుగా కొంత అప్రియంగా ఉన్నా తరువాత హితం చేకూర్చే మాటలు చెపుతాడు. హితులు మొగమోటం లేకుండా, బలవంతంగానైనా హితవును బోధిస్తారు. నీ విప్పుడు హితు లెవ్వరో, అహితు లెవ్వరో తెలిసికొనలేని స్థితిలో ఉన్నావు' - అని చెప్పి మాటలాడక మిన్నకున్నాడు విదురుడు.

ధనాల నన్నింటినీ ఓటువోయిన ధర్మరాజును మరొక పందెం కాయు మని శకుని బలవంతపెట్టాడు. ఆ తరువాత కూడా శకుని అవహేళనచేస్తూ పందాలు కాయుమనేవాడు. పౌరుషానికి ధర్మరాజు కాస్తుండేవాడు. వరుసగా సహదేవ నకుల పార్థభీములనూ, చివరకు తననుకూడా పణంగా పెట్టి జూదంలో ఓడిపోయాడు. ఆపైన శకుని 'ద్రౌపదికూడా నీ ధనమే కదా' అని ధర్మరాజుకు జ్ఞాపకం చేశాడు. గతిలేక కులభామనుకూడా జూదంలో ఒడ్డి చివరకు ఆమెనుకూడా ఓడిపోయాడు. ధర్మజుడు దీనవక్త్రుడై దిగాలుపడి కూర్చున్నాడు. భీష్మద్రోణులకు చెమటలు క్రమ్మాయి. విదురుడు మొగం ప్రక్కకుపెట్టి కంటతడి పెట్టుకొన్నాడు. మిగిలిన సదస్యు లందరూ ఏకధారగా దుఃఖించారు. దుర్యోధన దుశ్శాసన కర్ణ సైంధవులు విప్పారిన మొగాలతో ఒకరినొకరు చూచుకొంటూ నవ్వుకొన్నారు. సభలో కలకలం బయలుదేరింది. దుర్యోధనుడికి పట్టపగ్గాలు లేవు. పాండవులు తనకు దాసులైనా రని పొంగిపోతున్నాడు. ఆ గర్వాతిశయంతో పాంచాలిని దాసీలతో కలిసి తమయిళ్లు తుడవటానికి ఆజ్ఞాపించాడు. సభలో సంక్షోభం కలిగింది. గ్రుడ్డిరాజు ఆ గోల విని విషయ మేమి టని విదురుడిని అడిగి తెలిసికొన్నాడు.

ద్రౌపదీవస్త్రాపహరణం

దుర్యోధనుడు తన ఆజ్ఞను నెరవేర్పజేయటానికి విదురుడిని పోయి ద్రౌపదిని సభకు తీసికొని రమ్మని కోరాడు. విదురు డందుకు అతడిని మందలించాడు. దుర్యోధనుడు విదురుడిని తూలనాడి, ద్రౌపదిని తోడ్కొని రావటానికి ప్రాతికామిని పంపాడు. అతడు ద్రౌపది దగ్గరకు పోయి జరిగిందంతా చెప్పాడు. 'ఎన్నడైనా ఇలా తననూ తన భార్యనూ జూదంలో ఓడిపోయిన జూదరి ఉంటాడా?' అని విచారిస్తూ ప్రాతికామిని ఒక ప్రశ్న వేసింది పాంచాలి. 'అన్నా! ధర్మజుడు ముందుగా తన నోడి ఆ తరువాత న న్నోడాడా? నన్ను ముందుగా ఓడి ఆపై తనను తా నోడాడా? ఈ వివరం నీకు తెలిస్తే నాకు తెలియచెప్పుము. నీకు తెలియకపోతే ఆ ధర్మరాజునే అడిగి తెలిసికొని వచ్చి, ఉచిత మైతే నన్ను తీసికొని పో'' అని నిర్దేశించింది.

ప్రాతికామి సభకు వచ్చి ధర్మరాజును ఈ ప్రశ్న నడిగాడు. అత డేమీ సమాధానం ఇవ్వలేక మిన్నకున్నాడు. దుర్యోధనుడు 'నిండుసభలోనే ఆ సందిగ్ధమైన అర్థాన్ని నిర్ణయించుకొనవచ్చును; పాంచాలిని వేగంగా తీసికొని ర'మ్మని

ప్రాతికామిని మరలా పంపాడు. ద్రౌపది పరిస్థితుల ప్రాబల్యాన్ని గమనించింది. ఏకవస్త్రగా, అధోనీవిగా, అవిరళాశ్రుధారాపాతగా సభకు వచ్చి కురువృద్ధుడి సమీపంలో నించున్నది. ద్రౌపదిమోము చూడలేక లజ్జితులై, దుఃఖాయమానమానసులై, తలలు వంచియున్న పాండవులను చూచి దుర్యోధనుడు సంతోషించాడు. దుశ్శాసనుడిని పిల్చి 'నీవు పోయి పెద్దలవద్ద నున్న ద్రౌపదిని ఈవలకు లాక్కొని ర' మ్మని నియోగించాడు. అతడు ఆమెను సమీపించాడు. భయంతో ద్రౌపది గాంధారి దగ్గరకు పోయింది. దుశ్శాసనుడు ఆమెను వెన్నంటి వెళ్ళాడు. 'ఇం కెక్కడికి పోతావు? నీమగళ్ళు ని న్నోడారు. రారాజు నిన్ను గెలుచుకొన్నాడు. వెంటనే రా!' అని గద్దించాడు. 'నేను రజస్వలను. ఏకవస్త్రను. నన్ను ముట్టకుము; పెద్ద లున్న సభకు నే నీ స్థితిలో రాలేను' అని దీనంగా పలికింది పాంచాలి. 'నీవు ఏకవస్త్ర వైతే నేమి? వివస్త్ర వైతే నేమి? నిన్ను ఎట్లాగైనా తీసికొని పోతాను' - అని ఆ దుశ్శాసనుడు బలవంతంగా రాజసూయావభృథస్నానంతో పవిత్రమైన ఆమెశిరోజాలను ఒడిసిపట్టి సభకు ఈడ్చితెచ్చాడు. కర్ణ దుర్యోధన శకుని సైంధవాది దుష్టభూయిష్ఠమైన ఆ సభలో నిలబడి ద్రౌపది వివర్ణవదనంతో ఇట్లా సభికులను ఉద్దేశించి పలికింది -

'ఓ కురువృద్ధులారా! ధర్మరాజు ఎంత దురదృష్టకరమైన పరిస్థితులలో చిక్కుకొన్నా, ధర్మమార్గాన్ని మాత్రం వీడని ధన్యుడు. దుర్జనుడైన ఈ దుశ్శాసనుడు న న్నీసభ కెందుకు ఈడ్చుకొని తెచ్చాడు? సర్వధర్మసంవిదు లని పేరుగాంచిన కురుముఖ్యులు చూస్తూ ఉండగానే ఈ దుర్మదాంధుడు న న్నిట్లా అవమానిస్తున్నాడు. భరతవంశం నేడు అధర్మంతో అతినింద్యమై పోయింది' అని ఆక్రోశిస్తూ, 'అన్యథా శరణం నాస్తి' అనే భక్తిభావంతో ద్రౌపది శ్రీకృష్ణుడిని మనసులో తలచింది.

ద్రౌపదిదీనస్థితి చూచి భీముడు ధర్మరాజుపై మండిపడ్డాడు. జూదానికి కారణమైన అతడిచేతుల్ని కాలుస్తా నన్నాడు. అర్జునుడు అడ్డం వచ్చి ధర్మరాజువర్తనంలోని ధర్మనీతిని తెలియపరిచాడు. సభలో వికర్ణుడు లేచి ద్రౌపది అన్యాయవిజిత అని వాదించాడు. ఆమె అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వటం సభాధర్మ మని మనవి చేశాడు. కర్ణుడు అతడిని అధిక్షేపించాడు. అడగకుండానే నీతులు చెప్పే అధికప్రసంగానికి పోవ ద్దని మందలించాడు. ద్రౌపది ధర్మవిజితయే అని సమర్థించాడు. ఒక పతిని దైవంగా భావించి కాపురం చేసే వనితను ఏకవస్త్ర యని గౌరవించాలిగాని, అనేకభర్తృక అయిన బంధకిని వివస్త్రను చేసినా దోషం లే దని కర్ణుడు వాదించాడు. ఆ మాటలు విని రెచ్చిపోయి దుర్యోధనుడు 'పాండవుల వస్త్రాలను గ్రహించు'మని, 'పాంచాలిని వివస్త్రను చేయు'మని దుశ్శాసనుడిని ఆజ్ఞాపించాడు. అతడు అన్నమాటను అక్షరాలా పాటించాడు.

అయినా, అఖిలజగద్రక్షాదక్షుడైన నారాయణుడిమహిమవలన ద్రౌపదిశరీరంమీద చీర తొలగకుండా నిలిచి ఉండింది. దుశ్శాసనుడు లాగిన చీరలు కుప్పలు కుప్పలుగా పర్వతాకారంగా పడినాయి. అత డా మహిమకు సిగ్గుపడ్డాడు. అలసిపోయి ఊరుకొన్నాడు. దుశ్శాసనుడు ద్రౌపదికి చేసిన అవమానాన్ని భీమసేనుడు చూచి, ప్రతిక్రియ ఏమీ చేయలేని దయనీయ స్థితిలో ఉండికూడా రౌద్రాకారుడై ఇట్లా భయంకర శపథం చేశాడు: 'కురువృద్ధులు, గురువృద్ధులు, బంధువులు అనేకులు చూస్తూ ఉండగా మదోన్మత్తుడై ద్రౌపది నీవిధంగా చేసిన దుర్మార్గుడైన దుశ్శాసనుడిని యుద్ధంలో లోకాలు భయపడేటట్లు ఉగ్రాకారంతో చంపి అతడిగుండెలలోనుండి పెల్లుబికే రక్తప్రవాహాలను మనసారా రుచిచూస్తాను.' 'అట్లా చేయకపోతే పితృపితామహులగతికి తప్పినవాడి నవుతాను.' భీమశపథం విన్న సభాసదు లందరూ సపుత్రకుడైన ధృతరాష్ట్రుడిని నిందించారు. పాంచాలిప్రశ్నలను పట్టించుకొనని సభను విమర్శించారు. పాంచాలి ప్రశ్నలకు సమాధానం చెప్పకపోతే ధర్మవిదులకు పుట్టగతులుండ వని విదురుడు హెచ్చరించాడు. ఆమెప్రశ్నకు ధర్మరాజుమాత్రమే తగిన జవాబివ్వగల డని భీష్ముడు మారు పల్కాడు.

ఇంతలో కర్ణుడు పెచ్చు పెరిగి ద్రౌపదిని చూచి నవ్వుతూ 'తరుణీ! నీకు ఆరవ భర్త ఉండటం ఉచితం. జూదంలో ఓడనివాడినిగా చూచి అతడిని ఎన్నుకో'' అని ఎగతాళి చేశాడు. ఆ మాటలను ఆసరాగా తీసికొని దుర్యోధనుడు ఆ యిల్లాలిని తన యెడమ తొడమీద కూర్చొను మని సైగచేశాడు. ఆ దారుణమైన దృశ్యం చూచి వాయునందనుడు ఆగ్రహోదగ్రుడై లయకాలరుద్రుడివలె విజృంభించి భయంకరశపథం చేశాడు. 'రాజ్యసంపద మదంతో కన్ను మిన్ను కానకుండ

కోమలిని ద్రౌపదిని తన తొడమీద కూర్చో మని పిలిచిన దురాత్ముడైన దుర్యోధనుడిని భయంకరమైన రణరంగంలో నా బాహువులతో త్రిప్పే ప్రచండగదాఘాతాలతో తొడలు విరుగ గొట్టి చంపుతాను'- అని అరుణలోచనాలతో ఆయుధా లున్నవైపు చూపులు సారిస్తూ అన్నగారిఅనుమతికొరకు ఎదురు చూస్తున్న భీముడిని భీష్మవిదురద్రోణాదులు 'ఇది కోపానికి సమయం కా'దని వారించారు. ఆ సమయంలో ధృతరాష్ట్రుడి అంతఃపురంలో ఎన్నో అపశకునాలు గోచరించాయి. గాంధారి విదురుడిని తోడ్కొని ధృతరాష్ట్రుడి దగ్గరకు పోయి, జరిగినదంతా చెప్పింది. ధృతరాష్ట్రుడు దుర్యోధనుడిని పిలిచి కోపించి, సకలబాంధవహితం చేయసమకట్టి ద్రౌపదిని దగ్గరికి పిలిచి శాంతవచనాలు పలికాడు. ధృతరాష్ట్రుడు ద్రౌపదిని వరాన్ని కోరుకొ మ్మని అడిగాడు. ఆమె ధర్మరాజుదాస్యవిముక్తిని వరంగా కోరుకొన్నది. దానిని గ్రుడ్డిరాజు ప్రసాదించి రెండో వరాన్ని కోరుకో మన్నాడు. భీమాదులు నలుగురును వారిఆయుధాదులతోసహా దాస్యవిముక్తులు కావా లని అడిగింది. దానినీ ఇచ్చాడు. మూడోవరం వేడుకో మన్నాడు. 'క్షత్రియవనితకు రెండువరాలు కోరుకొనటం న్యాయం కాబట్టి మూడోవరం కోరుకొన'నన్నది. కోడలిధర్మనిష్ఠకు మెచ్చుకొని ధృతరాష్ట్రుడు ధర్మరాజుకు అతనిరాజ్యాన్ని యిచ్చి యేలుకొ మ్మని ఇంద్రప్రస్థపురానికి పంపాడు. పాండవులు బంగారురథా లెక్కి తమరాజధానికి చేరి సుఖంగా ఉన్నారు.

అనుద్యూతం

ఈ విషయం తెలిసికొన్న దుర్యోధనుడు ఖిన్నుడై తండ్రి వద్దకు పోయి ఇట్లా అన్నాడు- 'ఇకపై ఎంతమేలుచేసినా పాండవులకు మనం హితులం కాగలమా? పాములను తోకలు త్రొక్కి వదిలిపెట్టాం. అవి పగపట్టి కాటేయక మానవు. గాండీవంతో ఉన్న సవ్యసాచిని, గదగొన్న భీముడిని ఎదుర్కొనటం సాధ్యమా? కాబట్టి వారలను మరల పిలిపించి అనుద్యూతంలో ఓడించి, అడవులకు పంపుదాం' అని ధృతరాష్ట్రుని ఒప్పించి, ప్రాతికామిని పాండవులను తీసికొనిరావటానికి పంపాడు.

ధర్మరాజాదులు మరల హస్తినాపురికి వచ్చారు. అనుద్యూతానికి పూనుకొన్నారు. అందులో ఓడినవారు వల్కలాలు కట్టి, కందమూలాలు తింటూ, బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ పన్నెండేళ్లు వనవాసం చేసి, పదమూడవయేడు జనపదంలో అజ్ఞాతవాసం చేయాలి. అజ్ఞాతవాసంలో ఎవరైనా గుర్తిస్తే మరల పన్నెండేళ్ల అరణ్యవాసం, ఒకయేడు అజ్ఞాతవాసం చేయా లని కట్టడి చేసికొన్నారు. ధర్మరాజు అనుద్యూతంలో శకునిమాయవలన ఓడిపోయాడు. పాండవులు వనవాసాజ్ఞాతవాసాల దీక్షను గ్రహించారు. కుంతిని విదురునియింట ఉంచారు. సతీసమేతులై పాండవులు అడవులకు బయలుదేరారు.

తలవిరబోసుకొని పతుల వెంట నడచిపోయే ద్రౌపదిని చూచి కౌరవేంద్రుడి అంతఃపురవనిత లందరూ ఏదో చెప్పలేని భయంతో తలలు వంచారు. 'నా భయంకరగదాదండంతో ఆ దుర్యోధనునితొడలను ఉగ్రరణంలో విరగకొడతాను. శిరస్సు కాలితో తన్ని అవమానిస్తాను, దుశ్శాసనుడిని వధించి వేడిరక్తం త్రాగుతా' నంటూ బుసలు కొడుతూ సాగాడు వాయుపుత్రుడైన భీమసేనుడు. 'రాబోయే పదునాల్గవయేట జరగబోయే మహాయుద్ధంలో నా గాండీవం ఈ కర్ణుడు మొదలుగాగల దుర్జన సంఘాన్ని హతమారుస్తా' నని హుంకరిస్తూ అర్జునుడు వెళ్ళాడు. 'మాయాద్యూతంలో మోసం చేసి యింత విపత్తుకు మూలమైన శకునిని చంపుతా' మని భీమార్జుననకులసహదేవులు శపథం చేశారు.

ధృతరాష్ట్రుడిమందిరంలో పట్టపగలే నక్కలు కూశాయి. గ్రహణకాలం కాకుండానే సూర్యుడిని రాహువు పట్టాడు. భూమి కంపించింది. నారదుడు మింట నాట్యం చేస్తూ 'పదునాల్గవయేట భారతయుద్ధం జరుగుతుంది. భీమార్జునపరాక్రమాలవలన పాండవులు జయిస్తారు' అని ప్రకటించాడు.

ఇది సభాపర్వకథాసారం.

జి.వి. సుబ్రహ్మణ్యం
ప్రధాన సంపాదకుడు

శ్రీమదాంధ్ర మహాభారతము

సభాపర్వము

విషయసూచిక

ప్రథమాశ్వాసము

ద్వితీయాశ్వాసము

శ్రీమదాంధ్ర మహాభారతము

సభాపర్వము

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

సభాపర్వము -ప్రథమాశ్వాసము

శ్రీదయితోరస్థ్సల! విమ । లాదిత్యాత్మజ! నిరంతరానందమతీ!
కోదండపార్థ! నిఖిల ధ । రాదేవ స్తుత్య! రాజరాజ నరేంద్రా! **1**

ప్రతిపదార్థం:శ్రీ,దయితా+ఉరస్+స్థల=ప్రియురాలైన లక్ష్మీదేవిని వక్షస్థ్సలంలో కలవాడా (శ్రీమహావిష్ణువా!); విమల+ఆదిత్య+ ఆత్మజ= విమలాదిత్యుని యొక్క కుమారుడా!; నిరంతర+ఆనంద, మతీ= ఎల్లప్పుడు ఆనందంతో కూడుకొన్న మనస్సు కలవాడా!; కోదండ, పార్థ= విలువిద్యలో అర్జునునివంటివాడా!; నిఖిల, ధరా, దేవ, స్తుత్య= అందరు బ్రాహ్మణులచేత కొనియాడబడేవాడా!; రాజరాజ నరేంద్రా!

తాత్పర్యం: ప్రియురాలైన లక్ష్మీదేవిని వక్షస్థ్సలంలో కల విష్ణువువంటివాడా! విమలాదిత్యునికుమారా! అన్నివేళలా ఆనందమయమైన మనస్సుకలవాడా! విలువిద్యలో పార్థుడితో సమానమైనవాడా! బ్రాహ్మణు లందరి ప్రశంసలందుకొనేవాడా! ఓ రాజరాజనరేంద్రా!- (అని నన్నయ ప్రశంసాపూర్వకంగా రాజరాజును సంబోధించి, సభాపర్వప్రథమాశ్వాసరచన ప్రారంభించాడు).

విశేషం: ఆశ్వాసారంభంలో, ఆశ్వాసాంతంలో కృతిపతి గుణవిశేషాలు కొనియాడుతూ అతణ్ణి సంబోధించి కథను ప్రారంభించటం, ముగించటం ప్రాచీనకావ్య సంప్రదాయం. ఆ సంప్రదాయానుసారంగా జరిగిందే ఈరాజరాజ నరేంద్రుడి ప్రశంస; సంబోధన. అయినా తన భారతకృతిపతి రాజరాజనరేంద్రు డని నన్నయ ఎక్కడ స్పష్టంగా చెప్పలేదు. 'నావిష్ణుః పృథివీపతిః'- విష్ణువు కానివాడు పృథ్వీపతి (రాజు) కాలే డనిగదా ఆర్యోక్తి. అందువలన రాజరాజనరేంద్రుని విష్ణుత్వాన్ని, శత్రుశిక్షణ సమర్థమైన ఆయన పరాక్రమాన్ని నన్నయ భారతంలో అనేకసందర్భాల్లో అనేకవిధాలుగా వర్ణించాడు. ప్రస్తుతపద్యంలో 'శ్రీదయితోరస్థ్సల' అనే సంబోధనలో ఆయన విష్ణుత్వం, 'కోదండపార్థ' అనే సంబోధనలో ఆయన పరాక్రమం ప్రకటం కావటం గమనార్హం. కుంతి మొదటి పేరు పృథ. పృథపుత్రుడు పార్థుడు. పృథాపుత్రు లందరు పార్థులే. కాని పార్థు డంటే స్మృతికి వచ్చేది ఒక్క అర్జునుడే. అర్జునుని పదిపేర్లలో పార్థు డనేది ఒకటి. అర్జునుని పదిపేర్లు - అర్జునుడు, ఫల్గునుడు, పార్థుడు, కిరీటి, శ్వేతవాహనుడు, బీభత్సుడు, విజయుడు, జిష్ణుడు, సవ్యసాచి, ధనంజయుడు.

మయుం డొక్కసభను నిర్మించి ధర్మజున కిచ్చుట (సం. 2-1-1)

వ. అక్కథకుండు శౌనకాది మహామునులకుం జెప్పె: నట్లు ధర్మతనయునొద్ద వాసుదేవ సహితుం డయి యున్న యర్జునున కతిప్రీతిం గృతాంజలి యయి మయుం డిట్లనియె. **2**

ప్రతిపదార్థం:ఆ+కథకుండు= ఆ కథను చెప్పేవ్యక్తి (భారతకథను చెప్పే ఉగ్రశ్రవసుడనే సౌతి); శౌనక+ఆది, మహా, మునులకున్= శౌనకుడు మొదలైన మహామునులకు; చెప్పెన్= (ఖాండవవనదహనంవరకు జరిగిన కథను) చెప్పాడు; అట్లు= ఆ విధంగా-

అంటే ఖాండవదహన కారణంగా అగ్నిదేవునివల్ల దివ్యధనుర్బాణతూణీరలాభాన్ని పొంది; ధర్మతనయు+ఒద్ద= ధర్మరాజుదగ్గర; వాసుదేవ, సహితుండు+అయి= శ్రీకృష్ణునితో కూడినవాడై; ఉన్న; అర్జుననకున్; అతి ప్రీతిన్= మిక్కిలి సంతోషంతో; కృత+అంజలి, అయి= చేయబడిన నమస్కారం కలవాడై- అంటే నమస్కరించి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: నైమిశారణ్యంలో ఉగ్రశ్రవసుడనే మహర్షి, శౌనకాదులైన మహామునులకు ఖాండవదహనందాకా జరిగిన భారతకథను చెప్పాడు. ఖాండవ దహనం తరువాత శ్రీకృష్ణునితో కలిసి ధర్మరాజు దగ్గర ఉన్న అర్జునునికి మయుడు మహాసంతోషంతో నమస్కరించి ఇలా అన్నాడు. (అని ఉగ్రశ్రవసుడు మళ్ళీ కథ ప్రారంభించాడు.)

విశేషం: ఉగ్రశ్రవసుడు రోమహర్షణునిపుత్రుడు. అందువల్ల ఆయనకు రౌమహర్షణి అని కూడ పేరు. 'రౌమహర్షణి సుపౌరాణికుండు' (ఆది, ఆశ్వా. 1-28). వాసుదేవుడు-అన్నింటా, అంతటా వసించటంచేత భగవంతునికి వాసుదేవు డని పేరు. భగవంతుని అవతారం కావటంచేత, వసుదేవుని పుత్రుడు కావటంచేత శ్రీకృష్ణునికి కూడ వాసుదేవు డని పేరు. మయుడు రాక్షసశిల్పి. నముచి తమ్ముడు.

క. ఘనముగఁ బ్రాణము రక్షిం । చిన యుపకారికిఁ బ్రియంబు సేయుదు నన నే
ర్తునె; యైనను నీకుఁ బ్రియం । బనఘా! చేయంగ నిష్టమైనది నాకున్. 3

ప్రతిపదార్థం: అనఘా= పాపరహితుడవైన ఓ అర్జునా!; ఘనముగన్= గొప్పగా; ప్రాణము, రక్షించిన= (నా) ప్రాణాన్ని కాపాడిన; ఉపకారికిన్; ప్రియంబు, చేయుదున్, అనన్, నేర్తునె= ఇష్టమైనది చేయగలనని చెప్పగలనా; ఐనను; నీకున్; ప్రియంబు; చేయంగన్; నాకున్; ఇష్టము+ఐనది= కోరిక కలిగింది.

తాత్పర్యం: అర్జునా! నీవు నా ప్రాణాలనే కాపాడిన మహోపకారివి. అలాంటి నీకు ఏదో మేలు చేస్తా నని చెప్పటానికి సమర్థుడినా! అయినా నీకు ఇష్టమైన దేదో చేయా లని నాకు కోరికగా ఉంది.

విశేషం: మయునిమాటల్లో ఎంతో వినయం, అంతులేని ఆనందం, అపారకృతజ్ఞత వ్యక్తమౌతున్నాయి. ఉపకారం పొందిన ఏ వ్యక్తికైనా ఇవి ఉండదగిన గుణాలు.

వ. 'ఏను దానవ విశ్వకర్మ, ననేకవిధ శిల్ప కలా కుశలుండ; మీ కిష్టంబయిన దాని నిర్మించెదం బనుపుం' డనిన నర్జునుం డచ్యుతుమొగంబు చూచి 'యతని నెద్దియేనియు నొక్క యపూర్వం బయినదాని నిర్మింప నియోగింపు' మనినఁ గృష్ణుండు పెద్దయుంబ్రొద్దు విచారించి మయున కిట్లనియె. 4

ప్రతిపదార్థం: ఏను= నేను; దానవ, విశ్వకర్మన్= రాక్షసజాతికి చెందిన శిల్పిని; అనేక, విధ, శిల్ప, కలా, కుశలుండన్= పలువిధాలైన శిల్పకళలలో నేర్పరిని; మీకున్+ఇష్టంబు+అయిన, దానిన్; నిర్మించెదన్= సృజిస్తాను, చేస్తాను; పనుపుండు= ఆజ్ఞాపించండి; అనినన్= అని అనగా, అర్జునుండు; అచ్యుతు, మొగంబు= శ్రీకృష్ణుని ముఖాన్ని; చూచి; అతనిన్= ఆ మయుణ్ణి; ఎద్ది; ఏనియున్= ఏదైనా; ఒక్క, అపూర్వంబు+అయిన, దానిన్= ఇంతకుముం దెన్నడు లేనిదొక దానిని; నిర్మింపన్; నియోగింపుము= ఆజ్ఞాపించుము; అనినన్= అని అనగా; కృష్ణుండు; పెద్దయున్+ప్రొద్దు= చాలాసేపు; విచారించి= ఆలోచించి; మయునకున్+ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'నేను దానవశిల్పిని, వివిధకళల్లోనేర్పరిని. మీ కిష్టమైనదాన్ని నిర్మించి ఇస్తా, ఆజ్ఞాపించండి' అని మయుడు అర్జునుణ్ణి అడిగాడు. అర్జునుడు శ్రీకృష్ణునిముఖం చూచి 'ఏదైనా ఒక అపూర్వమైనదాన్ని నిర్మించవలసిందిగా ఆజ్ఞాపించం'డని అన్నాడు. శ్రీకృష్ణుడు చాలాసేపు ఆలోచించి మయునితో ఇలా అన్నాడు.

విశేషం: అచ్యుతుడు - చ్యుతిలేనివాడు - అంటే పతనం లేనివాడు - శ్రీమహావిష్ణువు. ఆయన అవతారం కావటంచేత శ్రీకృష్ణునికి కూడ అచ్యుతు డనేపేరు.

చ. **కురుపతికిన్ యుధిష్ఠిరునకున్ సకలక్షితిపాలసేవ్యసు**
స్థిర విభవాభిరామున కతిప్రమదంబుగ రత్నరాజిసుం
దర మగు దాని నొక్క సభ ధాత్రి కపూర్వముగా నొనర్చి చె
చ్చెరఁ గొనిరమ్ము నీదయిన శిల్పకలాకుశలత్వ మేర్పడన్. **5**

ప్రతిపదార్థం: కురుపతికిన్=కురువంశరాజుకు; యుధిష్ఠిరునకున్=ధర్మరాజుకు;సకల, క్షితి,పాల,సేవ్య,సుస్థిర,విభవ+అభిరామునకున్= అందరుభూపతులచేత - అంటే రాజులచేత కొలువదగిన శాశ్వత వైభవంతో వెలిగేవానికి; అతి, ప్రమదంబుగన్= ఎంతో సంతోషం కలిగేవిధంగా; రత్న, రాజి, సుందరము+అగు, దానిన్= రత్న సమూహంతో అందమైనదానిని; ఒక్క, సభన్= ఒక సభాభవనాన్ని; ధాత్రికిన్+అపూర్వముగాన్= భూమిమీద మున్నెన్నడు లేనివిధంగా; నీది+అయిన, శిల్ప, కలా, కుశలత్వము+ఏర్పడన్= నీయొక్కశిల్పకలానైపుణ్యం ప్రకాశించేవిధంగా; ఒనర్చి= నిర్మించి, చెచ్చెరన్= వేగమే; కొని, రమ్ము= తీసికొనిరా.

తాత్పర్యం: ధర్మరాజు కురువంశప్రభువు. అంతేకాదు, అందరు రాజులు సేవించదగిన శాశ్వతవైభవంతో విరాజిల్లే ప్రభుడు. అలాంటి ధర్మరాజుకు ఆనందదాయకంగా, నానావిధరత్నసమూహాలతో అందంగా, లోకానికే అపూర్వంగా నీ శిల్పకళానైపుణ్యానికి నిదర్శనంగా ఒక మహాసభను నిర్మించి వెంటనే తీసికొనిరా.

విశేషం: ధర్మరాజు అప్పటికి ఇంకా 'సకలక్షితిపాలసేవ్యసుస్థిరవిభవాభిరాముడు' కాలేదు. అయినా శ్రీకృష్ణుడు ఆ విశేషణాన్ని ప్రయోగించి అతని భావి సార్వభౌమయోగాన్ని అందరికీ ధ్వనింపజేయటం, ఏదో సామాన్యమైన సభనుగాక, సార్వభౌమయోగ్యమయిన మహాసభను నిర్మించి తెమ్మని మయునికి సూచించటం ఈ సందర్భంలో గమనించదగిన అంశాలు. మహాత్ముల మాటలు సార్థకాలు; భావ్యర్థసూచకాలు. శ్రీకృష్ణుడు అన్నట్లే తర్వాత ధర్మరాజు సార్వభౌము డయ్యాడు కదా! యుధిష్ఠిరుడు- 'ధృతిఁజేసి యుధిష్ఠిరుఁడు' (ఆది. ఆశ్వా.5-97)- యుద్ధంలో స్థిరంగా ధైర్యంతో నిలిచేవాడు ధర్మరాజు. పద్యంలో 'సకలక్షితిపాలసేవ్యసుస్థిరవిభవాభిరాముఁడు' - అనే సుదీర్ఘసంస్కృతసమాసం, అర్థం తెలియనివాళ్ళకుకూడ మున్ముందు ధర్మరాజుకు పట్టబోయే సార్వభౌమమహాయోగాన్ని ధ్వనింప చేసేదిగా ఉంటే- 'ఒనర్చి చెచ్చెరఁ గొనిరమ్ము'- అనే అలతి అలతి తెలుగు పదాలకూర్పు 'అపూర్వసభానిర్మాణం కదా అని ఆలస్యం చేసేవు- సత్వరం పని పూర్తిచేసి సభను తీసుకురా', అని మయుణ్ణి త్వరపెట్టి తరిమేదిగా ఉంది. అక్షరరమ్యమైన నన్నయశైలికి ఈ మాటలకూర్పులు మెరుగుటద్దాలు. ఈ పద్యంలో గుణం ప్రసాదం.

వ. **అనిన వాసుదేవునకు మయుం డిట్లనియె.** **6**

తాత్పర్యం: ఆ విధంగా అనిన శ్రీకృష్ణునితో మయుడు ఇలా అన్నాడు.

ఉ. ఇమ్మనుజేంద్రుఁ డింద్రదనుజేంద్రులకంటె మహావిలాస సౌ
ఖ్యమ్ములఁ బెద్ద యిద్ధరణిఁ గావున, నీతని పేర్మికిం దగన్
నెమ్మి నొనర్చెదన్ సభ మణిప్రభ నొప్పఁగ, దేవతావిమా
నమ్ములు నిట్టివే యని జనమ్ములు దానిన మెచ్చి చూడఁగన్. 7

ప్రతిపదార్థం: ఈ+మనుజ+ఇంద్రుఁడు= మానవులకు రాజైన ఈ ధర్మరాజు; ఇంద్ర, దనుజ+ఇంద్రులకంటెన్= దేవతల రాజైన ఇంద్రునికంటె, రాక్షసులకు రాజైనవానికంటె; మహా, విలాస, సౌఖ్యమ్ములన్= గొప్పవైభవంలో, సుఖాల్లో; ఈ+ధరణిన్= ఈభూమిమీద; పెద్ద;కావునన్; ఈతని, పేర్మికిన్=ఇతని గొప్పతనానికి; తగన్= తగినట్లు; మణిప్రభన్, ఒప్పఁగన్= మణులకాంతితో ప్రకాశించేవిధంగా; జనమ్ములు= ప్రజలు; దేవతావిమానమ్ములున్= దేవతలయొక్కసౌధాలు(మేడలు)అయినా; ఇట్టివే=ఈ విధంగా ఉంటాయా!; అని; దానిన్+అ= ఆ సభనే; మెచ్చి; చూడఁగన్; నెమ్మిన్= ప్రేమతో; సభ=సభను; ఒనర్చెదన్= నిర్మిస్తాను.

తాత్పర్యం: వైభవంలో, భోగానుభవంలో, దేవేంద్ర రాక్షసేంద్రులకంటె మనుజేంద్రుడైన ధర్మరాజే ఈ ధరమీద మిన్న. ఆయన గొప్పతనానికి తగ్గట్లు, దేవతలమేడలైనా ఇంత బాగుంటాయా అని జనులంతా దానినే మెచ్చి చూచేటట్లు, మణుల కాంతితో మెరిసే ఒక మహాసభను మనసార నిర్మించి ఇస్తా.

విశేషం: అలం: సందేహం. 'మెచ్చిచూడఁగన్' అనటానికిబదులు 'వచ్చిచూడఁగన్' అని కొన్ని ప్రతుల్లో ఉన్నపాఠం కూడ ఉచితమైనదే. దేవతావిమానాలు అంటే- దేవతలు ఆకాశంలో పయనించే వాహనాలు, దేవతలు నివసించే సౌధాలు, దేవాలయ గర్భగుడి గోపురాలు- అని మూడర్థాలూ చెప్పవచ్చు. కాని, ఇక్కడ దేవతలు నివసించే సౌధాలు- అని చెప్పటమే ఎక్కువ ఉచితంగా ఉంటుంది. దనుజేంద్రు డంటే బలిచక్రవర్తి అని ప్రసిద్ధి. ఈ పద్యంలో 'ఇంద్ర' శబ్దం మూడుసార్లు వచ్చింది- మనుజేంద్రుడు, ఇంద్రుడు, దనుజేంద్రుడు. ఈ ముగ్గురూ వరుసగా మర్త్య, స్వర్గ, పాతాళాలకు అధిపతులు. సాంప్రదాయికంగా చెప్పుకొనే వరుసక్రమం- స్వర్గ, మర్త్య, పాతాళాలు. ఈ ముల్లోకాల ఇంద్రుల్లో మనుజేంద్రుడు రెండవవాడు. మధ్య ఉండేవాడు. కాని పద్యంలో అతడు మొదటివా డయ్యాడు. దీనివల్ల త్రిలోకాధిపతుల్లో ధర్మరాజు శ్రేష్ఠు డని ధ్వని. అందుచేత అతని యోగ్యతకు తగ్గట్లు మహాసభ ఉండా లని మయుని ఉద్దేశం. దనుజేంద్రునిసభకంటె దేవేంద్రునిసభ గొప్పది. అంతకంటె గొప్పదిగా ధర్మరాజు సభ ఉండా లనీ, ఆ సభను చూచి, దేవతల సౌధాలుకూడా ఇలా ఉండవే- అని జనులంతా ఆశ్చర్యపోవా లనీ మయుని అభిప్రాయం. శ్రీకృష్ణుడు ధర్మరాజును మనుజేంద్రుల్లో గొప్పవా డని భావిస్తే, మయుడు ఆ మహారాజును ముల్లోకాధిపతుల్లో అధికు డని అన్నాడు. అతని ఆధిక్యానికి తగ్గట్లే ఆ సభను తీర్చిదిద్దుతా నన్నాడు. దేవేంద్రాదులసభలకంటే ఈ సభ దివ్యమైం దని, ముమ్ముందు తేల్చిచెప్పే త్రిలోకసంచారి నారదమహర్షిమాటకు ఇది సూచ్యార్థసూచన. పద్యంలోని అర్థవ్యక్తిప్రసాదగుణపరిపోషకం- వస్తుధ్వనికి వ్యంజకం. నన్నయ రచనాశిల్పానికి చక్కనిదర్పణం.

వ. తొల్లి వృషపర్వుండను దానవేంద్రున కొక్కసభ నిర్మింప సమకట్టి వివిధ రత్నమయంబులయిన యుపకరణంబు లొడఁగూర్చి బిందుసరంబను కొలన సంగ్రహించినవాఁడ; నయ్యుపకరణంబుల దాని విచిత్రంబుగా రచియించి తెచ్చి ధర్మరాజున కిచ్చెద; మఱియును భౌమాదిత్యుండను రాజర్షిచేత నిహితంబయి సకలశత్రుఘాతినియైన దాని భీమసేనున కొక్కగదను. దారుణంబయిన దివ్యఘోషంబు గలుగు దేవదత్తంబను శంఖం బర్జునునకు నిచ్చెద'నని చెప్పి ధర్మరాజుచేత సత్కృతుండై మయుం డరిగె; నంత నిట నారాయణుండును బాండవుల వీడ్కొని పితృదర్శనలాలసుండై ద్వారవతీపురంబున కరిగె; నట

మయుండును బూర్వోత్తరదిశాభిముఖుండై పోయి కైలాసంబునుత్తరంబున మైనాకశైలంబునందు హిరణ్యశృంగంబున. 8

ప్రతిపదార్థం: తొల్లి= పూర్వం; వృషపర్వుండు+అను; దానవ+ఇంద్రునకున్= రాక్షసరాజుకు; ఒక్కసభ; నిర్మింపన్; సమకట్టి= పూనుకొని వివిధరత్నమయంబులు+అయిన= అనేకరకాలైన రత్నాలతో కూడుకొన్న; ఉపకరణంబులు= సాధనాలు; ఒడన్+కూర్చి= ప్రోగుచేసి; బిందుసరంబు+అను, కొలనన్= బిందుసరం అనేపేరుగలకోనేటిలో; సంగ్రహించినవాఁడన్= సేకరించిఉంచాను; ఆ+ఉపకరణంబులు+అ= ఆ సామగ్రితోనే; దానిన్= ఆ సభను; విచిత్రంబుగాన్= మిక్కిలిఆశ్చర్యకరమైనదానినిగా; రచియించి= నిర్మించి; తెచ్చి; ధర్మరాజునకున్; ఇచ్చెద; మఱియును; భౌమ+ఆదిత్యుండు+అను; రాజ+ఋషిచేతన్= ఋషివంటిరాజుచేత; నిహితంబు+అయి=ఉంచబడిందై; సకల, శత్రు, ఘాతిని, ఐన, దానిన్= అందరు శత్రువులను చంపునట్టిదైనదానిని; ఒక్కగదను; భీమసేనునకున్; దారుణంబు+అయిన= భయంకరమైన; దివ్య, ఘోషంబు, కలుగు= శ్రేష్ఠమైనశబ్దం వచ్చే; దేవ, దత్తంబు+అను= దేవదత్తం అనేపేరుగల; శంఖంబు; అర్జుననకున్+ఇచ్చెదన్+అని; చెప్పి; ధర్మరాజుచేతన్; సత్, కృతుండు+అయి= సమ్మానించ బడినవాడయి; మయుండు; అరిగెన్= వెళ్ళాడు; అంతన్= తరువాత; ఇటన్= ఇక్కడ; ఇంద్రప్రస్థమున; నారాయణుండును= శ్రీకృష్ణుడుకూడ; పాండవులన్, వీడ్కొని= పాండవుల దగ్గర సెలవుతీసికొని; పితృ, దర్శన, లాలసుండు+ఐ= తండ్రిని చూడటంలో మిక్కుటమైన కోరిక కలవాడై- అంటే తండ్రిని చూడాలన్న తహతహతో; ద్వారవతీ, పురంబునకున్= ద్వారకానగరానికి; అరిగెన్= వెళ్ళాడు; అటన్= అక్కడ; మయుండు; పూర్వ+ఉత్తర, దిశా+అభిముఖుండు+ఐ= ఈశాన్యదిశవైపు తిరిగినవాడై; పోయి; కైలాసంబు= కైలాసపర్వతానికి; ఉత్తరంబునన్ మైనాక, శైలంబు+అందున్= మైనాక పర్వతంలో; హిరణ్యశృంగంబునన్= హిరణ్యమనే పేరున్న శిఖరంలో.

తాత్పర్యం: 'పూర్వం వృషపర్వుడనే రాక్షసరాజుకు ఒక సభను నిర్మించి ఇవ్వా లని, నానావిధరత్నాలతో కూడిన నిర్మాణ సామగ్రిని సమకూర్చాను. ఆ సామగ్రినంతా బిందుసరం అనే సరోవరంలో భద్రపరచాను. ఇప్పుడా సామగ్రిని ఉపయోగించి చిత్ర, విచిత్రమైన సభను నిర్మిస్తాను. దాన్ని ధర్మతనయునికి బహూకరిస్తాను. అంతే కాదు, భౌమాదిత్యుడనే రాజర్షి ఉంచిన గదాశంఖాలు నా అధీనంలోనే ఉన్నాయి. సర్వశత్రువుల్ని హతమార్చే ఆ గదను భీమసేనుని కిస్తాను. మహాభయంకరమైన దివ్యధ్వని గల దేవదత్తశంఖాన్ని అర్జునునికిస్తాను' - అని మయుడు ధర్మరాజుచేత సమ్మానంపొంది అక్కడినుండి బయలుదేరాడు. శ్రీకృష్ణుడుకూడ తనతండ్రిని చూడాలన్న ప్రబలకుతూహలంతో- పాండవులదగ్గర సెలవు తీసికొని ద్వారవతికి వెళ్ళాడు. మయుడు ఈశాన్యదిశగా పయనించి కైలాసపర్వతానికి ఉత్తరాన మైనాకపర్వతంమీది హిరణ్యశిఖరాన్ని చేరుకొన్నాడు.

విశేషం: వృషపర్వుడు - రాక్షసరాజు, శర్మిష్ఠతండ్రి. భౌమాదిత్యుడు - తపస్సు చేసి ఋషిత్వాన్ని పొందిన ఒక మహారాజు. నారాయణుడు - నీరు స్థానంగా కలవాడు; నరులసమూహం నివాసంగా కలవాడు; ఒక మన్వంతరంలో నరుడనే ఋషికి మిత్రుడైనవాడు - విష్ణుమూర్తి. విష్ణుమూర్తి అవతార మవటంచేత శ్రీకృష్ణుడికికూడ నారాయణు డని పేరు. శ్రీకృష్ణుడు పాండవుల వీడ్కొని వెళ్ళే కార్యక్రమం సంస్కృతంలో చాలా విపులంగా ఉన్నది. సుభద్రార్జునుల వివాహం జరిపించి పాండవులతో బాంధవ్యాన్ని, ప్రత్యేకించి అర్జునుడితో ఆత్మీయతను పెంచుకొని, ఖాండవదహనాన్ని జరిపించటంలో, దేవేంద్రుడిని ఓడించటంలో అర్జునుడికి తోడయి, ఆ గాండీవివెంట ఇంద్రప్రస్థానికి వచ్చినవాడు శ్రీకృష్ణుడు. అంతేకాక తాను సంకల్పించిన దుష్టశిక్షణ, శిష్టరక్షణ, ధర్మసంస్థాపనరూపమైన మహోద్యమసఫలతకు బలమైన ఉపకరణాలుగా పాండవులను ఉపయోగించదలచాడు శ్రీకృష్ణుడు. అందుచేత ఆ సందర్భంలో ఆ మహానుభావుడు పాండవులను వీడ్కొని వెళ్ళే కార్యక్రమం, విపులంగా, విలంబంగా సాగటం సహజమే. సంస్కృతభారతవర్ణన ఒకవిధంగా సందర్భోచితమే. కాని, పాఠకుడిదృష్టి ఆ సందర్భంలో అపూర్వసభానిర్మాణానికై

బయలుదేరిన మయునివెంట వెళ్తుందిగాని, పాండవులదగ్గర సెలవుతీసికొనే శ్రీకృష్ణుడికార్యక్రమంమీద నిలవదు. అందువలననే నన్నయ ప్రసన్నకథాకలితార్థయుక్తికోసం ఒక్కవాక్యంలో ఆ వీడ్కోలుకార్యక్రమాన్నంతా ముగించి, మయుని అపూర్వసభానిర్మాణాన్ని మనోహరంగా విపులీకరించి వర్ణించాడు. ప్రసన్నకథాకలితార్థయుక్తి అంటే ప్రసన్నాలైన కథలలో కూర్చబడిన అర్థంయొక్క యుక్తి (కూడిక) అనికూడ చెప్పవచ్చును. కథాకథనంలో ప్రధానభాగాలు మూడు - చెప్పటం, వర్ణించటం, వివరించటం. చెప్పడంలో సరళత, స్పష్టత, పొందిక ఉండాలి. అప్పుడుగాని కథకు ప్రసన్నతాగుణం కలుగదు. కాని ఒక్క ప్రసన్నతాగుణంతోమాత్రమే కథ రక్తి కట్టదు. కథాకథనంలో అనేక చమత్కారవర్ణనలు, అవసరమైన వివరణలు సందర్భోచితాలుగా చోటుచేసికొనాలి. అప్పుడుగాని కథకు అర్థయుక్తి అమరదు; కథ గొప్పగా రక్తి కట్టదు. అప్పుడుగాని అది ఉపదేశం చక్కగా నిర్వహించదు. కాని పెక్కుమంది కథకులకు - ఈవర్ణనకు, వివరణకు సంబంధించిన అర్థయుక్తిమీదనే ప్రలోభం మెండు. అర్థయుక్తి ఏమాత్రం మితిమీరినా కథా ప్రసన్నత దెబ్బతినక మానదు. అందుచేత కథాకథనంలో - కథ చెప్పటానికి, చమత్కారంగా వర్ణించటానికి, వివిధ కథాంశాలను, ధర్మసూక్ష్మాలను వివరించటానికి చక్కని సమన్వయం, సరైన నిష్పత్తి ఉంటేగాని కథ ప్రసన్నంగా సాగజాలదు; రసమయమై రక్తి కట్టనేరదు; ఉపదేశయుతమై సార్థకం కాలేదు. నన్నయ ఉత్తమకథకుడు. ఆయన మహాభారతకావ్యం ప్రసన్నకథాకలితార్థయుక్తి విశిష్టం.

సీ. ఎందేని సర్వభూతేశుండు సృజియించె । సచరాచరములైన జగము లెల్ల,
గంగఁ బ్రత్యక్షంబు గావింప నెందేనిఁ । గృతవాసుఁ డయ్యె భగీరథుండు.
నలినసంభవ నరనారాయణస్థాణు । వాసవప్రభృతి గీర్వాణముఖ్యు
లెందేనిఁ గ్రతువు లనేకయుగంబులఁ । జేసిరి, రత్నవిచిత్ర వితత

ఆ. చైత్యములు మహా విశాల హిరణ్మయ । యూపతతులు నోలి నొప్పు చుండ,
నట్టి బిందుసరమునందున్న వివిధర । త్నోపకరణచయము లొనరఁ గొనియె. 9

ప్రతిపదార్థం: ఎందు+ఏనిన్= ఎక్కడైతే; సర్వ, భూత+ఈశుండు= అన్నిభూతాలకు (పృథివ్యాదిపంచభూతాలు, సమస్తప్రాణులు, ప్రమథగణాలు మొదలయినవాటికి) ప్రభువైన పరమేశ్వరుడు; స, చర+అచరములు+ఐన= కదలిక గలవి, కదలికలేనివి అయిన వస్తువులతో కూడిన; జగములు+ఎల్లన్= లోకాలనన్నింటిని; సృజియించెన్= పుట్టేటట్లు చేశాడో; ఎందు+ఏనిన్= ఎక్కడైతే; గంగన్= గంగను; ప్రత్యక్షము, కావింపన్=అగుపడేటట్లుచేయటానికి; భగీరథుండు= సగరుడి ముమ్మనుమడు; కృతవాసుఁడు+అయ్యెన్= ఏర్పరచుకొన్ననివాసం కలవాడయ్యాడో- అంటే నివాసం ఏర్పరచుకొన్నాడో!; ఎందు+ఏనిన్= ఎక్కడైతే; రత్న, విచిత్ర, వితత, చైత్యములు= రత్నాలచేత విచిత్రాలై- అంటే తమ రంగురంగుల కాంతులతో ఆశ్చర్యాన్నిగొలిపేవై, విశాలాలైనయజ్ఞశాలలు; మహా, విశాల, హిరణ్మయ, యూప, తతులున్= మిక్కిలి విశాలాలై, బంగారుతో చేయబడి, బలిపశువును, బంధించటానికి నాటబడిన స్తంభాల సమూహాలు; ఓలిన్= వరుసగా; ఒప్పుచున్+ఉండన్= ప్రకాశిస్తుండగా; నలిన సంభవ, నర, నారాయణ, స్థాణు, వాసవ, ప్రభృతి, గీర్వాణ, ముఖ్యులు= బ్రహ్మ, నరుడు, నారాయణుడు, శివుడు, ఇంద్రుడు మొదలైన ముఖ్యులైన దేవతలు; అనేక, యుగంబులన్= ఎన్నో యుగాల్లో; క్రతువులు= యజ్ఞాలు; చేసిరి; అట్టి= అలాంటి; బిందుసరము+అందు+ఉన్న= బిందుసరం అనే సరోవరంలో ఉన్న; వివిధ, రత్న+ఉపకరణ, చయములు= అనేకవిధాలైన రత్నాలతో కూడిన సాధనాల సమూహాలు; ఒనరన్= ఒప్పుగా- చక్కగా; కొనియెన్= తీసికొన్నాడు.

తాత్పర్యం: ఎక్కడ పరమేశ్వరుడు చరాచరాలైన సర్వలోకాలను సృజించాడో, ఎక్కడ భగీరథుడు గంగావతరణకు ప్రయత్నం చెయ్యా లని తనస్థానాన్ని ఏర్పరచుకొన్నాడో, ఎక్కడ రత్నకాంతులతో చిత్రవిచిత్రాలైన విశాల యజ్ఞశాలలు, బలిపశువుల్ని బంధించటానికి నాటిన సువిశాలసువర్ణస్తంభాలు ప్రకాశిస్తుండగా బ్రహ్మ, నర, నారాయణ, శివ,

దేవేంద్రాది దేవతాముఖ్యులంతా ఎన్నో యుగాలు యజ్ఞాలు చేశారో - అలాంటి బిందుసర సరోవరంలో ఉన్న వివిధరత్నసాధనసమూహా లన్నింటిని మయుడు గ్రహించాడు.

విశేషం: అలం: ఉదాత్తం. నన్నయ వడివడిగా కథ నడపటానికీ, దేనినైనా విపులంగా వర్ణించటానికీ సామాన్యంగా సీసాన్ని స్వీకరిస్తాడు. ఇది ఒక వర్ణనాత్మకసీసం. బిందుసరంయొక్క మనోహరవర్ణనం. నలినసంభవుడు - (నలినము అంటే కమలం) విష్ణుమూర్తి నాభికమలంనుండి పుట్టినవాడు - బ్రహ్మ, నరనారాయణులు - బదరీవనంలో చాలకాలం తపస్సుచేసిన ఋషులు, నరుడు అర్జునుడుగా, నారాయణుడు కృష్ణుడుగా అవతరించా రని పురాణగాథ, స్థాణువు - ప్రళయకాలంలో కూడ చలనంలేకుండ స్థిరంగా నిలచిఉండేవాడు - శివుడు. వాసవుడు - వసువులు (అంటే రత్నాలు) కలవాడు - ఇంద్రుడు.

క. దేవబ్రాహ్మణులకు నా । నావిధపూజనలఁ దర్పణము సేసి ధరి
త్రీవనిత కపూర్వశ్రీఁ । గావింపఁ దొడంగె మయుఁడు గడు రమ్యముగన్. 10

ప్రతిపదార్థం: మయుఁడు; దేవ, బ్రాహ్మణులకున్= దేవతలకు, బ్రాహ్మణులకు; నానావిధ, పూజనలన్= అనేక విధాలైన పూజలచేత; తర్పణము+చేసి= తృప్తి కావించి; ధరిత్రీ, వనితకున్= భూమిఅనేకాంతకు(భూదేవికి); అపూర్వ, శ్రీన్= మున్నెన్నడులేనిశోభను - సభారూపమైన అలంకారాన్ని; కడురమ్యముగన్= ఎంతో అందంగా; కావింపన్= రూపొందించటానికి; తొడంగెన్= పూనుకొన్నాడు.

తాత్పర్యం: మయుడు ముందుగా దేవతలను, బ్రాహ్మణులను పూజలతో తృప్తిపరచి, భూకాంతకు అందమైన అపూర్వాలంకారంగా సభా నిర్మాణానికి పూనుకొన్నాడు.

విశేషం: మహాకార్యారంభాలకు ముందు దేవబ్రాహ్మణపూజలు చెయ్యటం ఆర్షసంప్రదాయం.

క. విమల మణిమయము లగు దూ । లములం గంబముల గోడలను వేదులఁ గు
ట్టిమములఁ జుట్టిన ప్రాకా । రములను గర మొప్పుచుండ రచియించె సభన్. 11

ప్రతిపదార్థం: విమల, మణిమయములు+అగు= స్వచ్ఛమైన మణులతో కూడినవయిన; దూలములన్= దూలాలతో; కంబములన్= స్తంభాలతో; గోడలను= గోడలతో; వేదులన్= అరుగులతో; కుట్టిమములన్= రాతికట్టడపుప్రదేశాలతో; చుట్టిన, ప్రాకారములను= చుట్టును వ్యాపించిన ప్రహరిగోడలతో; కరము+ఒప్పుచు+ఉండన్= మిక్కిలిప్రకాశిస్తుండగా; సభన్; రచియించెన్= నిర్మించాడు.

తాత్పర్యం: నిర్మలమణిమయాలైన దూలాలతో, స్తంభాలతో, గోడలతో, అరుగులతో, రాతికట్టడపుప్రదేశాలతో, ప్రహరిగోడలతో ఎంతో అందమైన సభను మయుడు నిర్మించాడు.

విశేషం: పై పద్యంలో ద్వితీయావిభక్తి ప్రత్యయమైన 'ను', తృతీయావిభక్త్యర్థంలో ఉంది - ఒక విభక్తికి మరో విభక్తి.

వ. మఱియును. 12

తాత్పర్యం: అంతేకాక.

సీ. **సురుచిరహరినీలకిరణజలంబులఁ । బద్మరాగారుణపద్మములను**
రాజితరాజీవరాజహంసావళి । నిర్మలసౌవర్ణకూర్మములను
గమనీయవైదూర్యకుముదంబులను వజ్ర । మీనమౌక్తికనవఫేనములను
మరకతశైవలోత్కరముల విలసిల్లఁ । గొల నని సన్మణిస్థలము చూచి

ఆ. **పలుఁగురాలకుడ్యముల రుచుల్ గప్పిన । జలము లున్నయెడల వెలయఁ జూచి**
యననుపస్థలంబు లని జను లెఱుఁగక । యుండునట్లుగా మయుండు సేసె. **13**

ప్రతిపదార్థం: సు, రుచిర, హరినీల, కిరణ, జలంబులన్= మంచికాంతులు గల ఇంద్రనీలమణులయొక్క కిరణాలు అనే నీళ్ళతో; పద్మ, రాగ+అరుణ, పద్మములను= పద్మరాగమణులతో చేసిన ఎర్రనిపద్మాలతో; రాజిత, రాజీవ, రాజహంస+ఆవళిన్= (ఇక్కడ రాజత అనేపాఠం యుక్తం - అప్పుడు రజతసంబంధమైన - అంటే వెండితో చేసిన అని చెప్పవచ్చు) ప్రకాశించే తెల్లతామరలయొక్క, రాజహంసలయొక్క సమూహంతో; నిర్మల, సౌవర్ణ, కూర్మములను= మాలిన్యం లేని మేలిమిబంగారుతో చేసిన తాబేళ్ళతో; కమనీయ, వైదూర్య, కుముదంబులను= మనోహరాలైన వైదూర్యాలతో చేసిన కలువలతో; వజ్ర, మీన, మౌక్తిక, నవఫేనములను= వజ్రాలతో చేసిన చేపలతో, ముత్యాలతో రూపొందించిన క్రొత్తనురుగులతో; మరకత, శైవల+ ఉత్కరములన్= మరకతమణులతో కూర్చిన నాచుసమూహాలతో; విలసిల్లన్= ఒప్పుచుండిన; సత్+మణి, స్థలము, చూచి= మంచిమణులు పొదిగినప్రదేశాన్ని చూచి; కొలను, అని=కొలను అనుకొని, పలుఁగు, రాల, కుడ్యముల, రుచుల్= స్ఫటికపురాళ్ళగోడలయొక్క కాంతులు; కప్పిన= మీదికి వ్యాపించిన; జలములు+ఉన్న+ఎడలన్= నీళ్ళుండే ప్రదేశాలను; వెలయన్+చూచి= ప్రకాశిస్తుండగా చూచి; (ఇక్కడ 'పులుగురాల కుడ్యముల రుచుల్' అనే పాఠాంతరంగూడ ఉంది - పులుగురాలు అంటే గరుడపచ్చరాళ్ళు, గరుడపచ్చలకాంతులు ముదురు ఆకు పచ్చగా ఉంటాయి. అది నీళ్ళరంగుకు దగ్గరరంగు. నీళ్ళు లేని ప్రదేశ మని అనిపించాలి కాబట్టి 'పలుగురాలు' అనే పాఠమే ఉచితం); అననుప, స్థలంబులు+అని= నీరు లేని ప్రదేశా లని; (అనుపము= జలప్రాంత ప్రదేశం, న+అనుపము= నీరులేని ప్రదేశం); (ఇచ్చట 'అనుపమస్థలము' లని ఒక పాఠాంతరం ఉంది. 'అనుపమస్థలా' లంటే చక్కని, చదునైన స్థలాలని అర్థం. అందువల్ల ఇదికూడ పరిగణించదగినపాఠమే); జనులు+ఎఱుఁగక+ఉండు+అట్లుగాన్= జనులు తెలిసికొనలేకుండ ఉండేటట్లుగా; మయుండు; చేసెన్= సభను నిర్మించాడు.

తాత్పర్యం: ఇంద్రనీలమణుల కిరణా లనే నీళ్ళతో, పద్మరాగమణులతో చెక్కిన ఎర్రనిపద్మాలతో, వెండితో చేసిన తెల్లతామరలతో, రాజహంసలతో, మేలిమి బంగారుతో పోతపోసిన తాబేళ్ళతో, మనోహరవైదూర్యాలతో మలచిన కలువలతో, వజ్రాలతో చేసిన చేపలతో, ముత్యాలతో కల్పించిన కొంగ్రొత్తనురుగులతో, మరకతాలతో రూపొందించిన నాచులతో ప్రకాశించే మణిమయప్రదేశాలు చూచి అవి నీటిమడుగు లని - స్ఫటికపురాళ్ళగోడల కాంతులు కప్పటంచేత నీళ్ళుండే చోట్లను చూచి నీళ్ళులేనిచో ట్లనీ - జనులు భ్రమపడేటట్లుగా మయుడు సభను నిర్మించాడు.

విశేషం: అలం: ఉదాత్తం, భ్రాంతిమంతం. మయునిశిల్పచాతురి అనుపమానం. ఈ శిల్పచాతురియే దుర్యోధనుని భంగపాటుకు, పాండవులమీద అతనిగుండెలో అప్పటికే గూడుకట్టుకున్న అసూయాద్వేషాలు అంతకంత పెరగటానికి పరోక్ష కారణమైంది. అక్షర రమ్యమైన ఈ పద్యం మయసభా రమణీయత ప్రతిఫలించే మెరుగుటద్దం. నవరత్నాలు - ఇంద్రనీలం, పద్మరాగం, వైదూర్యం, వజ్రం, మౌక్తికం, గోమేధికం, మరకతం, పుష్యరాగం, ప్రవాళం.

వ. మఱియు సకలజన మనోహరంబు లైన నానావిధ యంత్రంబులును, ననవరత కుసుమఫలభరితంబు లైన తరువనంబులును, వికచ కమల కుముదాభిరామంబులైన జలాశయంబులును, వివిధ విచిత్ర పతాకావలంబిత తోరణ విటంకప్రదేశంబులును౦ గలిగి దశ కిష్కు సహస్ర ప్రమాణవృత్తాయతంబును. సహస్రకర ప్రభా ప్రసర విస్తార విభూతియును వివిధరత్న విభవాభిశోభితంబునుంగా నపూర్వ సభా భవనంబు నందుఁ బదునాలుగు నెలలు నిర్మించి, దాని నెనిమిది వేల రాక్షస కింకరుల మహాకాయుల మహాజవసత్త్వ సంపన్నుల నంతరిక్ష చరులం బనిచి మోపించికొని వచ్చిధర్మరాజున కిచ్చి, గదయును శంఖంబును భీమార్జునుల కిచ్చి, ధర్మరాజుచేత సత్కృతుండయి మయుం డరిగిన. 14

ప్రతిపదార్థం: మఱియున్, సకలజన, మనః+హరంబులు+ఐన= అందరుప్రజలమనస్సుల్ని దోచుకొనేవి అయిన; నానావిధ, యంత్రంబులును= అనేకవిధాలైన యంత్రవిశేషాలున్నూ; అనవరత, కుసుమ, ఫల, భరితంబులు+ఐన= ఎల్లప్పుడు పువ్వులతో, పండ్లతో నిండినవైన; తరువనంబులును= చెట్లతోపులున్నూ; వికచ, కమల, కుముద+అభిరామంబులు+ఐన= వికసించిన కమలాలతో, కలువలతో, మనోహరాలైన; జల+ఆశయంబులును= నీటి మడుగులున్నూ; వివిధ, విచిత్ర, పతాకా+అవలంబిత, తోరణ, విటంక, ప్రదేశంబులును= రకరకాల చిత్రవిచిత్రాలైన జెండాలతో వ్రేలాడగట్టిన తోరణాలతో కూడిన గువ్వల గూళ్ళున్న ప్రదేశాలున్నూ, కలిగి; దశ, కిష్కు, సహస్ర, ప్రమాణ. వృత్త+ఆయతంబును=పదిమూరలకు వెయ్యిరెట్లు - అంటే పదివేలమూరల కొలత ఉండే కైవారంచేత (చుట్టుకొలతచేత) విశాలమైనదియు; సహస్రకర, ప్రభా, ప్రసర, విస్తార, విభూతియును= వెయ్యి కిరణాలు గల సూర్యుని కాంతిప్రసారంచేత ఎక్కువైన వైభవంకలదియున్నూ; వివిధ, రత్న, విభవ+అభిశోభితంబునున్+కాన్= రకరకాలైన రత్నకాంతులతో మిక్కిలిశోభిల్లేది అయ్యేటట్లుగా; అపూర్వసభాభవనంబున్= ఇంతకుముం దెన్నడు లేనట్టి సభాభవనాన్ని; అందున్= అక్కడ - బిందుసరోవరందగ్గర; పదునాలుగు నెలలు; నిర్మించి; దానిన్= ఆ సభాభవనాన్ని; ఎనిమిదివేలరాక్షస, కింకరులన్= ఎనిమిదివేలమంది రాక్షసభటులను; మహాకాయులన్= పెద్దశరీరాలు కలవాళ్ళను; మహా, జవ, సత్త్వ, సంపన్నులన్= గొప్పవేగం, బలం అధికంగా కలవాళ్ళను; అంతరిక్షచరులన్= ఆకాశంలో తిరిగేవాళ్ళను; పనిచి= నియమించి; మోపించికొని; వచ్చి; ధర్మరాజునకున్; ఇచ్చి; గదయును; శంఖంబును; భీమ+అర్జునులకున్+ ఇచ్చి; ధర్మరాజుచేతన్; సత్, కృతుండు+అయి= సమ్మానించబడినవాడై; మయుండు; అరిగినన్= వెళ్ళగా.

తాత్పర్యం: అపురూపమైన ఆ సభాభవనంలో మయుడు మనోహరాలైన అనేక యంత్రాలు అమర్చాడు. ఎప్పుడూ పూలతో, పండ్లతో కనులపండువుగా కనిపించే చెట్లతోపులను రూపొందించాడు. పూచిన తామరలతో, విచ్చిన కలువలతో కళకళలాడే కొలనులు కల్పించాడు. చూడ ముచ్చటగా వ్రేలాడే రకరకాల పతాకాల తోరణాలతో కూడి గువ్వల గూళ్ళున్న ప్రదేశాలు ఏర్పాటుచేశాడు. పదివేల మూరల చుట్టుకొలతతో సువిశాలమై, సూర్యకిరణప్రసారంతో వైభవోపేతమై, వివిధరత్నకాంతులతో విశేషంగా శోభిల్లే ఆ సభాభవనాన్ని బిందుసరం దగ్గర పదునాలుగునెలలు పరిశ్రమించి నిర్మించాడు. పెద్దశరీరాలతో, అమితవేగంతో అత్యధికబలంతో ఆకాశాన సంచరించే ఎనిమిదివేలమంది రాక్షసభటులచేత ఆ భవనాన్ని మోయించి తెచ్చి ధర్మరాజుకు ఇచ్చాడు. భీమునికి గదను, అర్జునునికి శంఖాన్ని అందించాడు. ధర్మరాజుచేత సన్మానంపొంది వెళ్ళాడు.

విశేషం: ఈ వచనరచన నన్నయ అక్షరరమ్యతకు చక్కని ఉదాహరణ. ఏ ఉద్దేశంతో ఆ జగన్నాటక సూత్రధారి శ్రీకృష్ణుడు ఈసభను నిర్మించుమన్నాడో, ఏ ముహూర్తంలో మయుడు దీనిని నిర్మించి తెచ్చాడో కురుపాండవ వైరవృద్ధికి ఇది పెద్దగా దోహదం చేసింది. విశేష్యం తరువాత విశేషణాలు వాడే సంప్రదాయం సంస్కృతంలో ఉన్నది. ఆ సంప్రదాయంప్రకారమే

నన్నయ రాక్షస కింకరులు అనే విశేష్యం తరువాత వరుసగా మూడువిశేషణాలు ప్రయోగించటం జరిగింది. (తెలుగులో మయసభావర్ణన సందర్భాలకు నన్నయవర్ణనం మార్గదర్శకం. అంతేకాదు ఆంధ్రులకు ఎంతో ప్రీతిపాత్రమైన దుర్యోధనుడి ఏకపాత్రాభినయ మనే ఆంధ్రుల రూపకప్రక్రియలో వాచికాభినయానికి నన్నయరచనయే ప్రేరకం. -సంపా.).

ధర్మరాజు సభాప్రవేశము కావించుట (సం. 2-4-1)

ఉ. వీరుఁడు ధర్మజుండు పదివేవురు విప్రుల కొప్పఁ బాయసా
హారము భక్తిఁ బెట్టి మఱి యందఱకుం జెఱు వేయునేసి వి
స్తారయశుండు ధేనువుల ధర్మవిధిన్ మణి ముద్రికాద్యలం
కార దుకూల పుష్పఫల గంధయుతంబుగ నిచ్చి లీలతోన్. 15

ప్రతిపదార్థం: వీరుఁడు; విస్తార, యశుండు= విరివిగా వ్యాపించిన కీర్తి కలవాడు; (అయిన); ధర్మజుండు; పదివేవురు= పదివేలమంది; విప్రులకున్= బ్రాహ్మణులకు, ఒప్పన్= తగినట్లుగా; పాయస+ఆహారము= పాయసంతోకూడినభోజనం; భక్తిన్= భక్తితో; పెట్టి; మఱి= ఇంకా; అందఱకున్; చెఱు= ఒక్కొక్కరికి, ('చెఱి' అని శబ్దరత్నాకరం); వేయున్+ఏసి= వెయ్యివంతున; ధేనువులన్= ఆవులను; మణి, ముద్రికా+ఆది+అలంకార, దుకూల, పుష్ప, ఫల, గంధ, యుతంబుగన్= మణులు పొదిగిన ఉంగరాలు మొదలైన ఆభరణాలతో, సన్నని వస్త్రాలతో, పువ్వులతో, పండ్లతో, గంధంతోకూడ; ధర్మవిధిన్= ధర్మపద్ధతితో; లీలతోన్= వేడుకతో; ఇచ్చి= దానం చేసి.

తాత్పర్యం: వీరుడు, విశేషకీర్తిమంతుడు అయిన ధర్మరాజు పదివేలమంది బ్రాహ్మణులకు భక్తితో పాయసాన్నం పెట్టాడు. అంతేకాదు ఒక్కొక్కరికి వెయ్యిగోవులతోపాటు, మణిముద్రికాదులైన ఆభరణాలు, సన్ననివస్త్రాలు, పుష్పఫలగంధాలు వేడుకతో దానమిచ్చాడు.

విశేషం: ఈ పద్యం ధర్మజుని దానవీరం ప్రతిఫలించే దర్పణం.

వ. అనుజసహితుం డయి దైవజ్ఞదత్తశుభముహూర్తంబున ధౌమ్యాదిభూసురాశీర్వాదపుణ్యాహనాదంబు లెసంగ సభాప్రవేశంబు సేసి యంత. 16

ప్రతిపదార్థం: అనుజ, సహితుండు+అయి= తమ్ములతో కూడినవాడై; దైవజ్ఞ, దత్త, శుభ, ముహూర్తంబునన్= జ్యోతిశ్శాస్త్రనిపుణులచేత నిర్ణయించ (ఇవ్వ)బడిన శుభసమయాన; ధౌమ్య+ఆది, భూసుర+ఆశీర్వాద, పుణ్యాహనాదంబులు= ధౌమ్యుడు మొదలైన బ్రాహ్మణులయొక్క ఆశీర్వచన, పుణ్యాహవాచన ధ్వనులు; ఎసంగన్= అతిశయిల్లగా; సభా, ప్రవేశంబు= మయసభాప్రవేశాన్ని; చేసి; అంతన్.

తాత్పర్యం: ధర్మరాజు తమ్ములతో కూడి దైవజ్ఞులు నిర్ణయించిన శుభముహూర్తాన ధౌమ్యుడు మొదలైన బ్రాహ్మణుల ఆశీర్వచనపుణ్యాహవాచన మంత్రధ్వనులు మారుమ్రోగుతూ ఉండగా మయసభాప్రవేశం చేశాడు.

విశేషం: ధౌమ్యుడు - పాండవులపురోహితుడు. పుణ్యాహవాచనం - అశుద్ధిని నివారించటానికి, పవిత్రతను సిద్ధింపచేయటానికి, శుభాన్ని కలిగించటానికి పుణ్యాహశబ్దాన్ని మూడుమారులు చెప్పే శుభకర్మం.

ఉ. మంచిగ భూరి భూసుర సమాజమునెల్లను భక్తితోడఁ బూ
జించి, యభీష్టదానములు సేసి, ధనార్థులఁ దన్పి దిక్కులన్
నించె యశంబు; బంధులకు నెయ్యురకున్ హృదయప్రియంబు గా
వించె విభూతి యేర్పడఁ బవిత్రుఁడు ధర్మసుతుండు నెమ్మితోన్. 17

ప్రతిపదార్థం: పవిత్రుడు, పుణ్యాత్ముడు (అయిన); ధర్మసుతుండు= ధర్మరాజు; మంచిగన్= బాగుగా; భూరి, భూసుర, సమాజమున్+ఎల్లన్= గొప్పబ్రాహ్మణ సమాజాన్నంతా; భక్తితోడన్; పూజించి; అభీష్ట, దానములు= వాళ్ళకు ఇష్టమైనదానాలు; చేసి; ధన+అర్థులన్= ధనం కోరి వచ్చినవాళ్ళను; తనిపి= తృప్తిపొందించి, దిక్కులన్= అన్నిదిశలలోను; యశంబు= కీర్తిని; నించెన్= నింపాడు; విభూతి= ఐశ్వర్యం; ఏర్పడన్= ప్రకాశించే విధంగా; నెమ్మితోన్= ప్రేమతో; బంధులకున్= బంధువులకు; నెయ్యురకున్= స్నేహితులకు; హృదయ, ప్రియంబు= మనస్సుకు సంతోషాన్ని; కావించెన్= చేశాడు.

తాత్పర్యం: పుణ్యాత్ముడైన ధర్మరాజు ఎందరెందరో బ్రాహ్మణుల్ని భక్తితో పూజించాడు. కోరినవాళ్ళకు కోరినదానాలిచ్చి తృప్తిపరచాడు. తనకీర్తి అన్నిదిక్కుల వ్యాపింపజేశాడు. తనఐశ్వర్యం ప్రకాశించేటట్లు ప్రేమతో బంధు మిత్రులకు ఆనందం కలిగించాడు.

విశేషం: క్త్వార్థక, భూతార్థక క్రియాపదాలతో పద్యంలోని మూడు పాదాల మొదట ఉన్న విరుపులు- ధర్మరాజు ఎంత ఉత్సాహంగా, ఎంత వేగంగా ధార్మిక క్రియలు నిర్వహించాడో స్ఫురింపచేసేవిగా ఉన్నాయి. నన్నయ పద్యరచనా శిల్పానికి, ప్రత్యేకించి ఆయన అక్షరరమ్యతకు నిదర్శనాలుగా నిలుస్తున్నాయి.

వ. తదవసరంబున. 18

తాత్పర్యం: ఆ సమయాన.

మ. మదమాతంగ తురంగ కాంచన లసన్మాణిక్య గాణిక్య సం
పద లోలిం గొని వచ్చి యిచ్చి, ముదమొప్పం గాంచి, సేవించి, ర
య్యుదయాస్తాచల సేతుశీతనగ మధ్యోర్వీపతుల్ సంతతా
భ్యుదయున్ ధర్మజుఁ దత్సభాస్థితు జగత్పూర్ణ ప్రతాపోదయున్. 19

ప్రతిపదార్థం: ఆ+ఉదయ+అస్త+అచల, సేతు, శీతనగ, మధ్య+ఉర్వీపతుల్= సూర్యుడు ఉదయించే ఆ పర్వతానికి, అస్తమించే పర్వతానికి, సేతువుకు (దక్షిణపుచివర), హిమవత్పర్వతానికి (ఉత్తరపుచివర) నడుమ ఉండే రాజులందరు - అంటే నేల నాలుగుదిక్కుల్లో ఉన్న రాజులంతా; సంతత+అభ్యుదయున్= ఎడతెగక వృద్ధిపొందే సంపద కలవానిని, జగత్+పూర్ణ, ప్రతాప+ఉదయున్= ప్రపంచమంతా నిండిన పరాక్రమంయొక్క ఔన్నత్యం కలవానిని; తత్+సభా, స్థితున్= ఆ మయసభలో కొలువుదీరినవానిని; ధర్మజున్= ధర్మరాజును; మద, మాతంగ, తురంగ, కాంచన, లసత్+మాణిక్య, గాణిక్య, సంపదలు= మదపుటేనుగులు, గుర్రాలు, బంగారు, మెరిసే మాణిక్యాలు, వేశ్యాసమూహరూపమైనధనాలు; ఓలిన్= వరుసగా; కొనివచ్చి= తీసికొనివచ్చి; ఇచ్చి; ముదము+ఒప్పన్= సంతోషం శోభిల్లగా; కాంచి= చూచి; సేవించిరి= సేవించారు.

తాత్పర్యం: నేల నాలుగు దిక్కుల్లో ఉన్న రాజులంతా - ఎడతెగక వృద్ధిపొందే సంపద కలవాడు, లోకమంతటా నిండిన పరాక్రమంచేత ఔన్నత్యం వహించినవాడు అయిన ధర్మనందనుని సంతోషంతో దర్శించుకొన్నారు.

మదపుటేనుగుల్ని, గుర్రాల్ని, బంగారాన్ని, మాణిక్యాలను, వేశ్యల్ని ప్రియమార కానుకలుగా సమర్పించుకొని మనసార ఆ మహారాజును సేవించుకొన్నారు.

విశేషం: అలం: వృత్త్యనుప్రాసం. నన్నయ కవితాశైలికి ఈ పద్య మొక చక్కని ఉదాహరణ. కీర్తిప్రతాపాల వర్ణనకు మత్తేభాన్ని వాడటం వృత్తౌచిత్యానికి నిదర్శనం. నన్నయశైలి సంస్కృతపదబహుళం, సమాసఘటితం, సంధి బంధురం. అలా అని అది వినటానికి కటువైంది కాదు. విశేషించి విన సొంపైంది. మదపుటేనుగు నడకలా ఉదాత్త మనోహరమైంది. అందుచేతనే ఎఱ్ఱాప్రెగ్గడ 'నన్నయభట్టకుంజరం బెన్న నిరంకుశోక్తిగతి' అని అన్నాడు. నన్నయ పేర్కొన్న అక్షరరమ్యతకూడ ఇదే. అక్షరాల కూర్పువలన కవితకు కలిగే రమ్యతయే అక్షరరమ్యత. వాఙ్మయంలో అక్షరం విశ్వంలో పరమాణువు లాంటిది. పరమాణువుల కూర్పులోని మార్పు వల్లనే వస్తువైవిధ్యం, పదార్థస్వరూప స్వభావాల్లో తారతమ్యం, అలాగే అక్షరాల కూర్పులోని మార్పు వల్లనే వివిధ పదాలు, అర్థాలు, శైలీభేదాలు ఏర్పడతాయి. పదంలోని శబ్దభాగం ఆపాతమధురం; అర్థభాగం ఆలోచనామృతం. ఆపాతమధురమైన శబ్దసంయోజనమే అక్షరరమ్యత. సామాన్యులచేత ఏ రచననైనా చదివించే మొదటిగుణం ఇదే, శ్రోతను ఆకర్షించే ప్రధానగుణంకూడ ఇదే. అక్షరరమ్యమైన రచన పూర్తిగా అర్థం కాకపోయినా అందలిభావంమాత్రం స్థూలంగా మనస్సుకు స్ఫురిస్తుంది. దీనినే ఆంగ్ల సాహిత్య విమర్శకులు 'Sound echoing the sense' అంటారు. నన్నయ కవితలో ఈగుణం మెండు. సామాన్య పాఠకునికి పై పద్య ప్రతిపదార్థం తెలియకున్నా - ఎందరెందరో రాజులు, ఎన్నెన్నో గొప్ప వస్తువులు, ఎంతో ఎక్కువగా ధర్మరాజుకు ఇస్తున్నా రని మాత్రం సూటిగా స్ఫురించకమానదు. ఆయన వైభవం అత్యధిక మని ధ్వనించక తప్పదు. ఈ పద్యంలోని అక్షరాల కూర్పు, సమాసఘటన అలాంటివి. 'ముదమొప్పన్' అనే విశేషణంకూడ ఇక్కడ గమనింపదగిందే. రాజులంతా ఆ కానుకలు తెచ్చి ఇవ్వటంలో ఏవిధమైన బలాత్కారం లేదు, భయం లేదు. అందరూ ఆ ధర్మరాజు ఆధిక్యాన్ని, ఆధిపత్యాన్ని మనఃపూర్వకంగా అంగీకరించి ఆనందంగా తెచ్చి యిస్తున్నారన్న విషయాన్ని ఆ విశేషణం తెలుపుతున్నది. మూలంలో ఎవరెవరు ఏ యే కానుకలు తెచ్చి యిచ్చారో ఎంతో విస్తృతంగా ఉంది. నన్నయ ఆ విస్తృతి నంతా 'అయ్యుదయాస్తాచల...' అన్న ఒక్క సమాసంతో చక్కగా సూచించాడు. (ఇది ఒక గొప్పసంఘటన. రాజులంతా కానుకలన్నీ కుప్పలు పోస్తున్నారు. కలిసి ధర్మరాజును సేవిస్తున్నారు. సేవించేరాజులు ఎవరైనా, ఎందరైనా అందరూ సేవాభావంలో మాత్రం అంతా ఒకటేకదా!. ఈ అర్థసంఘటనను శ్లేష అనే గుణంలో వ్యక్తం చేశాడు నన్నయ. బహుపదాల ఏకవద్భావం శబ్దశ్లేష, మనోహరమైన సన్నివేశసౌందర్యం అర్థశ్లేష, ఆ రెండుగుణాలు కల శ్లేషను వీరరసపోషకమైన ఓజోగుణరంజితంగా పద్యరచనలో ప్రపంచించటం నన్నయశిల్పం. ఓజస్సులో ఒదిగిన శ్లేష నన్నయకు ప్రీతిపాత్రమైన రచనాకళ!- సంపా.)

వ. మఱియును 20

తాత్పర్యం: అంతేకాక.

సీ. సుబల మార్కండేయ శునక మౌం జాయన । మాండవ్య శాండిల్య మందపాల
బక దాల్భ్య రైభ్యక భాలుకి జతుకర్ణ । గౌతమ కౌశిక కణ్వ కుత్స
సావర్ణి పర్ణాద సత్య గోపతి గోప । వేష మైత్రేయ పవిత్రపాణి
ఘటజాను కాత్రేయ కఠకలాప సుమిత్ర । హారీత తిత్తిరి యాజ్ఞవల్క్య.

ఆ. వాయుభక్ష భార్గవ వ్యాస జైమిని । శుక సుమంతు పైల సువ్రతాదు
లయిన మునులు నేము నరిగితి మెంతయు । రమ్యమయిన ధర్మరాజుసభకు. 21

ప్రతిపదార్థం: ఎంతయున్= మిక్కిలి; రమ్యము+అయిన= అందమైన; ధర్మరాజు, సభకున్; సుబల, మార్కండేయ, శునక, మౌంజాయన, మాండవ్య... సువ్రత+ఆదులు+ఐన= సుబలుడు, మార్కండేయుడు, శునకుడు, మౌంజాయనుడు, మాండవ్యుడు, సువ్రతుడు-మొదలయిన; మునులున్; ఏమున్= మేముకూడ; (అంటే ఉగ్రశ్రవసుడు ఆయన అనుచరులు); అరిగితిమి= వెళ్ళాము.

తాత్పర్యం: సుబల మార్కండేయ శునక మౌంజాయన మాండవ్య సువ్రతాది మహామునులు, మేము ఎంతో అందమైన ఆ ధర్మరాజుసభకు వెళ్ళా మని ఉగ్రశ్రవసుడు ఆ శౌనకాదిమహర్షులకు చెప్పాడు.

విశేషం: మునులపేర్ల విషయంలో భిన్నప్రతుల్లో భేదా లున్నాయి. మునులపేర్లను పట్టీగా చెప్పే ఈ సీసపద్యరచన ఉత్తమకవితగా చెప్పలేము కాని, ఉత్తమకథనశిల్ప మని చెప్పవచ్చును. ఈ పేర్లు వచనంలో చెప్పితే నీరసంగా ఉండేది. ఉగ్రశ్రవసుడు కథకుడు. ఆతడుకూడా అంతమంది మునులతో కలిసి వెళ్ళాడు. అందువలన అతని ఆత్మీయత ఇందులో ఉన్నది. తనతోపాటు ఎందరో మహర్షులను ఆకర్షించిన ఆ సభావైభవాన్ని చెప్పదలచుకొన్నాడు. మహర్షులవరుస వస్తుధ్వనిగా మారింది. ద్రష్టలైన ఋషులు దర్శించా లని కోరుకొన్న ధర్మరాజుసభ పరమపూజ్య మని ధ్వని. పేర్లనుకూడా కథార్థప్రయోజనంకొరకు ఒకవరుసగా చెపితే అది ఉక్తివైచిత్ర్య మౌతుంది. బహుపదాలు ఏకవద్భావం పొంది శ్లేషమనే శబ్దగుణం రాణించింది. పద్యం దీర్ఘసమాసభూయిష్ఠమైనా గాఢబంధత్వంకంటె మసృణత్వం రాణించింది. శ్లేషగుణం ఓజస్సులో ఒదిగిన రచన ఇది. ఇటువంటి రచనను తరువాతి కవు లాయాసందర్భాలలో సార్థకంగా వాడుకొన్నారు. (సంపా.)

వ. అమ్మహామునుల నెల్ల నతిభక్తిం బూజించి లబ్ధాశీర్వచనుండై ధర్మతనయుండు వారలవలన ధర్మకథలు
వినుచుఁ దమ్ములుం దానును సుఖంబుండునంత నొక్కనాఁడు. 22

ప్రతిపదార్థం: ఆ+మహామునులన్+ఎల్లన్= ఆ మహామునుల నందరిని; అతిభక్తిన్= మిక్కిలిభక్తితో; పూజించి; లబ్ధ+ ఆశీర్వచనుండు+ఐ= పొందబడిన ఆశీర్వచనం కలవాడై; ధర్మతనయుండు; వారలవలనన్= ఆ మహర్షులవలన; ధర్మకథలు= ధర్మసంబంధాలైన కథలు; వినుచున్; తమ్ములున్; తానును; సుఖంబు+ఉండు+అంతన్= సుఖంగా ఉండగా; ఒక్కనాఁడు= ఒక్క రోజు.

తాత్పర్యం: ధర్మరాజు ఆ మహాముని లందరిని అతిభక్తితో పూజించాడు. వాళ్ళ ఆశీర్వచనాలు పొందాడు. ఆ మహర్షులు చెప్పే ధర్మకథలు వింటూ తమ్ముళ్లతో కలిసి తాను సుఖంగా ఉండగా- ఒకనాడు

విశేషం: సుఖము+ఉండు-ప్రథమావిభక్తికి తృతీయార్థ ప్రయోగం - సుఖంతో ఉండు. ధర్మజుడు మహర్షులను ఎప్పుడు కలిసినా వాళ్ళవల్ల ధర్మకథలు, పుణ్యకథలు వినటం ధర్మరాజుస్వభావం. ఆ మహారాజుజ్ఞానతృష్ణ అపారం.

నారదుఁడు పాండవులయొద్దకు వచ్చుట (సం. 2-5-2)

ఉ. నీరజమిత్త్రుఁ డేల ధరణీగతుఁ డయ్యెడు నొక్కొ యంచు వి
స్మేర మనస్కులై జనులు మెచ్చి నిజద్యుతి చూచుచుండఁగా
నారదుఁ డేఁగుదెంచె గగనంబుననుండి సురేంద్రమందిర
స్ఫారవిలాసహాసి యగు పార్థగృహంబునకుం బ్రియంబునన్. 23

ప్రతిపదార్థం: నీరజమిత్త్రుఁడు= నీటిలోపుట్టిన పద్మాలకు స్నేహితుడైన సూర్యుడు; ఏల= ఎందుచేత; ధరణీగతుఁడు+అయ్యెడున్+ ఒక్కో= నేలకు దిగివస్తున్నాడో; అంచున్= అంటూ; విస్మేర, మనస్కులు+ఐ= ఆశ్చర్యంతోకూడుకొన్నమనస్సుకలవారై; మెచ్చి; నిజద్యుతిన్= తనయొక్కకాంతిని; చూచుచున్+ఉండఁగాన్: నారదుఁడు; గగనంబుననుండి= ఆకాశంనుండి; సుర+ఇంద్ర, మందిర, స్ఫార, విలాస, హాసి= దేవతలరాజైన దేవేంద్రునిభవనంయొక్క విస్తారమైన శోభను ఎగతాళి చేసేది; అగు; పార్థ, గృహంబునకున్= పృథ(కుంతీదేవి) పుత్రుడైన ధర్మరాజు ఇంటికి (పార్థనామంతో ప్రసిద్ధుడు అర్జునుడే అయినా-ఇక్కడ- నారదుడు పృథ పుత్రుడైన ధర్మరాజు ఇంటికి వచ్చా డనటమే ఎక్కువ ఉచిత మనిపిస్తుంది. యజమాని ధర్మరాజుకదా); ప్రియంబునన్= ప్రీతితో; ఏఁగుదెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: సూర్యు డేల నేలకు దిగి వస్తున్నాడో! అని తన దేహకాంతిని చూచి జనులంతా ఆశ్చర్యపడుతుండగా- నారదమహర్షి, ఆకాశంనుండి - దేవేంద్రుని గృహాశోభనే గేలిచేసే ధర్మరాజు గృహానికి ఎంతో ప్రీతితో వచ్చాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. బ్రహ్మమానసపుత్రుడైన ఆ నారదమహర్షి తేజస్సు ఎంత ఎక్కువో ఈ ఉత్ప్రేక్షతో నన్నయ భావుకులకు ప్రత్యక్షం చేశాడు. "నారదః సుమహాతేజాః..." అనే సంస్కృతాని కిది పెంపు. అక్షరరమ్యమైన ఈ పద్యగుణం మాధుర్యం.

క. తన పిఱుఁద ధర్మ సంబో । ధన వాంఛను వచ్చు దేవతా ఖచర మహా
మునివరులఁ దపనమార్గం । బునఁ గ్రమ్మఱఁ బంచె బ్రహ్మపుత్త్రుఁడు నెమ్మిన్. 24

ప్రతిపదార్థం: బ్రహ్మపుత్త్రుఁడు= బ్రహ్మదేవునికుమారుడైన నారదుడు; తన, పిఱుఁదన్= తన వెనుక; ధర్మ సంబోధనవాంఛను= ధర్మబోధను వినాలనే కోరికతో; వచ్చు; దేవతా, ఖచర, మహామునివరులన్= దేవతలను, ఆకాశసంచారులను, మహాముని శ్రేష్ఠులను; తపనమార్గంబునన్= ఆకాశమార్గంలోనే; నెమ్మిన్= ప్రేమతో; క్రమ్మఱన్+పంచెన్= త్రిప్పిపంపాడు.

తాత్పర్యం: బ్రహ్మపుత్రుడైన నారదుడు, తన ధర్మబోధ వినా లని వెంటవస్తున్న దేవతల్ని, ఆకాశసంచారుల్ని, మహామునిశ్రేష్ఠుల్ని - ఆకాశమార్గానే త్రిప్పిపంపాడు.

వ. పర్వతపారిజాతరైవత సుముఖు లను మహామునులతో నిట్లు వచ్చిన నారదమహామునికిం బ్రత్యుద్గతుండయి ధర్మరాజు దమ్ములుం దానును నమస్కరించి తోడ్కొని తెచ్చి యున్నతాసనంబున నునిచి యడుగులు గడిగి, యర్ఘ్యపాద్యాదివిధులం బూజించిన, వారల కుశలం బడిగి నారదుఁడు రాజనీతి విషయంబుల నయ్యుధిష్ఠిరు ని ట్లని యడిగె. 25

ప్రతిపదార్థం: పర్వత, పారిజాత, రైవత, సుముఖులు+అను మహామునులతోన్= ఈ మహామునులు నలువురితోమాత్రమే కలిసి; ఇట్లు= ఈవిధంగా; దివినుండి= ఆకాశంనుండి; భువికిన్= భూమికి; దిగివచ్చిన; నారదమహామునికిన్; ప్రతి+ ఉద్గతుండు+ఐ= లేచి ఎదురేగినవాడై; ధర్మరాజు; తమ్ములన్; తానును; నమస్కరించి; తోడ్కొని, తెచ్చి= ఆహ్వానించి వెంటతీసికొని వచ్చి; ఉన్నత+ఆసనంబునన్= ఎత్తయినపీఠంమీద; ఉనిచి= కూర్చుండబెట్టి; అడుగులు= పాదాలు; కడిగి; అర్ఘ్య, పాద్య+ఆది, విధులన్= పూజకు తగినపూలు, అక్షతలు మొదలైనవాటిని సమర్పించటం, పాదాలమీద నీటిని చల్లి ఆ నీటిని శిరస్సుపై చల్లుకోవటం మొదలైన పూజా పద్ధతులతో; పూజించినన్= పూజించగా; వారల= ఆ పాండవులయొక్క; కుశలంబు= క్షేమవిశేషాలు; అడిగి; రాజనీతి, విషయంబులన్= రాజనీతి విశేషాలగురించి; ఆ+యుధిష్ఠిరున్= ఆ ధర్మరాజును, ఇట్లు+అని; అడిగెన్.

తాత్పర్యం: పర్వత పారిజాత రైవత సుముఖు లనేమహర్షులతో కలిసి వచ్చిన నారదమహామునికి ధర్మరాజు తమ్ములతో కూడ ఎదురేగి నమస్కరించాడు. ఆహ్వానించి వెంటగొని వచ్చి ఉన్నతాసనంమీద కూర్చుండబెట్టాడు. అర్ఘ్యపాద్యాది పూజావిధానాలతో పూజించాడు. నారద మహర్షి పాండవు లందరిని కుశల మడిగాడు. ప్రత్యేకించి ధర్మరాజుతో రాజనీతి విషయాలు ప్రస్తావించాడు.

నారదుఁడు ధర్మరాజును రాజనీతివిషయంబులం గొన్నింటి నడుగుట (సం. 2-5-7)

సీ. **మీ వంశమున నరదేవోత్తములదైన । సద్ధర్మమార్గంబు సలుపుదయ్య?**
ధర్మవిదుండవై ధర్మార్థకామంబు । లొండొంటి బాధింపకుండ నుచిత
కాల విభక్తముల్ గా లీల సేవింతె? । ధర్మువునంద చిత్తంబు నిలిపి
యిమ్ముల నపరరాత్రమ్ములం దెప్పుడుఁ । జింతింతె నిజబుద్ధిఁ జేయఁదగిన

ఆ. **రాజకృత్యములఁ? దిరంబుగా నిఖిల ని । యోగ వృత్తులందు యోగ్యులయిన**
వారిఁ గరము గారవమ్మునఁ బంచితె । నీవు వారిదైన నే ర్పెఱింగి. **26**

ప్రతిపదార్థం: మీ, వంశమునన్; నరదేవ+ఉత్తముల+అది+ఐన= రాజశ్రేష్ఠులదైన; సత్+ధర్మ, మార్గంబు= మంచిధర్మపద్ధతిని; సలుపుదు+అయ్య= ఆచరిస్తున్నావుకదా!; ధర్మవిదుండవు+ఐ= ధర్మంతెలిసినవాడివై; ధర్మ+అర్థ+కామంబులు= ధర్మం, అర్థం, కామం అనే మూడుపురుషార్థాలు; ఒండు+ఒంటి= ఒకదాన్ని ఒకటి; బాధింపక+ఉండన్= బాధించకుండా; ఉచితకాలవిభక్తముల్= ఆయాకాలాలకు తగినట్లు విభజించబడినవి; కాన్=కాగా; లీల= సంతోషంగా; సేవింతె (సేవింతువు+ఎ)= సేవిస్తున్నావుకదా!; ధర్మువు+అందు+అ= ధర్మమందే; చిత్తంబు= మనస్సును; నిలిపి; ఇమ్ములన్= ప్రీతిగా; ఎప్పుడున్= ఎల్లప్పుడు; అపర, రాత్రమ్ముల+అందున్= రాత్రి ఉత్తరభాగంలో- అంటే అర్ధరాత్రి తరువాత; నిజ, బుద్ధిన్= స్వబుద్ధిచేత; చేయన్+తగిన; రాజకృత్యములన్= రాజకార్యాలను; చింతింతె (చింతింతువు+ఎ)= ఆలోచిస్తున్నావుకదా! తిరంబుగాన్= స్థిరంగా; నిఖిల, నియోగ, వృత్తుల+అందున్= అన్ని ప్రభుత్వ ఉద్యోగాల్లో; యోగ్యులు+ఐన= తగిన; వారిన్= వాళ్ళను; వారిది+ఐన; నేర్పు+ఎఱింగి= సామర్థ్యాన్ని తెలిసికొని; కరము= మిక్కిలి; గారవమ్మునన్= గౌరవభావంతో; నీవు; పంచితే (పంచితివి+ఏ)= నియమించావుకదా!

తాత్పర్యం: మీవంశంలో జన్మించిన రాజశ్రేష్ఠులు ఏర్పరచిన ధర్మపద్ధతిని తప్పక ఆచరిస్తున్నావుకదా! ధర్మాన్ని తెలుసుకొని, ధర్మార్థకామాలు ఒకదాని నొకటి బాధించకుండ, కాలోచితాలుగా వాటిని విభజించుకొని సేవిస్తున్నావుకదా! ధర్మమందే మనస్సు నిలిపి, చేయదగిన రాజకార్యాల్ని స్వబుద్ధితో ఎల్లప్పుడూ అర్ధరాత్రి దాటిన తరువాతే ఆలోచిస్తున్నావుకదా! ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరంగా యోగ్యులైన వాళ్ళను, వాళ్ళ వాళ్ళ శక్తి సామర్థ్యాల్ని గుర్తించి గౌరవభావంగా, స్థిరంగా నియమించావుకదా!

విశేషం: పురుషార్థాలు ధర్మార్థకామమోక్షాలు. వీటిలో అర్థకామాలు ఐహిక సంబంధులు. మోక్షం పరలోక సంబంధి. అర్థకామాలు ఐహిక సంబంధులే అయినా, మానవుని ఐహిక జీవితమంతా ఈ అర్థకామాల చుట్టే తిరుగుతూ ఉన్నా అవి ధర్మబద్ధాలయితేనేకాని మోక్షసాధనకు తోడ్పడవు. ధర్మానికి దూరమయితే అవి పాపహేతువులౌతాయి. నరకానికి త్రోవతీస్తాయి. అందుకే పురుషార్థాల్లో అర్థకామాలకు ముందు ధర్మాన్ని చెప్పటం జరిగింది. మానవుడు తన ఐహిక జీవితంనుండి మోక్షాన్ని అధిరోహించటానికి మంచి నిచ్చెన ధర్మం. 'ధర్మావిరుద్ధో భూతేషు కామోఽస్మి భరతర్షభ' ('అర్జునా! ప్రాణుల్లో ధర్మవిరుద్ధం కాని కామాన్ని నేనే') అనే గీతావాక్యంకూడ ఇచ్చట గుర్తించదగింది. "చువర్ణంబుతోడి దుగ్దకారం తకారం" అవుతుంది కనుక, సేవించుదువు,

చింతించుదువు- సేవింతువు, చింతింతువు - అవుతాయి. భూతతద్ధర్మార్థ క్రియల్లో వకారం లోపించవచ్చు కనుక సేవింతువు+ఎ= సేవింతె, చింతింతువు+ఎ= చింతింతె, పంచితివి+ఎ= పంచితె - అయ్యాయి.

క. అనఘుల శాస్త్ర విధిజ్ఞుల । ననురక్తులఁ బితృపితామహక్రమమున వ
చ్చిన విపుల మంత్రులఁగా । నొనరించితె కార్య సంప్రయోగము పొంటెన్. 27

ప్రతిపదార్థం: అనఘులన్= పాపాత్ములు కానివాళ్ళను; శాస్త్రవిధిజ్ఞులన్= శాస్త్రనియమాలు తెలిసినవాళ్ళను; అనురక్తులన్= (నీమీద) ప్రేమకల వాళ్ళను; పితృపితామహక్రమమునన్= తండ్రితాతలనుండి వంశపారంపర్యంగా; వచ్చిన= కొలువుచేస్తున్న; విపులన్= బ్రాహ్మణులను; కార్య, సంప్రయోగముపొంటెన్= రాజకార్యనిర్వహణంకొరకు; మంత్రులన్+కాన్= మంత్రులనుగా; ఒనరించితె= చేశావుకదా!

తాత్పర్యం: పుణ్యాత్ములు, శాస్త్రనియమాలు బాగా తెలిసినవాళ్ళు, నీమీద ప్రేమగలవాళ్ళు, తాతతండ్రులనాటి నుండి వంశపారంపర్యంగా కొలువుచేస్తున్న వాళ్ళు అయిన బ్రాహ్మణోత్తముల్ని రాజకార్యనిర్వహణకు మంత్రులుగా ఏర్పరచుకొన్నావుకదా!

విశేషం: పొంటెన్ - అనేది 'కొఱకు' అనే అర్థంలో చతుర్థీవిభక్తి ప్రత్యయంగా నన్నయకాలంలో ఉంది. ఇప్పు డది వ్యవహారంలో లోపించింది. అరవంలో దీనికి సమానార్థకం 'పొరుట్టు'. విద్యావంతులైన బ్రాహ్మణులు విప్రులని చెప్పే అభియుక్తోక్తి ఒకటి ఉంది- "జన్మనా బ్రాహ్మణో జ్ఞేయః, సంస్కారా ద్విజ ఉచ్యతే । విద్యయా యాతి విప్రత్వం, త్రిభిః శ్రోత్రియ ఉచ్యతే'. జన్మవల్ల బ్రాహ్మణుడు, సంస్కారంవల్ల ద్విజుడు, విద్యవల్ల విప్రుడు, ఈ మూడూ ఉంటే శ్రోత్రియుడు అంటారు.

క. రాజునకు విజయమూలము । రాజితమంత్రంబు; సుస్థిరంబుగ దానిన్
రాజాన్వయ! రక్షింతె ధ । రాజనులకుఁ గర్ణగోచరము గాకుండన్. 28

ప్రతిపదార్థం: రాజ+అన్వయ!= చంద్రవంశానికి చెందిన ఓ ధర్మరాజా!; రాజునకున్; విజయమూలము= విజయానికి కారణం; రాజిత, మంత్రంబు= చక్కనిరహస్యాలోచనమే; ధరా, జనులకున్= రాజ్యంలోని ప్రజలకు; కర్ణ, గోచరము, కాకుండన్= చెవిని పడకుండ; దానిన్= ఆ రహస్యాలోచనాన్ని; సుస్థిరంబుగన్= పదిలంగా; రక్షింతె= రక్షిస్తున్నావుకదా!

తాత్పర్యం: ఓధర్మరాజా! రాజుకు విజయకారణం అతడి రహస్యాలోచనం. ఆ రహస్యాలోచనం నీ ప్రజల చెవిని పడకుండ పదిలంగా రక్షించుకుంటున్నావుకదా!

విశేషం: అలం: వృత్త్యనుప్రాసం.

క. ధీరుఁడు ధర్మాధర్మ వి । శారదుఁడు బహుశ్రుతుండు సమచిత్తుఁడు వా
ణీ రమణీ శ్రిత వదన స । రోరుహుఁ డనఁ జనునె నీ పురోహితుఁ డధిపా! 29

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; నీ, పురోహితుఁడు; ధీరుఁడు= ధైర్యశాలియు (విద్వాంసుడు); ధర్మ+అధర్మ, విశారదుఁడు= ధర్మాధర్మాల్ని గూర్చి బాగా ఎరిగినవాడు; బహుశ్రుతుండు= అనేక వేదశాస్త్రా లెరిగినవాడు; సమచిత్తుఁడు= రాగద్వేషాలులేకుండ సమత్వాన్ని సాధించిన మనస్సు కలవాడు; వాణీ, రమణీ, శ్రిత, వదన, సరోరుహుఁడు= సరస్వతీదేవిచేత ఆశ్రయించబడిన ముఖపద్మం కలవాడు; అనన్+చనునె= అని అనదగినవాడే కదా!

తాత్పర్యం: ఓ ధర్మరాజా! నీ పురోహితుడు ధైర్యవంతుడు (పండితుడు), ధర్మాధర్మాలు తెలిసినవాడు, వివిధవేదశాస్త్రాలు బాగా అధ్యయనం చేసినవాడు, రాగద్వేషరహితమైన సమచిత్తం కలవాడు, సరస్వతీదేవి కొలువున్న ముఖపద్మం కలవాడు - అని అనదగినవాడే కదా!

విశేషం: పురోహితు డంటే శాంతికపౌష్టికాదివైదికకర్మల్లో ముందుండేవాడు. ధర్మాధర్మాలు తెలిపి శాస్త్రోక్తంగా వివిధ కర్మలు నడిపించేవాడు. మొగమోటమి లేకుండ ధర్మాధర్మాలు తెలియచెప్పటానికి, హితం ఉపదేశించటానికి, పురోహితునికి ధైర్యం కూడా ఉండాలి. ధైర్యం ఉన్నా-అందుకు తగిన వేదశాస్త్రపాండిత్యం, దాని సంస్కారరూపమైన రాగద్వేషరహిత సమచిత్తం లేకుంటే అతడు మంచిచెడ్డల్ని సరిగా నిర్ణయించలేడు, హితం ఉపదేశించ లేడు, నిస్స్వార్థంగా వ్యవహరించలేడు. ధైర్యం, పాండిత్యం, సమచిత్తం ఉన్నా- వాక్శుద్ధి, వాక్నైపుణ్యం లేకుంటే అవి అన్నీ వ్యర్థమే - అతనివాక్కు ఎదుటి హృదయాన్ని వశంచేసుకోలేదు. అందుచేత అతడు వాగ్దేవిని-సరస్వతిని-వశంచేసుకొన్న వ్యక్తిగా ఉండాలి. రజస్తమోగుణప్రధానమైనప్రభువ్యవస్థకు, ప్రాచీనకాలంలో పురోహితవ్యవస్థ సత్త్వశుద్ధిని కూర్చి ధర్మపాలనకు, ప్రభుక్షేమానికి, ప్రజాక్షేమానికి విశేషంగా దోహదం చేసింది. పై పద్యంలో పేర్కొన్నవన్నీ ఉత్తమపురోహిత లక్షణాలు.

క. జనవర! నీ యజ్ఞములం । దనవరతనియుక్తుఁ డయిన యాజ్ఞికుఁడు ప్రయో
గ నిపుణుఁడై యేమఱకుం । డునె నిజకృత్యముల నెప్పుడును సమబుద్ధిన్. 30

ప్రతిపదార్థం: జనవర!= ఓరాజా!; నీ యజ్ఞముల+అందున్; అనవరత, నియుక్తుఁడు+అయిన= ఎల్లప్పుడు నియమించబడినవాడైన; యాజ్ఞికుఁడు= యజ్ఞం చేయించే బ్రాహ్మణుడు; ప్రయోగ, నిపుణుఁడు+ఐ= యజ్ఞంచేయించటంలో నేర్పుకలవాడై; ఎప్పుడును= ఎల్లప్పుడు; సమబుద్ధిన్= రాగద్వేషరహితమైన సమత్వ బుద్ధితో; నిజకృత్యములన్= తాను చెయ్యదగినపనుల్లో; ఏమఱక+ఉండునె= విస్మరించకుండా ఉన్నాడు కదా!

తాత్పర్యం: ఓ ధర్మరాజా! నీవు యజ్ఞాలలో నియమించిన యాజ్ఞికుడు యజ్ఞం చేయించటంలో నిపుణుడై, రాగద్వేషరహితమైన సమబుద్ధితో తనకర్తవ్యాలను విస్మరించకుండా ఉన్నాడుకదా!

విశేషం: ఏయజ్ఞమైనా సక్రమంగా జరగకుంటే సత్ఫలితాలకు బదులు దుష్ఫలితాలు కలిగే ప్రమాదం ఉంది. అందువల్ల యాజ్ఞికుడు ప్రయోగనిపుణుడు, కర్తవ్యపరాయణుడు కావటం ఎంతో ముఖ్యం.

క. నానావిధరణవిజయమ । హానిపుణు లవార్యవీర్యు లనఁదగువారిన్
సేనాధ్యక్షులఁ జేసితె । నీ నమ్మినవారి మాననీయుల హితులన్. 31

ప్రతిపదార్థం: నానావిధ, రణ, విజయ, మహానిపుణులు= వివిధ యుద్ధాల్లో గెలుపు సాధించడంలో గొప్ప నేర్పరులైనవాళ్ళు; అవార్య, వీర్యులు= ఎదిరించ సాధ్యం కాని పరాక్రమం కలవాళ్ళు; అనన్= అని అనటానికి; తగువారిన్= తగినటువంటివాళ్ళను; నీ, నమ్మిన, వారిన్= నీకు నమ్మకం కలవాళ్ళను; మాననీయులన్= గౌరవింపదగినవాళ్ళను; హితులన్= నీమేలు కోరేవాళ్ళను; సేనా+అధ్యక్షులన్= సైన్యానికి అధ్యక్షులుగా; చేసితె= చేశావుకదా!

తాత్పర్యం: పలు విధాలైన యుద్ధాల్లో విజయాన్ని సాధించటంలో నిపుణులైన వాళ్ళను, ఎదిరించ సాధ్యంకాని పరాక్రమం కలవాళ్ళను, విశ్వాసపాత్రులైనవాళ్ళను, గౌరవానికి అర్హులైన వాళ్ళను, నీమేలు కోరే వాళ్ళను, సైన్యాధ్యక్షులుగా నియమించావుకదా!

విశేషం: రాజ్యవ్యవస్థలో సైన్యాధ్యక్షపదవి చాలా ముఖ్యమైంది. సైన్యాధ్యక్షుడే ప్రధాన దేశరక్షకుడు. అందుచేత అతడు సమర్థుడుగా ఉండాలి. అంతేకాదు, అతడు ప్రభువుకు ఎంతో విశ్వాసపాత్రుడై ఉండాలి. ఇవి మాత్రమే అతనికి చాలవు. అతనికి గౌరవార్హమైన వ్యక్తిత్వం కూడ ఉండాలి. అన్నింటిని మించి అతడు ప్రభువు మేలు కోరేవాడుగా ఉండాలి. లేకుంటే అతనివల్ల ప్రభువుకే ప్రమాదం.

చ. కడుఁ జనువాఁడునై పురుషకారియు దక్షుఁడు నైన మంత్రి పెం
పడరఁగ రాజపుత్త్రుల మహాధనవంతులఁ జేసి వారితో
నొడఁబడి పక్ష మేర్పడఁగ నుండఁడుగా, ధన మెట్టి వారికిం
గడుకొని చేయకుండునె జగన్నుత! గర్వము దుర్విమోహమున్. 32

ప్రతిపదార్థం: జగత్+నుత!= లోకంచేత కీర్తింపబడే ఓధర్మరాజా!; కడున్= మిక్కిలి; చనువాఁడును+ఐ= పలుకుబడికలవాడై; పురుషకారియున్= కృషిచేసేవాడూ! దక్షుఁడును+ఐన= సమర్థుడును అయిన; మంత్రి; పెంపు+అడరఁగన్= అతిశయంమీర; రాజపుత్త్రులన్; మహాధనవంతులన్= గొప్ప సంపన్నులను; చేసి= కావించి; వారితోన్; ఒడఁబడి= చేతులు కలిపి; పక్షము+ ఏర్పడఁగన్= వ్యతిరేకవర్గం ఏర్పడేటట్లుగా; ఉండఁడుగా= ఉండటంలేదుకదా!; ధనము; ఎట్టివారికిన్= ఎటువంటి వాళ్ళకైనా; కడుకొని= పూని; గర్వమున్= గర్వాన్ని; దుర్‌విమోహమున్= చెడ్డదైన మితిమీరినకాంక్షను; చేయక+ఉండునె= కలిగించకుండా ఉంటుందా!

తాత్పర్యం: ఎక్కువ పలుకుబడి కలిగి, క్రియాశీలి, సమర్థుడు అయిన మంత్రి-తన పరిధిమీరి, ఇతర రాజపుత్రుల్ని మహాధనవంతులుగా చేసి, వాళ్ళతో చేతులు కలిపి, నీకు వ్యతిరేకవర్గంగా ఏర్పడేటట్లుగా ఉండటం లేదుకదా! ధర్మరాజా! ధనం ఎటువంటివాళ్ళకైనా దురాశనూ, గర్వాన్నీ కలిగిస్తుంది.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. అధికారపక్షంలో ఉంటూ అన్ని ప్రయోజనాలూ పొంది, అధికంగా బలపడి, దురాశాదురహంకారాలు పెంచుకొని, అన్యులతో చేతులు కలిపి, అధికార పక్షాన్ని బలహీనపరిచే వ్యతిరేకవర్గాన్ని సృష్టించే వెన్నుపోటుదారులందరూ ఈ కోవకు చెందే మంత్రులే. కలియుగరాజకీయాల్లో వీళ్ళ సంఖ్య గణనీయంగా పెరగటం గమనార్హం. అలాంటివాళ్ళను ఓకంట కనిపెట్టటం మంచిదని ఆనాడే నారదుడు హెచ్చరించాడు.

క. క్షితినాథ! శాస్త్రదృష్టి। ప్రతిభను దివ్యాంతరిక్ష భౌమోత్పాత
ప్రతికారులగుచు సన్మా। నితులయి వర్తింతురయ్య నీదైవజ్ఞుల్. 33

ప్రతిపదార్థం: క్షితి, నాథ!= భూమికి అధిపతి అయినవాడా! - ఓధర్మరాజా!; నీ, దైవజ్ఞుల్= నీయొక్క జ్యోతిశ్శాస్త్ర పండితులు; శాస్త్రదృష్టి= శాస్త్రాలు చదవటంవల్ల కలిగిన పాండిత్యంచేత; ప్రతిభను= తమ బుద్ధిబలంచేత; దివ్య+అంతరిక్ష, భౌమ+ఉత్పాత, ప్రతీకారులు+అగుచున్= దేవతా సంబంధాలు, ఆకాశ సంబంధాలు, భూసంబంధాలు అయిన అనర్థాలకు విరుగుడుక్రియలు చేసేవాళ్ళయి; సన్మానితులు+అయి= నీచే తగిన సమ్మానాలను పొంది; వర్తింతురు+అయ్య= నడుచుకుంటున్నారుకదా!

తాత్పర్యం: ఓ ధర్మరాజా! నీ ఆస్థానజ్యోతిష్కులు శాస్త్రపాండిత్యంచేత, స్వీయప్రతిభచేత దేవతా సంబంధాలు, అంతరిక్ష సంబంధాలు, భూ సంబంధాలు అయిన ఉత్పాతాలను కనిపెట్టి వాటికి విరుగుడుగా శాంతి క్రియాదులు నీచేత జరిపించి, సన్మానాలు పొందుతున్నారు కదా!

విశేషం: ఉత్పాతాలు అంటే అపశకునాలు, హఠాత్తుగా వచ్చే అనర్థాలు. ఇవి దివ్యాలు, అంతరిక్షాలు, భౌమాలు అని మూడు విధాలు. దివ్యాలంటే - అపూర్వ గ్రహనక్షత్రాదులు పుట్టటం, అంతరిక్షాలంటే- పరివేషాలు ఏర్పడటం, పిడుగులు పడటం మొదలైనవి. భౌమాలంటే-అపూర్వ చరాచర వస్తువులు పుట్టటం, ఉప్పెనలు, భూకంపాలు మొదలైనవి రావటం. ఇవి ప్రజలకు దుఃఖాన్ని, రోగాన్ని కలిగిస్తాయి. అంతరిక్ష భూవాతావరణపరిశోధకులైన పండితుల సాయంతో సాధ్యమైనంత ముందుగా వీటిరాకను కనిపెట్టి ప్రతిక్రియలు జరిపించటం ప్రభుధర్మం.

క. అనిశము సేవింతురె ని । న్ననఘా! యష్టాంగమైన యాయుర్వేదం
బున దక్షులైన వైద్యులు । ఘనముగ ననురక్తులై జగద్ధితబుద్ధిన్. 34

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడవైన ఓధర్మరాజా!; నిన్నున్; అనిశము= ఎల్లప్పుడు; అష్ట+అంగము+ఐన= ఎనిమిదిభాగాలతో కూడుకొన్నదైన; ఆయుః+వేదంబునన్= ఆయుర్వేదంలో; దక్షులు+ఐన= సమర్థులైన; వైద్యులు; జగత్+హిత, బుద్ధిన్= లోకానికి మేలు చేయాలనే తలంపుతో; ఘనముగన్= ఎక్కువగా; అనురక్తులు+ఐ= ప్రేమగలవారై; సేవింతురె (సేవించుదురె)= సేవిస్తున్నారుకదా!

తాత్పర్యం: ఓ పుణ్యాత్మా! ఆయుర్వేదంలో సమర్థులైన వైద్యులు లోకానికి మేలుచేసేబుద్ధితో ప్రజలమీది ప్రేమతో ఎనిమిది శాఖలుగా వ్యాపించిన ఆ వైద్య విధానంలో సేవలు చేస్తున్నారా?

విశేషం: ఆయుర్వేదం-ఆయువును వృద్ధి చేసే మార్గాలను చెప్పేవేదం-భారతీయ వైద్యశాస్త్రం. నాలుగు ఉపవేదాలలో ఆయుర్వేదం ఒకటి. బ్రహ్మ, అశ్వినీదేవతలు, ధన్వంతరి మొదలయిన వాళ్ళు దీని కర్తలు. దీని అష్టాంగాలు - శల్యం, శాలాక్యం, కాయచికిత్స, భూతవిద్య, కౌమారభృత్యం, అగదతంత్రం, రసాయన తంత్రం, వాజీకరణ తంత్రం. 'జగద్ధితబుద్ధిన్' అని నారదమహర్షి వైద్యుల విషయంలో ప్రయోగించిన విశేషణం విశేషించి గుర్తించదగింది. బాధా పీడితుడై ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగికి చికిత్సచేసి అతని బాధ తొలగించి, ప్రాణం నిలిపే వైద్యుణ్ణి భారతదేశం విష్ణుస్వరూపునిగా భావించింది. 'వైద్యో నారాయణో హరిః' అని ప్రవచించింది. విష్ణు స్వరూపుడైన వైద్యునికి ఉండవలసిన బుద్ధి జగద్ధితబుద్ధి-స్వార్థబుద్ధి కాదు. స్వార్థబుద్ధి ప్రబలిన వైద్యుడు సమాజం పాలిటి దేవుడు కాడు- దానవుడు.

క. సారమతిఁజేసి మానస । శారీర రుజావళులకు సతతంబుఁ బ్రతీ
కారములు సేయుచుండుదె । యారఁగ వృద్ధోపసేవ నౌషధసేవన్. 35

ప్రతిపదార్థం: సారమతిన్+చేసి= నిపుణమైన బుద్ధితో - అంటే చక్కగా ఆలోచించి; మానస, శారీర, రుజా+ఆవళులకున్= మనస్సంబంధమైన, శరీరసంబంధమైన వ్యాధుల సమూహాలకు; సతతంబున్= ఎల్లప్పుడు; ఆరఁగన్= ఒప్పగా; వృద్ధ+ఉపసేవన్= వృద్ధులను సేవించటంచేత; ఔషధసేవన్= మందులను సేవించటంచేత, ప్రతీకారములు= విరుగుడుక్రియలు - అంటే చికిత్సలు; చేయుచున్+ఉండుదె= చేస్తున్నావు కదా!

తాత్పర్యం: చక్కగా ఆలోచించి పెద్దల సేవతో మనోవ్యాధులకు, ఔషధసేవతో శారీరకవ్యాధులకు చికిత్స చేసుకొంటున్నావు కదా!

విశేషం: అలం: క్రమాలంకారం. మనోవ్యాధికి మందు లేదంటారు. కాని వృద్ధసేవ మనోవ్యాధికి మంచిమందు. వృద్ధుల జీవితానుభవం, శాస్త్రవిజ్ఞానం మనోవ్యాధులకు మేలైన చికిత్స చేస్తాయి.

క. ఉపధాశుద్ధులఁ బాప । వ్యపగతబుద్ధుల వినీతివర్తుల సములన్
సుపరీక్ష నియోగించితె । నిపుణుల నర్థార్జనాదినృపకార్యములన్. 36

ప్రతిపదార్థం: ఉపధా, శుద్ధులన్= ధర్మపరీక్షలచేత పరిశుద్ధులైనవాళ్ళను; సుపరీక్షన్= లెస్సగా పరీక్షించుటచేత; పాపవ్యపగతబుద్ధులన్= పాపరహితమైన చిత్తవృత్తి కలవాళ్ళను; వినీతి వర్తులన్= విశేషంగా నీతిమార్గంలో ప్రవర్తించేవారిని (వినయవంతులను); సములన్= రాగద్వేషరహితులై అందరిపట్ల సమబుద్ధితో వ్యవహరించేవాళ్ళను; నిపుణులన్= నేర్పరులైనవారిని; అర్థ+ఆర్జన+ఆది, నృపకార్యములన్= డబ్బును వసూలుచేయటం మొదలయిన రాచకార్యాలలో; నియోగించితె= నియమించావుకదా!

తాత్పర్యం: పన్నులు వసూలు చేయటం వంటి ధనార్జన రూపమైన రాచకార్యాలలో ధర్మపరీక్షలచే పరిశుద్ధులైన వాళ్ళని, పాపరహితమైన చిత్తవృత్తి కలవాళ్ళని, విశేషంగా నీతిమార్గంలో నడుచుకొనేవాళ్ళని, రాగద్వేషరహితమైన సమబుద్ధితో వ్యవహరించేవాళ్ళని, నైపుణ్యం కలవాళ్ళని చక్కగా పరీక్షించి నియమించావుకదా!

విశేషం: పన్నులు వసూలు చెయ్యటంలాంటి ధనార్జనరూపమైన రాచకార్యాల్లో, అవినీతిపరులు, పక్షపాతబుద్ధికలవాళ్ళు, నియుక్తులైతే- ప్రభుత్వకోశానికి నష్టం వాటిల్లటమే కాక, ప్రభుత్వంమీద ప్రజలకు ద్వేషభావం పెరుగుతుంది. అందువల్ల అలాంటి ఉద్యోగ నియామకాల్లో ప్రభువు ప్రత్యేకశ్రద్ధ వహించాలి.

ఉ. ఉత్తమ మధ్యమాధమ నియోగ్యత బుద్ధి నెఱింగి వారి న
య్యుత్తమ మధ్యమాధమ నియోగములన్ నియమించితే నరేం
ద్రోత్తమ! భృత్యకోటికి ననూనముగాఁ దగు జీవితంబు లా
యత్తము సేసి యిత్తె దయ నయ్యయికాలము దప్పకుండఁగన్. 37

ప్రతిపదార్థం: నరేంద్ర+ఉత్తమ!= ఓరాజశ్రేష్ఠ!; ఉత్తమ, మధ్యమ+అధమ, నియోగ్యత= ఉత్తమ మధ్యమ అధమ స్థానాలలో నియమించదగిన వ్యక్తుల యోగ్యతలను; బుద్ధిన్+ఎఱింగి= గ్రహించి; వారిన్; ఆ+ఉత్తమ, మధ్యమ+అధమ, నియోగములన్= ఆ ఉత్తమ మధ్యమ అధమములైన ఉద్యోగాల్లో; నియమించితి(వి)+ఏ= నియమించావుకదా!; భృత్యకోటికిన్= సేవకులసమూహానికి; అనూనముగాన్= కొరతలేకుండా; తగు, జీవితంబులు= తగిన జీతాలను; దయన్= దయతో; ఆ+అయి, కాలము, తప్పక+ ఉండఁగన్= ఆయా సమయం దాటకుండ; ఆయత్తము, చేసి= సిద్ధంచేసి; ఇత్తె (ఇచ్చుదువు+ఎ)= ఇస్తున్నావుకదా!

తాత్పర్యం: ఓ ధర్మరాజా! వ్యక్తుల ఉత్తమ మధ్యమాధమ యోగ్యతలను తెలుసుకొని వాళ్ళను ఉత్తమ మధ్యమాధమ ఉద్యోగాల్లో నియమించావుకదా! సేవకు లందరికి, కొరతలేకుండా తగుజీతాలు దయతోసకాలంలో అందజేస్తున్నావుకదా!

విశేషం: ద్వ్యక్షరప్రాసతో వృత్తం అలంకృతమై ప్రతిపాద్యవస్తువును ఆస్వాదయోగ్యం చేస్తున్నది. సమత అనే గుణం పద్యనిర్మాణంలోనూ రచనలోనూ కనపడుతున్నది. మొదటి మూడు చరణాలు చివరిఅక్షరం ముందు విరిగి పైపాదంలో కొనసాగటం నిర్మాణంలోని సమత. మార్గాభేదం, అవైషమ్యం ఉండటంచేత సమతాగుణం స్ఫురించి, సేవకుల నందరినీ సమంగా చూస్తున్న రాజుయొక్క చిత్తవృత్తిని వ్యంజింపచేస్తున్నది. (సంపా.)

క. తమ తమ కనియెడు తఱి జీ । తము గానక నవయు భటుల దౌర్గత్య విషా
దము లేలినవాని కవ । శ్యము నెగ్గొనరించు నతఁడు శక్రుం డైనన్. 38

ప్రతిపదార్థం: తమ తమ, కనియెడు, తఱిన్= తాము తాము పొందవలసిన సమయాన; జీతము, కానక= జీతంపొందక; నవయు= శుష్కించే, (బక్కచిక్కే); భటుల, దౌర్గత్య, విషాదములు= సేవకులయొక్కదారిద్ర్య దుఃఖాలు; ఏలిన, వానికిన్= రాజుకు; అతఁడు; శక్రుండు+ఐనన్= దేవేంద్రుడైనా; అవశ్యమున్= తప్పక; ఎగ్గు+ఒనరించున్= కీడు కలిగిస్తాయి.

తాత్పర్యం: తాము పొందవలసిన సమయంలో జీతాన్ని పొందక శుష్కించే సేవకుల దారిద్ర్యదుఃఖాలు ప్రభువుకు- అతడు దేవేంద్రుడైనా సరే - తప్పక కీడు కలిగిస్తాయి.

విశేషం: సేవకులదుఃఖం ప్రభువుకు క్షేమకరం కాదు. తమ తమకు+అనియెడు. అని కొందరు విడదీస్తారు.

క. కులపుత్త్రులైన సద్భృ । త్యులకును సత్కార మర్థితోఁ జేయుదె? వా
రలు నీప్రస్తవమున ని । మ్ములఁ గృతము దలంచి ప్రాణములు విడుతు రనిన్. 39

ప్రతిపదార్థం: కులపుత్త్రులు+ఐన= వంశపారంపర్యంగా వచ్చే (ఇచట 'కులభృత్యులైన' అనే పాఠం పెక్కు ప్రతులలో ఉంది); సత్+కారము= సమ్మానం; అర్థితోన్= ప్రీతితో; చేయుదె= చేస్తున్నావుకదా; వారలు; నీ ప్రస్తవమునన్= నీ విషయంలో, (అంటే నీ పనికోసం); ఇమ్ములన్= ఇంపుగ; కృతము= నీవు చేసిన ఉపకారం; తలంచి= తలచుకొని; అనిన్= యుద్ధంలో; ప్రాణములు; విడుతురు.

తాత్పర్యం: వంశపారంపర్యంగా వచ్చే మంచి సేవకులకు ప్రీతితో సమ్మానం చేస్తున్నావుకదా! వారు మనసార నీ ఉపకారాన్ని స్మరించి యుద్ధభూమిలో నీకై ప్రాణాలు వదలుతారు.

క. అనఘా! నీ ప్రస్తవమున । నని నీల్గినవీరభటుల యనుపోష్యుల నె
ల్లను బ్రోతె భోజనాచ్ఛా । దనముల వారలకు నెమ్మి దఱుఁగక యుండన్. 40

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడవైన ఓధర్మరాజా!; నీ, ప్రస్తవమునన్= నీవిషయంలో; అనిన్= యుద్ధంలో; ఈల్గిన= మరణించిన; వీరభటుల, అనుపోష్యులన్+ఎల్లన్= వీరులైన భటులను అనుసరించి పోషించదగిన వాళ్ళందరిని, అంటే వారిపోషణపై ఆధారపడి జీవించే భార్యాపుత్త్రులు, తల్లిదండ్రులు మొదలయిన వాళ్ళందరిని; భోజన+ఆచ్ఛాదనములన్= కూడుగుడ్డలతో; వారలకున్; నెమ్మి= సంతోషం; తఱుఁగక+ఉండన్= తగ్గకుండా; ప్రోతె (ప్రోచుదువు+ఎ)= పోషిస్తున్నావుకదా!

తాత్పర్యం: పుణ్యాత్ముడవైన ఓ ధర్మరాజా! నీకొరకు యుద్ధంలో మరణించిన వీరసైనికుల కుటుంబాలకు కూడుగుడ్డలు లోటు లేకుండా ఇచ్చి, వాళ్ళ సంతోషం తగ్గకుండా పోషిస్తున్నావు కదా!

విశేషం: కుటుంబపు పింఛనుపథకం (**Family pension**) భారతకాలంలోనే ఉన్నదన్నమాట.

క. ధనలుబ్ధుల మ్రుచ్చులఁ గూ । ర్పని వారలఁ బగఱవలని వారల ధృతి చా
లని వారల దుర్జనులం । బనుపవుగా రాజకార్యభారము దాల్పన్. 41

ప్రతిపదార్థం: ధన, లుబ్ధులన్= ధనంపట్ల లోభబుద్ధికలవాళ్ళను; మ్రుచ్చులన్= దొంగల్ని; కూర్పనివారలన్= స్నేహానికి యోగ్యులు కానివాళ్ళను; పగఱవలనివారలన్= శత్రువులపట్ల పక్షపాతం కలవాళ్ళను; ధృతి, చాలని, వారలన్= ధైర్యం చాలని

వాళ్ళను; దుర్జనులన్= దుర్మార్గులైన వాళ్ళను; రాజ, కార్యభారము, తాల్పన్= రాచకార్యం యొక్క భారాన్ని వహించటానికి; పనుపవుగా= పంపటంలేదుకదా!

తాత్పర్యం: ఓధర్మరాజా! ధనంపట్ల లోభబుద్ధి కలవాళ్ళని, దొంగల్ని, స్నేహానికి యోగ్యులు కానివాళ్ళని, శత్రువులపట్ల పక్షపాతం కలవాళ్ళని, ధైర్యం చాలనివాళ్ళని, దుర్మార్గులైనవాళ్ళని రాజకార్యాలు నిర్వహించటానికి పంపటం లేదు కదా!

క. చోరభయవర్జితముగా । ధారుణిఁ బాలింతె, యధికధనలోభమునం
జోరుల రక్షింపరుగా । వారలచే ధనముగొని భవద్భృత్యవరుల్. 42

ప్రతిపదార్థం: చోర, భయ, వర్జితముగాన్= దొంగలవల్ల భయం లేకుండా; ధారుణిన్= భూమిని; పాలింతె (పాలించుదువు+ఎ)= పాలిస్తున్నావుకదా!; భవత్+భృత్యవరుల్= నీయొక్క సేవకుల్లో ముఖ్యులు; అధిక, ధన, లోభమునన్= ధనంమీది మితిమీరిన కోరికతో; వారలచేన్= ఆదొంగలచేత; ధనము, కొని= డబ్బుతీసుకొని; చోరులన్= ఆ దొంగలను; రక్షింపరుగా= రక్షించటంలేదుకదా!

తాత్పర్యం: ధర్మరాజా! దొంగభయం లేకుండా నీవు రాజ్యాన్ని ఏలుతున్నావుకదా! నీ ప్రభుత్వోద్యోగుల్లో ముఖ్యులైనవాళ్ళు ధనాశాపరులై ఆ దొంగలదగ్గర డబ్బు పుచ్చుకొని వాళ్ళకు రక్షణ కల్పించటం లేదు కదా!

విశేషం: కాలం గడిచేకొలదీ, నాగరకత పెరిగేకొలదీ దొంగల సంఖ్య, దొంగల్లో రకాల సంఖ్య, విపరీతంగా పెరుగుతున్నది. ఈ కలికాలంలో-నవనాగరక యుగంలో - వ్యక్తుల జేబుల్ని, ఇండ్లను, బ్యాంకుల్ని, బస్సుల్ని, రైళ్ళని దోచుకొనే వాళ్ళు మాత్రమే కాదు, 'స్మగ్లింగ్' చేసేవాళ్ళు, 'బ్లాక్‌మార్కెట్' చేసేవాళ్ళు పెక్కు విధాల పన్నులు ఎగవేసేవాళ్ళు, అనేక కారణాలు చెప్పి చందాలు వసూలుచేసి దిగమ్రింగేవాళ్ళు-వీళ్ళంతా రకరకాల దొంగలే. ప్రభుత్వంలో ఉన్నతపదవుల్లో ఉన్న ఉద్యోగులు లంచగొండులైతే ఇలాంటి దొంగల్ని పట్టటం, పట్టి వాళ్ళని శిక్షించటం సక్రమంగా జరుగదు. ఫలితం-ప్రభుత్వ కోశానికి నష్టం, ప్రజలకు బాధ, ప్రభుత్వానికి చెడ్డపేరు. అందుచేత లంచగొండులైన ప్రభుత్వోద్యోగుల పట్ల ప్రభువు ఏవిధంగా అప్రమత్తుడై ఉండాలో నారదమహర్షి సూచించాడు. (సంపా.)

క. ధరణీనాథ! భవద్భుజ । పరిపాలితయైన వసుధఁ బరిపూర్ణములై
కర మొప్పుచున్నె చెఱువులు । ధరణి కవగ్రహభయంబు దనుకక యుండన్. 43

ప్రతిపదార్థం: ధరణీ, నాథ!= భూపతీ - ఓ ధర్మరాజా!; భవత్+భుజ, పరిపాలిత+ఐన= నీభుజబలంచేత పరిపాలించబడినదైన; వసుధన్= భూమిలో (రాజ్యంలో); చెఱువులు; పరిపూర్ణములు+ఐ= నిండినవై; ధరణికిన్= భూమికి; అనుగ్రహభయము= వానలేమివల్ల భీతి; తనుకక+ఉండన్= కలుగకుండ; కరము= మిక్కిలి; ఒప్పుచున్+ఉండున్+ఎ= ఒప్పుతున్నాయి కదా!(బాగున్నాయి కదా).

తాత్పర్యం: ఓ ధర్మరాజా! భుజబలంతో నీవు పరిపాలిస్తున్న ఈ భూమిలో అనావృష్టి భయంలేకుండా చెరువులు నిండి కనులపండువుగా ఉన్నాయి కదా!

క. హీనులగు కర్షకులకును । భూనుత! ధాన్యంబు బీజములు, వణిజులకున్
మానుగ శతైకవృద్ధి న । నూనముగా ఋణము లిత్తె యుత్తమబుద్ధిన్. 44

ప్రతిపదార్థం: భూనుత!= లోకంచేత కొనియాడబడే ఓ ధర్మరాజా!; ఉత్తమబుద్ధిన్= గొప్పబుద్ధితో-ఉదారబుద్ధితో; హీనులు+అగు= పేదలైన కర్షకులకును; ధాన్యంబు, బీజములు= ధాన్యపు విత్తనాలు; వణిజులకున్= వర్తకులకు; మానుగన్= ఒప్పుగా, తగురీతిగా; శత+ఏక, వృద్ధిన్= నూటికి ఒక వడ్డీవంతున(1%); అనూనముగాన్= కొరతలేకుండ; ఋణముల్= అప్పులు; ఇత్తె(ఇచ్చుదువు+ఎ)= ఇస్తున్నావు కదా!

తాత్పర్యం: ఓ ధర్మరాజా! ఉదారబుద్ధితో పేద రైతులకు ధాన్యపు విత్తనాలూ, వర్తకులకు నూటికి ఒక రూపాయి వడ్డీ వంతున అప్పులు ఇస్తున్నావుకదా!

విశేషం: ఏ ప్రభువైనా వ్యవసాయాన్ని, వ్యాపారాన్ని ప్రోత్సహించాలి. సమాజశ్రేయస్సుకు అవి చాల అవసరం. నారదమహర్షి మాటల్నిబట్టి మహాభారతకాలంలోనే అధికాహారోత్పత్తికి విత్తనాలు, అధికాభివృద్ధికి తక్కువ వడ్డీతో ఋణాలు ప్రభువులు ఇస్తున్నట్లు తెలుస్తున్నది.

క. పంగుల మూకాంధుల వికలాంగులను నబాంధవుల దయం బ్రోతె? భయా
ర్తుం గడిఁది శత్రునైనను । సంగరరంగమునఁ గాతె శరణం బనినన్. 45

ప్రతిపదార్థం: పంగులన్= కుంటివాళ్ళను; మూక+అంధులన్= మూగవాళ్ళను, గ్రుడ్డివాళ్ళను; వికల+అంగులన్= అంగవిహీనులైనవాళ్ళను; అబాంధవులన్= బంధువులు లేనివాళ్ళను-అంటే దిక్కులేనివాళ్ళను; దయన్= దయతో; ప్రోతె(ప్రోచుదువు+ఎ)= పోషిస్తున్నావుకదా!; సంగరరంగమునన్+ యుద్ధభూమిలో; శరణంబు+అనినన్= శరణుఅనిఅంటే; కడిఁది, శత్రున్+ఐనను= పెద్దశత్రువునైనా; భయ+ఆర్తున్= భయంతో దుఃఖించేవాణ్ణి; కాతె(కాచుదువు+ఎ)= కాపాడుతున్నావుకదా!

తాత్పర్యం: కుంటివాళ్ళను, మూగవాళ్ళను, గ్రుడ్డివాళ్ళను, అంగవిహీనులైన వాళ్ళను, బంధువులు లేనివాళ్ళను దయతో పోషిస్తున్నావుకదా! భయంతో దుఃఖిస్తూ శరణువేడిన పెద్దశత్రువునైనా యుద్ధభూమిలో కాపాడుతున్నావుకదా!

విశేషం: దయార్ద్రత ప్రభువుకు ఉండవలసిన ఒక ప్రధానగుణం. వికలాంగులకు, అనాథులకు ప్రభుత్వం చేయూత ఇవ్వటం మహాభారతకాలంలోనే ఉంది.

క. కృత మెఱిఁగి కర్త నుత్తమ । మతుల సభల సంస్తుతించి మఱవక తగు స
త్కృతి సేయుదె? కృత మెఱిఁగెడు । పతియె జగజ్జనుల నెల్లఁ బరిపాలించున్. 46

ప్రతిపదార్థం: కృతము+ఎఱిఁగి= చేసినమేలును గుర్తించి; కర్తన్= ఆ మేలు చేసిన వ్యక్తిని; ఉత్తమ, మతులన్, సభలన్= గొప్పబుద్ధిమంతు లున్న సభల్లో; సంస్తుతించి= ప్రశంసించి; మఱవక= మరచిపోకుండ; తగు, సత్+కృతి= తగిన సమ్మానం; చేయుదె(చేయుదువు+ఎ)= చేస్తావుకదా!; కృతము+ఎఱిఁగెడు= చేసిన మేలును గుర్తించగల; పతియె= ప్రభువే; జగత్+జనులన్+ ఎల్లన్= లోకప్రజలనందరిని; పరిపాలించున్= (చక్కగా) పరిపాలించగలడు.

తాత్పర్యం: చేసినమేలు గుర్తించి, ఆ మేలు చేసినవ్యక్తిని పదిమంది పెద్దలున్న సభల్లో ఉచితరీతిని సత్కరిస్తున్నావుకదా! చేసినమేలు గుర్తించగల ప్రభువే ప్రపంచప్రజల నందరిని చక్కగా పరిపాలించగలడు.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. కృతజ్ఞత ఒక గొప్ప గుణం. అది మానవతాలక్షణం. మంచిని గుర్తించి పదిమందిముందు ప్రశంసించటంకంటె మంచిని పెంచటానికి మేలైన మార్గం మరొకటి లేదు.

సీ. **ఆయంబునందు నాలవ భాగమొండె. మూఁ । డవ భాగమొండె, నం దర్ధమొండె**
గాని మిక్కిలి సేయఁగాదు వ్యయం బని । యవధరించితె బుద్ధి నవనినాథ!
యాయుధాగారధనాధ్యక్ష్యములయందు । వరవాజివారణావళులయందు
బండారములయందుఁ బరమవిశ్వాసుల । భక్తుల దక్షులఁ బంచితయ్య?

ఆ. **గురుల వృద్ధశిల్పివరవణి గ్బాంధవ । జనుల నాశ్రితులను సాధుజనులఁ**
గరుణఁ బేదఱికము వొరయకుండఁగఁ బ్రోతె । సకలజనులు నిన్ను సంస్తుతింప. 47

ప్రతిపదార్థం: అవనినాథ!= భూమికి ప్రభువైన-ఓధర్మరాజా!; ఆయంబు+అందున్= ఆదాయంలో; నాలవభాగము+ఒండెన్= నాల్గవవంతుకాని; మూఁడవభాగము+ఒండెన్= మూడవవంతుకాని; అందు+అర్ధము+ఒండెన్= అందులో సగభాగంకాని; మిక్కిలి= మించి; వ్యయంబు= ఖర్చు; చేయన్, కాదు= చేయకూడదు; అని; బుద్ధిన్; అవధరించితె= గ్రహించావుకదా!; ఆయుధ+అగార, ధన+ఆధ్యక్ష్యముల+అందున్= ఆయుధశాలలయొక్క భాండాగారాలయొక్కపాలనలో; వర, వాజి, వారణ+ఆవళుల+అందున్= శ్రేష్ఠాలైన అశ్వగజ సమూహాల పాలనలో; బండారముల+అందున్= కోశాగారాల్లో; పరమ విశ్వాసులన్= మిక్కిలి నమ్మదగినవాళ్ళను; భక్తులన్= నీయందు భక్తి ఉన్న వాళ్ళను; దక్షులన్= సమర్థులైనవాళ్ళను; పంచితివి+అయ్యా= నియమించావుకదా!; నిన్నున్; సకల, జనులు; సంస్తుతింపన్= ప్రశంసించగా; గురులన్= గురువులను; వృద్ధ, శిల్పి, వర, వణిక్+బాంధవ, జనులన్= ముసలివారైన శిల్పులను, శ్రేష్ఠులైన వ్యాపారులను, బంధువులను; ఆశ్రితులను= ఆశ్రయించినవాళ్ళను; సాధుజనులన్= సజ్జనులను; పేదఱికము+పొరయక+ఉండఁగన్= పేదరికం కలుగకుండ; కరుణన్= దయతో; ప్రోతె (ప్రోచుదువు+ఎ)= పోషిస్తున్నావుకదా!

తాత్పర్యం: ధర్మరాజా! ఆదాయంలో నాల్గవభాగాన్ని లేదా మూడవభాగాన్ని లేదా సగభాగాన్ని మాత్రమే ఖర్చు చెయ్యాలికాని, అంతకుమించి చేయకూడ దని గ్రహించావుకదా! ఆయుధశాలలు, ధనాగారాలు, అశ్వశాలలు, గజశాలలు, కోశాగారాలు-వీటి పాలనలో ఎంతో నమ్మదగిన వాళ్ళను, నీపట్ల భక్తిగల వాళ్ళను, సమర్థులైన వాళ్ళను నియమించావుకదా! ప్రజలంతా నిన్ను ప్రశంసించేటట్లుగా గురువుల్ని, వృద్ధశిల్పుల్ని, గొప్ప వ్యాపారుల్ని, బంధువుల్ని, ఆశ్రితుల్ని, సజ్జనుల్ని పేదరికం రాకుండ దయతో పోషిస్తున్నావు కదా!

క. **వలయు నమాత్యులుఁ జుట్టం । బులు మూలబలంబు రాజపుత్త్రులు విద్వాం**
సులు బలసియుండ నిచ్చలుఁ । గొలువుండుదె లోక మెల్లఁ గొనియాడంగన్. 48

ప్రతిపదార్థం: వలయు= ఇష్టులైన(కావలసిన); అమాత్యులున్= మంత్రులును; చుట్టంబులున్= బంధువులును; మూల, బలంబు= ప్రధాన సైనిక సమూహం; రాజ పుత్త్రులు; విద్వాంసులు; బలసి+ఉండన్= ఎక్కువగా చేరిఉండగా; లోకము+ఎల్లన్; కొనియాడంగన్= కీర్తించగా; నిచ్చలున్= ప్రతిదినం; కొలువు+ఉండుదె(ఉండుదువు+ఎ)= కొలువుతీరి ఉంటావుకదా!

తాత్పర్యం: ఇష్టులైన మంత్రులు, బంధువులు, సైన్యాధిపతులు, రాకుమారులు పండితులు- అధికసంఖ్యలో ఆసీనులై ఉండగా ప్రపంచమంతా ప్రశంసించే విధంగా ప్రతిదినం నీవు కొలువుతీరుతున్నావు కదా!

క. **పరికించుచు బాహ్యాభ్యం । తరజనములవలన సంతతము నిజరక్షా**
పరుఁడ వయి పరమహీశుల । చరితము వీక్షింతె నిపుణచరనేత్రములన్. 49

ప్రతిపదార్థం: పరికించుచున్= జాగ్రత్తగా గమనిస్తూ; బాహ్య+అభి+అంతర, జనములవలనన్= బయట, లోపల ఉండే జనులవల్ల, (ప్రమాదం కలుగకుండా); సంతతము= ఎల్లప్పుడూ; నిజ, రక్షా, పరుఁడవు+అయి= నిన్ను నీవు రక్షించుకోవటంలో శ్రద్ధకలవాడివై; పర, మహీశుల= శత్రురాజులయొక్క; చరితము= ప్రవర్తన; నిపుణ, చర, నేత్రములన్= నేర్పుగల చారు లనే కళ్ళతో - అంటే సమర్థులైన గూఢచారులవల్ల; వీక్షింతె (వీక్షించుదువు+ఎ)= చూస్తున్నావుకదా!

తాత్పర్యం: జాగ్రత్తగా గమనిస్తూ వెలుపల లోపల ఉండే శత్రువులనుండి నిన్ను నీవు రక్షించుకుంటూ, శత్రురాజుల ప్రవర్తనను గూఢచారులు అనే కళ్ళద్వారా కనుగొంటున్నావుకదా!

విశేషం: అలం: రూపకం. తా నుంటేనేకదా తక్కినవి చెయ్యటం. అందుచేత ఆత్మరక్షణ అందరికీ ముఖ్యమే. అందులోనూ అధికార పీఠాన్ని అధిష్ఠించిన మహారాజుకు ఆత్మరక్షణ అతిముఖ్యం. దేశం వెలుపల లోపల ఆయనకు ఎంతోమంది శత్రువు లుంటారు. ఎన్నో ప్రమాదాలు కల్పిస్తారు. అందువల్ల ఏ ప్రభువైనా ఎంతో సమర్థులైన గూఢచారుల్ని నియమించాలి. ఎప్పటికప్పుడు ఎదుటివాళ్ళ ఎత్తుగడలను తెలుసుకోవాలి. ఆత్మరక్షణకు, శత్రుశిక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. ప్రభుశ్రేయానికి, విజయానికి పెద్దగా దోహదం చేసేది గూఢచారి వ్యవస్థ. ఒకవిధంగా ప్రభువుయొక్క చరించే చక్షువులే గూఢచారులు. అందుకే ప్రభువుకు చారచక్షువని పేరు.

క. వెలయఁగ విద్వజ్జన ము । ఖ్యులతోడ నశేషధర్మకుశలుఁడ వయి యి
మ్ముల లోకవ్యవహార । మ్ములు దయఁ బరికింతె నిత్యమును సమబుద్ధిన్. 50

ప్రతిపదార్థం: నిత్యమును= ప్రతిదినము; వెలయఁగన్= ఒప్పుగా-తగువిధంగా; విద్వత్+జన, ముఖ్యులతోడన్= పండితప్రముఖులతో; అశేష, ధర్మ, కుశలుఁడవు+అయి= అన్ని ధర్మాల్లో నేర్పరివై; సమబుద్ధిన్= రాగద్వేష రహితమైన బుద్ధితో, ఇమ్ములన్= శ్రద్ధగా; లోక, వ్యవహారమ్ములు; దయన్= దయతో; పరికింతె(పరికించుదువు+ఎ)= విచారిస్తున్నావుకదా!

తాత్పర్యం: గొప్ప పండితులతో కలిసి, సర్వధర్మాల్లో నేర్పరివై, రాగద్వేషరహితమైన సమబుద్ధితో శ్రద్ధగా దయతో లోకవ్యవహారాలు విచారిస్తున్నావు కదా!

ఆ. వార్తయంద జగము వర్తిల్లుచున్నది; । యదియు లేనినాఁడ యఖిలజనులు
నంధకారమగ్ను లగుదురు గావున । వార్త నిర్వహింపవలయుఁ బతికి. 51

ప్రతిపదార్థం: వార్త+అందు+అ= వార్త (న్యూస్) యందే; జగము= ప్రపంచం; వర్తిల్లుచున్+ఉన్నది= నడుస్తున్నది; అదియున్= ఆ వార్త; లేని, నాఁడు+అ= లేనిరోజే; అఖిలజనులున్; అంధకారమగ్నులు+అగుదురు= అజ్ఞానంఅనే చీకట్లో మునిగిపోయిన వాళ్ళుఅవుతారు; కావున; పతికిన్= రాజుకు; వార్త, నిర్వహింపవలయున్= వార్తను నడపవలసిన అవసరం ఉంది.

తాత్పర్యం: ప్రపంచమంతా వార్తమీదే నడుస్తున్నది. అది లేకుంటే ప్రజలంతా పెనుచీకట్లో మునిగినట్లే. అందువల్ల ప్రభువు వార్తను బాగా నడపాలి.

విశేషం: వార్త అంటే- వృత్తాంతం, వర్తనం, అర్థానర్థవివేచన విద్య- అనే అర్థాలు ఉన్నాయి. వార్తలను సేకరించటం, ప్రసరించటం, ప్రభుత్వబాధ్యత. అంతేకాదు. అది గొప్ప సామాజికావసరం కూడ. వార్తా నిర్వహణ సరిగా లేకుంటే ప్రభుత్వంలో ఒక విభాగానికి మరొక విభాగానికి, దేశంలో ఒక ప్రాంతానికి మరొక ప్రాంతానికి, సమాజంలో ఒక ప్రాంతానికి మరొక

ప్రాంతానికి, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య అవగాహన కుంటుపడుతుంది. సమన్వయం లోపిస్తుంది. ఎక్కడ ఏం జరుగుతున్నదో, ఎవరి అభిప్రాయాలు ఎలా ఉన్నాయో, ఏయే సమస్యలకు ఏయే పరిష్కారాలో ఎవ్వరికి తెలియని స్థితి ఏర్పడుతుంది. అందరు అంధకారంలో ఉన్నట్లే అవుతుంది. అందుచేత ప్రభువు వార్తను సమర్థంగా నిర్వహించాలి. ప్రత్యేకించి ప్రజాస్వామ్య ప్రభుత్వంలో వార్తా నిర్వహణకు అత్యధిక ప్రాధాన్యం ఉంది. ఒక విధంగా ప్రభుత్వానికి కళ్ళు, చెవులు-ప్రజలకు కళ్ళు, చెవులు-వార్తాపత్రికలే. ఇవి మామూలు కళ్ళకు అందని దృశ్యాల్ని చూపిస్తాయి. మామూలు చెవులకు వినిపించని విషయాల్ని వినిపిస్తాయి. వార్త అనే శబ్దం చేత కృషి గోరక్షాదులు కూడా గ్రాహ్యాలే.

ఆ. దారసంగ్రహంబు ధరణీశ! రతి పుత్త్రఫలము, శీలవృత్తఫలము శ్రుతము,
దత్తభుక్తఫలము ధనము, వేదము లగ్ని । హోత్ర ఫలము లనియు నొగి నెఱుంగు. 52

ప్రతిపదార్థం: ధరణి+ఈశ= భూమికి ప్రభువు అయిన ఓధర్మరాజా!; దార, సంగ్రహంబు= భార్యను పొందటం; రతి=(ఆమెతో) సంభోగించటం; పుత్త్ర, ఫలము= పుత్రోత్పత్తి ఫలాలుగా కలిగినట్టిది; శ్రుతము= ధర్మాల్నిగూర్చి వినటం; శీల, వృత్త, ఫలము= శీలాన్ని, మంచి నడవడిని ఫలాలుగా కలిగినట్టిది; ధనము; దత్త, భుక్త, ఫలము= దానాన్ని అనుభవాన్ని ఫలంగా కలిగినట్టిది; వేదములు; అగ్ని, హోత్ర, ఫలములు= అగ్నిహోత్రాల్ని ఫలాలుగా గలిగినట్టివి, అనియున్; ఒగిన్= క్రమంగా; ఎఱుంగు= తెలుసుకొనుము.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! భార్యను పొందటానికి ఫలం- సంభోగసుఖం, పుత్రులు పుట్టటం, ధర్మాలు వినటానికి ఫలం-సచ్ఛీలం, సత్ప్రవర్తన సిద్ధించటం, సంపాదించినధనానికి ఫలం-దానం చెయ్యటం, అనుభవించటం, వేదాలకు ఫలం - అగ్నిహోత్రాలు. ఈ సంగతి క్రమంగా తెలుసుకో.

విశేషం: ఇట్టి పద్యాలు సంస్కృత మూలానికి యథాతథానువాదాలు. భారతీయ సంస్కృతిలో వైవాహిక జీవిత ఫలం- పాశవికమైన కామవాంఛ తీర్చుకోవటంమాత్రమే కాదు. సమాజకల్యాణానికి, ఐహికాముష్మిక సుఖసాధనకు, జీవితచరితార్థతకు దోహదం చెయ్యగల సత్‌సంతానాన్ని కనటం. అలాగే, ధనార్జనకు ఫలం, ధర్మాధర్మ విచక్షణ లేకుండ మనసుపడ్డ భోగా లన్నీ అనుభవించటం కాదు; నిరుపయోగంగా కూడబెట్టటం కాదు - సత్పాత్రదానంచెయ్యటం. ధర్మబద్ధాలైన భోగాలు అనుభవించటం. ఈ రెండింటి విషయంలో కాళిదాస మహాకవి- రఘువంశరాజుల్నిగూర్చి చెప్పిన 'త్యాగాయ సంభృతార్థానాం ..... ప్రజాయై గృహమేధినామ్' అనే మాటలు ఈ సందర్భంలో గుర్తుంచుకోతగ్గవి. కాగా, ధర్మశ్రవణానికి ఫలం- ఉబుసుపోక కాదు; ఒక చెవితో విని మరొక చెవితో వదలివెయ్యటం కాదు- జీవితంలో ఆచరించటం; జన్మచరితార్థతకు, సమాజశ్రేయస్సుకు దోహదంచేసే మంచి శీలాన్ని, నడవడిని అలవరచుకోవటం. అలాగే వేదాలకు ఫలం అగ్నిహోత్రాలు. వేదంలో- కర్మకాండలో ప్రాధాన్యం వహించేది అగ్నిహోత్రం. వేల్చిన హవిస్సులను దేవతల కందించి, ఆ దేవతలవల్ల లోకానికి ఫలా లందించేవాడు అగ్నిహోత్రుడు. పాండవులు ద్రౌపదిని వివాహమాడి అర్ధరాజ్యాన్ని పొంది, ఇంద్రప్రస్థం కేంద్రంగా రాజ్యపాలన సాగించే తరుణంలో ధర్మరాజుకు నారదు డీ ధర్మాలు, రాజనీతి విశేషాలు, బోధించటం ఎంతో ఉచితంగా ఉంది.

చ. బహుధనధాన్యసంగ్రహము బాణశరాసనయోధవీరసం
గ్రహము నిరంతరాంతరుదకంబులు ఘాసరసేంధనౌఘ సం
గ్రహము ననేకయంత్రములుఁ గల్గి యసాధ్యములై ద్విషద్భయా
వహ లగుచుండ నొప్పునె భవత్పరిరక్ష్యములైన దుర్గముల్. 53

ప్రతిపదార్థం: భవత్+పరిరక్ష్యములు+ఐన= నీచే రక్షింపబడుతున్నవైన; దుర్గముల్= కోటలు; బహు, ధన, ధాన్య, సంగ్రహము= ఎక్కువ, ధన, ధాన్యాల నిల్వ; బాణ, శర+ఆసన, యోధవీర, సంగ్రహము= బాణాలయొక్క, ధనుస్సులయొక్క, యుద్ధవీరుల యొక్క కూడిక; నిరంతర+అంతః+ఉదకంబులు= ఎల్లప్పుడు లోపల ఉండే నీళ్ళు; ఘాస, రస+ఇంధన+ఓఘ, సంగ్రహము= (పశువులకు) గడ్డి, (మానవులకు) ఉప్పు, పులుపు, కారం మొదలైన పదార్థాలు, వివిధ పానీయాలు, వంటకట్టెల సమూహం యొక్క కూడిక; అనేక యంత్రములున్; కలిగి; అసాధ్యములు+ఐ= భేదించశక్యంకానివై; ద్విషత్+భయ+ఆవహులు+అగుచు+ ఉండన్+ఒప్పునె= శత్రువులకు భయం కలిగించేవై ఒప్పి ఉన్నాయి కదా!

తాత్పర్యం: ఓ ధర్మరాజా! నీ రక్షణలో నున్న కోటలన్నీ- ఎక్కువగా ధనధాన్యాల్ని, ధనుర్బాణాల్ని, యుద్ధవీరుల్ని, ఎప్పుడూ తరుగని నీళ్ళని, పశువుల గడ్డిని, ఉప్పు, పులుపు, కారంవంటి ఆహార పదార్థాల్ని, వివిధపానీయాల్ని వంటకట్టెల్ని, సమృద్ధిగా కలిగి అనేకయంత్రసాధనాలతో కూడి దుర్భేద్యాలై శత్రుభయంకరాలై ఒప్పుతున్నాయి కదా!

విశేషం: ముఖ్యంగా ముట్టడి సమయాల్లో పై పదార్థాలన్నీ కోటల్లో నిల్వ ఉండటం చాల అవసరం. రసశబ్దానికి అనేక అర్థాలు ఉన్నాయి. రుచిపరంగా రసాలు ఆరు-కషాయం(వగరు), మధురం(తీపి), లవణం(ఉప్పు), కటువు(కారం), తిక్తం(చేదు), ఆమ్లం (పులుపు). (అర్థవ్యక్తి అనే శబ్దగుణం ఇందులో చక్కగా పోషించబడింది - సంపా.)

చ. వదలక బుద్ధి నంతరరివర్గము నోర్చి జితేంద్రియుండ వై
మొదలన దేశకాలబలముల్ మఱి దైవబలంబుఁ గల్గి భూ
విదిత బలుండవై యహితవీరుల నోర్వఁగ నుత్సహింతె దు
ర్మద మలినాంధ చిత్తులఁ బ్రమత్తుల నింద్రియనిర్జితాత్ములన్. 54

ప్రతిపదార్థం: వదలక= విడువక; బుద్ధిన్= నీబుద్ధిబలంచేత; అంతః+అరి, వర్గమున్+ఓర్చి= లోపలి(నీలోని) శత్రుసమూహాన్ని జయించి; జిత+ఇంద్రియుండవు+ఐ= జయించిన ఇంద్రియాలు కలవాడివై; మొదలన= మొదటనే; దేశ, కాల, బలముల్; మఱి= అంతేకాక; దైవబలంబున్; కలిగి; భూ, విదిత, బలుండవు+ఐ= ప్రపంచంలో తెలియబడిన బలం కలవాడివై; దుర్మద+మలిన+అంధ, చిత్తులన్= మితిమీరిన గర్వమనే మాలిన్యంచేత గ్రుడ్డిదైన మనస్సుకలవాళ్ళను; ప్రమత్తులన్= మిక్కిలి మత్తెక్కినవాళ్ళను; ఇంద్రియ, నిర్జిత+ఆత్ములన్= ఇంద్రియాలచేత జయించబడిన బుద్ధికలవాళ్ళను; అహిత, వీరులన్= శత్రువీరులను; ఓర్వఁగన్= జయించటానికి, ఉత్సహింతె(ఉత్సహింతువు+ఎ)= ఉత్సాహపడుతున్నావుకదా!

తాత్పర్యం: దేశకాల దైవబలాల్ని ముందుగ పొంది, బుద్ధిబలంతో అంతశ్శత్రువులైన కామక్రోధాదుల్ని, ఇంద్రియాల్ని జయించి, ప్రపంచ ప్రసిద్ధిగల బలవంతుడివై, మితిమీరిన మదం అనే మాలిన్యంతో గ్రుడ్డిదైన మనస్సు కలవాళ్ళు, మిక్కిలి మత్తెక్కిన వాళ్ళు, ఇంద్రియాలకు వశమైన బుద్ధికలవాళ్ళు అయిన శత్రువుల్ని జయించాలన్న ఉత్సాహంతో ఉన్నావు కదా!

విశేషం: అంతరరివర్గం - కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు. కర్మేంద్రియాలు - వాక్, పాణి, పాద, పాయు, గుహ్యాలు. జ్ఞానేంద్రియాలు-త్వక్కు, చక్షువు, శ్రోత్రం, జిహ్వ, ఘ్రాణం; మనస్సునుకూడ చేర్చితే మొత్తం ఇంద్రియాలు పదకొండు. మదములు - విద్యామదం, ధనమదం, కులమదం, ఉద్యోగమదం, యౌవనమదం మొదలైనవి.

తే. కడిఁది రిపులపైఁ బోవంగఁ గడఁగి యున్న । నీకు ముందఱఁ జని రిపున్నృపులయందుఁ
దగిలి సామాద్యుపాయంబు లొగిన సంప్ర । యోగమునఁ జేసి వర్తిల్లుచున్నె చెపుమ. 55

ప్రతిపదార్థం: కడిఁది= గొప్ప; రిపులపైన్+పోవంగన్= శత్రువులమీద దండెత్తిపోవటానికి; కడఁగి, ఉన్న= పూనుకొని ఉన్న; నీకున్; ముందఱన్+చని= ముందుగా వెళ్ళి; రిపు నృపుల, అందున్= శత్రురాజుల్లో; తగిలి= ప్రయత్నించి; సామ+ఆది+ ఉపాయంబులు= సామం, దానం మొదలయిన నాలుగు ఉపాయాలు; ఒగిన్+అ= వరుసగా, సంప్రయోగమునన్+చేసి= చక్కగా ప్రయోగించటంచేత, వర్తిల్లుచున్+ఉన్నె= ప్రవర్తిల్లుతున్నాయికదా!; చెపుమ= చెప్పుము.

తాత్పర్యం: నీవు దండెత్తటానికి ముందే-బలవంతులైన శత్రురాజులమీద సామదానాది చతుర్విధోపాయాల్ని చక్కగా ప్రయోగిస్తున్నావు కదా!

విశేషం: ఉపాయాలు - సామం, దానం, భేదం, దండం.

వ. 'మఱియు నాస్తిక్యం బనృతంబు ప్రమాదం బాలస్యం బనర్థజ్ఞులతోడి చింతనంబు క్రోధంబు దీర్ఘచింత దీర్ఘ సూత్రత యెఱుకగలవారి నెఱుంగమి యర్థంబుల యందనర్థక చింత నిశ్చితకార్యంబులు సేయమి మంత్రంబుల రక్షింపమి శుభంబులఁ బ్రయోగింపమి విషయంబులం దగులుట యనంబరఁగిన పదునాలుగు రాజదోషంబులఁ బరిహరింతె?' యని యడిగిన నారదునకు ధర్మరా జి ట్లనియె. 56

ప్రతిపదార్థం: మఱియున్; నాస్తిక్యంబు= నాస్తికత - అంటే భగవంతుణ్ణి వేదప్రామాణ్యాన్ని అంగీకరించకుండటం; అనృతంబు= అబద్ధంచెప్పటం; ప్రమాదంబు= ఏమరుపాటు; ఆలస్యంబు= సోమరితనం; అనర్థజ్ఞులతోడి చింతనంబు= అజ్ఞానులతో ఆలోచించటం; క్రోధంబు; దీర్ఘ, చింత= ఎక్కువకాలం దుఃఖించటం; దీర్ఘసూత్రత= చేయవలసిన పనులనుగురించి దీర్ఘంగా ఆలోచించటం, ఆలస్యంగా చేయటం; ఎఱుక, కల, వారిన్= జ్ఞానులను; ఎఱుంగమి= గుర్తించకుండటం; అర్థంబుల, అందున్+అనర్థక, చింత= ప్రయోజనకరమైన విషయాల్లో ప్రయోజనభంగకరమైన ఆలోచన; నిశ్చితకార్యంబులు= నిర్ణయించినపనులు; చేయమి= చేయకుండటం; మంత్రంబులన్= రహస్యాలోచనల్ని; రక్షింపమి= కాపాడకుండటం; శుభంబులన్= శుభకార్యాలను; ప్రయోగింపమి= జరిపించకుండటం; విషయంబులన్= ఇంద్రియసుఖాల్లో; తగులుట= తగుల్కొనటం; అనన్+పరఁగిన= అనేటటువంటి; పదునాలుగు; రాజదోషంబులన్; పరిహరింతె(పరిహరించుదువు+ఎ)= విడుస్తున్నావుకదా!; అని; అడిగిన; నారదునకు; ధర్మరాజు+ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'నాస్తికత, అసత్యమాడటం, ఏమరుపాటు, సోమరితనం, తెలివితక్కువవాళ్ళతో కార్యాలోచనచెయ్యటం, అతికోపం, అధికకాలం దుఃఖించటం, చేయవలసిన పనిని గూర్చి అతిదీర్ఘంగా ఆలోచించటం, ఆలస్యంగా చెయ్యటం, జ్ఞానుల్ని గుర్తించకపోవటం, ప్రయోజనకరమైన విషయాల్లో ప్రయోజనభంగకరమైన ఆలోచనలు చెయ్యటం, నిర్ణయించిన పనులు చెయ్యకుండటం, రహస్యాలోచనలు బయటపడకుండ కాపాడకపోవటం, శుభకార్యాలు చెయ్యకుండటం, ఇంద్రియ సుఖాల్లో తగుల్కోవటం- అనే పదునాలుగు రాజదోషాలను విడనాడావుకదా!'' అని అడిగిన నారదమహర్షితో ధర్మరాజు ఇలా అన్నాడు.

తే. నాయథాశక్తిఁ జేసి యన్యాయపథముఁ । బరిహరించి మహాత్ముల చరితలందు
బుద్ధి నిలిపి మీ యుపదేశమున శుభంబు । లయిన వాని ననుష్ఠింతుఁ బ్రియముతోడ. 57

ప్రతిపదార్థం: నా యథాశక్తిన్+చేసి= నాచేతనైనంతవరకు; అన్యాయ, పథమున్= అన్యాయమార్గాన్ని; పరిహరించి= వదలి; మహాత్ముల, చరితల+అందున్= మహాత్ములయొక్క చరిత్రల్లో; బుద్ధి, నిలపి= మనస్సు ఉంచి; మీ, ఉపదేశమునన్=

మీధర్మబోధవల్ల; శుభంబులు+అయిన= శుభాన్ని కలిగించేవి అయిన; వానిన్; ప్రియముతోడన్= ప్రీతితో; అనుష్ఠింతున్= ఆచరిస్తాను.

తాత్పర్యం: నారదమునీంద్రా! చేతనైనంతవరకు అన్యాయమార్గాన్ని వదలి, మహాత్ముల చరిత్రల్ని ఆదర్శంగా ఉంచుకొని, మీధర్మబోధవల్ల శుభాలైనవాటిని మనఃపూర్వకంగా ఆచరిస్తాను.

విశేషం: 'నాయథాశక్తిఁ జేసి'- అనటంలో ధర్మజుడి వినయం. 'అనుష్ఠింతుఁ బ్రియముతోడ'-అనటంలో ఆయన ధర్మప్రియత్వం చక్కగా వ్యక్తమవుతున్నాయి. యథాశక్తి-అవ్యయీభావ సమాసం. నన్నయ ఇట్టి వాటిని విశేష్యాలుగా వాడుతుంటాడు. శౌనకాది మహామునులకు సౌతి చెప్పింది యథాతథ భారతకథనమే అయినా - నారదమహర్షి ప్రవేశంవల్ల, ఆయన కుశలప్రశ్నలవల్ల, ధర్మరాజు సమాధానాలవల్ల, సన్నివేశానికి ఒక నాటకీయత వచ్చింది. నారదమహర్షి ధర్మరాజును సాధారణ కుశలప్రశ్నలు అడుగకుండా-రాజనీతి విశేషాలకు, ఆదర్శరాజ్యపాలన ప్రమాణాలకు అద్దంపట్టే కుశలప్రశ్న లడగటం విశేషం. అభిషిక్తుడైన ధర్మరాజు తన రాజ్యప్రజలకు ఎలాంటి పరిపాలన అందివ్వాలో తెలియచేయటం విశేషం. నారదమహర్షి కుశలప్రశ్నలు- ఏ ప్రభువుకైనా ఉత్తమరాజనీతి పాఠాలు. ఆదర్శరాజ్యపాలనకు ఉత్తమప్రమాణాలు; ప్రభుజీవితచరితార్థతకు మహోపదేశాలు.

ఇట్టి సభ నెచ్చటనైనఁ జూచితిరా యని ధర్మజుఁడు నారదు నడుగుట (సం. 2-6-8)

వ. అని కృతాంజలి యయి 'మునీంద్రా! యీత్రిలోకంబులయందును మీ చూడనివి లే; వెందే నిట్టి యపూర్వంబైన సభ చూచి యెఱుంగుదురే?' యని మయ నిర్మితం బయిన సభ చూపినం జూచి విస్మితుండయి నారదుండు ధర్మరాజున కి ట్లనియె. 58

ప్రతిపదార్థం: అని; కృత+అంజలి+అయి= చేయబడిన నమస్కారం కలవాడై - అంటే నారదునికి నమస్కరించి; ముని+ఇంద్రా!= మునిశ్రేష్ఠా!; ఈ త్రిలోకంబుల, అందును= ఈమూడు లోకాలల్లోకూడ; మీ, చూడని+అవి= మీరు చూడనటువంటివి; లేవు; ఎందున్+ఏన్= ఎచ్చటనైనా; ఇట్టి; అపూర్వంబు+ఐన= అపురూపమైన; సభ, చూచి; ఎఱుంగుదురే; అని; మయ, నిర్మితంబు+ అయిన= మయునిచేత నిర్మించబడినదైన; సభ; చూపినన్= చూపించగా; విస్మితుండు+అయి= ఆశ్చర్యపడినవాడై; నారదుండు; ధర్మరాజునకున్+ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని ధర్మరాజు నారదమహర్షికి నమస్కరించి 'మునీంద్రా! ముల్లోకాలలోను మీరు చూడని విశేషాలు లేవు. అపూర్వమైన ఈ మయసభలాంటి సభను ఇం కెక్కడైన మీరు చూచారా?' అని ఆ సభను చూపించగా నారదమహర్షి ఆశ్చర్యపరవశుడై ఆయనతో ఇలా అన్నాడు.

క. భూనాథ! యిది యపూర్వ, మ । మానుషము, విచిత్ర రత్నమయ; మిట్టి సభన్
మానవలోకేశ్వరులం । దే నెన్నఁడుఁ జూచి వినియు నెఱుఁగ ధరిత్రిన్. 59

ప్రతిపదార్థం: భూనాథ!= ఓరాజా!; ఇది= ఈమయసభ; అపూర్వము= ఇంతకు ముం దెన్నడు లేనిది; అమానుషము= మానవాతీతమైనది; విచిత్ర, రత్న, మయము= విచిత్రాలైన రత్నాలతో కూడుకొన్నట్టిది; ఇట్టి; సభన్; ధరిత్రిన్= ఈభూమిమీద; మానవలోక+ఈశ్వరుల+అందున్= మానవలోక పరిపాలకులైన రాజుల దగ్గర; ఏన్=నేను; ఎన్నడున్= ఏనాడుకూడ; చూచి; వినియున్; ఎఱుఁగన్.

తాత్పర్యం: ధర్మరాజా! ఈ సభ అపూర్వం. మానవాతీతం. చిత్రవిచిత్ర రత్నమయం. మానవలోకంలో ఏ మహారాజు దగ్గర కూడ నేను ఇలాంటి సభను ఎన్నడూ చూడలేదు, ఉన్నట్లు వినలేదు.

విశేషం: నారదుడు త్రిలోకసంచారి, మహర్షి, దేవర్షి. అందుచేత 'ఇటువంటి సభను ముల్లోకాలలో మీ రెచ్చటైనా చూచారా?' అని ధర్మరాజు అడుగదగిన వ్యక్తి ఒక్క నారదుడే. ఆ మహర్షి మయసభనుగురించి చెప్పినమాట పరమప్రమాణం.

క. సురపతి యమ వరుణ ధనే। శ్వర కమలాసనుల దివ్యసభలెల్ల నరే
శ్వర! చూచితి; నవి దీనికి । సరిగా వత్యంతవిభవసౌందర్యములన్. 60

ప్రతిపదార్థం: నర+ఈశ్వర!= మానవులకు ప్రభువువైన ఓధర్మరాజా!; సురపతి, యమ, వరుణ, ధన+ఈశ్వర, కమల+ఆసనుల= దేవేంద్ర, యమ, వరుణ, కుబేర, బ్రహ్మదేవులయొక్క; దివ్యసభలు+ఎల్లన్= దేవతా సంబంధాలైన సభల నన్నింటిని; చూచితిన్; అవి; అత్యంత, విభవ, సౌందర్యములన్= అపారమైన ఐశ్వర్యంలో; అందమునందును; దీనికిన్; సరి, కావు= సమానం కావు.

తాత్పర్యం: ధర్మరాజా! దేవేంద్ర, యమ, వరుణ, కుబేర, బ్రహ్మదేవులయొక్క దివ్యసభలన్నీ నేను చూచాను. అవి ఏవీ ఐశ్వర్యసౌందర్యాల్లో దీనికి సరితూగలేవు.

విశేషం: దివ్యసభల్లో అందమైనవీ, ఐశ్వర్యంతో కూడినవీ అయినవాటిని అయిదింటిని నారదమహర్షి పేర్కొన్నాడు. అవన్నీ ధర్మజుని మయసభకు సాటిరా వని ప్రకటించాడు. ధర్మజుడు ఆ సంగతి విని ఊరుకుండేవాడు కాడు. ఏ విధంగా మయసభ దేవసభలకంటె గొప్పదో వివరంగా తెలుసుకోవా లని కుతూహలపడతాడు. అది అతని స్వభావం. వార్తలను సేకరించటంలో, వినటంలో, ప్రత్యక్ష పరిజ్ఞానాన్ని సంపాదించుకోవటంలో ధర్మజుడు సూక్ష్మబుద్ధి. ఆసక్తితో నిండిన అతనిభావిప్రశ్నకు నారదునివాక్యం చొరవ కలిపిస్తున్నది. (సంపా.)

వ. అనిన విని 'యవి యెట్టివి? వాని వినవలతు నానతిం'డని లోకపాల సభావిభవ శ్రవణ ప్రభూత కుతూహల చేతస్కుండై యడిగిన ధర్మరాజునకు నారదుం డి ట్లనియె. 61

ప్రతిపదార్థం: అనినన్; విని; అవి; ఎట్టివి; వానిన్= వాటినిగూర్చి; వినన్, వలతున్= వినాలని కోరుకుంటున్నాను; ఆనతి+ ఇండు+అని= ఆజ్ఞాపించం డని; లోకపాల, సభా, విభవ, శ్రవణ, ప్రభూత, కుతూహల, చేతస్కుండు+ఐ= దిక్పాలకులయొక్క సభావైభవాన్నిగూర్చి వినాలని ఎక్కువగా ఏర్పడిన కుతూహలంతో కూడుకొన్న మనస్సు కలవాడై; అడిగిన; ధర్మరాజునకు; నారదుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: నారదమహర్షి మాటలు విని దిక్పాలుర సభావైభవాన్నిగూర్చి వినాలన్న విశేష కుతూహలంతో ధర్మరాజు అవి ఎలాంటివి? వాటినిగూర్చి వినా లని ఉంది. ఆజ్ఞాపించండి' అని అడిగేసరికి నారదమహర్షి ఇలా అన్నాడు.

విశేషం: ఆనతివ్వండి, సెలవివ్వండి- ఇలాంటి మాటలు పెద్దల్ని ఏదైనా విషయాన్ని చెప్పండి అని అడిగేటప్పుడు ఎంతో గౌరవసూచకంగా వాడే క్రియాపదాలు. ఇక్కడ ఆనతివ్వండి అంటే చెప్పండి అని అర్థం. అంతేకాదు-మీరు చెప్పిందే ప్రమాణంగా, శాసనంగా, తిరుగులేనిదిగా భావిస్తాను- అనే భావం కూడ ఆ పదంలో ధ్వనిస్తుంది. ధర్మరాజు అలా అనటం ఆయన వినయసంపన్నతకు, సంస్కారానికి చక్కని సూచిక.

ఇంద్రసభావర్ణనము (సం. 2-7-1)

క. శతమఖుసభ శుభరత్నాం । చితకాంచనరచిత, మతివిచిత్రము, లోక
త్రితయాఖిల లక్ష్మీ సం । శ్రిత; మలవియె దానిఁ బొగడ శేషున కయినన్. 62

ప్రతిపదార్థం: శతమఖు, సభ= నూరు యజ్ఞాలుచేసిన దేవేంద్రునియొక్క సభ; శుభ, రత్న+అంచిత, కాంచన, రచితము= మంచి రత్నాలతో ఒప్పుతున్న బంగారుతో చేయబడింది; అతివిచిత్రము= మిక్కిలి ఆశ్చర్యకరమైనది; లోక, త్రితయ+అఖిల, లక్ష్మీ, సంశ్రితము= ముల్లోకాల్లోని సమస్త ఐశ్వర్యంచేత ఆశ్రయించబడింది; దానిన్; పొగడన్; శేషునకున్+అయినన్= ఆదిశేషునికి కూడా; అలవియె= సాధ్యమా!

తాత్పర్యం: దేవేంద్రుని సభ రత్నమయం, స్వర్ణమయం, చిత్రవిచిత్రం. ముల్లోకాల్లోని సకలైశ్వర్యాలకు నిలయం. ఆ సభను పొగడటానికి ఆదిశేషునికికూడా సాధ్యంకాదు.

విశేషం: శేషుడు వెయ్యితలలు, రెండువేల నాల్కలు కలవా డని ప్రసిద్ధి. అలాంటి ఆదిశేషునికి కూడ దేవేంద్రుని సభా వైభవం పొగడటానికి సాధ్యం కాకుంటే ఒకతల, ఒక నాలుక ఉన్నవాళ్ళకు సాధ్యమౌతుందా?

వ. అదియును నూఱుయోజనంబుల వెడల్పును, నూటయేఁబది యోజనంబుల నిడుపును, నేను యోజనంబుల తనర్పునుం గలిగి, వైహాయసంబయి, కామగమనంబయి, వ్యపేతశీతాతపంబయి, సకల కాల కుసుమ ఫలభరిత పాదపవన సంకీర్ణ సరోవర విరాజితంబయి, తపఃప్రభావంబున నమరేంద్రుచేత నిర్మితంబయి కరం బొప్పచుండు; నట్టి సభయందు. 63

ప్రతిపదార్థం: అదియును; నూఱు, యోజనంబులు, వెడల్పును= నూరామడలవెడల్పును; నూట, ఏఁబది, యోజనంబుల, నిడుపునున్= నూటయాభై ఆమడల పొడవును; ఏను, యోజనంబుల, తనర్పునున్= ఐదామడ లెత్తును; కలిగి; వైహాయసంబు+ అయి= ఆకాశానికి సంబంధించిందై-అంటే ఆకాశంలో ఉండేదై; కామగమనంబు+అయి= కోరుకొన్నట్లు వెళ్ళ గలిగిందై (కోరిక ననుసరించిన గతికలదై); వి+అపేత, శీత+ఆతపంబు+అయి= పూర్తిగా తొలగించబడిన చలి, ఎండ కలదై; సకల, కాల, కుసుమ, ఫల, భరిత, పాదప, వన, సంకీర్ణ, సరోవర, విరాజితంబు+అయి= అన్నికాలాలలోను పువ్వులతో, పండ్లతో నిండిన చెట్లతోపులతో క్రిక్కిరిసినదియున్నూ, సరోవరాలతో శోభిల్లేదియున్నూఅయి; తపః ప్రభావంబునన్= తపోబలంతో; అమర+ ఇంద్రుచేతన్= దేవేంద్రుడిచేత; నిర్మితంబు+అయి= నిర్మింపబడిందై; కరంబు= మిక్కిలి; ఒప్పుచున్+ఉండున్= ప్రకాశిస్తూ ఉంటుంది; అట్టి; సభయందు.

తాత్పర్యం: ఆ సభ వెడల్పు నూరామడలు. పొడవు నూటయాభై ఆమడలు. ఎత్తు ఐదామడలు. అది ఆకాశంలో ఉంటుంది. కోరుకొన్న చోటికి వెళ్ళుతుంది. చలిబాధ లేదు. ఎండబాధ లేదు. చెట్లతోపు లున్నాయి. అవి అన్ని కాలాల్లో పూలతో, పండ్లతో నిండి ఉంటాయి. సరస్సులూ ఉన్నాయి. అవి నిండుగా శోభిల్లుతుంటాయి. ఆ సభను దేవేంద్రుడే స్వయంగా తనతపోబలంతో నిర్మించుకున్నాడు.

విశేషం: 'తనర్పు' విషయంలో కొన్ని ప్రతుల్లో ఏనూరు, ఎనుబది అనే పాఠభేదా లున్నాయి. కాని, మూలంలో భండార్కరు ప్రతిలో 'పంచయోజన ముచ్ఛ్రితా' అని ఉంది.

చ. అతుల విభూతితో మణిమయాభరణద్యుతు లొప్పఁగా శత
క్రతుఁడు శచీసమేతుఁడయి కాంచన చారు విమానమాలికా
గత దివిజోత్తముల్ గొలువఁగాఁ గొలువుండు వరాప్సరోంగనా
యత విలసత్కటాక్ష కుసుమార్చిత సుందర వక్త్ర చంద్రుఁడై. 64

ప్రతిపదార్థం: అతుల, విభూతితోన్= సాటిలేని ఐశ్వర్యంతో; మణి, మయ+ఆభరణ, ద్యుతులు= మణులతోకూడినసొమ్ముల కాంతులు; ఒప్పఁగాన్= మెరయగా; శతక్రతుఁడు= నూరుయజ్ఞాలు చేసినవాడైన ఇంద్రుడు; శచీ, సమేతుఁడు+అయి= భార్య అయిన శచీదేవితో కూడుకొన్నవాడై; కాంచన, చారు, విమాన, మాలికా+ఆగత, దివిజ+ఉత్తముల్= బంగారుతో చేయబడిన అందమైన విమాన సమూహాల్లో వచ్చిన దేవతాశ్రేష్ఠులు; కొలువఁగాన్= సేవించగా; వర, అప్సరః+అంగనా+ఆయత, విలసత్+ కటాక్ష, కుసుమ+అర్చిత, సుందర, వక్త్ర, చంద్రుఁడు+ఐ= మేటి అప్సరఃకాంతలయొక్క విశాలాలు, ప్రకాశవంతాలు అయిన కడగంటిచూపు లనే పూవులతో పూజించబడే అందమైన ముఖమనే చంద్రుడు కలవాడై; కొలువు+ఉండున్= కొలువుతీరి ఉన్నాడు.

తాత్పర్యం: అందమైన బంగారు విమానాల్లో వచ్చిన దేవతాశ్రేష్ఠులు, కాంతిమంతాలైన విశాలనేత్రాల కడగంటి చూపులు అనే పూలతో పూజించే అప్సరసలు తనను సేవిస్తుండగా, సాటిలేని ఐశ్వర్యంతో, మణిమయాలైన ఆభరణాల కాంతులతో, శచీసమేతుడై, అందమైన చంద్రబింబంలాంటి ముఖంతో దేవేంద్రుడు ఆ సభలో కొలువు తీరి ఉంటాడు.

విశేషం: అలం: రూపకం. గాఢబంధమైన ఓజస్సు శిథిలబంధమైతే ఎంత మనోహరంగా ఉంటుందో, అది ప్రసాదగుణమనే పేరుతో ఎంత ప్రసన్నమౌతుందో ఈ పద్యరచన ప్రదర్శించి చూపుతున్నది. ఇందులో గల మసృణత్వం ఇంద్రుని ధీరలలితస్వభావానికి వ్యంజకంగా అమరింది. ఓజస్సు, శ్లేష అనే శబ్దగుణాలచేత రూపుకట్టిన ప్రసాదగుణం ఇంద్రసభావైభవాన్ని రచనామర్యాదతో రక్తికట్టింపచేస్తున్నది. ఇది నన్నయ ప్రసాదగుణప్రధానమైన రచనకు మంచి ఉదాహరణం. (సంపా.)

వ. మఱియును. 65

తాత్పర్యం: ఇంకను.

సీ. వదలక యేలినవాని ప్రస్తవమునఁ । బోరిలో నీల్గిన వీరభటులుఁ,
దమకుల ధర్మముల్ దప్పక సలిపిన । గృహమేధులును, జగన్మహితకీర్తిఁ
బరఁగిన ధన్యులుఁ, బరహితవ్రతులైన । పురుషులు, రుగ్జరా మరణ శోక
భయ బుభుక్షార్తి పిపాసా వ్యపేతులై । కొలుతురు సురరాజు నొలసి యర్థ

ఆ. ధర్మకామములు సదక్షిణ క్రతువులు । శ్రీ విలాసములు విశేషయజ్ఞ
వాహమంత్ర తతులు వచ్చి సేవింతురు । మూర్తిమంతు లగుచు ముదముతోడ. 66

ప్రతిపదార్థం: వదలక= విడువక; ఏలినవాని= తన ప్రభువుయొక్క; ప్రస్తవమునన్= విషయంలో; పోరిలోన్= యుద్ధంలో; ఈల్గిన= మరణించిన; వీరభటులున్= వీరులైనసైనికులూ; తమ, కులధర్మముల్; తప్పక; సలిపిన= ఆచరించిన; గృహమేధులు= గృహస్థులు; జగత్+మహిత, కీర్తిన్= ప్రపంచ ప్రసిద్ధిపొందిన కీర్తితో; పరగిన= ఒప్పిన; ధన్యులున్= పుణ్యాత్ములూ; పర, హిత,

వ్రతులు+ఐన= ఇతరులకు మేలు చెయ్యటమే వ్రతంగా కలవాళ్ళయిన; పురుషులు; రుక్+జరా, మరణ, శోక, భయ, బుభుక్షా+ఆర్తి, పిపాసా, వి+అపేతులు+ఐ= రోగం, ముసలితనం, మరణం, శోకం, భయం, ఆకలి, బాధ, దప్పిక పూర్తిగా తొలగినవాళ్ళయి; కొలుతురు= సేవిస్తారు; అర్థ, ధర్మ, కామములు; స దక్షిణ, క్రతువులు= దక్షిణలతో కూడిన యజ్ఞయాగాదులు; శ్రీవిలాసములు= లక్ష్మీదేవి కాంతులు(సంపదలు); విశేష, యజ్ఞవాహ, మంత్ర, తతులు= విశేషాలైన యజ్ఞాలను నిర్వహించే మంత్రాల సమూహాలు; మూర్తిమంతులు+అగుచున్= ఆకారాలు కలవారై; వచ్చి; సురరాజున్= దేవతలకు రాజయిన దేవేంద్రుడిని; ఒలసి= చుట్టుచేరి; ముదముతోడన్= సంతోషంతో; సేవింతురు.

తాత్పర్యం: ప్రభువును వదలకుండా ఆయనకోసం యుద్ధంలో మరణించిన వీరసైనికులు, తమకులధర్మాలను తప్పక పాటించిన గృహస్థులు, ప్రపంచ ప్రసిద్ధ కీర్తితో ఒప్పిన పుణ్యాత్ములు, ఇతరులకు మేలు చేయటమే వ్రతంగా గల మహాపురుషులు-రోగం, ముసలితనం, మరణం, శోకం, భయం, ఆకలి, బాధ, దప్పిలేనివాళ్ళయి దేవేంద్రుణ్ణి సేవిస్తుంటారు. అంతేకాదు ధర్మార్థకామాలు, దక్షిణలతో కూడిన యజ్ఞయాగాలు, లక్ష్మీవిలాసాలు, విశేషయజ్ఞాల్ని నిర్వహించే మంత్రసమూహాలు - ఆకారాలు తాల్చివచ్చి ఆ దేవతారాజును సంతోషంతో సేవిస్తుంటారు.

విశేషం: ధర్మకామాదులు అమహద్వాచకాలైనా, మూర్తిదాల్చి వస్తాయి. కాబట్టి 'మూర్తిమంతు'లనే మహద్విశేషణం వాడబడింది. 'మూర్తిమంతములయి ముదముతోడ' అనే పాఠాంతరం కూడ ఉంది.

వ. మఱియు శుక్రబృహస్పతులు నగ్నీషోములు నాశ్వినులు విశ్వదేవతలును ధాతయు విధాతయు హరిశ్చంద్రుం డను రాజర్షియు సురేంద్రసభ నుండుదురు. 67

ప్రతిపదార్థం: మఱియున్; శుక్ర బృహస్పతులున్, అగ్నీషోములును= అగ్నిదేవుడు, చంద్రుడు; ఆశ్వినులున్= అశ్వినీదేవతలు; విశ్వదేవతలును= విశ్వాపుత్రు లని భావింపబడే 10 మంది దేవతలు; ధాతయు= పండ్రెండు మంది సూర్యులలో ఒకడైన ధాత; విధాతయు= మన్మథుడు; హరిశ్చంద్రుండు+అను, రాజ+ఋషియు; సుర+ఇంద్ర, సభన్= దేవతలరాజైన ఇంద్రునిసభలో; ఉండుదురు= ఉంటారు.

తాత్పర్యం: అంతేకాక, శుక్రుడు, బృహస్పతి, అగ్నిదేవుడు, చంద్రుడు, అశ్వినీదేవతలు, విశ్వదేవతలు, ధాత, మన్మథుడు, హరిశ్చంద్రు డనే రాజర్షి దేవేంద్రునిసభలో ఉంటారు.

విశేషం: అశ్వినీదేవతలు- నాసత్యుడు, దస్రుడు, వీరు దేవవైద్యులు. సూర్యుడు అశ్వరూపం పొంది రమించటంచేత సంజ్ఞాదేవికి కలిగిన సుతు లవటంచేత వీళ్ళకు ఆశ్విను లనిపేరు. విశ్వదేవతలు- వసుబంధులు, క్రతుదక్షులు, కాలకాములు, ధురివిరోచనులు, పురూరవాద్రవులు (10మంది). ద్వాదశాదిత్యులు- ఇంద్రుడు, ధాత, పర్జన్యుడు, త్వష్ట, పూష, అర్యముడు, భగుడు, వివస్వంతుడు, విష్ణువు, అంశుమంతుడు, వరుణుడు, మిత్రుడు. ఇచట మూలంలో పెక్కుమంది ఋషుల పేర్లుకూడ ఉన్నాయి (భండార్కరు ప్రతి 2-7-8) ధాత, విధాత అనే సితాసితపటాన్ని వయించే (నేసే) ఇరువురు స్త్రీల ప్రసక్తి ఉదంకోపాఖ్యానంలో ఉంది.

యమసభావర్ణనము (సం. 2-8-1)

క. ధర్మసభ లోక ధర్మా। ధర్మ వివేకాస్పదంబు, తైజసము; లస
ద్ధర్మమణితతుల దానిన్। నిర్మించెను విశ్వకర్మ నిపుణత యొప్పన్. 68

ప్రతిపదార్థం: ధర్మ, సభ= యమధర్మరాజుయొక్క సభ; లోకధర్మ+అధర్మ, వివేక+ఆస్పదంబు= లోకంలోని ధర్మాధర్మాల్ని గూర్చి చేసే వివేచనానికి ఉనికిపట్టు; తైజసము= కాంతిమంతం; లసత్+భర్మ, మణి, తతులన్= ప్రకాశించే బంగారంతో, మణి సమూహాలతో; విశ్వకర్మ= దేవశిల్పి; నిపుణతన్= నేర్పుతో; ఒప్పన్; దానిన్, నిర్మించెను.

తాత్పర్యం: యమధర్మరాజుసభ లోకంలోని ధర్మాధర్మాలనుగూర్చి చేసే వివేచనానికి ఉనికిపట్టు. అంతేకాదు అది కాంతిమంతం. మెరిసే బంగారంతో, మణులసమూహాలతో విశ్వకర్మ ఎంతో నేర్పుతో దాన్ని నిర్మించాడు.

విశేషం: విశ్వకర్మ దేవశిల్పి. ప్రభావసుడనే వసువు కుమారుడు.

వ. అది శతయోజనవిస్తారాయామరమణీయంబును గామగామియును సూర్యతేజోనిభశుభతేజంబును సర్వసుఖసంపాదనంబు నయి చూడనొప్పచుండు; నట్టి సభయం దగస్తిమతంగాదిసిద్ధమునులును బితృదేవతలును గాలకింకరులును మూర్తిమంతులైన కాలచక్రక్రతుదక్షిణదిగ్దేవతలును నుగ్రతపంబులును గృతవీర్యజనమేజయజనకబ్రహ్మదత్తపృషదశ్వశంతనువైన్యభూరిద్యుమ్నేంద్రద్యుమ్నమన్మథ మధుకంఠోపరిచరులును మీ జనకుండయిన పాండుమహారాజును నాదిగాఁ గల యనేకరాజఋషులు నుందురు; వీరిచేత ననవరతంబు సేవితుండయి యమరాజు సమస్తజీవుల శుభాశుభకర్మంబు లారయుచుండు. 69

ప్రతిపదార్థం: అది= ఆ యమసభ; శతయోజనవిస్తార+ఆయామ, రమణీయంబును= నూరు ఆమడల విస్తృతిచేత, నిడుపుచేత అందమైనది; కామగామియును= కోరిన చోటికి వెళ్ళగలిగేది; సూర్య, తేజో, నిభ, శుభ, తేజంబును= సూర్యకాంతితో సమానమైన మంచికాంతి కలిగినది; సర్వ, సుఖ, సంపాదనంబున్+అయి= అన్ని సుఖాలను కూర్చునదయి; చూడన్+ఒప్పుచున్+ఉండున్; అట్టి; సభయందు; అగస్తి, మతంగ+ఆది, సిద్ధమునులును= అగస్త్యుడు, మతంగుడు మొదలైన సిద్ధ మహామునులును; పితృదేవతలును; కాల, కింకరులును= యమభటులును; మూర్తిమంతులు+ఐన= రూపుదాల్చిన; కాల, చక్ర, క్రతు, దక్షిణ, దిక్+దేవతలును= కాలచక్రం, యాగాలు, దక్షిణదిక్కులోనిదేవతలు; ఉగ్ర, తపంబులును= ఘోరాలైనతపస్సులును; కృతవీర్య, జనమేజయ, జనక, బ్రహ్మదత్త, పృషదశ్వ, శంతను, వైన్య, భూరిద్యుమ్న+ఇంద్రద్యుమ్న, మన్మథ, మధుకంఠ+ఉపరిచరులును; మీ, జనకుండు+అయిన= మీతండ్రి అయిన; పాండుమహారాజును; ఆదిగాన్+కల= మొదలుగా గల; అనేక, రాజ+ఋషులున్; ఉందురు; వీరిచేతన్; అనవరతంబు= ఎల్లప్పుడు; సేవితుండు+అయి= సేవించబడినవాడయి; యమరాజు= యమధర్మరాజు; సమస్త, జీవుల= అన్నిప్రాణుల; శుభ+అశుభ, కర్మంబులు= మంచిపనులు, చెడుపనులు; ఆరయుచున్+ఉండున్= విచారిస్తూఉంటాడు.

తాత్పర్యం: యమసభ నూరామడల విస్తృతి, నిడుపు కలిగి రమణీయమైంది. కోరుకున్నచోటికి వెళ్ళగలది. సూర్యకాంతితో సమానమైన మంచితేజస్సు కలది. సర్వసుఖాల్ని సమకూర్చేది. చూడ చక్కనిది. ఆ సభలో అగస్త్యమతంగాది సిద్ధమునులు, పితృదేవతలు, యమకింకరులు, రూపుదాల్చిన కాలచక్రం, యాగాలు, దక్షిణదిక్కులోని దేవతలు, ఉగ్రతపస్సులు, కృతవీర్య, జనమేజయ, జనకాదిమహారాజులు, మీతండ్రి అయిన పాండుమహారాజు మొదలుగా గల పెక్కుమంది రాజఋషులును ఉంటారు. వీళ్ళంతా తనను ఎప్పుడూ సేవిస్తుండగా యమధర్మరాజు ప్రాణుల పుణ్యపాపాల్ని గూర్చి విచారిస్తుంటాడు.

విశేషం: పాండురాజుకూడ యమసభలో ఉన్నా డని చెప్పటం భావికథకు ప్రేరకం.

వరుణసభావర్ణనము (సం. 2-9-1)

క. వరుణసభ సర్వలోకో । త్తర ముజ్జ్వలమణిమయము సితప్రభ మతిసుం
దర మందుండు వరుణుఁడును । వరుణానీసహితుఁడై ధ్రువంబగు మహిమన్. 70

ప్రతిపదార్థం: వరుణ, సభ= వరుణుడియొక్కసభ; సర్వలోక+ఉత్తరము= అన్నిలోకాలలో శ్రేష్ఠం; ఉత్+జ్వల, మణిమయము= మిక్కిలిప్రకాశించే మణులతో కూడుకొన్నది; సిత, ప్రభము= తెల్లని కాంతికలది; అతిసుందరము= మిక్కిలి అందమైనది; వరుణుఁడును; వరుణానీ, సహితుఁడు+ఐ= భార్యతో కూడుకొన్నవాడై; ధ్రువంబు+అగు= స్థిరమైన; మహిమన్= మహిమతో; అందున్+ఉండున్.

తాత్పర్యం: వరుణసభ సర్వలోకోత్తరమైంది. మెరిసే మణులతో కూడుకొన్నది. తెల్లనికాంతి కలది. ఎంతో అందమైంది. వరుణుడు భార్యాసహితుడై స్థిరమహిమతో ఆ సభలో ఉన్నాడు.

వ. అది యమరాజు సభయంతియ విస్తారాయామ రామణీయకంబులును గామగామిత్వంబునుం గలిగి విలసిల్లు; జలస్తంభంబు సేసి జలంబులలో నుండి విశ్వకర్మ దాని రమణీయంబుగా రచియించె. 71

ప్రతిపదార్థం: అది= ఆ వరుణుని సభ; యమరాజు, సభ, అంతియ= యమధర్మరాజు సభ అంతే; విస్తార+ఆయామ, రామణీయకంబులును= వెడల్పు, పొడవు, సొగసులూ; కామగామిత్వంబునన్= కోరుకొన్నచోటికి వెళ్ళగలిగినస్థితి; కలిగి; విలసిల్లున్= ప్రకాశిస్తూ ఉంటుంది; విశ్వకర్మ= దేవశిల్పి; జలస్తంభంబు, చేసి= జలస్తంభనవిద్యతో; జలంబులలోన్+ఉండి= నీళ్ళలో ఉండి; దానిన్= ఆ సభను; రమణీయంబుగాన్= సుందరంగా; రచియించెన్= రూపొందించాడు.

తాత్పర్యం: ఆ వరుణసభ యమసభతో సమానమైన వెడల్పు, పొడవు, అందం కలిగి, కోరినచోటికి వెళ్ళగలిగిందై కళకళలాడుతూ ఉంటుంది. విశ్వకర్మ జలస్తంభనవిద్యతో నీళ్ళలో ఉండి ఎంతో మనోహరంగా దాన్ని నిర్మించాడు.

విశేషం: జలస్తంభనం- ఊపిరి బిగబట్టి నీళ్ళ అడుగున జీవించగలగటం- ఇది అరవైనాలుగు కళల్లో ఒకటి. దుర్యోధనుడు కూడ ఈ విద్య నేర్చినవాడే.

సీ. అందు సుఖాసీనుఁడైన యవ్వరుణేంద్రు । నంబుధుల్ నాల్గును నధికభక్తిఁ
గాళింది నర్మద గంగ గోదావరి । విదిశ విపాశ కావేరి కృష్ణ
వేణి సరస్వతి పెన్న యైరావతి । యనఁగఁ బ్రసిద్ధంబులయిన నదులు
సరసీతటాక నిర్ఝర దీర్ఘికాదులు । దిక్కులు నఖిల ధాత్రీధరములు

ఆ. వసుమతియును దేహవంతంబులై వచ్చి । మకర కూర్మ శింశుమార సింహ
శరభ సామజాది జలచర స్థలచర । తతులతోడ సంతతంబుఁ గొలుచు. 72

ప్రతిపదార్థం: అందున్= ఆ సభలో; సుఖ+ఆసీనుఁడు+ఐ= సుఖంగా కొలువుదీరిఉన్న; ఆ+వరుణ+ఇంద్రున్= ఆ వరుణదేవుని; అంబుధుల్= సముద్రాలు; నాల్గును; కాళింది, నర్మద, గంగ, గోదావరి, విదిశ, విపాశ, కావేరి, కృష్ణవేణి, సరస్వతి, పెన్న, ఐరావతి; అనఁగన్= అనేపేర్లతో; ప్రసిద్ధంబులు+అయిన; నదులు; సరసీ, తటాక, నిర్ఝర, దీర్ఘికా+ఆదులు= సరస్సులు, చెరువులు, సెలయేళ్ళు, దిగుడుబావులు మొదలైనవి; దిక్కులున్= దిక్కులూ; అఖిల, ధాత్రీ, ధరములు= అన్ని పర్వతాలు;

వసుమతియును= భూమియు; దేహవంతంబులు+ఐ= దేహాలను ధరించినవై; వచ్చి; మకర, కూర్మ, శింశుమార, సింహ, శరభ, సామజ+ఆది, జలచర, స్థలచర, తతులతోడన్= మొసళ్ళు, తాబేళ్ళు, నీటికోతులు, సింహాలు, శరభాలు, ఏనుగులు మొదలైన జలచర, భూచర ప్రాణుల సమూహాలతో; సతతంబున్= ఎల్లప్పుడు; అధికభక్తిన్= మిక్కిలిభక్తితో; కొలుచున్= సేవిస్తారు.

తాత్పర్యం: ఆ సభలో సుఖంగా కొలువుదీరిఉన్న వరుణదేవుణ్ణి - నాలుగు సముద్రాలు, కాళిందీ నర్మదా గంగా గోదావరీ, కావేరీ మొదలైన నదులు, సరస్సులు, చెరువులు, సెలయేళ్ళు, దిగుడుబావులు, దిక్కులు, పర్వతాలు, భూమి - దేహాలు ధరించివచ్చి, మొసళ్ళు, తాబేళ్ళు, సింహాలు శరభాలు మొదలైన జలచర భూచర సమూహాలతో అన్నివేళలా అధికభక్తితో ఆయనను సేవిస్తుంటారు.

విశేషం: 'అంబుధు లేడు' అని కొన్ని ప్రతుల్లో ఉన్నా 'సముద్రా శ్చత్వారో' (భండార్కరు ప్రతి 2-9-18) అని మూలంలో ఉంది. శింశుమార మంటే మొసలి అనే అర్థంకూడ ఉంది.

వ. మఱియు వాసుక్యైరావతాది నాగరాజులును బ్రహ్లాద విరోచన బలి నరక నముచి విప్రచిత్తి కాలకంఠ కైటభ ఘటోదర దశగ్రీవ విశ్వరూప విరూపాక్షాదులయిన దైత్యదానవ వరులును వరుణు సేవించుచుండుదురు. 73

ప్రతిపదార్థం: మఱియున్; వాసుకి+ఐరావత+ఆది= వాసుకి, ఐరావతుడు మొదలయిన; నాగరాజులును= సర్పరాజులు; ప్రహ్లాద, విరోచన, బలి, నరక, నముచి, విప్రచిత్త, కాలకంఠ, కైటభ, ఘటోదర, దశగ్రీవ, విశ్వరూప, విరూపాక్ష+ఆదులు+అయిన= ప్రహ్లాదుడు, విరోచనుడు, బలి మొదలయిన; దైత్య, దానవ, వరులును= దైత్యదానవశ్రేష్ఠులూ; వరుణున్; సేవించుచున్+ఉండుదురు.

తాత్పర్యం: అంతేకాక వాసుకి, ఐరావతుడు మొదలైన నాగరాజులు, ప్రహ్లాదుడు, విరోచనుడు, బలి, నరకుడు, నముచి, విప్రచిత్తి, కాలకంఠుడు, కైటభుడు, ఘటోదరుడు, దశగ్రీవుడు, విశ్వరూపుడు, విరూపాక్షుడు మొదలైన దైత్యదానవశ్రేష్ఠులు వరుణుణ్ణి సేవిస్తూ ఉంటారు.

విశేషం: ఇంతకంటె అధికంగా సర్పరాజుల పేర్లు మూలంలో ఉన్నాయి. వాసుకి, ఐరావతుడు - కద్రువ కుమారులు. దైత్యులు - కశ్యపునికి దితియందు పుట్టినవాళ్ళు. దానవులు - కశ్యపునికి దనువుకు పుట్టినవాళ్ళు. అందరూ రాక్షసులే.

కుబేర సభావర్ణనము (సం. 2-10-1)

క. ధనదుసభ యింద్రసభతో । నెనయగుచు మహావిభూతి నెంతయు నొప్పుం
దన దివ్యశక్తి నాతం । డొనరఁగ నిర్మించె దాని నుత్తమమణులన్. 74

ప్రతిపదార్థం: ధనదు, సభ= ధనాన్ని ఇచ్చేవాడైన కుబేరుని సభ; ఇంద్రసభతోన్= దేవేంద్రుని సభతో; ఎన, అగుచున్= సాటిగా ఉంటూ; మహా, విభూతిన్= గొప్ప ఐశ్వర్యంతో; ఎంతయున్= మిక్కిలి; ఒప్పున్= ప్రకాశిస్తుంది. అతండు= ఆ కుబేరుడు; తన= తనయొక్క; దివ్య, శక్తిన్= దివ్యమైన శక్తిచేత; దానిన్= ఆ సభను; ఉత్తమ మణులన్= శ్రేష్ఠాలైన మణులతో; ఒనరఁగన్= ఒప్పుగా; నిర్మించెన్= నిర్మించాడు.

తాత్పర్యం: కుబేరునిసభ ఇంద్రసభతో సమానంగా ఉంటుంది. అపారమైన ఐశ్వర్యంతో ఎంతో ప్రకాశిస్తూ ఉంటుంది. కుబేరుడు తనదివ్యశక్తిచేత ఉత్తమమణులతో అతిరమణీయంగా దాన్ని నిర్మించాడు.

వ. అదియును నూఱుయోజనంబుల నిడుపును డెబ్బదియోజనంబుల వెడల్పునుం గలిగి సితప్రభంబయి గగనచరంబయి కనకమయతరులతాలంకృతం బయి తటిల్లతావిచిత్రశరదంబుదంబు ననుకరించు చుండు. 75

ప్రతిపదార్థం: అదియును; నూఱు, యోజనంబుల, నిడుపును= నూరామడల పొడవును; డెబ్బది, యోజనంబుల, వెడల్పును; కలిగి; సిత, ప్రభంబు+అయి= తెల్లటికాంతి కలదై; గగనచరంబు+అయి= ఆకాశంలో తిరుగాడేదై; కనకమయ, తరు, లతా+ అలంకృతంబు+అయి= బంగారుచెట్లతో, తీవలతో అలంకరించబడిందై; తటిత్+లతా, విచిత్ర, శరత్+అంబుదంబున్= మెరుపుతీవలచేత ఆశ్చర్యకరమైన శరత్కాలమేఘాన్ని; అనుకరించుచున్+ఉండున్= పోలి ఉంటుంది.

తాత్పర్యం: ఆ సభ పొడవు నూరామడలు, వెడల్పు డెబ్బది ఆమడలు. తెల్లటి కాంతితో అది ఆకాశంలో చలిస్తూ, బంగారు చెట్లతో, తీవలతో అలంకరించబడి, మెరుపుతీగలతో ఆశ్చర్యకరమైన శరత్కాలమేఘంలా ఉంటుంది.

విశేషం: సభకాంతి తెలుపు, శరత్కాల మేఘకాంతి తెలుపు. సభకు అలంకారాలు-బంగారుచెట్లు, తీవలు. మేఘానికి అలంకారాలు- మెరుపుతీగలు. పోలిక మనోహరం. ఆకాశ సంచారం రెండింటికి సమానం.

క. అందుఁ గుబేరుఁడు పరమా । నందంబున నుండు ధర్మనందన! విలస
న్మందార పారిజాతక । నందన మందానిలాభినందితుఁ డగుచున్. 76

ప్రతిపదార్థం: ధర్మనందనా!= ఓధర్మరాజా!; అందున్= ఆ సభలో; కుబేరుఁడు; పరమ+ఆనందంబునన్= మిక్కిలి ఆనందంతో; విలసత్+మందార, పారిజాతక, నందన, మంద+అనిల+అభినందితుఁడు+అగుచున్= శోభిల్లుతున్న మందార పారిజాత వృక్షాలతో కూడిన నందనవనంలోనుండి మెల్లగా వీస్తున్న చల్లనిగాలిచేత సంతోషింప చేయబడినవాడౌతూ; ఉండున్= కొలువుదీరి ఉంటాడు.

తాత్పర్యం: ఓధర్మరాజా! ఆ సభలో కుబేరుడు మందార పారిజాతాది వృక్షశోభతో శోభిల్లే నందనవనంనుండి మందమారుతంవీస్తుండగా పరమానందంతో కొలువుదీరి ఉంటాడు.

వ. అతని ననవరతంబును నరకిన్నర నాములైన గంధర్వులును, వరాహకర్ణ గజకర్ణ మాణిభద్ర హేమనేత్ర విభీషణ పింగళక ప్రవాళకాదులయిన యక్షులును, నలకూబరుండును, నూర్వశీతిలోత్తమా ఘృతాచీ మేనకా విభావరీ రంభా ప్రభృతులయిన యప్సరసలును సేవింతు; రే నెప్పుడు ననేక దేవర్షి గణంబులతో నరిగి చూచుచుండుదు. 77

ప్రతిపదార్థం: అతనిన్= ఆ కుబేరుని; అనవరతంబును= ఎల్లప్పుడును; నర, కిన్నర, నాములు+ఐన= నరులు, కిన్నరులు అనే పేర్లు కల; గంధర్వులును; వరాహకర్ణ, గజకర్ణ, మాణిభద్ర, హేమనేత్ర, విభీషణ, పింగళక, ప్రవాళక+ఆదులు+అయిన= వరాహకర్ణుడు, గజకర్ణుడు-మొదలైన; యక్షులును; నలకూబరుండును; ఊర్వశీ, తిలోత్తమా, ఘృతాచీ, మేనకా, విభావరీ, రంభా, ప్రభృతులు+అయిన= ఊర్వశి, తిలోత్తమ మొదలైన; అప్సరసలును; సేవింతురు; ఏను= నేను; ఎప్పుడున్= ఎల్లప్పుడు; అనేక, దేవ+ఋషి, గణంబులతోన్= పెక్కుమంది దేవర్షి సమూహాలతో; అరిగి= వెళ్ళి; చూచుచున్+ఉండుదున్.

తాత్పర్యం: అన్ని వేళల ఆ కుబేరుడిని నరులు, కిన్నరులు అనే పేర్లు గల గంధర్వులును, వరాహకర్ణుడు, గజకర్ణుడు మొదలయిన యక్షులు, నలకూబరుడు, ఊర్వశి, తిలోత్తమ మొదలయిన అప్సరసలు సేవిస్తూ ఉంటారు. నేను కూడ ఎప్పుడూ ఎంతోమంది దేవర్షులతో వెళ్ళి అతణ్ణి చూస్తూ ఉంటాను.

ఉ. వానికి నెయ్యుఁడై యమరవంద్యపదాంబుజుఁ డంబికా బృహ
త్పీనపయోధరాగ్ర పరిపీడితవక్షుఁడు భూషణీకృతా
హీనుఁ డశేషలోకగురుఁ డీశ్వరుఁ డెప్పుడు నంద యుండు నా
నా నిశితాయుధాయుతసనాథమహాద్భుతభూతకోటితోన్. 78

ప్రతిపదార్థం: వానికిన్= ఆకుబేరునికి; నెయ్యుఁడు+ఐ= స్నేహితుడై; అమర, వంద్య, పద+అంబుజుఁడు= దేవతలచేత నమస్కరించబడే పద్మాలవంటి పాదాలు కలవాడు; అంబికా, బృహత్+పీన, పయోధర+అగ్రపరిపీడిత, వక్షుఁడు= పార్వతీదేవియొక్క పెద్దవైన, బలిసిన పాలిండ్ల చివరలచే నొక్కబడిన వక్షఃస్థలం కలవాడు; భూషణీకృత+అహి+ఇనుఁడు= ఆభరణాలుగా చేయబడిన పాములరాజైన వాసుకి కలవాడు-అంటే పాములను అభరణాలుగా కలవాడు; అశేష, లోక, గురుఁడు= అన్నిలోకాలకు గురువైనవాడు; ఈశ్వరుఁడు= శివుడు; నానానిశిత+ఆయుధ+అయుత, సనాథ, మహా+అద్భుత, భూత, కోటితోన్= నానావిధాలై వాడి అయిన ఆయుధాలు పదివేలతో కూడుకొన్న మిక్కిలి ఆశ్చర్యకరమైన భూతాల సమూహంతో; ఎప్పుడున్= ఎల్లప్పుడు; అందు+అ, ఉండున్= అందే ఉంటాడు.

తాత్పర్యం: దేవతలు నమస్కరించే పాదపద్మాలు కలవాడు, పార్వతీదేవి పాలిండ్ల చివరలు నొక్కిన వక్షఃస్థలం కలవాడు, పాములరాజైన వాసుకిని ఆభరణంగా కలవాడు, అన్నిలోకాలకు గురుడు అయిన శివుడు కుబేరుడికి స్నేహితుడై పదునైన నానావిధ ఆయుధాలు ధరించి ఆశ్చర్యకరంగా ఉన్న భూతసమూహంతో ఎప్పుడూ అక్కడనే ఉంటాడు.

విశేషం: పిశాచగణాలకు, ప్రమథగణాలకు అధిపతి కనుక శివునికి భూతపతి అనికూడ పేరు. (ఈ పద్యంలో ఓజఃప్రసాదగుణమిశ్రమం వైదర్భీరీతిని రూపుకట్టించింది. ఇటువంటి రచన నన్నయలో విరళంగా కనపడుతుంది. (చూడు. పీఠిక). సంపా.)

బ్రహ్మసభావర్ణనము (సం. 2-11-1)

వ. ఏను దొల్లి మనుష్యలోకంబునం గొండొక కాలంబున్న నా కడకు సూర్యుండు వచ్చి పితామహు సభ వర్ణించినఁ దద్దర్శన కుతూహలుండ నయి యాదిత్యుతోడన యరిగి యక్కమలగర్భుసభం జూచితి. 79

ప్రతిపదార్థం: ఏను= నేను; తొల్లి= పూర్వం; మనుష్య, లోకంబునన్= భూలోకంలో; కొండొక, కాలంబు+ఉన్న= కొంతకాలం ఉండగా; నాకడకున్= నాదగ్గరకు; సూర్యుండు; వచ్చి; పితామహు, సభ= బ్రహ్మదేవునిసభను; వర్ణించినన్= వర్ణించగా; తత్+దర్శన, కుతూహలుండను+అయి= దాన్ని చూడటంలో ఆసక్తి కలవాడినై; ఆదిత్యుతోడన్+అ= సూర్యుని వెంటనే; అరిగి= వెళ్ళి; ఆ, కమల, గర్భు, సభన్= ఆ బ్రహ్మదేవునిసభను; చూచితిన్= చూచాను.

తాత్పర్యం: పూర్వం కొంతకాలం నేను భూలోకంలో ఉన్నప్పుడు నా దగ్గరకు సూర్యుడు వచ్చాడు. బ్రహ్మసభనుగూర్చి వర్ణించాడు. నేనుకూడ దాన్ని చూడాలన్న కుతూహలంతో సూర్యునివెంబడి వెళ్ళి ఆ బ్రహ్మసభను చూచాను.

విశేషం: పితామహుడు - తండ్రులకు తండ్రి - బ్రహ్మ, కమలగర్భుడు - పద్మాన్ని (శ్రీ మహావిష్ణువు యొక్క నాభి కమలాన్ని) పుట్టుకస్థానంగా కలవాడు (శ్రీమహావిష్ణువుయొక్క నాభికమలంనుండి పుట్టినవాడు) - బ్రహ్మ.

చ. దళితవిరోధి! యిట్టి దని దాని తెఱం గెఱుఁగంగ బ్రహ్మకుం
గొలఁదియె తా నవాఙ్మనసగోచర మద్భుతరూప మీ వియ
త్తల మను కంబ మొక్కటియ తాల్పఁగ సుస్థిరమై నిజప్రభా
వలి వెలుఁగించుచుండు శశివారిజమిత్త్రుల మండలంబులన్. 80

ప్రతిపదార్థం: దళితవిరోధి!= అణచివేయబడిన శత్రువులు కలవాడా! ఓధర్మరాజా!; ఇట్టి+అది+అని; దాని, తెఱంగు+ ఎఱుఁగంగన్= ఆ సభయొక్క విధం తెలుసుకోటానికి; బ్రహ్మకున్+కొలఁదియె= బ్రహ్మదేవునికైనా సాధ్యమా!; తాన్=తాను (సభ); అవాక్+మనస, గోచరము= మాటకు, మనస్సుకు అందనిది-అంటే చెప్పసాధ్యంకానిది, ఊహించశక్యంకానిది; అద్భుత, రూపము= ఆశ్చర్యకరమైన రూపం కలది; ఈ, వియత్+తలము+అను= ఈ ఆకాశమనే; కంబము+ఒక్కటి+అ= స్తంభమొక్కటే; తాల్పఁగన్= ధరించగా; సుస్థిరము+ఐ= మంచి నిలకడకలదై; శశి, వారిజ, మిత్త్రుల, మండలంబులన్= చంద్రసూర్యమండలాలను; నిజప్రభా+ఆవలిన్= తనయొక్కకాంతి సమూహాలచేత; వెలుఁగించుచున్+ఉండున్= ప్రకాశించేటట్లు చేస్తూ ఉంటుంది.

తాత్పర్యం: శత్రువుల్ని అణచివేసిన ఓ ధర్మరాజా! బ్రహ్మసభావైభవం ఇలాంటి దని తెలుసుకోటానికి ఆ బ్రహ్మకైనా సాధ్యం కాదు. అది చెప్ప సాధ్యం కానిది. ఊహకు కూడా అందనిది. దానిరూపం అద్భుతం. ఆకాశమనే స్తంభ మొక్కటే దాన్ని ధరిస్తూ ఉండగా, సుస్థిరంగా నిలిచి, తన కాంతులతో చంద్రసూర్యమండలాల్ని ప్రకాశింపచేస్తూ ఉంటుంది.

విశేషం: వారిజము - నీటినుండి పుట్టింది - పద్మం. దానికి మిత్త్రుడు - సూర్యుడు. 'వాఙ్మనసము' - ఇది నిపాతం. స్త్రీపుంసము, వాఙ్మనసము, రాత్రిందివము మొదలయినవి. (అచతు రేత్యాది పాణినీయ సూత్రం చూచేది). (పద్యరచనలో ప్రసాదగుణం ప్రసన్న మౌతున్నది. సంపా.)

వ. 'అం దనేకవిధ జీవరాసుల సృజియించుచు నధికతపస్వుల తపఃఫలంబులు విధించుచు విశ్వకర్తలైన మన్వత్రి మరీచి భృగు భరద్వాజ దక్ష వసిష్ఠ వాలఖిల్య పులస్త్య పులహ క్రతు కశ్యప గౌతమాంగిరః ప్రచేతసులును, జంద్రాదిత్యగ్రహనక్షత్రగణంబులును, దేవగణంబులును, వసురుద్రసిద్ధసాధ్యులును, బ్రజావంతులైన పంచాశత్సహస్రమునులును, నూర్ధ్వరేతసులయిన యష్టాశీతిసహస్రమునులును. నాశ్వినులును, విశ్వదేవతలును, విశ్వకర్మయుం, బితృదేవతలునుం దన్నుం బరివేష్టించి యుండ ధర్మార్థకామమోక్షంబులును, శబ్దస్పర్శరూపరసగంధంబులును, దపశ్శమదమంబులును, ధృతి స్మృతి మేధాబుద్ధి క్షమా కీర్తులును, సంకల్ప వికల్పప్రణవంబులును, క్షణలవత్రుటి కాష్ఠా ముహూర్తాహోరాత్ర పక్షమాస ఋతు సంవత్సర యుగాత్మకంబైన కాలచక్రంబును. ఋగ్యజుస్సామాథర్వణవేదవేదాంగంబులును,

బురాణేతిహాసంబులును, బహుప్రకారభాషలును, సమస్తవిద్యలును మూర్తిమంతంబులైకొలువ సరస్వతీ సమేతుండై పరమానందంబునం బరమేష్ఠి పద్మాసనంబున నుండు' నని లోకపాలురసభలను బ్రహ్మసభను వర్ణించిన నారదునకు ధర్మరా జి ట్లనియె. 81

ప్రతిపదార్థం: అందున్+అనేకవిధ, జీవరాసులన్= ఆ సభలో పెక్కువిధాలైన ప్రాణుల సమూహాల్ని; సృజియించుచున్= సృష్టిచేస్తూ, అధిక, తపస్వుల= ఎక్కువ తపస్సు చేసినవాళ్ళయొక్క; తపః, ఫలంబులు= తపస్సుల ఫలాలను; విధించుచున్= నిర్ణయిస్తూ; విశ్వకర్తలు+ఐన= విశ్వాన్ని రూపొందించిన; మను+అత్రి, మరీచి, భృగు, భరద్వాజ, దక్ష, వసిష్ఠ, వాలఖిల్య, పులస్త్య, పులహ, క్రతు, కశ్యప, గౌతమ+అంగిరః; ప్రచేతసులును; చంద్ర+ఆదిత్య, గ్రహ, నక్షత్ర, గణంబులును= చంద్రసూర్యగ్రహ నక్షత్ర సమూహాలూ; దేవగణంబులును= దేవతల సమూహాలూ; వసు, రుద్ర, సిద్ధ, సాధ్యులును; ప్రజావంతులు+ఐన= సంతానంగల; పంచాశత్+సహస్ర మునులును= యాభైవేలమంది మునులూ; ఊర్ధ్వరేతసులు+అయిన= ఇంద్రియాన్ని ఊర్ధ్వముఖం కావించిన - అంటే బ్రహ్మచారులైన; అష్ట+అశీతి, సహస్రమునులును= ఎనభైఎనిమిదివేలమంది మునులూ; ఆశ్వినులును= అశ్వినీదేవతలూ; విశ్వదేవతలును; విశ్వకర్మయున్, పితృదేవతలున్, తన్నున్= తనను (ఆబ్రహ్మదేవుణ్ణి); పరివేష్టించి, ఉండన్= చుట్టును చేరి కొలుస్తుండగా; ధర్మ+అర్థ, కామ, మోక్షంబులును; శబ్ద, స్పర్శ, రూప, రస, గంధంబులును; తపస్+శమ, దమంబులును= తపస్సును అంతర్బహిరింద్రియ నిగ్రహాలూ; ధృతి, స్మృతి, మేధా, బుద్ధి, క్షమా, కీర్తులును; సంకల్ప, వికల్ప, ప్రణవంబులును; క్షణ, లవ, త్రుటి, కాష్ఠా, ముహూర్త+అహః+రాత్ర, పక్ష, మాస, ఋతు, సంవత్సర, యుగ+ఆత్మకంబు+ఐన, కాలచక్రంబును= క్షణం, లవం వంటి కాలవిభాగాలతో కూడిన కాలచక్రమూ; ఋక్, యజుస్, సామ+అథర్వణవేద, వేద+ అంగంబులును= నాలుగువేదాలు, వేదాంగాలు; పురాణ+ఇతిహాసంబులును; బహు, ప్రకార, భాషలును= అనేకవిధాలైన భాషలూ; సమస్తవిద్యలును; మూర్తి మంతంబులు+ఐ= ఆకారాన్ని ధరించినవై; కొలువన్; సరస్వతీ, సమేతుండు+ఐ= సరస్వతీదేవితో కూడినవాడై; పరమ+ఆనందంబునన్; పరమేష్ఠి= బ్రహ్మదేవుడు; పద్మ+ఆసనంబునన్, ఉండున్+అని; లోకపాలుర, సభలను= లోకపాలురు - దిక్పాలకులైన ఇంద్ర, యమ, వరుణ, కుబేర, సభలను; బ్రహ్మసభను; వర్ణించిన; నారదునకున్; ధర్మరాజు+ ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'విశ్వకర్తలైన మనువు, అత్రి, మరీచి మొదలయినవాళ్ళు, సూర్య చంద్ర గ్రహనక్షత్ర సమూహాలు, దేవగణాలు, వసువులు, రుద్రులు, సిద్ధులు, సాధ్యులు సంతానవంతులైన యాభైవేలమంది మహామునులు, ఊర్ధ్వరేతసు లయిన ఎనభై ఎనిమిదివేలమంది మహర్షులు, అశ్వినీదేవతలు, విశ్వదేవతలు, విశ్వకర్మ, పితృదేవతలు, రూపుదాల్చిన ధర్మార్థకామమోక్షాలు, శబ్దస్పర్శరూపరసగంధాలు, తపస్సు, శమం, దమం, ధృతి, స్మృతి, మేధ, బుద్ధి, క్షమ, కీర్తి, సంకల్పం, వికల్పం, ప్రణవం (ఓంకారం), క్షణం, లవం, త్రుటి, కాష్ఠ, ముహూర్తం, పగలు, రాత్రి, పక్షం, మాసం మొదలయిన విభాగాలతో కూడిన కాలచక్రం, చతుర్వేదాలు, వేదాంగాలు, పురాణేతిహాసాలు, బహువిధ భాషలు, సమస్త విద్యలు, ఆకారం తాల్చి తనను సేవిస్తూ ఉండగా, సరస్వతీ సమేతుడై, వివిధ జీవరాసుల్ని సృజిస్తూ, మహాతపస్వుల తపఃఫలాలు నిర్ణయిస్తూ, బ్రహ్మదేవుడు పద్మాసనంమీద ఆ సభలో కొలువు తీరి ఉంటాడు'- అని దిక్పాలురసభలను, బ్రహ్మదేవునిసభను వర్ణించిన నారదమహర్షితో ధర్మరాజు ఇలా అన్నాడు.

విశేషం: బ్రహ్మదేవునిసభ ఎవ రెవరితో ఎంత క్రిక్కిరిసి ఉంటుందో, ఆయన ఎన్నెన్ని విషయాలలో ఎంత నిర్విరామంగా కృషి చేస్తుంటాడో ఈవచనం వ్యక్తం చేస్తుంది. వసువులు-ఆపుడు, ధ్రువుడు, సోముడు, అధ్వరుడు, అనిలుడు, ప్రత్యూషుడు, అనలుడు, ప్రభాసుడు. రుద్రులు- అజుడు, ఏకపాదుడు, అహిర్బుధ్న్యుడు, త్వష్ట, రుద్రుడు, హరుడు, శంభుడు, త్ర్యంబకుడు,

అపరాజితుడు, ఈశానుడు, త్రిభువనుడు. సిద్ధులు, సాధ్యులు దేవతల్లో రెండు తెగలు. ధర్మార్థకామమోక్షాలు-చతుర్విధపురుషార్థాలు. శబ్ద స్పర్శ రూప రస గంధాలు పంచభూతాలైన ఆకాశ వాయు కాంతి జల పృథివీ ధర్మాలు. వీటినే పంచతన్మాత్ర లని వ్యవహరించటం ఉంది. శమము-శాంతి,- అంతరింద్రియ నిగ్రహం. దమము-ఓర్పు-బాహ్యేంద్రియ నిగ్రహం. ప్రణవం - ఓంకారం. వేదాంగాలు - శిక్ష. వ్యాకరణం, ఛందం, నిరుక్తం జ్యోతిషం, కల్పం, పురాణం - సృష్టి. ప్రతిసృష్టి. వంశం, మన్వంతరం, వంశానుచరితం అనే ఐదు లక్షణాలు గల పురాతన చరిత్ర. పురాణాలు పద్దెనిమిది - మత్స్య, మార్కండేయ, భాగవత, భవిష్యత్, బ్రహ్మాండ, బ్రాహ్మ, బ్రహ్మవైవర్త, వామన, వాయవ్య, వైష్ణవ, వరాహ, అగ్ని, నారద, పద్మ, లింగ, గరుడ, కూర్మ, స్కాందాలు. ఇతిహాసం- ఇతి+హ+ఆస - పూర్వరాజుల చరిత్ర - భారతం లాంటిది.

హరిశ్చంద్రుమాహాత్మ్యము (సం. 2-11-48)

మధ్యాక్కర.

పరమధర్మాత్మకుఁ డయిన పాండుభూపతిఁదొట్టి సకల
ధరణీశులెల్ల యముసభ నుండంగఁ, దా నేమి పుణ్య
చరితఁ బ్రవర్తిల్లెనయ్య దేవేంద్రసభ హరిశ్చంద్రుఁ
డురుతరమహిమతో దేవపూజ్యుఁడై యుండంగఁ గనియె? 82

ప్రతిపదార్థం: పరమ, ధర్మ+ఆత్మకుఁడు+అయిన= మిక్కిలిధర్మాత్ముఁడైన; పాండుభూపతిన్, తొట్టి= పాండురాజు మొదలుగాగల; సకల, ధరణీ+ఈశులు+ఎల్లన్= సమస్త భూమండలానికి రాజులైన వా రందరు; యము, సభన్= యమధర్మరాజుయొక్క సభలో; ఉండంగన్= ఉండగా; హరిశ్చంద్రుఁడు; తాను+ఏమి; పుణ్యచరితన్= పవిత్రవర్తనంతో; ప్రవర్తిల్లెన్+అయ్య= నడవడి సాగించాడో; ఉరుతర, మహిమతోన్= గొప్ప మహిమతో; దేవ, పూజ్యుఁడు+ఐ= దేవతలకు పూజించదగినవాడై; దేవ+ఇంద్ర, సభన్= దేవేంద్రునియొక్కసభలో; ఉండంగన్, కనియెన్= ఉండగలిగాడు.

తాత్పర్యం: పరమధర్మాత్ముడైన పాండురాజు మొదలుగాగల రాజులంతా యమసభలో ఉండగా, ఏ పవిత్ర చరిత్రవల్ల హరిశ్చంద్రమహారాజు మహామహిముడై, దేవతలకే పూజ్యుడై దేవేంద్రుని సభలో ఉండగలిగినాడో కదా!

విశేషం: రాజ్యపాలకులంతా ఏదో ఒక్క కారణంగా యమలోకం చేరక తప్ప దని కాబోలు 'రాజ్యాంతే నరకం ధ్రువమ్' అన్నారు.

వ. అని యడిగిన ధర్మరాజునకు హరిశ్చంద్రు మహిమాతిశయంబు నారదుం డి ట్లని చెప్పె. 83

ప్రతిపదార్థం: అని; అడిగిన; ధర్మరాజునకు; నారదుండు; హరిశ్చంద్రు, మహిమ+అతిశయంబు= హరిశ్చంద్రుని ప్రభావం యొక్క గొప్పతనాన్ని; ఇట్లు+అని; చెప్పెన్;

తాత్పర్యం: ధర్మరాజు ఆ విధంగా అడిగేసరికి, నారదమహర్షి హరిశ్చంద్రుని గొప్పతనాన్ని ఈ విధంగా చెప్పాడు.

ఉ. దీపితసత్యసంధుఁడు ధృతిస్మృతిధర్మపరాయణుం డయో
ధ్యాపురనాయకుండు జలజాప్తకులైకవిభూషణుండు వి

ద్యాపరమార్థవేది శరదబ్జసముజ్జ్వలకీర్తిచంద్రికా
స్నాపితసర్వలోకుఁడు త్రిశంకునరేంద్రసుపుత్త్రుఁ డున్నతిన్. **84**

ప్రతిపదార్థం: త్రిశంకు, నర+ఇంద్ర, సుపుత్త్రుఁడు= త్రిశంకుమహారాజుయొక్క ఉత్తముడైన కుమారుడు - హరిశ్చంద్రుడు; ఉన్నతిన్= గొప్పతనంలో; దీపిత, సత్యసంధుఁడు= ప్రకాశింపజేయబడిన సత్యవాక్యప్రతిజ్ఞకలవాడు; ధృతి, స్మృతి, ధర్మ పరాయణుండు= యజ్ఞ (ధైర్య) శాస్త్రధర్మాలలో ఎంతో ఆసక్తి కలవాడు; అయోధ్యాపుర, నాయకుండు= అయోధ్యానగరానికి రాజు; జలజ+ఆప్త, కుల+ఏక, విభూషణుండు= పద్మాలకు ఆప్తుడైన సూర్యునివంశానికి ప్రధానమైన అలంకారమైనవాడు - అంటే సూర్యవంశంలో ప్రసిద్ధుడైన రాజు; విద్యా, పరమ+అర్థ, వేది= విద్యయొక్క పరమార్థాన్ని తెలిసికొన్నవాడు; శరత్+అబ్జ, సముజ్జ్వల, కీర్తి, చంద్రికా, స్నాపిత, సర్వలోకుఁడు= శరత్కాలంలోని పద్మంవలె మిక్కిలి కాంతిమంతమైన కీర్తి అనే వెన్నెలచేత స్నానం చేయించబడిన అన్నిలోకాలుకలవాడు - అంటే అన్నిలోకాలకు వ్యాపించిన కీర్తి కలవాడు.

తాత్పర్యం: త్రిశంకుమహారాజు కుమారుడైన హరిశ్చంద్రుడు పేరుకెక్కిన సత్యసంధుడు. యజ్ఞంలో, ధైర్యంలో, శాస్త్రంలో, ధర్మంలో ఎంతో ఆసక్తి కలవాడు. అయోధ్యానగరానికి ప్రభువు. సూర్యవంశం మొత్తానికి అలంకారమైనవాడు. విద్యాపరమార్థాన్ని తెలుసుకున్నవాడు. అన్నిలోకాలకు వ్యాపించిన కీర్తికలవాడు.

విశేషం: అలం: ఉపమ, రూపకం. అనేకప్రతుల్లో ఈ పద్యం లేదు. రచన ప్రసాదగుణబంధురం. (సంపా.)

సీ. జయశీలుఁడయి హరిశ్చంద్రుండు దొల్లి స । ప్తద్వీపములఁ దన బాహుశక్తిఁ
జేసి జయించి నిశ్శేషితశత్రుఁడై । ధారుణిలోఁ గల ధరణిపతుల
నిజశాసనంబున నిలిపి నిత్యంబైన । మహిమతో సకలసామ్రాజ్య మొప్ప
రాజసూయంబు తిరంబుగా నొనరించి । తనరి యథోచితదక్షిణలకు

ఆ. నేనుమడుఁగు లర్థ మిచ్చి యాజకులఁ బూ । జించి భక్తితో విశిష్ట విప్ర
జనుల కభిమతార్థసంప్రదానంబులఁ । దృప్తిసేసె వంశదీపకుండు. **85**

ప్రతిపదార్థం: వంశ, దీపకుండు= వంశం వెలిగించేవాడైన హరిశ్చంద్రుడు; జయశీలుఁడు+ఐ= జయించే స్వభావం కలవాడై; తొల్లి= పూర్వం; సప్త, ద్వీపములన్= ఏడుదీవులను; తన= తనయొక్క; బాహుశక్తిన్, చేసి= భుజబలంతో; జయించి; నిః+శేషిత, శత్రుఁడు+ఐ= మిగలని శత్రువులు కలవాడై, అంటే శత్రువు లందరిని జయించి; ధారుణిలోన్, కల= భూమిలో ఉన్న; ధరణిపతులన్= రాజుల్ని; నిజశాసనంబునన్= తన ఆజ్ఞలో; నిలిపి; నిత్యంబు+ఐన, మహిమతోన్= శాశ్వతమైన గొప్పతనంతో; సకల సామ్రాజ్యము+ఒప్పన్= సమస్త సామ్రాజ్యం ప్రకాశించగా; రాజసూయంబు= రాజసూయమహాయాగం; తిరంబుగాన్= స్థిరంగా; ఒనరించి= చేసి; తనరి= అతిశయించి; యథా+ఉచిత, దక్షిణలన్= ఎవరెవరికి ఎంతెంతగా ఇవ్వదగిన దక్షిణలకు; ఏనుమడుఁగులు= ఐదురెట్లు; అర్థము+ఇచ్చి= ధనాన్ని ఇచ్చి; యాజకులన్= యజ్ఞం చేయించేవారిని; పూజించి; భక్తితోన్; విశిష్ట, విప్ర, జనులకున్= గొప్పవారైన బ్రాహ్మణులకు; అభిమత+అర్థ, సంప్రదానంబులన్= కోరుకొన్నవస్తువులను ఇవ్వటంచేత; తృప్తి, చేసెన్= తృప్తి నొందించాడు;

తాత్పర్యం: సూర్యవంశాన్ని ప్రకాశింపజేసే హరిశ్చంద్ర మహారాజు, జయించాలన్న స్వభావంతో, సప్తద్వీపాల్ని తన బాహుబలంతో జయించాడు. శత్రువు లెవ్వరూ మిగులకుండ, నేలమీది రాజులంతా తన ఆజ్ఞ మీరకుండ చేశాడు.

శాశ్వతవైభవంతో తన సామ్రాజ్యమంతా ప్రకాశించేటట్లు - రాజసూయమహాయాగం చేశాడు. యాజ్ఞికు లందరికి ఇవ్వదగిన దక్షిణలకంటె ఐదింత లిచ్చి పూజించాడు. బ్రాహ్మణోత్తముల కోర్కెలన్నీ భక్తితో తీర్చాడు.

విశేషం: ద్వీపం - నాల్గువైపుల నీరున్న భూభాగం-దీవి. సప్తద్వీపాలు - జంబూ, ప్లక్ష, శాల్మల, కుశ, క్రౌంచ, శాక, పుష్కరాలు, యాజకుడు-యాజ్ఞికుడు-యాగం నడిపేవాడు - ఋత్విక్కు.

క. ఉరుతరధనసంతర్పిత । ధరణీసురు లతని నతిముదంబున దీవిం
చిరి 'రాజులందు లోకో । త్తరతేజోధర్మయుక్తిఁ దనరుమ' యనుచున్. 86

ప్రతిపదార్థం: ఉరుతర, ధన, సంతర్పిత, ధరణీసురులు= గొప్పధనదానాలచేత లెస్సగా తృప్తి పొందించబడిన బ్రాహ్మణులు; అతనిన్= ఆ హరిశ్చంద్రుణ్ణి; అతిముదంబునన్= మిక్కిలి సంతోషంతో; రాజుల+అందున్= రాజుల్లో; లోక+ఉత్తర, తేజః, ధర్మయుక్తిన్= లోకాతీతమైన తేజస్సుతో, ధర్మంతో కూడినవాడివై; తనరుము+అ= ఒప్పుమా!; అనుచున్; దీవించిరి.

తాత్పర్యం: హరిశ్చంద్రుడు కావించిన గొప్ప ధనదానాలతో లెస్సగా తృప్తిపొందిన బ్రాహ్మణులు మిక్కిలి సంతోషంతో 'రాజు లందరిలో నీవు లోకాతీతతేజస్సుతో, ధర్మంతో ప్రకాశించు' అని ఆశీర్వదించారు.

వ. వాఁడును బ్రాహ్మణ వచనంబునం జేసి యెల్ల రాజులకు నధికుండయి రాజసూయమహాయజ్ఞకరణంబునం జేసి దేవేంద్రుసాలోక్యంబు వడసె; నట్టి హరిశ్చంద్రు మహిమాతిశయంబు రాజసూయ నిమిత్తంబున నయినదిగా నెఱింగి రాజలోకంబుతో వైవస్వతసభ నుండు భవజ్జనకుండు పాండురాజు నాతో ని ట్లనియె. 87

ప్రతిపదార్థం: వాఁడును= ఆ హరిశ్చంద్రుడుకూడ; బ్రాహ్మణ, వచనంబునన్+చేసి= బ్రాహ్మణులయొక్క ఆశీర్వచనంచేత; ఎల్లరాజులకున్= అందరు రాజులకంటె; అధికుండు+అయి= గొప్పవాడై; రాజసూయ, మహాయజ్ఞ, కరణంబునన్+చేసి= రాజసూయ మహాయజ్ఞాన్ని చేయటంచేత; దేవేంద్రు, సాలోక్యంబు= దేవేంద్రుని చేరే స్థితిని; పడసెన్= పొందాడు; అట్టి, హరిశ్చంద్రు, మహిమ+అతిశయంబు= హరిశ్చంద్రుని గొప్పతనంయొక్క ఆధిక్యాన్ని; రాజసూయ, నిమిత్తంబునన్= రాజసూయ యాగ కారణాన; అయినది, కాన్= ఏర్పడినట్టిదిగా; ఎఱింగి= తెలిసికొని; రాజలోకంబుతోన్= రాజుల సమూహంతో; వైవస్వత, సభన్, ఉండు= యమధర్మారాజు సభలో ఉండే; భవత్, జనకుండు= నీయొక్క తండ్రి; పాండురాజు; నాతోన్+ఇట్లు+అనియెన్= నాతో ఈవిధంగా అన్నాడు.

తాత్పర్యం: హరిశ్చంద్రుడు బ్రాహ్మణాశీర్వచనంవల్ల అందరు రాజులకంటె అధికుడై, రాజసూయమహాయజ్ఞం చెయ్యటంవల్ల దేవేంద్రలోకాన్ని పొందాడు. హరిశ్చంద్రునికి ఆ మహిమాతిశయం అంతా రాజసూయ మహాయాగ కారణంగానే వచ్చిం దని గ్రహించి, యమసభలో రాజు లందరితో ఉన్న మీ తండ్రి నాతో ఇలా అన్నాడు.

నారదుఁడు పాండురాజువచనంబులు ధర్మజుని కెఱింగించుట (సం. 2-11-65)

క. జనపతులు రాజసూయం । బొనరించిన వారు శక్రునొద్దను సురపూ
జన లొందుచుండుదురు కో । రిన కోర్కులు వడయుచును హరిశ్చంద్రుక్రియన్. 88

ప్రతిపదార్థం: జనపతులు= రాజులు; రాజ, సూయంబు+ఒనరించినవారు= రాజసూయ మహాయాగం చేసినవారు; హరిశ్చంద్రు, క్రియన్= హరిశ్చంద్రుడివలె; శక్రు, ఒద్దను= దేవేంద్రుడి దగ్గర; కోరిన, కోర్కులు; పడయుచును= పొందుతూ; సుర, పూజనలు+ఒందుచున్= దేవతలయొక్క పూజలు అందుకొంటూ; ఉండుదురు.

తాత్పర్యం: రాజసూయయాగం చేసిన రాజులంతా హరిశ్చంద్రునిలా తమ కోర్కెలు తీర్చుకొంటూ దేవతల పూజలు అందుకుంటూ దేవేంద్రుని దగ్గర ఉంటారు.

చ. గొనకొని మర్త్యలోకమునకుం జని సన్మునినాథ! యిందు నా
యునికిని రాజసూయమఖ మున్నతిఁ జేసిన ధన్యు లింద్రునం
దునికియు నా తనూజున కనూనయశోనిధి యైన ధర్మనం
దనునకుఁ జెప్పి వాని నుచితస్థితిఁ బన్పుఁడు దానిఁ జేయఁగన్. 89

ప్రతిపదార్థం: సత్+మునినాథ!= ఓమహామునీంద్రా!; గొనకొని= పూనుకొని; మర్త్య, లోకమునకున్+చని= మానవలోకానికి వెళ్ళి; ఇందున్= ఈ యమసభలో; నా, ఉనికిని= నేను ఉండటాన్ని; రాజసూయ, మఖము+ఉన్నతిన్+చేసిన, ధన్యులు= రాజసూయ యజ్ఞాన్ని గొప్పగా చేసిన పుణ్యాత్ములు; ఇంద్రునందున్+ఉనికియు= ఇంద్రసభలో ఉండటాన్ని; నా, తనూజునకున్= నా కుమారునికి; అనూన, యశోనిధి+ఐన= సాటిలేని కీర్తికి స్థానమైన; ధర్మనందనునకున్, చెప్పి; వానిన్= అతడిని; దానిన్, చేయఁగన్= ఆ యజ్ఞాన్ని చెయ్యటానికి; ఉచిత, స్థితిన్, పన్పుఁడు= తగువిధంగా ఆజ్ఞాపించండి.

తాత్పర్యం: ఓ నారద మునీంద్రా! మీరు మానవలోకానికి వెళ్ళి నేను యమసభలో ఉన్న విషయాన్ని, రాజసూయ మహాయాగం చేసిన పుణ్యాత్ములంతా ఇంద్రసభలో ఉన్న విషయాన్ని, కీర్తి సంపన్నుడైన నా కుమారుడు ధర్మరాజుకు చెప్పండి. ఆ యాగం చెయ్యటానికి ఉచితరీతిని అతణ్ణి ఆజ్ఞాపించండి.

విశేషం: అర్థనైర్మల్యంతోకూడిన శిథిలబంధం ప్రసాదగుణాన్ని రూపొందించి పాండురాజు చిత్తవృత్తిని వ్యక్తంచేస్తున్నది. (సంపా.)

చ. అనుపమశక్తిమంతులు మదాత్మజు లేవురు దేవతావరం
బున నుదయించి యున్న కృతపుణ్యులు; వారలలోన నగ్రజుం
డనఘుఁడు రాజసూయము మహామతిఁ జేయఁగ నోపు శత్రుసూ
దనుఁ డయి సార్వభౌముఁ డయి తమ్ముల బాహుబలంబు పెంపునన్. 90

ప్రతిపదార్థం: అనుపమ, శక్తిమంతులు= సాటిలేని బలం కలవాళ్ళు; మత్+ఆత్మజులు= నాయొక్కకుమారులు; ఏవురు= ఐదుగురు; దేవతావరంబునన్= దేవతలయొక్కవరంచేత; ఉదయించి= పుట్టిఉన్న; కృత, పుణ్యులు= చేయబడిన పుణ్యం కలవారు - అంటే పుణ్యపురుషులు; వారలలోనన్= వారిలో; అగ్రజుడు= పెద్దవాడు; అనఘుఁడు= పాపరహితుడు-అంటే పుణ్యాత్ముడు; రాజసూయము; మహా, మతిన్= గొప్పబుద్ధితో; తమ్ముల= తమ్ములయొక్క; బాహు, బలంబు, పెంపునన్= భుజబలంయొక్క ఆధిక్యంతో; శత్రుసూదనుఁడు+అయి= శత్రువుల్ని జయించినవాడై; సార్వభౌముఁడు+అయి= భూమినంతా పరిపాలించేవాడయి; చేయఁగన్+ఓపున్= చెయ్యగలడు.

తాత్పర్యం: నాకుమారులు ఐదుగురు సాటిలేని శక్తి సంపన్నులు. దేవతల వరాలవల్ల పుట్టిన పుణ్యాత్ములు. పెద్దవాడు ధర్మజుడు తమ్ముల భుజబలంతో శత్రువుల్ని జయించి, చక్రవర్తి అయి రాజసూయమహాయాగం చెయ్యగలడు.

విశేషం: పైపద్యంలోవలె ఇందులోనూ ప్రసాదగుణం ప్రసన్నమౌతున్నది; ధర్మరాజు ధీరోదాత్తవ్యక్తిత్వాన్ని వ్యంజింపచేస్తున్నది.(సంపా.)

వ. అట్లేని నాకు నస్మత్పితృ పితామహ నివహంబుతోడ నాకాధిపలోక సుఖావాప్తి యగు ననిన నప్పాండురాజు వచనంబు నీ కెఱింగించు వేడుక నిట వచ్చితి. 91

ప్రతిపదార్థం: అట్లు+ఏనిన్= ఆ విధంగా అయితే-అంటే-ధర్మరాజు రాజసూయమహాయాగం చేస్తే; నాకున్= నాకు; అస్మత్+పితృ, పితామహ, నివహంబుతోడన్= నాతండ్రి తాతల సమూహంతోకూడ; నాక+అధిప, లోక, సుఖ+అవాప్తి, అగున్= స్వర్గానికి అధిపతి అయిన ఇంద్రునియొక్క లోకంలోని సుఖాన్ని పొందటం కలుగుతుంది; అనినన్= అని అనగా; ఆ+పాండురాజు, వచనంబు= ఆ పాండురాజు యొక్కమాట; నీకున్; ఎఱింగించు, వేడుకన్= నీకు తెలియచెయ్యాలన్న కుతూహలంతో; ఇటన్= ఇచ్చటికి; వచ్చితిన్= వచ్చాను.

తాత్పర్యం: 'ఆ విధంగా ధర్మరాజు రాజసూయం చేస్తే, నాకు పితృ పితామహ సమూహంతో ఇంద్రలోక సుఖప్రాప్తి కలుగుతుంది' అని ఆ పాండురాజు చెప్పినమాట నీకు తెలియచెయ్యాలన్న కుతూహలంతో ఇక్కడికి వచ్చాను.

క. న్యాయమున రాజసూయము । సేయుము; నీ పితృగణంబుఁ జెచ్చెర నధిక
శ్రీయుత సురగణపూజ్యులఁ । జేయుము; శక్రుసభ నుండఁ జేయుము వారిన్. 92

ప్రతిపదార్థం: అధిక, శ్రీ, యుత= గొప్ప సంపదతో కూడిన ధర్మరాజా!; న్యాయమునన్= న్యాయమార్గంలో; రాజసూయము, చేయుము; చెచ్చెరన్= వేగమే; సురగణపూజ్యులన్= దేవతల సమూహంచేత పూజించదగిన వాళ్ళనుగా; చేయుము; వారిన్= వాళ్ళను; శక్రుసభన్= దేవేంద్రుని సభలో; ఉండన్+చేయుము= ఉండేటట్లు చేయుము.

తాత్పర్యం: మహాసంపన్నుడవైన ఓ ధర్మరాజా! న్యాయమార్గంలో రాజసూయం చేసి నీ పితృదేవతాసమూహం దేవతాసమూహంచే శీఘ్రమే పూజలందుకొనేటట్లు, దేవేంద్రసభలో ఉండేటట్లు చెయ్యి.

విశేషం: పాండురాజు కోరికను మిత్రసమ్మితంగా ప్రబోధించిన నారదమహర్షియొక్క ఈ వాక్యాలు సభాపర్వకథార్థాలకు బీజతుల్యాలు. భవిష్యద్ద్రష్ట అయిన శ్రీకృష్ణుడు రాజసూయయాగా ధ్వరయోగ్యమైన సభను మయునిచేత నిర్మింపచేసి, నాంది నాలపించి నిష్క్రమించిన సూత్రధారునివలె ద్వారవతీ నగరానికి వెళ్ళాడు. నాంద్యంతాన ప్రవేశించే మరొక సూత్రధారునివలె నారదుడు వచ్చి, సభాసార్థక్యాన్ని సాధించే సవనప్రయోగాన్ని పితృవాక్యపరిపాలనధర్మంలోని అంగంగా నిర్దేశించాడు. నారదుని హితవాక్యాలతో కూడిన ఈ పద్యంలో 'సమత' అనే శబ్దగుణం సందర్భోచితంగా రాణించి, ఋషియొక్క సమతాబుద్ధిని ప్రసన్నతను ధ్వనింపజేస్తున్నది. పద్యనిర్మాణంలోని సమతకూడా గమనించతగింది. (సంపా.)

వ. 'దిగ్విజయోపార్జితంబులయిన ధనంబుల బ్రాహ్మణసంతర్పణంబును ధర్మమార్గంబునం జాతుర్వర్ణ్యాశ్రమ రక్షణంబునుం జేసి సామ్రాజ్యంబు పూజ్యంబై యొప్పం బ్రకాశింపుము; మఱి రాజసూయంబు బహు

విఘ్నంబు, బ్రహ్మరాక్షసులు దానిరంధ్రంబ రోయుచుండుదు; రదియును నిర్విఘ్నంబున సమాప్తం బయ్యెనేని నిఖిల ప్రజాప్రళయ కారణంబయిన రణంబగు'నని చెప్పి నారదుం డరిగినఁ దమ్ములంజూచి ధర్మతనయుండు ధౌమ్య ద్వైపాయన సుహృద్బాంధవ మంత్రి సమక్షంబున ని ట్లనియె. 93

ప్రతిపదార్థం: దిక్+విజయ+ఉపార్జితంబులు+అయిన= దిగ్విజయంచేత సంపాదించబడిన; ధనంబులన్= సంపదలతో; బ్రాహ్మణ, సంతర్పణంబును= బ్రాహ్మణుల్ని తృప్తి పెట్టటం; ధర్మ, మార్గంబునన్, చాతుర్వర్ణ్య+ఆశ్రమ, రక్షణంబునున్+చేసి= ధర్మమార్గంలో బ్రాహ్మణ క్షత్రియ, వైశ్య శూద్రవర్ణాలవారిని, బ్రహ్మచర్య, గార్హస్థ్య, వానప్రస్థ, సన్న్యాసాశ్రమాలను రక్షించటంచేత; సామ్రాజ్యంబు; పూజ్యంబు+ఐ= గౌరవించదగిందై; ఒప్పన్= శోభిల్లగా; ప్రకాశింపుము; మఱి; రాజసూయంబు; బహు, విఘ్నంబు= పెక్కు విధాలైన ఆటంకాలతో కూడుకొన్నది; బ్రహ్మరాక్షసులు; దాని; రంధ్రంబు+అ= దోషాన్నే; రోయుచుండుదురు= వెదుకుతూ ఉంటారు; అదియును= ఆ రాజసూయంకూడ; నిర్విఘ్నంబున= నిరాటంకంగా; సమాప్తంబు+అయ్యెన్+ఏనిన్= ముగిసినట్లయితే; నిఖిల, ప్రజా, ప్రళయ, కారణంబు, అయిన= సకలప్రజల నాశనానికి కారణమైన; రణంబు+అగున్+అని= యుద్ధం జరుగుతుం దని; చెప్పి; నారదుండు+అరిగినన్= నారదుడు వెళ్ళగా; ధర్మతనయుండు= ధర్మరాజు; తమ్ములన్+చూచి; ధౌమ్య, ద్వైపాయన, సుహృత్, బాంధవ, మంత్రి, సమక్షంబునన్= ధౌమ్యుడు, వ్యాసుడు, మిత్రులు, బంధువులు, మంత్రులు- వీళ్ళందరియెదుట; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'దిగ్విజయంచేత సంపాదించిన ధనంతో బ్రాహ్మణులను తృప్తిపెట్టు. ధర్మమార్గాన నాలుగు వర్ణాలవాళ్ళని, బ్రహ్మచర్యగార్హస్థ్యవానప్రస్థసన్న్యాసాశ్రమాల్ని (మునుల నివాసాలైన ఆశ్రమాల్ని) రక్షించు. నీ సామ్రాజ్యం గౌరవార్హమై శోభించేవిధంగా ప్రకాశించు. కాగా రాజసూయానికి అనేకవిఘ్నాలు కలుగుతాయి. బ్రహ్మరాక్షసులు దాన్ని భంగంచేసే మార్గాన్ని వెదుకుతుంటారు. నిర్విఘ్నంగా యాగం పూర్తిఅయితే సకల ప్రజా నాశకమైన మహాయుద్ధం సంభవిస్తుంది'- అని నారదమహర్షి చెప్పి అక్కడినుండి వెళ్ళాడు. ధర్మరాజు తన తమ్ముళ్ళవైపు చూచి ధౌమ్య, వ్యాస, మిత్ర, బంధు, మంత్రుల ఎదుట ఇలా అన్నాడు.

విశేషం: నారదుడి పలుకులు ప్రస్తావనలో సూత్రధారుడు కథోద్ఘాతం అనే అంగం ప్రయోగిస్తున్న స్ఫూర్తిని కలిగిస్తూ నన్నయ రచనలో నాటకీయతను ధ్వనింపచేస్తున్నాయి. ధర్మజుడు రాజసూయం చేసేటప్పుడు అనేక విఘ్నాలను ఎదుర్కోవలసి వస్తుందనీ, యజ్ఞం నిర్విఘ్నంగా ముగిస్తే కాలాంతరంలో ప్రజాక్షయం కలిగే ప్రళయంవంటి ఒక మహాయుద్ధం సంభవిస్తుం దనీ నారదుడు సూచించాడు. కలహభోజనుడిచేత ఈ అంశాన్ని కబురంపించటం, ఆయన ధర్మరాజుకు నిర్దేశించటం భావికథార్థధ్వనిలో ప్రవర్తిల్లిన ఔచిత్యం. రాజసూయానికి రంగంగా నిలిచింది మయసభ; ధర్మజుడి అంతరంగానికి ప్రేరకంగా సాగింది నారద వాక్యసుధ. (సంపా.)

ధర్మరాజు నారదవచనప్రబోధితుండై రాజసూయయజ్ఞంబు సేయుటకు నాలోచించుట (సం. 2-12-1)

క. పితృసంకల్పము సేయఁగ । సుతుల కవశ్యమును వలయు; సుతజన్మఫలం
బతిముదమునఁ బితృవరులకు । హిత మొనరించుటయ కాదె యెంతయు భక్తిన్. 94

ప్రతిపదార్థం: పితృ, సంకల్పము= తండ్రియొక్క కోరిక; సుతులకున్= కుమారులకు; అవశ్యమును, చేయఁగన్, వలయున్= తప్పక చేయాలి; సుతజన్మ, ఫలంబు= పుత్రుని పుట్టుకకు ఫలం; పితృ వరులకున్= పూజ్యులైన తండ్రులకు; ఎంతయున్, భక్తిన్= ఎంతోభక్తితో, అతిముదమునన్= మిక్కిలి సంతోషంతో; హితము+ఒనరించుట+అ, కాదు+ఎ= మేలు చేయటమే కదా!

తాత్పర్యం: తండ్రి కోర్కెను తీర్చటం తనయుల విధి, పుత్రుడుగా పుట్టినందుకు ఫలం పితృదేవులకు ఎంతో భక్తితో, సంతోషంతో మేలు చెయ్యటమే కదా!

విశేషం: ఈపద్యం పుత్రధర్మప్రబోధకం. చేయఁగ. వలయు= వ్యస్తంగా ఉన్నాయి.

క. 'పరలోకనిలయు లగు మీ । గురులకు దీనన హితం బగున్ లోకభయం
కరసంగరమును గాలాం । తరమున నగు' నని విరించితనయుఁడు సెప్పెన్. 95

ప్రతిపదార్థం: పరలోక, నిలయులు+అగు= పరలోకం నివాసస్థానంగా కలిగి ఉన్నవారయిన; మీగురులకున్= మీ పెద్దలకు అంటే- మీ పితరులకు; దీనన్+అ= దీనిచేతనే-ఈ రాజసూయము చెయ్యటంవల్లనే; హితంబు+అగున్= మేలు కలుగుతుంది; లోక, భయంకర, సంగరమును= ప్రపంచానికి భయంకరమైన యుద్ధంకూడ; కాల+అంతరమునన్+అగున్= తరువాతికాలంలో జరుగుతుంది; అని; విరించి, తనయుఁడు= బ్రహ్మదేవునియొక్క కుమారుడైన నారదుడు; చెప్పెన్.

తాత్పర్యం: 'ఈరాజసూయంవల్ల పరలోకవాసు లయిన మీ పెద్దలకు మేలు కలుగుతుంది. లోకంలో మున్ముందు మహాభయంకరమైన సంగ్రామం సంభవిస్తుంది' - అని నారదమహర్షి చెప్పాడు.

క. పితృగణహితార్థముగ స । త్క్రతు వొనరింపంగ బుద్ధిగలదు, ప్రజా సం
హృతి తత్క్రతువున నగు నని । మతి నాశంకయును గలదు మానుగ నాకున్. 96

ప్రతిపదార్థం: మానుగన్= తగువిధంగా; నాకు; పితృ, గణ, హిత+అర్థముగన్= పితృదేవతల సమూహంయొక్క మేలుకొరకు; సత్+క్రతువు+ఒనరింపంగన్= శ్రేష్ఠమైన ఆ రాజసూయయాగం చెయ్యటానికి; బుద్ధి= కోరిక; కలదు; తత్, క్రతువునన్= ఆ యాగంవల్ల; ప్రజా, సంహృతి= ప్రజానాశం; అగున్+అని= కలుగుతుం దని; ఆశంకయును= అనుమానం (భయం) కూడ; కలదు.

తాత్పర్యం: పితృదేవతల మేలుకోరి ఆ మహాయాగం చెయ్యాలన్న కోరిక ఉంది. కాని, ఆ యాగం చెయ్యటంవల్ల ప్రజానాశం కలుగుతుందన్న భయం కూడా ఉంది.

వ. ఏమి సేయుదు నని డోలాయమాన మానసుం డయి యున్న ధర్మరాజునకు ధౌమ్యప్రభృతు లి ట్లనిరి. 97

ప్రతిపదార్థం: ఏమి, చేయుదున్+అని; డోలాయమాన, మానసుండు+అయి= ఊయలవలె ముందు వెనుకలకు ఊగుతున్న మనస్సు కలవాడై; ఉన్న; ధర్మరాజునకు; ధౌమ్య, ప్రభృతులు= ధౌమ్యుడు మొదలయినవారు; ఇట్లు+అనిరి.

తాత్పర్యం: ఏమి చెయ్యటానికి తోచక ఉయ్యాలమాదిరిగా ముందువెనుకలకు ఊగుతున్న మనస్సు కల ధర్మరాజుతో ధౌమ్యాదులు ఇలా అన్నారు.

ఉ. చేయుము రాజసూయ మెడసేయక; దానన చేసి దోషముల్
వాయు నిలేశ! భూప్రజకుఁ; బార్థివులెల్ల భవత్ప్రతాపని

ర్జేయులు; సర్వసంపదలు చేకొనఁగాఁ దఱియయ్యెఁ గౌరవా
మ్నాయలలామ! నీ కెనయె మానవనాథులు మానుషంబునన్. 98

ప్రతిపదార్థం: ఇలా+ఈశ!= ఓ భూపతీ-ధర్మరాజా!; ఎడ, చేయక= ఆలస్యం చెయ్యకుండ; రాజసూయము, చేయుము; దానిన్+అ, చేసి= దానిచేతనే; భూప్రజకున్= లోకంలోని జనులకు; దోషముల్= పాపాలు; పాయున్= తొలగుతాయి; పార్థివులు+ఎల్లన్= రాజులంతా; భవత్, ప్రతాప, నిర్జేయులు= నీయొక్క పరాక్రమంచేత జయించతగినవారు; సర్వసంపదలు; చేకొనన్+కాన్= తీసుకోటానికి; తఱి+అయ్యెన్= సమయం అయింది; కౌరవ+ఆమ్నాయ, లలామ!= కౌరవ వంశశ్రేష్ఠా!; మానుషంబునన్= మానవయత్నంలో (పురుషకారంలో); మానవనాథులు= రాజులు; నీకున్; ఎనయె= సాటియా, సమానమా!

తాత్పర్యం: ధర్మరాజా! ఆలస్యం కాకుండా రాజసూయం జరిపించు. దానివల్ల ప్రజల పాపాలు తొలగిపోతాయి. రాజులంతా నీ ప్రతాపానికి లొంగిపోయేవాళ్ళే. సర్వసంపదలు సేకరించటానికి ఇది తగిన సమయం. ఓ కౌరవాన్వయశ్రేష్ఠా! మానవయత్నంలో రాజు లెవ్వరూ నీకు సరిగారు.

విశేషం: ఈ పద్యంలో అర్థవ్యక్తి అనే గుణం సార్థకంగా పోషించబడింది. రాజసూయయాగం చేయాలా వద్దా అని డోలాయమానమైన మనస్సుతో ఉన్న ధర్మరాజుకు నిశ్చయబుద్ధి కలిగేటట్లు ధౌమ్యాదులు ఇందులో వక్తవ్యార్థం స్ఫుటంగా ఝుటిత్యర్థస్ఫోరకంగా వ్యక్తమయ్యేటట్లు చెప్పటంవలన అర్థవ్యక్తి రూపుకట్టింది. ఈ పద్యరచనలో వాక్యనిర్మాణపద్ధతికూడ దానికి తోడ్పడుతున్నది. 'చేయుము రాజసూయ మెడసేయక'- అనే వాక్యం విధ్యర్థక క్రియాపదంతో ప్రారంభమై ధర్మజుని అనుమానాన్ని నివారిస్తున్నది. ఆ తరువాత రాజసూయ మనే కర్మను వాడటం, వెంటనే 'ఎడసేయక' అని వాడి, వెంటనే నిర్వహించవలసింది అని నిర్దేశించటం జరిగింది. ఈ పద్యంలోని తరువాతివాక్యాలన్నీ ఆలస్యంచేయకుండా రాజసూయం ఎందుకు చేయాలో నిరూపించేవే. అందుకు మూడు కారణాలు-చెప్పారు. 1. ప్రజలకు దోషాలు తొలుగుతాయి. అందువలన దేశంలో ఈతిబాధలు లేకుండ జనులు సుఖంగా జీవించగలుగుతారు-అంటే అది విశ్వశ్రేయోదాయక మని భావం. 2. రాజు లందరు ధర్మజునిచేత జయింపబడి ఉన్నారు. 3. అందువలన వా రందరు తమసంపదలను కప్పాలుగా, కానుకలుగా ధర్మజుడికి అర్పించగలరు. ఈ మూడుకారణాలవలన ధర్మరాజుకు ఆ కాలంలో దీటైనవాడు మరొక రాజు లేడు. కాబట్టి రాజసూయానికి అదే సమయ మని నొక్కిచెప్పారు. 'ఆలస్యా దమృతం విషమ్' అనే న్యాయంచొప్పున అనుకూలమైన కాలాన్ని అనువుగా ఉపయోగించుకొని అభ్యుదయాలను సాధించు మని ధౌమ్యాదులు బోధించారు. సమర్థనీయస్యార్థస్య కావ్యలింగం సమర్థనం' అనే లక్షణంచేత ఇందులో కావ్యలింగాలంకారం ఉన్నది. 'నీ కెనయె' అనేది అర్థాంతరసంక్రమిత వాచ్యం. పైన చెప్పిన కారణాలవలన ఏర్పడిన సమున్నతస్థితివలననే కాక, సర్వసద్గుణాలలోనూ, మహాపరాక్రమవంతులైన తమ్ములను కలిగి ఉండటంలోను, పరమాత్ముడైన శ్రీకృష్ణుని అండదండలు ఉండటంలోనూ ధర్మరాజుకు సాటిగా నిలిచే రాజులు మరెవ్వరూ భూతలంలో లే రని తాత్పర్యం. (సంపా.)

వ. **అనిన వారల వచనంబుల కనుగుణంబుగా ననుజానుమతుండయి ధర్మరాజు రాజసూయంబు సేయ సమకట్టి, 'దీని నిర్విఘ్నంబున నిర్వహించుట కనాదినిధనుం డాదిపురుషుండు పురుషోత్తముండు పుండరీకాక్షుం డజుం డయ్యును జగద్ధితార్థంబుగా మర్త్యంబున జనియించిన యమ్మహాత్ముండు వాసుదేవుండ యోపుంగాని యన్యుల కశక్యం' బని యప్పుడ యాప్తచరులం బిలువంబనిచి.** 99

ప్రతిపదార్థం: అనిన, వారల; వచనంబులకున్; అనుగుణంబుగాన్= తగినట్లుగా; అనుజ+అనుమతుండు+అయి= తమ్ములచేత సమ్మతించబడినవాడై, అంటే - తమ్ముల సమ్మతి పొంది; ధర్మరాజు; రాజసూయంబు; చేయన్; సమకట్టి= పూనుకొని; దీనిన్= ఈ రాజసూయాన్ని; నిర్విఘ్నంబునన్= ఆటంకంలేకుండా; నిర్వహించుటకున్= జరపటానికి; అనాది, నిధనుండు=

పుట్టుక, చావు లేనివాడు; ఆదిపురుషుండు= మొట్టమొదటిపురుషుడు; పురుష+ఉత్తముండు= పురుషుల్లో శ్రేష్ఠుడు; పుండరీక+అక్షుండు= తెల్ల తామరలవంటి కన్నులు కలవాడు; అజుండు= పుట్టుకలేనివాడు-విష్ణువు; అయ్యును; జగత్+హిత+అర్థంబుగాన్= లోకానికి మేలు చేయటంకోసం; మర్త్యంబునన్= భూలోకంలో; జనియించిన= పుట్టిన; ఆ+మహాత్ముండు; వాసుదేవుండు+అ= వసుదేవుని పుత్త్రుడైన శ్రీకృష్ణుడే; ఓపున్+కాని= సమర్థుడవుతాడు గాని; అన్యులకున్+ఇతరులకు; అశక్యంబు+అని= అసాధ్యమని; అప్పుడు+అ= అప్పటికప్పుడే; ఆప్తచరులన్= ఆప్తులైన సేవకులను; పిలువన్+పనిచి= పిలిపించి.

తాత్పర్యం: ధౌమ్యుడు మొదలయినవాళ్ళు చెప్పిన దానికి తగినట్లే ధర్మరాజు తమ్ముల సమ్మతి పొందాడు. రాజసూయం చేయటానికి పూనుకొన్నాడు. 'ఈ యాగాన్ని నిర్విఘ్నంగా నిర్వహించటానికి శ్రీకృష్ణుడే సమర్థుడనుకున్నాడు. ఇతరు లెవ్వరు కా దనుకున్నాడు. ఎందుకంటే - శ్రీమహావిష్ణువే శ్రీకృష్ణుడు. ఆద్యంతరహితుడు, ఆదిపురుషుడు, పురుషోత్తముడు అయిన శ్రీమహావిష్ణువు పుట్టుకలేనివాడే అయినా-లోకానికి మేలు చెయ్యా లని వసుదేవసుతుడుగా మానవలోకంలో అవతరించాడు. అందుచేత ఆ మహాత్ముడే ఈ యాగాన్ని నిర్విఘ్నంగా జరిపించటానికి సమర్థు డని, ఆప్తులైన సేవకుల్ని పిలిపించి.

క. అనిలజవాశ్వంబులఁ బూ । నిన యరదం బెక్కి ధారుణీధరు మధుసూ
దను దోడ్తెం డని ముదమునఁ । బనిచి తదాగమనకాంక్షఁ బార్థివుఁ డుండెన్. 100

ప్రతిపదార్థం: అనిల, జవ+అశ్వంబులన్= వాయువేగం గల గుర్రాల్ని; పూనిన= కట్టిన; అరదంబు+ఎక్కి= రథాన్నిఎక్కి; ధారుణీ, ధరున్= భూభారాన్ని, నిర్వహించేవాడు; మధుసూదనున్= మధు డనే రాక్షసుడిని సంహరించిన వాడు అయిన శ్రీకృష్ణుని; తోడ్తెండు+అని= వెంట పిలుచుకొనిరం డని; ముదమునన్= సంతోషంతో; పనిచి= పంపి; తత్+ఆగమన కాంక్షన్= ఆయన రాకను కోరుతూ; పార్థివుఁడు+ఉండెన్= ధర్మరాజు ఉన్నాడు.

తాత్పర్యం: 'వాయువేగం గల గుర్రాల్ని కట్టిన రథంఎక్కి వెళ్ళండి. ధరాభారాన్ని వహించేవాడు, మధుసూదనుడు అయిన శ్రీకృష్ణుణ్ణి వెంటతీసుకురండి' అని సంతోషంతో ధర్మరాజు సేవకుల్ని పంపాడు. ఆయన రాకకై ఎదురు చూస్తూ ఉన్నాడు.

విశేషం: ఈ సందర్భంలో శ్రీకృష్ణుడికి ధారుణీధరుడు, మధుసూదనుడనే విశేషణాలు ప్రయోగించటం ఎంతో ఉచితంగా ఉంది. రాజసూయమహాయాగనిర్వహణభారం సామాన్యమైంది కాదు. రాజసూయానికి ముందు దిగ్విజయయాత్ర జరగాలి. తరువాత దుర్మార్గులవల్ల ప్రమాదంలేకుండ యజ్ఞం నిర్విఘ్నంగా కొనసాగాలి. అందువల్ల, భూభారాన్ని వహించేవాడు, మధువనే రాక్షసుణ్ణి సంహరించినవాడు అయిన శ్రీకృష్ణుణ్ణి తీసుకొని రమ్మనటం ఎంతో అర్థవంతంగా ఉంది. నిరాటంకంగా దిగ్విజయయాత్ర పూర్తికావటానికి, నిర్విఘ్నంగా యజ్ఞం పరిసమాప్తి నొందటానికి, మున్ముందు జరిగే జరాసంధ శిశుపాలవధల్లో శ్రీకృష్ణుడు నిర్వహించనున్న గణనీయపాత్రను సూచించేదిగా ఉంది.

శ్రీకృష్ణుం డింద్రప్రస్థపురంబునకు వచ్చుట (సం. 2-12-30)

వ. అయ్యుధిష్ఠిరు సందేశంబున దాశార్హుండును దద్దర్శనోత్సుకుం డయి ద్వారవతి గదలి యతిత్వరితగతిం జని నిరంతర ప్రయాణంబుల నింద్రప్రస్థపురంబునకు వచ్చి. 101

ప్రతిపదార్థం: ఆ+యుధిష్ఠిరు, సందేశంబునన్= ఆ ధర్మరాజు పంపిన సందేశంతో; దాశార్హుండును= దశార్హుని సంతతివాడు-యాదవుడు అయిన - శ్రీకృష్ణుడు; తత్+దర్శన+ఉత్సుకుండు+అయి= ఆ ధర్మరాజును చూడాలన్న కుతూహలం కలవాడై; ద్వారవతి, కదలి= ద్వారకానగరంనుండి బయలుదేరి; అతి, త్వరితగతిన్= మిక్కిలి వేగంతో కూడిన గమనంతో; చని= వెళ్ళి; నిరంతర ప్రయాణంబులన్= మధ్య ఎక్కడా ఆగకుండ చేసిన ప్రయాణాలతో; ఇంద్రప్రస్థపురంబునకున్; వచ్చి.

తాత్పర్యం: ధర్మరాజు పంపిన సందేశాన్ని అందుకొని శ్రీకృష్ణుడుకూడ, ఆయనను చూడాలన్న కుతూహలంతో ద్వారవతి నుండి బయల్దేరి, ఎక్కడా మధ్యలో ఆగకుండ ప్రయాణాలు చేసి ఇంద్రప్రస్థపురానికి వచ్చాడు.

ఉ. కుంతికి ధర్మనందనునకున్ వినయంబున మ్రొక్కి భీము ధీ
మంతునిఁ గౌఁగిలించుకొని, మధ్యమపాండవు మాద్రిపుత్త్రులన్
సంతతభక్తినమ్రులఁ బ్రసాదనయోత్కటదృష్టిఁ జూచి, తా
నెంతయుఁ బ్రీతి నెత్తికొనియెన్ మహినెత్తిన పుణ్యుఁ డున్నతిన్. 102

ప్రతిపదార్థం: మహిన్+ఎత్తిన, పుణ్యుఁడు= భూమిపై అవతారమెత్తిన పుణ్యాత్ముడు లేదా, (వరాహావతారంలో) భూమిని ఎత్తిన పుణ్యాత్ముడు-శ్రీకృష్ణుడు; ఉన్నతిన్= గొప్పగా; కుంతికిన్; ధర్మనందనునకున్; వినయంబునన్; మ్రొక్కి= నమస్కరించి; ధీమంతునిన్= బుద్ధిమంతుని; భీమున్= భీముని; కౌఁగిలించుకొని; సంతత, భక్తి, నమ్రులన్= ఎల్లప్పుడు భక్తితో శిరం వంచిన వాళ్ళయిన; మధ్యమ, పాండవున్= పాండవుల్లో నడిమివాడైన అర్జునుణ్ణి; మాద్రిపుత్త్రులన్= మాద్రియొక్క కుమారులైన నకుల సహదేవుల్ని; ప్రసాద, నయ+ఉత్కట, దృష్టిన్= అనుగ్రహభావం, మృదుభావం అధికమైన దృష్టితో; చూచి; తాన్= తాను; ఎంతయున్= మిక్కిలి; ప్రీతిన్= ప్రేమతో; ఎత్తికొనియెన్= (కొద్దిగా) పైకెత్తుకొన్నాడు.

తాత్పర్యం: భూమిమీద అవతరించిన పుణ్యపురుషుడు, ఇదివరలో వరాహంగా అవతరించి భూమిని ఎత్తిన పుణ్యాత్ముడు అయిన శ్రీకృష్ణుడు కుంతీ ధర్మజులకు సవినయంగా నమస్కరించాడు. బుద్ధిమంతుడైన భీమసేనుణ్ణి కౌగిలించుకొన్నాడు. భక్తిభావంతో శిరస్సువంచి నిలిచిన అర్జున నకుల సహదేవుల్ని అనుగ్రహించినట్లు అల్లన చూచి అలా పైకెత్తుకొన్నాడు.

విశేషం: శ్రీకృష్ణుడు పెద్దలకు నమస్కరించి భక్తిని, పిన్నలను కౌగిలించుకొని ప్రేమను ప్రదర్శించాడు. 'మహినెత్తినపుణ్యుడు' అంటే వరాహావతారంలో భూమిని రక్షించినవాడనే అర్థాన్నికూడ భావించవచ్చు. ఈ సందర్భంలో అర్జున నకుల సహదేవులను ప్రేమతో ఎత్తుకొన్న శ్రీకృష్ణుని 'మహినెత్తిన పుణ్యుఁ' డనటం ఎంతో రమ్యంగా ఉంది. ఈవిధంగానే పాండవులను కష్టసమయాల్లో రక్షిస్తా డని వస్తుధ్వని. శ్రీకృష్ణుడు 'ప్రసాదనయోత్కటదృష్టిఁ జూచె'ననటంలో నన్నయ తనరచనలోని ప్రసాదగుణాన్ని ధ్వనిమయం చేశాడు.

వ. తదనంతరంబ ధర్మతనయుండు. 103

తాత్పర్యం: అటు పిమ్మట ధర్మరాజు.

క. పరమాసనమున నునిచి య । పరిమిత హర్షంబుతో సపర్యావిధులన్
గురుఁ బూజించిన విధమునఁ । గురువృషభుఁ డశేషలోకగురుఁ బూజించెన్. 104

ప్రతిపదార్థం: కురు, వృషభుఁడు= కురువంశశ్రేష్ఠుడైన ధర్మరాజు; పరమ+ఆసనమునన్= ఉన్నతమైన పీఠంపై; ఉనిచి= కూర్చుండబెట్టి; అపరిమిత, హర్షంబుతోన్= మిక్కిలి ఆనందంతో; గురున్= గురువును; పూజించిన, విధమునన్= పూజించినట్లు; అశేష లోకగురున్= అన్ని లోకాలకు గురువైన వానిని- శ్రీకృష్ణుణ్ణి; పూజించెన్= పూజించాడు.

తాత్పర్యం: కురువంశశ్రేష్ఠుడైన ధర్మరాజు - సర్వలోకగురుడైన శ్రీకృష్ణుణ్ణి, ఉన్నతాసనంమీద కూర్చోపెట్టాడు. అంతులేని ఆనందంతో, అన్ని ఉపచారపద్ధతులతో, గురువును పూజించినట్లు పూజించాడు.

విశేషం: అలం: ఉపమ. 'గురు' శబ్దానికి తండ్రి, పెద్ద, అనే రెండర్థాలను భావింపవచ్చును. గురు కురు శబ్దాలవలన అక్షరరమ్యత రచనకు కలిగింది.

క. **ఏమఱక జనుల యోగ । క్షేమంబుల నడపుచున్న కృష్ణుని యోగ**
క్షేమంబు లడిగి యపుడు మ । హాముదమున ధర్మసుతుఁడు హరి కి ట్లనియెన్. **105**

ప్రతిపదార్థం: అపుడు; ఏమఱక= మరవక; జనుల, యోగక్షేమంబుల; నడపుచున్న; కృష్ణుని; యోగక్షేమంబులు; అడిగి; ధర్మసుతుఁడు; మహా, ముదమునన్= మిక్కిలి ఆనందంతో; హరికిన్+ఇట్లు+అనియెన్= శ్రీకృష్ణునితో ఇలా అన్నాడు.

తాత్పర్యం: ఏమరుపాటు లేక, ఎల్లప్పుడు జనుల యోగక్షేమాల్ని నడిపే శ్రీకృష్ణపరమాత్మనే ధర్మజుడు యోగక్షేమాలు అడిగాడు. మహానందంతో ఇలా అన్నాడు.

విశేషం: 'యోగక్షేమం వహా మ్యహం' అని ప్రకటించిన పరమాత్ముడు శ్రీకృష్ణుడు. అతనిని లౌకికాచారాన్ని అనుసరించి యోగక్షేమా లడిగాడట ధర్మరాజు. అంటే తమ యోగక్షేమాలనుగురించి (దిగ్విజయ యాత్ర, రాజసూయం రెండూ ముందున్నాయి కనుక) శ్రీకృష్ణునికి జ్ఞాపకం చేయటమే అందులోని చమత్కారం. ఉక్తివైచిత్ర్యంతో కూడికొనిన ధర్మజుని హర్షపూర్ణాలైన మాటలు మధురగుణపూర్ణాలు. (సంపా.)

క. **ధ్యేయుఁడవు సకల లోక । స్థేయుండవు నమ్రులకు విధేయుఁడవు నయో**
పాయజ్ఞుఁడ విజ్జగముల । నీ యెఱుఁగని యవియుఁ గలవె నీరజనాభా! **106**

ప్రతిపదార్థం: నీరజనాభా!= నీటినుండి పుట్టిన పద్మాన్ని బొడ్డుగా కలవాడా..పద్మనాభా! శ్రీకృష్ణా!; ధ్యేయుఁడవు= ధ్యానించదగినవాడివి; సకల, లోక, స్థేయుండవు= అన్నిలోకాల్లో స్థిరంగా ఉండేవాడివి; నమ్రులకున్= భక్తులకు; విధేయుఁడవు= లొంగి ఉండేవాడివి; నయ+ఉపాయజ్ఞుఁడవు= నీతిని, ఉపాయాలను తెలిసిన వాడివి; ఈ+జగములన్= ఈ లోకాల్లో; నీ+ ఎఱుఁగని; అవియున్= నీకు తెలియని విశేషాలుకూడా; కలవు+ఎ= కలవా? (లేవు.)

తాత్పర్యం: ఓ పద్మనాభా! శ్రీకృష్ణా! నీవు అందరిచేత ధ్యానించదగినవాడివి. అన్నిలోకాల్లో స్థిరంగా ఉండేవాడివి. భక్తులకు వశమైనవాడివి. నీతి, ఉపాయాలు తెలిసినవాడివి. ఈ లోకాల్లో నీకు తెలియని విశేషాలు ఏమున్నాయి?

విశేషం: అంత్యప్రాసలతో కూడికొన్న విశేషణాలను వాడి, మనసులోని శ్రీకృష్ణభక్తిని మధురంగా వ్యక్తంచేశాడు ధర్మరాజు. రాజసూయయాగ రక్షణదక్షతకు యోగ్యమైన విశేషణాలనే ఎన్నుకొని ఒకవరుసలో వాడటంలో ఉక్తివైచిత్ర్యం ఉన్నది. వినయగుణం వ్యక్తమయ్యేటట్లు రచనలో పృథక్పదత్వం రాణించింది. కాబట్టి ఈ పద్యంలోని గుణం మాధుర్యం. (సంపా.)

వ. అయినను నాయర్థిత్వంబునంజేసి నీ కెఱింగించెద. 107

ప్రతిపదార్థం: అయినను; నా, అర్థిత్వంబునన్+చేసి= నేను కోరికకలవాడినవటంచేత; నీకున్+ఎఱింగించెదన్= నీకు తెలియచేస్తాను.

తాత్పర్యం: అయినా నా కోరికను నీకు తెలియచేసుకుంటాను.

సీ. 'పాండుమహీపతి పనిఁజేసి నారద । ముని వచ్చి వీ రెల్ల వినుచు నుండ
రాజసూయంబు తిరంబుగాఁ జేసి నీ । పితృపితామహులకు హితము సేయు
మని పంచె నన్నుఁ నెయ్యముననో, నాకట్టి । బలము సామర్థ్యంబుఁ గలుగు టెఱిఁగి
పంచెనో, తత్క్రతు ప్రారంభమున కొడం । బడితి వీ రిందఱుఁ గడఁగి దీని

ఆ. నిత్యసత్యవచన! నిపుణనిర్మలబుద్ధి । నిర్ణయించి పనుప నీ నియోగ
కాంక్ష నున్నవాఁడఁ గమలాక్ష!' యనిన ధ । ర్మాత్మజునకు నిట్టు లనియెఁ జక్రి. 108

ప్రతిపదార్థం: కమల+అక్ష!= పద్మాలవంటి కన్నులు కల ఓ శ్రీకృష్ణా!; పాండు మహీపతి= పాండురాజుయొక్క; పనిన్+చేసి= పనికారణంగా; నారదముని; వచ్చి; వీరు+ఎల్లన్= వీరంతా; వినుచున్+ఉండన్= వింటూ ఉండగా; రాజసూయంబు= రాజసూయయాగాన్ని; తిరంబుగాన్+చేసి= స్థిరంగా చేసి; నీ, పితృ, పితామహులకున్= నీతండ్రి తాతలకు; హితము, చేయుము+ అని= మేలు చెయ్యవలసిందని; నన్నున్; పంచెన్= ఆజ్ఞాపించాడు; నెయ్యముననో= ప్రేమచేతనో; నాకున్+అట్టి, బలము, సామర్థ్యంబున్= నాకు అలాంటి బలం, సామర్థ్యం; కలుగుట+ఎఱిఁగి= ఉండటం తెలుసుకొని; పంచెనో= ఆజ్ఞాపించాడో; నిత్య, సత్య, వచన!= ఎల్లప్పుడు సత్యాన్నే చెప్పేవాడా!; వీరు+అందఱున్= ఈసభలో ఉన్నవాళ్ళంతా; కడఁగి= పూనుకొని; దీనిన్= ఈ యాగాన్ని; నిపుణ, నిర్మల, బుద్ధిన్= నేర్పుతో కూడిన నిర్మలమైన బుద్ధితో; నిర్ణయించి; పనుపన్= ఆజ్ఞాపించగా; తత్+క్రతు, ప్రారంభమునకున్= ఆయాగాన్ని ప్రారంభించటానికి; ఒడంబడితిన్= అంగీకరించాను; నీ, నియోగకాంక్షన్= నీ ఆజ్ఞయందలి కోరికతో, అంటే నీ ఆజ్ఞకోసం; ఉన్నవాఁడన్= వేచి ఉన్నాను; అనినన్; చక్రి= చక్రాయుధం కలవాడు - శ్రీకృష్ణుడు; ధర్మ+ఆత్మజునకున్= యముని కుమారుడైన ధర్మరాజుకు; ఇట్టులన్+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణా! పాండురాజు పంపిస్తే నారద మహాముని వచ్చి, వీళ్ళంతా వింటూ ఉండగా, 'రాజసూయం చేసి పితృపితామహులకు మేలుచెయ్యి' అని చెప్పాడు. అది నా తండ్రి మీదిప్రేమతో చెప్పాడో!- లేక అందుకు తగిన శక్తిసామర్థ్యాలు నా కున్నా యని చెప్పాడో! వీళ్ళంతా నిర్మలబుద్ధితో ఎంతో నిపుణంగా ఆలోచించి, నిర్ణయించి నన్ను ప్రేరేపిస్తే ఆయాగాన్ని ప్రారంభించటానికి అంగీకరించాను. నీ ఆజ్ఞకోసం వేచిఉన్నాను.

విశేషం: ధర్మజుని మాటనేర్పుకు ఈ పద్యం చక్కని ఉదాహరణం. ఇక్కడ శ్రీకృష్ణునికి ప్రయోగించిన 'చక్రి' అనే విశేషణం మున్ముందు రాజసూయంలో ఆయన చక్రాయుధం నిర్వహించే పాత్రను సూచించేదిగా ఉంది. చక్రాయుధం - ఇది విశ్వకర్మనిర్మితం. దేవశిల్పి విశ్వకర్మ - తన కూతురు సంజ్ఞ, ఆమె భర్త అయిన సూర్యుడి తేజస్సుకు తాళలేక పోవటంచేత సూర్యుణ్ణి సానపట్టాడట; అప్పుడు రాలిన చూర్ణంతో చక్రాయుధాన్ని రూపొందించాడట!

కృష్ణుఁడు ధర్మజునికి జరాసంధుని సామర్థ్యము నెఱిఁగించుట (సం. 2-13-1)

క. కురువృషభ! సర్వగుణముల । సురుచిర తేజమున రాజసూయాఖ్య మహా
ధ్వరమునకు నీవ యర్హుఁడ । వరిసూదనశౌర్యు లయిన యనుజులబలిమిన్. 109

ప్రతిపదార్థం: కురు, వృషభ!= కురు వంశ శ్రేష్ఠా!; సర్వ, గుణములన్= అన్ని సుగుణాలచేత; సురుచిర, తేజమునన్= గొప్పగా ప్రకాశించే పరాక్రమంచేత; అరి, సూదన, శౌర్యులు+అయి= శత్రువులను సంహరించగల శౌర్యం కలవాళ్ళయిన; అనుజుల బలిమిన్= తమ్ముల యొక్క బలంచేత; రాజసూయ+ఆఖ్య, మహా+అధ్వరమునకున్= రాజసూయం అనే పేరున్న మహాయాగం చేయటానికి; నీవు+అ= నీవే; అర్హుఁడవు= తగినవాడివి.

తాత్పర్యం: ఓ కురువంశశ్రేష్ఠా! యుధిష్ఠిరా! అన్ని సుగుణాలచేత, గొప్పగా ప్రకాశించే పరాక్రమంతో, శత్రుసంహారం చెయ్యగల శౌర్యవంతులైన తమ్ముళ్ళతో రాజసూయమహాయాగం చెయ్యటానికి నీవే సమర్థుడివి.

వ. **తొల్లి జమదగ్నిసుతుం డయిన రామునిచేత ధాత్రి యపగతక్షత్త్రం బయిన నంతనుండి యైలవంశంబును నిక్ష్వాకువంశంబును దక్కఁ దక్కిన క్షత్త్రియవంశంబు లెల్లం గృత్రిమంబులు గాని విమల మకుటార్హంబులుగా; వీ రెండు వంశంబులవలన నేకోత్తరశతవంశంబు లయ్యె; మఱి యయాతి భోజ వంశంబులవలనం జతుర్దశ వంశంబు లయ్యె; నిట్టి సకలక్షత్త్రంబునెల్ల జయించి జరాసంధుం డున్నవాఁడు; వాని సామర్థ్యంబు చెప్ప నశక్యంబు.** **110**

ప్రతిపదార్థం: తొల్లి= పూర్వం; జమదగ్ని; సుతుండు+అయిన= జమదగ్ని యొక్క కుమారుడయిన; రామునిచేతన్= పరశురామునిచేత; ధాత్రి= భూమి; అపగతక్షత్త్రంబు+అయినన్= తొలగింపబడిన క్షత్రియులుకలదికాగా; అంతన్+ఉండి= అప్పటినుండి; ఐల, వంశంబును; ఇక్ష్వాకు వంశంబును; తక్కన్= తప్ప; తక్కిన; క్షత్త్రియ, వంశంబులు+ఎల్లన్= రాజవంశాలన్నీ; కృత్రిమంబులు, కాని= కేవలం కల్పించబడినవే కాని; విమల, మకుట+అర్హంబులు= స్వచ్ఛమైన రాజకిరీటాన్ని ధరించటానికి తగినవి; కావు; ఈ, రెండు, వంశంబుల వలనన్= ఈ ఐల, ఇక్ష్వాకు వంశాలు రెండింటివల్ల; ఏక+ఉత్తర, శత, వంశంబులు+ అయ్యెన్= నూటొక్క రాజవంశాలు ఏర్పడ్డాయి; మఱి= ఇంకను; యయాతి, భోజ, వంశంబులవలనన్= యయాతియొక్క, భోజుడియొక్క వంశాలవలన; చతుః+దశ, వంశంబులు+అయ్యెన్= పద్నాలుగువంశాలు ఏర్పడ్డాయి; ఇట్టి= ఇటువంటి; సకల క్షత్త్రంబున్+ఎల్లన్= సకలరాజసమూహాన్ని; జయించి; జరాసంధుండు+ఉన్నవాఁడు; వాని; సామర్థ్యంబు; చెప్పన్; అశక్యంబు= సాధ్యం కాదు.

తాత్పర్యం: పూర్వం జమదగ్నికొడుకు పరశురాముడు నేలమీద క్షత్రియులు లేకుండ చేశాడు. ఐల ఇక్ష్వాకు రాజ వంశాలు మాత్రమే ఈ భూమిమీద మిగిలాయి. అప్పటినుండి ఆ రెండే సహజ రాజవంశాలు. తక్కిన రాజవంశాలన్నీ కల్పితాలే. రాజకిరీటాన్ని ధరించటానికి యోగ్యాలు కావు. క్రమంగా ఈ రెండువంశాలు నూటొక్క వంశాలుగా విస్తరిల్లాయి. అంతేకాక, యయాతి, భోజవంశాలవల్ల పదునాల్గువంశాలు ఏర్పడ్డాయి. జరాసంధుడు ఈ రాజుల నందరిని జయించాడు. అతనిసామర్థ్యం చెప్పశక్యం కాదు.

విశేషం: ఇల - వైవస్వతమనువు కూతురు. ఈశ్వరానుగ్రహంచేత ఈమెకు పుంస్త్వం ప్రాప్తించింది. సుద్యుమ్ను డయ్యాడు. ఉత్కళుడు, గయుడు, విమలుడు-ఇతని కుమారులు. ఇతడు వేటకై వెళ్ళి, కుమారవనంలో శివపార్వతుల సంగమం చూచాడు. పార్వతి శాపంతో మళ్ళీ స్త్రీత్వాన్ని పొంది ఇలగా మారాడు. ఈ దశలో ఇలకు బుధునితో సమాగమం ఏర్పడింది. పురూరవుడు జన్మించాడు. మళ్ళీ ఈశ్వరానుగ్రహంచేత ఇల పురుషుడుగా మారింది. ఇలకు సంబంధించిన క్షత్రియవంశం ఐలం. ఇక్ష్వాకువు - వైవస్వత మనువు కుమారుడు. శ్రీరాముని వంశానికి మూలపురుషుడు. యయాతి - నహుషుని కుమారుడు. చంద్రవంశప్రభువు. దేవయానికి, శర్మిష్ఠకు భర్త.

క. అతిదర్పోద్ధతుఁడు మహా । ద్భుతభూరిబలుండు చేదిభూపతి సేనా
పతి యయి శిశుపాలుఁడు సం । తతమును నాతనిన కొలుచుఁ దద్దయు భక్తిన్. 111

ప్రతిపదార్థం: చేది భూపతి= చేది దేశంయొక్కరాజు; శిశుపాలుడు; అతి, దర్ప+ఉద్ధతుఁడు= మిక్కిలి గర్వంచేత విజృంభించేవాడు; మహత్+అద్భుత, భూరి, బలుండు= మిక్కిలి ఆశ్చర్యకరమైన గొప్ప బలం కలవాడు; సేనాపతి, అయి; సంతతమును= ఎల్లప్పుడు; తద్దయున్, భక్తిన్= ఎంతో భక్తితో; అతనిన్+అ= ఆ జరాసంధుణ్ణే; కొలుచున్= సేవిస్తాడు.

తాత్పర్యం: చేదిభూపతి అయిన శిశుపాలుడు, అమితగర్వంతో విర్రవీగేవాడు. ఆశ్చర్యకరమైన అపారబలం కలవాడు. అతడు సేనాధిపతిగా ఆ జరాసంధుణ్ణి భక్తితో ఎప్పుడూ సేవిస్తూ ఉంటాడు.

క. ఆయతభుజవీర్యులు మా । యాయోధులు హంసడిభకు లనువార లని
ర్జేయులు పరస్పర స్నే । హాయత్త సుచిత్తు లతని యాప్తు లధీశా! 112

ప్రతిపదార్థం: అధీశా!= రాజా!; హంస, డిభకులు+అనువారలు= హంసడిభకు లనే పేరు కలవారు; ఆయత భుజవీర్యులు= అధికమైన భుజబలంకలవాళ్ళు; మాయాయోధులు= మాయోపాయాలతో కూడిన యుద్ధవీరులు; అనిర్జేయులు= జయింపసాధ్యం కాని వారు; పరస్పర, స్నేహ+ఆయత్త, సుచిత్తులు= ఒకరి పట్ల ఒకరు స్నేహానికి అధీనమైన చక్కని మనస్సు కలవాళ్ళు; అతని= ఆ జరాసంధుని యొక్క; ఆప్తులు= స్నేహితులు, హితులు.

తాత్పర్యం: హంస డిభకులు మహాబలవంతులు, మాయోపాయాల్లో అరితేరిన యుద్ధవీరులు, అజేయులు. పైగా ఒకరి కొకరు మంచిమిత్రులు. ఇద్దరూ ఆ జరాసంధునికి ఆప్తులు.

వ. అయ్యిద్దఱును గౌశిక చిత్రసేను లను నామంబులతో మహాసేనాన్వితులై వానికి వామదక్షిణ భుజంబులుంబోలె సర్వసాధనసమర్థు లయి వర్తిల్లుదురు; మఱియు వరుణు నంతియ బలవంతుండు పశ్చిమ దిఙ్మహీపతి భగదత్తుం డనువాఁడు పాండురాజుసఖుం డగుటంజేసి నీకు మనంబున భక్తుం డయ్యును భయంబున జరాసంధునకు వాక్కర్మంబులం బనిసేయుచుండుఁ; జేదిపతులలోనఁ బురుషోత్తముండును నంగ వంగ పుండ్ర కిరాతపతులలోనఁ బౌండ్రకవాసుదేవుండు మదీయ నామంబులు దాల్చి జరాసంధుం గొలుతురు; ప్రాగ్దక్షిణ దిగ్భాముల రాజులు పురుజితుండును గరూశ కలభ నకుల సంకర్షణ సూపహిత మనోదత్త చక్ర సాల్వేయ యవనులును వానిన సేవింతు; రుదీచ్యులయిన యష్టాదశక్షత్త్రకులంబుల వారును నుత్తరపాంచాల శూరసేన పుష్కర పుళింద కళింగ కుంతి మత్స్యదేశంబుల రాజు ల్లెలను దద్భయంబునఁ దమ తమ దేశంబుల విడిచి యున్నవారలు మఱియును. 113

ప్రతిపదార్థం: ఆ+ఇద్దఱును= ఆ హంసడిభకు లిద్దరూ; కౌశిక, చిత్ర సేనులు+అను; నామంబులతో; మహాసేనా+అన్వితులు+ఐ= గొప్పసైన్యంతో కూడుకున్నవాళ్ళయి; వానికిన్= జరాసంధుడికి; వామ, దక్షిణ, భుజంబులున్+పోలెన్= ఎడమ, కుడి భుజాల్లాగా; సర్వ, సాధన, సమర్థులు+అయి= అన్నింటిని సాధించగల సామర్థ్యం కలవాళ్ళయి, వర్తిల్లుదురు= ప్రవర్తిస్తూ ఉంటారు; మఱియు; వరుణు, అంతియ= వరుణదేవునంతటి; బలవంతుండు= బలం కలవాడు; పశ్చిమ, దిక్+మహీపతి= పడమటి దిశకు రాజు; భగదత్తుండు+అనువాఁడు= భగదత్తుడనే పేరు కలవాడు; పాండురాజు, సఖుండు+అగుటన్+చేసి= పాండురాజుకు స్నేహితుడు కావటంవల్ల; నీకున్; మనంబునన్= మనస్సులో; భక్తుండు+అయ్యును=

భక్తుడైనా; భయంబునన్= భయంచేత; జరాసంధునకున్; వాక్, కర్మంబులన్= మాటలతో, చేతలతో; పనిచేయుచున్+ఉండున్= పనిచేస్తూ ఉంటాడు; చేదిపతులలోనన్= చేది రాజుల్లో; పురుష+ఉత్తముండును; అంగ, వంగ, పుండ్ర, కిరాత, పతులలోనన్= అంగ, వంగ, పుండ్ర, కిరాత రాజుల్లో; పౌండ్రకవాసుదేవుండున్; మదీయ, నామంబులు; దాల్చి= నాయొక్క పేర్లు పెట్టుకొని; జరాసంధున్; కొలుతురు(కొలుచుదురు)= సేవిస్తున్నారు; ప్రాక్+ దక్షిణ, దిక్+భూముల, రాజులు= తూర్పు, దక్షిణ దిక్కుల్లో ఉన్న రాజులు; పురుజితుండును; కరూశ, కలభ, నకుల, సంకర్షణ, సూపహిత, మనోదత్త, చక్ర, సాల్వేయ, యవనులును; వానిన్+అ= ఆ జరాసంధుణ్ణే; సేవింతురు= కొలుస్తారు; ఉదీచ్యులు+అయిన= ఉత్తర దిక్కులో ఉన్న; అష్టాదశ, క్షత్ర కులంబులవారును= పద్దెనిమిది క్షత్రియ వంశాలవాళ్ళూ; ఉత్తరపాంచాల, శూరసేన, పుష్కర, పుళింద, కళింగ, కుంతి, మత్స్యదేశంబుల; రాజులు+ఎల్లను= రాజులంతా; తత్+ భయంబునన్= ఆ జరాసంధునివల్ల కలిగిన భయంచేత; తమతమదేశంబులన్ విడిచి; ఉన్నవారలు; మఱియును.

తాత్పర్యం: కౌశిక చిత్రసేను లనే పేర్లుగల ఆ హంసడిభకు లిద్దరు పెద్దసైన్యంతో జరాసంధుడికి కుడి ఎడమభుజాల్లా ప్రవర్తిల్లుతున్నారు. అంతేకాదు, వరుణునిఅంతటి బలవంతుడైన పడమటిదేశ ప్రభువు భగదత్తుడు- మీ తండ్రి పాండురాజుకు స్నేహితుడే. నీపట్ల మనస్సులో భక్తి కలవాడే. అయినా జరాసంధునికి భయపడి మాటల్లో, చేతల్లో అతనినే అనుసరిస్తున్నాడు. చేదిరాజుల్లో పురుషోత్తముడు, అంగ, వంగ, పుండ్ర, కిరాత రాజుల్లో పౌండ్రక వాసుదేవుడు నాపేర్లు పెట్టుకొని జరాసంధుణ్ణి సేవిస్తున్నారు. తూర్పు దక్షిణ దేశాల రాజులు- పురుజితుడు, కరూశ, కలభ, నకుల, సంకర్షణ, సూపహిత, మనోదత్త, చక్ర, సాల్వేయ, యవనులు అతనినే కొలుస్తున్నారు. ఉత్తర దిక్కున ఉండే పదునెనిమిది రాజవంశాలవారు, ఉత్తరపాంచాల, శూరసేన, పుష్కర, పుళింద, కళింగ, కుంతి, మత్స్యదేశంబుల రాజు లందరు జరాసంధుని భయంతో తమతమదేశాలు విడిచి వెళ్ళారు.

ఉ. ఘోరరణంబులోన నధికుం గృతబంధు జనాపకారు నే
దారుణ లీలఁ గంసు నతిదర్పితుఁ జంపుటఁ జేసి, యమ్మహా
క్రూరుఁడు కంసుభార్య దన కూఁతురు గావున, దానిసంతత
ప్రేరణ నా కుపద్రవముఁ బెక్కు విధంబులఁ జేసె నీసునన్. 114

ప్రతిపదార్థం: నేన్= నేను; ఘోర, రణంబులోనన్= భయంకరమైన యుద్ధంలో; అధికున్= బలవంతుడైనవానిని; కృత, బంధుజన+అపకారున్= బంధుజనులకు అపకారాలు చేసినవానిని; అతి, దర్పితున్= మిక్కిలి గర్వించినవానిని; కంసున్= కంసుణ్ణి; దారుణలీలన్= ఘోరమైన పద్ధతిలో; చంపుటన్, చేసి= చంపటంచేత; కంసు, భార్య= కంసునియొక్క భార్య; తన, కూఁతురు, కావునన్; దాని= ఆ కంసుని భార్యయొక్క; సంతత= ఎడతెగని; ప్రేరణన్= ప్రేరేపణచేత; ఆ+మహా+క్రూరుఁడు= పరమ దుర్మార్గుడైన ఆ జరాసంధుడు; ఈసునన్= రోషంతో; నాకున్; ఉపద్రవమున్= కీడును; పెక్కు, విధంబులన్= అనేక విధాలుగా; చేసెన్= చేశాడు.

తాత్పర్యం: బలవంతుడు, బంధుజనులకు అపకారం చేసినవాడు, గర్వంతో విర్రవీగేవాడు అయిన కంసుణ్ణి నేను ఘోరంగా వధించాను. కంసునిభార్య తనకూతురు కావటంచేత ఆమెప్రేరణతో పరమదుర్మార్గు డైన ఆ జరాసంధుడు నామీద వైరంపూని అనేకవిధాల నాకు అపకారం చేశాడు.

విశేషం: జరాసంధుడు శ్రీకృష్ణాదులకు ఉపద్రవం కలిగించటానికి గల అర్థహేతువును చెప్తుతూ వస్తుస్వభావస్ఫుటత్వాన్ని కలిగించినట్లు రచించిన ఈ పద్యంలో అర్థవ్యక్తి అనే శబ్దగుణం ఉన్నది. ఇది ప్రసాదగుణంలో అంతర్భవించేది. (సంపా.)

క. భూమీశ! హంసడిభకులు । నా మగధాధీశ్వరుండు నమ్మువ్వురు ను
ద్దామ భుజవీర్య సంపద । తో మూఁడుజగములు నోపుదురు సాధింపన్. 115

ప్రతిపదార్థం: భూమి+ఈశ!= భూపతీ! ఓధర్మరాజా!; హంసడిభకులున్; ఆ+మగధ+అధీశ్వరుండున్= ఆమగధరాజైన జరాసంధుడు; ఆ+మువ్వురున్= ఆ ముగ్గురూ; ఉద్దామ, భుజ, వీర్య, సంపదతోన్= అధికమైన భుజబలంయొక్క సంపదతో (పెంపుతో); మూడు, జగములన్= ముల్లోకాలను; సాధింపన్= జయించటానికి; ఓపుదురు= చాలుదురు.

తాత్పర్యం: ధర్మరాజా! హంసడిభకులు, ఆ మగధరాజైన జరాసంధుడు - ముగ్గురూ తమ భుజ బల పరాక్రమంతో ముల్లోకాలనైనా జయించగలరు.

వ. ఆ జరాసంధుండును నాయుధనిహతులు గాని హంసడిభకులతో వచ్చి మధురపై విడిసిన నతి వీరులయిన యదు వృష్ణిభో జాంధక వరు లష్టాదశ సహస్ర రథవ్రాతంబులతో నేమును సమకట్టి మహాయుద్ధంబు సేయుచు వాని నెట్లును జయింపరాకున్న నుపాయంబున హంసుండు సమరనిహతుం డయ్యె నని డిభకునకుం జెప్పంబంచిన నప్పలుకులు నిక్కువంబ కా వగచి. 116

ప్రతిపదార్థం: ఆ, జరాసంధుండును; ఆయుధ, నిహతులు, కాని= ఆయుధంచేత చావులేని; హంస, డిభకులతో; వచ్చి; మధురపై= మధురానగరంపై; విడిసినన్= దండెత్తగా; అతి, వీరులు+అయిన= గొప్ప వీరులైన; యదు, వృష్ణి, భోజ+అంధక, వరులు= యదువృష్ణిభోజాంధక శ్రేష్ఠులు; అష్టాదశసహస్ర, రథ, సమూహములతోన్= పదునెనిమిది వేల రథ సమూహాలతో; ఏమును= మేమును; సమకట్టి= పూనుకొని; మహాయుద్ధంబు; చేయుచున్; వానిన్= ఆ జరాసంధుని; ఎట్లును= ఏవిధంగాకూడా; జయింపరాక+ఉన్నన్= గెలవలేకుండా ఉండగా; ఉపాయంబునన్= యుక్తిచేత; హంసుండు; సమరనిహతుండు+అయ్యెన్+ అని= యుద్ధంలో చంపబడినవాడయ్యాడని-అంటే యుద్ధంలో మరణించాడని; డిభకునకున్+చెప్పన్+పంచినన్= డిభకునికి చెప్పి పంపగా; ఆ+పలుకులు= ఆమాటలు; నిక్కువంబు+అ, కా= నిజమే అని; వగచి= దుఃఖించి(తలచి).

తాత్పర్యం: ఆయుధాలవల్ల చావు లేని ఆ హంసడిభకులతో కలసి ఆ జరాసంధుడు మధురమీద దండెత్తాడు. ఆసమయంలో మేముకూడ మహావీరులైన యదువృష్ణి భోజాంధక శ్రేష్ఠులు పద్దెనిమిదివేలమంది రథికులతో అతణ్ణి ఎదిరించి ఎంత యుద్ధం చేసినా విజయం లభించటం లేదు. అప్పు డొక ఉపాయం పన్నాము. హంసుడు యుద్ధంలో మరణించా డని డిభకునికి చెప్పి పంపాము. ఆ మాటలు నమ్మి ఎంతో దుఃఖించి.

చ. 'అనవరతంబు నిష్టుఁడగు హంసుఁడు లేని జగంబులోని జీ
వన మది యేల నా' కనుచు వారినిమగ్న శరీరుఁ డై క్షణం
బున డిభకుండు మృత్యుగతిఁ బొందె; ఘనంబుగ; దాని నక్కడన్
విని మృతుఁడయ్యె హంసుఁ డతివీరుఁడు తద్గత సౌహృదంబునన్. 117

ప్రతిపదార్థం: అనవరతంబున్= ఎల్లప్పుడు; ఇష్టుఁడు+అగు= ప్రియమైనవా డయిన; హంసుఁడు; లేని; జగంబులోని= ప్రపంచంలోని; జీవనము= బ్రదుకు; అది, నాకు, ఏల, అనుచు; వారి, నిమగ్న, శరీరుఁడు+ఐ= నీళ్ళలో పూర్తిగా మునిగిన శరీరం కలవాడై; క్షణంబునన్; డిభకుండు; మృత్యు, గతిన్+పొందెన్= మరణవిధాన్ని పొందాడు అంటే- మరణించాడు;

ఘనంబుగ= గట్టిగా; దానిన్= ఆ మరణవార్తను; అక్కడన్= యుద్ధభూమిలో; విని; తత్, గత, సౌహృదంబునన్= అతని పట్ల ఉన్న స్నేహభావంచేత; అతివీరుఁడు, హంసుఁడు= మహావీరుడైన హంసుడు; మృతుఁడు+అయ్యెన్= మరణించాడు.

తాత్పర్యం: తనకు అత్యంతం ఇష్టుడైన హంసుడు లేని లోకం ఎందుకని డిభకుడు నీళ్ళలో మునిగి ప్రాణాలు వదిలాడు. అది విని హంసు డిక్కడ డిభకునిమీది స్నేహభావంతో ఊపిరి విడిచాడు.

వ. అట్లు కౌశిక చిత్రసేనులు పరలోకగతులైన నసహాయుండై జరాసంధుండు మగిడి మగధపురంబునకుం జనియె; నేమును వానితోడి వైరంబు బలవంతంబైన, నమ్మధుర నుండ నొల్లక కుశస్థలంబునకు వచ్చి రైవతక పర్వతంబున ఘనంబుగా దుర్గంబు నిర్మించికొని భవదాశ్రయంబున సుఖంబున్నవారము. 118

ప్రతిపదార్థం: అట్లు= ఆవిధంగా; కౌశిక చిత్రసేనులు= హంసడిభకులు; పరలోక గతులు+ఐనన్= పరలోకానికి వెళ్ళినవాళ్ళు కాగా - అంటే మరణించగా; అసహాయుండు+ఐ= సాయంలేనివాడై; జరాసంధుండు; మగిడి= వెనుదిరిగి; మగధ పురంబునకున్; చనియెన్= వెళ్లాడు; ఏమును= మేము కూడా; వానితోడన్, వైరంబు; బలవంతంబు+ఐనన్= (బలం కలది) ఎక్కువకాగా; ఆ, మధురన్= ఆ మధురా నగరంలో; ఉండన్+ఒల్లక= ఉండటానికి ఇష్టపడక; కుశస్థలంబునకున్; వచ్చి; రైవతక పర్వతంబున; ఘనంబుగాన్= గట్టిగా; దుర్గంబు= కోటను; నిర్మించికొని= కట్టుకొని; భవత్+ఆశ్రయంబునన్= నీ అండలో; సుఖంబు+ఉన్నవారము= సుఖంతో ఉన్నాము.

తాత్పర్యం: ఆ విధంగా హంస డిభకులు హతులుకాగా జరాసంధుడు నిస్సహాయుడై-తన రాజధాని మగధకు మరలి వెళ్ళాడు. మేముకూడ అతనితో వైరం అధికం కాగా, ఆమధురానగరాన్ని వదలి కుశస్థలంలో రైవతకాద్రిమీద గట్టికోట కట్టుకొని, నీ అండలో సుఖంగా ఉన్నాము.

విశేషం: శక్తిమంతులైన బంధువు లుంటే శత్రుబాధ ఉండదు. భీమార్జునుల బలపరాక్రమాలు ప్రసిద్ధాలు; శత్రుభయంకరాలు. శ్రీకృష్ణునికి పాండవులతో బాంధవ్యమే కాక ప్రగాఢమైత్రికూడ ఉంది. బలవంతులైన పాండవుల ప్రాపు ఉన్న శ్రీకృష్ణునిమీదికి దండెత్తటానికి జరాసంధుడు సాహసించలేడు. అందుకే నీ అండతో మేము సుఖంగా ఉన్నా మని ధర్మరాజుతో శ్రీకృష్ణు డన్నాడు. పైగా ఈమాట జరాసంధునిమీద పాండవుల్ని ఉసిగొల్పటానికై కూడ ఉపయోగపడుతుంది. మూలంలో - 'సామర్థ్యవంతః సంబంధా ధ్రువస్తం సముపాశ్రితాః' - అని కూడా ఉంది. వానితోడన్, వైరంబు-సమాసంలో చేత, తోడ, వలనలకు ఇత్వం అవుతుంది కనుక - వానితోడి వైరంబు. సుఖంబు+ఉన్నవారము - ప్రథమావిభక్తి తృతీయార్థంలో వాడబడింది - సుఖంతో ఉన్నవారము.

చ. ఖలుఁడు బృహద్రథాత్మజుఁడు గర్వితుఁడై మహిలోని రాజులం
బెలుకుఱఁ బట్టి తెచ్చి చెఱఁబెట్టి గిరివ్రజమ న్పురంబులోఁ
జొలయక నిత్య మొక్కొకని సూనరివోలె వధించి నేమమున్
బలిమియు నేర్పడం గడఁగి భైరవపూజ యొనర్చు నుగ్రుఁడై. 119

ప్రతిపదార్థం: బృహద్రథ+ఆత్మజుఁడు= బృహద్రథుని కుమారుడైన జరాసంధుడు; ఖలుఁడు= దుర్మార్గుడు; గర్వితుఁడు+ఐ= గర్వించిన వాడై; మహిలోని రాజులన్= భూమిలోని రాజులందరిని; పెలుకుఱన్+పట్టి= భయపడేటట్లుగా బంధించి; తెచ్చి; గిరివ్రజము+అన్+పురంబులోన్= గిరివ్రజమనే పేరుగల నగరంలో; చెఱన్+పెట్టి= చెరసాలలో బంధించి; చొలయక= వెనుకాడక;

నిత్యము+ఒక్కొకనిన్= ప్రతిదినం ఒక్కొకరిని; సూనరి, పోలెన్= కసాయివానిలా; వధించి= చంపి; నేమమున్= నియమాన్ని; బలిమియున్= బలాన్ని; ఏర్పడన్= స్పష్టమయ్యేటట్లు; కడఁగి= పూని; ఉగ్రుఁడు+ఐ= భయంకరుడై; భైరవపూజ= భైరవరూపుడైన రుద్రుని పూజ; ఒనర్చున్= చేస్తున్నాడు.

తాత్పర్యం: దుర్మార్గుడు, గర్వితుడు అయిన జరాసంధుడు లోకంలోని రాజులనందరినిపట్టి బంధించి, రోజుకు ఒక్కడి వంతున తన నియమం, బలం ప్రకటమయ్యేటట్లు కసాయివానిలా వాళ్ళను వధించి, భయంకరంగా భైరవపూజ చేస్తున్నాడు.

క. ధరణీశ! వానిఁ జంపుడు । నురుతర సామ్రాజ్య విభవ మున్నతితో సు
స్థిరమగు నీకును; మఱి భా । సురముగ సమకూరు రాజసూయము సేయన్. 120

ప్రతిపదార్థం: ధరణీ+ఈశ= భూపతి అయిన ఓధర్మరాజా!; వానిన్= ఆ జరాసంధుడిని; చంపుడున్= చంపిన అనంతరం; నీకును; ఉరుతర, సామ్రాజ్య, విభవము= అధికమైన సామ్రాజ్యవైభవం; ఉన్నతితోన్= గొప్పగా; సుస్థిరము+అగున్= గట్టిగా స్థిరపడుతుంది; మఱి= అంతేకాక; భాసురముగన్= ప్రకాశమానంగా; రాజసూయము, చేయన్= రాజసూయయాగం చేయటానికి; సమకూరున్= సాధ్యమవుతుంది.

తాత్పర్యం: ఓ ధర్మరాజా! ఆ జరాసంధుణ్ణి సంహరిస్తే నీ సామ్రాజ్య వైభవం గొప్పగా స్థిరపడుతుంది. అంతేకాక జగత్ ప్రసిద్ధంగా రాజసూయం చేయటం కూడ సాధ్యమౌతుంది.

సీ. రక్షణంబున భగీరథుఁడు, జయంబున । నయ్యౌవనాశ్వుండు, నత్యుదగ్ర
బాహుబలంబున భరతుండు, తపమునఁ । గార్తవీర్యుండును, గరముబుద్ధి
నమ్మరుత్తుండును, నఖిల సామ్రాజ్యంబుఁ । బడసిరి తొల్లి భూపాల! యిప్పు
డిన్ని గుణంబులు నెన్నంగఁ గలవు నీ; । కిది యేమి దుర్లభ, మిద్దురాత్ముఁ

ఆ. డెంత బలియుఁడయ్యు, నెంత గర్వితుఁడయ్యుఁ । దన కఠోర దుష్ప్రతాపమునను
విగతవిభవుఁ డగు; వివేకవిహీనుల । కైన లక్ష్మి సుచిర మగునె యెందు? 121

ప్రతిపదార్థం: భూపాల!= భూమిని ఏలే ఓ ధర్మరాజా!; తొల్లి= పూర్వం; రక్షణంబునన్= ప్రజల్ని రక్షించటంచేత; భగీరథుండు; జయంబునన్= విజయంచేత; యౌవనాశ్వుండున్; అతి+ఉదగ్ర; బాహు, బలంబునన్= మిక్కిలి భయంకరమైన భుజబలంచేత; భరతుండు; తపమునన్= తపోబలంచేత; కార్తవీర్యుండును; కరము= మిక్కిలి; బుద్ధిన్= బుద్ధిబలంచేత; ఆ+మరుత్తుండును; అఖిల సామ్రాజ్యంబున్= సమస్త సామ్రాజ్యాన్ని; పడసిరి= పొందారు; ఇప్పుడు; ఇన్ని, గుణంబులున్= వాళ్ళందరిలోఉన్న ఈ సుగుణాలన్నీ; ఎన్నంగన్= లెక్కిస్తే; నీకున్; కలవు; ఇది= ఈరాజసూయయాగం చెయ్యటం; ఏమి, దుర్లభము= ఏమి కష్టం?; ఈ దురాత్ముఁడు= ఈదుర్మార్గుడైన జరాసంధుడు; ఎంత, బలియుఁడు+అయ్యున్= ఎంత బలం కలవాడైనప్పటికి; ఎంత, గర్వితుఁడు+అయ్యున్= ఎంతగర్వం కలవాడైనప్పటికి; తన= తనయొక్క; కఠోర= తీవ్రమైన; దుష్ప్రతాపమునను= చెడుపరాక్రమంచేత; విగత, విభవుఁడు+అగున్= కోల్పోయిన వైభవం కలవా డౌతాడు; ఎందున్= ఎక్కడైనా; వివేక, విహీనులకున్+ ఐన, లక్ష్మి= వివేకం లేని వాళ్ళకు లభించిన సంపద; సుచిరము+అగును+ఎ= ఎంతో ఎక్కువకాలం ఉంటుందా? - ఉండదు.

తాత్పర్యం: ధర్మరాజా! పూర్వం భగీరథుడు ప్రజారక్షణచేత, యౌవనాశ్వుడు విజయసాధనచేత, భరతుడు భయంకర భుజబలంచేత, కార్తవీర్యుడు తపోబలంచేత, మరుత్తుడు బుద్ధిబలంచేత సమస్త సామ్రాజ్యాన్ని పొందారు. ఇప్పు డీ సుగుణాలన్నీ నీలో ఉన్నాయి. అందువలన రాజసూయం చేయటం ఏం కష్టం? జరాసంధుడు ఎంత బలవంతుడైనా, గర్వితుడైనా అతని పరాక్రమం చెడుమార్గంలో ప్రవర్తిల్లటంచేత అతని వైభవం పతనం కాక తప్పదు. వివేకశూన్యులసంపద స్థిరంగా ఉండదు కదా!

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

భీమసేనార్జునులు ధర్మరాజున కుత్సాహంబు గలిగించుట (సం. 2-14-7)

వ. అనిన విని భీమసేనుండు ధర్మరాజున కిట్లనియె. 122

తాత్పర్యం: అని కృష్ణుడు అనగా విని భీముడు ధర్మరాజుతో ఇలా అన్నాడు.

క. ఆరంభరహితుఁ బొందునె । యారయ సంపదలు? హీనుఁ డయ్యును బురుషుం
డారంభశీలుఁ డయి యకృ । తారంభుల నోర్చు నెంత యధికుల నయినన్. 123

ప్రతిపదార్థం: ఆరయ= విచారిస్తే; ఆరంభరహితున్= ప్రయత్నమే చేయనివానిని; సంపదలు; పొందును+ఎ; పురుషుండు; హీనుఁడు+అయ్యును= బలహీనుడైనా; ఆరంభ, శీలుఁడు+అయి= ప్రయత్నం చేసే స్వభావం కలవాడై; అకృత+ఆరంభులన్= చేయబడని ప్రారంభం కలవారిని, అంటే- ప్రయత్నమే చెయ్యనివాళ్ళను; ఎంత, అధికులన్+అయినన్= ఎంత బలవంతులనైనా; ఓర్చున్= జయిస్తాడు.

తాత్పర్యం: లోకంలో ప్రయత్నమే చేయనివాడికి సంపదలు సమకూరవు. బలహీనుడైనా సరే పురుషుడు తాను ప్రయత్నం చేసే స్వభావం కలవాడైతే, ప్రయత్నమే చెయ్యని ఎంత బలవంతులనైనా జయించగలడు.

క. కడు నధికుతోడఁ దొడరినఁ । బొడిచిన నొడిచినను బురుషు పురుషగుణం బే
ర్పడుఁగాక, హీను నొడుచుట । కడిఁదియె? పౌరుషము దానఁ గలుగునె చెపుమా! 124

ప్రతిపదార్థం: కడున్+అధికుతోడన్= మిక్కిలి బలవంతునితో; తొడరినన్= ఎదుర్కొంటే; పొడిచినన్= పోట్లాడితే; ఒడిచినన్= ఓడిస్తే; పురుషు= పురుషుడియొక్క; పురుషగుణంబు= పౌరుషం; ఏర్పడున్, కాక= ప్రకాశిస్తుంది కాని; హీనున్= బలహీనుని; ఒడుచుట= ఓడించటం; కడిఁది+ఎ= గొప్పయా? కాదు; దానన్= దానివలన; పౌరుషము; కలుగునె; చెపుమా?

తాత్పర్యం: లోకంలో బలవంతునితో వైరం పూనినా, యుద్ధం చేసినా, అతణ్ణి ఓడించినా పురుషుని పౌరుషం ప్రకాశిస్తుంది. అంతేకాని బలహీనుణ్ణి ఓడించటం ఒక విశేషమా? అది పరాక్రమమా?

విశేషం: శ్రీకృష్ణుడు జరాసంధుని బలపరాక్రమాల్ని ప్రశంసించింది ధర్మరాజుకొరకే అయినా, ఆ ప్రశంస ప్రక్కనే ఉన్న భీమసేనునిలో కయ్యపువేడిని గొప్పగా పుట్టించింది. ఆ జగన్నాటక సూత్రధారిమాటలు, చేతలు బహుళార్థసాధకాలు కదా!

క. **ఈహరి కరుణయు నర్జును । సాహాయ్యముఁ గలుగ నీ ప్రసాదమున జగ**
ద్ద్రోహు జరాసంధు మహా । సాహసు వధియింతు నుగ్ర సంగ్రామమునన్. **125**

ప్రతిపదార్థం: ఈ, హరి, కరుణయున్= ఈకృష్ణునియొక్కదయ; అర్జును, సాహాయ్యమున్= అర్జునునియొక్క తోడ్పాటు; కలుగన్= కలిగితే; నీ ప్రసాదమునన్= నీ అనుగ్రహంచేత; జగత్+ద్రోహు, జరాసంధు= లోక ద్రోహి అయిన జరాసంధుణ్ణి; మహాసాహసున్= మిక్కిలి సాహసం కలవాణ్ణి; ఉగ్ర, సంగ్రామమునన్= భయంకరమైన యుద్ధంలో; వధియింతున్= చంపుతాను.

తాత్పర్యం: శ్రీకృష్ణుని దయ, అర్జునుని సాహాయ్యం నాకు ఉంటే, నీ అనుగ్రహంతో లోకద్రోహి, మహాసాహసుడు అయిన జరాసంధుణ్ణి భీకరసంగ్రామంలో సంహరిస్తాను.

తే. **అనఘ! యేము ముప్వురము మూఁడగ్నులట్లు । నీ మహాయజ్ఞ కార్యంబు నిర్వహింతు**
మా జరాసంధ పశువున నఖిల శాత్ర । వాహుతులఁ జేసి తృప్తుల మగుచు బలిమి. **126**

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడవైన ధర్మరాజా!; ఏము, ముప్వురము= మేము ముగ్గురం; మూఁడు+అగ్నుల+అట్లు= ఆహవనీయ; దక్షిణ, గార్హపత్యా లనే మూడు అగ్నుల్లా; జరాసంధ, పశువునన్= జరాసంధు డనే బలిపశువుతో; అఖిల, శాత్రవ+ఆహుతులన్+చేసి= సమస్త శత్రువు లనే హోమద్రవ్యాలతో - ఆహుతులతో; తృప్తులము+అగుచున్= తృప్తిచెందిన వాళ్ళమై; బలిమిన్= బలంతో; నీ, మహా, యజ్ఞ, కార్యంబు, నిర్వహింతుము= నీ రాజసూయ మహాయజ్ఞ కార్యాన్ని నిర్వహిస్తాము.

తాత్పర్యం: మేము ముప్వురం ఆహవనీయ, దక్షిణ, గార్హపత్యాలనే మూడు అగ్నుల్లా జరాసంధు డనే బలిపశువుతో, సర్వశత్రువులనే ఆహుతులతో నీరాజసూయమహాయజ్ఞకార్యాన్ని నిర్వహిస్తాము.

విశేషం: అలం: ఉపమ, రూపకం. ఆహవనీయ, దక్షిణ, గార్హపత్యాలు త్రేతాగ్నులు. ఇవి క్రమంగా వేదికి పూర్వ, దక్షిణ, పశ్చిమదిశలలో ఉంటాయి. ఇవిగాక సభ్యం, అపసభ్యం అనేవి ఈశాన్యదిశలో ఉంటాయి. పై పద్యానికి 3,4 పాదాలకు సంబంధించి 'శస్త్రాస్త్రతీవ్రహతిని జేసియుఁదృప్తుల మగుచు బలిమి - దివ్యాస్త్రశస్త్రహతునిఁగాఁ జేసి' వంటి పాఠాంతరా లున్నాయి. జరాసంధుడు శస్త్రాస్త్రాలచేత వధించ సాధ్యంకానివాడు. అందుచేత ఈ పాఠాంతరాలు ఉచితాలు కావనిపిస్తుంది.

వ. **అనిన భీమసేను విక్రమవచనంబుల కనుగుణంబుగా నర్జునుం డిట్లనియె.** **127**

ప్రతిపదార్థం: అనినన్; భీమసేను= భీమసేనుడియొక్క; విక్రమ, వచనంబులకున్= పరాక్రమంతో కూడిన మాటలకు; అనుగుణంబుగాన్= తగినట్లుగా; అర్జునుండు+ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని భీమసేనుడు అనగా, అతని పరాక్రమవాక్యాలకు తగ్గట్లు అర్జునుడు కూడ ఈ విధంగా అన్నాడు.

ఉ. **భూభుజులన్ జయింపుము, విభూతి నొనర్పుము రాజసూయమున్,**
నాభుజ వీర్య విక్రమ గుణంబులకుం దగుచున్న యీ ధను
ర్లాభము, దివ్య బాణరథలాభము, శోభితమైన యీ సభా
లాభము నొందుపాట సఫలత్వముఁ బొందునె కౌరవేశ్వరా! **128**

ప్రతిపదార్థం: కౌరవ+ఈశ్వరా!= కురువంశ ప్రభుడవైన ఓ ధర్మరాజా!; భూ, భుజులన్= రాజులను; జయింపుము; రాజసూయమున్; విభూతిన్+ఒనర్పుము= ఐశ్వర్యంతోచేయుము; నా, భుజ, వీర్య, విక్రమ, గుణంబులకున్= నాయొక్క భుజ బల పరాక్రమగుణాలకు; తగుచున్+ఉన్న= తగినట్లుగా ఉన్న; ఈ, ధనుః+లాభము= ఈగాండీవ మనే మహాధనుస్సు లభించటం; దివ్య, బాణ, రథ, లాభము= దేవతాసంబంధాలైన బాణాలు, రథం లభించటం; శోభితము+ఐన= ప్రకాశించేదైన; ఈ, సభా, లాభమున్= ఈ మయ సభ లభించటం; ఒండుపాట= వేరొకవిధంగా; సఫలత్వమున్+పొందునె= సార్థకతను పొందుతాయా!

తాత్పర్యం: ఓ కౌరవేశ్వరా! ధర్మరాజా! రాజులందరిని జయించు. అపారమైన ఐశ్వర్యంతో రాజసూయం నిర్వహించు. అలా కాకుంటే నా భుజబలపరాక్రమ గుణాలకు తగినట్లు ఈ గాండీవం, ఈ దివ్యబాణాలు, ఈ దివ్యరథం, శోభాయమానమైన ఈ మయసభ పొందినందుకు ఫల మేముంది?

విశేషం: గాండీవ దివ్యబాణరథాలు పార్థుని భుజబల పరాక్రమాలకు ఫలాలుగా లభించిన దివ్యఫలాలైతే, శోభాయమానమైన మయసభ ఆయన శరణాగత రక్షణ గుణానికి ఫలంగా లభించిన మహాద్భుతఫలం. (ఇందులోని వీరరసదీప్తి ఉజ్జ్వలమై కాంతి అనే గుణాన్నీ, తద్ద్వారా ప్రసాదాన్నీ రూపుకట్టిస్తున్నది. - సంపా.)

క. కలరూప గుణ ద్రవ్యం । బులు విక్రమవంతునందు భూవిదితములై
నిలుచు నవిక్రమునకు నవి । గలిగియు లేని క్రియ నప్రకాశంబు లగున్. 129

ప్రతిపదార్థం: విక్రమవంతునందున్= పరాక్రమం కలవానివిషయంలో; కల, రూప, గుణ ద్రవ్యంబులు= ఉన్నరూపం, గుణం, సంపద; భూవిదితములు+ఐ= ప్రపంచప్రసిద్ధాలై; నిలుచున్= రాణిస్తాయి; అవిక్రమునకున్= పరాక్రమం లేనివాడికి; అవి= ఆ రూపగుణసంపదలు; కలిగియున్= ఉండికూడ; లేని, క్రియన్= లేనివిధంగా; అప్రకాశంబులు+అగున్= వెలుగు లేనివై పోతాయి.

తాత్పర్యం: పరాక్రమవంతుని రూపగుణ సంపదలు ప్రపంచ ప్రసిద్ధాలై రాణిస్తాయి. పరాక్రమహీనునికి అవి ఉన్నా లేనట్లే కాంతివిహీనా లౌతాయి.

విశేషం: భండార్కర్ ప్రతిలో (మూలంలో) 'ద్రవ్యభూతాః గుణాః సర్వే తిష్ఠంతి హి పరాక్రమే' అని మాత్రమే ఉన్నా 'కుల రూపగుణ...' అని పెక్కు ప్రతులలో ఉన్న పాఠమే మేల్తర మనిపిస్తుంది. ఎందుకంటే గుణద్రవ్యాలే కాక కులరూపాలు కూడ పరాక్రమవంతుడిపట్ల గొప్పగా రాణిస్తాయి కదా.

వ. 'మఱియు రాజసూయ మహాధ్వరంబు కారణంబుగాఁ బరాక్రమంబున జరాసంధు వధియించి నిఖిల క్షత్త్రియ నిగ్రహ మోక్షణంబు సేయునంతకంటె మిక్కిలి యశోధర్మంబు లొండెవ్వి?' యనిన భీమార్జునుల పలుకులకు సంతసిల్లి నారాయణుం డి ట్లనియె. 130

ప్రతిపదార్థం: మఱియు, రాజసూయ, మహా+అధ్వరంబు= రాజసూయమహాయాగం; కారణంబుగాన్; పరాక్రమంబునన్= శౌర్యంతో; జరాసంధున్, వధియించి; నిఖిల, క్షత్త్రియ, నిగ్రహ, మోక్షణంబు= అందరు రాజులకు చెరనుండి విముక్తి; చేయు, అంతకంటె= కలుగచెయ్యటంకంటె; మిక్కిలి= ఎక్కువైన; యశః, ధర్మంబులు= కీర్తి, ధర్మము; ఒండు+ఎవ్వి= వేరే ఏమున్నాయి; అనిన; భీమ+అర్జునుల; పలుకులకున్= మాటలకు; సంతసిల్లి= సంతోషించి; నారాయణుండు= శ్రీకృష్ణుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'రాజసూయ మహాయాగ కారణంగా జరాసంధుణ్ణి వధించి, అతనిచేత బంధితులైన రాజులనందరిని చెరనుండి విడిపించటంకంటె ఎక్కువ కీర్తి, ధర్మం, ఇంకేమున్నాయి?' అని పలికిన భీమార్జునుల పలుకులకు శ్రీకృష్ణుడు సంతోషించి ఇలా అన్నాడు.

క. వెలయ విధిదృష్ట నయమున । వలయుఁ బరాక్రమము సేయ వసుధేశ్వర య
గ్గల మగు బుద్ధియుఁ గడఁకయుఁ । గల పురుషుల కిదియె చూవె కర్తవ్య మిలన్. 131

ప్రతిపదార్థం: వసుధా+ఈశ్వర!= ఓభూనాథ! ధర్మరాజా!; వెలయన్= ప్రకాశించేటట్లుగా; విధి, దృష్ట, నయమునన్= శాస్త్రదృష్టితో కూడిన నీతితో; పరాక్రమము, చేయ, వలయున్= పరాక్రమం చూపాలి; అగ్గలము+అగు= అధికమైన; బుద్ధియున్; కడఁకయున్= ప్రయత్నంకూడా; కల; పురుషులకు; ఇలన్= భూమిమీద; కర్తవ్యము= చేయతగినది; ఇది+ఎ, చూవె= ఇదే సుమా!

తాత్పర్యం: ఓ ధర్మరాజా! శాస్త్రోక్తమైన ధర్మపద్ధతిలో పరాక్రమాన్ని ప్రదర్శించాలి. బుద్ధిబలం, ప్రయత్నం గల పురుషులకు భువిలో ఇదే సుమా కర్తవ్యం.

వ. 'కావున మేము మువ్వురముఁ గ్రమంబునం బరాక్రమించి జరాసంధుడాసి నదీప్రవాహంబులు వృక్షోన్మూలనంబు సేయునట్లు క్రమంబున వాని నిర్మూలితుం జేసెద; మద్దురాత్ముండు భూతంబులయం దంతరాత్మయుం బోలెఁ దన యంతరం బెఱుంగక యేకాంతశీలుఁడై సుఖం బనుభవించుటం జేసి వాని యంతికంబున కరుగుట యశ్రమం' బనిన నారాయణునకు ధర్మరా జిట్లనియె. 132

ప్రతిపదార్థం: కావున; మేము; ముప్వురమున్; క్రమంబునన్= వరుసగా; పరాక్రమించి; జరాసంధు, డాసి= జరాసంధుణ్ణి సమీపించి; నదీ ప్రవాహంబులు; వృక్ష, ఉత్+మూలనంబు, చేయు, అట్లు= చెట్లను వేళ్ళతో కూడ పెకలించి వేసేటట్లు; క్రమంబునన్; వాని= ఆ జరాసంధుణ్ణి; నిర్మూలితున్+చేసెదము= చంపివేయబడినవాడినిగా చేస్తాము - అంటే చంపివేస్తాము; ఆ+దురాత్ముండు= ఆ దుర్మార్గుడు; భూతంబుల, అందున్= ప్రాణుల్లో; అంతర్+ఆత్మయున్+పోలెన్= అంతరాత్మవలె; తన, అంతరంబు= తనమేర (తనకాలపరిమితి); ఎఱుంగక= తెలియక; ఏకాంత, శీలుఁడు+ఐ= ఒంటరిగా ఉండే స్వభావం కలవాడై; సుఖంబు+అనుభవించుటన్+చేసి= సుఖాన్ని అనుభవిస్తూ ఉండటంవల్ల; వాని= ఆ జరాసంధుని; అంతికంబునకున్= సమీపానికి; అరుగుట= వెళ్ళటం; అశ్రమంబు= కష్టం కాదు; అనిన; నారాయణునకున్= శ్రీకృష్ణునికి; ధర్మరాజు+ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'భీమార్జునులు, నేను- ముప్వురం విజృంభించి జరాసంధుణ్ణి ఎదుర్కొని నదీప్రవాహాలు చెట్లను వ్రేళ్ళతో కూడ పెకలించివేసేటట్లు పట్టుబట్టి అతణ్ణి నిర్మూలిస్తాం. ప్రాణుల్లోని అంతరాత్మలా తన ఉనికి, తన కాలపరిమితి తెలియకుండా ఏకాంతంగా ఉండే స్వభావం కలవాడై, సుఖాలు అనుభవిస్తూ ఉండటంచేత అతని సమీపానికి వెళ్ళటం కష్టం కా' దని శ్రీకృష్ణు డనగా ధర్మరాజు ఇలా అన్నాడు.

విశేషం: అలం: ఉపమ. ఇచట అర్థం సందిగ్ధంగా ఉంది.

"తే వయం యత్న మాసాద్య శత్రుదేశసమీపగాః, కథ మంతం న గచ్ఛేమ వృక్షస్యేవ నదీరయాః.
పరరంధ్రే పరాక్రాంతః స్వరంధ్రావరణే స్థితః, వ్యూఢానీకస్తు బలవాన్ నోపేయా ద్బలవత్తరమ్.

అనవద్యా హ్యసంబాధాః దృష్ట్వా శత్రుం సమీపతః, శత్రుదేశ ముపాక్రమ్య తం కామం ప్రాప్నుయామహే. ఏకోహ్యేవ శ్రియం నిత్యం బిభర్తి భరతర్షభ, అంతరాత్మేవ భూతానాం తత్క్షయే వై బలక్షయః'' -అని మూలం. 'ఎఱుంగకుండ' అని ఉంటే 'తా నుండే చోటు ఎవ్వరూ ఎఱుగకుండ' - అని అర్థం చెప్పవచ్చు. 'అద్దురాత్ముండు తన యంతరం బెఱుంగక భూతంబులం దంతరాత్మయుంబోలె' - అని ఉంటే అన్వయం సులభంగా ఉండేది.

ప్రాణుల్లో ఉండే అంతరాత్మ ఎవ్వరికీ అగుపించకుండ ఏకాంతంగానే ఉంటుంది. అంతేకాదు- తన కొక కాలపరిమితి ఉంటుం దన్న సంగతికూడ అది తెలుసుకోదు. అలా ఉంటాననే అనుకుంటూ ఉంటుంది. కాలం తీరగానే వెళ్ళిపోతుంది. అలాగే అసాధారణజన్మతో అపారబలసంపన్నుడు, అతిగర్వితుడు అయిన జరాసంధుడు తనకాలపరిమితినిగూర్చి తాను ఆలోచించుకోకుండా ఉండటంలో ఆశ్చర్యం లేదు. పైగా ఎంతో రహస్యస్థానంలో, ఉంటూ ఏకాంతజీవితం గడపటానికి అలవాటు పడ్డాడు కనుక, తన ఉనికిని ఎవ్వరూ కనిపెట్టలేరన్న ధీమాకూడా అతనికి ఉండవచ్చు. రహస్యస్థానానికి మార్గం తెలియాలే కాని- తెలిస్తే ఆ స్థానాన్ని చేరుకోవటం పెద్ద కష్టంకాదు. అక్కడ ఏకాంతంగా ఉన్న వ్యక్తిని అంతమొందించటం కూడ అంతకష్టంకాదు. అంతరాత్మ ఎక్కడ ఉన్నా పరమాత్మ ప్రవేశించటానికి శ్రమ ఏముంటుంది? అందుకే శ్రీకృష్ణుడు లౌకికంగానేకాక తాత్త్వికంగాకూడా జరాసంధుణ్ణి చేరటం కష్టం కా దని అంటున్నాడేమో.

క. దనుజాహిత! నీ కాహవ । మున నెదిరి మహోగ్ర దహనమునఁ బడియును గా
లని మిడుత వోలె నతికో । పనుఁడు జరాసంధుఁ డెట్లు బ్రదుకఁగ నేర్చున్? 133

ప్రతిపదార్థం: దనుజ+అహిత= రాక్షసులకు శత్రువైనవాడా, శ్రీకృష్ణా!; నీకున్; ఆహవమునన్= యుద్ధంలో; ఎదిరి= ఎదిరించి; అతికోపనుఁడు= అధికకోపం కలవాడైన; జరాసంధుడు; మహా+ఉగ్ర, దహనమునన్= మిక్కిలి భయంకరమైన నిప్పులో; పడియును; కాలని; మిడుత, పోలెన్= మిడుత పురుగువలె; ఎట్లు= ఏవిధంగా; బ్రదుకఁగన్= జీవించటానికి; నేర్చున్= జీవించగలడు ?

తాత్పర్యం: శ్రీకృష్ణా! యుద్ధంలో ని న్నెదిరించి ఆ జరాసంధుడు అతిభయంకరమైన అగ్నిలో పడ్డ మిడతలా మాడిపోకుండా బ్రతుకగలడా!

విశేషం: అలం: ఉపమ.

క. అట్టి యతి దారుణత్వము । నట్టి యజేయ భుజ విక్రమాధిక్యము వాఁ
డెట్టి క్రియఁ బడసె; నాతని । పుట్టిన విధ మెట్లు చెప్పు పొలుపుగ నాకున్. 134

ప్రతిపదార్థం: వాఁడు= ఆ జరాసంధుడు; అట్టి= ఆవిధమైన; అతి, దారుణత్వమున్= మహాక్రూర స్వభావాన్ని; అట్టి= అంతటి; అజేయ, భుజ, విక్రమ+ఆధిక్యమున్= జయింప సాధ్యంకాని భుజ పరాక్రమాతిశయం; ఎట్టి, క్రియన్, పడసెన్= ఏ విధంగా పొందాడు; ఆతని= అతడియొక్క; పుట్టిన విధము; ఎట్లు= ఎలాంటిదో; నాకున్; పొలుపుగ = ఒప్పుగా; చెప్పు= చెప్పుము.

తాత్పర్యం: ఆ జరాసంధుడికి అంత క్రూర స్వభావం, జయించటానికి సాధ్యంకాని అంత భుజ పరాక్రమం ఎలా వచ్చాయో, అతని పుట్టుక ఎలాంటిదో నాకు చెప్పు.

విశేషం: చెప్పుము+పొలుపుగ - హల్లు పరమైంది కనుక 'ము' లోపం- చెప్పు.

శ్రీకృష్ణుఁడు ధర్మజునకు జరాసంధుని జననక్రమ మెఱిఁగించుట (సం. 2-16-12)

వ. అని యడిగిన ధర్మరాజునకుఁ గృష్ణుం డిట్లనియె. 135

తాత్పర్యం: అని అడిగిన ధర్మరాజుతో శ్రీకృష్ణుడు ఈవిధంగా అన్నాడు.

సీ. అతిసమర్థుండు బృహద్రథుం డనువాఁడు । మగధాధినాథుఁ డున్మార్గదూరుఁ,
డక్షౌహిణీ త్రితయంబు బలంబునఁ । బరుల నోడించిన బలిమికాఁడు,
కాశిరా జనువానిగాదిలికూఁతులఁ । గవల వారల నతికాంతిమతుల
నమరంగఁ బెండ్లి యై యనుపమప్రీతి న । య్యిరువురయందు భోగేచ్ఛ సలిపి

తే. యం దపత్యంబు వడయుదు నని తలంచి । విప్ర ముని దేవ పూజల వివిధవిధులఁ
బుత్త్రకామేష్టులను నొండు పుణ్యకర్మ । యుక్తులను జేసి పడయంగ నోప కలసి. 136

ప్రతిపదార్థం: అతి సమర్థుండు= మిక్కిలి సమర్థుడైన; మగధ+అధినాథుఁడు= మగధదేశపురాజు; బృహత్+రథుండు; అనువాఁడు= అనే పేరున్నవాడు; ఉన్మార్గదూరుఁడు= చెడునడవడికి దూరమైనవాడు; అక్షౌహిణీ, త్రితయంబు, బలంబునన్= మూడు అక్షౌహిణుల సైన్యంతో; పరులన్= శత్రువులను; ఓడించిన; బలిమికాఁడు= బలవంతుడు; కాశిరాజు+అనువాని; గాదిలికూఁతులన్= ప్రియమైన పుత్రికలను; కవల వారలన్= ఒకేసారి జన్మించిన జంట పిల్లలను; అతికాంతిమతులన్= మిక్కిలి తేజస్సుతో వెలిగేవాళ్ళను; అమరంగన్= ఒప్పుగా; పెండ్లి+ఐ= పెండ్లిచేసికొని; అనుపమప్రీతిన్= సాటిలేని ప్రేమతో; ఆ+ఇరువుర+అందున్= ఆ ఇద్దరు భార్యల ద్వారా; భోగ+ఇచ్ఛ= సంభోగ సంబంధమైన కోరిక; సలిపి; అందున్= ఆ భార్యల ఇద్దరి ద్వారా; అపత్యంబున్= సంతానాన్ని; పడయుదున్+అని= పొందుతానని; తలంచి; విప్ర, ముని, దేవపూజలన్= బ్రాహ్మణులను, మునులను, దేవతలను, పూజించటంచేత; వివిధ, విధులన్= అనేక శాస్త్రోక్త పద్ధతులచేత; పుత్రకామ+ఇష్టులన్= పుత్త్రులను కోరి చేసే యాగాలచేత; ఒండు= ఇతరాలైన; పుణ్య, కర్మ, యుక్తులను= పుణ్యకార్యాలతో కూడ; పడయంగన్+ఓపక= పుత్రులను పొందనేరక; అలసి= విసిగి.

తాత్పర్యం: మహాసమర్థుడైన మగధరాజు బృహద్రథుడు అక్రమ మార్గాలను అనుసరించకుండ, మూడుఅక్షౌహిణుల సైన్యంతో శత్రురాజుల్ని ఓడించాడు. కాశీరాజుకూర్మిపుత్రికల్ని, అందమైన కవలపిల్లల్ని వివాహమాడాడు. అమితప్రీతితో, ఆ యిద్దరితో అనేక సంభోగ సుఖాలు అనుభవించాడు. సంతానకాంక్షతో దేవ బ్రాహ్మణ ముని పూజలు చేశాడు. శాస్త్రనియమానుసారం పుత్రకామేష్టి యాగాలు, పెక్కుపుణ్యకార్యాలు చేశాడు. అయినా పుత్రుల్ని పొందలేక జీవితంలో విసిగిపోయాడు.

విశేషం: అక్షౌహిణి - 21870 రథాలు, అదేసంఖ్యలో ఏనుగులు, 65610 గుర్రాలు, 109350 పదాతులు గల సేనాసమూహం.

వ. 'పుత్త్రుండు లేని విభవంబు లన్నియు నేల?'యని నిర్వేదించి పత్నీద్వయ సమేతుండయి వనంబున కరిగి. 137

ప్రతిపదార్థం: పుత్త్రుండు; లేని; విభవంబులు+అన్నియున్= సంపదలన్నీ; ఏల; అని; నిర్వేదించి= నిరాశచెంది; పత్నీద్వయ సమేతుండు+అయి= భార్యలిద్దరితో కూడినవాడై; వనంబునకున్+అరిగి= అడవికి వెళ్ళి.

తాత్పర్యం: పుత్రులు లేని సంపదలు ఎందుకని నిరాశచెంది, భార్యలిద్దరితో కలిసి బృహద్రథుడు అడవికి వెళ్ళి.

ఉ. **ఆ విపినాంతరంబున నిరంతర నిష్ఠ ననంత మోక్షకాం**
క్షావిధి నొక్క బాల సహకార మహీజము క్రింద నుజ్జ్వల
త్పావకతేజుఁడై తపము పాయక చేయుచు నున్న ధన్యుఁ గా
క్షీవతుఁ గాంచె గౌతము నకిల్బిషమానసుఁ జండకౌశికున్. **138**

ప్రతిపదార్థం: ఆ+విపిన+అంతరంబునన్= ఆ, అడవి మధ్యలో; నిరంతర, నిష్ఠన్= ఎడతెగని నియమంతో; అనంత, మోక్ష, కాంక్షా, విధిన్= అంతులేని మోక్షం పట్ల కోరికతో కూడిన విధానంతో; ఒక్క, బాల, సహకార, మహీజము, క్రిందన్= లేతమామిడి చెట్టు క్రింద; ఉత్+జ్వలత్+పావక, తేజుఁడు+ఐ= బాగా మండుతున్న అగ్నిహోత్రుని వంటి కాంతి కలవాడై; తపము= తపస్సు; పాయక= వదలక; చేయుచున్+ఉన్న; ధన్యున్; కాక్షీవతున్; అకిల్బిష, మానసున్= పాపరహితమైన మనస్సు కలవానిని; గౌతమున్= గౌతముని కుమారుడిని; చండకౌశికున్= చండకౌశికు డనే పేరు కలవానిని; కాంచెన్= చూచాడు.

తాత్పర్యం: ఆ అడవి మధ్య నిరంతర నిష్ఠతో, అంతులేని ముక్తికాంక్షతో, మండుతున్న అగ్నిలా మహాతేజస్సుతో, ఒక లేత మామిడి చెట్టుక్రింద ఎడతెగని తపస్సు చేస్తున్న ధన్యుడు, కాక్షీవతుడు, పుణ్యాత్ముడు, గౌతముడు అయిన చండకౌశిక మహర్షిని చూచాడు.

విశేషం: కాక్షీవతః పుత్రం గౌతమస్య మహాత్మనః - అని మూలం. కాక్షీవతః అనేది గౌతమస్య అనే దానికి విశేషణం. (ఈ పద్యరచనలో అర్థనైర్మల్యంతో కూడిన బంధశైథిల్యం నన్నయరచనలో మిక్కుటంగా గోచరించే ప్రసాదగుణాన్ని ప్రత్యక్షం చేస్తున్నది. సంపా.)

క. **ధరణీశ్వరుఁ డమ్మునివరుఁ । బురాతనమునిన్ నిరాశుఁ బుణ్యాత్ము నిరం**
తర కృత నియమ సపర్యా । వరివస్యుం డగుచు భక్తి వదలక కొలిచెన్. **139**

ప్రతిపదార్థం: ధరణీ+ఈశ్వరుఁడు= బృహద్రథ మహారాజు; ఆ+మునివరున్= ఆమునిశ్రేష్ఠుని; పురాతన, మునిన్= ప్రాచీనుడైనమునిని; నిర్+ఆశున్= కోరికలేనివానిని; పుణ్య+ఆత్మున్= పవిత్రమైన మనస్సు కలవానిని; నిరంతర, కృత, నియమ, సపర్యా, వరివస్యుండు+అగుచున్= ఎడతెగకుండ చేయబడిన నియమబద్ధమైన, పరిచర్యలతోను కూడిన సేవ కలవాడై; భక్తిన్, వదలక= విడువక; కొలిచెన్= సేవించాడు.

తాత్పర్యం: పుణ్యాత్ముడు, పురాతనుడు, నిష్కాముడు, మునిశ్రేష్ఠుడు అయిన చండకౌశికుణ్ణి ఎడతెగని నియమనిష్ఠలతో, ఎనలేని భక్తితో బృహద్రథమహారాజు సేవించాడు.

వ. **ఇ ట్లుపాస్యమానుం డయి చండకౌశికుండు బృహద్రథునకు మెచ్చి 'నీ కిష్టంబు చెప్పు మిచ్చెద' ననిన వినయ వినమితోత్తమాంగుం డయి వాఁ డి ట్లనియె.** **140**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; ఉపాస్యుండు+అయి= సేవించబడినవాడై; చండకౌశికుండు; బృహత్+రథునకున్; మెచ్చి; నీకున్+ఇష్టంబు= నీఇష్టమైనది; చెప్పుము+ఇచ్చెదన్; అనినన్; వినయ, వినమిత+ఉత్తమ+అంగుండు+అయి= వినయంచేత వంచిన శిరస్సు కలవాడై; వాఁడు= ఆ బృహద్రథ మహారాజు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: బృహద్రథుడి సేవలకు మెచ్చి చండకౌశికుడు 'నీ కేమి కావాలో కోరుకొ'మ్మనగా అతడు వినయంతో శిరస్సు వంచి ఇలా అన్నాడు.

ఉ. సంతతమైన సర్వ సుఖ సంపద గల్గియు దానికిం దగన్
సంతతి లేమిఁ జేసి యది సర్వము హేయము కాఁ దలంచి ని
శ్చింతుఁడనై ధృతిం దపము సేయఁగవచ్చితిఁ బుత్త్రజన్మమై
నంతన యేను మీ దయఁ గృతార్థతఁ బొందుదు సన్మునీశ్వరా! 141

ప్రతిపదార్థం: సత్+మునీశ్వరా!= ఓమునిశ్రేష్ఠా!; సంతతము+ఐన= ఎడతెగని; సర్వ, సుఖ, సంపద= అన్ని సుఖాల వైభవం; కల్గియున్= పొందియు; దానికిన్, తగన్= అందుకు తగినట్లు; సంతతి, లేమిన్+చేసి= సంతానం లేనందువల్ల; అది, సర్వము= ఆ సంపద అంతా; హేయము+అ, కాన్+తలంచి= విడువదగినదే అని అనుకొని; నిశ్చింతుఁడన్+ఐ= దిగులు లేనివాడినై; ధృతిన్= స్థిరమైన బుద్ధితో; తపము= తపస్సు; చేయఁగన్; వచ్చితిన్; పుత్త్ర, జన్మము+ఐన+అంతన= పుత్రుడు పుట్టటం జరిగినంతనే; ఏను= నేను; మీదయన్= మీదయతో; కృత+అర్థతన్+పొందుదున్= ఈడేరిన కోరిక కలవాడి నౌతాను.

తాత్పర్యం: ఓ మునిశ్రేష్ఠా! నాకు అంతులేని సుఖసంపద లున్నాయి. కాని, అందుకు తగ్గట్లు సంతానం లేదు. అందుచేత ఆ భోగభాగ్యా లన్నింటిని వదలి నిశ్చింతగా, స్థిరబుద్ధితో తపస్సు చెయ్యాలని వచ్చాను. మీ అనుగ్రహంచేత నాకు పుత్రోదయ మైతే నాకోరిక తీరుతుంది.

విశేషం: నన్నయప్రసాదగుణవిశిష్టమైన రచన కీ పద్యం చక్కని ఉదాహరణం.

వ. అనినం గరుణించి మునివరుండు పరమధ్యానముకుళిత నయనుండై యున్నంత. 142

ప్రతిపదార్థం: అనినన్= అని బృహద్రథు డనగా; కరుణించి= దయతలచి; మునివరుండు= మునిశ్రేష్ఠుడైన చండకౌశికుడు; పరమ, ధ్యాన, ముకుళిత, నయనుండు+ఐ= గొప్పధ్యానంచేత ముడుచుకొన్న కన్నులు కలవాడై; ఉన్న+అంతన్.

తాత్పర్యం: అని బృహద్రథమహారాజు అనగానే, దయతో ఆ మునిశ్రేష్ఠుడైన చండకౌశికుడు ధ్యానంలో కళ్ళుమూసుకొని ఉండగా.

క. పవనవిధూతము శుకచం । చు విలూనముఁ గాక యొక్క చూతఫలం బ
య్యవనిజమువలన నమ్ముని । ప్రవరుపృథూత్సంగతలముపై వడిఁ బడియెన్. 143

ప్రతిపదార్థం: పవన, విధూతము= గాలిచే విసిరివేయబడింది; శుక, చంచు, విలూనమున్= చిలుక ముక్కుచేత త్రుంచి వేయబడింది; కాక= కాకుండ; ఒక్క, చూత, ఫలంబు= ఒక మామిడిపండు; ఆ, అవనిజము వలనన్= ఆ చెట్టునుండి; ఆ, ముని, ప్రవరు, పృథు+ఉత్సంగ, తలముపైన్= ఆ మునిశ్రేష్ఠుడియొక్క విశాలమైన తొడమీద; వడిన్= వేగమే; పడియెన్.

తాత్పర్యం: ఒక మామిడిపండు ఆ చెట్టుమీదినుండి చండకౌశికమహర్షియొక్క విశాలమైన తొడమీద పడింది. కాని, అది గాలికి రాలిపడలేదు. చిలుక ముక్కుతో దాన్ని త్రుంచి వెయ్యలేదు. దానంతట అదే పడింది.

వ. దానిం బుచ్చికొని యభిమంత్రించి చండకౌశికుండు బృహద్రథున కిచ్చి 'యీ ఫలంబువలన నీకొక్క పుత్త్రుం డుద్భవిల్లు' నని చెప్పిన నాతండును గృతార్థుండై క్రమ్మఱ నిజపురంబునకు వచ్చి, తన యిద్దఱు భార్యలకు నప్పండు సమంబుగా విభాగించి పెట్టినం దత్ఫలోపభోగంబున నయ్యిద్దఱు గర్భిణులయినఁ బదియగు మాసంబున నొక్కనాఁటి రాత్రియందు వారలకు. 144

ప్రతిపదార్థం: చండకౌశికుండు; దానిన్= ఆ మామిడిపండును; పుచ్చికొని= తీసికొని; అభిమంత్రించి= మంత్రంచేత సంస్కరించి; బృహత్+రథునకున్; ఇచ్చి; ఈ, ఫలంబువలనన్; నీకున్+ఒక్క, పుత్త్రుండు; ఉద్భవిల్లున్= జన్మిస్తాడు; అని; చెప్పినన్= చెప్పగా; అతండును= ఆ బృహద్రథుడు; కృత+అర్థుండు+ఐ= తీరిన కోరిక కలవాడై; క్రమ్మఱ= మరలి; నిజ, పురంబునకున్= తనయొక్క రాజధానీ నగరానికి; వచ్చి; తన; ఇద్దఱు; భార్యలకున్, ఆ+పండు; సమంబుగా= సమానంగా; విభాగించి= పంచి; పెట్టినన్; తత్, ఫల+ఉపభోగంబునన్= ఆ పండును తినటంచేత; ఆ+ఇద్దఱు; గర్భిణులు+అయినన్; పది, అగు, మాసంబునన్= పదవ నెలలో; ఒక్కనాటి; రాత్రి, అందున్; వారలకున్.

తాత్పర్యం: చండకౌశికుడు ఆ పండు తీసుకొన్నాడు. మంత్రించి బృహద్రథమహారాజుకు ఇచ్చాడు. దీనివల్ల నీ కొకకొడుకు జన్మిస్తా డని చెప్పాడు. బృహద్రథునికోరిక తీరింది. ఆయన తనరాజధానికి తిరిగివచ్చాడు. ఆ పండును భార్య లిద్దరికి సమానంగా పంచి ఇచ్చాడు. ఆ పండును తిన్న భార్య లిద్దరు గర్భవతు లయ్యారు. పదినెలల తర్వాత ఒకనాటి రాత్రి ఆ యిద్దరికి.

విశేషం: 'అవ' అనటానికి బదులు నన్నయగారు 'అగు' అని వాడుతుంటారు.

క. ఒక్కొక కన్నును జెవియును । జెక్కును జను బొడ్డు మూఁపుఁ జెలువగు చేయున్
బ్రక్కయుఁ గుఱువును గాలును । నక్కజముగ మనుజ శకలమై యుదయించెన్. 145

ప్రతిపదార్థం: ఒక్కొక; కన్నును; చెవియును; చెక్కును= చెంప; చను, బొడ్డు= చన్ను, బొడ్డుయొక్క భాగము; మూఁపున్= భుజమును; చెలువు+అగు= అందమైన; చేయున్= చెయ్యి; ప్రక్కయున్= ప్రక్క భాగమూ; కుఱువును= తొడా; కాలునున్, అక్కజముగ= ఆశ్చర్యకరంగా, మనుజ, శకలము+ఐ= మానవశరీరపు ముక్క అయి; ఉదయించెన్= పుట్టింది.

తాత్పర్యం: ఒక కన్ను, ఒక చెవి, ఒక చెంప, ఒక చన్ను, సగంబొడ్డు, ఒక భుజం, ఒక చెయ్యి, ఒక ప్రక్క భాగం, ఒక తొడ, ఒక కాలు ఉన్న మానవశరీరపు సగభాగం ముక్కలు ఆశ్చర్యకరంగా ఆ యిద్దరికి జన్మించాయి.

విశేషం: చండకౌశికుడు చెప్పింది ఈ ఫలంవల్ల ఒక పుత్రుడు కలుగుతాడు అని. బృహద్రథుడు ఆ పండును రెండు సమభాగాలుగా కోసి భార్యలకు ఇచ్చాడు. అందువల్లనే ఇలా అయింది. 'ఏకాక్షి బాహుచరణే అర్ధోదరముఖస్ఫిచే' - అని మూలం. చను బొడ్డు - అనే వాటి సంగతి అందులో లేదు.

క. అమ్మానిసి వ్రయ్యలు గని । యమ్ముదితలు వెఱచి 'వీని నాత్మజుఁ డని నె
య్యమ్మున నెట్టులు చూపుదు । మిమ్మనుజేశ్వరున?' కనుచు నెంతయు లజ్జన్. 146

ప్రతిపదార్థం: ఆ+మానిసి, వ్రయ్యలు= ఆ మానవుని ముక్కలు; కని= చూచి; ఆ+ముదితలు= ఆ కాంతలు, - బృహద్రథుని భార్యలు; వెఱచి= భయపడి; వీనిన్= ఈముక్కలుగా పుట్టిన వాడిని; ఆత్మజుఁడు+అని= పుత్రుడని; నెయ్యమునన్=

ప్రేమతో; ఈ+మనుజ+ఈశ్వరునకున్= ఈ మహారాజుకు (భర్త అయిన బృహద్రథుడికి); ఎట్టులు= ఏవిధంగా; చూపుదుము; అనుచున్; ఎంతయున్, లజ్జన్= మిక్కిలి సిగ్గుతో.

తాత్పర్యం: ఆ మానవాకారపు ముక్కల్ని చూచి, బృహద్రథుని భార్యలిద్దరు భయపడ్డారు. ఈ ముక్కలుగా పుట్టినవాణ్ణి ప్రియమార పుత్రుడని మహారాజుకు ఎలా చూపించాలా? అని సిగ్గుపడ్డారు.

వ. 'వీని నెవ్వరును నెఱుంగకుండ వెలుపల వైచిరం' డని తమదాదులం బంచిన, వార లా రెండు వ్రయ్యలుం గొనిపోయి రాజగృహ ద్వారతోరణ సమీపంబునఁ జదుకంబునొద్ద నొక్కచోట వైచిన, నచ్చదుకంబున నుండెడు రాక్షసి జర యనునది దాని బలియకా వగచి పఱతెంచి. **147**

ప్రతిపదార్థం: వీనిన్= ఈముక్కల్ని; ఎవ్వరును; ఎఱుంగకుండన్; వెలుపలన్; వైచి= వేసి; రండు+అని; తమ; దాదులన్= పనికత్తెల్ని; పంచినన్= పంపించగా; వారలు; ఆ, రెండు; వ్రయ్యలున్= ముక్కలును; కొనిపోయి= తీసుకొని పోయి; రాజ, గృహ, ద్వార, తోరణ, సమీపంబునన్= రాజభవనంయొక్క వెలుపలి వాకిలి దగ్గర; చదుకంబు+ఒద్దన్= నాలుగు త్రోవల కూడలి దగ్గర; ఒక్కచోటన్; వైచినన్= వెయ్యగా; ఆ+చదుకంబునన్= ఆ నాలుగుత్రోవలు కలిసేచోట; ఉండెడు; రాక్షసి; జర, అనునది; దానిన్= ఆ ముక్కల జంటను; బలి+అ, కా, వగచి= బలి ఇచ్చిన ప్రాణిశరీరంయొక్క ముక్కలని తలచి; పఱతెంచి= పరుగెత్తుకొని వచ్చి,

తాత్పర్యం: 'ఎవరికి తెలియకుండ ఈ ముక్కల్నిబయట పారేసిరం' డని బృహద్రథుని భార్యలు పనికత్తెల్ని పంపారు. పనికత్తెలు ఆ రెండు ముక్కల్ని తీసుకుపోయి రాజభవనం వెలుపలి వాకిలి సమీపంలో నాలుగు త్రోవలు కలిసేచోట ఒకవైపు వేసి వచ్చారు. అక్కడ ఉండే జర అనే రాక్షసి ఆ ముక్కలను చూచి, బలి యిచ్చిన ప్రాణి శరీరపుముక్కలని అనుకొని పరుగెత్తి వచ్చింది.

జరయను రాక్షసి బాలకునిఁ దెచ్చి బృహద్రథుని కొసంగుట (సం. 2-16-38)

ఆ. ఎత్తికొని చనంగ నిమ్మగు నట్లుగా । మెదలుచున్న వ్రయ్య లదిమి రెంటిఁ
గూడఁబట్టె; నవియుఁగూడి యొండొంటితోఁ । జక్క నంటి రెండు నొక్కఁడయ్యె. **148**

ప్రతిపదార్థం: ఎత్తికొని, చనంగన్= ఎత్తుకొని వెళ్ళటానికి; ఇమ్ము+అగునట్లుగాన్= అనుకూలం అయ్యేటట్లుగా; మెదలుచున్+ ఉన్న= అటు ఇటు కదలుతున్న; వ్రయ్యలు+అదిమి= ముక్కలను ఒత్తి; రెంటిన్; కూడన్, పట్టెన్= రెండింటిని కలిపి పట్టుకొన్నది; అవియున్= ఆ ముక్కలు; కూడి= కలిసి; ఒండు+ఒంటితోన్= ఒకదానితో ఒకటి; చక్కన్+అంటి= సరిగా అతుక్కొని; రెండును+ఒక్కఁడు+అయ్యెన్.

తాత్పర్యం: జర అనే ఆ రాక్షసి తా నెత్తుకొని వెళ్ళటానికి అనుకూలంగా-కదులుతున్న ఆ రెండు ముక్కల్ని కలిపి గట్టిగా పట్టుకున్నది. అవి ఒకదానితో ఒకటి చక్కగా అతుక్కొని రెండూ కలిసి ఒకవ్యక్తిగా రూపొందాయి.

క. ఆ రాక్షసి కెత్తికొనన్ । భారముగా వజ్రకఠిన బంధురతనుఁ డై
ధీరుఁడు బాలకుఁ డేడ్చె మ । హారవమున దాని చేతు లాడకయుండన్. **149**

ప్రతిపదార్థం: ఆ, రాక్షసికిన్; ఎత్తికొనన్; భారముగాన్= బరువుగా; వజ్ర, కఠిన, బంధుర, తనుఁడు+ఐ= వజ్రంలా కఠినంగా ఉన్న శరీరం కలవాడై; ధీరుఁడు; బాలకుఁడు; మహా, రవమునన్= పెద్దశబ్దంతో; దాని= ఆ రాక్షసియొక్క; చేతులు+ఆడక, ఉండన్= చేతులాడకుండగా; ఏడ్చెన్.

తాత్పర్యం: ఆ రాక్షసి ఎత్తుకొనటానికే బరువై, వజ్రంలాంటి కఠినమైన శరీరంతో ఒప్పుతున్న ఆ బాలుడు పెద్దశబ్దంతో ఏడ్చాడు. ఆ ఏడ్పు విన్న జరకు అతణ్ణి ఎత్తుకొని పోవటానికే చేతు లాడలేదు.

విశేషం: 'తతః సా రాక్షసీ రాజన్ విస్మయోత్ఫుల్లలోచనా, న శశాక సముద్వోఢుం వజ్రసారమయం శిశుం' (భండార్కరు ప్రతి. 2-16-41) మూలంలోని 'విస్మయోత్ఫుల్లలోచనా' అనే జర ఆశ్చర్యం అనువాదంలో రాలేదు. ఇచట ఆ రాక్షసి ఆశ్చర్యపడటం సహజమే కదా!

వ. అబ్బాలకు రోదన ధ్వని విని యంతిపురంబున నున్న ముదుసలి యవ్వలెల్లం బఱతెంచి మహాహర్షంబుతో వాని నెత్తికొని; రట్టి సంభ్రమం బెఱింగి బృహద్రథుండు వచ్చి తేజోధికుండయి తామ్రతలముష్టిం దనముఖపద్మంబునం బెట్టికొని దిక్కులు సెలంగ నేడ్చుచున్న కొడుకుం జూచి కృతార్థీకృత లోచనుం డయ్యెఁ; నట్టి యవసరంబున నా రాక్షసి కామరూపిణి గావున మనుష్య స్త్రీరూపధారిణి యయి యమ్మగధరాజున కి ట్లనియె. 150

ప్రతిపదార్థం: ఆ+బాలకు; రోదన, ధ్వని= ఏడుపు శబ్దం; విని; అంతిపురంబునన్+ఉన్న= అంతఃపురంలో ఉండే; ముదుసలి; అవ్వలు+ఎల్లన్= ముసలి స్త్రీలందరు; పఱతెంచి= పరుగెత్తుకొని వచ్చి; మహాహర్షంబుతోన్= మిక్కిలి సంతోషంతో; వానిన్= ఆ బాలుణ్ణి; ఎత్తికొనిరి; అట్టి; సంభ్రమంబు+ఎఱింగి= ఆ వేగిరపాటు చూచి; బృహద్రథుండు; వచ్చి; తేజః+అధికుండు+అయి= కాంతిచే మిక్కిలిగా వెలుగుతున్నవాడై; తామ్రతల ముష్టిన్= రాగివలె ఎర్రగా ఉన్న పిడికిలిని; తన= తనయొక్క; ముఖపద్మంబునన్= పద్మంవంటి ముఖంలో; పెట్టికొని; దిక్కులు, చెలంగన్= దిక్కులు మ్రోగేటట్లు; ఏడ్చుచున్+ఉన్న; కొడుకున్; చూచి; కృత+అర్థీకృత, లోచనుండు+అయ్యెన్= ఈడేరిన కోరిక కలవాడివలె చేయబడిన కన్నులు కలవాడయ్యాడు - అంటే పుత్రుడు కావాలనే కోరిక తీరటంచేత కలిగిన ఆనందం అతని కన్నులలో కన్పించింది; అట్టి, అవసరంబునన్= ఆ సమయంలో; ఆ రాక్షసి; కామరూపిణి; కావునన్= కోరుకొన్నరూపాన్ని ధరించేశక్తి కలది కావటంచేత; మనుష్య, స్త్రీ, రూప, ధారిణి, అయి= మానవకాంత రూపాన్ని ధరించిందై; ఆ+మగధరాజునకున్= ఆ బృహద్రథునికి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆ బాలకుడి ఏడుపుశబ్దం విని అంతఃపురంలో ఉండే వృద్ధస్త్రీలందరు పరుగెత్తుకొని వచ్చారు. మహానందంతో ఆ బాలుణ్ణి ఎత్తుకొన్నారు. వాళ్ళ వేగిరపాటును చూచి బృహద్రథుడు కూడా వచ్చాడు. ఎంతో కాంతితో ప్రకాశిస్తూ, రాగివలె ఎర్రగా ఉండే లేత పిడికిలిని తనపద్మంవంటి ముఖంపై పెట్టుకొని దిక్కులు పిక్కటిల్లేటట్లు ఏడుస్తున్న తన పుత్రుణ్ణి చూచి మహానందభరితు డయ్యాడు. ఆ రాక్షసి కోరుకొన్న రూపాన్ని ధరించే శక్తి ఉంది కనుక అప్పుడు మానవకాంతరూపం ధరించి ఆ మగధరాజైన బృహద్రథునితో ఇలా అన్నది.

తే. ఏను జరయను రాక్షసి, నిప్పురంబు । చదుకమునఁ బాయకుండుదు, సంతతంబు
నీకు నిష్టంబు సేయంగ నెమ్మితోడఁ । గోరుచుండుదు, నది సమకూరె నేఁడు. 151

ప్రతిపదార్థం: ఏను= నేను; జర, అను; రాక్షసిన్; ఈ+పురంబు= ఈనగరంయొక్క; చదుకంబునన్= నాలుగుమార్గాల కూడలిస్థలంలో; పాయక+ఉండుదున్= వదలకుండా ఉంటాను; సంతతంబు= ఎల్లప్పుడు; నీకున్= నీకు; ఇష్టంబు= ప్రియమైనది; చేయంగన్; నెమ్మితోడన్= ప్రేమతో; కోరుచున్+ఉండుదున్; అది= అలాంటి అవకాశం; నేడు; సమకూరెన్= లభించింది.

తాత్పర్యం: నాపేరు జర. నే నొక రాక్షసిని. ఈ నగరంయొక్క నాలుగు మార్గాల కూడలి నా నివాసస్థలం. సర్వదా నీ కిష్టమైనది చేయాలని నా కోరిక. ఆ అవకాశం ఈరోజు లభించింది.

వ. **'నీ యిద్దఱు దేవులకు నుద్భవిల్లిన యిమ్మనుష్య శకలంబులు రెండును నీదాదులు దెచ్చి యిచ్చదుకంబు నొద్ద నొక్కచో వైచి పోయిన నేను వానిం గూడఁబట్టుడు నప్పుడు వజ్రఘన ఘటిత కఠిన శరీరుండై యిక్కుమారుండు మేరుగిరి శృంగంబునుంబోలె నా కెత్తికొన నశక్యుం డయ్యె; వీని నొప్పుగొను' మనిన విని బృహద్రథుండు ముదితహృదయుం డయి దాని కి ట్లనియె.** 152

ప్రతిపదార్థం: నీ; ఇద్దఱు; దేవులకున్= భార్యలకు; ఉద్భవిల్లిన= పుట్టిన; ఈ+మనుష్యశకలంబులు= ఈమానవుడి ముక్కలు (మానవ దేహభాగాలు); రెండును; నీ, దాదులు= నీ పనికత్తెలు; తెచ్చి; ఈ+చదుకంబు+ఒద్దన్= ఈనాలుగు మార్గాల కూడలి దగ్గర; ఒక్కచోన్= ఒక్కచోట; వైచి= పడవేసి; పోయినన్= వెళ్ళగా; ఏను; వానిన్= ఆముక్కలను; కూడన్= కలిసేటట్లు; పట్టుడున్= పట్టుకోగా; అప్పుడు; వజ్ర, ఘన, ఘటిత, కఠిన, శరీరుండు+ఐ= వజ్రంయొక్క కాఠిన్యంతో కూర్చబడిన గట్టి శరీరం కలవాడై; ఈ+కుమారుండు; మేరుగిరి, శృంగంబునున్+పోలె= మేరుపర్వత శిఖరంవలె; నాకు+ఎత్తికొనన్; అశక్యుండు+అయ్యె= సాధ్యం కానివా డయ్యాడు; వీనిన్= ఈ బాలుణ్ణి; ఒప్పు, కొనుము= అంగీకరించు; అనిన; విని; బృహద్రథుండు; ముదిత, హృదయుండు+అయి= సంతోషించిన మనస్సు కలవాడై; దానికి= ఆ రాక్షసికి; ఇట్లు+అనియె.

తాత్పర్యం: 'నీ భార్య లిద్దరికి పుట్టిన ఈమానవదేహపు ముక్కలు రెండింటిని నీపనికత్తెలు తెచ్చి ఈనాలుగుత్రోవల కూడలిలో పారేసి వెళ్ళారు. నేను ఆ ముక్కలను కలిపి పట్టుకోగా వజ్రంలా కఠినమైన దేహంతో, ఈబాలకుడు రూపొందాడు. మేరుపర్వతశిఖరంవలె ఎత్తుకొనటానికి సాధ్యంకానివాడయ్యాడు. ఈ బాలుణ్ణి ప్రేమతో నీవు అంగీకరించు.' అని రాక్షసి అనగానే బృహద్రథుడు సంతోషంతో ఇలా అన్నాడు.

ఉ. **ఇచ్చకు వచ్చు పూజనల నెంతయు సంతసమంది తొల్లి నా**
కిచ్చె మునీశ్వరుండు దయ నిత్తనయున్; మఱి యిప్డు నెమ్మితో
నిచ్చితి వీవు రాక్షసివె! యిక్కులమెల్లను నుద్ధరింపఁగా
వచ్చిన పుణ్యదేవతవు వారిరుహాయతచారులోచనా! 153

ప్రతిపదార్థం: వారిరుహ+ఆయత, చారు, లోచనా!= పద్మాలవంటి విశాలమైన అందమైన కళ్ళు కలదానా!; ఇచ్చకున్, వచ్చు, పూజనలన్= ఇష్టమైన పూజలచేత; ఎంతయున్= మిక్కిలి; సంతసము+అంది= సంతోషాన్ని పొంది; తొల్లి= పూర్వం; ముని+ఈశ్వరుండు= ముని శ్రేష్ఠుడైన చండకౌశికుడు; దయన్= దయతో; ఈ+తనయున్= ఈ కుమారుణ్ణి; నాకున్+ఇచ్చె; మఱి; ఇపుడు; నెమ్మితోన్= ప్రేమతో; ఇచ్చితివి= నీవు నాకు ఇచ్చావు; ఈవు= నీవు; రాక్షసివె!= రాక్షసివా?; ఈ కులము+ఎల్లనున్= ఈ మావంశాన్నంతా; ఉద్ధరింపన్+కాన్= ఉన్నతస్థితికి చేర్చటానికి (తరింపచేయటానికి); వచ్చిన; పుణ్యదేవతవు= పవిత్రదేవతామూర్తివి.

తాత్పర్యం: పద్మాలవంటి విశాలమైన అందమైన కళ్ళు కలదానా! పూర్వం చండకౌశిక మహర్షిని పూజిస్తే ఈ పుత్రుణ్ణి ఇచ్చాడు. ఇప్పుడు ప్రేమతో నీ విచ్చావు. నీవు రాక్షసివా? నావంశాన్ని ఉద్ధరించటానికి వచ్చిన పుణ్యదేవతవు.

విశేషం: అలం: అపహ్నుతి. ఇందులోని శబ్దగుణం మాధుర్యం. (వివరాలకు పీఠిక చూడండి). (సంపా.)

వ. అని దాని నతిప్రీతిం బూజించి కొడుకు నెత్తికొని దేవీద్వయంబునకు నిచ్చి, జర యను రాక్షసిచేత సంధింపఁబడినవాఁడు గావున జరాసంధుం డను పేరిడి. పురం బష్టశోభనంబు సేయించి, యా రాక్షసి కేఁటేఁట మహోత్సవంబు సేయించుచుం గొడుకు నతి గౌరవంబునం బెంచిన. 154

ప్రతిపదార్థం: అని; దానిన్= ఆ జరను; అతిప్రీతిన్= మిక్కిలి ఇష్టంతో; పూజించి; కొడుకున్+ఎత్తికొని; దేవీ, ద్వయంబునకున్= భార్యలిద్దరికి ఇచ్చి; జర, అను; రాక్షసిచేత; సంధింపన్+పడినవాఁడు, కావునన్= ఒకటిగా కూర్చబడినవాడు కావటంచేత; జరాసంధుండు+అను; పేరు+ఇడి= పేరుపెట్టి; పురంబు+అష్ట, శోభనంబు, చేయించి= నగరాన్ని ఎనిమిది విధాల మంగళాలు కలదానినిగా చేయించి; ఆ, రాక్షసికిన్; ఏఁట+ఏఁట; మహా+ఉత్సవంబు= గొప్పపండుగ; చేయించుచున్; కొడుకున్; అతి, గౌరవంబునన్= మిక్కిలి ప్రేమతో (గారాబంతో); పెంచినన్.

తాత్పర్యం: అని బృహద్రథుడు ఆ జరను ఎంతో ప్రీతితో పూజించాడు. ప్రియమార పుత్రుణ్ణి ఎత్తుకొన్నాడు. భార్య లిద్దరిచేతికి ఇచ్చాడు. జరచేత ఒకటిగా కలుపబడినాడు కనుక జరాసంధు డని పేరుపెట్టాడు. నగరాన్ని అష్టశోభనంగా అలంకరించాడు. ఆ రాక్షసికి ప్రతిసంవత్సరం పండుగ జరిపిస్తూ పుత్రుణ్ణి ఎంతో ప్రేమతో పెంచుతుండగా.

విశేషం: 'జరయా సంధితో యస్మాత్ జరాసంధ స్తతోఽభవత్-' (భండార్కరు ప్రతి 2-17-6) అని మూలం. పురం బష్టశోభనంబు, చేయించుట - కొన్ని ప్రతులలో లేదు. మూలంలోకూడా లేదు. "మృగరాజో బుధో నాగః కలశో వ్యజనం తథా, వైజయంతీ తథా భేరీ దీప ఇత్యష్ట మంగలమ్''. మరికొందరి ప్రకారం "లో కేఽస్మిన్మంగలాన్యష్ట బ్రాహ్మణో గౌర్హుతాశనః హిరణ్యం సర్పి రాదిత్య ఆపో రాజా తథాష్టమః''.

క. ఈహిత విధానముల లో । కాహిత దుస్సహనతేజుఁ డయి వాఁడు మహో
త్సాహముతో వర్ధిల్లె ఘృ । తాహుతులఁ బ్రవృద్ధి నొందు నగ్నియపోలెన్. 155

ప్రతిపదార్థం: వాఁడు= ఆ జరాసంధుడు; ఈహిత, విధానములన్= కోరుకున్న పద్ధతుల్లో; లోక+అహిత, దుస్సహన, తేజుఁడు+అయి= ప్రపంచానికి హితంకానిది, సహించటానికి శక్యంకానిది అయిన పరాక్రమాన్ని కలవాడై; మహా+ఉత్సాహంతో= మిక్కిలి సంతోషంతో; ఘృత+ఆహుతులన్= నేతి ఆహుతులచేత; ప్రవృద్ధిన్+ఒందు= అంతకంతకు అధికమయ్యే; అగ్ని+అ. పోలెన్= నిప్పువలె; వర్ధిల్లెన్= పెరిగాడు.

తాత్పర్యం: ఆ జరాసంధుడు తన కిష్టమైనపద్ధతుల్లో లోకానికి హితంకాని, సహించ శక్యంకాని పరాక్రమం కలవా డయ్యాడు. నేతిఆహుతులతో అంతకంతకు అధికమయ్యే అగ్నిహోత్రునిలా అధికోత్సాహంతో అభివృద్ధి చెందాడు.

విశేషం: అలం: ఉపమ.

జరాసంధునియొద్దకుఁ జండకౌశికుండు వచ్చుట (సం. 2-17-8)

వ. ఇట్లు జరాసంధుండు పెరుగుచున్నఁ గొండొక కాలంబునకు నొక్కనాఁడు చండకౌశికుం డందులకు వచ్చిన నతిముదంబుతోఁ బుత్త్ర కళత్ర మిత్రభృత్యామాత్య సహితుండయి బృహద్రథుం డెదురువోయి యమ్మునీంద్రునకు నమస్కరించి తోడ్కొనివచ్చి యుచితాసనంబున నునిచి యడుగులు గడిగి

యర్ఘ్యపాద్యాది విధులం బూజించి తనరాజ్యంబుతోడ సర్వస్వంబును నివేదించి కొడుకుం జూపినం జూచి సంతసిల్లి మునివరుం డిట్లనియె. 156

ప్రతిపదార్థం: ఇట్లు; జరాసంధుండు; పెరుగుచున్+ఉన్నన్; కొండొక, కాలంబునకున్= కొంతకాలం తరువాత; ఒకనాఁడు; చండకౌశికుండు; అందులకున్= అక్కడికి; వచ్చినన్= రాగా; అతి, ముదంబుతోన్= మిక్కిలి సంతోషంతో; పుత్ర, కళత్ర, మిత్ర, భృత్య+అమాత్య, సహితుండు+అయి= పుత్రునితో, భార్యలతో, మిత్రులతో, సేవకులతో, మంత్రులతో కూడుకొన్నవాడై; బృహద్రథుండు; ఎదురు, పోయి; ఆ+మునీంద్రునకున్= ఆ చండకౌశికునికి; నమస్కరించి; తోడ్కొని, వచ్చి= వెంట పిలుచుకొని వచ్చి; ఉచిత+ఆసనంబునన్= తగిన పీఠంమీద; ఉనిచి= కూర్చుండబెట్టి; అడుగులు= పాదాలు; కడిగి; అర్ఘ్య, పాద్య+ఆది, విధులన్= అర్ఘ్యమివ్వటం, పాద్యమివ్వటం మొదలైన పూజా పద్ధతులతో; పూజించి; తన రాజ్యంబుతోడన్; సర్వస్వంబును= సమస్త సంపదలను; నివేదించి= అర్పించి; కొడుకున్= తన కుమారుఁడైన జరాసంధుని; చూపినన్; మునివరుండు= మునిశ్రేష్ఠుడు- చండకౌశికుడు; చూచి; సంతసిల్లి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: జరాసంధుడు ఈ విధంగా వృద్ధి పొందుతుండగా కొంతకాలం తరువాత ఒకరోజు చండకౌశికుడు వచ్చాడు. బృహద్రథుడు మహానందభరితుడై పుత్రునితో, భార్యలతో, మిత్రులతో, సేవకులతో, మంత్రులతో ఎదురేగి నమస్కరించాడు. ఆమహామునిని తోడ్తెచ్చాడు. ఉచితపీఠంపై కూర్చుండబెట్టాడు. కాళ్ళు కడిగి, అర్ఘ్యపాద్యాదు లిచ్చి పూజించాడు. తన రాజ్యంతో కూడ సర్వస్వాన్ని అర్పించి, ఆయన అనుగ్రహంచేత జన్మించిన తన కుమారుడిని చూపించాడు. ఆ మహామునికూడా జరాసంధుణ్ణి చూచి ఎంతో సంతోషించి ఇలా అన్నాడు.

క. జరయను రాక్షసి నీకుం । గర ముపకారంబు సేసె ఘనముగ దీనిన్
ధరణీశ! యే నెఱింగితి । నిరుపమ నిరతిశయ యోగ నిష్ఠిత బుద్ధిన్. 157

ప్రతిపదార్థం: ధరణీ+ఈశ!= ఓ బృహద్రథ మహారాజా!; జర; అను; రాక్షసి; నీకున్; కరము+ఉపకారము= మిక్కిలిమేలు; చేసెన్= చేసింది; ఘనముగన్= గొప్పగా; దీనిన్= ఈసంగతిని; నిరుపమ, నిరతిశయ. యోగ, నిష్ఠిత, బుద్ధిన్= సాటిలేని మేటి యోగంలో నిలుపబడిన బుద్ధిచేత; ఏన్= నేను; ఎఱింగితిన్= తెలుసుకొంటిని.

తాత్పర్యం: ఓ బృహద్రథ మహారాజా! జర అనే రాక్షసి నీకు మిక్కిలి మేలు చేసింది. ఈ సంగతి యోగదృష్టితో తెలుసుకొన్నాను.

వ. 'ఇక్కుమారుండు కుమారునంతియ శక్తి సంపన్నుండయి త్రిపురాంతకు నంతకహరుం బరమేశ్వరుం దనకు సన్నిహితుంజేయు; నెంత బలవంతు లయ్యును వైరివీరులు వీనిం దాఁకి యగ్నిఁ దాఁకిన శలభంబులుంబోలె నడంగుదురు; గరుడనిగతి నన్యవిహంగంబు లనుగమింప నోపనియట్లు మానవులు వీనివీర్యంబు ననుగమింపనోపరు; తేజస్వులలోన నాదిత్యుండు వెలుంగునట్లు వీఁడు మూర్ధాభిషిక్తులలోన మిగిలి వెలుంగు; నదీరయంబులు మహాపర్వతంబుల ఛేదింప నోపనియట్లు దివ్యాస్త్రంబులు వీని దేహంబు భేదింప నోపవు; సముద్రంబు మహానదులం జేకొనునట్లు వీఁడు పరమహీపతుల సంపదలు చేకొను'నని జరాసంధు సామర్థ్యంబు చెప్పి చండకౌశికుం డరిగిన. 158

ప్రతిపదార్థం: ఈ+కుమారుండు; కుమారు+అంతియ= కుమారస్వామి అంతటి; శక్తి, సంపన్నుండు+అయి= శక్తి సంపద కలవాడై; త్రిపుర+అంతకున్= మూడు నగరాలను నాశనం చేసినవాణ్ణి; అంతక, హరున్= మృత్యువును జయించినవాణ్ణి; పరమ+ఈశ్వరున్= సర్వానికి ప్రభువైన శివుణ్ణి; తనకున్; సన్నిహితున్, చేయున్= ప్రత్యక్షం కావించుకొంటాడు; ఎంత, బలవంతులు+అయ్యును= ఎంత బలం కలవాళ్ళయినా; వైరి, వీరులు= శత్రువీరులు, వీనిన్= ఈ జరాసంధుణ్ణి; తాఁకి= ఎదుర్కొని; అగ్నిన్= నిప్పును; తాఁకిన; శలభంబులున్+పోలెన్= మిడుతలవలె; అడంగుదురు= నశిస్తారు; గరుడని= గరుత్మంతునియొక్క; గతిన్= గమనాన్ని; అన్యవిహంగంబులు= ఇతర పక్షులు; అనుగమింపన్+ఓపని అట్లు= వెంబడించి వెళ్ళలేని విధంగా; మానవులు; వీని= ఈ జరాసంధునియొక్క; వీర్యంబున్= పరాక్రమాన్ని; అనుగమింపన్+ఓపరు= పోలజాలరు; తేజస్వులలోనన్= కాంతిమంతుల్లో; ఆదిత్యుండు= సూర్యుడు; వెలుంగునట్లు; వీఁడు= ఈ జరాసంధుడు; మూర్ధ+ అభిషిక్తులలోనన్= పట్టాభిషిక్తులైన రాజులలో; మిగిలి= అధికుడై; వెలుంగున్; నదీ, రయంబులు= ఏటి ప్రవాహవేగాలు; మహా, పర్వతంబులన్= పెద్దకొండలను; ఛేదింపన్+ఓపని, అట్లు= పడగొట్టలేనట్లు; దివ్య+అస్త్రంబులు= దేవతాసంబంధాలైన అస్త్రాలు; వీని, దేహంబున్= ఈ జరాసంధునియొక్క శరీరాన్ని; భేదింపన్+ఓపవు= చీల్చలేవు; సముద్రంబు; మహానదులన్= పెద్ద నదులను; చేకొను+అట్లు= తనలో చేర్చుకొనే విధంగా; వీఁడు= ఈ జరాసంధుడు; పరమహీపతుల, సంపదలు= ఇతర రాజుల సంపదలు; చేకొనున్= గ్రహిస్తాడు; అని; జరాసంధు; సామర్థ్యంబు; చెప్పి; చండకౌశికుండు; అరిగినన్= వెళ్ళగా.

తాత్పర్యం: 'ఈ కుమారుడు కుమారస్వామి అంతటి శక్తి సంపన్ను డౌతాడు. త్రిపురాంతకుడు మృత్యుంజయుడు అయిన పరమేశ్వరుణ్ణి ప్రత్యక్షం చేసుకొంటాడు. ఎంత బలవంతులైనా శత్రువీరులు ఈతణ్ణి ఎదుర్కొంటే నిప్పుమీద పడ్డ మిడుతల్లా మాడిపోతారు. గరుత్మంతుని పరుగును తక్కిన పక్షులు అనుసరించలేనట్లే ఈతని పరాక్రమానికి ఇతరులెవ్వరూ సరితూగలేరు. కాంతిమంతులలో సూర్యుడిలా, మహారాజుల్లో ఇతడు మిక్కిలి ప్రకాశిస్తాడు. నదీ ప్రవాహవేగాలు మహాపర్వతాల నెలా పెకలించి వేయలేవో, దివ్యాస్త్రాలు అలా ఇతని దేహాన్ని చీల్చలేవు. సముద్రం మహానదులను ఎలా తనలో చేర్చుకొంటుందో పరరాజులసంపదల్ని ఇతడు అలా చేజిక్కించుకుంటాడు' - అని చండకౌశికుడు జరాసంధుని సామర్థ్యాన్నిగురించి చెప్పి వెళ్ళాడు.

విశేషం: అలం: ఉపమ. త్రిపురాసురులు తారకాసురుని కుమారులు - విద్యున్మాలుడు, తారకాక్షుడు, కమలాక్షుడు. వాళ్ళ పురాలు మూడింటిని అంతం చేయటంచేత శివునికి త్రిపురాంతకు డనే పేరు వచ్చింది. మృత్యువును జయించిన వాడు కనుక ఆయనకు మృత్యుంజయు డనే పేరుకూడ ఉంది.

క. తనయుని నభినవయౌవను । ననుపము నభిషిక్తుఁ జేసి యవనీభర మా
తనిఁ బూన్చి సభార్యుండయి । యనఘ! తపోవనమునకు బృహద్రథుఁ డరిగెన్. 159

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడవైన ఓ ధర్మరాజా!; బృహద్రథుడు; అభినవయౌవనున్= క్రొత్తగా పొందిన యౌవనం కలవాణ్ణి; అనుపమున్= సాటిలేనివాణ్ణి; తనయునిన్= కుమారుడైన జరాసంధుణ్ణి; అభిషిక్తున్+చేసి= పట్టాభిషిక్తుణ్ణి కావించి- అంటే మగధ రాజ్యానికి రాజుగా చేసి; అవనీభరము= రాజ్యభారం; ఆతనిన్+పూన్చి= అతనిచేత వహింపజేసి; సభార్యుండు+ అయి= భార్యలతో కూడినవాడై; తపః+వనమునకున్= తపస్సు చేసుకోటానికి అనుకూలమైన అడవికి; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: ధర్మరాజా! నూత్నయౌవనుడు, సాటిలేని మేటివీరుడు అయిన తన కుమారుడు జరాసంధుణ్ణి రాజ్యాభిషిక్తుణ్ణి చేసి, రాజ్యభారం అతనికి అప్పగించి, భార్యలతో కలిసి బృహద్రథుడు తపోవనానికి వెళ్ళాడు.

విశేషం: విశేష్యం తరువాత విశేషణాలు వాడే సంస్కృత సంప్రదాయానుసారంగా నన్నయ - 'తనయునిన్, అభినవయౌవనున్, అనుపమున్' అని అనటం జరిగింది.

శ్రీకృష్ణుఁడు భీమార్జునులను దనతోఁ బంపు మని ధర్మజు నడుగుట (సం. 2-17-25)

వ. ఆ జరాసంధుండును నాయుధ నిహతులుగాని హంస డిభకులు దనకు సహాయులుగా నపరాజితంబయిన పరాక్రమంబునం బరచక్రపతుల భంజించుచు. 160

ప్రతిపదార్థం: ఆ, జరాసంధుండును; ఆయుధ, నిహతులు, కాని= ఆయుధాలచేత చావులేని; హంసడిభకులు; తనకున్; సహాయులుకాన్= తోడ్పడేవాళ్ళు కాగా; అపరాజితంబు+అయిన= ఓటమి లేనిదైన; పరాక్రమంబునన్= పరాక్రమంతో; పరచక్రపతులన్= ఇతర రాజ్యాల రాజులను; భంజించుచున్= ఓడిస్తూ.

తాత్పర్యం: ఆ జరాసంధుడుకూడా ఆయుధాలచేత చావులేనివారైన హంసడిభకులను తనకు తోడు చేసుకొని ఓటమిలేని పరాక్రమంతో ఇతరరాజ్యాల రాజులను ఓడిస్తూ.

చ. అయన విహీనుఁడౌ సవితృనట్లు, విఖండిత పక్షతిద్వయుం
డయిన ఖగేంద్రునట్లు, మఱి హంసుఁడు నా డిభకుండు నంతక
క్షయ గతులైన నిప్డు గతగర్వమునన్ మగధేశ్వరుండు ని
శ్చయమతి నున్నవాఁడు నిజసంక్షయకాలవిశంకితాత్ముఁడై. 161

ప్రతిపదార్థం: మగధ+ఈశ్వరుఁడు= మగధరాజైన జరాసంధుడు; మఱి; హంసుఁడున్, ఆ, డిభకుండున్; అంతక, క్షయ, గతులు+ఐనన్= యముని గృహానికి (నరకానికి) వెళ్ళినవారు కాగా - అంటే మరణించగా; ఇప్డు= ఇప్పుడు; అయన, విహీనుఁడు+ఔ= ఉత్తర దక్షిణాయనాలు లేని; సవితృ+అట్లు= సూర్యుడివలె; విఖండిత, పక్షతి, ద్వయుండు+అయిన= పూర్తిగా నరికివేయబడిన రెక్కల జంటగల; ఖగ+ఇంద్రు, అట్లు= పక్షులరాజైన గరుత్మంతుడివలె; గత, గర్వమునన్= కోల్పోయిన గర్వంతో; నిజ, సంక్షయ, కాల, విశంకిత+ఆత్ముఁడు+ఐ= తనయొక్క వినాశకాలాన్ని గురించిన అనుమానంతో కూడుకొన్న మనస్సు కలవాడై; నిశ్చయ, మతిన్= నిశ్చయమైన బుద్ధితో; ఉన్నవాఁడు= ఉన్నాడు.

తాత్పర్యం: మగధరాజైన జరాసంధు డిప్పుడు హంసడిభకులు మరణించటంచేత అయనాలు లేని సూర్యునిలా, రెక్కలు రెండూ తెగిన గరుడునిలా గర్వాన్ని కోల్పోయి, తన వినాశకాలాన్ని గూర్చిన అనుమానంతో మనస్సు రాయి చేసుకొని ఉన్నాడు.

విశేషం: అలం: ఉపమ. అయనాలు లేని సూర్యునితో, రెక్కలు లేని గరుడునితో జరాసంధుని పోల్చటం వలన అతడు ఎక్కడికీ దండయాత్రకు వెళ్ళక, వెళ్ళలేక తన అంత్యకాలాన్ని గురించిన ఆలోచనలో పడి, ఉన్నచోటనే ఉన్నాడని స్ఫురిస్తున్నది. 'అయనయ హీనుడైన పతి యట్లు' - అని పాఠాంతరం. (అర్థవ్యక్తి అనే శబ్దగుణం సార్థకంగా పోషించబడి ప్రసాదగుణానికి బలాన్ని చేకూర్చింది ఈ పద్యరచనలో. - సంపా.)

ఉ. అమ్మగధేశు నుగ్రబలు నాయుధయుద్ధమునన్ జయింపఁగా
నిమ్మహి నోప రెవ్వరు, నుమేశ్వరుఁ డట్టి వరమ్ము వానికిన్

నెమ్మిన యిచ్చెఁ, గావున వినీతుఁడు వాయుసుతుండు మల్లయు
ద్ధమ్మున నోర్చు నాతని నుదగ్రమహాభుజశక్తి యేర్పడన్. 162

ప్రతిపదార్థం: ఆ+మగధ+ఈశున్= ఆమగధరాజైన జరాసంధుణ్ణి; ఉగ్ర, బలున్= భయంకరమైన బలం కలవాణ్ణి; ఆయుధ, యుద్ధమునన్= ఆయుధాలతో చేసే యుద్ధంలో; జయింపఁగాన్= జయించటానికి; ఈ+మహిన్= ఈ భూమిమీద; ఎవ్వరున్= ఎవరు కూడ; ఓపరు= సమర్థులు కారు; ఉమా+ఈశ్వరుఁడు= పార్వతీదేవి భర్త అయిన శివుడు; వానికిన్= ఆ జరాసంధుడికి; అట్టి; వరమ్ము; నెమ్మిన్+అ= ప్రేమతో; ఇచ్చెన్; కావునన్; వినీతుఁడు= వినయవంతుడు; వాయు, సుతుండు= వాయుదేవుడియొక్క కుమారుడు-భీముడు; ఉదగ్ర, మహా, భుజ, శక్తి= మిక్కిలి భయంకరమైన గొప్ప బాహుబలం; ఏర్పడన్= ప్రకటమయ్యేటట్లు; ఆతనిన్= ఆ జరాసంధుణ్ణి; మల్లయుద్ధమ్మునన్; ఓర్చున్= ఓడిస్తాడు.

తాత్పర్యం: భయంకర బాహుబల సంపన్నుడైన ఆ జరాసంధుణ్ణి ఆయుధయుద్ధంలో జయించటానికి భూమిమీద ఎవరితరం కూడా కాదు. పరమేశ్వరుడు ప్రేమతో అతనికి ఆ వరం ఇచ్చాడు. అందుచేత అతిభయంకరమైన మల్లయుద్ధంలో తన బాహుబలం ప్రకటమయ్యేటట్లు వినయపరుడైన మనవాయుసుతుడు భీముడే అతణ్ణి ఓడిస్తాడు.

విశేషం: జరాసంధవధకు భీముణ్ణి పూర్తిగా సుముఖుణ్ణి చెయ్యాలనుకున్న శ్రీకృష్ణుడు మొదట మిక్కిలి చతురంగా జరాసంధుని బలపరాక్రమాల్ని సుదూరం వర్ణించాడు. తరువాత భీముణ్ణి ఉదగ్ర మహాభుజశక్తి యుక్తుడనీ, మహాబలుడైన వాయుదేవుని పుత్రుడనీ వినయపరు డనీ ఎంతో నేర్పుగా ప్రశంసించి జరాసంధుని జయించగల బలసంపద అతనికి ఉందని, తండ్రిపేరు నిలుపగల తనయుడని, నీవంటి పెద్దలు ఆజ్ఞాపించాలేకాని శిరస్సు వంచి చెప్పినపని సాధించే వినయపరుడని పరోక్షంగా సూచించాడు. ఆపినా ఆగకుండ ఆజరాసంధునిమీదికి ఆతడు కాలెత్తి కయ్యానికి వెళ్ళే మానసికస్థితిని మాత్రమే కల్పించాడు. ఇక శ్రీకృష్ణుడు సాధించవలసింది ధర్మజుని అనుమతి. మల్లయుద్ధం భుజబలంతో చేసేది. అందులో ఆయుధాల ఉపయోగం ఉండదు. అందువల్ల ఆయుధంచేత మరణం ఉండదని జరాసంధుడు పొందిన వరం మల్లయుద్ధంలో అతణ్ణి రక్షించలేదు. జరాసంధవధ జరిగితే మల్లయుద్ధంలోనే జరగాలి. అదీ భీమునిచేతిమీదిగానే జరగాలి. అందుకే శ్రీకృష్ణుడు అంతనేర్పుగా భీమునిమనస్సులో జరాసంధవధకు బీజం నాటాడు. పైపద్యం కొన్ని ప్రతులలో లేదు. కొన్నింటిలో 120వ పద్యంగా ఉంది. ఇందులోని శబ్దగుణం అర్థవ్యక్తి.

క. బలిమిమెయిఁ బార్థురక్షా । బలమును బవనసుతు బాహుబలమును నా ని
ర్మలనీతిబలము నీకుం । గలుగ నసాధ్యంబు గలదె కౌరవనాథా! 163

ప్రతిపదార్థం: కౌరవనాథా!= ఓధర్మరాజా!; బలిమిమెయిన్= దేహబలంతో; పార్థు, రక్షా, బలమును= రక్షణ కల్పించగల అర్జునునియొక్క శక్తి; పవన, సుతు, బాహు, బలమును= వాయుపుత్రుడైన భీముడియొక్క భుజశక్తి; నా, నిర్మల, నీతి, బలము= నాయొక్క మలినం కాని నీతి బలము; నీకున్+కలుగన్= నీకుండటంవలన; అసాధ్యంబు= సాధ్యం కానిది; కలదె= కలదా! (లేదు).

తాత్పర్యం: ఓ ధర్మరాజా! పార్థుడి రక్షాబలం, భీముడి భుజబలం, నా నీతిబలం నీకుండగా అసాధ్యమేముంది?

విశేషం: పార్థునిది సాంకేతికమైన ధనుర్విద్యాబలం, శస్త్రాస్త్రప్రయోగబలం. భీమునిది దైహికమైన బాహుబలం. శ్రీకృష్ణునిది నైతికమైన బుద్ధిబలం. ఈ మూడూ కూడితే అసాధ్య మేముంది?

చ. తడయక యేఁగి నీతి బలదర్పము లొప్పఁగ వాని డాసి, క
వ్వడియును నేను భీముఁడు నవశ్యముఁ బోర బృహద్రథాత్మజుం
గడిఁది రిపున్ జయింతుము జగన్నుత! న న్నెద నమ్మదేని యి
ల్లడయిడు భీము నర్జును నలంఘ్యబలాఢ్యుల నావశంబునన్. 164

ప్రతిపదార్థం: జగత్+నుత!= ప్రపంచంచేత కొనియాడబడేవాడా! ఓ ధర్మరాజా!; తడయక= ఆలస్యం చేయక; ఏఁగి= వెళ్ళి; నీతిబలదర్పములు+ఒప్పఁగన్= నీతి, బలం, దర్పం మెరసేటట్లుగా; కవ+వడియును= అర్జునుడూ; నేను; భీముఁడున్; వానిన్= ఆ జరాసంధుడిని; డాసి= సమీపించి (ఎదుర్కొని); పోరన్= యుద్ధంలో; కడిఁది, రిపున్= బలమైన శత్రువును; బృహద్రథ+ ఆత్మజున్= బృహద్రథుడియొక్క కుమారుడైన జరాసంధుని; అవశ్యమున్= తప్పక; జయింతుము; నన్ను+ఎదన్; నమ్మదు+ఏనిన్= నన్ను నీవు మనస్సులో నమ్మినట్లయితే; అలంఘ్య, బల+ఆఢ్యులన్= జయించ సాధ్యం కాని బలంతో కూడుకొన్న వాళ్ళైన; భీమున్; అర్జునన్; నావశంబునన్= నా అధీనంలో; ఇల్లడ, ఇడు= ఇల్లడపెట్టుము - అంటే నీ తమ్ముళ్ళను నీకు మళ్ళీ చెక్కుచెదరకుండ అప్పగించే పద్ధతిలో నాకు అప్పగించు.

తాత్పర్యం: ధర్మరాజా! ఆలస్యం చేయకుండ నేను, భీముడు, అర్జునుడు ముగ్గురం వెళ్ళి, నీతి, బలం, గర్వం ప్రకాశించేవిధంగా బలమైన శత్రువయిన ఆ జరాసంధుణ్ణి ఎదుర్కొని యుద్ధంలో తప్పక జయిస్తాము. నామీద నీకు నమ్మకముంటే అజేయులైన నీ తమ్ముళ్ళు భీమార్జునుల్ని నాకు ఇల్లడపెట్టు.

విశేషం: కవ్వడి - బాణ ప్రయోగంలో రెండు చేతుల వడి కలవాడు - అర్జునుడు. శ్రీకృష్ణుని మాటనేర్పు అనుపమానం. అటు జరాసంధుణ్ణిగురించి, ఇటు భీమార్జునుల శక్తి సామర్థ్యాలనుగురించి చెప్పవలసినవన్నీ ఎంతో చతురంగా చెప్పాడు. చిట్టచివరకు నామీద నమ్మకముంటే, నీ తమ్ముళ్ళను నాకు అప్పగించు అన్నాడు. ఇక ధర్మరాజు తప్పించుకోగలడా?

వ. అని నిశ్చయించి పలికిన నారాయణుని, విజయశ్రీ విభాసిత ముఖులైన భీమార్జునులం జూచి సంతుష్టాంత రంగుండయి ధర్మతనయుం డిట్లనియె. 165

ప్రతిపదార్థం: అని; నిశ్చయించి; పలికిన; నారాయణునిన్= శ్రీకృష్ణుని; విజయశ్రీ, విభాసిత, ముఖులు+ఐన= విజయశోభతో ప్రకాశించే ముఖాలు కలవాళ్ళయిన; భీమ+అర్జునులన్, చూచి; సంతుష్ట+అంతరంగుండు+అయి= సంతోషించిన మనస్సు కలవాడై; ధర్మతనయుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని నిర్ణయించి చెప్పిన శ్రీకృష్ణుని, విజయశోభతో ప్రకాశిస్తున్న భీమార్జునుల ముఖాలను చూచి ధర్మరాజు అంతరంగంలో ఎంతో సంతోషించి ఇలా అన్నాడు.

చ. ప్రియహితసత్యవాక్య! యరిభీషణ! కృష్ణ! భవన్నిదేశ సం
శ్రయమున నున్న మా కధికశత్రుజయం బగు టేమి పెద్ద, ని
శ్చయముగ నింక మోక్షితుల సర్వమహీశులు, నిమ్మహాధ్వర
క్రియయును సిద్ధిఁబొందెన యకిల్బిషకీర్తి వెలుంగుచుండఁగన్. 166

ప్రతిపదార్థం: ప్రియ, హిత, సత్య, వాక్య!= వినటానికి ఇంపైన, మేలు కలిగించే, సత్యమైన మాటలు కలవాడా!; అరి, భీషణ!= శత్రువులకు భయంకరమైనవాడా, కృష్ణ!; భవత్+నిదేశ, సంశ్రయమునన్= నీ ఆజ్ఞ అనే ఆశ్రయంలో; ఉన్న; మాకున్; అధిక, శత్రు జయంబు+అగుట= బలవంతులైన శత్రువులను జయించటం; ఏమి, పెద్ద= ఏమి గొప్ప?; నిశ్చయముగన్= అనుమానం లేకుండ; ఇంకన్=ఇక; సర్వ, మహీ+ఈశులున్= అందరు రాజులు - అంటే జరాసంధుడిచేత బాధించబడుతున్న, బంధించబడిన రాజులంతా, మోక్షితులు+అ= (ఆ బాధలనుండి, బంధాలనుండి) విముక్తి పొందినవాళ్ళే; అకిల్బిష, కీర్తి= నిర్మలమైన కీర్తి; వెలుంగుచున్+ఉండఁగన్; ఈ+మహా+అధ్వర, క్రియయును= ఈ రాజసూయ మహాయజ్ఞ కార్యం కూడ; సిద్ధిన్= సఫలతను; పొందెన్+అ= పొందినట్లే.

తాత్పర్యం: శ్రీకృష్ణా! నీవు ప్రియంగా, హితంగా సత్యం పలికేవాడివి. శత్రుభయంకరుడివి. నీ ఆజ్ఞను ఆశ్రయించి ఉండే మాకు బలవంతులైన శత్రువులను జయించటం ఒక విశేషమా! ఇక జరాసంధుడిచేత బాధితులు, బంధితులు అయిన రాజులందరికి ఆ బాధలనుండి బంధాలనుండి విముక్తి కలిగినట్లే. నీ నిర్మలకీర్తి ప్రకాశించేటట్లు రాజసూయ యజ్ఞంకూడ జరిగినట్లే.

విశేషం: 'పొందెఁ గృతకృత్యత' - అని పాఠాంతరం ఉంది. మాటనేర్పులో ధర్మజుడు శ్రీకృష్ణుడికి తీసిపోయేవాడు కాడు. 'భవన్నిదేశ సంశ్రయమున నున్న మాకు' - అని జరాసంధుడిని జయించి రాజసూయాన్ని సఫలం కావించే భారాన్నంతా శ్రీకృష్ణుని భుజస్కంధాలపై మోపాడు. (గాఢమైన బంధం శిథిలమైనట్లు చిత్రించే ప్రసాదగుణభూయిష్ఠ మైన రచన నన్నయ శైలి. దాని కిది చక్కని ఉదాహరణం. (చూడు: పీఠిక). - సంపా.)

క. ధరణీధర! సర్వగుణా । కర! కరుణానిరత! సర్వకార్యైకధురం
ధర! నినుఁ బడసిన మాకును । హరివిక్రమ! పడయరానియవియుం గలవే! 167

ప్రతిపదార్థం: ధరణీధర!= భూమిని ధరించినవాడా! శ్రీకృష్ణా!; సర్వగుణ+ఆకర!= అన్ని సుగుణాలకు ఉనికిపట్టు అయినవాడా!; కరుణా, నిరత!= దయయందు ఆసక్తి కలవాడా!; సర్వ, కార్య+ఏక, ధురంధుర= అన్ని పనుల (సఫలం చేసే) భారంమొత్తాన్నీ వహించేవాడా!; హరి, విక్రమ!= సింహంవంటి పరాక్రమం కలవాడా!; నినున్+పడసిన= నిన్ను పొందిన; మాకును; పడయరాని, అవియున్= పొందలేనివికూడా; కలవే= ఉన్నాయా! (లేవు).

తాత్పర్యం: ఓకృష్ణా! నీవు భూమిని ధరించినవాడివి. సర్వసుగుణాలకు స్థానమైనవాడివి. దయామయుడివి. సర్వకార్యభారాన్ని నిర్వహించేవాడివి. సింహపరాక్రముడివి. అటువంటి నీవు మావాడివై ఉండగా, మాకు పొందలేనివి ఏవైనా ఉంటాయా!

విశేషం: ఇవన్నీ భగవంతుని గుణాలు. భగవంతుడే మా ప్రక్కన ఉంటే అసాధ్యం ఏమున్నది? అంటున్నాడు ధర్మరాజు.

వ. అని సంతసిల్లి మఱియు నాత్మగతంబున. 168

తాత్పర్యం: అని సంతోషించి, ఇంకా మనస్సులో (ఇలా అనుకొన్నాడు).

క. నయనములు నాకుఁ బవనత । నయ విజయులు, మనము కమలనాభుఁడు; వీరిం
బ్రియహితులఁ బాసి నిమిషం । బయినను నెట్లుండ నేర్తు నవిచేష్టుఁడనై. 169

ప్రతిపదార్థం: పవన తనయ, విజయులు= భీమార్జునులు; నాకున్; నయనములు= కన్నులు; కమలనాభుఁడు= పద్మాన్ని బొడ్డుగా కలవాడు-శ్రీమహావిష్ణువు-శ్రీకృష్ణుడు; మనము= మనస్సు; వీరిన్= ఈముగ్గురిని; ప్రియహితులన్= ఇష్టులై నా మేలుకోరే వాళ్ళను; పాసి= వదలి, అవిచేష్టుఁడను+ఐ= చేష్టలు ఉడిగినవాడినై; నిమిషంబు+అయినను= ఒక్క నిమిషమైనా; ఎట్లు= ఏవిధంగా; ఉండనేర్తున్= ఉండగలను.

తాత్పర్యం: భీమార్జునులు నాకు కళ్ళు. కృష్ణుడు మనస్సు. ప్రియులు, హితులు అయిన ఈ ముగ్గురిని వదలి ఒక్కనిమిషమైనా నిర్వికారంగా ఎలా ఉండగలను?

విశేషం: కళ్ళు, మనస్సు లేకుండా మనిషి ఉండటం ఎంత కష్టమో ఈముగ్గురూ లేకుండా తాను ఉండటం అంత కష్టమని ధర్మజుని భావన.

వ. **'అయినను నా హృదయంబు గరంబు హృద్యంబగుచున్నయది; కృష్ణార్జునులం దలంచినవారికి శ్రీ విజయంబు లగు ననిన నమ్మహాత్ములఁ దనకు సహాయులఁగాఁ బడసిన భీమసేనునకు శ్రీ విజయంబు లగుట యేమి సందేహం?'బని నిశ్చయించి 'మీకుఁ గార్యసిద్ధి యయ్యెడు మరుగుం' డని పంచిన.** **170**

ప్రతిపదార్థం: అయినను; నా, హృదయంబు; కరంబు= మిక్కిలి; హృద్యంబు+అగుచున్+ఉన్న, అది= సంతోషాన్ని పొందుతున్నది; కృష్ణ+అర్జునులన్= కృష్ణుణ్ణి, అర్జునుణ్ణి; తలంచినవారికిన్= కేవలం తలచుకొన్నవారికే; శ్రీవిజయంబులు= కలిమి, గెలుపు; అగున్, అనినన్= కలుగుతుందనగా; ఆ+మహాత్ములన్= ఆ మహాత్ములిద్దరిని; తనకున్; సహాయులన్, కాన్= సహాయపడేవాళ్ళుగా; పడసిన= పొందిన; భీమసేనునకున్; శ్రీ, విజయంబులు= ఐశ్వర్యం, విజయం; అగుట= కలగటం; ఏమి, సందేహంబు= ఏమి అనుమానం? అని; నిశ్చయించి; మీకున్; కార్యసిద్ధి= కార్య సఫలత; అయ్యెడుము= అగునుగాక!; అరుగుండు+అని= వెళ్ళండని; పంచినన్= పంపగా.

తాత్పర్యం: అయినా నా మనస్సు చాలా సంతోషంగా ఉంది. కృష్ణార్జునులను కేవలం స్మరించే వాళ్ళకే కలిమి, గెలుపు కలుగుతా యంటారు కదా! ఆ మహాత్ము లిద్దరినీ సహాయులుగా పొందిన భీమసేనునికి ఐశ్వర్యం, విజయం కలుగుతా యనటంలో అనుమాన మేముంది? 'మీకు కార్యసిద్ధి ఔతుంది, వెళ్ళిరం' డని ధర్మరాజు వారిని సాగనంపించాడు.

క. **ఘోరరిపుఁ జంప నరిగెడు । వీరుల వార్ష్ణేయపాండవేయుల సింహా**
కారులఁ జూచి మనంబున । ధీరుఁడు ముదమందె నయ్యుధిష్ఠిరుఁ డంతన్. **171**

ప్రతిపదార్థం: ఘోర, రిపున్= భయంకరుడైన శత్రువును; చంపన్= చంపటానికి; అరిగెడు= వెళ్ళే; వీరులన్; వార్ష్ణేయ, పాండవేయులన్= వృష్ణి కులంలో పుట్టిన శ్రీకృష్ణుణ్ణి, పాండురాజు కుమారులైన భీమార్జునులను; సింహ+ఆకారులన్= సింహం వంటి ఆకారం కలవాళ్ళను; చూచి; మనంబునన్= మనస్సులో; ధీరుఁడు= ధైర్యవంతుడు అయిన; ఆ, యుధిష్ఠిరుఁడు= ఆ ధర్మరాజు; అంతన్= అప్పుడు; ముదము+అందెన్= సంతోషాన్ని పొందాడు.

తాత్పర్యం: భయంకర శత్రువైన ఆ జరాసంధుణ్ణి చంపటానికి బయలుదేరిన సింహాలవంటి శ్రీకృష్ణ భీమార్జునులను చూచి ధర్మరాజు సంతోషించాడు.

శ్రీకృష్ణభీమార్జునులు జరాసంధునిఁ జంపఁబోవుట (సం. 2-18-26)

వ. కృష్ణభీమపార్థులు కృతక స్నాతకులయి చని, యేక పర్వత ప్రభవంబులైన కాల కూట శోణ గండకీ సదానీరలను నేఱుల లంఘించి, సరయూనదియునుం బూర్వకోసల మిథిలా దేశంబులును గంగయుం గడచి, పూర్వాభిముఖులయి నిత్య ప్రయాణంబుల నమ్మగధదేశంబు సొచ్చి గోరథం బనుపర్వతం బెక్కి. 172

ప్రతిపదార్థం: కృష్ణ, భీమ, పార్థులు; కృతక, స్నాతకులు+అయి= కపటమైన స్నాతకవ్రతాన్ని పూనినవాళ్ళయి; చని= వెళ్ళి; ఏక, పర్వత, ప్రభవంబులు+ఐన= ఒకే పర్వతంనుండి పుట్టినవైన; కాలకూట, శోణ, గండకీ, సదానీరలు; అను; ఏఱులన్= నదులను; లంఘించి= దాటి; సరయూ, నదియును= సరయూనదిని; పూర్వకోసల, మిథిలా, దేశంబులును; గంగయున్; కడచి= దాటి; పూర్వ+అభిముఖులు+అయి= తూర్పువైపునకు తిరిగినవాళ్ళయి; నిత్య, ప్రయాణంబులన్= ఎడతెగని ప్రయాణాలతో; ఆ+మగధ, దేశంబు; చొచ్చి= ప్రవేశించి; గోరథంబు+అను; పర్వతంబు+ఎక్కి.

తాత్పర్యం: శ్రీకృష్ణ భీమార్జునులు కపటస్నాతకవ్రతాన్ని స్వీకరించారు. ఒకే పర్వతంనుండి పుట్టిన కాలకూట, శోణ, గండకీ, సదానీర లనే నదులను దాటారు. సరయూనదిని, పూర్వకోసల మిథిలాదేశాలను, గంగానదిని అతిక్రమించారు. తూర్పువైపు తిరిగి, నిరంతర ప్రయాణాలు చేసి ఆ మగధదేశాన్ని ప్రవేశించారు. గోరథం అనే పర్వతం ఎక్కారు.

విశేషం: స్నాతకుడు-స్నానశీలవ్రతం కలవాడు; విద్యాభ్యాసం పూర్తి అయిన తరువాత మతకార్యార్థం భిక్షుకత్వం వహించి తీర్థస్నానాలు చేసే బ్రహ్మచారి. 'కృతస్నానులై'- అనే పాఠాంతరం పెక్కుప్రతులలో ఉంది. కాని, మూలంలో 'వర్చస్వినాం బ్రాహ్మణానాం స్నాతకానాం పరిచ్ఛదాన్ ఆచ్ఛాద్య' (భండార్కరు ప్రతి 2-18-22) అని ఉంది. అందుచేత వారిని 'కృతకస్నాతకు' లనటమే సమంజసం.

చ. ఉరుతర హర్మ్యమాలికల నొప్పు గిరివ్రజ మన్పురంబుఁ గాం
చిరి నవసౌరభప్రసవచిత్రవనావళి గల్గుదాని నె
వ్వరికి దురాసదంబు లగు వజ్రమయోన్నతవప్రచారు గో
పురముల దాని నయ్యలకఁ బోలెడు దాని మహార్థసంపదన్. 173

ప్రతిపదార్థం: ఉరుతర, హర్మ్య, మాలికలన్= చాల గొప్పవైన మేడల వరుసలచేత; ఒప్పు= ప్రకాశిస్తున్న; నవ, సౌరభ, ప్రసవ, చిత్ర, వన+ఆవళి, కల్గు, దానిన్= క్రొత్త సువాసనలు గల పువ్వులతో కూడుకొన్న చిత్రాలైన తోటల సమూహం కలదానిని; ఎవ్వరికిన్= ఎంతశక్తి ఉన్నవాళ్ళకు కూడ; దురాసదంబులు+అగు= ప్రవేశం సాధ్యంకాని; వజ్రమయ+ఉన్నత, వప్ర, చారు, గోపురముల దానిన్= వజ్రాలతో నిండి, ఎత్తైన ప్రాకారాలు (చుట్టుగోడలు), అందమైన గోపురాలు కలదానిని; మహా+అర్థ సంపదన్= మిక్కుటమైన ఐశ్వర్యంలో; ఆ+అలకన్= ఆకుబేరుడి రాజధాని అయిన అలకాపట్టణాన్ని; పోలెడుదానిన్= పోలినటువంటి దానిని; గిరివ్రజము+అన్+పురంబున్= గిరివ్రజమనే పేరుగల పట్టణాన్ని; కాంచిరి= చూచారు.

తాత్పర్యం: గొప్ప గొప్ప మేడల వరుసలతో క్రొత్త వాసనలు వెదజల్లే పూలతోటలతో, ఎవ్వరికీ ప్రవేశించ సాధ్యం కాని ఎత్తైన వజ్రమయ ప్రాకారాలతో, అందమైన గోపురాలతో అపార ధనసంపదతో అలకాపురిని పోలిన గిరివ్రజమనే పురాన్ని ఆ శ్రీకృష్ణభీమార్జునులు చూచారు.

విశేషం: అలం: ఉదాత్తం, ఉపమ, వృత్త్యనుప్రాసం. (శ్లేష మనే శబ్దగుణం ఆ నగరవైభవాన్ని రచనలో రూపుకట్టించింది. - సంపా.)

వ. కని దాని యపూర్వ రామణీయక సమృద్ధి కచ్చెరువడి యచ్యుతుండు భీమార్జునుల కిట్లనియె. 174

ప్రతిపదార్థం: కని= చూచి; దాని= ఆ గిరివ్రజపురం యొక్క; అపూర్వ, రామణీయక, సమృద్ధికిన్= అపూర్వమైన సౌందర్యాతిశయానికి; అచ్చెరువడి= ఆశ్చర్య పడి; అచ్యుతుండు= శ్రీకృష్ణుడు; భీమ+అర్జునులకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆ గిరివ్రజపురాన్ని చూచి, దాని అపూర్వ సౌందర్యాతిశయానికి ఆశ్చర్యపడి, శ్రీకృష్ణుడు భీమార్జునులతో ఇలా అన్నాడు.

క. గోరథమును ఋషభము వై। హారము ఋషిగిరియుఁ జైత్యకాద్రియు ననఁగా
భూరిగిరు లేను దీనికి। శూరభటులువోలెఁ గాచి చుట్టును నుండున్. 175

ప్రతిపదార్థం: గోరథమును; ఋషభము, వైహారము; ఋషిగిరియున్; చైత్యక+అద్రియున్; అనఁగా= అనే పేర్లుగల; భూరి, గిరులు= పెద్ద కొండలు; ఏను= అయిదు; దీనికిన్= ఈ గిరివ్రజమనే పురానికి; శూరభటులు, పోలెన్= వీరులైన భటులవలె; కాచి= కాపాడుతూ; చుట్టునున్+ఉండున్.

తాత్పర్యం: గోరథం, ఋషభం, వైహారం, ఋషిగిరి, చైత్యకాద్రి అనే పేర్లున్న అయిదు పెద్దపర్వతాలు గిరివ్రజ మనే ఈ పట్టణానికి చుట్టూ ఉండి వీరభటుల్లా రక్షణ కల్పిస్తున్నాయి.

విశేషం: అలం: ఉపమ.

వ. 'దానన చేసి యిప్పురంబు గిరివ్రజంబు నాఁబరఁగె; నిందుఁ దొల్లి గౌతముం డౌశీనరి యను శూద్రయందుఁ గాక్షీవాదుల సృజియించె; నట్టి గౌతమానుగ్రహంబునను నీ దుర్గ బలంబుననుం జేసి యిమ్మాగధుల నెవ్వరును జయింప నోప' రనుచుఁ దద్ద్వారంబునం బురంబు సొరనొల్లక చైత్యకగిరి శృంగంబున కరిగి యందున్న మూఁడు భేరులం జూపి, 'తొల్లింటి మాగధులు మానుషాదంబను ఋషభంబు వధియించి దాని చర్మంబున వీని నిర్మించి; రివి యిప్పురంబు వింతవారు చొచ్చునప్పు డమ్మునిశక్తిం జేసి మ్రోయు' ననిన. 176

ప్రతిపదార్థం: దానన్+అ, చేసి= అందుచేతనే - అంటే కొండలసమూహం దాని చుట్టూ ఉండటంచేత; ఈ+పురంబు; గిరివ్రజంబు, నాన్+పరఁగెన్= గిరివ్రజము అనేపేరుతో ఒప్పింది; ఇందున్= ఈపురంలో; తొల్లి= పూర్వం; గౌతముండు= గౌతముడు అనే పేరున్న మహర్షి; ఔశీనరి, అను= ఔశీనరి అనే పేరున్న (ఉశీనర దేశంలో పుట్టింది); శూద్రఅందున్= శూద్రజాతి స్త్రీయందు; కాక్షీవ+ఆదుల= కాక్షీవుడు మొదలయిన వాళ్ళను; సృజియించెన్= పుట్టించాడు; అట్టి; గౌతమ+ అనుగ్రహంబునను= గౌతమ మహర్షి యొక్క దయచేత; ఈ, దుర్గ, బలంబుననున్+చేసి= ఈ దుర్గంయొక్క బలంచేత; ఈ+మాగధులన్= ఈమగధరాజులను; ఎవ్వరును= ఎవ్వరుగూడ; జయింపన్+ఓపరు= గెలువలేరు; అనుచున్= అని అంటూ; తత్+ద్వారంబునన్= దానియొక్క వాకిటినుండి; పురంబు= గిరివ్రజపురాన్ని; చొరన్= ప్రవేశించటానికి; ఒల్లక= ఇష్టపడక; చైత్యకగిరి, శృంగంబునకు+అరిగి= చైత్యక పర్వతంయొక్క శిఖరంమీదికి వెళ్ళి; అందున్+ఉన్న= ఆశిఖరంమీద ఉండే; మూఁడు భేరులన్= మూడు పెద్ద ఢక్కలను; చూపి; తొల్లింటి, మాగధులు= పూర్వకాలపు మగధరాజులు;

మానుషాదంబు+అను= మానుషాదం అనే పేరున్న (మనుషులను తినేది); ఋషభంబు= ఎద్దును; వధియించి= చంపి; దాని; చర్మంబునన్; వీనిన్= ఈభేరులను; నిర్మించిరి; ఇవి; ఈ+పురంబు= ఈ పట్టణాన్ని; వింతవారు= కొత్తవాళ్ళు; చొచ్చునప్పుడు; ఆ+మునిశక్తిన్, చేసి= ఆ గౌతమ మహర్షియొక్క మహిమచేత; మ్రోయున్= మ్రోగుతాయి; అనిన.

తాత్పర్యం: 'ఆ అయిదు కొండలూ చుట్టి ఉండటంచేత దీనికి గిరివ్రజ మనే పేరు వచ్చింది. పూర్వం గౌతమ మహాముని ఔశీనరి అనే శూద్రజాతిస్త్రీయందు కాక్షీవుడు మొదలయిన వాళ్ళను సృజించాడు. ఆ గౌతమ మహాముని దయచేత, ఈ దుర్గబలంచేత మగధరాజులను ఎవ్వరూ జయించలేరు' అని చెపుతూ శ్రీకృష్ణుడు ఆ నగరద్వారంనుండి గిరివ్రజపురాన్ని ప్రవేశించటానికి ఇష్టపడక, చైత్యకమనే కొండమీదికి వెళ్ళాడు. అక్కడ ఉండే మూడు పెద్ద ఢక్కలను భీమార్జునులకు చూపించాడు. ప్రాచీన మగధరాజులు మానుషాదమనే ఎద్దును చంపి దాని చర్మంతో వీటిని నిర్మించా రని, కొత్త వాళ్ళెవరైనా ఈ పురాన్ని ప్రవేశిస్తుంటే, ఆ గౌతమమహర్షిమహిమచేత ఇవి మ్రోగుతా యని చెప్పాడు.

విశేషం: శ్రీకృష్ణుని దూరదృష్టి, జాగరూకత అమోఘాలు. 'మానుషాద' మనే ఎద్దుకు 'మాషాద' మనే పేరుకూడా ఉన్నది.

ఉ. దారుణ వజ్రచారు భుజదండములన్ బలవద్విచార గం
భీరులు ధీరు లాక్షణమ భేరులు మూఁటిని వ్రచ్చి చైత్యక
స్ఫార నితంబదేశమును భగ్నము సేసి గిరివ్రజంబు న
ద్వారమునందుఁ జొచ్చి రతిదర్పితు లా యదుకౌరవోత్తముల్. 177

ప్రతిపదార్థం: బలవత్+విచార, గంభీరులు= బలవంతుల్లా విచారించటం (అంటే బలమైన ఆలోచన) చేత గంభీరంగా ఉండేవారు; ధీరులు= ధైర్యశాలులు; అతిదర్పితులు= మిక్కిలి గర్వంతో ఉన్నవాళ్ళు; ఆ, యదు, కౌరవ+ఉత్తముల్= ఆ యదువంశ, కురువంశ శ్రేష్ఠులు - శ్రీకృష్ణ భీమార్జునులు; దారుణ, వజ్ర, చారు, భుజ, దండములన్= కఠినమై, వజ్రంవలె అందమైన బాహుదండాలతో; ఆ, క్షణము+అ= అప్పటికప్పుడే; భేరులు; మూఁటిని, వ్రచ్చి= పగులగొట్టి; చైత్యక, స్ఫార నితంబ, దేశమును= చైత్యకపర్వతంయొక్క విశాలమైన నడిమిభాగాన్ని; భగ్నము, చేసి= భేదించి; గిరివ్రజంబున్= ఆ గిరివ్రజ పురాన్ని; అద్వారమునందున్= ద్వారం కాని త్రోవలో; చొచ్చిరి= ప్రవేశించారు.

తాత్పర్యం: బలవంతుల్లా ఆలోచించటంవల్ల గంభీరంగా ఉన్నవాళ్లు, ధైర్యవంతులు, ఎంతో గర్వంతో ఉన్నవాళ్ళు అయిన ఆ యదువంశ కురువంశ శ్రేష్ఠులైన శ్రీకృష్ణభీమార్జునులు, వజ్రంలా కఠినాలు సుందరాలు అయిన భుజదండాలతో తత్క్షణమే ఆభేరులు మూడింటిని పగులగొట్టారు. చైత్యకపర్వతంయొక్క నడిమిభాగాన్ని భేదించి, గిరివ్రజపురాన్ని ద్వారం కాని మార్గంలో ప్రవేశించారు.

విశేషం: గాఢబంధం శిథిలమైనట్లు భాసించే ఈ పద్యరచన ప్రసాదగుణ విశిష్టం. ఇటువంటి రచన నన్నయకు అభిమానపాత్రం. భేరులు పగులగొట్టిన ఈ వీరక్రియను వర్ణించే ఈ పద్యం తద్భావవ్యంజకంగా అక్షరరమ్యమై ఉంది. (సంపా.)

క. ఘోరాకారులు మాలా । కార గృహంబులకు గంధిక గృహంబునకున్
దా రరిగి ముప్పురు బలా । త్కారంబునఁ గొనిరి పుష్పగంధము లొప్పన్. 178

ప్రతిపదార్థం: ఘోర+ఆకారులు= భయంకరమైన ఆకారాలు కలవాళ్ళు - శ్రీకృష్ణ భీమార్జునులు; మాలాకార, గృహంబులకున్= పూలమాలలు కట్టే వాళ్ళ ఇళ్ళకు; గంధిక, గృహంబునకున్= సుగంధ ద్రవ్యాలు అమ్మేవాళ్ళ ఇంటికి; తారు= తాము; అరిగి= వెళ్ళి; ముప్వురు; బలాత్కారంబునన్= బలవంతంగా; పుష్ప, గంధములు= పువ్వులు, గంధం; కొనిరి= తీసికొన్నారు.

తాత్పర్యం: భయంకరాకారులైన శ్రీకృష్ణభీమార్జునులు ముప్వురు పూలమాలలు కట్టేవాళ్ళ ఇళ్ళకు, సుగంధాలు అమ్మేవాళ్ళ ఇంటికి వెళ్ళి బలవంతంగా పూలు, గంధం తీసుకొన్నారు.

విశేషం: అలం: క్రమం.

వ. **అందు మాల్యాలంకృతమౌళులుఁ జందనాగరు రూషితహస్తులు విస్మయమాన మాగధ నిరీక్ష్యమాణులు నయి రాజమార్గంబు గదియం జని, యనవరతంబును బ్రాహ్మణులకు సుప్రవేశంబగుచున్న జరాసంధు మందిరంబు గోవాసంబు హిమవత్సింహంబులు సొచ్చునట్లు యాదవ పాండవ సింహంబులు సొచ్చిన.** **179**

ప్రతిపదార్థం: అందున్; మాల్య+అలంకృత, మౌళులున్= పూలమాలలచేత అలంకరించబడిన సిగలు కలవాళ్ళు; చందన+అగరు+ రూషిత, హస్తులు= గంధం అగరు పూతలచేత కప్పబడిన చేతులు కలవాళ్ళు; విస్మయమాన, మాగధ, నిరీక్ష్యమాణులున్+ అయి= ఆశ్చర్యపడే మగధ పౌరులచే చూడబడేవాళ్ళు అయి; రాజ మార్గంబు; కదియన్+చని= చేరువగా వెళ్ళి; అనవరతంబును= ఎల్లప్పుడు; బ్రాహ్మణులకున్; సుప్రవేశంబు+అగుచున్+ఉన్న= చక్కగా ప్రవేశించటానికి అవకాశ మున్న; జరాసంధు మందిరంబున్= జరాసంధుని యొక్క ఇంటిని; గోవాసంబు= ఆవు నివసించేచోటును; హిమవత్+సింహంబులు= హిమాలయ పర్వతాలలో ఉండే సింహాలు; చొచ్చు+అట్లు= ప్రవేశించేవిధంగా; యాదవ, పాండవ, సింహంబులు= యాదవశ్రేష్ఠుడైన శ్రీకృష్ణుడు, పాండవశ్రేష్ఠులైన భీమార్జునులు; చొచ్చినన్= ప్రవేశించగా.

తాత్పర్యం: యాదవ పాండవ సింహాలైన శ్రీకృష్ణ భీమార్జునులు సిగల్లో పువ్వులు అలంకరించుకొన్నారు. చేతులకు గంధం అగరు పూసుకొన్నారు. మగధపౌరులు ఆశ్చర్యపరవశులై చూస్తుండగా ఆ ముగ్గురూ రాజమార్గానికి చేరువగా వెళ్ళారు. అన్ని వేళలా బ్రాహ్మణులకు చక్కగా ప్రవేశమున్న ఆ జరాసంధుని మందిరంలో గోశాలలో హిమాలయ సింహాలు ప్రవేశించినట్లు ప్రవేశించారు.

విశేషం: అలం. ఉపమ. ముమ్ముందు జరుగనున్న జరాసంధవధను పద్యంలోని అలంకారం ప్రస్ఫుటంగా ధ్వనింపజేస్తుంది. గోవాసంలోకి సింహాలు ప్రవేశిస్తే ఇక ఆ గోవు బ్రతుకగలదా! గో వంటే ఎద్దు అనే అర్థంకూడ ఉంది.

జరాసంధుఁడు శ్రీకృష్ణ భీమార్జునుల కెదురు వచ్చుట (సం. 2-19-29)

ఆ. **అర్ధరాత్ర మయిన నభ్యాగత ద్విజ। స్నాతకులకు నెదురుచని కరంబు**
భక్తిఁ బూజలిచ్చు పరమవ్రతుం డప్పు। డెదురు వచ్చి వారి కిష్టమెసఁగ. **180**

ప్రతిపదార్థం: అర్ధ రాత్రము+అయినన్= నడిరేయి అయినా; అభ్యాగత, ద్విజ, స్నాతకులకున్= అప్పటి కప్పుడు వచ్చే బ్రాహ్మణ స్నాతకవ్రతులకు; ఎదురు, చని= (ఆహ్వానించటానికి) లేచి ఎదురుగా వెళ్ళి; కరంబు= మిక్కిలి; భక్తిన్= భక్తితో;

పూజలు+ఇచ్చు= పూజలు చేసే; పరమవ్రతుండు= శ్రేష్ఠమైన వ్రతం పూనిన ఆ జరాసంధుడు; అప్పుడు= ఆ సమయంలో; ఎదురు, వచ్చి= శ్రీకృష్ణభీమార్జునులకు ఎదురుగా వెళ్ళి; వారికిన్; ఇష్టము+ఎసఁగన్= ప్రీతి కలిగేలా.

తాత్పర్యం: అర్ధరాత్రి అయినా అభ్యాగత బ్రాహ్మణ స్నాతకవ్రతులను ఆహ్వానించి, అమితభక్తితో అర్చనలు చేసే ఆ జరాసంధుడు స్నాతకవ్రతుల్లా అప్పుడు వచ్చిన ఆ శ్రీకృష్ణ భీమార్జునులకు ఎదురు వెళ్ళాడు. వాళ్ళకు ప్రీతిగా.

విశేషం: వ్రతభేదాన్నిబట్టి వ్రతులు తొమ్మిది విధాలు - ఋషి, స్నాతకుడు, యతి, స్థాండిలుడు; ద్వయాతిగుడు, మూలికుడు, లోచకుడు, ఔర్వుడు, ఖపుటుడు. వీరిలో స్నానశీలవ్రతుడు స్నాతకుడు. (స్నాతకులుకూడ తొమ్మిదివిధాలుగా ఉంటారు. వారు: 1. సంతానంకొరకు పెండ్లిచేసికొనదలచి ధనాన్ని యాచించేవాడు, 2. తన ధనాన్ని యాగాదులందు బ్రాహ్మణుల కిచ్చి దరిద్రుడై ధనాన్ని కోరేవాడు, 3. యజ్ఞార్థం ధనాన్ని యాచించేవాడు, 4. గురుదక్షిణకోసం ధనాన్ని కోరేవాడు, 5. బాటసారుల పోషణకై ధనాన్ని యాచించేవాడు, 6. రోగులపోషణకై ధనాన్ని యాచించేవాడు, 7. ఆలుబిడ్డల పోషణకై ధనాన్ని యాచించేవాడు, 8. బీదలకు అన్నదానం నిమిత్తం యాచించేవాడు, 9. వేదపఠనానికై కావలసిన సౌకర్యాలను కోరేవాడు.-సంపా.)

క. ధీయుతుఁ డయి మధుపర్కము । సేయఁగ సమకట్టి దానిఁ జేకొనని మహో
పాయుల గర్వంబు నభి । ప్రాయంబు నెఱింగి మగధపతి యి ట్లనియెన్. 181

ప్రతిపదార్థం: మగధపతి= మగధరాజైన జరాసంధుడు; ధీయుతుఁడు+అయి= బుద్ధిబలం కలవాడయి; మధుపర్కము= పెరుగు, తేనె కలిపిన తీయని పదార్థం; చేయఁగన్= (వారికి) ఇవ్వగా; సమకట్టి= పూనుకొని; దానిన్= ఆ మధుపర్కాన్ని; చేకొనని= తీసికొనని; మహా+ఉపాయుల= మిక్కిలి ఉపాయంగల వాళ్ళయొక్క - అంటే శ్రీకృష్ణభీమార్జునులయొక్క; గర్వంబున్= గర్వాన్ని; అభిప్రాయంబున్= ఉద్దేశాన్ని; ఎఱింగి= తెలిసికొని; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: తా నిచ్చే మధుపర్కాన్ని తీసికోవటానికి ఇష్టపడని ఆ శ్రీకృష్ణభీమార్జునుల గర్వాన్ని, ఉద్దేశాన్ని బుద్ధిబలం గల ఆ మగధరాజు జరాసంధుడు గ్రహించాడు. వాళ్ళతో ఇలా అన్నాడు.

విశేషం: జరాసంధుని మందిరంలో ప్రవేశించటానికి తప్పనిసరై ఆ శ్రీకృష్ణ భీమార్జునులు బ్రాహ్మణస్నాతక వేషధారులయ్యారేకాని, నిజానికి వాళ్ళు క్షత్రియులు, శత్రువులు కదా! అందుచేత జరాసంధు డిచ్చే మధుపర్కాన్ని స్వీకరిస్తారా?

తే. స్నాతకులరేని పూవులుఁ జందనంబుఁ । జనునె బలిమిమైఁగొని తాల్పఁ? జైత్యకాద్రి
తటము మీ రిట్లు వ్రచ్చి దోర్దర్ప మెసఁగఁ । జులుక నద్వారమునఁ బ్రోలు సొరఁగనగునె? 182

ప్రతిపదార్థం: స్నాతకులరు+ఏని= (మీరు) స్నాతకవ్రతం పూనినే వాళ్ళే అయితే; పూవులున్; చందనంబున్= గంధాన్ని; బలిమిమైన్= బలవంతంగా; కొని= గ్రహించి; తాల్పన్= ధరించటానికి; చనునె= తగునా?; చైత్యక+అద్రి, తటమున్= చైత్యక పర్వత ప్రదేశాన్ని; మీరు; ఇట్లు= ఈవిధంగా; వ్రచ్చి= భేదించి; దోః+దర్పము= భుజగర్వం; ఎసఁగన్= మెరసేటట్లు; చులుకన్= సులువుగా; అద్వారమునన్= ద్వారం కాని మార్గంలో; ప్రోలున్= గిరివ్రజపురాన్ని; చొరఁగన్= ప్రవేశించటం; అగునె= తగునా!

తాత్పర్యం: మీరు నిజంగా స్నాతకవ్రతులే అయితే మాలాకార గంధిక గృహాలనుండి పూలను, గంధాన్ని బలవంతంగా గ్రహించి ధరించటం తగునా? అంతే కాదు, మీరు ఈ విధంగా చైత్యకప్రదేశాన్ని భేదించి భుజగర్వంతో ద్వారం కాని మార్గంనుండి గిరివ్రజపురాన్ని ప్రవేశించటం తగునా?

వ. 'మఱియు నా కావించిన మధుపర్కంబు ప్రతిగ్రహింపనొల్లమి యిది యేమి? మీరలు వేషధారుల కావలయు; మీ వేషంబున బ్రాహ్మణత్వంబును మహాసత్త్వ దీర్ఘబాహు పృథులవక్షోలక్షణంబుల క్షత్రియత్వంబును బ్రకాశించుచున్న యవి' యనిన వానికి నారాయణుం డి ట్లనియె. 183

ప్రతిపదార్థం: మఱియున్; నా కావించిన= నేను ఇచ్చిన; మధుపర్కంబు; ప్రతిగ్రహింపన్= అందుకోటానికి; ఒల్లమి= ఇష్టపడకపోవటం; ఇది; ఏమి; మీరలు= మీరు; వేషధారులు+అ= స్నాతకులవలె వేషం వేసుకొన్నవాళ్ళే; కావలయున్= అయి ఉంటారు; మీ, వేషంబునన్; బ్రాహ్మణత్వంబును; మహా, సత్త్వ, దీర్ఘ, బాహు, పృథుల, వక్షః, లక్షణంబులన్= మిక్కిలి బలంగలవై, పొడవైన బాహువులయొక్క విశాలమైన వక్షస్థలంయొక్క లక్షణాలచేత; క్షత్రియత్వంబును; ప్రకాశించుచున్+ఉన్నయవి; అనిన; వానికిన్; నారాయణుండు= శ్రీకృష్ణుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'అంతే కాదు, నే నిచ్చిన మధుపర్కాన్ని మీ రెందుకు స్వీకరించటం లేదు? మీరు కేవల స్నాతకవేషధారుల్లా ఉన్నారు. మీ వేషంలో బ్రాహ్మణత్వం అగుపిస్తూఉంది. బలమైన మీ బాహువుల్లో, విశాలమైన వక్షస్థలాల్లో క్షత్రియత్వం ప్రకాశిస్తూ ఉంది' - అని పలికిన జరాసంధునితో శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు.

విశేషం: నా కావించిన - ఇచట కర్తృపద ప్రథమకు షష్ఠి వచ్చింది. ఈ ప్రయోగాలు నన్నయ భారతంలో మెండు.

క. స్నాతకులు పుణ్యకర్మస । నాతను లగుచున్న బ్రాహ్మణ క్షత్రియ వి
డ్జాతులయందును క్షత్రియ । జాతి స్నాతకుల మేము జనవినుత! మతిన్. 184

ప్రతిపదార్థం: జనవినుత!= జనులచేత కొనియాడబడే ఓ జరాసంధా!; స్నాతకులు; పుణ్యకర్మ, సనాతనులు= పుణ్యకర్మలచేత ప్రాచీనులు; అగుచున్+ఉన్న; బ్రాహ్మణ, క్షత్రియ, విట్+జాతుల, అందును= బ్రాహ్మణక్షత్రియ వైశ్యజాతులలో; మతిన్= బుద్ధిచేత; ఏము= మేము; క్షత్రియజాతి స్నాతకులము.

తాత్పర్యం: పుణ్యకర్మలు చేయటంచేత పురాతనులు అయిన బ్రాహ్మణక్షత్రియ వైశ్యజాతి స్నాతకుల్లో మేము క్షత్రియజాతిస్నాతకులము.

విశేషం: 'జనవినుతమతిన్' - జనులచేత కొనియాడబడే అభిప్రాయంచేత - అని ఇచ్చట అర్థం చెప్పి అన్వయించవచ్చు. కాని పెక్కుప్రతుల్లో 'జనవినుతనిధీ, జనవినుతమతీ, సౌజన్యనిధీ' అనే పాఠాంతరాలు ఉండటంచేత జనవినుత' అనేదాన్ని జరాసంధునికి సంబోధనగా భావించటమే ఉచిత మనిపిస్తుంది.

వ. ద్వారంబున మిత్త్రనివాసంబును నద్వారంబున నమిత్త్రనివాసంబును జొచ్చుట యిది బాహువీర్య సంపన్నులయిన క్షత్రియులకుం గర్తవ్యంబు; మఱి గంధమాల్యంబులయందు లక్ష్మి యుండుం గావున బలాత్కారంబున గంధ మాల్యంబులు గొంటిమి; నీయందుల మాకు నొండు కార్యంబు గలుగుటం జేసి నీయిచ్చు నర్ఘ్యంబు గొన నొల్ల' మనిన జరాసంధుం డి ట్లనియె. 185

ప్రతిపదార్థం: ద్వారంబునన్; మిత్త్ర నివాసంబును= మిత్రునియొక్క ఇంటిని; అద్వారంబునన్= ద్వారం కాని మార్గంలో - అంటే ప్రవేశించకూడని మార్గంలో; అమిత్త్ర, నివాసంబును= శత్రువుయొక్క ఇంటిని; చొచ్చుట= ప్రవేశించటం; ఇది; బాహు,

వీర్య, సంపన్నులు+అయిన= భుజబలసంపద కలవాళ్ళయిన; క్షత్త్రియులకున్; కర్తవ్యంబు= చేయదగినపని; మఱి; గంధ, మాల్యంబుల, అందున్= గంధంలో, పువ్వుల్లో; లక్ష్మి; ఉండున్; కావున; బలాత్కారంబునన్= బలవంతంగా; గంధ, మాల్యంబులు= గంధం, పూలమాలలు; కొంటిమి= తీసుకున్నాము; నీ, అందుల= నీపట్ల; మాకున్; ఒండు, కార్యంబు= మరొక విధమైనపని; కలుగుటన్, చేసి= ఉండటంచేత; నీ, ఇచ్చు+అర్ఘ్యంబు= నీవు ఇచ్చే అర్ఘ్యాన్ని; కొనన్= తీసికోటానికి; ఒల్లము= ఇష్టపడం; అనినన్; జరాసంధుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'ద్వారంనుండి మిత్రునిగృహాన్ని, ద్వారం తప్పించి శత్రుగృహాన్ని ప్రవేశించటం భుజబలసంపన్నులైన క్షత్రియులకు ఉచితమైన పనే. గంధంలో పువ్వుల్లో లక్ష్మి ఉండటంచేత మేము వాటిని బలాత్కారంగా గ్రహించాం. నీతో మాకు వేరే పని ఉంది. అందువల్ల నీ విచ్చే అర్ఘ్యాన్ని అంగీకరించం' అని శ్రీకృష్ణు డనగానే జరాసంధుడు ఇలా అన్నాడు.

విశేషం: గంధం, పువ్వులు లక్ష్మీస్థానాలు కనుక - దానం తీసుకోవటం క్షత్రియులకు ఉచితం కాదు కనుక, శ్రీకృష్ణ భీమార్జునులు బలవంతంగా వాటిని గ్రహించారు. అర్ఘ్యం స్వీకరిస్తే ఆర్షసంప్రదాయానుసారం అది ఇచ్చినవారిని ఆశీర్వదించాలి; వాళ్ళ హితాన్ని కోరాలి. శ్రీకృష్ణభీమార్జునులు జరాసంధుడిని చంపటానికి వచ్చారు. అందుచేతనే ఆత డిచ్చే అర్ఘ్యాన్ని గ్రహించలేదు. నన్నయకాలంలో 'అందుల' సప్తమీవిభక్తిప్రత్యయంగా ఉన్నట్లుంది.

ఆ. మీరు నాకు నేను మీకు నెన్నండు ము । న్నహిత మాచరించినదియు లేదు;
మీకు నేల నే నమిత్త్రుండ నైతి? ని । రాగసుండ సద్గుణాన్వితుండ. 186

ప్రతిపదార్థం: మీరు; నాకు; నేను; మీకున్; ఎన్నండున్= ఎప్పుడుకూడ; మున్ను= ఇదివరకు; అహితము= అపకారం; ఆచరించినదియు, లేదు= చేయలేదు; నిరాగసుండన్= తప్పు(పాపం) లేనివాణ్ణి; సద్గుణ+అన్వితుండన్= మంచి గుణాలతో కూడుకొన్న వాణ్ణి; మీకున్; ఏల= ఎందుచేత; అమిత్త్రుండను= శత్రువును; ఐతిన్= అయ్యాను.

తాత్పర్యం: ఇదివరకెప్పుడూ మీరు నాకుగాని, నేను మీకుగాని అపకారం చేయలేదు. పైగా నేను ఏ తప్పూ చెయ్యనివాణ్ణి. మంచిగుణాలు కలవాణ్ణి. ఎందుచేత మీకు నేను శత్రువు నయ్యాను?

విశేషం: మాటలలోని వికటత్వం ఉదారతాగుణ లక్షణం (చూడు వివరాలకు పీఠిక). (సంపా.)

క. 'సురమునివరులకు వసుధా । మరులకు భక్తుండ నుత్తమక్షత్త్రకులా
చరితుండ' ననిన ధరణీ । ధరుఁ డమ్మగధేశ్వరునకుఁ దా ని ట్లనియెన్. 187

ప్రతిపదార్థం: సుర, ముని, వరులకున్= దేవతలకు, మునిశ్రేష్ఠులకు; వసుధా+అమరులకున్= భూసురులకు - అంటే బ్రాహ్మణులకు; భక్తుండన్= భక్తుణ్ణి; ఉత్తమ, క్షత్త్ర, కుల+ఆచరితుండన్= ఉత్తమమైన క్షత్రియ కుల ధర్మాలను ఆచరించేవాణ్ణి; అనినన్= అని అనగా; ధరణీధరుఁడు= శ్రీకృష్ణుడు; ఆ+మగధ+ఈశ్వరునకున్= ఆ మగధ రాజైన జరాసంధునికి; తాన్= తాను; ఇట్లు+అనియెన్= ఈవిధంగా అన్నాడు.

తాత్పర్యం: 'దేవతలకు, మునిశ్రేష్ఠులకు, బ్రాహ్మణులకు నేను భక్తుణ్ణి. ఉత్తమ క్షత్రియ ధర్మాల్ని ఆచరించేవాణ్ణి' - అని జరాసంధు డనగానే శ్రీకృష్ణుడు అతనితో ఇలా అన్నాడు.

క. కులరక్షార్థ మఖిల నృప । కులోద్వహునియోగమున నకుంఠితశత్రు
ప్రళయవిధాయుల మయి యిం । దులకున్ వచ్చితిమి దుష్టదూషణబుద్ధిన్. 188

ప్రతిపదార్థం: కులరక్షా+అర్థము= క్షత్రియ కులాన్ని రక్షించటంకొరకు; అఖిల, నృప, కుల+ఉద్వహు, నియోగమునన్= అన్ని క్షత్రియ వంశాలను ఉద్ధరించేవాడైన ధర్మరాజు ఆజ్ఞచేత; అకుంఠిత, శత్రు, ప్రళయ, విధాయులము+అయి= అపజయ మెరుగని శత్రునాశం కలిగించే వాళ్ళమై; దుష్ట, దూషణ. బుద్ధిన్= దుర్మార్గులను నిందించే ఉద్దేశంతో; ఇందులకున్= ఇక్కడికి; వచ్చితిమి.

తాత్పర్యం: క్షత్రియ వంశాలనన్నింటిని ఉద్ధరించేవా డైన ధర్మరాజు ఆజ్ఞతో క్షత్రియకులాన్ని రక్షించటానికి, అపజయ మెరుగని శత్రువుల్ని అంతం చేయటానికి, దుర్మార్గుల్ని దూషించటానికి ఇక్కడికి వచ్చాము.

సీ. కడఁగి యత్యుత్తమ క్షత్రియ చరితంబు । నందు వర్తిల్లుదు నంటి, జనుల
కెవ్వరి కెన్నండు నెగ్గొనరింప నే । నంటి, సత్క్షత్రియు లవని నొరులు
నీయట్లు క్రూరులై నృపతులఁ జెఱఁబెట్టి । పశువరించుచుఁ బశుపతి నుమేశు
వరదుఁ బూజించిన వారును గలరె? ము । న్నింతకు నగ్గలం బెద్ది యెగ్గు?

ఆ. కారణంబు లేక దారుణుఁ డయి సాధు । హింస సేయు కుజనుఁ డెల్లవారి
కప్రియుండ కాక యప్రియలక్షణం । బొండు గలదె తలఁప నుత్తములకు? 189

ప్రతిపదార్థం: కడఁగి= ప్రయత్నించి; అతి+ఉత్తమ, క్షత్రియ, చరితంబు+అందున్= మిక్కిలి శ్రేష్ఠమైన క్షత్రియ జీవనంలో; వర్తిల్లుదును+అంటి(వి)= నడుచుకొంటానని అన్నావు; జనులకున్+ఎవ్వరికిన్= ఏమానవులకు కూడ; ఎన్నండున్= ఎప్పుడుకూడ; ఎగ్గు= కీడు; ఏను= నేను; ఒనరింపన్= చేయను; అంటి(వి)= అన్నావు; అవనిన్= భూమిలో; సత్+క్షత్రియులు= ఉత్తములైన రాజులు; ఒరులు= ఇతరులు; నీ, అట్లు= నీవలె; క్రూరులు+ఐ= దుర్మార్గులై; నృపతులన్= రాజులను; చెఱన్+పెట్టి= చెరసాలలో బంధించి; పశువరించుచున్= బలియిస్తూ; పశుపతిన్= శివుని; ఉమా+ఈశున్= పార్వతీపతిని; వరదున్= వరాలిచ్చేవాణ్ణి (శంకరుని); పూజించినవారును; మున్ను= ఇదివరకు; కలరె= ఉన్నారా?; ఇంతకున్= ఇంతకంటె; అగ్గలంబు= ఎక్కువైన; ఎగ్గు= కీడు; ఎద్ది= ఏది; కారణంబు, లేక; దారుణుఁడు+అయి= దుర్మార్గుడై; సాధు, హింస, చేయు= మంచివాళ్ళను బాధించే; కుజనుఁడు= దుష్టుడు; ఎల్లవారికిన్= అందరికీ; అప్రియుండు+అ, కాక= శత్రువే కాక; ఉత్తములకున్= సజ్జనులైన వాళ్ళకు; తలఁపన్= ఆలోచిస్తే; అప్రియ, లక్షణంబు= శత్రులక్షణం; ఒండు, కలదె= ఇంకొకటి ఉన్నదా?

తాత్పర్యం: ఓ జరాసంధా! నీవు అత్యుత్తమ క్షత్రియ జీవితం గడుపుతున్నట్లు చెప్పావు. ఎవ్వరికీ ఎప్పుడూ ఏ కీడూ చేయలే దన్నావు. భూమిమీద ఉత్తమ క్షత్రియులు నీవలె క్రూరులై రాజులను చెరబట్టి బలియిస్తూ ఇంతకుముం దెన్నడైనా శివుణ్ణి పూజించారా? ఇంతకు మించిన కీడు ఇంకేమైనా ఉందా? అకారణంగా సాధుజనులను హింసించే దుష్టుడు అందరికీ శత్రువే కదా! ఆలోచిస్తే ఉత్తములకు ఇంతకంటె వైరకారణం ఇంకొకటి ఏముంది!

విశేషం: పశుపతి - ప్రమథగణాలకు, పశువులకు అనగా జీవులకు - వారిని సంసారబంధము నుండి రక్షించువాడు ప్రభువు - శివుడు.

వ. నిర్దయుండై సవర్ణుండు నిర్దోషు లైన సవర్ణుల వధియించునంతకంటె మిక్కిలి పాతకం బొం డెద్ది? నీయట్టి పాపకర్ముల నుపేక్షించిన నఖిల ధర్మ రక్షణ క్షములమైన మమ్ముఁ దత్పాపంబు వొందు నని పాపభయంబున నిన్ను నిగ్రహింప వచ్చితిమి; నాకంటె నధికుండైన క్షత్త్రియుండు లేఁడని గర్వించి యొరుల నవమానించి పలుక వలదు. 190

ప్రతిపదార్థం: నిర్దయుండు+ఐ= దయలేనివాడై; స, వర్ణుండు= తమకులంవాడు; నిర్దోషులు+ఐన= తప్పు చేయని వాళ్ళయిన; స, వర్ణులన్= తనకులం వారిని; వధియించు+అంతకంటెన్= చంపటంకంటె; మిక్కిలి= ఎక్కువైన; పాతకంబు= పాపం; ఒండు+ఎద్ది= ఇంకొకటి ఏముంది?; నీ, అట్టి= నీవంటి; పాప, కర్ములన్= పాపపు పనులు చేసేవాళ్ళను; ఉపేక్షించినన్= వదలివేస్తే; అఖిల, ధర్మ, రక్షణ క్షములము+ఐన= అన్ని ధర్మాలను రక్షించటానికి సమర్థులమైన; మమ్మున్; తత్+పాపంబు= ఆపాపం; పొందున్; అని; పాపభయంబునన్= పాపంవల్ల కలిగే భయంచేత; నిన్నున్; నిగ్రహింపన్= దండించటానికి; వచ్చితిమి; నాకంటెన్; అధికుండు+ఐన= గొప్పవాడైన; క్షత్త్రియుండు; లేడు+అని; గర్వించి; ఒరులన్= ఇతరులను; అవమానించి; పలుక; వలదు.

తాత్పర్యం: కఠినాత్ముడై ఒక కులంవాడు, ఏతప్పూ చేయని తనకులంవాళ్ళను చంపటం కంటె ఎక్కువైన పాపం ఇంకేముంది? నీవంటి పాపపు పనులు చేసేవాళ్ళ సంగతి పట్టించుకోకుండ వదలివేస్తే, సర్వధర్మాలను రక్షించటానికి సమర్థులమైన మాకు, ఆ పాపం సంక్రమిస్తుంది. ఆ పాపభయంచేతనే నిన్ను దండించటానికి వచ్చాము. నన్ను మించిన క్షత్రియుడు లేడన్న గర్వంతో ఇతరులను అవమానించి మాట్లాడవద్దు.

క. అవినీతులయి మహాత్ముల । కవమానము సేసి మును జయద్రథ దంభో
ద్భవ కార్తవీర్యులనువా । రవజితులయి రొరులచే మహాబలులయ్యున్. 191

ప్రతిపదార్థం: మును= పూర్వం; జయద్రథ, దంభోద్భవ, కార్తవీర్యులు+అనువారు; మహాబలులు+అయ్యున్= మిక్కిలి బలంకలవారు అయినప్పటికిని; అవినీతులు+అయి= నీతిలేని వాళ్ళయి; మహాత్ములకున్; అవమానము; చేసి; ఒరులచేన్= ఇతరులచేత; వారు; అవజితులు+అయిరి= ఓడించబడినవా రయ్యారు.

తాత్పర్యం: పూర్వం జయద్రథుడు, దంభోద్భవుడు, కార్తవీర్యుడు మహాబలవంతులే అయినా అవినీతిపరులై మహాత్ములను అవమానించటంచేత ఇతరులచేతుల్లో ఓడిపోయారు.

విశేషం: జయద్రథుడు - సింధుదేశాధిపతి అయిన వృద్ధక్షత్రుని కుమారుడు. ఇతనికి సైంధవుడనే పేరుకూడ ఉంది. ఇతడు ధృతరాష్ట్రుడి కూతురు దుస్సలకు భర్త. అయితే ఈ సైంధవుడు పార్థునిచేత కురుక్షేత్రంలో చచ్చాడు. అందుచేత ఇక్కడ అతడని చెప్పటం కుదరదు. యశోదా వృహన్మనసుల కొడుకైన జయద్రథు డున్నాడు. అతడే ఇతడు. దంభోద్భవుడు - గంధమాదనంమీద తపస్సు చేసుకొంటున్న నరనారాయణుల దగ్గరకు క్రొవ్వెక్కి వెళ్ళి, యుద్ధానికి రమ్మని పిలిచి వాళ్ళచేతిలో ఓడిపోయిన రాజు. కార్తవీర్యుడు - కృతవీర్యుడి పుత్రుడు. హైహయవంశపు రాజు. దత్తాత్రేయుని వరంతో వెయ్యిచేతులు పొందినవాడు. జమదగ్ని మహామునిని అవమానించి పరశురామునిచేత నాశనమైనవాడు.

తరలము.

అతుల విక్రమ సంపదన్ రణయజ్ఞ దీక్షితులై రిపు
ప్రతతి నోర్చిన వీరు, లుగ్రతపంబు సేసినవారు స
ద్గతికిఁ బోదురు గాక; యి ట్లపకారదారుణవృత్తి ను
ద్ధతిని భైరవపూజ సేసిన దాన సద్గతి గల్గునే? **192**

ప్రతిపదార్థం: అతుల, విక్రమ, సంపదన్= సాటిలేని పరాక్రమమనే సంపదతో; రణ, యజ్ఞ దీక్షితులు+ఐ= యుద్ధమనే యజ్ఞంలో దీక్షగలవాళ్ళయి; రిపు ప్రతతిన్= శత్రు సమూహాన్ని; ఓర్చిన= ఓడించిన; వీరులు; ఉగ్ర, తపంబు= భయంకరమైన తపస్సు; చేసిన, వారు; సత్+గతికిన్= స్వర్గానికి; పోదురుగాక; ఇట్లు= ఈవిధంగా; అపకార, దారుణ, వృత్తిన్= అపకారంతో కూడుకొన్న క్రూరమైన నడవడితో; ఉద్ధతిని= గర్వంతో; భైరవ, పూజ= శివపూజ; చేసిన; దానన్= దానిచే; సత్+గతి= మోక్షం; కల్గునే= కలుగునా?

తాత్పర్యం: సాటిలేని పరాక్రమమనే సంపదతో, యుద్ధమనే యజ్ఞంలో దీక్షవహించి, శత్రుసమూహాన్ని ఓడించినవీరులు, గొప్పతపస్సు చేసినవాళ్ళు స్వర్గాన్ని పొందుతారు. కాని, నీవలె సాటిరాజులను క్రూరంగా హింసిస్తూ గర్వంతో శివపూజ చేస్తే మోక్షం లభిస్తుందా!

విశేషం: అలం: రూపకం. 'తరలం'లో న-భ-ర-స-జ-జ-గ- అనే గణాలు ఉంటాయి. 12వ అక్షరం యతి స్థానం. ఇందులో మొదటి రెండు లఘువులను ఒక గురువుగా మారిస్తే మత్తకోకిల అవుతుంది. (శ్రీకృష్ణుడు అధిక్షేపాత్మకంగా మాట్లాడిన ఈపద్యంలోని వాక్యవిన్యాసంలో వికటత్వం గోచరిస్తుంది. దానివలన ఉదారత పోషించబడి ఓజోగుణం రాణించింది. అధిక్షేపంలో కూడా అగ్రామ్యత గోచరించటం ఉదాత్తుని స్వభావానికి వ్యంజకం. - సంపా.)

తరలము.

చెడక నా వచనంబు సేయుము; చెచ్చెరన్ ధరణీశులన్
విడిచి పుచ్చుము; యేను గృష్ణుఁడ, వీఁడు భీముఁడు, వాఁడు గ
వ్వడి; భవత్కృత దారుణం బను వహ్ని యార్పఁగ నున్న య
క్కడిఁది వీరులు వీర లిద్దఱు గర్వితుల్ కురుసింహముల్. **193**

ప్రతిపదార్థం: చెడక= చెడిపోక; నా, వచనంబు, చేయుము= నేను చెప్పినట్లు చేయుము; చెర+చెరన్= వెంటనే, ధరణీ+ఈశులన్= రాజులను (చెరలో ఉన్న వాళ్ళను) విడిచి, పుచ్చుము+అ= విడిచిపెట్టుమా!; ఏను= నేను; కృష్ణుఁడ; వీఁడు; భీముఁడు; వాఁడు; కవ్వడి= అర్జునుడు; భవత్+కృత, దారుణంబు+అను= నీచే చేయబడిన దుర్మార్గమనే; వహ్ని= అగ్నిని; ఆర్పఁగన్= చల్లార్చటానికి; ఉన్న= సిద్ధంగా ఉన్న; ఆ+కడిఁది, వీరులు= ఆగొప్పవీరులు; వీరలు+ఇద్దఱు; గర్వితుల్= గర్వించి ఉన్నవారు- అంటే పెచ్చు పెరిగి ఉన్నవాళ్ళు; కురు సింహముల్= కురువంశశ్రేష్ఠులు.

తాత్పర్యం: నీవు చెడిపోకుండా ఉండాలంటే నేను చెప్పినట్లు చెయ్యి; వెంటనే చెరలో ఉండే రాజు లందరిని విడిచిపెట్టు. నేను కృష్ణుణ్ణి. ఇతడు భీముడు. అతడు అర్జునుడు. నీదుర్మార్గం అనే నిప్పును చల్లార్పటానికి సిద్ధంగా ఉన్న ఆ మహావీరు లిద్దరూ గర్వోన్నతులు, కురువంశ శ్రేష్ఠులు.

విశేషం: అలం: రూపకం. కవిత్రయంలో తరలవృత్తాన్ని నన్నయయే ఎక్కువగా వాడాడు. (నన్నయ రచించినవి 25; ఎఱ్ఱన రచించినవి-8, తిక్కన రచించినవి-5.). విశేషించి ఈ ఘట్టంలోనే శ్రీకృష్ణుడి మాటలుగా వరుసగా రెండు తరలవృత్తాలను వాడటం గమనార్హం. శ్రీకృష్ణుడు జరాసంధుణ్ణి మందలించి, అతనిని శిక్షించడానికి వచ్చామని బెదిరించిన ఈ వాక్యాలు ఈ విశేషవృత్తంలో ఉండటం ఛందౌచిత్యం. పై వృత్తంలోవలె ఇందులోకూడ ఉదారతను ఓజస్సుకు అంగంగా పోషించటం పాత్రౌచిత్య, సందర్భౌచిత్య కారకం. (సంపా.)

క. **కడుఁ గ్రూరుఁడవయి నృపతుల । విడువవనినాఁ డాజిఁ బాండవేయులు నీయు**
క్కడఁచి భుజశక్తి యేర్పడ । విడిపింతురు గడిమి నిఖిల విషయాధిపులన్. **194**

ప్రతిపదార్థం: కడున్= మిక్కిలి; క్రూరుఁడవు+అయి= దుర్మార్గుడివై; నృపతులన్= రాజులను; విడువని, నాఁడు= విడిచిపెట్టనిరోజు; ఆజిన్= యుద్ధంలో; పాండవేయులు= పాండురాజుకుమారులైన ఈ భీమార్జునులు; భుజశక్తి= భుజబలం; ఏర్పడన్= ప్రకాశించగా; నీ, ఉక్కు+అడఁచి= నీయొక్క పొగరును అణచి; కడిమిన్= ఆధిక్యంతో; నిఖిల, విషయ+అధిపులన్= అందరు భూపతులను - అంటే నీకు బందీలుగా ఉన్న రాజు లందరిని; విడిపింతురు.

తాత్పర్యం: పరమ దుర్మార్గుడివై నీవు రాజులను చెరనుండి విడిపించకుంటే, పాండుపుత్రులైన ఈ భీమార్జునులు తమ భుజబలంతో నీ పొగరు అణచివేస్తారు. నీకు బందీలైన రాజులందరినీ విడిపిస్తారు.

విశేషం: శ్రీకృష్ణుడు భీమార్జునుల పరాక్రమాన్ని ప్రశంసించి వారిని ఉత్సాహపరిచాడు. జరాసంధుణ్ణి నిందించి అతణ్ణి రెచ్చగొట్టాడు. యుద్ధానికి రంగాన్ని సిద్ధం చేశాడు.

వ. **అనిన విని జరాసంధుండు సటాసముత్పాటన కుపితకుంజర వైరియుంబోలెఁ గడునలిగి పటు కుటిల భ్రుకుటి ఘటిత నిటలుం డగుచుఁ బురుషోత్తమున కి ట్లనియె.** **195**

ప్రతిపదార్థం: అనినన్; విని; జరాసంధుండు; సటా, సమ్+ఉత్+పాటన, కుపిత, కుంజర, వైరియున్+పోలెన్= జూలు గట్టిగా పట్టి ఊడబెరకటంచేత కోపపడిన, ఏనుగుల శత్రువైన సింహంవలె; కడున్= మిక్కిలి; అలిగి= కోపించి; పటు, కుటిల, భ్రుకుటి, ఘటిత, నిటలుండు+అగుచున్= ఎక్కువగా వంకర తిరిగిన బొమముడిపాటుతో కూడిన నొసలు కలవాడై; పురుష+ఉత్తమునకున్= శ్రీకృష్ణునకు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: శ్రీకృష్ణుని మాటలకు జరాసంధుడు జూలు గట్టిగా పట్టి పెరకటంచేత కోపించిన సింహంలా ఎంతో కోపంతో మిక్కిలి వక్రమైన బొమముడిపాటుగల నొసలు కలవాడై ఇలా అన్నాడు.

విశేషం: అలం: ఉపమ. అక్షరరమ్యమైన నన్నయశైలికి ఇదొక చక్కని ఉదాహరణ. శ్రీకృష్ణ భీమార్జునుల అక్రమ ప్రవేశంతో, వాళ్ళ అహంకార ప్రదర్శనతో, అన్నింటిని మించి ఆ శ్రీకృష్ణుడి కవ్వింపు మాటలతో, జరాసంధుడు ఎంత కోపోద్రిక్తుడయ్యాడో ఈ వచనంలోని ఉపమానమే కాక ఇందులోని పద ఘటన కూడ పాఠకునికి ప్రత్యక్షం చేస్తున్నది. కటువైన ఉచ్చారణ, వక్రమైన ఆకారం ఉండే 'ట' కారం సటాసముత్పాటనతో ప్రారంభమై, వడివడిగా ఆ జరాసంధుని కోపం ఎట్లా పెరిగిందో ఒక్కపెట్టున అతని ముఖమెంత కటువుగా మారిందో, నొస లెంత వక్రత వహించిందో చక్కగా వ్యక్తం చేస్తూ ఉంది. ఇక్కడ 'ట' కారావృత్తితో వృత్త్యనుప్రాసమనే శబ్దాలంకారం ఉంది.

క. అమితపరాక్రమమున నా । క్రమించి పరనృపుల నోర్చి గర్వించుట దో
సమె? యిది సత్క్షత్రియ ధ । ర్మమ; యే నెప్పుడుఁ బరాక్రమవ్రతుఁడ నిలన్. 196

ప్రతిపదార్థం: అమిత, పరాక్రమమునన్= మిక్కిలి పరాక్రమంతో; ఆక్రమించి= దండెత్తి; పరనృపులన్= శత్రురాజులను; ఓర్చి= జయించి; గర్వించుట; దోసమె= తప్పా?; ఇది; సత్+క్షత్రియ, ధర్మము+అ= ఉత్తమక్షత్రియ ధర్మమే; ఇలన్= భూమిమీద; ఏన్= నేను; ఎప్పుడున్= ఎల్లప్పుడు; పరాక్రమవ్రతుఁడన్= పరాక్రమంతో జీవించటమే వ్రతంగా కలవాణ్ణి.

తాత్పర్యం: అమితపరాక్రమంతో పరరాజులమీద దండెత్తి వాళ్ళను జయించి గర్వించటం తప్పా? ఇది ఉత్తమ క్షత్రియధర్మమే కదా! ఈనేలమీద ఎప్పుడూ పరాక్రమంతో జీవించటమే నా వ్రతం.

క. దేవార్థముగాఁ దెచ్చిన । యీ వసుధాధిపుల నేల యే విడుతుఁ బ్రతా
పావజితరిపుఁడఁ గావున । నీ వెఱుఁగవె తొల్లి ధారుణీధర! నన్నున్? 197

ప్రతిపదార్థం: దేవ+అర్థముగాన్= దేవుడికొరకు - అంటే పరమేశ్వరుడికి బలిఇవ్వటానికని; తెచ్చిన; ఈ, వసుధా+అధిపులన్= ఈ భూపతులను - రాజులను; ఏల= ఎందుకు; ఏన్= నేను; విడుతున్= విడిచిపెడతాను; ప్రతాప+అవజిత, రిపుఁడన్= పరాక్రమంచేత జయింపబడిన శత్రువులు కలవాడిని; కావున= అవటంచేత; ధారుణీ, ధర!= శ్రీకృష్ణా!; తొల్లి= ఇదివరకు; నీవు; ఎఱుఁగవె; నన్నున్.

తాత్పర్యం: పరమేశ్వరునికి బలియివ్వటానికై పట్టి తెచ్చిన రాజు లందరిని ఎందుకు వదలిపెడతాను? పరాక్రమంచేత శత్రువుల్ని జయించినవాణ్ణి. శ్రీకృష్ణా! నా సంగతి నీ కిదివరకు తెలియదా?

విశేషం: జరాసంధుని దెబ్బకు తాళలేక మధురనుండి ద్వారవతికి తననివాసాన్నే మార్చుకొన్న శ్రీకృష్ణునికి 'నీ వెఱుఁగవె తొల్లి ధారుణీధర నన్నున్' అనే జరాసంధుని మాటపోటు ఆయువుపట్టు తాకేదిగా ఉంది.

జరాసంధుండు యుద్ధమునకు భీమునిఁ గోరుకొనుట (సం. 2-20-28)

సీ. 'సమకట్టి సైన్యంబు సైన్యంబుతో నొండెఁ, । దొడరి మీ ముప్పురతోడ నొండె.
నిద్దఱతో నొండె, నెక్కటి యొక్కని । తో నొండెఁ, బొడిచెద దోర్బలమున
నే యాయుధంబున నెమ్మెయిఁ బోరంగ । నిష్ట మయ్యది యుత్సహింపుఁ' డనిన,
'నొక్కనితోఁ బల్వు రుద్ధతులయి పూని । యుద్ధంబు సేయుట యుచితమగునె?

ఆ. యధిక బాహుబలులమయిన మా ముప్పుర । యందు నొక్కరుని మహాబలాఢ్యుఁ
గోరికొనుము; వాఁడు ఘోరాజిలో నిన్ను । మొనసి మల్లయుద్ధమున జయించు.' 198

ప్రతిపదార్థం: సమకట్టి= పూనుకొని; సైన్యంబు, సైన్యంబుతోన్+ఒండెన్= సైన్యం సైన్యంతోకాని; తొడరి= ప్రయత్నించి; మీ, ముప్పురతోడన్+ఒండెన్= మీ ముగ్గురితోకాని; ఇద్దఱతోన్+ఒండెన్= ఇద్దరితోకాని; ఎక్కటి, ఒక్కనితోన్+ఒండెన్= ఒంటరిగా ఒక్కనితోకాని; పొడిచెదన్= యుద్ధం చేస్తాను; దోః+బలమునన్= బాహుబలంచేతగాని; ఏ, ఆయుధంబునన్= ఏరకమైన ఆయుధంచేతగాని; ఏ, మెయిన్= ఏవిధంగా; పోరంగన్= యుద్ధం చెయ్యటానికి; ఇష్టము= మీకు ఇష్టమో; ఆ+అది= ఆవిధం;

ఉత్సహింపుఁడు= పూనుడు; అనినన్; ఒక్కనితోన్; పలువురు; ఉద్ధతులు+అయి= విజృంభించినవాళ్ళయి; పూని= పూనుకొని; యుద్ధంబు; చేయుట; ఉచితము+అగునె= తగునా?; అధిక, బాహు, బలులము+ఐన= మిక్కిలి భుజబలం కలవాళ్ళమైన; మా, మువ్వుర, అందున్; మహా, బల+ఆఢ్యున్= గొప్ప బలంతో కూడుకొన్నవాణ్ణి; ఒక్కరుని; కోరికొనుము; వాఁడు; ఘోర+ ఆజిలోన్= భయంకరమైన యుద్ధంలో; నిన్నున్; మొనసి= ఎదుర్కొని; మల్ల, యుద్ధమునన్; జయించున్.

తాత్పర్యం: 'సైన్యం సైన్యంతోగాని, మీ ముగ్గురితో కాని, మీలో ఇద్దరితోకాని, ఒంటరిగా మీలో ఒక్కరితో కాని యుద్ధం చేయటానికి నేను సిద్ధం. బాహుబలంతోకాని, ఆయుధంతో కాని, ఏవిధంగా పోరాడటం మీకిష్టమో ఆ విధంగా నాతో యుద్ధానికి రండి' అని జరాసంధు డనగానే 'పెక్కుమంది బలవంతులు విజృంభించి ఒక్కడితో యుద్ధం చేయటం ఉచితం కాదు. అధిక బలశాలురమైన మా ముగ్గురిలో మహాబలవంతుడైన ఒక్కణ్ణి కోరుకో. అతడే నిన్ను ఎదుర్కొంటాడు. భయంకరమైన మల్లయుద్ధంలో నిన్ను జయిస్తాడు' అని శ్రీకృష్ణు డన్నాడు.

విశేషం: శ్రీకృష్ణుని మాటనేర్పు అమోఘం. మా ముగ్గురిలో ఎవరినైనా ఒక్కడిని కోరుకొమ్మని పైకి అన్నట్లే అని, మహాబలాఢ్యుణ్ణి కోరుకొమ్ము, అతడు మల్లయుద్ధంలో నిన్ను జయిస్తా డని పలికి పరోక్షంగా జరాసంధునిదృష్టిని మహాబలుడైన వాయుపుత్రుడు, మల్లయుద్ధనిపుణుడు అయిన భీముడివైపు మళ్ళించాడు.

క. అనిన మురవైరి పలుకులు । విని బార్హద్రథుఁడు భూరివీర్యు మరున్నం
దనుఁ గోరికొనియె 'నీతం । డని నెన యగు నాకు' ననుచు నతిదర్పితుఁడై. 199

ప్రతిపదార్థం: అనినన్; ముర, వైరి, పలుకులు= మురుడనే రాక్షసునికి శత్రువైన శ్రీకృష్ణుని మాటలు; విని; బార్హద్రథుఁడు= బృహద్రథుడి పుత్రుడైన జరాసంధుడు; భూరి, వీర్యున్= గొప్ప పరాక్రమం కలవాడైన, మరుత్+నందనున్= వాయుతనయుడైన భీమసేనుని; ఈతండు; అనిన్= యుద్ధంలో; నాకున్; ఎన= సరి; అగున్; అనుచున్; అతిదర్పితుఁడు+ఐ= మిక్కిలి గర్వంతో కూడుకొన్నవాడై; కోరికొనియెన్.

తాత్పర్యం: శ్రీకృష్ణుని మాటలు విని జరాసంధుడు గర్వంతో 'యుద్ధంలో నాకు సరిజోడు పవన తనయుడైన భీముడే' అని ఆతణ్ణి కోరుకొన్నాడు.

విశేషం: భీముడే నాకు యుద్ధంలో సరి ఉద్దీ అని అతణ్ణి కోరుకొన్న జరాసంధుని అభిమానంగూడ అభినందించతగ్గదే.

వ. ఇట్లు జరాసంధుండు భీమసేనుతో మల్లయుద్ధంబు సేయ నిశ్చయించి తన తనయు సహదేవుని రాజ్యంబున కభిషిక్తుంజేసి పురోహిత కృత స్వస్త్యయనుండై. 200

ప్రతిపదార్థం: ఇట్లు; జరాసంధుండు; భీమసేనుతోన్; మల్ల, యుద్ధంబు; చేయ, నిశ్చయించి, తన, తనయున్= తన కుమారుణ్ణి; సహదేవునిన్; రాజ్యంబునకున్= మగధరాజ్యానికి; అభిషిక్తున్+చేసి= రాజుగా చేసి; పురోహిత, కృత, స్వస్తి+అయనుండు+ ఐ= పురోహితులచేత చేయబడిన మంగళాశీర్వచనాలుకలవాడై.

తాత్పర్యం: ఆ విధంగా జరాసంధుడు భీమసేనునితో మల్లయుద్ధం చేయటానికి నిశ్చయించి, ముందుగా తన కుమారుడైన సహదేవుణ్ణి మగధరాజ్యానికి పట్టాభిషిక్తుణ్ణి చేసి, తాను పురోహితుల మంగళాశీర్వచనాలు పొంది.

విశేషం: జరాసంధునికి ఆయుధాలవలన మరణం లేదనే వరం ఉంది. కాని ఇప్పుడు భీమునితో జరుగబోయేది మల్లయుద్ధం. జయం తథ్యం కాదు. అందుకే జరాసంధుడు మరణానికికూడా సిద్ధమై యుద్ధానికి పూనుకొంటున్నాడని సహదేవుని పట్టాభిషేకం సూచిస్తున్నది. జరాసంధుని మరణ సూచన ఉంది కనుక ఇది వస్తుధ్వని. (సంపా.)

ఆ. బలియుఁ డపుడు వెండ్రుకలు పాచి ముడిచి గం । టెసఁగఁ దాల్చి వీరరసికవృత్తి
నుద్ధతుండు మల్లయుద్ధ ప్రసాధనం । బమర నిలిచె వేడ్క నమితబలుఁడు. 201

ప్రతిపదార్థం: బలియుఁడు= బలవంతుడైన జరాసంధుడు; అపుడు; వెండ్రుకలు; పాచి= వెనుకకు త్రోసి; ముడిచి; గంటు+ ఎసఁగన్= ముడి ఒప్పేటట్లుగా; తాల్చి= వేసికొని; వీర, రసిక, వృత్తిన్= వీరరసావేశం పొందిన వాడి విధంగా; ఉద్ధతుండు= విజృంభించినవాడు; అమిత, బలుఁడు= మిక్కిలి బలవంతుడయిన జరాసంధుడు; మల్ల, యుద్ధ, ప్రసాధనంబు= మల్లయుద్ధానికి తగిన అలంకరణ; అమరన్= ఒప్పగా; వేడ్కన్= సంతోషంతో; నిలిచెన్= నిలిచాడు.

తాత్పర్యం: అప్పుడు మహాబలవంతుడైన ఆ జరాసంధుడు తనజుట్టు వెనుకకు నెట్టి, ముడివేసుకొన్నాడు. వీరరసావేశంతో విజృంభించాడు. మల్లయుద్ధానికి తగిన అలంకరణతో ఆ భీమునిముందు నిలిచాడు.

వ. భీమసేనుండును వానికి నక్కజంబుగా మల్లయుద్ధ సన్నద్ధుం డయి ప్రతిభటించి నిలిచె నంత. 202

ప్రతిపదార్థం: భీమసేనుండును; వానికిన్= ఆ జరాసంధునికి, అక్కజంబుగాన్= ఆశ్చర్యం కలిగేటట్లుగా; మల్ల, యుద్ధ, సన్నద్ధుండు+అయి= మల్లయుద్ధానికి సిద్ధమైనవాడై; ప్రతిభటించి= ఎదిరించి; నిలిచెన్; అంత= అప్పుడు.

తాత్పర్యం: భీమసేనుడు కూడ జరాసంధునికి ఆశ్చర్యం కలిగేటట్లుగా మల్లయుద్ధానికి సిద్ధమై అతనికి దీటుగా ఎదుట నిలిచాడు.

భీమసేన జరాసంధుల మల్లయుద్ధము (సం. 2-21-10)

మ. సమసత్త్వాతిశయుల్ వృకోదర జరాసంధుల్ మహోద్యత్పరా
క్రమ మొప్పం గడు నల్గి యొండొరులఁ జుల్కం దాఁకి రన్యోన్యదు
ర్దమ దోర్దండ పటుప్రహార జనితధ్వానంబు బ్రహ్మాండ భాం
డము నిండన్ లయకాల దండధర చండక్షోభమో నా జనుల్. 203

ప్రతిపదార్థం: సమ, సత్త్వ+అతిశయుల్= సమానమైన బలం యొక్క అధిక్యం కలవాళ్ళు; వృకోదర, జరాసంధుల్= భీమసేన జరాసంధులు; మహా+ఉద్యత్+పరాక్రమము+ఒప్పన్= పెల్లుబికిన శౌర్యం ప్రకాశించగా; అన్యోన్య, దుర్దమ, దోః+దండ, పటు ప్రహార, జనిత, ధ్వానంబు= పరస్పరం అణచటానికి సాధ్యం కాని భుజదండాల తీవ్రమైన దెబ్బలచే పుట్టిన శబ్దం; బ్రహ్మాండ, భాండము= కుండవంటి ఆకారంలో ఉన్న భువనగోళం; నిండన్= నిండగా; జనుల్; లయ, కాల, దండధర, చండ, క్షోభమో, నాన్= ప్రళయకాలంలోని యమునివల్ల ఏర్పడే భయంకరకల్లోలమా అని అనుకొనేటట్లుగా; కడున్+అల్గి= మిక్కిలి కోపించి; ఒండు+ఒరులన్= ఒకరి నొకరు; చుల్కన్= సుళువుగా; తాఁకిరి= ఎదుర్కొన్నారు.

తాత్పర్యం: సమబలులై, విజృంభించిన భీమజరాసంధు లిద్దరు, పెల్లుబికిన పరాక్రమంతో, పరస్పరం అణచసాధ్యంకాని తమ బాహుదండాల తీవ్రమైన దెబ్బల ధ్వని బ్రహ్మాండ భాండమంతా నిండగా, ప్రజలంతా అది ప్రళయకాల

యముని వల్ల ఏర్పడిన అల్లకల్లోలమా అని అనుకొనేటట్లుగా మితిమీరిన కోపంతో మహోద్రిక్తులై ఒకరినొకరు అవలీలగా ఎదుర్కొన్నారు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. రెండు మదపుటేనుగులు ఢీకొన్నట్లు భీమజరాసంధుల మల్లయుద్ధపు తొలితాకిడిని మత్తేభవృత్తంలో వర్ణించటం, వారి భుజదండ ప్రహారాలను బిందుపూర్వక డకార పౌనఃపున్యంచేత ధ్వనింప చేయటం శబ్దశాసనుడైన నన్నయ మనోహర కవితాశిల్పం. (వీరరౌద్ర రసస్ఫోరకమైన ఈ పద్యరచనలో కాంతి అనే శబ్దగుణంతో ఉజ్జ్వలంగా భాసించే ప్రసాదం ప్రదర్శితం. - సంపా.)

క. **కర్షితరిపు లన్యోన్యా । కర్షణ సంకర్షణాపకర్షణముల సా**
మర్షు లయి పెనఁగి రాహవ । హర్షంబునఁ బవనసుత బృహద్రథపుత్త్రుల్. **204**

ప్రతిపదార్థం: కర్షితరిపులు= పరస్పరం ఆకర్షితులైన శత్రువులు; పవన, సుత, బృహద్రథ, పుత్త్రుల్= వాయుదేవుని కొడుకైన భీముడు, బృహద్రథుని కొడుకైన జరాసంధుడు; అన్యోన్య+ఆకర్షణ, సంకర్షణ+అపకర్షణములన్= ఒకరి నొకరు లాగటంచేత, నలపటంచేత, త్రోయటంచేత; స+అమర్షులు+అయి= కోపంతో కూడుకొన్నవాళ్ళయి; ఆహవహర్షంబునన్= యుద్ధమందలి ఉత్సాహంతో; పెనఁగిరి= పోరాడారు.

తాత్పర్యం: పరస్పరం కలియబడిన శత్రువులు ఆ భీమ జరాసంధులు ఒకరినొకరు లాగటంచేత, నలపటంచేత, త్రోయటంచేత అతిశయించిన కోపంతో యుద్ధోత్సాహంతో పోరాటం సాగించారు.

విశేషం: ఒకదాని వెంట ఒకటిగా వచ్చే రకారషకారసంయోగం ఆ మల్లయుద్ధమహావీరుల పెనుగులాటను మనోహరంగా ధ్వనింపజేస్తున్నది. మహాకవుల రచనల్లో అక్షరాల కూర్పు అంతరభావాన్ని ధ్వనింపచేస్తుందనటానికి (Sound echoing the sense) ఇదొక ఉదాహరణ.

క. **వ్యాయామకర్కశ స్థిర । కాయుల యుద్ధము భయానకం బయ్యె మహో**
గ్రాయస పరిఘాయిత కఠి । నాయత భుజదండ దారుణాఘాతములన్. **205**

ప్రతిపదార్థం: వ్యాయామ, కర్కశ, స్థిర, కాయుల= వ్యాయామంచేత - అంటే కసరత్తుచేత - కఠినమై గట్టిపడిన శరీరాలు కలవాళ్ళయొక్క; మహా+ఉగ్ర+ఆయస, పరిఘాయిత, కఠిన+ఆయత, భుజ, దండ, దారుణ+ఆఘాతములన్= మిక్కిలి భయంకరాలైన ఇనుప గుదియల వలె కఠినాలై పొడవైన బాహుదండాలయొక్క; తీవ్రమైన దెబ్బలచేత; భయానకంబు+అయ్యెన్= భయాన్ని కలిగించే దయింది.

తాత్పర్యం: వ్యాయామంచేత గట్టిపడిన శరీరాలు కల ఆ భీమజరాసంధుల మల్లయుద్ధం భయంకరమైన ఇనుపగుదియలా కఠినంగా పొడవుగా ఉన్న వాళ్ళ బాహుదండాల దెబ్బలతో భయంకరంగా మారింది.

విశేషం: నన్నయగారు పద్యంలో విరివిగా ఇచట ప్రయోగించిన సవర్ణ దీర్ఘసంధులు, భీమ జరాసంధుల బాహుదండాల దీర్ఘతకు, సమానతకు, తీవ్రతకు చక్కని సూచికలు.

చ. అతులబలుల్ పరస్పర జయార్థులు పార్థివపుంగవుల్ మరు
త్సుత మగధేశ్వరుల్ సమరశూరులు దారుణలీలఁ బోరి రూ
ర్జిత భుజదర్ప మేర్పడఁగ సింహగజేంద్రములట్లు, వజ్ర ప
ర్వతముల యట్లు, ఘోరతర వాసవ వృత్రులయట్లు నిద్దఱున్. 206

ప్రతిపదార్థం: అతుల బలుల్= సాటిలేని బలం కలవాళ్ళు; పరస్పర, జయ+అర్థులు= ఒకరినొకరు జయించగోరే వాళ్ళు; పార్థివ పుంగవుల్= రాజశ్రేష్ఠులు; సమర, శూరులు= యుద్ధవీరులు; మరుత్+సుత, మగధ+ఈశ్వరుల్= వాయుపుత్ర, మగధరాజులైన - భీమ జరాసంధులు; ఊర్జిత, భుజ, దర్పము= దృఢమైన బాహు గర్వం; ఏర్పడఁగన్= మెరయగా; సింహ, గజ+ఇంద్రముల, అట్లు= సింహం మదపుటేనుగులవలె; వజ్ర, పర్వతముల, అట్లు= వజ్రాయుధ పర్వతాల వలె; ఘోరతర, వాసవ, వృత్రుల, అట్లు= మిక్కిలి భయంకరులైన దేవేంద్ర వృత్రాసురులవలె; ఇద్దఱున్; దారుణ, లీలన్= భీకర పద్ధతిలో; పోరిరి= యుద్ధం చేశారు.

తాత్పర్యం: సాటిలేని బలం కలవాళ్ళు, ఒకరినొకరు జయించాలన్న కాంక్ష కలవాళ్ళు, రాజశ్రేష్ఠులు, యుద్ధవీరులు అయిన భీమ జరాసంధు లిద్దరు - సింహ గజేంద్రుల్లా, వజ్రపర్వతాల్లా, ఇంద్ర వృత్రాసురుల్లా భయంకరంగా యుద్ధం చేశారు.

విశేషం: అలం: ఉపమ. వాళ్ళిద్దరూ సమస్థాయిలో ఎంత పట్టుగా పోరుతున్నా, భీముణ్ణి సింహంతో, వజ్రాయుధంతో, దేవేంద్రునితో పోల్చటం, భీమవిజయాన్నీ జరాసంధపరాజయాన్నీ అద్భుతంగా ధ్వనింపజేస్తున్నది. ఇది అలంకార మూలంగా జరిగే వస్తుధ్వని. భీముని విజయాన్ని సూచించటానికై నన్నయ ఇచట మూలంలోని ఉపమానాల క్రమం మార్చటం విశేషం. (వస్తుస్వభావస్ఫూర్తితో కూడిన అర్థవ్యక్తిహేతుత్వం గల అర్థవ్యక్తి అనే శబ్దగుణం ఇందులో ప్రసాదగుణాన్ని సార్థకంగా పోషిస్తున్నది. సర్వరససామాన్యమైన ప్రసాదగుణం రౌద్రరసపోషకంగా ఈ రచనలో రాణిస్తున్నది. - సంపా.)

వ. ఇట్లు కార్తిక మాసంబునం బ్రథమ దివసంబునం దొడంగి భీమజరాసంధు లెడ యుడుగక యొండొరులం బట్టియుఁ గిట్టియు నడిచియుం బొడిచియుఁ దాఁచియుం ద్రోచియు మహాయుద్ధంబు సేయుచుం ద్రయోదశినాఁ డిద్దఱుం గిట్టి మల్లయుద్ధ కౌశలం బేర్పడం బెనంగు నెడఁ జతుర్దశినాఁటి రాత్రియందు జరాసంధు నతిశ్రాంతభావం బుపలక్షించి యధోక్షజుండు భీమున కి ట్లనియె. 207

ప్రతిపదార్థం: ఇట్లు; కార్తికమాసంబునన్; ప్రథమ, దివసంబునన్= పాడ్యమినాడు; తొడంగి= ప్రారంభించి; భీమ, జరాసంధులు; ఎడ, ఉడుగక= (స్థానం విడువక) విడివడక; ఒండొరులన్= ఒకరినొకరు; పట్టియున్= గట్టిగా పట్టుకొని; కిట్టియున్= ఎదుర్కొని; అడిచియున్= కొట్టి; పొడిచియున్; తాఁచియున్= తన్ని; త్రోచియు= త్రోసి; మహాయుద్ధంబు; చేయుచున్; త్రయోదశినాఁడు= పదమూడవరోజు; ఇద్దఱున్; కిట్టి= సమీపించి (తలపడి); మల్లయుద్ధకౌశలంబు= మల్లయుద్ధంలోని నేర్పు; ఏర్పడన్= ప్రకటమయ్యేటట్లు; పెనంగు+ఎడన్= యుద్ధం చేస్తున్న సమయంలో; చతుర్దశినాఁటి రాత్రియందున్= పదునాల్గవ నాటి రాత్రి; జరాసంధు= జరాసంధునియొక్క; అతి, శ్రాంత, భావంబు= మిక్కిలి అలసిన స్థితిని; ఉపలక్షించి= గుర్తించి; అధోక్షజుండు= శ్రీకృష్ణుడు; భీమునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈ విధంగా కార్తిక శుద్ధ పాడ్యమినాడు ప్రారంభించి భీమ జరాసంధులు ఒకరినొకరు పట్టి, కొట్టి, పొడిచి, తన్ని, త్రోసి ఎడతెగని మహాయుద్ధం చేశారు. త్రయోదశినాడు ఇద్దరు తమ మల్లయుద్ధసామర్థ్యం

ప్రకటమయ్యేటట్లు పెనుగులాడగా చతుర్దశినాటి రాత్రి జరాసంధుడి అలసటను గుర్తించి శ్రీకృష్ణుడు భీమసేనునితో ఇలా అన్నాడు.

విశేషం: 'ఎడయుడుగక' కు మూలం - 'అనారతం దివారాత్ర మవిశ్రాంత మవర్తత' (భండార్కరు ప్రతి. 2-21-17). నన్నయ గారు మూలంలో వర్ణింపబడిన భీమజరాసంధుల యుద్ధంయొక్క అవిశ్రాంతత నంతా 'ఎడయుడుగక' అనే ఒక్క చక్కని తెలుగుమాటలో చెప్పి విడిచారు.

భీముఁడు జరాసంధుని సంహరించుట (సం. 2-22-3)

చ. **విరహితసత్త్వుఁ డయ్యెఁ బ్రతివీరుఁడు; వీని నశేష ధారుణీ**
శ్వరనికరాపరాధు నతిసాహసికున్ వధియించి, నీ భుజ
స్థిరత యెలర్ప నయ్యనిలదేవుబలంబును నీ బలంబు భా
సురముగ మాకుఁ జూపుము విశుద్ధయశోనిధి! మారుతాత్మజా! **208**

ప్రతిపదార్థం: విశుద్ధ, యశః, నిధి= నిర్మలమైన కీర్తికి నిలయమైన వాడా!; మారుత+ఆత్మజా!= వాయుదేవుని కుమారుడా!- భీమసేనా!; ప్రతివీరుఁడు= శత్రువీరుడైన జరాసంధుడు; విరహిత, సత్త్వుఁడు+అయ్యెన్= కోల్పోయిన బలం కలవాడయ్యాడు అంటే బలాన్ని కోల్పోయాడు; అశేష, ధారుణీ+ఈశ్వర, నికర+అపరాధున్= సకల రాజులసమూహానికి అపకారం చేసినవాణ్ణి; అతి సాహసికున్= మిక్కిలి తెగింపు కలవాణ్ణి; వీనిన్= ఈ జరాసంధుణ్ణి, వధియించి= చంపి; నీ, భుజ, స్థిరత= నీ భుజ బలంయొక్క చెక్కుచెదరని స్థితి; ఎలర్పన్= ప్రకటమయ్యేటట్లు; నీ బలంబు; ఆ+ అనిలదేవు, బలంబును= ఆ వాయుదేవునియొక్క బలంకూడ; భాసురముగన్= ప్రకాశించేటట్లు; మాకున్; చూపుము.

తాత్పర్యం: నిర్మలమైన కీర్తికి నిలయుడవైన ఓ వాయుపుత్రా! శత్రువీరు డైన జరాసంధుడు బలహీను డయ్యాడు. సకల రాజ సమూహానికి అపకారం చేసి, మితిమీరిన సాహసుడైన ఇతణ్ణి వధించి, నీ భుజబలంయొక్క చెక్కుచెదరని స్థితి ప్రకటమయ్యేటట్లు, నీ బలం, నీ తండ్రి వాయుదేవుడి బలం ప్రకాశించేటట్లు మాకు చూపు.

విశేషం: శ్రీకృష్ణుడు మారుతాత్మజా! అని సమయోచితంగా భీమసేనుణ్ణి సంబోధించటం, 'నీ బలమేకాక నీతండ్రి బలాన్ని కూడ మాకు చూపించు' అని చతురంగా సంభాషించి- ప్రోత్సహించటం, మహాబలుడైన వాయుదేవుని పుత్రుడివై ఉండి ఈ శత్రువీరుణ్ణి ఇంకా సహిస్తావా? - అని హెచ్చరించటం, నీ పితృదేవుణ్ణి స్మరించుమని సూచించటం- రసజ్ఞుల దృష్టిని ఆకర్షించే విశేషాలు. (యుద్ధవీరస్ఫోరకంగా ఈ పద్యంలో కాంతి అనే గుణం గొప్పగా పోషించబడింది. సంపా.)

వ. **అని ప్రబోధించిన ననిలతనయుం డనిలదేవుం దలంచి తత్ప్రసాదంబున నధికసత్త్వసమేతుండై.** **209**

ప్రతిపదార్థం: అని; ప్రబోధించినన్= కర్తవ్యాన్ని ఉపదేశించగా; అనిల, తనయుండు= వాయుదేవుడి కుమారుడైన భీముడు; అనిల, దేవున్= వాయుదేవుణ్ణి; తలంచి= స్మరించి; తత్+ప్రసాదంబునన్= ఆయన అనుగ్రహంచేత; అధిక, సత్త్వ, సమేతుండు+ఐ= మిక్కిలి బలంతో కూడుకొన్నవాడై.

తాత్పర్యం: అని శ్రీకృష్ణుడు కర్తవ్యబోధ చేయగానే, భీమసేనుడు తన తండ్రి అయిన వాయుదేవుణ్ణి మనస్సులో ధ్యానించి, ఆయన అనుగ్రహంతో అధికబలసంపన్నుడై.

ఉ. ఆతనిఁ బట్టి యెత్తి నిహతాహితవీరుఁడు వానిముక్కునన్
వాతను గర్ణరంధ్రముల వారక శోణితధార లొల్కఁగా
వాతసుతుండు వీచె శతవారము లుద్ధత చండ వాత సం
ఘాత వివర్తమాన తృణఖండసముం దగుచుండ మాగధున్. 210

ప్రతిపదార్థం: నిహత+అహిత, వీరుఁడు= చంపబడిన శత్రువీరులు కలవాడు - అంటే శత్రువులను సంహరించినవాడు; వాతసుతుండు= వాయుదేవుని కుమారుడైన భీముడు; ఆతనిన్= ఆ జరాసంధుణ్ణి; పట్టి, ఎత్తి= పట్టుకొని పైకెత్తి; వాని, ముక్కునన్; వాతను= నోటిలో; కర్ణ రంధ్రములన్= చెవి బెజ్జాలలో; వారక= ఎడతెగక; శోణిత, ధారలు= రక్తధారలు; ఒల్కఁగాన్= కారేటట్లుగా; ఉద్ధత, చండ, వాత, సంఘాత, వివర్తమాన, తృణఖండ, సముండు+అగుచుండన్= భయంకరమైన పెనుగాలి తాకిడిచేత తిరుగుడు పడుతున్న గడ్డిపరకతో సమానమైనవా డవుతుండగా; మాగధున్= మగధరాజైన జరాసంధుణ్ణి; శత, వారములు= నూరుసార్లు; వీచెన్= విసిరికొట్టాడు.

తాత్పర్యం: శత్రువీరసంహారకుడైన వాయుపుత్రుడు జరాసంధుణ్ణి పట్టి పైకెత్తి, అతడిముక్కున, నోట, కర్ణరంధ్రాలలో ఎడతెగనిరక్తధారలు ప్రవిస్తుండగా, భయంకరమైన పెనుగాలితాకిడికి తిరుగుడుపడుతున్న గడ్డిపరకతో సమానంగా మగధరాజైన ఆ జరాసంధుణ్ణి నూరుసార్లు విసరివేశాడు.

విశేషం: అలం: పరికరం. మహాబలుడైన వాయుదేవుణ్ణి స్మరించి ఆ పితృదేవుని అనుగ్రహంతో అధిక బల సంపన్నుడై విజృంభించిన భీమసేనుణ్ణి ఈ సందర్భంలో వాతసుతు డని సంబోధించటం, బలహీనుడై ఆ భీమసేనునిచేత చిక్కిన జరాసంధుణ్ణి గడ్డిపరకతో పోల్చటం ఎంతో ఉచితంగా, మనోహరంగా ఉండటమేగాక, భీమసేను డా జరాసంధుణ్ణి పట్టి, ఎత్తి, త్రిప్పికొట్టిన తీరుకూడ పాఠకుని కంటికి కట్టినట్లుంది. (భీముడు మల్లయుద్ధాల్లో శత్రువుల్ని ఈవిధంగా చంపటం సాధారణంగా కనపడుతుంది. హిడింబాసురుణ్ణీ, బకాసురుణ్ణీకూడా ఈ విధంగానే తుదముట్టించాడు. - సంపా.)

వ. మఱియును. 211

తాత్పర్యం: అంతేకాక.

క. వెఱచఱవఁ బట్టికొని వడిఁ। జఱచి జరాసంధుసంధిసంధుల యెమ్ముల్
విఱిచి వధియించి యార్చెను। వఱలఁగ భీముండు భువనవలయం బద్రువన్. 212

ప్రతిపదార్థం: భీముండు; వెఱచఱవన్= భయపడేటట్లుగా; పట్టికొని; వడిన్= తీవ్రంగా; చఱచి= అరచేత కొట్టి; జరాసంధు= జరాసంధునియొక్క; సంధి, సంధుల, ఎమ్ముల్= కీళ్ళకలయికల్లోని ఎముకలు; విఱిచి; వధియించి= చంపి; భువన, వలయంబు= భూమండలమంతా; అద్రువన్= అదరేటట్లు; వఱలఁగన్= వ్యాపించేటట్లు; ఆర్చెను= అరచాడు.

తాత్పర్యం: భీమసేనుడు భయంకరంగా జరాసంధుణ్ణి పట్టుకొని, తీవ్రంగా అరచేత కొట్టి, అతని కీళ్ళ కలయికల్లో ఉండే ఎముకలను విరిచి, అతణ్ణి వధించి భూమండలమంతా దద్దరిల్లేటట్లు పెద్దగా అరచాడు.

విశేషం: భీముడు మల్లయుద్ధంలో శత్రువును చివరకు క్రిందపడవేస్తాడు. వెన్నెముక విరుస్తాడు. కీళ్ళ ఎముకలూ విరుస్తాడు. కుప్పగూలిన అతణ్ణి చంపేస్తాడు. హిడింబాసురాదులను కూడ అలాగే తుదముట్టించాడు. ఇది భీముని పద్ధతి (సంపా.)

చ. అవనితలంబు వ్రస్సెనొ, హిమాచలశృంగము వ్రయ్యలయ్యెనో,
శ్రవణ విదారణం బయిన శబ్దము దా నిది యేమి యొక్కొ భై
రవమయి విన్చె నంచును బురంబునవారు భయంబు వొంది; రం
దువిదలగర్భముల్ గలఁగె; నుక్కడఁగెన్ మగధేశు సైన్యముల్. **213**

ప్రతిపదార్థం: అవని, తలంబు= భూమండలం; వ్రస్సెనొ= బ్రద్దలయ్యెనో; హిమ+అచల, శృంగము= హిమాలయ పర్వతశిఖరం; వ్రయ్యలు+అయ్యెనో= ముక్కలయిందో; శ్రవణ, విదారణంబు+అయిన= చెవులను బ్రద్దలు చేసేటటువంటిదైన; శబ్దము= ధ్వని; తాన్+ఇది; ఏమి+ఒక్కొ= ఏదోకదా!; భైరవము+అయి= భయంకరమై; వినిచెన్(విన్చెన్)= వినవచ్చింది; అంచును; పురంబునవారు= పురజనులందరు; భయంబు, పొందిరి; అందున్; ఉవిదల, గర్భముల్= స్త్రీలయొక్క కడుపులోని పిండాలు; కలఁగెన్= కలతచెందాయి; మగధ+ఈశు, సైన్యముల్= మగధరాజైన జరాసంధుని సేనలు; ఉక్కు+అడఁగెన్= బలహీనా లయ్యాయి.

తాత్పర్యం: 'భూమండలం బ్రద్దలయిందా! లేక హిమాచలశృంగం ముక్కలైందా! చెవులను బ్రద్దలు చేసే ఈ శబ్దం ఏమిటిది? భయంకరంగా వినవస్తున్నదే!' అని పురప్రజలందరు భీతి చెందారు. స్త్రీల గర్భాలు కలత పొందాయి. జరాసంధునిసేనలు బలహీనా లయ్యాయి.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. విజయోత్సాహంతో భీముడు అరచిన అరుపు ఎంత భయంకరమో, అతడిక్రోధవిజృంభణం ఎంత తీవ్రమో ఈపద్యం తెలియచేస్తుంది. (జరాసంధునికథ ఒక భయంకరమైన ఏడ్పుతో మొదలై భీముని దారుణమైన అరుపుతో ముగుస్తుంది. రోదిస్తూ పుట్టి రాజలోకాన్ని రోదింపచేసి, చివరకు దీనుడై ప్రాణాలు వదిలాడు - జరాసంధుడు. - సంపా.)

వ. ఇట్లు భీమసేనుండు జరాసంధుఁ జంపి వాని వధియించుట జగద్విదితంబుగాఁ దదీయ గృహద్వార తోరణ సమీపంబునం దత్కళేబరంబు వైచిన నది సర్వజన భయంకరంబయి యుండె; నంత నాదిత్యోదయంబున. **214**

ప్రతిపదార్థం: ఇట్లు; భీమసేనుండు; జరాసంధున్; చంపి; వాని, వధింయించుట= వానిని చంపటం; జగత్+విదితంబు, కాన్= ప్రపంచమంతటికి తెలిసేటట్లుగా; తదీయ, గృహ, ద్వార, తోరణ, సమీపంబునన్= ఆతనియొక్క ఇంటివాకిటితోరణం దగ్గర; తత్+కళేబరంబు= ఆతని శవాన్ని; వైచినన్= పడవేయగా; అది; సర్వ, జన, భయంకరంబు+అయి= అందరు ప్రజలకు భయాన్ని కలిగించేదై; ఉండెన్; అంతన్= తరువాత; ఆదిత్య+ఉదయంబునన్= సూర్యుడు ఉదయించిన సమయాన.

తాత్పర్యం: ఈ విధంగా భీమసేనుడు జరాసంధుణ్ణి సంహరించి, అతని చావు లోకానికంతా తెలిసేటట్లు అతని మృతదేహాన్ని అతని భవనద్వారతోరణం దగ్గర పడవేశాడు. అది ప్రజలందరికి భయంకరమై అగుపించింది. తర్వాత సూర్యోదయం కాగానే.

విశేషం: భీముడు పూర్వం బకాసురుని కళేబరాన్నికూడ ఏకచక్రపురం ద్వారంవద్ద పడవేశాడు. ప్రజలందరిముందు తన బలప్రదర్శన చేసే ఉద్ధతుని లక్షణం. రాక్షసబాధ తీరిపోయిం దని ప్రజలు తెలిసికొనవలెననే ప్రభుత్వలక్షణం - ఇందులో ధ్వని. (సంపా.)

జరాసంధుని కుమారుడైన సహదేవు నభిషిక్తుఁ గావించి శ్రీకృష్ణుఁడు భీమార్జునులతో నింద్రప్రస్థమున కరుగుట (సం. 2-22-40)

సీ. **గరుడధ్వజుం డప్డు కరుణాసమేతుఁడై । యమ్మాగధుల కెల్ల నభయ మిచ్చి,**
మొగి జరాసంధుచే నిగృహీతులయి యున్న । పృథివీపతుల విడిపించి చెఱలు,
మోక్షితు లైన సర్వక్షత్త్రియులచేత । సంశుద్ధరత్న పుంజములఁజేసి
పూజితుండయి, తన తేజంబు వెలుఁగంగ । సహదేవు నజ్జరాసంధతనయు

ఆ. **నోడ కుండు మని తదున్నత రాజ్యంబు । నందు నిలిపి, హృదయహారి వివిధ**
రత్నరాజి సుందరంబైన మగధేశు । రథముఁ దేరఁ బనిచె రమణతోడ. **215**

ప్రతిపదార్థం: గరుడ ధ్వజుండు= గరుత్మంతుడు జెండాగా కలవాడు - శ్రీకృష్ణుడు; అప్డు; కరుణా, సమేతుఁడు+ఐ= దయతో కూడుకొన్నవాడై; ఆ+మాగధులకున్+ఎల్లన్= ఆ మగధ దేశవాసులందరికి; అభయము+ఇచ్చి= భయంవద్దని మాట ఇచ్చి; మొగి= పూర్వం; జరాసంధునిచే నిగృహీతులు+అయి= బాధింపబడినవాళ్ళయి; ఉన్న; పృథివీ, పతుల= రాజులయొక్క; చెఱలు; విడిపించి; మోక్షితులు+ఐన= విడిపించబడిన వారైన; సర్వక్షత్త్రియులచేతన్= అందరు రాజులచేత; సంశుద్ధరత్న, పుంజములన్, చేసి= స్వచ్ఛములైన రత్న సమూహాలతో; పూజితుండు+అయి= పూజించబడినవాడై; తన, తేజంబు= తనప్రభావం (కాంతి); వెలుగంగన్; ఆ+జరాసంధ, తనయున్= ఆ జరాసంధుని కుమారుణ్ణి; సహదేవున్; ఓడక+ఉండుము+అని= భయపడకుండ ఉండుమని; తత్+ఉన్నత, రాజ్యంబు+అందున్= ఆగొప్ప మగధరాజ్యంలో; నిలిపి= ఉంచి; అంటే మగధరాజ్యానికి పట్టాభిషిక్తుణ్ణి చేసి; హృదయహారి= మనోహరమైనది; వివిధ, రత్న, రాజి, సుందరంబు+అయిన= అనేకవిధాలైన రత్న సమూహంచేత అందమైన; మగధ+ఈశు, రథమున్= మగధరాజుయొక్క రథాన్ని; రమణతోడన్= ప్రీతితో; తేరన్= తెచ్చుటకు; పనిచెన్= ఆజ్ఞాపించాడు.

తాత్పర్యం: గరుడధ్వజుడైన శ్రీకృష్ణుడు దయామయుడై మగధప్రజలందరికి అభయమిచ్చాడు. ఇదివరకు జరాసంధునిచేత బంధితులైన రాజులందరిని విడిపించాడు. ఆ రాజులంతా అర్పించిన స్వచ్ఛ రత్నసమూహాలతో పూజలందుకొన్నాడు. తన ప్రభావం ప్రకాశించగా జరాసంధసుతుడైన సహదేవునికి ధైర్యం చెప్పాడు. అతణ్ణి మగధరాజ్యానికి రాజుగా చేశాడు. మనోహరంగా వివిధరత్నకాంతులతో అందంగా ఉన్న జరాసంధుని రథాన్ని ప్రీతితో తెప్పించాడు.

వ. **'తొల్లి తారకాసుర సంగ్రామంబున నింద్రారూఢంబయిన దాని నింద్రువలన వసువను రాజు వడసె, వానివలన బృహద్రథుండు వడసె' నని తద్దివ్యరథప్రభావంబు సెప్పుచు భీమార్జున సమేతుండయి యా రథం బెక్కి చక్రధరుం డఖిలరాజచక్రంబుతో నింద్రప్రస్థగమనోన్ముఖుండై గరుడనిం దలంచుడుఁ దత్‌క్షణంబ.** **216**

ప్రతిపదార్థం: తొల్లి= పూర్వం; తారక+అసుర, సంగ్రామంబునన్= తారకుడనే రాక్షసునితో జరిపిన యుద్ధంలో; ఇంద్ర+ ఆరూఢంబు+అయిన, దానిన్= ఇంద్రునిచే ఎక్కబడినదానిని-అంటే ఇంద్రుడు ఎక్కిన దానిని; ఇంద్రువలన; వసువు+అను, రాజు; పడసెన్= పొందాడు; వాని వలనన్= ఆ వసుమహారాజువల్ల; బృహద్రథుండు= జరాసంధుని తండ్రి అయిన బృహద్రథుడు; పడసెన్= పొందాడు; అని; తత్+దివ్య, రథ, ప్రభావంబు= ఆ దేవతా సంబంధమైన రథంయొక్క గొప్పతనాన్ని; చెప్పుచున్; భీమ+అర్జున, సమేతుండు+అయి= భీమార్జునులతో కూడుకొన్నవాడై; చక్రధరుండు= చక్రాయుధాన్ని ధరించినవాడు -

శ్రీకృష్ణుడు; ఆ, రథంబు+ఎక్కి; అఖిల, రాజ, చక్రంబులతోన్= సకల రాజ సమూహంతో; ఇంద్రప్రస్థ, గమన+ఉన్ముఖుండు+ఐ= ఇంద్రప్రస్థపురం వెళ్ళటానికి పూనుకొన్నవాడై; గరుడనిన్= గరుత్మంతుణ్ణి; తలంచుడున్= తలచుకోగానే; తత్+క్షణంబు+అ= ఆ క్షణమందే.

తాత్పర్యం: 'పూర్వం తారకాసురునితో యుద్ధం చేసేటప్పుడు ఇంద్రుడు ఈ రథం ఎక్కాడు. తరువాత ఇంద్రునినుండి ఈ రథాన్ని వసుమహారాజు పొందాడు. అతడినుండి జరాసంధుని తండ్రి బృహద్రథుడు దీనిని గ్రహించాడు' - అని చక్రధరుడైన శ్రీకృష్ణుడు ఆ దివ్యరథవృత్తాంతాన్ని చెపుతూ, భీమార్జునులతో కలిసి ఆ రథ మెక్కి, సకల రాజ సమూహంతో ఇంద్రప్రస్థపురానికి వెళ్ళాలని గరుత్మంతుని మనసులో తలచుకోగానే తత్క్షణం.

విశేషం: తారకాసురుడు - రాక్షసుడు, వజ్రాంగుని కుమారుడు - బ్రహ్మనుగూర్చి మహోగ్రతపం చేసి తనతో సమానమైన బలవంతుడు లోకాల్లో లేకుండ వరంపొంది, లోకాల్ని బాధించాడు. చివరకు కుమారస్వామిచేత మరణించాడు.

క. అనలప్రభాభిశోభిత । ఘనతర తనుదీప్తు లొప్పఁగా వచ్చి వడిన్
వినతాతనయుఁడు వినయా । వనతోరుశిరస్కుఁ డయ్యె వనజాక్షునకున్. 217

ప్రతిపదార్థం: వినతా, తనయుఁడు= వినతయొక్క కుమారుడైన గరుత్మంతుడు; అనల, ప్రభా+అభిశోభిత, ఘనతర, తను, దీప్తులు= అగ్నిదేవుడియొక్క కాంతివంటి కాంతితో ప్రకాశించే గొప్ప శరీరకాంతులు; ఒప్పన్= ఒప్పుతుండగా; వడిన్= వేగమే; వచ్చి; వనజ+అక్షునకున్= పద్మాలవంటి కన్నులు గల శ్రీకృష్ణునికి; వినయ+అవనత+ఉరు, శిరస్కుఁడు+అయ్యెన్= వినయంచేత వంగిన గొప్ప శిరస్సు కలవా డయ్యాడు - అంటే వినయంతో శిరస్సు వంచి నిలబడ్డాడు.

తాత్పర్యం: వినతాసుతు డైన గరుత్మంతుడు అగ్నిలా ప్రకాశించే దేహకాంతులతో వేగంగా వచ్చి శ్రీకృష్ణుని ఎదుట వినయంతో శిరస్సు వంచి నిలబడ్డాడు.

వ. ఇట్లు వచ్చిన వైనతేయు నతిప్రీతిం దద్దివ్యరథసారథ్యంబునందు నియోగించి, మనోవాయు వేగంబునం గృష్ణ భీమ విజయు లింద్రప్రస్థపురంబు ప్రవేశించి రంత. 218

ప్రతిపదార్థం: ఇట్లు; వచ్చిన; వైనతేయున్= వినతాసుతుడైన గరుత్మంతుణ్ణి; అతి, ప్రీతిన్= మిక్కిలి ప్రేమతో; తత్+దివ్య, రథ, సారథ్యంబునందున్= ఆ దివ్యరథాన్ని నడపటంలో; నియోగించి= నియమించి; మనః, వాయు, వేగంబునన్= మనస్సు, గాలి వెళ్ళేటంత వేగంతో; కృష్ణ, భీమ, విజయులు= కృష్ణుడు, భీముడు, అర్జునుడు; ఇంద్రప్రస్థ పురంబు; ప్రవేశించిరి; అంత.

తాత్పర్యం: ఈ విధంగా వచ్చిన గరుత్మంతుణ్ణి అతి ప్రీతితో ఆ దివ్యరథానికి సారథిగా నియమించి, మనోవేగ, వాయువేగాలతో శ్రీకృష్ణభీమార్జునులు ఇంద్రప్రస్థపురంలో ప్రవేశించారు. అంత.

మ. 'జనసంత్రాసకరున్ మహోద్ధతు జరాసంధున్ హరిప్రేరణం
బున భంజించెఁ బ్రభంజనాత్మజుఁడు; భూభుగ్వీరులం దన్నిరో
ధన నిర్ముక్తులఁ జేసె; నింకఁ జతురంతక్షోణికిన్ ధర్మనం
దను సామ్రాజ్యము పూజ్యమయ్యె' నని మోదం బంది రుర్వీజనుల్. 219

ప్రతిపదార్థం: ప్రభంజన+ఆత్మజుఁడు= వాయుపుత్రుడైన భీముడు; హరి, ప్రేరణంబునన్= శ్రీకృష్ణునియొక్క ప్రేరణచేత; జన, సంత్రాసకరున్= ప్రజలకు మిక్కిలి భయం కలిగించేవాణ్ణి; మహా+ఉద్ధతున్= ఎంతో గర్వించినవాడిని; జరాసంధున్, భంజించెన్= చంపాడు; భూ, భుక్+వీరులన్= భూమిని అనుభవించే వీరులను - అంటే రాజులను; తత్+నిరోధన, నిర్ముక్తులన్= అతని చెరనుండి విముక్తిపొందిన వారినిగా; చేసెన్; ఇంకన్; చతుః, అంత, క్షోణికిన్= నాలుగు సముద్రాలు మేరలుగా గల భూమికి; ధర్మనందను, సామ్రాజ్యము= ధర్మరాజుయొక్క సామ్రాజ్యాధికారం; పూజ్యము+అయ్యెన్+అని= పూజించతగింది అయిందని; ఉర్వీ, జనుల్= భూమిమీద ప్రజలంతా; మోదంబు+అందిరి= సంతోషాన్ని పొందారు.

తాత్పర్యం: 'శ్రీకృష్ణుని ప్రేరణతో భీమసేనుడు లోకభయంకరుడు, మహాగర్వితుడు అయిన జరాసంధుణ్ణి వధించాడు. అతడు బంధించిన రాజుల నందరిని విడిపించాడు. ఇక నాలుగు సముద్రాలు హద్దులుగా గల ఈ భూమి కంతటికి ధర్మరాజు సామ్రాజ్యాధికారం పూజించదగింది అయింది' అని ప్రజలంతా మహానందభరితులయ్యారు.

విశేషం: ధర్మరాజు సామ్రాజ్యం పూజ్యం కావటానికి హేతువులు ఇందులో సమాలోచించబడ్డాయి. దానివలన వస్తుస్వభావం స్పష్టంగా వ్యక్తమౌతున్నది. ప్రజల సంతోషం ప్రతిఫలించే ఈ రచనలో అర్థవ్యక్తి అనే శబ్దగుణం రాణించింది. కథాప్రసన్నతకు ఈ గుణం ఎంతో తోడ్పడుతున్నది. (సంపా.)

క. 'ఆయుధనిహతుఁడు గాని య । జేయు జరాసంధు భీమసేనుఁడు విజయ
శ్రీ యెసఁగ నోర్చెఁగా క । త్యాయత భుజశక్తి నొరుల కలవియె?' యంచున్. 220

ప్రతిపదార్థం: భీమసేనుడు; ఆయుధ, నిహతుఁడు, కాని= ఆయుధాలతో చావనటువంటి; అజేయున్= జయించసాధ్యం కానివాణ్ణి; జరాసంధున్; అతి+ఆయత, భుజ, శక్తిన్= మిక్కిలి ఎక్కువైన భుజబలంతో; విజయశ్రీ= విజయలక్ష్మి; ఎసఁగన్= ప్రకాశించేటట్లు; ఓర్చెన్, కాక= ఓడించాడుగాని; (ఇది); ఒరులకున్= ఇతరులకు; అలవి+ఎ= చేతనవుతుందా?; అంచున్= అని అంటూ.

తాత్పర్యం: 'ఆయుధాలచేత చావులేనివాడు, జయించ సాధ్యంకానివాడు అయిన జరాసంధుణ్ణి భీమసేనుడు గొప్ప భుజబలంతో విజయలక్ష్మి వెలిగేలా వధించాడు. ఇది ఇతరులకు సాధ్యమా!' అని.

విశేషం: జరాసంధవధానంతరం ఆ కార్యసాధనలోని కీలకమైన అంశం ప్రజలచేత పరామర్శించబడుతున్నది (చర్వణం చేయబడుతున్నది). ఆయుధాలతో చావని అద్భుతవీరుడు జరాసంధుడు. అతడిని బాహువులతో చంపాడు భీముడు. గాండీవ చక్రధారులుకూడ చేయలేని పనిని తన భుజబలంతో సాధించిన భీముడి యుద్ధవీరం ఇతరులకు అసాధ్యం. అందుచేత అద్భుతం. కథలోని కీలకాంశాన్ని కీర్తించి తాను నిర్వహించిన కథారసార్థసంయోజన శిల్పాన్ని పఠితకు మననం చేయిస్తున్నా డిక్కడ నన్నయ. ఇది కథానిర్వహణ శిల్పంలో కమనీయమైన అంశం. (సంపా.)

క. పురజను లాశ్చర్యంబునఁ । గర మనురాగమునఁ బరమ కౌతుకమునఁ జూ
చిరి బోరన వచ్చి వృకో । దర దామోదర సురేంద్రతనయులఁ బ్రీతిన్. 221

ప్రతిపదార్థం: పురజనులు= ఇంద్రప్రస్థపుర ప్రజలు; ఆశ్చర్యంబునన్= ఆశ్చర్యంతో; కరము= మిక్కిలి; అనురాగమునన్= ప్రేమతో, పరమ, కౌతుకమునన్= ఎంతో ఎక్కువైన ఆసక్తితో; బోరన, వచ్చి= వేగంగా వచ్చి; వృకోదర, దామోదర, సుర+ఇంద్ర, తనయులన్= భీమసేనుణ్ణి, శ్రీకృష్ణుణ్ణి, దేవేంద్రపుత్రుడైన అర్జునుణ్ణి; ప్రీతిన్; చూచిరి.

తాత్పర్యం: ఇంద్రప్రస్థపురప్రజలంతా ఆశ్చర్యంతో, ఎంతో ప్రేమతో, ఎక్కువ ఆసక్తితో ఒక్కుమ్మడిగా వచ్చి భీమసేన శ్రీకృష్ణార్జునులను ప్రియమార చూచారు.

విశేషం: వృకోదరుడు - వృకంతో అంటే తోడేలుతో సమానమైన మిక్కిలి ఆకలి గల ఉదరం కలవాడు - భీముడు. దామోదరుడు - తులసి మాల ఉదరంపై కలవాడు - శ్రీ మహావిష్ణువు - శ్రీకృష్ణుడు. (వీరంనుండి అద్భుతం పుడుతుందని లాక్షణికు లంటారు. భీముని యుద్ధవీర స్మరణంవలన పురజనులలో ఆశ్చర్యం కలిగినట్లు వర్ణించటం కథాకథనంలోని రసశిల్పం. - సంపా.)

వ. కృష్ణభీమ విజయు లిట్లు విజయ విభాసితులయి వచ్చి ధర్మరాజునకు మ్రొక్కి జరాసంధు బంధనంబువలనం దమచేత మోక్షితులైన మహీపతుల నెల్లం జూపిన. 222

ప్రతిపదార్థం: కృష్ణ, భీమ, విజయులు+ఇట్లు; విజయ, విభాసితులు+అయి= విజయంచేత ప్రకాశించే వాళ్ళయి; వచ్చి; ధర్మరాజునకున్; మ్రొక్కి; జరాసంధు, బంధనంబు వలనన్= జరాసంధునియొక్క చెరనుండి; తమచేతన్; మోక్షితులు+ఐన= విడిపించబడిన; మహీపతులన్+ఎల్లన్= రాజులందరిని; చూపిన.

తాత్పర్యం: శ్రీకృష్ణ భీమార్జునులు ఈ విధంగా విజయకాంతితో వెలుగుతూ వచ్చి ధర్మరాజుకు మ్రొక్కి, జరాసంధుని చెరనుండి తాము విడిపించిన రాజులందరిని చూపించగా.

క. సవినయ నతోత్తమాంగుల । నవనీశుల నందఱను యథార్హప్రియగౌ
రవమునఁ బూజించి కురు । ప్రవరుఁడు తద్దేశములకుఁ బరువడిఁ బంచెన్. 223

ప్రతిపదార్థం: కురు, ప్రవరుఁడు= కురువంశశ్రేష్ఠుడైన ధర్మరాజు; సవినయనత+ఉత్తమ+అంగులన్= వినయంతో వంచిన శిరస్సులు కలవాళ్ళను; అవనీ+ఈశులన్= రాజులను; అందఱను; యథా+అర్హ, ప్రియ, గౌరవమునన్= ఎవరెవరికి తగిన రీతిగా వాళ్ళను ప్రేమతో, గౌరవంతో; పూజించి; తత్+దేశములకున్= ఆ దేశాలకు అంటే వారి వారి దేశాలకు; పరువడిన్= క్రమంగా; పంచెన్= పంపాడు.

తాత్పర్యం: కురువంశ శ్రేష్ఠుడైన ధర్మరాజు, తనకు వినయంతో శిరస్సు వంచి నమస్కరించిన ఆ రాజులందరిని, ఎవరికి తగినట్లు వాళ్ళను ప్రేమతో, గౌరవంతో పూజించి, వారి వారి దేశాలకు క్రమంగా సాగనంపాడు.

విశేషం: శ్రీకృష్ణుడు జరిపించిన జరాసంధవధచేత ధర్మజుని భావి సార్వభౌమాధికారానికి పెద్ద అడ్డు తొలగింది. జరాసంధ బంధవిముక్తులైన రాజులంతా ధర్మజుని ఆధిపత్యాన్ని కృతజ్ఞతాపూర్వకంగా అంగీకరించటం జరిగింది. 'ఏక క్రియా ద్వ్యర్థకరీ'- ఒక పనితో రెండు ప్రయోజనాలు సాధించటం అంటే ఇటువంటిదే. ఆ జగన్నాటకసూత్రధారి శ్రీకృష్ణుని రాజనీతి అమోఘం; బహుళార్థసాధకం.

కృష్ణుఁడు ద్వారకానగరమున కరుగుట (సం. 1-22-53)

వ. నారాయణుండును ధర్మరాజు వీడ్కొని తద్దివ్యరథారూఢుండయి ద్వారవతీపురంబున కరిగె, నంత నిక్కడ. 224

ప్రతిపదార్థం: నారాయణుండును= శ్రీకృష్ణుడుకూడ; ధర్మరాజున్, వీడ్కొని= ధర్మరాజు దగ్గర సెలవు తీసికొని; తత్+దివ్య, రథ+ఆరూఢుండు+అయి= ఆ దివ్యరథాన్ని ఎక్కినవాడై; ద్వారవతీ, పురంబునకున్= ద్వారకానగరానికి; అరిగెన్= వెళ్ళాడు; అంతన్= తర్వాత; ఇక్కడ= ఇంద్రప్రస్థంలో.

తాత్పర్యం: శ్రీకృష్ణుడుకూడ ధర్మజుని దగ్గర సెలవు తీసికొని ఆ దివ్యరథాన్ని ఎక్కి ద్వారకానగరానికి వెళ్ళాడు. తరువాత ఇంద్రప్రస్థంలో.

చ. భరతకులైక భూషణుఁడు భాసురతేజుఁడు ధర్మనందనుం
డురు భుజ విక్రమంబున జయోన్నతిఁ బోల్పఁగ వీరు లోకపా
లురయని భీముఁ బార్థు నకులున్ సహదేవునిఁ బంచెఁ దూర్పు ను
త్తరమును బశ్చిమంబు మఱి దక్షిణమున్ వరుసన్ జయింపఁగన్. **225**

ప్రతిపదార్థం: భరత, కుల+ఏక, భూషణుఁడు= భరత వంశానికంతటికి ముఖ్యమైన అలంకారమైన వాడు; భాసురతేజుఁడు= ప్రకాశిస్తున్న పరాక్రమం కలవాడు; (అయిన) ధర్మనందనుఁడు; ఉరు, భుజ, విక్రమంబునన్= గొప్పదైనభుజబలంలో; జయ+ఉన్నతిన్= విజయాన్ని సాధించే గొప్పతనంలో; పోల్పఁగన్= పోల్చి చూస్తే; వీరు; లోకపాలురు+అ, అని= దిక్పాలకుల వంటి వారే అని; భీమున్; పార్థున్; నకులున్; సహదేవునిన్; వరుసన్= వరుసగా; తూర్పున్, ఉత్తరమును; పశ్చిమంబున్; మఱి; దక్షిణమున్; జయింపఁగన్; పంచెన్= పంపాడు.

తాత్పర్యం: భరత వంశానికి అంతటికి అలంకారమైన వాడు, ప్రకాశించే పరాక్రమం కలవాడు అయిన ధర్మరాజు - గొప్ప భుజబలంలో, విజయాన్ని సాధించే గొప్పతనంలో తన తమ్ముళ్ళు దిక్పాలకులతో పోల్చదగిన వారని తలచి, భీమార్జున నకుల సహదేవుల్ని వరుసగా తూర్పు, ఉత్తరం, పశ్చిమం, దక్షిణం అనే దిక్కుల్ని జయించటానికి పంపించాడు.

విశేషం: అలం: క్రమం. ఓజోగుణవిశిష్టమైన ప్రసాదం వీరరసోన్నిద్రంగా ఈ రచనలో పోషించబడింది. ధర్మరాజును వర్ణించేటప్పుడు నన్నయ ఇటువంటిరచననే సాధారణంగా వాడతాడు. (సంపా.)

వ. ఇట్లు పంచిన నలువురు నపార చతురంగ బలసమేతులై నాలుగు సముద్రంబులపై నడచు నపూర్వ సముద్రంబులుం బోలె నాలుగు దిక్కులపై నడచి రనిన విని జనమేజయుండు వైశంపాయనున కి ట్లనియె. **226**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; పంచినన్= పంపగా; నలువురున్, అపార, చతురంగ, బల, సమేతులు+ఐ= మితిమీరిన రథ గజ తురగ పదాతి బలాలతో కూడుకొన్న వాళ్ళయి; నాలుగు, సముద్రంబులపై; నడచు; అపూర్వ, సముద్రంబులున్+పోలెన్= ఆశ్చర్యకరాలైన సముద్రాలవలె; నాలుగు దిక్కులపై; నడచిరి; అనినన్; విని; జనమేజయుండు; వైశంపాయనునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'ఈ విధంగా ధర్మరాజు పంపగా, భీమార్జున నకుల సహదేవులు నలువురు మితిమీరిన చతురంగ బలాలతో, నాలుగు సముద్రాలమీద నడచే అపూర్వాలైన మరి నాలుగు సముద్రాల్లా నాలుగు దిక్కులకు నడచా' రని వైశంపాయనుడు చెప్పగా జనమేజయుడు అతనితో ఇలా అన్నాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. సముద్రమే సువిశాలం, భయంకరం. ఒక సముద్రంమీద మరొక సముద్రం నడిస్తే ఎట్లా ఉంటుందో ఊహకు అందవలసిందే కాని మాటకు అందదు.

క. నరసుతు లయ్యె దిక్కుల । కరిగి మహీపతులచేత నరిగొని ధనముల్
దెరలఁగఁ దెచ్చిన మార్గముఁ । బరువడి నెఱిఁగింపు నాకుఁ బరమమునీంద్రా! 227

ప్రతిపదార్థం: పరమ ముని+ఇంద్రా!= మహామునిశ్రేష్ఠా! వైశంపాయనమహర్షీ!; నరసుతులు= రాజకుమారులైన భీమార్జున నకుల సహదేవులు; అయ్యె దిక్కులకున్= ఆయా దిశలకు; అరిగి= వెళ్ళి; మహీపతుల చేతన్= రాజులచేత; అరి= కప్పాన్ని; కొని= తీసుకొని; ధనముల్; తెరలఁగన్= పొంగునట్లుగా; తెచ్చిన; మార్గమున్= విధమును; నాకున్; పరువడిన్= క్రమంగా; ఎఱిగింపు= తెలియచెప్పుము.

తాత్పర్యం: వైశంపాయన మహామునీంద్రా! ఆ విధంగా భీమార్జున నకుల సహదేవులు నాలుగుదిక్కులకు వెళ్ళి రాజులచేత కప్పాలు తీసికొని అపార ధనాన్ని తెచ్చిన విధం నాకు చెప్పండి.

వ. అని యడిగిన జనమేజయునకు వైశంపాయనుం డి ట్లనియె. 228

తాత్పర్యం: అని అడుగగా వైశంపాయనుడు జనమేజయునితో ఈవిధంగా అన్నాడు.

అర్జునుం డుత్తరదిగ్విజయంబు సేయుట (సం. 2-23-7)

సీ. అగ్నిదత్తంబైన యద్దివ్యరథ మెక్కి । గాండీవధరుఁ డతిఘర్మసమయ
ఘర్మాంశుఁడును బోలెఁ గౌబేర దిగ్విజ । యార్థ ముగ్ర ప్రతాపాగ్ని వెలుఁగఁ
జని పుళిందావనీశ్వరు నోర్చి, ప్రతివింధ్యుఁ । డనువాని నోడించి, యశ్రమమున
మఱి యఖిల ద్వీప మండలేశుల నెల్ల । వశవిధేయులఁ జేసి, వారు దన్ను

ఆ. భక్తిఁ గొలిచి రాఁగఁ బ్రాగ్జ్యోతిషంబుపై । విడిసెఁ; దత్పురమున విభుఁ డనంత
బలముతోడఁ బన్ని భగదత్తుఁ డేతెంచి । విజయుఁ దాఁకె సమరవిజయకాంక్ష. 229

ప్రతిపదార్థం: గాండీవ, ధరుఁడు= గాండీవాన్ని ధరించినవాడు - అర్జునుడు; అగ్ని, దత్తంబు+ఐన= (ఖాండవదహనఘట్టంలో) అగ్నిదేవునిచేత ఇవ్వబడిన; ఆ+దివ్య, రథము+ఎక్కి= ఆ దేవతాసంబంధమైన రథాన్ని ఎక్కి; అతి, ఘర్మ, సమయ, ఘర్మ+ అంశుఁడును+పోలెన్= మండువేసవిలోవేడి కిరణాలు గల సూర్యునివలె; కౌబేర, దిక్+విజయ+అర్థము= కుబేరసంబంధమైన దిక్కును జయించటంకొరకు - అంటే ఉత్తర దిగ్విజయ యాత్రకొరకు; ఉగ్ర, ప్రతాప+అగ్ని= భయంకరమైన పరాక్రమ మనే అగ్ని; వెలుఁగన్= ప్రకాశిస్తుండగా; చని= వెళ్ళి; పుళింద+అవనీ+ఈశ్వరున్= పుళిందదేశపురాజును; ఓర్చి= ఓడించి; ప్రతివింధ్యుఁడు; అనువానిన్; ఓడించి; అశ్రమమునన్= సులువుగా; మఱి= ఇంకా; అఖిల, ద్వీప, మండల+ఈశులన్= సమస్తద్వీపమండలాల రాజులను; ఎల్లన్= అందరిని; వశ, విధేయులన్+చేసి= లొంగి తనకు తలవంచిన వాళ్ళుగా చేసి; వారు; తన్నున్= తనను; భక్తిన్= భక్తితో; కొలిచి= సేవించి; రాగన్= వెంట రాగా; ప్రాక్, జ్యోతిషంబుపై= ప్రాగ్జ్యోతిషం అనే పట్టణంమీద; విడిసెన్= దండెత్తాడు; తత్+పురమునన్= ఆ పట్టణంలో; విభుఁడు= రాజు; భగదత్తుఁడు; అనంత, బలముతోడన్= అంతులేని సైన్యంతో; పన్ని= యుద్ధానికి సిద్ధపడి; ఏతెంచి= వచ్చి; విజయున్= అర్జునుణ్ణి; సమర, విజయ, కాంక్షన్= యుద్ధంలో గెలవాలనే కోరికతో; తాఁకెన్= ఎదుర్కొన్నాడు.

తాత్పర్యం: గాండీవాన్ని ధరించిన అర్జునుడు అగ్నిదేవు డిచ్చిన దివ్యరథమెక్కి మండు వేసవిలో వెలిగే చండకిరణుడైన సూర్యునివలె భయంకరమైన పరాక్రమాగ్ని ప్రజ్వరిల్లేటట్లు ఉత్తర దిగ్విజయ యాత్రకు బయలుదేరి పుళిందరాజును ఓడించాడు. ప్రతివింధ్యుణ్ణి జయించాడు. అంతేకాక, అఖిల ద్వీపాల మండలేశ్వరులను అతిసులభంగా వశవర్తులను చేసుకొన్నాడు. వాళ్ళందరు తనను భక్తితో కొలిచి వెంటరాగా ప్రాగ్జ్యోతిషంపై దండెత్తాడు. ఆ దేశపురాజు భగదత్తుడు అపారసైన్యంతో దండెత్తివచ్చి అర్జునుణ్ణి గెలవాలన్న కాంక్షతో అతణ్ణి ఎదుర్కొన్నాడు.

విశేషం: అలం: ఉపమ. గాండీవధరుడు - విజయుడు అనే సంబోధనలు రెండూ ఈ సందర్భంలో సార్థకాలే.

వ. ఇట్లు శబర సాగరానూపవాసులైన యోధవీరులతోఁ బన్ని భగదత్తుండు పార్థుతో నెనిమిది దివసంబులు మహాయుద్ధంబు సేసి తదీయ బాణభగ్న బలుండై పార్థున కి ట్లనియె. 230

ప్రతిపదార్థం: ఇట్లు; భగదత్తుండు; శబర, సాగర+అనూపవాసులు+ఐన= శబరులు, సముద్రతీరవాసులు అయిన; యోధవీరులతోన్= వీరులైన యోధులతో; పన్ని= దండెత్తి; పార్థుతోన్= అర్జునునితో; ఎనిమిది, దివసంబులు= ఎనిమిదిరోజులు; మహాయుద్ధంబు; చేసి; తదీయ, బాణ, భగ్న, బలుండు+ఐ= అతనియొక్క బాణాలచేత కోల్పోయిన (భంజింపబడిన) బలం కలవాడై; పార్థునకున్+ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: భగదత్తుడు, శబరులు, సాగర తీరవాసులు అయిన యుద్ధవీరులతో కలిసి దండెత్తి, అర్జునునితో ఎనిమిది రోజులు పెద్ద యుద్ధం చేశాడు. అతని బాణాలచేత బలం కోల్పోయి ఇలా అన్నాడు.

విశేషం: 'అనూప' మంటే జలసమృద్ధి గల నేల. సాగరానూపం అంటే సముద్ర జలవ్యాప్తి గల ప్రదేశం. సాగరానూపవాసులు- సముద్ర తీరవాసులు. శబరులు - ఆటవికులు - అడవులలో నివసించేజాతి వారు. ఇక్కడ 'ఇట్లు సాగరోపవన వాసులైన యాభీర శబర వీర గణంబుతో' అని కూడ ఒక పాఠాంతరం ఉంది.

క. ఏ నింద్ర సఖుఁడ; నీవును । భూనాథ! సురాధినాథ పుత్త్రుండవు; నీ
తో నని సేయుట యుచితమె? । యే నోడితిఁ జెప్పు మెద్ది యిష్టము నీకున్. 231

ప్రతిపదార్థం: భూనాథ!= ఓరాజా!; ఏన్= నేను; ఇంద్ర, సఖుఁడన్= దేవేంద్రుడియొక్క స్నేహితుణ్ణి; ఈవును; సుర+అధినాథ, పుత్త్రుండవు= దేవతలకు రాజైన దేవేంద్రునియొక్క కుమారుడివి; నీతోన్; అని= యుద్ధం; చేయుట; ఉచితము+ఎ= తగునా?; ఏన్= నేను; ఓడితిన్= ఓడిపోయాను; నీకున్; ఎద్ది= ఏది; ఇష్టము; చెప్పుము.

తాత్పర్యం: అర్జునా! నేను ఇంద్రునికి స్నేహితుణ్ణి. నీవు ఇంద్రునికి పుత్రుడివి. నీతో యుద్ధం చేయటం ఉచితమా? నేను ఓడిపోయాను. నీ కేది ఇష్టమో చెప్పు.

వ. 'దానిన చేయుదు' ననిన విని భగదత్తునకుఁ బార్థుం డి ట్లనియె. 232

తాత్పర్యం: 'దానినే చేస్తా' - అని భగదత్తు డనగా అర్జునుడు ఇలా అన్నాడు.

క. కురువిభుఁడు రాజసూయా । ధ్వర మొనరింపం గడంగె; ధర్మజుఁడు నిరం
తరధర్మశీలుఁ; డాతని । కరి వెట్టుము; రమ్ము ప్రీతి నమ్మఖమునకున్. 233

ప్రతిపదార్థం: కురు విభుఁడు= కురువంశపురాజు; నిరంతర, ధర్మ, శీలుఁడు= ఎల్లప్పుడు ధర్మంతో కూడిన స్వభావం కలవాడు; ధర్మజుఁడు; రాజసూయ+అధ్వరము= రాజసూయం అనే యాగం; ఒనరింపన్= చేయటానికి; కడంగెన్= పూనుకొన్నాడు; అతనికిన్; అరి, పెట్టుము= కప్పాన్ని చెల్లించు; ప్రీతిన్= ప్రేమతో; ఆ+మఖమునకున్= ఆ యాగానికి; రమ్ము.

తాత్పర్యం: కురువంశప్రభువు, నిత్య ధర్మ శీలుడు అయిన ధర్మరాజు రాజసూయ మహాయాగం చెయ్యటానికి పూనుకొన్నాడు. ఆయనకు నీవు కప్పం చెల్లించు. ప్రీతితో ఆ యాగానికి రా.

వ. అని యా భగదత్తుచేత నపరిమిత ధనరాసులు గొని ధనదదిశాభిముఖుండయి ధనంజయుం డరిగి. 234

ప్రతిపదార్థం: అని; ఆ; భగదత్తు చేతన్, అపరిమిత= లెక్కకు మిక్కిలి అయిన; ధనరాసులు; కొని= తీసికొని; ధనద, దిశ+అభిముఖుండు+అయి= కుబేరుడి దిక్కైన ఉత్తరంవైపు తిరిగినవాడై; ధనంజయుండు= అర్జునుడు; అరిగి= వెళ్ళి.

తాత్పర్యం: అని ఆ భగదత్తునినుండి లెక్కకు మిక్కిలిగా ధనరాసులను తీసుకొని అర్జునుడు ఉత్తరదిశవైపు వెళ్ళి.

విశేషం: ధనదుడు - అంటే ధనం ఇచ్చేవాడు - కుబేరుడు. ఈయన ఉత్తర దిక్పాలుడు. అందుచేతనే ఉత్తర దిక్కుకు ధనదుదిశ అని పేరు. ఈసందర్భంలో అర్జునుణ్ణి ధనంజయుడని అనటం, ఆయన ఉత్తరదిశవైపు వెళ్ళా డని అనకుండ, ధనదు దిశవైపు వెళ్లా డనటం ఎంతో ఉచితంగా ఉంది. ధనదుదిశలోని రాజులను జయించి రాజసూయానికి అవసరమైన అపార ధనరాసులను తీసుకొని రావటంచేతనే అర్జునుడు ధనంజయు డయ్యాడు. తరువాత ఉత్తర గోగ్రహణంలో గో ధనాన్ని కూడ గెలిచి తేవటంలో ఆయన ధనంజయనామం అంతకంత సార్థకమైంది.

క. అతుల చతురంగ సేనా । యుతుఁ డంతర్గిరి బహిర్గి రోపగిరుల భూ
పతుల నని నోర్చి శౌర్యో । న్నతిఁ గొనియెను వారిచేత నానాధనముల్. 235

ప్రతిపదార్థం: అతుల, చతురంగ, సేనా, యుతుఁడు= సాటిలేని రథ గజ తురగ పదాతి బలంతో కూడుకొన్న వాడైన అర్జునుడు; అంతర్గిరి, బహిర్గిరి+ఉపగిరుల, భూపతులన్= అంతర్గిరి, బహిర్గిరి, ఉపగిరుల రాజుల నందరిని; అనిన్= యుద్ధంలో; ఓర్చి= జయించి; శౌర్య+ఉన్నతిన్= పరాక్రమం యొక్క ఆధిక్యంతో; వారిచేతన్, నానా, ధనముల్, కొనియెను= తీసుకొన్నాడు.

తాత్పర్యం: అర్జునుడు సాటిలేని చతురంగబలంతో అంతర్గిరి, బహిర్గిరి, ఉపగిరుల భూపతులనందరిని యుద్ధంలో జయించి అత్యధికపరాక్రమంతో వాళ్ళనుండి నానావిధధనాలు గ్రహించాడు.

విశేషం: "బహిర్గిరోపగిరుల - విడదీస్తే బహిర్గిర+ఉపగిరుల అని అవుతుంది, 'బహిర్గిరి' అనాలి గాని 'బహిర్గిర' అనటం ఒప్పా! అనిపిస్తుంది. అంతర్గిరించ కౌంతేయ స్తథైవచ బహిర్గిరిమ్ తథోపరిగిరిం చైవ విజిగ్యే పురుషర్షభః - అని మూలం (-భండార్కరు ప్రతి, 2-24-2) కాని 'బహిర్గిరమ్' అనే పాఠాంతరం కూడా ఉంది. ఈ పాఠాంతరాన్ని అనుసరించి

'బహిర్గిరోపగిరుల' అనే రూపం సాధువు. కాగా సిద్ధాంతకౌముదిలోని 'గిరేశ్చ సేనకస్య' అనే అవ్యయీభావ సమాస ప్రకరణంలోని తుది సూత్రంవలన గిర్యంతమైన అవ్యయీభావ సమాసానికి 'అచ్' ప్రత్యయం వైకల్పికంగా వస్తుంది. దీన్ని బట్టి అంతర్గిరి- అంతర్గిరమ్; బహిర్గిరి - బహిర్గిరమ్; ఉపగిరి - ఉపగిరమ్ అనే రూపాలు కలగటానికి అవకాశం ఉన్నది. నన్నయ 'బహిర్గిర+ ఉపగిరుల' అనే చోట 'అచ్' ప్రత్యయం వచ్చిన రూపం వాడి ఉన్నాడు. అందువలన బహిర్గిరోపగిరుల అనే రూపం సాధువే.''- (మహాభారత సంశోధిత ప్రతి).

వ. మఱియు నులూక దేశాధిపతియగు బృహంతునిఁ బరాజితుం జేసి, యుత్తరోలూక వామదేవ మోదాపుర సుదామ సుసంకులంబు లను దేశంబుల రాజుల జయించి, దేవప్రస్థంబున సేనాబిందు నోడించి, విష్వగశ్వుండనురాజువిక్రమం బడంచి, పార్వతేయుల గర్వం బుడిపి, బర్బర శబర తురుష్కపతుల వశగతులంజేసి, మాళవ పౌండ్ర కాశ్మీర త్రిగర్త లోహిత సుధన్వగాంధార కాంభోజ కోసల పతులచేత విచిత్ర రత్న కాంచన వస్తు వాహన నివహంబులు గొని, చిత్రాయుధ రక్షితంబైన సింహపురంబు మథించి, సింహాసనాసీనులయిన వనచర దస్యుల వశ్యులంజేసి, శ్వేతపర్వతం బతిక్రమించి యట చని కాంభోజ కటకుండను రాజుచేతం బూజితుండై, హాటకదేశంబున మానసం బనుకొలను ఋషికుల్యంబును జూచి, యందుల రాజులచేత నపరిమిత పదార్థంబులం దిత్తిరి కల్మాష మండూకాఖ్య మయూరహంస శుక సవర్ణంబులైన హయంబులం బర్వత నిభంబులైన యిభంబులం గొని, (హేమకూట నిషధాచలంబులు గడచి గంధర్వనగరంబులు గెలిచి, శత సహస్ర యోజనాయతం బయి శుద్ధ సువర్ణమయం బయి తేజోరాశి యయిన మేరు మహీధరంబు నాలోకించి, జంబూ మహావృక్షంబును జంబూ మహానదియునుం జూచి, తత్తీరంబున మేరువునకుం బ్రదక్షిణంబుగాఁజని, గంధమాదన పర్వతం బతిక్రమించి, తద్దిశాధిపతులైన సిద్ధ విద్యాధర చారణ గంధర్వులచేత నానా విచిత్రవస్తు వాహనంబులు గొని మాల్యవన్నీల పర్వతంబులు గడచి) యుత్తర కురుదేశములకుం జని హరివాసం బను పురంబుపై విడిసిన. 236

ప్రతిపదార్థం: మఱియున్= అంతేకాక; ఉలూక, దేశ+అధిపతి+అగు; బృహంతునిన్; పరాజితున్+చేసి= ఓడించి; ఉత్తర+ఉలూక, వామదేవ, మోదాపుర, సుదామ, సుసంకులంబులు; అను; దేశంబుల; రాజుల; జయించి; దేవప్రస్థంబున; సేనాబిందున్= సేనా బిందువు అనే పేరుగల రాజును; ఓడించి; విష్వక్+అశ్వుండు+అను; రాజు= రాజుయొక్క; విక్రమంబున్= పరాక్రమాన్ని; అడంచి= అణచి; పార్వతేయుల= పర్వతదేశరాజుల; గర్వంబు= పొగరును; ఉడిపి= తొలగించి; బర్బర, శబర, తురుష్క, పతుల; వశగతులన్+చేసి= లోబరుచుకొని; మాళవ, పౌండ్ర, కాశ్మీర, త్రిగర్త, లోహిత, సుధన్వ, గాంధార, కాంభోజ, కోసల, పతులచేత; విచిత్ర, రత్న, కాంచన, వస్తు, వాహన, నివహంబులు= విచిత్రాలైన రత్నాలను, బంగారు వస్తువులను, వాహనాల సమూహాలను; కొని= గ్రహించి; చిత్ర+ఆయుధ, రక్షితంబు+ఐన= చిత్రాయుధునిచేత రక్షించబడిందైన; సింహపురంబు; మథించి= జయించి (త్రచ్చి); సింహాసన+ఆసీనులు+అయిన= సింహాసనంపై కూర్చొని ఉన్న; వనచర దస్యులన్= ఆటవికులైన దస్యుజాతులవాళ్ళను; వశ్యులన్+చేసి= లోబడినవాళ్ళనుగా చేసుకొని; శ్వేత, పర్వతంబు; అతిక్రమించి= దాటి; అట, చని; కాంభోజకటకుండు+అను; రాజుచేతన్; పూజితుండు+ఐ= పూజించబడినవాడై; హాటక, దేశంబునన్; మానసంబు+అను= మానసం అనే పేరున్న; కొలను; ఋషికుల్యంబును; చూచి; అందుల, రాజులచేతన్; అపరిమిత పదార్థంబులన్= లెక్కకు మిక్కిలి అయిన వస్తువులను; తిత్తిరి, కల్మాష, మండూక+ఆఖ్య= తిత్తిరి, కల్మాషం, మండూకం అనే పేర్లు కలిగినట్టియు; మయూర, హంస, శుక, సవర్ణంబులు+ఐన= నెమలి, హంస, చిలుక రంగువంటి రంగు కలిగినవైన; హయంబులన్= గుఱ్ఱాలను; పర్వత, నిభంబులు+ఐన= కొండలతో సమానాలైన; ఇభంబులన్= ఏనుగులను; కొని= గ్రహించి; (హేమకూట,

నిషధ+అచలంబులు= హేమకూట నిషధ పర్వతాలు; కడచి= దాటి; గంధర్వ, నగరంబులు; గెలిచి, శత, సహస్ర, యోజన+ఆయతంబు+అయి= నూరువేల యోజనాల వైశాల్యం కలిగి; శుద్ధ, సువర్ణమయంబు+అయి= స్వచ్ఛమైన బంగారుతో కూడినదై; తేజః+రాశి= వెలుగుకుప్ప; అయిన, మేరు మహీధరంబును; జంబూ, మహావృక్షంబును; జంబూ మహానదియునున్, చూచి; తత్+తీరంబున= దాని ఒడ్డున; మేరువునకున్= మేరు పర్వతానికి; ప్రదక్షిణంబుగాన్= కుడినుండి ఎడమవైపుగా; చుట్టుచు; చని= వెళ్ళి; గంధమాదనపర్వతంబు; అతిక్రమించి= దాటి; తత్+దిశా+అధిపతులు+ఐన= ఆదిక్కుకు ప్రభువులయిన; సిద్ధ, విద్యాధర, చారణ, గంధర్వులచేతన్; నానా, విచిత్ర వస్తు వాహనంబులు; కొని= తీసుకొని; మాల్యవత్+నీల, పర్వతంబులు; కడచి= దాటి) ఉత్తరకురుదేశములకున్; చని= వెళ్ళి; హరివాసంబు+అను; పురంబుపై; విడిసినన్= దండెత్తగా.

తాత్పర్యం: అంతేకాక, ఉలూకదేశాధిపతి అయిన బృహంతుణ్ణి, ఉత్తర ఉలూక వామదేవాది దేశాల అధిపతుల్ని, దేవప్రస్థరాజయిన సేనాబిందుణ్ణి, విష్వగశ్వుణ్ణి, పార్వతేయుల్ని, బర్బర, శబర, తురుష్కరాజుల్ని, మాళవ, పౌండ్ర, కాశ్మీరాది దేశాధిపతుల్ని ఓడించాడు. వాళ్ళచేత చిత్రవిచిత్రాలైన రత్నాల్ని, కాంచన వస్తు వాహనాల సమూహాల్ని గ్రహించాడు. చిత్రాయుధుని రక్షణలో ఉన్న సింహపురాన్ని జయించాడు. సింహాసనాసీనులైన ఆటవిక దస్యుల్ని వశం చేసుకొన్నాడు. శ్వేతపర్వాతాన్ని దాటి, కాంభోజకటకుడనే రాజుచేత పూజలందుకొన్నాడు. హాటకదేశంలో మానసమనే పేరున్న కొలను, ఋషికుల్యాన్ని దర్శించాడు. అక్కడి రాజులచేత అపరిమిత పదార్థాల్ని, తిత్తిరి, కల్మాష, మండూకాలనే పేర్లు గల నెమలి, హంస, చిలుక రంగులతో సమానమైన రంగులు కల గుర్రాల్ని, కొండలవంటి ఏనుగుల్ని గ్రహించి (హేమకూట నిషధ పర్వతాలు దాటి, గంధర్వ నగరాన్ని జయించి, నూరువేల యోజనాల వైశాల్యంతో, స్వచ్ఛమైన బంగారుతో, కుప్పవోసిన కాంతిలా ఉన్న మేరుపర్వతాన్ని దర్శించి, జంబూమహావృక్షాన్ని, జంబూమహానదిని చూచి, ఆ నదీతీరాన మేరువుకు ప్రదక్షిణంగా వెళ్ళి, గంధమాదన పర్వతాన్ని దాటి, ఆ దిక్కుకు అధిపతులైన సిద్ధ, విద్యాధర, చారణ గంధర్వులచేత వివిధవస్తు వాహనాల్ని గ్రహించి, మాల్యవంతం, నీలం అనే పర్వతాలను దాటి) ఉత్తర కురు దేశాలకు వెళ్ళి, హరివాస మనే పురంపై దండెత్తాడు.

విశేషం: ఇది ప్రాచీన ఉత్తర భారత భౌగోళికస్థితిని వర్ణించే వచనం. 'హేమకూటనిషధాచలాలు' మొదలు 'మాల్యవన్నీల పర్వతంబులు గడచి' అనేవరకు ఉన్న వచన భాగానికి మూలం శ్రీ పి.పి.యస్. శాస్త్రిగారి సంపాదకత్వంలో వెలువడ్డ సంస్కృత భారత ప్రతిలో ఉంది కాని, భండార్కర్ ప్రతిలో అది లేదు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు భారత ప్రతిలో ఈ భాగం కుండలీకృతమై ఉంది. రాజుల పేర్ల విషయంలో, దేశాల పేర్ల విషయంలో కొన్ని ప్రతులలో కొన్ని భేదాలు ఉన్నాయి.

సీ. **తద్ద్వారపాలకుల్ దారుణాకారు ల । పార బలాఢ్యులు పార్థుకడకుఁ**
జనుదెంచి సురరాజసన్నిభు నాతనిఁ । జూచి యచ్చెరు వడి 'శూరు లెందు
నీయట్టిరే కురున్నపవీర! పర్యాప్త । మయ్యె నీ విజయ వీర్యాతిశయము;
వసుమతీనాథు లెవ్వరు నిట్లు బలిమిమై । నిట వచ్చిరే తొల్లి యే యుగముల?

ఆ. **నున్నతప్రతాప! యుత్తర కురు భూము । లండ్రు జనులు వీని; నవనిచరుల**
కివి యగోచరంబు; లిందు సాధించి యె । ద్దియును గొనఁగలేదు తివిరి నీకు. **237**

ప్రతిపదార్థం: తత్+ద్వారపాలకుల్= ఆ హరివాసపురం యొక్క ద్వారాన్ని కాపాడే భటులు; దారుణ+ఆకారులు= భయంకరమైన ఆకారం కలవాళ్ళు; అపార+బల+ఆఢ్యులు= అమితమైన బలంతో కూడుకొన్నవాళ్ళు; పార్థుకడకున్= అర్జునుని దగ్గరకు;

చనుదెంచి= వచ్చి; సుర, రాజ, సన్నిభున్= దేవతలకు రాజైన ఇంద్రునితో సమానమైన వాణ్ణి; అతనిన్= ఆ అర్జునుణ్ణి; చూచి; అచ్చెరు+పడి= ఆశ్చర్యపడి; కురు, నృప, వీర= వీరుడవైన కురు వంశ రాజా!; శూరులు+ఎందున్, నీ, అట్టిరే= వీరులు ఎచ్చటైనా నీవంటివాళ్ళు ఉన్నారా?; నీ, విజయ, వీర్య+అతిశయము= నీ విజయంలోని పరాక్రమం యొక్క గొప్పతనం; పర్యాప్తము+అయ్యె= తృప్తిని కలిగించింది (సంపూర్ణమయింది); తొల్లి= పూర్వం, ఏ, యుగములన్= ఏ యుగాల్లో అయినా; వసుమతీ, నాథులు= భూపతులు-రాజులు; ఎవ్వరున్= ఎవరుకూడ; ఇట్లు= ఈ విధంగా; బలిమిమైన్= బలంతో; ఇట, వచ్చిరే= ఇక్కడికి వచ్చారా; ఉన్నత, ప్రతాప= గొప్ప ప్రతాపం కలవాడా!; వీనిన్= ఈ ప్రదేశాలను; జనులు; ఉత్తర కురు భూములు; అండ్రు= అంటారు; అవని చరులకున్= భూమి మీద సంహరించేవాళ్ళకు; ఇవి= ఈ ప్రదేశాలు; అగోచరంబులు= అగుపించవు; నీకున్; ఇందు; తివిరి= ప్రయత్నించి; ఎద్దియును= దేనినికూడ; సాధించి; కొనఁగన్= తీసుకోటానికి; లేదు.

తాత్పర్యం: భయంకరమైన ఆకారం, అపారమైన బలం కల ఆ హరివాస పుర ద్వారపాలకులు అర్జునుని దగ్గరకు వచ్చి, దేవేంద్రునిలా ఉన్న అతణ్ణి దర్శించి ఆశ్చర్యచకితులై 'కురువంశవీరా! నీవంటి శూరులు ఎక్కడైనా ఉన్నారా! నీ విజయ పరాక్రమంయొక్క గొప్పతనం మాకు తృప్తి కలిగించింది. పూర్వం ఏ యుగాలలో అయినా, ఏరాజులైనా నీవలె బలసంపన్నులై ఇక్కడికి వచ్చారా? ఓ మహావీరా! ఈ ప్రదేశాలను ప్రజలు ఉత్తర కురుభూము లంటారు. నేలమీద సంచరించే సామాన్యులకు ఇవి అగుపించవు. నీవు ప్రయత్నించి సాధించి తీసుకోటానికి ఇక్కడ ఏదీ లేదు.'

విశేషం: విశేష్యానికి ముందు విశేషణాలను వాడటం తెలుగు పద్ధతి. విశేష్యం తరువాత విశేషణాలను ప్రయోగించటం సంస్కృత పద్ధతి. నన్నయ పెక్కుచోట్ల సంస్కృత పద్ధతిని అనుసరించారు. ప్రస్తుత పద్యంలో 'ద్వారపాలకులు' అనే విశేష్యం తరువాత 'దారుణాకారులు, అపారబలాఢ్యులు' అనే విశేషణాలు ప్రయోగించటం ఇటువంటిదే. 'ఏ/య్యవియుఁగొనఁగలేరు తివిరి జనులు (ఒరులు)' అని పెక్కు ప్రతులలోను, 'ఎయ్యవి గొనంగ లేవు నీవు' అని కొన్ని ప్రతులలోను పాఠాంతరా లున్నాయి. మూలంలో - నచాపికించిజ్జేతవ్య మర్జునాత్ర ప్రదృశ్యతే (భండార్కరు ప్రతి 2-25-11), (ఇంక నీకు జయించ వలసిన దేదియు లేదు) అనీ; 'పార్థనేదం త్వయా శక్యం పురం జేతుం కథంచన, ఉపావర్తస్వ కల్యాణ పర్యాప్త మిద మచ్యుత' (భండార్కరు ప్రతి, 2-25-9) (పార్థా! ఇది నీకు జయించ శక్యం కాదు. నీ విజయం సంపూర్ణమైనది. తిరిగి వెళ్ళుము) అనీ ఉన్నాయి.

వ. అయినను నీవచనంబు సేయంగలవారము మమ్ముఁ బనుపు మనిన వారికి నర్జునుం డి ట్లనియె. 238

ప్రతిపదార్థం: అయినను; నీ, వచనంబు= నీవు చెప్పినట్లు; చేయంగలవారము; మమ్మున్; పనుపుము= ఆజ్ఞాపించుము; అనినన్; వారికిన్; అర్జునుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'అయినా నీవు చెప్పినట్లు చేస్తాం. మమ్మల్ని ఆజ్ఞాపించు' - అనగానే వారితో అర్జునుడు ఇలా అన్నాడు.

తే. రాజసూయాధ్వరము ధర్మరాజు సేయ । నుత్సహించినవాఁడు తదుత్సవమున
కిందు మీయందుఁ గల వస్తు వెద్దియైన; । నమ్మహీనాథు సామ్రాజ్య మతిశయిల్లు. 239

ప్రతిపదార్థం: ధర్మరాజు; రాజసూయ+అధ్వరము= రాజసూయయాగం; చేయన్= చేయటానికి; ఉత్సహించినవాఁడు= ఉత్సాహంతో ఉన్నాడు; తత్+ఉత్సవమునకున్= ఆయాగానికి; మీయందున్; కల; వస్తువు; ఎద్ది; ఐనన్; ఇందు; ఆ+మహీనాథు, సామ్రాజ్యము; అతిశయిల్లున్= అధికం కాగలదు.

తాత్పర్యం: ధర్మరాజు రాజసూయ మహాయాగం చేయాలన్న ఉత్సాహంతో ఉన్నాడు. ఆ యాగానికి మీవద్ద ఉన్న వస్తు వే దైనా ఇవ్వండి. ఆ మహారాజు సామ్రాజ్యం గొప్పగా ప్రకాశిస్తుంది.

విశేషం: ఇచ్చు ధాతువునకు సంప్రార్థన విధులందు ఇమ్ము-ఇండు అనునవి ఏకవచన బహువచన రూపాలు.

వ. అనిన నయ్యుత్తర కురు భూముల రాజు లెల్ల నర్జునున కతిప్రీత చిత్తులయి యమూల్యంబులైన యపరిమిత దివ్యరత్నాభరణంబులు దెచ్చియిచ్చిన. 240

ప్రతిపదార్థం: అనినన్; ఆ+ఉత్తర కురు భూముల, రాజులు+ఎల్లన్; అర్జునునకున్; అతి, ప్రీతి, చిత్తులు+అయి= మిక్కిలి సంతోషించిన మనస్సులు కలవాళ్ళయి; అమూల్యంబులు+ఐన= చెప్పశక్యం కాని విలువలుఉన్న; అపరిమిత, దివ్య, రత్న+ ఆభరణంబులు= లెక్కకు మిక్కిలి యైన మంచిరత్నాలతో కూడిన నగలను; తెచ్చి; ఇచ్చినన్.

తాత్పర్యం: అని అర్జునుడు అనగా, ఆ ఉత్తర కురు భూములను పాలించే రాజులంతా అపరిమిత సంతోషంతో అర్జునుడికి అమూల్యాలు అసంఖ్యాకాలు అయిన రత్నాభరణాలను తెచ్చి ఇవ్వగా.

తరలము.

తరణిసన్నిభు ధర్మపుత్త్రు నుదారతేజము పర్వ భా
స్వర సుసంపదఁ బాకశాసని శాసనంబున నిట్టు లు
త్తర కురూత్తముఁ దొట్టి యుత్తర ధారుణీశులు వశ్యు లై
కర ధనంబులు దెచ్చియిచ్చిరి గౌరవంబున ధన్యు లై. 241

ప్రతిపదార్థం: తరణి, సన్నిభు= సూర్యునితో సమానుడైన; ధర్మపుత్త్రు= ధర్మరాజుయొక్క; ఉదార, తేజము= గొప్ప పరాక్రమం; భాస్వర, సుసంపదన్= ప్రకాశించే మంచి సంపదచేత; పర్వన్= వ్యాపించేటట్లు; పాకశాసని, శాసనంబునన్= దేవేంద్రుని కుమారుడైన అర్జునునియొక్క ఆజ్ఞచేత; ఇట్టులు= ఈ విధంగా; ఉత్తర కురు+ఉత్తమున్+తొట్టి= ఉత్తర కురు రాజశ్రేష్ఠుడు మొదలుగా; ఉత్తర ధారుణీ+ఈశులు= ఉత్తర దేశరాజులు; వశ్యులు+ఐ= లొంగిపోయిన వారై; గౌరవంబునన్; ధన్యులు+ఐ= పుణ్యవంతులై; కర, ధనంబులు= కప్పంసొమ్ములు; తెచ్చి; ఇచ్చిరి.

తాత్పర్యం: సూర్యసమానుడైన ధర్మరాజుయొక్క గొప్ప తేజస్సు, వెలిగే సంపదతో విశేషంగా వ్యాపించేటట్లుగా, అర్జునుని ఆజ్ఞకు లొంగి ఉత్తరకురుభూముల రాజులంతా గౌరవంతో కప్పాలు తెచ్చి యిచ్చి ధన్యులయ్యారు.

విశేషం: 'కరధనంబులు'కు - 'కలధనంబులు' అనే పాఠాంతరం ఉంది. ఇది కూడ ఉచితమైందే. కాని ఈ పాఠాన్ని అంగీకరిస్తే ర, ల లకు ప్రాస చెల్లుతుందని గ్రహించవలసి ఉంటుంది. ఈ వృత్తం తరలం. తరలమంటే హారమధ్యరత్నం, ప్రకాశించేది- అని అర్థం. పాండవమధ్యముడైన పార్థుడు ఉత్తర దిగ్విజయ యాత్రను దేదీప్యమానంగా పూర్తి చేసి, అపార ధనరాసులతో తిరిగి రావటాన్ని తరలవృత్తంలో వర్ణించటం ఎంతో ఉచితంగా ఉంది. పాకశాసని - తారకాసురుడి తమ్ముడైన పాకాసురుణ్ణి చంపటంచేత దేవేంద్రునికి పాకశాసను డని పేరు. పాకశాసనుడి కుమారుడు (అపత్యార్థంలో) పాకశాసని - అర్జునుడు వృత్తలక్షణానికి చూడు: సభా 1.192.

భీమసేనుండు పూర్వ దిగ్విజయంబు సేయుట (సం. 2-26-1)

వ. అట భీమసేనుండునుం బరచక్ర మర్దనంబయిన బలచక్రంబుతోఁ బూర్వ దిక్కునకుం జని పాంచాలపతిచేత సత్కృతుండయి, విదేహరాజు జనకుండను వాని జయించి, దశార్ణపతి యయిన సుధన్వుతో మహాయుద్ధంబు సేసి తత్పరాక్రమంబునకు మెచ్చి వానిం దనకు సేనాపతిం జేసికొని, యశ్వమేధేశ్వరుం డయిన రోచమాను ననుజ సహితుం బరాజితుం జేసి, చేదివిషయంబునకుం జనిన. 242

ప్రతిపదార్థం: అట, భీమసేనుండును; పర, చక్ర, మర్దనంబు+అయిన= శత్రుసమూహాన్ని అణచగలిగిన; బల, చక్రంబుతోన్= బలమైన దండుతో; పూర్వదిక్కునకున్= పూర్వదిశకు; చని= వెళ్ళి; పాంచాలపతిచేతన్= పాంచాలదేశప్రభువుచేత; సత్కృతుండు+ అయి= గౌరవించబడినవాడై; విదేహరాజు; జనకుండు; అనువానిన్; జయించి; దశార్ణపతి, అయిన; సుధన్వుతో; మహాయుద్ధంబు; చేసి; తత్, పరాక్రమంబునకున్= అతనియొక్క శౌర్యానికి; మెచ్చి; వానిన్; తనకున్; సేనాపతిన్; చేసికొని; అశ్వమేధ+ఈశ్వరుండు+ అయిన= అశ్వమేధానికి రాజైన; రోచమానున్; అనుజ, సహితున్= తమ్ములతో కూడిన వాణ్ణి; పరాజితున్+చేసి= ఓడించి; చేది విషయంబునకున్= చేదిదేశానికి; చనిన= వెళ్ళిన.

తాత్పర్యం: భీమసేనుడు కూడ శత్రు సమూహాన్ని అణచగలిగిన బలమైన సైన్యంతో తూర్పుదిక్కుకు వెళ్ళి, పాంచాల రాజుచేత పూజ లందుకొని, విదేహరాజైన జనకుణ్ణి జయించాడు. తరువాత దశార్ణపతి అయిన సుధన్వునితో మహాయుద్ధం చేసి అతని పరాక్రమానికి మెచ్చి తనకు సేనాపతిగా చేసుకొన్నాడు. అశ్వమేధం చేసిన రాజైన రోచమానుణ్ణి తమ్ములతో సహా ఓడించి చేదిదేశంలో ప్రవేశించాడు.

చ. అతని నతిప్రతాపు ననిలాత్మజుఁ గానఁగవచ్చి చేది భూ
పతి శిశుపాలుఁ డెంతయును భక్తిపరుం డయి రాజసూయ ము
న్నతి నొనరింపనున్న యమనందనుయత్న మెఱింగి రత్నశో
భిత ధనరాసు లిచ్చెఁ గడుఁబ్రీతిసమన్వితుఁ డై ముదంబునన్. 243

ప్రతిపదార్థం: అతనిన్; అతి, ప్రతాపున్= మిక్కిలి పరాక్రమం కలవాణ్ణి; అనిల+ఆత్మజున్= వాయుదేవునియొక్క పుత్రుణ్ణి (భీముణ్ణి); చేది, భూపతి= చేది దేశం యొక్క రాజు; శిశుపాలుఁడు; కానఁగన్, వచ్చి= చూడవచ్చి; ఎంతయును= మిక్కిలి; భక్తిపరుండు+అయి= భక్తితో కూడినవాడై; రాజసూయము; ఉన్నతిన్= గొప్పగా; ఒనరింపన్+ఉన్న= చేయటానికి సిద్ధంగా ఉన్న; యమనందను= యముని పుత్రుడైన ధర్మరాజుయొక్క; యత్నము+ఎఱింగి= ప్రయత్నం తెలుసుకొని; కడున్= మిక్కిలి; ప్రీతి, సమన్వితుఁడు+ఐ= ప్రేమతో కూడుకొన్నవాడై; ముదంబునన్= సంతోషంతో; రత్న, శోభిత, ధనరాసులు= రత్నాలతో వెలుగొందే ధనరాసులను; ఇచ్చెన్= ఇచ్చాడు.

తాత్పర్యం: మహాపరాక్రమ శాలి అయిన భీముణ్ణి చేది రాజైన శిశుపాలుడు దర్శించాడు. ఎంతో భక్తితో ధర్మరాజు చేస్తున్న రాజసూయ ప్రయత్నాన్ని గూర్చి తెలుసుకొన్నాడు. ఎంతో ప్రీతితో రత్నశోభితాలైన ధనరాసుల్ని ఆయనకు ఇచ్చాడు.

విశేషం: శిశుపాలుడు ధర్మరాజుపట్ల భక్తి గౌరవాలు కలవాడే. రాజసూయయాగ ప్రయత్నం తెలిసికొని సంతోషించినవాడే. అయితే ధర్మరాజు శ్రీకృష్ణునికి అర్ఘ్య మివ్వటంచేతనే అతడి వైఖరి పూర్తిగా వ్యతిరేకంగా మారింది.

వ. **భీమసేనుండును శిశుపాలుపురంబునం గొన్నిదినంబు లుండి పూర్వదిక్కున కరిగి, పుళిందపురంబున సుకుమారసుమిత్రులం, గుమారవిషయంబున శ్రేణిమంతునిం, గోసలదేశంబున బృహద్బలు, నయోధ్యాపురంబున దీర్ఘప్రజ్ఞునిఁ, గాశీరాజును సుపార్శ్వుని, రాజపతియైన సుధన్వుని, మత్స్యమలదపతులను గర్ణాట దక్షిణమల్లులను మర్దించి, వారిచేత నపరిమిత ధనంబులుగొని, మగధపతియయిన జరాసంధతనయు సహదేవు నాశ్వాసించి, హిమవత్పర్వత పార్శ్వంబునం జలోద్భవంబనుదేశంబును భల్లాటదేశంబును జయించి, యింద్రపర్వత సమీపంబునం గిరాతపతుల నేడ్వురను శర్మక వర్మకులను జంద్రసేన సముద్రసేనులను గర్ణవత్సపతులను బుండ్రపతినిం బౌండ్రక వాసుదేవుని వశగతులం జేసి. 244**

ప్రతిపదార్థం: భీమసేనుండును; శిశుపాల పురంబునన్; కొన్ని; దినంబులు+ఉండి; పూర్వ దిక్కునకున్= తూర్పుదిశకు; అరిగి= వెళ్ళి; పుళింద, పురంబునన్; సుకుమార, సుమిత్రులన్; కుమార, విషయంబునన్= కుమార దేశంలో; శ్రేణిమంతునిన్; కోసల, దేశంబునన్; బృహత్+బలున్; అయోధ్యా, పురంబునన్; దీర్ఘ ప్రజ్ఞునిన్; కాశీరాజును; సుపార్శ్వుని; రాజపతి+ఐన; సుధన్వుని ('రాజపతింక్రథ' మ్మని మూలం); మత్స్య, మలద, పతులను; కర్ణాట, దక్షిణ, మల్లులను; మర్దించి= ఓడగొట్టి; వారిచేతన్; అపరిమిత, ధనంబులు; కొని= తీసుకొని; మగధపతి, అయిన; జరాసంధ, తనయున్; సహదేవున్; ఆశ్వాసించి= అనునయించి; హిమవత్+పర్వత, పార్శ్వంబునన్= హిమవత్పర్వతం ప్రక్కలో; జల+ఉద్భవంబు+అను; దేశంబును; భల్లాట, దేశంబును; జయించి; ఇంద్ర, పర్వత, సమీపంబునన్, కిరాత, పతులన్= బోయరాజులను; ఏడ్వురను= ఏడుమందిని; శర్మక, వర్మకులను; చంద్రసేన, సముద్రసేనులను; కర్ణ, వత్సపతులను; పుండ్రపతినిన్; పౌండ్రకవాసుదేవునిన్; వశగతులన్, చేసి= లోబరచుకొని.

తాత్పర్యం: భీమసేనుడు శిశుపాలుడి పురంలో కొన్నిదినా లుండి, తూర్పుదిక్కునకు వెళ్ళి, ఆయాదేశాల రాజుల నందరిని జయించాడు.

విశేషం: రాజుల పేర్ల విషయంలో వివిధ ప్రతుల్లో భేదాలు ఉన్నాయి. కర్ణాటపదం మూలంలో లేదు. బహుశః నన్నయగారే దీన్ని చేర్చారేమో!

ఉత్సాహము.

అతులశౌర్యుఁ డనిలతనయుఁ డమిత వాహినీ పదా
హతి ధరిత్రి దలర నిట్టు లరిగి పూర్వ దిఙ్మహీ
పతులచేత రత్నరజత భర్మతతులఁ గొనియె భూ
నుతయశుండు వేఱు వేఱ నూఱు కోట్ల సంఖ్యలన్. 245

ప్రతిపదార్థం: అతులశౌర్యుఁడు= సాటిలేని పరాక్రమం కలవాడు; భూనుత, యశుండు= ప్రపంచంచేత కొనియాడబడిన కీర్తి కలవాడు; అనిల, తనయుఁడు= గాలిదేవుని కొడుకు - భీముడు; అమిత, వాహినీ, పదాహతిన్= మితిమీరిన సైన్యంయొక్క పాదాల తాకిడిచేత; ధరిత్రి= భూమి; తలరన్= అదరగా; ఇట్టులు+అ= ఈ విధంగా; అరిగినన్= వెళ్ళగా; పూర్వదిక్+ మహీపతులచేతన్= తూర్పు దిక్కులోని రాజులచేత; రత్న, రజత, భర్మ, తతులన్= రత్నాలయొక్క వెండియొక్క బంగారంయొక్క సమూహాలను; వేఱువేఱు; నూఱుకోట్ల సంఖ్యలన్; కొనియెన్= గ్రహించాడు.

తాత్పర్యం: సాటిలేని పరాక్రమశాలి, లోకం కొనియాడిన కీర్తిమంతుడు అయిన వాయుపుత్రుడు భీముడు, అపారసైన్యపాదఘట్టనతో భూమి అదిరేటట్లు దండయాత్ర చేసి, తూర్పు దిక్కులోని రాజులచేత వేర్వేరుగా వందకోట్ల రత్నరజతకాంచన రాసులను కప్పంగా తీసుకొన్నాడు.

విశేషం: 'రత్న రజత భర్మతతు' లకు మూలం - 'కాంచనం రజతం వజ్రం విద్రుమంచ మహాధనమ్' (భండార్కరు ప్రతి. 2-27-26). దిగ్విజయయాత్రనుండి సాటిలేని శౌర్యంతో భీమసేనుడు తిరిగి రావటాన్ని ఉత్సాహవృత్తంలో వర్ణించటం ఎంతో ఉచితంగా ఉంది. ఉత్సాహం జాతివృత్తం. అందులో ప్రతిచరణంలోనూ వరుసగా ఏడుసూర్యగణాలమీద ఒక గురువు నిలుస్తుంది. అయిదవగణంలోని మొదటి అక్షరం యతిస్థానం. ప్రాసనియమం ఉంది.

సహదేవుండు దక్షిణ దిగ్విజయంబు సేయుట (సం. 2-28-1)

వ. అట సహదేవుండు దక్షిణ దిక్కున కరిగి సుమిత్ర శూరసేన దంతవక్త్ర యవనులను, గోశృంగగిరి నివాసులను జయించి కుంతిభోజుచేతం బ్రియపూర్వకంబున సత్కృతుం డయి. 246

ప్రతిపదార్థం: అట; సహదేవుండు; దక్షిణ, దిక్కునకున్; అరిగి= వెళ్ళి; సుమిత్ర, శూరసేన, దంతవక్త్ర, యవనులను; గోశృంగగిరి, నివాసులను; జయించి; కుంతిభోజుచేతన్; ప్రియపూర్వకంబునన్= మనసార; సత్కృతుండు+అయి= పూజించబడినవాడై.

తాత్పర్యం: ఇక అక్కడ సహదేవుడు దక్షిణదిశకు వెళ్ళి సుమిత్రుడు, శూరసేనుడు, దంతవక్త్రుడు, యవనులు, గోశృంగగిరి నివాసులు మొదలైన రాజులందరిని జయించి, కుంతిభోజునిచేత మనసార పూజ లందుకొని.

ఆ. జలజనాభుపగతు జంభకుండనువాని । భూరిబలునిపుత్త్రుఁ బోరిలోన
నొడిచి వానిచేత నుత్తమ గజహయ । రత్నతతులు గొని పరాక్రమమున. 247

ప్రతిపదార్థం: జలజనాభు, పగతున్= పద్మనాభునియొక్క - అంటే శ్రీకృష్ణునియొక్క - శత్రువైన; జంభకుండు+అనువానిన్; భూరి, బలుని, పుత్త్రున్= భూరిబలుడు అనేవానియొక్క కుమారుణ్ణి (భూరి బలుడంటే గొప్ప బలం కలవాడు); పోరిలోనన్= యుద్ధంలో; ఒడిచి= ఓడించి; వానిచేతన్; ఉత్తమ, గజ, హయ, రత్న, తతులు= శ్రేష్ఠాలైన ఏనుగుల, గుర్రాల, రత్నాల సమూహాలను; కొని= గ్రహించి; పరాక్రమమునన్= పరాక్రమంతో.

తాత్పర్యం: శ్రీకృష్ణుని విరోధి, భూరిబలుని పుత్రుడు అయిన జంభకుడనే వానిని యుద్ధంలో ఓడించి అతనిచేత శ్రేష్ఠాలైన గజాశ్వరత్నసమూహాల్ని గ్రహించి పరాక్రమంతో.

వ. నర్మదాసమీపంబున నవంతి పతుల విందానువిందుల మందదర్పులం జేసి చని, మాహిష్మతీపురంబు పయి విడిసిన. 248

ప్రతిపదార్థం: నర్మదా, సమీపంబునన్= నర్మదానదానికి దగ్గర; అవంతి, పతులన్= అవంతిదేశరాజులను; వింద+అనువిందులన్; మంద, దర్పులన్+చేసి= అణగిన పొగరు కలవాళ్ళనుగా చేసి (ఓడించి); చని= వెళ్ళి; మాహిష్మతీ, పురంబు; పయి, విడిసినన్= దండెత్తగా.

తాత్పర్యం: నర్మదానదానికి సమీపంలోని అవంతిదేశరాజులైన విందానువిందుల్ని ఓడించి, ముందుకు సాగి మాహిష్మతీపురంమీద దండెత్తగా.

క. వీరుఁడు తత్పురవిభుఁ డు । గ్రారివిమర్దనుఁడు నీలుఁ డనువాఁడు మహా
దారుణబలుఁ డై సమర । ప్రారంభాత్యుగ్రుఁ డయ్యెఁ బాండవుతోడన్. 249

ప్రతిపదార్థం: వీరుఁడు; తత్+పుర, విభుఁడు= ఆమాహిష్మతీపురరాజు; ఉగ్ర+అరి, విమర్దనుఁడు= భయంకరులైన శత్రువుల్ని లెస్సగా అణచేవాడు; నీలుఁడు+అనువాడు; మహా, దారుణ, బలుండు+ఐ= మిక్కిలి భయంకరమైన బలం కలవాడై; పాండవుతోడన్= పాండురాజుపుత్రు డైన సహదేవునితో; సమర, ప్రారంభ+అతి+ఉగ్రుఁడు+అయ్యెన్= యుద్ధాన్ని ప్రారంభించటంలో మిక్కిలి విజృంభించినవా డయ్యాడు.

తాత్పర్యం: వీరుడు, మాహిష్మతీపుర ప్రభుడు, భయంకరశత్రు విమర్దనుడు అయిన నీలుడు, మహాదారుణబలుడై సహదేవునితో యుద్ధానికి విజృంభించాడు.

వ. అంత. 250

తాత్పర్యం: అప్పుడు.

క. దరికొని దహనుం డెగసెను । వరుసను సహదేవుసకలవాహినిమాద్య
త్కరులపయిఁ దురగములపయి । వరరథములపయిఁ బదాతివర్గములపయిన్. 251

ప్రతిపదార్థం: సహదేవు, సకల, వాహినిన్= సహదేవునియొక్క సమస్త సైన్యంలో; మాద్యత్, కరులపయిన్= మదపుటేనుగులమీద, తురగములపయిన్= గుర్రాలమీద; వర, రథములపయిన్= శ్రేష్ఠాలైన రథాలమీద; పదాతివర్గములపయిన్= కాల్బలాల సమూహాలమీద; దహనుండు= అగ్నిదేవుడు; దరికొని= రగుల్కొని; ఎగసెను= విజృంభించాడు.

తాత్పర్యం: క్రమంగా సహదేవుని సైన్యంలోని మదపుటేనుగులమీద, గుర్రాలమీద, రథాలమీద, కాల్బలాల సమూహంమీద అగ్నిదేవుడు రగుల్కొని వ్యాపించాడు.

వ. అనిన విని జనమేజయుండు వైశంపాయనున కి ట్లనియె. 252

తాత్పర్యం: అనగా విని జనమేజయుడు వైశంపాయనునితో ఇలా అన్నాడు.

అగ్ని సహదేవుసేనపైఁ బ్రచండశిఖలు కప్పుటకుఁ గారణము (సం. 2-28-16)

ఆ. కడఁగి యనలుఁ డేమి కారణంబున సహ । దేవు సేనపయి నతిప్రచండ
శిఖలు గప్పె? దీనిఁ జెప్పు మేర్పడ నాకు । ననఘ! వినఁగ వేడ్కయైన యదియు. 253

ప్రతిపదార్థం: అనఘ!= పాపరహితుడవైన ఓ వైశంపాయన మహర్షీ!; కడఁగి= పూనుకొని; అనలుఁడు= అగ్ని; ఏమి, కారణంబునన్; సహదేవుసేనపయిన్= సహదేవునియొక్క సైన్యంమీద; అతి, ప్రచండ, శిఖలు= మిక్కిలి తీవ్రాలైన మంటలు; కప్పెన్= పరపాడో; వినఁగన్; వేడ్క+ఐన, అదియు= వినా లని కుతూహలం కలిగింది; దీనిన్; ఏర్పడన్= స్పష్టంగా; నాకున్; చెప్పుము.

తాత్పర్యం: పుణ్యాత్మా! ఓ వైశంపాయనమహర్షీ! ఏకారణంచేత అగ్నిదేవుడు సహదేవుని సైన్యంమీద మహాతీవ్రమైన మంటలను కప్పాడో వినా లని కుతూహలంగా ఉంది. దీన్ని నాకు స్పష్టంగా చెప్పండి.

వ. అనిన వైశంపాయనుం డి ట్లని చెప్పెఁ:దొల్లి నీలువంశంబున నిషధుం డనురాజు రాజ్యంబున జాతవేదుండు విప్రుండయి వేదాధ్యయనంబుసేయుచు మాహిష్మతీపురంబున నుండి ప్రమాదవశంబునం బారదారికుండయిన నెఱింగి రాజనియోగులు వానిం బట్టికొని పోయి రాజసమక్షంబున శాస్త్రవిహితదండనంబున దండింపం బోయిన. 254

ప్రతిపదార్థం: అనినన్; వైశంపాయనుండు; ఇట్లు+అని; చెప్పెన్; తొల్లి= పూర్వం; నీలు, వంశంబునన్= నీలునియొక్క వంశంలో; నిషధుండు+అను రాజు, రాజ్యంబునన్= రాజుయొక్క రాజ్యంలో; జాతవేదుండు= అగ్నిదేవుడు; విప్రుండు+అయి= బ్రాహ్మణుడై; వేద+అధ్యయనంబు, చేయుచున్= వేదపాఠాలు నేర్చుకొంటూ; మాహిష్మతీపురంబునన్; ఉండి; ప్రమాద, వశంబునన్= ఏమరుపాటున; పారదారికుండు+అయినన్= పరపురుషుని భార్యతో రమించినవాడు కాగా; రాజనియోగులు= రాజభటులు; ఎఱింగి= తెలుసుకొని; వానిన్= ఆ అగ్నిహోత్రుణ్ణి; పట్టికొనిపోయి; రాజసమక్షంబునన్= రాజు ఎదుట; శాస్త్ర విహిత, దండనంబునన్= శాస్త్రంలో చెప్పబడిన శిక్షప్రకారం; దండింపన్+పోయినన్= శిక్షించపోగా.

తాత్పర్యం: అనిన విని వైశంపాయనుడు ఈవిధంగా చెప్పాడు. పూర్వం నీలునివంశంవాడైన నిషధు డనే రాజు రాజ్యం చేస్తుండగా, అగ్నిహోత్రుడు బ్రాహ్మణరూపం ధరించి మాహిష్మతీపురంలో వేదాధ్యయనం చేస్తూ ఉన్నకాలంలో పొరపాటున పరపురుషుని భార్యతో రమించాడు. రాజభటులు దానిని తెలుసుకొని అతణ్ణి బంధించి తీసుకొనిపోయి రాజసమక్షంలో శాస్త్ర ప్రకారం శిక్షించబోగా.

విశేషం: జాతవేదుడు - పుట్టిన వేదాలు కలవాడు - అగ్నిదేవుడు. అంటే ఇతడివల్ల వేదాలు పుట్టాయట. త్రేతాయుగంలో పురూరవుని మనస్సుకు వేదాలు కర్మబోధకాలై మూడు మార్గాలుగా తోచాయి. తాను ఇదివరకు అరణ్యంలో అగ్నిస్థాలిని వదలిన చోటికి వెళ్ళి శమీ(జమ్మి) గర్భంనుండి పుట్టిన అశ్వత్థా(రావిచెట్టు) న్ని చూచి, ఆ అశ్వత్థాన్ని రెండు అరణులుగా చేసి మొదటి అరణి తాననీ, రెండవ అరణి తాను మోహించిన ఊర్వశి అనీ, మధ్యనున్న కాష్ఠం పుత్రుడనీ మంత్రాలు జపించటంచేత జాతవేదు డనే అగ్ని సంభవించిం దట!

క. అవమానదుఃఖితుండయి । పొవయుచు రోషానలంబు పోఁడిమి వెలుఁగం
బవనసఖుఁ డుగ్ర కణములు । నెవయఁగఁ దన పొడవు చూపె నిషధుని మ్రోలన్. 255

ప్రతిపదార్థం: పవనసఖుఁడు= గాలిదేవుని మిత్రుడైన అగ్నిదేవుడు; అవమాన, దుఃఖితుండు+అయి= అవమానంచేత దుఃఖం పొందినవాడై; పొవయుచున్= పొగలుగ్రక్కుతూ; రోష+అనలంబు, పోఁడిమి= రోషమనే అగ్నియొక్క తీవ్రత; వెలుఁగన్= ప్రకాశించగా; ఉగ్ర, కణములు= భయంకరాలైన నిప్పురవ్వలు; నెవయఁగన్= ఎగురగా; నిషధునిమ్రోలన్= నిషధరాజు ఎదుట; తన, పొడవున్= తన యొక్క నిజరూపాన్ని; చూపెన్= చూపించాడు.

తాత్పర్యం: వాయుదేవుని మిత్రుడైన అగ్నిదేవుడు అవమానంతో దుఃఖపడి పొగలు క్రక్కుతూ, రోషంతో భయంకరాలైన నిప్పురవ్వలు ఎగిరేటట్లు నిజరూపాన్ని నిషధుని ముందు చూపించాడు.

వ. వాఁడును గడు భీతుండయి యగ్నిదేవునకు నమస్కరించి 'మహాపురుషా! నాయజ్ఞానంబు సహింపవలయు' నని ముకుళిత కరకమలుం డయిన వానికి వైశ్వానరుండు ప్రసన్నుండయి 'నీ కోరిన వరం బిచ్చెద వేఁడు'మనిన వాఁ డి ట్లనియె. 256

ప్రతిపదార్థం: వాఁడును= ఆ నిషధుడనే రాజుకూడ; కడున్= మిక్కిలి; భీతుండు+అయి= భయపడినవాడయి; అగ్నిదేవునకున్; నమస్కరించి; మహాపురుషా!; నా, అజ్ఞానంబు; సహింపవలయున్+అని; ముకుళిత, కర, కమలుండు+అయినన్= జోడించిన పద్మాల వంటి చేతులు కలవాడు కాగా; వానికిన్; వైశ్వానరుండు= అగ్నిహోత్రుడు; ప్రసన్నుండు+అయి= దయతో కూడినవాడై; నీ, కోరిన, వరంబు= నీవు కోరుకొన్నట్టి వరాన్ని; ఇచ్చెదన్; వేడుము+అనినన్= కోరుకొమ్మని అనగా; వాఁడు+ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అగ్నిహోత్రుని నిజ రూపం చూచి ఆ నిషధరాజు భయపడ్డాడు. 'మహాపురుషా! నా అజ్ఞానాన్ని సహించు' అని చేతులెత్తి నమస్కరించాడు. అప్పుడు అగ్నిహోత్రుడు దయదలచి 'నీవు కోరినవరం ఇస్తా వేడుకో' అని అనగా, అందుకు నిషధుడు ఇలా అన్నాడు.

విశేషం: వైశ్వానరుడు-విశ్వానరుని పుత్రుడు-అగ్ని. వైశ్వానరుడు శివుణ్ణి గురించి తపస్సు చేసి ఆయన అనుగ్రహంచేత ఆగ్నేయ మూలకు అధిపతి అయ్యాడు.

తే. ఇప్పురంబు జయింపంగ నెవ్వరేని । వత్తు రుద్ధతులయి శత్రువరులు వారు
దర్పమేది నీచేత నిర్దగ్ధులై వి । హీను లవునట్లుగా వర మిమ్ము నాకు. 257

ప్రతిపదార్థం: ఈ+పురంబు= ఈ మాహిష్మతీనగరాన్ని; జయింపంగన్= జయించటానికి; ఎవ్వరు+ఏనిన్= ఎవరైనా; శత్రు, వరులు= బలవంతులైన శత్రువులు; ఉద్ధతులు+అయి= విజృంభించిన వారై; వత్తురు (వచ్చుదురు)= వస్తారో; వారు= ఆ శత్రువులు; దర్పము= గర్వం; ఏది= నశించి; నీచేతన్; నిర్దగ్ధులు+ఐ= పూర్తిగా కాల్చబడినవాళ్ళయి; విహీనులు+అవునట్లుగాన్= మిగలకుండ నశించే వారయ్యేటట్లుగా; వరము+ఇమ్ము.

తాత్పర్యం: 'ఈ మాహిష్మతీ నగరాన్ని జయించటానికి బలమైన శత్రువులు ఎవరైనా విజృంభించి వస్తే, వాళ్ళు గర్వాన్ని కోల్పోయి నీచేత దగ్ధులై పూర్తిగా నశించేటట్లు నాకు వర మివ్వండి' అని ప్రార్థించాడు.

వ. అనిన నా రాజునకు నగ్నిదేవుం డభిమతం బయిన వరం బిచ్చి, 'మఱి నీవు నాకుం బ్రతిప్రియంబు సేయు; మిప్పురంబు నింతు లెంతయు మనోజరాగిణులు గావున వీరల స్వైరిణీవృత్తియెల్ల కాలంబు సహింపవలయు' నని యడిగిన, నాఁటంగోలె మాహిష్మతీ పురంబు స్త్రీలకు స్వైరిణీత్వంబు నిర్దోషంబయ్యె; నగ్నిదేవుండును నప్పురంబుపై వచ్చిన వారలనెల్ల దగ్ధ సైన్యులం జేయుచు దాని రక్షించుచుంటంజేసి పరరాష్ట్రపతు లగ్ని భయంబున నప్పురంబు పరిహరింతు; రది కారణంబుగా సహదేవు సైన్యంబెల్ల నగ్నిపరీతంబయినం జూచి సంచలింపక సహదేవుండు శుచియై వార్చి దర్భశయనంబున శయనించి యగ్నిసూక్తంబుల నగ్నిభట్టారకు ని ట్లని స్తుతియించె. 258

ప్రతిపదార్థం: అనినన్= అని నిషధరాజు వర మడుగగా; ఆరాజునకున్, అగ్నిదేవుండు; అభిమతంబు+అయిన= ఇష్టమైన; వరంబు+ఇచ్చి; మఱి; నీవు, నాకున్; ప్రతి ప్రియంబు= బదులుగా ఇష్టమైన దానిని; చేయుము; ఈ+పురంబు; ఇంతులు=

స్త్రీలు; ఎంతయున్= మిక్కిలి; మనోజరాగిణులు= మన్మథరాగాన్ని కలవాళ్ళు; కావునన్; వీరల; స్వైరిణీ, వృత్తి= స్వేచ్ఛా విహారం; వ్యభిచారం; ఎల్ల, కాలంబు; సహింపవలయున్; అని; అడిగినన్; నాటన్+కోలె= ఆనాటి నుండి; మాహిష్మతీ, పురంబు, స్త్రీలకున్; స్వైరిణీత్వంబు= వ్యభిచారం; నిర్దోషంబు+అయ్యె= తప్పులేని దయింది; అగ్నిదేవుండును; ఆ, పురంబుపై; వచ్చిన, వారలన్+ఎల్లన్= దండెత్తి వచ్చిన వారినందరిని; దగ్ధ, సైన్యులన్= దహించబడినసైన్యాలు కలవాళ్ళనుగా; చేయుచున్; దానిన్= ఆమాహిష్మతీపురాన్ని; రక్షించుచున్+ఉంటన్, చేసి= రక్షిస్తూ ఉండటంవల్ల; పరరాష్ట్రపతులు= ఇతరదేశాల రాజులు; అగ్ని, భయంబునన్= అగ్నివల్ల కలిగే భయంచేత; ఆ+పురంబు; పరిహరించుదురు= వదలివేస్తారు; అది; కారణంబుగా; సహదేవు, సైన్యంబు+ఎల్లన్= సహదేవుని సైన్యమంతా; అగ్ని, పరీతంబు+అయినన్= అగ్నిచే చుట్టబడింది కాగా; చూచి; సహదేవుండు; సంచలింపక= కలత చెందక; శుచి+ఐ= స్నానం చేసి పరిశుద్ధుడై; వార్చి= ఆచమనం చేసి; దర్భ శయనంబునన్= దర్భలతో కూర్చిన పడకమీద; శయనించి= పరుండి; అగ్ని సూక్తంబులన్= అగ్నికి సంబంధించిన వేదమంత్రస్తోత్రాలతో; అగ్ని భట్టారకున్= అగ్నిదేవుణ్ణి; ఇట్లు+అని= ఈ విధంగా; స్తుతియించెన్= స్తోత్రం చేశాడు.

తాత్పర్యం: అగ్నిదేవుడు నిషధరాజు కోరినట్లు వరమిచ్చి, అందుకు బదులుగా తన కిష్టమయిం దొకటి చేయవలసిందని అడిగాడు. 'మాహిష్మతీ పురస్త్రీలు శృంగారవతులు, మన్మథరాగం(కామం) అధికంగా కలవాళ్ళు, అందువల్ల వాళ్ళ వ్యభిచారాన్ని నీ వెప్పుడూ సహించాలి' అన్నాడు. ఆనాటినుండి ఆ పురస్త్రీల వ్యభిచారం తప్పు కాకుండా పోయింది. అగ్నిదేవుడుకూడ ఆ పురంమీద దండెత్తి వచ్చే వారి సైన్యాల్ని దగ్ధం చేస్తూ ఆ పురాన్ని రక్షిస్తూ ఉండటంచేత పరదేశభూపతులు అగ్నిభయంతో ఆదేశం మీదకి దండెత్తటం వదలివేశారు. అగ్నిదేవుడు ఆ కారణంచేతనే సహదేవుని సైన్యాన్ని చుట్టుకొన్నాడు. అయినా సహదేవుడు కలత చెందలేదు. స్నానం చేశాడు. శుచి అయ్యాడు. ఆచమనం చేసి దర్భలతో కూర్చిన పడకమీద పడుకొన్నాడు. వేదోక్తాలైన అగ్నిసూక్తాలతో అగ్నిదేవుణ్ణి ఈ విధంగా స్తుతించాడు.

సీ. 'నీ తదర్థంబులై నిఖిల వేదంబులు । వర్తిల్లు లోకపావనము లగుచుఁ;
బావనంబులలోనఁ బావనుండవు నీవ; । యజ్ఞంబులును నీవ హవ్యవాహ!
ధర్మనిత్యుండైన ధర్మజు కావించు । క్రతువు భవత్ప్రీతికరము గాదె!
దానికి విఘ్నంబు దలఁచుట ధర్మువె? । వరద! వైశ్వానర! వాయుమిత్త్ర!'

ఆ. యనిన నగ్నిదేవుఁ డతనికి సంప్రీతుఁ । డయి తదీయసేన కగ్నిభయముఁ
బాచె; దాని నెఱిఁగి భక్తుఁడై నీలుండు । కౌరవేంద్రుననుజుఁ గానవచ్చె. 259

ప్రతిపదార్థం: వరద!= వరాలిచ్చేవాడా!; వైశ్వానరా!= అగ్నిహోత్రా!; వాయుమిత్త్ర!= వాయుదేవునికి మిత్రుడా!; నీతదర్థంబులు+ఐ= నీకొరకైనవి; నిఖిల, వేదములు= అన్ని వేదాలు; లోక పావనములు+అగుచున్= లోకాన్ని పవిత్రం చేసేవై; వర్తిల్లున్= ఉంటున్నాయి; హవ్యవాహ!= అగ్నిహోత్రా!; పావనంబులలోనన్= పవిత్రాలైన వాటిల్లో; పావనుండవు= పవిత్రమైనవాడవు; నీవు+అ= నీవే; హవ్యవాహ!= అగ్నిదేవుడా!; యజ్ఞంబులును= యాగాలు కూడా; నీవు+అ= నీవే; ధర్మ, నిత్యుండు+ఐన= ఎడతెగని ధర్మాచరణం కలవాడైన; ధర్మజు, కావించు, క్రతువు= ధర్మరాజు చేసే యజ్ఞం; భవత్, ప్రీతికరము= నీకు ఇష్టమైంది; కాదు+ఎ= కాదా?; దానికిన్= ఆయజ్ఞానికి; విఘ్నంబు; తలఁచుట= ఆటంకాన్ని కలుగజేయాలనుకోవటం; ధర్మువు+ఎ= ధర్మమా?; అనినన్; అగ్నిదేవుఁడు; అతనికిన్= సహదేవుడికి; సంప్రీతుండు+అయి= మిక్కిలి ప్రీతి చెందినవాడయి; తదీయ, సేనకున్= అతనియొక్క సైన్యానికి; అగ్నిభయమున్; పాచెన్= తొలగించాడు; దానిన్+ఎఱిఁగి= దాన్ని తెలుసుకొని; నీలుండు= నీలుని వంశంవాడైన నిషధుడనే రాజు; భక్తుఁడై; కౌరవ+ఇంద్రు, అనుజున్= కౌరవపతి అయిన ధర్మరాజు తమ్ముణ్ణి-సహదేవుణ్ణి; కానవచ్చెన్= దర్శనం చేసుకొనటానికి వచ్చాడు.

తాత్పర్యం: 'ఓ వరదా! అగ్నిహోత్రా! వాయుమిత్రా! వేదాలన్నీ నీ కారణంగానే కదా లోకాన్ని పవిత్రం చేస్తున్నాయి. హవ్యవాహనా! పవిత్రాలైన వాటిలో పవిత్రుడివి నీవే. యజ్ఞాలుకూడా నీవే. ధర్మపరుడైన ధర్మరాజు చేసే రాజసూయయాగం నీకు ప్రీతికరం కాదా? దానికి విఘ్నం చెయ్యాలనుకోవటం నీకు ధర్మమా!' అని సహదేవుడనగా, అగ్నిదేవుడు సంతృప్తుడై అతని సేనకు అగ్నిభయాన్ని తొలగించాడు. దాన్ని తెలుసుకొని నీలుని వంశంవాడైన నిషధుడు భక్తితో సహదేవుని దర్శనం చేసుకొన్నాడు.

విశేషం: హవ్యవాహుడు - హవ్యాలను (హోమంలో వేసిన ఆహుతులను) దేవతలకు మోసుకొని పోయేవాడు - అగ్నిహోత్రుడు.

సహదేవుఁడు దక్షిణ దిఙ్మహీపతులచేఁ గప్పములు గొనుట (సం. 2-28-37)

క. దేవప్రభావుఁ డగు సహ । దేవునకు హయద్విపేంద్ర దివ్యాంబర నా
నా విధ రత్నమయాభర । ణావలి లలిఁ దెచ్చి యిచ్చె నధిక ప్రీతిన్. 260

ప్రతిపదార్థం: దేవప్రభావుఁడు+అగు= దేవతా సమానమైన తేజస్సు కలవాడైన; సహదేవునకున్; అధికప్రీతిన్= మిక్కిలి సంతోషంతో; హయ, ద్విప+ఇంద్ర, దివ్య+అంబర, నానావిధ, రత్నమయ+ఆభరణ+ఆవలిన్= గుర్రాలయొక్క, మదపుటేనుగుల యొక్క, మంచి వస్త్రాలయొక్క, అనేక విధాలైన రత్నాభరణాలయొక్క సమూహాన్ని; లలిన్= క్రమంగా; తెచ్చి, ఇచ్చెన్.

తాత్పర్యం: దేవసమానుడయిన సహదేవునికి ఎంతో ప్రీతితో గుర్రాల్ని, మదపుటేనుగుల్ని, మంచి వస్త్రాల్ని నానావిధరత్నాభరణాల్ని క్రమంగా తెచ్చి ఇచ్చాడు.

వ. ఇట్లు మాహిష్మతీపురంబు సాధించి నీలుచేత నరిగొని సహదేవుండు దక్షిణదిక్కున కరిగి సౌరాష్ట్రదేశంబున నుండి రుక్మి భీష్మక శూర్పారక దండక పతులచేత దూతముఖంబున నసంఖ్యాత ధనంబులు గొని సాగరద్వీపవాసు లైన నిషాదులం బురుషాదుల నేకపాదులం గాలముఖులం గర్ణప్రావరణుల నర రాక్షస యోనుల రామశైల కోలశైల తామ్రద్వీప సంజయంతీపుర నివాసులను వశగతులంజేసి. 261

ప్రతిపదార్థం: ఇట్లు; సహదేవుండు; మాహిష్మతీపురంబు, సాధించి; నీలుచేతన్; అరి, కొని= కప్పాన్ని గ్రహించి; దక్షిణ దిక్కునకున్+అరిగి= దక్షిణ దిశకు వెళ్ళి; సౌరాష్ట్రదేశంబునన్+ఉండి; దూతముఖంబునన్= దూతద్వారా; రుక్మి, భీష్మక, శూర్పారక, దండకపతులచేతన్; అసంఖ్యాత, ధనంబులు= అపరిమితాలైన సంపదలు; కొని= గ్రహించి; సాగరద్వీప, వాసులు+ఐన= సముద్ర ద్వీపాలలో నివసిస్తున్న; నిషాదులన్; పురుషాదులన్, ఏకపాదులన్; కాలముఖులన్; కర్ణ ప్రావరణులన్; నర, రాక్షస, యోనులన్= నర రాక్షస జాతులవాళ్ళను; రామశైల, కోలశైల, తామ్రద్వీప, సంజయంతీపుర, నివాసులను; వశగతులన్; చేసి= లోబరచుకొని.

తాత్పర్యం: ఈవిధంగా సహదేవుడు మాహిష్మతీపురాన్ని జయించి నిషధునిచేత కప్పం గ్రహించి, దక్షిణ దిశగా వెళ్ళి, సౌరాష్ట్రదేశంలో నిలిచి, దూతద్వారా - రుక్మి, భీష్మక, శూర్పారక, దండకరాజులచేత అపారధనాలు గ్రహించి, సముద్రద్వీపవాసులైన - నిషాద, పురుషాద, ఏకపాద, కాలముఖ కర్ణ ప్రావరణులనే నరరాక్షస జాతులవారిని, రామశైల, కోలశైల తామ్రద్వీప సంజయంతీపుర నివాసుల్ని వశపరచుకొని.

క. తాళవన పాండ్య కేరళ। కాళింగ ద్రవిడ యవన కరహాటక భూ
పాలకుల నోడిచి దక్షిణ। వేలావన భూములందు విడిసి కడంకన్. 262

ప్రతిపదార్థం: తాళవన, పాండ్య, కేరళ, కాళింగ, ద్రవిడ, యవన, కరహాటక; భూపాలకులన్= రాజులను; ఒడిచి= ఓడించి; దక్షిణ, వేలా, వన, భూముల+అందున్= దక్షిణ సముద్రపు చెలియలికట్ట చెంత ఉండే అడవి ప్రదేశాల్లో; విడిసి= దండు విడిసి; కడంకన్= పూనికతో.

తాత్పర్యం: తరువాత సహదేవుడు తాళవన, పాండ్య, కేరళ, కాళింగ, ద్రవిడ, యవన, కరహాటక రాజులను ఓడించి దక్షిణ సముద్రతీర వనభూముల్లో దండు విడిసి పూనికతో.

విశేషం: మూలంలో - ఆంధ్రాం స్తాళవనాంశ్చైవ (భండార్కరు ప్రతి. 2-28-48) అని ఉంది. నన్నయ పద్యంలో ఆంధ్రపదం లోపించింది. ఇది బుద్ధిపూర్వకమో (గౌరవప్రదమైన సందర్భం కాదు గనుక), లేక ఆయన చూచిన ప్రతులలో ఆ పదం లేదో!

చ. కురువిభు రాజసూయమునకున్ ధన మిచ్చిరి రాజులెల్ల నా
దరమునఁ బ్రీతి సేయునది దానును దప్పక యంచు లంక క
చ్చెరువుగఁ బుచ్చె దూతలఁ బ్రసిద్ధిగ నంత విభీషణుండు చె
చ్చెర సహదేవు శాసనము చేకొని సేసెఁ గరంబు నెమ్మితోన్. 263

ప్రతిపదార్థం: కురువిభు, రాజసూయమునకున్= కురువంశ ప్రభువైన ధర్మరాజుయొక్క రాజసూయ యాగానికి; ఆదరమునన్= మన్ననతో; రాజులు+ఎల్లన్= రాజులందరు; ధనము+ఇచ్చిరి; తానును= తానుకూడ; తప్పక; ప్రీతి, చేయునది= ప్రేమతో ధనం ఇవ్వవలసింది; అంచున్= అని, అంటూ; లంకకున్= లంకానగరానికి; అచ్చెరువుగన్= ఆశ్చర్యం కలిగేటట్లుగా; దూతలన్; పుచ్చెన్= పంపాడు; అంతన్= అప్పుడు; విభీషణుండు= విభీషణుడు; ప్రసిద్ధిగన్= గొప్పగా; చెచ్చెరన్= వేగమే; సహదేవు, శాసనము= సహదేవుని యొక్క ఆజ్ఞ; చేకొని= గ్రహించి; నెమ్మితోన్= ప్రేమతో, కరము, చేసెన్= కప్పాన్ని ఇచ్చాడు. (కరంబు నెమ్మితోన్= మిక్కిలి ప్రీతితో; అతని ఆజ్ఞ చేశాడు; ధనమిచ్చాడు).

తాత్పర్యం: సహదేవుడు దక్షిణసముద్రతీరవనభూముల్లో విడిది చేసి లంకాధిపతి అయిన విభీషణునికి దూతలద్వారా- 'ధర్మరాజురాజసూయానికి రాజులంతా ధనమిచ్చా'రని, 'నీవుకూడ ప్రీతితో ఈయవలసిం'దని చెప్పి పంపాడు. విభీషణుడు సహదేవుని ఆజ్ఞను శిరసావహించి వెంటనే ఆవిధంగా చేశాడు. (కప్పం తెచ్చి ఇచ్చాడు)

విశేషం: ఈ పద్యానికి ముందు కొన్ని ప్రతుల్లో 'ఇట్లు సేతు బంధన సమీపంబున విడిసిన సహదేవుండు ఘటోత్కచుం దలంచిన తత్‌క్షణంబ వచ్చి దండప్రణామంబు సేసి ముకుళితహస్తుం డయి పని యేమి యనుటయు, నీవు విభీషణుకడకుం జని యుపాయనంబు గొని రమ్మని పంచిన, వాఁడును గగనమార్గంబున లంకకుం జని రాక్షసేంద్రుండగు విభీషణునిఁ గాంచి, కృష్ణ సహాయుండగు ధర్మరాజు రాజసూయారంభంబును తత్కారణంబున భీమార్జున నకుల సహదేవుల దిగ్విజయార్థం బరుగుటయు, వారలలోన దక్షిణ దిశకుం జనుదెంచిన సహదేవు శాసనంబున తాను దూతయై వచ్చుటయుఁ దనపేరు భీమసేన పుత్త్రుం డయిన ఘటోత్కచుం డని విన్నవించి' అనే వచనం ఉంది. దీనికి మూలం శ్రీ పి.పి.యస్.శాస్త్రిగారి దాక్షిణాత్య సంస్కృత భారత ప్రతిలో 2-27-125 నుండి 203 వరకు ఉందిగాని భండార్కర్‌వారి సంస్కృత భారత ప్రతిలో

లేదు. - (మహాభారత సంశోధిత ప్రతి). (సౌకుమార్యమనే శబ్దగుణం సార్థకంగా ఈ పద్యరచనలో దర్శన మిస్తుంది. - సంపా.) త్రేతాయుగంనాటి విభీషణుడు చిరంజీవి గనుక ద్వాపరయుగంలో కూడా ఉన్నాడు.

మ. పరఁగన్ దక్షిణ దిఙ్మహీపతులచేఁ బౌలస్త్యుచే నిట్లు దు
ర్ధర శక్తిన్ సహదేవుఁ డర్థములు రత్నవ్రాతముల్ చందనా
గురు కాష్ఠాదులు గప్పముల్ గొనియెఁ బెక్కుల్ పేర్మితో నుర్వరా
మరలక్ష్మీకరుఁ డైన ధర్మసుతుసామ్రాజ్యంబు పూజ్యంబుగన్. 264

ప్రతిపదార్థం: సహదేవుఁడు; ఇట్లు= ఈ విధంగా; దుర్ధర, శక్తిన్= సహించ సాధ్యంగాని బలంతో; పరఁగన్= ఒప్పుగా; దక్షిణ, దిక్+మహీపతులచేన్= దక్షిణదిశలో ఉండే రాజులచేత; పౌలస్త్యుచేన్= పులస్త్య బ్రహ్మపుత్రుడైన విభీషణునిచేత; అర్థముల్= ధనాలు; రత్న, వ్రాతముల్= రత్నసమూహాలు; చందన+అగురు, కాష్ఠ+ఆదులు= మంచిగంధంయొక్క, అగురుయొక్క కొయ్యలు మొదలైన; కప్పముల్; పెక్కుల్= అనేకాలు; ఉర్వరా+అమర, లక్ష్మీకరుఁడు+ఐన= భూసురులకు (బ్రాహ్మణులకు) సంపదను కలిగించేవాడైన; ధర్మసుతు, సామ్రాజ్యంబు; పూజ్యంబుగన్= పూజించదగినది అయ్యేటట్లు; పేర్మితోన్= గౌరవంతో; కొనియెన్= గ్రహించాడు.

తాత్పర్యం: బ్రాహ్మణులకు సగౌరవంగా దక్షిణ లిచ్చే ధర్మరాజుసామ్రాజ్యం పూజ్యార్హ మయ్యేటట్లు సహదేవుడు సహించశక్యంగాని బలంతో, దక్షిణ దిశలో ఉండే రాజులచేత పులస్త్యుని పుత్రుడైన విభీషణునిచేత ధనాలు, రత్న సమూహాలు, మంచి గంధం చెక్కలు, అగరు కొయ్యలు మొదలైన కప్పాలు ఎన్నింటినో గ్రహించాడు.

విశేషం: ధర్మజుని చక్రవర్తివైభవం ధ్వనింపజేసే ఈ పద్యం ప్రసాదగుణరంజితంగా నన్నయ తీర్చిదిద్దాడు. (సంపా.)

నకులుఁడు పశ్చిమ దిగ్విజయంబు సేయుట (సం. 2-29-2)

క. నకులుఁడు పశ్చిమ దిక్కున । కకుటిల శౌర్యంబు మెఱయ నరిగి యరాతి
ప్రకర భయానక సేనా । ధికుఁడయి నిజతేజ మెల్లదిక్కుల వెలుఁగన్. 265

ప్రతిపదార్థం: నకులుఁడు; పశ్చిమదిక్కునకున్= పడమటి దిశకు; అకుటిల, శౌర్యంబు, మెఱయన్= మొక్కవోని శూరత్వం ప్రకాశించగా, అరిగి= వెళ్ళి; అరాతి, ప్రకర, భయానక, సేనా+అధికుఁడు+అయి= శత్రు సమూహానికి భయాన్ని కలిగించే సేన చేత మించినవాడై; నిజ, తేజము= తనయొక్క కాంతి; ఎల్ల, దిక్కులన్, వెలుఁగన్= అన్ని దిశల ప్రకాశించగా.

తాత్పర్యం: మొక్కవోని శౌర్యంతో నకులుడు పశ్చిమ దిశకు వెళ్ళి, శత్రు సమూహానికి భయం కలిగించే సేనతో అధికుడై తనకాంతి అన్నిదిక్కుల వెలుగగా.

ఉ. యోధుల సింహనాదము మదోత్కటవారణబృంహితంబు వే
గాధికవాజిహేషిత మహారవమున్ రథనేమిఘోషమున్
బాధితకర్ణరంధ్రమయి పర్వి దిగంతము లెల్ల మ్రోయ నం
భోధిరవంబపోలెఁ గురుపుంగవు నచ్చతురంగవాహినిన్. 266

ప్రతిపదార్థం: కురుపుంగవు= కురుశ్రేష్ఠుడైన నకులునియొక్క; ఆ+చతురంగ, వాహినిన్= ఆ రథ, గజ, తురంగ పదాతులతో కూడిన సైన్యంలో; యోధుల సింహనాదము= వీరులయొక్క గర్జన ధ్వని; మద+ఉత్కట, వారణ, బృంహితంబు= లెస్సగా మదించిన ఏనుగులయొక్క ఘీంకారం; వేగ+అధిక, వాజి, హేషిత, మహారవమున్= మిక్కిలి వేగంగల గుర్రాల సకిలింతలయొక్క పెద్దశబ్దం; రథనేమి ఘోషమున్= రథచక్రాల కమ్ముల ధ్వని; అంభోధి, రవంబు+అ, పోలెన్= నీటికి నిలయమైన సముద్రంయొక్క ఘోషవలె; బాధిత, కర్ణ, రంధ్రము+అయి= బాధించబడిన కర్ణ రంధ్రాలు కలదై; దిక్+అంతములు+ఎల్లన్= దిక్కులచివరి భాగాలన్నీ; మ్రోయన్= మారుమోగేటట్లు; పర్వెన్= వ్యాపించింది.

తాత్పర్యం: కురువంశ శ్రేష్ఠుడైన నకులుడి చతురంగ సైన్యంలో - వీరుల సింహనాదం, మదపుటేనుగుల ఘీంకారం, మిక్కిలి వేగంగల గుర్రాల సకిలింతల శబ్దం, రథ చక్రాల ధ్వని, సముద్రఘోషలా చెవుల్ని బ్రద్దలు చేస్తూ దిక్కులెల్ల మారు మ్రోగేటట్లు వ్యాపించింది.

విశేషం: అలం: ఉపమ.

వ. **ఇట్లు మాద్రేయుండు రౌద్రాకారంబునఁ గసిమసంగి మహాసేనాన్వితుండయి యరిగి మహాసేనరక్షితంబైన మహితక విషయంబున దత్తక మయూరకాది శూద్రులతోఁ గయ్యంబు చేసి, మరు మాళవ బర్బర కర్బర శైరీషక దాశార్ణ దేశంబుల రాజుల జయించి, పుష్కరారణ్యనివాసులైన యాభీరగణంబులను సరస్వతీసింధు కూలాశ్రితు లైన గ్రామణీయులను బంచనదామరపర్వతనివాసులను వశగతులం జేసికొని వాసుదేవునకు నిజాగమనం బెఱింగించి పుచ్చి.** **267**

ప్రతిపదార్థం: ఇట్లు; మాద్రేయుండు= మాద్రీ తనయుఁడైన నకులుడు; రౌద్ర+ఆకారంబునన్= భయంకరమైన రూపంతో; కసిమసంగి= విజృంభించి; మహాసేనా+అన్వితుండు+అయి= గొప్పసేనతో కూడుకొన్నవాడై; అరిగి= వెళ్ళి; మహాసేన, రక్షితంబు+ఐన= మహాసేనునిచేత రక్షింపబడిందైన; మహితక, విషయంబునన్= మహితకదేశంలో; దత్తక, మయూర+ఆది= దత్తకుడు, మయూరకుడు, మొదలయిన; శూద్రులతోన్; కయ్యంబుచేసి= యుద్ధం చేసి; మరు, మాళవ, బర్బర, కర్బర, శైరీషక, దాశార్ణ దేశంబుల, రాజులన్; జయించి; పుష్కర+అరణ్య, నివాసులు+ఐన; ఆభీరగణంబులను= యాదవ సమూహాలను; సరస్వతీ, సింధుకూల+ఆశ్రితులు+ఐన= సరస్వతీ సింధునదీ తీరాలను ఆశ్రయించి ఉండే; గ్రామణీయులను; పంచనద+అమర, పర్వత, నివాసులను; వశగతులన్+చేసికొని= లోబరచుకొని; వాసుదేవునకున్= శ్రీకృష్ణునికి; నిజ+ఆగమనంబు= తన రాకను; ఎఱింగించి పుచ్చి= తెలియబంపి.

తాత్పర్యం: ఈవిధంగా మాద్రీసుతు డైన నకులుడు భయంకరంగా విజృంభించి, పెద్దసైన్యాన్ని వెంటతీసికొని వెళ్లి, మహాసేనుని రక్షణలో ఉన్న మహితక దేశంలో దత్తక మయూరకాది శూద్రులతో యుద్ధం చేసి, మరు, మాళవ, బర్బర, కర్బర శైరీషక దాశార్ణదేశ రాజులను జయించాడు. పుష్కరారణ్యంలో నివసించే యాదవ సమూహాలను సరస్వతీ సింధు తీరాలలో ఉండే గ్రామణీయులను, పంచనద, అమర పర్వతాలలో ఉన్న వాళ్ళను వశపరచుకొని శ్రీకృష్ణునికి తనరాకను తెలియ చేశాడు.

విశేషం: ఆయా దేశాల పేర్ల విషయంలో భిన్నప్రతుల్లో భేదాలు ఉన్నాయి. 'గ్రామణేయా మహాబలాః' అని మూలం.

సీ. శాకలపురమందు శల్యు మద్రేశ్వరుఁ । దమ మేనమామ నుత్తమగుణాఢ్యుఁ
గానంగ నరిగి సత్కారపూర్వకముగా । వస్తువాహనములు వానిచేతఁ
గొని, పశ్చిమాంబుధి కుక్షినివాసులఁ । బరమదారుణుల బర్బర కిరాత
వీరుల నోడించి, విభుఁ డిట్లు వరుణేంద్ర । పాలిత దిఙ్మహీపతులచేత

ఆ. బలిమిఁ గొనిన ధనము పదివేలు లొట్టియల్ । పెఱిఁగి రాఁగ వైరిభీకరుండు
వచ్చె నకులుఁ డమిత వాహినీ పదహతిఁ । దల్లడిల్లుచుండ ధరణితలము. 268

ప్రతిపదార్థం: వైరి భీకరుండు= శత్రువులకు భయాన్ని కలిగించేవాడైన; నకులుఁడు; శాకల పురమందున్; శల్యు; మద్ర+ఈశ్వరున్= మద్రరాజును; తమ మేనమామన్; ఉత్తమగుణ+ఆఢ్యున్= ఉత్తమ గుణాలతో కూడుకొన్నవానిని; కానంగన్= చూడటానికి; అరిగి= వెళ్ళి; సత్కార పూర్వకముగన్= మర్యాద మున్నుగా; వస్తు, వాహనములు; వానిచేతన్; కొని= గ్రహించి; పశ్చిమ+అంబుధి, కుక్షి, నివాసులన్= పశ్చిమ సముద్ర గర్భంలో నివసించే వాళ్ళను; పరమ, దారుణులు= మిక్కిలి భయంకరులు అయిన; బర్బర, కిరాత వీరులన్; ఓడించి; విభుఁడు= ప్రభువు (నకులుడు); ఇట్లు= ఈవిధంగా; వరుణ+ఇంద్ర, పాలిత, దిక్+మహీపతులచేతన్= వరుణరాజుచేత పాలించబడే దిక్కులోని రాజులచేత; బలిమిన్, కొనిన= బలవంతంగా గ్రహించిన, ధనము= ధనాన్ని; పదివేల లొట్టియల్= పదివేల ఒంటెలు; పెఱిఁగి= మోసికొని; రాఁగన్; ధరణితలము= భూమిపైభాగం; అమిత, వాహినీ, పదహతిన్= అపారమైన సైన్యంయొక్క పాదాల తాకిడిచేత; తల్లడిల్లుచున్+ఉండన్= చలిస్తూ ఉండగా; వచ్చెన్= వచ్చాడు.

తాత్పర్యం: శత్రుజన భయంకరుడైన నకులుడు, శాకలపురంలో సద్గుణసమేతుడైన తన మేనమామ, మద్రపతి, శల్యుడిని చూడటానికి వెళ్ళాడు. మర్యాదపూర్వకంగా అతనిచేత అనేక వస్తు వాహనాలు గ్రహించాడు. పశ్చిమ సముద్ర గర్భంలో నివసించే పరమదారుణులు అయిన బర్బర కిరాత వీరుల్ని ఓడించాడు. పశ్చిమదిశలోని రాజులందరిచేత బలవంతంగా గ్రహించిన ధనాన్నంతా పదివేల ఒంటెలచేత మోయించుకొని అంతులేని సైన్య పాదఘట్టనతో భూతలం గ్రక్కదలేటట్లు వచ్చాడు.

విశేషం: అనేక ప్రతుల్లో శాకల్యపురమని ఉంది. 'శాకల మభ్యేత్య' అని మూలం (భండార్కరు ప్రతి 12-29-13). 'పదివేల లొట్టియల్ పెఱిఁగి రాఁగ' - కు 'పదివేల యొంటెలం బెటికి రాఁగ' అని ఒక పాఠాంతరం ఉంది.

వ. ఇట్లు భీమార్జున నకుల సహదేవులు పరాక్రమంబున దిగ్విజయంబుసేసి చతురుదధి పరీత మహీతలంబునంగల రాజులచేత నసంఖ్యాత ధన వస్తు వాహన నివహంబులు గొని వచ్చి వేఱు వేఱ ధర్మరాజునకుం జూపి యిచ్చిన. 269

ప్రతిపదార్థం: ఇట్లు; భీమ+అర్జున, నకుల, సహదేవులు; పరాక్రమంబునన్= పరాక్రమంతో; దిక్+విజయంబు, చేసి= నాలుగు దిక్కులను జయించి; చతుః+ఉదధి, పరీత, మహీతలంబునన్= నాలుగు సముద్రాలచే వ్యాప్తి చెందిన భూప్రదేశంలో; కల= ఉన్న; రాజులచేతన్; అసంఖ్యాత ధన, వస్తు, వాహన, నివహంబులు= లెక్కకు మిక్కిలిగా ధన వస్తు వాహన సమూహాలు; కొనివచ్చి= తీసుకొనివచ్చి; వేఱువేఱన్, ధర్మరాజునకున్; చూపి; ఇచ్చినన్.

తాత్పర్యం: ఈ విధంగా భీమార్జున నకుల సహదేవులు నలుగురు పరాక్రమంతో దిక్కులను జయించి, నాలుగు సముద్రాలచే వ్యాప్తినొందిన భూమిమీద గల రాజులందరిచేత లెక్కకు మిక్కిలిగా ధన వస్తు వాహన సమూహాలు తీసుకొనివచ్చి, వేరు వేరుగా ధర్మరాజుకు చూపి ఇచ్చారు.

క. ఉరుగుణవిశుద్ధ రత్నో। త్కర నానాధన సమృద్ధిఁ గడు నధికుండై
కురువృషభుఁడు గీడ్పఱిచెను। వరుణ ధనేశ్వరుల విభవ వైభవయుక్తిన్. 270

ప్రతిపదార్థం: కురువృషభుఁడు= కురువంశ శ్రేష్ఠుడైన ధర్మరాజు; ఉరు, గుణ, విశుద్ధ, రత్న+ఉత్కర, నానా, ధన సమృద్ధిన్= గొప్ప శ్రేష్ఠత గల స్వచ్ఛమైన రత్నసమూహాలతో కూడుకొన్న వివిధసంపదలయొక్క నిండుదనంచేత; కడున్= మిక్కిలి; అధికుండు+ఐ= ఎక్కువ వాడై; విభవ వైభవ యుక్తిన్= ఐశ్వర్యంయొక్క ఆధిక్యంతో కూడి ఉండటంలో; వరుణ, ధన+ఈశ్వరుల= వరుణదేవుని, కుబేరుని; కీడు, పఱిచెను= క్రిందు చేశాడు.

తాత్పర్యం: కురువంశ శ్రేష్ఠుడైన ధర్మరాజు ఎంతో శ్రేష్ఠత గల స్వచ్ఛమైన రత్న సమూహాలతో కూడుకొన్న నానావిధ ధనసమృద్ధితో అత్యధికుడై, ఆ వరుణకుబేరులనే తక్కువ చేశాడు.

విశేషం: రత్నాలకు స్థానం సముద్రం. అందుచేతనే దానికి రత్నాకరం అని కూడ పేరు. రత్నాకరా లన్నింటికి అధిపతి వరుణుడు. రత్నసంపదలో ఆయన అందరికంటే అధికుడు. ధనపతి కుబేరుడు. ఆయనకు ధనదు డని కూడ పేరు. ధనసమృద్ధిలో కుబేరుని మించినవాళ్ళు లేరు. రత్నసంపదలో, ధనసంపదలో ధర్మరాజు- అలాంటి వరుణకుబేరులనే తక్కువ చేశాడు.

రాజసూయము సేయుమని ధర్మజున కతనియాప్తులు సెప్పుట (సం. 2-30-8)

వ. మఱియు ధర్మోపార్జిత రక్షిత ప్రవర్ధితంబయిన మహాధనవర్గంబుఁ జూచి పాత్రప్రతిపాదనంబు నియోగింప సమకట్టి రాజసూయాధ్వరారంభసుస్థిరనివేశితబుద్ధియై యున్న యయ్యుధిష్ఠిరు నభిప్రాయంబున కనుగుణంబుగా నాప్తమంత్రు లి ట్లనిరి. 271

ప్రతిపదార్థం: మఱియున్= అంతే కాక; ధర్మ+ఉపార్జిత, రక్షిత, ప్రవర్ధితంబు+అయిన= ధర్మ పద్ధతిన సంపాదించబడి, రక్షింపబడి లెస్సగా వృద్ధి పొందించబడిన; మహా, ధన, వర్గంబున్= గొప్ప ధన సమూహాన్ని; చూచి; పాత్ర, ప్రతిపాదనంబు= తగిన రీతిని వినియోగాన్ని-అంటే తగిన రీతిలో ఖర్చు చేయటాన్ని, తగిన వారికి దానరూపంలో ఇచ్చి వేయటాన్ని; నియోగింపన్= ఆజ్ఞాపించ; సమకట్టి= పూనుకొని; రాజసూయ+అధ్వర+ఆరంభ, సుస్థిర, నివేశిత, బుద్ధి+ఐ= రాజసూయయాగాన్ని ప్రారంభించటంలో చొప్పించిన మనస్సు కలవాడై; ఉన్న; ఆ+యుధిష్ఠిరు+అభిప్రాయంబునకున్= ఆ ధర్మరాజుయొక్క ఉద్దేశానికి; అనుగుణంబుగాన్= తగినట్లుగా; ఆప్తమంత్రులు; ఇట్లు+అనిరి.

తాత్పర్యం: క్షత్రియధర్మాన్ని అనుసరించి ఆర్జించి, రక్షించి, లెస్సగా వృద్ధిచెందించిన మహాధనసమూహాన్నంతా చూచి, తగిన రీతిగా దానివినియోగాన్ని ఆజ్ఞాపించటానికి పూనుకొని, రాజసూయయాగ ప్రారంభాన్నిగూర్చి గట్టిగా ఆలోచిస్తున్న ధర్మరాజు అభిప్రాయానికి తగినట్లు అతని ఆప్తమంత్రులు ఈ విధంగా అన్నారు.

సీ. **కురువీర! నీ ధర్మపరిపాలనంబున । నీ గుణసంపద నీ విశుద్ధ**
చారిత్రమునఁ జేసి ధారుణి ప్రజ కెల్ల । నభివృద్ధియయ్యె నెయ్యంబుతోడ;
రాజవంచకులయు రాజవల్లభులయుఁ । దస్కరులయు బాధ దఱిఁగె; రుజయుఁ
బగయును భయమును వగయును వెఱపును । నాదిగాఁ గల యెగ్గు లడఁగెఁ బుడమి;

ఆ. **నర్ఘు లోలిఁ బెరిఁగె; నవనీశులెల్ల నీ । యనుజవీర్యవిజితు లయి త్వదీయ**
శాసనస్థు లయిరి జగతీశ! యిదియ నీ । యజ్ఞ కార్యమునకు నవసరంబు. **272**

ప్రతిపదార్థం: కురువీర= కురువంశ వీరుడివైన ఓ ధర్మరాజా!; నీ, ధర్మ పరిపాలనంబునన్= నీయొక్క ధర్మమైన పరిపాలనచేత; నీ, గుణ, సంపదన్= నీయొక్క సుగుణ సంపదచేత; నీ, విశుద్ధ, చారిత్రమునన్+చేసి= నీ నిర్మలమైన నడవడిచేత; ధారుణి, ప్రజకున్+ఎల్లన్= భూమిమీది జనులందరికి; నెయ్యంబుతోడన్= ఇంపుతో; అభివృద్ధి; అయ్యెన్= కలిగింది; రాజ వంచకులయు= రాజును మోసగించే వాళ్ళ వల్ల; రాజవల్లభులయు= రాజుకు ఇష్టులైనవాళ్ళవల్ల; తస్కరులయు= దొంగలవలన; బాధ; తఱిఁగెన్= తగ్గిపోయింది; పుడమిన్= భూమిలో; రుజయున్= రోగము; పగయును; భయమును; వగయును= దుఃఖమును; వెఱపును; ఆదిగాన్, కల= మొదలయిన; ఎగ్గులు= కీడులు; అడఁగెన్= తొలిగాయి; అర్ఘులు+ఓలిన్= వెలలు క్రమంగా; పెరిఁగెన్; అవనీ+ఈశులు+ఎల్లన్= రాజులందరు; నీ, అనుజ, వీర్య, విజితులు+అయి= నీ తమ్ముల పరాక్రమంచేత జయించబడినవాళ్ళయి; త్వదీయ, శాసనస్థులు+అయిరి= నీయొక్క ఆజ్ఞకు లోబడిన వాళ్ళయ్యారు. జగతీ+ఈశ= మహారాజా! ఇది+అ= ఇదే; నీ, యజ్ఞకార్యమునకున్= నీ రాజసూయ యజ్ఞానికి; అవసరంబు= తగిన సమయం.

తాత్పర్యం: కురువంశవీరుడివైన ఓధర్మరాజా! నీ ధర్మపరిపాలనచేత, నీ సుగుణసంపదచేత, నీ నిష్కళంక ప్రవర్తనచేత ఈభూమిమీది ప్రజలందరికి ప్రియమార అభివృద్ధి కలిగింది. రాజును మోసం చేసేవారివల్ల, రాజుకు ఇష్టులైన వాళ్ళవల్ల, దొంగలవల్ల బాధ తగ్గిపోయింది. రోగం, పగ, భయం, దుఃఖం మొదలయిన కష్టాలు తొలగిపోయాయి. వెలలు క్రమంగా పెరిగాయి. పరాక్రమంలో నీ తమ్ములు రాజులందరినీ జయించారు. అందరు రాజులు నీ ఆజ్ఞకు లోబడి ఉన్నారు. మహారాజా! నీవు రాజసూయం చేయటానికి ఇదే తగిన సమయం.

విశేషం: 'రాజవల్లభులయు' అనే దానికి 'రాష్ట్రవంచకులయు' అని కొన్ని ప్రతులలో పాఠాంతరం ఉంది. కాని మూలంలో 'రాజవల్లభ' శబ్దమే ప్రయుక్తమై ఉంది. (భండార్కరు ప్రతి 2-30-4,5). రాజవల్లభు లంటే రాజుకు ప్రియులు. -రాజుగారి బావమరిదిలాంటి వాళ్ళు. అలాంటివాళ్ళు రాజుగారికి తామంటే ఉండే ప్రియత్వాన్ని దుర్వినియోగంచేసి ప్రజలను బాధించే అవకాశం ఉంది.

వ. **'మఱియు నపరిమిత పరార్ఘ్యరత్న రజత సువర్ణ పరిపూర్ణంబయి మహామేరుశైలంబు సన్నిహితంబైన యట్లు యక్షేశ్వరు నక్షయనిధులు ప్రత్యక్షంబైన యట్లు భాండాగారంబు సమృద్ధంబైన యది; ఘృతలవణతైల తండుల ధాన్యాది సమస్త వస్తు విస్తృతంబయి కోష్ఠాగారంబు సకల సంకల్ప సిద్ధి కరంబై కల్పద్రుమంబు ననుకరించుచున్న యది; వేదంబు లన్నియు మూర్తిమంతంబులయిన యట్లు మహాయాజ్ఞికు లయిన మహీసురవరులు నీ యభ్యుదయంబు గోరుచున్నవారు గావున రాజసూయాధ్వరం బెడసేయక చేయు'మని పలుకుచున్న యవసరంబున.** **273**

ప్రతిపదార్థం: మఱియున్; అపరిమిత, పర+అర్ఘ్య, రత్న, రజత, సువర్ణ, పరిపూర్ణంబు+అయి= అపారమైన శ్రేష్ఠత, విలువ గల రత్నాలతో, వెండితో, బంగారుతో నిండి; మహా, మేరు, శైలంబు= గొప్పదైన మేరుపర్వతం; సన్నిహితంబు+ఐన+అట్లు= సమీపానికి వచ్చినట్లు; యక్ష+ఈశ్వరు+అక్షయ, నిధులు= యక్షులరాజైన కుబేరునియొక్క తిరుగులేని నిధులు(తొమ్మిది); ప్రత్యక్షంబు+ఐన+అట్లు= కంటి ఎదుట కన్పించినట్లు; భాండ+అగారంబు= బొక్కసం (ధనం నిలువ ఉంచేచోట; ఖజానా); సమృద్ధంబు+ఐన, అది= పూర్తిగా నిండి ఉన్నది; ఘృత, లవణ, తైల, తండుల, ధాన్య+ఆది, సమస్త, వస్తు, విస్తృతంబు+ అయి= నెయ్యి, ఉప్పు, నూనె, బియ్యం, పప్పులు మొదలయిన అన్ని వస్తువులతో నిండి; కోష్ఠ+అగారంబు= వస్తువులను నిలవ చేసే గది; సకల, సంకల్ప, సిద్ధికరంబు+ఐ= అన్నికోర్కెలను తీర్చేటటువంటిదైన; కల్పద్రుమంబును= కల్పవృక్షాన్ని; అనుకరించుచున్+ఉన్న, అది= పోలి ఉన్నది; వేదంబులు+అన్నియున్; మూర్తిమంతంబులు+అయిన, అట్లు= రూపాలు తాల్చినట్లు; మహాయాజ్ఞికులు+అయిన= గొప్పగా యజ్ఞం చేయించేవాళ్ళయిన; మహీసురవరులు= బ్రాహ్మణశ్రేష్ఠులు; నీ, అభ్యుదయంబు= నీయొక్క అభివృద్ధిని; కోరుచున్+ఉన్నవారు; కావునన్; రాజసూయ+అధ్వరంబు= రాజసూయయాగం; ఎడ, చేయక= ఆలస్యం చేయకుండ; చేయుము+అని; పలుకుచున్+ఉన్న; అవసరంబునన్= సమయంలో.

తాత్పర్యం: 'అంతేకాదు, అపరిమితమైన శ్రేష్ఠత, విలువ ఉన్న రత్నాలతో, వెండితో, బంగారంతో, మహామేరుపర్వతం సమీపించినట్లు, కుబేరుని అక్షయనిధులు ప్రత్యక్షమైనట్లు ధనాగారం పూర్తిగా నిండుగా ఉంది. వస్తువుల్ని నిలువ ఉంచే గృహం నెయ్యి, ఉప్పు, నూనె, బియ్యం, పప్పులు మొదలైన సమస్తవస్తువులతో నిండి అన్ని కోర్కెలను తీర్చే కల్పవృక్షంలా ఉంది. వేదాలన్నీ రూపుతాల్చి వచ్చినట్లున్న మహాయాజ్ఞికులైన బ్రాహ్మణోత్తములంతా నీ అభివృద్ధిని కోరుతున్నారు. అందుచేత రాజసూయయాగం ప్రారంభించు; ఆలస్యం చేయవద్దు' అని పలుకుతున్న సమయంలో.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష, ఉపమ. అలంకారాలు రమణీయాలై ధర్మరాజు సంపత్సమృద్ధిని చక్కగా సూచిస్తున్నాయి. ఇచటి విశేషణాలు ఉపమానోపమేయాలు రెండింటితో అన్వయిస్తాయి.

శ్రీకృష్ణుఁడు ద్వారకనుండి వచ్చుట (సం. 2-30-9)

క. **ద్వారవతినుండి జగదా। ధారుఁడు గృష్ణుండు వచ్చి ధర్మజు ధర్మ**
ప్రారంభనిత్యు నుత్తము। భూరిధనంబులను రత్నములఁ బూజించెన్. **274**

ప్రతిపదార్థం: ద్వారవతినుండి= ద్వారకానగరంనుండి; జగత్+ఆధారుఁడు= లోకానికి ఆధారమైనవాడు; కృష్ణుండు; వచ్చి; ధర్మ, ప్రారంభ, నిత్యున్= యజ్ఞాన్ని ప్రారంభించటంలో స్థిరమైన మనస్సు కలవాణ్ణి; ఉత్తమున్= శ్రేష్ఠుడైనవాణ్ణి; ధర్మజున్= ధర్మజుని; భూరి ధనంబులను= అధిక ధనాలచేత; రత్నములన్= రత్నాలచేత; పూజించెన్.

తాత్పర్యం: ద్వారకానగరంనుండి జగదాధారుడైన శ్రీకృష్ణుడు వచ్చి రాజసూయయాగాన్ని ప్రారంభించాలన్న స్థిరసంకల్పంతో ఉన్నవాడూ, ఉత్తముడూ అయిన ధర్మరాజుకు అధికధనాలు రత్నాలు ఇచ్చి గౌరవించాడు.

విశేషం: సరిగా ఈ సమయానికే జగన్నాటకసూత్రధారి శ్రీకృష్ణుడు తనంత తానే రావటం ఒక విశేషం.

వ. **ధర్మరాజును జగదర్చితుం డయిన యచ్యుతు నర్ఘ్యాదివిధులం బూజించి తమ్ములయు ధౌమ్య ద్వైపాయనాదులయు ఋత్విజులయు నాప్తమంత్రులయు సమక్షంబున నధోక్షజున కి ట్లనియె.** **275**

ప్రతిపదార్థం: ధర్మరాజును= ధర్మరాజు కూడ; జగత్+అర్చితుండు+అయిన= లోకంచే పూజించబడినవాడైన; అచ్యుతున్= శ్రీకృష్ణుణ్ణి; అర్ఘ్య+ఆది= అర్ఘ్య మివ్వటం మొదలైన; విధులన్= పూజా పద్ధతులతో; పూజించి; తమ్ములయు= తమ్ముళ్ళయొక్క ధౌమ్య+ద్వైపాయన+ఆదులయు= ధౌమ్యుడు, వ్యాసుడు మొదలయిన వాళ్ళయొక్క; ఋత్విజులయున్= యజ్ఞం చేయించే బ్రాహ్మణులయొక్క; ఆప్త, మంత్రులయు= ఆప్తులైన మంత్రులయొక్క; సమక్షంబునన్= ఎదుట; అధోక్షజునకున్= శ్రీకృష్ణునికి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: లోకంచేత పూజలందుకొనే శ్రీకృష్ణుణ్ణి, ధర్మరాజు అర్ఘ్యపాద్యాదులిచ్చి పూజించాడు. తమ్ముళ్ళు, ధౌమ్య ద్వైపాయనాదులు, ఋత్విజులు, ఆప్తమంత్రులు ఉండగా అందరి సమక్షంలో శ్రీకృష్ణునితో ఇలా అన్నాడు.

విశేషం: అధోక్షజుడు - ఇంద్రియాలను అధఃకరించి జన్మించినవాడు, జితేంద్రియులకు- అంటే ఇంద్రియాలను జయించినవాళ్ళకు- ప్రత్యక్షమయ్యేవాడు - శ్రీకృష్ణుడు. ధౌమ్యుడు పాండవపురోహితుడు.

మత్తకోకిలము.

> **ధారుణీధర! ధర్మతత్త్వనిధాన! దానవదర్ప సం**
> **హార! వారిజనాభ! బంధుజనానురంజనకారి! నీ**
> **కారణంబునఁ జేసి మాకు జగంబునం గల భూపతుల్**
> **భూరివిక్రమవశ్యు లైరి విభుత్వ మేర్పడుచుండఁగన్.** 276

ప్రతిపదార్థం: ధారుణీధర= భూమిని ధరించినవాడా! శ్రీకృష్ణా! ధర్మ, తత్త్వ, నిధాన= ధర్మతత్త్వానికి ఉనికిపట్టు అయినవాడా!; దానవ, దర్ప, సంహార= రాక్షసులయొక్క గర్వాన్ని అణచినవాడా!; వారిజనాభ= నీటినుండి పుట్టిన పద్మం బొడ్డులో కలవాడా!; బంధు, జన+అనురంజనకారి= బంధుజనులకు సంతోషాన్ని కలిగించేవాడా! నీ, కారణంబునన్+చేసి= నీకారణంచేత; జగంబునన్+కల= లోకంలో ఉండే; భూపతుల్= రాజులు; మాకున్; విభుత్వము+ఏర్పడుచున్+ఉండఁగన్= మాకు సార్వభౌమాధికారం కలిగేటట్లు; భూరి, విక్రమ, వశ్యులు+ఐరి= మా గొప్ప పరాక్రమానికి లొంగిపోయినవా ళ్ళయ్యారు.

తాత్పర్యం: భూమిని ధరించినవాడా! ధర్మతత్త్వానికి ఉనికిపట్టయినవాడా! రాక్షసులగర్వం అణచినవాడా! పద్మనాభా! బంధుజనులకు ఆనందాన్ని కలిగించేవాడా! నీ కారణాన్నే కదా మాకు సార్వభౌమాధికారం కలిగేటట్లు లోకంలోని రాజులంతా మా పరాక్రమానికి లొంగిపోయారు.

విశేషం: మత్తకోకిలవృత్తంలోని ప్రతిపాదంలోనూ వరుసగా ర,స,జ,జ,భ,ర అనే గణాలు ఉంటాయి. 18 అక్షరాల చరణంలో 11వ అక్షరం యతిస్థానం. ప్రాసనియమం ఉంది. భక్తికవితకు బీజప్రాయమైన లక్షణాలు ఈ పద్యరచనలో మాధుర్యగుణంతో కలిసి శోభిస్తున్నాయి. (సంపా.)

> **క. క్షితిపతులవలన సముపా । ర్జితమైన ధనంబు కొలఁదిఁ జెప్పఁగ వాచ**
> **స్పతికి నశక్యము; దీనిం । బ్రతిపాదింపంగవలయుఁ బాత్రవశమునన్.** 277

ప్రతిపదార్థం: క్షితి, పతులవలన= భూపతులనుండి - రాజులనుండి; సమ్+ఉపార్జితము+ఐన= లెస్సగా సంపాదించబడిన; ధనంబు, కొలఁదిన్= డబ్బు యొక్క పరిమాణాన్ని; చెప్పగాన్= చెప్పటానికి; వాచస్పతికిన్= బృహస్పతికైనా; అశక్యము= సాధ్యం కాదు; దీనిన్= ఈధనాన్ని; పాత్రవశమునన్= అర్హులైన వాళ్ళకు చెందేటట్లు; ప్రతిపాదింపంగన్ వలయున్= దానంగా ఇవ్వాలి.

తాత్పర్యం: రాజులనుండి సంపాదించిన ధనరాసుల పరిమాణమెంతో తేల్చి చెప్పటం ఆ బృహస్పతికికూడ సాధ్యం కాదు. ఇక ఈ ధనాన్ని అర్హులైనవారికి దానం చేయాలి.

వ. 'దేవముఖం బైన యగ్నిదేవుముఖంబున విధ్యుక్తంబుగా వేల్చి, దేవతర్పణంబును, యథోచితదక్షిణల నభీష్టదానంబుల మహీదేవ తర్పణంబునుం జేయవలయుం గావున నీ కిష్టంబయిన యజ్ఞంబు చేయించి, నాకును, లోకంబులకుం బ్రియంబు సేయు; మొండె నన్ను రాజసూయాధ్వర విధానంబునందు నియోగించి యనుగ్రహింపు' మనిన యుధిష్ఠిరునకు నారాయణుం డి ట్లనియె. 278

ప్రతిపదార్థం: దేవముఖంబు+ఐన= దేవతలకు నోరైన; అగ్నిదేవుముఖంబునన్= అగ్నిదేవునియొక్క నోటితో; విధి+ఉక్తంబుగాన్= శాస్త్రంలో చెప్పబడినవిధంగా; వేల్చి= ఆహుతులను వేసి; దేవ, తర్పణంబును= దేవతలకు తృప్తిని; యథా+ఉచిత దక్షిణలన్= తగిన దక్షిణలను ఇవ్వటంచేత; అభీష్ట, దానంబులన్= కోరినదానాలు ఇవ్వటంచేత; మహీదేవ, తర్పణంబునున్= భూదేవతలైన బ్రాహ్మణులకు తృప్తిని; చేయవలయున్; కావునన్; నీకున్; ఇష్టంబు+అయిన; యజ్ఞంబు; చేయించి; నాకును; లోకంబులకున్; ప్రియంబు; చేయుము; ఒండెన్= అట్లాకాకుంటే; నన్నున్; రాజసూయ+అధ్వర, విధానంబునందున్= రాజసూయయాగ కార్యక్రమంలో, నియోగించి= నియమించి; అనుగ్రహింపుము= దయ చూపుము; అనినన్; యుధిష్ఠిరునకున్= ధర్మరాజుకు; నారాయణుండు= శ్రీకృష్ణుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'దేవతలకు ముఖమైన అగ్నిదేవుని ముఖంలో శాస్త్రోక్తంగా వేసిన ఆహుతులతో దేవతల్ని, తగిన దక్షిణలతో, కోరిన దానాలతో బ్రాహ్మణుల్ని తృప్తి పరచాలి. అందుచేత నీ కిష్టమైన యజ్ఞం చేయించి నాకు, లోకాలకు ప్రియంచేయండి. అలా కాకుంటే, నన్ను రాజసూయ యాగకార్యక్రమంలో నియమించి అనుగ్రహించండి'- అని పలికిన ధర్మరాజుకు శ్రీకృష్ణు డిలా అన్నాడు.

విశేషం: పరాక్రమార్జిత మైన సంపదను యజ్ఞంచేసి ప్రభువు యోగ్యులకు పంచిపెట్టటం భారతీయ సంప్రదాయం. దానంతోనే ధనం రాణిస్తుం దని భారతీయభావన. అర్థం ధర్మబద్ధం కాకపోతే, పురుషయత్నం దైవానుకూల్యాన్ని పొందకపోతే వ్యర్థా లౌతాయి. అందువల్ల ధర్మరాజు పరమాత్ముడైన శ్రీకృష్ణుని యెదుట 'సంపదను యోగ్యుల కందజేసే యే యజ్ఞాన్నైనా చేయించు' అన్నాడు - మొదట. 'నీకు అంగీకార మైతే నన్ను రాజసూయయాగ కార్యక్రమంలో నియమించి అనుగ్రహించు' అన్నాడు - తరువాత, మానవుడు కోరుకొంటాడు కాని ఏ కోరిక యోగ్యమైనదో నిర్ణయించేది దైవం. అందువలన శ్రీకృష్ణునిమీదనే భారం ఉంచి, దైవానుకూల్యం ఉన్నకార్యాన్ని నిర్దేశించండి - అని ధర్మరాజు అర్థించాడు. (సంపా.)

ఉ. పూజ్యుఁడ వెల్ల వంశముల భూపతులందును, ధర్మ నిర్మల
ప్రాజ్యవిభూతి నద్దివిజపాలకు నట్టిఁడ నీక యొప్పె సా
మ్రాజ్యము దైవసంపదయు మానుషసంపదపేర్మి కావునన్
యాజ్యుఁడ విప్డు నీవ భరతాన్వయభూషణ! ధర్మనందనా! 279

ప్రతిపదార్థం: భరత+అన్వయ, భూషణ!= భరతునియొక్క వంశానికి అలంకారమైనవాడా, ధర్మనందనా!; ఎల్ల వంశముల, భూపతుల+అందును= అన్ని వంశాల రాజుల్లోను; పూజ్యుఁడవు= పూజింప దగినవాడివి; ధర్మ, నిర్మల, ప్రాజ్య, విభూతిన్= ధర్మంచేత స్వచ్ఛమై అధికమైన ఐశ్వర్యంలో; ఆ+దివిజ, పాలకు+అట్టిఁడు+అ= ఆ స్వర్గలోక పాలకుడైన ఇంద్రుని వంటివాడా; సామ్రాజ్యము; దైవ, సంపదయు= దైవబలం; మానుష సంపద పేర్మి= మానవ బలంయొక్క ఆధిక్యం; నీకు+అ= నీకే; ఒప్పెన్= అమరిఉంది; కావునన్; యాజ్యుఁడవు= యజ్ఞం చేయదగినవాడివి; ఇప్డు= ఇప్పుడు; నీవు+అ= నీవే.

తాత్పర్యం: భరత వంశానికి అలంకారమైనవాడా! ధర్మనందనా! అన్ని రాజ వంశాల్లో నీవు పూజించదగినవాడివి. ధర్మంచేత స్వచ్ఛమైన, అధికమైన ఐశ్వర్యంలో దేవేంద్రుని వంటి వాడివి. సామ్రాజ్యం దైవబలం, మానవబలం గొప్పగా నీకే అమరి ఉన్నాయి. అందుచేత ఇప్పుడు యజ్ఞం చేయదగినవాడివి నీవే.

విశేషం: మానుషసంపదతోపాటు దైవీసంపదకూడ కలిసి ధర్మజునికి సామ్రాజ్యయోగాన్ని కలిగించాయని శ్రీకృష్ణు డంగీకరించాడు. యజ్ఞం దైవస్వరూపం. దానిని నిర్వహించే అధికారం ధర్మరాజుకు ఉన్నదని ఈ విధంగా శ్రీమన్నారాయణ స్వరూపుడైన శ్రీకృష్ణుడు ధ్రువీకరించాడు. అర్థవ్యక్తి గుణరంజకమైన రచన ఈ పద్యం. (సంపా.)

క. పంపం దగుఁ దగ దని శం । కింపక నీ కిష్టమయిన కృత్యముల నియో
గింపుము నన్ను భవద్గుణ । సంపత్ప్రవణుల సమస్తజనుల జనేశా! 280

ప్రతిపదార్థం: జన+ఈశా!= జనులకు ప్రభువైన ఓ ధర్మరాజా!; పంపన్+తగున్, తగదు+అని= ఈపని చెప్పదగును, చెప్పతగదు అని; శంకింపక= సంకోచించక; నీకున్+ఇష్టము+అయిన; కృత్యములన్= పనుల్లో, నన్నున్= నన్ను; భవత్+గుణసంపత్+ ప్రవణులన్= నీయొక్క గుణ సంపదలపై ఆసక్తి గలవాళ్ళయిన; సమస్త జనులన్= అందరు వ్యక్తులను; నియోగింపుము= నియమించుము.

తాత్పర్యం: ధర్మరాజా! ఈ పని చెప్పతగినది, చెప్పతగనిది - అని ఏమాత్రం సంకోచించకుండ నీ కిష్టమైన పనుల్లో నన్ను, నీ గుణసంపదపట్ల ఆసక్తి ఉన్న అందరు వ్యక్తులను నియమించు.

విశేషం: యజ్ఞస్వరూపుడు, యజ్ఞపతి, యజ్ఞభోక్త, యజ్ఞకర్త అన్నీ తానే అయిన శ్రీకృష్ణపరమాత్ముడు తన్ను తాను ఆ విధంగా అర్పించుకోవటం రాజసూయమహాయజ్ఞనిర్వహణకు పూనుకొన్న ఆ ధర్మరాజుకు ఎంత ఆనందహేతువైందో! ఎంత గౌరవకారణమైందో! ఎంత ప్రోత్సాహజనక మైందో!

చ. అనిన నుపేంద్రువాక్య మను నయ్యమృతంబునఁజేసి ధర్మనం
దనుఁడు ముదంబు నొంది 'విదితంబుగ నాకు మనోరథంబు లె
ల్లను సమకూరె నిప్డు, సఫలత్వము నొందె ధనాగమంబు' లం
చును నెడ నిశ్చయించె మధుసూదనదేవు ననుగ్రహంబునన్. 281

ప్రతిపదార్థం: అనినన్; ఉపేంద్రు, వాక్యము+అను= శ్రీకృష్ణుడి మాట అనే; అ+అమృతంబునన్+చేసి= ఆ అమృతంచేత; ధర్మనందనుఁడు; ముదంబున్= సంతోషాన్ని; ఒంది= పొంది; విదితంబుగన్= స్పష్టంగా; నాకున్; మధుసూదన దేవు= మధువనే రాక్షసుణ్ణి సంహరించిన శ్రీకృష్ణదేవునియొక్క; అనుగ్రహంబునన్= దయచేత; ఇప్డు+అ= ఇప్పుడే; మనోరథంబులు+

ఎల్లన్= కోరికలన్నీ; సమకూరెన్= తీరాయి; ధన+ఆగమంబులు= సంపదలు కలుగుటలు; సఫలత్వమున్, ఒందెన్= సార్థక్యం పొందాయి; అంచునున్; ఎడన్= హృదయంలో; నిశ్చయించెన్.

తాత్పర్యం: అని పలికిన శ్రీకృష్ణుడి వాక్యమనే అమృతంచేత ధర్మరాజు సంతోషించి, 'నాకు శ్రీకృష్ణుని అనుగ్రహంచేత ఇప్పుడే కోరికలన్నీ తీరాయి. సమకూరిన సంపదలన్నీ ఫలవంతా లయ్యాయి' అని మనస్సులో నిశ్చయించాడు.

విశేషం: ఈ సందర్భంలో శ్రీకృష్ణునికి ప్రయోగించిన మధుసూదన శబ్దం మిక్కిలి అర్థవంతం. మధుడనే రాక్షసుడిని సంహరించిన శ్రీకృష్ణుడు యాగానికి ఆటంకం కలిగించే ఏ దుష్టులనైనా తొలగించగలడనే భావాన్ని అది ధ్వనింపజేస్తుంది. అందుకు తగినట్లే రాజసూయమహాయాగసభలో ఆయన శిశుపాలుణ్ణి హతమార్చటం జరిగింది.

ధర్మరాజు రాజసూయంబు సేయ నారంభించుట (సం. 2-30-17)

వ. ఇట్లు నారాయణదేవుచేత ననుజ్ఞాతుండయి తమ్ములయు ధౌమ్య ద్వైపాయనాదులయు ననుమతంబున ధర్మరాజురాజసూయంబు సేయ నుపక్రమించి, సహదేవుంజూచి 'నీవు ధౌమ్యోపదిష్టంబులయిన యజ్ఞోపకరణ ద్రవ్యంబులు దేర నింద్రసేన ప్రముఖులను నర్జును సారథియయిన రుక్మను సమర్పించి, యజ్ఞాయతనంబున నానాదేశాగతులైన రాజులకు సన్నివేశంబులు సేయించి, నిఖిల మహీతలంబునం బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రుల నెల్ల రాఁబనుపు' మని పంచిన నతండును దద్వాక్యానంతరంబున నింద్రసేనాదుల ననేక శిల్పివరుల నియోగించి. **282**

ప్రతిపదార్థం: ఇట్లు; నారాయణదేవుచేతన్= శ్రీకృష్ణునిచేత; అనుజ్ఞాతుండు+అయి= అనుమతించబడినవాడై; తమ్ములయు; ధౌమ్య, ద్వైపాయన+ఆదులయు= ధౌమ్యుడు, వ్యాసుడు మొదలయిన వారియొక్క; అనుమతంబునన్= సమ్మతితో; ధర్మరాజు; రాజసూయంబు; చేయన్; ఉపక్రమించి= ప్రారంభించి; సహదేవున్; చూచి; నీవు; ధౌమ్య+ఉపదిష్టంబులు+అయిన= ధౌమ్యునిచేత ఉపదేశించబడినవైన - అంటే ధౌమ్యులవారు అవసరమని చెప్పిన; యజ్ఞ+ఉపకరణ, ద్రవ్యంబులు= యజ్ఞానికి అవసరమైన వస్తువులు (సాధన సామగ్రి); తేరన్= తేవటానికి; ఇంద్రసేన, ప్రముఖులను= ఇంద్రసేనుని వంటి ముఖ్యులను; అర్జును, సారథి+ఐన; రుక్మను; సమర్పించి= నియమించి; యజ్ఞ+ఆయతనంబునన్= యజ్ఞశాలలో; నానాదేశ+ఆగతులు+ఐన= వివిధదేశాలనుండి వచ్చిన; రాజులకున్; సత్+నివేశంబులు= మంచి మందిరాలు; చేయించి= రూపొందించి; నిఖిల మహీ, తలంబునన్= సమస్త భూమండలంలో; బ్రాహ్మణ క్షత్రియ, వైశ్య, శూద్రులన్+ఎల్లన్; రాన్, పనుపుము= రమ్మని చెప్పుము; అని; పంచినన్= ఆజ్ఞాపించగా; అతండును= ఆ సహదేవుడును; తత్+వాక్య+అనంతరంబునన్= ఆమాట తరువాత, - అంటే అన్నగారు చెప్పినదాన్ని అనుసరించి; ఇంద్రసేన+ఆదులన్= ఇంద్రసేనుడు మొదలైన; అనేక, శిల్పవరులన్= పెక్కుమంది శిల్పాచార్యులను; నియోగించి= నియమించి.

తాత్పర్యం: ఈవిధంగా శ్రీకృష్ణుని అనుమతిని, తమ్ముళ్ళతోపాటు, ధౌమ్య ద్వైపాయనాదుల సమ్మతిని పొంది ధర్మరాజు రాజసూయం చేయటానికి పూనుకొని, సహదేవునితో 'నీవు ధౌమ్యులవారు చెప్పిన విధంగా యాగానికి అవసరమైన సాధన సామగ్రిని సమకూర్చే పనిని ఇంద్రసేనుడు మొదలైన ప్రముఖులకు, అర్జున సారథి రుక్మకు అప్పగించు' అన్నాడు. 'యాగశాలలో వివిధ దేశాలనుండి వచ్చిన రాజులకు మంచి విడుదులు ఏర్పాటు చేయవలసిం'

దని ఆజ్ఞాపించాడు. 'భూమండలంలో ఉండే బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రుల నందరిని రప్పించవలసిం'దని ఆదేశించాడు. సహదేవుడు అన్నగారి ఆజ్ఞప్రకారం ఇంద్రసేనాదులవంటి పెక్కుమంది శిల్పాచార్యులను నియమించి.

విశేషం: 'రుక్మశ్చార్జున సారథిః' - అని మూలం. కనుక 'రుక్మిని' - అని ఉండటం లెస్స.

సీ. శాస్త్రోపదిష్ట ప్రశస్త ప్రమాణల । క్షణముల యజ్ఞోపకరణ తతుల
యజ్ఞాయతనమున నతిరమణీయంబు । లయి యుండ నొనరించి, యందు సర్వ
సంభారములు నించి, సకలదిక్కుల హరి । ప్రస్థంబుచుట్టు నపార భూరి
బహువిధాగారముల్ ప్రమదవనంబుల । వాపుల దీర్ఘికావలుల వెలసి

ఆ. యాజ్య తైల తండులాది నానా వస్తు । పూరితంబులయి విభూతిఁ దనర
జననుతుండు సేసె సహదేవుఁ డపర భూ । తలముఁ బోలి యొప్పెఁ దత్పురంబు. 283

ప్రతిపదార్థం: శాస్త్ర+ఉపదిష్ట, ప్రశస్త, ప్రమాణ, లక్షణములన్= శాస్త్రంచేత చెప్పబడిన ఉత్తమ ప్రమాణ లక్షణాలతో; యజ్ఞ+ఉపకరణ, తతులన్= యజ్ఞానికి అవసరమైన సాధనసామగ్రియొక్క సమూహాలను; యజ్ఞ+ఆయతనమునన్= యజ్ఞశాలలో; అతిరమణీయంబులు+అయి, ఉండన్= మిక్కిలి అందమైనవిగా అమరేటట్లు; ఒనరించి= చేసి; అందున్= యజ్ఞశాలలో; సర్వసంభారములు= అన్ని వస్తువులు; నించి= నింపి; హరిప్రస్థము చుట్టున్= ఇంద్రప్రస్థం చుట్టు; సకల దిక్కులన్= అన్ని దిశల్లో; అపార, భూరి, బహువిధ+అగారముల్= లెక్కలేనన్ని గొప్పవైన వివిధ గృహాలతో; ప్రమదవనంబులన్= ఉద్యానవనాలతో; వాపులను= కోనేరులతో; దీర్ఘికా+ఆవలులన్= దిగుడుబావి సమూహాలతో; వెలసి= ఏర్పడి; ఆజ్య, తైల, తండుల+ఆది, నానావస్తు, పూరితంబులు+అయి= నెయ్యి, నూనె, బియ్యం మొదలయిన పదార్థాలతో నిండి ఉండేటట్లు, విభూతిన్=ఐశ్వర్యంతో; తనరన్= ఒప్పేటట్లుగా; జననుతుండు= జనులచే కీర్తించబడేవాడు; సహదేవుఁడు; చేసెన్; తత్, పురంబు= ఆపట్టణం; అపర, భూతలమున్+పోలి= రెండవ భూమండలంవలె; ఒప్పెన్= ప్రకాశించింది.

తాత్పర్యం: శాస్త్రోక్తాలైన ఉన్నత ప్రమాణ లక్షణాలున్న యజ్ఞ సాధన సామగ్రి నంతా యజ్ఞశాలలో అతిరమణీయంగా అమర్చాడు. అవసరమైన పదార్థాల నన్నింటినీ నింపాడు. ఇంద్రప్రస్థానికి అన్ని వైపులా ఉద్యానవనాలతో, కోనేరులతో, దిగుడు బావులతో, అవసరమైన నెయ్యి, నూనె, బియ్యంవంటి ఆహార పదార్థాలు సమృద్ధిగా ఉండేటట్లు అతిథిగృహ సముదాయాన్ని తన ఐశ్వర్యం శోభిల్లేటట్లు ఏర్పరచాడు. అప్పుడు ఇంద్రప్రస్థపురం అపరభూమండలంలా ప్రకాశించింది.

విశేషం: వైదికాలైన యజ్ఞవిషయాలు నన్నయగారికి ఎంతో ఆత్మీయాలు. అంతేకాక, ధర్మజుని రాజసూయం రాజకీయ ప్రాధాన్యమున్న యజ్ఞం. ఆ యజ్ఞమూలంగా ఆయన ఐశ్వర్యం, అధిక్యం అందరికీ ప్రకటం కావాలి. భావికురుసార్వభౌముడు ధర్మరాజే అనే అభిప్రాయం ఏర్పడాలి. అందుచేతనే నన్నయగారు ఇక్కడ ఆ యజ్ఞవిషయాల్ని మూలాన్ని మించి మనోహరంగా ఉదాత్తంగా వర్ణించారు. కాగా 'అపరభూతలం' అనే దానికి కొన్ని ప్రతులలో 'అమర భూధరం' అనే పాఠాంతరం ఉంది. ఐశ్వర్యంతో నిండిన ఇంద్రప్రస్థాన్ని అపర భూతలంతో పోల్చటం కంటె, అమర భూధరమైన మేరు పర్వతంతో పోల్చటమే మేల్తరంగా ఉంటుందేమో! అని అనిపించవచ్చు. అయినా, భూతలాన్ని పాలించే ప్రభువులు, కీర్తి కెక్కిన ప్రముఖులు అందరూ కలిసి ఒకచోట ఉండటానికి అనువుగా సర్వవిధసౌకర్యాలతో కూడికొనిఉన్న ఆ మహానగరం అపరభూతలం (Mini World)గా ఉన్న దని నన్నయగారు భావించిఉంటారు. అప్పుడే ధర్మరాజు సమ్రాట్టుగా వైభవాన్ని ప్రదర్శించగలడు.

వ. మఱియు సహదేవానుశాసనంబునఁ బుత్త్ర మిత్త్ర భ్రాతృసమేతులై విరాట ద్రుపద శిశుపాల గాంధార రాజులును బ్రాగ్జ్యోతిషంబున భగదత్తుండును, శక సాల్వ బృహద్బల చంద్రసేన సముద్రసేన కుంతిభోజ పౌండ్రకవాసుదేవులును, వసుదేవ బలదేవ ప్రద్యుమ్న శూరసేనాది యదు వృష్ణి భోజాంధకవరులును, నంగ వంగ కళింగ కాశ్మీర కాంభోజ గౌడాంధ్ర సింహళ కేరళ కుంతల ద్రవిడ మరు యవనపతులును, బార్వతేయులును సాగరానూపవాసులును నాదిగాఁ జతుస్సముద్ర ముద్రిత వసుంధరా చక్రంబునం గల రాజచక్రంబును, సమగ్ర వేద వేదాంగవిదు లైన యగ్రజన్ములును, స్వకర్మ నిరతులైన వైశ్యశూద్రులును వచ్చి యథాపరికల్పిత సన్నివేశంబుల నుండి; రంత ధర్మపుత్త్రుండు భీష్మాదులం దోడ్కొని తేర గజపురంబునకు నకులుం బంచిన. 284

ప్రతిపదార్థం: మఱియు; సహదేవ+అనుశాసనంబునన్= సహదేవునియొక్క ఆజ్ఞ ప్రకారం; పుత్త్ర, మిత్త్ర, భ్రాతృ, సమేతులు+ఐ= పుత్రులతో, మిత్రులతో, సోదరులతో కూడుకొన్నవాళ్ళయి; విరాట, ద్రుపద, శిశుపాల, గాంధార రాజులును; ప్రాగ్జ్యోతిషంబున భగదత్తుండును; శక, సాల్వ, బృహద్బల, చంద్రసేన, సముద్రసేన, కుంతిభోజ, పౌండ్రక, వాసుదేవ+ఆదులును= శకుడు, సాల్వుడు మొదలయినవాళ్ళూ; వసుదేవ, బలదేవ, ప్రద్యుమ్న, శూరసేన+ఆది, యదు, వృష్ణి, భోజ+అంధక, వరులును= వసుదేవుడు, బలరాముడు, ప్రద్యుమ్నుడు, శూరసేనుడు మొదలైన యదు, వృష్ణి, భోజ, అంధక వంశాలకు సంబంధించిన శ్రేష్ఠులూ; అంగ, వంగ, కళింగ, కాశ్మీర, కాంభోజ, గౌడ, ఆంధ్ర, సింహళ, కేరళ, కుంతల, ద్రవిడ, మరు, యవన పతులును= అంగవంగాది దేశాల రాజులూ; పార్వతేయులును= పర్వతప్రాంతాల రాజులూ; సాగర, అనూప, వాసులును= సముద్రతీరప్రాంతంలో నివసించేవాళ్ళూ; ఆదిగాన్= మొదలుగా; చతుః+సముద్ర, ముద్రిత, వసుంధరా, చక్రంబునన్= నాలుగు సముద్రాలచేత చుట్టబడిన భూమండలంలో; కల= ఉన్న; రాజచక్రంబును= రాజుల సమూహమూ, సమగ్ర, వేద, వేద+అంగ, విదులు+ఐన= పరిపూర్ణంగా వేదాలను, వేదాలయొక్క అంగాలైన శిక్ష, వ్యాకరణం మొదలైనవాటిని తెలిసినవాళ్ళయిన; అగ్రజన్ములును= బ్రాహ్మణులూ; స్వధర్మ, నిరతులు+ఐన= తమ కర్తవ్యాన్ని నిర్వహించటంలో ఆసక్తి కలవాళ్ళయిన; వైశ్య, శూద్రులును; వచ్చి; యథాపరికల్పిత సత్+నివేశంబులన్= వాళ్ళ వాళ్ళ అర్హతలకు తగినట్లు ఏర్పాటు చేయబడిన మంచి విడిది ఇండ్లలో; ఉండిరి; అంత= తరువాత; ధర్మపుత్రుండు= ధర్మరాజు; భీష్మ+ఆదులన్= భీష్ముడు మొదలయిన వాళ్ళను; తోడ్కొని తేరన్= వెంటతీసుకొని రావటానికి; గజపురంబునకున్= హస్తినాపురానికి; నకులున్= నకులుణ్ణి; పంచినన్= పంపగా.

తాత్పర్యం: సహదేవుని పిలుపుమేరకు, పుత్రులతో, మిత్రులతో, సోదరులతో కలిసి భూమండలంలో ఉండే అందరు రాజులు, వేదవేదాంగ పారంగతులైన బ్రాహ్మణులు, తమ తమ ధర్మాలను నిర్వర్తించే వైశ్యులు, శూద్రులు వచ్చి, వాళ్ళ వాళ్ళ అర్హతలకు తగినట్లు ఏర్పాటు అయిఉన్న ఇళ్ళలో విడిది చేశారు. తరువాత భీష్ముడు మొదలయిన పెద్దలను తోడ్కొని రావటానికి ధర్మరాజు నకులుణ్ణి హస్తినాపురానికి పంపగా.

విశేషం: వచ్చిన రాజుల విషయంలో వివిధ ప్రతులలో కొన్ని భేదా లున్నాయి. వేదాంగాలు - శిక్ష (కర్త పాణిని), వ్యాకరణం (కర్త పాణిని), ఛందం (కర్త పింగలముని), నిరుక్తం (కర్త యాస్కుడు), జ్యోతిషం (కర్తలు ఆదిత్యాదులు), కల్పం (కర్తలు ఆశ్వలాయన, కాత్యాయన, ఆపస్తంబ, బోధాయన, వైఖానసాదులు). పాండవులచేతిలో ఓడినవాళ్ళలో ఆంధ్రులను చేర్చని నన్నయ రాజసూయ యజ్ఞానికి వచ్చిన రాజుల్లో ఆంధ్రులను చేర్చి తనజాతిగౌరవాన్ని నిలిపాడు.

రాజసూయమునకు భీష్మాదు లరుదెంచుట (సం. 2-31-4)

క. అనుపమధనరాసులు గొను । చును ననురాగమున రాజసూయమఖాలో
కన కౌతూహలపరు లయి । చనుదెంచిరి భీష్ముఁదొట్టి సద్బంధుజనుల్. 285

ప్రతిపదార్థం: భీష్మన్, తొట్టి= భీష్ముని మొదలు చేసికొని; సత్+బంధు, జనుల్= మంచి (దగ్గరి) బంధువులందరు; అనుపమ, ధనరాసులు= సాటిలేని ధన సమూహాలు; కొనుచున్= వెంటతీసుకొని; అనురాగమునన్= ప్రేమతో; రాజసూయ, మఖ+ఆలోకన, కౌతూహల, పరులు+అయి= రాజసూయ యాగాన్ని చూడటంలో మిక్కిలి కోరిక కలవాళ్ళయి; చనుదెంచిరి= వచ్చారు.

తాత్పర్యం: భీష్ముడు మొదలైన ఆప్త బంధువులందరు సాటిలేని ధనరాసులు వెంటతీసికొని ప్రేమతో రాజసూయం చూడాలన్న కుతూహలంతో ఇంద్రప్రస్థానికి వచ్చారు.

విశేషం: వచ్చిన వాళ్ళలో - భీష్మవిదురాదులే కాక, దుర్యోధనాదులుకూడ అనురాగంతో అపార ధనరాసులు తీసికొని రాజసూయం చూడాలన్న కుతూహలంతో వచ్చారు. కౌరవులకు కన్ను కుట్టిందీ, మనస్సులో కుళ్ళు పెరిగిందీ, రాజసూయం చూచిన తరువాతే.

వ. ఇట్లు వచ్చిన భీష్మ ధృతరాష్ట్ర విదుర ద్రోణ కృపాశ్వత్థామ సోమదత్త కర్ణ భూరిశ్రవశ్శల్య శకుని సైంధవ దుర్యోధన దుశ్శాసన వికర్ణాదుల నెల్లం బ్రియసత్కారంబులం బూజించి వారలతో ధర్మరా జి ట్లనియె. 286

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; వచ్చిన; భీష్మ, ధృతరాష్ట్ర, విదుర, ద్రోణ, కృప+అశ్వత్థామ, సోమదత్త, కర్ణ, భూరి శ్రవః+శల్య, శకుని, సైంధవ, దుర్యోధన, దుశ్శాసన, వికర్ణ; ఆదులన్+ఎల్లన్= భీష్ముడు, ధృతరాష్ట్రుడు, విదురుడు, ద్రోణుడు మొదలయిన వారి నందరిని; ప్రియ, సత్కారంబులన్= ఇష్టమైన సమ్మానాలతో; పూజించి; వారలతోన్; ధర్మరాజు; ఇట్లు+ అనియెన్.

తాత్పర్యం: ఈ విధంగా వచ్చిన భీష్ముడు, ధృతరాష్ట్రుడు, విదురుడు, ద్రోణుడు మొదలయిన వాళ్ళనందరిని ధర్మరాజు సమ్మానించి వారితో ఇలా అన్నాడు.

విశేషం: వచ్చిన వారి పేర్ల విషయంలో వివిధ ప్రతులలో పాఠభేదా లున్నాయి.

ఆ. మీ యనుగ్రహమునఁ జేయంగఁ గడఁగితి । నిమ్మహాధ్వరంబు నెమ్మితోడ
దీని నిందఱును ననూనంబుగాఁ బూని । పెంపు మెఱసి నిర్వహింపవలయు. 287

ప్రతిపదార్థం: మీ, అనుగ్రహమునన్= మీ అందరిదయతో; ఈ+మహా+అధ్వరంబున్= ఈ మహాయజ్ఞాన్ని; చేయంగన్= చేయటానికి; కడఁగతిన్= పూనుకొన్నాను; నెమ్మితోడన్= ప్రేమతో; దీనిన్; ఇందఱును= మీరంతా; అనూనంబుగాన్= వెలితి లేకుండ; పూని= పూనుకొని; పెంపు, మెఱసి= ఘనత వహించి; నిర్వహింపవలయున్= జరిపించాలి.

తాత్పర్యం: మీ అందరి అనుగ్రహంతో నే నీ మహాయాగాన్ని చేయటానికి పూనుకొన్నాను. ప్రేమతో మీరందరు వెలితి లేకుండ దీన్ని ఘనంగా నిర్వహించాలి.

విశేషం: బంధువులకు పెద్దరికం ఇవ్వటం- విశేషించి ఇలాంటి సందర్భాల్లో భారతీయ కుటుంబసంస్కృతి. 'మీ అనుగ్రహంతోనే నే నీయజ్ఞాన్ని చేస్తున్నా నని చెప్పటం బంధుప్రీతికి సూచకం. 'మీరు పూనుకొని యజ్ఞాన్ని వెలితిలేకుండా నిర్వహించా'లని అనటం జ్ఞాతులవలన ఎలాంటి ఇబ్బందులు రాకుండ నిపుణంగా నివారించుకొనే ఉపాయం. (సంపా.)

వ. అని వారల యనుగ్రహంబు వడసి హిరణ్య రజత రత్న దక్షిణా దాన విషయంబులందుఁ గృపాచార్యునిఁ, గృతాకృత పరిజ్ఞానంబునందు భీష్మద్రోణులను, సకల వస్తు వ్యయంబునందు విదురుని, నానాదేశాగతులైన రాజులు దెచ్చి యిచ్చిన యుపాయనంబులు గైకొన దుర్యోధనుని, భక్ష్యభోజ్యాది వినియోగంబునందు దుశ్శాసనుని నియోగించి. 288

ప్రతిపదార్థం: అని; వారల, అనుగ్రహంబు; పడసి= పొంది; హిరణ్య, రజత, రత్న, దక్షిణా, దాన, విషయంబులందున్= బంగారు, వెండి, రత్నాలు, దక్షిణలు, దానాలు ఇచ్చే విషయాల్లో; కృపాచార్యునిన్; కృత+అకృత, పరిజ్ఞానంబు నందున్= చేయబడిన, చేయని వాటిని ఆలోచించి నిర్ణయించటంలో అంటే కార్యాకార్యాలను గురించి ఆలోచించటంలో; భీష్మద్రోణులను; సకల వస్తువ్యయంబునందున్= అన్ని పదార్థాలను వినియోగపరచటంలో; విదురునిన్; నానాదేశ+ఆగతులు+ఐన= వివిధ దేశాలనుండి వచ్చిన; రాజులు; తెచ్చి; ఇచ్చిన; ఉపాయనంబులు= కానుకలు; కైకొనన్= తీసికోవటానికి; దుర్యోధనునిన్; భక్ష్య, భోజ్య+ఆది, వినియోగంబునందున్= భక్ష్యాలు, భోజ్యాలు మొదలయిన ఆహార పదార్థాలను అందరికి అందచేయటంలో; దుశ్శాసనుని; నియోగించి= నియమించి.

తాత్పర్యం: అని, వచ్చిన బంధుజనులందరి అనుగ్రహం పొంది, బంగారు, వెండి, రత్నాలను దక్షిణలుగా, దానాలుగా ఇచ్చే విషయంలో కృపాచార్యుణ్ణి, కార్యాకార్యాలనుగురించి ఆలోచించటంలో భీష్మద్రోణుల్ని, సకల పదార్థాలను వినియోగ పరచటంలో విదురుణ్ణి, వివిధ దేశాల రాజులు తెచ్చి ఇచ్చే కానుకలను గ్రహించటంలో దుర్యోధనుణ్ణి, భక్ష్యభోజ్యాది ఆహార పదార్థాలను అందరికీ అందచేయటంలో దుశ్శాసనుణ్ణి నియమించి.

విశేషం: ఈ విధంగా ఆయా వ్యక్తుల్ని ఆయా పనుల్లో నియమించటంలో ధర్మజుని ఉచితజ్ఞత, దూరదృష్టి గొప్పగా వ్యక్తమవుతున్నాయి. ధర్మజుడు అప్పగించినా, పాండవులతో ప్రతి విషయంలో పోటీపడే స్వభావం, వాళ్ళపట్ల అసూయ పడే మనస్తత్వం ఉన్న దుర్యోధనుడు, అందరు రాజులు తెచ్చియిచ్చే కానుకలు అందుకొనే పనికి అప్పుడు అంగీకరించకుండా ఉంటే అతనికి ఎంతో బాగుండేది! కాని ఆ అవివేకి ఏ ముహూర్తంలో అంగీకరించాడో ఆ కానుకల విలువ, ధర్మరాజు వైభవం చూచి తన అసూయను అంతకంత పెంచుకొన్నాడు; కృశించాడు. శకుని మాటలు విని పాండవుల పతనానికి ప్రయత్నించాడు. అపకీర్తి పాలయ్యాడు. కడకు అతి దయనీయ మరణాన్ని పొందాడు. రాజసూయం చూడవచ్చి దుర్యోధనుడు అంగీకరించిన ఈ కానుకలందుకొనే పని, జీవితంలో అతణ్ణి ఎంతగానో దెబ్బతీసింది. ఒక విధంగా ఇది- ధర్మరాజు మర్యాదపూర్వకంగా దుర్యోధనునికి నిబంధించిన మానసికశిక్ష. ఎంతో వివేకి అయిన ధర్మరాజు కృతాకృతపరిజ్ఞానంలో కురుపితామహుడైన భీష్ముని, గురువుగారైన ద్రోణుని నియమించి, రాజసూయార్ఘ్య ప్రదాన విషయంలో తాతగారి మాట తల దాల్చినట్లే తాల్చి, తనకు ఇష్టుడైన శ్రీకృష్ణునికే అర్ఘ్యం ఇచ్చే అవకాశం కల్పించుకొన్నాడు.

ధర్మజుఁడు యజ్ఞాయతనము ప్రవేశించుట (సం. 2-33-1)

క. ప్రాజ్ఞుఁడు విశేష ధర్మవి । ధిజ్ఞుఁడు ధర్మజుఁడు యజ్ఞదీక్షితుఁ డయి వి
ప్రజ్ఞాతిపరివృతుం డయి । యజ్ఞాయతనమున కరిగె నధికవిభూతిన్. 289

ప్రతిపదార్థం: ప్రాజ్ఞు(డు= వివేకవంతుడు; విశేష, ధర్మ, విధిజ్ఞు(డు= విశేషాలైన ధర్మ విధులు తెలిసినవాడు; (అయిన) ధర్మజు(డు; యజ్ఞ, దీక్షితు(డు+అయి= యజ్ఞదీక్షను వహించిన వాడయి; విప్ర, జ్ఞాతి, పరివృతుండు+అయి= బ్రాహ్మణులతో, దాయాదులతో చుట్టబడినవాడై అనగా బ్రాహ్మణులు, దాయాదులు తన చుట్టు ఉండగా; అధిక, విభూతిన్= మిక్కిలి వైభవంతో; యజ్ఞ+ఆయతనమునకున్= యజ్ఞశాలకు; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: వివేకవంతుడు, విశేషధర్మజ్ఞుడు అయిన ధర్మరాజు, యజ్ఞదీక్ష వహించి బ్రాహ్మణులు, దాయాదులు తన చుట్టూ ఉండగా మహావైభవంగా యజ్ఞశాలలో ప్రవేశించాడు.

విశేషం: ధర్మరాజుకు ప్రాజ్ఞ డనే విశేషణం ఎంతో తగిఉంది. ఆయన ఆలోచనలు, మాటలు, చేష్టలు ఎంత ధార్మికాలో అంత లౌకికాలు. వాటిని అక్షరరమ్యంగా ఆవిష్కరించబడటం ఈ పద్యరచనాశిల్పం.

ఉ. సమ్మదమంది చూచిరి భృశంబుగ భూజను లెల్ల బ్రహ్మతే
జమ్మును రాజతేజమును సద్బహుభూషణ రత్నరాజి తే
జమ్మును విస్తరించుచు నిజద్యుతి యొప్ప(గ మూర్తమైన ధ
ర్మమ్మును బోలె నున్న గుణమండితు దీక్షితు ధర్మనందనున్. 290

ప్రతిపదార్థం: భూజనులు+ఎల్లన్= భూమిమీది ప్రజలంతా; భృశంబుగన్= గొప్పగా; బ్రహ్మతేజమ్మును= బ్రాహ్మణుల తేజస్సును; రాజతేజమును= రాజుల తేజస్సును; సత్+బహు, భూషణ, రత్న, రాజి, తేజమ్మును= శ్రేష్ఠాలైన అనేకాభరణాల, రత్నసమూహంయొక్క తేజస్సును; విస్తరించుచున్= అధికం చేస్తూ; నిజద్యుతి= తనయొక్క కాంతి; ఒప్ప(గన్= ప్రకాశించగా; మూర్తము+ఐన= ఆకారం తాల్చిన; ధర్మమ్మును+పోలెన్= ధర్మంవలె; ఉన్న; గుణమండితున్= సుగుణాలచేత అలంకరించ బడినవాణ్ణి; దీక్షితున్= యజ్ఞదీక్ష వహించినవాణ్ణి; ధర్మనందనున్= ధర్మరాజును; సమ్మదము+అంది= సంతోషాన్ని పొంది; చూచిరి.

తాత్పర్యం: బ్రహ్మతేజస్సుకు, క్షత్రతేజస్సుకు, ఉత్తమ ఆభరణాల రత్నతేజస్సుకు మెరుగులు దిద్దుతూ తన తేజస్సు ప్రకాశించగా గుణశోభితుడు, యజ్ఞదీక్షితుడు అయి, రూపుతాల్చిన ధర్మంలా ఉన్న ధర్మరాజును రాజ్యప్రజలంతా మహదానందభరితులై చూచారు.

విశేషం: అలం: ఉపమ. గుణం ప్రసాదం. అది అక్షరరమ్యంగా ఆవిష్కృతం. 'మూర్తమైన ధర్మమ్మును బోలె నున్న' అనేదానికి 'మూర్తియైన ధర్మమ్మునుబోలె' అనే పాఠాంతరం పెక్కు ప్రతుల్లో ఉంది. 'ధర్మో విగ్రహవా నివ' అని మూలం (భండార్కరు ప్రతి 2-30-45). ('రామో విగ్రహవాన్ ధర్మః' అని శ్రీరామునిగూర్చి మారీచునిచేత వాల్మీకి చెప్పించిన సూక్తి జగద్విదితం. అలాగే భారతంలో ధర్మరాజు ధర్మవీరం ప్రధానరసంగా పోషించబడిన ఆంధ్రమహాభారతంలో మూర్తమైన ధర్మంవలె నున్నట్లు ధర్మరాజును వర్ణించటం సార్థకం. రాజసూయయాగంవల్ల సమకాలీన చక్రవర్తులలో సార్వభౌముడుగా, రాబోయే కురుక్షేత్ర మహాసంగ్రామంలో విజయుడుగా ధర్మరాజు వెలుగబోతున్నాడు. మహాభారత యుద్ధానంతరం అశ్వమేధయాగంతో మరొకసారి తన సార్వభౌమత్వాన్ని నిరూపించుకోబోతున్నాడు. ధర్మవిజయాన్ని తెలిపే మహేతిహాసం మహాభారతం. -సంపా.)

క. బ్రహ్మవిదు లయిన నిఖిల । బ్రాహ్మణ సత్తములచేత(బరివేష్టితు(డై
బ్రహ్మణ్యు(దొప్పె(గురుపతి । బ్రహ్మర్షి పరీతు(డయిన బ్రహ్మయపోలెన్. 291

ప్రతిపదార్థం: బ్రహ్మ, విదులు+అయిన= బ్రహ్మజ్ఞాన సంపన్నులైన; నిఖిల, బ్రాహ్మణ, సత్తములచేతన్= అందరు బ్రాహ్మణశ్రేష్ఠుల చేత; పరివేష్టితుఁడు+ఐ= చుట్టబడినవాడై; బ్రహ్మణ్యుఁడు= బ్రాహ్మణులకు హితుఁడైన; కురుపతి= కురువంశరాజు - ధర్మరాజు; బ్రహ్మ+ఋషి, పరీతుఁడు+అయిన= బ్రహ్మర్షులచేత చుట్టబడినవాడైన; బ్రహ్మ+అ, పోలెన్= బ్రహ్మదేవునివలె; ఒప్పెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: బ్రహ్మజ్ఞానసంపన్ను లైన బ్రాహ్మణోత్తములంతా తనచుట్టూ ఉండగా, బ్రాహ్మణుల మేలుకోరే ధర్మరాజు బ్రహ్మర్షులచేత కొలువబడే బ్రహ్మదేవునిలా ప్రకాశించాడు.

విశేషం: అలం: ఉపమ.

క. **వేదనినాదము నాశీ । ర్వాదనినాదము ననేకవాదిత్రమహా**
నాదంబుఁ జెలఁగె నన్యని । నాదంబు జనంబులకు వినంబడకుండన్. **292**

ప్రతిపదార్థం: వేద, నినాదము= వేదమంత్రాల ధ్వని; ఆశీర్వాద, నినాదము= ఆశీర్వచనాల ధ్వని; అనేక, వాదిత్ర, మహానాదంబున్= పెక్కువాద్యాల యొక్క మహాధ్వని; అన్యనినాదంబు= ఇతర ధ్వని, జనంబులకున్; వినంబడక+ఉండన్= వినబడకుండా ఉండేటట్లుగా; చెలఁగెన్= వ్యాపించింది.

తాత్పర్యం: ఇతర శబ్దాలేవీ జనులకు వినపడకుండేటట్లుగా వేదమంత్రాలధ్వనీ, ఆశీర్వచనాలధ్వని, అనేక వాద్యాల మహాధ్వని వ్యాపించింది.

వ. **అంత ననంత వేదమూర్తులైన పైల ధౌమ్యులు హోతలుగా, యాజ్ఞవల్క్యుం దధ్వర్యుండుగా, ద్వైపాయనుండు బ్రహ్మగా, సుసాముం డుద్గాతగా, వీరల పుత్త్రశిష్యగణంబులు క్రమంబున మైత్త్రావరుణుండును నచ్ఛావాకుండును గ్రావస్తుతుండును బ్రతిప్రస్థాతయు నేష్టయు నున్నేతయు బ్రాహ్మణాచ్ఛంసియు నాగ్నీధ్రుండును బోతయుఁ బ్రస్తోతయుఁ బ్రతిహస్తయు సుబ్రహ్మణ్యుండునుంగా, నారదాది బ్రహ్మర్షులు సదస్యులుగా, భీష్మాది రాజర్షులు సహాయులుగా, సర్వక్రియా సమగ్రంబయి షడంగ సమృద్ధంబయి సంపూర్ణ దక్షిణా సనాథంబయి సకల ధన ధాన్యసమన్వితంబయి జగన్నాథరక్షితంబయి సకలజనానందకరంబయి రాజసూయం బతిరమణీయం బయిన.** **293**

ప్రతిపదార్థం: అంతన్= తరువాత; అనంత వేదమూర్తులు+ఐన= రూపుతాల్చిన అంతం లేని వేదాలవంటి వాళ్ళయిన; పైల, ధౌమ్యులు; హోతలుగా= ఋగ్వేద ఋత్విక్కులుగా; యాజ్ఞ+వల్క్యుండు; అధ్వర్యుండుగా= యజుర్వేదతంత్రం నడిపే వాడుగా; ద్వైపాయనుండు= వేదవ్యాసుడు; బ్రహ్మగా= ప్రధాన ఋత్విక్కైన బ్రహ్మగా; సుసాముండు; ఉద్గాతగా= సామవేద తంత్రం నడిపేవాడుగా; వీరల= వీరియొక్క; పుత్త్ర, శిష్య, గణంబులు= పుత్త్రుల శిష్యుల సమూహాలు; క్రమంబునన్= వరుసగా; మైత్త్రావరుణుండును, అచ్ఛావాకుండును, గ్రావస్తుతుండును, ప్రతిప్రస్థాతయు, నేష్టయున్, ఉన్నేతయు, బ్రాహ్మణాచ్ఛంసియు, ఆగ్నీధ్రుండును, పోతయున్, ప్రస్తోతయు, ప్రతిహస్తయు, సుబ్రహ్మణ్యుండునుంగాన్= యజ్ఞం చేయించే ఆయా సహాయ ఋత్విక్కులుగా; నారద+ఆది, బ్రహ్మ+ఋషులు= నారదుడు మొదలైన బ్రహ్మర్షులు; సదస్యులుగాన్= యజ్ఞవిధులను పరీక్షించే అధికారులుగా; భీష్మ+ఆది, రాజ+ఋషులు; సహాయులుగా= తోడ్పడేవాళ్ళుగా; సర్వక్రియా, సమగ్రంబు+అయి= అన్ని విధాల సంపూర్ణమై; షట్+అంగ, సమృద్ధంబు+అయి= ఆరు వేదాంగాలతో నిండిందై; సంపూర్ణ

దక్షిణా సనాథంబు+అయి= సంపూర్ణ దక్షిణలతో కూడుకొన్నదై; ధన, ధాన్య సమన్వితంబు+అయి= ధనంతో, ధాన్యంతో కూడుకొన్నదై; జగత్+నాథ, రక్షితంబు+అయి= లోకానికి ప్రభువైన శ్రీకృష్ణునిచేత రక్షించబడిందై; సకల జన+ఆనంద కరంబు+అయి= అందరు జనులకు ఆనందాన్ని కలిగించేదై; రాజసూయంబు; అతి రమణీయంబు+అయినన్= మిక్కిలి మనోహరం కాగా.

తాత్పర్యం: మూర్తీభవించిన అనంత వేదాల వంటి వారైన పైలధౌమ్యులు ఋగ్వేదతంత్రాన్ని నిర్వహించే ఋత్విక్కులుగా, యాజ్ఞవల్క్యుడు యజుర్వేదతంత్రాన్ని నడిపే అధ్వర్యుడగా, వేదవ్యాసుడు ప్రధాన ఋత్విక్కైన బ్రహ్మగా, సుసాముడు సామవేద తంత్రాన్ని నడిపే ఋత్విక్కుగా, ఈ నలువురియొక్క పుత్ర శిష్య సమూహాలు, మైత్రావరుణుడు, అచ్ఛావాకుడు మొదలయినవారు సహాయ ఋత్విక్కులుగా, నారదాది బ్రహ్మర్షులు సదస్యులుగా, భీష్మాది రాజర్షులు సహాయులుగా అన్ని విధాల సమగ్రమై, ఆరు వేదాంగాలైన శిక్షావ్యాకరణాదులతో నిండినదై, సంపూర్ణదక్షిణలతో కూడినదై, ధనధాన్యసమేతమై, జగన్నాథుడైన శ్రీకృష్ణునిచే రక్షితమై, సర్వప్రజలకు ఆనందజనకమై రాజసూయం మహామనోహరం కాగా.

విశేషం: ఋత్విక్కు - యజమానిచేత యజ్ఞాన్ని చేయించే వేదపండితుడు. ఋత్విక్కులు నలుగురు. వాళ్ళకు సహాయులుగా ఉండే ఋత్విక్కులు పండ్రెండుమంది. నలుగురు ప్రధాన ఋత్విక్కులు - హోత, అధ్వర్యుడు, బ్రహ్మ, ఉద్గాత, పండ్రెండు మంది సహాయ ఋత్విక్కులు - మైత్రావరుణుడు, అచ్ఛావాకుడు, గ్రావస్తుతుడు, ప్రతిప్రస్తోత, నేష్ట, ఉన్నేత, బ్రాహ్మణాచ్ఛంసి, ఆగ్నీధ్రుడు, పోత, ప్రస్తోత, ప్రతిహస్త, సుబ్రహ్మణ్యుడు. ఈ ఋత్విక్కుల క్రమం భిన్నప్రతులలో భిన్నవిధాలుగా ఉంది. నన్నయ వైదిక క్రియాప్రియత ఈ యాజ్ఞికభాగాన్ని మూలాన్ని మించి విపులంగా వర్ణించేటట్లు చేసింది.

సీ. 'అమ్మహామఖమునం దగ్నిముఖంబున । విపులమంత్రాహుతివితతిఁజేసి
సకలదేవతలును, సంపూర్ణదక్షిణా । దానోత్సవంబున ధరణిసురులు,
సముచితసత్కారశతసహస్రంబుల । నఖిలరాజన్యులు, నభిమతాన్న
దానంబుపెంపున ధరణీజనంబులుఁ । దద్దయుఁ దృప్తులై ధర్మచరితు

ఆ. ననఘు ధర్మతనయు ననుజసమన్వితు । సంస్తుతించి రధికసమ్మదమున'
నని కురుప్రభునకు నట్లు వైశంపాయ । నోక్తమైన కథ రసోత్కటముగ. 294

ప్రతిపదార్థం: ఆ+మహా, మఖమునందున్= ఆగొప్పయజ్ఞంలో; అగ్నిముఖంబునన్= అగ్నిహోత్రునియొక్క ముఖంలో; విపుల, మంత్ర+ఆహుతి, వితతిన్, చేసి= అధికంగా హోమం చేసిన మంత్రపూతాలైన ఆహుతుల సమూహంతో; సకల దేవతలును= అందరు దేవతలును; సంపూర్ణ, దక్షిణా, దాన+ఉత్సవంబునన్= నిండుగా దక్షిణలను, దానాలను ఇచ్చే వేడుకతో; ధరణి, సురులు= భూదేవులు - బ్రాహ్మణులు; సముచిత, సత్కార శత, సహస్రంబులన్= తగిన సమ్మానాలు నూరువేలతో; అఖిల రాజన్యులున్= సకలరాజశ్రేష్ఠులును; అభిమత+అన్నదానంబు, పెంపునన్= ఇష్టమైన అన్నదానంయొక్క ఆధిక్యంచేత; ధరణీ జనంబులున్= ప్రజలు; తద్దయున్= మిక్కిలి; తృప్తులు+ఐ= తృప్తిపొందిన వారై; ధర్మచరితున్= ధర్మబద్ధమైన నడవడి కలవాణ్ణి; అనఘున్= పాపరహితుణ్ణి - అంటే పుణ్యాత్ముణ్ణి; ధర్మతనయున్; అనుజ, సమన్వితున్= తమ్ముళ్ళతో కూడుకొన్నవాణ్ణి; అధిక, సమ్మదమునన్= మిక్కిలి సంతోషంతో; సంస్తుతించిరి= లెస్సగా ప్రశంసించారు; అని; కురు ప్రభునకున్= కురువంశ రాజైన జనమేజయునికి; అట్లు= ఆవిధంగా; రస+ఉత్కటముగన్= మిక్కిలి రసవంతంగా-అంటే ఆనందాతిశయం కలిగే తీరున; వైశంపాయన+ఉక్తము+ఐన, కథ= వైశంపాయనమునిచేత చెప్పబడిన కథ.

తాత్పర్యం: 'ఆ రాజసూయయాగంలో అగ్నిహోత్రుడిముఖంలో మంత్రపూతాలైన ఆహుతుల్ని అధికంగా వేల్చటంచేత దేవతలు, నిండుగా దక్షిణలు దానాలు ఇవ్వటంచేత బ్రాహ్మణులు, సముచిత సమ్మాన పరంపరలచే వివిధ దేశాధీశులు, అభీష్టమైన అన్నదానం అధికంగా చేయటంచేత సామాన్యప్రజలు పూర్తిగా తృప్తి పొందారు. ధర్మబద్ధమైన నడవడి కలిగి, పుణ్యాత్ముడై, తమ్ముళ్ళతో కూడి ఉన్న ఆ ధర్మరాజును మహానందంతో అందరు అమితంగా ప్రశంసించారు' అని జనమేజయునికి వైశంపాయనుడు ఎంతో రసవంతంగా మహాభారతకథ చెప్పాడు.

ఆశ్వాసాంతము

క. **భూరి గుణ రత్న భూషణ! । నారాయణమూర్తి! రాజనారాయణ! కం**
ఠీరవ విక్రమ! శారద । నీరద నీహార హీర నిభశుభకీర్తీ! 295

ప్రతిపదార్థం: భూరి, గుణ, రత్న, భూషణ!= గొప్పగుణా లనే రత్నాలు అలంకారాలుగా కలిగినవాడా!; నారాయణమూర్తి= విష్ణు స్వరూపా!; రాజనారాయణ= రాజచంద్రా!; కంఠీరవ, విక్రమ!= సింహంవంటి పరాక్రమం కలవాడా!; శారద నీరద, నీహార, హీర, నిభ, శుభకీర్తి!= శరత్కాలమేఘంతో, మంచుతో, వజ్రమణితో సమానమైన మంచికీర్తి కలవాడా!

తాత్పర్యం: గొప్ప గుణాలనే రత్నాలు అలంకారాలుగా కలిగిన వాడా! విష్ణు స్వరూపా! రాజచంద్రా! సింహంవంటి పరాక్రమం కలవాడా! శరత్కాల మేఘంతో, మంచుతో, వజ్రమణితో సమానమైన స్వచ్ఛమైన సత్కీర్తి కలవాడా!

విశేషం: ఇది ఆశ్వాసాంతంలో ప్రశంసాపూర్వకంగా చేసిన రాజరాజనరేంద్ర సంబోధన. నన్నయగారు ఆ మహారాజు సుస్వభావాన్ని, విష్ణుత్వాన్ని, రాజశ్రేష్ఠత్వాన్ని, శూరత్వాన్ని, కీర్తినిర్మలత్వాన్ని గొప్పగా ప్రశంసించారు.

అంబురుహ వృత్తము.

రాజకులోత్తమ! రాజమనోహర! రాజసూరి సభాంతర
భ్రాజిత సద్గుణ పార్థివశేఖర! పార్థ సన్నిభ! బాంధవాం
భోజవనద్యుమణీ! మణికాంచన పుంజ భూషిత! భూమరు
ద్రాజసమాజ! పరాక్రమరాఘవ! రాజరాజనరేశ్వరా! 296

ప్రతిపదార్థం: రాజకుల+ఉత్తమ!= రాజవంశంలో శ్రేష్ఠుడవైనవాడా! (రాజ శబ్దానికి చంద్రుడనే అర్థం కూడ ఉంది కాబట్టి రాజరాజనరేంద్రుడు చంద్రవంశపు రాజు కనుక 'చంద్రవంశంలో శ్రేష్ఠుడవైనవాడా!' అని కూడ చెప్పవచ్చు); రాజ, మనోహర!= చంద్రునివలె మనస్సును హరించేవాడా!- అంటే అందరికీ ఆహ్లాదాన్ని కలిగించేవాడా!; రాజ, సూరి, సభా+అంతర, భ్రాజిత, సద్గుణ!= రాజులయొక్క, పండితులయొక్క సభామధ్యంలో ప్రకాశించే మంచి గుణాలు కలవాడా!; పార్థివ, శేఖర!= రాజులకు సిగదండవంటివాడా! - రాజశ్రేష్ఠా!; పార్థ, సన్నిభ!= అర్జునునితో సమానమైనవాడా!; బాంధవ+అంభోజ, వన, ద్యుమణీ!= బంధువు లనే పద్మవనానికి సూర్యుని వంటివాడా!; మణి, కాంచన, పుంజ, భూషిత!= మణులయొక్క, బంగారుయొక్క సమూహంతో అలంకరించబడినవాడా!; భూ, మరుత్+రాజసమాజ!= భూసురుల (బ్రాహ్మణుల)తో కూడుకొన్న రాజసమూహం కలవాడా!; పరాక్రమ, రాఘవ!= పరాక్రమంలో శ్రీరామునితో సమానమైనవాడా!; రాజరాజ, నర+ఈశ్వర!= రాజరాజనరేంద్రా!

తాత్పర్యం: రాజవంశంలో ఉత్తముడవైనవాడా! లేదా చంద్రవంశంలో శ్రేష్ఠుడవైనవాడా! చంద్రునిలా ఆహ్లాదం కలిగించేవాడా! రాజులు, పండితులు ఉన్న సభలో శోభిల్లే సద్గుణాలు కలవాడా! రాజులకు శిరోభూషణం వంటివాడా! అర్జునునితో సమానమైనవాడా! బంధువు లనే పద్మవనానికి సూర్యునివంటివాడా, మణిసువర్ణాభరణాలను అలంకరించుకొన్నవాడా! బ్రాహ్మణులతో కూడిన రాజ సమూహం కలవాడా! పరాక్రమంలో శ్రీరామునివంటివాడా! శ్రీ రాజరాజనరేంద్రా!

విశేషం: అలం: రూపకం. రాజరాజుయొక్క గుణసంపద, పండితపోషణ, పరాక్రమాధికత, ఇందులో వ్యక్తమవుతున్నాయి. అంబురుహవృత్తంలోని ప్రతిచరణంలోను వరుసగా భ, భ, భ, భ, ర, స, లగ అనే గణాలు ఉంటాయి. 13వ అక్షరం యతిస్థానం. ప్రాసనియమం పాటించబడింది.

గద్యము.

> **ఇది సకలసుకవిజనవినుతనన్నయభట్ట ప్రణీతంబయిన శ్రీ మహాభారతంబునందు సభాపర్వంబున ధర్మరాజునకు సభాప్రాప్తియుఁ, గింకరదర్శనంబును, నారదువలన లోకపాలుర సభాశ్రవణంబును, రాజసూయ మహాధ్వరారంభంబును, జరాసంధవధయు, గిరివ్రజ నిరుద్ధులయిన రాజులం గృష్ణుండు విడిపించుటయు, దిగ్విజయంబును, రాజసూయంబు నన్నది ప్రథమాశ్వాసము. 297**

తాత్పర్యం: ఇది ఉత్తమకవిజనులందరి ప్రశంసలందుకొన్న నన్నయభట్టు రచించిన శ్రీమహాభారతంలోని సభాపర్వంలో ధర్మరాజుకు సభ సమకూరటం, కింకరదర్శనం, నారదునివల్ల లోకపాలకుల సభలనుగూర్చి వినటం, రాజసూయ మహాయజ్ఞాన్ని ఆరంభించటం, జరాసంధుని చంపటం, గిరివ్రజపురంలో బందీలై ఉన్న రాజులనందరిని శ్రీకృష్ణుఁడు విడిపించటం, దిగ్విజయం, రాజసూయమున్ను కలది మొదటి ఆశ్వాసం.

సభాపర్వంలో ప్రథమాశ్వాసం సమాప్తం.

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

సభాపర్వము - ద్వితీయాశ్వాసము

శ్రీరమణీప్రియ! ధర్మవి । శారద! వీరావతార! సౌజన్యగుణా
ధార! భువనైక సుందర! వీరశ్రీరమ్య! బుధ వివేక నిధానా! 1

ప్రతిపదార్థం: శ్రీ, రమణీ, ప్రియ= లక్ష్మీదేవికి ప్రియమైనవాడా!; ధర్మ, విశారద= ధర్మంలో విద్వాంసుడవైనవాడా!-అంటే ధర్మాన్ని పూర్తిగా తెలిసినవాడా! వీర+అవతార= పరాక్రమం రూపుదాల్చినవాడా! సౌజన్య, గుణ+ఆధార= మంచిగుణాలకు ఆధారమైనవాడా!; భువన+ఏక, సుందర= లోకమంతటికి అందమైనవాడా!; వీరశ్రీ, రమ్య= వీరలక్ష్మిచేత శోభిల్లేవాడా!; బుధ, వివేక, నిధానా= పండిత వివేకానికి నిధివంటివాడా - అంటే పండితులకు ఉండే వివేకాన్ని మెండుగా కలిగినవాడా!

తాత్పర్యం: లక్ష్మీదేవికి ప్రియమైనవాడా! ధర్మాన్ని పూర్తిగా తెలిసినవాడా! వీరత్వం రూపుదాల్చినవాడా! మంచిగుణాలకు ఆధారమైనవాడా! లోకాని కంతటికీ అందమైనవాడా! వీరలక్ష్మిచేత శోభిల్లేవాడా! పండితుల కుండే వివేకం మెండుగా కలవాడా! (అని నన్నయగారు ప్రశంసాపూర్వకంగా రాజరాజును సంబోధించి ద్వితీయాశ్వాసాన్ని ప్రారంభించారు.)

ధర్మజుఁడు శ్రీకృష్ణున కర్ఘ్యం బిచ్చుట (సం. 2-33-10)

వ. అ క్కథకుండు శౌనకాది మహామునులకుం జెప్పెఁ: నట్లు రాజసూయ మహోత్సవంబు నొప్పును ధర్మరాజు ధర్మనిత్యతయును స్తుతియించి నారదుం డా సదంబున సకలరాజసమూహంబును రాజలోకంబులో మనుష్యసామాన్యుండయి యున్న జగన్మాన్యు జనార్దనుం జూచి తొల్లి బ్రహ్మాదిసురగణప్రార్థితుండయి యఖిల మహీభారావతరణార్థంబు నారాయణుండు యదువంశంబున నుదయించుటయు, నయ్యయి క్షత్త్రియ కులంబుల సురదైత్య దానవ యక్ష రాక్షస గంధర్వాదుల యంశావతారంబులుం దలంచి భవిష్యద్భారత రణంబునకు సంహృష్ట హృదయుండయి యుండు నంత. 2

ప్రతిపదార్థం: ఆ+కథకుండు= ఆ కథను చెప్పేవాడు - ఉగ్రశ్రవసుడనే మహర్షి; శౌనక+ఆది, మహామునులకున్= శౌనకుడు మొదలయిన మహర్షులకు; చెప్పెన్; అట్లు= ఆ విధంగా; రాజ, సూయ, మహా+ఉత్సవంబు= రాజసూయ యాగమనే గొప్ప ఉత్సవంయొక్క; ఒప్పును= వైభవాన్ని; ధర్మరాజు, ధర్మ, నిత్యతయును= ధర్మరాజు ధర్మంయొక్క ఎడతెగనితనాన్ని; స్తుతియించి= పొగడి; నారదుండు; ఆ, సదంబునన్= ఆ సభలో; సకల, రాజ, సమూహంబును= సమ్తసరాజుల సమూహాన్ని; రాజ, లోకంబులోన్= ఆ రాజసమూహంలో; మనుష్య, సామాన్యుండు+అయి= సామాన్యమానవుడై; ఉన్న; జగత్+మాన్యున్= లోకానికి పూజ్యుడైన; జనార్దనున్= శ్రీకృష్ణుని; చూచి; తొల్లి= పూర్వం; బ్రహ్మ+ఆది, సుర, గణ, ప్రార్థితుండు+అయి= బ్రహ్మ మొదలయిన దేవతల సమూహంచేత ప్రార్థించబడినవాడయి; అఖిల, మహీ, భార+అవతరణ+అర్థంబు= సమస్త భూభారాన్ని తగ్గించటం కొరకు; నారాయణుండు= శ్రీమహావిష్ణువు; యదువంశంబునన్= యాదవకులంలో; ఉదయించుటయున్= పుట్టటమూ;

అయ్యయి, క్షత్త్రియ, కులంబులన్= ఆయా రాజవంశాల్లో; సుర, దైత్య, దానవ, యక్ష, రాక్షస, గంధర్వ+ఆదుల= దేవతలు, దైత్యులు, దానవులు, యక్షులు, రాక్షసులు, గంధర్వులు మొదలయినవాళ్ళయొక్క; అంశ+అవతారంబులున్= అంశాల పుట్టుకలూ; తలంచి= ఆలోచించి; భవిష్యత్+భారత, రణంబునకున్= మున్ముందు జరుగబోయే మహాభారతయుద్ధానికి; సంహృష్ట, హృదయుండు+అయి= సంతోషించిన హృదయం కలవాడయి; ఉండునంతన్= ఉన్నప్పుడు.

తాత్పర్యం: ఆ కథను చెప్పే ఉగ్రశ్రవస మహర్షి శౌనకాది మహామునులకు రాజసూయాన్ని గూర్చి ఆ విధంగా చెప్పాడు. నారదమహర్షి రాజసూయ మహోత్సవవైభవాన్ని, ధర్మరాజు శాశ్వత ధర్మపరాయణత్వాన్ని ప్రశంసించాడు. ఆ సభలో సకలరాజ సమూహాన్నీ, ఆ రాజసమూహంలో సామాన్య మానవునివలె ఉన్న లోకపూజ్యుడైన శ్రీకృష్ణుణ్ణీ చూచాడు. పూర్వం బ్రహ్మాది దేవతలు ప్రార్థించగా భూభారాన్ని తగ్గించటానికై శ్రీమహావిష్ణువు యదుకులంలో ఉదయించటాన్ని, సురదైత్య దానవ యక్ష రాక్షస గంధర్వాదుల అంశాలు ఆ యా క్షత్త్రియకులాల్లో జన్మించటాన్ని ఆలోచించాడు. రాబోయే మహాభారత యుద్ధానికి అంతరంగంలో సంతోషించాడు. అప్పుడు

విశేషం: దైత్యులు - కశ్యపునికి దితికి కలిగిన సంతానం. దానవులు - కశ్యపునికి దనువుకు కలిగిన సంతానం.

క. **శాంతనవుఁడు భీష్ముండు ప్ర । శాంతుఁడు దత్క్రతువు సూచి సంతుష్టుండై**
యంతక తనూజునకు ధృతి । మంతున కత్యంత ధర్మమతి కి ట్లనియెన్. **3**

ప్రతిపదార్థం: శాంతనవుఁడు= శంతనుని కుమారుడు; ప్రశాంతుఁడు= మిక్కిలి శాంతం కలవాడు; (అయిన) భీష్ముండు; తత్+క్రతువు= ఆ రాజసూయయాగాన్ని; చూచి; సంతుష్టుండు+ఐ= పూర్తిగా తృప్తిపొందినవాడై; ధృతిమంతునకున్= ధైర్యంతో కూడుకొన్నవానికి; అత్యంత, ధర్మ, మతికిన్= ఎంతో ఎక్కువగా ధర్మంలో నిలిపిన బుద్ధి కలవానికి; అంతక, తనూజునకున్= యమధర్మరాజు కుమారుడయిన ధర్మరాజుకు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఎంతో శాంతస్వభావం కలవాడు, శంతనుని కుమారుడు, అయిన భీష్ముడు రాజసూయ యాగాన్ని చూచి సంతృప్తి పొంది - ధైర్యవంతుడు, ధర్మపరాయణుడు అయిన ధర్మరాజుతో ఇలా అన్నాడు.

విశేషం: సంస్కృత సంప్రదాయాన్ని అనుసరించి నన్నయగారు 'అంతక తనూజునకు' అనే విశేష్యం తరువాత అదే విభక్తిలో 'ధృతిమంతునకు', 'అత్యంతధర్మమతికి' అనే విశేషణాలు వాడటం గమనించ దగింది.

మత్తకోకిలము.

స్నాతకుండును ఋత్విజుండును సద్గురుండును నిష్టుఁడున్
భూతలేశుఁడు సంయుజుండును బూజనీయులు; వీరిలోఁ
బ్రీతి నెవ్వఁడు సద్గుణంబులఁ బెద్ద యట్టి మహాత్ము వి
ఖ్యాతుఁ బూజితుఁ జేయు మొక్కనిఁ గౌరవాన్వయవర్ధనా! **4**

ప్రతిపదార్థం: కౌరవ+అన్వయ, వర్ధనా= కౌరవవంశాన్ని వృద్ధిపొందించేవాడా! - ధర్మరాజా!; స్నాతకుండును= స్నాతకవ్రతశీలుడూ; ఋత్విజుండును= యజ్ఞం చేయించేవాడూ; సత్+గురుండును= ఉత్తముడైన గురువూ; ఇష్టుఁడున్= మిక్కిలి ఇష్టమైనవాడూ;

భూతల+ఈశుఁడు= భూపతీ - అంటే రాజూ; సంయుజుండును= జ్ఞానీ; పూజనీయులు= పూజించదగినవాళ్ళు; వీరిలోన్= ఈ ఆర్గురిలో; ఎవ్వఁడు; సత్+గుణంబులన్= మంచిగుణాలచేత; పెద్ద= ఎక్కువవాడో; అట్టి; మహాత్మున్= మహాత్ముణ్ణి; విఖ్యాతున్= ప్రసిద్ధుడైనవాణ్ణి; ఒక్కనిన్; ప్రీతిన్= ప్రేమతో; పూజితున్+చేయుము= పూజించబడినవాణ్ణిగా చేయుము - అంటే పూజించుము.

తాత్పర్యం: కురువంశవర్ధనా! ఓధర్మరాజా! స్నాతకుడు, ఋత్విజుడు, సద్గురుడు, ఇష్టుడు, భూపాలుడు, జ్ఞానసంపన్నుడు - పూజించదగినవాళ్ళు. ఈ ఆర్గురిలో సద్గుణాలచేత ఎవడు అధికుడో అలాంటి వాణ్ణి ఒక్కణ్ణి ప్రేమతోపూజించు.

విశేషం: తొమ్మిదివిధాలైన వ్రతుల్లో స్నానశీలవ్రతుడు స్నాతకుడు. 'సంయుజుండును' అనేదానికి ఉన్న పాఠాంతరం 'సంయమీంద్రుడు' కూడ స్వీకరింపదగిందే. ధర్మరాజు రాజసూయంలో కృతాకృత పరిజ్ఞానంలో భీష్మద్రోణులను నియమించాడు. కనుక తదనుగుణంగా భీష్ముడు పూజించదగిన వ్యక్తి విషయాన్ని ప్రస్తావించటం ఉచితంగా ఉన్నది. పూజ్యులైన వారిని వివేచించి చెప్పి, 'వాళ్ళందరిలో ఎవడు గొప్పవాడో, ఎవడు మహాత్ముడో, ఎవడు లోకవిఖ్యాతుడో అతణ్ణి పూజించు' అని శ్రీకృష్ణుణ్ణి స్ఫురించేటట్లు చెప్పిన భీష్ముని మాటనేర్పు అద్భుతం. ఈ పద్యంలో నన్నయ పృథక్పదత్వంతో మాధుర్యగుణాన్ని మనోజ్ఞంగా పోషించాడు.

వ. అనిన 'నట్టివాఁ డెవ్వండు నా కెఱిఁగింపు' మనిన ధర్మరాజునకు భీష్ముం డి ట్లనియె. 5

తాత్పర్యం: అనగా విని ధర్మరాజు 'అటువంటివాడు ఎవడో నాకు తెలియచెప్పు' అన్నాడు. అందుకు భీష్ముడు ధర్మరాజుతో ఇలా అన్నాడు.

సీ. రోదసీకుహరంబు రుచిరాంశుతతిఁ జేసి । యర్కుండు వెలిఁగించు నట్టు; లమృత
సందోహ నిష్యంద చంద్రికఁ జేసి శీ । తాంశుఁ డానందించు నట్టు; సకల
జనులకుఁ దనదైన సదమలద్యుతిఁ జేసి । తనరంగఁ దేజంబుఁ దనుపుఁ దాన
చేయుచునున్న సత్సేవ్యుండు పుండరీ । కాక్షుండు గృష్ణుఁ డనాదినిధనుఁ

ఆ. డబ్జనాభుఁ డుండ; నర్ఘ్యంబునకు నిందు । నర్హు లొరులు గలరె? యజ్ఞపురుషు
నఖిలలోకపూజ్యు నచ్యుతుఁ బూజింపు । మధిప! యదియ చూవె యజ్ఞఫలము. 6

ప్రతిపదార్థం: అర్కుండు= సూర్యుడు; రుచిర+అంశు, తతిన్+చేసి= కాంతిమంతమైన కిరణాలయొక్క సమూహంచేత; రోదసీ, కుహరంబు= అంతరిక్షమనే గుహను; వెలిఁగించునట్టులు; శీత+అంశుఁడు= చల్లని కిరణాలు కలవాడు-చంద్రుడు; అమృత, సందోహ, నిష్యంద, చంద్రికన్+చేసి= అమృత సమూహాన్ని స్రవింపచేసే వెన్నెలచేత; ఆనందించునట్టు= ఆనందింపజేసేటట్లు; సకల, జనులకున్, తనది+ఐన; సత్+అమల, ద్యుతిన్+చేసి= మంచి స్వచ్ఛమైన కాంతిచేత; తనరంగన్= అతిశయించగా; తేజంబున్= వెలుగును; తనుపున్= తృప్తిని; తాను+అ= తానే; చేయుచున్+ఉన్న; సత్+సేవ్యుండు= సత్పురుషులు సేవించదగినవాడు; పుండరీక+అక్షుండు= తెల్లదామరలవంటి కన్నులు కలవాడు; అనాది, నిధనుఁడు= ఆది, అంతం లేనివాడు-అంటే జనన మరణాలు లేనివాడు; అబ్జనాభుఁడు= నీటినుండి పుట్టిన పద్మాన్ని నాభి(బొడ్డు)లో కలవాడు-కృష్ణుడు; ఉండన్= ఉండగా; అర్ఘ్యంబునకున్; ఇందున్= ఇచట; అర్హులు= తగినవాళ్ళు; ఒరులు= ఇతరులు; కలరె= కలరా?; అధిప= ధర్మరాజా!; యజ్ఞ, పురుషున్= యజ్ఞంలో పూజించదగిన ప్రధానపురుషుణ్ణి; అఖిలలోక, పూజ్యున్= అన్నిలోకాలు పూజించదగినవాణ్ణి; అచ్యుతున్= పతనం లేనివాణ్ణి - శ్రీకృష్ణుణ్ణి; పూజింపుము; యజ్ఞఫలము; అదియ, చూవె= అదే సుమా!

తాత్పర్యం: సూర్యుడు కాంతిమంతమైన తన కిరణసమూహంతో అంతరిక్షగుహను వెలిగించేటట్లు, చల్లనికిరణాలుగల చంద్రుడు అమృతసమూహాన్ని స్రవించే వెన్నెలచేత ఆనందింపజేసేటట్లు - అందరు మానవులను తనదైన నిర్మలకాంతితో వెలిగిస్తూ, తృప్తిపరుస్తూ, సత్పురుషులచేత సేవించదగినవాడు, తెల్లదామరలవంటి కన్నులు కలవాడు, ఆద్యంతాలు లేనివాడు, పద్మాన్ని నాభిలో కలవాడు అయిన విష్ణుస్వరూపుడు శ్రీకృష్ణు డుండగా - అర్ఘ్యప్రదానానికి అర్హులైనవాళ్ళు ఇక్కడ ఇంకెవ రున్నారు? ధర్మరాజా! యజ్ఞపురుషుడు, సర్వలోకపూజ్యుడు, అచ్యుతుడు అయిన శ్రీకృష్ణుణ్ణి పూజించు. అదే సుమా యజ్ఞఫలం!

విశేషం: అలం: ఉపమ. ఇందు శ్రీకృష్ణునికి వాడిన విశేషణాలన్నీ విష్ణుమూర్తికి సంబంధించినవే! శ్రీకృష్ణుడు విష్ణుమూర్తి అవతారం కనుక అవి అన్నీ ఆయనకు అన్వయించేవే.

వ. అనిన భీష్మువచనంబున నప్పుడు సహదేవోపనీతంబయిన యర్ఘ్యం బర్ఘణీయుండయిన వాసుదేవునకు శాస్త్రదృష్ట విధానంబున ధర్మతనయుం డిచ్చిన, దానింజూచి సహింపక శిశుపాలుం డుపాలంభనపరుం డయి యధోక్షజు నాక్షేపించుచు ధర్మరాజున కిట్లనియె. 7

ప్రతిపదార్థం: అనిన; భీష్ము, వచనంబునన్= భీష్మునిమాటప్రకారం, సహదేవ+ఉపనీతంబు+అయిన= సహదేవునిచేత తీసుకొనిరాబడిన; అర్ఘ్యంబు; అర్ఘణీయుండు+అయిన= పూజించదగినవాడయిన; వాసుదేవునకున్= శ్రీకృష్ణునికి; శాస్త్ర, దృష్ట, విధానంబునన్= శాస్త్రంలో చూడబడిన పద్ధతితో - అంటే శాస్త్రంలో చెప్పబడిన పద్ధతి ప్రకారం; ధర్మతనయుండు, ఇచ్చినన్; దానిన్; చూచి; సహింపక= ఓర్వక; శిశుపాలుండు; ఉపాలంభన పరుండు+అయి= నిందించే స్వభావం కలవాడయి; అధోక్షజున్= శ్రీకృష్ణుని; ఆక్షేపించుచున్= తప్పులు పడుతూ - దూషిస్తూ; ధర్మరాజునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: భీష్ముని మాటను అనుసరించి ధర్మరాజు - సహదేవుడు తెచ్చిన అర్ఘ్యాన్ని పూజార్హుడైన శ్రీకృష్ణునికి శాస్త్రోక్త పద్ధతి ప్రకారం సమర్పించాడు. దాన్ని చూచి సహించలేక శిశుపాలుడు శ్రీకృష్ణుణ్ణి నిందిస్తూ ధర్మరాజుతో ఇలా అన్నాడు.

విశేషం: సంస్కృతభారతంలో పై వచనానికి ముందు శ్రీకృష్ణుని విష్ణుతత్త్వాన్ని చెప్పటానికి, తక్కిన అవతారాల్లో ఆయన సాధించిన ఘనకార్యాలు సుదీర్ఘంగా వర్ణించబడ్డాయి. నన్నయ ఆ వర్ణనను వదలివేశాడు. ఇంతవరకు ప్రశాంతసుందరంగా, సరళరేఖలా సాగిపోయే రాజసూయం, ఉన్నట్టుండి ఈ అర్ఘ్యప్రదానఘట్టంతో పెద్దమలుపు తిరుగుతుంది. పాఠకుని ఆసక్తి ఆ మలుపు మీదికి తిరుగుతుందిగాని, ఎంత చెప్పినా విష్ణుమూర్తి అవతారవర్ణనమీద నిలవదు. అంతటి శ్రీకృష్ణుణ్ణి ఆ శిశుపాలుడు అప్పుడు ఏమని అధిక్షేపించాడో, దానిపరిణామం ఎలా ఉంటుందో తెలుసుకోవాలని పాఠకుడు ఉవ్విళ్ళూరుతాడు. అందుచేతనే నన్నయ ప్రసన్నకథాకలితార్థయుక్తిమీద దృష్టి నిలిపి, ఆ వర్ణనను పరిహరించి, పాఠకుని ఆసక్తిని అనుసరించి, శిశుపాలుని అధిక్షేపాన్నీ, దానిపరిణామాన్నీ వర్ణించటం జరిగింది.

శిశుపాలుఁడు ధర్మరాజు నాక్షేపించుట (సం. 2-34-1)

మ. అవనీనాథు లనేకు లుండఁగ విశిష్టారాధ్యు లార్యుల్ మహీ
దివిజుల్ పూజ్యులు పల్వు రుండఁగ ధరిత్రీనాథ! గాంగేయు దు
ర్వ్యవసాయంబునఁ గృష్ణుఁ గష్టచరితున్ వార్ష్ణేయుఁ బూజించి నీ
యవివేకం బెఱిఁగించి తిందఱకు; దాశార్హుండు పూజార్హుఁడే? 8

ప్రతిపదార్థం: ధరిత్రీనాథ= ఓ ధర్మరాజా! అవనీనాథులు+అనేకులు+ఉండఁగన్= రాజులు పెక్కుమంది ఉండగా; విశిష్ట+ఆరాధ్యులు+ఆర్యుల్= విశేషంగా పూజించదగిన పెద్దలు; మహీదివిజుల్= భూసురులు - బ్రాహ్మణులు; పూజ్యులు= పూజించదగినవాళ్ళు; పలువురు+ఉండఁగన్= పెక్కుమంది ఉండగా; గాంగేయు, దుర్+వ్యవసాయంబునన్= గంగాపుత్రుడైన భీష్మునియొక్క చెడు నిర్ణయాన్ని అనుసరించి; కష్ట, చరితున్= చెడు నడవడి కలవాణ్ణి; వార్ష్ణేయున్= వృష్ణి అనే వాని వంశంలో జన్మించిన వాణ్ణి, కృష్ణున్; పూజించి; నీ, అవివేకంబున్= నీయొక్క తెలివితక్కువతనాన్ని; ఇందఱకున్= ఇంతమందికి; ఎఱిఁగించితి= తెలియజేశావు; దాశార్హుండు= దశార్హసంతతివాడు, యాదవుడు అయిన శ్రీకృష్ణుడు; పూజా+అర్హుఁడే= పూజించటానికి తగినవాడా?

తాత్పర్యం: ఓ ధర్మరాజా! ఈ సభలో ఎందరో మహారాజు లుండగా, విశేషంగా పూజించదగిన పెద్దలు, బ్రాహ్మణులు పెక్కుమంది ఉండగా, భీష్ముని చెడు నిర్ణయాన్ని అనుసరించి, వృష్ణివంశంవాడు, చెడు ప్రవర్తన కలవాడు అయిన శ్రీకృష్ణుణ్ణి పూజించి, నీ తెలివితక్కువతనాన్ని ఇంతమందికి తెలియజేశావుగాని - ఆ దాశార్హుడు పూజార్హుడా?

విశేషం: యాదవులు యయాతిశాపంచేత రాజ్యానర్హులు. ఆ యాదవవంశాల్లో వృష్ణివంశం ఒకటి. దశార్హవంశం మరొకటి. రాజ్యానర్హుడై, తక్కువజాతికి చెందిన వృష్ణివంశంవాడు, చెడుప్రవర్తన కలవాడు అయిన శ్రీకృష్ణుడినా నీవు పూజించటం అని అధిక్షేపం. (దాశార్హుడు) పూజార్హుడు కాడని నిందించటం - శిశుపాలుని అధిక్షేపవాక్యాల్ని నన్నయ అర్థవ్యక్తి అనే శబ్దగుణంచేత విశిష్టంగా రచించాడు. శ్రీకృష్ణుడు పూజార్హుడు కాడనే విషయాన్ని సహేతుకంగా నిరూపించాలనే వాదన ఇందులో ముఖ్యం. తనవాదంలోని తాత్పర్యం ఝటితిస్ఫూర్తితో శ్రోతలు గ్రహించగలిగే అర్థవ్యక్తిహేతుత్వాన్ని శిశుపాలుని మాటల్లో నన్నయ నిబంధించాడు - సంపా.)

చ. **కడుకొని ధర్మతత్త్వ మెఱుఁగంగ నశక్యము; ధర్మబాహ్యు ని**
న్నొడఁబడ నిష్టుఁడై కఱపి యుత్తము లుండఁగ వాసుదేవుఁ డ
న్జడునకుఁ బూజ యిమ్మని విచారవిదూరుఁడు భీష్ముఁ డెంతయున్
వెడఁగుఁదనంబునం బనిచె; వృద్ధులబుద్ధులు సంచలింపవే. **9**

ప్రతిపదార్థం: కడుకొని= పూనుకొని; ధర్మతత్త్వము= ధర్మంయొక్క పరమార్థం; ఎఱుఁగంగన్= తెలుసుకోటానికి; అశక్యము= అసాధ్యము; విచారవిదూరుఁడు= ఆలోచనకు దూరమైనవాడు-అంటే తగిన ఆలోచన లేనివాడు; భీష్ముఁడు; ఎంతయున్= మిక్కిలి; వెడఁగు, తనంబునన్= అవివేకంతో; ఉత్తములు+ఉండఁగన్= శ్రేష్ఠులైనవాళ్ళు సభలో ఉండగా; వాసుదేవుఁడు+అన్+జడునకున్= వసుదేవుని కుమారుడైన శ్రీకృష్ణుడు అనే బుద్ధిహీనుడికి; పూజ= అర్ఘ్యం; ఇమ్ము; అని; ధర్మబాహ్యున్= ధర్మానికి దూరమైనవాడివైన; నిన్నున్; ఒడఁబడన్= సమ్మతించేటట్లు; ఇష్టుఁడై= (నీకు)ఇష్టమైనవాడై; కఱపి= బోధించి; పనిచెన్= ఆదేశించాడు; వృద్ధుల, బుద్ధులు; సంచలింపవే= చలిస్తాయికదా! - అంటే చక్కగా పనిచేయవుగదా!

తాత్పర్యం: ధర్మతత్త్వాన్ని తెలుసుకోవటం అసాధ్యం. భీష్ముడు ఆలోచన సరిగా లేనివాడు. అందుకే ఎందరో మహానుభావులు ఈ సభలో ఉంటే, అవివేకంగా ఆ శ్రీకృష్ణు డనే బుద్ధిహీనుడికి అర్ఘ్యం ఇమ్మని, ధర్మబాహ్యుడివైన నిన్ను సమ్మతింపచేశాడు. వృద్ధుల బుద్ధులు నిలకడగా ఉండవుకదా!

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. శిశుపాలుని అహంకారం, ఆక్షేపణం అంతకంతకు శ్రుతిమించుతున్నాయి. మొదట శ్రీకృష్ణుణ్ణి నిందించాడు. తరువాత ధర్మరాజునే ధర్మబాహ్యుడి వన్నాడు. పిమ్మట కురుపితామహుడైన భీష్ముణ్ణే విచారవిదూరు

డని, అవివేకి అని, వృద్ధుల బుద్ధులు సంచలింపవే - అని తూలనాడాడు. ఫలితం అనుభవించటానికి పాపం పండాలికదా! ఈ పద్యంలోకూడా అర్థవ్యక్తిగుణం సార్థకంగా పోషించబడింది.

చ. **ఇతనికిఁ గూర్తురేని ధనమిత్తు రభీష్టములైన కార్యముల్**
మతి నొనరింతు రిష్టుఁడని మంతురుగాక, మహాత్ములైన భూ
పతులయు విప్రముఖ్యులసభన్ విధిదృష్ట విశిష్ట పూజనా
యతికి ననర్హు నర్హుఁ డని యచ్యుతు నర్చితుఁ జేయఁ బాడియే? 10

ప్రతిపదార్థం: ఇతనికిన్= ఈ శ్రీకృష్ణునికి, కూర్చుదురు+ఏనిన్= (మీరు అంతగా) కావలసినవాళ్ళయితే; ధనము+ఇత్తురు= ధనాన్ని ఇస్తారుకాని; అభి+ఇష్టములు+ఐన= మిక్కిలి ప్రీతికరాలైన; కార్యముల్= పనులు; మతిన్= మనసార; ఒనరించుదురు= చేస్తే చేస్తారుకాని; ఇష్టుఁడు+అని= ఇష్టమైనవాడని; మంతురు (మనుచుదురు) కాక= పోషిస్తే పోషిస్తారు కాక; మహాత్ములు+ఐన= మిక్కిలి గొప్పవాళ్ళయిన; భూపతులయు= మహారాజులయొక్క; విప్రముఖ్యుల= బ్రాహ్మణశ్రేష్ఠులయొక్క; సభన్= సభలో; విధి, దృష్ట, విశిష్ట, పూజన+ఆయతికిన్= శాస్త్రంలో చెప్పబడిన గొప్ప పూజను పొందటానికి; అనర్హున్= యోగ్యత లేనివాణ్ణి; అర్హుఁడు+అని= యోగ్యుడని; అచ్యుతున్= శ్రీకృష్ణుణ్ణి; అర్చితున్+చేయన్= పూజించటం; పాడియే= న్యాయమా?

తాత్పర్యం: శ్రీకృష్ణునికి మీరు స్నేహితులైతే ఒంటరిగా మీ ఇంటికి పిలిచి ధనమిస్తే ఇవ్వండి. ఆయనకు ప్రీతికరాలైన పనులు మనసార చేస్తే చెయ్యండి. ఇష్టుడుకదా అని పోషిస్తే పోషించండి. అంతేకాని, మహాత్ములైన మహారాజులు, బ్రాహ్మణశ్రేష్ఠులు ఉండే ఈ మహాసభలో - శాస్త్రంలో చెప్పబడిన ఈ గొప్పపూజ పొందటానికి ఏమాత్రం యోగ్యత లేని అతణ్ణి యోగ్యు డని పూజించటం ఏంన్యాయం? (కాదని భావం).

విశేషం: అలంకారాదులచేత అయిన ఉక్తిప్రౌఢత లేకుండా అర్థశక్తివలన ప్రతీయమాన మయ్యే ధ్వని వాక్యాశ్రితంగా ఇందులో పోషింపబడింది. దీనిని స్వతస్సంభవ్యర్థశక్తికృతానురణనధ్వని అంటారు. శిశుపాలుడు ప్రదర్శించే ఈర్ష్యా క్రోధాది భావాలకు ఈ వాక్యార్థాలు పోషకంగా ఉన్నాయి. వీటిలో అర్థవ్యక్తి అనేగుణం పోషింపబడింది. ఇది నన్నయగారి రసభావధ్వనిపోషణకు చక్కని ఉదాహరణ. ఈ పద్యంలోని కొన్నివాక్యాలు బహుళప్రచారం పొందాయి. తెలుగువారి దైనందిన వ్యవహారంలోకూడా చోటుచేసికొన్నాయి. (సంపా.)

సీ. **ఈతని వృద్ధని యెఱిఁగి పూజించితే । వసుదేవుఁ డుండంగ వసుమతీశ!**
ఋత్విజుం డని విచారించి పూజించితే । ద్వైపాయనుం డుండ ధర్మయుక్తి;
యాచార్యుఁ డని వినయమునఁ బూజించితే । కృతమతుల్ ద్రోణుండుఁ గృపుఁడు నుండ;
భూనాథుఁ డనియెడు బుద్ధిఁ బూజించితే । యాదవుల్ రాజులే యవనిమీఁదఁ;

ఆ. **బూజనీయులైన పురుషులలోపల । నెవ్వఁడయ్యెఁ గృష్ణుఁ? డిట్టు లేల**
పూజ్యులయినవారిఁ బూజింపనొల్లక । భీష్ము పనుపుఁ జేసి బేల వయితి. 11

ప్రతిపదార్థం: వసుమతీ+ఈశ= భూనాథా! ఓ ధర్మరాజా!; ఈతనిన్= ఈ శ్రీకృష్ణుణ్ణి; వృద్ధు+అని= పెద్దవాడని; ఎఱిఁగి= గుర్తించి; పూజించితి+ఏ= పూజించావా!; వసుదేవుఁడు= శ్రీకృష్ణుని తండ్రిఅయిన వసుదేవుడు; ఉండంగన్= ఈ సభలో ఉండగా; ఋత్విజుండు+అని= యజ్ఞం చేయించేవాడని; విచారించి= ఆలోచించి; ధర్మయుక్తిన్= ధర్మపద్ధతిని; పూజించితి+ఏ=

పూజించావా! కృష్ణద్వైపాయనుండు+ఉండన్= వేదవ్యాస మునీంద్రుడే ఈసభలో ఉండగా; అచార్యుఁడు+అని= గురువని; వినయమునన్= వినయభావంతో; పూజించితి+ఏ= పూజించావా? కృతమతుల్= గొప్పబుద్ధిశాలురైన; ద్రోణుండు; కృపుఁడున్; ఉండన్= ఉండగా; భూనాథుఁడు+అనియెడు= రాజు అనే; బుద్ధిన్= ఉద్దేశంతో; పూజించితే; అవనిమీఁదన్= భూమిమీద; యాదవుల్= యదువంశీయులు; రాజులే= రాజులా? పూజనీయులు+ఐన= పూజించదగినవాళ్ళయిన; పురుషులలోపలన్; కృష్ణుఁడు; ఎవ్వఁడు+అయ్యెన్= ఎవడై ఉన్నాడు? ఇట్టులన్= ఈ విధంగా; ఏల= ఎందుచేత; పూజ్యులు+అయిన, వారిన్= పూజించదగినవాళ్ళను; పూజింపన్+ఒల్లక= పూజించటానికి ఇష్టపడక; భీష్ము, పనుపున్+చేసి= భీష్ముని ఆజ్ఞచేత; బేలవు+అయితి= మూర్ఖుడి వయ్యావు.

తాత్పర్యం: ధర్మరాజా! శ్రీకృష్ణుణ్ణి వృద్ధుడని గుర్తించి పూజించావా? సభలో ఆయన తండ్రి వసుదేవుడే ఉన్నాడుకదా! ఋత్విజు డని ఆలోచించి పూజించావా? సభలో వేదవ్యాస మునీంద్రులే ఉన్నారుకదా! గురువుగా రని వినయంతో పూజించావా? సభలో మహామేధావులైన ద్రోణాచార్య కృపాచార్యులే ఉన్నారుకదా! మహారాజు అని పూజించావా? భూమిమీద యాదవులు రాజులా? ఈ విధంగా పూజించదగిన పురుషుల్లో శ్రీకృష్ణుడు ఎవ డని పూజించావు? పూజించవలసినవాళ్ళను పూజించక, భీష్ముడు చెప్పినమాటలు విని శ్రీకృష్ణుణ్ణి పూజించి మూఢుడి వనిపించుకొన్నావు.

విశేషం: మూఢునికి కాళిదాసు చెప్పిన నిర్వచనం: 'మూఢః పరప్రత్యయనేయబుద్ధిః' - ఇతరులు చెప్పింది నమ్మే బుద్ధి గలవాడు. (ఈ పద్యంలోని వాక్యాంత కాకువు, తద్ధిత ప్రయోగాలూ వ్యంజకాలై శిశుపాలుని అసూయను ధ్వనింపచేస్తున్నాయి. అసూయకున్న ప్రధానలక్షణం-గుణాల్లో సైతం దోషారోపణచెయ్యటం. 'అక్షాంతిరీర్ష్యాఽసూయాతు దోషారోపో గుణేష్వపి' - అని అమరకోశం. శిశుపాలు డీలక్షణాన్ని పుష్కలంగా ప్రదర్శిస్తున్నాడు. ఈ సీసపద్యరచనలో ప్రతిపాదంలో పూర్వార్ధం ఆరోహగతిలో, ఉత్తరార్ధం అవరోహగతిలో సాగటంతో సమాధిగుణం సంపన్నమైంది. - సంపా.)

చ. పురుష విశేష విశ్రుతుఁడు పూజ్యుఁడు రాజులలోన నీయుధి
ష్ఠిరుఁ డని నీ గుణాళి ప్రకటించి మనంబులలోన ధారుణీ
శ్వరులు భవన్మఖంబునకు వచ్చిన నిందఱ కివ్విధంబునం
బరఁగ నవజ్ఞ సేయు టిది పాడియె ధర్మువె ధర్మనందనా! 12

ప్రతిపదార్థం: ధర్మనందనా= ఓ ధర్మరాజా!; ఈ, యుధిష్ఠిరుఁడు; పురుష, విశేష విశ్రుతుఁడు= పురుషు లందరిలో గొప్పపేరు పొందినవాడు; రాజులలోనన్; పూజ్యుఁడు= పూజించతగినవాడు; అని; నీ= నీయొక్క; గుణ+ఆళిన్= సుగుణాల సమూహాన్ని; ధారుణీ+ఈశ్వరులు= భూపతులు-రాజులు; మనంబులలోనన్= మనస్సులలో; ప్రకటించి= స్పష్టపరుచుకొని; భవత్+ మఖంబునకున్= నీయొక్క యాగానికి; వచ్చినన్= రాగా; ఇందఱకున్= ఇంతమందికి; ఈ+విధంబునన్; పరఁగన్= పెద్దగా; అవజ్ఞ, చేయుట= అవమానం చేయటం; ఇది; పాడియె= న్యాయమా? ధర్మువె= ధర్మమా? (కాదని భావం).

తాత్పర్యం: ధర్మరాజా! యుధిష్ఠిరుడు పురుషులందరిలో విశేషంగా పేరుపొందినవా డని, రాజుల్లో ఎంతో పూజ్యు డని, నీ సుగుణాలను స్పష్టంగా తెలుసుకొని, రాజులందరు నీ యజ్ఞానికి రాగా - ఇందరిని ఈ విధంగా ఇంత అవమానంపాలు చెయ్యటం నీకు న్యాయమా? ధర్మమా?

విశేషం: 'పురుషవిశేషవిత్తముఁడు' అనేదానికి 'పురుషవరేణ్యుఁ డుత్తముఁడు', 'పురుషవిశేషయుత్తముఁడు', 'పురుషవివేక సత్తముఁడు' అనే పాఠాంతరా లున్నాయి. (ధర్మువె, ధర్మనందనా- అని అనటంలో దెప్పిపొడుపు ధ్వనిస్తున్నది. శ్లేష అనే శబ్దగుణం శిశుపాలుడి వాక్యరచనకు మసృణత్వాన్ని కలిగిస్తూ మృదువుగా మందలిస్తున్న వైఖరిని ప్రదర్శిస్తున్నది. - సంపా.)

క. నీ వెఱుఁగక యిచ్చిన నిది । నా విషయమె యని మనంబునం దలఁపక ల
జ్జా విరహితుఁ డయి యర్ఘ్యము । గోవిందుఁడు గొనియెఁ; దనకుఁ గొను టుచితంబే? 13

ప్రతిపదార్థం: నీవు; ఎఱుఁగక= తెలియక; ఇచ్చినన్; ఇది; నా, విషయమె, అని= నేను పొందదగినదా అని; మనంబునన్= మనసులో; తలఁపక= ఆలోచించక; లజ్జా, విరహితుఁడు+అయి= సిగ్గులేనివాడై; గోవిందుఁడు= శ్రీకృష్ణుడు; అర్ఘ్యము; కొనియెన్= తీసుకొన్నాడు; తనకున్; కొనుట= తీసుకోవటం; ఉచితంబే= తగిఉన్నదా? (లేదని భావం)

తాత్పర్యం: నీవు అజ్ఞానంతో ఇచ్చినా, ఇందుకు నేను తగుదునా అని ఆలోచించకుండా శ్రీకృష్ణుడు సిగ్గులేక అర్ఘ్యాన్ని స్వీకరించాడు. అలా తీసుకోవటం అతనికి ఉచితమా?

క. చనఁ బేడికి దారక్రియ । యును, జెవిటికి మధురగీతియును, జీకునక
త్యనుపమ సురూపదర్శన । మును జేయుటఁ బోలుఁ గృష్ణుఁ బూజించు టిలన్. 14

ప్రతిపదార్థం: ఇలన్= భూమిలో; కృష్ణున్; పూజించుట; చనన్= తగునని; పేడికిన్= నపుంసకునికి; దార, క్రియయును= పెండ్లీ; చెవిటికిన్, మధురగీతియును= కమ్మని పాటా; చీకునకున్= గ్రుడ్డివాడికి; అతి+అనుపమ, సురూప, దర్శనమును= సాటిలేని సుందరరూపాన్ని చూపటం; చేయుటన్; పోలున్.

తాత్పర్యం: ఈ భూమిమీద శ్రీకృష్ణుణ్ణి పూజించటం - నపుంసకుడికి పెండ్లిచేయటంలాంటిది. చెవిటివాడికి కమ్మనిపాట వినిపించటంలాంటిది. గ్రుడ్డివాడికి అందమైనరూపాన్ని చూపించటంలాంటిది.

విశేషం: అలం: ఉపమ.

ఉ. 'ఈ యవనీశ్వర ప్రవరు లిందఱు నిన్ను నగంగ నిట్లుగాఁ
జేయుదె ధర్మరా జను విశేషసమాఖ్య నిరర్థకంబుగా
ధీయుత!' యంచు ధర్మజ నదీసుత కృష్ణుల నెగ్గులాడుచుం
బోయె సదంబు వెల్వడి సపుత్త్రబలుండయి చైద్యుఁ డల్కతోన్. 15

ప్రతిపదార్థం: చైద్యుఁడు= చేదిరాజైన శిశుపాలుడు; ధీయుత= బుద్ధిమంతుడవైన ఓ ధర్మరాజా! ఈ, అవనీ+ఈశ్వర, ప్రవరులు= ఈ రాజశ్రేష్ఠులు; ఇందరు= ఇంతమంది; నిన్ను, నగంగన్= నిన్ను చూచి నవ్వగా; ధర్మరాజు+అను; విశేష, సమాఖ్య= ప్రత్యేకమైన పేరు; నిరర్థకంబుగాన్= వ్యర్థమయ్యేటట్లుగా; ఇట్లు, కాన్= ఈవిధంగా; చేయుదు+ఎ= చేస్తావా? అంచున్, ధర్మజ, నదీసుత, కృష్ణులన్= ధర్మరాజును, గంగానదీసుతు డైన భీష్ముణ్ణి, శ్రీకృష్ణుని; ఎగ్గులు+ఆడుచున్= నిందిస్తూ; సపుత్త్రబలుండు+అయి= పుత్త్రులతో, పరివారంతో కూడుకొన్నవాడయి; అల్కతోన్= కోపంతో; సదంబు; వెల్వడి= సభనుండి బయటికి వచ్చి; పోయెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: చేదిరాజైన శిశుపాలుడు - 'బుద్ధిమంతుడా!' అని ధర్మరాజును ఎత్తిపొడుపుగా సంబోధించి, 'ఈ రాజశ్రేష్ఠులు ఇంతమంది నిన్ను చూచి నవ్వేటట్లు, ధర్మరా జనే నీ ప్రత్యేకనామం వ్యర్థం అయ్యేటట్లు ఈ విధంగా చేశావా?' అంటూ ధర్మజ భీష్మ కృష్ణులను నిందిస్తూ కోపోద్రిక్తుడై పుత్రులతో, బలగంతోగూడి సభనుండి వెళ్ళిపోయాడు.

విశేషం: ఈ పద్యంలో అగ్రామ్యత్వంవలన ఉదారత అనే అర్థగుణం రాణిస్తున్నది. (సంపా.)

వ. ఆ శిశుపాలు పిఱుందన చని ధర్మనందనుండు వానిం బ్రియవచనంబుల ననునయించుచు ని ట్లనియె. 16

ప్రతిపదార్థం: ధర్మనందనుండు; ఆ, శిశుపాలు= ఆ శిశుపాలునియొక్క; పిఱుందన= వెనుకనే; చని= వెళ్ళి; వానిన్; ప్రియ, వచనంబులన్= ఇంపైన మాటలతో; అనునయించుచున్= బుజ్జగిస్తూ; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ధర్మరాజు ఆ శిశుపాలుని వెనువెంటనే వెళ్ళి అతణ్ణి ఇంపైన మాటలతో బుజ్జగిస్తూ ఇలా అన్నాడు.

క. భూరిగుణోన్నతు లనఁదగు । వారికి ధీరులకు ధరణివల్లభులకు వా
క్పారుష్యము చన్నె? మహా । దారుణ మది విషముకంటె దహనముకంటెన్. 17

ప్రతిపదార్థం: భూరి, గుణ+ఉన్నతులు= గొప్పగుణాలచేత శ్రేష్ఠులు; అనన్+తగు, వారికిన్= అని అనదగినవాళ్ళకు; ధీరులకున్= విద్వాంసులకు; ధరణి వల్లభులకున్= భూపతులకు - అంటే రాజులకు; వాక్+పారుష్యము= మాటలో కాఠిన్యం - అంటే కటువుగా మాట్లాడటం; చనున్+ఎ= తగునా?; అది= ఆ వాక్పారుష్యం; విషముకంటెన్; దహనముకంటెన్= నిప్పుకంటె; మహాదారుణము= మిక్కిలి భయంకరమైంది.

తాత్పర్యం: గొప్పగుణాలచేత శ్రేష్ఠులని చెప్పదగినవాళ్ళకు, పండితులకు, ప్రభువులకు కఠినంగా మాట్లాడటం తగునా? మాటకాఠిన్యం-విషంకంటె, అగ్నికంటె అతిభయంకరం కదా!

విశేషం: నన్నయసూక్తుల్లో ఇదొక సుప్రసిద్ధసూక్తి. నన్నయ నానారుచిరార్థ సూక్తినిధి. అంటే అనేకరుచిరాలైన అర్థాలతో కూడుకొన్న సూక్తులకు ఆయన నిధివంటివాడు. సూక్తి అంటే మంచిమాట. లోకాన్ని పరిశీలించి, అనుభవాన్ని ఆధారంగా గొని, ధర్మమార్గానికి దీపికగా, మానవుని మనస్సుకు ఎక్కేట్లు చెప్పే మంచిమాట సూక్తి, సూక్తి సుదీర్ఘంగా ఉండకూడదు. సూత్రప్రాయంగా ఉంటేనే సూక్తికి శోభ. అంటే అది అల్పాక్షరాల అనల్పార్థ రచన. అంతేకాదు, సూక్తిలోని అర్థం సూటిగా ఉండాలి. కొంత ఘాటుగా కూడ ఉండాలి. అది చదివేకొలది చవులూరించాలి. వ్యక్తి జీవితానికి వెలుగునివ్వాలి. కవి లోకహితుడు. ఆతని కవిత రసమయంగానే కాక, ఉపదేశయుతంగా ఉండాలి. 'జగద్ధితంబుగన్ మహాభారత సంహితా రచన బంధురు'డైన మహాకవి నన్నయ నానారుచిరార్థ సూక్తినిధి. రసమయమైన ఆయనకవిత సూక్తిరత్నాకరం. మానవజీవితంలో మాట ఎంతో విలువైంది. అది మానవుణ్ణి "మహాత్మా" అని అనిపించగలదు. 'పశువా' అని పిలిపించగలదు. మాటకాఠిన్యాన్నిగూర్చి మహాకవి నన్నయసూక్తి మరపురానిది; మరువగూడనిది.

ఉ. ఆదిజుఁడైన బ్రహ్మయుదయంబున కాస్పదమైనవాఁడు, వే
దాది సమస్త వాఙ్మయములందుఁ బ్రశంసితుఁడైన వాఁడు,లో
కాది, త్రిలోకపూజ్యుఁ డని యాత్మ నెఱింగి పితామహుండు దా
మోదరుఁ జెప్పెఁ బూజ్యుఁ డని; యుక్తమ కా కిది యేమి దోసమే? 18

ప్రతిపదార్థం: ఆదిజుఁడు+ఐన= (సృష్టికి) మొదట పుట్టినవాడైన; బ్రహ్మ, ఉదయంబునకున్= బ్రహ్మదేవుని పుట్టుకకు; ఆస్పదము+ఐన, వాఁడు= స్థానమైనవాడు; వేద+ఆది= వేదాలు మొదలైన; సమస్త, వాఙ్మయముల+అందున్= అన్ని విజ్ఞానగ్రంథాల్లో; ప్రశంసితుఁడు+ఐనవాఁడు= కీర్తింపబడినవాడు; లోక+ఆది= లోకాలకు మొదలైనవాడు; త్రిలోక, పూజ్యుఁడు= మూడు లోకాలచేత పూజించదగినవాడు; అని; ఆత్మన్+ఎఱింగి= బుద్ధిచే గ్రహించి; పితామహుండు= తాత అయిన భీష్ముడు; దామోదరున్= శ్రీకృష్ణుని; పూజ్యుఁడు+అని= పూజించదగినవాడని; చెప్పెన్= చెప్పాడు; ఇది; యుక్తము+అ కాక= ఉచితంకాక; ఏమి, దోసమే= తప్పా ఏమి?

తాత్పర్యం: సృష్టికి మొదటపుట్టిన బ్రహ్మపుట్టుకకే స్థానమైనవాడు, వేదాలు మొదలైన మహాగ్రంథా లన్నింట కీర్తించబడేవాడు, లోకాలకే ఆద్యుడైనవాడు, ముల్లోకాలచే పూజించదగినవాడు - అని తెలుసుకొని పితామహుడైన భీష్ముడు, శ్రీకృష్ణుణ్ణి పూజార్హు డని చెప్పాడు. ఇది ఉచితం కాక దోష మౌతుందా ఏమిటి?

విశేషం: (అలం: కావ్యలింగం. సమర్థించవలసిన అర్థాన్ని సమర్థించటం కావ్యలింగం. శ్రీకృష్ణుడు పూజ్యు డని సమర్థించటం ఇందలి ప్రకృతాంశం. అందువల్ల ఇందులో అర్థవ్యక్తి అనే గుణం ఆకృతి తాల్చింది. -సంపా.) సృష్టికర్త అయిన బ్రహ్మదేవుడు విష్ణుమూర్తి నాభికమలంనుండి జన్మించాడు. కనుక బ్రహ్మపుట్టుకకు విష్ణుమూర్తి స్థానమయ్యాడు. దామోదరుడు - తులసిమాల ఉదరంపై కలవాడు.

క. పరమార్థ ప్రతిభఁ దమో । హరు నచ్యుతు భీష్ముఁ డెఱిఁగిన ట్లెఱుఁగఁగ నీ
కరిది శిశుపాల! పెద్దల । చరితం బల్పులకు నెఱుఁగ శక్యమె యెందున్? 19

ప్రతిపదార్థం: శిశుపాల; పరమ+అర్థ, ప్రతిభన్= పరమార్థ తత్త్వాన్ని దర్శించగల ప్రజ్ఞచేత; తమోహరున్= చీకటిని తొలగించేవాణ్ణి; అంటే అజ్ఞానాన్ని పారద్రోలేవాణ్ణి; అచ్యుతున్= చ్యుతి-లేదా-పతనంలేనివాణ్ణి, శ్రీకృష్ణుణ్ణి, భీష్ముఁడు; ఎఱిఁగినట్లు= తెలుసుకొన్నట్లు; ఎఱుఁగఁగన్= తెలుసుకొనటానికి; నీకున్, అరిది= అసాధ్యం; ఎందున్= ఎచ్చటైనా; పెద్దల చరితంబు= గొప్పవాళ్ళయొక్క చరిత్ర; అల్పులకున్= తక్కువవాళ్ళకు; ఎఱుఁగన్= తెలుసుకొనటం; శక్యమె= సాధ్యమా! (కాదని భావం.)

తాత్పర్యం: ఓ శిశుపాలా! పరమార్థతత్త్వాన్ని దర్శించే ప్రతిభచేత అజ్ఞానం అనే చీకటిని పారద్రోలేవాడు, పతనం లేనివాడు అయిన శ్రీకృష్ణుణ్ణి భీష్ముడు అర్థంచేసుకొన్నట్లు అర్థంచేసుకోవడం నీకు అసాధ్యం. ఎక్కడైనా మహాత్ముల చరిత్రను అల్పులు అర్థంచేసుకోగలరా!

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. (ఈ రచనలోనూ అర్థవ్యక్తి అనే గుణం సార్థకంగా పోషించబడింది. -సంపా.)

క. గురుఁ డని సమస్తలోకో । త్తరుఁ డని నీకంటె వృద్ధతములైన నరే
శ్వరు లచ్యుతు నర్చన నెడఁ । గర మభినందింప నీకుఁ గాదనఁ దగునే. 20

ప్రతిపదార్థం: గురుఁడు+అని= అందరికంటె గొప్పవా డని, లేదా జ్ఞానదాత అని; సమస్త, లోక+ఉత్తరుఁడు+అని= అన్నిలోకాలకంటె శ్రేష్ఠు డని; నీకంటెన్; వృద్ధతములు+ఐన= మిక్కిలి పెద్దవాళ్ళయిన; నర+ఈశ్వరులు= నరపతులు - అంటే రాజులు; అచ్యుతు, అర్చనన్= శ్రీకృష్ణుని యొక్క పూజను; ఎడన్= హృదయమందు; కరము= మిక్కిలి; అభినందింపన్= పొగడగా; నీకున్; కాదు; అనన్; తగునే.

తాత్పర్యం: అందరికంటె గొప్పవా డని, జ్ఞానదాత, అని లోకాలన్నింటికంటె శ్రేష్ఠు డని, నీకంటె ఎంతో పెద్దలైన రాజులే శ్రీకృష్ణుని కిచ్చిన అర్ఘ్యానికి ఎంతో పొగడుతూ ఉంటే నీ విలా వ్యతిరేకించటం తగునా?

విశేషం: ధర్మజుని వాక్యవిన్యాసంలో రుచిరార్థసూక్తులను కూర్చాడు నన్నయ. గురుడనే శబ్దం సార్థకం. ఇది శ్రీకృష్ణుడి జగద్గురుత్వాన్నీ, అజ్ఞానాన్ని తొలగించి వెలుగును ప్రసాదించే మహత్త్వాన్నీ ధ్వనింపచేస్తున్నది. సమస్తలోకోత్తరు డనే విశేషణం శ్రీకృష్ణుని పరమాత్మతత్త్వాన్ని వ్యక్తంచేస్తున్నది. 'అచ్యుతుని అర్చన చేయటం' అనే పదాలు శ్రీకృష్ణుని నిత్యత్వాన్ని తెలుపుతూ శిశుపాలుణ్ణి వివేకచ్యుతు డని వ్యంగ్యంగా చెపుతున్నవి. 'వృద్ధతములు' అనేమాట సార్థకం. శిశుపాలునికంటె వయసులోనే కాక అనుభవంలోకూడా పెద్దలైనవాళ్ళు శ్రీకృష్ణుణ్ణి అభినందిస్తే శిశుపాలుడు అభిశంసించి అవివేకి అనిపించుకొన్నా డని భావం. ధర్మజుని వాక్యం ప్రౌఢం. ధ్వనిమయం. ఈ పద్యంలోని వాక్యవిన్యాసవికటత్వంలో నన్నయ ఉదారతను పోషించాడు. అగ్రామ్యత్వలక్షణం ధర్మజుడి సంస్కారవ్యంజకం. (సంపా.)

వ. అని యా శిశుపాలుం బట్టువఱుచుచున్నంత ధర్మరాజునకు భీష్ముం డి ట్లనియె. 21

ప్రతిపదార్థం: అని; ఆ, శిశుపాలున్; పట్టువఱుచుచున్+ఉన్న+అంతన్= తెలియజెప్పి ఒప్పించటానికి ప్రయత్నిస్తుండగా; ధర్మరాజునకున్; భీష్ముండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని ఆ శిశుపాలుడికి నచ్చచెప్పి ఒప్పించటానికి ప్రయత్నిస్తూ ఉండగా, ధర్మరాజుతో, భీష్ముడు ఈ విధంగా అన్నాడు.

భీష్ముఁడు శిశుపాలుని నిందించుట (సం. 2-35-6)

ఉ. పాలితదుర్ణయుండు శిశుపాలుఁడు బాలుఁడు; వీని నేల భూ
పాలక! నీకుఁ బట్టువఱుపన్? మఱి ధర్ము వెఱుంగ వీనికిం
బోలునె రాగకోప పరిభూత మనస్కున కల్పరాజ్య ల
క్ష్మీ లలనాంధబుద్ధి కనిమిత్త మహత్పరివాదశీలికిన్? 22

ప్రతిపదార్థం: భూపాలక= ధర్మరాజా; శిశుపాలుఁడు; పాలిత, దుర్ణయుండు= పెంచుకొనబడిన చెడునడత కలవాడు; బాలుఁడు= పరిపక్వం కాని బుద్ధికలవాడు; వీనిన్= ఇటువంటి శిశుపాలుడిని; పట్టు, పఱుపన్= తెలియజెప్పి ఒప్పించటం; నీకున్; ఏల= ఎందుకు; మఱి= అంతేకాక; రాగ, కోప, పరిభూత, మనస్కునకున్= మాత్సర్య కోపాలచేత అవమానించబడిన మనస్సు కలవాడూ - అంటే అసూయా క్రోధాలకు వశమైన మనస్సు కలవాడూ; అల్ప, రాజ్య, లక్ష్మీ లలనా+అంధ, బుద్ధికిన్= కొద్దిపాటి రాజ్యసంపద అనే కాంత చేతనే గ్రుడ్డిదైన బుద్ధికలవాడూ - అంటే అల్పరాజ్య సంపద అనేకాంతను చూచుకొని మదించి వివక్షను కోల్పోయిన బుద్ధి కలవాడూ; అనిమిత్త, మహత్+పరివాద, శీలికిన్= కారణం లేకుండానే మహాత్ములను నిందించే స్వభావం కలవాడూ అయిన; వీనికిన్= ఈ శిశుపాలుడికి; ధర్మువు+ఎఱుంగన్= ధర్మతత్త్వాన్ని తెలుసుకోవటం; పోలునె= సాధ్యమగునా?

తాత్పర్యం: ధర్మరాజా! శిశుపాలుడు పెచ్చుపెరిగిన చెడునడత కలవాడు; పరిపక్వం కాని బుద్ధికలవాడు. ఇలాంటి వీడికి చెప్పి ఒప్పించే ప్రయత్నం నీవు ఎందుకు చేస్తావు? అంతేకాదు, ఇతడు అసూయా క్రోధాలకు వశమైన మనస్సు కలవాడు. కొద్దిపాటి రాజ్యలక్ష్మిచేతనే మదించి వివక్షను కోల్పోయిన బుద్ధి కలవాడు. కారణం లేకుండానే మహాత్ములను నిందించే స్వభావం కలవాడు. ఇలాంటి వీడికి ధర్మతత్త్వం తెలుసుకోవటం సాధ్యమవుతుందా?

విశేషం: అలం: రూపకం. ఈ పద్యం శిశుపాలుడి చెడు స్వభావం ప్రతిఫలించే అద్దం. ధర్మతత్త్వాన్ని గ్రహించటానికి రాగద్వేషరహితమైన సమచిత్తం ఉండాలి. అహంకారం, అవివేకం ఉండకూడదు. శిశుపాలుని స్వభావంలో ఉండవలసిన సమచిత్తత లేదు. ఉండగూడని అహంకారం, అవివేకం మెండుగా ఉన్నాయి. అందుచేత 'ధర్మరాజా! ఇతనికి ధర్మతత్త్వాన్ని తెలియజెప్పి ఒప్పించే ప్రయత్నం వ్యర్థ'మని భీష్ము డంటున్నాడు. అంతేకాదు, 'భూపాలక! నేల నాలుగు దిక్కులు జయించి సార్వభౌమ యోగ్యమయిన రాజసూయయాగం చేసే మహారాజా! వీనిన్ - ఈ తక్కువవాణ్ణి, అల్పరాజ్య లక్ష్మీలలనాంధబుద్ధిని, అనిమిత్త మహాత్మపరివాదశీలిని - ఒప్పించే ప్రయత్నం నీకు అనవసర'మనికూడ అంటున్నాడు. కాగా, ఇక్కడ శ్రీకృష్ణుని మాహాత్మ్యాన్ని, ఆయన పూర్వావతార వృత్తాంతాలను విరివిగా భీష్ముడు వర్ణించినట్లు పి.పి.యస్. శాస్త్రిగారి సంపాదకత్వంలో వెలువడిన దాక్షిణాత్య సంస్కృత భారత ప్రతిలో ఉంది. నన్నయ కథాప్రసన్నతను పోషించటానికే ఆ విపులవర్ణనను పరిహరించి, శ్రీకృష్ణునికి అర్ఘ్యమివ్వటం ఎలా ఉచితమో యుక్తియుక్తంగా, సంక్షిప్తంగా చెప్పించాడు. (పై పద్యంలోని భీష్ముడి క్రోధోక్తులు ఆరోహక్రమంలో సాగి అర్థదృష్టితో ప్రవర్తిల్లటంచేత సమాధి అనే గుణం రసోదంచితంగా రచనలో రాణించింది. ఈ ఘట్టంలోని నన్నయనాటకీయతను గురించిన వివరాలకు పీఠిక చూడండి. - సంపా.)

వ. అని ధర్మరాజును వారించి శిశుపాలుం జూచి భీష్ముం డిట్లనియె. 23

తాత్పర్యం: అని ధర్మరాజును ఆపి. శిశుపాలుణ్ణి చూచి భీష్ముడు ఇలా అన్నాడు.

చ. అవినయబుద్ధివై హరికి నర్ఘ్య మయోగ్యమ యంటి; నీవు మూ
ర్ఖవు శిశుపాల! యింకఁ బలుకన్ వలసెన్ సభలోన నున్న యీ
యవనిపులెల్ల నాతని దయం బరిముక్తులు, వానిచేత నా
హవ జితులుం, దదీయశరణార్థులుఁగా కొరులయ్య చెప్పుమా! 24

ప్రతిపదార్థం: శిశుపాల; అవినయ, బుద్ధివి+ఐ= వినయంలేని బుద్ధికలవాడివై - అంటే అహంకరించి; హరికిన్= శ్రీమహావిష్ణువుకు - అంటే ఆయన అవతారమైన శ్రీకృష్ణునికి; అర్ఘ్యము; అయోగ్యము+అ= తగదు; అంటి= అంటివి; నీవు= నీవు; మూర్ఖవు= తెలివిలేనివాడివి; ఇంకన్= ఇక; పలుకన్, వలసెన్= చెప్పక తప్పటంలేదు; సభలోనన్= ఈసభలో; ఉన్న; ఈ; అవనిపులు+ఎల్లన్= ఈ రాజులందరు; ఆతని, దయన్= ఆశ్రీకృష్ణునిదయచేత; పరిముక్తులు= పూర్తిగా విడిచిపెట్టబడినవాళ్ళు (జరాసంధుని చెరనుండి), వానిచేతన్= శ్రీకృష్ణునిచేత; ఆహవజితులున్= యుద్ధంలో ఓడించబడినవాళ్ళు; కాక; ఒరులు+అయ్య= ఇతరులటయ్యా! చెప్పుమా.

తాత్పర్యం: శిశుపాలా! అహంకరించి సాక్షాత్తు శ్రీమహావిష్ణువు అవతారమైన శ్రీకృష్ణునికే అర్ఘ్యమివ్వటం తగదంటున్నావు. ఇక చెప్పక తప్పిందికాదు. ఈ సభలో ఉండే రాజులంతా, ఆయనదయచేత జరాసంధుని చెరనుండి విడిపించబడినవాళ్ళే. లేదా ఆయనచేత యుద్ధంలో ఓడించబడినవాళ్ళే. లేదా ఆయనను శరణువేడినవాళ్ళే, అలా కాకుండా ఇతరు లెవరున్నారో చెప్పు?

విశేషం: ఇక్కడ 'హరి' శబ్దప్రయోగం ఉచితంగా ఉంది. శ్రీకృష్ణుని విష్ణుత్వంమీద, శిశుపాలుని మూర్ఖత్వంమీద ఆ మాట వెలుగులను ప్రసరిస్తున్నది. (భీష్ముని వాక్యవిన్యాసంలో, రచనలో వికటత్వం భాసించి ఉదారత అనే గుణం క్రోధభావోద్దీప్తికి తోడ్పడింది-సంపా.)

తే. ఉత్తమ జ్ఞానవృద్ధు నా నుండె నేని । బాలుఁ డయ్యును బూజ్యుండు బ్రాహ్మణుండు;
క్షత్రియుఁడు పూజ్యుఁ డమితవిక్రమసమృద్ధి । నుర్విపతులలో నధికుఁడై యుండె నేని. 25

ప్రతిపదార్థం: బ్రాహ్మణుండు; ఉత్తమ, జ్ఞాన, వృద్ధునాన్= ఉత్తమమైన జ్ఞానంచేత పెద్దవాడయితే; బాలుఁడు+అయ్యును= వయస్సులో చిన్నవాడయినా; పూజ్యుండు= పూజించదగినవాడు; క్షత్రియుఁడు; అమిత, విక్రమ, సమృద్ధిన్= అపరిమితమైన పరాక్రమంయొక్క నిండుదనంచేత; ఉర్వి, పతులలోన్= భూపతులలో; అధికుఁడు+ఐ= ఎక్కువైనవాడై; ఉండెన్+ఏనిన్= ఉన్నట్లయితే; పూజ్యుఁడు= పూజించదగినవాడు.

తాత్పర్యం: ఉత్తమజ్ఞానంచేత గొప్పవాడయితే, వయస్సుచేత బాలుడయినా బ్రాహ్మణుడు పూజించదగినవాడే, అపరిమితమైన పరాక్రమంతో రాజుల్లో అధికుడైతే క్షత్రియుడు పూజార్హు డౌతాడు.

విశేషం: నన్నయరుచిరార్థసూక్తి.

క. ఈ రెండు కారణముల ము । రారాతియ యర్ఘ్యమునకు నర్హుఁడు; జగదా
ధారుండు మాక కాదు, స । దారాధ్యుఁడు విష్టపత్రయావాసులకున్. 26

ప్రతిపదార్థం: ఈ, రెండు, కారణములన్= ఉత్తమజ్ఞానం, పరాక్రమసమృద్ధి అనే రెండు కారణాలచేత; ముర+అరాతి+అ= మురుడనే రాక్షసునికి శత్రువైన శ్రీకృష్ణుడే; అర్ఘ్యమునకున్= అర్ఘ్యమివ్వటానికి; అర్హుఁడు= తగినటువంటివాడు; జగత్+ ఆధారుండు= లోకానికి ఆధారమైనవాడు; మాకు+అ, కాదు= మాకు మాత్రమే కాదు; విష్టపత్రయ+ఆవాసులకున్= మూడులోకాలలో నివసించేవారికి; సదా+ఆరాధ్యుఁడు= ఎల్లప్పుడు పూజించదగినవాడే.

తాత్పర్యం: ఉత్తమజ్ఞానం, అమితపరాక్రమం అనే ఈ రెండు కారణాలవల్ల - మురుడనే రాక్షసునికి శత్రువైన శ్రీకృష్ణుడే అర్ఘ్యానికి అర్హుడు. జగత్తుకు ఆధారమైన శ్రీకృష్ణుడు, మాకే కాదు ముల్లోకాల్లో నివసించే వాళ్ళందరికీ ఆయన ఎల్లప్పుడూ పూజార్హుడే.

విశేషం: ఇక్కడ శ్రీకృష్ణునికి ప్రయోగించిన 'మురారాతి' శబ్దం శిశుపాలునికి పరోక్షంగా హెచ్చరికవంటిది. శ్రీకృష్ణునితో వైరంపూనిన మురుడికి ఏగతి పట్టిందో తెలుసుకొ మ్మని ఆ పదం శిశుపాలునికి ధ్వనింపచేస్తున్నది.

క. వృద్ధు లొకలక్ష యున్నను । బుద్ధియె యెవ్వరికి వారిఁ బూజింపంగా;
నిద్ధరణీశులలో గుణ । వృద్ధని పూజించితిమి త్రివిక్రము భక్తిన్. 27

ప్రతిపదార్థం: వృద్ధులు= వయస్సుచేత పెద్దలైనవాళ్ళు; ఒక; లక్ష; ఉన్నను; ఎవ్వరికిన్= ఎవరికైనా; వారిన్= వాళ్ళను; పూజింపంగాన్= పూజించటానికి; బుద్ధియె= జ్ఞానమే(ప్రమాణం); ఈ+ధరణీ+ఈశులలో= ఈ రాజులందరిలో; గుణ, వృద్ధు+అని= గుణంచేత పెద్దవాడని; త్రివిక్రమున్= శ్రీకృష్ణుణ్ణి; భక్తిన్= భక్తితో; పూజించితిమి.

తాత్పర్యం: వయస్సుచేత వృద్ధులైనవాళ్ళు ఒక లక్షమంది ఉన్నా - ఎవరినైనా వాళ్ళ జ్ఞానాన్ని బట్టే పూజిస్తాం. రాజులందరిలో గుణంచేత గొప్పవా డనే శ్రీకృష్ణుణ్ణి భక్తితో పూజించాం.

విశేషం: భీష్మునిమాటలు శ్రీకృష్ణునికి అర్ఘ్య మివ్వటాన్ని సమర్థించే ఉక్తులుమాత్రమే కావు, లోకానికి ఉపయోగించే చక్కని సూక్తులుకూడ. కాగా, త్రివిక్రమ పదప్రయోగంకూడా శిశుపాలుణ్ణి హెచ్చరించేదే. శ్రీకృష్ణుణ్ణి తక్కువగా లెక్కగట్టవద్దని, అవసరమైతే ఆయన త్రివిక్రమావతారం తాల్చగల డని, బలిఅంతటివాడు ఏమయ్యాడో భావించుకొమ్మని, నీకొలది తెలుసుకొని ప్రవర్తించు మని ఆ పదం శిశుపాలునికి ధ్వనింపజేస్తున్నది.

క. **పూజితుల తృప్తులగుదురు । భూజను లొరు; లచ్యుతుండు పూజితుఁ డగుడుం**
దేజమున జగత్త్రితయముఁ । బూజితమయి తృప్తిఁబొందుఁ బుణ్యసమృద్ధిన్. **28**

ప్రతిపదార్థం: భూ, జనులు= భూమిమీది ప్రజలు; ఒరులు= ఇతరులు - అంటే శ్రీకృష్ణుడు కాక ఇతరులు; పూజితులు+అ= పూజించబడినవాళ్ళుమాత్రమే; తృప్తులు+అగుదురు= తృప్తి పొందినవా ళ్ళవుతారు; అచ్యుతుండు= శ్రీకృష్ణుడు; పూజితుఁడు= పూజించబడినవాడు; అగుడున్= అయితే; తేజమునన్= ప్రకాశంగా - గొప్పగా; జగత్+త్రితయమున్= మూడులోకాల సమూహం, పూజితము+అయి= పూజించబడిందై; పుణ్య, సమృద్ధిన్= పుణ్యంయొక్క నిండుదనంచేత; తృప్తిన్; పొందున్.

తాత్పర్యం: లోకంలో శ్రీకృష్ణుడు కాక ఇతరు లెవ్వరు పూజించబడినా వాళ్ళుమాత్రమే తృప్తిపొందుతారు. శ్రీకృష్ణుడు పూజితుడైతే ముల్లోకాలు పూజితాలై పుణ్యసమృద్ధితో తృప్తిపొందుతాయి.

సీ. **'బుద్ధియు మనమును బురుషుండు నవ్యక్త । మగుచున్న ప్రకృతియు నంబరంబు**
ధరణియుఁ దరణియు దహనుండుఁ జంద్రుండు । గాడ్పును దిక్కులుఁ గాలములును
దానయై జంగమస్థావరాత్మకమైన । సకల భూత ప్రపంచంబు నెల్లఁ
దన దివ్యశక్తిమైఁ దాల్చిన సర్వాత్ము । సర్వభూతేశ్వరు సర్వవంద్యు

ఆ. **నధికయోగ నిష్ఠితాత్మకులగు మహా । యోగివరులు తత్త్వయుక్తిఁజేసి**
యెఱిఁగినట్టు నీకు నెఱుఁగంగఁబోలునే?' । యనుచు భీష్ముఁ డన్న యవసరమున. **29**

ప్రతిపదార్థం: బుద్ధియున్; మనమును= మనస్సును; పురుషుండున్= జీవుడు; అవ్యక్తము+అగుచున్న, ప్రకృతియున్= ఇంద్రియాలకు గోచరించని పరమాత్మ; అంబరంబు= ఆకాశం; ధరణియున్= భూమియు; తరణియున్= సూర్యుడును; దహనుండున్= అగ్ని; చంద్రుండు; గాడ్పును= గాలియు; దిక్కులున్; కాలములును= భూతభవిష్యద్వర్తమానాలు; తాన, ఐ= తానే అయి; జంగమ, స్థావర+ఆత్మకము+ఐన= కదలునట్టి, కదలనట్టి వాటితోకూడిన; సకల, భూత, ప్రపంచంబున్+ఎల్లన్= అన్ని ప్రాణులతో కూడిన ప్రపంచాన్నంతటిని; తన, దివ్య, శక్తిమైన్= తనయొక్కదివ్యశక్తిచేత; తాల్చిన= ధరించిన; సర్వ+ఆత్మున్= సర్వాన్నిఆత్మగా కలిగినవాణ్ణి - అంటే సర్వం తానే అయినవాణ్ణి; సర్వ, భూత+ఈశ్వరున్= అన్ని ప్రాణులకు ప్రభువైనవాణ్ణి; సర్వవంద్యున్= అందరికి పూజ్యుడైనవాణ్ణి; అధిక, యోగ, నిష్ఠిత+ఆత్మకులు+అగు= గొప్ప యోగంలో గట్టిగా నిలుపబడిన మనస్సు కలవాళ్ళయిన, మహా, యోగి, వరులు= శ్రేష్ఠులైన గొప్పయోగులు, తత్త్వయుక్తిన్+చేసి= యథార్థజ్ఞానంతో; ఎఱిఁగిన+ అట్టు= తెలుసుకొన్నట్లు; నీకున్; ఎఱుఁగంగన్= తెలుసుకొనటానికి; పోలునే= సాధ్యమవుతుందా? అనుచున్; భీష్ముఁడు; అన్న= అనిన; అవసరమునన్= సమయంలో.

తాత్పర్యం: 'బుద్ధి, మనస్సు, జీవుడు, ఇంద్రియాలకు గోచరించని పరమాత్మ, ఆకాశం, భూమి, సూర్యుడు, అగ్ని, చంద్రుడు, వాయువు, దిక్కులు, కాలములు, అన్నీ తానై, చరాచరాలైన సమస్త భూతాలతో కూడిన ప్రపంచాన్నంతటిని తన దివ్యశక్తిచేత ధరించి, సర్వమూ తానై, సర్వభూతాలకు ప్రభువై, సర్వులకు పూజ్యుడైనవాణ్ణి, యోగనిష్ఠలో ఉన్న మహాయోగులు యథార్థ జ్ఞానంతో తెలుసుకొన్నట్లు, తెలుసుకోవటం నీకు సాధ్యమవుతుందా?' అని భీష్ము డన్న సమయంలో.

విశేషం: 'యోగ శ్చిత్తవృత్తి నిరోధః' - మనస్సుయొక్క చలనాన్ని అరికట్టి దాన్ని ఏకాగ్రం చెయ్యటం - అంటే పరమాత్మమీద లగ్నం చెయ్యటం యోగం. దీన్నే ధ్యానం అని గూడ వ్యవహరించటం ఉంది. (పై పద్యంలోని శ్లేష పరతత్త్వవివరణ ఘట్టానికి అనువుగా అమరింది. - సంపా.)

చ. ఎడపక యర్ఘ్య మచ్యుతున కిచ్చితి; మిచ్చిన దీని కిం దొడం
బడ మని దుర్జనత్వమునఁ బల్కెడువీరుల మస్తకంబుపై
నిడియెద నంచుఁ దాఁ జరణమెత్తె సభన్ సహదేవుఁ డట్టిచో
నుడిగి సభాసదుల్ వలుకకుండిరి తద్దయు భీతచిత్తులై. 30

ప్రతిపదార్థం: ఎడపక= వెనుకాడక; అర్ఘ్యము; అచ్యుతునకున్= శ్రీకృష్ణునికి; ఇచ్చితిమి; ఇచ్చినన్; దీనికిన్; ఇందున్= ఈ సభలో; ఒడంబడము+అని= ఒప్పుకొనమని; దుర్జనత్వమునన్= చెడు బుద్ధితో; పలికెడు; వీరుల, మస్తకంబు, పైన్= వీరుల నెత్తిమీద; ఇడియెదను= పెట్టెదను; అంచున్= అంటూ; సహదేవుడు; తాన్= తాను; సభన్= సభలో; చరణము+ఎత్తెన్= పాదాన్ని పైకెత్తాడు; అట్టిచోన్= అప్పుడు; సభాసదుల్= సభలోనివాళ్ళు; తద్దయున్= మిక్కిలి; భీతచిత్తులై= భయంతో కూడిన మనస్సుకలవాళ్ళయి; ఉడిగి= అణగి; పలుకక+ఉండిరి= మాటాడకున్నారు.

తాత్పర్యం: 'మేము శ్రీకృష్ణునికి అర్ఘ్యం ఇచ్చాం. దీనికి తిరుగులేదు. దుర్బుద్ధితో దీన్ని కాదనే వీరుల తలమీద ఇదిగో నాపాదం పెట్టి అణగత్రొక్కుతా' అని సహదేవుడు పాదాన్ని పైకెత్తగానే సభాసదులంతా భయభ్రాంతులై మారుమాటాడకుండా ఉన్నారు.

విశేషం: తాత్కాలికంగానైనా శిశుపాలుని నోటికి తాళంవేసిన సహదేవుని ధార్మికతేజం, సాహసం శ్లాఘించదగినవి. (ఇందులో ప్రదర్శితమైన సహదేవుని రౌద్రానికి సభికుల్లో ఏర్పడిన భావశాంతి అంగంగా నిబంధించబడింది. ఈవిధంగా రసానికి భావశాంతిని అంగంగా పోషిస్తే సమాహితాలంకార మౌతుంది. ఈ అద్భుతసంఘటనలో శ్లేష అనే శబ్దగుణం ప్రసాదగుణపోషకంగా రాణించింది. -సంపా.)

చ. చెలువుగఁ బుష్పవృష్టి గురిసెన్ సహదేవుపయిన్; దివంబునన్
వెలయఁగ సాధువాదములు వించె; సభాసదులెల్ల విస్మయా
కులిత మనస్కులైరి; తన కుంచెయుఁ గృష్ణమృగాజినంబునుం
బలుమఱు వీచుచుం గలహబంధుఁడు నారదుఁ డాడె వేడుకన్. 31

ప్రతిపదార్థం: సహదేవు, పయిన్= సహదేవునిమీద; చెలువుగన్= అందంగా; పుష్పవృష్టి= పూలవాన; కురిసెన్; దివంబునన్= ఆకాశంలో; సాధువాదములు= బాగుబాగనే శబ్దాలు; వెలయఁగన్= ఒప్పుగా; వించెన్(వినిచె)= వినిపించాయి; సభాసదులు+ఎల్లన్=

సభలోఉన్న వాళ్ళంతా; విస్మయ+ఆకులిత, మనస్కులు+ఐరి= ఆశ్చర్యంచేత కలతచెందిన మనస్సులు కలవాళ్ళయ్యారు; కలహబంధుఁడు= పోట్లాటకు బంధువైనవాడు-నారదుడు; తన కుంచెయున్= తనయొక్క చామరాన్ని; కృష్ణమృగ+అజినంబునున్= నల్ల ఇర్రి చర్మాన్ని; పలుమఱు= పెక్కుమారులు; వీచుచున్; వేడుకన్= ఆనందంతో; ఆడెన్= నృత్యంచేశారు.

తాత్పర్యం: అప్పుడు సహదేవునిమీద అందంగా పూలవాన కురిసింది. ఆకాశంలో 'బాగుబాగు' అనే ధ్వనులు పెద్దగా వినిపించాయి. సభాసదులంతా ఆశ్చర్యంతో కలతచెందారు. కలహబంధుడైన నారదుడు తనచామరాన్ని, కృష్ణాజినాన్ని పెక్కుమారులు వీస్తూ ఆనందనృత్యం చేశాడు.

విశేషం: దుష్టశిక్షణకు దారితీసే కలహం పెరుగుతూ ఉంది కనుక ఆ కలహబంధుడికి అంత ఆనందం. (అందుకే రచనలో మాధుర్యగుణం. -సంపా.)

వ. అంత శిశుపాలుసేనాపతి సునీథుండను వాఁ డతిరోషపరుషవచనుం డగుచు, స్వపక్షక్షత్త్రియులనెల్ల నొక్కంతం జేర్చికొని, శిశుపాలు ననుమతంబున యుద్ధసన్నద్ధుం డయియున్న సమయంబున. 32

ప్రతిపదార్థం: అంతన్= అప్పుడు; శిశుపాలు, సేనాపతి= శిశుపాలునియొక్క సేనాధిపతి; సునీథుండు+అనువాఁడు; అతి, రోష, పరుష వచనుండు+అగుచున్= మిక్కిలి కోపంతో కూడిన కఠినమైన మాటలు కలవాడై; స్వపక్ష, క్షత్రియులన్+ఎల్లన్= తమవైపున ఉండే రాజులందరిని; ఒక్కంతన్+చేర్చుకొని= ఒక్కటిగా కూర్చుకొని; శిశుపాలు+అనుమతంబునన్= శిశుపాలునియొక్క అనుమతితో; యుద్ధ సన్నద్ధుండు+అయి= యుద్ధానికి సిద్ధమైనవాడయి; ఉన్న; సమయంబునన్.

తాత్పర్యం: అప్పుడు శిశుపాలుని సేనాధిపతి సునీథు డనేవాడు మిక్కిలి కోపంతో కఠినంగా మాట్లాడుతూ, తమవైపు ఉండే రాజులందరిని ఒకటిగా కూర్చుకొని, శిశుపాలుని అనుమతితో యుద్ధానికి సిద్ధమయ్యాడు. అప్పుడు

చ. రయవిచల త్తురంగమ తరంగములన్ మదనాగనక్ర సం
చయముల సంచలచ్చటుల సైనిక మత్స్యములన్ భయంకరం
బయి యదువృష్ణిభోజ కుకురాంధక వాహినియుం గలంగె ని
ర్దయతరరోషమారుత నితాంత సమీరితమై క్షణంబునన్. 33

ప్రతిపదార్థం: యదు, వృష్ణి, భోజ, కుకుర+అంధక, వాహినియున్= యదు, వృష్ణి, భోజ, కుకుర, అంధక వంశాల వీరులయొక్క సైన్యం - వాహిని శబ్దానికి నది అనే అర్థం ఉంది కాబట్టి సైన్యమనే నది; రయ, విచలత్+తురంగమ, తరంగములన్= వేగంగా, ఎక్కువగా కదలుతున్న గుర్రాలనే అలలతో; మద, నాగ, నక్ర, సంచయములన్= మదపుటేనుగులనే మొసళ్ళ సమూహాలతో; సంచలత్+చటుల, సైనిక మత్స్యములన్= మిక్కిలిగాతిరుగుతూ మెరుస్తున్న సైనికులనే చేపలతో; భయంకరంబు+అయి= భయాన్ని కలిగించేదై; నిర్దయతర, రోష, మారుత, నితాంత, సమీరితము+ఐ= ఏమాత్రం దయలేని కోప మనే గాలి ఎడతెగకుండా వీచబడిందై; క్షణంబునన్= ఒక్క నిమిషంలో; కలంగెన్= కలత పొందింది.

తాత్పర్యం: యదువృష్ణిభోజ కుకురాంధకవంశ వీరుల సైన్య మనే నది - వేగంగా ఎక్కువగా కదలుతున్న గుర్రాలనే అలలతో, మదపుటేనుగులనే మొసళ్ళ సమూహాలతో, అమితంగా అటుఇటు తిరుగాడుతూ మెరుస్తున్న సైనికులనే చేపలతో, భయంకరమై, ఏమాత్రం దయలేని కోపమనే ఎడతెగని గాలి వీచగా ఒక్క క్షణంలో కలతచెందింది.

విశేషం: అలం. సావయవరూపకం - శ్లేష, వృత్త్యనుప్రాసం. అక్షరరమ్యమై, ఓజోగుణ విశిష్టమై, అర్థచమత్కృతితో పాఠకుణ్ణి ఆకర్షించే నన్నయ ప్రసిద్ధ పద్యాల్లో ఇదొకటి. 'వాహినీ' శబ్దాని కున్న రెండర్థాలను ఆధారంగా గ్రహించి, సైన్యంలోని గుర్రాలను నదిలో ఎంతో చలనంతో పైకిలేచే అలలతో, మదపుటేనుగులను లోపల పారాడే భీకర నక్రాలతో, సైనికులను- తళుకు తళుక్కుమంటూ మిక్కిలిగా సంచరించే మీనాలతో రూపించటం మనోహరంగా ఉంది. 'రయ విచలత్ - తురంగమ- తరంగములన్' అనే కూర్పులోని శబ్దాలంకారానికి సంబంధించిన తకార, రకార, బిందుపూర్వక గకారాల సమూహం చెవికి సోకగానే ఏదో మీదికెగసి దూకుతున్న స్ఫూర్తి కలగటమేకాక, ఆశ్వికులు యుద్ధసన్నద్ధులై ఒక్కసారిగా కళ్ళేలు లాగటంచేత మెడలు మలిపి మూతులుపైకెత్తి కదనుత్రొక్కే ఎత్తైన గుర్రాల తలల కదలికలు, గాలితాకిడిచేత అంతకంతకు పై కెగిరే అలల చివరల ఊపులు భావుకుని కంటికి కనిపించగలవు. అలాగే నాగ - నక్ర పదాల్లో గబగబ ముందుకు దూసుకొనిపోయే ఏనుగులను, తలలు వంచి పారాడే నల్లని మొసళ్ళను, 'సంచలత్ - చటుల - సైనిక' శబ్దోచ్చారణలో - యుద్ధ సన్నద్ధులై, తళతళ మెరిసే ఖడ్గాలు చేపట్టి - అటు ఇటు చురుకుగా సంచరించే సైనికులను, నీళ్ళలో తళుకు, తళుక్కున తిరుగాడే మత్స్యాలను భావుకుడు చూడవచ్చు. శబ్దఘటనచేత అర్థస్ఫూర్తిని కలిగించే నన్నయగారి అక్షరశిల్పానికి ఈ పద్యం ఒక చక్కని ఉదాహరణం. 'వాహినియుం' అనేదానికి 'వారిధియుం' అనే పాఠాంతరం ఉంది. 'తత స్సాగర సంకాశం దృష్ట్వా నృపతి సాగరమ్' (భండార్కరుప్రతి 2-37-1) అనే మూలానికి సరైన పదం 'వారిధి'యే కాని వాహినీ శబ్దంచేత సావయవరూపకానికి సమకూరే మనోహర శ్లేష వారిధిశబ్దంవల్ల సంక్రమించదు. కాగా, 'రోషమారుత' మనే పదానికి 'దోషమారుత'మనే పాఠాంతరం ఉంది. ప్రకరణాన్నిబట్టి 'దోషమనేగాలి' అనటం కంటే 'రోషమనేగాలి' అనటమే మేల్తర మనిపిస్తున్నది. ఈ పద్యానికి ప్రతిబింబంవంటి పద్యాన్ని ఎఱ్ఱాప్రెగ్గడ ఆరణ్యపర్వ షష్ఠాశ్వాసంలో వ్రాయటం దీని ఆకర్షణ కొక తార్కాణం.

వ. అట్టి సకల క్షత్త్రియ క్షోభంబు సూచి భయసంభ్రమాక్రాంత హృదయుండయి ధర్మరాజు భీష్మున కి ట్లనియె. 34

ప్రతిపదార్థం: అట్టి= ఆవిధమైన; సకల, క్షత్త్రియ, క్షోభంబు= అందరు రాజులయొక్క అలజడి; చూచి; భయ, సంభ్రమ+ ఆక్రాంత, హృదయుండు+అయి= భయంచేత, వేగిరపాటుచేత, ఆక్రమించబడిన హృదయం కలవాడై; ధర్మరాజు; భీష్మునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆ విధంగా అందరు రాజుల్లో ఏర్పడిన అలజడిని చూచి భయం, వేగిరపాటు అలముకొన్న మనస్సుతో ధర్మరాజు భీష్మునితో ఇలా అన్నాడు.

తరలము.

ధరణిలోఁ గల రాజు లెల్లను దారుణక్షయకాలసా
గరములట్లు గలంగి; రిప్డు మఖప్రయోగము విఘ్నముం
బొరయ కుండఁ బ్రజాపకారము పుట్టకుండఁగ నీవు చె
చ్చెరఁ బితామహ! వీరి కిచ్చటఁ జిత్తశాంతి యొనర్పవే. 35

ప్రతిపదార్థం: పితామహ= తాతా!; ధరణిలోన్+కల= భూమిలో ఉండే; రాజులు+ఎల్లను= రాజులందరు; దారుణ, క్షయ, కాల, సాగరముల+అట్లు= భయంకరమైన ప్రళయకాల సముద్రాలవలె, కలంగిరి= కలతచెందారు; ఇపుడు(ఇప్డు)= ఇప్పుడు; మఖ, ప్రయోగము= రాజసూయయాగ కార్యక్రమం; విఘ్నమున్= ఆటంకాన్ని; పొరయకుండన్= పొందకుండా; ప్రజా+అపకారము= ప్రజలకు కీడు; పుట్టక+ఉండఁగన్; నీవు; చెచ్చెరన్= వెంటనే, వీరికిన్= ఈ రాజులకు; ఇచ్చటన్; చిత్తశాంతి= మనశ్శాంతిని; ఒనర్పవే= కలిగించవా?

తాత్పర్యం: పితామహా! భూమిమీది రాజులంతా ప్రళయకాల సముద్రాల్లా కలతచెందారు. రాజసూయ కార్యక్రమానికి విఘ్నం కలుగకుండ, ప్రజలకు కీడు పుట్టకుండ, నీవు వెంటనే ఈ రాజులందరికి మనశ్శాంతి కలిగించు.

విశేషం: ఈ పద్యరచనలో సౌకుమార్యగుణం అక్షరరమ్యంగా సందర్భోచితంగా ప్రసాదగుణరంజకంగా పోషించబడింది.(సంపా.)

వ. అనిన ధర్మరాజునకు భీష్ముం డి ట్లనియె. 36

తాత్పర్యం: అనగా భీష్ముడు ధర్మరాజుతో ఈవిధంగా అన్నాడు.

క. నీ యజ్ఞమునకు విఘ్నము । సేయఁగ నోపుదురె యొరులు? జితదైత్యుఁడు నా
రాయణుఁడు యజ్ఞపురుషుఁ డ । జేయ పరాక్రముఁడు దీనిఁ జేకొని కావన్. 37

ప్రతిపదార్థం: జితదైత్యుఁడు= జయించబడిన రాక్షసులు కలవాడు - అంటే రాక్షసులను జయించినవాడు; యజ్ఞ, పురుషుఁడు= శ్రీమహావిష్ణువు; నారాయణుఁడు= శ్రీకృష్ణుడు; అజేయ, పరాక్రముఁడు= జయించసాధ్యంగాని పరాక్రమం కలవాడు; దీనిన్= ఈ యజ్ఞాన్ని; చేకొని= తనదిగా చేసుకొని; కావన్ - రక్షించగా; ఒరులు= ఇతరులు, నీయజ్ఞమునకున్; విఘ్నము= చెరుపు; చేయఁగన్= చేయటానికి; ఓపుదురె= చేతనైనవా ళ్ళవుతారా?

తాత్పర్యం: రాక్షసులను జయించినవాడు, జయించ సాధ్యంకాని పరాక్రమం కలవాడు, శ్రీమహావిష్ణు స్వరూపుడు అయిన శ్రీకృష్ణుడు- ఈ రాజసూయాన్ని చేపట్టి రక్షిస్తుండగా, ఇతరులు నీ యజ్ఞానికి చెరుపు చెయ్యగలరా?

సీ. 'చైద్యునకై పూని సన్నద్ధులై యున్న । యీ రాజు లిందఱు నీక్షణంబ
హరి యల్గి చూచుడు నంతకక్షయమున । కరిగెడు వార; ఘోరాహవమున
దమఘోషనందనుదర్పంబు నిప్పుడ । యడఁగెడుఁ; గడుఁబెక్కులయ్యుఁ గుక్క
లిభకుంభదళనమహిష్ఠనిష్ఠురనఖ । ముఖుఁడగు హరిమీఁద మొఱిఁగి యేమి

ఆ. సేయనోపుఁ? గృష్ణు సింహపరాక్రము । నెఱుఁగకున్నవారె యెల్లవారు?'
ననిన భీష్మపలుకు లవి కర్ణశూలంబు । లయినఁ జేదినాథుఁ డాగ్రహించి. 38

ప్రతిపదార్థం: చైద్యునకై= చేదిదేశానికి రాజైన శిశుపాలునికై; పూని= పూనుకొని; సన్నద్ధులై= యుద్ధానికి సిద్ధమైనవాళ్ళయి; ఉన్న; ఈ, రాజులు; ఇందఱున్; ఈ క్షణంబు+అ; హరి= శ్రీకృష్ణుడు; అలిగి= కోపించి; చూచుడున్= చూస్తే; అంతకక్షయమునకున్= యమధర్మరాజుయొక్క ఇంటికి; అరిగెడు, వారు+అ= వెళ్ళేటటువంటివారే-అంటే మరణించేవారే; దమఘోషనందను, దర్పంబు= దమఘోషునియొక్క కుమారుడైన శిశుపాలుని పొగరు; ఘోర+ఆహవమునన్= భయంకరమైన యుద్ధంలో; ఇప్పుడు+అ= ఇప్పటికిప్పుడే; అడఁగెడున్= అణగిపోతుంది; కడున్= మిక్కిలి; పెక్కులు+అయ్యున్= ఎక్కువసంఖ్యలో ఉన్నప్పటికిని; కుక్కలు; ఇభ, కుంభ, దళన, మహిష్ఠ, నిష్ఠుర, నఖ, ముఖుఁడు+అగు= ఏనుగు కుంభస్థలాన్ని చీల్చటంలో మహాకఠినాలైన గోళ్ళ చివరలు కలవాడయిన; హరిమీదన్= సింహంమీద; మొఱిఁగి= అరిచి; ఏమి చేయన్+ఓపున్= ఏమిచేయగలవు; సింహపరాక్రమున్ - సింహంవంటి పరాక్రమం కలవాణ్ణి; కృష్ణున్= శ్రీకృష్ణుణ్ణి; ఎల్లవారున్= అందరును; ఎఱుఁగకన్, ఉన్న, వారె= తెలియకున్నారా - అంటే శ్రీకృష్ణునియొక్క పరాక్రమంగురించి తెలియని వాళ్ళెవరు?; అనిన; భీష్మపలుకులు=

భీష్మునియొక్కమాటలు; అవి; కర్ణశూలంబులు= చెవులకు బల్లెములవంటివి; కాగా; (అంటే వినటానికి మిక్కిలి బాధాకరాలైనవికాగా); చేదినాథుఁడు= చేదిదేశానికి రాజైన శిశుపాలుడు; ఆగ్రహించి= కోపం పొంది.

తాత్పర్యం: 'శ్రీకృష్ణుడు కోపగించుకొని చూస్తే చాలు, శిశుపాలునికై యుద్ధం చెయ్యటానికి సిద్ధంగా ఉండే ఈ రాజులంతా ఒక్క క్షణంలో యమలోకానికి వెళ్ళుతారు. భీకరపోరాటంలో శిశుపాలునిపొగరు ఇప్పటికిప్పుడే అణగిపోతుంది. కుక్కలు మిక్కిలి ఎక్కువ సంఖ్యలో ఉన్నా, ఏనుగు కుంభస్థలాన్ని చీల్చగల మహాకఠినాలైన గోళ్ళ చివరలు గల సింహంమీద మొరిగి ఏంచేస్తాయి? సింహంవంటి మహాపరాక్రమశాలి అయిన శ్రీకృష్ణుని సంగతి తెలియనివా ళ్ళెవరు?' అని పలికిన భీష్మునిమాటలు శిశుపాలునికి కోపాన్ని కలిగించాయి.

విశేషం: అలం: నిదర్శన, పరికరం, శత్రుపక్షరాజుల అల్పత్వం, శ్రీకృష్ణుని ఆధిక్యం, పద్యంలోని అర్థాలంకారంచేతనే కాక, అక్షరయోజన చేతగూడ సువ్యక్తమవుతున్నది. 'కడు-పెక్కులు-అయ్యు-కుక్కలు' అనే అలతి అలతి పదాలకూడిక, వాటిలో ఒక్క మహాప్రాణాక్షరంకూడ లేని స్థితి. 'ఇభకుంభ దళన మహిష్ఠ నిష్ఠుర నఖ ముఖుఁడు' అనే సుదీర్ఘ సమాసం, అందలి ఓష్ఠ్య మూర్ధన్య కంఠ్యమహాప్రాణాక్షరాలైన భకార, షకార, ఠకార, ఖకారాల పునరుక్తి-ఇరుపక్షాల శక్తులందుండే వ్యత్యాసాన్ని చక్కగా ధ్వనింపచేస్తున్నాయి. కాగా, సింహం, శ్రీమహావిష్ణువు అనే రెండర్థాలు ఉండే 'హరి' శబ్దప్రయోగంకూడ పద్యాని కొక ప్రత్యేకశోభను పొదుగుతున్నది. ఇభకుంభదళన మహిష్ఠ నిష్ఠుర నఖముఖుడైన హరి అనటంతోనే - ఆనాడు మదించి హరిని దూషించిన హిరణ్యకశ్యపు వక్షస్థలాన్ని, తన మహిష్ఠ నిష్ఠుర నఖముఖాలచే చీల్చి, రుధిరపానంచేసే రౌద్రరసోద్విగ్న భీకరనృసింహమూర్తి భావుకుడైన పాఠకుని మనోనయనానికి పొడగట్టుతున్నాడు.

శిశుపాలుఁడు భీష్ముని దూలనాడుట (సం. 2-38-1)

ఉ. 'ఇమ్ముదివెట్టి వీనిఁ బరమేశ్వరుఁగాఁ గొనియాడె; ధర్మత
త్త్వమ్ములు పాండవేయులును దానునుగాని యెఱుంగరట్టె; సా
మమ్మున నెల్లవారి నవమాన్యులఁ జేసె నమాన్యుఁడంచు రూ
క్షమ్మున భీష్ముఁ జూచి బలగర్వితుఁ డి ట్లని పల్కె నల్కతోన్. 39

ప్రతిపదార్థం: ఈ+ముదివెట్టి= ఈ ముసలి వెట్టివాఁడు-భీష్ముడు; వీనిన్= ఈ కృష్ణుణ్ణి; పరమ+ఈశ్వరున్, కాన్= భగవంతునిగా; కొనియాడెన్= పొగిడాడు; ధర్మతత్త్వమ్ములు= ధర్మంయొక్క పరమార్థాలు; పాండవేయులును= పాండవులు; తానును; కాని; ఎఱుంగరు+అట్టె= ఎరుగరట! - అంటే పాండవులు, తాను మాత్రమే తెలుసుకుంటారట!; అమాన్యుఁడు= గౌరవించతగినవాడు - ఈ భీష్ముడు; సామమ్మునన్= మంచిగా మెత్తగా మాట్లాడుతూనే; ఎల్లవారిన్= అందరిని; అవమాన్యులన్+చేసెన్= అవమానించబడినవాళ్ళను చేశాడు - అంటే అవమానించాడు, అంచున్= అంటూ; రూక్షమ్మునన్= కఱకుగా, - చురచుర; భీష్మున్; చూచి; బలగర్వితుఁడు= బలంచేత పొగరెక్కినవాడు; అల్కతోన్= కోపంతో; ఇట్లు+అని, పల్కెన్= పలికాడు.

తాత్పర్యం: 'ఈ ముసలి వెర్రి భీష్ముడు, ఈ గుణహీనుడైన శ్రీకృష్ణుణ్ణి, పరమేశ్వరు డని పొగిడాడు. ధర్మతత్త్వాలు ఈ పాండవులకు, తనకే తెలుసు నట! గౌరవార్హుడుగాని ఈ భీష్ముడు మెత్తగా మాట్లాడుతూనే అందరినీ అవమానించాడు!' అని ఆ కురుపితామహుణ్ణి చురచుర చూచి, బలగర్వితుడైన శిశుపాలుడు కోపంతో ఇంకా ఇలా అన్నాడు.

విశేషం: నన్నయగారు రూపొందించిన 'ఇమ్ముదివెట్టి' పదంలో శిశుపాలుని ఈసడింపు లెస్సగా వ్యక్తమైంది. ('నీనిన్' అని శ్రీకృష్ణుణ్ణి నిర్దేశించటంలో అతనిపట్ల శిశుపాలునికి గల క్రోధాసహ్యాభావం కూడ ధ్వనిస్తూఉంది. దానికి పోషకంగా రచనలో అర్థవ్యక్తిగుణం అమరింది. - సంపా.)

ఉ. నెట్టన ధర్మనందనుఁడు ని న్నవలంబము సేసి యోడతోఁ
గట్టినయోడవోలె గతగౌరవుఁడై కడుఁదూలెఁ గృష్ణుఁ జే
పట్టి బిభీషికల్ ధరణిపాలుర కిప్పుడు సూపి; తెందు నీ
యట్టి దురాత్ములుం గలరె; యంత యధీరులె ధారుణీపతుల్? 40

ప్రతిపదార్థం: నెట్టన= తప్పనిసరై; ధర్మనందనుఁడు= ధర్మరాజు; నిన్నున్+అవలంబము, చేసి= నిన్ను ఆధారంగా చేసుకొని; కృష్ణున్+చేపట్టి= అర్ఘ్యమివ్వటానికి శ్రీకృష్ణుణ్ణి చేకొని; ఓడతోన్+కట్టిన, ఓడ, పోలెన్= ఒక ఓడతో కట్టిన మరొక ఓడవలె; గతగౌరవుఁడు+ఐ= కోల్పోయిన గౌరవం కలవాడై; కడున్= మిక్కిలి; తూలెన్= చలించాడు; ధరణి, పాలురకున్= భూపతులకు; - రాజులకు; ఇప్పుడు, బిభీషికల్= పెద్ద బెదిరింపులు; చూపితివి; ఎందున్= ఎక్కడైనా; నీ, అట్టి= నీవంటి; దురాత్ములున్= దుర్మార్గులు; కలరె; ధారుణీపతుల్= ఈ రాజులందరు; అంత, అధీరులె= అంత ధైర్యంలేనివాళ్ళా?

తాత్పర్యం: తప్పనిసరై ధర్మనందనుడు నిన్ను ఆధారంచేసుకొని అర్ఘ్యమివ్వటానికి శ్రీకృష్ణుణ్ణి స్వీకరించాడు. ఓడతో కట్టిన ఓడలా గౌరవాన్ని కోల్పోయి తూలాడు. ఈ సభలోఉన్న రాజులందరిని నీ విప్పుడు బెదిరించావు. ఎక్కడైనా నీవంటి దుర్మార్గులున్నారా? ఈ రాజులంతా అంత ధైర్యం లేనివాళ్ళా?

విశేషం: అలం: ఉపమ. భీష్ముణ్ణి ఆధారంచేసుకోవటం ధర్మరాజుకు తప్పనిసరి అవటానికి కారణం - ఆయన తాత అవటం, కృతాకృత పరిజ్ఞానంలో ధర్మజుడే ఆయనను నియమించటం. కాగా భీష్ముడు కావించిన శ్రీకృష్ణుని బలపరాక్రమ మాహాత్మ్య ప్రశంసలన్నీ పరోక్షంగా ప్రతిపక్షులకు బెదిరింపులే. (పద్యరచనలో అర్థవ్యక్తి పౌరుషోక్తులతోకూడిన ప్రసాదానికి పోషకంగా నిలిచింది. సంపా.)

సీ. పూతనాఘాతంబుఁ, జేతనేతరమైన । శకటంబు త్రోపును జరణనిహతి,
వీఁకతోఁ గడుఁబూచుమ్రాకుల విఱుపును, । వల్మీకమాత్రపర్వతము నెత్తి
కొని, లావుగలఁడు వీఁ డన నేఁడు దివసంబు । లునికియు, వృషవధయును ననంగఁ
బమ్మిన కృష్ణుబీరమ్ములు వొగడుచు । నున్న నీ నాలుక యొక్కఁడయ్యు

ఆ. వ్రయ్యవలయు నూఱు వ్రయ్యలుగాఁగ; న । ట్లయినఁ గాని చాల వతనిఁ బొగడ;
నెల్లదాని నేన యెఱుఁగుదు; నెందు వాఁ । డర్ఘ్యదానయోగ్యుఁ డయ్యెఁ జెపుమ. 41

ప్రతిపదార్థం: పూతనా, ఘాతంబు= పూతన అనే రాక్షసిని చంపటం; చరణనిహతిన్= కాలిదెబ్బచేత; చేతన+ఇతరము+ఐన= ప్రాణంకలది కానిదైన; శకటంబు, త్రోపును= బండిని పడగొట్టటం; వీఁకతోన్= గర్వంతో; కడున్= మిక్కిలి - అంటే ఏమాత్రంకూడ; పూచుమ్రాకులన్= చేవలేని చెట్లను; విఱుపును= విరగదీయటాన్ని; వల్మీకమాత్ర, పర్వతమును= పుట్టఅంతటి చిన్నకొండను; ఎత్తికొని= పైకెత్తుకొని; లావు గలఁడు, వీఁడు+అనన్= బలంకలవా డితడు అనేటట్లు; ఏడు, దివసంబులు= ఏడురోజులు; ఉనికియున్= ఉండటమును; వృషవధయునున్= ఎద్దును చంపటమును; అనంగన్= అనేటటువంటి; పమ్మిన=

అతిశయించిన, కృష్ణబీరమ్ములు= శ్రీకృష్ణుని పరాక్రమాలు; పొగడుచున్+ఉన్న; నీ, నాలుక; ఒక్కడు+అయ్యున్= ఒక్కటే అయినా; నూఱు వ్రయ్యలు, కాఁగన్= వందముక్కలయ్యేటట్లుగా, వ్రయ్యవలయున్= చీలిపోవాలి; అట్లు; అయినన్; కాని; అతనిన్= ఆ శ్రీకృష్ణుణ్ణి; పొగడన్= పొగడటానికి; చాలవు= సరిపోవు; ఎల్లదానిన్= ప్రతివిషయాన్ని, - ఆ కృష్ణునికి సంబంధించిన అన్ని విషయాలను; నేను+అ= నేనే; ఎఱుఁగుదున్; ఎందున్= ఏవిషయంలో; వాఁడు= ఆ కృష్ణుడు; అర్ఘ్య, దాన, యోగ్యుఁడు+అయ్యెన్= అర్ఘ్యాన్ని ఇవ్వటానికి తగినవాడయ్యాడో; చెపుమ= చెప్పుమా!

తాత్పర్యం: పూతన అనే ఆడుదాన్ని చంపటం, కాలిదెబ్బతో ప్రాణంలేని బండిని పడద్రోయటం, ఏమాత్రం సారంలేని చెట్లను గర్వంతో విరవటం, పుట్టఅంత చిన్నకొండను ఎత్తుకొని వీడు బలవంతు డనిపించేటట్లు ఏడురోజు లుండటం, ఎద్దును చంపటం- అనే శ్రీకృష్ణుని పరాక్రమాలు పొగడుతున్న నీ నాలుక ఒక్కటే అయినా, అది నూరు చీలికలుగా చీలాలి. అట్లయితేగాని అతణ్ణి బాగా పొగడటానికి సరిపోవు. ఆ కృష్ణుని విషయాలన్నీ నాకు తెలుసు. ఏ విషయంలో వాడు అర్ఘ్యమివ్వటానికి తగినవా డయ్యాడో తెలుపు.

విశేషం: అంతటి మాయాపూతనా జీవితాపహరణాన్ని ఒక ఆడుదాన్ని చంపటంగాను, శకటాసురుడంతటివాణ్ణి భంజించటాన్ని ప్రాణంలేని బండిని పడద్రోయటంగాను, మహావృక్షరూపులైన మాయావులు యమళార్జునుల్ని పడవేయటం చేవలేనిచెట్లను విరవటంగాను, గోవర్ధనగిరిని ఎత్తి ఏడునాళ్ళు గొడుగుగా పట్టుకొనటాన్ని పుట్ట అంతటి చిన్నకొండను ఎత్తి బలవంతు డని విర్రవీగటంగాను, ధేనుకాసురుణ్ణి తుదముట్టించటాన్ని ఎద్దు నొకదానిని చంపటంగాను- తక్కువచేసి మాట్లాడే శిశుపాలుని తక్కువదనాన్ని, శ్రీకృష్ణద్వేషాన్ని ఈ పద్యం చక్కగా సూచిస్తున్నది. 'ఎల్లదాని నేన యెఱుఁగుదు నెందు వాఁ డర్ఘ్యదానయోగ్యుఁ డయ్యెఁ జెపుమ'- అనే దానికున్న, 'ఎల్లదాని నేన యెఱుఁగుదు నందు వీఁ డర్ఘ్య దానయోగ్యుఁ డగునె చెపుమ'- అనే పాఠాంతరం కూడ స్వీకరించదగిందే. 'పూచు మ్రాకుల'కు మూలంలో భండార్కర్ ప్రతిలో 'అర్కప్రమాణౌ తౌ వృక్షౌ'- (జిల్లేడుచెట్ల ప్రమాణం గలరెండుచెట్లు) అని ఉంది. (2-38-367).

వ. స్త్రీలను గోబ్రాహ్మణులం గూడువెట్టువారిని విశ్వసించినవారిని వధియించుట మహాపాతకం బని పెద్దలు సెప్పుదు; రట్టివానియందు గోవిందుఁడు స్త్రీవధయును గోవధయునుం జేసె; నీవునుం గడు ధర్మువెఱింగినవాఁడ వయి వీని కర్ఘ్యం బిప్పించి; తదియునుంగాక యన్యకామ యయిన యంబ యను కన్యక నపహరించి నీవు దెచ్చిన నెఱింగి నీ తమ్ముండు విచిత్రవీర్యుండు ధర్మ వెఱిఁగినవాఁడై దాని విడిచి పుచ్చె. **42**

ప్రతిపదార్థం: స్త్రీలను; గోబ్రాహ్మణులన్; కూడు; పెట్టువారిని; విశ్వసించినవారిని= నమ్మినవారిని; వధియించుట= చంపటం; మహా, పాతకంబు+అని= మిక్కిలి పాప మని; పెద్దలు; చెప్పుదురు; అట్టి, వాని, అందున్= ఆ విధా లైన మహాపాపాల్లో; గోవిందుఁడు; స్త్రీవధయును; గోవధయునున్; చేసె; నీవునున్= నీవుకూడ; కడున్= గొప్పగా; ధర్మువు+ఎఱింగినవాఁడవు+అయి= ధర్మం తెలిసినవాడవయి; వీనికిన్= ఇటువంటి పాపాలు చేసిన ఈ కృష్ణునికి; అర్ఘ్యంబు+ఇప్పించితి; అదియునుంగాక; అన్య, కామ, అయిన= ఇతరుణ్ణి వరించినదైన; అంబ; అను; కన్యకన్; అపహరించి= దొంగిలించి; నీవు; తెచ్చినన్; ఎఱింగి= తెలుసుకొని; నీ, తమ్ముండు; విచిత్రవీర్యుండు; ధర్మువు+ఎఱిగినవాఁడు+ఐ= ధర్మాన్ని తెలిసికొన్నవాడై; దానిన్= ఆ కన్యకను; విడిచి; పుచ్చెన్= వదలివేశాడు.

తాత్పర్యం: స్త్రీలను, గోవులను, బ్రాహ్మణులను, అన్నంపెట్టినవారిని, నమ్మినవాళ్ళను చంపటం మహాపాప మని పెద్దలు చెప్తుతారు. అటువంటి పాపాల్లో గోవిందుడు స్త్రీవధను, గోవధను చేశాడు. నీకేదో గొప్పగా ధర్మం

తెలిసినట్లు అలాంటి పాపాలు చేసిన కృష్ణునికి అర్ఘ్యం ఇప్పించావు. అంతే కాదు, మరొకరిని ప్రేమించిన అంబ అనే కన్యకను నీవు అపహరించి తెచ్చావు. ఆ సంగతి తెలిసి, ధర్మం తెలిసిన నీ తమ్ముడు విచిత్రవీర్యుడు, ఆమెను విడిచిపెట్టాడు.

విశేషం: అంబ కాశీరాజు పెద్దకూతురు. ఆమె సాళ్వుణ్ణి ప్రేమించింది. స్వయంవర సమయంలో భీష్ముడు-తక్కిన రాజుల్ని జయించి తమ్ముడు విచిత్రవీర్యునికొరకు ఆమెను, ఆమె చెల్లెళ్లు - అంబికను, అంబాలికను బలవంతంగా తెచ్చాడు.

క. జననిందిత మయి నీయం। దనపత్యత యను నధర్మ మది యుండఁగ ధ
ర్మనివృత్తచరిత్రక! నీ। యనుశాసన మెట్లు నమ్మ నగు జనములకున్? 43

ప్రతిపదార్థం: జననిందితము+అయి= జనులచేత నిందించబడిందై; నీయందున్; అనపత్యత= సంతానం లేకుండటం; అను; అధర్మము; అది; ఉండఁగన్; ధర్మ; నివృత్త, చరిత్రక!= ధర్మంనుండి మరల్చబడిన చరిత్ర కలవాడా-అంటే ధర్మాన్ని వదలిన చరిత్ర కలవాడా!; నీ, అనుశాసనము= నీ ఆనతి; జనములకున్; ఎట్లు, నమ్మన్, అగున్= ఏవిధంగా సమ్మతమవుతుంది?

తాత్పర్యం: ధర్మానికి దూరమైనచరిత్రకలవాడా! సంతానం లేకపోవటం అనే అధర్మం - అందరిచేత నిందింపబడుతూ నీలో ఉంది కదా! అలాంటప్పుడు నీ ఆజ్ఞను జను లెట్లా శిరసావహిస్తారు?

వ. తొల్లి సముద్రతీరంబున నుండి యొక్క వృద్ధహంస ధర్మాధర్మంబులు సెప్పుచు ధర్మమార్గంబున వర్తిల్లుచుండుఁ డని పక్షుల నెల్ల శిక్షించుచుఁ బ్రాణిహింస సేయక తపోవృత్తి నున్న దానికి సముద్రజలచరంబు లయిన పక్షులు రుచ్యంబు లగు భక్ష్యంబులు దెచ్చి పెట్టుచుం దత్సమీపంబునం దమ తమ యండంబుల నెల్ల నిక్షేపించి భక్షణార్థం బొక్కనాఁ డతిదూరం బరిగిన, నిట యాహంసయు నయ్యండంబుల భక్షించిన దాని నొక్క పక్షి గని యా పక్షులకెల్లం జెప్పిన, నవి దద్దయు దుఃఖించి యా యంచను వధియించెం గావున నట్ల నీవు నధర్మప్రవృత్తుండవై ధర్మశిక్ష సేయుచుఁ గౌరవుల కాపద యాపాదించుచున్నవాఁడవు. 44

ప్రతిపదార్థం: తొల్లి= పూర్వం; సముద్రతీరంబునన్; ఉండి; ఒక్క; వృద్ధ, హంస= ముసలిహంస; ధర్మ+అధర్మంబులు= ఇది ధర్మం. ఇది అధర్మం అని; చెప్పుచున్; ధర్మమార్గంబునన్; వర్తిల్లుచున్+ఉండుఁడు= ప్రవర్తిస్తూ ఉండండి; అని; పక్షులన్+ఎల్లన్= అన్ని పక్షులను; శిక్షించుచున్= బోధిస్తూ; ప్రాణి, హింస, చేయక= ప్రాణులను చంపక; తపో, వృత్తిన్= తపస్సు చేసుకొంటూ; ఉన్నన్; దానికిన్= ఆ ముసలిహంసకు; సముద్ర, జల, చరంబులు= సముద్రపునీట తిరుగుతున్న; పక్షులు; రుచ్యంబులు+అగు= మంచి రుచికలిగినటువంటి; భక్ష్యంబులు= ఆహారపదార్థాలు; తెచ్చి; పెట్టుచున్; తత్, సమీపంబునన్= ఆ ముసలిహంస దగ్గర; తమ; తమ; అండంబులన్+ఎల్లన్= గ్రుడ్లనన్నింటిని; నిక్షేపించి= దాచిఉంచి; భక్షణ+అర్థంబు= ఆహారంకోసం; ఒక్కనాఁడు; అతి, దూరంబు; అరిగినన్; ఆ, ముసలి, హంస; ఆ+అండంబులన్= ఆ గ్రుడ్లను; భక్షించినన్= తినగా; దానిన్= ఆ తినటాన్ని; ఒక్క; పక్షి; కని= చూచి; ఆ, పక్షులకున్+ఎల్లన్= ఆ పక్షుల కన్నింటికి; చెప్పినన్; అవి; తద్దయున్= మిక్కిలి; దుఃఖించి; ఆ, అంచను= ఆ ముసలిహంసను; వధియించెన్= చంపాయి; కావునన్; అట్లు= ఆ విధంగా; నీవును; అధర్మ, ప్రవృత్తుండవు+ఐ= అధర్మంలో నడుస్తున్నవాడివై; ధర్మశిక్ష, చేయుచున్= ధర్మబోధచేస్తూ; కౌరవులకున్; ఆపద= కీడు; ఆపాదించుచున్+ఉన్నవాఁడవు= కలిగిస్తున్నావు.

తాత్పర్యం: పూర్వం ఒక ముసలిహంస సముద్రతీరంలో నివసిస్తూ, ధర్మాధర్మాల్ని గూర్చి చెప్తూ, ధర్మమార్గంలో నడచుకొండని పక్షులన్నింటికి ఉపదేశిస్తూ, జీవహింస మాని తపస్సు చేసుకొంటూ ఉండింది. సముద్రపునీట తిరుగాడే పక్షులన్నీ ఆ ముసలిహంసకు రుచికరా లైన ఆహారపదార్థాలు తెచ్చిపెడుతూ, తమ గ్రుడ్లను దానిదగ్గర దాచిపెట్టి, ఒకరోజు దూరప్రాంతానికి ఆహారానికై వెళ్ళాయి. ముసలిహంస ఆ గ్రుడ్లను తినటం ఒకపక్షి చూచి తక్కినవాటికి చెప్పింది. ఆ పక్షులన్నీ మిక్కిలి దుఃఖించి ఆ ముసలిహంసను చంపివేశాయి. అలాగే నీవుకూడ అధర్మమార్గాన నడుస్తూ, ధర్మబోధ చేసి కౌరవులకు కీడు కలిగిస్తున్నావు.

క. విదితముగ నధికబలసం । పద నోర్చె నుపేంద్రుఁ డవనిపాలుర నంచున్
మదిఁ బొగడితి; నా యెఱుఁగని । యదియె జనార్దనుబలంబు నత్యున్నతియున్? 45

ప్రతిపదార్థం: ఉపేంద్రుఁడు= కృష్ణుడు; విదితముగన్= లోకప్రసిద్ధంగా; అధికబలసంపదన్= మిక్కుట మైన బలసమృద్ధితో; అవనిపాలురను= రాజులను; ఓర్చెన్= ఓడించాడు; అంచున్= అంటూ; మదిన్= మనసార; పొగడితి= కొనియాడావు; జనార్దను, బలంబున్= శ్రీకృష్ణునియొక్క బలం; అతి+ఉన్నతియున్= అధికమైన గొప్పతనము; నా, ఎఱుఁగని, అదియె= నాకు తెలియనిదా?

తాత్పర్యం: శ్రీకృష్ణుడు లోకప్రసిద్ధంగా అత్యధిక బలసంపదతో రాజులందరిని ఓడించా డని మనసార పొగిడావు. ఆ శ్రీకృష్ణుని బలం, గొప్పతనం నాకు తెలియనివా?

క. సకలక్షత్త్రభయంకరు । నకు బార్హద్రథికి ననిమొనన్ మార్కొన నో
పక వలియం బాఱఁడె యీ । ముకుందుఁడు భయాతిరేకమునఁ బదిమాఱుల్. 46

ప్రతిపదార్థం: ఈ ముకుందుఁడు= ఈ శ్రీకృష్ణుడు; సకల, క్షత్ర, భయంకరునకున్= అందరు క్షత్రియులకు భయాన్ని కలిగించేవాడికి; బార్హద్రథికిన్= బృహద్రథుని కుమారుడైన జరాసంధుడికి; అనిమొనన్= యుద్ధంలో ఎట్టయెదుట; మార్కొనన్+ ఓపక= ఎదుర్కొనలేక; భయ+అతిరేకమునన్= విపరీతమైన భయంతో; పదిమాఱుల్; వలియన్= బలహీనతను పొంది; పాఱడె= పరుగెత్తిపోలేదా?

తాత్పర్యం: అందరు రాజులకు భయాన్ని కలిగించేవాడు, బృహద్రథుని పుత్రుడు అయిన జరాసంధుణ్ణి యుద్ధంలో ఎదుర్కోలేక, విపరీత భయంతో ఈ శ్రీకృష్ణుడు బ్రతుకుజీవుడా అని పదిమార్లు పరుగెత్తిపోలేదా?

వ. అమ్మహాసత్త్వు జరాసంధుం బరమబ్రహ్మణ్యు బ్రాహ్మణవేషంబున భీమార్జునులం దోడుసేసికొని వధియించె; నవి యెల్లం ద్రివిక్రము పరాక్రమంబులుగా నశ్రాంతవచనుండ వయి. 47

ప్రతిపదార్థం: ఆ+మహాసత్త్వున్, జరాసంధున్= మహాబలసంపన్ను డైన ఆ జరాసంధుణ్ణి; పరమబ్రహ్మణ్యున్= మిక్కిలిగా బ్రాహ్మణుల హితం కోరేవాణ్ణి; బ్రాహ్మణవేషంబునన్; భీమ+అర్జునులన్; తోడు, చేసికొని= వెంటబెట్టుకొని; వధియించెన్= చంపాడు; అవి; ఎల్లన్; త్రివిక్రము= శ్రీకృష్ణునియొక్క; పరాక్రమంబులుగాన్; అశ్రాంతవచనుండవు+అయి= అలసటలేని మాటలు కలవాడివై.

తాత్పర్యం: మహాబలసంపన్నుడు, ఎంతగానో బ్రాహ్మణుల మేలు కోరేవాడు అయిన ఆ జరాసంధుణ్ణి బ్రాహ్మణవేషంలో భీమార్జునుల్ని సహాయులుగా చేసుకొని చంపాడు. వీటి నన్నింటిని శ్రీకృష్ణుని వీరకృత్యాలుగా అలసటలేని మాటలు కలవాడివై.

ఆ. బూతు వొగడినట్లు వొగడెదు; పొగడంగ । వలయునేని సుగుణవంతు లయిన
కర్ణ శల్యు లాదిగాఁ గల వీరులఁ । బొగడుచుండరాదె ప్రొద్దువోక. 48

ప్రతిపదార్థం: బూతు= బట్టువాడు(వంది); పొగడినట్లు; పొగడెదు= పొగడుతున్నావు; పొగడంగన్, వలయున్+ఏనిన్= పొగడదలచుకొంటే; సుగుణవంతులు+అయిన= మంచిగుణాలు కలవాళ్ళయిన; కర్ణ, శల్యులు+ఆదిగాన్= కర్ణుడు, శల్యుడు మొదలుగా గల; వీరులన్; ప్రొద్దు, పోక= కాలం గడపటానికి; పొగడుచున్+ఉండరాదె= పొగడుతూ ఉండకూడదా?

తాత్పర్యం: బట్టువానివలె పొగడుతున్నావు. పొగడదలచుకుంటే మంచిగుణాలు కల కర్ణ శల్యుల వంటి వీరు లున్నారు. ప్రొద్దుపోవటానికి వాళ్ళను పొగడుతూ ఉండరాదా?

విశేషం: 'ప్రొద్దుపోక'కు 'ప్రొద్దువోవ' అనే పాఠాంతరం ఉన్నది. (రౌద్రానుప్రాణితంగా శిశుపాలుడి వాక్యాలలో వికటత్వం లాస్యంచేస్తూ అగ్రామ్యత్వంవలన ఉదారత అనే గుణం రాణిస్తున్నది. -సంపా.)

ఆ. అన్యకీర్తనంబు నన్యనిందయుఁ దన్నుఁ । బరఁగఁ బొగడికోలుఁ బ్రబ్బికోలు
నాపగాతనూజ! యార్యవృత్తములు గా । వనిరి వీని నాద్యులయిన మునులు. 49

ప్రతిపదార్థం: ఆపగా, తనూజ= నదీతనయా! గాంగేయా!; ఆద్యులు+అయిన, మునులు= ప్రాచీను లైన మహర్షులు; అన్యకీర్తనంబున్= ఇతరులను పొగడటం; అన్య, నిందయున్= ఇతరులను దూషించటం; తన్నున్= తనను; పరఁగన్= ఒప్పుగా; పొగడికోలున్= పొగడుకొనటం; ప్రబ్బికోలున్= నిందించుకోవటం; వీనిన్= ఈ నాల్గింటిని; ఆర్య, వృత్తములు= పెద్దలు చేయదగిన పనులు; కావు+అనిరి.

తాత్పర్యం: గాంగేయా! ఇతరులను పొగడటం, నిందించటం, తనను తాను పొగడుకోవటం, నిందించుకోవటం పెద్దలు చెయ్యదగిన పనులు కా వని ప్రాచీను లైన మహర్షులు చెప్పారు కదా!

వ. అని రూక్షాక్షరవచనంబుల నాక్షేపించుచున్న శిశుపాలుం జూచి సహింపనోపక భీమసేనుం డతిరౌద్రాకారంబున నలిగిన. 50

ప్రతిపదార్థం: అని; రూక్ష+అక్షర, వచనంబులన్= కఠినాలైన అక్షరాలతో కూడుకొన్న మాటలతో; ఆక్షేపించుచున్+ఉన్న= దూషిస్తున్న; శిశుపాలున్; చూచి; సహింపన్+ఓపక= ఓర్చుకొనలేక; భీమసేనుండు; అతి, రౌద్ర+ఆకారంబునన్= మిక్కిలి భయంకరమైన రూపాన; అలిగినన్= కోపించగా.

తాత్పర్యం: అని కఠినాక్షరాలతో కూడుకొన్న మాటలతో దూషిస్తున్న ఆ శిశుపాలుణ్ణి చూచి ఓర్చుకోలేక భీముడు మిక్కిలి భయంకరమైన రూపంతో కోపించగా.

విశేషం: 'రూక్షాక్షరవచనంబుల' అనేదానికి 'రూక్షేక్షణవచనంబుల' అనే పాఠాంతరం అనేక ప్రతుల్లోఉంది. అర్థాన్నిబట్టి శిశుపాలుని మాటలు కఠినాలే గాని, అందలి అక్షరాల్లో కాఠిన్యమేముంది? కాగా సందర్భాన్నిబట్టి శిశుపాలుడు మాట్లాడిన మాటల్లోనే కాక అతడు కురుపితామహుణ్ణి చూచిన చూపుల్లోకూడ ఎంతో కఱకుదనం ఉండే అవకాశంఉంది. అందువల్ల కఱకుచూపులు, మాటలు - అనే అర్థాన్నిచ్చే 'రూక్షేక్షణవచనంబుల' అనే పాఠాంతరమే మేల్తర మనిపిస్తున్నది. అంతమందిలో, అంతటి కురుపితామహుణ్ణి నోటికి వచ్చినట్లు మాట్లాడే శిశుపాలుడి మాటల్లోని కఱకుదనాన్నే గాక, చూపుల్లోని కఱకుదనాన్నికూడ చూడబట్టే భీముడు అంత ఆగ్రహోదగ్రమూర్తి అయ్యా డనిపిస్తుంది.

చ. ప్రకటితకోపవేగమునఁ బద్మదళాయతనేత్రముల్ భయా
నకతర లీలఁ దాల్చె నరుణద్యుతి నుద్యతమై త్రిశాఖ మై
భ్రుకుటి లలాటదేశమునఁ బొల్చెఁ ద్రికూటతటిత్రిమార్గగా
నుకృతిఁ బ్రభంజనప్రియతనూజున కంతకమూర్తి కచ్చటన్. 51

ప్రతిపదార్థం: అచ్చటన్= ఆ సభలో; అంతకమూర్తికిన్= అందరిప్రాణాలను అంతమొందించేవాడైన యమధర్మరాజువంటి ఆకారాన్ని తాల్చినవానికి; ప్రభంజన, ప్రియ, తనూజునకున్= వృక్షాలు మొదలైనవాటిని విరిచే మహాబలు డైన వాయుదేవుని కూర్మి తనయునికి- భీమసేనునికి; ప్రకటిత, కోప, వేగమునన్= పెల్లుబికిన కోపంయొక్క వేగంచేత; పద్మదళ+ఆయత, నేత్రముల్= పద్మంయొక్క రేకులవంటి విశాలాలైన కన్నులు; అరుణద్యుతిన్= ఎఱ్ఱనికాంతితో; భయానకతర, లీలన్+తాల్చెన్= ఎక్కువభయంకరమైన రూపాన్ని ధరించాయి; భ్రుకుటి= బొమముడి; ఉద్యతము+ఐ= పైకి ఎత్తబడినదై; త్రిశాఖము+ఐ= మూడుభాగాలు కలదై - అంటే మూడు మెలికలు కలదై; త్రికూట, తటి= త్రికూట పర్వతప్రదేశంలో; త్రిమార్గగా+అనుకృతిన్= మూడుమార్గాల్లో వెళ్ళేటటువంటి దైన- అంటే స్వర్గ మర్త్య పాతాళలోకాల్లో ప్రవహించే దైన గంగానదిని పోలినదై; లలాటదేశమునన్= (భీముడియొక్క) నొసటిప్రదేశంలో; పొల్చెన్= ఒప్పింది.

తాత్పర్యం: ఆ సభలో యమునివంటి ఆకారం ధరించినవాడు, ప్రభంజను డైన వాయుదేవుడి ప్రియపుత్రుడు అయిన భీమునికి, పెల్లుబికిన కోపవేగంతో పద్మపత్రాలవంటి విశాలనేత్రాలు ఎఱ్ఱబడ్డాయి. భయంకర మైన రూపుదాల్చాయి. అతనినొసట బొమముడి ఎత్తుగా పైకుబికి మూడుభాగాలుగా మెలికలు తిరిగి, త్రికూట పర్వతప్రదేశంలో మూడుపాయలుగా చీలి స్వర్గ మర్త్య పాతాళాల్లో ప్రవహించే గంగానదిలా కన్పించింది.

విశేషం: అలం: ఉపమ. ఇది భీమసేనుని కోపవిజృంభణవర్ణనం. శిశుపాలుని దౌష్ట్యాన్ని చూచి ఆగ్రహోదగ్రుడైన భీమసేనుణ్ణి అంతకమూర్తి అనటం ఎంతో బాగుంది. అన్నగారి అనుమతి లభించాలే కాని ఆ కోపోద్రిక్తస్థితిలో శిశుపాలుని పాలిటికి, అతని సైన్యం పాలిటికి అప్పు డా భీమసేనుడు యముడే. 'ప్రభంజన ప్రియతనూజుడు' అనే సంబోధనకూడ ఈ సందర్భంలో భావస్ఫోరకంగా ఉంది. ప్రభంజనుడు ఏ విధంగా విజృంభించి, వీచి ఎంతటి వృక్ష సముదాయా న్నైనా ఏ విధంగా నేలమట్టం చేస్తాడో ఆయన ప్రియతనూజు డైన భీమసేనుడుకూడ- అన్నగారు ఊఁ అంటే చాలు- ఆ శిశుపాలుణ్ణి, అతని సైన్యాన్ని తాకి ఒక్కక్షణంలో మట్టుపెట్టగలడు. పద్మపత్రాల్లా సహజంగా విశాలాలే అయినా కోపోద్రిక్తు డైన ఆ భీమసేనుని కళ్ళు, అప్పు డెంతగా విప్పారి ఎఱ్ఱబడ్డాయో 'పద్మదళాయత' అనే సమాసంలోని సవర్ణదీర్ఘత చక్కగా సూచిస్తున్నది. ఎత్తైన అతని ఫాలభాగంమీది ఆ బొమముడి, ఎంత ఎత్తై ఏ విధంగా మూడు మెలికలు తిరిగిందో- త్రిశాఖమై, త్రికూటతటి, త్రిమార్గగ- అనే పదాల్లో మొత్తం వక్రమై మూడుసార్లు కనిపించే 'త్రి'లో భావుకుడు దర్శించవచ్చు. కాగా భీముని ధార్మికరోషాన్ని- ఎంత పవిత్రమో అంత ప్రమాదకరమైన గంగానదితో పోల్చటం ప్రత్యేకించి బాగున్నది. అక్షరసంయోజనచేతనే కాక, ఓజోగుణరచనచేతనే కాక, అర్థగాంభీర్యంచేతకూడ ఈ పద్యం మనోహరం; ప్రసిద్ధం.

భీమునకు భీష్ముండు శిశుపాలుని వృత్తాంతంబు సెప్పుట (సం. 2-40-1)

వ. ఇట్లు నిఖిల క్షత్త్రియత్రాసజననంబుగా నలిగి దంతసందష్ట దారుణ ముఖుండై శిశుపాల నిర్మూలనాభీల సంరంభంబున నున్న భీమసేను వారించి భీష్ముం డిట్లని చెప్పె ; 'నిద్దురాత్ముండు తొల్లి చేదివంశంబున దమఘోషుం డనువానికి సాత్వతికిం జతుర్భుజ లలాట నేత్రంబులతో నుదయించి. రాసభరవంబున నేడ్చుచున్నం జూచి తల్లిదండ్రులు భయవిస్మయాధీనమనస్కులయి యున్న వారికి నొక్క యశరీరభూతం బిట్లనియె.' 52

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; నిఖిల, క్షత్త్రియ, త్రాస, జననంబుగాన్= అందరు రాజులకు భయంపుట్టేటట్లు; అలిగి= కోపించి; దంత, సందష్ట, దారుణ, ముఖుండు+ఐ= పళ్ళుకొరకటంచేత భయంకర మైన ముఖం కలవాడై; శిశుపాల, నిర్మూలన+ఆభీల, సంరంభంబునన్= శిశుపాలుణ్ణి చంపటంలో భీకరమైన ఆటోపంతో; ఉన్న; భీమసేను; వారించి= ఆపి; భీష్ముండు; ఇట్లు+అని; చెప్పెన్; తొల్లి= పూర్వం; ఈ+దురాత్ముండు= ఈ దుర్మార్గు డైన శిశుపాలుడు; చేది, వంశంబునన్; దమఘోషుండు+అనువానికిన్; సాత్వతికిన్= సాత్వతి అనే పేరుగల ఆమెకు; చతుః+భుజ, లలాట, నేత్రంబులతోన్= నాలుగుభుజాలతో; నొసటి మీది కంటితో; ఉదయించి= పుట్టి; రాసభరవంబునన్= గాడిదకంఠధ్వనితో; ఏడ్చుచున్+ఉన్నన్= ఏడుస్తూ ఉండగా; తల్లిదండ్రులు= సాత్వతీదమఘోషులు; చూచి; భయ, విస్మయ+అధీన, మనస్కులు+అయి= భయానికి, ఆశ్చర్యానికి లొంగిపోయిన- అంటే భయాశ్చర్యాలతో నిండిన- మనస్సులు కలవాళ్ళయి; ఉన్నన్; వారికిన్; ఒక్క; అశరీర, భూతంబు= శరీరం లేకయే పలికే ప్రాణి- ఆకాశవాణి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికింది.

తాత్పర్యం: ఈ విధంగా కోపించి రాజు లందరికి భీతి కలిగేలా, పళ్ళుకొరుకుతూ భయంకర మైన ముఖంతో శిశుపాలుణ్ణి తుదముట్టించటానికి సమకట్టి, దారుణమైన ఆటోపంతో ఉన్న భీమసేనుణ్ణి ఆపి- భీష్ముడు, శిశుపాలుని చరిత్రను ఇలా చెప్పాడు: 'ఈ దుర్మార్గుడైన శిశుపాలుడు చేదివంశంలో సాత్వతీదమఘోషులకు పుట్టాడు. పుట్టుతూనే ఇతనికి- నాలుగుభుజాలు, నొసట కన్ను, గాడిదకంఠధ్వనితో ఏడ్పు వచ్చాయి. తల్లిదండ్రులు అది చూచి భయపడ్డారు, ఆశ్చర్యపోయారు. అప్పు డొక అశరీరవాణి ఇలా అన్నది.

విశేషం: సాత్వతి శ్రీకృష్ణుని మేనత్త.

ఆ. వీని నొరులు చంపఁగా నోప రెవ్వరు; । నెవ్వరేని వీని నెత్తికొనుడు
మిగిలియున్న బాహుయుగళంబుఁ గన్నును । నడఁగు వీని కతఁడ యంతకుండు. 53

ప్రతిపదార్థం: వీనిన్= ఈ బాలుణ్ణి; ఒరులు= ఇతరులు; ఎవ్వరున్= ఎవరుకూడ; చంపఁగాన్+ఓపరు= చంపలేరు; ఎవ్వరు+ఏనిన్= ఎవరైతే; వీనిన్= ఈ బాలుణ్ణి; ఎత్తికొనుడున్= ఎత్తుకొంటూనే; మిగిలి, ఉన్న= ఎక్కువగా ఉన్న; బాహు, యుగళంబున్= చేతులజంట; కన్నునున్= కన్ను; అడఁగున్= అణగిపోతాయో; అతఁడు+అ= అతడే; వీనికిన్; అంతకుండు= అంతమొందించేవాడు- యముడు.

తాత్పర్యం: ఈ బాలుణ్ణి ఇతరు లెవ్వరూ చంపలేరు. ఎవరైతే ఇతణ్ణి ఎత్తుకోగానే, ఎక్కువగా ఉన్న రెండుచేతులు, కన్ను అణగిపోతాయో అతడే ఇతడి పాలిటి యముడు.

వ. అనిన నయ్యశరీరివచనంబులు విని వార లాశ్చర్యమానసులయి, యా కుమారుం జూడవచ్చిన వారికెల్ల నెత్తికొన నిచ్చుచున్నంత. 54

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; ఆ+అశరీరి= ఆ శరీరంలేనిదానియొక్క; వచనంబులు= మాటలు; విని; వారలు= ఆ శిశుపాలుని తల్లిదండ్రులు; ఆశ్చర్య, మానసులు+అయి= ఆశ్చర్యంతో కూడుకొన్న మనస్సులు కలవాళ్ళయి; ఆ, కుమారున్; చూడ, వచ్చిన, వారికిన్+ఎల్లన్; ఎత్తికొనన్= ఎత్తుకొనటానికి; ఇచ్చుచున్+ఉన్న+అంతన్= ఇస్తూ ఉండగా.

తాత్పర్యం: అశరీరవాణి ఆవిధంగా చెప్పేసరికి, శిశుపాలుని తల్లిదండ్రులు ఆశ్చర్యపోయారు. చూడవచ్చినవాళ్ళందరి చేతికి ఎత్తుకోటానికి ఆ బాలుణ్ణి ఇవ్వసాగారు.

చ. అతివికృతస్వరూపధరుఁ డైన కుమారకుఁ బ్రీతితోడ సా
త్వతిఁ దమ మేనయత్తను ముదంబునఁ జూడఁగఁగోరి యద్భుత
ప్రతిభులు రామకేశవులు పన్నుగ నేఁగిరి చేదిధారుణీ
పతిపురి కొక్కనాఁ డఖిల బాంధవ మంత్రిసుహృత్సమేతులై. 55

ప్రతిపదార్థం: అద్భుత, ప్రతిభులు= ఆశ్చర్యకరమైన బుద్ధిబలం కలవాళ్ళయి; రామకేశవులు= బలరామకృష్ణులు; అతి, వికృత, స్వరూప, ధరుఁడు+ఐన= మిక్కిలి వికారమైన ఆకారాన్ని ధరించిఉన్నవాడైన; కుమారకున్= ఆ బాలుణ్ణి- శిశుపాలుణ్ణి; ప్రీతితోడన్= ప్రేమతో; తమ, మేన+అత్తను; సాత్వతిన్; ముదంబునన్= సంతోషంతో; చూడఁగన్+కోరి; ఒక్కనాఁడు; అఖిల, బాంధవ, మంత్రి, సుహృత్+సమేతులు+ఐ= అందరు బంధువులతో, మంత్రులతో, స్నేహితులతో కూడుకొన్నవాళ్ళయి; చేదిధారుణీపతి, పురికిన్= చేదిభూపతియొక్క పట్టణానికి; పన్నుగన్= ఒప్పుగా; ఏఁగిరి= వెళ్ళారు.

తాత్పర్యం: అద్భుతప్రతిభావంతులైన బలరామకృష్ణు లిద్దరూ వికారరూపంలో ఉన్న బాలుడు శిశుపాలుణ్ణి, మేనత్త అయిన సాత్వతిని ప్రియమార చూడా లని బంధువులతో, మంత్రులతో, మిత్రులతో కలిసి ఒకనాడు చేదిభూపతి పట్టణానికి వెళ్ళారు.

వ. ఇట్లు వచ్చిన రామకేశవులం బ్రియసత్కారంబులఁ బూజించి సాత్వతియు నబ్బాలు బలదేవుచేతికి నెత్తికొననిచ్చి తదనంతరంబ నారాయణుచేతికి నిచ్చిన. 56

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; వచ్చిన, రామకేశవులన్; ప్రియసత్కారంబులన్= ఇష్టము లైన సమ్మానాలచేత; పూజించి; సాత్వతియున్; ఆ+బాలున్= ఆ బాలుడైన శిశుపాలుణ్ణి; బలదేవు చేతికిన్; ఎత్తికొనన్; ఇచ్చి; తత్+అనంతరంబ= ఆ తరువాత; నారాయణు, చేతికిన్= శ్రీకృష్ణునిచేతికి; ఇచ్చినన్.

తాత్పర్యం: సాత్వతి ఈ విధంగా వచ్చిన బలరామకృష్ణులను ప్రీతితో గౌరవించి, బాలుడైన శిశుపాలుణ్ణి, ఎత్తుకోటానికి మొదట బలరాముని చేతి కిచ్చింది. ఆ తరువాత శ్రీకృష్ణునిచేతికి ఇచ్చింది.

క. అక్కొడుకు నబ్జనాభుం । డక్కజముగ నెత్తికొనుడు నందఱుఁ జూడన్
గ్రక్కున నొక్కట నడఁగెను । మిక్కిలి చేతులును వానిమిక్కిలి కన్నున్. 57

ప్రతిపదార్థం: ఆ+కొడుకున్= ఆ సాత్వతికుమారు డైన శిశుపాలుణ్ణి; అబ్జనాభుండు= పద్మానాభుడు - శ్రీకృష్ణుడు; ఎత్తికొనుడున్= ఎత్తుకొన్నవెంటనే; అందఱున్; చూడన్; అక్కజముగన్= ఆశ్చర్యకరంగా; గ్రక్కునన్= వెంటనే; మిక్కిలి చేతులును= ఎక్కువగా ఉండే చేతులూ; మిక్కిలి కన్నున్= ఎక్కువగా ఉండే కన్నూ; ఒక్కటన్= ఒక్కసారిగా; అడఁగెను= అణగిపోయాయి.

తాత్పర్యం: శిశుపాలుణ్ణి శ్రీకృష్ణుడు ఎత్తుకోగానే, అందరూ చూస్తుండగా, ఆశ్చర్యకరంగా - అధికంగా ఉండే అతని చేతులు, కన్ను ఒక్కసారిగా అణగిపోయాయి.

వ. దానిం జూచి సాత్వతి యద్భుతచిత్తయై యశరీరిపలుకు లప్పుడు దలంచి తన పుత్త్రునకు మురవైరివలన మరణం బగుట యెఱింగి యతని కి ట్లనియె. 58

ప్రతిపదార్థం: దానిన్; చూచి; సాత్వతి; అద్భుత, చిత్త+ఐ= ఆశ్చర్యంతో కూడుకొన్న మనస్సు కలదై; అశరీరి, పలుకులు; అప్పుడు; తలంచి; తన, పుత్త్రునకున్; మురవైరివలనన్= శ్రీకృష్ణునివల్ల; మరణంబు+అగుట= చావు కలగటం; ఎఱింగి= తెలుసుకొని; అతనికిన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: దానిని చూచి సాత్వతి ఆశ్చర్యపోయింది, అశరీరవాణి చెప్పిన మాటలను మనసులో తలచుకొన్నది. శ్రీకృష్ణునివల్లనే తనకొడుకుకు మరణం తప్ప దని తెలుసుకొన్నది. శ్రీకృష్ణునితో ఈ విధంగా అన్నది.

క. కుపథప్రవృత్తుఁ డయి వీఁ। డపనయమున నీ కనిష్టుఁ డయినను గరుణా
నిపుణుఁడవై నీ మఱఁదికి। నపరాధశతంబు సైఁపుమయ్య యుపేంద్రా! 59

ప్రతిపదార్థం: ఉపేంద్రా= ఓ శ్రీకృష్ణా!; వీఁడు= ఈ బాలుడు; కుపథ, ప్రవృత్తుఁడు+అయి= చెడుమార్గంలో నడిచేవాడై; అపనయమునన్= కీడుచేయటంచేత; నీకున్; అనిష్టుఁడు+అయినను= ఇష్టంలేనివాడు అయినప్పటికీ; కరుణా, నిపుణుఁడవు+ఐ= దయచూపటంలో నేర్పరివై; నీ, మఱఁదికిన్= నీమరది అయిన ఈ శిశుపాలునికి; అపరాధశతంబు= తప్పులు నూరింటిని; సైఁపుము+అయ్య= క్షమించవయ్యా!

తాత్పర్యం: శ్రీకృష్ణా! ఈ బాలుడు చెడుమార్గంలో నడిచేవాడై అపకారం చేసి నీకు అప్రియుడైనా- నీ మరది చేసే తప్పులు నూరింటిని దయతో క్షమించు.

విశేషం: ఈపద్యంలో సాత్వతి 'నాకొడుకుకు' అనకుండా 'నీమఱఁదికి' అని అనటం, 'కరుణానిపుణుఁడవై' అని వేడుకొనటం విశేషం. ఆ బాలుడు దుర్మార్గుడైనా నీ బావమరది. బావలు మరదులు పరస్పరం క్షేమం కోరుకుంటా రని తెలుగులో నానుడి. ఆ బంధుత్వాన్ని జ్ఞాపకంచేసి దయచూపటానికికూడా తానే ఉపాయాలూ, దారులూ చూచుకొని రక్షించా లని సూచించి, శిశుపాలునితోపాటు అతని బ్రతుకునుకూడ శ్రీకృష్ణునిచేతుల్లో పెట్టినట్లు పలకటం మెచ్చుకోదగిన మాటనేర్పు. (సంపా.)

వ. అని వీనితల్లి తొల్లి జగద్వల్లభుండైన జనార్దనుం బ్రార్థించి తత్ప్రసాదంబున వరంబు వడయుటం జేసి శతాపరాధంబులు నిండునంతకు వీఁ డన్యులచేత నప్రతిహతుండు; కృష్ణునిచేత నిహతుండగు; నది కారణంబుగా. 60

ప్రతిపదార్థం: అని; వీని; తల్లి; తొల్లి= మునుపు; జగత్+వల్లభుండు+ఐన= లోకానికి ప్రభువైన; జనార్దనున్= శ్రీకృష్ణుణ్ణి; ప్రార్థించి; తత్+ప్రసాదంబునన్= ఆయన దయచేత; వరంబు; పడయుటన్+చేసి= పొందటంచేత; శత+అపరాధంబులు= నూరుతప్పులు; నిండునంతకున్= పూర్తిఅయ్యేవరకు; వీఁడు; అన్యులచేతన్= ఇతరులచేత; అప్రతిహతుండు= చంపబడడు; కృష్ణునిచేతన్; నిహతుండు+అగున్= చంపబడినవాడవుతాడు; అది, కారణంబుగా.

తాత్పర్యం: ఇదివరకు ఇతనితల్లి జగన్నాయకుడైన ఆ కృష్ణుణ్ణి ప్రార్థించి, ఆయనదయతో వరం పొందింది కనుక, నూరుతప్పులు నిండేదాకా ఇతడు ఇతరులచేత హతుడు కాడు. ఆ తరువాత శ్రీకృష్ణునిచేతనే హతు డౌతాడు. అందుచేతనే.

చ. ఇతనికి నిట్లు న న్నుఱక యెగ్గులు వల్కఁగఁ బోలెఁగాక, యు
ద్ధతమతి నన్యు లీతని విధంబునఁ బల్కి మదీయచాప ని
ర్గత చటులోగ్రమార్గణ నికాయ పయోధి మునుంగ కిట్లు ద
ర్పితులయి పోవనేర్తురె గభీరపరాక్రమ! మారుతాత్మజా! 61

ప్రతిపదార్థం: గభీర, పరాక్రమ= గంభీరమైన పరాక్రమం కలవాడా! మారుత+ఆత్మజ= వాయుపుత్రా! భీమసేనా!; ఇతనికిన్; ఇట్లు= ఈవిధంగా; నన్నున్+ఉఱక= నన్ను లక్ష్యపెట్టక; ఎగ్గులు= నిందలు; పల్కఁగన్= పలకటానికి; పోలెన్+కాక= సాధ్యమైనదికాని; అన్యులు= ఇతరులు; ఈతని విధంబునన్; ఉద్ధతమతిన్= దుడుకుతనంతో; పల్కి= మాటాడి; మదీయ, చాప, నిర్గత, చటుల+ఉగ్ర, మార్గణ, నికాయ, పయోధి, మునుంగక= నాయొక్క ధనుస్సునుండి వెలువడి మెరుస్తున్న భయంకర బాణ సమూహ మనే సముద్రంలో మునగకుండ; ఇట్లు= ఈ విధంగా; దర్పితులు+ఐ= పొగరుబట్టి ప్రవర్తించినవాళ్ళయి; పోవనేర్తురె= బ్రతికిపోగలరా!

తాత్పర్యం: గంభీరమైన పరాక్రమం కలవాడా! వాయుపుత్రా! భీమసేనా! ఇతని కీవిధంగా న న్నూరకే నిందలు పలకటం సాధ్యమైందిగాని-ఇతరు లీవిధంగా దుడుకుతనంతో మాట్లాడితే, నా ధనుస్సునుండి వెలువడి మెరుస్తున్న బాణసమూహ మనే సముద్రంలో మునగకుండ ఇలా పొగరుబట్టి ప్రవర్తించి బ్రతకగలరా!

విశేషం: అలం: రూపకం. భీష్ముడు భీమసేనునికి ప్రయోగించిన విశేషణాలు రెండూ ప్రశంసాపూర్వకంగా అతని పెనుకోపాన్ని ఉపశమింపజేసేవే. (భీష్ముడు సంయమనంతో కూడుకొన్న క్రోధభావదీప్తిని ప్రకటిస్తున్న ఈ పద్యరచన ఔజ్జ్వల్యంతోకూడిన కాంతిగుణంతో శోభిల్లుతున్నది. - సంపా.)

వ. అని పలుకుచున్న భీష్మభీముల నతిక్రమించి శిశుపాలుండు జనార్దనున కభిముఖుండయి యి ట్లనియె. 62

ప్రతిపదార్థం: అని; పలుకుచున్+ఉన్న; భీష్మ, భీములన్; అతిక్రమించి= దాటివెళ్ళి; శిశుపాలుండు; జనార్దనునకున్= శ్రీకృష్ణునికి; అభిముఖుండు+అయి= ఎదురుగా నిలిచినవాడై; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని పలుకుతున్న భీష్ముణ్ణీ, భీముణ్ణీ త్రోసిపుచ్చి శిశుపాలుడు శ్రీకృష్ణునితో ముఖాముఖి ఈ విధంగా అన్నాడు.

మ. అవమాన్యున్ సభలోన మాన్యుఁ డని సౌహార్దంబునం గౌరవ
స్థవిర ప్రేరణ నిన్నుఁ బాండుతనయుల్ తప్పంగఁ బూజించి ర
య్యవివేకాస్పదు లైన పాండవులు మోహాంధుండు భీష్ముండుఁ గే
శవ! నీవుం గడఁగుండు నాకు నెదురై సంగ్రామరంగంబునన్. 63

ప్రతిపదార్థం: అవమాన్యున్= అవమానించతగినవాణ్ణి; సభలోనన్= నిండుసభలో; మాన్యుఁడు+అని= గౌరవించదగినవాడని; సౌహార్దంబునన్= స్నేహంచేత; కౌరవ, స్థవిర, ప్రేరణన్= కురువంశపు ముదుసలి అయిన భీష్మని ప్రేరణచేత; పాండు, తనయుల్= పాండురాజు కుమారులు; నిన్నున్; తప్పంగన్= తప్పువడి; పూజించిరి; ఆ+అవివేక+ఆస్పదులు+ఐన= ఆ తెలివితక్కువతనానికి స్థానమైనవాళ్ళయిన; పాండవులు; మోహ+అంధుండు= నీమీది విపరీత ప్రేమచేత గ్రుడ్డివాడైన; భీష్ముండు; కేశవ= కృష్ణా; నీవున్= నీవును; సంగ్రామరంగంబునన్= యుద్ధభూమిలో; నాకున్; ఎదురై= ఎదురుగా నిలిచి; కడఁగుండు= పూనుకొనండి; అంటే యుద్ధంచేయటానికి ప్రయత్నించండి.

తాత్పర్యం: అవమానించదగిన నిన్ను- స్నేహంచేత, కురువంశపు ముదుసలి అయిన భీష్మని ప్రేరణచేత - నిండుసభలో గౌరవించదగినవాడి వని ఎంచి తప్పుగా పూజించారు. కేశవా! అవివేకులైన ఆ పాండవులు, నీ మీది మోహంతో మతికోల్పోయిన ఈ భీష్ముడు, నీవు- నాతో యుద్ధం చెయ్యటానికి సిద్ధం కండి.

విశేషం: ఇది మితిమీరిన శిశుపాలుడి మదాన్ని, మూర్ఖతను, మాటల కాఠిన్యాన్ని ప్రదర్శించే పద్యం, సభలో శిశుపాలుడు గర్వంతో ఎంతగా విర్రవీగి, ఎంత నిరసనభావంతో శ్రీకృష్ణుణ్ణి చూచి, ఎంత చులుకనగా ఆయనవైపు వేలెత్తిచూపి 'కేశవ నీవున్' అని పలికాడో ఆదిగురువు ఆవల లఘువులుకల ఆ మూడక్షరాలపదం (కేశవ) మూడవపాదం చివర, నాలుగవపాదంమొదట విరగటంలో ధ్వనిస్తున్నది. శిశుపాలుని అప్పటి మదాతిరేకతకు మత్తేభవృత్తంకూడ చక్కని సూచికగా ఉంది. (ఇందులోని అర్థవ్యక్తిగుణం రౌద్రరసానుగుణమైన ప్రసాదాన్ని పోషిస్తున్నది. -సంపా.)

వ. అని శిశుపాలుండు గర్వించి పలికిన విని చక్రధరుం డఖిల రాజచక్రంబు విన నిట్లనియె. 64

ప్రతిపదార్థం: అని; శిశుపాలుండు; గర్వించి; పలికినన్; విని; చక్రధరుండు= చక్రాయుధాన్ని ధరించినవాడు - శ్రీకృష్ణుడు; అఖిల, రాజ, చక్రంబు= అందరు రాజుల సమూహం; వినన్= వినేటట్లుగా; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అని శిశుపాలుడు గర్వంతో మాట్లాడగా చక్రధారి అయిన శ్రీకృష్ణుడు సమస్త రాజ సమూహం వినేటట్లు ఈ విధంగా అన్నాడు.

విశేషం: శిశుపాలుని ఉదంతంలో మొదటిసారిగా ఇక్కడ శ్రీకృష్ణుణ్ణి చక్రధరు డని ప్రయోగించటం ఎంతో భావస్ఫోరకంగా ఉంది. కథలో ఇక ప్రాధాన్యం వహించేది, సభలో రాజచక్రం దృష్టి నంతా ఆకర్షించేది ఈ చక్రప్రయోగమే. శిశుపాలుని మాటలు ఎంచి, చూచి, అతనిమాట పడిపోవటానికి కాల మాసన్న మైన దనీ, అతని కయ్యం ఊపును ఆపి యజ్ఞాన్ని నిర్విఘ్నం చేయవలసిన అవసరం ఏర్పడిం దనీ భావించి - బహుశః అప్పుడు శ్రీకృష్ణుడు చక్రాయుధాన్ని స్మరించి కేల గ్రహించి నిలిచాడేమో!

సీ. ప్రాగ్జ్యోతిషంబున భగదత్తుపయి నేము । వోయిన నీతఁ డన్యాయవృత్తి
నిట బాలవృద్ధుల కెల్ల భయంబుగా । ద్వారకాపురిఁ గాల్చె, వీరులైన
భోజరాజన్యులు పొలఁతులతోడ రై । వతకాద్రిఁ గ్రీడాభిరతిఁ బ్రమత్తు
లయియున్న వారల నదయుఁడై వధియించె; । దేవాభుఁ డగు వసుదేవు చేయు

ఆ. నశ్వమేధమునకు నభ్యర్చితం బైన । హయము నపహరించి యజ్ఞమునకు
విఘ్న మాచరించె; వీఁ డతిపాపుఁ డై । బభ్రుభార్యఁ దనకు భార్యఁ జేసె. 65

ప్రతిపదార్థం: ఏము= మేము; ప్రాక్+జ్యోతిషంబునన్= ప్రాగ్జ్యోతిష మనే పట్టణంలో; భగదత్తుపయిన్= భగదత్తు డనే రాజుమీద; పోయినన్= దండెత్తిపోగా; ఈతఁడు= ఈ శిశుపాలుడు; ఇటన్= ఇక్కడ; ద్వారకాపురిన్= ద్వారకానగరాన్ని; బాలవృద్ధులకున్+ఎల్లన్= అందరుపిల్లలకు, ముసలివాళ్ళకు; భయంబుగాన్= భయంకలిగేటట్లుగా; కాల్చెన్= తగులబెట్టాడు; వీరులు+ఐన; భోజరాజన్యులు= భోజవంశపురాజులు; పొలఁతులతోడన్= భార్యలతోకూడి; రైవతక+అద్రిన్= రైవతక మనే పేరున్న పర్వతంలో; క్రీడా+అభిరతిన్= విహరించాలనే కోరికతో; ప్రమత్తులు+అయి= మైమరచి; ఉన్నన్; వారలన్; అదయుఁడు+ఐ= దయలేనివాడై; వధియించెన్= చంపాడు; దేవ+ఆభుఁడు+అగు= దేవతాసమాన మైన దీప్తి కలవాడయిన; వసుదేవు, చేయు= వసుదేవుడు చేసే; అశ్వమేధమునకున్= అశ్వమేధయాగానికి; అభి+అర్చితంబు+ఐన= బాగా పూజించబడిందైన; హయమున్= గుర్రాన్ని; అపహరించి= దొంగిలించి; యజ్ఞమునకున్= ఆ అశ్వమేధయాగానికి; విఘ్నము= ఆటంకం; ఆచరించెన్= చేశాడు(కలిగించాడు); వీఁడు= ఈ(నీచుడైన) శిశుపాలుడు; అతి, పాపుఁడు+ఐ= మిక్కిలి పాపాత్ముడై; బభ్రుభార్యన్= బభ్రువనే వాని భార్యను; తనకున్; భార్యన్+చేసె= భార్యగా చేసుకొన్నాడు.

తాత్పర్యం: ప్రాగ్జ్యోతిషాధిపతి భగదత్తునిమీద మేము దండెత్తిన సమయంలో - ఈ శిశుపాలుడు దుర్మార్గుడై బాలురకు, వృద్ధులకు భయం కలిగేటట్లు ద్వారకానగరాన్ని తగులబెట్టాడు. వీరులైన భోజరాజులు భార్యలతో కలిసి రైవతకాద్రిమీద క్రీడిస్తూ మైమరచి ఉన్న సమయంలో, క్రూరుడై వాళ్ళను వధించాడు. దేవతాసమానుడయిన వసుదేవుడు అశ్వమేధయాగానికై పూజించిన గుర్రాన్ని అపహరించి, ఆ యాగానికి చెరుపుచేశాడు. పాపాత్ముడై బభ్రుని భార్యను తన భార్యగా చేసుకొన్నాడు.

వ. 'మఱియు వాగ్విషయంబు లయిన యపకారంబు లనేకంబులు సేసె; మా యత్త సాత్వతి నన్నుం బ్రార్థించుటంజేసి యిద్దురాత్ముండు సేసిన యపరాధశతంబు సహించితి; నిప్పుడు మీ రిందఱు నెఱుంగ నాయం దకారణ వ్యతిక్రమం బుపక్రమించి యత్యంతశత్రుం డయ్యె' ననిన విని శిశుపాలుం డతిపరుష వచనుం డగుచుఁ బురుషోత్తమున కి ట్లనియె. 66

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకను; వాక్+విషయంబులు+అయిన= మాటలకు సంబంధించిన; అపకారంబులు; అనేకంబులు; చేసెన్; మా, అత్త; సాత్వతి; నన్నున్; ప్రార్థించుటన్+చేసి= వేడుకొనటంచేత; ఈ+దురాత్ముండు= ఈ దుర్మార్గుడు; చేసిన; అపరాధశతంబు= నూరుతప్పులు; సహించితిన్= ఓర్చుకొన్నాను; ఇప్పుడు; మీరు+ఇందఱున్; ఎఱుంగన్; నా, అందున్; అకారణ, వ్యతిక్రమంబు+ఉపక్రమించి= కారణంలేని దుర్మార్గాన్ని ప్రారంభించి; అత్యంత శత్రుండు+అయ్యెన్= మిక్కిలి శత్రువయ్యాడు; అనినన్= అని అనగా; విని; శిశుపాలుండు; అతి, పరుష, వచనుండు+అగుచున్= మిక్కిలి కఠినమైన మాటలు కలవాడై; పురుషోత్తమునకున్= శ్రీకృష్ణునికి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'అంతేకాక, మాటలకు సంబంధించి అనేక అపకారాలుకూడ చేశాడు. మా అత్త సాత్వతి ప్రార్థించటంచేత ఈ దుర్మార్గుడు చేసిన నూరుతప్పులు సహించాను. ఇప్పుడు మీరంతా చూస్తుండగా నాపట్ల దుర్మార్గప్రవర్తన ప్రారంభించి పరమశత్రు వయ్యాడు' - అని శ్రీకృష్ణు డనగానే శిశుపాలుడు మహాకఠినా లైన మాటలతో ఆ పురుషోత్తముణ్ణి ఇలా అన్నాడు.

క. నీ కూర్మియు నీ యలుకయు । నా కవి యేమిటికి దుర్గుణప్రియ! మొదలన్
నా కిచ్చిన యక్కన్యకఁ । జేకొని నీ కిట్లు పలుక సిగ్గును లేదే! 67

ప్రతిపదార్థం: దుర్గుణప్రియ= చెడుగుణాలు కలవాళ్ళకు ప్రియమైనవాడా!; నీ, కూర్మియున్= నీ స్నేహం; నీ, అలుకయున్= నీ కోపం; నాకున్+అవి, ఏమిటికిన్= వాటితో నాకేమి పని?; మొదలన్= మొదట; నాకున్+ఇచ్చిన; ఆ+కన్యకన్; చేకొని= చేపట్టి; నీకున్+ఇట్లు; పలుకన్; సిగ్గును; లేదే= లేదా!

తాత్పర్యం: దుర్జనులకు ప్రియమైనవాడా! నీ స్నేహంతో, నీ కోపంతో నా కేమి పని? మొదట నా కిచ్చిన కన్యను నీదానినిగా చేసుకొని ఈ విధంగా మాట్లాడటానికి సిగ్గులేదా?

విశేషం: సభలో శిశుపాలుని వాక్పారుష్యం చివరకు రుక్మిణి విషయంవరకు ప్రాకింది. అతనిపాపం పండింది. ('బభ్రు భార్యను శిశుపాలుడు తనభార్యగా చేసుకొన్నా'డని శ్రీకృష్ణుడు చేసిన నిందకు ప్రతిగా, రుక్మిచేత తనకు దత్త అయిన రుక్మిణిని శ్రీకృష్ణుడు రాక్షసవివాహపద్ధతిలో గ్రహించిన ఉదంతాన్ని పేర్కొన్నాడు శిశుపాలుడు. అంబను తెచ్చినందుకే భీష్ముణ్ణి అధిక్షేపించిన శిశుపాలుడు అన్యుడి భార్యనే తెచ్చి ఏలుకొంటున్న అధర్మవర్తను డని చేసిన శ్రీకృష్ణుని ఎత్తిపొడుపును సహించలేక, రెచ్చిపోయి మాటకుమాట వడ్డించాడు. వాదం ఒక తీవ్రస్థాయికి చేరింది. - సంపా.)

చక్రాయుధముచేత శిశుపాలుండు చచ్చుట (సం. 2-42-21)

చ. అని శిశుపాలుఁ డొండొకట నప్రియముల్ హరిఁ బల్కుచున్నచో
ననలశిఖాలి దూల దనుజాంతకచక్రము రాజచక్ర మె
ల్లను భయమంద మూర్ధవికలంబుగ నప్పుడు సేసెఁ జేదినం
దను తనువున్ బృహద్రుధిరధారలు బోరన మీఁది కొల్కఁగన్. 68

ప్రతిపదార్థం: అని; శిశుపాలుఁడు; ఒండు+ఒకటన్= ఒకదానివెంట ఒకటిగా; హరిన్= శ్రీకృష్ణుణ్ణి; అప్రియముల్= నిందలు; పలుకుచున్+ఉన్నచోన్= పలుకుతుండగా; దనుజ+అంతక+చక్రము= రాక్షసులను అంతమొందించేవాడైన శ్రీకృష్ణునియొక్క చక్రాయుధం; అనల, శిఖా+ఆలి= అగ్నిజ్వాలల సమూహం; తూలన్= చలిస్తుండగా; రాజ, చక్రము+ఎల్లను= రాజుల సమూహమంతా; భయము+అందన్; చేదినందను, తనువున్= చేదిరాకుమారుడైన శిశుపాలుని శరీరాన్ని; బృహత్+రుధిర, ధారలు= పెద్దరక్తధారలు; బోరనన్= ఒక్కుమ్మడిగా; మీఁదికిన్; ఒల్కఁగన్= చిందేటట్లుగా; అప్పుడు; మూర్ధ, వికలంబుగన్= తల తెగిన దాన్నిగా; చేసెన్= చేసింది.

తాత్పర్యం: ఈ విధంగా శిశుపాలుడు ఒకదానివెంట ఒకటిగా శ్రీకృష్ణుణ్ణి నిందావాక్యాలతో దూషిస్తుండగా, రాక్షసాంతకు డైన శ్రీకృష్ణుని సుదర్శనచక్రం-అగ్నిజ్వాలలు చలిస్తుండగా, అందరు రాజులు భయపడుతుండగా, శిశుపాలుని శరీరంనుండి రక్తధారలు ఒక్కుమ్మడి మీదికి చిందుతుండగా అతని తలను నరికివేసింది.

విశేషం: రౌద్రరసరమ్యమైన ఈ సంఘటనలో శ్లేష మనే గుణాన్ని నన్నయ అక్షరరమణీయంగా వాడాడు. (సంపా.)

ఉ. ప్రల్లదమేది యిట్లు శిశుపాలుఁడు వజ్రహతాద్రి తుల్యుఁడై
త్రెళ్ళెడు వానిదైన పృథుదేహము వెల్వడి తేజ మంబరం
బెల్ల వెలుంగ వచ్చి పరమేశ్వరు దేహము సొచ్చె విస్మయో
త్ఫుల్ల విశాలనేత్రు లయి భూపతులెల్లను జూచుచుండఁగన్. 69

ప్రతిపదార్థం: ప్రల్లదము+ఏది= నిందిస్తూ మాట్లాడటం (పెరిగి పెరిగి) నశించి; శిశుపాలుఁడు; ఇట్లు= ఈవిధంగా; వజ్ర, హత+అద్రి, తుల్యుఁడు+ఐ= వజ్రాయుధంచేత నరకబడ్డ కొండతో సమానమైనవాడై; త్రెళ్ళెడు= క్రిందపడుతున్న; వానిది+ఐన= ఆ శిశుపాలునియొక్క; పృథు, దేహము, వెలువడి= పెద్దశరీరంనుండి బయటికి వచ్చి; భూపతులు+ఎల్లను= రాజులందరు; విస్మయ+ఉత్ఫుల్ల, విశాల, నేత్రులు+అయి= ఆశ్చర్యంచేత వికసించిన పెద్ద కన్నులు కలవాళ్ళయి; చూచుచున్+ఉండఁగన్; తేజము= కాంతి; అంబరంబు+ఎల్లన్= ఆకాశమంతా; వెలుంగన్; వచ్చి; పరమ+ఈశ్వరు, దేహమున్= పరమాత్మ అయిన శ్రీకృష్ణుని దేహాన్ని; చొచ్చెన్= ప్రవేశించింది.

తాత్పర్యం: నిందిస్తూ మాట్లాడుతున్న శిశుపాలునినోరు మూత పడింది. రాజులంతా ఆశ్చర్యంతో కళ్ళంతా పెద్దవిచేసుకొని చూస్తుండగా-శిశుపాలుని శరీరం, వజ్రాయుధంతో హతమైన కొండలా క్రిందపడింది. ఆ కళేబరం నుండి ఒకకాంతి ఆకాశమంతా వెలుగులు చిమ్ముతూ వెలుపలికి వచ్చింది. శ్రీకృష్ణపరమాత్మ శరీరంలో చేరిపోయింది.

విశేషం: అద్భుతరసవ్యంజక మైన ఈ పద్యరచన నన్నయ ప్రసాదగుణప్రధానరచనకు ఒక ఉదాహరణం. (సంపా.)

క. ఘనజాలము లేకయుఁ బెలు । చన పిడుగులతోడి వృష్టి చైద్యుని పాతం
బునఁ గురిసె; సముద్ర మహా । ద్రి నికాయముతో ధరిత్రి దిర్దిరఁ దిరిగెన్. 70

ప్రతిపదార్థం: చైద్యుని పాతంబునన్= చేదిరాజైన శిశుపాలునియొక్క పతనంతోడనే- అంటే శిశుపాలుడు తలతెగి పడటంతోనే; ఘనజాలము= మేఘాలయొక్క సమూహం; లేకయున్= లేకుండానే; పెలుచన= పెద్దగా; పిడుగులతోడి; వృష్టి= వాన; కురిసెన్; సముద్ర, మహా+అద్రి, నికాయముతోన్= సముద్రాలయొక్క, మహాపర్వతాలయొక్క సమూహంతో; ధరిత్రి= భూమి; దిర్దిరన్= గిర్రున; తిరిగెన్.

తాత్పర్యం: శిశుపాలుడు తల తెగి పడటంతోనే మేఘాలు లేకుండా పిడుగులతో కూడిన పెద్దవాన కురిసింది. సముద్రసమూహంతో, మహాపర్వత సమూహంతో భూమి దిర్దిర తిరిగింది.

క. జయ జయ నినాదమున న । వ్యయు నంబుజనాభు భువనవంద్యు నుపేంద్రుం
బ్రియమునఁ బొగడెడు జనముల । దయిన మహాధ్వనియుఁ జెలఁగె నతితుములంబై. 71

ప్రతిపదార్థం: అవ్యయున్= నాశం లేనివాణ్ణి; అంబుజనాభున్= పద్మాన్ని నాభిలో కలవాణ్ణి; భువనవంద్యున్= లోకాలచేత పూజించదగినవాణ్ణి; ఉపేంద్రున్= శ్రీకృష్ణుణ్ణి; జయ జయ నినాదమునన్= జయ జయ శబ్దాల ధ్వనితో; ప్రియమునన్= మనసార; పొగడెడు; జనములది+అయిన= ప్రజలయొక్క; మహాధ్వనియున్= పెద్దశబ్దంకూడ; అతి, తుములంబు+ఐ= మిక్కిలి తీవ్రమైనదయి; చెలఁగెన్= వ్యాపించింది.

తాత్పర్యం: నాశం లేనివాడు, పద్మనాభుడు, లోకాలచేత పూజించదగినవాడు అయిన శ్రీకృష్ణుణ్ణి జయజయ ధ్వానాలతో మనసార పొగడే జనుల మహాధ్వని తీవ్రమై వ్యాపించింది.

వ. అంత ననంతశయనుండు శిశుపాలు సంస్కరింపం బంచి వాని కొడుకుం జేదిరాజ్యంబున కభిషిక్తుం జేసె; నట్లు ప్రశాంతవిఘ్నంబయి, సుఖారంభంబయి, ప్రభూతభక్ష్యాన్నధనదానసనాథంబయి, జగన్నాథ రక్షితంబయి రాజసూయమహాధ్వరంబు సమాప్తప్రయోగం బయిన. 72

ప్రతిపదార్థం: అంతన్= తరువాత; అనంతశయనుండు= శ్రీకృష్ణుడు; శిశుపాలు సంస్కరింపన్= శిశుపాలునికి అంత్యక్రియలు జరపటానికి; పంచి= ఆజ్ఞాపించి; వానికొడుకున్= ఆ శిశుపాలునియొక్క కుమారుణ్ణి; చేదిరాజ్యంబునకున్; అభిషిక్తున్= రాజునుగా; చేసెన్; అట్లు= ఆ విధంగా; రాజసూయ+మహా+అధ్వరంబు= రాజసూయమహాయాగం; ప్రశాంతవిఘ్నంబు+అయి= శాంతింపజేయబడిన విఘ్నం కలదై - అంటే అడ్డులేనిదై, సుఖ+ఆరంభంబు+అయి= సుఖమైన ఆరంభం కలదై; ప్రభూత, భక్ష్య+అన్న, ధన, దాన, సనాథంబు+అయి= అధికమైన పిండివంటలను, అన్నాన్ని, డబ్బును, దానం చేయటంతో కూడుకొన్నదై; జగన్నాథ, రక్షితంబు+అయి= జగత్తుకు ప్రభువైన శ్రీకృష్ణునిచేత రక్షించబడిందై; సమాప్తప్రయోగంబు+అయినన్= పూర్తిచేయబడిన కార్యక్రమం కలది కాగా.

తాత్పర్యం: తరువాత శ్రీకృష్ణుడు శిశుపాలుని మృతదేహానికి అంత్యక్రియలు చెయ్యం డని ఆజ్ఞాపించాడు. ఆతని కుమారుణ్ణి చేది రాజ్యానికి రాజుగా చేశాడు. ఆ విధంగా రాజసూయం నిరాటంకంగా సుఖంగా ప్రారంభమై అధికమైన భక్ష్యాన్న ధనదానాలతో, జగన్నాథుడైన శ్రీకృష్ణుని సంరక్షణలో సమాప్తం కాగా-

విశేషం: అనంతశయనుడు - అనంతుని (ఆదిశేషుడి)పై శయనించేవాడు - శ్రీమహావిష్ణువు, శిశుపాలుడు పూర్వజన్మలో ఆయన ద్వారపాలకుల్లో ఒకడు. శిశుపాలుని పుత్రుడు ధృష్టకేతుడు.

ఉ. దేవగురుద్విజప్రకరతృప్తికరున్ వరరాజసూయ య
జ్ఞావభృథాభిషేకవిమలాంగు విశుద్ధయశోనిధిన్ జగ
త్పావను ధర్మనందను సభాస్థితుఁ జూచి ముదంబు చెంది లిం
ద్రావరజాది మిత్రు, లసహత్వముఁ బొందిరి ధార్తరాష్ట్రులున్. 73

ప్రతిపదార్థం: దేవ, గురు, ద్విజ, ప్రకర, తృప్తికరున్= దేవతల, గురువుల, బ్రాహ్మణులయొక్క సమూహానికి తృప్తి కలిగించినవాణ్ణి; వర, రాజసూయ, యజ్ఞ+అవభృథ+అభిషేక, విమల+అంగున్= శ్రేష్ఠమైన రాజసూయయాగంలో అవభృథస్నానం చేయటంవలన పరిశుద్ధమైన శరీరం కలవాణ్ణి; విశుద్ధయశః+నిధిన్= నిర్మల కీర్తికి నిధి అయిన వాణ్ణి; జగత్+పావనున్= లోకాన్ని పవిత్రం చేసేవాణ్ణి; సభా, స్థితున్= సభలో కొలువు తీరినవాణ్ణి; ధర్మనందనున్= ధర్మరాజును; చూచి; ఇంద్ర+అవరజ+ఆది, మిత్రులు= ఇంద్రుని తమ్ముడైన శ్రీకృష్ణుడు మొదలయిన మిత్రులు; ముదంబు, చెందిరి= సంతోషించారు; ధార్తరాష్ట్రులున్= ధృతరాష్ట్రుని కుమారులు- కౌరవులు; అసహత్వమున్= ఓర్వలేమిని; పొందిరి.

తాత్పర్యం: దేవతలను, గురువులను, బ్రాహ్మణ సమూహాలను తృప్తినొందించినవాడు, రాజసూయమహాయాగం ముగిసిన సందర్భంలో అవభృథస్నానంతో పవిత్రమైన శరీరం కలవాడు, నిర్మలమైన కీర్తికి నిధివంటివాడు, లోకాన్ని

పవిత్రం చేసేవాడు అయిన ధర్మరాజు సభలో కొలువుతీరి ఉండగా, శ్రీకృష్ణాదు లైన మిత్రులంతా చూచి ఎంతో సంతోషించారు. కౌరవులు అసూయ చెందారు.

విశేషం: గుణం: ప్రసాదం. అవభృథము - యజ్ఞాంతంలో చేసేస్నానం. వ్యక్తివైభవాన్ని చూచి మిత్రులు ఆనందించటం, దాయాదులు అసూయ చెందటం లోకసహజం. కొన్ని ప్రతుల్లో ఈ పద్యానికి ముందు అథర్వణాచార్యునివి అని చెప్పబడే రెండు పద్యాలు ఉన్నాయి.

వ. ఇట్లు మహావిభూతితో నున్న ధర్మరాజు నొద్దకు వచ్చి నానాదేశాగతులయిన రాజు లి ట్లనిరి. 74

ప్రతిపదార్థం: ఇట్లు; మహా, విభూతితోన్= గొప్ప ఐశ్వర్యంతో; ఉన్న; ధర్మరాజు+ఒద్దకున్= ధర్మరాజు దగ్గరకు; వచ్చి; నానా, దేశ+ఆగతులు+ఐన= వివిధ దేశాలనుండి వచ్చిన; రాజులు; ఇట్లు+అనిరి.

తాత్పర్యం: ఈ విధంగా గొప్ప ఐశ్వర్యంతో ఉండే ధర్మరాజు దగ్గరకు చేరి, వివిధదేశాలనుండి వచ్చిన రాజులు ఇలా అన్నారు.

మాలిని.

జగదభినుతసామ్రాజ్యంబుతో నొప్పు నీ య
త్యగణిత గుణయుక్తం బైన ధర్మప్రవృత్తిన్
మిగిలి వెలిఁగె నాజామీఢవంశంబు విద్వ
ద్గగనతపన! సర్వక్షత్రవంశంబులందున్. 75

ప్రతిపదార్థం: విద్వత్+గగన, తపన= పండితులనే ఆకాశానికి సూర్యుని వంటివాడా!-ధర్మరాజా!; జగత్+అభినుత, సామ్రాజ్యంబుతోన్= లోకంచేత కొనియాడబడే సామ్రాజ్యంతో; ఒప్పు= ప్రకాశించే; నీ, అతి+అగణిత, గుణ, యుక్తంబు+ఐన, ధర్మప్రవృత్తిన్= ఏమాత్రం లెక్కించసాధ్యంగాని సుగుణాలతో కూడుకొన్న నీ ధర్మబద్ధమైన నడవడికచేత; సర్వ, క్షత్ర, వంశంబుల+అందున్= అన్నిరాజ వంశాలలో; ఆజామీఢవంశంబు= (మీదైన) ఆజామీఢవంశం; మిగిలి వెలిఁగెన్= ఎక్కువగా ప్రకాశించింది.

తాత్పర్యం: విద్వజ్జనులు అనే ఆకాశానికి సూర్యునివంటివాడా! ఓ ధర్మరాజా! లోకం అంతా కీర్తించే సామ్రాజ్యంతో వెలుగుతూ, లెక్కకు మిక్కిలి అయిన సుగుణాలతో కూడిన ధర్మప్రవర్తనతో రాణిస్తూ- అన్ని రాజవంశాల్లో నీ ఆజామీఢవంశమే అధికంగా ప్రకాశించింది.

విశేషం: గుణం : ప్రసాదం. అజామీఢుడు కురువంశమూలపురుషుడు. హస్తి అతనికి కుమారుడు. హస్తికుమారుడైన వికంఠనుడి కుమారుడు కూడ అజామీఢ నామధేయుడే.

వ. 'ఏము భవదీయ రాజసూయ మహోత్సవ దర్శనంబునను భవత్కృత సత్కార గౌరవంబుననుం జేసి కృతార్థుల మయితిమి. మా మా దేశంబులకుం బోయెద' మని చెప్పి వీడ్కొని చని; రప్పుడు ధర్మరాజువచనంబున భీష్మధృతరాష్ట్రుల భీమసేనుండును, యజ్ఞసేను నర్జునుండును, సపుత్త్రకులయిన (కర్ణ) శల్య సుబలుల

నకులుండును, గృపద్రోణాశ్వత్థామల సహదేవుండును, విరాట భగదత్తుల ధృష్టద్యుమ్నుండునుం, బార్వతేయులైన రాజుల సౌభద్రద్రౌపదేయులును ననిచి రంత. 76

ప్రతిపదార్థం: ఏము= మేము; భవదీయ, రాజసూయ, మహా+ఉత్సవ, దర్శనంబునను= మీయొక్క రాజసూయయాగ మహోత్సవాన్ని చూడటంచేత; భవత్+కృత, సత్కార, గౌరవంబుననున్+చేసి= మీచే చేయబడిన సమ్మానంవలన కలిగిన గొప్పతనంచేత-అంటే మీరు చేసిన మర్యాదచేతను; కృతార్థులము+అయితిమి= ధన్యులమయ్యాము; మా, మా, దేశంబులకున్; పోయెదము; అని; చెప్పి; వీడ్కొని= వదలి; చనిరి= వెళ్ళారు; అప్పుడు; ధర్మరాజు, వచనంబునన్= ధర్మరాజుయొక్క మాటను అనుసరించి; భీష్మ, ధృతరాష్ట్రులన్; భీమసేనుండును; యజ్ఞసేనున్= ద్రుపదుణ్ణి; అర్జునుండును; సపుత్త్రకులు+అయిన= కుమారులతో కూడుకొనినవాళ్ళయిన; (కర్ణ), శల్య, సుబలులన్; నకులుండును; కృప, ద్రోణ+అశ్వత్థామల; సహదేవుండును; విరాట, భగదత్తులన్; ధృష్టద్యుమ్నుండునున్; పార్వతేయులు+ఐన, రాజులన్= పర్వత దేశానికి సంబంధించిన రాజులను; సౌభద్ర, ద్రౌపదేయులునున్= సుభద్రాతనయుడైన అభిమన్యుడు, ద్రౌపదీ పుత్రులైన ప్రతివింధ్యుడు, శ్రుతసోముడు, శ్రుతకీర్తి, శతానీకుడు, శ్రుతసేనుడు; అనిచిరి= సాగనంపారు; అంతన్= తరువాత.

తాత్పర్యం: 'మేము నీ రాజసూయ యాగ మహోత్సవాన్ని చూచి, నీవు చేసిన సమ్మానగౌరవంతో ధన్యుల మయ్యాం. ఇక మా మా దేశాలకు వెళ్ళివస్తాం' అని సెలవు తీసుకొని వెళ్ళారు. అప్పుడు ధర్మరాజు ఆజ్ఞాపించగా భీమసేనుడు భీష్మధృతరాష్ట్రులను, అర్జునుడు ద్రుపదుణ్ణి, నకులుడు (కర్ణ) శల్య సుబలులను, వాళ్ళ కుమారులను, సహదేవుడు కృపద్రోణాశ్వత్థామలను, ధృష్టద్యుమ్నుడు విరాటభగదత్తులను, అభిమన్యుడు ఉపపాండవులు పర్వతదేశాల రాజులను సాగనంపారు. ఆ తరువాత.

విశేషం: కర్ణ శల్యుల విషయం మూలంలో లేదు. అనేక ప్రతుల్లో 'సుబలుల' అనటానికి బదులు 'సౌబలుల' అని ఉంది. కాని మూలంలో సుబలుడినే నకులుడు సాగనంపినట్లుంది. 'నకులః సుబలం రాజన్ సహపుత్త్రం సమన్వయాత్' (భండార్కరు ప్రతి 2-42-43) సుబలుడు= గాంధారరాజు, గాంధారియొక్క తండ్రి. ఆయన పెద్దవాడు, గౌరవించదగినవాడు కనుక నకులుడు ఆయనవెంట వెళ్ళి పంపటమే సమంజసం. సౌబలు డంటే సుబలుని కొడుకు - శకుని.

క. సతత ధన దానములఁ బూ । జితులయి తృప్తులయి గుణవిశిష్టమహీదే
వతవరులు ధర్మసుతు మా । నితగుణు దీవించి చనిరి నిజ గృహములకున్. 77

ప్రతిపదార్థం: గుణ, విశిష్ట, మహీదేవత, వరులు= గుణంచేత గొప్పవాళ్ళయిన బ్రాహ్మణశ్రేష్ఠులు; సతత, ధన, దానములన్= ఎడతెగని ధనదానాలచేత; పూజితులు+అయి= పూజించబడినవాళ్ళయి; మానిత, గుణున్= గౌరవించదగినగుణాలు కలవాడయిన; ధర్మసుతున్= ధర్మరాజును; దీవించి; నిజగృహములకున్= తమ ఇండ్లకు; చనిరి= వెళ్ళారు.

తాత్పర్యం: గుణాలచేత గొప్పవాళ్ళయిన బ్రాహ్మణోత్తములంతా-ఎడతెగని ధనదానాలతో తృప్తిపొంది, గౌరవించదగిన గుణాలు కలవాడైన ధర్మరాజును దీవించి, తమ తమ ఇండ్లకు వెళ్ళారు.

వ. నారాయణుండును బాండునందనుల నందఱం గ్రమంబున వీడ్కొని ద్వారవతికిం బోవుచుండి ధర్మరాజున కి ట్లనియె. 78

తాత్పర్యం: శ్రీకృష్ణుడుకూడ పాండవులందరికి ఒకరి తరువాత ఒకరికి వీడ్కోలు చెప్పి ద్వారవతీనగరానికి పోబోతూ ధర్మరాజుతో ఇలా అన్నాడు.

తే. **సకలభూతసంఘంబు పర్జన్యుఁ, బక్షి। సమితి బహుఫలవృక్షంబు, నమరు లింద్రు**
ననిశమును నుపజీవించునట్లు బంధు। జనులు ని న్నుపజీవింప మనుము పేర్మి. 79

ప్రతిపదార్థం: సకల, భూత, సంఘంబు= అన్ని ప్రాణుల సమూహం; పర్జన్యున్= మేఘుణ్ణి; పక్షి, సమితి= పక్షుల సమూహం; బహు, ఫల, వృక్షంబున్= పెక్కు పండ్లున్న చెట్టును; అమరులు= దేవతలు; ఇంద్రున్= దేవేంద్రుణ్ణి; అనిశమును= ఎల్లప్పుడూ; ఉపజీవించునట్లు= ఆశ్రయించి బ్రతికేటట్లు; బంధుజనులు; నిన్నున్+ఉపజీవింపన్= నిన్ను ఆశ్రయించి బ్రతికేటట్లుగా; పేర్మిన్= గొప్పగా; మనుము= జీవించుము.

తాత్పర్యం: ధర్మరాజా! అన్ని ప్రాణులు మేఘుణ్ణి, పక్షిసమూహం పెక్కుఫలాలున్న వృక్షాన్ని, దేవతలు దేవేంద్రుణ్ణి, ఎల్లప్పుడు ఆశ్రయించి జీవిస్తున్నట్లు- బంధువులందరు ని న్నాశ్రయించి బ్రతికేలా గొప్పగా మనుగడ సాగించు.

విశేషం: అలం: ఉపమ. బంధుజనులు రాజును ఆశ్రయించే విధాలను, రాజు వాళ్ళను రక్షించే పద్ధతులను ఈ పద్యంలో వాడిన మూడు ఉపమానాలు సూచిస్తున్నాయి. ప్రాణులకు జలం ప్రాణాధారం, అలాగే బంధుజనుల ప్రాణరక్షణభారం రాజు వహించాలి. పండ్లవృక్షాన్ని పక్షులు ఆహార నివాసాలకొరకు ఆశ్రయిస్తాయి. అలాగే రాజు తనను ఆశ్రయించిన బంధువులకు ఆహారనివాసాలకు అవసరమైన ద్రవ్యాలను అందించాలి. అంటే ఆశ్రయ మిచ్చి పోషించా లని భావం. అమరులు ఇంద్రుణ్ణి ఆశ్రయించి సురక్షితులుగా ఉండా లని ఆశిస్తారు. అలాగే రాజు బంధువులకు రక్షాకవచంగా నిలవాలి. ఈ మాటలు ఒక బంధువుగా శ్రీకృష్ణుడు చెప్పటంలో విశేషం ఉన్నది. (సంపా.)

వ. **'మఱియు నప్రమత్తుండవయి నిఖిలప్రజారక్షణంబు సేయు'మనినఁ గృష్ణునకు ధర్మరా జి ట్లనియె.** 80

ప్రతిపదార్థం: మఱియున్= అంతేకాక; అప్రమత్తుండవు+అయి= ఏమరుపాటు లేనివాడివై; నిఖిల, ప్రజా, రక్షణంబు, చేయుము= అందరు ప్రజలను రక్షించుము; అనినన్, కృష్ణునకున్; ధర్మరాజు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అంతేకాక, ఎటువంటి ఏమరుపాటు లేకుండా ప్రజలందరిని రక్షించు' అని శ్రీకృష్ణుడు అనగా ధర్మరాజు ఇలా అన్నాడు.

ఉ. **నీకరుణం గరంబు రమణీయతరంబయి సర్వవిఘ్నదూ**
రీకృతమై సమాప్తి నొనరెన్ ధరణీధర! యిమ్మఖంబు; భూ
లోకములోన నేను నృపలోక నమస్కృతిఁ గీర్తిఁ బర్వితిన్;
నా కులమున్ వెలింగె సుగుణంబుల కాస్పదమై పవిత్రమై. 81

ప్రతిపదార్థం: ధరణీధర= భూమిని ధరించినవాడా! శ్రీకృష్ణా!; నీ, కరుణన్= నీ దయచేత; ఈ, మఖంబు= ఈయజ్ఞం; కరంబు= మిక్కిలి; రమణీయ తరంబు+అయి= ఎక్కువ మనోహరమైనదయి; సర్వ, విఘ్న దూరీకృతము+ఐ= అన్ని ఆటంకాలకు దూరం చేయబడినదై; సమాప్తిన్+ఒనరెన్= ముగింపుతో ఒప్పింది; లోకములోనన్; నేను; నృప, లోక, నమస్కృతిన్, కీర్తిన్= రాజసమూహం యొక్క నమస్కారంచేత కీర్తితో; పర్వితిన్= ప్రసిద్ధుడనయ్యాను; సుగుణంబులకున్= మంచిగుణాలకు; ఆస్పదమై= ఉనికిపట్టయి; పవిత్రము+ఐ= పరిశుద్ధమై; నా, కులమున్= నాయొక్క వంశంకూడ; వెలింగెన్= ప్రకాశించింది.

తాత్పర్యం: భూభారాన్ని వహించిన ఓ శ్రీకృష్ణా! నీ దయతో ఈయజ్ఞం ఎంతో మనోజ్ఞమై, నిర్విఘ్నమై, శోభాయమానంగా ముగిసింది. లోకంలో రాజులంతా నమస్కరించటంవల్ల వచ్చిన కీర్తితో నేను ప్రసిద్ధుడి నయ్యాను. నా వంశం కూడ మంచిగుణాలకు నిలయమై, నిర్మలమై ప్రకాశించింది.

విశేషం: ధరణీధర! అనే సంబోధనలో 'భూభారాన్నే వహించిన నీకు నా యజ్ఞభారాన్ని వహించటం ఒక లెక్కా' అనే ధ్వని కూడ లేకపోలేదు. (ఆనందపూర్ణమయిన ధర్మరాజు హృదయం అక్షరరమ్యంగా మాధుర్యగుణ బంధురంగా ఈ పద్యంలో ప్రతిఫలించింది. - సంపా.)

క. ద్వారవతి నుండియును నిట । యారసియుండునది దానవాంతక! లోకా
ధార! సమీపస్థుండవ । దూరంబున నుండియుం జతుర్భుజ! మాకున్. 82

ప్రతిపదార్థం: దానవ+అంతక!= రాక్షసులను నాశ మొనర్చేవాడా! లోక+ఆధార= లోకానికి ఆధారమైనవాడా! చతుర్భుజ!= నాలుగుభుజాలు కలవాడా!-శ్రీకృష్ణా!; ద్వారవతిన్+ఉండియును= ద్వారకానగరంలో ఉన్నప్పటికిని; ఇటన్= ఇక్కడ; ఆరసి+ ఉండునది= (మా యోగక్షేమాలను) విచారిస్తూ ఉండవలసింది; దూరంబునన్, ఉండియున్= దూరంలో ఉండికూడ; మాకున్; సమీపస్థుండవు+అ= దగ్గరివాడివే.

తాత్పర్యం: రాక్షసుల్ని నాశం చేసేవాడా! లోకానికి ఆధారమైనవాడా! నాలుగు భుజాలు కలవాడా! శ్రీకృష్ణా! నీవు ద్వారకానగరంలో ఉన్నప్పటికీ, ఇక్కడి మా యోగక్షేమాలు విచారించు, దూరంగా ఉన్న నీవు మా కెప్పుడూ దగ్గరివాడివే.

విశేషం: ధర్మరాజు శ్రీకృష్ణుని శక్తిసామర్థ్యాల్ని, మాహాత్మ్యాన్ని ప్రశంసించి, 'నీ వెక్కడున్నా ఇక్కడ మా యోగక్షేమాల్ని విచారించవలసిన బాధ్యత నీదే' అని అనన్యభక్తితో అంటున్నాడు. (ఈ మాటల్లో సర్వేశ్వరుని అనంతశక్తిమత్త్వాన్నీ, అనంత వ్యాపకత్వాన్నీ ధర్మరాజు ధ్వనిమయంగా స్తుతించాడు. ద్రౌపదీమానసంరక్షణ ఘట్టంలో ఈ వాక్యం నిజం కానున్నది. ఇది వస్తుధ్వని. - సంపా.)

వ. 'నిన్నుం బాసి నిమిషంబయిన నిర్వహింప నేర'మని ధర్మరా జెట్టకేనియు గరుడగమనుగమనంబున కొడంబడియె; నంత. 83

ప్రతిపదార్థం: నిన్నున్+పాసి= నిన్నువిడిచి; నిమిషంబు+అయినన్; నిర్వహింపనేరము= జీవితాన్ని నడుపుకోలేము; అని; ధర్మరాజు; ఎట్టకేనియున్= అతి కష్టంమీద; గరుడ, గమను, గమనంబునకున్= (గరుత్మంతుని మీద ప్రయాణంచేసేవాని ప్రయాణానికి) శ్రీకృష్ణుని ప్రయాణానికి; ఒడంబడియెన్= అంగీకరించాడు; అంతన్= తరువాత.

తాత్పర్యం: 'నిన్ను విడిచి నిమిషంకూడా ఉండలేము' అంటూ ధర్మరాజు ఎంతోకష్టంమీద శ్రీకృష్ణుని ప్రయాణానికి అంగీకరించాడు. ఆ తరువాత.

విశేషం: గరుడ గమనుఁడు-గరుడునిపై ప్రయాణం చేసేవాడు - విష్ణుమూర్తి - శ్రీకృష్ణుడు.

చ. అనిలజవాశ్వయుక్తమయి హాటకరత్న విచిత్ర తార్క్ష్య కే
తనమయి మేఘనాదమయి దారుక సారథియైన దివ్య కాం
చన రథ మెక్కి యాక్షణమ సాత్వతకుంజరుఁ డేఁగె భక్తి నా
తని ననిచెన్ యుధిష్ఠిరుఁడు దమ్ములు దానును బాదచారియై. 84

ప్రతిపదార్థం: సాత్వత, కుంజరుఁడు= సాత్వతవంశశ్రేష్ఠుడు - శ్రీకృష్ణుడు; అనిల, జవ+అశ్వ, యుక్తము+అయి= వాయువేగం గల గుర్రాలతో కూడినదై; హాటక, రత్న, విచిత్ర, తార్క్ష్య, కేతనము+అయి= బంగారుతో, రత్నాలతో, చాలా చిత్రమైన రంగు గల గరుడధ్వజం కలదై; మేఘ, నాదము+అయి= మేఘ గర్జనం వంటి శబ్దం కలదై; దారుక, సారథి, ఐన= దారుకుని సారథిగా గలదైన; దివ్య, కాంచన, రథము= దేవతాసంబంధమైన బంగారు రథాన్ని; ఎక్కి; ఆ, క్షణము+ఆ= ఆ నిమిషాన్నే; ఏఁగెన్= వెళ్ళాడు; యుధిష్ఠిరుఁడు= ధర్మజుడు; తమ్ములు; తానును; పాదచారియై= నడిచివెళ్ళి; భక్తిన్= భక్తితో; అతనిన్= ఆ కృష్ణుని; అనిచెన్= సాగనంపాడు.

తాత్పర్యం: సాత్వత వంశశ్రేష్ఠుడైన శ్రీకృష్ణుడు- వాయువేగం గల గుర్రాలు, బంగారుతో, రత్నాలతో చిత్రమైన గరుడధ్వజం, మేఘగర్జన లాంటిశబ్దం కలిగి- దారుకుడు సారథిగా ఉన్న దివ్యమైన కాంచన రథాన్ని అధిరోహించి ఆ క్షణమే ద్వారకకు బయలుదేరివెళ్ళాడు. ధర్మరాజు తమ్ములతో కూడ నడిచి వెళ్ళి, భక్తి భావంతో శ్రీకృష్ణుణ్ణి సాగనంపాడు.

విశేషం: సాత్వతుడు వృష్ణి తండ్రి. ధర్మరాజు స్వయంగా నడిచి వెళ్ళి సాగనంపింది ఒక శ్రీకృష్ణుణ్ణే. (శ్రీకృష్ణుడి రథయాత్రలో కానవచ్చే ఔదాత్త్యాన్ని, గతిగాంభీర్యాన్ని, శబ్దాలంకారభ్రాంతిని కలిగించే వివిధ మధురాక్షరసంయోజనంవలన కలిగిన అక్షరరమ్యత అనుభూతికి అందిస్తున్నది. రథగమనమధురనాదమే ఈ వృత్తరచనమా అనిపిస్తున్నది. వృత్తం ప్రతిపాదం చివరిఅక్షరం దగ్గర విరిగి ముందుపాదంలోకి గతి చొచ్చుకొనిపోయే నిర్మాణసమత మార్గాభేదత్వాన్ని ధ్వనింపచేస్తున్నది. సమత అనే గుణం సంపన్నమై సహృదయహృదయాలను సమ్మోదపరుస్తున్నది. - సంపా.)

క. తగిలి విలోచన గోచర । మగు నంతకు దృష్టి నిలిపి యట హృదయం బి
మ్ముగఁ జొనిపి యెట్టకేనియు । మగిడిరి హరి ననిచి దీనమతిఁ బాండుసుతుల్. 85

ప్రతిపదార్థం: పాండుసుతుల్= పాండురాజుకుమారులు-పాండవులు; తగిలి= వెంటవెళ్ళి; విలోచన, గోచరము+అగునంతకున్= కంటికి కనిపించినంతదూరం; దృష్టి= చూపు; నిలిపి; అటన్= ఆవల; హృదయంబు= మనస్సును; ఇమ్ముగన్= ప్రీతితో; చొనిపి= చొప్పించి - అంటే చూపులకు బదులు మనస్సును ప్రవేశపెట్టి; ఎట్టకేనియున్= అతికష్టంతో; హరిని= శ్రీకృష్ణుణ్ణి; అనిచి= సాగనంపి; దీనమతిన్= దీనతను పొందిన బుద్ధితో - అంటే శూన్యం, నీరసం అయిన మానసిక స్థితితో; మగిడిరి= వెనుదిరిగారు.

తాత్పర్యం: పాండవులు శ్రీకృష్ణుని రథం వెంట వెళ్ళి, కంటికి కనిపించినంతదూరం చూచి, ఆవల చూపులకు బదులు మనస్సును పంపి, అతికష్టంమీద ఆయనను సాగనంపి దీనుల్లా తిరిగి వచ్చారు.

విశేషం: కొంతవరకే వెళ్ళేది కంటిచూపు. ఎంతవరకైన వెళ్ళేది వ్యక్తిమనస్సు. జీవితంలో తమ కెంతో సాయంచేసి, అండగా నిలిచిన ఆత్మీయుణ్ణి సాగనంపి, ఆయన వెంట మనస్సును పంపి, ఇంటికి తిరిగి వచ్చే వ్యక్తుల దీనమతి, శూన్యస్థితి అనుభవైకవేద్యమే కాని, వివరణ సాధ్యం కాదు.

పాండవ సభామహిమకు దుర్యోధనుండు లజ్జితుం డగుట (సం. 2-43-1)

వ. అట దుర్యోధనుండు శకునియుం దానును సభావిభవంబుఁ జూచు వేడుక నందుఁ గొన్ని దినంబు లుండి, యొక్కనాఁడు దాని యపూర్వరమణీయతకు విస్మితుం డగుచు నయ్యయి ప్రదేశంబులం గ్రుమ్మరువాఁడు వివృతంబైన ద్వారదేశంబు సంవృతంబుగా వగచి చొరనొల్లక, సంవృతంబైనదాని వివృతంబుగా వగచి చొరంబోయిలలాట ఘట్టితగృహద్వారుండయి, సమప్రదేశం బున్నతంబుగా వగచి యెక్కసమకట్టి, నీలాశ్మరశ్మి స్థగితంబైన విమలమణిస్థలంబు జలాశయంబుగా వగచి పరిధానం బెగఁద్రోచికొని, స్ఫటికదీప్తిజాల పరివృతంబైన జలాశయంబు స్థలంబుగా వగచి కట్టిన పుట్టంబు దడియంజొచ్చి, క్రమ్మఱిన వానిం జూచి పాంచాలియుఁ బాండుకుమారులును నగి రంత. 86

ప్రతిపదార్థం: అటన్= అక్కడ; దుర్యోధనుండు; శకునియున్; తానును; సభా, విభవంబున్= మయసభయొక్క గొప్పతనం; చూచు, వేడుకన్= చూడాలనే కుతూహలంతో; అందున్= ఇంద్రప్రస్థంలో; కొన్ని, దినంబులు; ఉండి; ఒక్కనాఁడు; దాని= ఆ మయసభయొక్క; అపూర్వ రమణీయతకున్= అరుదైన సౌందర్యానికి; విస్మితుండు+అగుచున్= ఆశ్చర్యంపొందుతూ; ఆ+అయి, ప్రదేశములన్= సభలోపలి ఆయా ప్రదేశాలలో; క్రుమ్మరువాఁడు= తిరుగుతున్నట్టి ఆ దుర్యోధనుడు; వివృతంబు+అయిన= తెరువబడి ఉండే; ద్వార, దేశంబు= వాకిలిని; సంవృతంబుగా= మూసి ఉన్న దానినిగా; వగచి= తలంచి; చొరన్+ఒల్లక= ప్రవేశించటానికి ఇష్టపడక; సంవృతంబు+ఐన, దానిన్= మూసివేయబడి ఉండే వాకిలిని; వివృతంబుగా= తెరువబడి ఉండే దానినిగా; వగచి= తలంచి; చొరన్, పోయి= ప్రవేశించబోయి; లలాట, ఘట్టిత, గృహ, ద్వారుండు+అయి= నొసట కొట్టుకొన్న గృహద్వారం కలవాడై-అంటే నొసలు గృహద్వారానికి కొట్టుకొని; సమ, ప్రదేశంబు= సమతలంగా ఉండే చోటును; ఉన్నతంబుగా= ఎత్తైన ప్రదేశంగా; వగచి= తలంచి; ఎక్కన్= ఎక్కటానికి; సమకట్టి= పూనుకొని; నీల+అశ్మ, రశ్మి, స్థగితంబు+ఐన= నీలపు రాళ్ళ కాంతులచేత కప్పబడిన; విమల, మణి, స్థలంబు= నిర్మలమైన మణులు పొదగబడిన ప్రదేశాన్ని; జల+ఆశయంబుగా= నీటి మడుగుగా; వగచి= తలచి; పరిధానంబు= కట్టుకొన్నధోవతి; ఎగ, త్రోచికొని= పైకెత్తి పట్టుకొని; స్ఫటిక, దీప్తి, జాల, పరివృతంబు+ఐన= పటికపు రాళ్ళ కాంతి సమూహంచేత చుట్టబడిన దయిన; జల+ఆశయంబు= నీటి మడుగును; స్థలంబుగా= నేలగా; వగచి= తలచి; కట్టిన, పుట్టంబు= కట్టుకున్న వస్త్రం; తడియన్= తడిసిపోయేటట్లు చొచ్చి= అందులో ప్రవేశించి; క్రమ్మఱిన= వెనుదిరిగిన; వానిన్= ఆ దుర్యోధనుణ్ణి; చూచి; పాంచాలియున్= ద్రౌపదియు; పాండుకుమారులును= పాండవులును; నగిరి= నవ్వారు; అంతన్= తరువాత.

తాత్పర్యం: దుర్యోధనుడు, శకుని - మయసభా విశేషాలు చూడాలన్న కుతూహలంతో ఇంద్రప్రస్థంలోనే కొన్ని రోజులు ఉన్నారు. ఒకరోజు దుర్యోధను డొక్కడే ఆ మయ సభయొక్క అపూర్వసౌందర్యానికి ఆశ్చర్యపడి, అందుండే ఆ యా ప్రదేశాలు తిరిగి చూడటం ప్రారంభించాడు. ఒకచోట తెరచిన ద్వారాన్ని మూసిన దానినిగా తలచి ముందుకు వెళ్ళక వెనుదిరిగాడు. మరొకచోట మూసినద్వారాన్ని తెరచినదానినిగా తలచి ముందుకు పోబోయి నొసలు కొట్టుకొన్నాడు. సమతలప్రదేశాన్ని ఎత్తైన స్థలంగా తలచి ఎక్కబోయాడు. ఒకచోట నీలపురాళ్ళ కాంతులు కప్పిన మణిమయ ప్రదేశాన్ని నీటిమడుగుగా భ్రమించి కట్టుకొన్న బట్టలు ఎగబట్టుకొని నడిచాడు. మరొకచోట స్ఫటికపు రాళ్ళ కాంతులు కప్పిన నీటి మడుగును నేలగా తలచి ముందుకు నడిచి కట్టుబట్టలు తడుపుకొని వెనుదిరిగాడు. అతణ్ణి చూచి ద్రౌపదితోపాటు పాండవులు కూడ నవ్వారు.

విశేషం: ఇది అభిమానధనుడైన దుర్యోధనుని భంగపాటు. పాండవులపై అతని అసూయా ద్వేషాలను అంతకంత అధికం చేసిన భంగపాటు. ద్రౌపదీమానభంగయత్నానికి త్రోవతీసిన భంగపాటు. రాజసూయయాగంవల్ల కలుగబోయే మహాసంగ్రామానికి ఇది తొలినాటు.

ఆ. దాని నెఱిఁగి ధర్మతనయుండు ధృతరాష్ట్ర । తనయునకు సమీరతనయుచేత
దివ్యవస్త్రములును దివ్యభూషణములు । నిచ్చి పుచ్చెఁ బ్రీతి యేర్పడంగ. 87

ప్రతిపదార్థం: దానిన్= ఆ దుర్యోధనుని తడిసిన బట్టలతో కూడినస్థితిని; ఎఱిఁగి= తెలుసుకొని; ధర్మతనయుండు= ధర్మరాజు; ధృతరాష్ట్రతనయునకున్= ధృతరాష్ట్రుని కుమారుడైన దుర్యోధనునికి; సమీర, తనయుచేతన్= వాయుపుత్రుడైన భీమసేనునిచేత; దివ్య, వస్త్రములును= మంచి బట్టలను; దివ్యభూషణములును= మంచి ఆభరణాలను; ప్రీతి= ప్రేమ; ఏర్పడంగన్= ప్రకటమయ్యేటట్లుగా; ఇచ్చి పుచ్చెన్= ఇచ్చి పంపించాడు.

తాత్పర్యం: దుర్యోధనుని కట్టుబట్టలు తడిసిన స్థితిని చూచి, ధర్మరాజు అతనికి మంచి వస్త్రాలు, ఆభరణాలు తన ప్రేమ ప్రకటమయ్యేలా భీమసేనునిచేత ఇచ్చి పంపించాడు.

విశేషం: ధర్మరాజుకు దుర్యోధనునిమీద అంతప్రేమ ఉంటే మంచివస్త్రాలు, ఆభరణాలు ఇచ్చి పంపటం మంచిదే. కాని, అవి భీమసేనునిచేతనే ఇచ్చి పంపాలా? మరొక తమ్ముడిచేత పంపకూడదా? తిక్కనగారు ధర్మజుణ్ణి 'మెత్తనిపులి' అనటం ఇలాంటివాటిని దృష్టిలో పెట్టుకొని కాబోలు. ఆగర్భశత్రువైన భీమసేనుని చేత అలా ఇచ్చి పంపితే అవమానం పాలైన అభిమానధనుడు దుర్యోధనునికి పుండుమీద కారం చల్లినట్లుండదా?

వ. దుర్యోధనుం డట్లు సభాప్రలంభంబునకు లజ్జితుండయి పాండవుల వీడ్కొని గజపురంబున కరిగి ధర్మరాజు రాజసూయంబు దన కసూయాజననం బగుటయు సకలజనమనో నయనోత్సవంబయిన తత్సభాలక్ష్మి దన మనోనయనంబుల కగ్నిజ్వాలలయి మహాదాహంబు సేయుటయు సంతప్తుండై నిదాఘదాహంబున నింకి తఱుఁగు నల్పజలాశయంబునుం బోలెఁ దద్దయుం దఱిఁగి. 88

ప్రతిపదార్థం: దుర్యోధనుండు; అట్లు= ఆ విధంగా; సభా ప్రలంభంబునకున్= సభవల్ల మోసపోవటానికి; లజ్జితుండు+ఐ= సిగ్గుపడినవాడై; పాండవులన్; వీడ్కొని= వదలి; గజపురంబునకున్= హస్తిపురానికి; అరిగి= వెళ్ళి; ధర్మరాజు, రాజసూయంబు= ధర్మరాజుయొక్క రాజసూయయాగం; అసూయా, జననంబు+అగుటయున్= అసూయను పుట్టించేది కాగా; సకల, జన, మనః+నయన+ఉత్సవంబు+అయిన= అందరు ప్రజల మనస్సులకు, కన్నులకు పండువు అయిన - అంటే అందరికీ సంతోషాన్ని కూర్చిన; తత్+సభా, లక్ష్మి= ఆ మయసభా వైభవం; తన, మనః+నయనంబులకున్= తనయొక్క మనస్సుకు, నేత్రాలకు; అగ్ని, జ్వాల+ఐ= నిప్పుమంట అయి; మహా, దాహంబు, చేయుటయున్= మిక్కిలిగా కాల్చటంచేత; సంతప్తుండు+ఐ= ఎక్కువ దుఃఖం పొందినవాడై; నిదాఘ, దాహంబునన్= వేసవి వేడిమిచేత; ఇంకి= నీళ్ళు ఇంకిపోయి; తఱుఁగు= తగ్గిపోయే; అల్ప, జల+ఆశయంబునున్+పోలెన్= చిన్ననీటిమడుగువలె; తద్దయున్= మిక్కిలి; తఱిఁగి= కృశించి.

తాత్పర్యం: ఆ విధంగా దుర్యోధనుడు మయసభవల్ల మోసపోయి, అవమానం పాలైనందుకు సిగ్గుపడ్డాడు. పాండవుల్ని వదలి హస్తినకు వెళ్ళాడు. ధర్మరాజు రాజసూయం అతనికి అసూయ కలిగించింది. అందువల్ల - అందరి మనస్సులకు, కళ్ళకు ఆనందాన్ని కూర్చిన ఆ మయసభా వైభవం - అతని మనస్సుకు, కళ్ళకు నిప్పుమంట

అయింది. అమితంగా అతణ్ణి దహించింది. దుఃఖంతో కుమిలిపోయాడు. వేసవి వేడికి నీళ్ళింకి తరిగిపోయిన నీటి మడుగులా కృశించి-

విశేషం: అలం. ఉపమ.

క. కందు గల పసిఁడి గాఁచినఁ । గంది వివర్ణమయినట్లు కౌరవుకాయం
బొందఁగ వివర్ణమయి కడు । వందె మనస్తాపహవ్యవహదాహమునన్. 89

ప్రతిపదార్థం: కందు= మాలిన్యం; కల; పసిఁడి= బంగారాన్ని; కాఁచినన్= కాల్చగా; కంది= నలుపెక్కి; వివర్ణము+అయిన, అట్లు= రంగును కోల్పోయినట్లు; మనస్తాప, హవ్యవహ, దాహమునన్= మనోవేదన అనే అగ్నియొక్కవేడిచేత; కౌరవుకాయంబు= దుర్యోధనుని శరీరం; ఒందఁగన్= స్పష్టంగా తెలిసేటట్లుగా; వివర్ణము+అయి= కళావిహీనమై - అంటే వెలవెలపోయి; కడున్= మిక్కిలి; వందెన్= దుఃఖంచేత కృశించింది.

తాత్పర్యం: మాలిన్యం గల బంగారాన్ని బాగా కాలిస్తే (వేడిచేస్తే) అది నలుపెక్కి ఎంతగా తన రంగును కోల్పోతుందో మనోవేదన అనే నిప్పువేడిచేత దుర్యోధనుని శరీరం అంత కళావిహీనమైంది. కృశించింది.

విశేషం: అలం: రూపకానుప్రాణితఉపమ. ఎదుటివారి అభివృద్ధిని చూచి సంతోషించటం సజ్జనలక్షణం. ఈర్ష్యపడటం దుర్జనస్వభావం. ఈర్ష్య చాలాచిత్రమైన దుర్గుణం. అది ఒకరితో చెప్పుకోటానికి వీలులేనిది. అట్లని ఓర్చుకొనటానికి సాధ్యంకానిది. ఒక విధంగా అది కర్రకు అంటుకొన్న నిప్పులాంటిది. ఎదుటివాళ్ళను కాల్చేమాట ఎలా ఉన్నా మొదట కర్రను మాత్రం అది కాల్చకమానదు. ఇప్పుడు దుర్యోధనుని స్థితి ఇదే.

క. అవనీ రాజ్యవ్యాపా । రవిహీనుం డయి సుహృద్విరంజనుఁ డై కౌ
రవపాంసనుండు పాప । వ్యవసాయమునందు బుద్ధి వదలక నిలిపెన్. 90

ప్రతిపదార్థం: కౌరవ, పాంసనుండు= కౌరవ కులానికి అపకీర్తి తెచ్చేవాడు-దుర్యోధనుడు; అవనీ, రాజ్య, వ్యాపార, విహీనుండు+ అయి= రాజ్యపరిపాలన వ్యవహారాలు మానినవాడై; సుహృత్+విరంజనుఁడు+ఐ= స్నేహితులపట్ల ఇష్టంలేనివాడయి; పాప, వ్యవసాయంబునందున్= పాపపుపని చేయటంలో; బుద్ధి= మనస్సు; వదలక= విడువక-అంటే గట్టిగా; నిలిపెన్= నిలిపాడు.

తాత్పర్యం: కౌరవకులానికి అపకీర్తి కలిగించే దుర్యోధనుడు, రాజ్యవ్యవహారాలు చూడటం మాని, స్నేహితులను కలయటానికి కూడ ఇష్టపడక, పాపపుపని చెయ్యటంలో పట్టుగా బుద్ధి నిలిపాడు.

వ. ఇట్లు సకల సుఖోపభోగ విముఖుండయి యెవ్వరితోడం బలుక కున్న దుర్యోధనుం జూచి శకుని యి ట్లనియె. 91

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; సకల, సుఖ+ఉపభోగ, విముఖుండు+ఐ= అన్ని సుఖాలను అనుభవించటానికి ఇష్టంలేని వాడై; ఎవ్వరితోడన్= ఎవరితోకూడ; పలుకక+ఉన్న= మాట్లాడకుండ ఉన్నటువంటి; దుర్యోధనున్; చూచి; శకుని; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈ విధంగా ఏ సుఖం అనుభవించటానికి ఇష్టంలేని వాడై, ఎవరితో కూడా మాట్లాడకుండా ఉండే ఆ దుర్యోధనుణ్ణి చూచి శకుని ఇలా అన్నాడు.

ఆ. ఇన్ని దినములయ్యె నేటికి నాతోడ । నిభపురేశ! పలుక విట్టు లేల?
నీ ముఖంబు దీర్ఘ నిశ్వాస ధూమ సం । హతులఁ జేసి కలుషమయిన యదియు. 92

ప్రతిపదార్థం: ఇభ, పుర+ఈశ= ఓ హస్తినాపురరాజా! దుర్యోధనా!; ఇన్ని, దినంబులు+అయ్యెన్= ఇన్ని రోజులయింది-అంటే చాలా రోజులనుండి; ఏటికిన్= ఎందుచేత; నాతోడన్; పలుకవు= మాట్లాడవు; ఇట్టుల= ఈ విధంగా; ఏల= ఎందుచేత; నీ, ముఖంబు; దీర్ఘ, నిశ్వాస, ధూమ, సంహతులన్+చేసి= నిట్టూర్పుపొగల సమూహాలచేత; కలుషము+అయిన, అదియు= మలినమైనది.

తాత్పర్యం: ఓ హస్తినాపురరాజా! దుర్యోధనా! ఇన్ని రోజులుగా నీవు నాతో ఎందుకు మాట్లాడటం లేదు? ఎందుచేత నీ ముఖం ఈ విధంగా వేడి నిట్టూర్పులతో మలినమైపోయింది?

విశేషం: వేడినిట్టూర్పులు వెలితికి చిహ్నాలు. వేదనకు సూచికలు. 'ఇభపురేశ' - అనే సంబోధన - నీవు హస్తినాపురాధీశ్వరుడివి కదా! నీ కేమి కొరత? ఎందుల కీ నిట్టూర్పులు? ఏమి నీ వేదన? తప్పక చెప్పు' అని తరచి అడిగేదిగా ఉంది.

క. నా కెఱిఁగింపుము దీని, న । నేకాగ్రతఁ బొందనేల యే నుండఁగ? న
వ్యాకులభవత్ప్రతాప ని । రాకృతులు ధరిత్రిలోని రాజులు నీకున్. 93

ప్రతిపదార్థం: దీనిన్= నీ దుఃఖకారణాన్ని; నాకున్+ఎఱిఁగింపుము= నాకు తెలియజెప్పుము; ఏన్+ఉండఁగన్= నేనుండగా; అనేకాగ్రతన్= చింతను; పొందన్+ఏల= పొందటమెందుకు? ధరిత్రిలోని= భూమిలోని; రాజులు; నీకున్? అవ్యాకుల, భవత్+ప్రతాప, నిరాకృతులు= కలతచెందని నీ పరాక్రమంచేత అణగించబడినవారు.

తాత్పర్యం: నీ దుఃఖకారణాన్ని నాకు చెప్పు. నే నుండగా నీవు చింతించట మెందుకు? భూమిమీద రాజులంతా నీ స్థిరపరాక్రమంచేత అణచివేయబడిన వాళ్ళే కదా!

వ. 'ఇంత సంతాపింప నేల?' యనిన నాశకునికి దుర్యోధనుం డిట్లనియె. 94

తాత్పర్యం: 'ఇంతగా నీవు దుఃఖించట మెందుకు?' అని అనగానే ఆ శకునితో దుర్యోధనుడు ఇలా అన్నాడు.

దుర్యోధనుని దురాలోచనము (సం. 2-43-19)

ఉ. నీవును జూచి, తట్టిసభనేని వినంబడ దేయుగంబులన్;
భూవలయంబులో నది యపూర్వము సర్వమనోజ్ఞ మిష్ట భో
గావహ మేక్రియం బడసెనయ్య? మహాత్ముఁడు దాన నేమి సం
భావితభాగ్యుఁ డయ్యెను బ్రభాకరతేజుఁడు ధర్మజుం డిలన్. 95

ప్రతిపదార్థం: నీవును= నీవుకూడ; చూచితి= చూచావు; అట్టి, సభన్+ఏని= అటువంటి సభనుగురించి ఏ మాత్రం; ఏ యుగంబులన్= ఏ యుగాల్లోకూడ; వినంబడదు= వినబడలేదు; భూవలయంబులోన్= భూమండలంలో; అది= ఆ మయసభ; అపూర్వము= ముందెన్నడూ లేనట్టిది; సర్వ, మనోజ్ఞము= అన్నివిధాల (అందరికీ) అందమైనట్టిది; ఇష్టభోగ+ఆవహము= కోరిన

సుఖాలను కలగజేసేటటువంటిది; మహాత్ముఁడు= గొప్పవాడైన ధర్మరాజు; ఏ క్రియన్= ఏ విధంగా; పడసెన్+అయ్యా= పొందాడయ్యా! దానన్= ఆ సభచేత; ఏమి= ఎంతగొప్పగా; ప్రభాకర తేజుఁడు= సూర్యునితో సమానమైన కాంతికలవాడు; ధర్మజుండు= ధర్మరాజు; ఇలన్= భూమిమీద; సంభావిత భాగ్యుఁడు+అయ్యెను= గౌరవించబడిన వైభవం కలవాడయ్యాడు.

తాత్పర్యం: నీవుకూడ చూచావుకదా! ఏ యుగంలో కూడ అలాంటి సభ ఉన్నట్లే వినలేదు. భూమండలంలో అది అపూర్వం. అన్నివిధాల రమణీయం. కోరిన సుఖాలన్నీ ఇచ్చే ఆ సభను, ఆ మహాత్ముడు ధర్మరాజు ఏ విధంగా పొందాడోకదా! సూర్యతేజుడైన ధర్మరాజు దాన్ని పొంది ఈ లోకంలో ఎంత గౌరవం పొందిన భాగ్యం కలవాడయ్యాడు!

విశేషం: గుణం : అర్థవ్యక్తి. రాజసూయంలో ఆ మయసభావైభవం అన్నింటికంటె మిన్నగా దుర్యోధనుని కన్ను కుట్టింది. (ఈ సందర్భంలో అతని మనోవేదనను వ్యక్తంచేసిన పద్యాలను అర్థవ్యక్తి గుణరంజకంగా రచించటం గమనార్హం. -సంపా.)

చ. **కడు భయమంది వానికిఁ దగన్ మఱి వైశ్యులపోలె వశ్యులై**
పుడమి నతిప్రసిద్ధులగు భూపతులెల్ల మహాధనావళుల్
దడయక తెచ్చియిచ్చి కరదానము సేయుటఁ బార్థివత్వ మే
ర్పడియెఁ బృథాగ్రపుత్త్రునకుఁ; బాండవతేజము పర్వె నెల్లచోన్. **96**

ప్రతిపదార్థం: పుడమిన్= భూమిలో; అతిప్రసిద్ధులు+అగు= మిక్కిలిపేరు పొందిన; భూపతులు+ఎల్లన్= రాజులందరు; కడున్ భయము+అంది= మిక్కిలి భయాన్ని పొంది; వానికిన్= ఆ ధర్మరాజుకు; మఱి; వైశ్యులపోలెన్= వైశ్యులవలె; వశ్యులై= లొంగిపోయినవాళ్ళయి; మహాధన+ఆవళుల్= గొప్ప ధన సమూహాలను; తడయక= ఆలస్యంచెయ్యకుండా; తెచ్చియిచ్చి; కరదానము, చేయుటన్= కప్పం చెల్లించటంచేత; పృథ+అగ్ర, పుత్త్రునకున్= కుంతీదేవియొక్క పెద్దకుమారునికి; పార్థివత్వము= చక్రవర్తిత్వం; ఏర్పడియెన్= ఏర్పడింది; పాండవ, తేజము= పాండవులయొక్క పరాక్రమం; ఎల్లచోన్= అన్నిచోట్ల; పర్వెన్= వ్యాపించింది.

తాత్పర్యం: భూమిమీద ఎంతో పేరుపొందిన రాజులంతా చాలా భయపడి ధర్మరాజుకు వైశ్యుల్లా లొంగిపోయారు. విపరీత ధనసమూహాలు కప్పాలుగా తెచ్చి ఇచ్చారు. అందువల్ల ఆ కుంతీదేవి పెద్దకొడుకుకు చక్రవర్తిత్వం ఏర్పడింది. పాండవుల పరాక్రమం అన్నివైపులా వ్యాపించింది.

విశేషం: గుణం: అర్థవ్యక్తి. ఆ మయ సభావైభవం తరువాత, దుర్యోధనుని కన్నుకుట్టించినవి- వివిధ దేశాధీశ్వరులు ధర్మజునికి తెచ్చిఇచ్చిన ధనరాసులు; ఆయనచక్రవర్తిత్వం; పాండవుల పరాక్రమం. వైశ్యులు వాణిజ్య వ్యాపారాలు వృత్తిగా కలవారు. వాళ్ళు తమ ప్రయోజనాలు పూర్తిగా సాధించుకోటానికి అందరితో మంచిగా మెలగి, విశేషించి ప్రభువులకు వశవర్తులై ఉండక తప్పదు. అందుచేతనే 'వైశ్యులపోలె వశ్యులై' అనటం జరిగిందేమో?

ఉ. **యాదవుచేతిచక్రము భయంకరమై శిశుపాలమస్తక**
చ్ఛేదము సేసినం గడుఁ బ్రసిద్ధులు శూరులునైన రాజు ల
య్యాదవుముందటన్ జయ జయ ధ్వను లిచ్చిరి గాని, వాని శౌ
ర్యోదయవృత్తికట్టెదుర నోపర యెవ్వరు విక్రమింపఁగన్. **97**

ప్రతిపదార్థం: యాదవుచేతి, చక్రము= యదువంశంవాడైన శ్రీకృష్ణుని చేతిలోని చక్రాయుధం; భయంకరము+ఐ; శిశుపాల, మస్తకచ్ఛేదము, చేసినన్= శిశుపాలునియొక్క తలను నరుకగా; కడున్= మిక్కిలి; ప్రసిద్ధులు= పేరుపొందినవాళ్ళు; శూరులున్+ ఐన; రాజులు; ఆ+యాదవు, ముందటన్= ఆ శ్రీకృష్ణుని ఎదుట; జయ, జయ, ధ్వనులు, ఇచ్చిరి, కాని= 'జయ!జయ!' అని విజయ ప్రశంసలతో కూడిన కేకలు పెట్టారు కాని; వాని= ఆ శ్రీకృష్ణునియొక్క; శౌర్య+ఉదయ, వృత్తి, కట్టెదురన్= పరాక్రమ ప్రవర్తనముందు; ఎవ్వరున్= ఏ ఒక్కరుకూడ; విక్రమింపఁగన్= ఎదిరించటానికి; ఓపర= చాలని వాళ్ళయ్యారు.

తాత్పర్యం: యాదవుడైన శ్రీకృష్ణుని చేతిచక్రం భయంకరమై శిశుపాలుని శిరస్సును ఛేదిస్తే- ఎంతో ప్రసిద్ధులు, వీరులు అయిన రాజులు- ఆ శ్రీకృష్ణుని ముందు జయ జయ శబ్దాలు చేశారు కాని, ఆతని ఆ వీరకృత్యాన్ని ఎదిరించటానికి ఏ ఒక్కరు సమర్థులు కాలేకపోయారు.

విశేషం: గుణం: అర్థవ్యక్తి. దుర్యోధనుడు ఒకటికి రెండుమార్లు యాదవపదాన్ని ప్రయోగించింది శ్రీకృష్ణుని కులాన్ని ఎత్తిచూపటానికే.

చ. **అతుల పరాక్రమార్జితములైన ధనంబులపేర్మిఁ జేసి యు**
న్నతమగు చున్న పాండునరనాథ తనూజుల లక్ష్మి నా కస
మ్మతమయి సూ వెలింగె విను మాతుల! మానధనాఢ్యుఁ డైన భూ
పతి సహియింపనోపునె సపత్నులవృద్ధియు నాత్మహానియున్. **98**

ప్రతిపదార్థం: అతుల, పరాక్రమ+ఆర్జితములు+ఐన= సాటిలేని పరాక్రమంచేత సంపాదించబడినవైన; ధనంబుల, పేర్మిన్+చేసి= సంపదల అతిశయంతో; ఉన్నతము+అగుచున్+ఉన్న= ఎక్కువ అవుతున్న; పాండు, నరనాథ, తనూజుల, లక్ష్మి= పాండురాజుకుమారులయొక్క ఐశ్వర్యం; నాకున్; అసమ్మతము+ఐ= సహించరానిదై; వెలింగెన్, సూ= ప్రకాశించిందిసుమా; మాతుల= ఓ మేనమామా!; విను; మాన, ధన+ఆఢ్యుఁడు+ఐన= అభిమాన మనే ధనంతో కూడుకొనినవాడైన; భూపతి= రాజు; సపత్నుల, వృద్ధియున్= దాయాదులయొక్క అభివృద్ధిని; ఆత్మ, హానియున్= తనయొక్క తగ్గుదలను; సహింపన్+ ఓపునే= ఓర్చుకొనగలడా!

తాత్పర్యం: సాటిలేని పరాక్రమంతో సంపాదించిన గొప్ప సంపదలతో అంతకంతకు అధికమౌతున్న పాండవుల ఐశ్వర్యం. నాకు సహించరానిదై ప్రకాశించింది సుమా! ఓ మేనమామా! శకునీ! విను. అభిమానధనుడైన రాజు దాయాదుల అభివృద్ధిని, తన తగ్గుదలను సహించగలడా!

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. ఇది దుర్యోధనుని ఈర్ష్యకు అద్దం పట్టే పద్యం. గుణం: అర్థవ్యక్తి.

వ. **'ఏమి సేయుదము? పాండవుల లక్ష్మి యెవ్విధంబున మన కపహరించి కొననగు?' ననిన దుర్యోధనునకు శకుని యి ట్లనియె.** **99**

ప్రతిపదార్థం: ఏమి, చేయుదము; పాండవుల లక్ష్మి= పాండవులయొక్క సంపద; ఏ, విధమునన్; మనకున్; అపహరించికొనన్= దోచుకోవటానికి; అగున్= సాధ్యమవుతుంది; అనిన; దుర్యోధనునకున్; శకుని; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'ఏం చేద్దాం? పాండవుల సంపదను ఏ విధంగా దోచుకోటానికి సాధ్య మౌతుందో చెప్పు' అని దుర్యోధను డనగా- శకుని ఈ విధంగా అన్నాడు.

క. దీనికి ధృతరాష్ట్రునను । జ్ఞానము వడయుడును మనకు సమకూరు ధరి
త్రీనాథ! భవదభిప్రా । యానుగుణైశ్వర్య మతిశయంబుగఁ బ్రీతిన్. 100

ప్రతిపదార్థం: ధరిత్రీనాథ= భూపతీ! ఓదుర్యోధనా మహారాజా!; దీనికిన్= పాండవుల సంపదను దోచుకొనే ఈ పనికి; ధృతరాష్ట్ర+అనుజ్ఞానము= ధృతరాష్ట్రునియొక్క అనుమతిని; పడయుడును= పొందితే; భవత్+అభిప్రాయ+అనుగుణ+ ఐశ్వర్యము= నీ ఉద్దేశానికి తగిన సంపద; అతిశయంబుగన్= గొప్పగా; ప్రీతిన్= ఇష్టంతో; మనకున్; సమకూరున్.

తాత్పర్యం: ఓ దుర్యోధన మహారాజా! పాండవుల సంపదను అపహరించేపనికి ధృతరాష్ట్రుని అనుమతి పొందితే, నీ ఉద్దేశానికి తగిన ఐశ్వర్యం ప్రియమార మనకు సమకూరుతుంది.

వ. అని యప్పుడ శకుని దుర్యోధనుం దోడ్కొని ధృతరాష్ట్రునొద్దకుం జని యాతని శరీరకార్శ్య వైవర్ణ్యంబులు సెప్పిన విని యదరిపడి ధృతరాష్ట్రుండు కొడుకు నొడలంటి చూచి కడు దుఃఖితుండయి యి ట్లనియె. 101

ప్రతిపదార్థం: అని; అప్పుడు; శకుని; దుర్యోధనున్; తోడ్కొని= వెంటపెట్టుకొని; ధృతరాష్ట్ర+ఒద్దకున్= ధృతరాష్ట్రుని దగ్గరకు; చని= వెళ్ళి; ఆతని= ఆ దుర్యోధనునియొక్క; శరీ, కార్శ్య, వైవర్ణ్యంబులు= శరీరం కృశించటాన్ని, కళావిహీనమవటాన్ని; చెప్పిన; విని; అదిరిపడి; ధృతరాష్ట్రుండు; కొడుకు; ఒడలు= దేహాన్ని అంటి, చూచి= తడవిచూచి; కడున్, దుఃఖితుండు+అయి= మిక్కిలి దుఃఖించినవాడయి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అని శకుని, అప్పుడు దుర్యోధనుణ్ణి వెంట బెట్టుకొని ధృతరాష్ట్రుని దగ్గరకు వెళ్ళాడు. అతని శరీరం కృశించటాన్ని, కళావిహీన మవటాన్ని చెప్పాడు. అది విని ధృతరాష్ట్రుడు అదిరిపడ్డాడు. కుమారుని శరీరాన్ని తడవి చూచి అమితంగా దుఃఖిస్తూ ఇలా అన్నాడు.

సీ. కౌరవైశ్వర్యంబు గౌరవంబున సమ । ర్పితమయ్యె నీయంద పేర్మితోడ;
ననుజులు మిత్రులు ననుచరులును నీకుఁ । బ్రీతుల కాని యప్రియులు లేరు;
వివిధోపభోగముల్ దివిజేశునకుఁ గల । యట్టుల కలవు నీ కనుభవింప;
సకలభూపతులుఁ బాయక భక్తియుక్తులై । యొలసి నీ పనుపు సేయుదురు; పేర్మి

ఆ. నేమి గొఱఁతయయ్యెఁ? నిట్లు డయ్యను దను । చ్ఛాయ దఱఁగి యుండ సకలధరణి
రాజ్యభోగ సుఖ పరాఙ్ముఖత్వముఁ బొంద । నేల నీకుఁ గురుకులేశ్వరుండ! 102

ప్రతిపదార్థం: కురుకుల+ఈశ్వరుండ= కురువంశరాజా! ఓ దుర్యోధనా!; కౌరవ+ఐశ్వర్యంబు= కౌరవులసంపద; గౌరవంబునన్= గొప్పగా; నీయందు+అ= నీకే; పేర్మితోడన్= ఎక్కువగా; సమర్పితము+అయ్యెన్= ఈయబడింది; అనుజులు= తమ్ములు; మిత్రులున్= స్నేహితులును; అనుచరులును= సేవకులును; నీకున్; ప్రీతులకాని= ఇష్టమైనవాళ్ళేకాని; అప్రియులు= ఇష్టంకానివాళ్ళు; లేరు; వివిధ+ఉపభోగముల్= అనేకవిధాలైన సుఖభోగాలు; దివిజ+ఈశునకున్= దేవేంద్రునికి; కల, అట్టుల= ఉన్నట్లు; నీకున్; అనుభవింపన్; కలవు; సకల, భూపతులున్= అందరు రాజులు; పాయక= ఎడతెగక; భక్తియుక్తులు+ఐ= భక్తితో కూడినవాళ్ళయి; ఒలసి= చుట్టుకొని; నీ, పనుపు= నీ ఆజ్ఞను; చేయుదురు; పేర్మిన్= గొప్పతనంలో; ఏమి; కొఱత+అయ్యెన్= లోటు కలిగింది; ఇట్లు= ఈ విధంగా; డయ్యను= కృశించటం; తనుచ్ఛాయ= దేహకాంతి; తఱఁగి= తక్కువై; ఉండన్= ఉండటం; సకల,

ధరణి, రాజ్య, భోగ, సుఖ, పరాఙ్ముఖత్వమున్= సమస్తరాజ్య భోగసుఖాలలో విరక్తిని; పొందన్= పొందటం; నీకున్; ఏల= ఎందులకు?

తాత్పర్యం: దుర్యోధనా! కౌరవసంపద నీకే ఎక్కువగా ఇవ్వబడింది. తమ్ములు, స్నేహితులు, సేవకులు, నీకు ఇష్టమైన వాళ్ళే కాని, ఇష్టం కానివాళ్ళు లేరు. అనేక విధాలైన సుఖభోగాలు దేవేంద్రునికి ఉన్నట్లు అనుభవించటానికి నీకూ ఉన్నాయి. అందరు రాజులు ఎడతెగని భక్తితో నీచుట్టూ చేరి గౌరవంతో నీ ఆజ్ఞ పాలిస్తారు. గొప్పతనంలో నీ కేమి కొరత? ఈ విధంగా నీవు కృశించటం, వెలవెలబోవటం. రాజ్యభోగాల్లో, సుఖాల్లో విరక్తిచెందటం ఎందుకు?

వ. అనిన విని ధృతరాష్ట్రునకు దుర్యోధనుం డి ట్లనియె. 103

తాత్పర్యం: అనగా విని దుర్యోధనుడు ధృతరాష్ట్రునితో ఇలా అన్నాడు.

క. పాండవుల విభవ మది యా । ఖండలు విభవంబుకంటెఁ గడుమిక్కిలియై
యొండొండ పెరిఁగి దిక్కులు । నిండెఁ దదీయ ప్రతాప నిర్మల రుచితోన్. 104

ప్రతిపదార్థం: పాండవుల, విభవము= పాండవులయొక్కఐశ్వర్యం; అది; ఆఖండలు, విభవంబుకంటెన్= దేవేంద్రుడియొక్క ఐశ్వర్యంకంటె; కడున్, మిక్కిలి+ఐ= ఎంతో ఎక్కువై; ఒండు+ఒండ, పెరిఁగి= అంతకంతకు పెరిగి; తదీయ, ప్రతాప, నిర్మల, రుచితోన్= వారి పరాక్రమంయొక్క స్వచ్ఛకాంతులతో; దిక్కులు; నిండెన్.

తాత్పర్యం: పాండవుల ఐశ్వర్యం- దేవేంద్రుని ఐశ్వర్యంకంటె ఎంతో ఎక్కువై- అంతకంతకు పెరిగి, స్వచ్ఛమైన వాళ్ళ పరాక్రమకాంతులతో అన్ని దిక్కులా నిండింది.

విశేషం: అలం: సహోక్తి.

క. సామాన్యమె యుత్తర కురు । భూములు మొదలుగ సమస్తభూములు విజయ
శ్రీమహిమను సాధించెఁ ద్రి । ధామపరాక్రముఁడు శక్రతనయుఁడు బలిమిన్. 105

ప్రతిపదార్థం: త్రిధామ పరాక్రముఁడు= విష్ణుమూర్తితో సమానమైన పరాక్రమం కలవాడు; శక్రతనయుఁడు= దేవేంద్రుని కుమారుడు - అర్జునుడు; బలిమిన్= బలంతో; ఉత్తర కురు భూములు మొదలుగ; సమస్త, భూములు= అన్నిదేశాలు; విజయశ్రీ, మహిమను= విజయలక్ష్మీ ప్రభావంచేత; సాధించెన్= జయించాడు; సామాన్యమె= ఇది సామాన్యమైన విషయమా? (కాదని భావం).

తాత్పర్యం: విష్ణుమూర్తితో సమానమైన పరాక్రమం గల అర్జునుడు తన బలంతో ఉత్తర కురుభూములు మొదలుగా సమస్తదేశాలను జయించాడు. ఇది సామాన్యమైన విషయమా?

తే. సఖ్యసంబంధములఁ జేసి చక్రధరుఁడు । ద్రుపదుఁడును దక్కఁ దక్కిన నృపతులెల్ల
నరియుఁ బెట్టనివారు లే రఖిల జలధి । వలయిత క్షోణిలోఁ బాండవులకుఁ బ్రీతి. 106

ప్రతిపదార్థం: సఖ్య, సంబంధములన్+చేసి= స్నేహంతో, బంధుత్వంతో; చక్రధరుఁడు= చక్రాన్ని ధరించినవాడు - శ్రీకృష్ణుడు; ద్రుపదుడును; తక్కన్= తప్ప; అఖిల, జలధి, వలయిత, క్షోణిలోన్= అన్ని సముద్రాలచేత చుట్టబడి ఉండే భూమిలో; తక్కిన; నృపతులు+ఎల్లన్= రాజులందరు; ప్రీతిన్= ప్రీతితో; పాండవులకున్; అరియున్= కప్పమును; పెట్టనివారు= చెల్లించనివాళ్ళు; లేరు.

తాత్పర్యం: స్నేహంతో, బంధుత్వంతో శ్రీకృష్ణుడు, ద్రుపదుడు తప్ప, ఈ సమస్త భూమండలంలో పాండవులకు ప్రీతిగా కప్పంకట్టని రాజులే లేరు.

తే. శైల కానన ద్వీప విశాల మయిన । వసుమతీ చక్రమంతయు వారి వశము;
యేను నొకరాజసుతుఁడనై యెట్లు దీనిఁ । జూడ నోపుదుఁ బ్రాభవశూన్యునట్లు. 107

ప్రతిపదార్థం: శైల, కానన, ద్వీప, విశాలము+అయిన= కొండలతో, అడవులతో, ద్వీపాలతో విశాలమైన; వసుమతీచక్రము+అంతయున్= భూమండలమంతా; వారి, వశము+అ= పాండవుల అధీనమే; ఏనున్= నేను; ఒక; రాజసుతుఁడను+ఐ= రాజకుమారుడినై ఉండి; ప్రాభవ, శూన్య+అట్లు= ప్రభుత్వంలేనివాడివలె; ఎట్లు= ఏ విధంగా; దీనిన్= ఈ స్థితిని; చూడన్+ఓపుదున్= చూడగలను?

తాత్పర్యం: కొండలతో, అడవులతో, ద్వీపాలతో విశాలమైన భూమండలమంతా పాండవుల అధీనమై ఉండగా, నేనొక రాజకుమారుడినై అధికారం లేని దీనుడిలా దీన్ని ఎలా చూడగలను.

తే. నన్ను రత్నపరిగ్రహణంబునందుఁ । బాండవుండు నియోగించెఁ బార్థివేంద్ర!
సర్వరత్నాకరైక ప్రశస్త రత్న । పుంజముల కాస్పదము ధర్మపుత్త్రుగృహము. 108

ప్రతిపదార్థం: పార్థివ+ఇంద్ర= ధృతరాష్ట్రమహారాజా!; పాండవుండు= ధర్మరాజు; నన్నున్; రత్న, పరిగ్రహణంబు+అందున్= రత్నాలు అందుకొనటంలో; నియోగించెన్= నియమించాడు; ధర్మపుత్త్రు, గృహము= ధర్మరాజుయొక్క ఇల్లు; సర్వ, రత్న+ఆకర+ఏక, ప్రశస్త, రత్న, పుంజములకున్= అన్ని సముద్రాల్లోని మిక్కిలి శ్రేష్ఠమైన రత్న సమూహాలకు; ఆస్పదము= ఉనికిపట్టు.

తాత్పర్యం: ధృతరాష్ట్రమహారాజా! ధర్మరాజు నన్ను అందరూ కానుకలుగా తెచ్చి ఇచ్చిన రత్నాలు అందుకోటానికి నియమించాడు. ఆ ధర్మజుని ఇల్లు అన్ని సముద్రాల్లోని శ్రేష్ఠరత్నాలకు నిలయం.

విశేషం: రత్నాకరము-రత్నాలకు నిలయమైనది సముద్రం.

తే. యజ్ఞదీక్షితుఁ డయిన ధర్మాత్మజునకు । గౌడకాంభోజపతు లనేక ప్రకార
వర్ణకంబళములు శుకవర్ణవాహ । నివహములుఁ దెచ్చియిచ్చిరి నెమ్మితోడ. 109

ప్రతిపదార్థం: యజ్ఞ దీక్షితుఁడు+అయిన= యజ్ఞదీక్ష వహించిన వాడైన; ధర్మ+ఆత్మజునకున్= ధర్ముని యొక్క కుమారుడైన ధర్మరాజుకు; నెమ్మితోడన్= ప్రేమతో; గౌడ, కాంభోజపతులు= గౌడ కాంభోజ దేశ రాజులు; అనేక, ప్రకార, వర్ణ, కంబళములు= అనేక విధాలైన రంగులు గల కంబళ్ళును; 'శుక', వర్ణ, వాహ, నివహములున్= చిలుకవన్నె గల గుర్రాల సమూహాలును; తెచ్చి; ఇచ్చిరి.

తాత్పర్యం: యజ్ఞదీక్ష వహించిన ధర్మరాజుకు-గౌడ, కాంభోజ దేశాధీశులు రకరకాల రంగుల కంబళ్ళను, చిలుకవన్నె గుర్రాల సమూహాలను తెచ్చి ఇచ్చారు.

ఉ. సాగరసారవారిరుహ శౌక్తిక మౌక్తిక విద్రుమద్రుమై
లాగురు చందనంబులు ప్రియంబున నిచ్చిరి తెచ్చి యున్నత
శ్రీగుణయుక్తిమైఁ బరఁగు సింహళకేరళచోళపాండ్యదే
శాగతరాజపుత్త్రులు మహాగుణశాలి కజాతవైరికిన్. 110

ప్రతిపదార్థం: ఉన్నత, శ్రీ, గుణ, యుక్తిమైన్= గొప్ప ఐశ్వర్యంతో, సుగుణాల కూడికతో; పరఁగు= ఒప్పే; సింహళ, కేరళ, చోళ, పాండ్య, దేశ+ఆగత, రాజ, పుత్త్రులు= సింహళ, కేరళ, చోళ, పాండ్య దేశాలనుండి వచ్చిన రాజకుమారులు; మహాగుణశాలికిన్= గొప్పగుణాలు కలవానికి; అజాతవైరికిన్= పుట్టని శత్రువులు గలవానికి- అంటే ధర్మరాజుకు; సాగర, సార, వారిరుహ, శౌక్తిక, మౌక్తిక, విద్రుమ, ద్రుమ+ఏలా+అగురు, చందనంబులు= సముద్రపునీటినుండి పుట్టిన ముత్యపుచిప్పల్లోని మంచిముత్యాలను, పగడపు చెట్లను, ఏలకులను, అగురు చెక్కలను, గంధపు చెక్కలను; ప్రియంబునన్= ప్రీతితో; తెచ్చి; ఇచ్చిరి.

తాత్పర్యం: గొప్ప ఐశ్వర్యం, గుణాలు ఉన్న సింహళ కేరళ చోళ పాండ్య దేశరాజులు- మహాగుణవంతుడు, అజాతశత్రుడు అయిన ధర్మరాజుకు- మంచి ముత్యాలను, పగడపు చెట్లను, ఏలకులను, అగరుచెక్కలను, గంధపుచెక్కలను ప్రీతితో తెచ్చి ఇచ్చారు.

విశేషం: అలం: ఉదాత్తం. నన్నయ అక్షర రమ్యమైన శైలికి ప్రసాదగుణరచనకు ఈ పద్యమొక చక్కని ఉదాహరణ. 'సాగరసార .... ప్రియంబున నిచ్చిరి తెచ్చి' అనే సుదీర్ఘ సమాసాన్ని చదివినంతనే, అర్థం వివరంగా తెలియకున్నా, ఏవో గొప్ప గొప్ప వస్తువులను విస్తారంగా తెచ్చియిచ్చారనే భావం మాత్రం పాఠకునికి స్ఫురిస్తుంది. పాశ్చాత్య సాహిత్య విమర్శకులు దీనినే **Sound Echoing the Sense** అంటారు.

ఉ. మందిత సూర్యరశ్మి రుచిమన్మణిహారచయంబుతోఁ గట
స్యంది సుగంధిదాన జల సంపద నొప్పెడు వాని దేవకీ
నందనుఁ డిచ్చెఁ బ్రీతిఁ బదునాలుగువేలుగజంబులన్ జనా
నందనకీర్తియైన యమనాథతనూజున కిష్టమిత్త్రుఁడై. 111

ప్రతిపదార్థం: దేవకీనందనుఁడు= దేవకీదేవి కుమారు డైన శ్రీకృష్ణుడు; జన+ఆనందన, కీర్తి+ఐన= జనులకు ఆనందాన్ని కలిగించే కీర్తి కలవాడైన; యమనాథ, తనూజునకున్= యమధర్మరాజు కుమారుడైన ధర్మరాజుకు; ఇష్ట, మిత్త్రుఁడు+ఐ= ప్రియమైన స్నేహితుడై; మందిత, సూర్యరశ్మి, రుచిమత్+మణిహార, చయంబుతోన్= సూర్యకాంతినే వెలవెలపోయేటట్లు చేసే కాంతి ఉన్న మణిహార సమూహాలతో; కట, స్యంది, సుగంధి, దానజల, సంపదన్= చెక్కిళ్ళనుండి జాలువారుతున్న పరిమళ మదజలంయొక్క అతిశయంతో, ఒప్పెడు, వానిన్; పదునాలుగువేలు; గజంబులన్= ఏనుగులను; ప్రీతిన్= ప్రేమతో; ఇచ్చెన్.

తాత్పర్యం: దేవకీదేవి కుమారుడైన శ్రీకృష్ణుడు, యమధర్మరాజు కుమారుడైన ధర్మరాజుకు ప్రియమిత్రుడై - సూర్యరశ్మినే వెలవెల పోయేటట్లు చేసేకాంతిఉన్న మణిహార సమూహాలతో, చెక్కిళ్ళనుండి మిక్కిలిగా జాలువారుతున్న పరిమళ మదజలంతో ఒప్పే పదునాలుగు వేల ఏనుగులను ప్రియమార ఇచ్చాడు.

విశేషం: ఈ పద్యంకూడ అక్షరరమ్యమైన నన్నయ ఉదాత్త మనోహర శైలికి ప్రసాద గుణ రచనకు ఒక చక్కని ఉదాహరణ. అలం. ఉదాత్తం.

క. హరియును గిరీటియును నొం । డొరుల కభీష్టములు సలుపుచుండుదు రంద
య్యిరువురు నేకాత్ములు జన । శరణ్యు లుత్తములు నిత్యసాంగత్యమునన్. 112

ప్రతిపదార్థం: అందున్= అక్కడ - ఇంద్రప్రస్థంలో; హరియును= శ్రీకృష్ణుడును; కిరీటియును= అర్జునుడును; ఒండొరులకున్= ఒకరికొకరు; అభీష్టములు= ప్రియములు; సలుపుచున్+ఉండుదురు= చేస్తూ ఉన్నారు; ఆ+ఇరువురు= ఆ కృష్ణార్జును లిద్దరు; నిత్య, సాంగత్యమునన్= ఎడతెగని కలయికచేత; ఏక+ఆత్ములు= ఒకే మనస్సు కలిగిన వాళ్ళు; జన, శరణ్యులు= జనులకు శరణు పొందదగినవాళ్ళు; ఉత్తములు= శ్రేష్ఠులు.

తాత్పర్యం: ఒకే మనస్సు కలవాళ్ళు, జనులంతా శరణు వేడదగిన వాళ్ళు, ఉత్తములు - అయిన కృష్ణార్జునులు రాజసూయంలో ఒకరికొకరు ఇష్టమైన పనులు చేస్తూ అగుపించారు.

వ. మఱియు నయ్యుధిష్ఠిరున కనురక్తుండయి విరాటుండు రెండువేలు గజంబుల నిచ్చె; ద్రుపదుండు వేయి గజంబులను బదివేలు హయంబులను బదునాలుగువేలు విలాసినీజనంబులం బదివేలు దాసీ గృహస్థుల నిచ్చెఁ; గురు కుకురోలూక కేకయ కాశ్మీర కాంభోజ గాంధార మద్ర ద్రవిడ మగధ మాళవ కళింగాంగ వంగ బంగాళగౌడాంధ్రకేరళకోసలాది మహీపతులునుం బ్రాగ్జ్యోతిషంబున భగదత్తుండును మరుకచ్ఛనివాసులును జేదిపతులును నాజానేయ బాహ్లిక హూణ పారసీయ దేశంబులం గల హయంబులం బర్వతనిభంబులైన యిభంబులను దివ్యాంబరాభరణ భూషితంబులయిన యోషిత్సహస్రంబులను నపరిమితంబులయిన యజావి గో మహిషంబులను హిరణ్య రత్నరజత కంబళాంబరాదుల నిచ్చిరి; మఱియు మేరుమందరమధ్య కీచక వనవాసులయిన గుళింద పారద బర్బర తురుష్క టెంకణ కోంకణాధిపతులును వశగతులై హిమశైల రామశైల కురుదేశంబులైన కౌసుమ క్షౌద్ర పాత్రంబులను దివ్యౌషధంబులను నింద్ర నీలేంద్ర గోప పిక చంద్ర మయూర కీర వర్ణ తురంగంబులను సౌవర్ణ కీటజ పట్టజాండజ శయ్యలను నిశిత దీర్ఘ నిస్త్రింశంబులను మణి కాంచన ఖచిత గజ దంతమయ శిబికాసనంబులను నిచ్చిరి; వాసవ సఖుండయిన గంధర్వపతి చిత్రరథుం డనువాఁడు నన్నూఱు గంధర్వ హయంబుల నిచ్చెఁ; దుంబురుండను గంధర్వుండు నూఱు హయంబుల నిచ్చె. 113

ప్రతిపదార్థం: మఱియున్; ఆ+యుధిష్ఠిరునకున్= ఆ ధర్మరాజుకు; అనురక్తుండు+అయి= ప్రేమకలవాడై; విరాటుండు; రెండువేలు; గజంబులన్= ఏనుగులను; ఇచ్చెన్; ద్రుపదుండు; వేయి; గజంబులన్= ఏనుగులను; ఇచ్చెన్; పదివేలు; హయంబులను= గుర్రాలను; పదునాలుగువేలు; విలాసినీజనంబులన్= వేశ్యలను; పదివేలు; దాసీ, గృహస్థులన్= దాసీకుటుంబాలవాళ్ళను; ఇచ్చెన్; కురు, కుకుర+ఉలూక, కేకయ, కాశ్మీర, కాంభోజ, గాంధార, మద్ర, ద్రవిడ, మగధ, మాళవ, కళింగ+అంగ, వంగ, బంగాళ, గౌడ+ఆంధ్ర, కేరళ, కోసల+ఆది, మహీపతులునున్= కురు, కుకుర, ఉలూక, ఆది, రాజులును; ప్రాక్+జ్యోతిషంబునన్= ప్రాగ్జ్యోతిషమనే దేశంలో; భగదత్తుండును; మరుకచ్ఛనివాసులును= మరుకచ్ఛ ప్రదేశంలో నివసించేవాళ్ళూ; చేది పతులునున్= చేదిదేశరాజులూ; ఆజానేయ, బాహ్లిక, హూణ, పారసీయ, దేశంబులన్= ఆయాదేశాలలో; కల= ఉన్న; హయంబులన్= గుర్రాలను; పర్వత నిభంబులు+ఐన= పర్వతంతో సమానాలైన; ఇభంబులను=

ఏనుగులను; దివ్య+అంబర+ఆభరణ, భూషితంబులు+అయిన= మంచి వస్త్రాలతో, సొమ్ములతో అలంకరించబడిన; యోషిత్‌సహస్రంబులనున్= వేలకొలది స్త్రీలను; అపరిమితంబులు+ఐన= లెక్కకు మిక్కిలి అయిన; అజ+అవి, గో, మహిషంబులను= మేకలను, గొఱ్ఱెలను, ఆవులను, బఱ్ఱెలను; హిరణ్య, రత్న, రజత, కంబళ+అంబర+ ఆదులన్= బంగారు, రత్నాలు, వెండి, కంబళ్ళు, వస్త్రాలు మొదలయిన వాటిని; ఇచ్చిరి; మఱియు; మేరు, మందర, మధ్య, కీచక, వన, వాసులు+అయిన= మేరు పర్వతానికి, మందరపర్వతానికి మధ్యనఉండే సన్నవెదుళ్ళ అడవులలో నివసించే వాళ్ళైన గుళింద, పారద, బర్బర, తురుష్క, టెంకణ, కోంకణ+అధిపతులును= ఆయాదేశాలరాజులును; వశగతులై= లొంగిపోయినవాళ్ళయి; హిమశైల, రామశైల, కురుదేశంబులు+ఐన= ఆయా దేశాలలోని; కౌసుమ, క్షౌద్ర, పాత్రంబులను= పూలసంబంధమైన తేనెతో కూడిన పాత్రలను; దివ్య+ఔషధంబులను= మంచి మందులను; ఇంద్రనీల+ఇంద్రగోప, పిక, చంద్ర, మయూర, కీర, వర్ణ, తురంగంబులను= ఇంద్రనీలమణి, ఆరుద్రపురుగు, కోకిల, చంద్రుడు, నెమలి, చిలుక రంగులు కల గుర్రాలను; సౌవర్ణ, కీటజ, పట్టజ+అండజ, శయ్యలను= బంగారు మయములై, పురుగునుండి పుట్టిన - అంటే పట్టు పురుగుల వంటి పురుగులనుండి పుట్టిన మెత్తని పదార్థంతో; చెట్ల బెరడులనుండి పుట్టిన మెత్తని పదార్థంతో, గుడ్డునుండి పుట్టిన పక్షుల ఈకలవంటి మెత్తని పదార్థంతో రూపొందించిన పరుపులను; నిశిత, దీర్ఘ, నిస్త్రింశంబులను= వాడియై, పొడవైన ఖడ్గాలను; మణి, కాంచన, ఖచిత, గజ, దంతమయ, శిబికా+ఆసనంబులను= మణులు బంగారు పొదుగబడిన ఏనుగు దంతాలతో రూపొందించబడిన పల్లకీలను, పీఠాలను; ఇచ్చిరి; వాసవసఖుండు+అయిన, గంధర్వపతి= దేవేంద్రుని స్నేహితుడైన గంధర్వరాజు; చిత్రరథుండు+అనువాఁడు; నన్నూఱు(నాలుగు+నూఱు), గంధర్వ, హయంబులన్= నాలుగు వందల గంధర్వజాతి గుర్రాలను; ఇచ్చెన్; తుంబురుండు+అను; గంధర్వుండు; నూఱు, హయంబులన్; ఇచ్చెన్.

తాత్పర్యం: అంతేకాక ఆ ధర్మరాజుపట్ల ప్రేమ కలవాడై విరాటుడు రెండువేల ఏనుగులను ఇచ్చాడు. ద్రుపదుడు వెయ్యి ఏనుగులను, పదివేల గుర్రాలను, పద్నాలుగువేలమంది వేశ్యలను, పదివేల దాసీకుటుంబాలవాళ్ళను ఇచ్చాడు. కురు, కుకుర ఉలూకాది దేశ ప్రభువులు, ప్రాగ్జ్యోతిష దేశాధిపతి భగదత్తుడు, మరుకచ్ఛ నివాసులు, చేది దేశరాజులు పేరుపొందిన ఆజానేయ బాహ్లిక హూణ పారసీక దేశాల గుర్రాలను, కొండలతో సమానాలైన మదపుటేనుగులను, మంచి వస్త్రాలతో, సొమ్ములతో అలంకరించబడిన వేలకొలది స్త్రీలను, లెక్కకు మిక్కిలిగా మేకలను, గొర్రెలను, ఆవులను, బర్రెలను, బంగారు, రత్నాలు, వెండి, కంబళ్ళు, వస్త్రాలు మొదలయిన వాటిని ఇచ్చారు. అంతేగాక మేరు మందర పర్వతాల మధ్య ఉండే సన్నవెదుళ్ళ అడవుల్లో నివసించే గుళింద, పారద, బర్బర, తురుష్క, టెంకణ, కోంకణ దేశప్రభువులు లొంగిపోయినవాళ్ళయి హిమశైల, రామశైల, కురుదేశాల్లోని పూలతేనెతో కూడిన పాత్రలను, మంచి మందులను, ఇంద్రనీలమణి, ఆరుద్రపురుగు, కోకిల, చంద్రుడు, నెమలి, చిలుక రంగులు గల గుర్రాలను, బంగారు మయాలై పట్టుపురుగువంటి పురుగులనుండి పుట్టిన పట్టు వంటి మెత్తని పదార్థంతో, చెట్లబెరడులనుండి పుట్టిన మెత్తని పదార్థంతో, గ్రుడ్డునుండి పుట్టిన పక్షుల ఈకలవంటి మెత్తని పదార్థంతో రూపొందించిన పాన్పులను, వాడిగల, పొడవైన ఖడ్గాలను, మణులు బంగారు పొదుగబడిన ఏనుగుదంతాలతో రూపొందించిన పల్లకీలను, పీఠాలను ఇచ్చారు. దేవేంద్రుడి స్నేహితుడైన గంధర్వరాజు చిత్రరథుడు నాలుగు వందల గంధర్వజాతి గుర్రాలను ఇచ్చాడు. తుంబురుడనే గంధర్వుడు వంద గుర్రాలను ఇచ్చాడు.

విశేషం: బహుశః లోకంలో దుర్యోధనుని వంటి ఈర్ష్యాగ్రస్తులే దాయాదుల ఐశ్వర్యాన్ని ఇంతగా లెక్కించి గుర్తుంచుకోగలరేమో! దేశాల పేర్ల విషయంలో కొన్ని ప్రతుల్లో భేదాలున్నాయి. ఆంధ్ర కేరళ తురుష్కరాజులు ఆకాలంలో ఉన్నారా? ఇవి నన్నయ చేర్చినవే. మూలంలో లేవు. (ధర్మరాజుకు కానుకలుగా వచ్చిన ఈ వివరాలను రాజసూయం జరిగిన ఘట్టంలో వివరించకుండా

దుర్యోధనుడు ధృతరాష్ట్రునికి నివేదించటంలో కథాకథన శిల్పం ఉంది. అప్పుడు చెప్పినట్లైతే ఈ వివరాలు కథలో మునిగిపోయేవి. ఇప్పుడు చెప్పటంవల్ల దుర్యోధనుని అసూయకు గల బలమైన హేతువును చెప్పినట్లయింది. ధర్మరాజు కావాలని దుర్యోధనునికి బహుమతులను స్వీకరించే బాధ్యత ఎందుకు ఇచ్చాడో తేటతెల్లమయింది. ఆత్మీయుడైతే దుర్యోధనుడు ఆ సంపదను చూచి హర్షించేవాడు. దాయాది, అసూయాగ్రస్తుడు కావటంచేత భరించలేకపోతున్నాడు. ఈ వివరాలవల్ల పాండవుల ఔన్నత్యం, దుర్యోధనుని దుష్టత్వం ధ్వనిస్తున్నాయి. మరొక విశేషం - ధర్మరాజు మాయాద్యూతంలో సంపదలను కోల్పోయినప్పుడు ఈ వివరాలు ఇవ్వవలసిన అవసరంకూడా తప్పింది. ఇదంతా నన్నయ కథను చెప్పటంలో సాధించిన అర్థసంయోజనం. -సంపా.)

ఉ. భావిపురాతనాద్యతనపార్థివలక్ష్ములు పాండవేయు ల
క్ష్మీ విభవంబుతోడ నుపమింప సమంబులు గా వశేష రా
జావళిలోన నత్యధికులైన సపత్నులపేర్మిఁ జూచి యేఁ
జూవె సహింపనోపక కృశుండ వివర్ణుఁడ నైతి నెంతయున్. 114

ప్రతిపదార్థం: భావి, పురాతన+అద్యతన, పార్థివ, లక్ష్ములు= రాబోయే కాలంలోని, గతించిన కాలంలోని, వర్తమాన కాలంలోని రాజులయొక్క ఐశ్వర్యాలు; పాండవేయు, లక్ష్మీ, విభవంబుతోడన్= ధర్మరాజు ఐశ్వర్యంయొక్క గొప్పతనంతో; ఉపమింపన్= పోల్చటానికి; సమంబులు= సమానాలు; కావు, అశేష, రాజ+ఆవళిలోనన్= అందరు రాజులయొక్క సమూహంలో; అతి+అధికులు+ ఐన= మిక్కిలి గొప్పవాళ్ళయిన; సపత్నుల పేర్మిన్= దాయాదులయొక్క ఆధిక్యాన్ని; చూచి; ఏన్= నేను; చూవె= చూడుమా (సుమా) సహింపన్+ఓపక= ఓర్వలేక; ఎంతయున్= మిక్కిలి; కృశుండన్= చిక్కిపోయినవాణ్ణి; వివర్ణుఁడన్= కళావిహీనమైనవాణ్ణి; అయితిన్= అయ్యాను.

తాత్పర్యం: భూత భవిష్య ద్వర్తమానాల్లోని రాజుల ఐశ్వర్యా లేవీ ధర్మరాజు ఐశ్వర్యాతిశయంతో పోల్చటానికి సమానాలు కావు. సకలరాజసమూహంలో మిక్కిలి గొప్పవాళ్ళయిన దాయాదుల అతిశయం చూచి ఓర్వలేక నే నెంత కృశించానో, ఎంత కళావిహీనుణ్ణి అయ్యానో చూడు.

విశేషం: ఇది దుర్యోధనుడు తన అసూయను స్పష్టం చేసిన పద్యం: అసూయ కర్రకు అంటుకొన్న నిప్పులాంటిది. అది ఎదుటివాళ్ళను కాల్చే మాట ఎలా ఉన్నా మొదట ఆ కర్రను మాత్రం కాల్చక మానదు. దుర్యోధనుడు కృశించటం వెలవెలపోవటం ఇలాంటిదే. (ఈ పద్యరచనలోని దీప్తరసత్వం, ఔజ్జ్వల్యం కాంతిగుణాన్ని కమనీయంగా రూపొందించాయి. - సంపా.)

ఆ. ఒక్క లక్ష భూసురోత్తముల్ గుడిచిన । మొనసి తనకుఁ దాన మ్రోయు శంఖ;
మొక్క నిమిషమేని యుడుగక మ్రోసె న । య్యధ్వరోత్సవంబు నన్నినాళ్ళు. 115

ప్రతిపదార్థం: ఒక్క, లక్ష, భూసుర+ఉత్తముల్= ఒక లక్షమంది బ్రాహ్మణశ్రేష్ఠులు; కుడిచినన్= భోజనంచేస్తే; మొనసి= పూనుకొని; తనకు తాను+అ= తనంతటతటా తానే; మ్రోయు, శంఖము; ఆ+అధ్వర+ఉత్సవంబు, అన్నినాళ్ళు= ఆ రాజసూయయాగం జరిగినన్ని రోజులు; నిమిషము+ఏనిన్= క్షణంకూడా; ఉడుగక= మానక; మ్రోసెన్= మ్రోగింది.

తాత్పర్యం: ఒక లక్షమంది బ్రాహ్మణ శ్రేష్ఠులు భోజనంచేస్తే తనకు తానై మ్రోగే శంఖం, ఆ రాజసూయ మహోత్సవం జరిగినన్ని రోజులు ఒక్క నిమిషమైనా ఆగకుండా మ్రోగింది.

సీ. **జన్నంబు చూడంగ సకలభూములనుండి । వచ్చిన రాజన్యవరుల నవని**
సురులను వైశ్యుల శూద్రుల నాత్మీయ । బంధుసుహృద్వీరభటనియోగ
జనులను బేదల సాధుల నిత్యంబుఁ । దాన పరీక్షించి, తగ వెఱింగి,
యన్నంబు దయఁ బెట్టి, యందఱుఁ గుడిచినఁ । దనుమధ్య యర్ధరాత్రంబు నపుడు

ఆ. **గాని కుడువదట్టె కమలాక్షి ద్రౌపది; । యదియుఁగాక యమ్మహాధ్వరమున**
నధముఁ డయ్యుఁ గడుఁబ్రియంబున నభ్యర్చి । తుండ కాని వంచితుండు లేఁడు. **116**

ప్రతిపదార్థం: తనుమధ్య= సన్నని నడుంగలది; కమల+అక్షి= కమలంవంటి కన్నులు కలది అయిన ద్రౌపది; జన్నంబు= ఆ రాజసూయ యజ్ఞం; చూడంగన్= చూడటానికి; సకల భూముల నుండి= అన్ని దేశాలనుండి; వచ్చిన; రాజన్య, వరులన్= రాజశ్రేష్ఠులను; అవనిసురులను= బ్రాహ్మణులను; వైశ్యులన్; శూద్రులన్; ఆత్మీయ, బంధు, సుహృత్+వీరభట, నియోగజనులను= దగ్గరిబంధువులను, స్నేహితులను, వీరభటులను ఆయాపనుల్లో నియమించిన పరిచారకులను; పేదలన్; సాధులన్; నిత్యంబున్= ప్రతిదినము; తాన= తానే; పరీక్షించి; తగవు+ఎఱింగి= తగినవిధం తెలుసుకొని; దయన్= దయతో; అన్నంబు; పెట్టి; అందఱున్; కుడిచినన్= భోజనంచేసిన తర్వాత; అర్ధరాత్రంబు, అపుడుగాని= అర్ధరాత్రి సమయంలో గాని; కుడువదు+అట్టె= తాను తృప్తిగా భుజింపదు; అదియున్, కాక= అంతేగాక; ఆ+మహా+అధ్వరమునన్= ఆ మహాయజ్ఞంలో; అధముఁడు+అయ్యున్= తక్కువవాడైనా; కడున్= మిక్కిలి; ప్రియంబునన్= ప్రీతితో; అభ్యర్చితుండు+అ కాని= పూజింపబడినవాడే కాని; వంచితుండు= కోరుకున్నది లభించనివాడు; లేఁడు.

తాత్పర్యం: ద్రౌపదీదేవి అన్నిదేశాలనుండి రాజసూయయాగం చూడటానికి వచ్చిన రాజశ్రేష్ఠులను, బ్రాహ్మణులను, వైశ్యులను, శూద్రులను, దగ్గరిబంధువులను, స్నేహితులను, వీరభటులను, పనివాళ్ళను, పేదలను, బైరాగులను ప్రతిదినం తానే స్వయంగా విచారించి తగిన రీతిగా, దయతో అన్నంపెట్టి, అందరూ భుజించిన తర్వాత అర్ధరాత్రి కాని తాను తృప్తిగా భుజించదు. అంతేకాదు, ఆ మహాయాగంలో అధముడు కూడ ప్రేమతో పూజలందుకొన్నాడుగాని- కోరుకొన్నది లభించనివాడు ఒక్కడైనా లేడు.

విశేషం: రాజసూయంలో జరిగిన అన్నదానం, ఆ అన్నదాన కార్య నిర్వాహకురాలుగా ఆ ద్రౌపదీదేవి వెలిగిన వెలుగు, దుర్యోధనునికి కన్ను కుట్టించాయి. మిత్రుడు అభిమానంతో చేసే ప్రశంసకంటె శత్రువు అసూయతోనైనా చేసే ప్రశంస సత్యమైనది. ప్రశస్తమైనది.

క. **ధరణి హరిశ్చంద్రుఁడు భా । సురయశుఁ డయి చేసె రాజసూయం; బదియున్**
సరిగా దని యే వగతును । సురుచిరవిభవమునఁ బాండుసుతుయజ్ఞముతోన్. **117**

ప్రతిపదార్థం: ధరణిన్= భూమిమీద; హరిశ్చంద్రుఁడు; భాసుర, యశుఁడు+ఐ= ప్రకాశించే కీర్తి కలవాడై; రాజసూయంబు; చేసెన్; అదియున్= ఆ రాజసూయంకూడ; సురుచిరవిభవమునన్= మిక్కిలి ఒప్పయిన వైభవంలో; పాండుసుతుయజ్ఞముతోన్= పాండురాజుకుమారుడైన ధర్మరాజుయాగంతో; సరిగాదు+అని= సమానం కాదని; ఏన్= నేను; వగతును= చింతిస్తాను.

తాత్పర్యం: ఈ భూమిమీద హరిశ్చంద్రుడు గొప్ప కీర్తిమంతుడై రాజసూయం చేశాడు. కాని వైభవంలో అది కూడ ధర్మరాజు చేసిన రాజసూయయాగంతో సరిగా దని నేను చింతిస్తున్నాను.

వ. **అట్టి రాజసూయాధ్వరంబున నవభృథసమయంబునందు బ్రహ్మర్షి రాజర్షి లోకపాలపరివృతుం డయిన మహేంద్రుండునుం బోలె నున్న ధర్మతనయు నారదపారాశర్యాదిమహామునిసమేతుండయి ధౌమ్యుం డశేషతీర్థజలంబుల నభిషిక్తుం జేసిన.** **118**

ప్రతిపదార్థం: అట్టి= అటువంటి, రాజసూయ+అధ్వరంబునన్= రాజసూయ యాగంలో; అవభృథ, సమయంబునందున్; బ్రహ్మర్షి, రాజర్షి, లోకపాల, పరివృతుండు+అయిన= బ్రహ్మర్షులచేత, రాజర్షులచేత, దిక్పాలురచేత కొలువబడి ఉన్న; మహా+ఇంద్రుండునున్, పోలెన్= దేవేంద్రునివలె; ఉన్న; ధర్మతనయున్= ధర్మరాజును; నారద, పారాశర్య+ఆది, మహాముని, సమేతుండు+అయి= నారదుడు, పరాశరుని కుమారుడు వేదవ్యాసుడు మొదలైన మహామునులతో కూడినవాడై; ధౌమ్యుండు; అశేష, తీర్థ, జలంబులన్= అన్ని పుణ్యనదుల జలాలచేత; అభిషిక్తున్+చేసినన్= అభిషేకించబడినవాణ్ణిగా చేయగా.

తాత్పర్యం: అలాంటి రాజసూయయాగం చివర చేసే అవభృథస్నానసమయంలో - పాండవ పురోహితుడు ధౌమ్యుడు, నారద వ్యాసాది మహర్షులతో కలిసి - బ్రహ్మర్షులు, రాజర్షులు, దిక్పాలకులు కొలుస్తున్న ఇంద్రునిలా వెలుగుతున్న ధర్మరాజును, అన్ని పుణ్యనదుల జలాలతో అభిషేకించాడు.

సీ. **అభిషిక్తుడయిన యయ్యమరాజసుతునకు । సాత్యకి మౌక్తికచ్ఛత్ర మొప్పఁ**
బట్టె; భీముండును బార్థుండు మణిహేమ । దండ చామరయుగధారు లయిరి;
కమలనాభుండును గవలును ద్రుపదేశ । పుత్త్రుండు వేర్వేఱ భూమిపతుల
మూర్ధాభిషిక్తుల మ్రొక్కించుచుండిరి । దర్పంబు వెలయంగ; దానిఁ జూచి

ఆ. **యేను మొదలుగా మహీపతు లెల్లను । దీప్తిఁ దఱఁగి యుండఁ దివిరి మమ్ము**
నగిరి కృష్ణ పాండునందన ద్రౌపదీ । సాత్యకులుఁ గరంబు సంతసమున. **119**

ప్రతిపదార్థం: అభిషిక్తుఁడు+అయిన= అభిషేకించబడిన; ఆ+యమరాజ, సుతునకున్; సాత్యకి; మౌక్తికచ్ఛత్రము= ముత్యాలగొడుగు; ఒప్పన్= అందంగా; పట్టెన్= పట్టాడు; భీముండును; పార్థుండు= అర్జునుడు; మణిహేమదండ, చామర, యుగ, ధారులు+అయిరి= మణులు పొదగబడిన బంగారుకాడలు గల చామరాల జంటను ధరించిన వాళ్ళయ్యారు; కమలనాభుండును= శ్రీకృష్ణుడును; కవలును= నకుల సహదేవులును; ద్రుపద+ఈశ, పుత్త్రుండును= ద్రుపదరాజుయొక్క కుమారుడైన ధృష్టద్యుమ్నుడును; వేఱు+వేఱ; మూర్ధ+అభిషిక్తులన్= పట్టాభిషిక్తులైన; భూమిపతులన్= రాజులను; దర్పంబు= గర్వం; వెలయంగన్= ప్రకాశిస్తుండగ; మ్రొక్కించుచున్+ఉండిరి; దానిన్; చూచి; ఏను= నేను; మొదలుగ; మహీపతులు+ఎల్లన్= రాజులందరు; దీప్తి= కాంతి; తఱఁగి= తగ్గి; ఉండన్= ఉండగా; తివిరి= ప్రయత్నించి - అంటే పనికట్టుకొని; కృష్ణ, పాండునందన, ద్రౌపదీ, సాత్యకులు= శ్రీకృష్ణుడు, పాండవులు, ద్రౌపది, సాత్యకి; కరంబు= మిక్కిలి; సంతసమునన్= సంతోషంతో; మమ్మున్, నగిరి= మమ్మల్ని చూచి నవ్వారు.

తాత్పర్యం: రాజసూయంలో అభిషిక్తుడైన ఆ ధర్మరాజుకు సాత్యకి ముచ్చటగా ముత్యాలగొడుగు పట్టాడు. భీమార్జునులు మణులు పొదిగిన బంగారుకాడలున్న చామరాల జంటను ధరించి చెరొకవైపు నిలిచారు. శ్రీకృష్ణుడు, నకులసహదేవులు, ద్రుపదరాజ పుత్రుడైన ధృష్టద్యుమ్నుడు పట్టాభిషిక్తులయిన రాజు లందరిని వేరువేరుగా కొనిపోయి ధర్మరాజుకు మ్రొక్కించారు. ఆ వైభవాన్ని చూచి నేను, తక్కిన రాజులు వెలవెలబోతూ ఉంటే, శ్రీకృష్ణుడు, పాండవులు, ద్రౌపది, సాత్యకి అదే పనిగా ఆనందాతిశయంతో మమ్మల్ని చూచి నవ్వారు.

విశేషం: దాయాది అయిన ధర్మరాజు వైభవంతోపాటు, శ్రీకృష్ణపాండునందన ద్రౌపదీసాత్యకుల నవ్వుకూడ ఈ దుర్యోధనుని హృదయంలో గాఢంగా గ్రుచ్చుకొన్నది.

వ. మఱియు నయ్యుధిష్ఠిరుండు. 120

తాత్పర్యం: అంతేకాక ఆ ధర్మరాజు.

సీ. 'అనఘుఁడై యెనుబది యెనిమిది వేవురు । బ్రాహ్మణ ప్రవరుల బ్రహ్మవిదుల
వెలయంగ నల్లిండ్ల నిలిపి, ప్రత్యేకంబ । ముప్పండ్రు దాసుల నొప్ప నిచ్చి
ముదముతో రక్షించుఁ, బదివేవురుత్తమ । భూసురు లతని యగ్రాసనమునఁ
గలధౌతమయ పాత్రములఁ బ్రతిదినమును । గుడువను గట్టను దొడువఁ బూయ

ఆ. ననుభవింపఁ గలుగు టది యేమి పురుషార్థ । మయ్య; కష్టపురుషు నట్లు లొరుల
పేర్మిఁ జూచుచుండఁ బెద్దయు నే నోప' । ననినఁ బతికి నిట్లు లనియె శకుని. 121

ప్రతిపదార్థం: అనఘుఁడు+ఐ= పాపరహితుడై; ఎనుబది, ఎనిమిదివేవురు, బ్రాహ్మణ, ప్రవరులన్= ఎనభై యెనిమిది వేలమంది బ్రాహ్మణశ్రేష్ఠులను; బ్రహ్మవిదులన్= బ్రహ్మజ్ఞాన సంపన్నులను; వెలయంగన్= ఒప్పునట్లుగా; నల్లిండ్లన్= అగ్రహారాల్లో; నిలిపి; ప్రత్యేకంబ; ముప్పండ్రు, దాసులన్= ముప్పదేసిమంది సేవకులను; ఒప్పన్= తగురీతిగా; ఇచ్చి; ముదముతోన్= సంతోషంతో; రక్షించున్= రక్షిస్తున్నాడు; పదివేవురు, ఉత్తమ, భూసురులు= పదివేలమంది ఉత్తమ బ్రాహ్మణులు; అతని= ఆ ధర్మరాజుయొక్క; అగ్ర+ఆసనమునన్= ఉన్నతమైన పీఠంలో; కలధౌతమయ, పాత్రములన్= వెండి లేదా బంగారుతో చేయబడిన పాత్రలలో; ప్రతిదినమును; కుడువను= భుజించటాన్ని; కట్టను= వస్త్రాలు కట్టటాన్ని; తొడువను= సొమ్ములుఅలంకరించుకొనటాన్ని; పూయన్= మైపూతలు పూసుకొనటాన్ని; అనుభవింపన్+కలుగుట; అది; ఏమి; పురుష+అర్థము+అయ్య= మానవ జీవిత సార్థకత అయ్యా? కష్టపురుషున్+అట్టుల= హీనస్థితిలో ఉన్న మానవుడివలె; ఒరుల= ఇతరులయొక్క; పేర్మిన్= గొప్పతనాన్ని; చూచుచున్; ఉండన్; పెద్దయున్= ఎక్కువగా; ఏన్= నేను; ఓపన్= సహించను; అనినన్= అనిఅనగా; శకుని; పతికిన్= దుర్యోధనుడికి; ఇట్టుల+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: 'పుణ్యాత్ముడైన ఆ ధర్మరాజు ఎనభైఎనిమిదివేలమంది బ్రహ్మజ్ఞాన సంపన్నులైన బ్రాహ్మణ శ్రేష్ఠులను అగ్రహారాల్లో నిలిపి, వాళ్ళకు ముప్పదేసిమంది సేవకుల నిచ్చి, సంతోషంతో రక్షిస్తూ, పదివేలమంది బ్రాహ్మణులను ప్రతిదినం తన ప్రక్కన కూర్చుండ బెట్టుకొని భోజనం పెడుతూ, వాళ్ళకు బట్టలు, సొమ్ములు, మైపూతలు ఇచ్చి అనుభవింప జేయ గలగటం జీవితంలో ఎంతధన్యత! నేను హీనస్థితిలో ఉన్న మానవునిలా ఇతరుల గొప్పతనాన్ని చూచి అట్టే సహించి ఉండలేను' అని దుర్యోధనుడు అనగా అతనితో శకుని ఇలా అన్నాడు.

విశేషం: దానధర్మాలు కూడ వ్యక్తివైభవానికి అలంకారాలే. ప్రత్యర్థులకు అసహనహేతువులే. ఈర్ష్యాగుణం దుర్యోధనునికి తల్లిగర్భంనుండే సంక్రమించినట్లుంది. అది పాండవుల రాజసూయవైభవం చూచిన తరువాత పరాకాష్ఠ చెందింది. కురుపాండవ సఖ్యానికి తావులేకుండా చేసింది. సాక్షాత్తు చక్రధరుని సంధిప్రయత్నాన్నే చెడగొట్టింది. మహాభారత సంగ్రామానికి దారితీసింది; సర్వనాశనానికి కారణమయింది.

క. భానుప్రభుఁ డగు పాండుమ । హీనాథాత్మజులలక్ష్మి యెల్లను నీకున్
నే నపహరించి యిత్తు ధ । రానుత! మాయాదురోదరవ్యాజమునన్. 122

ప్రతిపదార్థం: ధరానుత= భూమిలోని ప్రజలచే కొనియాడబడేవాడా - ఓ దుర్యోధనా!; భానుప్రభుఁడు+అగు= సూర్యునితో సమానమైన తేజస్సు కలవాడయిన; పాండు మహీనాథ+ఆత్మజుల, లక్ష్మి= పాండు భూపతి కుమారులైన పాండవులయొక్కఐశ్వర్యం; ఎల్లను= అంతా; నీకున్; ఏను= నేను; మాయా, దురోదర, వ్యాజమునన్= మోసపు జూదం నెపంతో; అపహరించి= దోచి; ఇత్తున్= ఇస్తాను.

తాత్పర్యం: లోకం కొనియాడే ఓదుర్యోధనా! సూర్యునితో సమానమైన తేజస్సుకల ఆ ధర్మరాజుఐశ్వర్యాన్నంతా మాయాద్యూతం నెపంతో నీకు అపహరించి ఇస్తాను.

వ. 'ధర్మతనయుండు జూదంబునకుఁ బ్రియుండు గాని యందుల యుక్కివం బెఱుంగం; డే నక్షవిద్యయం దతి దక్షుండ; నాతని నశ్రమంబున నోడించి తదీయ రాజ్యవిభూతి నీ కిచ్చెద; వగవకుండు' మని పలికిన శకుని పలుకులకు సంతసిల్లి దుర్యోధనుండు దండ్రిపాదంబులపయిం బడి మ్రొక్కి 'యీ శకునిమతంబున కొడంబడవలయు' ననినఁ గొడుకునకు ధృతరాష్ట్రుం డి ట్లనియె. 123

ప్రతిపదార్థం: ధర్మతనయుండు= ధర్మరాజు; జూదంబునకున్; ప్రియుండు; కాని; అందుల= ఆ జూదంలోని; ఉక్కివంబు= కపటం; ఎఱుంగండు= తెలియడు; ఏన్= నేను; అక్షవిద్యయందున్= పాచికలాడటంలో; అతిదక్షుండన్= మిక్కిలి నేర్పరిని; ఆతనిన్= ఆ ధర్మరాజును; అశ్రమంబునన్= సులభంగా; ఓడించి; తదీయ, రాజ్య, విభూతి= అతని రాజ్య సంపద అంతా, నీకున్+ఇచ్చెదన్; వగవక+ఉండుము= దుఃఖించకుండుము; అని; పలికిన; శకుని; పలుకులకున్; సంతసిల్లి; దుర్యోధనుండు; తండ్రి, పాదంబుల; పయిన్; పడి; మ్రొక్కి; ఈ, శకుని, మతంబునకున్= ఈశకునియొక్క అభిప్రాయానికి; ఒడంబడవలయున్= అంగీకరించాలి; అనినన్; కొడుకునకు; ధృతరాష్ట్రుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'ధర్మరాజుకు జూదం అంటే ఎంతో ఇష్టం. కాని అందులో ఎంతమోసం ఉంటుందో అతనికి తెలియదు. నేను ద్యూతవిద్యలో చాలా నేర్పరిని. ఆ ధర్మరాజును సులభంగా ఓడించి, అతని రాజ్యసంపదనంతా నీకిస్తా. ఎందుకు అలా దుఃఖిస్తావు' - అని శకుని అనగానే సుయోధనుడు సంతోషించాడు. తండ్రి పాదాలమీద వ్రాలాడు. 'ఈ శకుని అభిప్రాయాన్ని అంగీకరించు' అన్నాడు. అందుకు ధృతరాష్ట్రుడు ఇలా అన్నాడు.

క. ధీరమతి విదురుతోడ వి । చారింతము; వాఁడు నయవిశారదుఁడు కళా
పారగుఁడు దీర్ఘదర్శి య । పార హితారంభుఁ డుభయపక్షంబులకున్. 124

ప్రతిపదార్థం: ధీరమతి= బుద్ధిబలం కలవాడైన - అంటే మేధావి అయిన; విదురుతోడన్; విచారింతము= ఆలోచిద్దాం; వాఁడు= ఆ విదురుడు; నయ, విశారదుఁడు= నీతి, న్యాయం బాగా తెలిసినవాడు; కళాపారగుఁడు= విద్యయొక్క ఆవలిదరి చేరినవాడు - అంటే గొప్ప విద్యావంతుడు; దీర్ఘదర్శి= ముందుచూపు కలవాడు; ఉభయ పక్షంబులకున్= కురుపాండవ పక్షాలు రెండింటికి; అపార, హిత+ఆరంభుఁడు= గొప్పమేలు చేసే పూనిక కలవాడు.

తాత్పర్యం: విదురుడు మేధావి. అతనితో ఈ విషయం ఆలోచిద్దాం. అంతేకాదు. అతడు నీతికోవిదుడు. అంతేకాదు దూరదృష్టి కలవాడు. కురుపాండవ పక్షాలు రెండింటి క్షేమం కోరేవాడు.

విశేషం: శకునిపన్నాగం దుర్యోధనునికి మేలు చేసేదే. అయితే, దానికి ధృతరాష్ట్రుని ఆమోదముద్ర కావాలి. ఇది కురుపాండవ రాజ్యతంత్రంతో ముడివడి ఉంది. ధృతరాష్ట్రుడు రాజుగా, తండ్రిగా రెండు పాత్రలు నిర్వహించాలి. తండ్రిగా అతడు అనుకూలుడే, అంతకంటె అతడు రాజ్యానికి ప్రభువు. రాజనిర్ణయం మంత్రితో చర్చించి తీసుకోవాలి. విదురుని అంగీకారం. ధృతరాష్ట్రుని ప్రభుత్వముద్రకు ముఖ్యం. దుర్యోధనుడు ధృతరాష్ట్రుని స్వతంత్రనిర్ణయాన్నే కోరుతున్నాడు. కాని, తన నిర్ణయాన్నే తండ్రి ప్రభు నిర్ణయంగా ప్రకటించా లని అతని ఉద్దేశం. అయితే మంత్రిని కా దని తంత్రం సాగించటానికి ధృతరాష్ట్రునికి ధైర్యం చాలలేదు. ఆ చిత్తవృత్తికి ఈ వాక్యాలు అద్దంపట్టుతున్నాయి. (సంపా.)

వ. 'సురపతి గురుండైన బృహస్పతి సేసిన నీతిశాస్త్ర రహస్యంబులం దెవ్వరికంటె విదురుం డెంతయు విశారదుం; డాతని బుద్ధిబలంబునను నాపగేయు బాహుబలంబుననుంజేసి యీ రాజ్యతంత్రంబు వర్తిల్లుచున్నయది; గావున నవ్విదురానుమతంబున నెగడుట లగ్గగు' ననిన దుర్యోధనుం డి ట్లనియె. 125

ప్రతిపదార్థం: సుర, పతి, గురుండు+ఐన= దేవతలరాజు దేవేంద్రుని గురువైన; బృహస్పతి; చేసిన= చెప్పిన; నీతి, శాస్త్ర, రహస్యంబులందున్, ఎవ్వరికంటెన్= అందరికంటె; విదురుండు; ఎంతయున్= ఎంతో; విశారదుండు= నేర్పరి; ఆతని బుద్ధి, బలంబునను= ఆతని బుద్ధిబలంచేతను; ఆపగేయు, బాహుబలంబుననున్+చేసి= గంగాతనయుడైన భీష్ముని భుజబలంచేతను; ఈ, రాజ్యతంత్రంబు; వర్తిల్లుచున్న+అది= నడుస్తున్నది; కావునన్; ఆ+విదుర+అనుమతంబున= ఆ విదురుని సమ్మతితో; నెగడుట= నడుచుకొనటం; లగ్గు+అగున్= మేలవుతుంది; అనినన్; దుర్యోధనుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'దేవేంద్రుని గురువైన బృహస్పతి చెప్పిన నీతిశాస్త్రరహస్యాల్లో విదురుడు అందరికంటె విద్వాంసుడు. అతని బుద్ధిబలంతో, గంగాతనయుడైన భీష్మునిబాహుబలంతో ఈ హస్తినాపురరాజ్యతంత్రం నడుస్తున్నది. అందుచేత ఏదిచేసినా విదురుడి సమ్మతితో చెయ్యటం మంచిది' అని ధృతరాష్ట్రు డనగా- అందుకు దుర్యోధనుడు ఇలా అన్నాడు.

విశేషం: ధృతరాష్ట్రుని పుత్రమమకారం 'ఈపాడుబుద్ధి నీ కేల' అని గట్టిగా కొడుకును మందలించలేక, విదురుని సమ్మతితో చేయటం మంచి దని చెప్పింది. లోకంలో పుత్రమమకార పీడితుల స్వభావం ఇలాగే ఉంటుంది. వాళ్ళు తగిన తరుణంలో తనయులను దండించరు. పరిస్థితులు విషమించినప్పుడు బాధపడతారు.

**తే. పాండుపుత్త్రుల కెప్పుడుఁ బక్షపాతి । విదురుఁ డని చెప్పఁ దొల్లియు విందు; దీని
నెఱిఁగి వారించుఁ గా, కతఁ డేల శకుని । కైతవంబున కొడఁబడుఁ గౌరవేంద్ర! 126**

ప్రతిపదార్థం: కౌరవ+ఇంద్ర!= ధృతరాష్ట్రమహారాజా!; విదురుఁడు; ఎప్పుడున్= ఎల్లప్పుడు; పాండుపుత్త్రులకున్; పక్షపాతి= మొగ్గుచూపేవాడు; అని; చెప్పన్; తొల్లియున్= ఇదివరకే; విందున్= విని ఉన్నాను; దీనిన్= ఈ జూదమాడే ప్రయత్నాన్ని; ఎఱిఁగి= తెలుసుకొని; వారించున్+కాక= ఆపివేస్తాడుగాని; అతఁడు= ఆ విదురుడు; ఏల= ఎందుచేత; శకుని= శకునియొక్క; కైతవంబునకున్= జూదానికి; ఒడఁబడున్= అంగీకరిస్తాడు?

తాత్పర్యం: విదురుడు ఎప్పుడూ పాండవపక్షం వైపే మొగ్గుచూపుతా డని ఇదివరకే విన్నాను. ఆత డీప్రయత్నాన్ని ఆపివేస్తాడేకాని, శకునిజూదానికి అంగీకరిస్తాడా?

తే. దీని కొడఁబడు; మొడఁబడవేని నేఁడ । యీ క్షణమ సర్వభక్షుచే భక్షితుండ
నగుదుఁ; దెల్ల మే నట్లైన వగపుఁ దక్కి । విదురుఁడును నీవు నుండుఁడు ముదముతోడ. 127

ప్రతిపదార్థం: దీనికిన్= ఈ జూదప్రయత్నానికి; ఒడఁబడుము= అంగీకరించుము; ఒడఁబడవు+ఏనిన్= అంగీకరించకుంటే; నేడు+అ= ఈ రోజే; ఈక్షణము+అ= ఈ నిమిషాన్నే; సర్వ, భక్షుచే= అన్నింటినీ భక్షించే వాడైన అగ్నిచే; భక్షితుండన్= భక్షించబడినవాణ్ణి; అగుదున్; తెల్లము= ఇది నిజం; ఏన్= నేను; అట్లు+ఐనన్= ఆ విధంగా నశిస్తే; వగపున్= చింతను; తక్కి= వదలి; విదురుఁడును; నీవున్; ముదముతోడన్= సంతోషంతో; ఉండుఁడు.

తాత్పర్యం: ఈ ప్రయత్నానికి అంగీకరించు. అంగీకరించకుంటే ఈ రోజే, ఈ క్షణమే అగ్నికి ఆహుతి అవుతా. ఇది నిజం. తరువాత నిశ్చింతగా నీవూ, విదురుడూ సుఖంగా ఉండండి.

విశేషం: పుత్రమమకారపీడితులైన తల్లిదండ్రులను లోకంలో దుర్మార్గులైన తనయులు బెదిరించే తీరు ఇదే.

క. అని కడు నడలుగఁ బలికిన । విని ధృతరాష్ట్రుండు దుఃఖవివశాత్మకుఁ డ
య్యును నెద నది యుచితము గా । దని వగచుచు నాత్మజునకు నాహ్లాదముగన్. 128

ప్రతిపదార్థం: అని; కడున్= మిక్కిలి; అడలుగన్= దుఃఖంతో; పలికినన్; విని; ధృతరాష్ట్రుండు; దుఃఖ, వివశ+ఆత్మకుఁడు+ అయ్యునున్= దుఃఖానికి పూర్తిగా లొంగిపోయిన మనస్సు కలవాడైకూడా; ఎదన్= మనస్సులో; అది; ఉచితముకాదు= తగిందికాదు; అని; వగచుచున్= చింతిస్తూ; ఆత్మజునకున్= కుమారునికి; ఆహ్లాదముగన్= సంతోషం కలిగేటట్లుగా.

తాత్పర్యం: అని అమితంగా దుఃఖిస్తూ దుర్యోధనుడు అనగానే విని, ధృతరాష్ట్రుడు, తాను కూడా తీవ్రంగా దుఃఖించాడు. అయినా జూదం తగ దని మనస్సులో అనుకొని కొడుకుకు ఆహ్లాదం కలిగేవిధంగా-

వ. అప్పుడు వేవురు శిల్పాచార్యుల రావించి, కనకరత్న ఖచిత స్తంభ సహస్రంబులను విచిత్రద్వార శతంబులను వివిధ రత్నరుచిర ప్రదేశంబులనుం జేసి రమ్యంబుగా నొక్క సభ నిర్మింపంబనిచి, యొక్కనాఁ డే కాంతంబ విదురునకు శకునిదుర్యోధనుల యభిప్రాయంబు చెప్పిన విని, యతండు విస్మితుండై, కలి ద్వారసమీపం బగుటయు జూదం బఖిలప్రజాక్షయకరం బగుటయు నెఱింగి ధృతరాష్ట్రున కి ట్లనియె. 129

ప్రతిపదార్థం: అప్పుడు; వేవురు= వెయ్యిమంది; శిల్ప+ఆచార్యులన్= శ్రేష్ఠులైన శిల్పులను; రావించి; కనక, రత్న, ఖచిత, స్తంభ, సహస్రంబులను= బంగారు, రత్నాలు పొదుగబడిన వేయిస్తంభాలతో; విచిత్ర ద్వార శతంబులను= ఆశ్చర్యకరాలైన వందలకొలది వాకిళ్ళతో; వివిధ, రత్న, రుచిర, ప్రదేశంబులనున్+చేసి= అనేక విధాలైన రత్నకాంతులతో ఒప్పిన ప్రదేశాలతో; రమ్యంబుగాన్= అందంగా; ఒక్క; సభ; నిర్మింపన్; పనిచి= ఆజ్ఞాపించి; ఒక్కనాడు; ఏకాంతంబు+అ= ఒంటరిగా; విదురునకున్; శకుని, దుర్యోధనుల; అభిప్రాయంబు; చెప్పినన్; విని; అతండు= ఆ విదురుడు; విస్మితుండు+ఐ= ఆశ్చర్యపడినవాడై; కలి, ద్వార, సమీపంబు+అగుటయున్= కలి వాకిటి దగ్గరకు రావటం - అంటే కలియుగం దగ్గర పడటం; జూదంబు; అఖిల, ప్రజా, క్షయ, కరంబు+అగుటయున్= అందరు ప్రజలకు నాశనం కూర్చేది అవటాన్ని; ఎఱింగి= తెలుసుకొని; ధృతరాష్ట్రునకున్+ ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అప్పుడు శ్రేష్ఠులైన శిల్పులను వెయ్యిమందిని రప్పించి, బంగారు రత్నాలు పొదిగిన వెయ్యిస్తంభాలతో, విచిత్రాలైన వందలకొలది ద్వారాలతో, రకరకాలైన రత్నకాంతులతో ప్రకాశించే ప్రదేశాలతో, అందంగా ఒక సభను నిర్మించటానికి ఆజ్ఞాపించాడు. ఒకనాడు ఒంటరిగా విదురునితో శకునిదుర్యోధనుల అభిప్రాయాన్ని చెప్పాడు. అది విన్న విదురుడు ఆశ్చర్యపడి- కలియుగప్రవేశం దగ్గరపడటం, జూదం సర్వజననాశకం కావటం తెలుసుకొని ధృతరాష్ట్రునితో ఇలా అన్నాడు.

విశేషం: 'కలి ద్వార సమీపం బగుటయు' అనే దానికి అనేక ప్రతుల్లో 'కలిద్వాపర సమీపంబగుటయు' అనే పాఠాంతరం ఉంది. కాని మూలంలో 'తచ్ఛ్రుత్వా విదురో ధీమాన్ కలిద్వార ముపస్థితమ్ । వినాశముఖ ముత్పన్నం ధృతరాష్ట్ర ముపాద్రవత్' - అని ఉంది. (భండార్కరు ప్రతి - 2-45-50).

విదురుఁడు ధృతరాష్ట్రునితో జూదమాడఁదగ దని చెప్పుట (సం. 2-51-23)

ఆ. ఇట్టి కార్యమునకు నే నవశ్యంబును । నొడఁబడంగ నోప నుక్కివమున
సుతులతోడ నేల సుతులకు భేదంబు । సేయఁ గడఁగి తిదియుఁ జెట్ట యనక. 130

ప్రతిపదార్థం: ఇట్టి; కార్యమునకున్; నేను; అవశ్యంబును= తప్పని సరిగా; ఒడఁబడంగన్+ఓపన్= ఒప్పుకొనలేను; ఇదియున్= దీన్ని; చెట్ట, అనక= చెడ్డ అని అనకుండ; ఉక్కివమునన్= కపటంతో; ఏల= ఎందుచేత; సుతులతోడన్; సుతులకున్= కొడుకులతో కొడుకులకు; భేదంబు= విరోధం; చేయన్= కలిగించటానికి; కడఁగితి= పూనుకొన్నావు.

తాత్పర్యం: ఇలాంటి పనికి ఏ మాత్రం నేను అంగీకరించను. ఇది చెడ్డ అని అనకుండ, కపటంతో నీ కొడుకుల్లో- పాండవులకు కౌరవులకు - విరోధం కల్పించటానికి ఎందుకు పూనుకున్నావు?

తే. ఒలసి నీ పుత్త్రులెల్ల నొండొరులతోడ । నె ట్లొడంబడి యుండుదు రట్ల చేయ
వలయుఁ; దమలోన జూదంబు వాదు నగుటఁ । గలహ మూలంబ యెట్టి శాంతులకు నైన. 131

ప్రతిపదార్థం: ఒలసి= కలిసి; నీ, పుత్త్రులు+ఎల్లన్= నీ కుమారు లందరు; ఒండు+ఒరులతోడన్= ఒకరితో నొకరు; ఎట్లు= ఏ విధంగా; ఒడంబడి, ఉండుదురు= కూడిఉంటారో; అట్లు+అ= ఆ విధంగా; చేయవలయున్; ఎట్టి, శాంతులకున్+ఐనన్= ఎంతటి శాంత స్వభావం కలవాళ్ళకైనా; తమలోనన్; జూదంబు; వాదున్= వివాదం; అగుటన్; కలహ, మూలంబు+అ= వైరమేర్పడటానికి కారణమే.

తాత్పర్యం: నీ పుత్రులంతా ఒకరితో ఒకరు ఎలా కలిసి మెలిసి ఉంటారో అలా చెయ్యి. ఎంత శాంత స్వభావులకైనా జూదం వాళ్ళలో వాళ్ళకు వాదు ఏర్పడటానికి, వైరం కలగటానికి కారణం అవుతుంది.

విశేషం: భారతంలో విదురుడు గొప్ప హితవరి, నన్నయ నానారుచిరార్థసూక్తినిధిత్వం విదురుని నోట విశేషంగా శోభిల్లింది.

వ. 'నీ నేర్చు విధంబున శకుని దుర్యోధనుల దుర్వ్యవసాయం బుడిగించి యిక్కురువంశంబు రక్షింపు' మనిన విదురునకు ధృతరాష్ట్రుం డి ట్లనియె. 132

ప్రతిపదార్థం: నీ, నేర్పు, విధంబునన్= నీకు చేతనైన పద్ధతిలో; శకుని, దుర్యోధనుల; దుర్+వ్యవసాయంబు= చెడ్డపనిని; ఉడిగించి= మాన్పి; ఈ+కురువంశంబు; రక్షింపుము; అనిన; విదురునకు; ధృతరాష్ట్రుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'నీకు చేతనైన పద్ధతిలో శకుని దుర్యోధనుల చెడ్డపనిని మాన్పించి, కురుకులాన్ని రక్షించు'అని విదురుడు అనగానే విదురుడితో ధృతరాష్ట్రుడు ఇలా అన్నాడు.

ఉ. పుత్త్రుల కేల భేదమగు భూనుత! యేనును నీవు జాహ్నవీ
పుత్త్రుఁడు నుండఁగా నహితమున్ భయమున్ దొరకొన్నె? నాకు నా
పుత్త్రులకుం బ్రసాదకృత బుద్ధులు వేల్పులు గాన దీనికిన్
మిత్రనిధీ! యొడంబడుము మిన్నక సంశయ మంద నేటికిన్? 133

ప్రతిపదార్థం: భూనుత!= లోకంచేత కొనియాడబడేవాడా!; ఏనునున్= నేనూ; నీవు; జాహ్నవీ, పుత్త్రుఁడున్= గంగాతనయుఁడు- భీష్ముడు; ఉండఁగాన్; పుత్త్రులకున్; ఏల= ఎందుచేత; భేదము+అగున్= వైరమేర్పడుతుంది?; వేల్పులు= దేవతలు; ప్రసాద, కృత, బుద్ధులు, కానన్= దయచూపే బుద్ధి కల వా రవటంచేత; నాకున్, పుత్త్రులకున్; అహితమున్= కీడును; భయమున్= భయమూ; దొరకొన్నె= కలుగునా?; మిత్త్రనిధీ= మిత్రులకు నిధియైనవాడా!; దీనికిన్= ఈ జూదానికి; ఒడంబడుము= అంగీకరించుము; మిన్నక= ఊరక - అంటే అనవసరంగా; సంశయము+అందన్= అనుమానపడటం; ఏటికిన్= ఎందుకు?

తాత్పర్యం: లోకం కొనియాడే ఓ విదురా! నేను, నీవు, గంగాతనయుడు భీష్ముడు ఉండగా, కొడుకుల కెందుకు వైరం ఏర్పడుతుంది? దేవతలు దయచూపే బుద్ధికలవాళ్ళు కావటంచేత నాకు, నా పుత్త్రులకు కీడు, భయం కలుగుతాయా? మిత్రనిధీ! నీ వీ జూదానికి అంగీకరించు. అనవసరంగా అనుమానపడటం ఎందుకు?

విశేషం: ధృతరాష్ట్రుని పుత్ర మమకారంతో పాటు, మాటనేర్పుకూడ ఈపద్యంలో వ్యక్తమవుతున్నది. విదురుణ్ణి ఆజ్ఞాపించగలవాడైనా అతణ్ణి 'మిత్త్రనిధీ!' అని సంబోధించి 'ఇందుకు అంగీకరించు' అని అడుగుతున్నాడు. (ఈ మాటల్లో ప్రభువు పాత్రకంటె తండ్రి పాత్రకే ధృతరాష్ట్రుడు ప్రాధాన్యం ఇస్తున్నట్లు స్పష్ట మౌతున్నది. ఇక విదురునిమాటలు అరణ్యరోదనలే, బూడిదలో పోసిన పన్నీరే. గుణం: ఉదారత. - సంపా.)

వ. 'వడిగల తురంగంబులం బూనిన రథం బెక్కి యింద్రప్రస్థపురంబునకుం జని యిందులకు ధర్మనందనుం దోడ్కొని ర' మ్మని విదురుం బంచిన, నాతండును నాపగేయున కంతయు నెఱింగించి 'యిది యపకర్మం' బనుచుండె; నిట ధృతరాష్ట్రుండు దన నిర్మింపంబంచిన సభ దుర్యోధనునకుం జూపి యాతని కేకాంతంబున నిట్లనియె. 134

పతిపదార్థం: వడిగల= వేగంగల; తురంగంబులన్= గుర్రాలను; పూనిన= కట్టిన; రథంబు+ఎక్కి; ఇంద్రప్రస్థపురంబునకున్; చని= వెళ్ళి; ధర్మనందనున్= ధర్మరాజును; తోడ్కొని= పిలిచికొని; రమ్ము+అని; విదురున్; పంచినన్; ఆతండునున్= విదురుడుకూడ; ఆపగేయునకున్= గంగానదీ పుత్రుడైన భీష్మునికి; అంతయున్= జరిగినదంతా; ఎఱింగించి= తెలిపి; ఇది= ఈ జూదం; అపకర్మంబు= చేయకూడని పని; అనుచుండెన్; ఇట; ధృతరాష్ట్రుండు; తన= తాను; నిర్మింపన్; పంచిన = ఆజ్ఞాపించిన; సభ; దుర్యోధనునకున్; చూపి; ఆతనికిన్; ఏకాంతంబునన్= ఒంటరిగా; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'వేగంగల గుర్రాలను కట్టిన రథం ఎక్కి ఇంద్రప్రస్థపురానికి వెళ్ళి, ధర్మరాజును ఇక్కడికి పిలుచుకొనిరా' అని విదురుణ్ణి పంపగా, ఆతడు భీష్మునికి జరిగిందంతా చెప్పి, 'ఈ జూదం కూడని పని' అన్నాడు. ధృతరాష్ట్రుడు తాను నిర్మించటానికి ఆజ్ఞాపించిన సభను దుర్యోధనునికి చూపి, ఏకాంతంగా అతనితో ఇలా అన్నాడు.

క. జూద మిది యేల? దీనను । భేదము మీలోనఁ బుట్టుఁ బెలుచన; యుష్మ
ద్భేదమునఁజేసి యె గ్గు । త్పాదిల్లు ధరిత్రిఁ బ్రజకు భయజననంబై. 135

ప్రతిపదార్థం: జూదము+ఇది; ఏల; దీనను= దీనివలన; పెలుచన= పెద్దగా; మీలోనన్; భేదము= వైరం; పుట్టున్; యుష్మత్+ భేదమునన్+చేసి= మీయొక్కవైరంవలన; ధరిత్రిన్= భూమిలోని; ప్రజకున్= ప్రజలకు; భయ, జననంబు+ఐ= భయాన్ని కలిగించేదై; ఎగ్గు= కీడు; ఉత్పాదిల్లున్= పుడుతుంది.

తాత్పర్యం: ఈ జూదం ఎందుకు? దీనివల్ల మీలో మీకు తీవ్ర వైరం పుడుతుంది. మీ వైరంవల్ల భూమిమీది ప్రజలందరికి భయంకరమైన కీడు కలుగుతుంది.

ఉ. ఇమ్మహి నీవుఁ బాండవులు నెప్పటియట్ల పరస్పరానురా
గమ్మున నేలుచున్కి యిది కార్యము; పాండవలక్ష్మి నీ కస
హ్య మ్మన నేల? వంచనఁ బరార్థ పరిగ్రహబుద్ధిఁ జేసి పా
పమ్మగుఁ; బాపకారులకుఁ బాయు నవశ్యము నర్థధర్మముల్. 136

ప్రతిపదార్థం: ఈ+మహిన్= ఈభూమిని; నీవున్; పాండవులున్; ఎప్పటి, అట్ల= ఎప్పటివలె; పరస్పర+అనురాగమ్మునన్= పరస్పరప్రేమతో; ఏలుచున్+ఉనికి= పాలిస్తూ ఉండటం; ఇది; కార్యము= చేయదగింది; పాండవ, లక్ష్మి= పాండవులఐశ్వర్యం; నీకున్; అసహ్యము+అనన్+ఏల= ఓర్చుకోరానిది అని అనటం ఎందుకు?; వంచనన్= మోసంతో; పర+అర్థ= ఇతరులయొక్క సంపదను; పరిగ్రహ, బుద్ధిన్+చేసి= తీసుకోవాలనే ఆలోచనచేత; పాపమ్ము+అగున్= పాపం కలుగుతుంది; పాపకారులకున్= పాపంచేసేవాళ్ళకు; అవశ్యమున్= తప్పక; అర్థ, ధర్మముల్= సంపద, ధర్మం; పాయున్= తొలగిపోతాయి.

తాత్పర్యం: ఈ భూమిని నీవు, పాండవులు ఎప్పటిలాగే పరస్పర ప్రేమతో పాలిస్తూ ఉండటం మంచిది. పాండవుల సంపద నీకు ఎందుచేత సహింపరానిదైంది? మోసంతో ఇతరుల సంపద పరిగ్రహించా లనే ఆలోచనవల్ల పాపం కలుగుతుంది. పాపాత్ములకు సంపద, ధర్మం తప్పక నశిస్తాయి.

విశేషం: ఈ పద్యరచనలో ఉదారతాగుణం పోషించబడింది. (సంపా.)

వ. 'ధర్మాధర్మవిదుండైన విదురున కిది సమ్మతంబు గాదు; ధర్మజు ధనసంపదకంటె నేనుమడుంగులు నీకు ధన సంపద గలదు; వాని చేసిన యజ్ఞంబుకంటె విశేషంబుగా దక్షిణ లిచ్చి నీ కిష్టంబయిన యజ్ఞంబు సేయుము; నీకును భూలోకంబునంగల రాజులెల్లం దమసర్వస్వమ్ములుఁ దెచ్చియిత్తు' రనిన విని దుర్యోధనుండు దండ్రి కి ట్లనియె. 137

ప్రతిపదార్థం: ధర్మ+అధర్మ, విదుండు+ఐన= ధర్మం, అధర్మం తెలిసిన వాడైన; విదురునకున్; ఇది= జూదమాడి మోసంతో పాండవుల సంపదను అపహరించే పని; సమ్మతంబు కాదు; ధర్మజు, ధనసంపదకంటెన్; ఏనుమడుంగులు= ఐదు రెట్లు; నీకున్; ధనసంపద; కలదు; వాని, చేసిన= ఆ ధర్మరాజుచేసిన; యజ్ఞంబుకంటెన్; విశేషంబుగాన్= ఎక్కువగా; దక్షిణలు; ఇచ్చి; నీకున్+ఇష్టంబు+అయిన; యజ్ఞంబు; చేయుము; నీకును; భూలోకంబునన్+కల= భూలోకంలో ఉండే; రాజులు+ఎల్లన్= రాజులందరూ; తమ సర్వస్వమ్ములున్= తమ సకలసంపదలను; తెచ్చి; ఇత్తురు; అనినన్; విని; దుర్యోధనుండు; తండ్రికిన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'ధర్మాధర్మాలు బాగా తెలిసిన విదురునికి ఈ మాయాద్యూతం సమ్మతంకాదు. ధర్మరాజు ధనసంపదకంటె ఐదురెట్లు ధనసంపద నీ కుంది. అతడు చేసిన యజ్ఞంకంటె అధికంగా దక్షిణ లిచ్చి నీకిష్ట మైన యజ్ఞం చెయ్యి. లోకంలోని రాజులంతా నీకుగూడ తమ సంపద లన్నింటిని తెచ్చి ఇస్తారు' అని అనగా విని దుర్యోధనుడు తండ్రితో ఇలా అన్నాడు.

విశేషం: ఈర్ష్యాగ్రస్తునికి తనకు లేదన్న బాధకంటె ఎదుటివాళ్ళకు ఉన్నదన్న బాధే ఎక్కువ. తనకు లే దన్న బాధను ఎవరైనా తీర్చగల రేమో కాని, ఎదుటివాళ్ళ కున్నదన్న బాధను కడకు కన్నతండ్రి మాత్రం ఏ విధంగా తీర్చగలడు?

క. ఇమ్ముల ధర్మజుతో జూ । దమ్మాడఁగఁ గాన్ప నాకు ధరణీశ్వర! య
జ్ఞ మ్మదియ సమస్తైశ్వ । ర్యమ్ములు వడయఁగ నుపాయ మభిమతబుద్ధిన్. 138

ప్రతిపదార్థం: ధరణి+ఈశ్వర= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; ఇమ్ములన్= ఇంపుగా; ధర్మజుతోన్; జూదమ్ము; ఆడఁగన్; కాన్పన్= చూచుటయే; నాకున్; యజ్ఞము; అది+అ= అదే; అభిమతబుద్ధిన్= కోరుకొన్నట్లు; సమస్త+ఐశ్వర్యమ్ములు= సకల సంపదలు; పడయఁగన్= పొందటానికి; ఉపాయము.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్రమహారాజా! ధర్మరాజుతో జూదమాడగా చూడటమే నాకు యజ్ఞం. కోరుకొన్న సకల సంపదలు పొందటానికి అదే తగిన ఉపాయం.

క. మీ రిందుల కందఱుఁ జను । దేరఁగ నే నంద యుండితిని సభ చూడన్;
ధారుణి నట్టి యపూర్వ స । భారచనలు వినఁగఁ జూడఁబడ వెవ్వరిచేన్. 139

ప్రతిపదార్థం: మీరు; అందఱున్; ఇందులకున్= ఈ హస్తినాపురానికి; చనుదేరఁగన్= రాగా; నేను; సభ= మయసభను; చూడన్= చూడటానికి; అందు+అ= అక్కడే - అంటే ఇంద్రప్రస్థంలోనే; ఉండితిని; ధారుణిన్= భూమిలో; అట్టి; అపూర్వ, సభా, రచనలు= ఆశ్చర్యకరమైన సభా నిర్మాణ శిల్పాలు; ఎవ్వరిచేన్= ఎవరిచేతగూడ; వినఁగన్, చూడన్, పడవు= వినబడలేదు. చూడబడలేదు.

తాత్పర్యం: మీరంతా రాజసూయం తర్వాత హస్తినాపురానికి తిరిగివచ్చారు. నేను ఆ మయసభను చూడా లని అక్కడే ఉన్నాను. లోకంలో ఆశ్చర్యకరమైన అలాంటి సభానిర్మాణాన్ని ఇంతవరకు ఎవ్వరూ వినలేదు. కనలేదు.

వ. **నిర్మల స్ఫటిక శిలానిర్మితం బై శశిప్రకాశంబై వివిధరత్న ప్రభా భాసురంబైన యా సభావిభవంబు చూచువేడుక నందుఁ గ్రుమ్మరు వాఁడ హరినీల బద్ధస్నిగ్ధ మణిస్థలంబునందు జలబుద్ధింజేసి పరిధానోత్కర్షణంబుసేసి, విమల శిలాతలబుద్ధి నుదకపరిపూర్ణం బయిన వాపి సొచ్చి, కట్టిన పుట్టంబు దడియం డ్రెళ్ళిన నన్నుం జూచి వృకోదరుండు నగియె; దాని నంతయు నెఱింగి ధర్మరాజ చోదితులయిన కింకరులు నాకుం బరిధానంబులు దెచ్చి యిచ్చిరి; మఱియు వివృతద్వారంబుఁ గవాట ఘటితం బని చొరనొల్లక, కవాటఘటితంబు వివృతంబుగా వగచి, చొరంబోయి తత్కవాట స్ఫటిక శిలా ఘట్టిత లలాటుండ నైన నన్నుం జూచి యనేక సహస్ర విలాసినీ పరివృతయయియున్న ద్రౌపది నగియె; నంత నకుల సహదేవులు పఱతెంచి 'యిదె వాకిలి యిట వచ్చునది' యని నన్నుం దోడ్కొని పోయి; రట్టి సభాప్రలంభంబు నాకు హృదయశల్యం బయి యున్నది. 140**

ప్రతిపదార్థం: నిర్మల, స్ఫటిక, శిలా, నిర్మితంబు+ఐ= స్వచ్ఛమైన స్ఫటికపురాళ్ళతో కట్టబడినదై; శశి, ప్రకాశంబు+ఐ= చంద్రునివలె వెలిగేటటువంటిదై; వివిధ, రత్న, ప్రభా భాసురంబు+ఐన= పలువిధాలైన రత్న కాంతులచేత ప్రకాశించేదైన; ఆ సభా, విభవంబు= ఆ మయ సభయొక్క గొప్పదనం; చూచువేడుకన్= చూడాలనే కుతూహలంతో; అందున్= ఆ మయసభలో; క్రుమ్మరువాఁడన్= తిరుగుతున్న నేను; హరినీల, బద్ధ, స్నిగ్ధ, మణిస్థలంబునందున్= ఇంద్రనీలాలు కూర్చబడటంచేత నునుపైన మణి ప్రదేశంలో; జలబుద్ధిన్+చేసి= నీళ్ళున్నాయని అనుకోవటంచేత; పరిధాన+ఉత్కర్షణంబు, చేసి= కట్టుకున్న వస్త్రాన్ని పైకెత్తుకొని; విమల, శిలా, తల, బుద్ధిన్= స్వచ్ఛమైన రాతినేల అనే తలంపుతో; ఉదక, పరిపూర్ణంబు+అయిన= నీళ్ళతో పూర్తిగా నిండిన; వాపి= నడబావి - అంటే నడిచిపోవటానికి మెట్లు ఏర్పాటుచేసిన బావి; చొచ్చి= ప్రవేశించి, కట్టిన పుట్టంబు= కట్టుకొన్న బట్ట; తడియన్= తడిసిపోయేటట్లు; త్రెళ్ళినన్= పడిపోగా; నన్నున్; చూచి; వృకోదరుండు= భీముడు; నగియెన్= నవ్వాడు; దానిన్; అంతయున్; ఎఱింగి= తెలుసుకొని; ధర్మరాజ, చోదితులు+అయిన= ధర్మరాజుచేత పంపబడిన; కింకరులు= సేవకులు; నాకున్; పరిధానంబులు= కట్టుబట్టలు; తెచ్చియిచ్చిరి; మఱియున్; వివృతద్వారంబున్= తెరవబడిన వాకిలిని; కవాటఘటితంబు+అని= తలుపు మూయబడిన వాకిలి అని; చొరన్= ప్రవేశించటానికి; ఒల్లక= ఇష్టపడక; కవాటఘటితంబు= తలుపు మూయబడిన దానిని; వివృతంబుగాన్= తెరవబడినదానినిగా; వగచి= తలంచి; చొరన్+పోయి= ప్రవేశించబోయి; తత్+కవాట, స్ఫటిక, శిలా, ఘట్టిత, లలాటుండన్+ఐన= దానితలుపుయొక్క స్ఫటికపురాతిచే కొట్టబడిన నొసలు కలవాడినైన; నన్నున్; చూచి; అనేక, సహస్ర, విలాసినీ, పరివృత, అయిన, ఉన్న= పెక్కువేలమంది చెలికత్తెలతో కూడి ఉన్న; ద్రౌపది; నగియెన్= నవ్వింది; అంతన్= అప్పుడు; నకుల, సహదేవులు; పఱతెంచి= పరుగెత్తుకొనివచ్చి; ఇదె; వాకిలి; ఇట; వచ్చునది; అని; నన్నున్; తోడ్కొని= వెంటపిలుచుకొని; పోయిరి; అట్టి; సభా, ప్రలంభంబు= సభవలన కలిగిన వంచన; నాకున్; హృదయ, శల్యంబు+అయి= గుండెలో గుచ్చుకొన్న బాణమై; అంటే మిక్కిలి బాధాకరమై; ఉన్నది.

తాత్పర్యం: స్వచ్ఛమైన స్ఫటికపు రాళ్ళతో నిర్మించబడి, చంద్రునిలా ప్రకాశిస్తూ, పలువిధాలైన రత్నకాంతులతో వెలుగుతున్న ఆ మయసభా వైభవాన్ని చూడాలన్న కుతూహలంతో అందులో తిరుగుతూ ఉండగా-ఇంద్రనీలమణుల కూర్పుచేత నునుపైన మణిప్రదేశంలో నీళ్ళున్నా యని, కట్టుకొన్న వస్త్రాన్ని పైకెత్తుకొన్నాను. స్వచ్ఛమైన రాతినేల అనే తలంపుతో నీళ్ళు నిండిన నడబావిలో అడుగుపెట్టి కట్టుకున్న బట్టలన్నీ తడసేటట్లు క్రిందపడ్డాను. నాపాటు చూచి భీముడు నవ్వాడు. ధర్మరాజు పంపితే కొందరు సేవకులు కట్టుబట్టలు తెచ్చిఇచ్చారు. అంతే కాదు, తెరచిన ద్వారాన్ని మూసినదాన్నిగా తలచి అందు ప్రవేశించకుండా ఆవలికి తొలగిపోయాను. మూసినతలుపును తెరచినదాన్నిగా తలచి ప్రవేశించబోగా దానిస్ఫటికపురాతికి నొసలు కొట్టుకున్నాను. అలాగే నా స్థితిని చూచి పెక్కువేలమంది

చెలికత్తెలతో ఉన్నపాంచాలి ఫక్కున నవ్వింది. నకులసహదేవులు పరుగెత్తుకొని వచ్చి-ఇది వాకిలి; ఇటు ర మ్మని పిలుచుకొని పోయారు. ఆ సభలో, నేను పడినభంగపాటు గుండెలో గ్రుచ్చుకొన్న బాణంలా నన్ను అమితంగా బాధిస్తూ ఉంది.

విశేషం: అసలే దుర్యోధనుడు పాండవుల పట్ల అసూయాగ్రస్తుడు. అందుకుతోడు వారిముందే అంత ఘోరావమానం. పుండుమీద కారం చల్లినట్లయింది. అంతేకాదు, విశేషించి సూదులు గ్రుచ్చినట్లు ద్రౌపదీ భీమసేనుల నవ్వులు. అప్పటి దుర్యోధనుని మానసిక స్థితి ఊహించుకోవలసిందే కాని వివరించ సాధ్యంకాదు.

క. పెద్దలు హీనతఁ బొందిరి । తద్దయు హీనులు సమృద్ధిఁ దనరిరి నియమం
బెద్ది విధియోగమున కను । హృద్దర్పోన్నతులు సూచి యెట్లు సహింతున్. 141

ప్రతిపదార్థం: పెద్దలు= గొప్పవారు; హీనతన్= తక్కువతనాన్ని; పొందిరి; తద్దయున్= మిక్కిలి; హీనులు= తక్కువవాళ్ళు; సమృద్ధిన్= ఐశ్వర్యంతో; తనరిరి= ఒప్పారు; విధి, యోగమునకున్= బ్రహ్మదేవునిచేష్టకు; నియమంబు= క్రమం; ఎద్ది= ఏది?అ, సుహృత్+దర్ప+ఉన్నతులు= మిత్రులుకాని వాళ్ళయొక్క గర్వం; ఔన్నత్యము; చూచి; ఎట్లు; సహింతున్= ఓర్చుకుంటాను?

తాత్పర్యం: గొప్పవాళ్ళు తగ్గిపోయారు. అల్పులు అన్ని సంపదలతో అధికు లయ్యారు. బ్రహ్మదేవుని చేష్టకు క్రమం ఏముంది? మిత్రులు కానివాళ్ళ గర్వాన్ని, ఔన్నత్యాన్ని చూచి నే నెలా సహిస్తాను?

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

క. పరమసుఖోపాయంబునఁ । బరసంపద చేకొనంగఁ బడునేని నరే
శ్వర! యంతకంటె మిక్కిలి । పురుషార్థం బెద్ది యొండు భూనాథులకున్. 142

ప్రతిపదార్థం: నర+ఈశ్వర= ధృతరాష్ట్రమహారాజా!; భూనాథులకున్= రాజులకు; పరమ, సుఖ+ఉపాయంబునన్= మిక్కిలి సులభమైన ఉపాయంచేత; పర, సంపద= పగవారి సంపద; చేకొనంగన్, పడున్, ఏనిన్= తీసుకోటానికి వీలైతే; అంతకంటెన్; మిక్కిలి= ఎక్కువైన; పురుష+అర్థంబు= పురుష ప్రయోజనం; అంటే జీవితంలో పురుషుడు పొందదగిన లాభం; ఒండు= మరొకటి; ఎద్ది= ఏది?

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! రాజులు చాలా సులభమైన ఉపాయంతో శత్రువుల సంపదను గ్రహించటానికి వీలు కలిగితే, అంతకంటె అధికంగా వాళ్ళు కోరుకోతగిన ప్రయోజనం ఇంకేముంది?

క. నముచి యను దనుజుఁ డుగ్రత । పము సేయుచు నున్నవాని బలమథనుఁ డధ
ర్మమున వధియించె; రిపుప । క్షము నెమ్మెయి నైనఁ జెఱుపఁగా వలయు నిలన్. 143

ప్రతిపదార్థం: నముచి; అను; దనుజుఁడు= రాక్షసుడు; ఉగ్ర, తపము= భయంకరమైన తపస్సు; చేయుచున్+ఉన్న; వానిన్= అతడిని బలమథనుఁడు= ఇంద్రుడు; అధర్మమునన్= అన్యాయంగా; వధియించెన్= చంపాడు; ఇలన్= భూమిలో; రిపు, పక్షమున్= శత్రుపక్షాన్ని; ఏ+మెయిన్+ఐనన్= ఏవిధంగానైనా; చెఱుపఁగావలయున్= నాశనం చేయాలి.

తాత్పర్యం: నముచి అనే రాక్షసుడు భయంకరమైన తపస్సు చేస్తుండగా, దేవేంద్రుడు అన్యాయంగా అతణ్ణి వధించాడు గదా! భూమిమీద శత్రుపక్షాన్ని ఏ విధంగా నైనా నాశనం చెయ్యాలి.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. నముచి కశ్యపునికి, దనువుకు జన్మించిన కుమారుడు. నముచి భార్య ప్రభ. దేవదానవయుద్ధంలో ఇంద్రుడు వజ్రాయుధంతో కొట్టినా ఇతడు కసుగందలేదు. ఇతనికి ఉండే వరాలు అలాంటివి. ఆర్ద్రమైన (తడిసిన) దానితోగాని శుష్కమైన (ఎండిన) దానితోగాని ఇతనికి చావు లేదు. అయినా నముచి దేవేంద్రునికి భయపడి, దాగి, భయంకరమైన తపస్సు చేస్తుండగా- ఇంద్రుడు 'నిన్ను ఆర్ద్రమైన దానితోగాని, శుష్కమైన దానితోగాని కొట్ట' నని నమ్మించి, ఫేనం (నురుగు)తో కొట్టి ఈ రాక్షసుణ్ణి హతమార్చా డని పురాణగాథ.

ఆ. అల్పుఁడయ్యు మనుజుఁ డతి పరాక్రమమునఁ । బేర్మిఁ దరతరంబ పెరుగుచున్న
వాఁడు మ్రాని మొదలి వల్మీక మా మ్రానిఁ । జెఱుచు నట్లు గడఁగి చెఱుచుఁ బగఱ. 144

ప్రతిపదార్థం: మనుజుఁడు; అల్పుడు+అయ్యున్= తక్కువవాడు అయి నప్పటికి; అతిపరాక్రమమునన్= మిక్కిలి పరాక్రమంచేత; పేర్మిన్= గొప్పగా; తరతరంబ= అంతకంతకు; పెరుగుచున్నవాడు; మ్రాని, మొదలి, వల్మీకము= చెట్టుమొదట ఉండే పుట్ట; ఆ, మ్రానిన్= ఆ చెట్టును; కడఁగి= ప్రయత్నించి; పగఱన్= శత్రువులను; చెఱచున్= నాశనం చేస్తాడు.

తాత్పర్యం: మానవుడు తక్కువవాడే అయిన ఎక్కువ పరాక్రమంతో అంతకంతకు గొప్పగా అభివృద్ధి చెందుతుంటే చెట్టుమొదలిపుట్ట క్రమంగా ఆ చెట్టునే చెరిచి వేసినట్లు, ఆతడు ప్రయత్నంచేసి తనశత్రువులను నాశనం చెయ్యగలడు.

విశేషం: అలం: ఉపమ.

తే. అహితవృద్ధి యుపేక్షితం బగుడు నల్ప । మగు మహావ్యాధియును బోలె నది యసాధ్య
మయి యుపేక్షకు నిర్మూలితాత్ముఁ జేయుఁ । గాన పాండవశ్రీ యుపేక్ష్యంబు గాదు. 145

ప్రతిపదార్థం: అహిత, వృద్ధి= మేలుకోరేవారుకాని వాళ్ళయొక్కఅభివృద్ధి-అంటే శత్రువులయొక్క అభివృద్ధిని; ఉపేక్షితంబు+ అగుడున్= పరిగణించక అశ్రద్ధ చేస్తే; అల్పము+అగు= తక్కువగా ఉండే; మహావ్యాధియున్+పోలెన్= పెద్దరోగంవలె; అది; అసాధ్యము+అయి= అదుపుచేయటానికి; వీలుకానిదై; ఉపేక్షకున్= అశ్రద్ధచేసినవాణ్ణి; నిర్మూలిత+ఆత్మున్= నాశనమైనవానిగా, చేయున్; కాన= అందుచేత; పాండవశ్రీ= పాండవులఐశ్వర్యం; ఉపేక్ష్యంబు, కాదు= లెక్కలోకి తీసికొనకుండ విడిచివేయతగింది కాదు.

తాత్పర్యం: శత్రువుల అభివృద్ధిని లెక్కలోకి తీసుకోకుండా వదలివేస్తే- మొదట తక్కువగా ఉన్నా పెరిగి పెరిగి పెద్దదై అదుపుచెయ్యటానికి సాధ్యంకాని మహావ్యాధిలా, అశ్రద్ధ చేసినవాణ్ణే అది నాశనం చేస్తుంది. అందువల్ల పాండవుల ఐశ్వర్యం ఏమాత్రం వదిలివేయతగింది కాదు.

విశేషం: అలం: ఉపమ. గుణం: అర్థవ్యక్తి.

వ. 'దాని నెవ్విధంబున నయిన నపహరింపవలయు; నట్లుగాని నాఁడు నా హృదయ తాపంబున కుపశమనంబుగా; దనిన దుర్యోధనునకు శకుని యి ట్లనియె. 146

ప్రతిపదార్థం: దానిన్= ఆ పాండవ ఐశ్వర్యాన్ని; ఏ+విధంబునన్+అయినన్= ఏ పద్ధతిని అనుసరించి అయినా; అపహరింపవలయున్= దొంగిలించాలి; అట్లు; కాని, నాఁడు= ఆ విధంగా జరగని రోజు; నా, హృదయ, తాపంబునకున్= నా గుండెలోని బాధకు; ఉపశమనంబు= తగ్గుదల; కాదు; అనిన; దుర్యోధనునకు; శకుని; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'పాండవుల ఐశ్వర్యాన్ని ఏ పద్ధతిని అనుసరించి అయినా అపహరించాలి. ఆ విధంగా జరుగని నాడు నా హృదయంలోని బాధ తీరదు' అని దుర్యోధనుడు అనగా అతనితో శకుని ఇలా అన్నాడు.

సీ. నాగరథాశ్వసన్నాహ మొనర్పక, । యొడ్డనంబులు దీర్ప, కుభయ సైన్య
వీరుల కరముల వివిధాయుధంబుల । నన్యోన్యసంఘట్టనారవంబు
లెసఁగంగ సంగ్రామ మేర్పడఁ జేయక, । యక్షముల్ దొలిచి యే నశ్రమమునఁ
బ్రతిపక్షతతుల సంపదలు జయించి నీ । కిచ్చెద; వగవంగ నేల? ధర్మ

ఆ. రాజుఁ బ్రీతితోడ రావించి యతనితోఁ । గడఁగు జూద మాడఁ గౌరవేంద్ర!
యొండు పాటఁ బాండవోన్నతి వేల్పుల । కయిన నపహరింప నలవి గాదు. 147

ప్రతిపదార్థం: నాగ, రథ+అశ్వ, సన్నాహము= గజ, రథ, తురగ బలాల ప్రయత్నం; ఒనర్పక= చేయక; ఒడ్డనంబులు= యుద్ధవ్యూహాలు; తీర్పక= ఏర్పరచక; ఉభయ, సైన్యవీరుల= రెండు సైన్యాలలోని వీరుల యొక్క; కరములన్= చేతులలో; వివిధ+ఆయుధంబులన్= పలురకాలైన ఆయుధాలచేత; అన్యోన్య, సంఘట్టనా, రవంబులు= ఒకరినొకరు తాకిన శబ్దాలు; ఎసఁగంగన్= అతిశయించగా; సంగ్రామము= యుద్ధం; ఏర్పడన్= కలిగేటట్లు; చేయక; అక్షముల్= పాచికలు; తొలిచి= రంధ్రాలు చేసి, రూపొందించి; లేదా, దొలిచి= దొర్లించి; ఏన్= నేను; అశ్రమమునన్= శ్రమలేకుండ; ప్రతిపక్ష, తతుల, సంపదలు= ఎదుటి పక్ష సమూహాల సంపదలు; జయించి= గెలిచి; నీకున్; ఇచ్చెదన్; వగవంగన్= దుఃఖించటం; ఏల= ఎందుకు? కౌరవ+ఇంద్ర= కౌరవరాజా! ఓ దుర్యోధనా!; ధర్మరాజున్; ప్రీతితోడన్= ప్రియమార; రావించి; అతనితోన్; జూదము+ఆడన్; కడఁగు= పూనుకొనుము; ఒండుపాటన్= వేరొక విధంగా; పాండవ+ఉన్నతి= పాండవులయొక్క గొప్పదనం; వేల్పులకున్+అయినన్= దేవతలకైనా; అపహరింపన్= మోసగించి తీసుకోవటం; అలవిగాదు= సాధ్యం కాదు.

తాత్పర్యం: గజ రథ తురగ బలాల ప్రయత్నాలు లేకుండ, యుద్ధవ్యూహాల ఏర్పాట్లు చెయ్యకుండ, ఉభయసైన్యాల వీరుల చేతి ఆయుధాల తాకిడి శబ్దాలు పెల్లుబికేటట్లు పోరు సలుపకుండ, పాచికలు దొర్లించి, ఎదుటిపక్షంవాళ్ళ సంపదలు శ్రమలేకుండ గెలిచి నీ కిస్తాను. దుఃఖపడటం ఎందుకు? దుర్యోధనా! ధర్మరాజును ప్రియమార పిలిచి ఆతనితో జూదమాడు. ఇంకో విధంగా పాండవుల గొప్పతనం అపహరించటం ఆ దేవతలకైనా సాధ్యంకాదు.

విశేషం: అవినీతి పరులకు అక్రమ సంపాదనమీద అభిలాష మెండు. అక్రమ మార్గానుసరణం ఒక విధంగా వ్యక్తి అశక్తతకు చిహ్నమే. 'అక్షముల్ దొలిచి'- అంటే పాచికలను (యుక్తిగా) దొర్లించటం; దొలుచు అనే ధాతువు సంస్కృత 'దోలనం' నుండి ఏర్పడినరూపం. ఇచట కొన్ని ప్రతుల్లో 'అక్షములొడ్డి', 'అక్షముల్ దాల్చి' అనే పాఠాంతరా లున్నాయి. వీటి అర్థం స్పష్టం.

వ. అనిన ధృతరాష్ట్రుండు దాని కొడంబడనొల్లక 'యేను విదురు శాసనంబున వర్తిల్లుచున్నవాఁడ; నాతం డర్థానర్థ విదుండు, సకలకార్యసమర్థుండు; జూదంబున విగ్రహం బగు ననియె; బలవంతులతోడి విగ్రహంబు పరిహరించుట లగ్గు; నా వచనంబు ధర్మోపేతంబు; దీని నతిక్రమించి యనుతాపంబు సేయక యిప్పుడు జూదం బుడిగి యెప్పటియట్ల యుండుట కార్యం' బనిన విని దుర్యోధనుం డతని కి ట్లనియె. 148

ప్రతిపదార్థం: అనినన్; ధృతరాష్ట్రుండు; దానికిన్= జూదానికి; ఒడంబడన్, ఒల్లక= ఒప్పుకొనటానికి ఇష్టపడక; ఏను= నేను; విదురుశాసనంబునన్= విదురుడు చెప్పినప్రకారం; వర్తిల్లుచున్+ఉన్నవాఁడన్= నడుచుకొంటూ ఉన్నవాణ్ణి; ఆతండు; అర్థ+అనర్థ, విదుండు= న్యాయాన్యాయాలు లేదా మేలుకీళ్ళు బాగా తెలిసినవాడు; సకల, కార్య, సమర్థుండు= చేయదగిన అన్ని పనులలోను నేర్పుకలవాడు; జూదంబునన్= జూదమాడటంచేత; విగ్రహంబు+అగున్+అనియెన్= యుద్ధంకలుగుతుందని చెప్పాడు; బలవంతులతోడి; విగ్రహంబు= యుద్ధం; పరిహరించుట= విడవటం; లగ్గు= మేలు; నా వచనంబు= నామాట; ధర్మ+ఉపేతంబు= ధర్మంతో కూడుకొన్నది; దీనిన్; అతిక్రమించి= దాటి; అనుతాపంబు= పశ్చాత్తాపం; చేయక= పొందక; ఇప్పుడు; జూదంబు; ఉడిగి= మానుకొని; ఎప్పటి, అట్ల; ఉండుట; కార్యంబు= చేయదగినపని; అనినన్; విని; దుర్యోధనుండు; అతనికిన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని దుర్యోధను డనగా- ధృతరాష్ట్రుడు జూదానికి ఇష్టపడక, 'నేను విదురుడు చెప్పినట్లు నడుచుకొంటాను. అతడు న్యాయాన్యాయాలు లేదా మేలుకీళ్ళు బాగా తెలిసినవాడు. చేయదగినపను లన్నింటిలో నేర్పుకలవాడు. జూదమాడటంవల్ల యుద్ధం కలుగుతుందని చెప్పాడు. బలవంతులతో యుద్ధం నివారించటం మేలు. నామాట ధర్మంతో కూడుకొన్నది. దీన్ని దాటి, తరువాత దుఃఖించక, ఇప్పుడు జూదం మాని ఎప్పటిలా ఉండు. అది మంచిది' అని అనగా తండ్రితో దుర్యోధనుడు ఇలా అన్నాడు.

క. తనకార్య మొరుమతంబున । నొనరింపఁగ నేర నగునె యొరునిమతంబుం
దనమతము నొకఁడు గా నో । పునె? చెచ్చెర నిశ్చయింపఁబోలునె దానిన్? 149

ప్రతిపదార్థం: తన, కార్యము= తాను చేయదగినపని; ఒరు, మతంబునన్= ఇతరుల ఇష్టంప్రకారం; ఒనరింపఁగ నేరన్+అగునె= చేయదగునా?; ఒరుని, మతంబున్= ఇతరుని అభిప్రాయం; తన, మతమున్= తన అభిప్రాయం; ఒకఁడు, కాన్+ఓపునె= ఒకటి అవుతుందా?; దానిన్= ఇతరుల అభిప్రాయం తన అభిప్రాయం ఒకటి అవుతుందనే విషయాన్ని; చెచ్చెరన్= వెంటనే; నిశ్చయింపన్+పోలునె= నిర్ణయించటం సాధ్యమా?

తాత్పర్యం: తాను చెయ్యవలసిన పనిని ఇంకొకడి ఇష్టప్రకారం చెయ్యవచ్చా? ఇతరుల అభిప్రాయం, తన అభిప్రాయం ఒకటిగా ఉంటుందా? ఒకే విధంగా ఉంటుం దని వెంటనే నిర్ణయించటం సాధ్యమా?

ఆ. విదురుమతము పాండవేయహితార్థంబు; । వానిబుద్ధి నెగడవలవ; దన్య
పక్షపాతబుద్ధిఁ బరఁగుచు నుండెడు । నట్టి వాని నాప్తుఁ డనఁగ నగునె? 150

ప్రతిపదార్థం: విదురు, మతము= విదురుని అభిప్రాయం; పాండవేయ, హిత+అర్థంబు= పాండవుల మేలునే ప్రయోజనంగా కలిగినట్టిది - అంటే పాండవుల మేలు కోరేటటువంటిది; వాని= ఆ విదురునియొక్క; బుద్ధి= ఆలోచన; నెగడన్, వలవదు= వర్తిల్లకూడదు, - అంటే అతడు చెప్పినట్లు చేయకూడదు; అన్య, పక్షపాత, బుద్ధిన్= ఇతరులపట్ల పక్షపాతం గల మనస్సుతో; పరఁగుచున్= ఒప్పుతూ; ఉండెడున్+అట్టివానిన్= ఉన్నట్టివాడిని; ఆప్తుఁడు= స్నేహితుఁడు; అనఁగన్+అగునె= అని అనవచ్చునా?

తాత్పర్యం: విదురుని అభిప్రాయం ఎప్పుడూ పాండవుల మేలు కోరేదే. అందువల్ల అతడు చెప్పినట్లు చెయ్యకూడదు. ఇతరుల పట్ల పక్షపాతం గలవాణ్ణి మనం ఆప్తు డని అనుకోవచ్చా?

విశేషం: నన్నయ వాక్యాలు కొన్ని సూత్రాల్లా సాగుతాయి. నానారుచిరార్థసూక్తులై శోభిల్లుతాయి. 'విదురుమతము పాండవేయహితార్థంబు'- ఇది సంస్కృత పద్ధతిలో సూత్రంలా సాగిన వాక్యం. 'అన్యపక్షపాత బుద్ధిఁ బరఁగుచు నుండెడు నట్టివాని నాప్తుఁ డనఁగ నగునె' అనేది ఒక చక్కని సూక్తి.

వ. 'జూదం బన్నది పురాణంబులయందును వినంబడు; దీన దోషంబు లేదు; సుహృద్ద్యూతంబున దేవతలు దేవసాయుజ్యంబు వడయుదురు; గాన, దీనిం బ్రవర్తింప శకుని కానతిచ్చి యిందులకు ధర్మనందను రావింప వలయు' ననిన ధృతరాష్ట్రుండు పెద్దయుం బ్రొద్దు చింతించి, యెట్టకేనియు దాని కొడంబడి, విదురుం బిలిపించి వాని కి ట్లనియె. 151

ప్రతిపదార్థం: జూదంబు; అన్నది; పురాణంబుల, అందును; వినంబడున్; దీనన్= ఈ జూదంలో; దోషంబు; లేదు; సుహృత్+ ద్యూతంబునన్= స్నేహంగా ఆడుకొనే జూదంవల్ల; దేవతలు; దేవ, సాయుజ్యంబు= దేవత్వయోగాన్ని; పడయుదురు= పొందుతారు; కాన= అందువలన; దీనిన్= ఈ జూదాన్ని; ప్రవర్తింపన్= నడిపించటానికి; శకునికిన్; ఆనతి; ఇచ్చి; ఇందులకున్; ధర్మనందనున్; రావింపవలయున్= రప్పించాలి; అనినన్; ధృతరాష్ట్రుండు; పెద్దయున్+ప్రొద్దు= చాలాసేపు; చింతించి= ఆలోచించి; ఎట్టకేనియున్= చిట్టచివరికి; దానికిన్= ఆ జూదానికి; ఒడంబడి= అంగీకరించి; విదురున్, పిలిపించి; వానికిన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'జూదం అనేది పురాణాల్లోకూడా వినిపిస్తుంది. దీనిలో దోషం లేదు. స్నేహంగా ఆడుకొనే జూదంవల్ల దేవతలు దేవత్వాన్ని పొందుతున్నారు. అందువల్ల ఈ జూదాన్ని నడిపించటానికి శకునికి అనుమతి ఇచ్చి, ధర్మరాజును ఇక్కడికి రప్పించాలి' అని దుర్యోధను డనగా, ధృతరాష్ట్రుడు చాలా సేపు ఆలోచించి, చివరకు అంగీకరించాడు. విదురుణ్ణి పిలిపించాడు. అతనితో ఇలా అన్నాడు.

విశేషం: 'దివు' ధాతువుకు అనేకార్థా లున్నాయి. దివు-క్రీడా, విజిగీషా, వ్యవహార, ద్యుతి, స్తుతి, మోద, మద, స్వప్న, కాంతి, గతిషు. దీవ్యన్తి ఇతిదేవాః- కాబట్టి దేవనం చేతనే - అంటే ద్యూతక్రీడ చేతనే వాళ్ళు దేవత లయ్యారు. జూదమాడటంచేత దేవతలు దేవత్వాన్ని పొందుతుంటే, మనం జూదమాడటంలో తప్పేమి ఉంది అని దుర్యోధను డంటున్నాడు.

చ. అనుపమరత్నకాంచనచయాంచిత మీ సభ దీని ధర్మనం
దనుఁ డనఘుండు దానుఁ దన తమ్ములు నిందుల కేఁగుదెంచి చూ
చినఁ గడు సంతసం బగు విశిష్టజనస్తుత! నీవు వానిఁ దో
డ్కొని చనుదెమ్ము భూసురసఖున్ బుధబంధుజనానురంజనున్. 152

ప్రతిపదార్థం: విశిష్ట, జన, స్తుత= గొప్పవారిచేత ప్రశంసించబడేవాడా! ఓ విదురా!; ఈ, సభ; అనుపమ, రత్న, కాంచన, చయ+అంచితము= సాటిలేనట్టి రత్నాలయొక్క, బంగారుయొక్కసమూహంతో కూడుకొన్నది; అనఘుండు= పాపరహితుడైనవాడు; ధర్మనందనుఁడు= ధర్మరాజు; తానున్, తన తమ్ములున్; ఇందులకున్= ఇక్కడికి; ఏఁగుదెంచి= వచ్చి; దీనిన్= ఈ సభను; చూచినన్= చూస్తే; కడున్= మిక్కిలి; సంతసంబు= సంతోషం; అగున్= కలుగుతుంది; నీవు; భూసురసఖున్= బ్రాహ్మణులకు ప్రియమైనవాణ్ణి; బుధ, బంధు, జన+అనురంజనున్= పండితులను, బంధుజనులను సంతోషపరచేవాణ్ణి; వానిన్= ఆ ధర్మరాజును; తోడ్కొని= వెంటబెట్టుకొని; చనుదెమ్ము= రమ్ము.

తాత్పర్యం: గొప్పవారిచేత పొగడబడేవాడా! ఓవిదురా! ఈసభ సాటిలేని మేటి రత్నాలతో, బంగారుతో కూడుకొన్నది. పుణ్యాత్ముడైన ధర్మరాజు, అతని తమ్ములు ఇక్కడికి వచ్చి దీనిని చూస్తే చాలా సంతోషం కలుగుతుంది. నీవు వెళ్ళి- బ్రాహ్మణులకు ప్రియమైనవాడు, పండితులను, బంధువులను సంతోషపరచేవాడు అయిన ఆ ధర్మరాజును వెంటపెట్టుకొనిరా.

విశేషం: ధర్మరాజును పిలిపించటం జూదమాడటానికా? సభను చూడటానికా? ఈ మాత్రం సభను ధర్మరాజు ఎన్నడూ చూడలేదా? అయినా ఆ మయసభముందు ఇదెంత? పైగా ధృతరాష్ట్రుడు 'విశిష్టజనస్తుత!' అని విదురుణ్ణి సంబోధిస్తున్నాడు. ధర్మజునికి అనఘుడు. భూసురసఖుడు, బుధ బంధు జనానురంజకుడు - అనే విశేషణాలు ప్రయోగిస్తున్నాడు. లోకం ధృతరాష్ట్రుణ్ణి గురించి నోట తీపి, అంగిట విషం' అనటం ఇందుకే కాబోలు. గుణం: అర్థవ్యక్తి.

వ. 'ఇట్టి విచిత్ర రత్న సభావేదికాతలంబున నతండును దుర్యోధనుతోడం బ్రొద్దువోక సుహృద్ద్యూతంబుఁ బ్రవర్తించు'
ననిన విని విదురుండు విషణ్ణహృదయుండయి 'మాయా దురోదరంబు దురర్థంబుగాఁ జింతించి దీని
నుడిగిన నుభయపక్షంబులకు ల గ్గగు' నని పెక్కుమాఱులు వారించి. 153

ప్రతిపదార్థం: ఇట్టి= ఈ విధమైన; విచిత్ర, రత్న, సభా, వేదికా, తలంబునన్= ఆశ్చర్యకరాలైన రత్నాలతో కూడిన సభలోని అరుగుమీద; అతండును= ఆ ధర్మరాజు; దుర్యోధనుతోడన్; ప్రొద్దు, పోక= కాలక్షేపానికి; సుహృత్+ద్యూతంబున్= మైత్రితో కూడుకొన్న జూదాన్ని; ప్రవర్తించున్= ఆడుకొంటాడు; అనిన; విని; విదురుండు; విషణ్ణ, హృదయుండు+అయి= దుఃఖాన్ని పొందిన మనస్సు కలవాడయి; మాయా, దురోదరంబు= కపటపుజూదం; దుర్+అర్థంబుకాన్= చెడు ఫలా న్నిచ్చే దానినిగా; చింతించి= ఆలోచించి; దీనిన్= ఈ జూదాన్ని; ఉడిగినన్= మానితే; ఉభయపక్షంబులకున్= రెండు వైపులవాళ్ళకి; లగ్గు= మేలు; అగున్+అని; పెక్కుమాఱులు; వారించి= వద్దని చెప్పి.

తాత్పర్యం: 'ఈ విధంగా ఆశ్చర్యకరాలైన రత్నాలతో కూడుకొన్నసభావేదిక మీద, ధర్మరాజు కాలక్షేపానికి దుర్యోధనునితో మిత్రద్యూతం ఆడతా'డని ధృతరాష్ట్రు డనగా, విదురుడు దుఃఖపడి 'కపటపు జూదంవల్ల అనర్థం కలుగుతుం దని ఆలోచించి, దీనిని మానితే రెండుపక్షాలవాళ్ళకి మేలవుతుం'దని, జూదం వద్దని పెక్కుమార్లు చెప్పి.

విశేషం: ధర్మరాజును పిలిపించేది అతని ప్రొద్దుపోకకా! దుర్యోధనునితో జూదమాడే అవకాశం కల్పించటానికా? అన్యాయంగా అతని సంపదను అపహరించటానికా? ఎంత తీయగా మాట్లాడినా, తడిగుడ్డతో గొంతుకోసే ధృతరాష్ట్రుని తత్త్వం తలుపు సందునుండి తొంగిచూచినట్లు కొంత కొంత తెలుస్తూనే ఉంది.

విదురుఁడు ధర్మరాజుం దోడ్కొని వచ్చుట (సం. 2-52-1)

క. అవిలంఘనీయ మీదు । ర్వ్యవసాయం బనుచు సత్యవచనుఁడు ధర్మా
ర్థవిదుం డప్పుడు ధృతరా । ష్ట్రవిధాతృనియోగమున కొడంబడి యంతన్. 154

ప్రతిపదార్థం: ఈ, దుర్+వ్యవసాయంబు= ఈ చెడ్డపని; అవిలంఘనీయము= దాట సాధ్యం కానిది; అనుచున్; సత్య, వచనుఁడు= సత్యమైన మాటలు కలవాడు; ధర్మ+అర్థ, విదుండు= ధర్మంయొక్క అర్థం తెలిసినవాడు అయిన విదురుడు; అప్పుడు; ధృతరాష్ట్ర, విధాతృ, నియోగమునకున్= ధృతరాష్ట్రు డనే బ్రహ్మయొక్క ఆజ్ఞకు, ఒడంబడి= ఒప్పుకొని, అంతన్= తర్వాత.

తాత్పర్యం: ఈ చెడ్డపని తప్పించుకోటానికి సాధ్యం కాదని- సత్యం మాట్లాడేవాడు, ధర్మం తెలిసినవాడు అయిన విదురుడు ధృతరాష్ట్రు డనే విధాత ఆజ్ఞకు తలవంచి- అప్పుడు,

క. ఇంద్రప్రస్థపురంబున । కింద్రగురుప్రతిభుఁ డరిగి యింద్రసమానుం
జంద్రయశు ననుజసహితు నృ । పేంద్రుని ధర్మసుతుఁ గాంచె నెంతయుఁ బ్రీతిన్. 155

ప్రతిపదార్థం: ఇంద్ర, గురు, ప్రతిభుఁడు= దేవేంద్రుని గురువైన బృహస్పతితో సమానమైన బుద్ధిబలం కలవా డయిన విదురుడు; ఇంద్రప్రస్థపురంబునకున్; అరిగి= వెళ్ళి; ఇంద్ర, సమానున్= దేవేంద్రునితో సమానమైనవాణ్ణి; చంద్ర, యశున్= చంద్రునివలె ప్రకాశించే కీర్తికలవాణ్ణి; అనుజ, సహితున్= తమ్ములతో కూడుకొన్నవాణ్ణి; నృప+ఇంద్రునిన్= రాజశ్రేష్ఠుని; ధర్మసుతున్= ధర్మరాజును; ఎంతయున్= మిక్కిలి; ప్రీతిన్= ప్రేమతో; కాంచెన్= చూచాడు.

తాత్పర్యం: దేవేంద్రుని గురువైన బృహస్పతితో సమానమైన బుద్ధిబలం గల విదురుడు, ఇంద్రప్రస్థపురానికి వెళ్ళి- దేవేంద్రునితో సమానమైనవాడు, చంద్రుని వలె ప్రకాశించే కీర్తికలవాడు, తమ్ములతో కూడి ఉన్నవాడు, రాజశ్రేష్ఠుడు అయిన ధర్మరాజును ఎంతో ప్రేమతో దర్శించాడు.

విశేషం: అలం: ఉపమ, వృత్త్యనుప్రాసం.

వ. అతనిచేత నభ్యర్చితుం డయి కుశలం బడిగి నిజాగమనప్రయోజనం బెఱింగించిన విని, విదురునకు ధర్మతనయుం డి ట్లనియె. 156

ప్రతిపదార్థం: అతనిచేతన్= ఆ ధర్మరాజుచేత; అభ్యర్చితుండు+అయి= పూజించబడినవాడయి; కుశలంబు= క్షేమం; అడిగి; నిజ+ఆగమన, ప్రయోజనంబు= తనరాకయొక్కకారణం; ఎఱింగించినన్= చెప్పగా; విని; ధర్మతనయుండు= ధర్మరాజు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: విదురుడు ధర్మరాజు పూజలందుకొని, అతని క్షేమ మడిగి, తనరాకకు గల కారణం చెప్పగా, ధర్మరాజు ఇలా అన్నాడు.

సీ. 'పుత్త్రవత్సలుఁడు విచిత్రవీర్యాత్మజుఁ । డార్యుండు ధృతరాష్ట్రుఁ డాదరించి
నిన్ను నియోగించె నన్నుఁ దోడ్కొని తేర; । నీవును వచ్చితి నెమ్మితోడ;
లాలితాపూర్వసభాలోకనంబున । యందు జూదంబు కార్యంబె? చెపుమ;
జూదంబు కతమున భేదంబు గాకుండ । నేరదు మాలోన; నీనియోగ

ఆ. మనఘ! మా కలంఘ్య మయినట్లు ధృతరాష్ట్రు । పనుపుసేయ నీకుఁ బాడి యదియ'
యనుచు విధినియుక్తుఁ డయి యప్డు విదురుతో । నేఁగ నిశ్చయించె నిందుకులుఁడు. 157

ప్రతిపదార్థం: అనఘ= పాపరహితుడా!; విదురా!; పుత్త్రవత్సలుఁడు= పుత్రులపట్ల స్నేహభావం కలవాడు; విచిత్ర, వీర్య+ ఆత్మజుఁడు= విచిత్రవీర్యునికుమారుడు; ఆర్యుండు= పూజ్యుడుఅయిన; ధృతరాష్ట్రుఁడు; ఆదరించి= మన్నన చూపి; నన్నున్; తోడ్కొనితేరన్= పిలుచుకొని రావటానికి; నిన్నున్; నియోగించెన్= నియమించాడు; నీవును= నీవుకూడ; నెమ్మితోడన్=

ప్రేమతో; వచ్చితి= వచ్చావు; లాలిత+అపూర్వ, సభా, లోకనంబునన్= అందమై మిక్కిలి అరుదైన సభను చూస్తున్నపుడు; అందున్; జూదంబు; కార్యంబె= చేయదగిందేనా?; చెపుమ= చెప్పుము; మాలోనన్; జూదంబు; కతమునన్= జూదమాడటం కారణంగా; భేదంబు= వైరం; కాకుండ నేరదు= కలగకుండా ఉండదు; నీ నియోగము= నీ ఆజ్ఞ; మాకున్; అలంఘ్యము= దాటరానిది; అయినట్లు= అయిన విధంగానే; ధృతరాష్ట్రు, పనుపు= ధృతరాష్ట్రుని ఆజ్ఞను; చేయన్= చేయటం; నీకున్; పాడి, అది+అ= న్యాయమే; అనుచున్; ఇందుకులుఁడు= చంద్రవంశపు రాజైన ధర్మజుడు; విధి, నియుక్తుఁడు+అయి= దైవంచేత నియమింపబడినవాడై- అంటే దైవ నిర్ణయానుసారం; విదురునితోన్; ఏఁగన్= వెళ్ళటానికి; నిశ్చయించెన్.

తాత్పర్యం: 'పుణ్యాత్మా! విదురా! పుత్రులపట్ల స్నేహభావం కలవాడు, విచిత్రవీర్యునితనయుడు, పూజ్యుడు, అయిన ధృతరాష్ట్ర మహారాజు- ఆదరంతో నన్ను పిలుచుకొని ర మ్మని నిన్ను పంపాడు. ప్రేమతో నీవు నా దగ్గరకు వచ్చావు. అందమై, అపూర్వమైన ఆ సభను చూడటానికి వచ్చి అందులో జూదమాడటం తగునా? చెప్పు. ఈ జూదం కారణంగా మాలో మాకు వైరం ఏర్పడక మానదు. నీ ఆజ్ఞ మా కెట్లా మీరరానిదో, ధృతరాష్ట్రుని ఆజ్ఞ నీకూ అట్లే' అని- చంద్రవంశప్రభువైన ధర్మరాజు విధివశాన విదురుని వెంట వెళ్ళటానికి నిశ్చయించాడు.

విశేషం: అంతా దైవనిర్ణయం అనటం వేరు. కాని వ్యసనం మానవస్వభావంలో ఒక బలమైన భాగం. అందువల్ల ధర్మరాజు అన్నీ తెలిసి విదురుని వెంట హస్తినకు వెళ్ళాడు. జూద మాడాడు. ధర్మరాజులో ఈ వ్యసనమే లేకుంటే మహాభారతకథ మరోవిధంగా ఉండేది. (ధర్మరాజువాక్యవిన్యాసంలో వికటత్వం అర్థప్రకటనలో అగ్రామ్యత్వం సందర్భోచితంగా సంవదించటంవలన ఉదారతాగుణం రాణించింది. సంపా.)

క. **అనుజులు ద్రుపదాత్మజయును । ననుచరముఖ్యులును ధౌమ్యుఁ డాదిగ విద్వ**
జ్జనులును దోఁ జనుదేరఁగ । నినసన్నిభతేజుఁ డరిగె నిభపురమునకున్. **158**

ప్రతిపదార్థం: అనుజులు= తమ్ములు; ద్రుపద+ఆత్మజయును= ద్రుపదునికూతురైన పాంచాలియు; అనుచర, ముఖ్యులును= ముఖ్యులైన సేవకులును; ధౌమ్యుఁడు+ఆదిగన్= ధౌమ్యుడుమొదలయిన; విద్వత్+జనులును= పండితులును; తోన్+ చనుదేరఁగన్= వెంటరాగా; ఇన, సన్నిభ, తేజుఁడు= సూర్యునితో సమానమైన తేజస్సుకలవాడు - ధర్మరాజు; ఇభ, పురమునకున్= హస్తినాపురానికి; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: తమ్ముళ్ళు, ద్రౌపది, ముఖ్యసేవకులు, ధౌమ్యుడు మొదలైన పండితులు వెంటరాగా, సూర్యతేజుడైన ధర్మరాజు హస్తినాపురానికి వెళ్ళాడు.

వ. **అందు దుర్యోధన దుశ్శాసనాది పుత్త్రశతంబుతో భీష్మశల్య శకుని సైంధవ కర్ణ గౌతమ ద్రోణాశ్వత్థామ సోమదత్త సమేతుండయి యున్న ధృతరాష్ట్రునకు భానుమతీ ప్రభృతిస్నుషా పరివృతయయి తారకాపరివృత యయి యున్న రోహిణియుంబోలె నున్న గాంధారీదేవికిఁ గురువృద్ధజనులకు నతివినయంబున ననుజ సహితుండయి ధర్మతనయుండు మ్రొక్కె; నంత ద్రుపదరాజనందనయు గాంధారికి మ్రొక్కిన, నక్కోమలిం జూచి గాంధారికోడం డ్రల్లను విస్మితలయి.** **159**

ప్రతిపదార్థం: అందున్= ఆ హస్తినాపురంలో; దుర్యోధన, దుశ్శాసన+ఆది, పుత్త్ర,శతంబుతోన్= దుర్యోధనుడు, దుశ్శాసనుడు మొదలయిన నూరుగురు కొడుకులతో; భీష్మ, శల్య, శకుని, సైంధవ, కర్ణ, గౌతమ, ద్రోణ+అశ్వత్థామ, సోమదత్త, సమేతుండు+

అయి, ఉన్న= భీష్ముడు, శల్యుడు, శకుని మొదలయిన వారితో కూడి ఉండే; ధృతరాష్ట్రునకు; భానుమతీ, ప్రభృతి, స్నుషా, పరివృత, అయి= భానుమతి మొదలైన కోడండ్రచేత చుట్టబడినదై- అంటే భానుమతి మొదలయిన కోడళ్ళందరూ చుట్టూ చేరి ఉన్నారనటం; తారకా, పరివృత, అయి= నక్షత్రాలచేత చుట్టబడినదై; ఉన్న; రోహిణియున్+పోలెన్= రోహిణివలె; ఉన్న; గాంధారీదేవికిన్, కురువృద్ధజనులకున్= కురువంశంలోని పెద్దలకు; అతి, వినయంబునన్= మిక్కిలి వినయంతో; అనుజ, సహితుండు+అయి= తమ్ములతో కూడినవాడై; ధర్మతనయుండు= ధర్మరాజు; మ్రొక్కెన్= నమస్కరించాడు; అంతన్; ద్రుపదనందనయున్= ద్రౌపదికూడ; గాంధారికిన్; మ్రొక్కినన్, ఆ+కోమలిన్= ఆ అందగత్తెను; చూచి; గాంధారి కోడండ్రు+ఎల్లను= గాంధారీదేవికోడ ళ్ళందరూ; విస్మితలు+అయి= ఆశ్చర్యపడినవాళ్ళయి.

తాత్పర్యం: హస్తినాపురంలో - దుర్యోధనుడు, దుశ్శాసనుడు మొదలైన నూర్గురు కొడుకులతో, భీష్మ, శల్య, శకుని, సైంధవ, కర్ణ, కృప, ద్రోణ, అశ్వత్థామ, సోమదత్తులతో కూడి ఉన్న ధృతరాష్ట్రునికి, భానుమతిమొదలయిన కోడళ్ళతోకూడి, నక్షత్రాల మధ్య రోహిణిలా ఉన్న గాంధారీదేవికి, కురుకులంలోని పెద్దలకు ధర్మరాజు తమ్ముళ్ళతో గూడి ఎంతోవినయంగా నమస్కరించాడు. అప్పుడు ద్రౌపది కూడ గాంధారిదేవికి మ్రొక్కగా, ఆమె అందాన్ని చూచి గాంధారి కోడ ళ్ళందరూ ఆశ్చర్యపడ్డారు.

విశేషం: అలం: ఉపమ.

తే. **'అఖిలలావణ్యపుంజంబు నబ్జభవుఁడు । మెలఁతగా దీనియందు నిర్మించె నొక్కొ!**
కానినాఁ డిట్టి కాంతి యే కాంతలందు । నేల లే?'దని సామర్షహృదయ లయిరి. **160**

ప్రతిపదార్థం: అబ్జభవుఁడు= పద్మంనుండి పుట్టినవాడు - బ్రహ్మదేవుడు; అఖిల, లావణ్య, పుంజంబున్= సమస్త సౌందర్య కాంతి సమూహాన్ని; మెలఁతగా= స్త్రీగా; దీని+అందున్= ఈ ద్రౌపదిపట్ల; నిర్మించెన్+ఒక్కొ= నిర్మించాడోగదా! కాని, నాఁడు= అలాకానప్పుడు; ఇట్టి, కాంతి; ఏకాంతల+అందున్= ఏ స్త్రీలలోకూడ; ఏలన్= ఎందుచేత; లేదు+అని; స+అమర్ష, హృదయలు= అసూయతో కూడిన మనస్సు కలవాళ్ళు; అయిరి.

తాత్పర్యం: 'బ్రహ్మదేవుడు సమస్తసౌందర్యకాంతిసమూహాన్ని ఈ ద్రౌపదీకాంతగా నిర్మించిన ట్లున్నాడు. అందువల్లనే కాబోలు! ఇంతటికాంతి ఏ యితరకాంతల్లోనూ కానరాదు' అని వాళ్ళంతా అసూయ చెందారు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. సాటి స్త్రీలే అసూయపడేటంత లావణ్యవతి ద్రౌపది. (ఈ పద్యంలోని వ్యంగ్యవైభవాన్నిగురించి విశ్వనాథ సత్యనారాయణగారు చేసినవ్యాఖ్యను పీఠికలో గమనించవచ్చు.)

వ. **ఇట్లు పాండవ కౌరవు లతిప్రణయగౌరవంబున నద్దివసంబు సలిపి రంతఁ బ్రభాతంబ.** **161**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; పాండవ, కౌరవులు; అతి, ప్రణయ, గౌరవంబునన్= మిక్కిలి ప్రేమాతిశయంతో; ఆ+దివసంబు= ఆ రోజు; సలిపిరి= గడిపారు; అంతన్; ప్రభాతంబు+అ= ఉదయాన్నే.

తాత్పర్యం: ఈ విధంగా పాండవకౌరవులు ఎంతో ప్రేమాదరాలతో ఆరోజంతా గడిపారు. మరునాటి ఉదయం.

ఉ. ఆ ధృతరాష్ట్రుచేసిన యనర్ఘమణిప్రకరానుబద్ధ శో
భాధృతి నొప్పుచున్న సభ పార్థివముఖ్యుఁడు ధర్మజుండు దు
ర్యోధనుఁ డర్థిఁ జూపఁగ సహోదరవీరులుఁ దానుఁ జూచి ల
క్ష్మీధరమూర్తి యెంతయును మెచ్చె మనంబునఁ దద్విభూతికిన్. 162

ప్రతిపదార్థం: ఆ, ధృతరాష్ట్రు, చేసిన= ఆ ధృతరాష్ట్రమహారాజు నిర్మించిన; అనర్ఘ, మణి, ప్రకర+అనుబద్ధ, శోభా, ధృతిన్= వెలలేనిమణులసమూహంతో కూర్చబడిన శోభను ధరించటంచేత; ఒప్పుచున్+ఉన్న= అందంగా ఉండే; సభన్= సభను; దుర్యోధనుఁడు; అర్థిన్= వేడ్కతో; చూపఁగన్; పార్థివ, ముఖ్యుఁడు= రాజులలో ప్రముఖు డైనవాడు; ధర్మజుండు; తానున్; సహోదర, వీరులు= వీరులైనతమ్ములు; చూచి; లక్ష్మీధరమూర్తి= లక్ష్మిని ధరించిన విష్ణుమూర్తివంటి ధర్మరాజు (నాఽవిష్ణుః పృథివీపతిః - అని గదా ఆర్యోక్తి. అందుచేత పృథ్వీపతి అయిన ధర్మరాజు లక్ష్మీధరమూర్తియే), తత్+విభూతికిన్= ఆ సభాభవనవైభవానికి; మనంబునన్= మనస్సులో; ఎంతయును= మిక్కిలి; మెచ్చెన్.

తాత్పర్యం: ఆ ధృతరాష్ట్రమహారాజు నిర్మించింది, అమూల్య మణిసమూహశోభతో ప్రకాశించేది - అయిన సభను దుర్యోధనుడు ప్రీతితో చూపించగా, రాజుల్లో ప్రముఖుడైన ధర్మరాజు, వీరులైన తమ్ముళ్ళతో కలిసి ఆ సభావైభవాన్ని చూచాడు. మనస్సులో ఎంతో మెచ్చుకొన్నాడు.

వ. అయ్యపూర్వసభామణి కుట్టిమంబున నందఱు సుఖాసీనులయి యిష్టసంభాషణాది క్రీడావసరంబున నున్నంత దుర్యోధనుండు యుధిష్ఠిరున కి ట్లనియె. 163

ప్రతిపదార్థం: ఆ+అపూర్వ, సభా, మణి, కుట్టిమంబునన్= ఆ అపురూపమైన సభలో మణులతో నిర్మించబడిన తిన్నెమీద; అందరు; సుఖ+ఆసీనులు+అయి= సుఖంగా కూర్చుండి; ఇష్ట, సంభాషణ+ఆది, క్రీడా+అవసరంబునన్+ఉన్నంతన్= ఇష్టమైన సంభాషణలు మొదలయిన వినోదాలతో ఉన్న సమయాన; దుర్యోధనుండు; యుధిష్ఠిరునకున్= ధర్మరాజుకు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆ అపురూపమైన సభలో, మణులతో నిర్మించిన వేదికమీద, అందరు సుఖంగా కూర్చుండి, సరస సల్లాపాది వినోదాలతో ఉన్న సమయాన దుర్యోధనుడు ధర్మరాజుతో ఇలా అన్నాడు.

క. అనఘ! సుహృద్ద్యూతం బిం । దొనరింతము ప్రొద్దుపోకయును నగు, జూదం
బునకుం బ్రియుఁడవు దక్షుఁడ । వన విందుము నిన్నుఁ బ్రీతి నక్షజ్ఞులచేన్. 164

ప్రతిపదార్థం: అనఘ= పాపరహితుడా! ధర్మరాజా!; సుహృత్+ద్యూతంబు= స్నేహంగా ఆడుకొనే జూదం; ఇందున్= ఇక్కడ; ఒనరింతము= ఆడుదాము; ప్రొద్దు, పోకయును+అగున్= కాలక్షేపం జరుగుతుంది; నిన్నున్; ప్రీతిన్= ప్రియమార; అక్షజ్ఞులచేన్= పాచికలాడటం బాగా తెలిసినవాళ్ళచేత; జూదంబునకున్; ప్రియుఁడవు; దక్షుఁడవు= నేర్పరివి; అనన్= అని అనగా; విందుము= విన్నాము.

తాత్పర్యం: పుణ్యాత్మా! ధర్మరాజా! ఇక్కడ స్నేహంగా జూదం ఆడుకొందాం. కాలక్షేపం అవుతుంది. పాచికలాడటం బాగా తెలిసినవాళ్ళు- నీవు జూదంలో ఆసక్తి గలవాడి వని, సమర్థుడి వని చెప్పితే విన్నాం.

వ. అనిన వానికి ధర్మతనయుం డి ట్లనియె. 165

తాత్పర్యం: అనగా దుర్యోధనునితో ధర్మరాజు ఇలా అన్నాడు.

తే. క్షత్రనీతిక్రమంబులు గావు సూవె । నికృతియును జూదమును; ధర్మనిత్యులైన
వారి కీ రెండు వర్జింపవలయు నెందుఁ; । బాపవృత్తంబు జూదంబు పార్థివులకు. 166

ప్రతిపదార్థం: నికృతియును= మోసం; జూదమును; క్షత్ర, నీతి, క్రమంబులు, కావు= క్షత్రియధర్మానికి తగినవికావు; సూవె= సుమా!; ధర్మనిత్యులు+ఐనవారికిన్= ధర్మాన్ని ఎల్లప్పుడూ ఆచరించేవారికి; ఈ, రెండున్; ఎందున్= ఎచ్చటైనా; వర్జింపవలయున్= విడవాలి; పార్థివులకున్= రాజులకు; జూదంబు; పాప, వృత్తంబు= పాపపుపని.

తాత్పర్యం: మోసం, జూదం- క్షత్రియధర్మానికి తగినవి కావు సుమా! ఎప్పుడూ ధర్మాన్ని ఆచరించేవాళ్ళు ఈ రెంటిని వదలివెయ్యాలి. రాజులు జూదమాడటం పాపపు పని.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. ధర్మరాజు ఆవులిస్తే ప్రేవులు లెక్కపెట్టగలవాడు. ధర్మరాజు జూదంలో ఆసక్తి కలవాడనీ, అందులో సమర్థుడనీ, 'అక్షజ్ఞుల' వలన విన్నాడట దుర్యోధనుడు. ఆ మాట వినగానే ధర్మజునికి తెలిసిందేమో- ఆ బుద్ధి దుర్యోధనుడి బుఱ్ఱలో పుట్టింది కా దని, అక్షవిద్య తెలిసిన శకుని దుష్ట చింతన అని. పైగా దుర్యోధనుడు అక్షవిద్యలో నిపుణుడు కాడు. శకుని మోసగాడు. అతని వ్యూహం సుహృద్ద్యూతం. అందుకే ధర్మరాజు ధర్మనిరతులైన క్షత్రియులు జూదం ఆడకూడ దన్నాడు. ఇది వ్యంగ్యంగా దుర్యోధనునికి ఎత్తిపొడుపు. అంతేకాక, జూదంవల్ల పార్థివులు పాపవృత్తులై చెడిపోతా రనటంలో శకునిమాటలు విని చెడిపోకు మన్న హెచ్చరిక కూడా ఉంది. (సంపా.)

ఆ. కుటిలమార్గు లయిన కుత్సితకితవుల । తోడఁ గడఁగి జూదమాడఁ జనదు;
దానఁజేసి యర్థధర్మవివర్జితు । లగుదు రెట్టివారు జగములోన. 167

ప్రతిపదార్థం: కుటిల, మార్గులు+అయిన= మోసపుమార్గాలు అవలంబించేవాళ్ళయిన; కుత్సిత, కితవులతోడన్= నీచపు జూదగాండ్రతో; కడఁగి పూనుకొని; జూదము; ఆడన్+చనదు= ఆడకూడదు; దానన్+చేసి= దానివల్ల; జగములోనన్= ప్రపంచంలో; ఎట్టివారు= ఎటువంటివాళ్ళయినా; అర్థధర్మవివర్జితులు= ధనాన్ని, ధర్మాన్ని కోల్పోయినవాళ్ళు; అగుదురు.

తాత్పర్యం: మోసపు మార్గాలు అనుసరించే నీచపు జూదగాళ్ళతో జూదమాడకూడదు. దానివల్ల లోకంలో ఎటువంటి వాళ్ళయినా ధనాన్ని, ధర్మాన్ని కోల్పోతారు.

విశేషం: నన్నయభట్టారకుని నానారుచిరార్థ సూక్తినిధిత్వానికి పై పద్యాలు రెండూ చక్కని ఉదాహరణలే. లోకంలో ద్యూతవ్యసన పరులకు కనువిప్పు కలిగించే గొప్ప హెచ్చరికలే. కుటిలమతులు, కుత్సితబుద్ధులు అయిన జూదగాళ్ళతో జూదమాడటంవల్ల అర్థం, ధర్మం రెండూ దూరమౌతాయి అన్నమాటల్లో ఆ లక్షణాలు గల జూదగాడు శకుని అని, దుర్యోధనునిది దుష్టవ్యూహ మని, మోసగాళ్ళతో జూదమాడితే ధనం, ధర్మం రెండూ కోల్పోయే ప్రమాదం ఉం దని ధర్మరాజు గ్రహించకపోలే దని ధ్వనిస్తూ ఉంది. చిత్ర మేమంటే - ఇంత తెలిసి, ఇన్ని ధర్మాలు చెప్పి ధర్మరాజు చివరకు జూదమాడాడు. ఎన్నో కష్టాలు అనుభవించాడు. అతని ద్యూతవ్యసనం అంతబలీయం.

వ. 'మఱియు మాయాద్యూతంబున జయించుట మహాపాతకం బనియును, ధర్మద్యూతంబున జయించుట ధర్మయుద్ధంబున జయించు నంతియ పుణ్యం బనియును నసితుండయిన దేవలుండు చెప్పె' ననిన నయ్యుధిష్ఠిరునకు శకుని యి ట్లనియె. 168

ప్రతిపదార్థం: మఱియున్= అంతేకాక, మాయాద్యూతంబునన్= కపటపుజూదంలో; జయించుట= గెలవటం; మహాపాతకంబు= మిక్కిలి పాపం; అనియును; ధర్మ, ద్యూతంబునన్= ధర్మంగా ఆడిన జూదంవల్ల; జయించుట; ధర్మ, యుద్ధంబునన్= ధర్మంగా చేసిన యుద్ధంలో; జయించు, అంతియ= గెలిచేటంతటి; పుణ్యంబు; అనియును; అసితుండు; అయిన; దేవలుండు; చెప్పెన్; అనినన్; ఆ+యుధిష్ఠిరునకున్; శకుని; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'అంతేకాక, కపటపు జూదంలో గెలవటం మహాపాప మని, ధర్మంగా ఆడిన జూదంలో గెలవటం ధర్మంగా చేసినయుద్ధంలో గెలిచినంత పుణ్య మని అసితుడయిన దేవలుడు చెప్పాడు' అని ధర్మరాజు అనగా అతనితో శకుని ఇలా అన్నాడు.

విశేషం: అసితదేవలుడు పితృలోకంలో వ్యాసుని ఆదేశానుసారం భారతాన్ని ప్రచారం చేసిన ఋషీశ్వరుడు. (ధర్మరాజు మాయాద్యూతం మహాపాప మనీ, ధర్మద్యూతం పుణ్యప్రద మనీ ఒక నీతివిశేషం చెప్పాడు. దుర్యోధనుడు పైకి అంటున్నది సుహృద్ద్యూతమైనా, అసలు జరుగబోయేది మాయాద్యూత మని ధర్మజునివాక్యాల్లో ధ్వని, భావికథార్థం భావించి వ్యంగ్యంగా మందలిస్తున్న ధర్మరాజుతో దుర్యోధనుడు మారు మాటాడలేక పోయాడు. పైమాట లన్నీ శకునికి తగిలాయి. ధర్మరాజు తగలాలనే మాట్లాడాడు. అందువల్ల భుజాలు తడువుకుంటూ శకుని బదులుచెప్పాడు. ధర్మరాజు మాట లనే గాలం వేసి, శకుని కుతంత్రాన్ని బైటకు లాగాడు. - సంపా.)

క. ద్యూతకళాకుశలుండగు । నాతఁడు లోకజ్ఞుఁడును మహామతియును వి
ఖ్యాతుఁడు నగు సత్క్షత్రియ । నీతి విదుఁడు దగునె దాని నిందింపంగన్. 169

ప్రతిపదార్థం: ద్యూత, కళా, కుశలుండు+అగు, ఆతఁడు= ద్యూతకళలో నేర్పరి అయినవాడు; లోకజ్ఞుఁడును= లోకజ్ఞానం కలవాడు; మహామతియును= గొప్పమేధావి; విఖ్యాతుఁడున్= ఎంతో పేరు గలవాడు; అగున్; సత్+క్షత్రియ, నీతి, విదుఁడు= ఉత్తమరాజనీతి చక్కగా తెలిసినవాడు; దానిన్= జూదాన్ని; నిందింపంగన్; తగునె= ఒప్పునా? (తగదని భావం).

తాత్పర్యం: జూదమాడే కళలో నేర్పరి, లోకజ్ఞానం కలవాడు, గొప్పమేధావి, కీర్తిమంతుడు, ఉత్తమరాజనీతి చక్కగా తెలిసినవాడు ఆ జూదాన్ని నిందించటం తగునా?

విశేషం: శకుని ధర్మరాజును పొగడ్తలతో ఉబ్బించటం జూదం ఊబిలో దించటానికే. శకుని సామాన్యుడా! ధర్మరాజు ద్యూతవ్యసనం ఎంత బలియమో అతనికి తెలుసు. ఇంతదూరం ధర్మరాజు వచ్చింది జూదం ఆడటానికే కదా. అయితే ధర్మపన్నాలు వల్లిస్తున్నాడు. అంతే. అతనికి పూనకం తెప్పిస్తే చాలు. జూదంలో పడిపోతాడు. అందుకే ఈ ప్రశంస.

క. బలహీను లయిన వారలు । బలవంతుల నొడుచునపుడు బహుమాయల న
చ్ఛలమునఁ జేయుట యెందును । గలయదియ; జయంబ కాదె కర్తవ్య మిలన్. 170

ప్రతిపదార్థం: బలహీనులు+అయిన, వారలు; బలవంతులన్; ఒడుచునపుడు= ఓడించేటప్పుడు; బహుమాయలన్= పెక్కుమోసాలను; అచ్ఛలమునన్= పూనికతో; చేయుట; ఎందును= ఎచ్చటైనా; కల, అది+అ= ఉన్నదేకదా!; జయంబు+అ, కాదె= జయమేకదా!; ఇలన్= భూమిమీద; కర్తవ్యము= చేయదగింది.

తాత్పర్యం: బలహీనులైనవాళ్ళు బలవంతులను ఓడించేటప్పుడు పెక్కుమోసాలకు పూనుకోవటం ఎక్కడైనా ఉన్నదేకదా! లోకంలో ఏ విధంగానైనా జయాన్ని సాధించటమే కదా చెయ్యదగిన పని.

విశేషం: ధర్మజుడు ద్యూతంలో మోసాన్ని నిందించాడు. అది శకునికి గట్టిగా తగిలే ఎత్తిపొడుపే. పైగా శకుని జూదంలో ధర్మరాజును మోసం చెయ్యాలన్న సంకల్పంతోనే ఉన్నాడు. అందుకే ధర్మరాజు ఎత్తిపొడుపును త్రిప్పికొట్టటానికి, మున్ముందు తాను చెయ్యబోయే మోసాన్ని సమర్థించుకోటానికి ఇలా అన్నాడు. మోసానికి నీతి ముసుగు తొడిగాడు. శుక్రనీతిని పేరు చెప్పకుండ పేర్కొన్నాడు. జరాసంధవధలో మీరు చేసింది ఇదే కాదా - అని ధ్వనింపచేశాడు.

వ. 'జూదంబున కీ వోడుదేని యుడుగు' మనిన నాతనికి ధర్మరా జి ట్లనియె. 171

ప్రతిపదార్థం: జూదంబునకున్; ఈవు; ఓడుదు+ఏనిన్= భయపడేటట్లయితే; ఉడుగుము= మానుకొమ్ము; అనినన్; ఆతనికిన్; ధర్మరాజు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'జూద మాడటానికి నీవు భయపడితే మానుకో' - అని అనగా - శకునితో ధర్మరాజు ఈ విధంగా అన్నాడు.

విశేషం: చివరకు శకుని ధర్మరాజు అభిమానాన్ని రెచ్చగొట్టి అతణ్ణి జూదానికి దించాడు.

ధర్మరాజు శకునితో జూదం బాడుట (సం. 2-53-13)

క. 'బలవద్ద్యూతార్థముగాఁ । బిలువంబడి మగుడ నగునె? పెక్కులు పలుకుల్
పలుకంగ నేల?' యని య । త్యలఘుఁడు ధర్మజుఁడు జూద మాడఁ గడంగెన్. 172

ప్రతిపదార్థం: బలవత్+ద్యూత+అర్థంబుగాన్= బలవంతంగా జూదానికి; పిలువంబడి; మగుడన్+అగునె= వెనుదిరిగి వెళ్ళదగునా?; పెక్కులు, పలుకుల్= అనేకములైన మాటలు; పలుకంగన్+ఏల= మాట్లాడటం ఎందుకు? అని; అతి+ అలఘుఁడు= మిక్కిలి గొప్పవాడు; ధర్మజుఁడు; జూదము; ఆడన్= ఆడటానికి; కడంగెన్= పూనుకొన్నాడు.

తాత్పర్యం: బలవంతంగా జూదానికి పిలువబడి వెనుదిరిగి వెళ్ళటమా? ఎక్కువ మాట్లాడటం ఎందుకు? అని ఆ ధర్మరాజు జూదానికి పూనుకొన్నాడు.

వ. ఇట్లు జూదంబున నయ్యెడు దోసం బెఱింగియు దైవానుశాసనంబున ధర్మజుండు దాని కభిముఖుండయి చందన కర్పూర కస్తూరీ పరిషిక్తంబయిన ద్యూతరంగంబునందు ముందఱ గంధపుష్పార్చితంబు లయిన యభిమతాక్షంబు లమర్చికొనియున్న సౌబల వివింశతి చిత్రసేన వికర్ణులం జూచి 'వీరిలో నెవ్వఁడు నాతో జూదం బాడెడు వాఁ?'డనిన నాతనికి దుర్యోధనుం డి ట్లనియె. 173

ప్రతిపదార్థం: ఇట్లు; జూదంబున్= జూదమాడటంచేత; అయ్యెడు= కలిగే; దోసంబు; ఎఱింగియున్= తెలిసికూడా; దైవ+ అనుశాసనంబునన్= దైవాజ్ఞచేత; ధర్మజుండు; దానికిన్= ఆ జూదానికి; అభిముఖుండు+అయి= ఇష్టపడినవాడై; చందన, కర్పూర, కస్తూరీ, పరిషిక్తంబు+అయిన= మంచిగంధం, కర్పూరం, కస్తూరి కలిసిన నీటిచేత చుట్టును తడుపబడిన; ద్యూత, రంగంబు+అందున్= జూదమాడేస్థలంలో; ముందఱ; గంధ, పుష్ప+అర్చితంబులు+అయిన= గంధంచేత, పూలచేత పూజింపబడినవైన; అభిమత+అక్షంబులు= ఇష్టమైన పాచికలు; అమర్చికొని= ఏర్పాటు చేసుకొని; ఉన్న; సౌబల, వివింశతి, చిత్రసేన వికర్ణులన్= శకుని, వివింశతి, చిత్రసేనుడు, వికర్ణుడు అనేవాళ్ళను; చూచి; వీరిలోన్; ఎవ్వడు; నాతోన్; జూదంబు; ఆడెడువాడు; అనినన్; ఆతనికిన్= ధర్మరాజుకు; దుర్యోధనుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: జూదమాడటం తప్పని తెలిసికూడా, దైవనిర్ణయానుసారం ధర్మరాజు అందుకు అంగీకరించాడు. చుట్టూ మంచిగంధం, కర్పూరం, కస్తూరి, కలిపిన నీళ్ళు చల్లిన జూదమాడే స్థలంలో, గంధంచేత, పూలచేత పూజించబడిన పాచికలు అమర్చుకొని కూర్చున్న శకునిని, వివింశతిని, చిత్రసేనుణ్ణి, వికర్ణుణ్ణి చూచి 'వీరిలో ఎవడు నాతో జూదమాడే వా' డనగా అతనితో దుర్యోధనుడు ఇలా అన్నాడు.

తే. **అనఘ! మా మామ శకుని నాకై కడంగి । జూదమాడెడి నీతోడఁ; గాదు నాక**
యీతఁ డొడ్డిన ధనరాసు లెవ్వియైనఁ । బోఁడిగా నీకు నీఁగలవాఁడ నేను. **174**

ప్రతిపదార్థం: అనఘ= పాపరహితుడా! ధర్మరాజా!; శకుని; నాకై= నాకొరకు; కడంగి= పూని, నీతోడన్; జూదము+ఆడెడిన్; కాదు, నాక= కాదని అనకుండ; ఈతఁడు; ఒడ్డిన; ధన, రాసులు; ఎవ్వి+ఐనన్; పోఁడిగాన్= ఒప్పుగా; నేను; నీకున్; ఈన్+కలవాఁడన్= ఈయగలవాడిని.

తాత్పర్యం: పుణ్యాత్మా! ఓ ధర్మరాజా! నా పక్షాన శకుని నీతో జూదమాడతాడు. కాదని అనకుండా- ఇతడు ఒడ్డిన ధనరాసులు ఏవైనా సరే- నీకిస్తా.

వ. **అని తనచేతి యనర్ఘ రత్న కటకంబు లొడ్డిన, 'నన్యులకయి యన్యులు జూదం బాడుట యెంతయు విషమం' బనుచు ధర్మతనయుండు సాగరావర్త సంభవంబులయిన పరార్థ్యమణిహారంబు లొడ్డె; నిట్లు సుహృద్ద్యూతంబు ప్రవర్తిల్లు నదియైన నచ్చోటికి వచ్చి భీష్మ ధృతరాష్ట్ర విదురకృపద్రోణాశ్వత్థామలు విచిత్రోచ్చాసనస్థు లయి దానిం జూచుచు నప్రహృష్టహృదయు లయి యుండి రంత.** **175**

ప్రతిపదార్థం: అని; తన, చేతి; అనర్ఘ; రత్న, కటకంబులు= వెలకట్ట సాధ్యంగాని రత్నాలతో చేయబడిన కంకణాలు; ఒడ్డినన్; అన్యులకున్+అయి= ఇతరులకై; అన్యులు= ఇతరులు; జూదంబు+ఆడుట; ఎంతయున్= మిక్కిలి; విషమంబు= అక్రమం; అనుచున్; ధర్మతనయుండు; సాగర+ఆవర్త, సంభవంబులు+అయిన= సముద్రపు సుడులలో పుట్టిన; పరార్థ్య, మణి, హారంబులు= శ్రేష్ఠాలైన మణులతో చేయబడిన హారాలు; ఒడ్డెన్; ఇట్లు; సుహృత్+ద్యూతంబు= స్నేహంగా ఆడుకొనే జూదం; ప్రవర్తిల్లునది+ఐనన్= నడిచేది కాగా; ఆ+చోటికిన్; వచ్చి; భీష్మ, ధృతరాష్ట్ర, విదుర, కృప, ద్రోణ+అశ్వత్థామలు; విచిత్ర+ఉచ్చ+ ఆసనస్థులు+అయి= విచిత్రాలై ఎత్తైన పీఠాలమీద కూర్చుండి; దానిన్= ఆ జూదాన్ని; చూచుచున్; అప్రహృష్ట, హృదయులు+ అయి= సంతోషం లేని మనస్సు కలవాళ్ళయి; ఉండిరి; అంతన్.

తాత్పర్యం: అని దుర్యోధనుడు అమూల్యరత్నాలతో చేసిన తనకంకణాలను ఒడ్డగా, ఒకరికై మరొకరు జూదమాడటం అక్రమ మని అంటూ ధర్మరాజు సముద్రపు సుళ్ళలో ఉద్భవించిన ఉత్తమ మణులతో చేసిన హారాలను ఒడ్డాడు. ఈవిధంగా స్నేహభావంతో జూదం నడుస్తుండగా, అక్కడికి భీష్మ ధృతరాష్ట్ర విదుర కృప ద్రోణాశ్వత్థామలు వచ్చి, ఎత్తైన పీఠాలమీద కూర్చుండి, సంతోషం లేనిమనస్సుతో ఆ జూదాన్ని చూస్తూ ఉన్నారు.

విశేషం: ఒకరికై మరొకరు జూదమాడటం అక్రమం అనే ధర్మరాజు ఆ జూదంలో ఎందుకు పాల్గొనాలి? వ్యక్తి స్వభావంలో వ్యసనం ఎంతో బలీయం. అందుచేతనే అంతటి ధర్మరాజుకూడ-అందరికీ తెలియటానికి అది అక్రమం అని అన్నారు కాని- ఆటమాత్రం తాను మానలేదు.

తే. అభిమతాక్షముల్ దొల్చి మాయావిదుండు । సుబలరాజాత్మజుఁడు ధర్మసుతు జయించె;
నొడుతు నే నింక నని వెండియును గడంగె । శకునితో జూదమాడ నా శశికులుండు. 176

ప్రతిపదార్థం: అభిమత+అక్షముల్= తన కిష్టమైన పాచికలు; దొల్చి= యుక్తిగా దొర్లించి; మాయావిదుండు= మోసంచేయటం ఎరిగినవాడు; సుబలరాజ+ఆత్మజుఁడు= సుబలుడనే రాజుయొక్క కుమారుడు-శకుని; ధర్మసుతున్= ధర్మరాజును; జయించెన్; ఆ, శశి, కులుండు= ఆ చంద్ర వంశం వాడైన ధర్మరాజు; ఏను= నేను; ఇంకన్; ఒడుతున్= ఓడిస్తాను; అని; శకునితో; వెండియును= మరల; జూదము; ఆడన్; కడంగెన్= పూనుకొన్నాడు.

తాత్పర్యం: తన కిష్టమైన పాచికలు రూపొందించుకొని మోసగా డైన శకుని ధర్మరాజును జయించాడు. ఆ చంద్ర వంశంవాడైన ధర్మరాజు 'నే నింక నిన్ను ఓడిస్తాను' అని శకునితో మళ్ళీ జూదం ఆడటానికి పూనుకొన్నాడు.

వ. ఇట్లు యుధిష్ఠిరుండు బద్ధమత్సరుండయి పెఱిఁగి యొండొండ యొడ్డుచు నిష్కసహస్రభరితానేకాయుత కుండమండితంబు లయిన సువర్ణభాండాగారంబులును, వజ్రవైదూర్యమరకతమౌక్తికనీలప్రవాళ పద్మరాగాది వివిధ శుద్ధ విపుల రత్న పరిపూర్ణంబు లైన రత్నభాండాగారంబులుం, బ్రత్యేకంబ పంచద్రోణ కాంచన సంచితంబు లయిన చతుశ్శతనిధులును, మణికింకిణీ జాలాలంకృతంబు లయిన యసంఖ్యాత హయ యూథంబులును, జాతరూప వరూథంబులుం గనక కక్ష్యాకుథ సనాథంబు లయిన మదాంధ గంధ సింధుర సందోహంబులుం, బరార్థ్య రత్న భూషణ భూషితంబు లయిన యోషిత్సహస్రంబులును, ననుదినాతిథి జన భోజనపాత్రహస్తులయిన శతసహస్రపరిచారకులును, నర్జునునకుఁ జిత్రరథుం డిచ్చిన గంధర్వ హయంబులం దొట్టి దుగ్ధపానశాలి తండుల ఖాదనంబులం బెరుఁగుచున్న జాత్యశ్వానేకాయుతంబులు, నజావి గో మహిష ఖర రాసభ నివహంబులు నొక్కొక్క యొడ్డునన యొడ్డి యోటుపడినం జూచి విదురుండు ధృతరాష్ట్రునకు రహస్యంబున ని ట్లనియె. 177

ప్రతిపదార్థం: ఇట్లు; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; బద్ధ, మత్సరుండు+అయి= క్రోధంతో(అసూయతో) కూడుకొనిన వాడై; పెఱిఁగి= రెచ్చి; ఒండు+ఒండ= ఒకదానివెంట ఒకటి; ఒడ్డుచు; నిష్క, సహస్ర భరిత+అనేక+అయుత, కుండ, మండితంబులు+ అయిన= వేలకొలది వరహాలతో నిండి, పెక్కుపదివేల సంఖ్యలు గల కుండలతో అలంకరించబడినవైన; సువర్ణ భాండాగారంబులును= బంగారు బొక్కసాలును; వజ్రవైదూర్య, మరకత, మౌక్తిక, నీల, ప్రవాళ, పద్మరాగ+ఆది, వివిధ, శుద్ధ, విపుల, రత్న, పరిపూర్ణంబులు+ఐన= వజ్రాలు, వైదూర్యాలు, మరకతాలు, ముత్యాలు, ఇంద్రనీలాలు, పవడాలు, పద్మరాగాలు మొదలైన అనేకవిధాల- స్వచ్ఛాలు. విస్తారాలు అయిన రత్నాలతో నిండిన; రత్నభాండాగారంబులున్= రత్నాల కోశాలును; ప్రత్యేకంబు+అ= వేర్వేరుగా; పంచ, ద్రోణ, కాంచన, సంచితంబులు+అయిన= ఐదుతూముల బంగారు కూడబెట్టబడినవైన; చతుః+శత, నిధులును= నాలుగువందల నిధులను; మణి, కింకిణీ, జాల+అలంకృతంబులు+అయిన= మణుల చిరుగజ్జెల సమూహాలచేత అలంకరించబడిన వైన; అసంఖ్యాత, హయ, యూథంబులును= లెక్కలేనన్ని గుర్రాల సమూహాలును; జాతరూప, వరూథంబులున్= బంగారు కవచాలు కలవియు; కనక, కక్ష్యా, కుథ, సనాథంబులు+అయిన= బంగారుతో చేయబడిన (నడుముకు కట్టే) మోకులతో, (మీదపరిచే) చిత్రకంబళాలతో కూడుకొన్నవియు అయిన; మద+అంధ, గంధ, సింధుర, సందోహంబులున్= మదంచేత కన్నుగానని మదపుటేనుగుల సమూహాలును; పరార్థ్య, రత్న, భూషణ, భూషితంబులు+ అయిన= శ్రేష్ఠములైన రత్నాల సొమ్ములచే అలంకరించబడిన; యోషిత్+సహస్రంబులును= వేలకొలది స్త్రీలును; అనుదిన+ అతిథిజన, భోజన, పాత్ర, హస్తులు+అయిన, శత, సహస్ర, పరిచారకులును= ప్రతిదినం అతిథులైన జనులయొక్క భోజన

పాత్రలను హస్తాలలో కలవాళ్ళయిన నూరువేలమంది సేవకులును; అర్జునునకున్; చిత్రరథుండు= గంధర్వరాజైన చిత్రరథుడు; ఇచ్చిన; గంధర్వ, హయంబులన్+తొట్టి= గంధర్వజాతి గుర్రాలు మొదలుకొని; దుగ్ధపాన, శాలితండుల, ఖాదనంబులన్= పాలు త్రాగటంచేత, వరిబియ్యం తినటంచేత, పెరుగుతున్న; జాతి+అశ్వ+అనేక+అయుతంబులున్= మేలుజాతిగుర్రాలు పెక్కుపదివేల సంఖ్యలును; అజ+అవి, గో, మహిష, ఖర, రాసభ, నివహంబులున్= మేకల, గొఱ్ఱెల, గోవుల, గేదెల, గాడిదల, కంచర గాడిదల సమూహాలును; ఒక్కొక్క; ఒడ్డునన= ఒడ్డనంలో; ఒడ్డి; ఓటుపడినన్= ఓడిపోగా; చూచి; విదురుండు; ధృతరాష్ట్రునకున్; రహస్యంబునన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈ విధంగా ధర్మరాజు క్రోధంతో పెచ్చుపెరిగి ఒకదాని వెంట ఒకటి ఒడ్డుతూ - వేలకొలది వరహాలతో నిండి పదివేల సంఖ్యలు గల పెక్కు కుండలతో ఒప్పుతున్న బంగారు భాండాగారాలను, వజ్ర వైదూర్యమరకతాది పలువిధ స్వచ్ఛ విస్తార రత్నాలతో నిండిన రత్నభాండాగారాలను, ప్రత్యేకంగా ఐదుతూముల బంగారంతో కూడుకొన్న నాలుగువందలనిధులను, మణులసమూహాలతో, చిరుగజ్జెలసమూహాలతో అలంకరించబడిన లెక్కలేనన్ని గుర్రాల సమూహాలను, బంగారుకవచాలతో, నడుముకు కట్టే బంగారుమోకులతో, మీద పరిచే బంగారుచిత్రకంబళాలతో కూడుకొన్న మదపుటేనుగుల సమూహాలను, శ్రేష్ఠాలైన రత్నాల సొమ్ములతో అలంకరించబడిన వేలకొలది స్త్రీలను, ప్రతిదినం అతిథిజనుల భోజన పాత్రలను హస్తాల్లో ధరించిన నూరువేలమంది సేవకులను, అర్జునుడికి గంధర్వరాజు బహూకరించిన గంధర్వాశ్వాలు మొదలుకొని పాలు త్రాగటంచేత, వరిబియ్యం తినటంచేత పెరుగుతున్న పెక్కు పదివేల సంఖ్యల మేలుజాతిగుర్రాలను, మేకల, గుఱ్ఱాల, గోవుల, గేదెల, గాడిదల, కంచరగాడిదల సమూహాలను ఒక్కొక్క ఒడ్డున ఒడ్డి ఓడిపోవటం చూచి, విదురుడు ధృతరాష్ట్రునితో రహస్యంగా ఇలా అన్నాడు.

క. ఖలుఁ డీ దుర్యోధనుఁ డె । గ్గులతోడన యుద్భవిల్లె; గోమాయురుతం
బులు వించె, దుర్నిమిత్తం । బులు పెక్కులు వుట్టె వీని పుట్టిన వేళన్. 178

ప్రతిపదార్థం: ఖలుఁడు= దుర్మార్గుడు; ఈ; దుర్యోధనుఁడు; ఎగ్గులతోడన= దోషాలతోనే; ఉద్భవిల్లెన్= పుట్టినాడు; వీని, పుట్టిన, వేళన్= వీడు పుట్టిన సమయంలో; గోమాయు, రుతంబులు= నక్కల అరుపులు; వించెన్= వినిపించాయి; దుర్నిమిత్తంబులు= చెడ్డశకునాలు; పెక్కులు; పుట్టెన్.

తాత్పర్యం: దుర్మార్గుడైన దుర్యోధనుడు దోషాలతోనే జన్మించాడు. వీడు పుట్టినప్పుడు నక్కల అరుపులు వినబడ్డాయి. ఎన్నో చెడుశకునాలు పుట్టాయి.

వ. తొల్లి యెన్నండును బాపంబుం బొరయని మహాభిష భీమసేన ప్రతీప శంతనుల కులంబు దుర్యోధనుకారణంబునం బాపభూయిష్ఠంబు గానున్నయది; యొక్కని కారణంబునఁ గులంబున కెగ్గగు నేని వాని దూషించి కులంబు రక్షించుట ధర్మం బని శుక్రుండు చెప్పెఁ; గులరక్షణార్థం బంధక యాదవ వృష్ణి వీరులు కృష్ణు నియోగించి కులదూషకుండైన కంసుని వధియించిరి గావున. 179

ప్రతిపదార్థం: తొల్లి= పూర్వం; ఎన్నండును; పాపంబున్; పొరయని= పొందని; మహాభిష, భీమసేన, ప్రతీప, శంతనుల, కులంబు; దుర్యోధను కారణంబునన్= దుర్యోధనుని కారణంగా; పాప, భూయిష్ఠంబు= పాపంతో నిండింది; కాన్+ఉన్న, అది= కాబోతున్నది; ఒక్కని, కారణంబునన్= ఒక్కని కారణంగా; కులంబునకున్= వంశానికి; ఎగ్గు+అగున్+ఏనిన్= కీడు

కలిగితే, వానిన్, దూషించి= వాణ్ణి నిందించి; కులంబు= వంశాన్ని అంతటినీ; రక్షించుట; ధర్మంబు+అని; శుక్రుండు; చెప్పెన్, కుల, రక్షణ+అర్థంబు= వంశాన్ని రక్షించటంకొరకు, అంధక, యాదవ, వృష్ణి, వీరులు= అంధక, యాదవ, వృష్ణి వంశాలకు చెందిన వీరులు; కృష్ణున్; నియోగించి= పంపి(ప్రయోగించి); కుల, దూషకుండు+ఐన= కులానికి చెడ్డపేరు తెచ్చేవాడైన; కంసునిన్; వధియించిరి= చంపారు; కావునన్.

తాత్పర్యం: ఇదివరకు ఎప్పుడూ పాపం అంటని మహాభిష, భీమసేన, ప్రతీప, శంతనులదైన ఈ వంశం దుర్యోధనుని కారణంగా పాపంతో నిండబోతున్నది. ఒకడి కారణంగా వంశాని కంతటికి కీడు కలిగితే అతణ్ణి నిందించి వంశాన్ని రక్షించటం ధర్మమని శుక్రాచార్యుడు చెప్పాడు. వంశాన్ని రక్షించుకోవటానికై అంధక యాదవ వృష్ణి వీరులు, శ్రీకృష్ణుణ్ణి పంపి, కులానికి చెడ్డపేరు తెచ్చే కంసుణ్ణి వధించారు. అందుచేత

విశేషం: మహాభిషుడే బ్రహ్మశాపంచేత ప్రతీపమహారాజుకుమారుడైన శంతనుడుగా జన్మించాడు. భీమసేనుడు ప్రతీపుని తండ్రి, ఋక్షుని కుమారుడు.

మత్తకోకిలము.

వాసవాత్మజుఁ బంపు మిప్పుడ వాఁడు ధర్మవిదుండు నీ
శాసనంబున నిగ్రహించు విచారదూరు సుయోధనున్;
భూసతీశ్వర! దీన నీకులమున్ మహీప్రజయున్ గత
త్రాసవృత్తిసుఖంబు వొందుఁ; బ్రధానవిగ్రహ మేటికిన్? 180

ప్రతిపదార్థం: భూసతీ+ఈశ్వర!= భూమి అనే స్త్రీకి భర్త అయినవాడా! ఓ ధృతరాష్ట్ర మహారాజా!; ఇప్పుడు+అ= ఈ క్షణమే; వాసవ+ఆత్మజున్= దేవేంద్రుని కుమారుడైన అర్జునుణ్ణి; పంపుము; వాఁడు; ధర్మ, విదుండు= ధర్మం తెలిసినవాడు; నీ శాసనంబునన్= నీ ఆజ్ఞచేత; విచార దూరున్, సుయోధనున్= ఆలోచనకు దూరమైన వాడైన దుర్యోధనుణ్ణి; నిగ్రహించున్= ఆపివేస్తాడు; దీనన్= దీనివలన; నీకులమున్; మహీప్రజయున్= భూమిలోని ప్రజయు; గత, త్రాస, వృత్తిన్= తొలగిపోయిన భయంతో కూడిన నడవడికతో; సుఖంబు; పొందున్; ప్రధానవిగ్రహము= గొప్పయుద్ధం; ఏటికిన్= ఎందుకు?

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్రమహారాజా! ఇప్పుడే దేవేంద్రుని తనయుడైన అర్జునుణ్ణి పంపించు. వాడు ధర్మం తెలిసినవాడు. నీ ఆజ్ఞతో వివేకంలేని ఆ దుర్యోధనుణ్ణి ఆపగలడు. దీనివల్ల నీ కులం, భూమిమీద ప్రజ- భయం తొలగి సుఖంగా జీవిస్తారు. పెద్దయుద్ధం ఎందుకు?

విశేషం: విదురుడి వాక్యవిన్యాసాన్ని చిత్రించిన ఈ పద్యంలో దీప్తరసత్వం, ఔజ్జ్వల్యం శోభించి కాంతిగుణాన్ని రూపొందించాయి. (సంపా.)

ఉ. ఇమ్మనుజాధమున్ గుణవిహీను బహిష్కృతుఁ జేసి ధర్మమా
ర్గమ్మునఁ గౌరవాన్వయముఁ గావుము; పాండుతనూజులం బ్రతా
ప మ్మెసఁగంగ నేలు; మిది పథ్యము సు; మ్మొక నక్క నిచ్చి సిం
హమ్ముల విల్చికో లుఱదె? యన్యులె వారలు కౌరవేశ్వరా! 181

ప్రతిపదార్థం: కౌరవ+ఈశ్వరా!= ఓ ధృతరాష్ట్రమహారాజా! ఈ+మనుజ+అధమున్= ఈ నీచుడైన మానవుణ్ణి; గుణ, విహీనున్= మంచి గుణాలు లేనివాణ్ణి; బహిష్కృతున్+చేసి= వెలివేయబడినవాణ్ణిగా చేసి - అంటే త్రోసిపుచ్చి; ధర్మ, మార్గమ్మునన్; కౌరవ+అన్వయమున్= కౌరవవంశాన్ని; కావుము= రక్షించుము; పాండు, తనూజులన్= పాండురాజకుమారులను; ప్రతాపమ్ము; ఎసగంగన్= అతిశయించేటట్లు; ఏలుము= పాలించుము; ఇది; పథ్యము= అనుసరించదగినమార్గం; సుమ్ము= సుమా!; ఒక; నక్కను; ఇచ్చి; సింహమ్ములన్; విల్చికోలు= కొనటం; ఉఱదు+ఎ= మేలుకాదా!; వారలు= పాండవులు; అన్యులు+ఎ= పరాయివాళ్ళా?

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్రమహారాజా! ఈ నీచమానవుడు, గుణవిహీనుడు అయిన దుర్యోధనుణ్ణి వెలివేసి, ధర్మమార్గాన కౌరవవంశాన్ని కాపాడు. పాండవుల ప్రతాపం పెంపొందేటట్లు పాలించు. ఇది నీకు అనుసరించదగిన మార్గం సుమా! ఒక నక్కను ఇచ్చి సింహాలను కొనటం మేలు గాదా? పాండవులుమాత్రం పరాయివాళ్ళా?

విశేషం: అలం: దృష్టాంతం. గుణం: కాంతి. విదురుడి వాక్యాలు లోతైనవి. దుర్యోధనుడి చర్యలవలన వంశాని కంతటికీ, ప్రజల కందరికీ కీడు కలుగుతుం దని అతడు పుట్టినప్పుడు కలిగిన దుశ్శకునాలే సూచించా యనీ, అవన్నీ ఈ మాయాద్యూతం కారణంగా నిజం కాబోతున్నా యనీ పూర్వాపర సమన్వయంతో రాబోయే విపత్తును సూచించాడు. ఒకడివలన వంశానికి ముప్పు వచ్చేటట్లుంటే అతడిని నిందించటం ధర్మ మని కర్తవ్యాన్ని నిర్దేశించాడు. అర్జునుడు అతడిని నిర్జించగల డని, కులాన్ని రక్షించగల డని సూచించాడు. స్వీయపుత్రుడిని దూషించి పాండుపుత్రులను రక్షించటం ధర్మం కా దని అనుకోవ ద్దన్నాడు. పాండవులను తనపుత్రులవలెనే భావించు మని హితవు చెప్పాడు. పాండవులను కాపాడటం వంశాన్ని కాపాడటంగా చెప్పాడు. లేకపోతే ఘోరయుద్ధం జరుగుతుం దని హెచ్చరించాడు. సరళమైన దృష్టాంతాన్ని చూపించాడు. కుటిలమైన నక్కను ఇచ్చి సింహాలను కొనటంవంటి దా కార్యమన్నాడు. (సంపా.)

మధ్యాక్కర.

> **అంగారములు గొనువేడ్కఁ బుష్పఫలావళీ లలిత**
> **తుంగద్రుమప్రకరంబుఁ గరుణావిదూరుఁడై కాల్చు**
> **నంగారకారుఁ బోలంగ సమకట్టె నర్థలోభంబు**
> **నం గురుకులహానికరుఁడు ధారుణీనాథ! నీ సుతుఁడు.** 182

ప్రతిపదార్థం: ధారుణీ నాథ= ఓ ధృతరాష్ట్రమహారాజా!; కురుకులహానికరుఁడు= కురువంశానికి కీడు కలిగించేవాడు; నీ, సుతుఁడు= నీ కుమారుడు; అర్థ, లోభంబునన్= ధనంమీది అత్యాశతో; అంగారములు= బొగ్గులు; కొను= తీసుకొను; వేడ్కన్= కోర్కెతో; పుష్ప, ఫల+ఆవళీ, లలిత, తుంగ, ద్రుమ, ప్రకరంబున్= పూలు, పండ్ల సమూహంతో అందమైన ఎత్తయిన చెట్ల సమూహాన్ని; కరుణా, విదూరుడు+ఐ= దయలేనివాడై; కాల్చు; అంగారకారున్= బొగ్గులు చేసేవాణ్ణి; పోలంగన్= పోలేటట్లు; సమకట్టెన్= పూనుకొన్నాడు.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్రమహారాజా! కురువంశానికి కీడు కలిగించే నీకుమారుడు, ధనంమీది అత్యాశతో-పూలతో, పండ్లతో నిండి కనుల పండువుగా ఉన్న ఎత్తైన చెట్ల సమూహాన్ని బొగ్గులకోసం కఠినాత్ముడై కాల్చటానికి పూనుకొన్న బొగ్గులవాడిలా ఉన్నాడు.

విశేషం: అలం: ఉపమ. గుణం: కాంతి, నానారుచిరార్థసూక్తిరత్నాకరమైన నన్నయ కవితలో ఈ పద్య మొక మేలిమి రత్నం. అలంకారం వలన వస్తువు ధ్వనిస్తున్నది. మాయాద్యూతంలో పాండవసంపదను మోసంతో హరించటం ఎటువంటి చర్యయో ఇందులో చెప్పబడింది. పుష్పఫలాలతో కూడుకొన్న మహావృక్షాలను బొగ్గులకొరకు తగులబెట్టటంవలె ఉన్నదనటం విశేషం. దానికి కారణం ధనాశ. ఈ గుణం వంశనాశనకరుడికే కలుగుతుం దని సూచన. బొగ్గులవ్యాపారం చేసేవాడు బొగ్గులనే కోరుకొంటాడు. వంశనాశనం కోరుకొనేవాడు ఇక్కడ బొగ్గులుకోరేవాడు. పాండవులను సర్వనాశనం చేయటానికి తలపెట్టిన కపటద్యూతం అప్పుడు పాండవవృక్షదహనంగా భాసించటం సహజం. కాని, కురుక్షేత్రయుద్ధంలో ఏచెట్లు కాలిపోతాయో ఊహించుకొను మని ధ్వని. కౌరవులు తమ వంశాంకురాలుకూడా మిగలకుండ నశించిపోతారు. పాండవవృక్షాలను తగులబెట్టా లనుకొన్న దుర్యోధను డనేఅంగారకారుడు తన కుటుంబాన్నే కాల్చుకొంటాడని ధ్వని. (సంపా.)

ఆ. అధికదర్పయుక్తమై బలీవర్దంబు । నగముదరి విదారణంబు సేయఁ
గాలుద్రవ్వునట్లు గడు బలాఢ్యులతోడ । నేచి వీఁడు విగ్రహింపఁ దొడఁగె. 183

ప్రతిపదార్థం: అధిక, దర్ప, యుక్తము+ఐ= మిక్కిలి పొగరెక్కినదై; బలీవర్దంబు= ఎద్దు; నగము, దరిన్= కొండచరియను; విదారణంబు, చేయన్= చీల్చివేయటానికి; కాలుద్రవ్వునట్లు; వీఁడు= ఈ దుర్యోధనుడు; ఏచి= విజృంభించి; కడున్, బల+ఆఢ్యుల తోడన్= మిక్కిలి బలవంతులతో; విగ్రహింపన్= పోరుసలుపటానికి; తొడఁగెన్= పూనుకొన్నాడు.

తాత్పర్యం: ఎంతో పొగరెక్కిన ఎద్దు కొండచరియను చీల్చటానికి కాలుద్రవ్వినట్లు, ఈ దుర్యోధనుడు విజృంభించి మహాబలవంతులతో పోరు సలుపటానికి పూనుకొన్నాడు.

విశేషం: అలం: ఉపమ. (జనజీవనంలోనుండి ఎన్నుకొన్న ఉపమానాలను సార్థకంగా వాడటం నన్నయ ఉపజ్ఞ. ఎద్దు మదించబట్టే ఎవరితో ఢీకొంటున్నదీ తెలియక కొండతో ఢీకొనటం. ఫలితం తల పగలటం. ఈ అర్థం అలంకారకృతవస్తుధ్వని. - సంపా.)

వ. 'ఇంక నయిన నుపేక్షింపక యీ దుష్టద్యూతంబు వారింపు 'మనినఁ బుత్త్రస్నేహంబున నెద్దియుం జేయునది నేరక ధృతరాష్ట్రుండు మిన్నకుండె; నంత విదురుండు దుర్యోధనున కభిముఖుండై యి ట్లనియె. 184

ప్రతిపదార్థం: ఇంకన్; అయినన్; ఉపేక్షింపక= అశ్రద్ధ చేయక; ఈ, దుష్ట, ద్యూతంబు= ఈ దుర్మార్గపు జూదం; వారింపుము= ఆపుము; అనినన్; పుత్త్రస్నేహంబునన్= పుత్రులమీది ప్రేమచేత; ఎద్దియున్= ఏదీ; చేయునది, నేరక= చేయటానికి తోచక; ధృతరాష్ట్రుండు; మిన్నక, ఉండెన్= ఊరకున్నాడు; అంతన్; విదురుండు; దుర్యోధనునకున్; అభిముఖుండు+ఐ= ఎదురు తిరిగిన ముఖం కలవాడై - అంటే దుర్యోధనునివైపు తిరిగి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'ఇంకా అశ్రద్ధ చెయ్యక ఈ దుర్మార్గపు జూదాన్ని ఆపు' అని అనగా పుత్రులమీది మమకారంతో ఏమీ చెయ్యటానికి తోచక ధృతరాష్ట్రుడు ఊరకున్నాడు. అప్పుడు విదురుడు దుర్యోధనుని వైపు తిరిగి ఇలా అన్నాడు.

విశేషం: విదురోపదేశాన్ని వినకుండ ధృతరాష్ట్రుడు ఉపేక్ష వహించాడు. ఇది మాయాద్యూతంకంటె మహాపకారం చేసింది కౌరవులకు. (సంపా.)

క. న్యాయంబు విడిచి సౌబలు । మాయా ద్యూతమునఁ బాపమతివై భరతా
మ్నాయు లగు పాండవేయుల । శ్రీ యిమ్మెయిఁ గొనిన నిన్నుఁ జీ యనరె యొరుల్. 185

ప్రతిపదార్థం: న్యాయంబు; విడిచి; సౌబలు= శకునియొక్క; మాయాద్యూతమునన్= కపటజూదంచేత; పాపమతివి+ఐ= చెడుబుద్ధి కలవాడవై; భరత+ఆమ్నాయులు+అగు= భరతుని సంప్రదాయానికి చెందిన వాళ్ళయిన - అంటే భరతవంశీయులయిన పాండవేయుల= పాండవులయొక్క; శ్రీ= సంపద; ఈ+మెయిన్= ఈ విధంగా; కొనిన= గ్రహించిన; నిన్నున్; ఒరుల్= ఇతరులు; ఛీ, అనరె= ఛీ అని అనరా?

తాత్పర్యం: న్యాయం వదలి, శకుని మాయాద్యూతంతో పాపబుద్ధి కలవాడివై, భరతవంశం వాళ్ళయిన పాండవుల సంపద ఈ విధంగా అపహరిస్తే ఇతరులు నిన్ను ఛీకొట్టరా?

విశేషం: ప్రజలు ఛీకొట్టే కారణాలు ఇందులో ఆరు చెప్పబడుతున్నాయి. 1. అన్యాయంగా మాయతో పాపబుద్ధితో పాండవసంపదను హరించటం. 2. పాండవులు భరతవంశంవారు కావటంచేత ధర్మాత్ములే కాక దాయాదులు, స్వీయవంశంవారే కావటం, దానివలన తమవారినే తాను నిలువుదోపిడీ చేసినట్లు కావటం. 3. అన్నదమ్ములను శత్రువులుగా భావించటం. 4. పాండవవినాశనం స్వీయవంశనాశనం కా దని అవివేకంగా భావించటం. 5. ఉత్తమవంశజులు ఆచరించవలసిన ఉదాత్తచర్య మాయాద్యూతం కాకపోవటం. 6. అపహరణభావం అధర్మమూలం కావటం. విదురుడి వివేకానికి ఈ హితవు విశిష్టతార్కాణం. (సంపా.)

క. ధృతిమంతుల భుజవిక్రమ । జితశత్రులఁ బాండవేయసింహులను మదో
ద్ధతిమైఁ బరాజితులఁ జే । సితి; వారల కిట్లు నికృతి సేయుట లగ్గే? 186

ప్రతిపదార్థం: ధృతిమంతులన్= ధైర్యవంతులను; భుజ, విక్రమ, జిత, శత్రులన్= భుజ పరాక్రమంచేత జయించిన శత్రువులు కలవారిని; పాండవేయ సింహులను= పాండవశ్రేష్ఠులను; మద+ఉద్ధతిమైన్= పెచ్చుపెరిగిన పొగరుతో; పరాజితులన్= ఓడిపోయినవారినిగా; చేసితి= చేసినావు; వారలకున్; ఇట్లు; నికృతి= మోసం; చేయుట; లగ్గు+ఏ= మంచిదా? (కాదని భావం).

తాత్పర్యం: ధైర్యవంతులు, భుజపరాక్రమంచేత శత్రువులను జయించినవాళ్ళు అయిన పాండవశ్రేష్ఠులను పెచ్చుపెరిగిన పొగరుతో జూదంలో ఓడిపోయేటట్లు చేశావు. వాళ్ళను ఇలా మోసం చెయ్యటం మంచిదా?

విశేషం: విదురుడు ఉపయోగించిన 'ధృతిమంతులు, భుజవిక్రమజితశత్రులు, పాండవేయసింహులు' అనే పదాలు మూడూ పాండవుల శక్తిసామర్థ్యాలను, రానున్న ప్రమాదాలను ధ్వనింపజేస్తున్నాయి. ఉత్తరపదంగా ఉండే సింహపదం సామాన్యంగా శ్రేష్ఠవాచకమే. కాని ఇక్కడ ఆ పదం ఒక ప్రత్యేకతను సంతరించుకొన్నది. ప్రమాద తీవ్రతను తెలియజేస్తున్నది. ఒకవేళ వంచించి కొట్టినా, సింహాన్ని దెబ్బకొట్టటం మంచిదా? ఆలోచించుకొమ్మనే భావాన్ని స్ఫురింపజేస్తున్నది.

వ. అనిన విని విదురున కలిగి దుర్యోధనుం డి ట్లనియె. 187

తాత్పర్యం: అనగా విని దుర్యోధనుడు కోపించి విదురుడితో ఇలా అన్నాడు.

సీ. పరుల గుణంబులు పలుమాఱుఁ గీర్తింతు; । పక్షంబ పలుకుదు పాండవులకు;
ధార్తరాష్ట్రుల సంతతంబు నిందింతువు; । కుడిచిన చోటికిఁ గూర్ప వెపుడు;
నుత్సంగతలమున నుగ్రవిషోరగం । బున్నట్లు నీవు మా యొద్ద నునికి;
పరులసంపద సుఖోపాయబలంబునఁ । గొనుట భూపతులకు గుణము కాదె?

ఆ. యడుగకయును గర్జ మది యిష్టుఁడై చెప్పు । నతని కాడఁ దగిన యదియ; నన్ను
నిట్టు నట్టు ననఁగ నేల? నీ యిమ్ముల । నుండు; బుద్ధి సెప్పకుండు మాకు. 188

ప్రతిపదార్థం: పరుల, గుణంబులు= శత్రువుల గుణాలనే; పలుమాఱున్= పెక్కుమారులు; కీర్తింతు= పొగుడుతావు; పాండవులకున్; పక్షంబు+అ= పక్షపాతంగానే; పలుకుదు= మాటాడతావు; ధార్తరాష్ట్రులన్= ధృతరాష్ట్రుని పుత్రులను; సంతతంబు= ఎల్లప్పుడు; నిందింతువు; కుడిచిన చోటికిన్= అన్నం తిన్న ఇంటికి; ఎపుడున్= ఎన్నడును; కూర్పవు= అనుకూలంగా ఉండవు; నీవు; మా, ఒద్దన్= మా దగ్గర; ఉనికి= ఉండటం; ఉత్సంగ, తలమునన్= ఒడిలో; ఉగ్ర విష+ఉరగంబు= భయంకరమైన విషసర్పం; ఉన్నట్లు; పరుల, సంపద= శత్రువుల ఐశ్వర్యం; సుఖ+ఉపాయ, బలంబునన్= సుఖమైన ఉపాయబలంచేత; కొనుట= తీసుకోవటం; భూపతులకున్= రాజులకు; గుణము, కాదె= స్వభావంకదా! ఇష్టుఁడు+ఐ= ఇష్టమైనవాడై - అంటే స్నేహితుడై; అడుగకయును= అడగకుండానే; కర్జము+అది= చేయదగినదాన్ని; చెప్పు, అతనికి= బోధించేవాడికి; ఆడన్, తగిన, అదియ= మాటాడదగిందే; నన్నున్; ఇట్టున్, అట్టున్, అనఁగన్= ఈవిధంగా చేసినావు, ఆవిధంగా చేసినావు అని తప్పులెన్నటం; ఏల= ఎందుకు? నీ, ఇమ్ములన్= నీ స్థానంలో; ఉండు=(నీవు) ఉండుము - అంటే నీ హద్దుల్లో నీవు ఉండుము; మాకున్; బుద్ధి; చెప్పక; ఉండు.

తాత్పర్యం: శత్రువుల గుణాలనే నీవు పలుమారు పొగడుతావు. పాండవ పక్షాననే పలుకుతావు. ధృతరాష్ట్రుని పుత్రులను ఎల్లప్పుడూ నిందిస్తావు. తిన్నయింటికి ఎన్నడూ అనుకూలంగా ఉండవు. నీవు మావద్ద ఉండటం ఒడిలో భయంకరమైన విషసర్పం ఉన్నట్లే. శత్రుసంపదను సులభోపాయంతో గ్రహించటం రాజుల సహజస్వభావమే కదా! స్నేహితుడు అడగకుండానే ఇది చెయ్యదగు నని చెప్పవచ్చు. కాని నీవు నన్ను 'ఈవిధంగా చేశావు, ఆ విధంగా చేశావు' అని తప్పు లెన్నటం ఎందుకు? నీ హద్దుల్లో నీవు ఉండు. మాకు బుద్ధులు చెప్పవద్దు.

విశేషం: అలం: ఉపమ. విదురుని హితం దుర్యోధనునికి ఎంత వెగటుగా ఉందో ఈ పద్యం వ్యక్తం చేస్తున్నది. (దుర్యోధనుడు ఈ విధంగా విదురుణ్ణి నిందించి వివేకవిహీను డని నిరూపించుకొన్నాడు. హితం చెపితే స్నేహితుడు చెప్పా లని ఎత్తిపొడిచాడు. విదురుడు తనకు విరోధి అని బహిరంగంగా నిందించాడు. హితుణ్ణి హితుడిగా గుర్తించే వివేకాన్ని కోల్పోయి, శకునిని హితుడిగా భావిస్తున్న దుర్యోధనుణ్ణి చూచి విదురుడు విసుక్కున్నాడు. హితుడుగా అతణ్ణి మందలించకుండ ఉండలేకపోయాడు. అందుకే మళ్ళీ మాట్లాడుతున్నాడు- నిజానికి తాను కౌరవహితాన్ని కోరేవాడు కాబట్టి. - సంపా.)

వ. అనిన విదురుం డి ట్లనియె. 189

తాత్పర్యం: అనగా విదురుడు ఇలా అన్నాడు.

క. చెడఁ గఱపువార చెలులుం । గడుకొని నీయట్టివారి కర్జంబులు చె
ప్పెడు వారుఁగాక, నీకున్ । మడవక మా యట్టివారి మాటలు గొఱయే? 190

ప్రతిపదార్థం: చెడన్= చెడిపోయేటట్లు; కఱపువారు+అ= బోధలు చేసేవారే; చెలులున్= స్నేహితులు; కడుకొని= యత్నించి; నీ, అట్టి, వారి= నీవంటి వారియొక్క; కర్జంబులు= చేయదగినపనులు; చెప్పెడువారున్= చెప్పేటటువంటివాళ్ళు; కాక= అట్లాకాక; మా, అట్టి, వారి, మాటలు; నీకున్, మడవక= నిష్ఫలాలుకాక, కొఱయే= ప్రయోజనకరా లౌతాయా?

తాత్పర్యం: చెడిపోయ్యేటట్లు చెడ్డబుద్ధులు చెప్పేవాళ్ళే నీకు స్నేహితులు; నీవంటి వాడికి కర్తవ్యాలు చెప్పేవాళ్ళు. మావంటివాళ్ళమాటలు నీపట్ల వ్యర్థా లవుతాయి కాని, ప్రయోజనకరా లౌతాయా?

విశేషం: హితాన్ని చెప్పేవాడే హితుడు. స్నేహితుడు. చెడు చెప్పేవాడు హితుడిలా తోచే అహితుడు. దుర్యోధనుడు అహితులను స్నేహితులుగా చేసుకొన్నాడు. వారి పన్నాగాలు మన్నించాడు. హితులను విరోధులుగా భావిస్తున్నాడు. ఇది అతనిలోని విపరీతబుద్ధి. దానిని విదురుడు అధిక్షేపించాడు. కాని, దుర్యోధనుడు వినడు. (సంపా.)

తే. **ప్రియము పలికెడువారిన పెద్ద మెత్తు, । రప్రియంబును బథ్యంబునైన పలుకు**
వినఁగ నొల్లరు, గావున వేడ్కదానిఁ । బలుక రెవ్వరు నుత్తమప్రతిభు లయ్యు. **191**

ప్రతిపదార్థం: ప్రియము= వినటానికి ఇంపైనమాట; పలికెడు; వారిని+అ= వారినే; పెద్ద, మెత్తురు= ఎక్కువగా మెచ్చుకొంటారు; అప్రియంబును= వినటానికి ఇంపు కాకుండ; పథ్యంబును+ఐన= మేలు చేసేదైన, పలుకు= మాట; వినఁగన్= వినటానికి; ఒల్లరు= ఇష్టపడరు; కావునన్= అందుచేత; ఉత్తమ, ప్రతిభులు+అయ్యున్= గొప్పతెలివిగలవాళ్ళయి కూడ; ఎవ్వరున్= ఎవరును; దానిన్= అట్టి మాటను-అంటే వినటానికి కటువుగా ఉన్నను మేలు చేసేమాటను; పలుకరు= చెప్పరు.

తాత్పర్యం: వినటానికి ఇంపుగా ఉండే మాటను పలికేవాళ్ళనే ఎక్కువగా మెచ్చుకొంటారు. మేలు చేసేదైనా వినటానికి ఇంపుగా ఉండని మాటను వినటానికి ఎవరూ ఇష్టపడరు. అందుచేత గొప్ప ప్రతిభావంతులుకూడ అలాంటి కటువైన మాట చెప్పరు.

విశేషం: 'హితం మనోహారి చ దుర్లభం వచః' వంటి హితోక్తుల ప్రక్క నిలువదగిన రుచిరార్థసూక్తి ఇది. (సంపా.)

తే. **మొదల నప్రియ మయ్యును దుదిఁ గరంబు । పథ్య మగు పల్కు ప్రియులందు బలిమి నైనఁ**
బలుక వలయు మోమోడక యొలసి యట్టి । వాఁడు దగు సహాయుండు భూవల్లభునకు. **192**

ప్రతిపదార్థం: మొదలన్= మొదట; అప్రియము+అయ్యును= వినటానికి ఇంపు కాకున్నను; తుదిన్= చివరకు; కరంబు= మిక్కిలి; పథ్యము+అగు= మేలు చేసేదైన; పల్కు= మాట; ప్రియుల+అందున్= ఇష్టులైనవాళ్ళకు; బలిమిన్+ఐనన్= బలవంతంగానైనా; మోమోడక= మొగమోటమి లేకుండా; ఒలసి= చెంతచేరి; పలుకవలయున్; అట్టివాఁడు; భూవల్లభునకున్= భూపతికి-రాజుకు; తగు, సహాయుండు= తగిన సహాయం చేసేవాడు - అంటే హితుడు.

తాత్పర్యం: మొదట వినటానికి ఇంపు కాని దైనా, చివరికి మేలు చేసే మాటను, ఇష్టులైనవాళ్ళ చెంత చేరి, మొగమోటమి లేకుండ, బలవంతంగానైనా చెప్పాలి. అలాంటివాడే రాజుకు తగినసహాయం చేసేవాడు.

విశేషం: విదురుని హితవాక్యాలు దుర్యోధనునికి ఎలా ఉన్నా, లోకానికి మాత్రం శిరోధార్యాలు.

వ. **'ఏను సపుత్త్రకుండైన వైచిత్రవీర్యు కార్యంబునకు హితుండనై నెగడుదు; నట్టి న న్నన్యథాబుద్ధి నొల్లక పలికితి; పాండవులతోడి విగ్రహంబు లగ్గుగా'దని చెప్పి విదురుండు విగతవచనుండై యుండె; నంత శకుని ధర్మనందనున కి ట్లనియె.** **193**

ప్రతిపదార్థం: ఏను= నేను; సపుత్త్రకుండు+ఐన= పుత్రులు కలవాడైన; వైచిత్రవీర్యు, కార్యంబునకున్= ధృతరాష్ట్రుడు చేయదగినపనికి; హితుండను+ఐ= మేలు కోరేవాడినై; నెగడుదున్= ఉంటాను; నన్నున్; అన్యథా, బుద్ధిన్= వేరొక విధమైన తలంపుతో; ఒల్లక= ఇష్టపడక; పలికితి= పలికావు; పాండవులతోడి; విగ్రహంబు= వైరం; లగ్గు, కాదు= మేలు కాదు; అని; చెప్పి; విదురుండు; విగత వచనుండు+ఐ= మాట మానినవాడై; ఉండెన్; అంతన్; శకుని; ధర్మనందనునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'నేను పుత్రులు గల ధృతరాష్ట్రునికి మేలు కోరేవాణ్ణి. నన్ను వేరొక విధంగా అర్థం చేసుకొన్నావు. త్రోసిపుచ్చి మాట్లాడావు. పాండవులతో వైరం మంచిది కాదు' అని విదురుడు మౌనం వహించాడు. అప్పుడు శకుని ధర్మరాజుతో ఇలా అన్నాడు.

విశేషం: 'ఏ నపుత్రకుండయ్యు' అనే పాఠాంతరం కొన్నిప్రతుల్లో ఉంది. ఇది కూడ గ్రహించదగిన పాఠమే. 'నాకు ఏవిధమైన స్వార్థం లేదు'. అనే అర్థంలో విదురుడు ఇలా అనటం ఉచితమే. (ప్రస్తుతపాఠంకూడ సార్థకమే. విదురుడు మహామంత్రిస్థానంలో ఉన్నాడు. అతడు రాజును, రాజ్యాన్నీ రక్షించాలి. రాజు పుత్రవంతుడైతే వాళ్ళను కూడా రక్షించే ఉపాయం ఆలోచించటం అతని కర్తవ్యం. అందువల్ల విదురుడు దుర్యోధనాదుల యోగక్షేమాలనుగూర్చి మాట్లాడాడు. అది రాజ్యవ్యవస్థ తెలిసిన ఉచితజ్ఞునికి తెలియదగిన అంశం. దుర్యోధనుడు విదురుణ్ణి అపార్థం చేసుకున్నాడు. నిందించాడు. కాని, అతనికికూడ హితవుచెప్పటం తన ధర్మ మని విదురుడు భావించాడు. నిండుకొలువులోనే వివరించి చెప్పాడు. మారుమాటాడని ధృతరాష్ట్రునిలా తానుకూడ నిర్లిప్తు డైనాడు. హితవు చెప్పని దోషం అతనికి కలుగదు. హితవు పాటించని దోషం ధృతరాష్ట్ర దుర్యోధనులదే. కపటవర్తనుల నడుమ కటకటపడుతున్న ధర్మస్వరూపుడు విదురుడు. - సంపా.) సంస్కృత భారతంలో విదురునికి సంతానం ఉన్నట్లుగా చెప్పబడింది - (ఆ.పర్వం. 113 ఆధ్యాయం 12,13,14 శ్లోకాలు).

ఉ. 'ఎల్లధనంబు నోటువడి తిందుకులేశ్వర! యింక నొడ్డఁగా
మొల్లము నాకుఁ జూపు'మని ముందట సారెలు ద్రోచి యాడఁగా
నొల్లకయున్న సౌబలున కున్నతచిత్తుఁడు ధారుణీతలం
బెల్లను నొడ్డి యోటువడియెన్ బలవద్వ్యసనాభిభూతుఁడై. 194

ప్రతిపదార్థం: ఇందు కుల+ఈశ్వర= ఓ చంద్రవంశపురాజా! ధర్మరాజా! ఎల్ల; ధనంబున్= ధనాన్ని అంతను; ఓటు, పడితి= ఓడిపోయావు; ఇంకన్, ఒడ్డగాన్= పందెంఒడ్డటానికి; మొల్లము= ధనం; నాకున్; చూపుము; అని; ముందట; సారెలు= పాచికలు; త్రోచి= పడవేసి; ఆడఁగాన్= ఆడటానికి; ఒల్లక+ఉన్న= ఇష్టపడకున్న; సౌబలునకున్= శకునికి; ఉన్నత, చిత్తుఁడు= గొప్పమనస్సు కలవాడు - ధర్మరాజు; బలవత్+వ్యసన+అభిభూతుఁడు+ఐ= బలమైన ద్యూతవ్యసనంచేత తిరస్కరించబడినవాడై; ధారుణీతలంబు+ఎల్లను= రాజ్యాన్నంతా; ఒడ్డి; ఓటు, పడియెన్= ఓడిపోయాడు.

తాత్పర్యం: 'ఓ చంద్రవంశపురాజా! ధర్మరాజా! ఉన్న సంపదనంతా ఓడిపోయావు. ఇంకా పందెం ఒడ్డటానికి నాకు ధనం చూపు' అని సారెలు ముందర పడవేసి ఆట మానిన శకునికి, గొప్ప మనస్సు కల ధర్మరాజు బలమైన ద్యూతవ్యసనానికి లొంగిపోయి రాజ్యాన్నంతా ఒడ్డి ఓడిపోయాడు.

వ. ఇట్లు దేవభోగ బ్రాహ్మణ వృత్తులు దక్కఁ దక్కిన మహీతలంబును, బ్రాహ్మణులు దక్క సర్వప్రకృతిజనులలను, రాజ పుత్త్రుల నొక్కొక్క యొడ్డున నొడ్డి యోటువడి వెండియు. 195

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; దేవభోగ, బ్రాహ్మణవృత్తులు= గుడులలో దేవుళ్ళ ధూపదీపాలంకార నైవేద్యాలకొరకు, బ్రాహ్మణుల జీవనోపాధికొరకు ఇచ్చిన భూములు - అంటే దేవాలయాలకు, బ్రాహ్మణులకు దానంగా ఇచ్చిన మళ్ళు, మాన్యాలు; తక్కన్= తప్ప; తక్కిన, మహీతలంబును= తక్కిన భూమిని; బ్రాహ్మణులు; తక్కన్= తప్ప; సర్వ, ప్రకృతి జనులను= అందరు సామాన్య మానవులను; రాజపుత్రులన్; ఒక్కొక్క; ఒడ్డునన్, ఒడ్డి; ఓటు, పడి; వెండియున్= మళ్ళీ.

తాత్పర్యం: ఈవిధంగా - దేవాలయాల్లోని దేవుళ్ళ ధూపదీపాలంకార నైవేద్యాలకు, బ్రాహ్మణుల జీవనోపాధికి దానాలుగా ఇచ్చిన భూములు తప్ప, తక్కిన భూమిని, బ్రాహ్మణులు తప్ప సామాన్యజనులందరిని, రాజపుత్రులను, ఒక్కొక్క పందెంలో ఒడ్డి ఓడిపోయాడు. మళ్ళీ

ధర్మరాజు తమ్ములను ద్రౌపదిని జూదమునం దొడ్డి యోడుట

సీ. **తమ్ముల నత్యంత ధర్మసమేతుల । నాయతబాహుల నాజిజయుల**
నాదిత్యతేజుల నాదిభూపాలక । చరితుల నభిమానసత్యరతుల
సహదేవనకులవాసవసుతభీములఁ । గ్రమమున నలువురఁ గౌరవేంద్రుఁ
డొక్కొక్క యొడ్డున నొడ్డి తన్నును నొడ్డి । యుక్కివంబున నప్పు డోటు వడిన

ఆ. **నతనిఁ జూచి శకుని యనియె 'నిట్లేల ని । న్నొడ్డి తధిప! నీకు నొండుధనము**
గలదు; మఱచి తెట్లు? కమలాక్షి పాంచాల । కన్య నీకు ధనము గాదె?' యనిన. **196**

ప్రతిపదార్థం: తమ్ములన్; అత్యంత, ధర్మ, సమేతులన్= మిక్కిలి ధర్మంతో కూడుకొన్నవాళ్ళను - అంటే పరిపూర్ణంగా ధర్మాన్ని అనుసరించేవాళ్ళను; ఆయతబాహులన్= పొడవైన చేతులుగలవాళ్ళను; ఆజిజయులన్= యుద్ధంలో గెలుపొందే స్వభావం కలవాళ్ళను; ఆదిత్య, తేజులన్= సూర్యునితో సమానమైన తేజస్సు కలవాళ్ళను; ఆది, భూపాలక, చరితులన్= తొలిరాజుల నడవడి కలవాళ్ళను; అభిమాన, సత్య, రతులన్= ఆత్మగౌరవంలోను, సత్యంపట్లను ప్రీతి కలవాళ్ళను; సహదేవ, నకుల, వాసవసుత (అర్జున) భీములన్; క్రమమునన్= వరుసగా; నలువురన్; కౌరవ+ఇంద్రుఁడు= కౌరవప్రభువైన ధర్మరాజు; ఒక్కొక్క; ఒడ్డునన్= పందెంలో; ఒడ్డి= (పణంగా) పందెంలో ఒడ్డి; తన్నునున్= తనను కూడ; ఒడ్డి; ఉక్కివంబునన్= మోసంచేత; ఓటు, పడినన్= ఓడిపోగా; అతనిన్= ఆ ధర్మరాజును; చూచి; శకుని; అనియెన్; అధిప= ఓ ధర్మరాజా! ఇట్లు= ఈ విధంగా; ఏల; నిన్ను; ఒడ్డితివి; నీకున్; ఒండు= మరొక; ధనము; కలదు; మఱచితి+ఎట్లు= ఎలా మరిచిపోయావు?; కమలాక్షి= కమలాలవంటి కన్నులు కలదైన; పాంచాల, కన్య= పాంచాలరాజుకూతురు - ద్రౌపది; నీకున్; ధనము; కాదె; అనినన్.

తాత్పర్యం: పూర్తిగా ధర్మాన్ని అనుసరించేవాళ్ళు, విశాలమైనభుజాలుగలవాళ్ళు, యుద్ధంలో జయశీలురు, సూర్యునితో సమానమైన తేజస్సు కలవాళ్ళు, తొలిరాజులవలె మంచి నడవడి కలవాళ్ళు, ఆత్మగౌరవంలో, సత్యంలో ప్రీతిగలవాళ్ళు అయిన తమ్ములు - సహదేవనకులార్జునభీమసేనులు నలుగురిని వరుసగా ధర్మరాజు ఒడ్డి ఓడిపోయాడు. కడకు తననుకూడ ఒడ్డుకొని వంచనకు గురిఅయి ఓడిపోగా, శకుని చూచి, 'ఓ ధర్మరాజా! ఈ విధంగా ని న్నేల ఒడ్డుకొన్నావు? నీకు ఇంకొక ధనం ఉందిగదా! ఎలా మరచావు? కమలాక్షి ద్రౌపది నీధనం కాదా?' అన్నాడు.

విశేషం: ఇక్కడ శకుని వేసిన ప్రశ్న జటిలమైంది. ఆ చిక్కు ధర్మరాజుకే అర్థమౌతుంది. ధర్మరాజు తనను తాను పణంగా పెట్టుకొన్నప్పుడు శకుని మాట్లాడలేదు. అతను ఓడిన తరువాత మరొక ధనం ఉం దని జ్ఞాపకం చేశాడు. త న్నోడిన ధర్మజుడు దాసుడు కావచ్చు కాని, అతనిభార్యమీది అధికారం అతని కున్న దని సూచనచేయటం ఒక అర్థం. ధర్మజుడు ఓడాడు కాబట్టి శకుని చెప్పినట్లు చేయటం కర్తవ్యం కావటం మరొక అర్థం. ఈ రెండింటిచేత బంధించబడిన ధర్మజుడు

భార్యను పణంగా పెట్టటానికి పూనుకొన్నాడు. దీనిలోని ధర్మసూక్ష్మాన్ని గురించి ద్రౌపది నిండుసభలో ప్రశ్నించబోతున్నది. (వివరాలకు పీఠిక చదవండి - సంపా.)

చ. అలయక వెండియుం గడఁగి యక్షరతుండయి ద్రౌపదిన్ మహో
త్పలదళచారునేత్రఁ గులభామఁ బణంబుగఁ జేసి యొడ్డి సౌ
బలఖలుచేత నోటువడి పాండుసుతుం డుడిగెన్ ధనంబు ల
గ్గలముగ నొడ్డలేమి గతగర్వమునం గడు దీనవక్త్రుఁడై. 197

ప్రతిపదార్థం: అలయక= ఆలస్యంచేయక; వెండియున్= మళ్ళీ; కడఁగి= పూనుకొని; అక్షరతుండు+అయి= పాచికలందు ప్రీతికలవాడయి; మహా+ఉత్పల, దళ, చారునేత్రన్= పెద్దకలువరేకులవంటి అందమైన కన్నులు కలదానిని; కులభామన్= కులకాంతను; ద్రౌపదిన్; పణంబుగన్+చేసి= పందెంగా జేసి; ఒడ్డి; సౌబలఖలుచేతన్= సుబలునికుమారుడు శకుని అనే దుర్మార్గుని చేత; ఓటు, పడి= ఓడిపోయి; పాండు, సుతుండు= పాండురాజుకుమారుడైన ధర్మరాజు; ధనంబులు; అగ్గలముగన్= అధికంగా; ఒడ్డలేమి= ఒడ్డలేక; గత, గర్వమునన్= కోల్పోయిన గర్వంతో; కడున్, దీన, వక్త్రుఁడు+ఐ= మిక్కిలి దీనమైన ముఖంకలవాడై; ఉడిగెన్= పాచికల ఆట చాలించాడు.

తాత్పర్యం: ఆలస్యం చెయ్యకుండా, పాచికలమీది ప్రీతితో, ధర్మరాజు మళ్ళీ ఆటకు పూనుకున్నాడు. కలువరేకులవంటి కన్నులు కలది, కులకాంత అయిన ద్రౌపదిని పణంగా ఒడ్డాడు. దుష్టశకుని చేతుల్లో ఆమెను కూడ ఓడిపోయాడు. ఇంకా ఒడ్డటానికి ధనం లేదు. అందుచేత గర్వాన్ని కోల్పోయాడు. ఎంతో దీనమైన ముఖంతో అప్పుడు ఆట చాలించాడు.

విశేషం: ధర్మజుని ద్యూతవ్యసనం కడకు ధర్మపత్ని ద్రౌపదిని ఓడిపోయేదాకా సాగితేకాని ఆగలేదు. మానవస్వభావంలో వ్యసనపరత ఎంత బలీయమో, అన్నిధర్మాలు తెలిసిన ఆ ధర్మరాజునమతనే అది ఎంతగా తారుమారు చేసిందో - మహాభారతం ఈ ఘట్టంలో మరపురానంత బలంగా ప్రదర్శించింది.

సీ. ఆతనిఁ జూచి ద్రోణాచార్య కృప భీష్ము । లవిరళ స్వేదాంగు లగుచు వృద్ధ
జనులును దారు నిశ్శబ్ద నిరంతర । ముఖులైరి; విదురుండు మొగము వాయ
నిడి తలవాంచి త న్నెఱుఁగక దుఃఖితుం । డై యుండెఁ; దక్కిన యా సదస్యు
లందఱుఁ బ్రబలబాష్పాంబుధారాకులి । తాక్షులై; రత్యుచ్చమై పయోధి

ఆ. పటురవాభమై సభాక్షోభ మయ్యె; దు । శ్శాసనుండుఁ గర్ణసైంధవులును
నధికహర్షవికసితాస్యంబు లొప్ప నొం । డొరులఁ జూచి నగుచు నుండి రపుడు. 198

ప్రతిపదార్థం: ఆతనిన్= ఆవిధంగా సర్వం కోల్పోయిన ధర్మరాజును; చూచి; ద్రోణాచార్య, కృప, భీష్ములు; అవిరళ, స్వేద+అంగులు= దట్టమైన చెమటతో కూడిన అవయవాలు కలవాళ్ళు; అగుచున్; వృద్ధజనులును; తారున్= తాము; నిశ్శబ్ద, నిరంతర, ముఖులు+ఐరి= నిశ్శబ్దం ఎడతెగకుండా ఉన్న ముఖాలు కలవాళ్ళయ్యారు-అంటే నోటిమాట, శ్వాస శబ్దంరాని స్థితిలో ఉండిపోయారు; విదురుండు; మొగము; వాయన్+ఇడి= మొగాన్ని ప్రక్కకు త్రిప్పి; తలవాంచి; తన్నున్+ఎఱుంగక=

తనలోతానులేక; దుఃఖితుండు+ఐ; ఉండెన్; తక్కిన; ఆ, సదస్యులు+అందఱున్= ఆ సభలోని సభ్యులందరును; ప్రబల, బాష్ప+అంబు, ధారా+ఆకులిత+అక్షులు+ఐరి= తీవ్రమైన కన్నీటి ధారలచే కలతచెందిన కన్నులుకలవా ళ్ళయ్యారు; అతి+ఉచ్చము+ఐ= మిక్కిలి ఎక్కువైనది అయి (మిక్కిలి పెద్దదై); పయోధి, పటు, రవ+ఆభము+ఐ= సముద్రంయొక్క పెద్ద ధ్వని వలె చాలా తీవ్రమై; సభా, క్షోభము+అయ్యెన్= సభలో కలకలం చెలరేగింది; దుశ్శాసనుండున్; కర్ణ, సైంధవులును; అధిక, హర్ష, వికసిత+ఆస్యంబులు= మిక్కిలి సంతోషంచేత విప్పారిన ముఖాలు; ఒప్పన్= ప్రకాశించగా; ఒండొరులన్= ఒకరినొకరు; చూచి; నగుచున్= నవ్వుతూ; ఉండిరి; అప్పుడు.

తాత్పర్యం: ఆ విధంగా సర్వాన్ని కోల్పోయిన ధర్మరాజును చూచేసరికి- ద్రోణ కృప భీష్ములకు శరీరమంతా చెమటపట్టింది. తాము, తక్కిన వృద్ధులు నోటమాట, శ్వాసశబ్దం కూడ రాని స్థితిలో ఉండిపోయారు. విదురుడు మొగం ప్రక్కకు త్రిప్పి, తలవంచుకొని, మనస్సు మనస్సులో లేక ఎంతో దుఃఖంతో ఉన్నాడు. తక్కిన సదస్యులంతా తీవ్రంగా కంటతడి పెట్టారు. మితిమీరిన సముద్రఘోషలా సభలో కలకలం చెలరేగింది. దుశ్శాసనుడు, కర్ణుడు, సైంధవుడు సంతోషాతిరేకంతో విప్పారినముఖాలతో ఒకరి నొకరు చూచుకుంటూ నవ్వుతూ ఉండిపోయారు.

విశేషం: దిగ్విజేతగా, రాజసూయం చేసిన మహారాజుగా, కానున్న కురుసార్వభౌముడుగా కొండంత దీప్తితో కౌరవసభలో అడుగుపెట్టిన ధర్మరాజుముఖాన్ని, పిదప కపటద్యూతంలో ఉన్నదంతా కోల్పోయి, కడకు తనను కూడ ఓడిపోయి, ఎవరి వైపు చూడలేక, ఏమి చెయ్యాలో తోచక, దీనాతిదీనస్థితిలో అందరిముందు తలవంచుకొని ఉన్న ధర్మరాజుముఖాన్ని- అక్రమవిజయంతో, వికృతానందంతో విజృంభించి ఒకరివైపు మరొకరు చూచుకొంటూ, పకపక నవ్వుతున్న దుర్యోధన శకుని కర్ణ దుశ్శాసనాదుల ముఖాలను, అన్యాయాన్ని నివారించలేక ఆవేదనపడుతూ, నిస్సహాయులై కళ్ళనీళ్ళు నించుకొన్న భీష్మ ద్రోణ విదురాదుల ముఖాలను, సభలో చెలరేగిన కలకలాన్ని- సహృదయుడు ఒక్కసారి ఊహించుకుంటే అప్పు డెంత తీవ్రమైన స్థితి ఏర్పడిందో తెలుస్తుంది.

వ. ధృతరాష్ట్రుండును 'నిది యేమి సభాక్షోభం? బెవ్వ రెవ్వ రే వస్తువు లొడ్డి?' రని విదురు నడుగుచుండె; నట్టి యవసరంబున దుర్యోధనుండు పాండవులం దనకు దాసులంగా నొడిచినవాఁడై పెటిఁగి. 199

ప్రతిపదార్థం: ధృతరాష్ట్రుండునున్; ఇది; ఏమి; సభా, క్షోభంబు= సభాకలకలం; ఎవ్వరు+ఎవ్వరు; ఏ వస్తువులు; ఒడ్డిరి+అని; విదురున్; అడుగుచున్; ఉండెన్; అట్టి; అవసరంబునన్= సమయంలో; దుర్యోధనుండు; పాండవులన్; తనకున్; దాసులంగాన్= సేవకులనుగా; ఒడిచినవాఁడు+ఐ= ఓడించినవాడై; పెటిఁగి= గర్వంతో పెల్లురేగి.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు సభలో 'ఇది ఏమి కలకలం? ఎవ్వరెవ్వరు ఏ యే వస్తువులు ఒడ్డినారు?' అని విదురుణ్ణి అడుగుతున్న సమయంలో- దుర్యోధనుడు, పాండవులను తనదాసులుగా గెలుచుకొన్న గర్వాతిరేకంతో.

క. వరవుళ్ళఁ గలసి తనయిలు । పరువడిఁ దుడువంగఁ గృష్ణఁ బనుచువగన్ భా
సుర రాజ్యదర్ప మొప్ప వి । దురుఁ జెచ్చెరఁ బంచె దానిఁ దోడ్కొని తేరన్. 200

ప్రతిపదార్థం: వరవుళ్ళన్, కలిసి= దాసీజనంతో కలిసి; తన, ఇలు= తన ఇల్లు; పరువడిన్= క్రమంగా; తుడువంగన్= శుభ్రంగా తుడవటానికి; కృష్ణన్= ద్రౌపదిని; పనుచు= ఆజ్ఞాపించు; వగన్= ఆలోచనతో; భాసుర, రాజ్య, దర్పము= వెలుగుతున్న రాజ్యగర్వం; ఒప్పన్; దానిన్= ద్రౌపదిని; తోడ్కొని తేరన్= పిలుచుకొని రావటానికి; విదురున్; చెచ్చెరన్= వెంటనే; పంచెన్= ఆజ్ఞాపించాడు.

తాత్పర్యం: దాసీజనంతో కలిసి తన ఇల్లు వరుసగా తుడవటానికి ద్రౌపదిని ఆజ్ఞాపించాలనే ఆలోచనతో, రాజ్య గర్వంతో విర్రవీగుతూ- ద్రౌపదిని తోడ్కొని రమ్మని విదురుణ్ణి వెంటనే ఆజ్ఞాపించాడు.

విశేషం: కపటద్యూతంలో ధర్మరాజురాజ్యాన్ని గెలుచుకోవటంతో దుర్యోధనునికి అహంకారం అంతులేకుండా పెరిగింది. అది మొదలు తానే రాజైనట్లు, తండ్రితో నిమిత్తమే లేనట్లు విదురునంతటివాణ్ణే ఆజ్ఞాపించే స్థితికి వచ్చాడు. దాసీజనంతో కలిసి ద్రౌపది తనఇల్లు తుడవాలట! విదురుడు వెళ్ళి ఆమెను ఆ పనికి పిలుచుకు రావాలట! ఎంత అహంకారం! ఎంత దుర్విదగ్ధత!

క. దాని సహింపక విదురుం । డా నరపతి కిట్టు లనియె 'నజ్ఞానులు నీ
తో నెన లే రొరు; లిట్లు మ । హానిష్ఠురవృత్తిఁ బనుప నగునే నన్నున్?' 201

ప్రతిపదార్థం: దానిన్, సహింపక; విదురుండు; ఆ, నరపతికిన్= ఆదుర్యోధనునికి; ఇట్టులు+అనియెన్; అజ్ఞానులు= మూర్ఖులు; నీతోన్; ఒరులు= ఇతరులు; ఎనలేరు= సాటిలేరు; ఇట్లు= ఈ విధంగా; మహానిష్ఠురవృత్తిన్= చాలా క్రూరమైన పనిమీద; నన్నున్; పనుపన్+అగునే= పంపదగునా?

తాత్పర్యం: దాన్ని సహించక విదురుడు దుర్యోధనునితో 'నీతో సమానమైన మూర్ఖులు లోకంలో మరెవ్వరూ లేరు. ఇంత క్రూరమైన పనికి నన్ను పంపదగునా?' అని అన్నాడు.

విశేషం: మాయాద్యూతంలో గెలిచినంతమాత్రాన-పాంచాలరాజపుత్రి, పాండవ ధర్మపత్ని అయిన ద్రౌపదిని తనదాసిగా చేసి ఇల్లు తుడిపించటమా? ఎంత క్రూరమైనపని? పైగా అందుకు అంత గొప్ప విదురుణ్ణి పొమ్మని ఆజ్ఞాపించటమా? ఎంత మూర్ఖత! ఎంత అహంకారం!

క. మదమలినమనస్కుఁ డరుం । తుదుఁడు నృశంసుఁ డనఁ బరఁగు దుర్జనునకు సం
పద లెడలయ్యును నాతని । మొదలిటి సంపదలతో సమూలంబు చెడున్. 202

ప్రతిపదార్థం: మద, మలిన మనస్కుఁడు= పొగరుచేత మాసిన మనస్సుకలవాడు; అరుంతుదుఁడు= ఆయువుపట్టును నొప్పించేవాడు; నృశంసుఁడు= క్రూరుడు; అనన్, పరఁగు= అని అనదగిన; దుర్జనునకున్= దుర్మార్గునికి; సంపదలు; ఎడలు+ అయ్యునున్= చెదిరిపోయినప్పటికి; ఆతని; మొదలిటి= తొలుతటి; సంపదలతో; సమూలంబు= వేరుతో గూడ, -అంటే పూర్తిగా; చెడున్= నశిస్తాయి.

తాత్పర్యం: పొగరుచేత మలినమైన మనస్సు కలవాడు. ఆయువుపట్టును (మర్మస్థానాన్ని) నొప్పించేవాడు, క్రూరుడన దగినవాడు అయిన దుర్మార్గుని సంపదలు చెదరిపోవటమే కాక, అతని తొలిసంపదలుకూడ సమూలంగా నాశనమవుతాయి.

విశేషం: విదురునిమాటలు పైకిచూస్తే సూక్తులు: లోనారసి చూస్తే భవిష్యద్వాణులు. శాపోక్తులవంటివి. విదురుడు అంతరాత్మబోధితమైన ధర్మసంస్కారప్రజ్ఞవంటివాడు. అతణ్ణి తనకు హితవు చెప్పవ ద్దని దుర్యోధనుడు తిరస్కరించాడు. అంతటితో ఆగకుండ అధర్మంచేయు మని ఆజ్ఞాపిస్తున్నాడు. ఇది ధర్మప్రవృత్తియొక్క ఆయువుపట్టును నొప్పించే పని. దుర్యోధనుడు ఈ చర్యను ద్రౌపదిని ఆజ్ఞాపించా లని అనుకోవటంతో మొదలుపెట్టాడు. విదురుణ్ణి ఆజ్ఞాపించి దానికి ఒక

రూపా న్నివ్వదలచుకొన్నాడు. దీనివల్ల ధర్మజాదుల ఆయువుపట్టులు బాధపడతాయి. ఆ అధర్మఫలంగా వచ్చిన సంపదతోపాటు ఉన్నసంపదకూడ ఊడ్చుకొనిపోతుం దని భవిష్యద్దర్శనంతో విదురుడు మాట్లాడాడు. (సంపా.)

క. అవనీతలసామ్రాజ్యో । త్సవమునకును యోగ్యమైనసతి ద్రౌపది పాం
డవధర్మపత్ని నీ కం । తవమానము సేయ నేమి యనపాశ్రయయే. 203

ప్రతిపదార్థం: ద్రౌపది; అవనీతల, సామ్రాజ్య+ఉత్సవమునకును= భూమండల సామ్రాజ్యాని కంతటికి రాణిగా పట్టాభిషేకం పొందే వేడుకకు; యోగ్యము+ఐన, సతి= తగిన స్త్రీ; పాండవ ధర్మపత్ని= పాండవుల భార్య; నీకున్; అంత; అవమానము; చేయన్, అనపాశ్రయయే= అండ లేనిదా ఏమి?

తాత్పర్యం: ద్రౌపది సమస్తభూమండలానికి రాణిగా పట్టాభిషేకం పొందదగిన స్త్రీమూర్తి. పాండవుల ధర్మపత్ని, నీ వంత అవమానం చెయ్యటానికి ఆమె అండ లేనిదా ఏమి?

తే. ఏల యాశీవిషంబుల నెఱిఁగి యెఱిఁగి । మూర్ఖవై యలిగించెదు? మొనసి యొరుల
ధనము నికృతిమై గొను టిది ధర్మువగునె? । శకునిమతమునఁ బాపంబుఁ జనునె చేయ? 204

ప్రతిపదార్థం: ఏల= ఎందులకు; ఆశీవిషంబులన్= ముఖమందు విషం గల పాములను; ఎఱిఁగి, ఎఱిఁగి= తెలిసి తెలిసి; మూర్ఖవు+ఐ= మూర్ఖుడివై; అలిగించెదు= కోపం వచ్చేటట్లు చేస్తావు; మొనసి= పూనుకొని; ఒరుల= ఇతరుల; ధనము; నికృతిమైన్= మోసంతో; కొనుట= గ్రహించటం; ఇది; ధర్మువు; అగునె; శకుని, మతమునన్= శకుని అభిప్రాయాన్ని అనుసరించి; పాపంబున్; చేయన్, చనును+ఎ= చేయవచ్చునా?

తాత్పర్యం: ఎందుచేత తెలిసితెలిసి మూర్ఖుడివై పాములకు కోపం తెప్పిస్తావు? ఇతరుల ధనాన్ని మోసంతో గ్రహించటం ధర్మమా? శకునిఅభిప్రాయాన్ని అనుసరించి పాపం చెయ్యదగునా?

విశేషం: అలం: రూపకాతిశయోక్తి. చేసిన పనిలోని చెడుగుతోపాటు, రానున్న ప్రమాదాన్నికూడా విదురుడు సూచిస్తున్నాడు.

వ. జూదంబున నెగ్గు పుట్టు; దీన నయ్యెడు ఫలంబు వేణుఫలంబునుంబోలె సహమూలవినాశంబునకు నిమిత్తం బగు'ననిన దుర్యోధనుండు విదురుం దూలనొదరి, ప్రాతికామి యనువానిం బిలిచి' యీ విదురుం డెప్పుడు నరిష్టంబ కాని పలుకండు; పాండవులకు వెఱచు; నీవు వోయి ద్రౌపదిం దోడ్కొని ర'మ్మని పంచిన. 205

ప్రతిపదార్థం: జూదంబునన్= జూదంవల్ల; ఎగ్గు= కీడు; పుట్టున్; దీనన్= దీనివల్ల; అయ్యెడు= కలిగే; ఫలంబు; వేణు, ఫలంబునున్+పోలెన్= వెదురు ఫలంవలె; సహమూల, వినాశంబునకున్= వేళ్ళతోగూడ నాశనం కావటానికి; నిమిత్తంబు= కారణం; అగున్; అనినన్; దుర్యోధనుండు; విదురున్; తూలన్+ఒదరి= తిరస్కారంగా నిందించి; ప్రాతికామి; అనువానిన్; పిలిచి; ఈ, విదురుండు; ఎప్పుడున్= ఎల్లప్పుడు; అరిష్టంబు+అ, కాని= కీడే కాని; పలుకండు; పాండవులకున్; వెఱచు= భయపడతాడు; నీవు; పోయి; ద్రౌపదిన్, తోడ్కొని; రమ్ము; అని; పంచినన్= పంపగా.

తాత్పర్యం: 'జూదం వల్ల కీడు పుట్టుతుంది. జూదంవల్ల కలిగే ఫలం వెదురు ఫలంలా వేళ్ళతోగూడ నాశనం కావటానికి కారణమవుతుంది' అని అనగా దుర్యోధనుడు విదురుణ్ణి తిరస్కరించి నిందించాడు. ప్రాతికామి అనే

వాణ్ణి పిలిచి 'ఈవిదురు డెప్పుడూ మనకు కీడే పలుకుతాడు. పాండవుల కితడు భయపడతాడు. నీవు పోయి ద్రౌపదిని తోడ్కొని రా' అని పంపాడు.

విశేషం: అలం: ఉపమ. వెదురుపంట పండగానే పొద ఆమూలాగ్రం ఎండిపోతుంది.

ప్రాతికామి ద్రౌపదిని సభకుఁ దోడ్కొని వచ్చుట (సం. 2-60-3)

ఆ. **అవనినాథుచేత నాజ్ఞాపితుం డయి । సూతనందనుండు ప్రాతికామి**
పాండవాగ్రమహిషిపాలికిఁ జని భక్తి । వినతుఁ డగుచు నిట్టు లనియె సతికి. 206

ప్రతిపదార్థం: అవనినాథుచేతన్= భూపతి దుర్యోధనునిచేత; ఆజ్ఞాపితుండు+అయి= ఆజ్ఞాపించబడినవాడై; సూతనందనుండు= సూతుని కుమారుడు; ప్రాతికామి; పాండవ+అగ్రమహిషి, పాలికిన్= పాండవపట్టమహిషి అయిన ద్రౌపది దగ్గరకు; చని, భక్తిన్, వినతుఁడు+అగుచున్= భక్తితో నమస్కరించినవాడై; సతికిన్= ఆ పతివ్రతకు; ఇట్టులు+అనియెన్.

తాత్పర్యం: దుర్యోధనుడు ఆజ్ఞాపించగా, సూతనందనుడైన ప్రాతికామి, పాండవ పట్టమహిషి అయిన ద్రౌపది దగ్గరకు వెళ్ళి, భక్తితో నమస్కరించి, ఆ పతివ్రతతో ఈ విధంగా అన్నాడు.

తరువోజ.

'ధనసంపదలు నిజధరణిరాజ్యంబుఁ దనయులం దమ్ములఁ దన్నును నిన్నుఁ
దనరఁ జూదంబాడి ధార్తరాష్ట్రులకు ధర్మతనూజుండు దా నోటువడియె;
వనజాక్షి! కౌరవవరుపని నిన్ను వడిఁ దోడుకొని పోవ వచ్చితి నిపుడ;
చనుదెమ్ము కౌరవేశ్వరుకడ' కనిన జలజాయతాక్షి పాంచాలి యి ట్లనియె. 207

ప్రతిపదార్థం: ధర్మతనూజుండు= ధర్మరాజు; తనరన్= ఒప్పగా; జూదంబు+ఆడి; ధార్తరాష్ట్రులకున్= ధృతరాష్ట్రుని కుమారులకు; ధనసంపదలు; నిజ, ధరణి, రాజ్యంబున్= తనభూమిమీది దొరతనాన్ని; తనయులన్= కుమారులను; తమ్ములన్; తన్నును; నిన్నున్; తాన్; ఓటుపడియెన్= ఓడిపోయాడు; వనజ+అక్షి= నీట పుట్టిన పద్మాలవంటి కన్నులు కలదానా!; కౌరవ, వరు, పని= కౌరవశ్రేష్ఠుడైన దుర్యోధనుని పనిమీద; నిన్నున్; వడిన్= వేగమె; తోడుకొనిపోవన్; వచ్చితిన్; ఇపుడు+అ; చనుదెమ్ము= రమ్ము; కౌరవ+ఈశ్వరు, కడకున్= కౌరవరాజు దగ్గరకు; అనినన్; జలజ+ఆయత+అక్షి= నీటినుండి పుట్టిన పద్మాలవలె విశాలమైన కన్నులు గలదైన; పాంచాలి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'ధర్మరాజు జూదమాడి-కౌరవులకు తన ధనసంపదలను, రాజ్యాన్ని, కొడుకులను, తమ్ములను, తనను, నిన్ను ఓడిపోయాడు. పద్మాక్షీ! కౌరవశ్రేష్ఠుడైన దుర్యోధనుని పనిమీద నిన్ను వేగమే తోడ్కొని పోవటానికి వచ్చాను. కౌరవేశ్వరుని దగ్గరికి రా' అని అనగా ద్రౌపది అతనితో ఇలా అన్నది.

విశేషం: ప్రాతికామికథనంలో నన్నయవాడిన శబ్దాలు గమనించదగ్గవి. ధర్మరాజు ధార్తరాష్ట్రులకు ఓడిపోయాడట! కౌరవశ్రేష్ఠుడు పంపితే ద్రౌపదిని తోడ్కొనిపోవటానికి వచ్చాడట. కౌరవేశ్వరుని దగ్గరకు ఆమె రావాలట. జూదం మొదలైనప్పుడు దుర్యోధనుడు ధృతరాష్ట్రుని పుత్రుల్లో పెద్దవాడు. గెలిచినతరువాత ఆజ్ఞాపించేటప్పుడు అతడే కౌరవశ్రేష్ఠుడు. రమ్మంటున్నది కౌరవేశ్వరుని

దగ్గరికి. దుర్యోధనుడు పాండవులను గెలిచేంతవరకే ధృతరాష్ట్రుని పుత్రు డని- ఆ తరువాత తానే కౌరవేశ్వరుడుగా వెలిగిపోతున్నా డని ధ్వని. ద్రౌపది కౌరవేశ్వరు డంటే ధృతరాష్ట్రు డని వ్యాఖ్యానించుకొని సభలో మొదట ఆయనవద్దకు వెళ్ళి నిలువబడిం దని చెప్పుకొనటానికి అనువుగా ఆ శబ్దాన్ని వాడాడు. ధృతరాష్ట్రునివద్దనున్న ద్రౌపదిని దుర్యోధనుడు తానే కౌరవేంద్రుడ నన్నట్లు ఆజ్ఞాపిస్తాడు. ధృతరాష్ట్రుడు మారుమాటాడలేదు. (వివరాలకు పీఠిక చూడండి). (సంపా.)

ఆ. 'ఏయుగంబునందు నెట్టి దుష్కితవుండు । భార్య నొడ్డి యోటువడినభర్త
గలఁడె? యిది వినంగఁ గడు నపూర్వం బయ్యె; । నిట్లు సేయునొక్కొ యిందుకులుఁడు? 208

ప్రతిపదార్థం: ఏయుగంబునందున్= ఏయుగంలో నయినా; ఎట్టి దుష్కితవుండు= ఎటువంటి చెడుజూదగాడైనా; భార్యను+ఒడ్డి; ఓటుపడిన= ఓడిపోయిన; భర్త; కలఁడె; ఇది; వినంగన్; కడున్= మిక్కిలి అపూర్వంబు+అయ్యెన్= ఆశ్చర్యకరమయింది; ఇందుకులుఁడు= చంద్రవంశ ప్రభువైన ధర్మరాజు; ఇట్లు; చేయున్+ఒక్కొ= చేశాడా?

తాత్పర్యం: ఏ యుగంలో నయినా, ఎటువంటి చెడ్డ జూదగాడయినా, భార్యను పణంగా ఒడ్డి ఓడిపోయిన భర్త ఉన్నాడా? వినటాని కిది ఆశ్చర్యకరంగా ఉంది. చంద్రవంశ ప్రభువైన ధర్మరాజు ఇలా చేశాడా?

విశేషం: ధర్మజుని 'ఇందుకులు' డనటంలో చంద్రునికాంతితో పాటు అతనిమచ్చకూడ స్ఫురించినట్లే. ధర్మజుని గుణసంపదతోపాటు అతని ద్యూతవ్యసనం కూడా ధ్వనిస్తున్నది.

తే. మున్ను ద న్నోటువడి మఱి నన్ను నోటు । వడియెనో, నన్ను ము న్నోటువడి విభుండు
గ్రన్నఁ ద న్నోటువడియెనో యన్న! నాకు । నెఱుఁగఁ జెప్పుము దీని నీ వెఱుఁగుదేని.' 209

ప్రతిపదార్థం: మున్ను= మొదట; తన్నున్= తనను; ఒటుపడి= ఓడిపోయి; మఱి= తర్వాత; నన్నున్+ఓటు పడియెనో= ఓడిపోయాడో; నన్నున్; మున్ను+ఓటుపడి= ముందుగా ఓడిపోయి; విభుండు= ప్రభువు; క్రన్నన్= పిమ్మట; తన్నున్+ఓటు, పడియెనో= తనను ఓడిపోయాడో; అన్న! దీనిన్; ఈవు; ఎఱుఁగుదు+ఏనిన్; నాకున్; ఎఱుఁగన్; చెప్పుము.

తాత్పర్యం: నా భర్త మొదట తన్నోడి తరువాత న న్నోడెనా? లేక ముందే న న్నోడి తరువాత తా నోడెనా? అన్నా! నీకు తెలిస్తే ఈ సంగతి నాకు చెప్పు.

విశేషం: పదునైన ద్రౌపదిబుద్ధికి ఈ ప్రశ్న ఒక ప్రబలనిదర్శనం.

వ. 'ఎఱుంగవేని యక్కితవు నడిగి వచ్చి మఱి నన్నుం దోడ్కొని పోవనగునేని తోడ్కొని పొ'మ్మనినం బ్రాతికామి క్రమ్మఱి వచ్చి పాంచాలిపలుకులు ధర్మరాజునకుం జెప్పిన, దురోదర పరాజయ దుఃఖిత చేతస్కుం డగుటం జేసి యతఁడు వానికి నదత్తప్రతివచనుం డైనఁ, బ్రాతికామికి దుర్యోధనుం డి ట్లనియె. 210

ప్రతిపదార్థం: ఎఱుంగవు+ఏనిన్= నీకు తెలియకుంటే; ఆ+కితవున్= ఆ జూదగాణ్ణి; అడిగి; వచ్చి; మఱి= తర్వాత; నన్నున్; తోడ్కొని, పోవన్, అగున్+ఏనిన్= పిలుచుకొని వెళ్ళదగినట్లయితే, తోడ్కొనిపొమ్ము; అనినన్; ప్రాతికామి; క్రమ్మఱి, వచ్చి= తిరిగివచ్చి; పాంచాలి, పలుకులు= ద్రౌపది మాటలు; ధర్మరాజునకున్; చెప్పినన్; దురోదర, పరాజయ, దుఃఖిత, చేతస్కుండు+ అగుటన్+చేసి= జూదంలో ఓడిపోవటంచేత దుఃఖాన్ని పొందిన మనస్సుకలవాడుకావటంచేత; అతఁడు= ఆ ధర్మరాజు;

వానికిన్= ప్రాతికామికి; అదత్త, ప్రతివచనుండు+ఐనన్= ఇవ్వబడని బదులుమాటలు కలవాడు కాగా, అంటే సమాధానం చెప్పలేకపోగా; ప్రాతికామికిన్; దుర్యోధనుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'నీకు తెలియకుంటే, ఆ జూదగాణ్ణి అడిగి వచ్చి- నన్ను పిలిచికొని వెళ్ళటం తగినట్లయితే పిలుచుకొని వెళ్ళు'- అని ద్రౌపది పలుకగా, ప్రాతికామి తిరిగి వచ్చి ఆమెమాటలు ధర్మరాజుకు చెప్పాడు. కాని, అతడు జూదంలో ఓడిపోయి దుఃఖంతో ఉండటంవల్ల ప్రాతికామికి బదులు చెప్పలేదు. అప్పుడు దుర్యోధనుడే ఇలా అన్నాడు.

విశేషం: 'నీకు తెలియకుంటే ఆ జూదగాడి నడిగి తెలుసుకొనిరా' అనే ఒక్క వాక్యంతో ఆ ప్రాతికామిని త్రిప్పిపంపిన ద్రౌపది వ్యక్తిత్వంలోని నిండుదనం, దిటవుతనం- విశేషించి ధర్మజుని ద్యూతవ్యసనం పట్ల ఆమె కుండే నిరసన, ఆవేదన పాఠకునికి పొడగట్టక మానవు. సామాన్యస్త్రీ ఎవరైనాసరే ఈ పరిస్థితిలో దుఃఖాతిరేకంతో చతికిలబడిపోయేదే. ద్రౌపదిది ఒక మహోన్నత వ్యక్తిత్వం.

క. 'సందిగ్ధ మయిన యర్థము । నిందఱ సన్నిధిన యడిగి; తింద ఱెఱుంగన్
సుందరిఁ బాంచాలేంద్ర సు । తం దోడ్కొని రమ్ము, పొమ్ము! తడయక' యనినన్. 211

ప్రతిపదార్థం: సందిగ్ధము+అయిన= సందేహమైన - అంటే ఖచ్చితంగా సమాధానం చెప్పటానికి వీలులేని దయిన; అర్థమున్= న్యాయాన్ని; ఇందఱ, సన్నిధిన= ఇంతమంది యెదుట; అడిగితి= అడిగావు; ఇందఱు+ఎఱుంగన్= ఈ సభలోని ఇందరూ తెలిసికొనటానికి వీలుగా; తడయక= ఆలస్యంచేయక; సుందరిన్= అందగత్తె అయిన; పాంచాల+ఇంద్రసుతన్= పాంచాలరాజుకూతురు ద్రౌపదిని; తోడ్కొని, రమ్ము.

తాత్పర్యం: 'ఖచ్చితంగా సమాధానం చెప్పటానికి వీలులేని న్యాయాన్ని ఇంతమంది ఎదుట అడిగావు. ఈ సభలోని వా రందరూ తెలుసుకొనేట్లు, అందగత్తె అయిన ఆ ద్రౌపదిని ఆలస్యం చేయకుండా తోడ్కొనిరా- వెళ్ళు' అని దుర్యోధను డనగా.

విశేషం: 'సందిగ్ధమయిన యర్థము నిందఱి సన్నిధికి వచ్చి యందఱు నడుగన్', 'యేర్పడ నడుగన్' అనే పాఠాంతరాలే ఇక్కడ స్పష్టార్థాలుగా ఉన్నాయి. (మూలంలోకంటె నన్నయచేసిన మార్పులను గురించి పీఠిక చదవండి. - సంపా.)

వ. వాఁడును ద్రౌపది పాలికింబోయి 'దేవీ! నీ యడిగిన యర్థంబ నిర్ణయించువా రయి సభ్యులు నిన్ను రాఁబంచిరి; ర'మ్మనిన దుర్యోధను దుశ్చేష్టితంబునకు ధర్మరాజుసమ్మతంబునకు వెఱచి, యక్కోమలి ప్రాతికామిపిఱుంద నేకవస్త్రయు నధోనీవియు నవిరళగళితనయనోదకబిందుసందోహపరిపీడ్యమానపీనస్తన పరిధానాంతరయు నగుచు సభకుం జనుదెంచి కురువృద్ధసమీపంబున నున్నంత; ద్రౌపదిం జూడ నోపక లజ్జితులయి దుఃఖాయమాన మానసులయి తలలు వాంచియున్న పాండవుల వైలక్ష్యం బుపలక్షించి సంతసిల్లి దుర్యోధనుండు దుశ్శాసనుం బిల్చి 'ప్రాతికామి వృకోదరునకు వెఱచు; నీవు వోయి ద్రౌపదిం దోడ్కొని ర'మ్మని పంచిన. 212

ప్రతిపదార్థం: వాఁడును= ఆ ప్రాతికామియు; ద్రౌపది, పాలికిన్= ద్రౌపది దగ్గరకు; పోయి; దేవీ; నీ, అడిగిన= నీవు అడిగిన; అర్థంబు+అ= న్యాయాన్ని; నిర్ణయించువారు+అయి; సభ్యులు; నిన్ను; రాన్, పంచిరి= రమ్మని ఆజ్ఞాపించారు; రమ్ము+అనిన; దుర్యోధను= దుర్యోధనునియొక్క; దుశ్చేష్టితంబునకున్= చెడ్డపనికి; ధర్మరాజు= ధర్మరాజుయొక్క; సమ్మతంబునకున్= అంగీకారానికి; వెఱచి= భయపడి; ఆ+కోమలి= ఆ సుకుమారి అయిన ద్రౌపది; ప్రాతికామి, పిఱుందన్= ప్రాతికామి వెనుక; ఏకవస్త్రయున్= ఒకే బట్టను ధరించినదీ; అధోనీవియున్= కిందికి ఉన్న కోకముడి కలదీ; అవిరళ, గళిత, నయన+ఉదక, బిందు, సందోహ, పరిపీడ్యమాన, పీన, స్తన, పరిధాన+అంతరయున్= మెండుగా పడుతున్నకన్నీటి బిందువుల సమూహంచేత గట్టిగా బాధించబడుతున్న బలిసిన పాలిండ్ల కట్టువస్త్రంయొక్క చాటు కలదీ; అగుచున్; సభకున్; చనుదెంచి= వచ్చి; కురువృద్ధు, సమీపంబునన్= కురువంశంలో పెద్దవాడైన; ప్రభువైన ధృతరాష్ట్రుని ప్రక్కన; ఉన్న+అంతన్= నిలిచిఉండగా; ద్రౌపదిన్, చూడన్+ఓపక= చూడలేక; లజ్జితులు+అయి= సిగ్గుచెందినవాళ్ళయి; దుఃఖాయమానమానసులు+అయి= దుఃఖంతో నిండిన మనస్సులు కలవాళ్ళయి; తలలు, వాంచి= తలలు వంచుకొని; ఉన్న; పాండవులు; వైలక్ష్యంబు= సిగ్గు; ఉపలక్షించి= చూచి; సంతసిల్లి= సంతోషించి; దుర్యోధనుండు; దుశ్శాసనున్; పిల్చి; ప్రాతికామి; వృకోదరునకున్= భీమునికి; వెఱచున్= భయపడతాడు; నీవు; పోయి; ద్రౌపదిన్; తోడ్కొని= వెంటతీసుకొని; రమ్ము, అని; పంచినన్= ఆజ్ఞాపించగా.

తాత్పర్యం: ఆ ప్రాతికామి ద్రౌపది దగ్గరకు వెళ్ళాడు. 'నీ వడిగిన న్యాయాన్ని నిర్ణయించటానికి సభ్యులు నిన్ను ర మ్మని ఆజ్ఞాపించారు. రా' - అన్నాడు. ద్రౌపది దుర్యోధనుని దుష్కృత్యానికి, ధర్మరాజు అంగీకారానికి భయపడింది. ధరించిన ఏకవస్త్రంతో, క్రిందికి ఉన్న కోకముడితో, ఎడతెరపిలేని కన్నీటి బిందువులతో, తడిసిన చనుకట్టుతో ప్రాతికామివెంట సభకు వెళ్ళింది. కురువృద్ధుడైన ధృతరాష్ట్రునిదగ్గర నిలిచింది. ద్రౌపదిదీనస్థితిని చూడలేక సిగ్గుతో దుఃఖిస్తూ, పాండవులు తలలు వంచుకొన్నారు. సిగ్గుతో తలలువంచుకొన్న పాండవుల్ని చూచి సుయోధనుడు సంతోషించాడు. దుశ్శాసనుణ్ణి పిలిచాడు. 'ప్రాతికామి భీముడికి భయపడతాడు. నీవు వెళ్ళి ద్రౌపదిని తీసుకురా' అని ఆజ్ఞాపించాడు. అప్పుడు

విశేషం: ప్రాతికామి మళ్లీ రావటంలోనే పాంచాలికి పరిస్థితుల తీవ్రత అర్థమైంది. దుర్యోధనుని దుర్మార్గ విజృంభణాన్ని, ధర్మజుని నిస్సహాయతను ఆమె గుర్తించింది. ఒక్క మాటలో అప్పుడు ప్రాతికామిని తిప్పిపంపిన ధీరోదాత్త గంభీర స్త్రీమూర్తి ఇప్పుడు 'కోమలి' అయి అతనివెంట కౌరవసభకు నడిచింది. ఈ కురువంశపుకోడలిమానమర్యాదలు కాపాడవలసిన బాధ్యత నీదే అన్నట్లు కురువృద్ధుడు, స్వార్థరహితుడు, ధర్మనిరతుడు అయిన ధృతరాష్ట్రుని ప్రక్క నిలిచింది. భర్తల బలహీనతను పరోక్షంగా ఎత్తిపొడిచింది. ఆనాడు ఓడలు బండ్లయ్యాయి. బండ్లు ఓడలయ్యాయి. అంతటి పాండవులు అడుగంటి క్రుంగిపోయారు. క్రుంగిన కౌరవులు పట్టపగ్గాలు లేని పొంగులో ఉన్నారు. అ దొక భయంకర వాతావరణం. (ఇందులో- కురువృద్ధు డంటే భీష్ము డనే అర్థం రూఢం. కాని, మూలంలో ద్రౌపది సభలోకి వచ్చి మామగారైన ధృతరాష్ట్రుడివద్ద నిలువబడిం దని చెప్పబడి ఉన్నది. ద్యూతంలో అధర్మవిజిత కావటంచేత ఆమె దాసి కాదు. పాండవులు తమ్ము తా మోడిపోవటంచేత వారికి ద్రౌపదిని పణంగా పెట్టే అధికారం లేదు. ఆమె అప్పుడు ధృతరాష్ట్రుడి అధికారంలోకి వస్తుంది. అతడు కాపాడకపోతే గాంధారిపొంతకు పోతుంది. ఇక్కడ అత్తమామల రక్షలోఉన్న కోడలు. మూలంలో ధర్మరాజు తన ప్రత్యేకదూతతో ఆవిధంగానే వ్యవహరించు మని చెప్పిపంపాడు. కాబట్టి ఆమె వచ్చి మామవద్ద నిలిచింది. ఆయన కాపాడకపోతే లోకులు ధృతరాష్ట్రుడిని నిందించా లని ఆ చర్యలోని అంతరార్థం. ఈ సందర్భంలో కురువృద్ధు డంటే ప్రకరణాన్నీ, ప్రయోజనాన్నీ అనుసరించి ధృతరాష్ట్రు డని అర్థం చెప్పాలి. భీష్ముడు ధృతరాష్ట్రుడి ప్రభుత్వాన్ని కా దని ఏ పనీ చేయలేడు. అతడు స్వయంగా చేసికొనిన నియమం అటువంటిది. అందువలననే అతడికి ద్రౌపదిమీద ఆ సందర్భంలో రక్షణాధికారం లేదు. అంతేకాదు అతడు రాజుకు విరుద్ధంగా ధర్మంకూడా చెప్పలేడు. భీష్ముడు నిర్లిప్తుడైతే గాంధారివద్దకు ద్రౌపది పోవటంలో అప్పుడు ఔచిత్యమే ఉండదు.

అందువలన ఇక్కడ కురువృద్ధు డంటే ధృతరాష్ట్రు డని గ్రహించటంవలన మూలంలోని కొన్ని అంశాలను తెలుగులోకి తేకుండా సంగ్రహించిన నన్నయకథనంలోకూడా సమన్వయం సాధించబడుతుంది. (పీఠికలోని వివరాలు చూడండి). (సంపా.)

ఆ. నిర్దయాత్ముఁ బాపనిరతు దుశ్శాసనుఁ । బనుచు టెఱిఁగి కృష్ణ పంకజాక్షి
గడుభయంబు నొంది గాంధారియొద్దకు । నరిగెఁ గడు నడంగి యతిరయమున. 213

ప్రతిపదార్థం: పంకజ+అక్షి= పద్మాలవంటి కన్నులు కలది; కృష్ణ= ద్రౌపది; నిర్దయ+ఆత్మున్= దయలేని హృదయం కలవాడిని; పాప, నిరతున్= పాపం చేయటంలో ఆసక్తి కలవాడిని; దుశ్శాసనున్; పనుచుట= పంపటం; ఎఱిఁగి= చూచి (తెలిసికొని); కడున్, భయంబున్= మిక్కిలి భీతిన్; ఒంది= పొంది; కడున్= చాలా; అడంగి= తగ్గి; అతి, రయమునన్= ఎంతో వేగంగా; గాంధారి, ఒద్దకున్= గాంధారి దగ్గరకు; అరిగెన్= వెళ్ళింది.

తాత్పర్యం: దయ లేని హృదయం కలవాడు, పాపం చేయటంలో ఆసక్తి కలవాడు అయిన దుశ్శాసనుణ్ణి పంపటం చూచి, పద్మాలవంటి కన్నులు కల ద్రౌపది మిక్కిలి భీతితో, ఎంతో కుంచించుకుపోయింది. ఒక్కపరుగున గాంధారీదేవి దగ్గరకు వెళ్ళింది.

విశేషం: దుర్యోధనదుశ్శాసనుల దౌష్ట్యాన్ని ధృతరాష్ట్రుడు ఆపకుండటం చూచి ఆ అబల - సాటిస్త్రీగా, కౌరవుల ఇంటి పెద్ద కోడలుగా 'నీవైనా నా గౌరవం కాపాడు' అన్నట్లు గాంధారిదగ్గరకు పరుగెత్తింది.

చ. తడయక కౌరవానుజుఁడు దాని పిఱుందన పాఱి 'యింక నె
క్కడ కరుగంగఁబోలుఁ? జులుకం జను దెమ్మిట; సౌబలుండు ని
న్నొడిచె దురోదరంబునఁ; గురూత్తము నర్థమ వైతి; నిన్నునుం
బుడమిని దమ్ముఁ గోల్పడిరి పొల్తి! భవత్పతులైన పాండవుల్.' 214

ప్రతిపదార్థం: తడయక= ఆలస్యం చేయక; కౌరవ+అనుజుఁడు= కౌరవుడైన దుర్యోధనుని తమ్ముడు; దాని, పిఱుందన= ఆ ద్రౌపది వెనుక; పాఱి= పరుగెత్తి; పొల్తి= ఓ కాంతా! ఇంకన్; ఎక్కడకున్; అరుగంగన్+పోలున్= వెళ్ళటానికి సాధ్యమవుతుంది?; చులుకన్= సులభంగా; ఇటన్= ఇక్కడికి; చనుదెమ్ము= రమ్ము; సౌబలుండు= శకుని; దురోదరంబునన్= జూదంలో; నిన్నున్+ఒడిచెన్= నిన్ను గెలిచాడు; కురు+ఉత్తము= కురుశ్రేష్ఠుడైన దుర్యోధనునియొక్క; అర్థమవు+ఐతి= సొత్తువైనావు; భవత్+పతులు+ ఐన= నీ భర్తలైన; పాండవుల్; నిన్నునున్; పుడమినిన్= భూమిని; తమ్మున్= తమను; కోలుపడిరి= కోల్పోయారు.

తాత్పర్యం: వెంటనే దుశ్శాసనుడు ఆ ద్రౌపదివెంట పరుగెత్తి 'ఓ కాంతా! ఇంక నీ వెక్కడికి వెళ్ళగలవు? చెప్పినట్లు విని ఇక్కడికి రా. జూదంలో శకుని నిన్ను గెలిచాడు. కురుశ్రేష్ఠుడైన దుర్యోధనుడి సొత్తువైనావు. నీ భర్తలు నిన్ను, రాజ్యాన్ని, తమను జూదంలో కోల్పోయారు.

వ. అనుచు డాయ వచ్చిన నక్కోమలి 'రజస్వల నన్ను ముట్టకు; మేకవస్త్ర నయి యున్నదాన; గురుబంధు జనాధిష్ఠితంబైన సభకు నెట్లు రా నేర్తు?' ననిన 'నీ వేకవస్త్ర వైతేమి విగతవస్త్ర వైతేమి? ని న్నెట్లుం దోడ్కొని పోదు'నని బలాత్కారంబున. 215

ప్రతిపదార్థం: అనుచున్; డాయన్, వచ్చినన్= దగ్గరకు రాగా; ఆ+కోమలి= ఆ ద్రౌపది; రజస్వలన్= ముట్టైన దానను (ఋతుమతిని); నన్నున్; ముట్టకుము= తాకకుము; ఏకవస్త్రను= ఒకే బట్టను కట్టుకొన్నదానిని; అయిఉన్నదానన్; గురు, బంధుజన+అధిష్ఠితంబు+ఐన= పెద్దలతో, బంధువులతో ఆక్రమించబడిందైన; సభకున్; ఎట్లు; రా నేర్తున్. అనినన్= అని అనగా; నీవు; ఏక, వస్త్రవు= ఒకే బట్ట కట్టుకొన్న దానివి; ఐతేమి= అయితే ఏమి? విగతవస్త్రవు= పూర్తిగా తొలగిన వస్త్రం కలదానివి; ఐతేమి= అయితే ఏమి? నిన్నున్; ఎట్లున్= ఏ విధంగా నైనా; తోడ్కొనిపోదును+అని= తీసుకొనిపోతా నని; బలాత్కారంబునన్= బలవంతంగా.

తాత్పర్యం: అంటూ దగ్గరకు రాగా, ఆ ద్రౌపది - 'నేను రజస్వలను, నన్ను తాకవద్దు. ఒకే బట్ట కట్టుకొని ఉన్నాను. పెద్దలు, బంధువులు కొలువుదీరిన ఈ సభకు ఎలా వస్తాను?' అని అనగా, దుశ్శాసనుడు 'నీవు ఒకే బట్ట కట్టుకొంటే ఏమి? లేదా అసలు బట్ట లేకుండా ఉంటే ఏమి? ఎలాగైనా నిన్ను తీసుకొని పోతాను' అని బలవంతంగా-

విశేషం: 'నేను రజస్వల నన్ను ముట్టకుండు మేకవస్త్ర' - అనే పాఠాంతరం పెక్కుప్రతుల్లో ఉంది.

దుశ్శాసనుఁడు ద్రౌపదిని సభలోని కీడ్చి తెచ్చుట

ఉ. **ఆ వనజాననం గురుకులాపశదుండు గడంగి రాజసూ**
యావభృథంబునందు వసుధామరమంత్రపవిత్రవారిధా
రావళిఁ జేసి పావనము లైన శిరోజములం దెమల్చి పా
పావహుఁ డీడ్చి తెచ్చె సభ కందఱు సంభ్రమమంది చూడఁగన్. **216**

ప్రతిపదార్థం: కురుకుల+అపశదుండు= కురువంశంలోని నీచుడు; పాప+ఆవహుఁడు= చెడుచేసేవాడు - అయిన దుశ్శాసనుడు; కడంగి= పూనుకొని, ఆ, వనజ+ఆననన్= పద్మంవంటిముఖంగల ఆ ద్రౌపదిని; రాజసూయ+అవభృథంబు+అందున్= రాజసూయయాగం చివర చేసిన అవభృథస్నానంలో; వసుధ+అమర, మంత్ర, పవిత్ర, వారి, ధారా+ఆవళిన్+చేసి= భూదేవతల-అంటే బ్రాహ్మణులయొక్క మంత్రాలచేత పవిత్రాలైన నీటిధారలచేత; పావనములు+ఐన= పవిత్రాలైన; శిరోజములన్= తలవెండ్రుకలను; తెమల్చి= పట్టుకొని; అందఱు= సభలోనివాళ్ళంతా; సంభ్రమము+అంది= భయపడి; చూడఁగన్; సభకున్; ఈడ్చి; తెచ్చెన్.

తాత్పర్యం: కురుకులనీచుడు, పాపాత్ముడు అయిన దుశ్శాసనుడు పూని, పద్మంవంటి ముఖం గల ఆ ద్రౌపదిని - రాజసూయ యాగం చివర చేసిన అవభృథస్నానంలో, బ్రాహ్మణుల మంత్రాలచేత పవిత్రాలైన నీటి ధారలతో పావనాలైన తలవెండ్రుకలను పట్టి అందరు భయపడి చూస్తుండగా సభకు ఈడ్చి తెచ్చాడు.

విశేషం: ద్రౌపది శిరోజాలకు నన్నయ ప్రయోగించిన సుదీర్ఘ విశేషణాలు-వాటి పవిత్రతనేకాక, పొడవును, సౌందర్యాన్ని, పట్టిలాగబడిన ఆ శిరోజాలు భావిభారత కథలో వహించనున్న ప్రాధాన్యాన్ని పరోక్షంగా సూచించేవిగా ఉన్నాయి. కులకాంతను పదిమందిలో జుట్టుబట్టి లాగటం పెద్దదోషం. అందులోను సార్వభౌమయోగ్యమైన రాజసూయయాగం చేసిన శక్తిసంపన్నుల ధర్మపత్ని ద్రౌపదిని, నిండుసభలో అవభృథస్నానంచేత పవిత్రాలైన ఆమె సుదీర్ఘ శిరోజాలు పట్టి లాగటం మహాపాపమే కాదు, మిక్కిలి ప్రమాదకరంకూడ. పుట్టలోని నల్లత్రాచును పట్టి లాగినట్లే. ఈ శిరోజాలు-సంధికి వెళ్ళే శ్రీకృష్ణునికి ద్రౌపదిచేత 'ఇవి దుస్ససేను వ్రేళ్ళం దవిలి సగము ద్రెవ్విపోయి తక్కిన యవి కౌరవులకడఁ దీఱుమాటల యవసరమునఁ దలపవలయు నచ్యుత వీనిన్' అని చెప్పించాయి. 'ఈ వెండ్రుకలు వట్టి యీడ్చిన యా చేయి దొలుతగాఁ బోరిలో దుస్ససేను, తను వింతలింతలు

తునియలై చెదరి రూపటియున్నఁ గని యుడుకాఱుఁగాక' అని పలికించాయి. సంధి ప్రయత్నాన్ని చేతనైనంతవరకు బలహీన పరిచాయి. ఈ పద్యరచనలో శ్లేష మనేగుణం రసోదంచితంగా పోషించబడింది (వివరాలకు చూడు: పీఠిక). (సంపా.)

వ. ఇట్లు వాతావధూతంబైన పతాకయుంబోలె దుశ్శాసనాకృష్టయై ద్రౌపది వికీర్ణకేశయు వివర్ణవదనయునై కర్ణ దుర్యోధన శకుని సైంధవాది దుష్ట భూయిష్ఠంబైన సభకు వచ్చి కోపలజ్జాపరవశ యయి. 217

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; వాత+అవధూతంబు+ఐన= గాలిచేత కదలించబడిందైన; పతాకయున్, పోలెన్= జెండావలె; దుశ్శాసన+ఆకృష్ట+ఐ= దుశ్శాసనునిచేత లాగబడినదై; ద్రౌపది; వికీర్ణ, కేశయున్= చెదరిన వెండ్రుకలు గలదియు; వివర్ణవదనయున్+ఐ= వెలవెలబోయిన ముఖం కలదియు అయి; కర్ణ, దుర్యోధన, శకుని, సైంధవ+ఆది= కర్ణుడు, దుర్యోధనుడు, శకుని, సైంధవుడు మొదలయిన; దుష్ట, భూయిష్ఠంబు+ఐన= దుర్మార్గులతో నిండినదైన; సభకున్; వచ్చి; కోప; లజ్జా, పరవశ+ అయి= కోపంచేత, సిగ్గుచేత మై మరచినదై;

తాత్పర్యం: ఈ విధంగా గాలిచే కదలించబడిన జెండావలె దుశ్శాసనునిచేత ఈడ్వబడిన ద్రౌపది, చెదిరిన జుట్టుతో, వెలవెలబోయిన ముఖంతో-కర్ణుడు, దుర్యోధనుడు, శకుని, సైంధవుడు మొదలయిన దుర్మార్గులతో నిండిన సభకు వచ్చి, కోపంతో సిగ్గుతో మైమరచినదై.

విశేషం: అలం: ఉపమ.

చ. అనుపమ దైవయోగహతుఁ డయ్యు నవశ్యము ధర్మసంపదం
దనరున కాక ధర్మజుఁడు ధన్యుఁడు ధర్మపథంబు తప్పఁద్రొ
క్కునె కురువృద్ధులార! భృశకోపనుఁ డీతఁడు నన్ను నేల దు
ర్జనుఁ డిట యీడ్చి తెచ్చె నవిచారపరుం డయి దుర్మదంబునన్. 218

ప్రతిపదార్థం: కురువృద్ధులార= కురువంశంలోని పెద్దలారా!; అనుపమ, దైవ, యోగ, హతుఁడు+అయ్యున్= సాటిలేని దైవయోగంచేత కొట్టబడినవాడైనను; ధన్యుఁడు= పుణ్యాత్ముడు; ధర్మజుఁడు; అవశ్యము= తప్పక; ధర్మసంపదన్= ధర్మమనే ఐశ్వర్యంతో; తనరును+అ+కాక= ఒప్పునేకాని; ధర్మపథంబు= ధర్మమార్గం; తప్పన్+త్రొక్కునె= తప్పి నడుస్తాడా?; భృశకోపనుఁడు= అధికకోపంకలవాడు; దుర్జనుఁడు= చెడ్డవాడు; ఈతఁడు= ఈ దుశ్శాసనుడు; దుర్మదంబునన్= కండకావరంతో; అవిచారపరుండు+అయి= ఆలోచన లేనివాడై; నన్నున్; ఏల; ఇటన్= ఈ సభకు; ఈడ్చి; తెచ్చెన్.

తాత్పర్యం: కురువంశంలోని పెద్దలారా! సాటిలేని దురదృష్టాలచేత దెబ్బతిన్నప్పటికీ, పుణ్యాత్ముడైన ధర్మరాజు ఎల్లప్పుడు ధర్మమనే సంపదతో ప్రకాశిస్తాడేకాని, ధర్మమార్గం తప్పి నడుస్తాడా? అధికకోపం కలవాడు, చెడ్డవాడు అయిన ఈ దుశ్శాసనుడు కండకావరంతో అవివేకంగా న న్నెందుకు ఈ సభకు ఈడ్చి తెచ్చాడు?

విశేషం: లౌకిక సంపదలు కోల్పోయినా ధర్మరాజు నిత్యధర్మసంపన్నుడు. అతని చర్యల్లోని ధర్మసూక్ష్మాన్ని గుర్తించలేని అవివేకి దుశ్శాసనుడు. 'అతడు ఏ ధర్మాన్ని ఆశ్రయించి నన్ను సభకు తెచ్చాడు?' అని ద్రౌపది ప్రశ్నించింది. ఆమెను సభకు రప్పించటంలో ధర్మం లేదనీ, మదమొక్కటే కారణ మనీ ఆమె సభకు నివేదించుకొన్నది. (ఈ మాటల కీ ఘట్టంలో లోతైన అర్థాలు ఉన్నాయి. వివరాలకు పీఠిక చూడండి). (సంపా.)

చ. 'ఇది యుచితంబు గా దనక యిక్కురుముఖ్యులు సూచుచుండ దు
ర్మదుఁ డయి వీఁడు నన్ను నవమానితఁ జేసెడి; సర్వధర్మ సం
విదు లన నున్న యీ భరతవీరులవంశము నేఁ డధర్మ సం
పద నతినింద్య మయ్యె' నని భామిని గృష్ణుఁ దలంచె భీతయై. 219

ప్రతిపదార్థం: ఇది= ఈ విధంగా జుట్టుపట్టి ఈడ్చితేవటం; ఉచితంబు= తగినది; కాదు+అనక= కాదని అనకుండా; ఈ+కురు, ముఖ్యులు= ఈ కురువంశంలోని ముఖ్యమైనవాళ్ళు - అంటే భీష్మ ధృతరాష్ట్రాది ప్రముఖులు; చూచుచున్+ఉండన్; దుర్మదుఁడు+అయి= క్రొవ్వినవాడై; వీఁడు= ఈ దుశ్శాసనుడు; నన్నున్; అవమానితన్= అవమానించ బడిన దానినిగా; చేసెడిన్= చేస్తున్నాడు; సర్వ, ధర్మ, సంవిదులు+అనన్= అన్నిధర్మాలు బాగుగా తెలిసినవారు అనునట్లుగా; ఉన్న; ఈ భరతవీరుల, వంశము; నేఁడు; అధర్మ, సంపదన్= అధర్మం పెరగటంచేత; అతి నింద్యము= మిక్కిలి నిందించదగినది; అయ్యెన్+ అని; భామిని= కోపం గల స్త్రీ - ద్రౌపది; భీత+ఐ= భయపడిందై; కృష్ణున్= శ్రీకృష్ణుణ్ణి; తలంచెన్= తలచుకొన్నది.

తాత్పర్యం: 'ఈ విధంగా నన్ను జుట్టుపట్టి ఈడ్చితేవటం ఉచితం కాదని భావించక, ఈ కురువంశప్రముఖులంతా చూస్తుండగా, క్రొవ్విన ఈ దుశ్శాసనుడు న న్నవమానిస్తున్నాడు. అన్ని ధర్మాలు పూర్తిగా తెలిసినవా ళ్ళని పేరు పొందిన ఈ భరతవీరుల వంశం ఈనాడు అధర్మం పెరగటంచేత ఎంతో నిందించదగినది అయిం' దని కోపించిన ద్రౌపది భయపడి శ్రీకృష్ణుణ్ణి స్మరించింది.

విశేషం: కురువంశపు పెద్దలను ఉద్దేశించి ద్రౌపది అన్నమాటల్లో మంటలు కనబడకపోవచ్చు గాని వేడిమాత్రం విపరీతంగా ఉంది. (భయభావదీప్తిని సూచిస్తూ ఔజ్జ్వల్యంతో కూడుకొన్న మాటలరచన గల ఈ పద్యంలో కాంతిగుణం ప్రకాశిస్తున్నది. -సంపా.)

వ. ఇట్లు జగత్త్రయ విజయ భుజవీర్య సనాథులైన నాథులు గలిగియు ననాథయుంబోలెఁ బాంచాలరాజపుత్త్రి భయార్తయై యార్తజన శరణ్యుండైన జగన్నాథు జనార్దనుం దలంచుచుఁగపట ద్యూతమధుమదోన్మత్తుండయిన ధర్మపుత్త్రు నిమిత్తంబున నుద్గతంబయిన పాండవపరాజయ దహనంబుఁ దన రూక్ష కటాక్ష వీక్షణ వచనంబులఁ బ్రవర్తించుచున్నదానిఁ జూచి దుఃఖితుండై భీమసేనుండు ధర్మరాజున కి ట్లనియె. 220

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; జగత్త్రయ, విజయ, భుజవీర్య, సనాథులు+ఐన= ముల్లోకాలను జయించగల భుజబలంతో కూడుకొన్న వాళ్ళయిన; నాథులు= భర్తలు; కలిగియున్; అనాథయున్+పోలెన్= భర్తలేని దాని వలె-అంటే దిక్కులేని దాని వలె; పాంచాల రాజపుత్త్రి= ద్రౌపది; భయ+ఆర్త+ఐ= భయంచేత దుఃఖంపొందిందై; ఆర్తజనశరణ్యుండు+ఐన= దుఃఖంలో ఉండే జనులు రక్షణ వేడదగినవాడైన; జగన్నాథున్= జగత్తు కంతటికి ప్రభు వైనవాణ్ణి; జనార్దనున్= శ్రీమహావిష్ణువును - ఆయన అవతారమైన శ్రీకృష్ణుణ్ణి; తలంచుచున్= తలచుకొంటూ; కపట, ద్యూత, మధు, మద+ఉన్మత్తుండు+అయిన= కపటపుజూదమనే మద్యపానమదంచేత మిక్కిలి మత్తెక్కి ఉన్న వాడైన; ధర్మపుత్త్రు, నిమిత్తంబునన్= ధర్మరాజు కారణంగా; ఉద్గతంబు+అయిన= పుట్టిన; పాండవ పరాజయ, దహనంబున్= పాండవుల ఓటమి అనే అగ్నిని; తన, రూక్ష, కటాక్ష, వీక్షణ, వచనంబులన్= తనయొక్క కఠినాలైన చూపులలో, మాటలలో; ప్రవర్తించుచున్నదానిన్= ప్రకటిస్తున్న ద్రౌపదిని; చూచి; దుఃఖితుండు+ఐ= దుఃఖంపొందినవాడై; భీమసేనుండు; ధర్మరాజునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈ విధంగా ముల్లోకాలను జయించగల భుజబలం ఉన్న భర్తలు గల ద్రౌపది, దిక్కులేనిదానిలా భయంతో దుఃఖిస్తూ - దుఃఖంలో ఉన్నవా ళ్ళందరు శరణు వేడదగినవాడు, జగత్తు కంతటికి ప్రభువు అయిన శ్రీకృష్ణుణ్ణి మనస్సులో తలచుకొంటూ, కపటపు జూద మనేమద్యపానమదంచేత మత్తెక్కిన ధర్మరాజువల్ల పుట్టిన పాండవుల ఓటమి అనే అగ్నిని కఠినాలైన తన చూపుల్లో, మాటల్లో వ్యక్తం చేయటం చూచి, భీమసేనుడు దుఃఖపడుతూ ధర్మరాజుతో ఇలా అన్నాడు.

విశేషం: అలం. రూపకం. అందరు ఉన్నా ద్రౌపదికి ఎవ్వరూ లేనట్లే అయింది. ఇక దిక్కులేనివాళ్ళకు దేవుడే దిక్కుగదా! అందుకే ఆమె శ్రీకృష్ణుణ్ణి స్మరించింది.

క. ధన కనక రత్న వరవా । హన ధరణీ రాజ్యములును నాయుధములు మ
మ్మును నోటువడుట యుచితమ । యినసన్నిభ! వీని కెల్ల నీశుఁడ వగుటన్. 221

ప్రతిపదార్థం: ఇన, సన్నిభ= సూర్యునితో సమానమైనవాడా! ఓ ధర్మరాజా!; ధన, కనక, రత్న, వరవాహన, ధరణీ, రాజ్యములునున్= డబ్బును, బంగారాన్ని, రత్నాలను, శ్రేష్ఠములైన వాహనాలను, రాజ్యాన్ని, ఆయుధాలను; మమ్మునున్= తమ్ముళ్ళమైన నలువురను; వీనికిన్+ఎల్లన్= వీటి కన్నింటికి; నీవు; ఈశుఁడవు= ప్రభుడవు; అగుటన్= అవటంచేత; ఓటు, పడుట= జూదంలో ఒడ్డి ఓడిపోవటం; ఉచితము+అ= తగినదే.

తాత్పర్యం: సూర్యునితో సమానమైన ఓ ధర్మరాజా! ధన, కనక, రత్న, వాహనాలకు, రాజ్యానికి, ఆయుధాలకు, తమ్ములమైన మా నల్వురకు - నీవు ప్రభుడవు. కాబట్టి, జూదంలో ఒడ్డి ఓడిపోవటం ఉచితమే.

క. ద్రుపదతనూజం బణముగఁ । గపటద్యూతమునఁ జేయఁగాఁ దగునె జనా
ధిప! యిది దుష్టద్యూతము । నెపమునఁ బరిభూత య య్యె నిష్కరుణులచేన్. 222

ప్రతిపదార్థం: జన+అధిప= రాజా!; ద్రుపద, తనూజన్= ద్రౌపదిని; కపట, ద్యూతమునన్= మోసపు జూదంలో; పణముగాన్= పందెంగా; చేయఁగాన్+తగునె= చేయటం తగునా?; ఇది= ద్రౌపది; దుష్ట, ద్యూతము, నెపమునన్= ఈ చెడుజూదం కారణంగా; నిష్కరుణులచేన్= దయలేని వారి చేత; పరిభూత+అయ్యెన్= అవమానించబడినది అయింది.

తాత్పర్యం: ఓరాజా! ద్రౌపదిని కపటపు జూదంలో పందెంగా ఒడ్డదగునా! ఈ చెడుజూదం కారణంగా ఆమె ఈ దయలేనివాళ్ళచేత అవమానింపబడింది.

వ. 'శకునికైతవం బెఱింగియుం బాపద్యూతంబునఁ బ్రవర్తించి యధర్మ ప్రవృత్తుండ వయితి కావున భవద్బాహు దాహంబు సేయవలయు' నని కోపించి పలికినం బవనతనయునకు నర్జునుం డి ట్లనియె. 223

ప్రతిపదార్థం: శకుని, కైతవంబు= శకునియొక్కకపటాన్ని; ఎఱింగియున్= తెలిసియు; పాప, ద్యూతంబునన్= చెడ్డజూదంలో; ప్రవర్తించి= పాల్గొని; అధర్మ ప్రవృత్తుండవు+అయితి= అధర్మంలో నడిచినవాడి వయ్యావు; కావున; భవత్+బాహు, దాహంబు= నీయొక్క చేతులను కాల్చటం; చేయవలయున్, అని కోపించి; పలికినన్, పవనతనయునకున్= వాయుదేవుని కుమారుడైన భీమునికి; అర్జునుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'శకునిమోసం తెలిసికూడ నీవు చెడుజూదంలో పాల్గొని, అధర్మమార్గాన నడిచినవాడి వయ్యావు. అందుచేత నీ చేతులు కాల్చాలి' అని కోపంతో పలికిన భీమునికి అర్జునుడు ఇలా అన్నాడు.

విశేషం: ఇక్కడ మూలంలో "బాహూ తే సంప్రధక్ష్యామి సహదేవాగ్ని మానయ'' (భండార్కరు ప్రతి 2-61-6) అని ఉంది. సహదేవుణ్ణి అగ్ని తెమ్మనటం తెలుగులో లేదు. కాగా 'బాహూ తే సంప్రధక్ష్యామి' అనటాన్ని రెండు విధాలుగా పండితులు అన్వయించటం జరిగింది. తే బాహూ= నీ బాహువులను; సంప్రధక్ష్యామి= తగులబెడతాను - అనటం ఒకటి, తే=తే(పురతః), బాహూ=(మమ) బాహూ, సంప్రధక్ష్యామి= తగులబెడతాను (నీ ఎదుట నా బాహువులను తగులబెడతాను) అని అనటం మరొకటి. భీముడు అన్నగారి బాహువులను తగులబెడతానని అంటాడా? అందుచేత ఏమీ చేయలేక తన బాహువులను తానే తగులబెట్టుకొంటా నన్నా డని మరొక వర్గంవారి అభిప్రాయం. కాని, ఆ సందర్భంలో ఆవేశపరుడైన భీముడు అన్నగారిని అలా అనటమే సమంజస మనిపిస్తున్నది. అందుచేతనే అర్జునుడు ధర్మరాజును సమర్థించవలసివచ్చింది. పైగా భీముడు ధర్మరాజును ఎదిరించి మాట్లాడిన సందర్భాలు భారతంలో లేకపోలేదు. నన్నయ అనువాదమే ఈ సందర్భంలో చక్కగా అతుకుతున్నది.

సీ. **ధర్మతనూజుండు ధర్మువు దప్పిన । ధరణీతలం బెల్లఁ దల్లడిల్లుఁ;**
దగిలి సుహృద్ద్యూత ధర్మయుద్ధములకుఁ । బరులచేఁ బిలువంగఁబడి విభుండు
గడగక విముఖుండు గాఁ జన దని శుభ । క్షాత్త్రధర్మంబు లోకంబునందు
నిలిపెఁ దా; నిది పతినేరమియే? దైవ । వైపరీత్యం బైన వనరఁ దగునె?

ఆ. **గురుల ధర్మపరులఁ గోపించి ధీరు ల । తిక్రమింతురే? తదీయనిత్య**
ధర్మగౌరవం బధార్మికు లగుచున్న । పరులచేతఁ జెఱుపఁబడియె నిట్లు. **224**

ప్రతిపదార్థం: ధర్మతనూజుండు= ధర్మరాజు; ధర్మువు= ధర్మం; తప్పినన్; ధరణీతలంబు+ఎల్లన్= భూమండలం అంతా; తల్లడిల్లున్; తగిలి= వెంటబడి; సుహృత్+ద్యూత, ధర్మయుద్ధములకున్= స్నేహంగా ఆడుకొనే జూదానికి, ధర్మంకోసం చేసే యుద్ధానికి; పరులచేన్= ఇతరులచేత; పిలువంగఁబడి; విభుండు= రాజు; కడగక= పూనుకొనక; విముఖుండు= పెడమొగం పెట్టినవాడు; కాన్+చనదు+అని= కాకూడ దని; శుభ, క్షాత్ర, ధర్మంబు= శుభమైన క్షత్రియధర్మాన్ని; లోకంబునందున్; తాన్= తాను; నిలిపెన్; ఇది; పతి, నేరమియే= ధర్మరాజుయొక్క అజ్ఞానమా?; దైవవైపరీత్యంబు+ఐనన్= దేవునిదయ తారుమారైతే; వనరన్= దుఃఖించ; తగునె= తగునా?; గురులన్= పెద్దవాళ్ళను; ధర్మపరులన్= ధర్మాన్ని పాటించేవాళ్ళను; కోపించి; ధీరులు= నీవంటి ధైర్యవంతులు; అతిక్రమింతురే= మర్యాదను మీరుతారా!; తదీయ, నిత్య, ధర్మ, గౌరవంబు= ఆయనయొక్క (ధర్మరాజుయొక్క) శాశ్వతమైన ధర్మంయొక్క గొప్పతనం; అధార్మికులు= ధర్మహీనులు; అగుచున్+ఉన్న; పరులచేతన్= ఇతరులచేత; ఇట్లు; చెఱుపన్+పడియెన్= చెడగొట్టబడింది.

తాత్పర్యం: ధర్మరాజే ధర్మం తప్పితే భూమండలమంతా తల్లడిల్లదా? స్నేహంగా ఆడుకొనే జూదానికి, ధర్మంకొరకు చేసే యుద్ధానికి ఇతరులు పలుమార్లు పిలిస్తే, ప్రభువైనవాడు అందుకు పూనుకోకుండా, పెడమొగంపెట్టి పోకూడదన్న శుభక్షత్రియధర్మాన్ని, ఆయన లోకంలో నిలిపాడు. అంతేకాని ధర్మరాజు ఈ జూదమాడటం అజ్ఞానంవల్లనా? దైవానుగ్రహం తారుమారైతే అందుకు దుఃఖించటం తగునా? ధర్మజుని శాశ్వతమైన ధర్మగౌరవం- ధర్మహీనులైన ఇతరులచేత ఈ విధంగా చెడగొట్టబడింది.

విశేషం: అర్జునునిసమర్థన భీముని ఆగ్రహావేశానికి సకాలంలో చక్కని అడ్డుకట్ట వేసింది.

వ. అనుచు దుఃఖితులగు చున్న పాండవులను దుశ్శాసనాపకృష్టయై సభాంతరంబున నున్న ద్రౌపదిం జూచి వికర్ణుం డన్యాయశ్రవణవికర్ణులై మిన్నకున్న సభ్యుల కి ట్లనియె. 225

ప్రతిపదార్థం: అనుచున్; దుఃఖితులు+అగుచున్+ఉన్న; పాండవులను; దుశ్శాసన+అపకృష్ట+ఐ= దుశ్శాసనునిచేత ఈడ్వబడిందై; సభా+అంతరమునన్= సభమధ్య; ఉన్న; ద్రౌపదిన్, చూచి; వికర్ణుండు; అన్యాయ, శ్రవణ, వికర్ణులు+ఐ= అన్యాయాన్ని వినటానికి చెవులు లేనివాళ్ళయి - అంటే అన్యాయాన్నిగూర్చి వినటానికి ఒల్లనివాళ్ళయి; మిన్నక+ఉన్న= ఊరకున్న; సభ్యులకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని దుఃఖిస్తున్న పాండవులను, దుశ్శాసనునిచేత ఈడ్వబడి సభామధ్యంలో ఉన్న ద్రౌపదిని చూచి, అన్యాయాన్ని గూర్చి వినటానికి ఇష్టపడని సభాసదులతో వికర్ణుడు ఇలా అన్నాడు.

విశేషం: దుర్యోధనుని తొంబయితొమ్మిదిమంది తమ్ముళ్ళలో వికర్ణుడు ఒకడు. కొంత న్యాయాన్యాయ పరిగణన, ధార్మికావేశం కలవాడు.

క. సమచిత్తవృత్తు లగు బు । ద్ధిమంతులకు నిపుడు ద్రౌపదీప్రశ్న విచా
రము సేయ వలయు; నవిచా । రమునఁ బ్రవర్తిల్లు టది నరకహేతు వగున్. 226

ప్రతిపదార్థం: సమచిత్తవృత్తులు+అగు= పక్షపాతం లేని మనస్సు కలవాళ్ళయిన; బుద్ధిమంతులకున్= మేధావులకు-ఆలోచనాపరులకు; ఇప్పుడు; ద్రౌపదీ, ప్రశ్న= ద్రౌపది వేసిన ప్రశ్న; విచారము, చేయవలయున్= ఆలోచించవలసి ఉన్నది; అవిచారమునన్= ఆలోచించకుండ; ప్రవర్తిల్లుట= ఉండటం; అది; నరకహేతువు+అగున్= నరకం పొందటానికి కారణ మవుతుంది.

తాత్పర్యం: పక్షపాతంలేని బుద్ధిమంతు లంతా ఇప్పుడు ద్రౌపది అడిగిన ప్రశ్నను విచారించవలసిన అవసరముంది. అలా విచారించకుండ మన కెందుకు లెమ్మని ఊరకుంటే అది నరక హేతు వౌతుంది.

వ. 'ఇక్కురువృద్ధు లైన భీష్మ ధృతరాష్ట్ర విదురాదులును నాచార్యులయిన ద్రోణకృపాదులుం బలుకరైరి; యున్న సభాసదులెల్లం గామక్రోధాదులు దక్కి విచారించి చెప్పుం'డనిన నెవ్వరుం బలుకకున్న 'నే నిందు ధర్మ నిర్ణయంబు సేసెద; నెల్లవారును వినుండు; జూదంబును వేఁటయుఁ బానంబును బహుభక్షణాసక్తియు నను నాలుగు దుర్వ్యసనంబులం దగిలిన పురుషుండు ధర్మువుం దప్పివర్తిల్లు; నట్టి వాని కృత్యంబులు సేకొనం దగవు; కిత వాహూతుండై వ్యసనవర్తి యయి పరాజితుం డయిన పాండవాగ్రజుండు పాండవుల కందఱకు సాధారణ ధనంబయిన పాంచాలిఁ బణంబుఁ జేసెం గావున ద్రౌపది యధర్మవిజిత; యక్కోమలి నేకవస్త్ర నిట దోడ్కొని తెచ్చుట యన్యాయం' బనిన వికర్ణుపలుకుల కొడంబడక కర్ణుండు వాని కి ట్లనియె. 227

ప్రతిపదార్థం: ఈ+కురువృద్ధులు+ఐన= ఈ కురువంశపు పెద్దలైన; భీష్మ, ధృతరాష్ట్ర, విదుర+ఆదులునున్= భీష్ముడు, ధృతరాష్ట్రుడు, విదురుడు మొదలయినవాళ్ళూ; ఆచార్యులు+అయిన= గురువులైన; ద్రోణ, కృప+ఆదులున్= ద్రోణుడు, కృపుడు మొదలయినవాళ్ళూ; పలుకరు+ఐరి= మాటాడకున్నారు; ఉన్న= మిగిలిఉన్న- తక్కిన; సభాసదులు+ఎల్లన్= సభలో

కూర్చున్న ధర్మం తెలిసిన వాళ్ళంతా; కామ, క్రోధ+ఆదులు= రాగం, ద్వేషం మొదలైనవి; తక్కి= మాని; విచారించి= ఆలోచించి; చెప్పుండు; అనినన్; ఎవ్వరున్= ఎవరుకూడ; పలుకక; ఉన్నన్; ఏన్= నేను; ఇందున్= ఇక్కడ; ధర్మనిర్ణయంబు= ధర్మాన్ని గురించిన నిర్ణయం; చేసెదన్; ఎల్లవారును= అందరు; వినుండు; జూదంబును; వేఁటయున్; పానంబును= మద్యపానం; బహు, భక్షణ+ఆసక్తియున్= అతిగా తినటంలోని మితిమీరిన కోరిక; అను నాలుగు, దుర్వ్యసనంబులన్= చెడు వ్యసనాలలో; తగిలిన= తగుల్కొన్న; పురుషుండు= మానవుడు, ధర్మువున్= ధర్మాన్ని; తప్పి, వర్తిల్లున్= ప్రవర్తిస్తాడు; అట్టి వాని; కృత్యంబులు= పనులు; చేకొనన్, తగవు= లెక్కలోకి తీసుకోదగినవికావు; కితవ+ఆహూతుండు+ఐ= జూదరిచేత పిలువబడినవాడై; వ్యసన, వర్తి+అయి= జూదవ్యసనంలో తగుల్కొన్నవాడై; పరాజితుండు+అయిన= ఓడిపోయిన; పాండవ+అగ్రజుండు= పాండవులందు ముందు పుట్టినవాడు - ధర్మరాజు; పాండవులకున్+అందఱకు; సాధారణ ధనంబు+అయిన= ఉమ్మడిసొమ్ము అయిన; పాంచాలిన్= ద్రౌపదిని; పణంబున్+చేసెన్= పందెంగా చేశాడు; కావున; ద్రౌపది; అధర్మ, విజిత= అధర్మంచేత జయింపబడింది; ఆ+కోమలిన్= ఆ సుకుమారిని; ఏక, వస్త్రన్= ఒకే బట్టను ధరించినదానిని; ఇటన్= ఇక్కడికి; తోడ్కొని; తెచ్చుట; అన్యాయంబు; అనిన; వికర్ణ, పలుకులకున్= వికర్ణుని మాటలకు; ఒడంబడక= ఒప్పుకొనక; కర్ణుండు; వానికిన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'ఈ కురువంశపు పెద్దలైన భీష్ముడు, ధృతరాష్ట్రుడు, విదురుడు మొదలయినవాళ్ళూ, గురువులైన ద్రోణుడు, కృపుడు మొదలయినవాళ్ళూ మౌనంగా ఉన్నారు. సభలో కూర్చున్నవాళ్ళలో మిగిలిన ధర్మజ్ఞులైనా రాగద్వేషాలు మాని ఆలోచించి చెప్పండి' - అని వికర్ణు డనగా, ఎవ్వరూ పలుకలేదు. అప్పుడు వికర్ణుడు 'నేనే ఇక్కడ ధర్మనిర్ణయం చేస్తాను. అందరు వినండి. జూదం, వేట, మద్యపానం, అతిగా తినటం అనే నాలుగూ చెడు వ్యసనాలు. వీటిలో తగుల్కొన్న మానవుడు ధర్మంతప్పి ప్రవర్తిస్తాడు. అలాంటివాడి పనులు లెక్కలోకి తీసుకోకూడదు. జూదగానిచేత ఆహ్వానించబడి, జూదవ్యసనంలో తగుల్కొని ఓడిపోయిన ధర్మరాజు, పాండవు లందరికి ఉమ్మడిసొమ్ము అయిన పాంచాలిని పందెంగా చేశాడు. అందుచేత ఆమె అధర్మంచేత జయించబడింది. ఆ సుకుమారిని- ఒకేవస్త్రం ధరించి ఉన్నదాన్ని, ఇక్కడికి తీసుకొని రావటం అన్యాయం' అని వికర్ణు డనగా ఆ మాటలను అంగీకరించక కర్ణు డతనితో ఇలా అన్నాడు.

విశేషం: వ్యసన మంటే కామక్రోధాదులవల్ల పుట్టే దోషం. ఇవి ఏడు. జూదం, మద్యపానం, వేట, స్త్రీవ్యామోహం (ఈ నాలుగు కామం వల్ల పుట్టేవి), వాక్పారుష్యం, దండపారుష్యం, అర్థదూషణం (ఈమూడూ క్రోధంవల్ల పుట్టేవి). పై వచనంలో 'బహుభక్షణాసక్తి' అనే దానికి 'పరనారీ బహుళాసక్తి' అనే పాఠాంతరం ఉంది. ఇదే మేల్తరం, మూలానుగుణం అనిపిస్తుంది.

ఆ. 'ఎల్లవారు నెఱుఁగ నొల్లని ధర్మువు । బేల! నీకుఁ జెప్ప నేల వలసెఁ?
జిఱుతవాని కింత తఱుసంటి పలుకులు । సన్నె వృద్ధజనము లున్నచోట? 228

ప్రతిపదార్థం: ఎల్లవారున్= అందరు; ఎఱుఁగన్+ఒల్లని= తెలియటానికి ఇష్టపడని; ధర్మువు= ధర్మం; బేల= మూఢుడా! నీకున్, ఏల; చెప్పన్, వలసెన్= చెప్పవలసివచ్చింది, వృద్ధ, జనములు= పెద్దవాళ్ళు; ఉన్నచోటన్; చిఱుతవానికిన్= చిన్నవాడికి; ఇంత; తఱుసంటి, పలుకులు= అధికప్రసంగాలు; చన్నె= తగునా? (తగదని భావం).

తాత్పర్యం: ఎవ్వరూ తెలియటానికి ఇష్టపడని ధర్మాన్ని మూఢుడా! నీ వెందుకు చెప్పవలసివచ్చింది? పెద్దవాళ్ళుండే చోట చిన్నవాడికి ఈ అధికప్రసంగా లెందుకు?

విశేషం: నిండుసభల్లో పెద్ద లెవరైనా పిన్నవారిని ఈసడింపుతో అధిక్షేపించే సందర్భాలలో ఈ పద్యాన్ని వాడుతూ ఉండటం ప్రసిద్ధి. అది నన్నయగారి రుచిరార్థసూక్తిమత్త్వానికి మచ్చుతునక. ఈ పద్యరచనలో 'బేల!' అన్నసంబోధన అవహేళనాత్మకం. 'చిఱుతవాని కింత తఱుసంటిపలుకులు' అనేమాట అధిక్షేపాత్మకం. తెలుగుమాటలతో కూడిన వాక్యాల నృత్యవద్భావం. అగ్రామ్యత్వస్ఫూర్తి కల ఈ పద్యంలో ఉదారత ఉజ్జ్వలంగా పోషించబడింది. (సంపా.)

వ. నీవు ద్రౌపది నధర్మవిజిత యని పలికితి; సభాసదులెల్ల నెఱుంగ ధర్మజుండు దన సర్వస్వమ్ము నొడ్డి యోటువడి నప్పు డిది వానికి వెలిగాదు గావున ధర్మవిజితయ; యిట్లు గానినాఁడు పాండవు లిందఱును దీని విజితఁగా నేల యొడంబడుదురు? మఱి యేకవస్త్రయై యున్న దీని సభకుం దోడ్కొని వచ్చుట ధర్మువు గాదంటి; భార్యకు దైవవిహితుం డయిన భర్త యొక్కరుండ; యిది యనేకభర్తృక గావున బంధకి యనంబడు; నిట్టిదాని విగతవస్త్రం జేసి తెచ్చినను ధర్మవిరోధంబు లే' దని కర్ణుండు వికర్ణువచనంబులకుం బ్రత్యాఖ్యానంబు సేసిన విని, దుర్యోధనుండు దుశ్శాసనుం బిలిచి 'యిప్పాండవులయు ద్రౌపదియు వస్త్రంబు లపహరింపు' మని పంచిన దాని నెఱింగి. 229

ప్రతిపదార్థం: నీవు; ద్రౌపదిన్; అధర్మ విజిత= అధర్మంచేత జయించబడినది; అని; పలికితి= పలికావు; సభాసదులు+ఎల్లన్= సభలో కూర్చున్న ధర్మం తెలిసిన వాళ్ళంతా; ఎఱుంగన్; ధర్మజుండు; తన, సర్వస్వమ్మున్= తనకున్న సంపద నంతా; ఒడ్డి; ఓటుపడి నప్పుడు= ఓడిపోయి నప్పుడు; ఇది= ఈ ద్రౌపది; వానికిన్= ఆ ధర్మరాజుకు; వెలి, కాదు, కావునన్= పరాయిది కాదు కనుక; ధర్మవిజిత+అ= ధర్మంచేత జయించబడినదే; ఇట్లు; కాని, నాఁడు= కానిరోజు; పాండవులు+ఇందఱును= పాండవులంతా; దీనిన్= ఈ ద్రౌపదిని; ఏల, విజితఁగాన్= జయించబడిన దానినిగా; ఒడంబడుదురు= అంగీకరిస్తారు; మఱి= మరియు; ఏక, వస్త్ర, ఐ= ఒకే వస్త్రాన్ని ధరించినదై; ఉన్న; దీనిన్; సభకున్, తోడ్కొని= వెంటబెట్టుకొని; వచ్చుట; ధర్మువు= ధర్మం; కాదు+అంటి; భార్యకున్; దైవవిహితుండు+అయిన= దైవంచేత ఏర్పాటు చేయబడిన; భర్త; ఒక్కరుండు+అ= ఒక్కడే; ఇది= ఈ ద్రౌపది; అనేక, భర్తృక= పెక్కుమంది భర్తలు కలది; కావునన్; బంధకి= రంకుటాలు; అనంబడున్; ఇట్టిదానిన్; విగతవస్త్రన్+చేసి= తొలగించబడిన వస్త్రాలు కలదానినిగా చేసి - అంటే నగ్నంగా; తెచ్చినను; ధర్మ, విరోధంబు= ధర్మానికి వ్యతిరేకం; లేదు+అని; కర్ణుండు; వికర్ణు, వచనంబులకున్= వికర్ణుని మాటలకు; ప్రతి+ఆఖ్యానంబు; చేసినన్= నిరాకరణ చేసిన - అంటే త్రోసిపుచ్చి మాట్లాడగా; విని; దుర్యోధనుండు; దుశ్శాసనున్; పిలిచి; ఈ+పాండవులయు= ఈపాండవులయొక్క; ద్రౌపదియు= ద్రౌపదియొక్క; వస్త్రంబులు; అపహరింపుము= లాగికొనుము; అని; పంచినన్= ఆజ్ఞాపించగా; దానిన్; ఎఱింగి= తెలుసుకొని.

తాత్పర్యం: 'నీవు, ద్రౌపది అధర్మంగా జయించబడిం దని పలికావు. సభలో కూర్చున్న ధర్మజ్ఞులంతా చూస్తుండగా ధర్మరాజు తన సర్వస్వాన్నీ ఒడ్డి ఓడిపోయాడు. ఈ ద్రౌపది అతనికి పరాయిమనిషి కాదు. అందుచేత అదికూడ ధర్మంగా జయించబడినట్లే. అలా కాకుంటే పాండవులంతా దానిని ఎందుకు జయించబడిన దానినిగా అంగీకరిస్తారు? కాగా, ఒకే వస్త్రాన్ని ధరించి ఉన్నదాన్ని సభకు తోడ్కొని రావటం ధర్మం కా దన్నావు. భార్యకు భగవంతుడు విధించిన భర్త ఒక్కడే. ఇది పెక్కుమంది భర్తలు కలది. అందుచేత బంధకి. ఇలాంటిదాన్ని బట్టలు లేకుండ నగ్నంగా తెచ్చినా తప్పు లేదు' అని కర్ణుడు వికర్ణుని మాటలను త్రోసిపుచ్చి పలుకగా - దుర్యోధనుడు విని, దుశ్శాసనుణ్ణి పిలిచి 'ఈపాండవులవి, ద్రౌపదివి వస్త్రాలు లాగితీసుకో' అని ఆజ్ఞాపించగా దానిని తెలుసుకొని.

విశేషం: వస్త్రాపహరణాన్ని సూచించినవాడు, ద్రౌపదీ నగ్నసౌందర్యాన్ని చూడ ఉసిగొల్పినవాడు - కర్ణుడు.

క. కితవవ్యవసాయపరా । జితు లగుటం జేసి బలిమి చెడి పాండుసుతుల్
ధృతిఁ దమ పయిపుట్టము లా । యతకీర్తులు మున్నపెట్టి యా సభ నున్నన్. 230

ప్రతిపదార్థం: కితవ, వ్యవసాయ, పరాజితులు+అగుటన్+చేసి= జూదమాడే ప్రయత్నంలో ఓడిపోయిన వాళ్ళుకావటంచేత; పాండుసుతుల్= పాండురాజుపుత్రులు - పాండవులు; ఆయతకీర్తులు= గొప్ప కీర్తికలవాళ్ళు; బలిమి, చెడి= బలహీనులై; ధృతిన్= ధైర్యంతో; తమ; పయి పుట్టములు= పై బట్టలు; మున్న= ముందుగానే; పెట్టి= తీసిపెట్టి; ఆ, సభన్= ఆ సభలో; ఉన్నన్= ఉండగా.

తాత్పర్యం: జూద మాడే ప్రయత్నంలో ఓడిపోయినవాళ్ళు కావటంచేత, ఎంతో కీర్తిమంతులైన పాండవులు బలహీనులై తమ పై బట్టలు ముందే తీసిపెట్టి ఆ సభలో నిలిచారు.

దుశ్శాసనుండు ద్రౌపది కట్టిన పుట్టం బొలుచుట (సం. 2-61-40)

సీ. ఇది సేయఁ గా దని మది విచారింపక । సద్గర్హితుండు దుశ్శాసనుండు
నెట్టన ద్రౌపది గట్టిన పుట్టంబు । సభలోన విడ్చె నాశంక లేక
యుడుగక యొలువంగఁ బడియు ము న్నపనీత । మైన తద్వస్త్రంబు నట్టి వలువ
లలితాంగిజఘనమండలమునఁ బాయక । యొప్పుచు నున్న నయ్యువిదఁ జూచి

ఆ. సభ్యులెల్ల నుదితసమ్మదు లయిరి దు । శ్శాసనుండు వస్త్రచయము పర్వ
తోపమాన మయిన నొలువంగ నోపక । యుడిగె లజ్జఁ బొంది యుక్కు దక్కి. 231

ప్రతిపదార్థం: సత్+గర్హితుండు= సజ్జనులచేత నిందించబడినవాడు; దుశ్శాసనుండు; ఇది; చేయన్+కాదు+అని= చేయ కూడని దని; మదిన్= మనస్సులో; విచారింపక= ఆలోచించక; నెట్టన= అడ్డులేకుండా; ద్రౌపది; కట్టిన= కట్టుకొనిన; పుట్టంబు= వస్త్రం; ఆశంక, లేక= సంకోచం లేకుండ; సభలోనన్; విడ్చెన్= విప్పాడు; ఉడుగక= ఆపకుండ; ఒలువంగఁబడియున్= విప్పబడి; మున్ను+అపనీతము+ఐన= ముందు తొలగింపబడిందైన; తత్‌వస్త్రంబు, అట్టి, వలువ= ఆ వస్త్రంవంటి వస్త్రమే; లలిత+అంగి, జఘన, మండలమునన్= మనోహరాలైన అవయవాలు కల ద్రౌపదియొక్క మొలభాగాన; పాయక= ఎడతెగక; ఒప్పుచున్; ఉన్నన్; ఆ+ఉవిదన్= ఆకాంతను; చూచి; సభ్యులు+ఎల్లన్= సభలోని సభ్యులంతా; ఉదిత, సమ్మదులు+అయిరి= పుట్టిన సంతోషం కలవా ళ్ళయ్యారు- అంటే సంతోషించారు; వస్త్రచయము= బట్టల సమూహం; పర్వత+ఉపమానము= పర్వతంతో సమానం; అయినన్; దుశ్శాసనుండు; ఒలువంగన్+ఓపక= విప్పలేక; ఉక్కు, తక్కి= పట్టువిడిచి; లజ్జన్+పొంది= సిగ్గుచెంది; ఉడిగెన్= ఊరకున్నాడు.

తాత్పర్యం: సజ్జనులచేత నిందించబడిన దుశ్శాసనుడు, ఇది చేయకూడ దని మనస్సులో విచారించక, అడ్డులేనివాడై, ఆ ద్రౌపది కట్టుకొన్న వస్త్రాన్ని నిస్సంకోచంగా నిండు సభలో విప్పాడు. ఆపకుండా అతడు విప్పుతున్నా ముందు తొలగించబడ్డ వస్త్రంవంటి వస్త్రమే- ఆ లలితాంగి మొలభాగంమీద ఎడతెగకుండా ఉండటం చూచి సభలోని సభ్యులంతా సంతోషించారు. విప్పిన వస్త్రసమూహం కొండలా గుట్టపడగా దుశ్శాసనుడు ఇక విప్పలేక, పట్టు విడిచి, సిగ్గుచెంది ఊరకుండిపోయాడు.

విశేషం: కులకాంతకు ఇంతకంటె ఘోరావమానం ఏముంది? అయినా అంతమంది సభలో ఉండి దాన్ని ఆపలేకపోయారు. ఊహించుకొంటే చాలు ఎవరికైనా రక్తం ఉడికిపోతుంది. అది చూచి ఎవరు ఊరుకొన్నా- భీముడు ఊరుకొంటాడా?

వ. ఇట్లు భీమసేనుండు ద్రుపదరాజనందనకు దుశ్శాసనుండు సేసిన యవమానంబు సూచి కోపరక్తాంత నయనుం డగుచు నంతకాకారంబున దంతసందష్టదారుణముఖుండయి యెల్లవారును విన ని ట్లనియె. 232

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; భీమసేనుండు; ద్రుపదరాజ నందనకున్= ద్రుపదరాజు కూతురైన ద్రౌపదికి; దుశ్శాసనుండు; చేసిన; అవమానంబు; చూచి; కోప, రక్త+అంత+నయనుండు= కోపంచేత ఎరుపెక్కిన చివరలు గల కన్నులు కలవాడు; అగుచున్; అంతక+ఆకారంబునన్= యముని రూపాన; దంత, సందష్ట, దారుణ, ముఖుండు+అయి= పళ్ళుకొరకటంచేత భయంకరమైన ముఖం కలవాడై; ఎల్లవారును; వినన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈ విధంగా ద్రుపదరాజపుత్రికి దుశ్శాసనుడు చేసిన అవమానాన్ని చూచి, భీమసేనుడు కళ్ళెర్ర చేశాడు. పళ్ళు కొరుకుతూ, భయంకరముఖంతో యమునిలా అందరూ వినేటట్లు ఇలా అన్నాడు.

మ. కురువృద్ధుల్ గురువృద్ధబాంధవు లనేకుల్ సూచుచుండన్ మదో
ద్ధురుఁడై ద్రౌపది నిట్లు సేసిన ఖలున్ దుశ్శాసనున్ లోకభీ
కరలీలన్ వధియించి తద్విపులవక్షశ్శైలరక్తౌఘ ని
ర్ఝర ముర్వీపతి సూచుచుండ నని నాస్వాదింతు నుగ్రాకృతిన్. 233

ప్రతిపదార్థం: కురు, వృద్ధుల్= కురువంశపు పెద్దలు; గురు, వృద్ధ, బాంధవులు= గురువులు, వృద్ధులు, బంధువులు; అనేకుల్= పెక్కుమంది; చూచుచుండన్; మద+ఉద్ధురుఁడు+ఐ= పొగరుచేత బరువైనవాడై- అంటే పొగరు పెరిగి చెలరేగినవాడై; ద్రౌపదిన్; ఇట్లు= ఈ విధంగా; చేసిన; ఖలున్= క్రూరుడైనవాణ్ణి; దుశ్శాసనున్; ఉర్వీపతి= రాజైన దుర్యోధనుడు; చూచుచుండన్; అనిన్= యుద్ధంలో; లోకభీకరలీలన్= లోకానికి భయం కలిగించే రీతిగా; వధియించి= చంపి; తత్+విపుల, వక్షస్+శైల, రక్త+ఓఘ, నిర్ఝరము= ఆ దుశ్శాసనుడియొక్క విశాలమైన రొమ్ము అనే పర్వతంలోని రక్తప్రవాహ మనే సెలయేటిని; ఉగ్ర+ఆకృతిన్= భయంకరమైన రూపంతో; ఆస్వాదింతున్= పానం చేస్తాను.

తాత్పర్యం: కురు వంశపు పెద్దలు, గురువులు, వృద్ధులు, బంధువులు పెక్కుమంది చూస్తుండగా- పొగరెక్కి చెలరేగి, ద్రౌపదిని ఈవిధంగా చేసిన దుశ్శాసనుణ్ణి రాజు (దుర్యోధనుడు) చూస్తుండగానే యుద్ధంలో లోకభయంకరమైన రీతిలో వధించి, అతని విశాలవక్షస్థలమనే పర్వతంలోని రక్తప్రవాహమనే సెలయేటిని భయంకరాకారం ధరించి త్రాగుతాను.

విశేషం: అలం: రూపకం. అక్షరరమ్యమై, అర్థగంభీరమై, పద్యశిల్పంలో అతిప్రసిద్ధమైన నన్నయ పద్యాల్లో ఇది ఒకటి, భయంకరాలై, భావిభారత మహాసంగ్రామానికి ప్రాతిపదికలై, రౌద్రరసానికి ఉనికి పట్టులైన భీముని ప్రతిజ్ఞల్లో ఇది మొదటిది. వినాలేగాని ఇందులోని ధకారాల్లో మహోగ్రుడైన భీముని గదాఘాతాలు, పిడిగ్రుద్దులు వినిపించగలవు. చూడాలేగాని తరువాతి పదాల్లో, సమాసాల్లో-ఖలున్, దుశ్శాసనున్ - అని ఖంగున తెగబలికి, కళ్ళురిమి, పళ్ళు బిగబట్టి, ఒక్క గ్రుక్కలో 'లోక భీకరలీలన్ వధియించి తద్విపుల వక్షశ్శైల రక్తౌఘ నిర్ఝర ముర్వీపతి సూచుచుండ నని నాస్వాదింతు నుగ్రాకృతిన్' అని బుసలు కొట్టుతూ, ఊగుతూ నిలిచిన భీముని భయంకరముఖాకృతిని చూడవచ్చు. 'ద్రౌపది నిట్లు సేసిన ఖలున్' అనటంలో

దుశ్శాసనుడు చేసిన పని ఎంత అవాచ్యమైనదో వ్యక్తమౌతున్నది. 'ఉర్వీపతి చూచుచుండన్' అనటంలో అవాచ్యం, అతిక్రూరం అయిన ఈ పనికి అతణ్ణి పురికొల్పిన వ్యక్తి కట్టెదుటే దుష్టదుశ్శాసనుణ్ణి ఈ విధంగా కడతేరిస్తే గాని నాకసి తీర దనే భావం స్ఫురిస్తున్నది. 'ఆస్వాదింతు' ననటంలో తన కసితాపం తీరటానికి దుశ్శాసనుడి నెత్తురు భీముడి కెంత తియ్యని పానీయమో తెలుస్తున్నది. ఇక ఆనాటి భీముడి 'ఉగ్రాకృతి' ఊహించదగిందే కాని- వివరించ సాధ్యం కానిది. దుశ్శాసనుడి గుండె పగిలి నెత్తుటిధారలు పైకి చిమ్మినట్లే, పద్యంలోని ప్రతిపదంలోనూ రౌద్రరసం పైకి ఎగుస్తున్నది. అందులోనూ మహాప్రాణాక్షర వర్ణవిన్యాస వైఖరి, అక్షరరమ్యతను రౌద్రరసోన్నిద్రంగా ఆవిష్కరింప చేసింది.

వ. 'ఇట్లు సేయనైతినేని పితృపితామహుల గతికిం దప్పినవాఁడ నగుదు' ననిన నతని యతిమానుషంబయిన మహావ్యవసాయంబున కద్భుతం బంది దిక్కులు చూడక ధిక్శబ్దముఖరిత ముఖు లగుచు సభాజనులు తమలో సపుత్త్రకుండయిన ధృతరాష్ట్రు నిందించుచు 'ద్రుపదరాజపుత్త్రి వాక్యంబులు విచారింపక వృద్ధరాజు లుపేక్షించి' రనుచుండి; రంత నుద్యతబాహుం డయి విదురుం డెల్లవారిని వారించి యి ట్లనియె. 234

ప్రతిపదార్థం: ఇట్లు= చెప్పినట్లు; చేయన్+ఐతిన్+ఏనిన్= చూయజాలకుంటే; పితృ, పితామహుల, గతికిన్= తండ్రితాతల మార్గానికి; తప్పినవాడన్; అగుదున్; అనినన్; అతని; అతిమానుషంబు+అయిన= మానవశక్తికి మించినదైన; మహావ్యవసాయంబునకున్= గొప్పపనికి; అద్భుతంబు+అంది= ఆశ్చర్యపడి; దిక్కులు, చూడక= ఊరకుండక; ధిక్+శబ్ద, ముఖరిత, ముఖులు= ఛీ అనే శబ్దం మ్రోగుతున్న ముఖాలు కలవారు; అగుచున్; సభా, జనులు; తమలోన్; సపుత్త్రుకుండు+అయిన= పుత్త్రులతో కూడి ఉండే; ధృతరాష్ట్రునిన్; నిందించుచున్; ద్రుపదరాజ, పుత్త్రి, వాక్యంబులు= ద్రౌపదిమాటలు; విచారింపక= ఆలోచించక; వృద్ధ, రాజులు= పెద్దలైనరాజులు; ఉపేక్షించిరి= అశ్రద్ధచేశారు; అనుచుండిరి; అంతన్= అప్పుడు; విదురుండు; ఉద్యత, బాహుండు+అయి= పైకెత్తిన చేతులు కలవాడై; ఎల్లవారినిన్= అందరిని; వారించి= ఆపి - అంటే మాట్లాడకుండ ఆపి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'ఈ విధంగా చెప్పినట్లు చెయ్యకుంటే నేను తండ్రితాతల మార్గానికి తప్పినవాడి నవుతాను' అని భీము డనగా - అతని మానవాతీతమైన మహాప్రయత్నానికి సభాసదులంతా ఆశ్చర్యపడి, ఊరకుండక, కొడుకులతో కూడి ఉన్న ధృతరాష్ట్రుణ్ణి 'ఛీ' అని నిందిస్తూ- 'ద్రౌపది అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పక పెద్దలైన రాజులు అశ్రద్ధ చేశా'రని అంటుండగా- విదురుడు చేతులు పైకెత్తి అందరిని మాట్లాడకుండ ఆపి- ఇలా అన్నాడు.

క. సుమతులు పాంచాలీ ప్ర । శ్నము నర్థము నేర్పడన్ విచారింపుఁడు పా
పము వొందు ధర్మసందే । హము దీర్పనినాఁడు సభ్యులగు సజ్జనులన్. 235

ప్రతిపదార్థం: సుమతులు= మంచి బుద్ధికలవాళ్ళు; పాంచాలీ ప్రశ్నము, అర్థమున్= ద్రౌపదిప్రశ్నకు సమాధానం; ఏర్పడన్= స్పష్టంగా తెలిసేటట్లు; విచారింపుఁడు= ఆలోచించండి; ధర్మసందేహము= ధర్మాన్నిగూర్చిన అనుమానం; తీర్పనినాఁడు= తీర్చని రోజున; సభ్యులు+అగు= సభలో ఉన్న వాళ్ళయిన; సజ్జనులన్; పాపము, పొందున్= పాపం అంటుతుంది.

తాత్పర్యం: బుద్ధిమంతులంతా ద్రౌపది అడిగిన ప్రశ్నకు సమాధానం స్పష్టమయ్యేటట్లు ఆలోచించండి. ధర్మసందేహం తీర్చని రోజు సభలోని సజ్జను లందరికి పాపం అంటుకొంటుంది.

విశేషం: 'తీర్పనినాఁడు', 'తీర్పనిరోజు' - అనే వాటికి ఈ సందర్భంలో 'అప్పటికప్పుడు తీర్పుచెప్పకపోతే' అని అర్థం.

మత్తకోకిలము.

ఈ వికర్ణుఁడు బాలుఁ డయ్యును నేర్పరించి యథావిధిన్
దేవమంత్రియపోలె ధర్మువుఁ దెల్పె; నీతనిబుద్ధి మీ
రేవగింపక చేకొనుం డిది; యెల్లయందును ధర్మ స
ద్భావ మొక్కని కేర్పరింపఁగ బ్రహ్మకైనను బోలునే? 236

ప్రతిపదార్థం: ఈ, వికర్ణుఁడు; బాలుఁడు+అయ్యును= చిన్నవాడయినప్పటికి; దేవమంత్రియ, పోలెన్= బృహస్పతివలె; యథావిధిన్= శాస్త్రం ప్రకారం; ఏర్పరించి= స్పష్టమవునట్లు; ధర్మువున్= ధర్మాన్ని; తెల్పెన్= చెప్పాడు; మీరు; ఏవగింపక= తక్కువగా చూచి త్రోసిపుచ్చక; ఈతని, బుద్ధి= ఈతని ఆలోచన; చేకొనుండు= అంగీకరించండి; ఎల్లన్, అందును= అన్నిచోట్లా; ధర్మ, సత్+భావము= ధర్మంయొక్క సరైన అర్థాన్ని; ఒక్కనికిన్; ఏర్పరింపఁగన్= తెలియజేయటానికి; బ్రహ్మకున్+ఐనను; పోలునే= సాధ్యమవుతుందా?

తాత్పర్యం: ఈ వికర్ణుడు చిన్నవాడైనా బృహస్పతిలా శాస్త్రప్రకారం స్పష్టంగా ధర్మాన్ని తెలియచెప్పాడు. ఇతని ఆలోచనను మీరు తక్కువ చేసి త్రోసిపుచ్చక అంగీకరించండి. అన్నిచోట్లా ధర్మంయొక్క సరైన అర్థాన్ని నిర్ణయించటం ఏ ఒక్కడికీ- బ్రహ్మకుకూడ సాధ్యం కాదు.

ఆ. సభకు వచ్చి ధర్మసందేహ మడిగిన । నెఱిఁగి చెప్పకుండిరేని సభ్యు
లనృతదోషఫలమునం దర్ధ మొందుదు । రనిరి ధర్మవేదులైన మునులు. 237

ప్రతిపదార్థం: సభకున్, వచ్చి; ధర్మసందేహము= ధర్మాన్ని గూర్చిన అనుమానం; అడిగినన్, ఎఱిఁగి= తెలిసి; చెప్పక; ఉండిరి+ఏనిన్; సభ్యులు; అనృతదోషఫలమునందున్= అసత్యమాడే తప్పువలన కలిగే ఫలంలో; అర్ధము= సగం; ఒందుదురు= పొందుతారు; అని; ధర్మవేదులు+ఐన= ధర్మాన్ని తెలిసిన; మునులు; అనిరి.

తాత్పర్యం: సభకు వచ్చి ఎవరైనాసరే ధర్మసందేహం అడిగితే, తెలిసి చెప్పకుంటే- సభ్యులు, అసత్యమాడే తప్పువల్ల కలిగే ఫలంలో సగం పొందుతా రని ధర్మ మెరిగిన మునులు చెప్పారు.

ఆ. ధర్మ వెఱిఁగి దానిఁ దా నొండుగా లాభ । లోభ పక్షపాతలోలబుద్ధి
సభల నెవ్వఁడేని సభ్యుఁడై పలుకు వాఁ । డనృతదోషఫలము ననుభవించు. 238

ప్రతిపదార్థం: ధర్మువు+ఎఱిఁగి= ధర్మం తెలిసికూడ; దానిన్; ఒండుగాన్= మరొకవిధంగా; లాభ, లోభ, పక్షపాత, లోల, బుద్ధిన్= లాభంచేత, కోరికచేత, పక్షపాతంచేత ఊగిసలాడే మనస్సుతో; సభలన్= సభల్లో; ఎవ్వఁడు+ఏనిన్= ఎవ్వడైనా; సభ్యుఁడై; పలుకువాఁడు; అనృత, దోష, ఫలమున్= అసత్య మాడే తప్పువల్ల కలిగే ఫలాన్ని; అనుభవించున్.

తాత్పర్యం: ధర్మాన్ని తెలిసికూడా, లాభంచేతనో, లోభంచేతనో, పక్షపాతంచేతనో, ఊగిసలాడే బుద్ధితోనో సభల్లో ఎవడైనా - దానిని మరొక విధంగా పలికితే, అతడు అసత్యమాడే దోషంవల్ల కలిగే ఫలాన్ని అనుభవిస్తాడు.

విశేషం: నానారుచిరార్థసూక్తినిధి అయిన నన్నయ కవితలో పై పద్యాలు రెండూ గొప్ప సూక్తిరత్నాలు. న్యాయాన్యాయ నిర్ణయం చేసే సభల్లో కూర్చున్న పెద్దలందరికి ఇవి శిరోధార్యాలు.

విరోచన సుధన్వుల వృత్తాంతము

వ. ఈయర్థం బితిహాసంబులయందు వినంబడుఁ; దొల్లి ప్రహ్లాదునికొడుకు విరోచనుండును నంగిరసుండను విప్రునికొడుకు సుధన్వుండును నొక్క కన్యా ప్రతిగ్రహ నిమిత్తంబున నెల్లసుగుణంబుల 'నేన పెద్ద, నేన పెద్ద' నని తమలో నిద్దఱును ప్రాణంబు లొడ్డుగా నొడ్డి వివాదంబు సేసి ప్రహ్లాదు పాలికిం జని; రందు సుధన్వుండు ప్రహ్లాదున కి ట్లనియె. 239

ప్రతిపదార్థం: ఈ, అర్థంబు= ఈ న్యాయం; ఇతిహాసంబుల, అందున్; వినంబడున్= వినిపించును; తొల్లి= పూర్వం; ప్రహ్లాదునికొడుకు; విరోచనుండును; అంగిరసుండు+అను; విప్రుని, కొడుకు= బ్రాహ్మణుని కుమారుడు; సుధన్వుండును; ఒక్క; కన్యా, ప్రతిగ్రహ నిమిత్తంబునన్= కన్యను దానం పుచ్చుకొనే కారణాన; ఎల్ల, సుగుణంబులన్= అన్ని మంచి గుణాలలో; ఏను+అ, పెద్దన్= నేను ఎక్కువ; ఏను+అ, పెద్దన్= నేను ఎక్కువ; అని; తమలోన్; ఇద్దరును; ప్రాణంబులు; ఒడ్డుగాన్, ఒడ్డి= పందెంగా ఒడ్డి; వివాదంబు, చేసి= తగవులాడుకొని; ప్రహ్లాదు, పాలికిన్= ప్రహ్లాదుని దగ్గరకు; చనిరి= వెళ్ళారు; అందున్; సుధన్వుండు; ప్రహ్లాదునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈ న్యాయం ఇతిహాసాల్లోకూడ వినిపిస్తుంది. పూర్వం ప్రహ్లాదునికొడుకు విరోచనుడూ, అంగిరసుడనే బ్రాహ్మణునికొడుకు సుధన్వుడూ ఒక కన్యను దానం పుచ్చుకొనే విషయంలో - అన్ని సుగుణాల్లో నే నెక్కువ, నే నెక్కువ అని, ప్రాణాలు పందెంగా ఒడ్డి, తగవులాడుకొని, ప్రహ్లాదునిదగ్గరకు వెళ్ళారు. సుధన్వుడు ప్రహ్లాదునితో ఇలా అన్నాడు.

తే. నీవు ధర్మవిదుండవు మా వివాద । మెఱిఁగి తీర్పు గుణశ్రేష్ఠుఁ డితఁడొ నేనొ
చెప్పు; మన్యథాబుద్ధివై చెప్పితేని । మఘవు కులిశంబు వ్రచ్చు నీ మస్తకంబు. 240

ప్రతిపదార్థం: నీవు; ధర్మ, విదుండవు= ధర్మం తెలిసినవాడివి; మా, వివాదము= మా తగవు; ఎఱిఁగి= తెలుసుకొని; గుణశ్రేష్ఠుఁడు= మంచిగుణాలచేత గొప్పవాడు; ఇతఁడొ; నేనో; తీర్పు చెప్పుము; అన్యథా, బుద్ధివి+ఐ= ఇతరమైన మనస్సు కలవాడివై - అంటే నీ పుత్రుడన్న పక్షపాతబుద్ధి కలిగినవాడివై; చెప్పితేనిన్= తీర్పు చెప్పితే; మఘవు, కులిశంబు= దేవేంద్రునియొక్క వజ్రాయుధం; నీ, మస్తకంబున్= నీ తలను; వ్రచ్చున్= పగులగొట్టుతుంది.

తాత్పర్యం: నీవు ధర్మం తెలిసినవాడివి. మా తగవు తెలుసుకొని గుణాలచేత గొప్పవాడు ఇతడో, నేనో తీర్పు చెప్పు. నీ పుత్రు డని పక్షపాతబుద్ధితో తీర్పు చెప్పితే దేవేంద్రుని వజ్రాయుధం నీ తలను పగులగొట్టుతుంది.

వ. అనినం బ్రహ్లాదుండు భయంపడి కశ్యపుకడకుం జని విరోచన సుధన్వులు తన్ను వివాదనిర్ణయం బడిగిన విధంబును జెప్పిన విని వానికిం గశ్యపుం డి ట్లనియె. 241

ప్రతిపదార్థం: అనినన్; ప్రహ్లాదుండు; భయము+పడి; కశ్యపు, కడకున్= కశ్యపుని దగ్గరకు; చని= వెళ్ళి; విరోచన, సుధన్వులు; తన్నున్; వివాదనిర్ణయంబు= తగవుయొక్కతీర్పు; అడిగిన, విధంబును; చెప్పినన్; విని; వానికిన్; కశ్యపుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అనగా ప్రహ్లాదుడు భయపడి కశ్యపునిదగ్గరకు వెళ్ళి- తగవు తీర్పునుగూర్చి విరోచనుడు, సుధన్వుడు త న్నడిగిన విధము చెప్పగా, కశ్యపుడు అతనితో ఇలా అన్నాడు.

తే. సాక్షియును ధర్మదర్శియు సాక్షిధర్మ । విధులు దప్పంగఁ జెప్పిన నధమవృత్తి
వరుణపాశసహస్రంబు వానిఁ గట్టి । పాయు నేఁటేఁట నొక్కొకఁ డాయతముగ. 242

ప్రతిపదార్థం: సాక్షియును; ధర్మ, దర్శియున్= ధర్మాన్ని దర్శించే న్యాయాధిపతీ; సాక్షి, ధర్మవిధులు= సాక్షియొక్క, ధర్మంయొక్క నియమాలు; తప్పంగన్= తప్పునట్లు; అధమ, వృత్తి= నీచంగా ప్రవర్తించి; చెప్పినన్= చెప్పితే; వరుణ, పాశ, సహస్రంబు= వెయ్యి వరుణపాశాలు; వానిన్; కట్టి; ఏఁట+ఏఁటన్= ప్రతి సంవత్సరం; ఒక్కొకఁడు= ఒక్కొక్కటి; ఆయతముగన్= నిడుపుగ; పాయున్= వదలుతాయి.

తాత్పర్యం: సాక్షీ, ధర్మాన్ని దర్శించే న్యాయమూర్తిఐనవాడు- సాక్షినియమాలను, ధర్మనియమాలను తప్పి నీచంగా ప్రవర్తించి సాక్ష్యం, ధర్మం చెప్పితే అలాంటివాణ్ణి వెయ్యివరుణపాశాలు బంధిస్తాయి. ఏటేట ఒక్క పాశం వంతున వదలుతాయి.

విశేషం: సాక్షులు పదకొండుమంది. అందులో కృతసాక్షులు - అంటే నిర్ణయించుకొనబడిన సాక్షులు ఐదుగురు. వారు లిఖితుడు, స్మారితుడు, యదృచ్ఛాభిజ్ఞుడు, గూఢుడు, ఉత్తరుడు. అకృతసాక్షులు - అంటే నిర్ణయించుకొనబడని సాక్షులు ఆరుగురు. వారు - గ్రామస్థులు, ప్రాడ్వివాక లేఖకసభ్యులు, రాజు, కార్యాధికారి, వాదిచే పంపబడిన వాడు (కులవివాదాల్లో కులంవాడు).

వ. 'ధర్మం బధర్మవిద్ధంబయి సభకు వచ్చిన దానిం దీర్పనిసభ్యు లధర్మవిద్ధు లగుదురు; మఱి సభ్యులు కామక్రోధంబులు విడిచి యధర్మంబు నాపనినాఁ డయ్యధర్మంబునం దొక్కపాదంబు సభ్యుల, నొక్కపాదంబు భూపతిఁ, దక్కినయది గర్తనుం బొందు; సమంజసులైన సభ్యులచేత విధ్యుక్తం బయ్యేనేని నధర్మంబు కర్తనుం బొందుఁ; గావున ధర్మంబు దప్పక చెప్పవలయు'ననినం బ్రహ్లాదుండు ధర్మమతియై విచారించి తనకొడుకుకంటె గుణశ్రేష్ఠుఁడుగా సుధన్వుం జెప్పినఁ, 'బుత్త్రస్నేహంబు విడిచి ధర్మువు దప్పక చెప్పి' తని ప్రహ్లాదుం బ్రశంసించి సుధన్వుం డరిగెఁ; గావున 'మీరును ద్రౌపదీ ప్రశ్నంబునందు ధర్మబుద్ధిసేయుం' డని విదురుండు పలికిన, దుర్యోధను భయంబున సభ్యు లెవ్వరుం బలుకరయిరి; ద్రౌపదియు నట్లు సకలక్షత్త్రియసమక్షంబున దుశ్శాసనుచేతం బరిభవింపంబడి దుఃఖిత యయి. 243

ప్రతిపదార్థం: ధర్మంబు+అధర్మ, విద్ధంబు+అయి= ధర్మం అధర్మంచేత బాధించబడినదై; సభకున్; వచ్చినన్; దానిన్; తీర్పని; సభ్యులు; అధర్మ, విద్ధులు= అధర్మంచేత బాధించబడినవాళ్ళు; అగుదురు; మఱి; సభ్యులు; కామ, క్రోధంబులు; విడిచి; అధర్మంబును; ఆపని, నాఁడు; ఆ, అధర్మంబునందున్; ఒక్క, పాదంబు= నాల్గవవంతు; సభ్యులన్; ఒక్క, పాదంబు= నాల్గవవంతు; భూపతిన్= రాజును; తక్కినది; కర్తనున్= చేసినవాణ్ణి; పొందున్; సమంజసులు+ఐన= న్యాయంతో కూడిన వాళ్ళయిన; సభ్యులచేతన్; విధి+ఉక్తంబు+అయ్యేన్+ఏనిన్= ఉన్నస్థితి చెప్పబడిందైతే; అధర్మంబు; కర్తనున్= చేసినవాణ్ణి; పొందున్; కావున; ధర్మంబు; తప్పక; చెప్పవలయున్; అనినన్; ప్రహ్లాదుండు; ధర్మమతి+ఐ= ధర్మంతో కూడిన బుద్ధిగలవాడై; విచారించి= ఆలోచించి; తనకొడుకు కంటెన్; గుణశ్రేష్ఠుఁడుగాన్= గుణాల్లో గొప్పవాడుగా; సుధన్వున్= సుధన్వుణ్ణి; చెప్పినన్; పుత్త్ర, స్నేహంబు= పుత్రునిమీది ప్రేమ; విడిచి= వదలి; ధర్మువు= ధర్మం; తప్పక; చెప్పితి= చెప్పావు; అని; ప్రహ్లాదున్;

ప్రశంసించి= పొగిడి; సుధన్వుండు; అరిగెన్= వెళ్ళాడు; కావున; మీరును; ద్రౌపదీ, ప్రశ్నంబు, అందున్= ద్రౌపది అడిగిన ప్రశ్న విషయంలో; ధర్మ, బుద్ధి= ధర్మంతో కూడిన బుద్ధి; చేయుండు= కావించండి - అంటే ధర్మమైన బుద్ధితో ఆలోచించండి; అని; విదురుండు; పలికినన్; దుర్యోధను, భయంబునన్= దుర్యోధనునివల్ల కలిగిన భయంచేత; సభ్యులు; ఎవ్వరున్= ఎవరుగూడ; పలుకరు+అయిరి= మాటాడకున్నారు; ద్రౌపదియున్, అట్లు= ఆ విధంగా; సకల, క్షత్రియ, సమక్షంబునన్= అందరు రాజుల ఎదుట; దుశ్శాసనుచేతన్; పరిభవింపంబడి= అవమానించబడి; దుఃఖిత; అయి= దుఃఖించినదై.

తాత్పర్యం: 'ధర్మం అధర్మంచేత బాధింపబడి సభకు వస్తే, దాన్ని తీర్చని సభ్యులు, అధర్మంచేత బాధించబడతారు. అంతేకాదు. సభ్యులు కామక్రోధాలు విడిచి అధర్మాన్ని ఆపనినాడు, ఆ అధర్మంలో ఒక నాల్గవ భాగం సభ్యులకు, మరొక నాల్గవ భాగం రాజుకు, మిగిలింది కర్తకు సంక్రమిస్తుంది. అందుచేత ధర్మం తప్పక చెప్పాలి' అనగా, ప్రహ్లాదుడు ధర్మబుద్ధికలవాడై ఆలోచించి తనకొడుకుకంటె సుధన్వుడు సుగుణాల్లో గొప్పవా డని చెప్పాడు. సుధన్వుడు 'పుత్రప్రేమ వదలి ధర్మం తప్పక చెప్పావు' అని ప్రహ్లాదుణ్ణి పొగడి వెళ్ళాడు. 'అందుచేత మీరుకూడ ద్రౌపది అడిగిన ప్రశ్నను ధర్మబుద్ధితో ఆలోచించండి' అని విదురుడు పలుకగా దుర్యోధనునికి భయపడి సభ్యుల్లో ఎవ్వరూ పెదవి విప్పలేదు. ద్రౌపది ఆ విధంగా దుశ్శాసనునిచేత అవమానించబడి దుఃఖంతో ఉండగా.

సీ. 'అవ్విధంబున నొప్పి యా స్వయంవరము నాఁ। డఖిల భూపతులచే నట్లు సూడఁ
బడి, పాండవుల ధర్మపత్నినై, గోవిందు । చెలియలినై, వీనిచేత నిట్లు
పరిభూత నగుచు సభామధ్యమున మహీ । పతులచేఁ జూడంగఁ బడితి; నింత
వడుదునె? యిపుడు నా పలుకుల కెవ్వరుఁ । బ్రతివచనం బేల పలుక రైరి?

ఆ. ధన్యులార! యే నదాసినే? దాసినే? । యెఱుఁగఁ జెప్పి పనుపుఁ' డెల్ల దాని
ననుచు వనరుచున్న నాపగాసుతుఁడు శాం । తనవుఁ డిట్టు లనియె దానిఁ జూచి. 244

ప్రతిపదార్థం: ఆ, స్వయంవరమునాఁడు; ఆ+విధంబునన్; ఒప్పి= ప్రకాశించి; అఖిల భూపతులచేన్= అందరు రాజులచేత; అట్లు= అంత గొప్పగా; చూడబడి; పాండవుల, ధర్మపత్నినిన్+ఐ= పాండవుల భార్యనై; గోవిందు, చెలియలినిన్+ఐ= శ్రీకృష్ణునియొక్క చెల్లెలినై; వీనిచేతన్= ఈ దుశ్శాసనునిచేత; ఇట్లు= ఈ విధంగా; పరిభూతన్= అవమానించబడిన దానినిగా; అగుచున్; సభామధ్యమునన్; మహీపతులచేన్= రాజులచేత; చూడంగన్+పడితిన్; ఇపుడు; ఇంత, పడుదునె= ఇంత దుస్థితిని అనుభవిస్తున్నానే; నా, పలుకులకు; ప్రతివచనంబు= బదులుమాట అంటే సమాధానం; ఎవ్వరున్= ఎవరుగూడ; ఏల; పలుకరు+ఐరి= చెప్పకున్నారు; ధన్యులార= ఓ పుణ్యాత్ములారా!; ఏన్= నేను; అదాసినే= దాసిని కానిదానినే; దాసినే= దాసినా?; ఎల్లదానిన్= సర్వాన్నీ; ఎఱుఁగన్, చెప్పి= తెలియజెప్పి; పనుపుఁడు= ఆజ్ఞాపించండి; అనుచున్; వనరుచున్+ఉన్నన్= దుఃఖిస్తూ ఉండగా; దానిన్= ద్రౌపదిని; చూచి; ఆపగాసుతుఁడు= గంగాతనయుడు; శాంతనవుఁడు శంతనుని పుత్రుడు అయిన భీష్ముడు; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: 'ఆ స్వయంవరంరోజు ఆ విధంగా వెలిగి, అందరు రాజులచే అంత గొప్పగా చూడబడి, పాండవుల ఇల్లాలినై, శ్రీకృష్ణునిచెల్లెలినై- ఇప్పుడు ఈ దుశ్శాసనుడిచేత ఇలా అవమానించబడుతూ, ఈ సభామధ్యంలో రాజులందరిచేత చూడబడుతూ ఇంత దుఃస్థితిని అనుభవిస్తున్నానే- నే నడిగిన దానికి ఎవరు గూడ ఎందుకు

బదులు చెప్పరు? నేను దాసినా? కానా? పూర్తిగా తెలియ జెప్పి నన్ను ఆజ్ఞాపించండి' అని దుఃఖిస్తున్న ద్రౌపదిని చూచి భీష్ముడు ఈ విధంగా అన్నాడు.

విశేషం: ద్రౌపదివాక్యవిన్యాసంలో కానవచ్చే అగ్రామ్యత్వం, వికటత్వం ఉదారతాగుణాన్ని రూపుకట్టిస్తున్నాయి. (సంపా.)

వ. **'అవ్వా! నీ ప్రశ్నంబునకు నుత్తరం బయ్యుధిష్ఠిరుఁడు సెప్పవలయుఁ; గానినాఁడు ధర్మసూక్ష్మత యెవ్వరికి నెఱుంగ గహనంబు; దీని ఫలంబు వేగంబ యిక్కురుకులపాంసను లనుభవింతు' రని పలుకుచున్న యవసరంబున నక్కోమలిం జూచి నగుచు.** **245**

ప్రతిపదార్థం: అవ్వా= అమ్మా! నీ ప్రశ్నంబునకున్; ఉత్తరంబు= సమాధానం; ఆ+యుధిష్ఠిరుఁడు= ఆధర్మరాజు; చెప్పవలయున్; కానినాఁడు= అట్లా కాని రోజు; ధర్మ, సూక్ష్మత= ధర్మంయొక్క సూక్ష్మతత్త్వం; ఎవ్వరికిన్= ఇతరు లెవరి కైనా; ఎఱుంగన్= తెలుసుకోవటం; గహనంబు= కష్టం; దీని, ఫలంబున్= ఈ చెడుపనియొక్క ఫలితాన్ని; వేగంబు+అ= త్వరగానే; ఈ, కురుకుల, పాంసనులు= కురువంశాన్ని మలినం చేసే ఈ కౌరవులు; అనుభవింతురు; అని; పలుకుచున్+ఉన్న; అవసరంబునన్= సమయంలో; ఆ+కోమలిన్= అందగత్తె అయిన ఆ ద్రౌపదిని; చూచి; నగుచున్= నవ్వుతూ.

తాత్పర్యం: 'అమ్మా! నీ ప్రశ్నకు సమాధానం ఆ యుధిష్ఠిరుడే చెప్పాలి. అలా కానినాడు ధర్మంయొక్క సూక్ష్మతత్త్వాన్ని తెలుసుకోవటం ఇతరు లెవరికైనా అసాధ్యమే. ఈ చెడుపని ఫలితాన్ని వెంటనే ఈ కురువంశ దూషకులైన కౌరవులు అనుభవిస్తారు' అని భీష్ముడు పలుకుతున్న సమయంలో, కోమలి అయిన ఆ ద్రౌపదిని చూచి నవ్వుతూ.

విశేషం: భీష్ముడు 'అమ్మా! ఈ ప్రశ్నకు సమాధానం చెప్పవలసింది ఆ యుధిష్ఠిరుడే' అనటంలో ఎన్నో అర్థాలు స్ఫురిస్తున్నాయి. మహావ్యసనపరుడై, ఒళ్ళు తెలియక పందెములొడ్డి ఓడిపోయిన ఆ ధర్మరాజునే సమాధానం అడగ'మన్నట్లు, ఇందులో కొంత నిరసన వ్యక్తమవుతున్నది. 'న్ని న్నొడ్డి ఓడిపోయిన నీ భర్త జూదంలోని మోసాన్నిగూర్చిగాని, ని న్నొడ్డటంలోని ముందు వెనుకలనుగూర్చి గాని విమర్శించక, జరిగిన దానిని అంతా అంగీకరించినట్లు ఊరకుండగా ఎవ్వ రేమని చెప్పగలరు?' అనే భావంగూడ ధ్వనిస్తున్నది. అంతేగాక - 'ఈ దుర్మార్గులమీద దండోపాయం ప్రయోగించటమే నీ ప్రశ్నకు సమాధానం. దీన్ని నిర్ణయించవలసిన వాడు నీ భర్త' అనే భావంకూడ కొంత స్ఫురిస్తున్నది. ధర్మజు డని అనక యుధిష్ఠిరుడనే పదప్రయోగం, 'దీనిఫలంబు వేగంబ యిక్కురుకులపాంసను లనుభవింతురు' అనే వాక్యం ఈ భావానికి బలం చేకూరుస్తున్నాయి. ధర్మరాజును మించి ధర్మసూక్ష్మాలు ఎరిగినవాళ్ళు ఇం కెవ్వ రున్నారు? ఆయనే నీ ధర్మసందేహం తీర్చగల డన్నది వాచ్యార్థం.

తే. **'తరుణి! యేవురకంటె నొక్కరుఁడ భర్త । యగుట లగ్గు; జూదంబున నాలి నోటు**
వడని వానిఁగాఁ దగు భర్తఁ బడయు మింక' । ననుచు రాధేయుఁ డుల్లసమాడె నంత. **246**

ప్రతిపదార్థం: తరుణి= ఓకాంతా! ద్రౌపదీ!; ఏవురకంటెన్= ఐదుమంది కంటె; ఒక్కరుఁడు+అ= ఒక్కడే; భర్త; అగుట; లగ్గు= మేలు; జూదంబునన్; ఆలిన్= భార్యను; ఓటుపడని= ఓడిపోని; వానిన్, కాన్, తగు, భర్తన్= తగిన భర్తను; ఇంకన్= ఇక; పడయుము= పొందుము; అనుచున్; రాధేయుఁడు= కర్ణుడు; అంతన్= అప్పుడు; ఉల్లసము+ఆడెన్= ఎగతాళి చేశాడు.

తాత్పర్యం: 'ద్రౌపదీ! ఐదుగురికంటె ఒక్కడే భర్త కావటం మంచిది. జూదంలో భార్యను ఓడిపోని తగుభర్తను ఇక పొందు' అని కర్ణుడు ఎగతాళి చేశాడు.

విశేషం: కర్ణుని పెంపుడు తల్లి రాధ (అధిరథుని భార్య). అందుచేత కర్ణుడు రాధేయుడైనాడు. జూదంలో భార్యను ఓడిపోని వాణ్ణి తగుభర్తగా పొందుమంటే దుర్యోధనుణ్ణి చేపట్టు మని కర్ణునిసూచన. ఏ కులకాంత కైనా కర్ణునిమాటలు కర్ణశూలాలే. కాగా, కర్ణునిసూచన మాయాద్యూతంలో లభించిన అక్రమవిజయంతో మదోద్ధతుడై ఉన్న దుర్యోధనుని దుర్మార్గాన్ని మరొకరీతిగా రగుల్కొల్పింది.

ఉ. అమ్ముదితన్ విభీతహరిణాక్షిఁ గలాపవిభాసికేశభా
రమ్మున నొప్పు దానిఁ దన రమ్యపృథూరుతలంబు నెక్కఁగా
రమ్మని సన్న సేసె ధృతరాష్ట్రసుతాగ్రజుఁ డప్డు; దాని దూ
రమ్మునఁ జూచి కౌరవకురంగమృగేంద్రుఁడు భీముఁ డల్కతోన్. 247

ప్రతిపదార్థం: ధృతరాష్ట్ర, సుత+అగ్రజుఁడు= ధృతరాష్ట్రుని కొడుకుల్లో ముందు పుట్టినవాడు - దుర్యోధనుడు; ఆ+ముదితన్= ఆ కాంతను; విభీత, హరిణ+అక్షిన్= భయపడిన లేడి కన్నులవంటి కన్నులుకలదానిని; కలాప, విభాసి, కేశ, భారమ్మునన్= నెమలి పురివలె ప్రకాశించే తల వెండ్రుకల బరువుచేత; ఒప్పుదానిన్= ప్రకాశించే దానిని; తన, రమ్య, పృథు+ఊరు, తలంబున్= తనయొక్క అందమైన, విశాలమైన తొడమీద; ఎక్కఁగాన్= ఎక్కటానికి - అంటే కూర్చొనటానికి; రమ్ము+అని; సన్న= సైగ; చేసెన్; అపుడు; దానిన్= ఆ సైగను; దూరమ్మునన్+చూచి= దూరానుండి చూచి; కౌరవ, కురంగ, మృగ+ ఇంద్రుఁడు= కౌరవులనే జింకలపాలిటికి సింహంవంటివాడైన; భీముడు; అల్కతోన్= కోపంతో.

తాత్పర్యం: ధృతరాష్ట్రుని జ్యేష్ఠపుత్రుడైన దుర్యోధనుడు, భయపడిన లేడి కన్నులాంటి కన్నులుకలది, నెమలి పురిలా ప్రకాశించే తల వెండ్రుకలభారం కలది అయిన ద్రౌపదిని- అందమై, విశాలమైన తన తొడమీద కూర్చుండ రమ్మని సైగ చేశాడు. ఆ సైగను దూరంనుండి చూచి, కౌరవులు అనే జింకల పాలిటి సింహంలాంటి భీముడు కోపంతో.

విశేషం: అలం: ఉపమ, రూపకం. భయపడిన లేడివంటి కన్నులు, నెమలి పురివలె ప్రకాశించే బరువైనజుట్టు స్త్రీకి సౌందర్యహేతువులు. 'విభీతహరిణాక్షి, కలాపవిభాసికేశభారమ్మున నొప్పుదాని' అని నన్నయ ద్రౌపదికి ప్రయోగించిన విశేషణాలు రెండును ఆమె పొందుతున్న భీతిని, దుశ్శాసనుని దుష్టచేష్టవల్ల ఆ జుట్టు చెదరినరీతిని తెలియజెయ్యటంతో పాటు, దుర్యోధనుని కంటికి ఆ స్థితిలోగూడ ఆమె అందంగా కనిపించటాన్ని సూచిస్తున్నది. భీముణ్ణి 'కౌరవ కురంగ మృగేంద్రు' డనటంలో మున్ముందు అతనిచేత కౌరవులకు పట్టనున్న గతికూడ సూచన చేయబడింది. (ఈ పద్యరచనలో పదాలు మసృణత్వంతోనూ అర్థఘటనతోనూ కూడిఉండటంచేత శ్లేష మనే గుణం రౌద్రరసవిభావవర్ణనంలో విశిష్టంగా రూపొందింది. - సంపా.)

క. లయసమయదండధర ని । ర్దయుఁడై ధరణీశు లెల్లఁ దనపలుకులు వి
స్మయసంభ్రమభయసంభృతు । లయి వినుచుండంగ నిట్టు లనియెన్ సభలోన్. 248

ప్రతిపదార్థం: లయ, సమయ, దండధర, నిర్దయుఁడు+ఐ= ప్రళయకాలంలోని యమధర్మరాజువలె దయలేనివాడై; ధరణి+ఈశులు+ఎల్లన్= రాజులందరు; విస్మయ, సంభ్రమ, భయ, సంభృతులు+అయి= ఆశ్చర్యంచేత, తొట్రుపాటుచేత, భయంచేత నిండినవారై; తన, పలుకులు= తనమాటలు; వినుచుండంగన్; సభలోన్; ఇట్టులు+అనియెన్.

తాత్పర్యం: భీముడు ప్రళయకాల యమధర్మరాజులా దయలేనివాడై, రాజులంతా ఆశ్చర్యంతో, తొట్రుపాటుతో, భయంతో తనమాటలు వింటూండగా సభలో ఇలా అన్నాడు.

ఉ. ధారుణి రాజ్య సంపద మదంబునఁ గోమలిఁ గృష్ణఁ జూచి రం
భోరు నిజోరుదేశమున నుండఁగఁ బిల్చిన యిద్దురాత్ము దు
ర్వార మదీయ బాహుపరివర్తిత చండ గదాభిఘాత భ
గ్నోరుతరోరుఁ జేయుదు సుయోధను నుగ్రరణాంతరంబునన్. 249

ప్రతిపదార్థం: ధారుణి, రాజ్య, సంపద, మదంబునన్= భూమిమీద దొరతనమనే ఐశ్వర్యంవల్ల కలిగిన పొగరుచేత; కోమలిన్= అందమైన దానిని; కృష్ణన్= ద్రౌపదిని; చూచి; రంభ+ఊరున్= అరటి (బోదెల) వంటి తొడలు గల ఆమెను; నిజ+ఊరు, దేశమునన్= తనతొడమీది స్థలంపై; ఉండఁగన్; పిల్చిన; ఈ+దురాత్మున్= ఈ దుర్మార్గుణ్ణి; సుయోధనున్= దుర్యోధనుణ్ణి; ఉగ్ర, రణ+అంతరంబునన్= భయంకరమైన యుద్ధంలో; దుర్వార, మదీయ, బాహు, పరివర్తిత, చండ, గదా+అభిఘాత, భగ్న+ఉరుతర+ఊరున్= అడ్డగించసాధ్యం కాని నా చేతులచేత త్రిప్పబడిన భయంకరమైన గదయొక్క దెబ్బలచేత విరిగిన పెద్దతొడలు గలవాణ్ణిగా; చేయుదున్.

తాత్పర్యం: రాజ్యసంపదవల్ల కలిగిన పొగరుతో అందమైన ద్రౌపదిని చూచి, అరటి(బోదెల) వంటి తొడలు గల ఆమెను, తన తొడమీద కూర్చుండ రమ్మని పిలిచిన ఈ దుష్టదుర్యోధనుణ్ణి భయంకర యుద్ధరంగంలో ఎదుర్కొని, అడ్డగించ సాధ్యంకాని నా చేతులు త్రిప్పే భీకరగదాదండం దెబ్బలతో ఇతనితొడలు విరుగ కొట్టుతాను.

విశేషం: ఉదాత్తరమణీయమైన నన్నయ పద్యశైలికి ఉదాహరణాలైన ప్రసిద్ధ పద్యాల్లో ఇదొకటి. భయంకరాలు, భావి భారత మహా సంగ్రామానికి ప్రాతిపదికలు, రౌద్రరసానికి ఉనికి పట్టులు అయిన భీముని ప్రతిజ్ఞల్లో ఇది రెండవది. అనేకంగా ప్రయుక్తమైన 'ఊరు' శబ్దం పద్యశైలికి రమ్యతను కూర్చటమే కాక, ద్రౌపదిని కూర్చుండు మని దుర్యోధనుడు చూపిన ఊరువు భీముని కంటికి ఎంత కటువుగ మాటిమాటికి కనిపించిందో తెలుపుతున్నది. కాగా 'దుర్వారమదీయబాహుపరివర్తితచండగదాభిఘాత భగ్నోరుతరోరు' అని సుదీర్ఘంగా సుళ్ళు తిరుగుతూ సాగిన సమాసంలో- సహృదయుడు, భీముని చేతిలో ఆ చండగద తిరిగే విధాన్ని భావించుకోవచ్చు. (ఇందులో శబ్దశక్తిమూలకానురణనధ్వని, ఓజోగుణం పోషించబడ్డాయి. సంపా.)

వ. అని సర్వజన భయానక క్రోధావేశ వివశుండయి యాయుధంబు లున్న వలనికి దృష్టులు సలుపుచు నగ్రజు మొగంబు సూచుచున్న భీమసేను నతిరౌద్రాకారంబు సూచి భీష్మ విదుర ద్రోణాదు'లిది కోపంబున కవసరంబు గా'దని యాతనిం బ్రశాంతచిత్తుం జేసి రంత. 250

ప్రతిపదార్థం: అని, సర్వజన, భయానక, క్రోధ+ఆవేశ, వివశుండు+అయి= అందరికీ భయం కలిగించే కోపావేశంచేత మైమరచిన వాడై; ఆయుధంబులు+ఉన్న; వలనికిన్= దిక్కుకు; దృష్టులు= చూపులు; సలుపుచున్= సాగేటట్లు చేస్తూ; అగ్రజు, మొగంబు= అన్న అయిన ధర్మరాజు ముఖాన్ని; చూచుచున్న; భీమసేను, అతిరౌద్ర+ఆకారంబు= భీమసేనునియొక్క మిక్కిలి భయంకరమైన రూపు; చూచి; భీష్మ, విదుర, ద్రోణ+ఆదులు= భీష్ముడు, విదురుడు, ద్రోణుడు మొదలయినవాళ్ళు; ఇది; కోపంబునకున్; అవసరంబు= సమయం; కాదు+అని; ఆతనిన్= ఆ భీమసేనుణ్ణి; ప్రశాంత, చిత్తున్= మిక్కిలి శాంతిని పొందిన మనస్సు కలవాణ్ణిగా చేసిరి; అంతన్.

తాత్పర్యం: అని అందరికి భయాన్ని కలిగించే కోపావేశంతో మైమరచి ఆయుధా లుండే దిక్కుకు చూపులు ప్రసరింపజేస్తూ, అన్నమొగం చూస్తున్న ఆ భీమసేనుడి భయంకరాకారం చూచి, భీష్మవిదుర ద్రోణాదులు 'ఇది కోపానికి సమయంకా'దని ఆ భీమసేనుణ్ణి పూర్తిగా శాంతింపజేశారు. అప్పుడు.

క. ధృతరాష్ట్ర నగ్నిహోత్రా । యతనంబున నఱచె వఱుకు, లగ్నులు శాంత
ద్యుతులయ్యెఁ, గౌరవ స్త్రీ । తతిహృదయము లధికశోకతప్తము లయ్యెన్. 251

ప్రతిపదార్థం: ధృతరాష్ట్ర, అగ్నిహోత్ర+ఆయతనంబునన్= ధృతరాష్ట్రుని యొక్క అగ్నిహోత్ర గృహంలో; వఱుకులు= పెద్దనక్కలు; అఱచెన్; అగ్నులు; శాంత, ద్యుతులు+అయ్యెన్= చల్లారిన వెలుగులు కలవి అయ్యాయి; కౌరవ, స్త్రీ, తతి, హృదయములు= కౌరవ స్త్రీ సమూహాల హృదయాలు; అధిక, శోక, తప్తములు+అయ్యెన్= పెద్దదుఃఖంచేత తపింప జేయబడినవి అయ్యాయి.

తాత్పర్యం: ధృతరాష్ట్రుని అగ్నిహోత్రగృహంలో పెద్దనక్కలు అరిచాయి. అగ్నిహోత్రాల్లో వెలుగులు చల్లారినాయి. కౌరవస్త్రీసమూహాల హృదయాలు దుఃఖంతో కలతచెందాయి.

విశేషం: అపశకునాలు అశుభసూచకాలు.

క. క్రూరాత్మకులై దుష్పద । వీ రతులగు ధార్తరాష్ట్రవీరుల శయ్యా
గారముల నెగసె నెంతయు । ఘోరంబుగఁ గాక ఘూక ఘూత్కారంబుల్. 252

ప్రతిపదార్థం: క్రూర+ఆత్మకులు+ఐ= క్రూరమైన మనస్సుతో కూడిన వాళ్ళయి; దుష్పదవీ, రతులు+అగు= చెడుమార్గం ఇష్టం గలవాళ్ళయిన; ధార్తరాష్ట్ర, వీరుల= కౌరవ వీరులయొక్క; శయ్యా+అగారములన్= పడకటిండ్లలో; ఎంతయున్; ఘోరంబుగన్= భయంకరంగా; కాక, ఘూక, ఘూత్కారంబుల్= కాకుల, గుడ్లగూబల అరుపులు; ఎగసెన్= వ్యాపించాయి.

తాత్పర్యం: క్రూరమైన మనస్సు కలవాళ్ళు, చెడుమార్గం ఇష్టమైనవాళ్ళు, అయిన కౌరవ వీరుల పడకటిండ్లలో ఎంతో భయంకరంగా కాకుల కూతలు, గుడ్లగూబల అరపులు వ్యాపించాయి.

క. అట్టి మహోత్పాతంబులు । పుట్టినఁ గృప విదుర కలశభూ శాంతనవుల్
'నెట్టన ధృతరాష్ట్రజులకుఁ । బుట్టె నరిష్ట' మని రిష్టమునఁ దమలోనన్. 253

ప్రతిపదార్థం: అట్టి; మహా+ఉత్పాతంబులు= పెద్ద అపశకునాలు; పుట్టినన్; కృప, విదుర, కలశభూ, శాంతనవుల్= కృపుడు, విదురుడు, కలశంలో నుండి పుట్టిన ద్రోణుడు; శంతనుని పుత్రుడైన భీష్ముడు; ఇష్టమునన్= ఇష్టంగా; తమలోనన్= తమలో తాము; ధృతరాష్ట్రజులకున్= ధృతరాష్ట్రుని కుమారులకు; నెట్టన= తప్పక; అరిష్టము= కీడు; పుట్టెన్; అనిరి.

తాత్పర్యం: అలాంటి పెద్ద అపశకునాలు పుట్టగా- కృప, విదుర, ద్రోణ, భీష్ములు తమలో తాము- ధృతరాష్ట్రుని కుమారులకు కీడు పుట్టిందని ఇష్టంగా అనుకొన్నారు.

వ. అంత నంతయు నెఱింగి గాంధారి విదురుం దోడ్కొని ధృతరాష్ట్రు కడకుంబోయి పాండవపరాజయంబును ద్రౌపదిపరిభవంబును దుర్నిమిత్తోత్పత్తియుం జెప్పిన విని, ధృతరాష్ట్రుండు దుర్యోధనుం బిలిచి యి ట్లనియె. 254

ప్రతిపదార్థం: అంతన్; అంతయున్; ఎఱింగి= తెలుసుకొని; గాంధారి; విదురున్, తోడ్కొని; ధృతరాష్ట్రు, కడకున్= ధృతరాష్ట్రుని దగ్గరకు; పోయి; పాండవపరాజయంబును= పాండవుల ఓటమిని; ద్రౌపది, పరిభవంబును= ద్రౌపదియొక్క అవమానాన్ని; దుర్నిమిత్త+ఉత్పత్తియున్= అపశకునాల పుట్టుకను; చెప్పినన్; విని; ధృతరాష్ట్రుండు; దుర్యోధనున్; పిలిచి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అప్పుడు జరిగిందంతా తెలుసుకొని గాంధారి- విదురుణ్ణి వెంట బెట్టుకొని ధృతరాష్ట్రుని దగ్గరకు వెళ్ళింది. పాండవులు ఓడిపోవటాన్ని, ద్రౌపదికి జరిగిన అవమానాన్ని, అపశకునాలు పుట్టటాన్ని ఆయనకు చెప్పింది. అది విని ధృతరాష్ట్రుడు దుర్యోధనుణ్ణి పిలిచి.

విశేషం: ఇంత జరిగిన తరువాత గాంధారి ఇప్పుడు కదిలింది. కోడలిమీద సానుభూతి పెరిగి కదిలిందో? లేక కొడుకుల క్షేమాన్ని కాంక్షించి కదిలిందో?

చ. పరమపతివ్రతన్ సభఁ దపస్వినిఁ బాండవధర్మపత్ని ధ
ర్మరత నయోనిజం బ్రకృతిమానవభామినిఁగాఁ దలంచి దె
ప్పరములు వల్కఁగాఁ దగునె? బాల్యము నాదిగ దుష్టభావనం
బెరిఁగితి నీ నిమిత్తమునఁ బెద్దయు దుఃఖితు లైరి పాండవుల్. 255

ప్రతిపదార్థం: పరమ, పతివ్రతన్; తపస్వినిన్= తాపసురాలిని; పాండవ, ధర్మపత్నిన్= పాండవుల ఇల్లాలిని; ధర్మరతన్= ధర్మంపట్ల అభిలాష కల దానిని; అయోనిజన్= గర్భంనుండి పుట్టని దానిని; ద్రౌపదినిన్; ప్రకృతి, మానవ, భామినిగాన్= సామాన్య మానవకాంతగా; తలంచి; దెప్పరములు= ఓర్చుకొన సాధ్యంగాని మాటలు; సభన్= సభలో; పల్కఁగాన్= మాట్లాడగా; తగునె= తగునా? బాల్యము+ఆదిగన్= చిన్నతనం మొదలుకొని; దుష్టభావనన్= చెడు తలంపుతో; పెరిఁగితి= పెరిగావు; నీ నిమిత్తమునన్= నీ కారణంగా; పాండవుల్; పెద్దయున్= మిక్కిలి; దుఃఖితులు+ఐరి= దుఃఖాన్ని పొందినవా ళ్ళయ్యారు.

తాత్పర్యం: పరమపతివ్రత, తాపసురాలు, పాండవుల ఇల్లాలు, ధర్మంపట్ల ప్రీతి కలది, మానవగర్భంనుండి పుట్టనిది అయిన ద్రౌపదిని- సామాన్య మానవకాంతగా తలచి, ఓర్చుకోటానికిసాధ్యం గాని మాటలు సభలో మాట్లాడటం తగునా? బాల్యంనుండి నీవు చెడు తలంపుతోనే పెరిగావు. నీ కారణంగా పాండవులు ఎంతో దుఃఖం అనుభవించారు.

విశేషం: గతజన్మంలో ద్రౌపది ఇంద్రసేన. గొప్పతపస్సు చేసిన పతివ్రత. (ధృతరాష్ట్రుడి మాటలలో అగ్రామ్యత్వం, వికటత్వం ఉదారతాగుణాన్ని రూపొందిస్తున్నాయి. - సంపా.)

వ. 'వారలవలన నీ దురాగ్రహం బుడుగు'మని కొడుకును భంగించి సకలబాంధవహితంబు సేయందలంచి ద్రౌపదిని రావించి శాంతవచనంబుల నిట్లనియె. 256

ప్రతిపదార్థం: వారలవలనన్= వారలపట్ల; నీ, దురాగ్రహంబు= నీ చెడుకోపం; ఉడుగుము= మానుము; అని; కొడుకును; భంగించి= త్రోసిపుచ్చి; సకల, బాంధవ, హితంబు= అందరు బంధువులకు మేలు; చేయన్, తలంచి; ద్రౌపదిని; రావించి; శాంత, వచనంబులన్= మెత్తనిమాటలచే; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: 'వాళ్ళమీద నీవు కోపం మాను' అని కొడుకును త్రోసిపుచ్చి, అందరు బంధువులకు మేలు చెయ్యాలనే తలంపుతో ద్రౌపదిని పిలిచి మెత్తనిమాటలతో ఇలా అన్నాడు.

ధృతరాష్ట్రుండు ద్రౌపదిగోరినవరంబు లిచ్చుట (సం. 2-63-27)

క. సుందరి! నా కోడండ్రుర । యం దభ్యర్హితవు నీవ; యతిముదమున నీ
కుం దగఁ బ్రియంబు సేసెద । నిందుముఖీ! వేఁడు మెద్ది యిష్టము నీకున్. 257

ప్రతిపదార్థం: సుందరి; నా, కోడండ్రుర, అందున్= నాకోడండ్రందరిలో; నీవు+అ= నీవే; అభ్యర్హితవు= గౌరవించదగినదానవు; ఇందుముఖీ= చంద్రునివంటి అందమైన ముఖం కలదానా!; అతి, ముదమునన్= మిక్కిలి సంతోషంతో; నీకున్; తగన్= తగిన విధంగా; ప్రియంబు, చేసెదన్= ఇష్టమైనది ఇస్తాను; నీకున్; ఎద్ది= ఏది; ఇష్టము; వేఁడుము= కోరుకొనుము.

తాత్పర్యం: సుందరీ! ద్రౌపదీ! నా కోడళ్ళందరిలో నీవే గౌరవించదగిన దానివి. చంద్రముఖీ! నీ కేది ఇష్టమో కోరుకో. ఎంతో సంతోషంతో ఇస్తా.

విశేషం: ధృతరాష్ట్రుడు గ్రుడ్డివాడు. ద్రౌపది అందాన్ని గురించి ఆయన విని ఉంటాడే కాని చూడలేదు. అయినా ఈ సందర్భంలో ఆమెను సుందరీ, ఇందుముఖీ- అని సంబోధిస్తున్నాడు. సౌందర్య సూచకాలైన సంబోధనలు స్త్రీలకు సంతోషహేతువులు. ద్రౌపది మనస్సును సుముఖం చేసుకోటానికి ధృతరాష్ట్రుడు ఆమెను అలా సంబోధించి ప్రశంసించా డని అనిపిస్తుంది.

వ. అనినం బాంచాలి యి ట్లనియె. 258

తాత్పర్యం: అని ధృతరాష్ట్రుడనగా, ద్రౌపది ఇలా అన్నది.

ఆ. కరుణతోడ నాకు వరము ప్రసాదింప । బుద్ధియేని లోకపూజితుండు
మనునిభుండు ధర్మతనయుండు దాస్యంబు । వలనఁ బాయవలయు వసుమతీశ! 259

ప్రతిపదార్థం: వసుమతీ+ఈశ= ఓ భూనాథ! ధృతరాష్ట్రమహారాజా!; కరుణతోడన్= దయతో; నాకున్; వరము; ప్రసాదింపన్= ఇవ్వటానికి, బుద్ధి, ఏనిన్= మనస్సు కలదేని; లోకపూజితుండు= ప్రపంచంచేత పూజించబడేవాడు; మను, నిభుండు= మనువుతో సమానమైనవాడు; ధర్మతనయుండు= ధర్మరాజు; దాస్యంబువలనన్= సేవకత్వంనుండి; పాయవలయున్= తొలగిపోవాలి, విముక్తుడు కావాలి.

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! దయతో నాకు వరం ఇవ్వా లని మీకు అనిపిస్తే, లోకంచేత పూజించబడేవాడు, మనువుతో సమానమైనవాడు అయిన ధర్మరాజుకు దాస్యంనుండి విముక్తి కలగాలి.

విశేషం: అపారుష్యం, అజరరత్వం గల ఈ పద్యరచన సౌకుమార్యానికి చక్కని ఉదాహరణం. (సంపా.)

వ. 'అ ట్లయినం గురుకుమారులు గురువృద్ధజనలాలితుండై పెరిఁగిన ప్రతివింధ్యు దాసపుత్త్రుం డనకుండుదు; రిదియ నా యిష్టం' బనిన 'నిచ్చితి; నింక రెండవవరంబు వేఁడు' మనిన ద్రౌపది యి ట్లనియె. 260

ప్రతిపదార్థం: అట్లు+అయినన్; కురు, కుమారులు= కౌరవులు; గురు, వృద్ధ జన, లాలితుండు+ఐ= గురువులచేత, పెద్దవారిచేత బుజ్జగించబడిన వాడై; పెరిగిన; ప్రతివింధ్యు= ప్రతివింధ్యుని; దాస పుత్త్రుండు= సేవకుని కొడుకు; అనక+ ఉండుదురు= అని అనకుండా ఉంటారు; ఇదియే; నాకున్; ఇష్టంబు; అనినన్; ఇచ్చితిన్; ఇంక; రెండవ, వరంబు; వేఁడుము= కోరుకొనుము; అనినన్; ద్రౌపది; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'అలా అయితే గురువులచేత, పెద్దవారిచేత బుజ్జగించబడి పెరిగిన మా ప్రతివింధ్యుణ్ణి కౌరవులు సేవకుని కొడు కని అనకుండా ఉంటారు. ఇదే నా కోరిక' - అని ద్రౌపది అనగా- 'ఇచ్చాను- రెండవవరం కోరుకో' అని ధృతరాష్ట్రు డన్నాడు. అందుకు ద్రౌపది ఇలా అన్నది.

విశేషం: ప్రతివింధ్యుడు ద్రౌపదికి ధర్మరాజువల్ల జన్మించిన కుమారుడు. ఈ కోరికలో రాచకూతురుగా ద్రౌపది మాతృహృదయం వ్యక్తమవుతుంది.

**క. నెమ్మిని ధర్మజు నలువురు । దమ్ములుఁ దమ యాయుధములఁ దమవర్మవరూ
థమ్ములయుఁ దోడ సకల హి । తమ్ముగఁ బాయంగవలయు దాస్యము వలనన్. 261**

ప్రతిపదార్థం: నెమ్మినిన్= సంతోషంతో; ధర్మజు, నలుగురు, తమ్ములున్= ధర్మరాజుయొక్క నలుగురు తమ్ములును; తమ, ఆయుధములన్, తమ, వర్మ, వరూథమ్ములయున్+తోడన్= తమయొక్క ఆయుధాలతో కవచాలతో, గృహాలతో గూడ; సకల హితమ్ముగన్= అందరికి మేలు కలిగేటట్లు; దాస్యమువలనన్= దాస్యంనుండి; పాయంగవలయున్= తొలగాలి.

తాత్పర్యం: సంతోషంతో ధర్మరాజు నలుగురు తమ్ములు, తమ ఆయుధాలతో, కవచాలతో, గృహాలతో అందరికి మేలు కలిగేటట్లు దాస్యంనుండి విముక్తి పొందాలి.

వ. అనిన ధృతరాష్ట్రుండు 'నీకోరిన వరం బిచ్చితి; నింక మూఁడవవరంబు వేఁడు' మనిన ద్రౌపది యి ట్లనియె. 262

తాత్పర్యం: అని ద్రౌపది అనగా ధృతరాష్ట్రుడు 'నీవు కోరినవరం ఇచ్చాను. ఇంకా, మూడవవరం కోరుకో' అనగా ద్రౌపది ఇలా అన్నది.

**ఆ. 'వైశ్యసతికి నొక్క వరము, సత్క్షత్త్రియ । సతికి రెండు, శూద్రసతికి మూఁడు,
విప్రసతికి నూఱు వేఁడఁ జ న్వరములు । గాన యింక వేఁడఁగాదు నాకు.' 263**

ప్రతిపదార్థం: వైశ్యసతికిన్= వైశ్య స్త్రీకి; ఒక్క వరము; సత్+క్షత్త్రియ సతికిన్= ఉత్తమక్షత్త్రియస్త్రీకి; రెండు; శూద్రసతికిన్= శూద్ర స్త్రీకి; మూఁడు; విప్రసతికిన్= బ్రాహ్మణ స్త్రీకి; నూఱు, వరములు; వేఁడన్+చన్= కోరదగును; కాన; ఇంకన్; నాకున్; వేఁడన్+కాదు= కోరదగదు.

తాత్పర్యం: వైశ్యస్త్రీ ఒకవరం, ఉత్తమక్షత్త్రియస్త్రీ రెండువరాలు, శూద్రస్త్రీ మూడువరాలు, బ్రాహ్మణస్త్రీ వంద వరాలు కోరవచ్చు. అందువల్ల ఇక నేను కోరకూడదు.

వ. అనిన ధృతరాష్ట్రుండు కోడలి గుణంబులకు ధర్మం బెఱుంగుటకు సంతసిల్లి, యనుజ సహితుం డయిన యుధిష్ఠిరు రావించి 'నీవు సర్వసంపదలు స్వరాజ్యంబు నొప్పుగొని యెప్పటియట్ల యింద్రప్రస్థపురంబున కరిగి సుఖం బుండుము; నీకు లగ్గయ్యెడు' మని వెండియు. 264

ప్రతిపదార్థం: అనిన; ధృతరాష్ట్రుండు; కోడలి; గుణంబులకున్= మంచిగుణాలకు; ధర్మంబు+ఎఱుంగుటకున్= ధర్మం తెలిసి ఉండటానికి; సంతసిల్లి= సంతోషించి; అనుజ, సహితుండు+అయిన= తమ్ములతో కూడిన; యుధిష్ఠిరున్= ధర్మరాజును; రావించి; నీవు; సర్వ, సంపదలు; స్వ, రాజ్యంబున్= నీ యొక్క రాజ్యాన్ని; ఒప్పుగొని= తీసుకొని; ఎప్పటి, అట్ల= ఎప్పటివలె; ఇంద్రప్రస్థ, పురంబునకున్; అరిగి= వెళ్ళి; సుఖంబుండుము; నీకున్; లగ్గు= మేలు; అయ్యెడుము+అని= అవునని; వెండియున్= మళ్ళీ.

తాత్పర్యం: ద్రౌపది మాటలు విన్న ధృతరాష్ట్రుడు ఆ కోడలి గుణాలకు, ధర్మపరిజ్ఞానానికి, సంతోషించి, యుధిష్ఠిరుణ్ణి, అతనితమ్ములతో కూడ రప్పించి, 'నీవు సర్వసంపదలు, నీ రాజ్యం తీసుకొని ఎప్పటిలా ఇంద్రప్రస్థానికి వెళ్ళి సుఖంగా జీవించు. నీకు మేలు కలుగుతుంది' అని, మళ్ళీ.

తే. నీవు నిత్యంబు వృద్ధోపసేవఁ జేసి । యెఱుఁగు దెల్ల ధర్మంబులు; నెఱుక లేక
కడఁగి నీ కెగ్గు సేసె నా కొడుకు; దీని । మఱచునది; నీకు నే నొండ్లు గఱపనేల? 265

ప్రతిపదార్థం: నీవు; నిత్యంబు= ఎల్లప్పుడు; వృద్ధ+ఉపసేవన్+చేసి= పెద్దలసేవ చేసి; ఎల్లధర్మంబులన్= అన్నిధర్మాలను; ఎఱుఁగుదు= తెలిసినవాడివి; నా, కొడుకు; ఎఱుక లేక= జ్ఞానం లేక; కడఁగి= పూనుకొని; నీకున్; ఎగ్గు= కీడు; చేసెన్; దీనిన్= ఈ అపకారాన్ని; మఱచునది; నీకున్; నేను; ఒండ్లు= ఇతరాలు; కఱపన్+ఏల= బోధించట మెందుకు?

తాత్పర్యం: నీవు పెద్దలసేవ చేసి అన్ని ధర్మాలు తెలుసుకొన్నావు. నాకొడుకు జ్ఞానం లేక నీకు కీడు చేశాడు. ఈ అపకారాన్ని మరచిపో. నీకు నేను ఇంకేమీ బోధించ నక్కరలేదు.

క. మనమున వేరమిఁ దలఁపమి । యును, సక్షమచిత్తుఁ డగుటయును, గుణములు కై
కొని దోషమ్ములు విడుచుట । యును నుత్తముఁ డయిన పురుషు నుత్తమగుణముల్. 266

ప్రతిపదార్థం: మనమునన్= మనస్సులో; వేరమిన్= వైరాన్ని; తలఁపమియును= తలంచకుండటం; సక్షమ, చిత్తుఁడు+ అగుటయును= ఓర్పుతో కూడిన మనస్సు కలవాడు కావటం; గుణములు; కైకొని= గ్రహించి; దోషమ్ములు; విడుచుటయును; ఉత్తముఁడు+అయిన= గొప్పవాడైన; పురుష, ఉత్తమ, గుణముల్= మానవునియొక్క గొప్పగుణాలు.

తాత్పర్యం: మనసులో వైరం తలచకుండటం, ఓర్పుతో కూడిన మనస్సు కలిగి ఉండటం, గుణాలు గ్రహించి, దోషాలు విడిచి వేయటం, గొప్పవ్యక్తియొక్క గొప్పగుణాలు.

విశేషం: మానవతకు వెలుగు నిచ్చే చక్కని సూక్తుల్లో ఇ దొకటి. (పై పద్యం, ఈ పద్యం మాధుర్యగుణానికి మచ్చుతునకలు. సంపా.)

వ. ఏను బుద్ధిలేక జూదం బుపేక్షించితి; నల్పబుద్ధిసత్త్వుండయిన వృద్ధు నన్నును, మీతల్లి యయిన గాంధారినిం దలంచి, దుర్యోధనాదులు సేసిన దుర్నయంబులు సేకొన కుండునది; సర్వశాస్త్రవిదుం డయిన విదురుండు మంత్రిగా సర్వధర్మవిదుండవైన నీవు రక్షకుండవుగా నిక్కురుకులంబునకు లగ్గగు'నని ధర్మరాజుఁ బాండురాజు రాజ్యంబునందు సమర్పించిన. 267

ప్రతిపదార్థం: ఏను= నేను; బుద్ధిలేక; జూదంబు+ఉపేక్షించితిన్= జూదాన్ని అశ్రద్ధచేశాను; అల్ప, బుద్ధి, సత్త్వుండు+అయిన= కొద్దిదైన బుద్ధిబలం గల; వృద్ధున్= ముసలివాణ్ణి; నన్నును; మీ, తల్లి, అయిన; గాంధారినిన్, తలంచి; దుర్యోధన+ఆదులు= దుర్యోధనుడు మొదలయినవాళ్ళు; చేసిన; దుర్నయంబులు= చెడ్డపనులు; చేకొనక+ఉండునది= లెక్కపెట్టకుండ ఉండేది; సర్వ, శాస్త్ర విదుండు+అయిన= అన్ని శాస్త్రాలు తెలిసిన వాడైన; విదురుండు; మంత్రిగా; సర్వ, ధర్మ, విదుండవు+ఐన= అన్ని ధర్మాలు తెలిసిన వాడి వైన; నీవు; రక్షకుండవుగాన్; ఈ+కురుకులంబునకున్= ఈ కురువంశానికి; లగ్గు+అగున్= మే లవుతుంది; అని; ధర్మరాజున్; పాండురాజు, రాజ్యంబునందున్; సమర్పించినన్= గౌరవంగా అప్పగించగా.

తాత్పర్యం: 'నేను బుద్ధిలేక జూదాన్ని ఉపేక్షించాను. స్వల్పబుద్ధి గల ముసలివాణ్ణి నన్నూ, మీ తల్లి గాంధారినీ తలచి దుర్యోధనాదులు చేసిన చెడ్డపనులు మనస్సులో పెట్టుకోవద్దు. అన్నిశాస్త్రాలు తెలిసిన విదురుడు మంత్రిగా, అన్ని ధర్మాలు తెలిసిన నీవు రక్షకుడవుగా ఈ కురువంశానికి శుభం కలుగుతుంది' అని ధృతరాష్ట్రుడు పాండురాజు రాజ్యాన్ని ధర్మరాజుకు సమర్పించాడు.

విశేషం: ఇది ధృతరాష్ట్రుని మనోవేదనను వ్యక్తం చేసే వచనం. పుత్రమమకారం, అధర్మఫలభీతి అనే అడకత్తెరలో ఆ తండ్రి నలుగుతున్నాడు. 'సమర్పించిన' అనే దానికి అనేకప్రతుల్లో ఉండే 'నియోగించిన' అనే పాఠాంతరం అర్థస్పష్టతకు ఎక్కువ అనుకూలమైనదిగా ఉంది.

తరలము.

తరుణి ద్రౌపది యిట్లు పాండవధార్తరాష్ట్రులదైన భీ
కర పరస్పర కోపవేగము గ్రన్నఁ బాచి విపత్తి సా
గర నిమగ్నుల నుద్ధరించెఁ బ్రకాశకీర్తుల ధీరులం
బురుషసింహములన్ నిజేశులఁ బూని తద్దయుఁ బ్రీతితోన్. 268

ప్రతిపదార్థం: తరుణి= యౌవనవతి; ద్రౌపది; ఇట్లు= ఈ విధంగా; పాండవ ధార్తరాష్ట్రులది+ఐన= పాండవులయొక్క; ధృతరాష్ట్రుని కుమారులైన కౌరవులయొక్క; భీకర, పరస్పర, కోప, వేగము= భయంకరమైన పరస్పరకోపంయొక్క తీవ్రతను; క్రన్నన్= త్వరగా; పాచి= తొలగించి; విపత్తి, సాగర, నిమగ్నులన్= ఆపద అనే సముద్రంలో పూర్తిగా మునిగినవాళ్ళను; ప్రకాశ, కీర్తులన్= వెలుగుతున్న కీర్తి కలవాళ్ళను; ధీరులన్= ధైర్యవంతులను; పురుష, సింహములన్= పురుష శ్రేష్ఠులను; నిజ+ఈశులన్= తన భర్తలను; పూని= ప్రయత్నించి; తద్దయున్= మిక్కిలి; ప్రీతితోన్= ప్రేమతో; ఉద్ధరించెన్= లేవనెత్తింది.

తాత్పర్యం: ద్రౌపది ఈ విధంగా పాండవులకు, కౌరవులకు ఒకరిమీద మరొకరికున్న భయంకరకోపతీవ్రతను త్వరగా తొలగించింది. ఆపద అనే సముద్రంలో పూర్తిగా మునిగిన కీర్తిమంతులు, ధైర్యవంతులు, పురుషశ్రేష్ఠులు అయిన తనభర్తలను ప్రయత్నించి ఎంతో ప్రేమతో పైకి తీసింది.

విశేషం: అలం: రూపకం. గుణం : శ్లేష. (సంపా.)

సీ. **దాని నంతయు భీమసేనుండు విని 'రాజ్య । సంప్రాప్తి పాండవసత్తములకు**
సతికారణంబున ధృతమయ్యె నను నింత । కంటెను గష్టంబు గలదె యొండు;
పేర్మి నపత్యంబుఁ గర్మంబు విద్యయు । నను నివి తేజంబు లట్టె తగిన
పురుషున కెందును; నిరతంబు మిక్కిలి । తేజంబు కర్మంబు; దీని విడిచి

ఆ. **యలుక గాఁడె పురుషుఁ' డని కోపఘూర్ణిత । రక్తనేత్రుఁడై 'పరాక్రమమున**
శత్రువరుల నుగ్రసంగరంబునఁ జంపి । కుతలరాజ్యమెల్లఁ గొందు' ననుచు. **269**

ప్రతిపదార్థం: దానిన్; అంతయున్; భీమసేనుండు; విని; పాండవ, సత్తములకున్= పాండవశ్రేష్ఠులకు; రాజ్య, సంప్రాప్తి= రాజ్యలాభం; సతి, కారణంబునన్= భార్యమూలంగా; ధృతము+అయ్యెన్= ధరించబడినది అయినది; అను నింతకంటెను= అనిపించుకొనటంకంటె; కష్టంబు; ఒండు= మరొకటి; కలదె= కలదా? పేర్మిన్= గొప్పగా; అపత్యంబున్= సంతానం; కర్మంబు= చేయవలసిన పని; విద్యయున్; అను, ఇవి; తగిన; పురుషునకున్; ఎందును= ఎచ్చటనైనను; తేజంబులు+అట్టె= వెలుగులను (కీర్తిని) కలిగిస్తాయా?; నిరతంబు= ఎల్లప్పుడు; మిక్కిలి, తేజంబు, కర్మంబు= వీరకృత్యమే; మిక్కిలి శ్రేష్ఠం, దీని; విడిచి; పురుషుఁడు; అలుకగాఁడె= తేలికపడడా! అని; కోప, ఘూర్ణిత, రక్త, నేత్రుఁడు+ఐ= కోపంచేత తిరుగుడు పడిన ఎఱ్ఱని కన్నులు కలవాడై; పరాక్రమమునన్= శౌర్యంతో; శత్రు, వరులన్= శత్రురాజులన్; ఉగ్ర, సంగరంబునన్= భయంకరమైన యుద్ధంలో; చంపి; కుతల, రాజ్యము+ఎల్లన్= భూమిమీది రాజ్యాధికారాన్నంతను; కొందును= గ్రహిస్తాను; అనుచున్.

తాత్పర్యం: భీమసేనుడు అంతా విని 'పాండవ శ్రేష్ఠులకు రాజ్యలాభం భార్యమూలంగా వచ్చిం దని అనిపించుకోవటంకంటె కష్టం మరొకటి లేదు. పురుషునికి వెలుగునిచ్చేవి- గొప్ప సంతానం, చేసేపని, విద్య, ఎల్లప్పుడు వీరకృత్యమే శ్రేష్ఠం. దీన్ని విడిచిన పురుషుడు తేలికపడడా!' అని కోపంతో తిరుగుడుబడిన ఎఱ్ఱనికళ్ళు కలవాడై, 'పరాక్రమంతో శత్రురాజులను భయంకరయుద్ధంలో సంహరించి రాజ్యమంతా గ్రహిస్తా' నంటూ.

విశేషం: 'అలుకగాఁదె' అనే పాఠానికి 'అలుసుగాఁదె', 'అలతిగాదె' అనే పాఠాంతరా లున్నాయి.

వ. **మృగమధ్యంబున నున్న సింహంబునుంబోలె ననుజమధ్యంబున నున్న యాతనిం గరంబున వారించి, ధర్మరాజు ధృతరాష్ట్రు శాసనంబునం దమ్ములుం దానును ద్రౌపదీ సహితంబుగాఁ గాంచనరథారూఢుఁ డై యింద్రప్రస్థపురంబున కరిగిన; నిట దుశ్శాసనుచేత నంత వృత్తాంతంబును విని దుర్యోధనుండు కర్ణశకుని సైంధవులతో విచారించి ధృతరాష్ట్రుపాలికిం జని యి ట్లనియె.** **270**

ప్రతిపదార్థం: మృగ, మధ్యంబునన్+ఉన్న= జింకలమధ్య ఉన్న; సింహంబునున్+పోలెన్= సింహంవలె; అనుజమధ్యంబునన్+ఉన్న= తమ్ముల మధ్య ఉండే; ఆతనిన్= ఆ భీమసేనుణ్ణి; ధర్మరాజు; కరంబునన్= చేతితో; వారించి= అడ్డగించి; ధృతరాష్ట్రు, శాసనంబునన్= ధృతరాష్ట్రుని ఆజ్ఞ ప్రకారం; తమ్ములున్; తానును; ద్రౌపదీ, సహితంబుగాన్= ద్రౌపదితోకూడ; ఇంద్రప్రస్థ, పురంబునకున్; అరిగినన్= వెళ్ళగా; ఇట; దుశ్శాసనుచేతన్; అంత, వృత్తాంతంబును= జరిగిన విషయాన్నంతటిని; విని; దుర్యోధనుండు; కర్ణ, శకుని, సైంధవులతో, విచారించి; ధృతరాష్ట్ర పాలికిన్= ధృతరాష్ట్రుని దగ్గరికి; చని= వెళ్ళి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: జింకలమధ్య ఉన్న సింహంలా తమ్ముల మధ్య ఉన్న ఆ భీమసేనుణ్ణి, ధర్మరాజు చేతితో అడ్డగించాడు. ధృతరాష్ట్రునిఆజ్ఞప్రకారం తమ్ములు, తాను, ద్రౌపదితో కలిసి ఇంద్రప్రస్థపురానికి వెళ్ళాడు. జరిగిందంతా దుశ్శాసనునిద్వారా విని దుర్యోధనుడు, కర్ణ శకుని సైంధవులతో ఆలోచించి, ధృతరాష్ట్రుని దగ్గరకు వెళ్ళి ఇలా అన్నాడు.

విశేషం: అలం: ఉపమ. తాను చేసినదంతా తండ్రి తలక్రిందులు చేస్తే దుర్యోధనుని స్థితిలో ఉన్న ఏ తనయుడైనా ఊరకుంటాడా?

క. అహితుల నెల్ల విధంబుల । విహతులఁగాఁ జేయునది వివేక మని మరు
న్మహితుండు చెప్పె నిది మును । బృహస్పతి సురేశ్వరునకుఁ బ్రియహితబుద్ధిన్. 271

ప్రతిపదార్థం: అహితులను= శత్రువులను; ఎల్ల, విధంబులన్= అన్ని విధాల; విహతులన్+కాన్= తెగటార్చ బడిన వాళ్ళనుగా; చేయునది; వివేకము= తెలివి; అని; మరుత్+మహితుండు= దేవతలలో గొప్పవాఁడు; బృహస్పతి; మును= పూర్వం; ప్రియ, హిత, బుద్ధిన్= ప్రేమతో మేలు చేసే తలంపుతో; సుర+ఈశ్వరునకున్= దేవతలరాజుకు-దేవేంద్రునికి; ఇది; చెప్పెన్.

తాత్పర్యం: 'శత్రువుల్ని అన్నివిధాల తెగటార్చటమే వివేకం' అని దేవతల్లో గొప్పవాడైన బృహస్పతి- దేవరాజైన దేవేంద్రునికి మేలు చెయ్యా లని ప్రేమతో చెప్పాడు.

వ. అప్పాండవుల కెంత లగ్గు సేసియు నింక హితుల మయ్యెదమె? యాశీవిషంబుల నలిగించి కంఠ సమీపంబున విడుచునట్లు వారల విడిచిపుచ్చి కర్జంబు దప్పితిమి. 272

ప్రతిపదార్థం: ఆ+పాండవులకున్; ఎంత; లగ్గు= మేలు; చేసియున్; ఇంక; హితులము= మేలు చేసేవాళ్ళము; అయ్యెదము+ ఎ= అవుతామా?; ఆశీ, విషంబులన్= ముఖంలో విషం కలవాటిని- పాములను; అలిగించి= కోపపడేటట్లు చేసి; కంఠసమీపంబునన్= గొంతు దగ్గర; విడుచునట్లు; వారలన్; విడిచి; పుచ్చి= పంపి; కర్జంబు= చేయదగినపని; తప్పితిమి.

తాత్పర్యం: ఆ పాండవులకు ఎంతమేలు చేసినా ఇంక మనం మంచివాళ్ళం అవుతామా! పాములను కోపపడేటట్లు చేసి కంఠంపై విడిచినట్లు వాళ్ళను వదలి, పంపి, తప్పు చేశాము.

విశేషం: అలం: ఉపమ.

ఉ. భూ విదిత ప్రతాప పరిభూత విపక్షుఁడు సవ్యసాచి గాం
డీవము గొన్న భీముఁడు వడిన్ గదగొన్నఁ, గవల్ కృపాణచ
ర్మావరణాది భాసిత మహాభుజ విక్రములైన, వారలన్
లావె రణంబులో మన కలంఘ్యబలాఢ్యుల నింక నోర్వఁగన్. 273

ప్రతిపదార్థం: భూ, విదిత, ప్రతాప, పరిభూత, విపక్షుఁడు= ప్రపంచప్రసిద్ధమైన పరాక్రమంచేత ఓడించబడిన శత్రువులుకలవాడు; సవ్యసాచి= అర్జునుడు; గాండీవము; కొన్నన్= చేత పట్టితే; భీముఁడు; వడిన్= వేగంగా; గద, కొన్నన్= గదను చేపట్టితే; కవల్= నకుల సహదేవులు; కృపాణ, చర్మ+ఆవరణ+ఆది, భాసిత, మహా, భుజ, విక్రములు+ఐనన్= కత్తి, డాలు, కవచం మొదలైన

వాటిచేత ప్రకాశించిన గొప్ప బాహుపరాక్రమం కలవాళ్ళయితే; వారలన్; అలంఘ్య, బల+ఆఢ్యులన్= దాటసాధ్యంకాని బలంతో కూడుకొన్నవాళ్ళను- అంటే జయింప సాధ్యంగాని బలంతో కూడుకొన్నవాళ్ళను; రణంబులోన్= యుద్ధంలో; ఇంకన్; మనకున్; ఓర్వఁగన్= సహించటం; లావె= శక్యమా?

తాత్పర్యం: ప్రపంచ ప్రసిద్ధమైన పరాక్రమంచేత శత్రువుల్ని ఓడించిన సవ్యసాచి, గాండీవం చేతపట్టితే- భీముడు వడిగా గదను చేబూనితే, నకుల సహదేవులు కత్తి, డాలు, కవచం మొదలైనవాటిచేత ప్రకాశించే గొప్ప భుజ పరాక్రమం కలవాళ్ళయితే, జయింప సాధ్యంగాని ఆ బలవంతుల్ని మనం యుద్ధంలో ఎదిరించి నిలవటం సాధ్యమా?

విశేషం: సవ్యసాచి అనే పదప్రయోగం, ఆ పదానికి విశేషణంగా కూర్చిన సుదీర్ఘ సమాసం గాండీవం చేపట్టిన అర్జునుని భీకరవీర విహారాన్ని చక్కగా వ్యక్తం చేస్తున్నవి. పాపపు పని చేసినవానికి దానిఫలితాన్ని గూర్చిన భయం ఎక్కువ. అందుచేత దుర్యోధనుని ఈ భయం అసహజమైంది కాదు. (ఈ పద్యరచనలో పాండవ పరాక్రమంవల్ల ప్రదర్శితమైన వీరరసదీప్తి ఔజ్జ్వల్యప్రధానమై కాంతి గుణపోషకంగా ఉంది. - సంపా.)

వ. 'కావున వారల ననుద్యూతంబునఁ బరాజితులం గావించి విరళ దేశ నిర్వాసితులం జేయుట కార్యం' బనిన విని ధృతరాష్ట్రుం డొడంబడి, యప్పుడ యనుద్యూతార్థంబు ధర్మనందనుం దోడితేరం బ్రాతికామిం బంచినం 'బితృనియోగంబును విధినియోగంబు నతిక్రమింప నగునే' యని. 274

ప్రతిపదార్థం: కావున; వారలన్= పాండవులను; అనుద్యూతంబునన్= రెండవ జూదంలో; పరాజితులన్= ఓడిపోయినవాళ్ళనుగా; కావించి= చేసి; విరళదేశ, నిర్వాసితులన్= దూరప్రదేశాలకు వెళ్ళగొట్టబడినవాళ్ళనుగా; చేయుట; కార్యంబు; అనినన్; విని; ధృతరాష్ట్రుండు; ఒడంబడి= ఒప్పుకొని; అప్పుడు+అ= అప్పుడే; అనుద్యూత+అర్థంబు= రెండవమారు జూదమాడటంకొరకు ధర్మనందనున్ - ధర్మరాజును; తోడితేరన్= తోడ్కొని రావటానికి; ప్రాతికామిన్; పంచినన్= పంపగా; పితృ, నియోగంబును= తండ్రియొక్క ఆజ్ఞను; విధి, నియోగంబున్= దైవనిర్ణయాన్ని; అతిక్రమింపన్+అగునే= దాటనవునా; అని.

తాత్పర్యం: 'కావున పాండవుల్ని పునర్ద్యూతంలో ఓడించి దేశంనుండి వెళ్ళగొట్టటమే మనం చెయ్యదగినపని' అని అనగా ధృతరాష్ట్రుడు ఒప్పుకొని, అప్పుడు మళ్ళీ జూదమాడటానికి ధర్మరాజును పిలుచుకొని రమ్మని ప్రాతికామిని పంపాడు. 'తండ్రి ఆజ్ఞ, దైవనిర్ణయం దాటనవునా?' అని.

విశేషం: పునర్ద్యూత విషయంలో భీష్ముడు తన అసమ్మతిని వెలిబుచ్చటం, గాంధారి దుర్యోధనుణ్ణి వదలివేసి అయినా కులాన్ని రక్షించు మని ధృతరాష్ట్రునికి హితబోధ చేయటం- మొదలయినవి మూలంలో ఉన్నాయి కాని, తెలుగు భారతంలో లేవు.

క. నృపవరుఁ డనుజులుఁ దానును । ద్రుపదతనూజయుఁ బ్రియంబుతో నరిగెను హ
స్తిపురంబునకు నశేష । స్వపక్షజన హృదయములకు సంతాపముగన్. 275

ప్రతిపదార్థం: నృప, వరుఁడు= రాజశ్రేష్ఠుడు- ధర్మరాజు; అనుజులున్= తమ్ములును; తానును; ద్రుపద తనూజయున్= ద్రుపదుని యొక్క పుత్రిక అయిన ద్రౌపదియు; అశేష, స్వ, పక్ష, జన, హృదయములకున్= తన పక్షంలోని జనులందరి హృదయాలకు; సంతాపముగన్= విచారం కలిగేటట్లు; హస్తిపురంబునకున్; ప్రియంబుతోన్= ప్రీతితో; అరిగెను= వెళ్ళాడు.

తాత్పర్యం: రాజశ్రేష్ఠుడైన ధర్మరాజు తన పక్షంలోని జను లందరి హృదయాలకు విచారం కలిగేటట్లుగా తమ్ములతో, ద్రౌపదితో కలిసి ఎంతో ఇష్టంగా హస్తినకు వెళ్ళాడు.

విశేషం: 'సంతాపముగన్' అనే దానికి పెక్కు ప్రతుల్లో ఉన్న 'సంతోషముగన్' అనే పాఠాంతరం మూల విరుద్ధం. "వ్యథయం తిస్మ చేతాంసి సుహృదాం" (మూలం భండార్కరు ప్రతి 2-67-6).

వ. అం దెప్పటియట్ల ధృతరాష్ట్ర నిర్మిత సభాసీనులై యున్నంత నభిమతాక్షుండైన శకుని కితవుండు ధర్మరాజున కి ట్లనియె. 276

ప్రతిపదార్థం: అందున్; ఎప్పటి, అట్ల= ఎప్పటివలె; ధృతరాష్ట్ర, నిర్మిత, సభా+ఆసీనులు+ఐ= ధృతరాష్ట్రునిచే నిర్మించబడిన సభలో కూర్చున్నవాళ్ళయి; ఉన్నంతన్= ఉండగా; అభిమత+అక్షుండు+ఐన= కోరిన పాచికలు కలవాడైన; శకుని, కితవుండు= మోసగాడు, జూదగాడుఅయిన శకుని; ధర్మరాజునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: హస్తినాపురంలో ధృతరాష్ట్రుడు నిర్మించిన ద్యూతసభలో ఎప్పటిలాగే అందరు కూర్చున్నారు. కోరిన పాచికలు గల జూదగాడు మోసగాడు అయిన శకుని- ధర్మరాజుతో ఇలా అన్నాడు.

క. ధనసంపద రాజ్యంబున । దినకరతేజుండు మిమ్ము ధృతరాష్ట్రుఁడు పెం
పునఁ బూజించెం గావునఁ । జన దింకను వాని నొడ్డి సరి క్రీడింపన్. 277

ప్రతిపదార్థం: దినకర, తేజుండు= సూర్యుని వంటి కాంతి కలవాడైన; ధృతరాష్ట్రుఁడు; ధన సంపదన్, రాజ్యంబునన్= ధనసంపదచేత, రాజ్యంచేత; మిమ్ము; పెంపునన్= గొప్పగా; పూజించెన్= సత్కరించాడు; కావునన్; వానినిన్= ఆ ధన సంపదను, రాజ్యమును; ఒడ్డి= పణంగా పెట్టి; సరి క్రీడింపన్= తగురీతిగా జూదమాడటం; ఇంకను; చనదు= కూడదు.

తాత్పర్యం: సూర్యునివంటి తేజస్సు గల ధృతరాష్ట్ర మహారాజు- ధనసంపదను, రాజ్యసంపదను ఇచ్చి మిమ్మల్ని సమ్మానించాడు. కాబట్టి ఇక వాటిని ఒడ్డి జూదమాడటం తగదు.

వ. 'ఇది యపూర్వంబైన పణంబు; దీని నొడ్డి యోటువడిన వార లజినవల్కలంబులు గట్టి వన్యమూలఫలాశనులై బ్రహ్మచర్యంబునం బన్డ్రెండేండ్లు వనవాసంబు సేసి, పదుమూఁడగు నేఁడు జనపదంబున నజ్ఞాతవాసంబు సేసి, యం దెఱుంగఁ బడిరేని వెండియుఁ బన్డ్రెండేండ్లు వనవాసంబు నొక్కయేఁ డజ్ఞాతవాసంబుఁ జేయుచుండు వా; రిట్లొపుదేని జూదం బాడుద' మనిన 'ననుద్యూతార్థం బాహూతుండనై మగుడ నగునే' యని. 278

ప్రతిపదార్థం: ఇది= నేను చెప్పబోయేది; అపూర్వంబు+ఐన= మున్నెన్నడు లేని, పణంబు= పందెం; దీనిన్; ఒడ్డి; ఓటు, పడిన, వారలు= ఓడిపోయినవాళ్ళు; అజినవల్కలంబులు= జింకచర్మం, నారచీరలు; కట్టి; వన్య, మూల ఫల+అశనులు+ఐ= అడవులలోని వేళ్ళు (దుంపలు), పండ్లు ఆహారంగా కలవాళ్ళయి; బ్రహ్మచర్యంబునన్= బ్రహ్మచర్యవ్రతాన్ని పూని; పన్ద్రెండు+ ఏండ్లు; వనవాసంబు, చేసి= అడవులలో నివసించి; పదుమూఁడగు, ఏఁడు= పదమూడవ సంవత్సరం; జనపదంబునన్= ఏదో ఒక దేశంలో; అజ్ఞాతవాసంబు= తెలియబడని నివాసం - అంటే వా ళ్ళెవరో తెలియకుండా నివసించటం; చేసి; అందున్= ఆ అజ్ఞాతవాసంలో; ఎఱుంగన్+పడిరి+ఏనిన్= కనపడినట్లయితే; వెండియున్= మళ్ళీ; పన్ద్రెండేండ్లు; వనవాసంబున్=

అరణ్యావాసాన్ని; ఒక్కఏఁడు; అజ్ఞాతవాసంబున్; చేయుచున్+ఉండువారు; ఇట్లు= ఈ విధంగానైన పందెమునకు; ఓపుదు+ ఏనిన్= చాలినవాడివయితే - అంటే ఈ విధమైన పందెం వేయటానికి చేతనైనవాడి వైతే; జూదంబు; ఆడుదము; అనినన్; అనుద్యూత+అర్థంబు= రెండవమారు జూదమాడటంకొరకు; ఆహూతుండను+ఐ= పిలువబడినవాడనై; మగుడన్= మరలి వెళ్ళటం; అగునే= తగునా? అని.

తాత్పర్యం: 'నేను చెప్పబోయేది ఇంతకుముం దెన్నడు లేని పందెం. దీన్ని ఒడ్డి ఓడినవాళ్ళు జింకచర్మం, నారచీరలు ధరించి, అడవుల్లో వేళ్ళు(దుంపలు) ఫలాలు ఆహారంగా, బ్రహ్మచర్యవ్రతం అవలంబించి, పండ్రెండేండ్లు అరణ్యావాసం, పదమూడవయేడు ఏదో ఒక దేశంలో అజ్ఞాతవాసం చెయ్యాలి. ఆ అజ్ఞాతవాసంలో వాళ్ళు కనబడితే మళ్ళీ పండ్రెండేండ్లు అరణ్యావాసం, ఒక సంవత్సరం అజ్ఞాతవాసం చేస్తారు. ఈ విధమైన పందెం వెయ్యటానికి నీకు శక్తి సరిపోతే జూదమాడదాం' - అని శకుని అనగా 'రెండవసారి జూదానికి ర మ్మని పిలిస్తే వెనుతిరిగి వెళ్ళదగునా' అని.

విశేషం: ప్రథమ ద్యూతంలోని పందెములు పాండవులను నిండుసభలో నిట్టనిలువునా దోచుకోవటం వంటివి. పాండవులకే కాదు ప్రజలకు కూడా కోపావేశాన్ని కలిగించేటువంటివి. అందుచేతనే పునర్ద్యూతంలోని పందెములు తడిగుడ్డతో పాండవుల గొంతులు కోసేవిగా రూపొందించటం జరిగింది. పాండవులు పదుమూడేండ్లు పదవి లేక ప్రజకు దూరమైతే వారి విషయం అందరు విస్మరించరా? అంతేకాదు, పండ్రెండేండ్లు అరణ్యావాసం తరువాత వాళ్ళు బ్రతికి ఉంటారనే నమ్మకం ఏముంది? అవసరమైతే అరణ్యావాసంలో అసహాయులైన వాళ్ళను అంతమొందించే ప్రయత్నాలు చెయ్యవచ్చు. ఘోషయాత్ర అటువంటిదే. ఒకవేళ వాళ్ళు బ్రతికి బయటపడినా అజ్ఞాతవాసంలో- ఒక్క సంవత్సరకాలంలో- వాళ్ళ ఉనికి కనిపెట్టటానికి సాధ్యంకాదా? మొత్తం ప్రభుత్వయంత్రాంగం, గూఢచారులదళం సర్వం తమ చేతుల్లోనే ఉంటుంది గదా! అజ్ఞాతవాసంలో వాళ్ళను కనిపెట్టితే మళ్ళీ వాళ్ళ జీవితం పండ్రెండేండ్లు అడవులపాలు. ఇది ఈ రెండవ జూదపు పందెం వెనుక ఉండే క్రూరప్రణాళిక. మొత్తంమీద ధర్మరాజు మళ్ళీ జూదమాడటానికి అంగీకరించాడు. పూర్వానుభవంతో అతడు గుణపాఠం నేర్చుకోలేదు. ఇక ఎవ్వరేం చెయ్యగలరు? భండార్కర్ సంస్కృత భారత సంశోధిత ప్రతిలో భీష్మద్రోణ బాహ్లిక సోమదత్త వికర్ణ యుయుత్సాదులును, గాంధారీ ద్రౌపదీకుంతీదేవులును రెండవసారి జూదం ఆడవద్దని ధర్మరాజుకు బోధించిన ట్లుంది గాని తెలుగు భారతంలో ఇది లేదు. కాగా భండార్కర్ ప్రతిలో - వనవాస అజ్ఞాతవాసాలు సక్రమంగా నెరవేర్చితే ఓడినవాళ్ళు మళ్ళీ తమ రాజ్యాన్ని తాము పొందగల రని ఉంది. ఈ విషయం గూడ తెలుగు భారతంలో లేదు. ధర్మరాజుకు అప్పటికీ ఇప్పటికీ ఒకే ధర్మం- సుహృద్ద్యూతానికి కాని, అనుద్యూతానికి గాని పిలువబడిన తరువాత క్షత్రియుడు దానిని వల దని తిరిగిపోరాదట! ఇది ప్రచ్ఛన్నరణరంగం. గెలుపో ఓటమో ఏదో ఒకటే గమ్యం. ఈ సున్నితమైన ధర్మబలహీనతను ధర్మరాజులో సహజంగా ఉన్న ద్యూతవ్యసన బలహీనతను శకుని కొల్లగొట్టాడు.

ధర్మరాజు శకునితో రెండవమాఱు జూదంబాడుట (సం. 2-67-21)

క. ధర్మసుతుఁ డొడ్డి శకుని క । ధర్మ స్థితి నోటు వడియె; దైవము చెయిదిన్
నిర్మితమయిన శుభాశుభ । కర్మ ఫలం బెట్లు దేహి గడవఁగ నేర్చున్. 279

ప్రతిపదార్థం: ధర్మసుతుఁడు= ధర్మరాజు; ఒడ్డి= పందెంవేసి; శకునికిన్; అధర్మస్థితిన్= అధర్మపద్ధతిలో; ఓటు, పడియెన్= ఓడిపోయాడు; దైవము, చెయిదిన్= దేవునిచేత; నిర్మితము+అయిన= ఏర్పరచబడిన; శుభ+అశుభ, కర్మ, ఫలంబు= మంచి చెడు పనుల ఫలితాన్ని; దేహి= దేహంగలవాడు; ఎట్లు; కడవఁగన్= దాటటానికి; నేర్చున్. (దాటటానికి వీలు లేదని భావం).

తాత్పర్యం: ధర్మరాజు పందెం వేసి శకునిచేతిలో అధర్మంగా ఓడిపోయాడు. దేవుడు నిర్ణయించిన మంచిచెడ్డల కర్మఫలాన్ని మానవుడు ఎలా దాటగలడు?

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

వ. అంత ననుద్యూతపరాజితులయిన పాండవులు దమరాజ్యోపభోగంబులు విడిచి విప్రసుహృద్బాంధవ జనానుగమ్యమానులయి వనంబునకుం బోవ సమకట్టి భీష్మ ధృతరాష్ట్ర విదురకృప ద్రోణాచార్యుల నా మంత్రించిన విదురుం డి ట్లనియె. 280

ప్రతిపదార్థం: అంతన్= అప్పుడు; అనుద్యూత, పరాజితులు+అయిన= రెండవసారి ఆడి జూదంలో ఓడిపోయిన; పాండవులు; తమ; రాజ్య+ఉపభోగంబులు= రాజ్యసుఖానుభవాలను; విడిచి; విప్ర, సుహృత్+బాంధవ, జన+అనుగమ్యమానులు+అయి= బ్రాహ్మణులు, మిత్రులు, బంధువులు, ప్రజలు వెంట వస్తున్నవాళ్ళయి; వనంబునకున్= అరణ్యానికి; పోవన్; సమకట్టి= పూనుకొని; ధృతరాష్ట్ర, విదుర, కృప, ద్రోణాచార్యులను; ఆమంత్రించినన్= వెళ్ళివస్తామని సెలవుతీసుకొనగా; విదురుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అప్పుడు పునర్ద్యూతంలో ఓడిపోయిన పాండవులు తమ, రాజ్యసుఖానుభవాలను వదలి బ్రాహ్మణులు, మిత్రులు, బంధువులు, ప్రజలు వెంటరాగా అరణ్యానికి వెళ్ళ బోతూ ధృతరాష్ట్ర విదుర కృప ద్రోణాచార్యుల దగ్గర సెలవు తీసుకున్నప్పుడు, విదురుడు ఇలా అన్నాడు.

క. వనవాసపరిక్లేశం । బున కోపదు కుంతిదేవి భోజాత్మజ గా
వున నా గృహమున నుండెడు । ననవరతము భక్తితో మదభ్యర్చితయై. 281

ప్రతిపదార్థం: భోజ+ఆత్మజ= భోజుని కూతురు; కుంతిదేవి; వనవాస, పరిక్లేశంబునకున్= అరణ్యంలో నివసించటంవల్ల కలిగే కష్టానికి; ఓపదు= ఓర్వలేదు; కావున; నా, గృహమునన్= నా ఇంటిలోనే; అనవరతము= ఎల్లప్పుడు; భక్తితో; మత్+అభ్యర్చిత యై= నాచేత పూజించబడేదై; ఉండెడున్.

తాత్పర్యం: భోజుని కూతురు కుంతీదేవి అరణ్యావాసంవల్ల కలిగే కష్టాన్ని ఓర్చుకోలేదు. అందువల్ల ఎప్పుడు నాచేత పూజించబడుతూ నాఇంట్లోనే ఉంటుంది.

సీ. ధర్మజ్ఞుఁడవు నీవు పేర్మిఁ, బరాక్రమ । ధనుఁడు భీముం, డింద్రతనయుఁ డఖిల
యుద్ధ విశారదుం డిద్ధయశోనిధి, । నకులుఁ డర్థాఢ్యుండు, ప్రకట బుద్ధి
నెంతయు సంయమవంతుఁడు సహదేవుఁ, । డధ్యాత్మవిద్య నారాధ్యుఁ డెందు
ననఘుండు ధౌమ్యుండు, వినుతార్థ ధర్మంబు । లందు విచక్షణ సుందరాంగి

ఆ. ద్రుపదతనయ; యిట్లు విపులగుణాళి న । న్యోన్య హితుల రగుట నన్యు లుర్వి
నాదరింపఁగాక భేదింపనోపెడు । వారు గలరె మిమ్ము ధీరమతుల. 282

ప్రతిపదార్థం: నీవు; పేర్మిన్= గొప్పగా; ధర్మజ్ఞుఁడవు= ధర్మం తెలిసినవాడివి; భీముఁడు; పరాక్రమధనుఁడు= శౌర్యమే ధనంగా కలగినవాడు - అంటే గొప్ప శౌర్యవంతుడు; ఇంద్రతనయుఁడు= ఇంద్రుని కుమారుడైన అర్జునుడు; అఖిల, యుద్ధ, విశారదుండు= అన్నియుద్ధాల్లో నేర్పరి; ఇద్ధ, యశోనిధి= ప్రకాశించే కీర్తికి నిధివంటివాడు; నకులుఁడు; అర్థ+ఆఢ్యుండు= న్యాయ సంపన్నుడు; సహదేవుఁడు; ప్రకటబుద్ధిన్= ప్రసిద్ధమైన తెలివితో; ఎంతయున్= మిక్కిలి; సంయమవంతుఁడు= నియమశీలం కలవాడు; అధ్యాత్మవిద్యన్= ఆత్మసంబంధమైన జ్ఞానంలో; ఎందున్= ఎచ్చటనైనా; అనఘుండు= పాపరహితుడు; ధౌమ్యుండు; ఆరాధ్యుఁడు= పూజింపదగినవాడు; వినుత+అర్థ, ధర్మంబుల+అందున్= పేరుకెక్కిన ధర్మార్థాలలో; సుందర+అంగి= అందమైన రూపు గలది; ద్రుపద, తనయ= ద్రుపదుని కూతురు; ద్రౌపది; విచక్షణ= బాగోగులు తెలిసినట్టిది; ఇట్లు= ఈ విధంగా; విపుల+గుణ+ఆళిన్= పెక్కు గొప్ప గుణాల సమూహంచేత; అన్యోన్యహితులరు+అగుటన్= ఒకరిమేలు మరొకరు కోరేవారవటంచేత; ధీరమతులు= ధైర్యవంతులు; మిమ్ము; ఉర్విన్= భూమిమీద; అన్యులు= ఇతరులు; ఆదరింపన్+కాక= గౌరవింపక; భేదింపన్+ఓపెడువారు= వైరం పూనే శక్తి కలవాళ్ళు; కలరె= కలరా?

తాత్పర్యం: నీవు గొప్ప ధర్మజ్ఞుడివి. భీముడు పరాక్రమవంతుడు, అర్జునుడు యుద్ధవిశారదుడు, కీర్తిమంతుడు. నకులుడు న్యాయసంపన్నుడు. సహదేవుడు మేధావి, నియమశీలి. పుణ్యాత్ముడైన ధౌమ్యుడు అధ్యాత్మవిద్యచేత పూజ్యుడు. అందమైన ద్రౌపది ధర్మార్థాల్లో చక్కని వివేకం గలది. ఈ విధంగా ఎన్నో గొప్ప గుణాలు కలిగి, ఒకరికొకరు హితులై, ధైర్యవంతులైన మిమ్మల్ని లోకంలో ఇతరులు ఆదరించక మీతో వైరం పెట్టుకోగలరా?

వ. మఱియుఁ గృష్ణద్వైపాయనుచేత శిక్షితులరు, నారదుచేత రక్షితులరు, మీకుం బురోహితుండు ధౌమ్యుండు, దైవమానుషసంపన్నులరు, బలపరాక్రమంబులంజేసి రాజులను, ధర్మచరితంబునం జేసి ఋషులను, మహత్త్వంబునంజేసి కుబేరవాసవాదులను జయించిన వారలరు, మిమ్ము భూమియు గాడ్పును జంద్రాదిత్యులు నెల్లకాలము రక్షించుచు నుండెడు; మెల్ల కార్యంబులయందును నప్రమత్తుల రయి వర్తిల్లునది; భవత్పునర్దర్శన మయ్యెడు మరుగుం'డని కఱపిన గురువృద్ధానుమతంబునం దమ తల్లి చరణంబులకు మ్రొక్కినం గొడుకుల. 283

ప్రతిపదార్థం: మఱియున్= అంతేకాక; కృష్ణద్వైపాయనుచేతన్; శిక్షితులరు= బోధించ బడిన వాళ్ళు; నారదుచేతన్; రక్షితులరు= రక్షించ బడిన వాళ్ళు; మీకున్; పురోహితుండు; ధౌమ్యుండు; దైవమానుషసంపన్నులరు= దివ్యత్వం, మానవత్వం నిండుగా కలవాళ్ళు; బలపరాక్రమంబులన్+చేసి= ధర్మ ప్రవర్తనతోన్; ఋషులను; మహత్త్వంబునన్+చేసి= గొప్పతనంచేత; కుబేర, వాసవ+ఆదులను= కుబేరుడు; ఇంద్రుడు మొదలయినవాళ్ళని; జయించిన వారలరు= జయించినట్టివాళ్ళు; మిమ్మున్; భూమియున్; గాడ్పును= గాలియు; చంద్ర+ఆదిత్యులున్= చంద్రుడు, సూర్యుడును; ఎల్ల, కాలము; రక్షించుచున్; ఉండెడున్+ఎడమ= అన్ని కాలాల్లోను రక్షిస్తూ ఉండుగాక!; ఎల్ల, కార్యంబుల, అందునున్= అన్ని పనులలోను; అప్రమత్తులరు+అయి= జాగరూకులై; వర్తిల్లునది= నడచుకొనండి; భవత్+పునర్దర్శనము= మిమ్మల్ని మరలా చూడటం; అయ్యెడున్= అగునుగాక! అరుగుండు= వెళ్ళండి; అని; కఱపిన= బోధించిన; గురు, వృద్ధ+మతంబునన్= గురువులయొక్క, పెద్దలయొక్క అనుమతితో; తమ, తల్లి; చరణంబులకున్= పాదాలకు; మ్రొక్కినన్; కొడుకులన్.

తాత్పర్యం: 'మీరు కృష్ణద్వైపాయనుని బోధ పొందినవాళ్ళు. నారదునిరక్షణ ఉన్నవాళ్ళు. మీకు పురోహితుడు ధౌమ్యుడు. దివ్యత్వం, మానవత్వం నిండుగా కలవాళ్ళు. బలపరాక్రమాలతో రాజులను, ధర్మప్రవర్తనతో ఋషులను, మహత్తుచేత

కుబేర దేవేంద్రాదులను జయించినవాళ్ళు. మిమ్మల్ని నేల, గాలి, చంద్రుడు, సూర్యుడు ఎల్లవేళల రక్షించుగాక! అన్ని పనుల్లో జాగరూకులై నడుచుకొందురుగాక! మిమ్మల్ని మరలా చూడటం జరుగుగాక! వెళ్ళిరండు' అని విదురుడు బోధించగా, గురువులఅనుమతి, పెద్దల అనుమతి పొంది పాండవులు కుంతీదేవి పాదాలకు మ్రొక్కగా, ఆమె కొడుకులను.

విశేషం: 'నారదుచేత రక్షితులరు' అనేదానికి పెక్కు ప్రతుల్లో ఉన్న 'నారాయణుచేత రక్షితులరు' అనే పాఠమే ఎంతో ఉచిత మనిపిస్తుంది.

సీ. **అధికలజ్జావనతాస్యుల, నపగతా । భరణాంబరుల, ధర్మపరుల, నజిన**
వల్కలధారుల, వరమునివేషులఁ బాండుకుమారుల భానునిభులఁ
జూచి దుఃఖిత యయి సుతులార! యిట్టి దు । ర్వ్యసనోపహతులైనవారి మిమ్ముఁ
జూడక ముందఱ సురలోకమున కేఁగి । పాండుభూపతి పుణ్యభాగి యయ్యెఁ;

తే. **భక్తిఁ బతితోన పోవఁ దపంబు సేసె । మాద్రి; యే నేల పోవక మందభాగ్య**
నయితి నని విలాపించుచు నపుడు గుంతి । యేడ్చె దుఃఖితు లగుచుండ నెల్లవారు. **284**

ప్రతిపదార్థం: అధిక, లజ్జా+అవనత+ఆస్యులన్= మిక్కిలి సిగ్గుచేత వంచుకొన్న మొగాలు కలవాళ్ళను; అపగత+ఆభరణ+ అంబరులన్= కోల్పోయిన ఆభరణాలు, వస్త్రాలు కలవాళ్ళను; ధర్మపరులన్= ధర్మంలో ఆసక్తి కలవాళ్ళను; అజిన, వల్కల, ధారులన్= జింకచర్మం, నారచీరలు ధరించినవాళ్ళను; వర, మునివేషులన్= శ్రేష్ఠమైన మునివేషం కలవాళ్ళను; భానునిభులన్= సూర్యుడితో సమానమైన వాళ్ళను; పాండుకుమారులన్; చూచి; దుఃఖిత; అయి= దుఃఖించినట్టిదై; సుతులారా= కుమారులార; ఇట్టి; దుర్వ్యసన+ఉపహతులు+ఐనవారిన్= చెడువ్యసనం(జూదం)చేత దెబ్బతినినవాళ్ళను; మిమ్మున్; చూడక; ముందఱన్; పాండుభూపతి= పాండురాజు; సురలోకమునకున్= స్వర్గలోకానికి; ఏఁగి= వెళ్ళి; పుణ్య, భాగి, అయ్యెన్= పుణ్యవంతు డయ్యాడు; మాద్రి; భక్తిన్= భక్తితో; పతితోనన్= భర్తతోకూడ; పోవన్= పోవటానికి; తపంబు; చేసెన్; ఏన్= నేను; ఏల= ఎందుచేత; పోవక= వారివెంట గతించక; మందభాగ్యను= దురదృష్టవంతురాలిని; అయితిని; అని; కుంతి, ఎల్లవారు= అందరు; దుఃఖితులు+అగుచున్+ఉండన్= దుఃఖం పొందినవా రవుతుండగా; అపుడు; విలాపించుచున్= దుఃఖంతో మాటాడుతూ; ఏడ్చెన్.

తాత్పర్యం: ఆభరణాలు, వస్త్రాలు పోగొట్టుకొని, సిగ్గుతో ముఖాలు దించుకొని, నారచీరలు కట్టుకొని, జింకచర్మాలు చేతపట్టుకొని- మునివేషధారులు, సూర్యతేజులు, ధర్మపరులు అయిన పాండవులను చూచి దుఃఖించి- 'పుత్రులారా! ఈ విధంగా ద్యూతవ్యసనంతో దెబ్బతిన్న మిమ్మల్ని చూడకముందే పాండురాజు స్వర్గస్థుడై పుణ్యవంతు డయ్యాడు. పతితో సహగమనం చెయ్యటానికి మాద్రి తపస్సు చేసింది. నేను వాళ్ళ వెంట వెళ్ళని దురదృష్టవంతురాల్ని' - అని కుంతి అందరితోపాటుగా తానూ దుఃఖిస్తూ పలికింది.

వ. **మఱియును** **285**

తాత్పర్యం: అంతేకాక.

మత్తకోకిలము.

వీర లిట్టు లనాథులై మునివృత్తి నుండెడు వారె హా
ద్వారకాపురనాథ! కేశవ! దైత్యభేది! భవత్పదాం
భోరుహాశ్రితులైన వీరలఁ బూని కావక యుండఁగా
ధారుణీధర! నీకు ధర్మువె ధర్మనిర్మలమానసా! 286

ప్రతిపదార్థం: వీరలు= నాకుమారులైన ఈ పాండవులు; ఇట్టులు= ఈ విధంగా; అనాథులు+ఐ= దిక్కులేనివాళ్ళయి; మునివృత్తిన్; ఉండెడువారె; హా! ద్వారకాపురనాథ= ద్వారకాపురప్రభూ!; కేశవ! దైత్య, భేది= రాక్షసులను సంహరించినవాడా!; ధారుణీ, ధర= భూమిని ధరించినవాడా!; ధర్మ, నిర్మల, మానసా= ధర్మంచేత పరిశుద్ధమైన మనస్సుగలవాడా! శ్రీకృష్ణా!; భవత్+పద+అంభోరుహ+ఆశ్రితులు+ఐన= నీయొక్క పాదపద్మాలను ఆశ్రయించిన వాళ్ళయిన; వీరలన్= ఈ పాండవులను; పూని= ప్రయత్నించి; కావక, ఉండఁగాన్= రక్షించకుండా ఉండటం; నీకున్; ధర్మువె= ధర్మమా?

తాత్పర్యం: నా కుమారులైన పాండవులు ఈ విధంగా దిక్కులేని వాళ్ళయి మునివృత్తిని అవలంబించి ఉండటమా! హా! ద్వారకానాథా! కేశవా! రాక్షససంహారా! భూమిని ధరించినవాడా! ధర్మంచేత నిర్మలమైన మనస్సు కలవాడా! శ్రీకృష్ణా! నీ పాదపద్మాలను ఆశ్రయించిన ఈ పాండవులను ప్రయత్నించి రక్షించకుండటం నీకు ధర్మమా?

విశేషం: ఈ పద్యరచనలో కాంతిగుణం పోషించబడింది. (వివరాలకు చూడు - పీఠిక - సంపా.)

తరలము.

అమితసత్త్వులు ధర్మమూర్తు లహర్పతిప్రతిముల్ రిపు
ద్రుమహుతాశను లాపగేయుఁడు ద్రోణుఁడున్ విదురుండు గౌ
తముఁడు నుండఁగ ధర్మమార్గము దప్పఁ బాడియె? పాండవో
త్తములు రాష్ట్రనిరాసయోగ్యులె ధార్తరాష్ట్రుల వంచనన్? 287

ప్రతిపదార్థం: అమిత, సత్త్వులు= మిక్కిలి బలవంతులు; ధర్మమూర్తులు= ధర్మస్వరూపులు; అహర్పతి ప్రతిముల్= పగటికి నాథుడైన సూర్యునితో సమానమైన వాళ్ళు; రిపు, ద్రుమ, హుతాశనులు= శత్రువు లనే వృక్షాలకు అగ్నిహోత్రులవంటివాళ్ళు; ఆపగేయుఁడు= గంగా తనయుడు - భీష్ముడు; ద్రోణుఁడున్; విదురుండు; గౌతముఁడున్= కృపాచార్యుడును; ఉండఁగన్; ధర్మ, మార్గము; తప్పన్= తప్పటం; పాడియె= న్యాయమా?; ధార్తరాష్ట్రుల, వంచనన్= ధృతరాష్ట్రుని కుమారులయొక్క మోసంచేత; పాండవ+ఉత్తములు= పాండవశ్రేష్ఠులు; రాష్ట్ర, నిరాస, యోగ్యులు+ఎ= దేశం వదలి వెళ్ళదగినవాళ్ళా?

తాత్పర్యం: మహాబలవంతులు, ధర్మమూర్తులు, సూర్యతేజులు, శత్రువు లనే వృక్షాలకు అగ్నిహోత్రులవంటివాళ్ళు అయిన భీష్ముడు, ద్రోణుడు, విదురుడు, కృపాచార్యుడు ఉండగా ధర్మమార్గం తప్పటం న్యాయమా? కౌరవుల మోసంచేత పాండవశ్రేష్ఠులు దేశాన్ని వదలి వెళ్ళ దగినవాళ్ళా?

విశేషం: కాంతి గుణానికి కుంతీదేవి ఈ వాక్యాలు కూడా ఉదాహరణలు. (సంపా.)

క. అన్న! సహదేవ! నీవును । నన్నలతో నరిగె దయ్య యట నడవుల కీ
వున్నను సుతు లందఱు నిం । దున్నట్టుల నాకుఁ జిత్త మూఱడి యుండున్. 288

ప్రతిపదార్థం: అన్న, సహదేవ= నాయనా! సహదేవా!; అటన్= అక్కడ; అడవులకున్; అన్నలతోన్; నీవును= నీవుకూడ; అరిగెదు+అయ్య= వెళ్లుతావా?; ఈవు= నీవు; ఉన్నను= ఉన్నచో; సుతులు+అందఱున్= కొడుకులందరు; ఇందున్= ఇక్కడ; ఉన్న+అట్టుల; నాకున్; చిత్తము= మనస్సు; ఊఱడి= ఊరటచెంది; ఉండున్.

తాత్పర్యం: నాయనా! సహదేవా! నీవుకూడ అన్నలతోపాటు అడవులకు వెళ్ళుతావా? నీవు ఒక్కడివి ఉంటే చాలు. కొడుకు లందరు ఇక్కడ ఉన్నట్లే. నా మనస్సు ఊరట చెంది ఉంటుంది.

విశేషం: సవతికొడుకైనా, కడగొట్టువాడైన సహదేవునిమీద కుంతీదేవికి ఎంతో ప్రేమ.

వ. అనుచు శోకాక్రాంత యయి కుంతీదేవి దనకు వినయవినమితోత్తమాంగ యయిన పాంచాలిం జూచి బాష్పజలంబు లురుల ని ట్లనియె. 289

ప్రతిపదార్థం: అనుచున్; శోక+ఆక్రాంత, అయి= దుఃఖంచేత నిండిందై; కుంతీదేవి; తనకున్; వినయ, వినమిత+ఉత్తమ+అంగ, అయిన= వినయంచేత వంగిన శిరస్సు కలదైన; పాంచాలిన్; చూచి; బాష్పజలంబులు= కన్నీళ్ళు; ఉరులన్= దొరలగా; ఇట్లు+ అనియెన్.

తాత్పర్యం: అని అంటూ దుఃఖంతో నిండిన కుంతీదేవి, వినయంతో తలవంచి తనకు నమస్కరించిన ద్రౌపదిని జూచి, కన్నీళ్ళు కారుస్తూ ఇలా అన్నది.

క. ధవళాక్షి । నీ కతంబునఁ । బవిత్రమై ద్రుపదకులముఁ బాండుకులంబున్
భువనముల వెలిఁగె నీ వు । ద్భవ మౌటను జొచ్చుటను శుభస్థితితోడన్. 290

ప్రతిపదార్థం: ధవళ+అక్షి= తెల్లని కన్నులు కలదానా! అంటే అందమైన కన్నులు కలదానా!; నీ కతంబునన్= నీకారణంగా; పవిత్రము+ఐ= నిర్మలమై; నీవు; ఉద్భవము+ఔటను= పుట్టటంచేత, ద్రుపద కులమును= ద్రుపదుడి వంశమును; చొచ్చుటను= ప్రవేశించటంచేత; పాండు, కులంబున్= పాండురాజువంశమును; శుభస్థితితోడన్= మంగళకరమైన ఉనికితో; భువనములన్= లోకాలలో; వెలిఁగెన్= ప్రకాశించాయి.

తాత్పర్యం: అందమైన కన్నులు గల ఓ ద్రౌపదీ! నీకారణంగా పవిత్రమై- నీవు పుట్టటంచేత ద్రుపదవంశం, నీవు మెట్టటంచేత పాండువంశం, శుభస్థితితో లోకాల్లో ప్రకాశించాయి.

విశేషం: అలం: క్రమం. అరణ్యవాసకాలంలో సహదేవుణ్ణి ఆదరంతో చూచుకొమ్మని కుంతి ద్రౌపదితో చెప్పినట్లు భండార్కర్‌వారి సంస్కృత భారతప్రతిలో ఉంది. తెలుగులో లేదు.

ఆ. 'పురుషవృషభు లయిన పురుషులతోడన । యరిగి పరమభక్తిఁ బరిచరింపఁ
బోవఁ గనుట నీవు పుణ్యంబు సేసితి' । వంచుఁ బ్రీతిఁ గౌఁగిలించుకొనియె. 291

ప్రతిపదార్థం: పురుష, వృషభులు+అయిన= పురుషశ్రేష్ఠులయిన; పురుషులతోడన= మగవారి వెంట; అరిగి= వెళ్ళి; పరమభక్తిన్= మిక్కిలి భక్తితో; పరిచరింపన్+పోవన్+కనుట= సేవ చేయబోవగలగటంచేత; నీవు; పుణ్యంబు; చేసితివి; అంచున్= అంటూ; ప్రీతిన్= ప్రేమతో; కౌఁగిలించుకొనియెన్.

తాత్పర్యం: 'పురుషశ్రేష్ఠు లయిన భర్తలవెంట వెళ్ళి పరమభక్తితో సేవ చేయగలగటం నీపుణ్యం' అని ప్రేమతో కౌగిలించుకొన్నది.

వ. అని యిట్లు కోడలిం గొడుకులను దీవించి కుంతీదేవి విదురుగృహంబున నుండె; నంత. 292

తాత్పర్యం: అని ఈవిధంగా కోడలిని, కొడుకులను దీవించి కుంతీదేవి విదురుని ఇంట్లో ఉన్నది. తరువాత-

ఆ. పతులపిఱుఁద మందగతి ముక్తకేశియై । పోవుదాని ద్రుపదపుత్త్రిఁ జూచి
వంతఁ గౌరవేంద్రు నంతిపురంబున । వారలెల్లఁ దలలు వాంచి రడలి. 293

ప్రతిపదార్థం: పతుల, పిఱుఁద= భర్తల వెనుక; మందగతిన్= నిదానంగా నడుస్తూ; ముక్తకేశి+ఐ= విడువబడిన తలవెంట్రుకలు కలదై - అంటే విరబోసికొన్న జుట్టుతో; పోవుదానిన్; ద్రుపద, పుత్త్రిన్= ద్రుపదునికూతురైన ద్రౌపదిని; చూచి; కౌరవ+ఇంద్రు; అంతిపురంబున; వారలు+ఎల్లన్= కౌరవరాజుయొక్క అంతఃపురంలోని వాళ్ళంతా; వంతన్= దుఃఖంతో; అడలి= భయపడి; తలలు; వాంచిరి.

తాత్పర్యం: భర్తల వెనుక మెల్లగా అడుగులు వేస్తూ, తల విరబోసుకొని వెళ్ళుతున్న ద్రౌపదిని చూచి- కౌరవరాజు అంతఃపురంలో ఉన్న వాళ్ళంతా దుఃఖంతో భయపడి తలలు వంచుకొన్నారు.

విశేషం: కౌరవరాజు అంతఃపురకాంతలకు- సాటిస్త్రీ ద్రౌపదికి, ఆమె భర్తలకు కలిగిన దుస్థితి చూడటం వల్ల దుఃఖం-కుములుతూ కానలకు వెళ్ళే పాండవులవల్ల ముమ్ముందు ఎలాంటి దారుణ పరిణామాలు సంభవిస్తాయో అన్న ఊహవల్ల భయం- కలిగాయి.

ఆ. ధర్మతనయుపిఱుఁదఁ దమ్ములు నలువురు । నరుగుచుండి తత్సభాంతరమున
జనులు వినుచునుండ సంభృతక్రోధులై । పలికి రధికపరుషభాషణముల. 294

ప్రతిపదార్థం: ధర్మతనయు, పిఱుఁదన్= ధర్మరాజు వెనుక; తమ్ములు; నలువురున్, అరుగుచున్+ఉండి= వెళ్ళుతూ; తత్+సభా+అంతరమునన్= ఆ సభలో; జనులు; వినుచున్+ఉండన్; సంభృత క్రోధులు+ఐ= నిండిన కోపం కలవాళ్ళయి; అధిక, పరుష, భాషణములు= మిక్కిలి కఠినాలైన మాటలను; పలికిరి.

తాత్పర్యం: ధర్మరాజువెనుక నలుగురుతమ్ములు వెళ్ళుతూ, సభలోని జనులంతా వింటుండగా అమితకోపంతో కఠినాతికఠినాలైన మాటలను మాట్లాడారు.

క. సాహసమున మద్బాహు గ । దాహతి దుర్యోధనాదులగు రిపుల జగ
ద్ద్రోహులఁ జంపుదు నత్యు । గ్రాహవమున హరిహరాదు లడ్డం బైనన్. 295

ప్రతిపదార్థం: సాహసమునన్= తెగించి; మత్+బాహు, గదా, హతిన్= నా చేతి గద దెబ్బతో; దుర్యోధన+ఆదులు+అగు= దుర్యోధనుడు మొదలయినవాళ్ళయిన; రిపులన్= శత్రువులను; జగత్+ద్రోహులన్= లోకానికి అపకారం చేసేవాళ్ళను; అతి+ ఉగ్ర+ఆహవమునన్= మిక్కిలి భయంకరమైన యుద్ధంలో; హరి, హర+ఆదులు= విష్ణువు, శివుడు మొదలయినవాళ్ళు; అడ్డంబు+ఐనన్= అడ్డు తగిలినా, చంపుదున్.

తాత్పర్యం: సాహసించి నా చేతిగదదెబ్బతో లోకద్రోహు లైన దుర్యోధనాదిశత్రువులను మహాభయంకరమైన యుద్ధంలో హరిహరాదులు అడ్డమైనా హతమారుస్తాను.

ఆ. దుష్టచిత్తుఁ డయిన కష్టు దుర్యోధను । శిరము దన్నువాఁడ ధరణిఁ గూల్చి;
హీనుఁడైన దుస్ససేనుని వధియించి । వేఁడిరక్త మానువాఁడఁ గడఁగి. 296

ప్రతిపదార్థం: కడఁగి= పూనుకొని; దుష్ట, చిత్తుఁడు+అయిన= దుర్మార్గమైన మనస్సు కలవాడైన; కష్టున్= పాపిని; దుర్యోధనున్; ధరణిన్= భూమిమీద; కూల్చి= పడగొట్టి; శిరము= తలను; తన్నువాఁడన్; హీనుఁడు+ఐన= నీచుడైన; దుస్ససేనునిన్= దుశ్శాసనుని; వధియించి= చంపి; వేఁడి, రక్తము; ఆనువాఁడన్= త్రాగుతాను.

తాత్పర్యం: ప్రయత్నించి దుష్టాత్ముడు, పాపి అయిన దుర్యోధనుణ్ణి నేల గూల్చి అతని తలను తన్నుతాను, నీచు డైన దుశ్శాసనుణ్ణి చంపి వాడి వేడినెత్తురు త్రాగుతాను.

మ. కనకోర్వీధర సానుసార రుచిమద్గాండీవ నిర్ముక్త ప
త్రినిపీతారుణ వారిశేషముఁ బతత్రివ్రాతముల్ ద్రావున
య్యని నాతోడఁ జతుర్దశాబ్దమున మాఱెపోరు కర్ణాది దు
ర్జన సంఘంబుల మార్తురం దునుముదున్ సంగ్రామరంగంబునన్. 297

ప్రతిపదార్థం: కనక+ఉర్వీధర, సాను, సార, రుచిమత్+గాండీవ, నిర్ముక్త, పత్త్రి, నిపీత+అరుణ, వారి, శేషమున్= మేరు పర్వతపు చరియలాగ నిగ్గుదేలిన కాంతితో కూడిన గాండీవంనుండి విడువబడిన బాణాలచేత లెస్సగా త్రావబడిన నెత్తుటి మిగులును; పతత్త్రి, వ్రాతముల్= పక్షుల సమూహాలు - అంటే కాకులు, గ్రద్దలు మొదలయినవి; త్రావు= తాగునట్టి; ఆ+ అనిన్= ఆ యుద్ధంలో; నాతోడన్; చతుర్దశ+అబ్దమునన్= పదునాల్గవ సంవత్సరంలో; మాఱు+ఐ= ఎదుర్కొని; పోరు= యుద్ధంచేసే; కర్ణ+ఆది, దుర్జన, సంఘంబులన్= కర్ణుడు మొదలయిన దుర్మార్గుల సమూహాలను; మార్తురన్= శత్రులను; సంగ్రామ రంగంబునన్= యుద్ధభూమిలో; తునుముదున్= చంపుతాను.

తాత్పర్యం: పదునాల్గవ సంవత్సరంలో (అంటే అరణ్యాజ్ఞాతవాసాల తరువాత) యుద్ధభూమిలో మేరుపర్వతపు చరియలాంటి నిగ్గుదేలిన కాంతిగల గాండీవం నుండి ప్రయోగించిన బాణాలు-లెస్సగా త్రావగా, మిగిలిన రక్తాన్ని కాకులు, గద్దలు మొదలైన పక్షులు త్రాగే యుద్ధంలో - న న్నెదిరించి పోరాడే కర్ణాది దుర్మార్గుల్ని, శత్రు సమూహాల్ని సంహరిస్తా.

విశేషం: మేరుపర్వతసానువువంటి నిగ్గుదేలిన కాంతితో కూడిన గాండీవంఅని అనటమే కాక, మిక్కిలిపొడవైన సమాసాన్ని ప్రయోగించటంవల్ల కూడ నన్నయ, పార్థుని గాండీవం పొడవును, లావును, కాంతిని, అతని కోపాతిశయాన్ని పాఠకుని ఊహకు అందేటట్లు చేశాడు. పత్త్రి, పతత్త్రి శబ్దాలు రెండూ రెక్కలు గల బాణాలకు, పక్షులకు గల సామ్యాన్ని చక్కగా చెప్పటమేకాక పద్యశోభను కూడ పెంచాయి. ఉర్వీధరమంటే - భూమిని ధరించింది - కొండ. కనకోర్వీధరం - బంగారుకొండ - మేరువు. ఇది భూమిచుట్టూ ఒడ్డాణంలా ఉంటుం దని, దీనిచుట్టూ సూర్యచంద్రులు తిరుగుతుంటా రని, ఈ పర్వత శిఖరాల్లో దేవతలు విహరిస్తూ ఉంటా రని పురాణాలు చెప్పుతున్నవి.

క. మాయాద్యూతంబున ని। ర్జేయులఁ గా మమ్ము నిట్లు సేసిన ఖలు న
న్యాయపరు శకుని నస్మ। త్సాయకజితహస్తుఁ జేసి చంపుదు మాజిన్. 298

ప్రతిపదార్థం: మాయా, ద్యూతంబునన్= కపటపు జూదంలో; నిర్జేయులన్, కా= ఓడిపోయిన వార మవునట్లు; మమ్మున్, ఇట్లు; చేసిన; ఖలున్= దుర్మార్గుణ్ణి; అన్యాయపరున్= అన్యాయాన్ని అవలంబించినవాణ్ణి; శకునిన్; ఆజిన్= యుద్ధంలో; అస్మత్, సాయక, జిత+హస్తున్= మా బాణాలచేత ఓడించబడిన హస్తం కలవాణ్ణిగా; చేసి; చంపుదుము.

తాత్పర్యం: కపటపుజూదంలో మమ్మల్ని ఓడించి ఇలా చేసిన దుష్టుడు, అన్యాయపరుడు, అయిన శకునిని యుద్ధంలో మా బాణాలచేత ఓడించి చంపుతాము.

విశేషం: ఏ చేతుల్తో పాచికలు వేసి, మోసంతో మమ్ము జయించాడో, ఆ చేతులు శకునికి లేకుండా చేసి, చంపుతాము- అని ధ్వని.

వ. అని భీమార్జున నకుల సహదేవులును విజృంభించి కృతప్రతిజ్ఞులై; రట్లు పాండవులు పరిత్యక్తవిభవు లయి నిజాయుధంబులు ధరించి గజపురంబు వెలువడి; రంత. 299

ప్రతిపదార్థం: అని; భీమ+అర్జున, నకుల, సహదేవులును; విజృంభించి= రెచ్చిపోయి; కృతప్రతిజ్ఞులు+ఐరి= చేయబడిన ప్రతిజ్ఞలు కలవాళ్ళు అయ్యారు; అట్లు; పాండవులు; పరిత్యక్త, విభవులు+అయి= పూర్తిగా విడువబడిన ఐశ్వర్యం కలవాళ్ళయి; అంటే ఐశ్వర్యాన్ని పూర్తిగా కోల్పోయినవాళ్ళయి; నిజ+ఆయుధంబులు= తమయొక్క ఆయుధాలు; ధరించి; గజపురంబు= హస్తినాపురంనుండి; వెలువడిరి; అంతన్.

తాత్పర్యం: అని భీమార్జున నకుల సహదేవులు కోపావేశంతో చెలరేగి ప్రతిజ్ఞలు చేసి, ఐశ్వర్యాన్ని పూర్తిగా కోల్పోయిన వాళ్ళయి తమ తమ ఆయుధాలు ధరించి హస్తినాపురంనుండి బయలుదేరారు.

సీ. ధృతరాష్ట్రవిభుని మందిరమున నఱచుచుఁ। బఱచె గోమాయువుల్ పట్టపగల;
యప్రదక్షిణముగా నయ్యె నుల్కాపాత;। మపమేఘమై యున్న యంబరమున
విద్యుత్సహస్రముల్ విలసిల్లె; మఱి రాహు। పర్వంబు గాకయ భానుఁ బట్టె;
భూకంప మయ్యె నప్పుడు; సభాంతరమున। నరులెల్ల వినుచుండ నారదుండు

ఆ. పలికె నద్భుతముగఁ 'బదునాలుగవ యేఁడు। భారతాజి యగు; నపారవీరు
లయిన పాండవులు జయం బందుదురు భీమ। మఘవసుతుల విక్రమమున' ననుచు. 300

ప్రతిపదార్థం: ధృతరాష్ట్ర, విభుని, మందిరమునన్= ధృతరాష్ట్ర మహారాజుయొక్క అంతఃపురంలో; పట్టపగలు+అ; గోమాయువుల్= నక్కలు; అఱచుచున్; పఱచెన్= పరుగెత్తాయి; అప్రదక్షిణముగాన్= అపసవ్యంగా; ఉల్కాపాతము= తోకచుక్కలు పడటం; అయ్యెన్= జరిగింది; అపమేఘము+ఐ= తొలగింపబడిన మేఘాలు కలదై, అంటే మేఘాలు లేనిదై; ఉన్న; అంబరమునన్= ఆకాశంలో; విద్యుత్ సహస్రముల్= వేలకొలదిమెఱుపులు; విలసిల్లెన్= మెరిశాయి; మఱి= అంతేకాక; పర్వంబు, కాకయు= గ్రహణ పర్వదినం కాకుండానే; రాహు= రాహువు; భానున్= సూర్యుణ్ణి; పట్టెన్; భూకంపము+అయ్యెన్; అప్పుడు; సభా+ అంతరమునన్= సభలోపల; నరులు+ఎల్లన్= జనులంతా; వినుచుండన్; నారదుండు; పదునాలుగవ, ఏఁడు= పదునాల్గవసంవత్సరం; అంటే అరణ్య, అజ్ఞాతవాసాల తర్వాత; భారత+ఆజి= భారతయుద్ధం; అగున్; అపార, వీరులు+అయిన= మహాపరాక్రమశాలురైన; పాండవులు; భీమ, మఘవ సుతుల, విక్రమమునన్= భీమునియొక్క, దేవేంద్రపుత్రుడైన అర్జునునియొక్క శౌర్యంచేత; జయంబు+అందుదురు= విజయాన్ని పొందుతారు; అనుచున్; అద్భుతముగన్= ఆశ్చర్యం కలిగేటట్లు; పలికెన్.

తాత్పర్యం: ధృతరాష్ట్రమహారాజు అంతఃపురంలో పట్టపగలే నక్కలు అరుస్తూ పరుగెత్తాయి. అపసవ్యంగా తోకచుక్కలు పడ్డాయి. మేఘాలు లేకుండానే ఆకాశంలో వేలకొలది మెరుపులు మెరిశాయి. గ్రహణానికి తగిన పర్వదినం కాకుండానే రాహువు సూర్యుణ్ణి పట్టుకొన్నాడు. భూమి కంపించింది. అప్పుడు సభలోని వాళ్ళంతా వింటూండగానే నారదుడు- పదునాల్గవ ఏట భారతయుద్ధం జరుగుతుం దనీ, మహాపరాక్రమశాలురైన పాండవులు భీమార్జునుల బలాధిక్యంచేత విజయం పొందుతా రనీ ఆశ్చర్యకరంగా పలికాడు.

విశేషం: అపశకునాలు అశుభసూచకాలు. పూర్ణిమ అమావాస్యవంటి పర్వదినాల్లోనే గ్రహణాలు కలుగుతాయి.

వ. ధృతరాష్ట్రుండును దాని నంతయు విని 'కొడుకుల దుర్ణయంబుల నింక నెట్టి యరిష్టంబులు పుట్టెడునో' యని వగచుచు విదురుం బిలిచి, 'ధౌమ్య ద్రౌపదీ సహితు లయిన పాండవు లెట్లు వోయి' రని యడిగిన నతనికి విదురుం డి ట్లనియె. 301

ప్రతిపదార్థం: ధృతరాష్ట్రుండును; దానిన్; అంతయున్; విని; కొడుకుల, దుర్ణయంబులన్= కొడుకుల చెడుపనులవలన; ఇంకన్; ఎట్టి; అరిష్టంబులు= అశుభాలు; పుట్టెడునో= ఏర్పడతాయో; అని; వగచుచున్= చింతిస్తూ; విదురున్; పిలిచి; ధౌమ్య, ద్రౌపదీ, సహితులు+అయిన= ధౌమ్యునితో, ద్రౌపదితో కూడుకొన్న; పాండవులు; ఎట్లు; పోయిరి, అని; అడిగినన్; అతనికి; విదురుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు జరిగిందంతా విని, కొడుకుల దుశ్చేష్టలవల్ల ఇంకా ఎటువంటి అశుభాలు కలుగుతాయో అని చింతిస్తూ, విదురుణ్ణి పిలిచి, పాండవులు ధౌమ్యునితో, ద్రౌపదితో కలిసి ఏ విధంగా వెళ్ళా రని అడుగగా అతనికి విదురుడు ఇలా అన్నాడు.

విదురుఁడు ధృతరాష్ట్రునకుఁ బాండవు లడవికిఁ బోయిన రీతి సెప్పుట (సం. 2-71-3)

సీ. వదనసరోజంబు వస్త్రాంతమునఁ గప్పి । కొని యేఁగె ధర్మనందనుఁడు; మఱియు
భీమబాహులు రెండుఁ బెద్దలుగాఁ జాచి । ఘనసత్త్వుఁ డమ్మరుత్తనయుఁ డరిగె;
నిసుము చల్లుచు నమరేంద్రపుత్త్రుఁడు వోయె; । ధూరేణులిప్తశరీరుఁ డగుచు
నకులుండు సనియె; మానక లజ్జఁ జేసి య । ధోవక్త్రుఁ డై సహదేవుఁ డరిగె;

ఆ. వివృతకేశభరము వ్రేలంగ ద్రౌపది । సనియె; రౌద్రయామ్య సామగాన
ముఖరితాస్యుఁ డగుచు మ్రోల ధౌమ్యుం డేఁగె । సకలజనులు శోకజలధిఁ దేల. 302

ప్రతిపదార్థం: సకల జనులు= అందరు ప్రజలు; శోక, జలధిన్= దుఃఖమనే సముద్రంలో; తేలన్= తేలునట్లుగా; ధర్మనందనుఁడు= ధర్మరాజు; వదన, సరోజంబు= పద్మంవంటి ముఖాన్ని; వస్త్ర+అంతమునన్= బట్టకొంగుతో; కప్పికొని; ఏఁగెన్= వెళ్ళాడు; మఱియున్; ఘన, సత్త్వుఁడు= మిక్కిలి బలం కలవాడు; ఆ+మరుత్+తనయుఁడు= ఆ వాయుదేవుని కుమారుడైన భీముడు; భీమ, బాహులు= భయంకరమైన చేతులు; రెండున్; పెద్దలుగాన్= పొడవు (వెడల్పు) అగునట్లుగా; చాచి; అరిగెన్= వెళ్ళాడు; అమర+ఇంద్ర పుత్త్రుఁడు= దేవేంద్రుని కుమారుడైన అర్జునుడు; ఇసుము= ఇసుక; చల్లుచున్; పోయెన్; నకులుండు; భూరేణులిప్త, శరీరుఁడు+అగుచున్= మట్టికణాలు పూయబడిన శరీరంకలవాడై - అంటే దుమ్ము శరీరంపై పూసికొన్నవాడై; చనియెన్= వెళ్ళాడు; సహదేవుఁడు; మానక= ఆగక, లజ్జన్+చేసి= సిగ్గుచేత; అధోవక్త్రుఁడు+ఐ= వంచినముఖం కలవాడై; అరిగెన్= వెళ్ళాడు; ద్రౌపది; వివృత, కేశ, భరము= విరబోసుకొన్న వెంట్రుకల భారం; వ్రేలంగన్= వ్రేలాడుతుండగా; చనియెన్= వెళ్ళింది; ధౌమ్యుఁడు; రౌద్ర, యామ్య, సామగాన, ముఖరిత+ఆస్యుఁడు+అగుచున్= రుద్ర యమ సంబంధాలైన మంత్రాల సామగానం ధ్వనించే ముఖం కలవాడై; మ్రోలన్= ముందుభాగంలో; ఏఁగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: జనులంతా దుఃఖసముద్రంలో తేలుతుండగా, ధర్మరాజు పద్మంవంటి తన ముఖాన్ని గుడ్డకొంగుతో కప్పుకొని వెళ్ళాడు. మహాబలవంతుడైన భీముడు భయంకరమైన తనచేతులు రెండూ పెద్దగా చాచి నడిచాడు. ఇంద్రతనయుడైన అర్జునుడు ఇసుక చల్లుతూ వెళ్ళాడు. నకులుడు దుమ్ము నిండిన శరీరంతో నడిచాడు. సహదేవుడు కుంతి కోరినట్లు అరణ్యావాసం మానక, సిగ్గుతో ముఖం వంచుకొని అన్నల వెంట వెళ్ళాడు. ద్రౌపది విరబోసుకొన్న వెంట్రుకల భారం వ్రేలాడుతుండగా ప్రయాణం సాగించింది. ధౌమ్యుడు రుద్ర యమ సంబంధి మంత్రాలతో సామగానం చేస్తూ ముందు నడిచాడు.

విశేషం: రుద్ర యములు ఇద్దరు అంత్యకాలానికి సంబంధించిన దేవతలు, భయంకరులు.

వ. అనిన 'నట్లేల వార లరిగి?' రని యడిగిన విదురుం డి ట్లనియె. 303

తాత్పర్యం: అనగా 'వాళ్ళు ఆవిధంగా ఎందుకు వెళ్ళా?' రని ధృతరాష్ట్రు డడుగగా విదురుడు ఇలా అన్నాడు.

క. నీకొడుకునికృతిఁ జేసి య । పాకృత రాజ్యుఁ డయి ధర్మపతి నిజరూక్షా
లోకనజనదాహభయ । వ్యాకులుఁ డై చనియె దృష్టి వారించి వడిన్. 304

ప్రతిపదార్థం: ధర్మపతి= ధర్మరాజు; నీ, కొడుకు; నికృతిన్+చేసి= మోసంచేత; అపాకృత, రాజ్యుఁడు+అయి= తొలగించబడిన రాజ్యం కలవాడయి; నిజ+రూక్ష+ఆలోకన, జన, దాహ, భయ, వ్యాకులుఁడు+ఐ= తనయొక్క కఠినమైన చూపులచేత జనులు మండిపోతా రనే భయంవల్ల కలతనొందిన మనస్సుకలవాడై; దృష్టిన్; వారించి= తప్పించి; వడిన్= వేగంగా; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: నీకొడుకు చేసిన మోసంచేత రాజ్యాన్ని కోల్పోయినవాడై ధర్మరాజు తనకోపపుచూపులవల్ల జనం దహించబడతారేమో అన్న భయంతో కలత చెంది తన దృష్టిని తప్పించి (ముఖానికి గుడ్డ కప్పుకొని) వడిగా వెళ్ళాడు.

క. సమరమున బాహుబల ద । ర్పము మెఱయం గంటి ననుచు బాహు లతివిశా
లములుగఁ జేయుచు నరిగెను । సమీరజుఁ డరాతిభీతిసంజననుం డై. 305

ప్రతిపదార్థం: సమీరజుఁడు= వాయుదేవునికి జన్మించినవాడు - భీముడు; సమరమునన్= యుద్ధంలో; బాహు, బల, దర్పము= భుజబలగర్వం; మెఱయన్+కంటిని= ప్రకాశింప జేసే అవకాశాన్ని పొందాను; అనుచున్; బాహులు= చేతులు; అతి విశాలములుగన్= మిక్కిలి పొడవు (వెడల్పు) లయ్యేటట్లుగా; చేయుచున్, అరాతి, భీతి, సంజననుండు+ఐ= శత్రువులకు భయాన్ని కలిగించేవాడై; అరిగెను= వెళ్ళాడు.

తాత్పర్యం: భీమసేనుడు యుద్ధంలో తన బాహు బలగర్వాన్ని ప్రకాశింపచేసే అవకాశాన్ని పొందాను - అన్నట్లుగా చేతులు విశాలంగా చాచి, శత్రువులకు భయం కలిగించేవాడై వెళ్ళాడు.

క. వెఱచఱవ నింతకంటెం । దఱుచుగ బాణంబు లేసి తడయక పగఱం
జెఱుతు నని యిసుము చల్లుచు । నుఱక ధనంజయుఁడు రణజయోన్నతుఁ డరిగెన్. 306

ప్రతిపదార్థం: రణ, జయ+ఉన్నతుఁడు= యుద్ధంలోని విజయంచేత గొప్పవాడు; ధనంజయుఁడు= అర్జునుడు; వెఱచఱవన్= భయపడేటట్లుగా; ఇంతకంటెన్, తఱుచుగన్= అధికంగా; బాణంబులు; ఏసి= వేసి; తడయక= ఆలస్యం చేయకుండ; పగఱన్= శత్రువులను; చెఱుతును= చంపుతాను; అని; ఇసుము= ఇసుక; చల్లుచున్; ఉఱక= ఊరక, (నిర్లక్ష్యంగా); అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: యుద్ధ విజయాలతో గొప్పవాడైన అర్జునుడు- ఇసుకచల్లుతూ, భయంకరంగా ఇంతకంటె ఎక్కువగా బాణాలువేసి, సత్వరమే శత్రువుల్ని సంహరిస్తా నని నిర్లక్ష్యంగా నడిచాడు.

వ. మఱి దుఃఖాను భావంబున కనుచితంబైన తన సుందర రూపంబు సూచి జనులు దుఃఖింప కుండ వలయు నని ధూళి ధూసరిత శరీరుండై నకులుం డరిగె; దీనంబైన తన యాననంబు సూచినవారికి నెల్ల నెగ్గగు నని యవనతవదనుం డయి సహదేవుం డరిగె. 307

ప్రతిపదార్థం: మఱి, దుఃఖ+అనుభావంబునకున్= దుఃఖప్రభావానికి; అనుచితంబు+ఐన= తగనిదైన; తన, సుందరరూపంబు; చూచి; జనులు; దుఃఖింపకుండ వలయును; అని; ధూళి, ధూసరిత, శరీరుండు+ఐ= దుమ్ముచేత కప్పబడిన శరీరం కలవాడై; నకులుండు; అరిగెన్= వెళ్ళాడు; దీనంబు+అయిన; తన; ఆననంబు= ముఖం; చూచిన, వారికిన్+ఎల్లన్= చూచినవారి కందరికి; ఎగ్గు= కీడు; అగున్+అని; అవనత, వదనుండు+అయి= వంచుకొన్న ముఖం కలవాడయి; సహదేవుండు; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: దుఃఖాన్ని అనుభవించటానికి తగని తన అందమైన రూపాన్ని చూచి ప్రజలు దుఃఖపడకుండా ఉండా లని, దుమ్ముచేత కప్పబడిన శరీరం కలవాడై నకులుడు వెళ్ళాడు. తన దీనముఖాన్ని చూచినవాళ్ళకు కీడు కలుగుతుం దని సహదేవుడు ముఖం వంచుకొని వెళ్ళాడు.

చ. తడిసిన యేకవస్త్రపరిధానముతోడ విముక్తకేశియై
తొడరుచు దుఃఖభావమున ద్రోవది వోయె మహాహవంబునం

బడిన నిజేశ మిత్ర సుత బంధు జనంబులు శోకవేదనం
గడుకొని యట్ల యేఁగుదురు కౌరవభామిను లన్విధంబునన్. 308

ప్రతిపదార్థం: తడిసిన; ఏక, వస్త్ర, పరిధానముతోడన్= ఒంటి బట్ట కట్టుకొని; విముక్త కేశి+ఐ= విరబోసికొనిన వెంట్రుకలు గలదై; తొడరుచున్= తొట్రుపడుతు; దుఃఖభావమునన్= దుఃఖంతో కూడిన మనస్సుతో; ద్రోవది; మహా+ఆహవంబునన్= మహాయుద్ధంలో; పడిన= మరణించిన; నిజ+ఈశ, మిత్ర, సుత, బంధు, జనంబుల, శోకవేదనన్= తమయొక్క భర్తలను, స్నేహితులను, కొడుకులను, చుట్టాలను గురించిన దుఃఖబాధతో; కడుకొని= పూనుకొని; కౌరవ, భామినులు= కౌరవుల భార్యలు; అట్లు+అ= ఆ విధంగా; ఏఁగుదురు= వెళ్తారు; అనువిధంబునన్= అనే పద్ధతిగా; పోయెన్= వెళ్ళింది.

తాత్పర్యం: తడిసిన ఒంటి బట్ట కట్టుకొని, వెంట్రుకలు విరబోసుకొని, తొట్రుపడుతూ, దుఃఖిస్తూ ద్రౌపది-భర్తలు, మిత్రులు, పుత్రులు, బంధువులు మహాయుద్ధంలో మరణించగా కౌరవుల భార్యలు ఆ విధంగానే వెళ్ళుతా రన్నట్లు వెళ్ళింది.

క. భారతరణహతు లగు కురు । శూరుల పరలోకవిధులు సూచించి క్రియా
పారగుఁడు ధౌమ్యుఁ డరిగె వి । చారజ్ఞుఁడు రౌద్రయామ్యసామోద్గీతిన్. 309

ప్రతిపదార్థం: భారత, రణ, హతులు+అగు= భారత యుద్ధంలో మరణించే; కురు, శూరుల= కౌరవవీరులయొక్క; పరలోక విధులు= ఉత్తరక్రియలు; సూచించి; క్రియాపారగుఁడు= క్రియలు పూర్తిగా తెలిసినవాడు; విచారజ్ఞుఁడు= ఆలోచనను తెలిసినవాడు అయిన; ధౌమ్యుఁడు; రౌద్ర, యామ్య సామ+ఉత్+గీతిన్= రుద్ర, యమ సంబంధి సామవేదమంత్రాలను పెద్దగా గానం చేస్తూ; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: మహాభారతయుద్ధంలో మరణించే కౌరవవీరుల పరలోకక్రియలు సూచించి, ఆ క్రియలు పూర్తిగా తెలిసినవాడు, ఆలోచనాపరుడు అయిన ధౌమ్యుడు రుద్ర యమ సంబంధి సామాన్ని పెద్దగా గానం చేస్తూ వెళ్ళాడు.

వ. అనిన విని ధృతరాష్ట్రుండు దుఃఖితుం డయి. 310

తాత్పర్యం: అనగా విని ధృతరాష్ట్రుడు శోకించి.

తరలము.

సమరశూరులు పాండవుల్ జితశత్రు లున్నతచిత్తు లు
త్తములు వారలతోడి వైరము ధర్మయుక్తిఁ గరం బయు
క్తము ప్రజాక్షయకారణం బని తద్దయున్ భయమందుచున్
విమనుఁడై పడియుండె హా యని వెచ్చనూర్చుచు విన్న నై. 311

ప్రతిపదార్థం: పాండవుల్; సమర, శూరులు= యుద్ధవీరులు; జిత, శత్రులు= జయింపబడినశత్రువులు కలవాళ్ళు; ఉన్నత, చిత్తులు= గొప్ప మనస్సు కలవాళ్ళు; ఉత్తములు= శ్రేష్ఠులు; వారలతోడి; వైరము= శత్రుత్వం; ధర్మయుక్తిన్= ధర్మంప్రకారం; కరంబు= మిక్కిలి; అయుక్తము= తగనిది; ప్రజా, క్షయ, కారణంబు= జనులు నశించటానికి హేతువు; అని; తద్దయున్=

మిక్కలి; భయము+అందుచున్= భయపడుతూ; హా! అని; వెచ్చన్+ఊర్చుచున్= వేడి నిట్టూర్పులు వదలుతూ; విన్నను+ఐ= వెలవెలబోయి; విమనుఁడు+ఐ= దుఃఖంపొందిన మనస్సు కలవాడై; పడి, ఉండెన్.

తాత్పర్యం: 'పాండవులు యుద్ధవీరులు. శత్రువులను జయించినవాళ్ళు. గొప్పమనస్సు కలవాళ్ళు. ఉత్తములు. వారితో వైరం ధర్మంప్రకారం ఏమాత్రం తగనిది. అది ప్రజానాశానికి కారణం' అని మిక్కిలి భయపడుతూ ధృతరాష్ట్రుడు హా! అని వేడి నిట్టూర్పులు విడుస్తూ వెలవెలబోయి దుఃఖిస్తూ పడి ఉన్నాడు.

విశేషం: భయదుఃఖభావతీవ్రతను ప్రదర్శించే ఈ రచనలో కాంతిగుణం రసపోషకం. (సంపా.)

వ. అట్లు వగుచుచున్న ధృతరాష్ట్రునకు సంజయుం డి ట్లనియె. 312

తాత్పర్యం: ఆవిధంగా దుఃఖిస్తున్న ధృతరాష్ట్రునితో సంజయుడు ఇలా అన్నాడు.

సీ. పాండుకుమారులఁ బరమధార్మికు లని । వగవక రాష్ట్రంబువలనఁ బాపి
వసుపూర్ణమైన యివ్వసుమతి సేకొంటి । వసుధేశ! నీ కింక వగవ నేల?
కలశజ విదుర గంగాసుత ప్రభృతులు । వారింప వారింప వశము గాక
కర్ణ గాంధారుల కఱపులు విని, వారి । కపకారి యయ్యె నీ యాత్మజుండు;

ఆ. వగవ కధికు లయిన వారితో వైరంబు । సేసికొంటి కరము చెట్ట యనక;
నీవు నీ సుతుండు నేర్తురు గా, కొరు । లేమి సేయనేర్తు రిందుకులుఁడ! 313

ప్రతిపదార్థం: ఇందుకులుఁడ= చంద్రవంశంవాడి వైన ఓ ధృతరాష్ట్రమహారాజా!; పాండుకుమారులన్= పాండురాజు పుత్రులైన పాండవులను; పరమ ధార్మికులు+అని= మిక్కిలి ధర్మాత్ములని; వగవక= ఆలోచించక; రాష్ట్రంబువలనన్+పాపి= దేశంనుండి వెళ్ళగొట్టి; వసుపూర్ణము+ఐన= బంగారుతో నిండిన; ఈ+వసుమతిన్= ఈ భూమిని; చేకొంటి= గ్రహించావు; వసుధ+ఈశ= భూ నాథా! రాజా!; నీకున్; ఇంకన్; వగవన్= దుఃఖించటం; ఏల= ఎందుకు? కలశజ, విదుర, గంగాసుత, ప్రభృతులు= కుండనుండి పుట్టిన ద్రోణుడు; విదురుడు, గంగా తనయుడైన భీష్ముడు మొదలయినవాళ్ళు; వారింపన్= అడ్డగించగా; వారింప వశము, కాక= అడ్డగించటం సాధ్యంగాక; కర్ణ గాంధారుల= కర్ణునియొక్క, శకుని యొక్క; కఱపులు= బోధలు; విని; నీ, ఆత్మజుండు= నీ కుమారుడు; వారికిన్= పాండవులకు; అపకారి, అయ్యెన్= అపకారం చేసినవా డయ్యాడు; వగవక= విచారించక; కరంబు= మిక్కిలి; చెట్ట, అనక= చెడ్డ అని భావించక; అధికులు+అయిన, వారితోన్= గొప్పవాళ్ళతో; వైరంబు= శత్రుత్వం; చేసికొంటి; నీవు; నీ, సుతుండు= నీ కుమారుడు; నేర్తురుగాక= ఏమి చేయటానికైన తగుదురు; ఒరులు= ఇతరులు; ఏమి, చేయన్, నేర్తురు= ఏమి చేయగలరు?

తాత్పర్యం: చంద్రవంశంవాడి వైన ఓ ధృతరాష్ట్ర మహారాజా! పాండవులు మిక్కిలి ధర్మాత్ము లని ఆలోచించక దేశంనుండి వెళ్ళగొట్టి, బంగారుతో నిండిన ఈ భూమినంతా గ్రహించావు. మహారాజా! నీ వింక దుఃఖించటం ఎందుకు? భీష్మద్రోణవిదురాదులు వద్దన్నా వినకుండ, కర్ణశకునుల మాటలు విని, నీ కుమారుడు పాండవులకు అపకారం చేశాడు. ఆలోచించకుండా, ఎంతో చెడ్డ అని అనుకోకుండా గొప్పవాళ్ళతో వైరం తెచ్చుకొన్నావు. నీవు, నీ కుమారుడు ఏమి చెయ్యటానికైనా తగినవాళ్ళు. ఇతరు లేమి చేస్తారు?

విశేషం: ఈ సందర్భంలో 'ఇందుకులుఁడ' అనే సంజయుని సంబోధనలో ఆహ్లాదకరుడైన చంద్రునివంశంలో జన్మించి, కొడుకుల క్రూరకృత్యాలను ప్రోత్సహిస్తున్నావా? అనే ఎత్తిపొడుపు ధ్వనిస్తున్నది.

వ. అని సంజయుండు పలికిన విని విదురుండు ధృతరాష్ట్రున కి ట్లనియె. 314

తాత్పర్యం: అని సంజయుడు పలుకగా విదురుడు విని ధృతరాష్ట్రునితో ఇలా అన్నాడు.

తరలము.

వగవ నేటికి నింకనైనను వారలం బిలిపించి యీ
జగతి నెప్పటియట్ల యేలుచు సంతసంబున నుండఁగా
జగదధీశ్వర! పంపు; వంచన చన్నె? యన్యుల సంపదల్
మిగిలి చేకొన నిట్లు సేసిన మెత్తురే మది నుత్తముల్? 315

ప్రతిపదార్థం: జగత్+అధీశ్వర= ప్రపంచానికి ప్రభువైనవాడా! ధృతరాష్ట్ర మహారాజా!; వగవన్, ఏటికిన్= దుఃఖించటం ఎందుకు? ఇంకన్+ఐనను; వారలన్= పాండవులను; పిలిపించి; ఈ, జగతిన్= ఈ భూమిని; ఎప్పటి+అట్ల= ఎప్పటివలె; ఏలుచున్= పాలిస్తూ; సంతసంబునన్; ఉండఁగాన్; పంపు= ఆజ్ఞాపించు; వంచన= మోసం; చన్నె= తగునా?; అన్యుల, సంపదల్= ఇతరుల సంపదలను; మిగిలి= హద్దుమీరి - అంటే ధర్మాన్ని అతిక్రమించి; చేకొనన్= గ్రహించటానికి; ఇట్లు+చేసినన్; ఉత్తముల్= గొప్పవాళ్ళు; మదిన్= మనస్సులో; మెత్తురే= మెచ్చుకొంటారా?

తాత్పర్యం: ధృతరాష్ట్రమహారాజా! దుఃఖించటం ఎందుకు? ఇప్పు డైనా పాండవుల్ని పిలిపించి ఈ భూమిని ఎప్పటిలా పాలిస్తూ సుఖంగా ఉండండని ఆజ్ఞాపించు. మోసం చెయ్యటం తగునా? ఇతరుల సంపదలు హద్దు మీరి గ్రహించటానికి ఇలా చేస్తే ఉత్తములు మెచ్చుకొంటారా?

విశేషం: విదురుడు చేసిన కర్తవ్యబోధ కురుపాండవ సమస్యకు సమయోచిత సులభపరిష్కారం. ధృతరాష్ట్రుని చిత్తశుద్ధికి చక్కని గీటురాయి. 'జగదధీశ్వర!' అనే సంబోధనలో సర్వసర్వంసహాధికారివి నీవై ఉండి, పాండవులను పిలిచి, రాజ్య మిచ్చి ఎప్పటిలా పాలించుకొమ్మని చెప్పితే నీ మాట కాదనే వాళ్ళెవరు? - అనే భావం కూడ ధ్వనిస్తున్నది. (విదురుడి వాక్యవిన్యాసంలో గోచరించే అగ్రామ్యత్వం, వికటత్వం ఉదారతాగుణస్ఫోరకాలై రాణిస్తున్నాయి. సంపా.)

ఆ. అనిన విదురుపలుకు లా ధృతరాష్ట్రుండు। వినియు విననియట్లు విపినవాస
గతులఁ బాండుసుతులఁ గ్రమ్మఱింపక యుపే। క్షించెఁ బూర్వవిహిత కిల్బిషమున. 316

ప్రతిపదార్థం: అనిన; విదురు, పలుకులు; ఆ, ధృతరాష్ట్రుండు; వినియున్; వినని, అట్లు; విపిన, వాస, గతులన్= అరణ్యానికి వెళ్ళే వాళ్ళను; పాండు సుతులన్= పాండురాజు కుమారులను; క్రమ్మఱింపక= మరలించక; పూర్వ విహితకిల్బిషమునన్= గడచిన జన్మలో విధించబడిన పాపంచేత; ఉపేక్షించెన్= ఊరకున్నాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు విదురుని మాటలు వినికూడ, వినని విధంగా ఉండి, అరణ్యానికి వెళ్ళే పాండవులను మరలించకుండా, గతజన్మంలో విధించబడిన పాపంచేత ఊరక ఉండిపోయాడు.

విశేషం: ధృతరాష్ట్రునికి చిత్తశుద్ధిలేదనటానికి ఇది చక్కని ఉదాహరణం.

వ. మఱియు ద్రోణుండు పాండవులకు నెయ్యుం డయ్యును దొల్లి యాజోపయాజుల వరంబున నగ్ని కుండంబున నుద్భవిల్లిన ద్రుపదాత్మజుండు ధృష్టద్యుమ్నుండు పాండవసంబంధి యయి ప్రతివీరుం డగుట నాతనితోఁ దనకు సమరం బగు నని యెఱింగి పాండవానుగమనంబు సేయ నొల్లక గజపురంబున ధృతరాష్ట్రు నొద్దన యుండె; ని ట్లింద్రప్రస్థపురంబున నిరువది మూఁడేఁడులు రాజ్యంబు సేసి పాండవులు పాపద్యూత పరాజితు లయి. 317

ప్రతిపదార్థం: మఱియు, ద్రోణుండు; పాండవులకున్; నెయ్యుండు+అయ్యును= స్నేహితుడయినప్పటికి; తొల్లి= పూర్వం; యాజ+ఉపయాజుల= యాజునియొక్క ఉపయాజునియొక్క; వరంబునన్= వరంచేత; అగ్ని, కుండంబునన్, ఉద్భవిల్లిన= పుట్టిన; ద్రుపద+ఆత్మజుండు= ద్రుపదుని కుమారుడు; ధృష్టద్యుమ్నుండు; పాండవ, సంబంధి, అయి= పాండవుల బంధువై; ప్రతివీరుండు= శత్రువీరుడు; అగుటన్= అవటంచేత; ఆతనితోన్= ఆ ధృష్టద్యుమ్నునితో; తనకున్; సమరంబు= యుద్ధం; అగును+అని; ఎఱింగి= తెలిసికొని; పాండవ+అనుగమనంబు= పాండవుల వెంట వెళ్ళటం; చేయన్= చేయటానికి; ఒల్లక= ఇష్టపడక; గజపురంబునన్= హస్తినాపురాన; ధృతరాష్ట్రు+ఒద్ద= ధృతరాష్ట్రుని దగ్గర; ఉండెన్; ఇట్లు; ఇంద్రప్రస్థపురంబునన్; ఇరువది మూఁడు+ఏఁడులు= ఇరవై మూడు సంవత్సరాలు; రాజ్యంబు, చేసి; పాండవులు; పాప, ద్యూత, పరాజితులు+అయి= చెడుజూదంలో ఓడిపోయినవాళ్ళయి.

తాత్పర్యం: ద్రోణుడు పాండవులమీద ప్రేమకలవాడే అయినా-పూర్వం యాజోపయాజుల వరంచేత అగ్నిగుండంనుండి పుట్టిన ద్రుపదపుత్రుడు ధృష్టద్యుమ్నుడు పాండవుల బంధువై తనకు శత్రువీరుడు కావటంచేత, అతనితో తనకు యుద్ధం అవుతుం దని తెలుసుకొని, పాండవులవెంట వెళ్ళటానికి ఇష్టపడక హస్తినాపురంలో ధృతరాష్ట్రుని దగ్గరే ఉండిపోయాడు. ఈ విధంగా పాండవులు ఇంద్రప్రస్థపురంలో ఇరవై మూడేళ్ళు రాజ్యంచేసి పాపపు జూదంలో ఓడిపోయి.

విశేషం: యాజోపయాజులు గంగ ఒడ్డున వానప్రస్థవృత్తిలో ఉండే బ్రాహ్మణోత్తములు.

క. వీరులగు పాండు సుతులు మ । హారణ్యనివాస నిరతులయి ధరణీబృం
దారక సహస్రములతో । సారమతుల్ సనిరి నిత్యసత్యవ్రతులై. 318

ప్రతిపదార్థం: వీరులు+అగు; పాండు సుతులు= పాండవులు; మహా+అరణ్య, నివాస, నిరతులు+అయి= మహారణ్యంలో నివసించటంలో మిక్కిలి ఆసక్తి కలవాళ్ళయి; ధరణీ బృందారక, సహస్రములతోన్= వేలకొలది భూసురులతో; సారమతుల్= బుద్ధిమంతులు; నిత్యసత్యవ్రతులు+ఐ= ఎల్లప్పుడు సత్యాన్నే వ్రతంగా కలవాళ్ళయి; చనిరి= వెళ్ళారు.

తాత్పర్యం: వీరులు, బుద్ధిమంతులు, నిత్యసత్యవ్రతులు అయిన పాండవులు- వేలకొలది బ్రాహ్మణులు వెంటరాగా అరణ్యవాసానికి వెళ్ళారు.

క. అని యిట్లు సభాపర్వం । బున కథ జనమేజయునకు మొగి వైశంపా
యను చెప్పిన విధమంతయు । మనునిభ! శుభచరిత! నిత్యమహిమాతిశయా! 319

ప్రతిపదార్థం: మను, నిభ= మనువుతో సమానమైన వాడా! శుభచరిత= మంగళకరమైన చరిత్ర కలవాడా! నిత్య, మహిమ+ అతిశయా= శాశ్వతమైన గొప్పతనంచేత మిన్న అయినవాడా! ఓ రాజరాజ నరేంద్రా! అని; ఇట్లు; సభా, పర్వమున, కథ= సభా పర్వంలోని కథ; మొగి= మునుపు; జనమేజయునకున్; వైశంపాయను, చెప్పిన, విధము+అంతయున్= వైశంపాయనుడు చెప్పిన విధం పూర్తిగా ఇది.

తాత్పర్యం: మనువుతో సమానమైన వాడా! శుభ చరిత్ర కలవాడా! శాశ్వతమైన మహిమచే మిన్న అయినవాడా! ఓ రాజరాజ మహేంద్రా! ఈ విధంగా సభాపర్వంలోని కథ పూర్తిగా మునుపు జనమేజయునికి వైశంపాయనుడు చెప్పిన విధమంతా ఇది.

విశేషం: 'మనునిభ శుభ చరిత!' అనే విశేషణానికి 'మనువుకు సాటియైన శుభచరిత్ర గలవాడా!' అనే అర్థంకూడా చెప్పవచ్చు.

ఆశ్వాసాంతము

రథోద్ధతము.

హార హీర ధవళాంశు నిర్మలో
దార కీర్తి! రణదర్ప! సద్గుణా!
వైరి వీర రస వైద్య! మన్మథా
కార! ధీర! పరగండభైరవా! **320**

ప్రతిపదార్థం: హార, హీర, ధవళ+అంశు, నిర్మల, ఉదార, కీర్తి= హారంలోని వజ్రంయొక్క తెల్లని కాంతిలా నిర్మలమైన గొప్పకీర్తి కలవాడా!; రణ, దర్ప= యుద్ధంలో గర్వం కలవాడా!; సద్గుణా= మంచిగుణాలు కలవాడా!; వైరి, వీర, రస, వైద్య= శత్రువులయొక్క వీరరసానికి చికిత్స చేసేవాడా!; మన్మథ+ఆకార= మన్మథుని వంటి ఆకారం కలవాడా!; ధీర= ధైర్యం కలవాడా!; పరగండ భైరవా= శత్రువీరులకు భయంకరమైనవాడా!

తాత్పర్యం: హారంలోని వజ్రకాంతివంటి తెల్లని నిర్మలమైన గొప్పకీర్తి కలవాడా! యుద్ధంలో గర్వంకలవాడా! ఉత్తమగుణాలు గలవాడా! శత్రువుల వీరరసానికి చికిత్స చేసేవాడా! మన్మథుని ఆకారం కలవాడా! ధైర్యం కలవాడా! శత్రువీరులకు భయంకరమైనవాడా!

విశేషం: అలం. ఉపమ, వృత్త్యనుప్రాసం. ఇవి ఆశ్వాసాంత రాజరాజ సంబోధనలు. ఆయన గుణ విశేషాల ప్రశంసలు. (రథోద్ధత వృత్తంలోని ప్రతిపాదంలోనూ వరుసగా ర,న,ర,లగ గణా లుంటాయి. ఏడవ అక్షరం యతి. ప్రాసనియమం పాటించబడింది. నన్నయ లఘు రకారావృత్తిచేత వృత్తరచనలో అక్షరరమ్యతను పోషించాడు. నన్నయ ఈ వృత్తాన్ని ఈ ఒక్కచోటనే వాడాడు. - సంపా.)

క. **కరుణావతార! ధరణీ । సురవర సురభూజ! రాజసుందర! నయబం**
ధుర! ధర్మధురంధర! మం । దరధైర్య! సుహృన్నిధాన! దానవినోదీ! **321**

ప్రతిపదార్థం: కరుణా+అవతార= దయా స్వరూపా!; ధరణీ, సుర, వర, సురభూజ= భూదేవతలైన బ్రాహ్మణ శ్రేష్ఠులకు కల్పవృక్షం వంటి వాడా!; రాజ, సుందర= చంద్రునివలె అందమైనవాడా!; నయ, బంధుర= నీతిచేత ఒప్పిదమైనవాడా!; ధర్మధురంధర= ధర్మభారాన్ని వహించేవాడా!; మందర ధైర్య= మందరపర్వతంతో సమానమైన ధైర్యం కలవాడా!; సుహృత్+ నిధాన= మిత్రులకు పెన్నిధివంటివాడా!; దాన, వినోదీ= దానం చేయటంలో సంతోషం కలవాడా!

తాత్పర్యం: దయాస్వరూపా! భూదేవతలైన బ్రాహ్మణ శ్రేష్ఠులకు కల్పవృక్షం వంటివాడా! చంద్రుడిలా అందమైనవాడా! నీతితో ప్రకాశించేవాడా! ధర్మభారం వహించేవాడా! మందరపర్వతంతో సమానమైన ధైర్యం కలవాడా! మిత్రులకు పెన్నిధివంటివాడా! దానం చెయ్యటంలో సంతోషం కలవాడా!

విశేషం: అలం: ఉపమ. వృత్త్యనుప్రాసం. (సంపా.)

ఉత్సాహము.

రాజవంశవార్ధిచంద్ర! రాజదేవ! నిత్యల
క్ష్మీ జయాభిరామ! ధర్మమిత్త్ర! మిత్త్ర విద్వదం
భోజ వన పయోజమిత్త్ర! భూరి కీర్తి కౌముదీ
రాజిత త్రిలోక! నిఖిల రాజ నిత్య పూజితా! 322

ప్రతిపదార్థం: రాజ, వంశ, వార్ధి, చంద్ర= రాజవంశం అనే సముద్రానికి చంద్రునివంటివాడా!; రాజదేవ!; నిత్యలక్ష్మీ, జయ+ అభిరామ= శాశ్వతమైన ఐశ్వర్యంతో, జయంతో మనోహరమైనవాడా!; ధర్మమిత్త్ర= ధర్మానికి స్నేహితుడివైనవాడా!; మిత్త్ర, విద్వత్+ అంభోజ, వన, పయోజమిత్త్ర= స్నేహితులు, పండితులు అనే పద్మవనానికి సూర్యుని వంటివాడా!; భూరి, కీర్తి కౌముదీ, రాజిత త్రిలోక= గొప్పకీర్తి అనే వెన్నెలచేత ముల్లోకాలను ప్రకాశింప చేసేవాడా!; నిఖిల, రాజ, నిత్య, పూజితా= అందరు రాజులచేత ఎల్లప్పుడు పూజించబడేవాడా!

తాత్పర్యం: రాజవంశమనే సముద్రానికి చంద్రునివంటివాడా! రాజదేవా! శాశ్వతమైన ఐశ్వర్యంతో, జయంతో మనోహరమైనవాడా! ధర్మానికి మిత్రుడవైనవాడా! స్నేహితులు, పండితులు అనే పద్మవనానికి సూర్యునివంటివాడా! ముల్లోకాలను కీర్తి అనే వెన్నెలచేత ప్రకాశింపచేసేవాడా! సమస్తరాజులచే ఎల్లప్పుడు పూజింపబడేవాడా!

విశేషం: అలం: ఉపమ. రూపకం. ఉత్సాహ వృత్తపాదంలో ఏడు సూర్య గణాలమీద ఒక గురువు ఉంటుంది. అయిదవ గణంలోని మొదటి అక్షరం యతిస్థానం. ప్రాసనియమం ఉంది. (సంపా.)

గద్యము.

ఇది సకలసుకవిజనవినుత నన్నయభట్ట ప్రణీతం బయిన శ్రీమహాభారతంబునందు సభాపర్వంబున నర్ఘ్యాభిహరణంబును, శిశుపాల వధయును, రాజసూయ విభూతికి దుఃఖితుండై సభాస్ఖలితుండై యున్న దుర్యోధనుం జూచి ద్రౌపదీభీమసేనులు నగుటయు, రాజసూయవిభూతి సూచి సహింపక దుర్యోధనుండు జూదం బొనర్చుటయు, నందు శకుని కైతవంబున ధర్మరాజ పరాజయంబును, ద్యూతదుఃఖార్ణవ

మగ్నులయిన పాండవులం బాంచాలి యుద్ధరించుటయుఁ, బునర్ద్యూత పరాజితులయి పాండవులు వనవాసగతు లగుటయు నన్నది సర్వంబును ద్వితీయాశ్వాసము.

సభాపర్వము సమాప్తము.

తాత్పర్యం: ఇది ఉత్తమకవు లందరి ప్రశంస లందుకొన్న నన్నయభట్టారకుడు రచించిన శ్రీమహాభారత సభాపర్వంలో, అర్ఘ్యప్రదానం, శిశుపాలుణ్ణి చంపటం, రాజసూయవైభవాన్ని చూచి దుఃఖితుడై సభలో జారిపడిన దుర్యోధనుణ్ణి చూచి ద్రౌపదీ భీమసేనులు నవ్వటం, రాజసూయ వైభవాన్ని చూచి సహించలేక దుర్యోధనుడు జూదమాడటం, అందులో శకుని మోసంవల్ల ధర్మరాజు ఓడిపోవటం, జూదంవల్ల కలిగిన దుఃఖ మనే మహాసముద్రంలో మునిగిన పాండవులను ద్రౌపది ఉద్ధరించటం, మళ్ళీ ఆడిన జూదంలో పాండవులు ఓడి అడవులకు వెళ్ళటం - అన్నది రెండవ ఆశ్వాసం.

సభాపర్వంలో ద్వితీయాశ్వాసం సమాప్తం.

శ్రీమదాంధ్ర మహాభారతంలో సభాపర్వం ముగిసింది.

శ్రీమదాంధ్ర మహాభారతము

సభాపర్వము

పద్య - గద్య ప్రథమపాద సూచి